శ్రీ గణేశ పురాణం
పురుఘుళ్ళ శ్రీ ఫణి సీతారామన్

శ్రీగణేశ పురాణము

ఓం శ్రీరామ

గ్రంథకర్త

పురిఘళ్ళ శ్రీఫణి సీతారామన్

నాహం కర్తా

హర: కర్తా

అంకితం

శ్రీ సీతారామచంద్రుల పాదపద్మములకు

శ్రీరామ పంచాక్షరీ స్తుతి

సురసంఘంబులు అమందానందము నొంద, ప్రకృతి సర్వము పులకరింప
ధరణీజనులెల్లరు సంతసిల్ల, ముని గణములు ఔఔనని తలయూప
పంచాక్షరియే పరమ మంత్రమని, సీతారాములె పరమ దైవమని
గడకట్టి నినదంబు జేసెద భువన భాండములెల్ల ప్రతిధ్వనింపగన్ ॥

శ్రీ సీతా స్తుతి

కనుతెరచిన సుందరమగు జగతియట
కను మూసిన హృదయస్థిత జ్యోతియట
కనులందు వెలుగు ఉజ్వల కాంతియట
కనుగొనవలసిన ఆ తల్లి మాయమ్మ సీతయట ॥

ఉపాసన ఖండము

1. సోమకాంత వర్ణనము 24
2. సోమకాంత దు:ఖ వర్ణనము 26
3. సదాచార వర్ణనము; హేమకంత పట్టాభిషేకము 28
4. సోమకాంత వన గమనము 30
5. చ్యవన సుధర్మ సంవాదము 31
6. సోమకాంత భృగు సంవాదము 33
7. సోమకాంతుని పూర్వజన్మ వృత్తాంతము 34
8. సోమకాంత భృగు సంవాదము 36
9. పాపపురుష ఉద్భవము 37
10. వ్యాసుని మతిభ్రమణము 39
11. శ్రీగణేశ మంత్రము; పూజావిధి 40
12. శ్రీగణేశావిర్భావము 41
13. త్రిమూర్తుల ద్వారా శ్రీగణేశ స్థుతి 42
14. భ్రహ్మదేవుని అహంకారము 44
15. భ్రహ్మతపము, శ్రీగణేశుని వరదానము 45
16. యోగనిద్రా స్థుతి 46
17. శివ విష్ణు సమాగమము 47
18. విష్ణు తపస్సు & మధు, కైటభ వధ 49
19. భీమ ఉపాఖ్యానము 50
20. దక్ష చరిత్ర 52
21. దక్షముద్గల సంవాదము 54
22. దక్షుని పూర్వజన్మ వృత్తాంతము 55
23. ఇందుమతీదేవి శోకము 57
24. దక్షుని స్వప్నము 59
25. చంద్రసేన మహారాజు మరణము 60
26. దక్షుని రాజ్యప్రాప్తి 61
27. భీమ మహారాజు పుత్రప్రాప్తి 62
28. రుక్మాంగద శాపము 64
29. రుక్మాంగదునికి నారద దర్శనము 65

30. అహల్య వృత్తాంతము	66
31. గౌతమ మహర్షిచే ఇంద్రుడు శపింపబడుట	67
32. దేవ గౌతమ సంవాదము	68
33. ఇంద్రుని శాప విముక్తి	70
34. ఇంద్రునికి శ్రీగణేశ సాక్షాత్కారము	71
35. రుక్మాంగదాదుల ముక్తి	72
36. ముకుందా చరితము	73
37. వరసిద్ధి వినాయక ఆవిర్భావము	75
38. త్రిపురాసుర జననము	76
39. త్రిపురాసుర విజయము	78
40. త్రిపురాసుర సంహారమునకై దేవతల ప్రార్థన	80
41. కళాధర చరితము	82
42. త్రిపురుడు చింతామణి వినాయకుని గొనిపోవుటకు ప్రయత్నము	83
43. త్రినేత్ర, త్రిపురాసుర సంగ్రామము	84
44. వృషాంకుని విచారము	86
45. శివుని ద్వారా శ్రీగణేశ పూజనము	87
46. శ్రీగణేశ సహస్రనామావళి	88
47. త్రిపురాసుర సంహారము	94
48. పార్వతీ విలాపము	96
49. శ్రీగణేశోపాసనా పద్ధతి	97
50. శ్రీగణేశ మంత్రోపాసన	100
51. కర్దమ చరితము	101
52. నల చరితము	104
53. చంద్రాంగద ఇందుమతీ చరితము	106
54. ఇందుమతీ నారద సంవాదము	107
55. ఇందుమతీ చంద్రాంగద సమాగమము	109
56. శూరసేన వృత్తాంతము	110
57. భృశుండి చరితము	112
58. సంకష్ట చతుర్థి మహాత్మ్యము	114
59. బ్రహ్మ, కృతవీర్య పిత సంవాదము	115
60. మంగళ చరితము; అంగారక చతుర్థి మహాత్మ్యము	116
61. శశాంక ఉదంతము	119

62. దూర్వాంకుర మహిమ; సులభ, సుముద్ర, మధుసూదన వృత్తాంతము 121
63. అనలాసుర చరితము 123
64. అనలాసుర భంజనము 125
65. శ్రీగణేశుని చే జనకుని పరీక్ష 126
66. విరోచన త్రిశిర చరితము 127
67. దూర్వాంకుర మహిమ 129
68. కృతవీర్య అమాత్య సంవాదము 131
69. సంకటహార చతుర్థి వ్రత విధానము 132
70. సంకటహార చతుర్థి వ్రతము కావించిన ప్రముఖులు 135
71. సంకటహార చతుర్థీ ఉద్యాపనము 136
72. కార్తవీర్య జననము 137
73.కార్తవీర్యుడు సహస్రార్జునుడగుట 138
74. ఛండాలినీ చరితము 140
75. శూరసేన ఉద్ధరణ 141
76. బుధచరితము, శ్రీగణేశ నామ మహిమ 143
77. కార్తవీర్యుని జమదగ్ని దర్శనము 145
78. కార్తవీర్య జమదగ్ని సంవాదము 147
79. జమదగ్ని మహర్షి దుర్మరణము 148
80. రేణుకా విలాపము 150
81. పరశురామ దత్తాత్రేయ సంవాదము 151
82. కార్తవీర్య సంహారము 152
83. తారకాసుర చరితము 153
84. మదన దహనము 155
85. కార్తికేయ జననము 155
86. కార్తికేయుడు దేవసేనాని అగుట 157
87. వరద చతుర్థీ వ్రతము 158
88. కామదేవుని పునర్జన్మ 160
89. మహోత్కట గణపతి ఉద్భవము, శేషుని గర్వము 162
90. ధరణీధర గణపతి చరితము 163
91. కాశ్యప సృష్టి 165
92. శ్రీగణేశుని ద్వాదశ నామ ఫలము 167

క్రీడా ఖండము

1. దేవాంతక నరాంతక జననము	170
2. దేవాంతక నరాంతక తపస్సు	171
3. దేవాంతకుని స్వర్గముపై విజయము	172
4. నరాంతకుని పృథివీ పాతాళములపై విజయము	174
5. అదితీదేవి తపము	174
6. మహోత్కట జననము	176
7. విరజా నిశాచరి మరణము	177
8. ఉద్ధట, దుంధుర సంహారము; చిత్ర గంధర్వుని ఉద్ధరణ	178
9. మహోత్కటుడు తన నోటియందు విశ్వరూపమును చూపించుట	179
10. మహోత్కటుని ఉపనయనము	181
11. ఇంద్రుని గర్వభంగము	182
12. ధూమ్రాక్ష వధ	184
13. మహోత్కటుని కాశీనగర ప్రవేశము	186
14. వినాయకుని కాశీనగర బాల్యలీలలు	187
15. కాశీనగరము దగ్ధమగుట; వినాయకుని పరిరక్షణ	189
16. భృశుండి వృత్తాంతము	190
17. భృశుండి, వినాయక సమాగమము	192
18. హేమజ్యోతిర్విదుని చరితము	194
19. కూప కంధర సంహారము	195
20. అంధక, అంబాసుర, తుంగ దానవుల వధ	197
21. భ్రమరా దురాగతము	198
22. శుక్ల, విద్రుమ చరితము	200
23. వినాయకుడు శుక్ల, విద్రుమలను అనుగ్రహించుట	202
24. సనక, సనందన గర్వ భంగము	204
25. సనక సనందనులచే వినాయక స్తుతి	205
26. వ్యాధుని చరితము	206
27. వ్యాధ, రాక్షసుల పూర్వ జన్మము	207
28. సాంబ, దుష్టబుద్ధుల కథనము	208

29. కశ్యప సంతతి చరితము 209
30. వామన జననము 211
31. సుముఖ గణపతి చరితము 212
32. ప్రియవ్రత చరితము 214
33. క్షిప్ర ప్రసాద చరితము 215
34. శమీక మందార చరితము 217
35. శమీక మందార కథనము 219
36. సావిత్రీ శాపము 220
37. దేవాంగనా స్తుతి 221
38. దురాసద చరితము 223
39. దురాసద విజయము 225
40. వక్రతుండ గణపతి జననము 226
41. వినాయక దురాసద సంగ్రామము 227
42. దురాసద పరాజయము 228
43. డుంఠి గణపతి వృత్తాంతము 230
44. దివోదాసు చరితము 230
45. శివుని విచారము 231
46. డుంఠి గణపతి చతురత 233
47. దివోదాసు నిష్క్రమణము 234
48. పరశుబాహు చరితము 235
49. పరశుబాహు సారూప్యము 237
50. స్వానంద భువనము 239
51. కాశీరాజుకై దివ్య విమానాగమనము 241
52. వివిధలోక వర్ణన 242
53. వినాయక కాశీరాజ సమాగమము 244
54. శూర చపలాఖ్యానము 246
55. నరాంతకుని యుద్ధ సంరంభము 247
56. కాశీరాజ పరాజయము 249
57. నరాంతక పరాజయము 251
58. కాశీ పునరుద్ధరణ 252
59. వినాయక నరాంతక సమరము 254

60. నరాంతక వధ 255
61. శారదా రౌద్రకేతుల శోకము 257
62. వినాయక దేవాంతక యుద్ధ సంరంభము 258
63. దేవదైత్య సమరము 260
64. బుద్ధి దేవాంతక సంగ్రామము 261
65. దేవాంతకుని సమర పునరాగమనము 262
66. వినాయక దేవాంతక సంగ్రామము - I 263
67. వినాయక దేవాంతక సంగ్రామము - II 264
68. వినాయక దేవాంతక సంగ్రామము - III 265
69. దేవాంతక వధ 267
70. వినాయకుని తిరుగు ప్రయాణము 268
71. వినాయకావతార పరిసమాప్తి 269
72. చక్రపాణి చరితము 271
73. సింధు జననము 273
74. సింధు దిగ్విజయము 275
75. దేవ దానవ సంగ్రామము 276
76. సింధు దైత్యుని త్రిలోకాధిపత్యము 277
77. దేవతల మంత్రాంగము 278
78. పార్వతీ పరమేశ్వర సంవాదము 280
79. పార్వతీ తపము 281
80. శ్రీగణేశ జననము 282
81. గుణేశ నామకరణము 283
82. గృధ్రాసుర భంజనము 285
83. క్షేమ, కుశల సంహారము 287
84. శ్రీగణేశ కవచము 289
85. వ్యోమాసుర సంహారము 290
86. శతమహిష, కమఠాసుర సంహారము 291
87. తల్పాసుర, దుందుభి సంహారము 293
88. అజగర, శలభాసుర సంహారము 294
89. నూపురాసుర, అవిపుత్ర సంహారము 295
90. కూట, మత్స్యాసుర, శైలదైత్యుల సంహారము 297

91. వినాయకుడు విశ్వరూపమును చూపుట	298
92. ఖడ్గ సంహారము	300
93. గణేశుని బాల్యలీల	301
94. వినాయకునికి విశ్వకర్మ ఆయుధ ప్రదానము	303
95. గణేశుని ఉపనయనము	305
96. నాగ, విహంగ సమరము	306
97. గణేశుడు మయూరేశ్వరుడగుట	308
98. ముని బాలకులకు విశ్వరూప సందర్శనము	310
99. విహంగత్రయ విడుదల	311
100. కమలాసురుని యుద్ధాగమనము	313
101. మయూరేశ కమలాసుర సంగ్రామము	314
102. కమలాసుర సంహారము	315
103. విరించి గర్వభంగము	316
104. మయూరేశుని అభేదతత్వము	318
105. మయూరేశుడు గణాధ్యక్షుడగుట	320
106. ఇంద్ర గర్వభంగము	321
107. యమ గర్వభంగము	322
108. మయూరేశుని వివాహ ప్రస్తావన	324
109. మయూరేశుని రాయబార ప్రయత్నము	325
110. నంది రాయబారము	326
111. దైత్య, శివగణ యుద్ధారంభము	328
112. కౌస్తుభ, మైత్రుల మరణము	329
113. దైత్య సేనానాయకుల మరణము	330
114. సింధు దైత్యుని పరాజయము	332
115. మయూరేశుని ద్వారా దేవతల సహజస్థితి నొందుట	333
116. దుర్గా సింధు సంవాదము	335
117. కల, వికల మరణము	336
118. ధర్మాధర్ముల మరణము	337
119. సింధు, దుర్గల శోకము	338
120. సింధు పరాజయము	340
121. నారద అభ్యర్ధనము	342

122.	సింధు దైత్యుని మరణము	343
123.	దుర్గ, చక్రపాణి, ఉగ్రల శోకము	345
124.	మయూరేశ వివాహము	347
125.	మయూరేశ అవతార పరిసమాప్తి	349
126.	సిందూర దైత్య జననము	351
127.	శివ సిందూర కదనము	352
128.	పార్వతీ గర్భధారణ	354
129.	గజానన జననము	356
130.	శిశువును పుష్పిక వద్దకు చేర్చుట	357
131.	సిందూర దైత్యుని గర్వభంగము	358
132.	పుష్పికా శోకము	359
133.	మూషికము గణేశ వాహనమగుట	360
134.	మూషిక పూర్వ జన్మ వృత్తాంతము	362
135.	గజాననుని యుద్ధ ప్రయత్నము	363
136.	సిందూర మరణము	365
137.	శ్రీగణేశగీత - 1	367
138.	శ్రీగణేశగీత - 2	369
139.	శ్రీగణేశగీత - 3	371
140.	శ్రీగణేశగీత - 4	374
141.	శ్రీగణేశ గీత - 5	375
142.	శ్రీగణేశ గీత - 6	376
143.	శ్రీగణేశ గీత - 7	377
144.	శ్రీగణేశ గీత - 8	378
145.	శ్రీగణేశ గీత - 9	379
146.	శ్రీగణేశ గీత - 10	381
147.	శ్రీగణేశ గీత - 11	382
148.	కలియుగ లక్షణములు	384
149.	వ్యాసునికి శ్రీగణేశ సాక్షాత్కారము	386
150.	సోమకాంతుని కుష్ఠువ్యాధి నివారణము	387
151.	సోమకాంతుని మోక్షము	389
152.	వారణాసి యందలి వినాయకులు	391
153.	శ్రీగణేశ పురాణ ఫలశృతి	392

అనుబంధము

త్రిమూర్తికృత శ్రీగణేశ స్థోత్రము (స్థోత్ర రాజము)	396
అష్టశ్లోకీ	398
ద్వాదశ శ్రీగణేశ నామములు	399
సంకటహార స్థోత్రము	400
శ్రీగణేశ కవచము	401
భ్రహ్మకృత మయూరేశ స్థోత్రము	402
దు:ఖప్రశమన స్థోత్రము	403

ముందుమాట

"నిత్యహికాలా:" అనేది పతంజలి యోగసూత్రం. కాలం అనంతం. ఈ ప్రవహించే కాలప్రవాహంలో ఆది నుండి నేటి వరకూ ప్రతిజీవి లోపలా అప్పుడూ, ఇప్పుడూ, హృదయంలో ఏదో ఒక మూల పీడించే సందేహం "భగవంతుడు ఎవరు? ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఉంటాడు/ఉంటుంది?" ఈ భగవంతుడు అనే పదార్థాన్ని ఎవరికి వారు తమకు తగ్గట్టుగా నిర్వచించేరు. "పూర్వేషాణాం గురు: కాలేన అనవచ్ఛేద్" అన్నది యోగశాస్త్రం. అంటే పూర్వీకులకు కూడా గురువు. కానీ కాలము చేత ఛేదింపబడనది. "భగవాన్" అని నిర్వచించేయి పురాణాలు. "భ" అంటే జ్ఞానము, శక్తి. "గ" అంటే కీర్తి, ఐశ్వర్యం. "వ" అంటే సత్యం, పూర్ణ వైరాగ్యం. ఈ ఆరు గుణములు ఎవరి వద్ద సంపూర్ణముగ ఉంటాయో ఆ మహాశక్తి లేక తత్వమే భగవంతుడు. మనోవాక్కాయములు దేనిని తెలియక వెనుదిరిగాయో, దానికి అవతల యున్నదే భగవంతుడు అని ఊరుకొన్నాయి వేదాలు. ఏ చైతన్యం చేతనే ఈ సమస్త సృష్ఠి పనిచేయుచున్నదో, ఆ నిర్గుణ చైతన్యమే భగవంతుడు అని ఘోషించాయి ఉపనిషత్తులు.

ఈ అంతు తెలియని అనంతశక్తినే "విష్ణువు" అని వైష్ణవులు; "శివుడు" అని శైవులు; "శక్తి" (కాళిక/లలిత) అని శాక్తేయులు, "గణపతి" అని గాణాపత్యులు; ఈ విధముగ ఎవరికి నచ్చినట్లు వారు పిలుచుకొన్నారు. దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగువారికి శివుడు, విష్ణువు, శక్తి భగవంతుడు అంటే పెద్ద సమస్య కాదుకానీ, గణపతి అనేసరికి "అదేంటి? ఈయన పార్వతీ పుత్రుడు కదా! మరి పరబ్రహ్మ ఎట్లు అయినాడు?" అను సంశయం కొంచెం కొరుకుపడదు. గాణాపత్యం ఎక్కువగా మహారాష్ట్రలో వాడుకలో ఉన్న మతం. వారికి గణపతియే పరబ్రహ్మ స్వరూపం.

ఈ గణేశపురాణం కూడా ఒక ప్రక్క "భగవంతుడు నిరాకారుడు" అని చెబుతూనే సాకారంలో ఈ గణపతిమూర్తిని ప్రతిపాదిస్తుంది. ఈ గణేశ పురాణం ఒక గొప్ప స్థోత్రరత్న నిధి. ఇందులో ఎందరో దేవతలు, ఋషులు కావించిన స్థోత్రములు యున్నాయి. ఏ కార్యసిద్ధి నైననూ కలిగించు స్థోత్రములు ఈ పుణ్యచరిత యందు కోకొల్లలు. అంతేకాక ఈ పవిత్ర పురాణం మానవుని అజ్ఞానం నుండి జ్ఞానం వైపు, అంధకారము నుండి ఉజ్వల కాంతివైపు, మృత్యువు నుండి అమృతత్వమునకు కొనిపోగల ఒక గొప్ప ఉపనిషద్ రహస్య సింధువు. మనలో ఉండే కామక్రోధాది అరిషడ్వర్గములను జయించి పరమాత్మను సాధించే ప్రయత్నమే ఈ గణేశ పురాణం యొక్క ముఖ్యోద్దేశం.

ఈ మహద్గ్రంధాన్ని అనువాదం చేయడానికి నాకు తోడ్పడిన హిందీ గ్రంధములు శ్రీశ్రీ ఆచార్య డా॥ మహేష్‌చంద్ర జోషీ, ప్రొఫెసర్ దల్‌వీర్‌సింగ్ చౌహాన్ ల హిందీ అనువాదములు. ఈ బృహత్ పధకంలో నాకు సహకరించిన మహానుభావులు ప్రప్రధమంగా శ్రీ నీలేష్ జత్వా. ఎఐ సహకారంతో సిద్ధి, బుద్ధి సహిత శ్రీగణేశుని ముఖ చిత్రమును హృద్యముగ, సర్వాంగ సుందరముగ తీర్చిదిద్దిన మహానుభావుడు. ఆయనకు హృదయపూర్వక పాదాభివందన మొనర్చుచున్నాను. తన సహృదయతతో, పవిత్రమైన ఆశీశ్శులతో నన్ను

ఎల్లప్పుడూ దీవించే మా పిట్స్‌బర్గ్ పుర పురోహితులు శ్రీ ధర్మతేజ గారు. వారి పాదములకు సాంజలి బంధకముగ నమస్కరించుచున్నాను. చివరగ నా వెన్నుతట్టి, నాకు ఎల్లప్పుడూ ప్రోత్సాహాన్ని ఇచ్చి, నాలో ఉత్సాహాన్ని నింపే నా శ్రీమతి ఉమ. ఆమె సహాయ సహకారములకు నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడను. చివరిగా ఈ పుస్తక ముద్రణకు ఎంతో సహయపడిన శ్రీచరణ్‌తేజ గారికి నేను సదా ఋణపడి ఉంటాను. వారికి నా నమస్కారములు.

వ్రాసేది, వ్రాయించేది, వ్రాయబడేది సర్వము శ్రీ సీతారామచంద్రులే!

ఈ గ్రంథంలో తప్పులన్నీ నావి. ఒప్పులన్నీ పరమేశ్వరునివి.

రామన్.

ఉపాసనా ఖండము

ఒకటవ అధ్యాయము

(సోమకాంత వర్ణనము)

ఓం గణానాం త్వా గణపతిం హవామహే కవిం కవీనాం ఉపమశ్రమస్తమమ్
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మస్పతఆన: శృణ్వం నూతిభిం సీదసాదనమ్ ॥

ఓం శ్రీ మహా గణాధిపతయే నమ:

గజాననం భూత గణాది సేవితం
కపిత్థ జంబూఫలసార భక్షితమ్
ఉమాసుతం శోక వినాశ కారణం
నమామి విఘ్నేశ్వర పాద పంకజమ్ ॥

యా కుందేందు తుషార హార ధవళా యా శుభ్ర వస్త్రావృతా
యా వీణా వరదండ మండితకరా యా శ్వేత పద్మాసనా
యా బ్రహ్మాచ్యుత శంకర ప్రభృతిభిర్దేవై స్సదాపూజితా
సామాం పాతు సరస్వతీ భగవతీ నిశ్శేష జాడ్యాపహా ॥

సర్వ కార్య సిద్ధి ప్రదాకయుడు, బుద్ధి ప్రకాశకుడు, యోగి హృత్కమల స్థితుడు అయిన శ్రీగణేశుని సర్వ కార్యములందు నాకు సఫలత్వము ప్రసాదింపమని స్థిర చిత్తుడనై ప్రార్థించుచున్నాను. సకల జీవ సర్వాంతర్యామి అయిన గణేశ భగవానుడు భక్త రక్షణార్థమై సగుణ, నిర్గుణ రూపుడై విలసిల్లుచున్నాడు. ఈయన నరరూపము సగుణమును, గజముఖము నిర్గుణ పరబ్రహ్మమును తెలుపుచున్నది. ఈ గణేశుడే కళ్యాణములు ప్రసాదించునపుడు శివునిగనూ, లోకపాలనము నందు విష్ణువుగనూ, అంధకార నివృత్తి యందు ఆదిత్యునిగనూ, కార్యాచరణమందు శక్తిగనూ, జగద్రచన యందు బ్రహ్మగనూ, ధరించువారలందు శేషునిగనూ, వెలుగొందు చున్ననూ, తాను మాత్రము ఎల్లప్పుడూ తనయందు స్వానంద తత్పరుడై క్రీడించుచుండును. ఈ పురాణములను క్షుణ్ణముగ తెలిసి కొనుటకై నేను నిరంతరము దేవ, ఋషి, మరియు మహాత్ముల పాద పద్మములను ఆశ్రయించుచున్నాను.

ఒకనాటి మాట!! కాల ప్రవాహమున మహా యుగములు, మన్వంతరములు, వాని యందు యుగములు గడచుచున్నవి. అందు ఒకానొక చతుర్యుగమున కృత, త్రేతా, ద్వాపరములు గడచి కలి ప్రవేశము జరిగినది. ఆ కలి ప్రభావమున జరిగెడు దుష్కర్మలను, దుష్కృత్యములను కానలేక సమస్త ఋషిగణము దు:ఖితులై నైమిశారణ్యమును ఆశ్రయించిరి. ఈ ఘోర కలిగియుగము నందు కలి బాధల నివారణకు "సులభోపాయము కేవలం పురాణ శ్రవణమే!" అని పూర్వము చతుర్ముఖ బ్రహ్మదేవునిచే నిర్దేశింపబడినది కావున వారందరూ పురాణ శ్రవణమునకు ఉత్సుకులైరి. ఆ

సమయమున వారి వద్దకు సకల పురాణ ఇతిహాసజ్ఞుడు, విద్వాంసుడు, విశిష్ఠదర్శి, కృష్ణద్వైపాయనుని అంతేవాసి అయిన రోమహర్షణుడు (సూతుడు) ఏతెంచెను. సూతుడు ఆ నైమిశారణ్యమును, అచట గల ఋషులను దర్శించి మనసున ఇట్లు తలంచెను “ఆహా! ఈ కలి రహితమయిన నైమిశారణ్యము ధన్యము. స్వధర్మ పరాయణులు, నిత్యనైమిత్తిక కర్మాచరణులు, నిరంతర పంచ యజ్ఞాచరణ ధురంధరులు, వేదాధ్యయన సంయుతులు, జ్వలించుచున్న అగ్ని వంటి తేజో సంపన్నులయిన ఈ ఋషి గణమును కాంచుట నా పూర్వజన్మ పుణ్య ఫలము.” ఈ విధముగ మనసున తలంచి, వారందరినీ సాదరముగ వీక్షించి, సాంజలి బంధకముగ వారందరికీ నమస్కరించి, మృదు మధురముగ వారితో ఇట్లనియె “ఓ! ఋషి సత్తములారా! నేడు నా వంశము, మాతా పితరులు, కులము, ఆయువు, విద్య, తపస్సు, జ్ఞానము, వ్రతము, సర్వము ధన్యమయినవి. ఎందుకనగా దేవతలు సహితము ఎవరిని కాంచుటకు నిరంతరము వాంఛించెదరో, అట్టి మహర్షుల సందర్శనము నేటికి నాకు కలిగినది. ఇయ్యది కేవలము నా పూర్వ పుణ్య ఫలము. “బ్రహ్మమును తెలిసికొన్నవాడు బ్రాహ్మణుడు.” అట్టి బ్రాహ్మణ సందర్శనము చే నేను కృతార్థుడను, కృతకృత్యుడను అయి భవసాగరము నుండి విముక్తుడనైతిని.”

అంత మునులు మిక్కిలి సంతసిల్లి, సూత మహర్షికి సాంజలి బంధకముగ నమస్కరించి, అర్ఘ్య పాద్యాదులిచ్చి, సుఖాసీనుని కావించిరి. ఆ మునుల పనుపున శౌనక మహర్షి ఈ విధముగ పలికెను. “ఓ! మహాబుద్ధి స్వరూపా! మీరు సాక్షాత్ నారాయణావతారమైన వేదవ్యాసుని శిష్యులు. సర్వజ్ఞులు. సమస్త పురాణేతిహాసములు మీకు కరతలామలకము. మీరు సమస్త సంశయములను సర్వులకు నివారింపగలుగుటచే రోమహర్షణులైరి. ఈ కలియుగము మహాపాపరూప కాలము. అందువలన భయాతురులమైన మమ్ము బ్రహ్మదేవుడు నైమిశారణ్యమున నివసింపవలసినది అని ఆజ్ఞాపించెను. అంతేకాక ఎక్కడ పురాణ శ్రవణము జరుగుచుండునో, ఎక్కడ పురాణములు గానము చేయబడునో, అచట కలి నివసింప లేదు. అందువలన అచట కలి ప్రభావము యుండదు. అందుచే దయచేసి మాకు వివిధ పురాణ గాథలను వివరింప ప్రార్థన.” అంత సూతుడు సంతుష్టాంగ తరంగుడై సర్వ దు:ఖములను హరించి, సమస్త ధర్మములను బోధించు సకల పురాణములను, బ్రహ్మమును వర్ణించు సమస్త మతములను, చతుర్విధ పురుషార్థములనొసంగు ఇతిహాసములను, ఉపపురాణములను, వారికి వాక్రుచ్చెను. అద్దానిచే వారందరూ కలి కల్మష రహితులై, ముదిత మనస్కులైరి. కానీ ఏకమయిన పరబ్రహ్మమును గూర్చి వివిధ రకములుగ ఉపదేశించుట చే వారందరూ భ్రాంతియుతులై తిరిగి ఇట్లు ప్రశ్నించిరి “మహాత్మా! సూత మహర్షీ! ఈ పురాణములు కొన్ని విష్ణువును, కొన్ని పరమశివుని, మరికొన్ని శక్తినీ, కొన్ని ఆత్మ, ప్రాణము, మనస్సు, అన్నము, జ్ఞానము, బుద్ధి, సాంఖ్యము లేక స్వానందమును ఉత్కృష్టము లేక పరబ్రహ్మమని ఘోషించుచున్నవి. ఈ ఉపదేశము లన్నింటియందు సర్వ సమ్మతము, లేక సర్వోత్కృష్టము ఏది? దయచేసి తెలుపవలసినది.” అంత సూతుడు ఋషి సత్తములారా! సర్వ వేదములందు, శృతి, పురాణాదులందు సర్వులచే సారరూపమని తెలుపబడినది “శ్రీ గణేశ పురాణము.” మీకు ఆ సచ్చరిత్రమును వినిపించెదను.”

ఈ గణేశ పురాణము శ్రవణ మాత్రమున మానవులను కృతకృత్యులను కావించును. దీని ప్రభావమును తెలుపుట ఫణిపతి, వాణీపతులకు సహితమసాధ్యము. కానీ మీ ఆదేశానుసారము ఈ దివ్య పురాణమును మీకు తెలుపుటకు ప్రయత్నించెదను. అనేక పూర్వ పుణ్య సంచయము చేతనే ఈ పురాణమును శ్రవణము చేయుట సిద్ధించును. పాఖండ, నాస్తిక పాపజనులకు ఈ పురాణ శ్రవణము కల్ల. ఈ గణేశుడు సగుణ; నిర్గుణ రూపుడు. ఈయన స్వరూప వర్ణనము అసాధ్యము. వేదాదుల యందు ఓంకార రూపుడుగ ప్రతిపాదింపబడినది ఈయనయే! త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, ఋషి గణములు, సదా హృదయమందు ఈ గణపతినే కొలుచుచుందురు. ఈయన సమస్త జగత్తుకు హేతువు మరియు సర్వ కారణ కారణము. ఈయన ఆజ్ఞచే చతుర్ముఖ బ్రహ్మ సృష్టినీ, విష్ణు భగవానుడు పాలననూ, రుద్రుడు సంహారమును

కావించుచున్నారు. అతిక్రమింపలేని ఈ మహాపురుషుని ఆజ్ఞచే వాయువు చలించును, గ్రహ, నక్షత్రములు భ్రమించుచుండును, అగ్ని ప్రజ్వరిల్లును. ఈ పరమాత్ముడు గణేశుని చరిత్రము గుప్తాతిగుప్తము. దీనిని తొలుత బ్రహ్మ నారాయణాంశ అయిన మా గురుదేవులు వ్యాసునకు, వ్యాసుడు భృగువునకు, భృగువు సోమకాంతునికి తెలిపిరి. ఎవరు వ్రతములు, యజ్ఞములు, తీవ్ర తపోదానములు, తీర్థ, క్షేత్ర సందర్శనములు కావించి అనంత పుణ్యరాశిని ఆర్జించుకొందురో వారి బుద్ధి శ్రీ గణేశ పురాణమును వినుటకు ప్రవర్తిల్లును. ఎవని బుద్ధి పత్నీ, పుత్ర, సాంసారిక వ్యామోహముల నుండి విముక్తి నొందునో, వారు ఈ మయూరేశుడు గణపతి యొక్క పురాణాఖ్యానములు వినుటకు సన్నద్ధులగుదురు.

ఒకానొకనాటి మాట! సౌరాష్ట్రము నందు దేవ నగరిని "సోమకాంతుడు" అను మహారాజు పరిపాలించుచుండెను. ఈయన గొప్ప వేద శాస్త్రార్థ తత్వజ్ఞుడు, మరియు దర్మశాస్త్రార్థ పరాయణుడు. అంతేకాక ఆయన బుద్ధి యందు బృహస్పతి, సంపదలందు కుబేరుడు, క్షమ యందు ధరిత్రి, గంభీరత యందు సాగరము, తేజస్సు యందు సూర్యుడు, ద్యుతి యందు చంద్రుడు, ప్రతాపమందు కుతవాహుడు, సౌందర్యము నందు కామదేవుల సముడు. ఆయనకు అయిదుగురు అమాత్యులు కలరు. వారందరూ బలశాలురు, పరాక్రమోపేతులు, దృఢనిశ్చయులు, నీతిశాస్త్ర చతురులు, శత్రుదేశములను నిర్జించి ధ్వంసమొనర్పగల సమర్థులు అయిననూ నిరంతర రాచకార్య సంలగ్నులు, మరియు ప్రభుభక్తి పరాయణులు. వారందరూ వరుసగా రూపవానుడు, విద్యాధీశుడు, క్షేమంకరుడు, జ్ఞానగమ్యుడు, మరియు సబల నామధేయులు. ఈ మహారాజు యొక్క ధర్మపత్ని "సుధర్మ". ఆమె రూప లావణ్యముల యందు రతీదేవి, రంభాది అప్సరసల కంటె సౌందర్యరాశి. నిరంతరము దివ్యాభరణ భూషితయై చిత్ర విచిత్ర దుకూలములు దాల్చుచూ తన పతిని ఆనంద సాగరమున ఓలలాడించెడిది. నిరంతరము భగవత్ పూజ, అతిధి సేవ, పతిసేవా తత్పరయై విలసిల్లెడిది. ఆ పుణ్య దంపతికి "హేమకంఠుడు" అను పుత్రుడుదయించెను. ఆతడు పదివేల ఏనుగుల బలశాలి, బుద్ధిమంతుడు, గుణవంతుడు, మరియు శత్రుమర్దనుడు. ఈ విధముగ సోమకాంతుడు శ్రేష్ఠుడై, సర్వ రాజనీకమును ఓడించి సార్వభౌముడై ధరాతలమును పాలించుచుండెను. ఆయన నిత్య ధర్మపరాయణుడు, యజ్ఞనిరతుడు, దానశీలి, మరియు త్యాగధనుడు.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి సోమకాంత వర్ణనము అను ప్రధమోధ్యాయము సమాప్తము)

(రెండవ అధ్యాయము)

(సోమకాంత దు:ఖ వర్ణనము)

కాలమెప్పుడునూ ఒకే విధముగ యుండదు కదా! సోమకాంతుడు ఈ విధముగ సర్వసౌఖ్యములు అనుభవించుచుండగా పూర్వ జన్మ పాప విశేషమున ఆయనకు కుష్ఠవ్యాధి సంక్రమించినది. శుభాశుభ కర్మ ఫలములు శరీరములు మారిననూ వెన్నంటక మానవు కదా! ఈ కుష్ఠ వ్యాధి మూలమున శరీరమంతయు వ్రణములు పొటమరించి, వాని మూలమున మహారాజు మిక్కిలి వ్యధకు గురి అయ్యెను. ఈ వ్రణములు రక్తము, చీము నిరంతరము స్రవించుటచే శరీరమంతయు దుర్గంధభూయిష్ఠమై, మహారాజు చిక్కి శల్యావశిష్ఠుడాయెను. ఈ వ్యాధి నివారణకై రాజు ఎన్నో ప్రయత్నములు సలిపి, తుదకు ఈ వ్యాధిని నివారించుకొని సావధానుడగు పరిస్థితి అసాధ్యమని తెలిసికొని, మనసు కుదుటపరుచుకొని, తదుపరి కార్యార్థమై తన అమాత్యులను, పత్నీ పుత్రులను పిలిచి ఇట్లనియె "నేను అంతులేని రాజ్య సుఖభోగములను

అనుభవించితిని. కానీ నేడు నా రాజ్యము, బల, రూప, సౌందర్యాదులు, ధనము, సర్వము వ్యర్థమయినవి. పూర్వ జన్మములందు నేనేమి పాప కర్మలాచరించితినో నాకు తెలియదు. సోముని కాంతిని తిరస్కరించి సోమకాంతుడనైన నేను నేడు కాంతి విహీనుడనైతిని. నేను నా శక్తి మేర సత్పురుషులను, ఋషి, ముని గణములను, శ్రోత్రియ బ్రాహ్మణులను, దీన దు:ఖితులను, సకల ప్రజానీకమును కన్నబిడ్డల వలె పరిపాలించితిని. ఘోర శత్రువులను నా సాయక ధారలచే పరాజితుల కావించితిని. సమస్త పృథివీతలమును ఏక ఛత్రాధిపత్యముగ ఏలితిని. దేవాధిదేవుడయిన పరమేశ్వరుని సదాశివుని మనసారా పూజించి, అర్చించితిని. చిత్తవృత్తులను పూర్ణముగ నిరోధించి, దుష్ట సంసర్గ రహితుడనై, సత్సాంగత్యముచే ఈ శరీరమందు ఇహలోక సర్వాభీష్ట సిద్ధి నొందితిని. ఇపుడు ఆ శరీరమే దుర్గంధ భూయిష్ఠమైనది. నా జీవితము వ్యర్థమయినది. నేడు నేను మీ అందరి అనుమతితో వనములకేగెదను. అమాత్యులారా! మీరందరూ నన్ను ఎంతో శ్రద్ధాభక్తులతో సేవించిరి. నా అనంతరము బుద్ధిమంతుడు, పరాక్రమోపేతుడు అయిన నా సుపుత్రునకు రాజ్యాభిషేక మొనరించి వానిని నా యందు వలెనే ప్రభుభక్తితో సేవింపవలసినది. ఇక నేను ఎవరికీ నా ముఖము చూపింపలేను. నాకు ఇక ఈ రాజ్యము పత్నీ, ధనము, అధికారము తో ప్రయోజనము లేదు."

ఈ విధముగ పలికి ధర్మాత్ముడైన మహారాజు మొదలు నరికిన కదళీతరువువలె నేలపై బడెను. అంత అంత:పుర స్త్రీలు, అమాత్యులు, రాజ పరివారము, సేవకులు, సర్వులు ఒక్క పెట్టున రోదించిరి. ఈ హృదయ విదారక దృశ్యముచే అంత:పురమంతయు హాహాకారములు చెలరేగినవి. అంత బిషగర్వులు ఔషధములు ప్రయోగించి రాజునకు స్వస్థత చేకూర్చిరి. అపుడు అమాత్యులు ఈ విధముగ పలికిరి "మహారాజా! మేము సహితము మీ ఛత్రఛాయన ఇతరులకు దుర్లభమగు ఇంద్రతుల్య భోగములు అనుభవించితిమి. ఇపుడు మీరు లేక మేము ఈ సుఖములనెట్లు అనుభవింపగలము? అటులయిన మేము కృతఘ్నులమగుదుము. మీ సుపుత్రుడు సర్వ రాజలక్షణ శోభితుడు మరియు పరాక్రమోపేతుడు. ఆయనకు మా అవసరము లేదు. ఆయన స్వయముగ కార్య నిర్వహణ యందు దిట్ట. అందువలన మేము సహితము వనములందు మిమ్ము అనుసరించెదము." అంత మహారాణి సుధర్మ "నేను ఈ మహారాజు వల్ల ఈయనతో ఎన్నో సుఖ, భోగములను అనుభవించితిని. ఈ జన్మమునందలి సుఖ దు:ఖములకు కారణము కేవలము పూర్వజన్మ కర్మ ఫలములే! ఎవరికి ఏమి సుఖములు వ్రాయబడినవో, వారు ఆ సుఖమును మాత్రమే బడయుదురు. పతిసేవ సతికి ఆదర్శము. అందుకే ఆమె సహధర్మచారిణి. ఇహపర లోకములందు పతిని అనుసరించడమే సతికి ధర్మమని మునులు ఆదేశించిరి. అదియే పతివ్రతాధర్మము. అందువలన అమాత్యులారా! మీరు మా పుత్రునికి రాజ్యాభిషేకమొనర్పవలసినది. నేను వనములందు ఈ మహారాజును అనుసరించెదను."

అంత శోక సంతప్తుడైన రాకుమారుడు హేమకంఠుడిట్లనియె "తండ్రీ! నాకు రాజ్యము, పత్ని, ప్రాణము, ధనములందు ఏ విధమయిన ప్రలోభము లేదు. మీరు వినా నాకు ఏ ఇతర కృత్యములు అభీష్ఠము కాదు. ఓ! ధర్మపాలకా! తైలము లేని దీపము, ప్రాణము లేని శరీరము వలె మీరు లేని రాజ్యము వృధా!!" అంత మహారాజు వారు పలికిన పలుకులు విని స్వాంతననొంది ఇట్లనియె "పుత్రా! వినుము. పితృవాక్య పరిపాలకుడు, తల్లిదండ్రులు గతించిన పిదప శ్రాద్ధాది కర్మలు సక్రమముగ ఆచరించువాడు, గయ యందు పిండ ప్రదానము కావించువాడు మాత్రమే "పుత్రుడు" అని పిలువబడును. అందువలన నీతిని ఆశ్రయించి, నీవు నా ఆజ్ఞానుసారము ఈ అమాత్యుల సహాయముతో ప్రజలను కన్నబిడ్డల వలె ప్రేమించుచూ రాజ్యపాలన మొనర్పుము. ధర్మశాస్త్ర తత్వజ్ఞుడు, నీతి శాస్త్రజ్ఞాత, సమస్త ప్రజానీకమును సంతుష్ఠపరచగల నాయకుడే "రాజు" అనదగును. పుత్రా! కుష్టరోగపీడితుడనైన నేను ఇక భార్య సహితుడనై వనముల కేగుటకు నాకు అనుమతి నీయవలసినది."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి సోమకాంత దు:ఖ వర్ణనమను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(సదాచార వర్ణనము; హేమకంఠ పట్టాభిషేకము)

తదుపరి మహారాజు కుడిచేతితో తన కుమారుని ఆసరాగా తీసికొని, లేచి, ఆ రాకుమారుని తమ గృహాంతర్భాగమునకు తీసికొని వెళ్ళి, ఒక రత్న సింహాసనముపై తన ప్రక్కన కూర్చుండ బెట్టుకొని ఏకాంతమున తనకుల, యశోవృద్ధి కావించు వివిధములయిన నీతి వాక్యములను, సదాచారములను ఈ విధముగ తెలిపెను "నాయనా! రాత్రి ఒక యామము (1/8 వంతు రాత్రి) మిగిలి యుండగనే మనుష్యుడు నిద్రలేచి, శయ్యను త్యజించి, ఒక శుద్ధ ప్రదేశమున కూర్చొని గురువును స్మరించి, తదుపరి ఇష్ఠ దేవతా స్థుతి కావింపవలెను. పిదప "సముద్ర వసనే దేవి, పర్వత స్థన మండలీ" మొదలగు శ్లోకములతో పృధివీదేవిని తన పాదస్పర్శచే కావించు ఘాతుకమునకు క్షమింపమని ప్రార్ధింపవలెను. పిమ్మట సమస్త సృష్ఠి కారకుడు, సర్వదేవ వరప్రదాయకుడు, ఆగమములందు తెలుపబడినవాడు, ధర్మార్ధకామమోక్ష చతుర్విధ పురుషార్ధ ఫలప్రదాత, ముముక్షువులకు మోక్షప్రదాత, వాణిచే వర్ణనాతీతుడు, అనాది, మరియు అనంత రూపములుగల గణపతిని ప్రార్ధింపవలెను. తదుపరి క్షీరసాగరవిహారి, ఉపేంద్రుడు, అత్యుగ్ర పరాక్రముడు, నిజభక్త రక్షణార్ధము అవతారములను స్వీకరించు పాప, శత్రు నాశకుడయిన లక్ష్మీపతి నారాయణ భగవానునకు నమస్కరింపవలెను. పిదప వ్యాఘ్ర చర్మాంబరధారి, కాముని భస్మమొనర్చిన మహాదేవుడు, దేవ సిద్ధాదులకు సహితము ఆశ్రిత, సేవిత పూజితుడు, కంఠ సర్పహారి, త్రిశూలధారి, అయిన ఉమాపతి శంకర భగవానునకు ప్రణామములర్పింప వలెను. పిమ్మట పాపహరుడు, గగనాంధకార దూరీకృతుడు, వేద స్వరూపుడు, పూజనీయుడు, జ్ఞానదాత, ఉదారుడు, అనంత శక్తిశాలి అయిన ప్రత్యక్ష నారాయణుడు సూర్య భగవానునికి ప్రణామములర్పింపవలెను. అటు పిమ్మట సంసార సమృద్ధికి హేతువు, భవసాగరతారిణి, త్రినేత్రి, తత్వజ్ఞానకారిణి, మాయా స్వరూపిణీ మరియు ఆసురీ మాయా విచ్ఛిన్నకరీ, అయిన సురేశ్వరి పార్వతీదేవికి ప్రణమిల్లవలెను. చివరగ అన్య దేవీ దేవతలను,ముని జనులను ధ్యానించి మానసోపచార పూజ కావింపవలెను.

తదుపరి జలపాత్ర తీసికొని గ్రామమునకు నైఋతి దిశగా ఏగి శౌచ నిమిత్తము బ్రాహ్మణుడు తెలుపు, క్షత్రియుడు ఎరుపు, వైశ్య శూద్రులు నలుపు రంగు మృత్తికను ఉపయోగింపవలెను. శౌచ నిమిత్తము ఉపయోగించు మృత్తికను నదీతీరము నుండి కానీ, ఊసరక్షేత్రము నుండి కానీ, వల్మీకము నుండి కానీ తీసికొనవలెను. గడ్డి ఆవరించిన భూమిపై ఉదయము దక్షిణ దిశకు, రాత్రి ఉత్తరదిశకు తిరిగి మలమూత్ర విసర్జన కావింపవలెను. తదుపరి తృణములతో కానీ, వృక్ష కాష్ఠములతో కానీ, శుభ్రపరుచుకొని పిదప మృత్తిక మరియు జలములతో శుభ్ర పరుచుకొని తదుపరి రెండు చేతులను ఇదే పద్ధతిని ఏడుమార్లు శుభ్రపరుచుకొనవలెను. మూత్ర విసర్జన అయిన పిదప ఒక్కమారు లింగమును, మూడు మార్లు ఎడమ చేతిని, రెండు మార్లు రెండు చేతులను పైన తెలిపిన విధానముననే శుభ్రపరుచుకొనవలెను. మలోత్సర్గము, లేక మూత్రోత్సర్గము – ఈ రెండు కార్యక్రమములందునూ, దేని పిదపనైననూ పాదప్రక్షాళన కావింపవలెను. ఈ పైన తెలిపిన క్రియాకలాపమంతయు గృహస్థ పురుషులందరూ ఆచరింపవలెను. గృహస్థ స్త్రీలు పైన తెలిపిన క్రియల యందు ఉదయ వేళలందు సగభాగము, రాత్రి వేళలందు పావు (1/4) భాగము ఆచరించిన సరిపోవును. బ్రహ్మచారి అయిన గృహస్థ విధులకు ద్విగుణీకృతము, వానప్రస్తుడు త్రిగుణీకృతము, యతి లేక సన్యాసి నాలుగు రెట్లు అధికముగ గావింపవలెను.

తదుపరి ఆచమనము చేసి పాలుకారు వృక్షములు, కంటక సహిత వృక్షములు మినహా మిగిలిన వృక్ష కాష్ఠములు

గ్రహించి, అద్దానితో దంతధావన కావింపవలెను. ఆ సమయమున వృక్ష కాష్ఠమును "ఓ! వనస్పతీ! నాకు బల, వీర్య, యశో, తేజస్సు, పశు, బుద్ధి, ధనము, మేధ, వేద జ్ఞానము ప్రసాదింపమని ప్రార్ధింపవలెను. పిదప శీతల జలములతో స్నానమాచరించి, సంధ్యోపాసన, జప, హోమ, స్వాధ్యాయ, పితృతర్పణ, దేవపూజ, బలి, విశ్వేదేవ, అతిధి పూజన కావించి, అటుపిదప భోజనాది కార్యక్రమములు కావింపవలెను. భోజనానంతరము ద్విజుల సమక్షమున పురాణ శ్రవణము చేయవలెను. తన ధన, ప్రాణముల ఫణముగ అమృతతుల్య వాక్యములతో పరోపకారమొనర్పవలెను. ఎట్టి పరిస్థితుల యందు ఆత్మస్తుతి, పరనింద కావింపరాదు. గురుద్రోహము, వేదనింద, నాస్తికత, పాపపరాయణుల సేవ, అభక్ష్య భక్షణము, పరస్త్రీ గమనము, స్వపత్నీ త్యాగము ఎన్నడునూ కావింపరాదు. తన పత్నితో ఋతుకాలమందు సంగమింపవలెను. మాతా, పితృ, గురు, గోసేవ ఎల్లప్పుడూ చేయవలెను. దీనదు:ఖితులు, అంధులు, నిర్ధనులు, నిస్సహాయులకు అన్న వస్త్రదాన మొనరింపవలెను. ప్రాణ సంకటమందు కూడా అసత్య మాడరాదు. ఈశ్వరానుగ్రహము కల సత్పురుషులను అనుసరింపవలెను. నీతిజ్ఞుడైన రాజు నిరంతరము ధర్మశాస్త్రాధ్యయనము చేయుచూ, ధర్మశాస్త్ర విశారదులయిన విద్వాంసులను సంప్రదించుచూ, అపరాధులకు వలయు శిక్షను విధింపవలెను. అవిశ్వసనీయులపై ఎన్నడునూ విశ్వాసము కూడదు. రాజు తన దేశమును "యానము, ఆసనము, సంధి, విగ్రహము, ద్వైదీభావము, ఆశ్రయ సంజ్ఞకము" అను ఆరు గుణముల ఆశ్రయము చే పరిపాలింపవలెను. రాజు తన కోశాగార సామర్థ్యము ననుసరించి దానము నొనర్పవలెను. లేని ఎడల దేశము ధనహీనమై దుర్భిక్షము పాలగును.

శత్రువు వ్యాకులుడై విపత్తుల యందున్నపుడు యానము (యుద్ధాభిమానము) చేయుట అధమమని తెలుపబడినది. రాజు తన గుప్తచారుల ద్వారా తన దేశము యొక్క, శత్రురాజుల యొక్క విషయములు తెలియవలెను. రాజు సరిఅయిన దూతల ద్వారా తాను సందేశమును గ్రహించుట, లేక పంపుట చేయవలెను. ఎప్పుడూ అపరాధులను శిక్షించుటకు, శత్రువుల నుండి రాజ్య రక్షణకు రాజు అప్రమత్తుడై యుండవలెను. రాజు యొక్క దండన భయము వలన ప్రజలు తమ ధర్మములను ఉల్లంఘించక నీతి, న్యాయ మార్గములందు చరింతురు. లేని ఎడల సమాజము నందు నియమములు నశించును. అధములైన వ్యక్తుల నిందా, ప్రశంసలను కేవలము ఉపేక్షింపవలెను. వాని వలన క్రోధము సంతుష్టి రెంటినీ పొందరాదు. పూర్వకాలమందు తనకు అపకారము చేసిననూ, పూర్వకాలమందు ధనవంతుడైన వ్యక్తి దరిద్రుడైననూ, వారు తన వద్దకు వచ్చి శరణుజొచ్చినచో, వారికి ఎల్లప్పుడూ శరణిచ్చి, పోషింపవలెను. మంత్రుల తోడి మంత్రాంగము ఎల్లప్పుడూ గుప్తముగనే సాగవలెను. రాజ్యాధికారము కేవలము గుప్తమంత్రము ద్వారానే సాధ్యము. రాజు తొలుత తన మనసునందలి అరిషడ్వర్గము (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు) పై విజయము సాధించి, తదుపరి బాహ్య శత్రువులను జయింపవలెను. రాజు బ్రాహ్మణహింస, ప్రజా పీడనము, దేవపూజా పరిత్యాగము, ఉద్యానవన ఖండనము, చైత్యారామముల (ఆలయములు, మూర్తులు) వినాశనము ఎప్పుడునూ, ఎన్నడునూ చేయరాదు! చేయరాదు!! చేయరాదు!!! పర్వకాలమందు దానములు, యశోవృద్ధికై త్యాగములు, చేయవలెను. మిత్రుల ఎడల వంచన, స్త్రీలకు గుప్త విషయములు ఎరుకపరచుట చేయరాదు. ఋణగ్రస్తులయిన బ్రాహ్మణులను, బురదనందు కూరుకొని పోయిన గోవులను ఉద్ధరింపవలెను. సత్యమును ఎప్పుడూ పలుకవలెను. అసత్యమును ఎన్నడూ పలుకరాదు. రాజు తన అమాత్యుల, భృత్యుల, ప్రజల హృదయములు గెలువవలెను. సురలందు, భూసురులందు రాజుకు భక్తి యుండవలెను."

ఈ విధముగ సోమకాంతుడు తన పుత్రునకు యధాశక్తి ధర్మము, ఆచారములు, శృతి సమ్మతమైన నీతిశాస్త్ర వచనములు బోధించి, పిదప క్షేమంకరాది తన అమాత్యులను రావించి, ఒక శుభ ముహూర్తమును నిర్ణయించి, హేమకంఠుని రాజ్యాభిషేకమునకై వలయు సామాగ్రి, సంభారములను ఆయత్తమొనర్పమని ఆదేశించెను. ఆ శుభ ముహూర్తమునకు వేదశాస్త్ర ధురంధరులు, యజ్ఞకర్మమందు నిష్ణాతులైన బ్రాహ్మణులను, గొప్ప గొప్ప ఇతర రాజ్య మహీపతులను, తన

శుభమును కాంక్షించు మిత్రులను, రాజ్యమండలి వణిక్ ప్రముఖులను, సుప్రసిద్ధులైన నాగరికులను, సామాన్య ప్రజానీకమును, ఇతరులందరినీ, తన పుత్రుని రాజ్యాభిషేకమున కాహ్వానించెను. తదుపరి యధావిధి గణేశ, ఇష్టదేవతా, మాతృపూజనము కావించి, స్వస్తివాచకము చేయించి, సర్వులను భోజనాదికములచే సంతుష్టుల గావించి, హేమకంఠుని మహారాజుగ అభిషేకించి, రూపవాన్ మొదలగు అమాత్యులను పిలచి ఇట్లనియె "అమాత్యులారా! ఈ రాజపుత్రుని హేమకంఠుని మీ పుత్రుని వలె భావింపవలసినది. నేను నా పుత్రుని మీ చేతులయందు నిడుచున్నాను. నీతి నిపుణులైన మీరందరూ ఇదివరలో నా శాశనమును మన్నించినట్లే, రాజ్యమండలి ప్రముఖులందరితో కలసి ఈ హేమకంఠుని శాశనమందు సంలగ్నులు కావలసినది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండ మందలి సదాచార వర్ణనము, హేమకంఠ పట్టాభిషేకమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(సోమకాంత వన గమనము)

హేమకంఠుని రాజ్యాభిషేకానంతరము సోమకాంతుడు అరుదెంచిన బ్రాహ్మణులకు పూజనమొనర్చి, వారికి ధన, కనక, రత్న, వైఢూర్య రాశులను, ఒక్కొక్కరికి ఒక్కొక్క ఆయుతము (పదివేలు) గోవులను దానమిచ్చి సంతృప్తి నొనరించెను. ఆహ్వానితులైన రాజులకు గజాశ్వ ధనరాశులను, అత్యంత విలువయిన చీని చీనాంబరములను, కాశ్మీరు శాలువాలును, తివాచీలను, బహూకరించెను. అమాత్యులకు మరికొన్ని గ్రామములను, ధనరాశులను ప్రసాదించెను. మిగిలిన ఆహ్వానితులందరికీ యధావిధిగ వారి వారి స్థాయి ననుసరించి సర్వులను సన్మానించి సంతుష్టుల గావించెను. అటుపిదప తన పూర్వజన్మ దుష్కర్మ జనిత కుష్ఠరోగము చే అమిత వ్యధ నొందుచూ శోకసంతప్తుడై వనమున కరుగుట మొదలిడెను. ఆ సమయమున భయంకర, దీన హాహాకారములు పెల్లుబికినవి. సర్వులు తమ తమ కర్మల పరిత్యజించి ఆయన వెనుక పయనమైరి. రాజు నడచుచూ, పడుచూ, లేచుచూ నెమ్మదిగ ముందుకు సాగెను. పురజనులు తిరిగి మహారాజు యొక్క ప్రస్థానము నాపుటకు ప్రయత్నించిరి. రాజు ముందుకు సాగి నానా వృక్ష పరివృతమయిన జలాశయము వద్ద ఒక శీతల వృక్ష ఛాయన విశ్రమించి, అంజలి ఘటించి పురజనులతో ఇట్లనియె "అమాత్య, పురజనులారా! చిరకాలము నుండి రాజ్యాధికారము చే నేను కావించిన అపరాధములను మన్నింపవలసినది. మీకు అంజలి ఘటించి నమస్కరించుచున్నాను. నా పుత్రుని ఎడ దయ చూపవలసినది. ఒకవేళ దైవ యోగమున నేను తిరిగి వచ్చిన ఎడల మీకు నా ఎడల యధాతథమైన స్నేహము యుండుగాక! బాల, స్త్రీ, వృద్ధ సహితులై ఏతెంచిన మీరందరూ తిరిగి మీ గృహములకు ఏగ వలసినది. నా పుత్రుని పాలన యందు మీరందరూ నిశ్చింతులై నివసించెదరు గాక! దయచేసి వనమునకేగుటకు నాకు అనుజ్ఞ నీయవలసినది. మీరు వెనుకకు వెడలిన ఎడల నేను నిశ్చింతగా మనశ్శాంతితో వనమున కేగెదను. నాకు ఈ మహోపకారమొనర్పవలసినది. నా జన్మాంతర మహాపాప ఫలితముగ సుభిక్షమైన ఈ రాజ్యమును, హితులైన మీవంటి పురజనులను వదలి వెళ్ళు ఖర్మమేర్పడినది. ఎవ్వరికైననూ పూర్వజన్మ కర్మ ఫలితము అనుభవింప తప్పదు కదా!"

రాజు ఈ విధముగ పలికిన మీదట జనులు మరింత దు:ఖాతురులైరి. కొందరు ధీర పురుషులు "మహారాజా!

ఇన్నాళ్ళు మా ఆలనా, పాలనా, చూసిన మీరు, మమ్ము విడువతగదు. జలము శీతలమును, అగ్ని ఉష్ణతను, సముద్రము తన చెలియలికట్టను, సూర్యుడు ప్రకాశమును, ఎట్లు వీడరో, అట్లే మీరు మమ్ము వీడుట సబబు కాదు. ఓ! జనవత్సలా! మీరు లేక మేము ఎట్లుమనగలము? శత్రుతాపకా! ఎన్నో తారలు యున్నప్పటికీ చంద్రుడు లేని ఆకాశము ఎట్లు శోభనీయదో, అట్లే మీరు లేని రాజ్యము శోభాహీనము. మేము సహితము మీతో తీర్థయాత్ర కావించెదము. తీర్థ సేవనము చే మీరు మీ పూర్వపు కాంతిని సంతరించుకొనెదరు. అపుడు విద్వజ్జన సమూహము, వాద్యఘోష, వంది మాగధుల స్తోత్ర పాఠము, ధ్వజపతాక పరివేష్ఠితులై మీరు తిరిగి రాజ్య ప్రవేశము కావింపవచ్చు." అంత మహారాజు మనసునందు దు:ఖ క్రోధములు ఏకకాలమున అలముకొనగా "అట్లు చేయవలదు" అని తిరిగి ప్రార్థించెను. అంత అమాత్య సహిత హేమకంఠుడు వినయముగ ఇట్లనియె "తండ్రీ! మీ విరహమునందు నాకు రాజ్యపాలన ఇంచుక రుచించుట లేదు. దీనిని సహించుట దుష్కరము."

అంత మహారాజు "పుత్రా! అందువలననే నీకు నీతి వాక్యములు నిండిన ధర్మశాస్త్ర వచనములను తెలిపితిని. ఆ సదుపదేశము వ్యర్థము కారాదు. పురాతన కాలమందు పితృవాక్య పరిపాలనార్థమై పరశురాముడు తన తల్లిని వధించెను. రామచంద్రుడు రాజ్య త్యాగము కావించి వనమున కేగెను. లక్ష్మణుడు రామాజ్ఞ చే కారణమరయకుండగనే సీతాదేవిని విపినమున విడచెను. అందువలన హేమకంఠా! నీవు అమాత్యుల సహితుడవై నా ఆజ్ఞగా నగరమునకు పొమ్ము. ఎట్లు తత్వవేత్తలయిన విద్వాంసులు లౌకిక కర్మాచరణము ఆచరించినప్పటికీ, చిత్తము సర్వదా భగవంతుని యందు సంలగ్నమైనటులే, ఎట్లు జన సామాన్యుల చిత్తము ఎల్లప్పుడూ తాము ఆర్జించిన ధనమందు లగ్నమైనటులే, నేను కాననములకేగినప్పటికీ నా అంత:కరణము ఎల్లప్పుడూ నీ చింతన యందే యుండును. దైవ యోగమున ఒకవేళ నా కుష్ఠరోగము నయమయిన ఎడల నేను తప్పక గృహమున కేతెంచెదను. నా వచనములు పాలించుట వలన నీకు ధర్మప్రాప్తి కలుగును. అందువలన నీవు అమాత్య సహితముగ నగరమునకు ఏగవలసినది." ఇక చేయునది లేక హేమకంఠుడు రాజునకు ప్రదక్షిణ మాచరించి పురజన, అమాత్య, రథ, గజాశ్వ, పదాతి దళములతో, ధ్వజ పతాకములతో పరివేష్ఠితుడై నగరమునకు బయలుదేరుటకు నిశ్చయించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి సోమకాంత వనగమనము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(చ్యవన సుధర్మ సంవాదము)

తిరిగి తన నగరమునకేగుచూ ఆఖరి ప్రయత్నముగ హేమకంఠుడు తన తల్లి వద్దకేగి ఇట్లనియె "మాతా! నీవైననూ తండ్రిగారికి చెప్పి నన్ను మీ ఇరువురితో వనములకు తీసకొని వెళ్ళవలసినది. అచట నేను మీ ఇరువురికి సేవ చేసి తరించెదను. నాకు ఈ రాజ్య భోగములందు కాంక్ష లేదు." అంత సుధర్మ " పుత్రా! ఈ పరిస్థితుల యందు మీ తండ్రి ఎవరి పలుకులు వినరు. మనము మన ధర్మములనాచరింప వలసినదే! నేను పతివ్రతా ధర్మము ననుసరించి మీ తండ్రితో కాననమున కేగెదను. నీవు రాజ్యమునకేగి రాజ్యపాలనము కావింపవలసినది." అంత హేమకంఠుడు తన తల్లికి ప్రదక్షిణ మాచరించి తన నగరమున కరిగెను. అయనను నాగరికులందరూ పూర్ణకుంభము, ధ్వజపతాకములతో ఆహ్వానించిరి. రాజమార్గమంతయు పన్నీటి జల్లులు జల్లి, నగరమంతయు ఇంద్రపురి వలె అలంకరించిరి. హేమకంఠుడు

తన మాతా పితరుల వియోగమును సహించి, స్వజనులందరినీ తాంబూల వస్త్ర ప్రదానములతో సత్కరించి, సుందరముగ అలంకరింపబడిన స్వగృహమున ప్రవేశించెను. అటు పిదప హేమకంఠుడు తన తండ్రివలెనే ధర్మమార్గానుసారము రాజ్యపాలన కావించి ప్రజలను కన్న బిడ్డలవలె పాలించెను.

ఈ ఆఖ్యానమును వినుచున్న ఋషులు సూతుని వనమున కేగిన సోమకాంతుని విషయమరసిరి. అంత సూతుడు "సోమకాంతుడు తన ధర్మపత్నీ సహితుడై, అమాత్యులైన సుబల, జ్ఞానగమ్యులు వెంటరాగా దుర్గమ వనమందు ప్రవేశించెను. వారు నాలుగు దినముల కొకసారి భోజనము సేవించుచూ, ఏకాగ్ర చిత్తులై ప్రయాణించుచుండిరి. వారు ఏక కాలమున సుఖదు:ఖములను అనుభవించుచూ, ఒక వనము నుండి వేరొక వనము చేరుచూ, శ్రమ, ఆకలి దప్పికలచే శ్రమనొందుచూ, దుర్గమమైన అరణ్య మార్గమున కొండలు, గుట్టలు ఎక్కుచూ, దిగుచూ ఒకనాడు ఒక మహా సరోవరమును కాంచిరి. ఆ సరోవరము గజముల వంటి మీన కచ్ఛపములచే నిండి, నలుప్రక్కలా తాళ, తమాల, సరళ, ప్రియాళ, వకుళ, మామిడి, పనస, జంబూ, వేప, వట, రావి వృక్ష సమూహములచే పరివేష్ఠితమైనది. ఈ వృక్షములనల్లుకొని నానావిధ పరిమళ లతలు వ్రేలాడుచుండుట చే, ఆ ప్రదేశమంతయు పర్వత కంధరము వలె ఇంచుక అంధకారబంధురమై యున్నది. కమల, కదంబ పుష్ప సుగంధభరిత మలయమారుతము మనసునకు ఆహ్లాదము కావించుచున్నది. మునిజనులు ఆ పరిశరములనున్న ఫల పుష్పములను కోసికొనుచుండిరి. ఆ సరోవరము హంస, కారండవములు, కొంగలు, కాకులు, కోయిలలు, మైనాలు, చక్రవాకములతో నిండియుండెను. ఆ సరోవరము, దాని చుట్టూయున్న వృక్ష, పక్షి గణములతో ఈ రాజపరివారమంతటికీ స్వర్గము వలె కానపట్టెను. వారందరూ ఆనందమనస్కులై, తియ్యని సరోవర జలములు సేవించి, స్నానాదికములు గావించి, నిత్య కర్మానుష్ఠానము పూర్ణమొనరించి, అమృతతుల్యమైన ఫలములారగించిరి. అంత మహారాజు నెమ్మదిగ శయనించగా ఆయన ధర్మపత్ని ఆయనకు పాదసంవాహనమొనరించెను. రాజు యొక్క అనుమతి గ్రహించి అమాత్యులిరువురు కందమూలములు, కమలనాళములు సేకరించుట కరిగిరి.

ఆ సమయమున రాజపత్ని సుధర్మ ఒక స్ఫురద్రూపి, ఆదిత్యమండల తేజో సంపన్నుడగు ఒక సుందర బాలకుని కాంచి, మనసున ప్రసన్నత నొంది ఆ బాలునిట్లు ప్రశ్నించెను "కుమారా! నీవెవరవు? నీ తల్లి దండ్రులెవరు? ఎచట నుండి ఏతెంచితివి? దయచేసి నాకు తెలుపవలసినది." అంత ఆ బాలుడు "సాధ్వీ! నా తండ్రి భృగువు, మరియు పులోమ నా తల్లి. చ్యవనుడు నా నామధేయము. నేను నా తల్లి కొరకు జలము సంగ్రహించుకు ఇచట కేతెంచితిని. మీరెవరు? మీచే సేవలందుకొనుచున్న ఈ పురుషుడెవరు? ఈ వనమున కేల ఏతెంచిరి? ఆయన శరీరము ఎందువల్ల దుర్గంధభూయిష్ఠమైన వ్రణములతో నిండియున్నది? మీరు సుకుమారి, సుందరి, విశాలనేత్రి, సర్వ శుభలక్షణ లక్షిత వలెయున్నారు. కానీ అత్యంత దీనస్థితి యందున్న ఈ పురుషునికి మీరు సేవ చేయుటకు కారణమేమి? మీ వివాహమునకు పూర్వము ఈ వరుడు కుష్ఠరోగి అని మీ కుటుంబము నందు ఎవ్వరికీ తెలియదా? అయిననూ ఈ కుష్ఠరోగిని వరించుటకు కారణమేమి?"

అంత సుధర్మ హర్షశోకములు ఒకేమారు చుట్టుముట్టగా ఇట్లనియె "పుత్రా! సౌరాష్ట్ర దేశమందు దేవనగరి అను విఖ్యాత నగరము కలదు. అద్దానిని రాజధానిగ చేసికొని గుణశీలి, స్వాభిమాని, దానశీలుడు, మహా పరాక్రమోపేతుడు, అసంఖ్యాక సేనా బల సంపన్నుడు, శత్రురాజ్య విజేత, యజ్ఞకర్త, సుందరుడు, శ్రీమంతుడు, సుహృద్ జనములకు కొంగుబంగారము, సర్వకార్య దక్షుడు, నీతిశాస్త్ర కుశలుడు, పరేంగితావగాహి అయిన సోమకాంతుడు పరిపాలించుచుండెను. ఆయన చిరకాలము రాజ్యపాలనము కావించి, అనేక భోగములనుభవించి, పూర్వజన్మ పాప ఫలితముగ కుష్ఠవ్యాధి గ్రస్తుడయ్యెను. ఆయనే ఈ మహారాజు. నేను ఈయన ధర్మపత్ని సుధర్మ. మేము మా తనయునికి పట్టాభిషేకమొనర్చి, ఇరువురు అమాత్యులు వెంటరాగా ఈ దుర్గమారణ్యము ప్రవేశించితిమి. మా అమాత్యులు కందమూలాది సేకరణకేగిరి.

మా కష్టములకు అంతు కనబడుట లేదు. ఈ వనము అనేక క్రూర మృగములకు భయంకర ఘోర రాక్షసులకు ఆలవాలమై యున్నది. వారెవరూ మమ్ముల భక్షించి ఈ దుష్కర పరిస్థితుల నుండి ఏల విడిపించుట లేదు? కాలగతిని వర్ణించుట ఎవరికి సాధ్యము? ఒకప్పుడు హంసతూలిక తల్పమందు శయనించి, నలుదిశలా తన శరీర సుగంధమును విరజిమ్మిన ఈ చక్రవర్తి ఇపుడు కటికనేలపై శయనించి, ఈ దుర్గంధ స్రావములచే నిండియున్నాడు. ఒకప్పుడు పండితగోష్ఠి యందు వేదశాస్త్ర నిష్ణాతులచే పరివేష్ఠింపబడిన ఈ మహారాజు ఇపుడు క్రిమికీటక పరివేష్ఠితుడై దు:ఖితుడైనాడు. ఓ! భృగునందనా! ఈ దు:ఖ సాగరమును మేమెట్లు దాటుదుమో తెలియకున్నది. దయచేసి దీని నుండి తరించు తరుణోపాయమును తెలుపవలసినది."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి చ్యవన - సుధర్మ సంవాదమను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(సోమకాంత, భృగు సంవాదము)

ఈ విధముగ కన్నీరు మున్నీరుగ విలపించుచూ మహారాణి సుధర్మ పలికిన పలుకులు విని ఏ విధమయిన ప్రతిసహాయ మొనర్పజాలక బాలుడయిన చ్యవనుడు హృదయ భారమున కన్నుల నీరు గ్రమ్మగా మౌనముగ జలాశయము నుండి జలములు గ్రహించి తన ఆశ్రమమునకు చనెను. అంత బాలుని తండ్రి, మహాతపస్వి అయిన భృగుమహర్షి మ్లానముఖుడయిన తన పుత్రుని కాంచి ఇట్లనియె "కుమారా! నీవు ఏదేని చూడరాని దృశ్యమును చూచితివా? నీ రాక ఆలస్యమైనది మరియు నీవు కించిత్ చకితుడవై యుండి నీ ముఖము మ్లానమై యున్నది. జరిగినది సర్వము నాకు తెలుపుము." అంత చ్యవనుడు "తండ్రీ! సౌరాష్ట్ర ప్రభువు, కమలనయనుడు అయిన సోమకాంతుడను మహారాజు కలడు. ఆయన ధర్మాత్ముడు. ఆయనకు దుర్భాగ్య వశమున కుష్ఠవ్యాధి సంక్రమించినది. ఆయన తన కుమారునికి పట్టాభిషేకమొనర్చి, తన ఇరువురు అమాత్యులు, సర్వ శుభలక్షణ లక్షిత అయిన ధర్మపత్నీ సహితుడై వనముల తిరుగుచూ, చివరకు మన సరోవర ప్రాంతము చేరి విశ్రమించుచుండెను. గౌతమ ముని శాపముచే ఒడలంతా కనులు పొటమరించిన సహస్రాక్షుని వలె ఆయన శరీరమంతయు వ్రణముల చే నిండియుండెను. అత్యంత దు:ఖిత అయిన ఆ మహారాణి వద్ద ఈ విషయములన్నియు వినుచుండుటచే నాకు జలములు తెచ్చుట ఆలస్యమయినది. అంతేకాక ఆ దు:ఖితను కాంచి నా హృదయము ద్రవించినది." అంత భృగుమహర్షి "కుమారా! నా ఆజ్ఞగా నీవు వెంటనే వెళ్ళి వారందరినీ మన ఆశ్రమమునకు తీసికొనిరావలసినది. వారిని చూడవలెనని నాకు ఉత్సుకతగా యున్నది."

అంత దయాళువైన చ్యవనుడు వెంటనే సరోవరము వద్దకేగి మహారాజ దంపతిని, వారి అమాత్యులను గాంచి వారికి తన తండ్రి యొక్క సందేశమును వినిపించెను. అమృత తుల్యములగు ఆ పలుకులు వినినంతనే వారందరికీ పోయిన ప్రాణములు తిరిగి వచ్చినట్లయి, వెంటనే వారందరూ ఆ ముని కుమారుని వెనుక మున్యాశ్రమమునకు పయనమైరి. ఆ సమయమున వారు వాచస్పతి అయిన బృహస్పతి ముందు నడుచుచుండగా, స్కంధ విశాఖుల సహిత పార్వతీ పరమేశ్వరుల వలె ఒప్పిరి. భృగుమహర్షి ఆశ్రమము నానా పుష్ప, ఫల భరితమయిన వృక్షములతో నిండి, పక్షుల కమనీయ కుహుకుహూ నాదములతో, శ్రావ్యమయిన వైదికమంత్రఘోషతో నిండియున్నది. అందు అనేక హంస, కారండవాది పక్షులు, పులి, సింహము, ఏనుగు, ఆవు, పిల్లి, నెమలి, మొదలయిన జంతువులు తమ క్రూరత్వమును

విడచి సాధువులైయున్నవి. అచట వాయువు మందముగ వీచుచున్నది. సూర్యుడు తన తీవ్రతను తగ్గించి శరీరమును వెచ్చగా స్పృశించుచుండెను. మహర్షి ఆజ్ఞను అనుసరించి వర్షములు కురియుచున్నవి. ఈ విధముగ పరమ ప్రశాంతత సర్వత్రా వెల్లివిరియుచున్న ఆశ్రమము నందు మని కుమారుని వెనుక రాజపరివారము ప్రవేశించినది.

అచట వారు వ్యాఘ్రచర్మముపై పరచియున్న కృష్ణజింక చర్మముపై ద్వితీయాదిత్యుని వలె దివ్య తేజస్సుతో ప్రకాశించుచున్న భృగు మహర్షిని కాంచి అమితానందమును, పరమశాంతిని పొంది అంజలి ఘటించిరి. అంత మహారాజు సోమకాంతుడిట్లనియె "ఓ! ద్విజోత్తమా! నేను కావించిన తపము, ధర్మము, బ్రాహ్మణోత్తముల ద్వారా పొందిన ఆశీర్వాదము మీ దర్శనము చే నేడు ఫలించినవి. నేను పవిత్రుడనైతిని. నా తల్లిదండ్రులు సహితము ధన్యులైరి. ఓ! మునీశ్వరా! మీ దర్శనము భూతకాల పుణ్యఫలము, వర్తమాన పాపనాశకము, భవిష్యత్ నందు కళ్యాణకారకము. నేను సౌరాష్ట్రము నందు దేవనగరిని రాజధానిగ చేసికొని అప్రతిహతమైన అధికారముతో, నీతి మరియు ధర్మ శాస్త్రానుసారముగ రాజ్యపాలన కావించితిని. పాపభీతితో దేవ భూసుర పూజన కావించితిని. కానీ నా పూర్వజన్మ పాప ఫలితముగ ఈ దుర్దశ ప్రాప్తించినది. ఈ వ్యాధి నివారణమునకు నేను కావించిన యత్నములన్నియు వ్యర్థమైనవి. మీ ఆశ్రమము నందు సహజవైరమున్న జంతువులు – సింహము, ఏనుగు; పాము,ముంగిస; పిల్లి,ఎలుక; అశ్వము,మహిషము; సహితము తమ వైరమును విడనాడి పరస్పరము ప్రేమతో యున్నవి. నేను మిమ్ములను శరణువేడుచున్నాను. మహాప్రభో! నాకు దారి చూపింపవలసినది."

అంత సర్వజ్ఞుడయిన భృగు మహర్షి ధ్యానమగ్నుడై, సర్వమును గ్రహించి, కన్నులు తెరచి ఇట్లనియె "మహారాజా! మీరు చింతించవలదు. మీకు పరిష్కారమును తెలిపెదను. నా ఆశ్రమము ప్రవేశించిన ఏ జీవి దు:ఖము నొందదు. నీవు కావించిన జన్మాంతర దుష్కర్మ చే నీకు ఈ వ్యాధి పొడసూపినది. ఆ వివరములన్నియు మీకు తెలిపెదను. కానీ చిరకాలము నుండి క్షుధార్తులై మీరందరూ మిక్కిలి డస్సియున్నారు. అనేక వనముల తిరుగుట వలన మీ ముఖములు మ్లానమైనవి. అందువలన తొలుత భోజనాదికములు తీసికొనవలసినది." తదుపరి భృగు మహర్షి వారందరికి స్నానాదికములు అమర్చి, షడ్రసోపేతమైన విందు ఆరగింపజేసి, దివ్యాభరణములు ప్రసాదించి విశ్రమింపజేసెను. వారందరూ హృదయము నందున్న దుష్కరభారమును విడచి, ఆనంద మనస్కులై, కోమలమైన శయ్యలపై నిశ్చింతగా నిద్రించిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి సోమకాంత భృగు సంవాదమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(సోమకాంతుని పూర్వజన్మ వృత్తాంతము)

ఈ విధముగ హృద్యముగ సాగుచున్న సోమకాంత చరిత్రపై సింహావలోకనము కావించుటకు సూతమహర్షి ఒక్కమారు కన్నులు మూసికొని ఒక దీర్ఘ ఉచ్ఛ్వాసము తీసికొనెను. అంత ఆ పవిత్రాఖ్యానమును వినుచున్న ఋషులు ఇట్లు పలికిరి "మహాత్మా! సూత మహర్షీ! మీ వచనామృత సుధాధారలచే ఇంకనూ మాకు తృప్తి కలుగుట లేదు. ఇంకనూ వినవలెనన్న కుతూహలము పెరుగుచున్నది. తదుపరి ఏమయినది? భృగు మహర్షి సోమకాంతునకు ఏవిధమయిన తరుణోపాయము బోధించెను?" అంత సూతుడు మిక్కిలి సంతసిల్లి ఇట్లనియె "ఓ! ఋషిసత్తములారా! ఈ లోకమున ఒక నానుడి కలదు. కథాశ్రవణమందు ఆఖ్యానము పూర్ణము కాకుండా మధ్యలో వదలి వెళ్ళిన వక్త లేక

శ్రోతలు, పుణ్య గ్రంథములను చౌర్యము కావించిన చోరులు, గురువును జ్ఞాన సంబంధిత విషయములు అడగని శిష్యులు, అటువంటి సందేహములను తీర్చని గురువులు, వారందరూ ఈ లోకమున మూగ, చెవిటివారు అగుదురు. ఇక సోమకాంత వృత్తాంతమును నుడివెదను."

మరుసటి దినము భృగుమహర్షి యథావిధిగ ఉదయముననే లేచి సంధ్యావందనాదులు, జప, హోమాది నిత్యకర్మలు పూర్ణ మొనరించుకొని కూర్చుండెను. రాజ పరివారము సహితము తమ నిత్య కర్మానుష్ఠానము లొనరించి, ఆ మహర్షిని చేరి భక్తితో నమస్కరించి, ఆయన చేరువనే పాదముల వద్ద సుఖాశీనులైరి. అంత భృగు మహర్షి సోమకాంతునుద్దేశించి ఇట్లనియె "మహారాజా! వింధ్యాచల సమీపమున కొల్హారు నగరమందు చిద్రూపుడు అను బహు విఖ్యాతుడు, అష్టైశ్వర్య సంపన్నుడు అగు వైశ్యుడు యుండెడివాడు. ఆయన ధర్మపత్ని సులోచన. ఆమె సుభగ, సుశీల, దానశీల, పతివ్రత మరియు పతిసేవాతత్పరత గల స్త్రీ. ఆ దంపతి చిరకాలము సంతానము లేక అల్లల్లాడిరి. చివరకు మధ్యవయసుపైబడిన పిదప వారికి ఏకైక మగ సంతతిగా నీవు జన్మించితివి. ఆ దంపతి ఆ బాలునికి "కామందుడు" అని నామకరణమొనర్చిరి. లేకలేక పుట్టిన బిడ్డవు గావున వారు నిన్ను అల్లారుముద్దుగ పెంచి యుక్త వయస్సు వచ్చిన పిదప ఒక సర్వ సులక్షణలక్షిత అయిన "కుటుంబిని" అను స్త్రీని ఇచ్చి వివాహ మొనరించిరి. ఈ కుటుంబిని సుందరి, కుసుమకోమలి, మృగనయన, భర్త యందు అత్యంత అనురక్తి కలిగిన పతివ్రతా శిరోమణి, దేవ, ద్విజ, అతిథి సేవా పరాయణురాలైన సార్థకనామధేయురాలు. కామందునకు ఆమె యందు ఏడుగురు పుత్రులు, అయిదుగురు రతిదేవి వంటి కన్యలు కలిగిరి. ఈ విధముగ కొంతకాలము గడచిన పిదప కామందుని తండ్రి గతించెను. పతివ్రత అయిన ఆతని తల్లి సహగమనమాచరించి స్వర్గప్రాప్తి నొందెను.

అటుపిదప కొంతకాలమునకు దుష్ట సాంగత్యముచే, నిర్లక్ష్యము చే, మిత్రుల మోసము చే, కామందుని పిత్రార్జితమైన సంపదంతయు నశించెను. ఆతని పత్ని ఎన్ని విధములుగ నచ్చచెప్పిననూ వినక చివరకు గృహమును సహితము కోల్పోయెను. అంత కుటుంబ పోషణ గడవక కుటుంబిని తన భర్త అనుమతితో సంతానమును తీసికొని పుట్టింటికి పయనమయ్యెను. కామందుడు మద్యపానమత్తుడై, పరధనాపహరణము, పరస్త్రీ పరాయణము, దొంగతనము, ద్యూతక్రీడ, దుష్ట సహవాసము, హింసాత్మక చర్యలు కావించుచూ దినదినము మరింత దిగజారి దురాచారుడయ్యెను. తన మిత్రులు, తన తండ్రి మిత్రులు, సజ్జనుల వద్ద నుండి కూడా ధన సంగ్రహణము కావించి అద్దానిని పూర్ణముగ నష్టపరచెను. అసత్యభాషణము, అనృత సాక్ష్యములు పలుకుచు తీవ్రవైఖరిని అవలంబించుట చే జనులు కామందుని పరమాన్నమందు బడిన పల్లేరుకాయ వలె అసహ్యించుకొని రాజానుమతితో నగరబహిష్కరణ గావించిరి. అంత కామందుడు వనమందు నివసించుచూ అనేక పక్షులను, జంతువులను, బాల, స్త్రీ, వృద్ధులనెందరినో హతమార్చెను. గిరి కంధరముల నుండి సింహ, వ్యాఘ్ర, భల్లూకములను పారద్రోలి, చోరులందరితో స్నేహమొనర్చి వారి సహాయమున ఆ కంధరములందు ఒక ఉత్తమ గృహనిర్మాణమొనర్చెను. రాజాజ్ఞచే భయభీతుడై కామందుని మామగారు తన పుత్రిక, మనుమలను తిరిగి కామందుని వద్దకు పంపించెను. కామందుడు తిరిగి వారిని తన వద్దకు చేర్చుకొని దోచుకొన్న సొమ్ముతో నిర్భయుడై, పాపభీతి లేక సుఖముగ నుండెను.

ఆ సమయమున ఒక చిత్రమయిన సంఘటన జరిగినది. ఒకనాడు కామందుడు వనమందు సంచరించుచుండగా ఆతనికి విద్వాంసుడు, సద్గుణశీలి, ఒంటరిగా నడచుచున్న గుణవర్ధనుడు అను బ్రాహ్మణుడు తారసపడెను. గుణవర్ధనుడు కాలుని వంటి కామందుని చూడగనే కంపించి, మూర్ఛితుడై తిరిగి స్పృహ తెచ్చుకొని, తనకు కాలము సమీపించినదని తలచి, అయిననూ జీవేచ్ఛచే, కరుణాపూర్ణ స్వరముతో కామందునకు తత్వబోధ చేయుచూ ఇట్లనియె "నీవు సుందర సౌభాగ్యశీలి మరియు ధనవంతుడవు. నిరపరాధిని, శాంతుడను, బ్రాహ్మణుడను, నవ వివాహితుడనైన నన్ను నిర్జించుట

పాడికాదు. నా ప్రథమ పత్ని స్వర్గస్థురాలైనది. నేను పితృఋణ విముక్తికై, ధర్మ వృద్ధికై, సత్సంతాన ప్రాప్తికై, గృహస్థ ధర్మ పరిపాలనకై, అత్యంత ప్రయాసపడి రెండవ వివాహము చేసికొంటిని. నా భార్య సదాచారిణి, పరమ ఉదార స్వభావిని మరియు పతివ్రత. నీవు నన్ను హతమార్చిన ఎడల మా ఇరువురి జీవితములు వ్యర్ధమగును. శాస్త్రములందు జన్మదాతయే కాక భయత్రాత (భయము నుండి రక్షించు వానిని) కూడా తండ్రి అని సంభోదింపతగును. దస్యులు సహితము బ్రాహ్మణులను, శరణాగతులను రక్షింతురు. అందువలన శరణాగతుడను, బ్రాహ్మణుడను, భయగ్రస్థుడనైన నన్ను విడువవలసినది. లేనిఎడల నీవు వేలాది కల్పములు నరకగామివగుదువు. నీ ద్వారా సంపాదింప బడిన ధనము నీ భార్య, పిల్లలు, స్నేహితులు అనుభవించెదరు. కానీ నీ పాపమును ఎవరునూ పంచుకొనరు. నీవు మోసపోవుచున్నావు సుమా! ఈ నీ పాపకర్మము ఎన్ని జన్మములనుభవించ వలెనో లెక్కపెట్టలేరు."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి సోమకాంత పూర్వజన్మ వృత్తాంతమను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(సోమకాంత భృగు సంవాదము)

ఈ విధముగ బ్రాహ్మణుడు కరుణాక్రందన కావించినప్పటికీ కామందుని పాషాణ హృదయము ఇంచుక కరుగక ఆ ద్విజునితో ఇట్లనియె "నీ పలుకులు నిష్ప్రయోజనములు. బధిరుని ముందు పాండిత్యఘోష, బోర్లించిన ఘటము నందలి జలముల వలె నీ వాక్యములు వ్యర్ధములు. మద్యపానరతునికి తత్వ విచారము రుచించునా? కామాతురుని యందు లజ్జ, భయము లెట్లుండవో అట్లే ధనాతురుడు బంధు, బాంధవ్య విచారము సలుపడు. కాకి యందు శుద్ధత, జూదరి యందు సత్యము, నపుంసకుని యందు ధైర్యము, స్త్రీ యందు కామోపభోగ సంతృప్తి, సర్పముల యందు క్షమ ఎప్పుడైననూ కాంచితివా? లేదు. దైవ యోగమున నీవు నా ఎదుటకు తేబడితివి. నిన్ను ఎట్టి పరిస్థితుల యందు విడువను." అని పలికి ఒక తీక్షణ కరవాలము చేత ధరించి క్రూర మార్జాలము చిట్టెలుక శిరము బక్షించునటుల ఆ బ్రాహ్మణుని శిరమును నిర్దయగా ఖండించెను. ఈ విధముగ స్త్రీ, బాల, వృద్ధ, బ్రాహ్మణ హత్యలు అగణనీయముగ కావించెను. కాలము ఎవరి కొరకు ఆగదు కదా! నెమ్మదిగ కామందునకు వృద్ధాప్యమంకురించెను. శరీరమందు కఫ, వాత, పిత్తములు ముప్పిరిగొన కొంచెము మతిమరుపు, శరీరమందు స్వేదము, వణుకు మొదలయినవి. ఆతని పుత్రీ పుత్రులు, దాసదాసీజనము, మిత్రులు, శుభచింతకులు, బంధువులు, అందరూ నిరాదరణ చూపుట మొదలిడిరి. ఆతని గృహమందు గతిలేక గుప్తముగ సేవ చేయుచున్న బ్రాహ్మణుడు యుండెను. కామందుడు ఆతనిని పిలచి వనమందలి ఋషిగణమును తన వద్దయున్న సొమ్మును దానముగ గైకొనుటకు రమ్మని పంపెను. మునులు ఈ దస్యుని భయమున ఏతెంచి ముక్త కంఠముతో ఇట్లు పలికిరి "కామందా! మేము నీ దానము నొల్లము. పాపితో యజ్ఞము, అధ్యయన, అధ్యాపనము, వార్తాలాపములు, వైవాహిక సంబంధములు, యాత్ర, కలసి భుజించుట ఇవన్నియు పాపమును సంక్రమింపజేయును." ఈ విధముగ పలికి, తమ గృహములకేగి ఆత్మశుద్ధికై సచేలస్నాన మాచరించిరి.

తదుపరి కామందుడు రోగగ్రస్థుడగుట, స్వకీయ జనులచే ఉపేక్షింపబడుట, మునుల ద్వారా పరిత్యజింపబడుటచే మనసున అత్యంత పశ్చాత్తాపము నొందెను. తన వద్దనున్న అసంఖ్యాక వజ్ర వైఢూర్య ధనరత్న రాశులను గాంచి జీర్ణదేవాలయోద్ధరణము కావింపవలెనని మనమున నిశ్చయించెను. ఆతడు ఒకానొకనాడు అచటికి సమీపమున ఒక

జీర్ణ గణేశాలయము కలదనీ, అందు ఎంతో కాలము గణేశ భగవానుని పూజాధికములు జరిగెననీ, వర్తమానమున అయ్యది శిధిలావస్థనొందెననీ వినెను. అంత కామందుడు తన యావదాస్తి వినియోగించి ఆ ఆలయమును అత్యంత సుందరముగ పునర్నిర్మించెను. ఎత్తు అయిన తోరణములు గల సింహద్వారములు, గాలిగోపురములు, సువర్ణ, రత్న, ముత్యముల ప్రాంగణములు, నానా ఫల పుష్పముల నిచ్చు వృక్షములు, నలుదిశలా శుద్ధ జలములు నిండిన జలాశయములు, మధ్యన ఎత్తు అయిన గోపుర శిఖరము కలిగిన ఆలయము నిర్మించెను. మిగిలిన ధనమును స్త్రీ, పుత్ర, బాంధవులు తీసికొనిరి. ఈ ఆలయ నిర్మాణమునకు కొలది సమయము పిదప కామందుడు పంచత్వము నొందెను. ఆతడు మృతినొందిన పిదప కాలుని భటులు ఆతని ఆత్మను యాతనా శరీరమందు ప్రవేశపెట్టి, కొరడాలతో కొట్టి హింసించుచూ, పాశములతో బంధించి శిలలపై దొర్లించుచూ రక్త శోణిత కర్దమ నరకమందు పడవైచిరి. ఈ విధముగ హింసించిన మీదట ఈ యమభటులు కామందుని యముని ముందు ప్రవేశపెట్టిరి. అంత యముడు నిన్ను తొలుత పాప పుణ్య ఫలితములందు దేనిని అనుభవించెదవని ప్రశ్నించెను. అందుకు కామందుడు తొలుత పుణ్యఫలము ననుభవించెదనని బదులిచ్చెను. తత్ఫలితముగ నీవు సోమకాంతునిగ జననమందితివి. నా తపోబల ఫలితముగ నీ పూర్వజన్మ వృత్తాంతమును నీకు తెలిపితిని" అని భృగు మహర్షి ఒక్క తడవు మౌనము వహించెను.

తన పూర్వజన్మ వృత్తాంతమును వినిన మహారాజు సోమకాంతుడు నిర్ఘాంతుడై కొంత తడవు త్రికాలద్రష్ఠ అయిన భృగు మహర్షిని సంశయించెను. అంత మరుక్షణము ఆ రాజు శరీరము నుండి అనేక ఆకృతులు గల పక్షులు వెలువడి ఆ రాజును తన వాడి దంష్ట్రలతో పొడిచి ఆ మాంసమును తినుట ఆరంభించినవి. అంత రాజు తీవ్రమయిన బాధకు గురియై "మహర్షీ! మీ ఆశ్రమమున స్వాభావికముగ వైరమున్న జంతువులు సహితము సాధు వర్తనులై మెలగుచున్నవి. కానీ మీ సమక్షముననే ఈ భయంకర విహంగములు నా శరీర మాంసభక్షణము గావించుచున్నవి. స్వామీ! ఈ బాధ నేను భరింపలేను. దీనుడను, కుష్ఠరోగగ్రస్తుడను, శరణాగతుడనైన నన్ను రక్షింప వలసినది." అని తిరిగి ఆయనకు నమస్కరించెను. అంత మహర్షి "రాజా! నీవు నా వాక్యములను సంశయించితివి. అందువలననే ఈ తీవ్ర తాపమునకు గురియైతివి," అని ఒక్క తడవు హుంకరించెను. మరుక్షణము పక్షులన్నియు మటుమాయమయ్యెను. అంత మహర్షి "రాజా! నీకు ఈ రోగ విముక్తి కొరకై ఒక ఉపాయము తెల్పెదనని" నుడివెను. అంత రాజు మరియు ఆయన పరివారము స్వస్థత నొందిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి భృగు సోమకాంత సంవాదమను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(పాప పురుష ఉద్భవము)

భృగుమహర్షి "మహారాజా! శీఘ్రమే నీవు గణేశ పురాణమును శ్రవణము చేసిన ఎడల ఈ పాప జనిత అనంత దు:ఖసాగరము నుండి ముక్తుడవగుదువు" అని పలికి గణేశ అష్టోత్తర శత నామావళి జపము చేసి ఆ అభిమంత్రిత జలమును మహారాజుపై ప్రోక్షణ కావించెను. అంత రాజు యొక్క నాసికాశోణముల నుండి ఒక క్రిమి వంటి నల్లని పురుషుడు బయటపడెను. చూచుచుండగనే ఆ కాలాంజన సదృశుడు ఏడు తాడిచెట్ల పరిమాణమున పెరిగెను. భయంకరమయిన ముఖము, పామువలె సుడులతో బయటకు, లోపలకు వెడలుచున్న నాలుక, ఎర్రని కనులు, విశాలమయిన

భుజములు, పొడవాటి చేతులు, జటాజూటము ధరించిన శిరము, ముఖమున అగ్ని జ్వాలలు, రక్తము, చీము స్రవించుచుండగా, అంధకారమునకు మారుపేరుగా దశదిశలా తన అట్టహాసముతో ఘూర్ణిల్లుచుండగా ఆ వికృత పురుషుడు సర్వులనూ భయకంపితుల కావించుచూ నిలబడెను. ఆతని భయానక రూపమునకు ఆశ్రమవాసులందరూ దశదిశలా పరుగులు తీసిరి. ఆతని వాస్తవికతను తెలిసినప్పటికీ భృగుమహర్షి ఏమీ తెలియనటుల "ఓ! కాలాంజన సదృశా! నీవు ఎవరు? నీ నామధేయమేమి?" అని ప్రశ్నించెను. అంత ఆ వికృతరూపుడు "ఓ!మహర్షీ!! నేను పాపపురుషుడను. మీచే ప్రోక్షణ చేయబడిన అభిమంత్రిత జలముల చే ఈ సోమకాంతుని శరీరము నుండి బయల్వెడలితిని. ఇపుడు నాకు నివాస స్థలము లేదు. అంతేకాక ప్రస్తుతము నేను అత్యంత క్షుద్బాధితుడనై యున్నాను. అందువలన నాకు తినుటకు ఆహారమునీయ వలసినది. లేని ఎడల మీ ఎదుటనే ఈ సోమకాంతుని, మీ ఆశ్రమవాసులందరినీ భుజించెదను." అంత భృగుమహర్షి తన ఆశ్రమము బయటకు నడుచుకొనివచ్చి అచటగల ఎండిపోయిన ఆకులు, మోడయిన కాండము గల ఒక మామిడి చెట్టును చూపించి "ఓ! పాపపురుషా! నీవు ఈ ఎండిన ఆకులను నా ఆజ్ఞగా నీ ఆకలి తీరుటకు స్వీకరింపవలసినది. ఓరీ! నా వాక్కులు అనృతములు కావు. నా ఆజ్ఞను ధిక్కరించితివేని నిన్ను భస్మమొనరించెదను" అని ఆ ఎండిన వృక్షమును తన చేతితో తాకెను. తక్షణము ఆ వృక్షము భస్మీపటలమై బూదిపోగుగా నేలపై బడెను. అంత పాప పురుషుడు భయకంపితుడై ఆ బూడిద పోగునందు చేరి అదృశ్యమయ్యెను.

అంత భృగుమహర్షి సోమకాంతునితో "ఓ! నృపశ్రేష్ఠా! శ్రీ గణేశ పురాణ శ్రవణ పుణ్యమును ప్రతిదినము ఈ భస్మరాశికి సమర్పింపవలసినది. ఈ భస్మరాశి నుండి తిరిగి ఈ ఆమ్ర వృక్షము నూతన పల్లవములతో చిగురించి, వృద్ధి చెంది, పుష్ప ఫలయుక్తమగునపుడు నీ పాపరాశి అంతయు నశించి నీవు నిష్పాపివగుదువు. అంత మహారాజు "బ్రహ్మన్! నేను గణేశ పురాణము గూర్చి వినలేదు, కనలేదు. నేను ఆ పుణ్య పురాణమును ఎట్లు పొందగలను?" అంత మహర్షి "రాజా! సర్వ పాపనాశిని అయిన ఈ గణేశ పురాణమును తొలుత చతుర్ముఖ బ్రహ్మ నారాయణాంశ సంభూతుడైన వేదవ్యాసునికిచ్చెను. వ్యాసమహర్షి అద్దానిని నా కెరింగించెను. నేను నీకా పుణ్య చరితమును వినిపించెదను. నీవు ఈ తీర్థమున స్నానమాచరించి శ్రీగణేశ పురాణమును వినెదనని సంకల్ప మొనరింపుము." అంత మహారాజు భృగు ప్రేరితుడై ప్రఖ్యాతము, దివ్యము అయిన భృగుతీర్థమందు స్నానమాచరించి అట్లే సంకల్పించెను. ఆ సంకల్ప మాత్రమున మహారాజు సోమకాంతుని రోగము ఉపశమింపసాగెను. భృగుకృప చే రాజునకు వ్రణముల తీవ్రత తగ్గి రక్తస్రావము ఆగెను. అంత భృగు మహర్షి మహారాజు యొక్క చేయిపట్టి, తన ఆశ్రమము యొక్క అంతర్భాగమునకు తీసికొని వెళ్ళి, ఆయనను సుఖాశీనుని కావించి, తాను సహితము ఆసనమును గ్రహించెను. అంత మహారాజు అంజలి ఘటించి "మహర్షీ! మీ కృపచే నా సమస్త క్లేశములు దూరమయినవి. ఇపుడు నాకు పరమాద్భుత శ్రీగణేశ పురాణమును దయచేసి వినిపింపవలసినది."

అంత భృగుమహర్షి "మహారాజా! ఎవని అనంత పుణ్యవిశేషములు పక్వమొంది ఫలించునో, వారికి మాత్రమే ఈ పుణ్య చరిత విను సౌభాగ్యమబ్బును. లేని ఎడల దీనిని వినుట కల్ల. ఈ పురాణ శ్రవణము వలన సప్త జన్మకృత సర్వ పాపములు నష్టమగును. ఈ గణేశ భగవానుని స్వరూపమును త్రిమూర్తులు తెలియలేరు, సహస్రముఖుడయిన శేషుడు వర్ణింపలేడు. ఈ మహా పుణ్య ప్రదమయిన పురాణమును అపరిమిత తేజశ్శాలి, అతీంద్రియ దర్శనుడు అయిన వ్యాసభగవానుడు నాకు ఎట్లు తెలిపెనో, అట్లే యధాతథముగ అద్దానిని నీకు తెల్పెదను. ఈ పురాణమును యజ్ఞ విధ్వంసము చే శోకాకులుడయిన దక్ష ప్రజాపతి ముద్గల మహర్షి నుండి వినెను. ఎవనికి గణేశ భగవానుని యందు దృఢభక్తి కలుగునో, వారు మాత్రమే నిత్యము ఈ పురాణమును వినగలరు. తద్వారా విఘ్నములు నష్టమై తమ అభీష్టసిద్ధి నొందెదరు. ఈ కలియుగమందు మానవులు వేదార్థ జ్ఞానరహితులు, వేదాధ్యయన రహితులు, వర్ణాశ్రమహీనులు, కేవల

యోనిరతులై, దేహ సుఖములందు తాదాత్మ్యులై, వర్ణ సంకరము కావించువారు, కుటిలురు, మరియు పాపులు. వారి హితార్ధము, మరియు ధర్మ సంరక్షణార్ధము భూత భవిష్యత్ వర్తమాన ద్రష్ట అయిన నారాయణాంశ సంభూతుడు, వేదవ్యాసుడు పదునెనిమిది పురాణోపపురాణములను రచించి, వాని ద్వారా వివిధ విషయ విశేషములను సులభముగ, సుస్పష్టముగ తెలియబరచెను. ఈ విశేష విషయములన్నియు చివరి ఉప పురాణమయిన శ్రీ గణేశ పురాణమందు నిక్షిప్తమొనర్పబడినవి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి పాపపురుష ఉద్భవము అను తొమ్మిదవ అధ్యామము సమాప్తము)

పదియవ అధ్యాయము

(వ్యాసుని మతిభ్రమణము)

భృగుమహర్షి తిరిగి చెప్పదొడంగెను "మహాత్ముడైన వేదవ్యాసుడు వేద విభజనానంతరము సామాన్యులకు సహితము విశేషధర్మములు తెలియవలెనని, పురాణములు రచించుటకు ఉపక్రమించెను. ఎంతటి వారలకైననూ మాయను దాటుట అసాధ్యము కదా! అంతటి మహానుభావుడైన వేదవ్యాసునికి తన విద్య, ప్రతిభపై కించిత్ అహంకారముదయించెను. దానివలన ఆయన పురాణరచనకు మున్ను నిర్విఘ్నకార్య సంపన్నమునకై గణేశపూజ, మంగళాచరణము కాదుకదా, కనీసము గణేశునకు నమస్కారము సహితము చేయలేదయ్యె!! దాని ఫలితముగ వ్యాసుడు వేదశాస్త్రవ్యాఖ్యాత, సర్వజ్ఞుడయినప్పటికీ నిత్య, నైమిత్తిక, లౌకిక, పారలౌకిక కర్మలందు, శ్రౌత స్మార్త అనుష్ఠానముల విషయములందు స్పష్టత నశించి మతిభ్రమించుట నారంభించెను. ఔషధ, మంత్ర ప్రయోగము చే బల, శౌర్యములుడిగిన నాగరాజు వలె వ్యాసుడు స్థంభితుడై తన అవస్థకు కారణము తెలియక, ఆశ్చర్యచకితుడై, లజ్జితుడై, సత్యలోకమున కేగెను. అచట దేవర్షులకు, దేవగణములకు, చతుర్ముఖ బ్రహ్మదేవునకు ప్రణామములు సలిపి తన కొసగిన ఆసనమును స్వీకరించి ఇట్లనియె "ఓ! బ్రహ్మన్! ఈ కలి యుగమందు జనులు నాస్తికులు, సదాచార వర్జితులు, జ్ఞాన రహితులు, వేదనిందకులు, అకర్మణ్యులు, స్థబ్దులు అగుచున్నారు. వారికి జ్ఞాన నష్టమవకుండా విధి, నిషేధములను తెలుపుటకు పురాణేతిహాసములు రచింపవలెనని నిర్ణయించితిని. కానీ ఏదియును స్ఫురణకు రాక, జ్ఞాన నష్టమై మతి భ్రమించుచున్నది. మహాత్మా! నేను నిత్యాచార నిష్ఠా గరిష్ఠుడను, సత్పురుషుడను, మరియు నారాయణాంశ సంభూతుడను, సర్వజ్ఞుడను అయినప్పటికీ భ్రాంతికి గురి అగుచున్నాను. పితామహా! మిమ్ములను శరణువేడుచున్నాను. నాకు దయచేసి తరుణోపాయము శలవీయవలసినది."

అంత తన పాదములపై బడిన వ్యాసుని చూచి చతుర్ముఖ బ్రహ్మ చిరునవ్వు నవ్వుచూ "పరాశరపుత్రా! నీకు కర్మ యొక్క సూక్ష్మగతిని గూర్చి తెలిపెదను. దుష్కర్మ లేక సుకర్మ, ఏ కర్మ అయిననూ అద్దానిని సంయక్ విచారము కావించిన పిదపనే ఆచరింపవలెను. లేని ఎడల అద్దాని ఫలితము విపరీత ఫలము నొసగును. బుద్ధిమంతుడయిన మానవుడు ఏ చిన్న కర్మనయిననూ కూడా నిష్కపట భావముతో ప్రయత్నపూర్వకముగ సాధింపవలెను. గర్వాహంకార ఈర్ష్యాద్వేషములతో ఎన్నడునూ చేయరాదు. గర్వము కారణమున గరుడుడు విష్ణువునకు వాహనమయ్యెను. ఈర్ష్య కారణమున అంబికా పుత్రుడగు ధృతరాష్ట్రుడు తన నూర్గురు కొడుకులనూ, రాజ్యమును కూడా కోల్పోయెను. మత్సర కారణమున పూర్వము పరశురాముడు పలుమార్లు క్షత్రియ సంహారము కావించెను. వ్యాసా! గణేశుడు ఆదిమధ్యాంతరహితుడు, జగత్కర్తా,

జగద్భర్తా, జగత్స్వరూపుడు, జగత్సంహారకుడు, వ్యక్తావ్యక్త స్వరూపుడు, సర్వ సమర్థుడు. ఇంద్రాది దేవతలు, నాతో సహితముగ త్రిమూర్తులు, సూర్యుడు, దిక్పాలకులు, కూడా ఆయనకు ఆధీనులు. ఆయన భక్తులకు విఘ్నహర్తా, మరియు అభక్తులకు విఘ్నకర్త. నీవు నీ విద్యాహంకారములు ఆశ్రయించి సర్వజ్ఞుడను అను దురభిమానము చే గర్వితుడవై గణేశుని పూజింపలేదు సరికదా ఆయనను కానీ, మరే దేవతను కానీ కనీసము స్మరింపలేదు. అద్దాని వలన నీవు భ్రాంతికి గురి అయితివి.

సర్వ కార్యారంభములందును, గృహ ప్రవేశము, యాత్రాకాలము, శ్రౌత స్మార్త కర్మలందు, ఏ లౌకిక కృత్యారంభమునైననూ గణేశుని స్మరింపక, పూజింపక కావించిన ఎడల వారు విఘ్నములకు గురి అగుదురు. వేదశాస్త్ర విశారదులందరూ గణేశుని పరబ్రహ్మ స్వరూపుడు, పరమానంద రూపుడు, పరమగతి అని పేర్కొందురు. అందువలన ఓ! వ్యాసా! నీవు పరమభక్తితో ఆ గణేశుని పూజింపుము. ఆయన ప్రసన్నుడైన ఎడల నీ మనోవాంఛిత కర్మములన్నియు పూర్ణమగును. లేని ఎడల వెయ్యేండ్లు నిండినప్పటికీ నీ ఇచ్ఛ పూర్ణమవ్వదు.” అంత వ్యాసుడు “హే! బ్రహ్మన్! ఈ గణేశుడెవరు? ఆయన స్వరూపమేమి? ఆయనను తెలిసికొనుట ఎట్లు? ఆయన అవతారము లేవి? ఆయన ఇత: పూర్వము కావించిన కార్యములేమి? పూర్వకాలమందు ఎవరెవరు ఆయనను పూజించిరి? ఏ సమయమందు ఆయనను స్మరింపవలెను? పితామహా! కరుణానిధీ! భ్రమ చిత్తుడనైన నాకు ఈ విషయములన్నియు విస్తారముగ తెలుపవలసినది.”

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి వ్యాసుని మతిభ్రమణమను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(శ్రీగణేశమంత్రము; పూజావిధి)

బ్రహ్మదేవుడు తిరిగి పలుకుట నారంభించెను “మహాత్ముడైన గణేశునకు అనంతకోటి మంత్రములు కలవు. ఆగమములు వాటిని ఏడు కోట్లకు కుదించినవి. దీని రహస్యమును దేవాధిదేవుడు శంకరుడెరుంగును. నేను కొంచెము తెలియుదును. వీనియందు షడక్షర మంత్రము **(వక్రతుండాయ హుం)** మరియు ఏకాక్షర మంత్రము **(గం)**; ఈ రెండు మంత్రములు సర్వ శ్రేష్ఠము. వీనిస్మరణ మాత్రమున సర్వసిద్ధులు హస్తగతమగును. ఈ గణేశోపాసకులయిన భక్తులు ధన్యులు, జీవన్ముక్తులు, దేవతలకు సహితము ఆరాధ్యులు, సర్వజ్ఞులు, నానారూపధారణా సమర్థులు అగుదురు. అష్టసిద్ధులు వీరికి దాసోహమగును. వీరి దర్శనము చే విఘ్నములు శాంతించును. చరాచర ప్రపంచమంతయు వీరికి ప్రణమిల్లును. ఏ మనుష్యునకు శ్రీగణేశుని పట్ల లేశమాత్ర భక్తిలేకుండునో వారు నిరర్థకులగుదురు. శ్రీగణేశ విముఖుల ముఖము సహితము కాంచరాదు. వారి దర్శన మాత్రమున అడుగడుగునా విఘ్నములు వాటిల్లును. ఓ! పరాశర పుత్రా! నీకు ఈ ఏకాక్షరానుష్ఠాన విధిని తెల్పెదను. దీనిని నాకు తొలుత పరమేశ్వరుడు అనుగ్రహించెను. సాధకుడు ఉదయముననే తొలుత స్నానమాచరించి శుద్ధుడై, శుభ్ర వస్త్రములు ధరించి పిదప కుశాసనమును, దానిపై కృష్ణజింక చర్మమును, దానిపై వస్త్రమును పరచి అద్దానిపై సుఖాసీనుడు కావలెను. పిదప భూతశుద్ధి యొనర్చి, ఆత్మప్రాణప్రతిష్ఠ కావించి, తదుపరి బాహ్య, అంతర్ముఖ న్యాసము కావించి ప్రాణాయామము సలుపవలెను. పిదప ఆగమప్రోక్తముగ సంధ్యావందన విధిని కావించి, తరువాత శ్రీగణేశమూర్తిని చరణముల నుండి శిరము వరకు ధ్యానించుచూ ఏకాగ్ర చిత్తముతో మానసోపచార పూజ కావింపవలెను. తదుపరి యథావిధి పురశ్చరణ విధి విధానముననుసరించి ఏకాక్షర మంత్ర జపము కావింపవలెను.

ఎప్పటివరకు శ్రీగణేశ భగవానుడు ప్రసన్నుడయి ప్రత్యక్ష మగునో అప్పటి వరకూ మంత్రజపము కొనసాగింపవలెను.”

బ్రహ్మ “పరాశరాత్మజా! కోటిసూర్య ప్రకాశుడు శ్రీగణేశుడు ప్రత్యక్షమయినపుడు సావధానుడవై ఈ విధముగ పలుకుము “ఓ! గజాననా! నీవు ఎల్లప్పుడూ నా హృదయమందు విరాజమానుడవై యండుము.” అపుడు ఆ భగవానుడు నిన్ను మనోవాంఛిత వరము కోరుకొనమని అద్దానిని ప్రసాదించును. శ్రీగణేశుడు నీ హృదయమందు విరాజమానమైన మరుక్షణము నీకు దివ్య జ్ఞానప్రాప్తి కలిగి భూత, భవిష్యత్, వర్తమాన ద్రష్టవగుదువు. అపుడు ఈ భ్రాంతి దూరమయి అనేక గ్రంథములు అత్యద్భుతముగ రచింపగలవు. అంత వ్యాసుడు “పితామహా! మీ దివ్యోపదేశము చే నాకు శాంతి చేకూరుచున్నది. మీ ఆజ్ఞానుసారము నేను ఈ ఏకాక్షర మంత్రానుష్ఠానము కావింతును.” బ్రహ్మ “కుమారా! నీవు అలజడి లేని ఏకాంత ప్రదేశమునకేగి శ్రీ గణేశ భగవానుని ధ్యానాదులు కావింపవలసినది. మంత్రములందలి సర్వోత్తమమైన ఈ ఏకాక్షర మంత్రమును నాస్తికులకు, వేద, ద్విజ నిందకులకు క్రూర, దురాచార, దుష్టులకు, శఠులకు, ఎన్నడునూ ఉపదేశింపరాదు. కానీ శరణుజొచ్చిన దృఢ భక్తియుతులకు, శ్రద్ధాళువులకు, వినీతులు, వేదపాఠులు, మృదు స్వభావులకు ఈ మంత్రోపదేశము కావింపవచ్చు. ఈ మంత్రరాజమును అయోగ్యులకు ఉపదేశించిన ఎడల ఆ మంత్రదాత, ఆతని పది తరముల ముందు, పదితరములు తరువాత కూడా నరకగాములగుదురు. ఈ మంత్రమును భక్తి పూర్వకముగ జపించు పుణ్యాత్ములు ధన ధాన్య సంపన్నులై, పుత్ర పౌత్రాభియుక్తులై, నిర్మలజ్ఞానులై, ఇహలోకమందు సర్వ భోగములు అనుభవించి, పరమున మోక్షము నొందెదరు.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి శ్రీగణేశమంత్రము, పూజావిధి యను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(శ్రీగణేశావిర్భావము)

వ్యాసుడు “పితామహా! మీ పలుకులు నన్ను శ్రీగణేశుని ఎడల అప్రమత్తుని గావించినవి. ఈ ఏకాక్షర మంత్రరాజమును ఇది వరలో ఎవరు జపించిరి? వారు ఏ విధమయిన సిద్ధి నొందిరి? మహాప్రభో! ఈ సంశయమును మీరు వినా వేరొకరు తొలగింపలేరు.” అంత బ్రహ్మ సంతసిల్లి “పరాశరపుత్రా! నీవు ఉత్తమము, మరియు సుందరమైన ప్రశ్న నడిగితివి. పుణ్యహీనులకు ఈ కథా శ్రవణమందు ఆసక్తి జనింపదు. స్నేహభాజనుడు, ప్రజ్ఞావంతుడైన శిష్యుని వద్ద ఎట్టి పరిస్థితుల యందు జ్ఞానమును గుప్తము చేయరాదు. శ్రీగణేశుడు ఓంకార రూపుడని పూర్వమే నీకు తెలిపితిని కదా! నిర్విఘ్న కార్యాచరణ కుశలురందరూ తమ కార్యములన్నిటినీ గణేశ పూజనము తోనే మొదలుపెట్టెదరు. లేని ఎడల ఆ కార్యములన్నియు విఘ్నముల పాలగును. ఓంకార బీజ సంయుక్త గణేశమంత్రము సర్వాగమముల యందు ప్రస్తావింపబడినది. ఓంకార బీజరహిత మంత్రములు నిష్ఫలములు. సత్యాసత్యములు, యుక్తాయుక్తములన్నియు శ్రీగణేశుని ప్రతిరూపములే!

ఈ విధముగ దేవ, గంధర్వ, యక్ష, రాక్షస, గుహ్యక, గరుడ, నాగ, కిన్నెర, కింపురుష, చారణ, మనుష్య, సర్వ చరాచర ప్రాణికోట్లు శ్రీగణేశుని ఉపాసకులే! ఈ గణేశుని కంటె వేరొకటి లేదు. నీకు ఒక ప్రాచీన ఉపాఖ్యానమును వినిపించెదను. దైవయోగమున ఒకనాడు ప్రళయము సంభవించినది. తీవ్రమయిన వాయు వీవనము చే పర్వతములు విరిగి పడినవి. ఆకాశమునందు ద్వాదశ ఆదిత్యులుదయించి, సమస్త జలరాశిని శోషణమొందించిరి. తదుపరి మహాగ్ని

ఉద్భవించి సమస్త సంసారమును దగ్ధమొనరించినది. అటుపిదప సంవర్తకాది మేఘములుద్భవించి ఏనుగుతొండముల వంటి వర్షధారలతో పృథివి సర్వమునూ ముంచెత్తినవి. ఆ సమయమున బ్రహ్మ మొదలు స్థావర జంగమాత్మకమైన మాయామయ సృష్టి అంతయు సంపూర్ణముగ నశించినది. అంత శ్రీగణేశ భగవానుడు అణువు కంటె సూక్ష్మతరమయిన రూపము ధరించి స్థితిగతుడయ్యెను. జగత్తు అంతయు అంధకారబంధురమయ్యెను. అట్లు బహుదీర్ఘకాలము గడచిన పిమ్మట నాదయుక్తమయిన ఏకాక్షర బ్రహ్మోభిర్భావము నొందెను. ఈ ఏకాక్షర బ్రహ్మము స్వకీయ మాయా వికారముచే ఆనందమయమై శ్రీగణేశ రూపమున ప్రకటితమయ్యెను. ఈ మహద్రూపము నుండి సత్వ, రజస్, తమో గుణములు, త్రిమూర్తులు, సమస్త చరాచర ప్రాణికోట్లు, మూడు లోకములు ప్రాదుర్భవించినవి.

శ్రీగణేశుని మాయచే భ్రమితులై త్రిమూర్తులు తమ కర్తవ్యమును తెలిసికొనుటకు స్వర్గ పాతాళములతో సహా సమస్త విశ్వమును గాలించిరి. అంత వారు శ్రీగణేశుని కానక, నిరాహారులై ఒక వేయి దివ్య సంవత్సరములు తీవ్ర తపమాచరించిరి. అయిననూ ఆ మహాప్రభుని దర్శింపలేక నిరాశ, మనస్తాపము మనసును ఆవరింపగా తిరిగి యత్నశీలురై వనములు, ఉపవనములు, నదులు, సముద్రములు, పర్వతములు, గుహలు, శిఖరములు గాలించిరి. అంత వారికి ఒక దివ్య సరోవరము కానబడెను. అయ్యది కొంగలు, చకోర, హంస, కారండవాది జలపక్షులచే ఆవరింపబడి, మత్స్య మకరాది జల మృగములచే నిండి, అనేక ఫలపుష్ప వృక్ష పరివృతమై యున్నది. వారు ముప్వురు ఆ తీయని నీటిని త్రావి, చల్లని నీట స్నానమొనరించి, కొంత తడవు ఆ తటమున విశ్రాంతినొంది తదుపరి ముందునకేగిరి. అచట వారికి ప్రళయాగ్నికీలకము, కోటిసూర్య ప్రకాశకము అయిన కాంతి కనబడెను. అద్దానిని చూడగనే వారికి ఆ కాంతిని కాంచు దక్షత లేక, కన్నులు, తెరువలేక, ఆ తేజోరాశి నుండి బయల్వెడలి క్షుధార్తులై, దాహము, తీవ్రశ్రమచే వివశులై, భయభీతులై, తమను తాము నిందించుకొనుచు దీర్ఘ నిశ్వాసములు విడువసాగిరి.

అంత సర్వలోకాధిష్ఠాత, సమస్త విషయ జ్ఞాత అయిన శ్రీగణేశుడు కరుణాపూర్ణుడై వారికి దర్శనమొసంగెను. ఆ మహానుభావుని చరణాంగుళుల శోభ కమల కేసరముల నధిక్షేపించుచుండెను. ఆయన అరుణారుణ వస్త్రము సంధ్యాకాల సూర్యమండలమును పరాజితుని కావించుచున్నది. ఆయన కటిసూత్రము హేమాద్రి శిఖరముల ప్రభను మించియున్నది. సుందరములయిన ఆయన నాలుగు హస్తముల యందును ఖడ్గము, డాలు, ధనుస్సు, శక్తి శోభించుచున్నవి. ఆయన ముఖము పూర్ణ చంద్రుని శోభను తిరస్కరించుచున్నది. సుందరమయిన ఆయన నేత్రద్వయము కమలదళముల పోలియున్నవి. ముకుటము సహస్రసూర్యుల పగిది దేదీప్యమానముగ వెలుగుచున్నది. ఉత్తరీయము అనేక నక్షత్రయుతమయిన ఆకాశము వలె మెరయుచున్నది. ఏకదంతము విష్ణువు యొక్క వరాహ అవతారమునందు పృథివీ ఉద్ధరణము కావించిన కోర వలె ఒప్పారుచున్నది. ఆయన మెలిదిరిగిన తొండము ఐరావతాది దిక్పాల కుంజరములకు సహితము భయము గొల్పుచున్నది. ఆ మహానుభావుని కాంచగనే త్రిమూర్తులు శాంతినొంది, ప్రణమిల్లి ఈ విధముగ స్తుతించిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి శ్రీగణేశావిర్భావము అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(త్రిమూర్తుల ద్వారా శ్రీగణేశ స్తుతి)

త్రిమూర్తులు "అజుడు, నిర్వికల్ప, నిరాలంబ, నిరాకారుడు, అద్వితీయుడు, పరుడు, అద్వైతుడు, ఆనందపూర్ణుడు,

నిర్గుణ, నిర్విశేష, నిరీహుడు (దేనినీ వాంఛింపనివాడు), పరబ్రహ్మస్వరూపుడయిన శ్రీగణేశునికి నమస్కారము. గుణాతీతుడు, ఆద్యంత రహితుడు, చిదాభాసుడు, చిదానంద స్వరూపుడు, సర్వత్రా వెలయువాడు, జ్ఞానము చేత మాత్రమే తెలియువాడు, మునుల ధ్యానగమ్యుడు, ఆకాశరూపి, పరమేశ్వరుడు, పరబ్రహ్మమైన గజాననునికి నమస్కారము. జగత్ కారణకారుడు, దేవాధిదేవుడు, గణములకు స్వామి, జగద్వ్యాపి, విశ్వవంద్యుడు, సురేశ్వరుడు అయిన పరబ్రహ్మమునకు నమస్కారము. రజోగుణ సంపర్కము చే బ్రహ్మరూపము దాల్చి వేదములను తెలియువాడు, సృష్టికార్యసంలగ్నుడు, అచింత్యరూపుడు, జగత్కారకుడు, సకల విద్యా నిధానుడు, బ్రహ్మరూపి అయిన గజాననునకు నమస్కారము. సత్వగుణ సంపన్నుడు, సదాప్రసన్నుడు, అసుర నాశకుడు, జగత్పాలకుడు, అనేక అవతారములు దాల్చువాడు, నిజభక్తజనుల అజ్ఞానమును దూరమొనర్చువాడు, సర్వదా విష్ణురూపి అయిన శ్రీగణేశునికి నమస్కారము. తమోగుణాశ్రయుడు, రుద్రరూపి, త్రినేత్రుడు, జగత్సంహారకుడు, తరింపజేయువాడు, జ్ఞాననిధి, తన భక్తులకు ఆగమముల ద్వారా జ్ఞానమొసగువాడు, శివరూపుడయిన గణేశ్వరునికి నమస్కారము. అంధకార నాశకుడు, భక్తుల అజ్ఞాన తిమిరమును నాశమొనర్పువాడు, వేదములకు సారము మరియు వికారదూరుడు, సూర్య స్వరూపుడయిన శ్రీగణేశునకు నమస్కారము. తన కిరణములచే ఔషధములకు శక్తి నొసగువాడు, తన అమృత వర్షముచే దేవతలను తృప్తి నొనర్చువాడు, సూర్యకిరణ సంతాపమును హరించువాడు, శశాంక స్వరూపుడయిన గజాననునకు నమస్కారము. ప్రకాశము, ఆకాశము, వాయువు మొదలగు వికారముల కారణరూపము, కాలము, కళ, క్రియ మరియు అనేక శక్తి రూపములయిన శ్రీగణేశునికి నమస్కారము. మూలప్రకృతి, మహత్తత్వము, అహంకారము, పంచభూతములు, పంచతన్మాత్రలు, బుద్ధి, మనస్సు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియములు, అష్ట దిశాధిపతులు, సత్యాసత్యరూపములు, జగత్ హేతువు మరియు జగద్రూపి అయిన శ్రీగణేశునకు నమస్కారము. ప్రభూ! ఎవరు మీ చరణయుగళి యందు మనసును లగ్నమొనరించెదరో వారు విఘ్నముల నుండి రక్షింపబడుదురు. మేము అజ్ఞాన వశమున అట్లు చేయక చిరకాలము భ్రమకు గురియై పరిభ్రమించుచున్నాము. తుదకు మీ కృపచే మీ చరణయుగళి చేరితిమి.”

అంత శ్రీగణేశుడిట్లనియె “మీరు ఎంతో క్లిష్టతరమయిన తపమాచరించిరి. మీ అభీష్ఠ వరము కోరుకొనవలసినది. మీరు కావించిన ఈ స్తుతి “స్థోత్రరాజము” అను పేర ప్రసిద్ధినొందును. ఎవరు ఈ స్థోత్రమును ఉదయము లేవగనే పఠించునో అతడు సదా శుద్ధుడగును. ఎవరు దీనిని త్రిసంధ్యల యుందునూ పఠింతురో వారు సమస్త కామనలను ప్రాప్తించి పుత్ర పౌత్రాభివృద్ధితో, ధనధాన్యసిద్ధితో చిరకాలము వర్ధిల్లి, అంత్యమున పరబ్రహ్మ స్వరూపులగుదురు.” అంత త్రిమూర్తులు “ప్రభూ! మాకు మీ చరణ కమలములందు దృఢభక్తిని ప్రసాదింపవలసినది.” అంత గణేశుడు “ఓ! మహాభాగులారా! మీకు నా యందు అవ్యభిచార భక్తి కలుగును. దాని వలన మీరు గొప్ప కష్ఠములనుండి కూడా బయటపడుదురు. అంతేకాక ఓ! చతురాననా! నీవు రజోగుణోద్భవుడవు కావున సృష్టి కావింపుము,” అని ఆ పరమాత్ముడు బ్రహ్మకు అత్యంత ఆదరముగ వేద శాస్త్రములు, పురాణములు, అన్యవిద్యలు, సృష్ఠిరచనా శక్తి ప్రసాదించెను. “విష్ణూ! నీవు సత్వగుణ సంపన్నుడవు కావున వ్యాపకుడవై, సృష్ఠి యందు ఉత్పన్నము కాబడిన జీవులను పాలింపుము.” విష్ణువునకు యోగశక్తి చే స్వేచ్ఛారూపధారణను అనుగ్రహించెను. “రుద్రా! నీవు తమోగుణాశ్రయుడవు కావున నీవు సంహారక్రియ కావింపుము,” అని శివునకు తన ఏకాక్షర, షడక్షర మంత్రములు, సర్వాగమములు, సృష్ఠి సంహార సామర్ధ్యము ప్రదానము కావించెను.

అంత చతుర్ముఖ బ్రహ్మ ఇట్లనియె “ప్రభూ! శబ్దశక్తి విహీనునకు వాచ్యావాచ్య వివేకములుండవు కదా! నేను మున్ను ఎన్నడునూ సృష్ఠి కావింపలేదు. అందువల్ల ఎట్లు సృష్ఠి చేయగలను? అట్లే అనల్లుంఘనీయమైన మీ ఆజ్ఞను పరిపాలించుట ఎట్లు? అందువలన నాయందు దయ చూపింపవలసినది. అంత గణేశుడు బ్రహ్మకు దివ్యదృష్ఠి ప్రసాదించి

"చతురాననా! నా శరీరము వెలుపలా, లోపలా కూడా అసంఖ్యాక బ్రహ్మాండములు కలవు. నీవు వాటిని సందర్శింపవలసినది," అని ఒక్కమారు ఉచ్ఛ్వాసము తీసికొనెను. దానిచే బ్రహ్మ గణేశుని ఉదరమున ప్రవేశించి, ఉదుంబర వృక్షమందలి ఫలముల వలె యున్న అనేక బ్రహ్మాండములను చూచెను. అందలి ఒక బ్రహ్మాండము నందు నాకీయబడిన దివ్యశక్తి చే అలతి కాలమున సమస్త సృష్టినీ కాంచితిని. ఆ బ్రహ్మాండమందు త్రిమూర్తులను, ప్రజాపతులను, ఇంద్రాది దేవతలను, సూర్య వరుణాదులను, నదులు, సముద్రములు, పర్వతములు, వృక్షములతో కూడిన మేదినినీ, ఉద్భిజ, జరాయుజ, స్వేదజ, అండజములను చతుర్విధ సృష్టినీ, ఇరువది ఒకటి స్వర్గాది ఊర్ధ్వలోకములను, ఏడు పాతాళాది అధో లోకములను, భావాభావములను, చరాచర విశ్వమును కాంచితిని. అంతేకాక ఇతర బ్రహ్మాండములను సహితము పరికించితిని. ఆ బ్రహ్మాండములకు అంతులేదు.

వాటన్నిటినీ చూచి, తిరిగి మతిభ్రమించి, చేతన లేక స్థబ్దుడనై యధాస్థానమున కూర్చొని గజాననుని ఈ విధముగ స్థుతించితిని "ఓ! దేవేశా! నీకు వందనములు. ఆకాశము నందు తారలను, సముద్రము నందలి మత్స్యములను, సముద్రతీరమందలి ఇసుక రేణువులను, లెక్కింపవచ్చు. కానీ నీ ఉదరమునందున్న అసంఖ్యాక బ్రహ్మాండములను లెక్కించుట అసాధ్యము. దేవేశ్వరా! మీ చరణారవిందములను కాంచిననూ నేను భ్రమించుచున్నాను. అయిననూ నాకు ఇపుడు చిన్నతనమని అనిపించుట లేదు. మీ దర్శనమయిన పిదప మోక్షము సహితము తుచ్ఛప్రాయమయినది. ఇక అన్యవస్తువుల ననేల? తండ్రీ! ఈ అనంత కోటి బ్రహ్మాండముల దర్శించి నేను బయటకు వచ్చుటకు అశక్యుడనైతిని. మిమ్మే శరణువేడుచున్నాను. తండ్రీ! నన్ను రక్షించండి! రక్షించండి!! రక్షించండి!!!" అంత శ్రీగణేశుడు తన నిశ్వాసము ద్వారా తిరిగి నన్ను బయటకు తీసకొని వచ్చెను. అంతదనుక శివకేశకులు ఇరువురు ఆ పరమాత్ముని విశాల కర్ణములందు నిద్రించుచుండిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి త్రిమూర్తులచే గణేశస్థుతి యను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(బ్రహ్మదేవుని అహంకారము)

సోమకాంత మహారాజిట్లనియె "స్వామీ! బ్రహ్మదేవుడు ఈ బ్రహ్మాండములు కాంచిన పిదప ఏమి చేసెను? ఎటువంటి సృష్టి కావించెను?" భృగుమహర్షి "బ్రహ్మ దేవుడు అనేక బ్రహ్మాండములు కాంచిన మీదట కించిత్ మోహగ్రస్తుడయ్యెను. రజోగుణ సముద్భవుడు, మరియు నూతనముగ సర్వశక్తివంతుడయిన చతుర్ముఖ బ్రహ్మ ఇట్లు తలపోసెను. నేను వేదశాస్త్ర, పురాణేతిహాస విశారదుడను, జ్ఞాన విజ్ఞాన సంపన్నుడను, శాపానుగ్రహ సమర్ధుడను. అనేక బ్రహ్మాండములు దర్శించి సృష్టి రచనను ఆకళింపు చేసికొన్న మేధావిని. ఇక సృష్టి చేయుట కేవలము నల్లేరుపై నడక." ఈ విధముగ తలంచి బ్రహ్మ సృష్టిరచనకు ఉద్యక్తుడయ్యెను. అకస్మాత్తుగ ఆయనకు వేలకొలది విఘ్నములు ఎదురై ఒక వికృత సృష్టి మొదలైనది. అందు ద్వి, త్రి, పంచముఖులు, అనేక బహూదర వక్రనేత్రులు, వికారరూపులు, అగణణీయముగ పుట్టుకొచ్చి ఈ మహానుభావుని బంధించి హింసింప నారంభించిరి. అంత చతురాననుడు చింతాక్రాంతుడై, ఆత్మావలోకియై, తన మనసునందు ఉదయించిన గర్వమును సంపూర్ణముగ త్యజించి, శ్రీగణేశుని తలంచి ఇట్లనియె "పరమాత్మా! ఏమి చిత్రము? నిన్ను భజించి, సుఖప్రదుడనై ఎన్నటికి ముక్తి నొందెదను? మీ కృపా కటాక్ష వీక్షణములచే

అభిషిక్తుడనైన నేను ఇపుడు ఇడుముల పాలైతిని. సృష్టికర్తనైన నాకు ఇప్పటిలో మృత్యువు లేదు. నాకు ఎప్పటికి ఈ భవసాగరమును తరించు నిర్మలజ్ఞానము లభించును? ఇపుడు నా కర్తవ్యమేమి?” ఈ విధముగ మదిలో తర్జన భర్జన కావించుచున్న విరంచికి అశరీరవాణి “నీవు తపస్సు చేయుము” అని వినిపించెను.

తక్షణమే బ్రహ్మదేవుని బాధించుచున్న వికృతరూపులు అదృశ్యులైరి. అంత బ్రహ్మ మంత్రము, స్థానము లేక ఎక్కడ ఏ విధమయిన తపమాచరింపవలెనని తలంచుచూ, కొంత తడవు ఆ విశాల జలరాశి యందు భ్రమించి, చివరకు మనసు కుదుటపరుచుకొని, తాను కాంచిన గణేశుని రూపమును తిరిగి జ్ఞప్తికి తెచ్చుకొని ధ్యానించుట మొదలిడెను. ఆ రూపమిట్లుండెను – రక్తచందన లిప్తమైన శరీరము, ముఖము సింధూరలిప్తమై అరుణ వర్ణముతో ప్రకాశించుచుండెను. ఫాలమందు శశాంకుడు శోభిల్లుచుండగా, శిరమున సువర్ణరత్న ఖచితమైన ముకుటము జ్వాజ్వల్యమానముగా దీప్తించుచుండెను. కంఠమునందు ముత్యాల సరములు, నాగ యజ్ఞోపవీతము, బాహువులందు రత్నఖచిత వంకీలు, వేళ్ళకు మరకతముల అంగుళీయకములు, మహా సర్పముల చే పరివేష్ఠితమైన మహోదరము, నానా వజ్ర వైఢూర్య జటిత కటిసూత్రము, స్వర్ణతారల జరీయున్న ఎర్రని పట్టుదట్టీ, సుందరమైన దంతము, మెలిదిరిగి శోభాయమానముగ వ్రేలాడుచున్న తొండము, బంగారు పట్టీలు ధరించిన పాదములు – ఈ విధమయిన రూపమును మనసున ఏకాగ్రచిత్తుడై హిరణ్యగర్భుడు ధ్యానించుచుండెను. అంత అశరీరవాణి తిరిగి “సుందర వట వృక్షమును కాంచుము” అని పలికెను. అది విని పద్మయోని తిరిగి చింత్రాగ్రస్థుడయి, ఒక్క క్షణము కన్నులు మూసికొనెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి బ్రహ్మదేవుని అహంకారమనెడు పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(బ్రహ్మ తపము, శ్రీగణేశుని వరదానము)

విరించి ఆ సమయమున ఒక సుందర స్వప్నమును కాంచెను. అందు ఆయనకు ఒక విశాల వటవృక్షము కానబడినది. అంత సురజ్యేష్ఠుడు ప్రళయకాలీన వాయు, అగ్ని, జల ప్రకంపనములు తట్టుకొని ఈ వటకృక్షము ఎట్లు నిలచినది అని తలంచుచూ, ఆశ్చర్యచకితుడై నెమ్మదిగ ఆ వృక్షమును చేరెను. అచట ఆయనకు ఒక విచిత్రమయిన దృశ్యము కానబడెను. ఆ వటవృక్షపు ఒక పత్రముపై చతుర్భుజుడు, కిరీటకుండలధారి, ఏక దంతుడు, గజముఖుడు, మానవశరీరుడు, జ్వాజ్వల్యమానముగ తేజరిల్లుచున్న ఒక బాలకుడు కానబడెను. “ఏమి ఈ మాయ? ఈ బాలకుడు ఇచటకెట్లు ఏతెంచెను?” అని శోచించుచుండగా, అంత ఆ బాలుడు తన తొండముతో నీటిని తీసికొని విరించిపై ప్రోక్షించెను. అంత పద్మయోని ఏకకాలమున హర్షశోకములు పొందెను. అంత ఆ బాలుడు వట వృక్షము నుండి క్రిందికి ఏతెంచి పద్మగర్భుని ఒడిలో కూర్చొని ఇట్లనియె “విరించీ! గర్వాహంకారములచే నీ బుద్ధి భ్రమించి, తుచ్ఛుడవై విఘ్నములచే పీడింపబడితివి. నీవు తపమాచరించుటకు వ్యర్థముగ జలరాశి యందు తిరుగుచుంటివి. నేను నీకు సర్వ శుభ, సుఖ ప్రదాయకమైన ఏకాక్షర మంత్రమును ఉపదేశించెదను. దీనిని పురశ్చరణ విధానమునుసరించి పది లక్షల జపము కావింపవలసినది. ఈ విధముగ కావించిన ఎడల నీకు చింతలు దూరమై నీకు నా ప్రత్యక్ష దర్శనము జరుగును.” తక్షణము పద్మయోనికి మెలకువ గలిగి, తనకు కలిగిన స్వప్నమును పునరావలోకము గావించి, పద్మమందు ఒక్క పాదముపై నిలబడి, జితేంద్రియుడై, ఆహారము వర్జించి, క్షుధను నియంత్రించి, కాష్ఠ పాషాణదుల స్థితిని పొంది,

ఏకాక్షర మంత్రమును నిష్ఠగా జపింప నారంభించెను. కొంత కాలమునకు ఆయన ముఖము నుండి అగ్నిజ్వాలలు బయలుదేరి చరాచర జగత్తును మండింపనారంభించెను. అంత శ్రీగణేశుడు ఆయన సుదృఢ నిష్ఠను గమనించి, సంతసించి, ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యెను.

ఆ సమయమున శ్రీగణేశుడు పృధివ్యాకాశములు ఆవరించి, జ్వాలామాలికాయుక్తుడై, కోటిసూర్య ప్రకాశుడై హస్తములందు పరశువు, కమలములు ధరించి యుండెను. సకల సౌందర్యనిధానుడు, సమస్త పాపహరణుడు, కుంజరముఖుడు, భక్తజన మనోకామనాపూర్ణుడు అయిన శ్రీగణేశుడిట్లనియె "ఓ! సృష్టికర్తా! భయము వలదు. నీకు స్వప్నమందు ఏకాక్షర మంత్రరాజమును ఉపదేశించినది నేనే! ఆ మంత్ర జపముచే నీవు సిద్ధి పొందితివి. నీ తపముచే నేను అత్యంత సంతోషము, సంతుష్టి కలిగి నీకు వరదానమిచ్చుటకు ఏతెంచితిని. నీవు ఈప్సిత వరములు కోరుకొనవలసినది. అవి ఎంతటి కష్ఠతరములైననూ వానికి నీకు ప్రసాదించెదను." అంత చతుర్ముఖ బ్రహ్మ కనులు తెరచి, వాటియందు ఆనందాశ్రువులు పొరలుచుండ ఆ మహాత్మునికి సాంజలి బంధకముగ నమస్కరించి ఇట్లనియె "స్వామీ! నేడు నా జన్మ సఫలమైనది. వేద శాస్త్ర ఉపనిషాదులకు, జ్ఞానులకు, యోగులకు సహితము అగోచరుడు, విభుడు, ఆది మద్యాంతరహితుడు, అనంతుడు, అప్రమేయుడు మరియు నిర్గుణుడు అయిన శ్రీగణేశ భగవానుడు నా చర్మచక్షువులకు దర్శనమిచ్చెను. మహాప్రభో! నా తపము చే మీరు ప్రసన్నులైన ఎడల నాకు మీ పాదపద్మముల ఎడ సుదృఢ భక్తిని ప్రసాదింపవలసినది. నాకు నానా విధముల సృష్టి రచనా సామర్ధ్యము ప్రసాదించి, విఘ్నములను నాశనమొనర్చి, నేను మిమ్ము స్మరించినంత మాత్రమున నా విఘ్నముల సర్వమునూ హరించి, నా కార్యములు నిర్విఘ్నమొనర్చి, అంత్యకాలమున నాకు స్థిరముక్తిని ప్రసాదింపవలసినది". శ్రీగణేశుడు సంతసించి "తథాస్తు" అని దీవించెను.

అంత విరించి శ్రీగణేశుని పూజింప దలిచెను. గజాననుని అనుగ్రహము చే విరించి మనసున సంకల్పించిన వస్తుజాలమంతయు తక్షణము ఉపస్థితమయ్యెను. ఆయన వాటిచే గణపతిని మనసార పూజించెను. దక్షిణనిచ్చు సమయమున అచట "సిద్ధి, బుద్ధి" అను ఇరువురు స్త్రీ మూర్తులు ప్రత్యక్షమయిరి. వారిరువురు పద్మముఖులు, సుమధుర గంధయుక్తులు, సువర్ణ రత్నఖచిత ఆభూషణా శోభితులు, నానా పరిమళ పుష్పమాలాలంకృతులు, విచిత్ర దుకూల ధారిణిలు. వారిరువురినీ బ్రహ్మదేవుడు దక్షిణగా శ్రీగణేశునకర్పించెను. పిదప కర్పూర నీరాజనము, పుష్పాంజలి సమర్పించి, అష్టోత్తర సహస్రనామావళితో వారిని స్థుతించి, ప్రదక్షిణ మాచరించెను. అంత శ్రీగణేశుడు సంతసిల్లి సిద్ధి, బుద్ధి సహితుడై అంతర్ధానుడయ్యెను. విరించి పరబ్రహ్మమయిన గణపతి ఆజ్ఞ మరియు కృపతో సృష్టిరచన నిరాటంకముగా కావించెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి బ్రహ్మతపము మరియు గణేశుని వరదానము అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(యోగనిద్రా స్థుతి)

సోమకాంత మహారాజు "మహర్షీ! శ్రీగణేశ చరిత్ర హృదయానందమును కలుగజేయుచున్నది. ఈ కథామృతమును ఎంత సేవించిననూ నాకు తృప్తి కలుగుట లేదు. తదుపరి సృష్టినిర్మాణము ఎట్లు జరిగినది? దయచేసి తెలుపవలసినది." భృగుమహర్షి సంతసిల్లి ఇట్లనియె "తొలుత పద్మయోని తన మన:సంకల్పముతో ఏడుగురు పుత్రులనుద్భవింప చేసి, వారిని సృష్టి సహాయకారులు కమ్మని తెలిపెను. వారు బ్రహ్మ పలుకులు విని, వారందరూ తపశ్చర్యకుపక్రమించి

పరబ్రహ్మమందు లీనమైరి. తిరిగి విరించి మరి ఏడుగురు పుత్రులనుదయింపజేసెను. వారును జ్ఞానమార్గమవలంబించి సృష్టి కావింపరైరి. అంత బ్రహ్మ సనకాదులను ఉద్భవింప జేసెను. వారునూ సృష్టికి పరాన్ముఖులైరి. అంత చేయునది లేక హిరణ్యగర్భుడు తన ముఖము నుండి బ్రాహ్మణులను, అగ్నినీ, బాహువుల నుండి క్షత్రియులను, ఊరువుల నుండి వైశ్యులను, పాదముల నుండి శూద్రులను, హృదయము నుండి చంద్రుని, నేత్రముల నుండి సూర్యుని, కర్ణముల నుండి వాయువు, ప్రాణమును, నాభి నుండి అంతరిక్షమును, శిరము నుండి ఆకాశము, స్వర్గాది లోకములను, పాదములనుండి భూమిని, చెవుల నుండి దిశలను, అన్య లోకములను సృజించెను. తదుపరి స్థావర జంగమాత్మకమైన భూమి, దానియందు నదులు, పర్వతములు, సముద్రములు, తృణ, గుల్ఫ, వృక్షాదులను సృష్టించెను.

ఆ సమయమున ఒక చిత్రము జరిగెను. నిదురించుచున్న విష్ణు భగవానుని కర్ణమలము నుండి మధు, కైటభులను ఇరువురు బృహత్ రాక్షసులు ఉద్భవించిరి. వారు మహాబలురు, పర్వతాకారులు, విశాల కాయులు, వర్షాకాల మేఘగర్జన వంటి స్వరముతో, ఆ దుష్టులిరువురు బ్రహ్మదేవుని అపశబ్దములతో నిందించి, దేవ, బ్రాహ్మణ, ఋషి, వేదనింద గావించిరి. వారి అకృత్యములతో పుడమి కంపించి శేషనాగము తల్లడిల్లెను. ఆ అసురద్వయముచే బ్రహ్మాండమంతయు పీడింపబడెను. వారిరువురు బ్రహ్మదేవుని భక్షింపదలచిరి. కానీ చతురాననుడు శ్రీగణేశుని కృపచే వీరిరువురు శ్రీహరి చే సంహరింపబడుదురని తెలిసి, విష్ణువు నేత్రములందున్న యోగనిద్రాదేవిని ఈ విధముగ ప్రార్థించెను "ఓదేవీ! యోగనిద్రా! నీవు స్వాహా, స్వధా, సుధా మరియు ఓంకార రూపిణివి. జగత్తు యందు సృష్టి, స్థితి, సంహారకాండలు సాగించునది నీవే! నీవే జగన్మాత, జగద్ధాత్రి, సావిత్రీ, సంధ్య, క్షుధ, పిపాస, మరియు మహామాయ. తల్లీ! నీవు ఆదిమధ్యాంత రహితవు. జీవులు, వస్తువులు, పదార్థముల యందలి శక్తివి నీవే! జననీ! మీ స్వామి, త్రిలోకకర్త, దైత్యదానవ నాశకర్త, జ్ఞానవిజ్ఞాననిధానము, అయిన విష్ణు భగవానుడు గాఢ సుషుప్తి యందున్నాడు. ఆయన జగత్పాలకుడు. ఆయన నీ వలనే అనేక అవతారములు స్వీకరించుచుండును. పరమదుష్టులైన ఈ ఇరువురు రాక్షసాధములు పూర్వజన్మమందు నాకై తపమాచరించి వరములు బడసిరి. అందుచే వారు నాచే అవధ్యులు. అందుచే నాకు వారి అపశబ్దములను సహింపవలసి వచ్చుచున్నది. వీరు దుష్టాత్ములై నన్ను సహితము వధించుటకు యత్నించుచున్నారు. తల్లీ! నిన్ను ప్రార్థించుచున్నాను. నీవు ఈ దుష్ట ద్వయమును మోహింపజేసి వీరిని హతమార్చుటకై విష్ణు భగవానుని మేల్కొలుపుము."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి యోగనిద్రాస్తుతియను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(శివ విష్ణు సమాగమము)

శ్రీమహావిష్ణువు యోగనిద్రనుండి మెళకువనొందు సమయమునకు మధుకైటభులు ఇంద్రాది దేవతలను, దిక్పాలురను, ఓడించి స్వర్గమును కైవసము చేసికొనిరి. వారిని చూచి సమస్త దేవతానీకము పలాయనము చిత్తగించిరి. మానవ, గంధర్వ, నాగ, యక్ష, కిన్నెర, కింపురుషాదులు ముందే మూర్ఛితులైరి. అంత శ్రీహరి శంఖ, చక్ర, గదాధరుడై వీరందరి కొరకై శిష్ట రక్షనార్థము తన ప్రచండ పాంచజన్యమును పూరించెను. ఆ భయంకర ఆరావముచే భూమ్యాకాశములు దద్దరిల్లి, మధుకైటభుల హృదయములు విదీర్ణములైనవి. వారిరువురు తమలో తాము "ఏమి ఈ దుర్వారమైన ధ్వని? స్వర్గ, పృధివీ, పాతాళములు స్వాధీనమొనర్చుకొన్నపుడు ఈ శబ్దము వినలేదే! ఈ ధ్వని పాషాణ ఘాతము వలె

బాధించుచున్నది. ఈ శంఖధ్వని కావించుచున్న పురుషునితో తప్పక సమరమొనర్పవలె! జయాపజయముల మాట అటుంచి ముందు మన రణకండూతి తీరును. మనము మన శత్రువును వధించిన కీర్తి, మనము వధింపబడిన పునర్జన్మ లభించును. అంత వారు విష్ణువును చేరి "పురుషోత్తమా! నీవు మా యుద్ధాభిలాషను శాంతమొనర్పవలసినది. నీవు ఆయుధధారివైయున్నావు. కానీ చతుర్భుజుడవు. మేము ఇరువురము. అందువలన నీవు మా ఇరువురితో మల్లయుద్ధమొనర్పవలసినది." అంత విష్ణువు "వల్లె" అనెను. పిదప తన ఆయుధములు విడచి వారితో బాహా బాహి, ముక్కాముక్కి, ముష్ఠా ముష్ఠి మల్లయుద్ధమొనర్చెను. ఆ విగ్రహము అయిదు వేల దివ్య వత్సరములు గడచిననూ ఒక కడకు తేలలేదు. విష్ణువు వారిని ఓడింపజాలకుండెను.

అంత విష్ణువు ఒక గంధర్వరూపము ధరించి, వనమధ్యమునకేగి, వీణాపాణియై సుమధురముగ గానమాలపింప మొదలిడెను. ఆ గాన మాధుర్యమునకు ముగ్ధులై మానవ, యక్ష, రాక్షస, దేవ, దానవ, పశు, పక్ష్య, మృగములు తమవ్యాపారములు మాని ఆ గానమునందు ఓలలాడిరి. ఆ మధురాలాపము నెమ్మదిగ కైలాస పర్వత చరియల యందలి దేవదేవుడు శంకరుని చెవుల బడెను. అంత ఆ మహాదేవుడు నికుంభ, పుష్పదంతులను పిలచి వనమందు గానమాలపించుచున్న గాయకుని తక్షణము తన వద్దకు తీసికొని రమ్మని పంపెను. వారు వనమునకేగి గంధర్వుని గాంచి "అనఘా! నీ గానమాధుర్యమునకు శివ భగవానుడు ముగ్ధుడై నిన్ను గైకొని రమ్మని మమ్ములను పంపెను. నీవు శీఘ్రమే మాతో పయనమై కైలాసమున కేతెంచవలసినది." అంత గంధర్వుడు వారి వెంట కైలాసమునకేగి పార్వతీపతి, బాలశశాంకమౌళి, గజచర్మాంబరధారి, గళమున ముండమాలాలంకృతుడు, పింగళ వర్ణ జటాజూటధారి, నాగయజ్ఞోపవీతుడు, ప్రణతిజన కష్ఠ నివారకుడు, విశ్వేశ్వరుడు, మహాదేవుని గాంచి అధోక్షజుడు నారాయణుడు ధరిత్రిపై బడిన స్వర్ణ దండము వలె ఆయన పాదములపై బడెను. అంత శంభుడు ఆ గంధర్వరూపుని సాదరముగ లేవనెత్తి ఆసనమును ప్రసాదించి పూజించెను. అంత గంధర్వుడు "మహాప్రభూ! నేడు మీ దర్శనము చే నా జన్మ ధన్యమైనది. ఇయ్యది ధర్మార్థకామమోక్ష దాయకము." అంత శివుడు గానము వినుటకు తత్పరుడగుట గమనించి, తన వీణను శృతియొనర్చి, మంద మధుర పదములతో, ధ్వనితో వివిధ కీర్తన లాలపించెను. ఆ గంధర్వుడు శంభునే కాక పార్వతీమాతను, స్కంధగణేశులను, ఋషి, ముని, శివగణములను సహితము సంతుష్ఠుల నొనర్చెను.

అంత సర్వజ్ఞాత అయిన మహేశ్వరుడు సాభిప్రాయముగ ఆ గంధర్వుని వంక చూచెను. అంత గంధర్వుడు శంఖ, చక్ర, గదాధారి, చతుర్భుజుడైన విష్ణువుగా మారి తన నిజరూపమున నిలచెను. అంత మహేశుడు ఆయనను గాఢాలింగనము చేసికొని ఇట్లనియె "ఓ! విష్ణూ! నేను నీ గాన కుశలత చే సంపూర్ణముగ సంతుష్ఠుడనైతిని. నీ మనమున యున్న వాంఛిత వరమేది అయిననూ కోరుకొనుము." అంత విష్ణువు మధుకైటభ వృత్తాంతమంతయు తెలిపి "ఓ! కరుణానిధీ! వారిని నేను నిర్జింపలేకున్నాను. నాకు దయచేసి వారి వధోపాయమును తెలుపవలసినది." అంత కపర్ది "విష్ణూ! నీవు యుద్ధభూమికేగినపుడు గణేశుని పూజింపక ఏగితివి. తత్ఫలితముగ నీవు శక్తిహీనుడవై క్లేశముల పాలయితివి. ఇప్పటికీ మించిపోయినది లేదు. నీవు గణేశుని పూజించి తిరిగి యుద్ధమునకేగుము. నా కృపచే నీవు నిస్సందేహముగ వారిని నిర్జించెదవు. శ్రీగణేశుని మాయ చే వారు మోహగ్రస్తులగుదురు." అంత విష్ణువు "స్వామీ! నేను శ్రీగణేశుని ఉపాసన ఎట్లు కావింపవలెను? ఆ విధి విధానములు, సాంగోపాంగముగ నాకు ఉపదేశింపవలసినది. శివుడు "శ్రీగణేశునకు ఆగమములందు ఏడు కోట్ల మంత్రములున్నవి. అందు ఏకాక్షర, షడక్షర మంత్రములు బహు ప్రసిద్ధములు. ప్రస్తుతము నీకు దానవులపై విజయము కావలెను. కావున నీకు షడక్షర మహామంత్రమును "వక్రతుండాయ హుం" ఉపదేశించెదను. ఇయ్యది సిద్ధమంత్రము, శుభము, సర్వసిద్ధి ప్రదాయకము. కేవల మంత్రానుష్ఠానము వలన నీకు సిద్ధి కలుగును. అంత విష్ణు భగవానుడు ఈ మహామంత్ర జపానుష్ఠానహేతువై పార్వతీ పరమేశ్వరులకు ప్రణమిల్లి వెంటనే

అచట నుండి నిష్క్రమించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి శివవిష్ణు సమాగమమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్దెనిమిదవ అధ్యాయము

(విష్ణు తపస్సు; మధకైటభ వధ)

సోమకాంతుడు "మహర్షీ! విష్ణు భగవానుడు శ్రీగణేశుని షడక్షర మంత్రమును ఎట్లు ఉపాసించెను? సిద్ధి ఏ విధముగ కలిగినది?" భృగువు "భూమండలమందు "సిద్ధక్షేత్రము" అను పరమ విఖ్యాత తీర్థ స్థలమున్నది. విష్ణు భగవానుడు అచటికి చేరి జితేంద్రియుడై, నారాచముద్ర ధరించి, దిగ్బంధనము, భూతశుద్ధి, ఆత్మ ప్రాణ ప్రతిష్ఠాపన, సలిపి మూలాధారము నుండి సహస్రారము వరకు అంతర్ మాతృకాన్యాసము ఒనరించి, శిరము నుండి పాదముల వరకు బాహ్యమాతృకా న్యాసము కావించి, ప్రాణాయామము చేసి సిద్ధివినాయకుని ఆవాహన గావించి, మానసోపచార పూజసలిపి, తదుపరి షోడశోపచారములతో పూజించి తదుపరి శ్రీగణేశుని షడక్షర మంత్రజపము గావించెను. ఈ విధముగ వందేండ్లు గడచిన పిమ్మట అగ్ని సదృశ తేజస్వీ, కోటి సూర్య ప్రకాశుడు, అయిన శ్రీగణేశ భగవానుడు ప్రత్యక్షమయ్యెను. శ్రీగణేశుడు "విష్ణు! నీ నిష్ఠుర తపము చే నేను సంతుష్ఠి నొందితిని. నీ మనోవాంఛితములన్నియు కోరుకొన వలసినది." అంత శ్రీహరి "వ్యక్తావ్యక్త స్వరూపుడవు, ఏకరూపుడవు అయినప్పటికీ, నానా రూపధారుడవు; శివబ్రహ్మేంద్రాదులకు తపము చే కూడా లభ్యమవ్వని నీవు నా పుణ్యవశమున ఈ కన్నులకు దర్శనమిచ్చితివి. నీవు అణువు కంటె అణువు, మహత్తు కంటె మహత్తు, ఆకాశాది పంచభూతముల కంటె విశేషము, మరియు సమస్త జగత్తుకు సృష్టి, స్థితి, సంహారకుడవు. నీవు సర్వాత్మా, సర్వగామీ, సర్వవ్యాపీ, సర్వకర్తా, సర్వద్రష్టా, సర్వరక్షక, సర్వ సంహారక, ధాతా, విశ్వనేత, జగత్పిత, మరియు సర్వశక్తి యుతుడవు నీవే! ప్రభూ! నీ దర్శన భాగ్యము చే నాకు సర్వ సిద్ధులు సిద్ధించును."

"మహాత్మా! నా యోగనిద్ర యొక్క అంతిమ క్షణములందు నా కర్ణమలము నుండి మధుకైటభులను ఇరువురు మహాసురులు ఉద్భవించిరి. నేను బహుకాలము వారితో పోరు సాగించినప్పటికీ, వారిని గెలువలేకపోతిని. పరమాత్మా! నేను మిమ్ము శరణు జొచ్చుచున్నాను. నాకు మీ పాదముల యందు అవ్యభిచార భక్తిని ప్రసాదింపవలసినది. అంతేకాక నా ద్వారా ఆ ఇరువురు అసురులు మృతినొందవలె! నాకు ఈ అసురులందరినీ నిర్జించు శక్తి కలిగి, సర్వలోకములందు నా పవిత్ర అతులిత కీర్తి ప్రబలి, ఆ కీర్తి చే మూడు లోకములు పవిత్రములగుగాక!!" అని పలికెను. శ్రీగణేశుడు "తథాస్తు. నీవు అసురుల నిర్జించెదవు. నీ యశోబల కీర్తులచే సర్వ కార్యములను నిర్విఘ్నముగ కావింప గలుగుదువు," అని పలికి అంతర్ధానుడయ్యెను. అంత విష్ణువు ఆ సిద్ధక్షేత్రమందు ఒక స్పటిక మణి మందిరమును నిర్మించి, దాని చుట్టూ నలుద్రిక్కులా విశాల ద్వారములు గల ఎత్తైన ప్రాకారముల నమర్చెను. గండకీ నది నుండి లభించు సాలిగ్రామ శిలలతో శ్రీగణేశుని ప్రతిమ చేసి స్థాపించెను. ఈ క్షేత్రము సిద్ధక్షేత్రమై, ఇచటి వినాయకుడు సిద్ధి వినాయకుడై ప్రసిద్ధినొందెను.

తదుపరి విష్ణువు మధుకైటభులున్న స్థలమున కేగెను. వారిరువురు ఆ మహానుభావుని కాంచి హేళనగా "నీ మేఘవర్ణ ముఖము ఇన్నాళ్ళు కనబడక ఏమైనదో? ఈ సారి మేమిరువురము నీకు ముక్తిని ప్రసాదించెదము. నీవు అల్పుడవు. నీవు పరాజితుడవైనప్పటికీ తిరిగి ఏల వచ్చితివి?" అంత విష్ణువు "అగ్ని అల్పమైననూ సర్వమునూ దగ్ధమొనరింపగలదు. దీపము చిన్నదైనప్పటికీ మహాంధకారమును పారద్రోలును. దుర్మధాంధులైన మీరిరువురినీ నేను

మట్టుబెట్టెదను.” అని పలికెను. అంత ఆ అసురద్వయము అగ్రహోదగ్రులై యుద్ధోన్ముఖులైరి. వారి మధ్య కొన్ని దినములు సమరము గడచిన పిదప విష్ణువు మృదు స్వరముతో ఇట్లనియె “ఓ! దైత్యపుంగవులారా! మీరిరువురు ఎంతో కాలము నుండి నా ప్రహారములను సహించిరి. మీ వంటి బలశాలురు ఇంతకు మున్ను లేరు. ఇకముందు ఉండబోరు. మీపట్ల నేను సంతుష్టుడనైతిని. మీరిరువురు ఏదేని వరము కోరుకొన వలసినది. దానిని నేను నెరవేర్చెదను.” అంత దైత్యులు విష్ణుమాయా మోహితులై “ఓ! విష్ణూ! మేమే నీకు వరదానమిచ్చెదము. మనోవాంఛిత వరము కోరుకొనుము.” అంత విష్ణువు “అట్లయిన మీరిరువురు నా ద్వారా మృతినొందవలెను.” అని పలికెను. వారిరువురు ఒక్క క్షణము నివ్వెరపోయి పిదప తేరుకొని ఇట్లనిరి “ఓ! మహాపురుషా! నీచే వధింపబడుట మాకు సహితము శోభనిచ్చును. అంత్యకాలమందు నీ చింతన సాక్షాత్ ముక్తి ప్రదము. మేము సర్వమును త్యజింపగలము, కానీ సత్యమును త్యజింపలేము. ఎందువలన అనగా సత్యము నందే సర్వము స్థితిగతమై యున్నది. నీవు మమ్ము అవశ్యము వధింపవచ్చు. కానీ మమ్ము నీరులేని ప్రదేశమున వధింపుము.” “వ్యాప్నోతి ఇతి విష్ణు:” వ్యాపించు వాడగుటచే నారాయణుడు విష్ణువయినాడు. ఆయన తన రెండు తొడలను దిగంతముల వరకు వ్యాపింపజేసి, వానిపై వారిరువురినీ యుంచి, చక్రాయుధముతో వారిని ఖండించెను. ఆ ఇరువురు మహాసురులు పంచత్వము నొందిరి.

ఈ మహత్కార్యమునకు సంతసిల్లి దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వుల గానము, అప్సరసలు నాట్యము కావించిరి. అంత విష్ణు భగవానుడు పరమేష్ఠి వద్దకేగి జరిగిన విశేషములన్నియు వివరించెను. సర్వ దేవతలు శ్రీగణేశుని, త్రిమూర్తులను, స్తోత్రము చేసి తమ ఆవాసముల కరిగిరి. ఏ మనుష్యుడు శ్రీగణేశుని ఈ పరమ పావన గాథను వినునో వానికి భయము నశించి, వాని సర్వ కామనలు పూర్ణమగును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి మధుకైటభ వధ అను పద్దెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(భీమ ఉపాఖ్యానము)

భృగుమహర్షి “బ్రహ్మదేవుని వలన షడక్షర మహిమను సంపూర్ణముగ వినినప్పటికీ వ్యాసునకు ఆ మంత్ర మహిమ యందు ఇంకనూ సంపూర్ణ విశ్వాసము కుదరక ఇట్లనియె “విధాతా! నేను మీ దయవల్ల సిద్ధక్షేత్ర మహిమ, సర్వకామనాపూర్ణము, పాపనాశకము, పుణ్యవర్ధకము అయిన సిద్ధి వినాయక మహాత్మ్యమును వింటిని. కానీ నాకు ఇంకనూ ఈ కథామృత పాన తృష్ణ తీరుటలేదు. దయచేసి ఈ మహాత్మ్యమును మరికొంత వర్ణింప వలసినది.” బ్రహ్మ “పరాశరపుత్రా! నీకు ఆ మహానుభావుని మరొక ఆఖ్యానమును తెలిపెదను. ఒకనాటిమాట! విదర్భ దేశమును భీముడు అను మహారాజు పరిపాలించెడివాడు. ఆతడు పరాక్రమోపేతుడు, మహాబలి, దాత, యుద్ధ కుశలుడు, అసంఖ్యాక సైన్య సమోపేతుడు మరియు సకల సద్గుణములకు ఆలవాలము. ఆయన ధర్మపత్ని చారుహాసిని. ఆ తల్లి పరమ పతివ్రతా శిరోమణి; దేవ, బ్రాహ్మణ, భక్తులందు నిత్య సేవా పరాయణి. తన భర్తను ప్రాణము కంటె మిన్నగా ప్రేమించెడిది. వారికి సర్వము యున్ననూ పుత్ర సంతతి లేకుండెను. ఎన్నో నోములు, వ్రతములు, పూజా పునస్కారములు కావించిననూ ఫలితము శూన్యము. చివరకు ఒకనాడు భీముడు తన ధర్మపత్నితో ఇట్లనియె “అపుత్రస్య గతిర్నాస్తి. పుత్రహీనులకు పుణ్యగతులుండవు. వారికి సుఖశాంతులు, స్వర్గ ప్రాప్తి యుండదు. వారిచే ఈయబడిన హవ్యము దేవతలు, కవ్యము

పితరులు స్వీకరింపరు. నా జన్మము, కులము, ధనధాన్య సంపత్తి, నా సమస్త కర్మములు సర్వము నేడు వృధా అయినవి. ప్రేయసీ! మనము ఈ రాజ్యము వీడి వనములకేగుదుము." పతివాక్య శిరోధారిణి అయిన చారుహాసిని "వల్లె" అనినది.

అంత భీమ మహారాజు సుమంతువు, మనోరంజనుడు అను తన అమాత్యులిరువురినీ పిలచెను. వారిరువురు అధ్యాత్మవిద్య, తర్కశాస్త్ర విశారదులు, వేదవిదులు, కృషి, వాణిద్య, పశుపాలన యందు ఆరితేరిన మేటిలు, పదునారు కళలందు జ్ఞాతలు. వారిరువురు తక్షణమే ఏతెంచి మహారాజునకు నమస్కరించిరి. మహారాజిట్లనియె "అమాత్యులారా! మీరిరువురు సర్వశాస్త్ర విశారదులు. మా దంపతి ఇరువురము రాజ్యత్యాగము చేసి వనములకేగవలెనని నిశ్చయించితిమి. నా రాజ్యమును మీరిరువురు సమభాగములు చేసి పాలింపవలసినది. దైవయోగమున మాకు సంతతి కలిగిన ఎడల తిరిగి వచ్చెదము. మేము రాని ఎడల రాజ్యమును భాగించి మీరిరువురు తీసికొనవలసినది. పూర్వజన్మ పాప ఫలితమున నాకు అపత్యదోషము (పుత్రలేమి) అంకురించినది." ఈ విధముగ పలికి, భూసురులకు దానములొసగి వనములకు పయనించెను. అమాత్యులు, నాగరికులు, ప్రజలు రాజదంపతిని ఒక క్రోసు దూరము వెంబడించిన పిదప, రాజు వారిని సముదాయించి వెనుకకు పంపెను. ఆ సమయమున వారందరూ దు:ఖార్తులైరి. కానీ రాజు వారందరినీ అనునయించి, అమాత్యులు వారందరినీ ప్రజారంజకముగ పాలింతురని నమ్మబలికి వెనుకకు పంపి, రాజదంపతి కాననముల ప్రవేశించెను. కొంతకాలము వారిరువురు ఆ కాననములందు తిరుగాడి చివరకు ఒక దివ్య మున్యాశ్రమమును చేరిరి. ఆ ఆశ్రమము నందు జన్మ వైరమున్న జంతువులు సహితము తమ వైరమును విడనాడి పరస్పర ప్రేమానురాగములు చిందించుచున్నవి. ఆ దంపతి ఆ ఆశ్రమ మధ్యమున శిష్యులచే పరివేష్ఠితుడయిన విశ్వామిత్ర మహర్షిని కాంచిరి. వెంటనే వారిరువురు ఆ మహర్షికి సాష్టాంగ దండప్రణామములాచరించిరి.

తపోనిధి, మునిశ్రేష్ఠుడయిన విశ్వామిత్రుడు వారిని సాదరముగ పలుకరించి, ఆశీనుల గావించి, ఇట్లు ప్రశ్నించెను "రాజా! మీరెవరు? ఎచటి నుండి ఏతెంచిరి? మీ వృత్తాంతమంతయు నాకు తెలుపవలసినది." అంత భీముడు "స్వామీ! విదర్భ దేశమున కౌండిన్య నగరము కలదు. నేను ఆ దేశాధీశుడను. భీమ నామధేయుడను. ఈమె నా ధర్మపత్ని చారుహాసిని. మేము పుత్రార్ధమై తపోదానవ్రతములెన్నియో సలిపితిమి. కానీ పూర్వజన్మ పాప ఫలితముగ సంతానము కలుగలేదు. ఆ ఈశ్వరునికి మాపై కరుణ కలుగుట లేదు. దైవయోగమున మాకు మీ దర్శనభాగ్యము, చరణసన్నిధి లభించినది. సాధు, సత్పురుషుల సందర్శనము శీఘ్ర ఉత్తమఫలదాయకము. మీ ఆశీర్వాద బలము చే మాకు తప్పక పుత్రయోగము కలుగును. ఇందు సందియము లేదు. విద్యా, తపో, దాన, యజ్ఞ, స్వాధ్యాయములు, శమదమాది సద్గుణ సంపన్నులు అయిన మీ ఆశీర్వాదము వ్యర్ధమవదు. మహర్షీ! నేను పూర్వజన్మమందు చేసిన పాపమేమి? అద్దాని ప్రాయశ్చిత్తము, ప్రక్షాళనము నేనెట్లు కావించెదను? దయచేసి నాకు తెలుపవలసినది." అంత విశ్వామిత్రుడు "రాజా! నీవు ధనమదాంధత చే దుర్బుద్ధివై, వేదశాస్త్ర పురాణములందు తెలిపిన విహిత కర్మలను, లోకాచారము చే ప్రతిష్ఠమైన కులధర్మములను పూర్ణముగ త్యజించితివి. నీ పూర్వజులందరూ పరబ్రహ్మమైన గణపతి సేవా తత్పరులు. నీవు పూర్ణముగ ఆ శ్రీగణేశ భగవానుని విస్మరించితివి. ఆ పరమాత్ముడు కోపించి సంతతి లేకుండ చేసెను. శ్రీగణేశుడు మీ పూర్వజులకు ఎట్లు కులదేవత అయ్యెనో వివరించెదను. వినుము.

నీకు ఏడు తరముల ముందు భీముడను రాజు కలదు. ఆయన పుత్రుడు వల్లభుడు. ఈ వల్లభునకు చాలా కాలము పుత్ర సంతతి కలుగకుండెను. చివరకు రాణి గర్భవతియై ఒక పుత్రుని ప్రసవించెను. దురదృష్టవశాత్తు ఆ శిశువు బధిరుడు, మూగ అయి, గూని కలిగి, కుబ్జుడై, శరీరము వ్రణములు కలిగి, చీము, నెత్తురు స్రవించుచూ దుర్గంధభూయిష్ఠమై యుండెను. అదికాంచి వల్లభుని రాణి కమల మిక్కిలి దు:ఖించి ఇట్లు తలచినది "ఇటువంటి పుత్రుడు కలుగుట కంటె కలుగకుండుట మేలు. విధాత నాకు గానీ, ఈ పుత్రునకు గానీ ఏల మృత్యువును ప్రసాదింపడు?

నేను నా మిత్రజనులకు ముఖమెట్లు చూపించెదను?" ఈ దు:ఖాలాపములు వినిన రాజు వల్లభుడు ప్రసూతి గృహము ప్రవేశించి, జరిగిన విషయము తెలిసికొని తన పత్నిని ఇట్లు స్వాంతన పరచెను "కళ్యాణీ! నీవు దు:ఖపడవలదు. కర్మల గతి అనూహ్యము. పూర్వ జన్మ కర్మములచే మానవుడు సుఖదు:ఖములనొందును. దు:ఖప్రాప్తి అనంతరము సుఖము, సుఖప్రాప్తి అనంతరము దు:ఖము కలుగుట తథ్యము. ఈ బాలకుని విషయమై చింతింపవలదు. పూర్వజన్మ కర్మమెట్లున్నదో అట్లే ఈతని భవిష్యత్ యుండును. మనము యథావిధిగ రాజపుత్ర లాంఛనములతో ఈతనిని అలంకరించి పెంచెదము. యథావిధి మంత్ర, ఔషధ, తపో, జప, పూజా తీర్ధయాత్రలు విధి విధానముగ కావించెదము. వర్తమానమందు సముచిత విధముగ యత్నించెదము." ఈ విధముగ అనునయించిన పిదప పతివ్రత అయిన కమల స్వాంతన నొంది, శిశువునకు స్నానమొనరించి యథావిధిగ జాతకర్మ సంస్కారములు, బ్రాహ్మణపూజ కావించిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి భీమోపాఖ్యానము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(దక్ష చరిత్ర)

తదుపరి మహారాజు వల్లభుడు బ్రాహ్మణులను, సాధువులను, దైవజ్ఞులను, వైదిక పండిత ప్రకాండులను, వైద్యులను రావించి, బహుమూల్య రత్నరాశులొసగి తన పుత్రునికి "దక్షుడు" అని నామకరణమొసంగి, ఆ పుత్రుని ఆరోగ్యవంతుని కావించుటకు వలయు ప్రయత్నములన్నియు కావించెను. అంతేకాక ఆయన సహితము కుమారుని ఆరోగ్యము కొరకు పన్నెండేడ్లు తపమాచరించెను. ఏమిచేసిననూ బాలుని యందు ఏవిధమయిన మార్పులేక రాజు నైరాశ్యము చెంది, పట్టలేని శోకము చే కృద్ధుడై తన భార్యను పిలచి "రాణీ! కమలా! నేను నిన్ను, నీ పుత్రుని ముఖము ఇక చూడలేను. మిమ్ము రాజ్యభహిష్కరణ కావించుచున్నాను," అని పలికి నిర్దయుడై వారిని భహిష్కరించెను. అంత చేయునది లేక రాణి తన పుత్రుని తీసికొని నగరము నుండి బయల్వెడలెను. వేరొక విధముగ బ్రతుకు గడువక ఆ బాలుని తీసికొని ఆమె బిక్షాటన చే జీవితము గడుప నారంభించెను. ఆమె వద్దనున్న బహుమూల్య వస్త్రాభరణములను దస్యులు దోచుకొనిరి. ఆమె తన కుమారునితో ఒక గ్రామము నుండి వేరొక గ్రామమునకు తిరుగుచూ, బిక్షాటనము కావించుచూ అతి దీనముగ బ్రతుకు వెళ్ళబుచ్చుచుండెను. ఒక్కొక్కనాడు తన పుత్రుని శివాలయమందు విడచి తాను ఒంటరిగా బిక్షాటనకు వెళ్ళెడిది. ఒక్కొక్కమారు పుత్రుని సహితము తీసికొని వెళ్ళెడిది. కాలము ఎప్పుడూ ఒకే విధముగ యుండదు. శ్రీగణేశుని లీలలు చిత్రము.

ఒకానొకనాడు కమల తన పుత్రుని సహితముగ మాధూకరము చేయచుండగా ఒక గణేశ భక్తుని శరీరమును స్పర్శించిన మలయ మారుతము ఆ బాలుని తాకుట చే ఆ గణేశభక్తుని అతిశయ పుణ్య ప్రభావమున దక్షునికి క్షణ పర్యంతము గణేశ దర్శనము కలిగి పిదప చూపు, మాట, శ్రవణము, కలిగి, శరీరము నందలి వ్రణములు నశించి చర్మము స్వచ్ఛమై దక్షుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యెను. దివ్యదేహుడయిన ఆ బాలుని సుమధుర సుఖప్రద వచనముల చే కమల దు:ఖమును మరచి ప్రసన్నురాలై ఈ విధముగ చింతించినది "జప, తపాదులకు, ఔషధ మంత్రాదులకు కొరుకుబడని దీర్ఘవ్యాధి ద్విజోత్తముని శరీర మారుత స్పర్శచే ఎట్లు నయమైనది? ఈ బాలుని పూర్వజన్మ పాపమును నశింపజేసిన ఆ మహాపురుషుని తిరిగి నేనెట్లు చూడగలను?" ఈ విధముగ తలంచుచు తన పుత్రుని గైకొని ముధూకర

వృత్తిని కొనసాగించుచుండెను. ఆ పట్టణమందలి నాగరికులు వారిని ఆదరించి రకరకముల పక్వాన్నములు, ఘృత, చక్కెరాదులను వారికి సమర్పించెడివారు. ఒకనాడు ఒక నాగరికుడు దక్షుని ఆతని పుట్టు పూర్వోత్తరముల గూర్చి ప్రశ్నించెను. అంత ఆ బాలుడు తన నామము దక్షుడనీ, తన తండ్రి కర్ణాటక దేశమందలి భానునగరాధిపతి వల్లభుడు యని, తన పూర్వ వృత్తాంతమును, ఒక దివ్య పురుషుని శరీర సంస్పర్శనము చే తాను స్వస్థుడనైన విధానమును గూర్చి సంపూర్ణముగ తెలియజేసెను. అది విని ఆ నాగరికుడు తిరిగి ప్రశ్నింపలేదు. కొన్నాళ్ళకు ఒక దయాళువైన ద్విజుడు ఆ తల్లీ కొడుకులకు గణేశ ఆరాధనా విధి మరియు మహా మహితాన్వితమైన గణేశ అష్టాక్షర మంత్రము నుపదేశించెను. వారిరువురు పరమశాంతులై, కేవల వాయు భక్షణ చేయుచూ, అష్టాక్షర మంత్రోపాసన కావించుచూ సమాధిస్థితులైరి. అంత కరుణామయుడయిన శ్రీగణేశ భగవానుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను.

ఆ పరమాత్ముడు చతుర్భుజుడు, మహాకాయుడు, కుంజరముఖుడు, పరమ సుందరుడు, కోటిసూర్య ప్రకాశుడు, స్వర్ణ, రత్న జటిత ముకుటధారుడు, అరుణారుణ వర్ణ పట్టువస్త్రధారి, బంగారు భుజకీర్తులు, అంగదములు, వేళ్ళకు మరకతాది మణి అంగుళీయకములు, నాగ యజ్ఞోపవీతుడు, ఏకందంతుడై, సర్వ శుభలక్షణ లక్షితుడై ఒప్పారుచుండెను. కమలా, దక్షులు ఆ స్వరూపమునకు అంజలి ఘటించిరి. అంత పరమాత్మ ఒక బ్రాహ్మణ రూపము ధరించి వారితో ఇట్లనియె "మీరిరువురి తపస్సుచే నేను ప్రసన్నుడనైతిని. మీ మనోవాంఛితమేమి? అంత దక్షుడు పరమ వినీతుడై ఇట్లనియె "మహాప్రభూ! మా పూర్వజన్మ పుణ్య విశేషముచే మీ ద్వివిధరూపములు మేము చూడగలిగిమితి. స్వామీ! మీరు వేదరూపులు. కారణమునకు సహితము కారణము. వేదముల ద్వారా భోదవ్యులు, సనాతనులు, పరబ్రహ్మ, సర్వసాక్షి, మరియు స్థావర జంగమాత్మకమయిన ఈ జగత్తు లోపల, వెలుపల విస్తరిల్లిన విశ్వశక్తి, సర్వకార్యకర్తా, ఏకరూపులు, నానారూపధారులు, మరియు రూపరహిత నిరాకారులు మీరే! త్రిమూర్తులు, దిక్పాలురు, పంచ భూతములు, గ్రహనక్షత్రాదులు, సూర్యచంద్రులు, సర్వులు మీ స్వరూపమే! సృష్టి, స్థితి, సంహారము కావించు మహాశక్తి మీరు మాత్రమే! జ్ఞాన విజ్ఞాన యుక్తులు, జగద్గురువులు, రక్షకులు, భూత భవిష్యత్ వర్తమానాది కాలములు, కళా, కాష్ఠా, ముహూర్తాది కాల స్వరూపములు, ఇంద్రియాదిష్ఠాతులైన దేవశక్తులు శ్రీ, ధృతి, కాంతిరూపులు, చాతుర్వర్ణములు, సాంఖ్యము, యోగము, వేదశాస్త్ర, పురాణేతిహాస, ఉపనిషత్తులు, ప్రమాణ, ప్రమేయములు, యోగుల జ్ఞానగమ్యులు, పదునాల్గు భువన భాండములు, సమస్త జీవకోట్లు, అరిషడ్వర్గములు, దయ, క్షమ, నిద్ర, హర్ష, విలాస శోకములు; ఇది అది అననేల? స్వామీ! సర్వము, సర్వులు మీరే! మీరే!! మీరే!!!"

ఈ స్థోత్రమును విని శ్రీగణేశ భగవానుడు ముదమునొంది మేఘగంభీర స్వరముతో ఇట్లనియె "ఓ! మహాభాగా! నీకు వరము నిచ్చుటకు నేను ఉత్కంఠుడనై యున్నాను. కానీ వరము నీయను. నీకు నా భక్తుడు, నీ స్వస్థతకు కారణ భూతుడయిన పుణ్యాత్ముడు, నిన్ను సర్వాంగసుందరునిగ తీర్చిదిద్దిన ధన్యజీవి వాంఛిత వరములిచ్చును. ఆతని నామము ముద్గలుడు. నీవు ఆయనను ధ్యానించినంత మాత్రమున ఆయన ప్రత్యక్షమై, దర్శనమొసగి నీ మనోవాంఛితములన్నింటినీ పూర్ణమొనర్చును" ఈ విధముగ పలికి శ్రీగణేశ భగవానుడు అంతర్ధానుడయ్యెను. అంత బాలుడయిన దక్షుడు ఖిన్నుడై, కంటికి మింటికి ఏకధారగా రోదించుట మొదలిడెను. పెన్నిధి దొరికిన పేద, ఆ ధనాభాండమును తిరిగి పోగొట్టుకొన్నచో ఎట్లు దు:ఖించునో, తన నుండి దూరమయిన దూడకై తల్లి ఆవు ఎట్లు ఆక్రందన కావించునో, ఆ విధముగ దక్షుడు పలుమార్లు "శ్రీగణేశుడెక్కడ? శ్రీగణేశుడెక్కడ" అని ఎలుగెత్తి ఘోషించుచూ దు:ఖాతురుడు అయ్యెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి దక్షచరితమను

ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(దక్ష ముద్గల సంవాదము)

ఈ విధముగ దక్షుడు విలపించుచూ, విహ్వలుడై, మతి భ్రమించినవాని వలె తిరుగుచు, ఎదురుపడిన మానవ, వృక్ష, పశుపక్ష్యాదులను శ్రీగణేశుని గూర్చి ప్రశ్నించుచూ కొంతసేపటికి అలసట చెంది మూర్ఛితుడై పడెను. అపుడు ఆతడు ఒక స్వప్నమును గాంచెను. ఆ స్వప్నమందు ఆతనికి ఒక బ్రాహ్మణ పుంగవుడు దర్శనమిచ్చి "బాలకా! నేను ముద్గలుడను. నీవు సిద్ధి వినాయకుని కోరిన కోరికలన్నియు అంతకుమున్నే నీకు ప్రసాదించితిని" అని పలికి అదృశ్యుడయ్యెను. దక్షుడు మెలకువ గాంచి, తన స్వప్నమును తలంచి, ఊరట చెంది, అక్కడగల బ్రాహ్మణోత్తములను ముద్గలమహర్షి యొక్క ఉనికిని గూర్చి ప్రశ్నించెను. అంత వారిలో ఒక బ్రాహ్మణుడు పరమ గణేశభక్తుడు, పుణ్యపురుషుడు అయిన ముద్గలుని ఆశ్రమమును దక్షునికి చూపించెను. బాలకుడయిన దక్షుడు మనసున ముద్గలుని విశేషముగ ధ్యానించుచూ, ఆ ఆశ్రమ ప్రవేశము కావించెను. ఆ ఆశ్రమము పరమాశ్చర్యయుక్తమై, అత్యంత రమణీయమై, అలకాపురి వద్ద గల నందనవనమును పోలి నానా పుష్ప, ఫల, వృక్షపరివృతమై యున్నది. ఆ వన మధ్యమున వేద వేదాంగ తత్వజ్ఞుడు, సర్వ శాస్త్ర పారంగతుడు, తేజస్వీ, యోగాభ్యాస బలము చే నానారూపధారణా సామర్థ్యము గల ముద్గల మహర్షి ఒక సుందరమైన ఆసనమున విరాజమానుడై యుండెను. ఆయన చతుర్భుజుడు, త్రినేత్రుడు, నానాభూషణ భూషితుడైన స్వర్ణ గణపతిని షోడశోపచారములతో పూజించుచుండెను. ఆ దృశ్యమును చూచి దక్షుడు ఆధారము లేని స్వర్ణదండము వలె నేలపైబడి, కన్నుల నీరు కారుచుండగా సాష్టాంగ దండ ప్రమాణములాచరించెను.

అంత ముద్గలుడు దక్షుని గాంచి "బాలకా! నీవు ఎవరు? ఎక్కడి నుండి ఏతెంచితివి? ఏల దు:ఖించుచున్నావు? కారణము తెలిపిన ఎడల తప్పక సహాయమొన్తును" అని పలికెను. అంత దక్షుడు ఆయనకు తన పూర్వ వృత్తాంత మంతటినీ తెలిపి, ఆయనను స్పర్శించిన మలయమారుతము తనను స్పర్శించుటచే తాను సంపూర్ణ స్వస్థుడగుట గూర్చి తెలియజేసెను. "స్వామీ! పూర్వకాలమున రాతిని నాతిగా చేసిన శ్రీరామచంద్రుని వలె మీ దయ చే నేను స్వస్థుడనైతిని. పై విషయములేవియును నాకు తెలియవు. నా తల్లి నాకావిషయములన్నియు తెలిపినది. అప్పటి నుండి మీ గూర్చి వెదకుచుండగా, తపము చే మాకు కరుణాసాగరుడయిన దేవేశ్వరుడు గణేశుని దర్శనము కలిగినది. ఆ దివ్య దర్శనముచే నా తల్లి కోరికలన్నియు తీరినవి. అంత గణేశుడు నాతో "పుత్రా! నీవు ఎవరి కోసము తపించుచున్నావో ఆ పరమభక్త శిఖామణి అయిన ముద్గలుని నేనే!" అని ఒక బ్రాహ్మణరూపము ధరించెను. అంత నేను హృదయమదు భక్తి ముప్పిరిగొనగా ఆయనను అనేక స్తోత్రములతో స్తుతించితిని. ఆయన ఆనందించి తిరిగి గణేశరూపము నొందెను. ఆ రూపము ఇట్లుండెను – చతుర్భుజుడు, మహాకాయుడు, స్వర్ణమణిఖచిత కిరీట శోభితుడు, నాలుగు హస్తములందు పరశువు, కమలము, మాలా, మోదకములు ధరించి, దివ్య వస్త్రధారుడై, ఏకదంతుడై, కుండలాలంకృతాంగుడై, మెలిదిరిగిన తొండము కలిగి, సర్పయజ్ఞోపవీతుడై, దివ్యభూషణ భూషితుడై శోభిల్లు చుండెను.

ఆయన రూపమును గాంచి, పూర్ణచంద్రోదయమున ఘూర్ణిల్లు సాగరము వలె నా మనసు ఆనంద సాగర తరంగములందు ఓలలాడినది. అంత గణేశ భగవానుడు "దక్షా! నీ మనోకామనలు అన్నియు ముద్గలుడు పూర్ణమొనర్చును" అని ఆ మహాత్ముడు అంతర్ధానుడయ్యెను. నేను పూర్ణముగ ఆయన రూపమును కన్నులారా కాంచలేదు. అందువలన నేను ఖిన్నుడనై, దు:ఖభరితుడనై, మూర్ఛితుడనైతిని. ఆ స్థితి నుండి మెలకువందిన పిదప నాకు లీలగా గణేశుడు నన్ను వరములు కొరుకొమ్మనినట్లు నేను "ప్రభూ! నా గృహమందు లక్ష్మీదేవి ఎల్లప్పుడూ స్థిరముగ యుండవలెను. అట్లే నా

మనసు నుందు నీ ఎడ అవ్యభిచార భక్తి సుస్థిరముగ యుండవలెను," అని ఈ రెండు వరములు కోరినట్లు, అంత ఆకాశవాణి ఆ వరములు నాకు ప్రసాదించినట్లు అనిపించినది. అంత నేను ప్రసన్నచిత్తుడనై మీకడకు ఏతెంచితిని. స్వామీ! ఎవరు ముద్గలుడో ఆయనే గజాననుడు. ఎవరు గజాననుడో ఆయనే ముద్గలుడు. అంతేకాదు, నాకు స్పష్టముగ తెలిసిన దేమన సర్వము శ్రీగణేశుడే!!"

ఇది అంతయు వినిన ముద్గలుడు ఇట్లనియె "ఓ! కమలపుత్రా! నీవు పరమభక్తుడవు, భాగ్యశాలివి, మరియు కృతకృత్యుడవు. నీ భక్తి యొక్క మహిమను వర్ణించుట అసాధ్యము. నేను వేయి సంవత్సరముల నుండి కఠోర తపమాచరించుచున్నాను. కానీ నేను ఆ మహాప్రభువును దర్శించు అదృష్టమునకు నోచలేదు. నీవు జగద్గురువు, జగత్తుకు స్వామి, త్రిగుణాతీతుడు, త్రిగుణముల చేతనే తెలియువాడు, త్రిమూర్తుల సహిత చరాచర ప్రాణికోట్లను ఉత్పత్తి చేయువాడు, మహత్తత్వము, అహంకారము, బుద్ధి, మనస్సు, పంచభూత, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ కర్త, దేవ, ఋషి, వేదములు సహితము ఎవరిని పూర్ణముగ తెలియరో, ఆ గణేశుని దర్శనమును నీవు గాంచితివి. నీవు పరమభక్తుడవయిన కారణమున నేను నీ చరణములకు వందనములర్పించుచున్నాను." అటు పిదప వారిరువురు పరస్పరము వందనములిడుకొని గాఢాలింగితులైరి. అంత దక్షుడు కొంతకాలము ఆ ముని ఆశ్రమమున ముద్గలుని వద్దనే యుండిపోయెను. ఒకానొక సుముహూర్తమున ముద్గలుడు వినమ్రుడు, రాజపుత్రుడయిన దక్షునకు మహితాన్వితమయిన ఏకాక్షర గణేశ మహామంత్రము **(గం)** ను ఉపదేశించి దాని ధ్యానవిధులను, పురశ్చరణాది కర్తవ్యములను తెలిపి ఇట్లనియె "రాజపుత్రా! నీవు ప్రతిదినము ఈ మంత్రమును జపానుష్ఠానములు కావించుట చే శ్రీగణేశుడు నీ యందు ప్రసన్నుడై, నీ సర్వకామనలు పూర్ణమొనర్చును. ఒకవేళ ఈ మంత్రానుష్ఠానమును నీవు విస్మరించిన ఎడల నీవు సర్వత్రా నష్టపోయెదవు. ఎంతకాలము నీవు ఈ గణేశ మంత్రానుష్ఠానమును కావించెదవో, అంతకాలము ఇంద్రాది లోకపాలురందరూ నీ వశీభూతులై యుందురు. అంతేకాక నీవు ఇహలోక సుఖములన్నియుబడసి, పరమున మోక్షము నొందెదవు."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి దక్షముద్గల సంవాదమను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(దక్షుని పూర్వజన్మ వృత్తాంతము)

భీమ మహారాజు విశ్వామిత్రుని ఈ విధముగ ప్రశ్నించెను "మహర్షీ! ఈ కమలా పుత్రుడు దక్షుని చరిత్రము మహాశ్చర్యము. ఈ ఆఖ్యానమునందు నాకు కొన్ని ప్రశ్నలు తలెత్తుచున్నవి. అంధుడు, బధిరుడు, మూగజీవి, కుబ్జుడు, శరీర మంతయు వ్రణములు గల దక్షుడు ముద్గలుని శరీరమారుత స్పర్శచే స్వస్థుడయ్యెను కదా! ఏ పాపము చే ఆతడు రోగగ్రస్థుడయ్యెను? ఏ పుణ్యముచే ఆతడు తిరిగి సంపూర్ణ ఆరోగ్యమును సంతరించుకొనెను? ముద్గలుడు వెయ్యేండ్లు తపమాచరించినప్పటికీ ఆతనికి తన ఇష్టదైవమైన వినాయకుని దర్శనము ఎందుకు కలుగలేదు? వల్లభపుత్రుడు, రాకుమారుడు దక్షుడు అంత సునాయాసముగ దేవేశ్వరుడైన శ్రీగణేశుని ఎట్లు దర్శింపగలిగెను? పూర్వ జన్మమందు ఈ దక్షుడెవరు? ఓ! సర్వజ్ఞాతా! ఈ సందేశము నివృత్తి పరచుటకు మీరే సమర్థులు. నాకు గణేశ పురాణామృతపాన పిపాస తీరుటలేదు. దయచేసి తెలుపవసినది." అంత విశ్వామిత్రుడు "మహారాజా! మంచి సందేహ మడిగితివి. తప్పక నీకు ఆ కథామృతమును వినిపించెదను. ఏకాగ్రచిత్తుడవై వినుము. సింధుదేశము నందు "పల్లి" అను పురము కలదు. అందు

“కళ్యాణుడు” అను అత్యంత ధనికుడైన వైశ్యుడుండెడువాడు. ఆయన గొప్ప బుద్ధికుశలుడు, వ్యవహార చతురుడు, దానశీలి, సుర భూసుర సేవా తత్పరుడు. ఆయన ధర్మపత్ని “ఇందుమతి”. ఆమె పద్మముఖి మరియు పతివ్రత. చాల కాలమునకు వారికి ఉత్తముడు, గుణవంతుడయిన పుత్రుడు కలిగెను. కళ్యాణుడు ఆ సమయమున బ్రాహ్మణులకు అనేక గోవులు, వస్త్రభూషణములు, సువర్ణ రత్నాదికములు దానమొనర్చి ఆ బాలకునికి జాతకర్మాది సంస్కారములు కావించి ఈతడు అమిత బలాఢ్యుడగునని ఆ బాలకునకు “భల్లాళుడు” అని నామరణ మొనర్చెను. పూర్వపుణ్యవశమున భల్లాళునికి బాల్యమందే అమితమైన దైవభక్తి అబ్బినది. ఆతడు తన మిత్రులతో కలసి ఆటలందు గ్రామము వెలుపలికేగి దైవపూజ యందు నిమగ్నమయ్యెడివాడు.

ఈ విధముగ కాలము గడుచుచుండగా ఒకనాడు ఒక చిత్రము జరిగినది. ఒకనాడు యధావిధిగా బాలురందరూ గ్రామము వెలుపలి వనమున కరిగి, ఒక సుందర పాషాణమును గణేశమూర్తిగానెంచి, దానిని శుభ్రపరిచి, సింధూరమలది, ఆ మూర్తికి దూర్వాంకురములు, మరియు సుకోమల పత్రములతో పూజనమొనరించిరి. కొందరు బాలురు ఆ వనమందు లభ్యమయిన కలపతో శ్రీగణేశునికి చిరుమందిరము నిర్మించిరి. కొందరు బాలురు భజన చేయగా, మరికొందరు నృత్యము గావించిరి. కొందరు పవిత్రాఖ్యానములను నుడివిరి. కొందరు ప్రసాదమును వడ్డించిరి. కొందరు ధర్మశాస్త్రములను వ్యాఖ్యానించిరి. ఈ విధముగ ఆ బాలురందరూ శ్రీగణేశపూజనమందు తమను తాము మరచి క్షుధాపిపాసల విస్మరించిరి. ఈ బాలురను కాంచిన వారి తల్లిదండ్రులకు వీరి చర్యలు రుచింపక, వారందరూ ఏకమై వారు భల్లాళుని తండ్రి అయిన కళ్యాణుని వద్దకొచ్చి ఇట్లనిరి “ఓ! శ్రేష్ఠీ! నీ పుత్రుడు పురమందలి బాలురందరినీ చెరచుచున్నాడు. ఈ బాలురు దివారాత్రములు నీ పుత్రుని తో కలసి పూజలు చేయుచూ, ఏమియును తినక కృశించుచున్నారు. నీవు నీ పుత్రునికి బుద్ధి గరపవలసినది. లేనిఎడల మేమే అతనిని బంధించి, తీవ్రముగ దండనమొనర్చి, పురభహిష్కరణ గావింతుము.” ఎన్నడునూ వినని శూలముల వంటి ఈ వ్యాఖ్యలను విని కళ్యాణుడు అగ్రహోదగ్రుడు అయ్యెను. ఆతడు మిగిలిన పురవాసులకు సర్దిచెప్పి, వారిని స్వాంతన పరచి పంపించెను.

అంత కళ్యాణుడు వెనుకముందులాలోచింపక క్రోధతామ్రాక్షుడై, దురాత్ముడై, హుటాహుటిన వనమునకరిగి, ఒక దండము చేతబూని భల్లాళుని తీవ్రముగ మోదెను. ఆ బాలురచే నిర్మింపబడిన గణేశమందిరమును ధ్వంసమొనర్చి, శ్రీగణేశమూర్తిని విసరివైచెను. ద్వితీయకాలుని వలె భాసించుచున్న కళ్యాణుని కాంచి, మిగిలిన బాలురందరూ దశదిశలకు పరుగులెత్తిరి. కానీ బల్లాళుడు మాత్రము శ్రీగణేశభక్తియందు సుస్థిరుడై, కదలక నిశ్చలుడై కూర్చుండెను. అంత కళ్యాణుడు ఒక చేతితో భల్లాళుని బలముగ పట్టి, దండముతో ఒడలంతయు రక్తస్రావమగునట్లుమోదెను. వర్షాకాలమందు పర్వతము నుండి ప్రవహించు జలధారలవలె భల్లాళుని శరీరము నుండి రక్తము స్రవింపసాగెను. అయిననూ కళ్యాణుడు పాషాణ హృదయుడై, భల్లాళుని ఎడ పుత్రప్రేమను సంపూర్ణముగ విడనాడి, ఆతనిని దగ్గరయున్న దృఢ లతలచే కాలు చేతులాడనటుల బంధించి, హేళనగా ఇట్లనియె “దుష్టుడా! ఇక నిన్ను నీ భగవానుడయిన గణేశుడు విడిపించి భోజన పానీయాదులతో నిన్ను తృప్తి యొనర్చి రక్షించును. నీవు తిరిగి గృహమున కేతెంచి నా కనుల పడితివేని, నిన్ను అవశ్యము సంహరింతును” అని పలికి అచటి నుండి వెడలెను.

మాయ ఎంతటి వారనైననూ భ్రమింపజేయును. భక్తి ఎంతటి క్లిష్ఠ పరిస్థితుల నుండి యైననూ రక్షించును. అంత వైశ్యపుత్రుడు భల్లాళుడు శోకాకులుడై ఇట్లు తలంచెను “శ్రీగణేశుడు విఘ్నశత్రుడు కదా! శేషుడు తన ఫణముల యందలి ధరిత్రిని, సూర్యుడు తన దీప్తిని, చంద్రుడు తన అమృతవర్షమును, అగ్ని తన ఉష్ణతను త్యజింపవచ్చు. కానీ విఘ్నేశ్వరుడు తన భక్తులను ఎన్నడునూ త్యజింపడని వేదశాస్త్ర పురాణములు ఘోషించుచున్నవి. మరి నన్ను ఆ భగవానుడు విడనాడుటకు కారణమేమి? ఈ విధముగ రోదించుచూ వినాయకాలయమును ధ్వంసమొనర్చిన తన తండ్రి ఎడల

తీవ్రవ్యగ్రత కలిగి ఇట్లు శపించెను". "నాకు వినాయకుని యందు ధృఢభక్తి యుండెనేని, వినాయకమూర్తిని విసరివైచిన ధూర్తుడయిన నా తండ్రి నిశ్చయముగ అంధుడు, బధిరుడు, కుబ్జుడు, మూగి, శరీరమంతయు వ్రణయుతుడు అగుగాక! నా తండ్రి కేవలము నా శరీరమును మాత్రమే బంధించగలిగెను. కానీ శ్రీగణేశభగవానుని ఎడల నా భక్తిని ఎవరూ ఆపలేరు. ఈ శరీరమును నేను ఏనాడో ఆ గణపతికి అర్పించితిని. నేను అనన్య భక్తి చే శ్రీగణేశుని చింతించుచూ ఇచటనే దేహత్యాగము కావింతును." ఈ నిశ్చల భక్తికి కరిగిన శ్రీగణేశుడు ఒక బ్రాహ్మణ రూపు దాల్చి అచటికేతెంచెను. సహస్రకోటి కిరణుడయిన సూర్య భగవానుడు ఉదయాచలమందు కనిపించగనే అంధకారము పటాపంచలైనట్లు, శ్రీగణేశుని తేజోరాశి చే భల్లాళుని శృంఖలములు తెగిపడినవి. ఆతని రక్తసిక్త శరీరము సుందరమై, వ్రణములు మాయమై, బడలిక అంతయు నశించి, నిర్మలజ్ఞానము ప్రాప్తించినది.

అంత భల్లాళుడు శ్రీగణేశుని ఈ విధముగ కీర్తించెను "మహాప్రభూ! మీరే నా తల్లి, తండ్రి, బాంధవాది సర్వము. స్వామీ! సత్పురుషులు, దుష్టులు, ఖలులు వీరందరినీ పుట్టించునది, నానా యోనులందు ప్రవేశపెట్టునది నీవే! ఆకాశము, భూమి, సముద్రములు, హిమాలయాది పర్వతములు, దిశలు, కాలము, అగ్ని, వాయువు, సూర్యచంద్ర నక్షత్రాదులు, గ్రహ, ఇంద్రాది లోకపాలురు, ధాతువులు, ఔషధములు, చాతుర్వర్ణములు, పంచతన్మాత్రలు, ఇంద్రియోపభోగములు, సర్వము నీవే!" శ్రీగణేశుడు ఈ స్తుతికి సంతసిల్లి "వత్సా! నా ప్రాసాదమును భగ్నము కావించిన దుర్మతి తప్పక నరకగామి అగును. నీచే ఈయబడిన శాపము నా ఆజ్ఞానుసారముగ నీ తండ్రి అనుభవించును. అతడు అంధుడు, బధిరుడు, కుబ్జుడు, మూగి అయి, శరీరమంతయు వ్రణయుతుడై తన తండ్రిచే తన మాతా సహితముగ భహిష్కరింపబడును. ఇక నీ అన్య కామనలేమి? అవి ఎంతటి క్లిష్టతరములైననూ వాటిని నీకు ప్రసాదించెదను". అంత భల్లాళుడు "ప్రభూ! మీరు నా యందు ప్రసన్నులైన ఎడల మీరు ఎల్లప్పుడూ ఈ క్షేత్రమందు యుండి భక్తులను విఘ్నముల నుండి రక్షింపవలసినది." అంత శ్రీగణేశుడు "తథాస్తు. ఇక్కడి ప్రజలు ముందు నీ పేరు పలికి తదుపరి నా శుభనామమును పలికెదరు. ఇచట నేను భల్లాళ వినాయకునిగ సంప్రతిష్ఠుడ నగుదును. నీ మనస్సు నా యందు స్థిరముగ కేంద్రీకృతమై, నీవు నా అనన్య భక్తుడవగుదువు. ఈ "పల్లి" నగరమందు ఎవరు భాద్రపద శుక్ల చవితి కి నా యాత్ర గావింతురో, నేను వారి మనోకామనలన్నింటినీ పూర్ణ మొనరింతును." ఈ విధముగ పలికి శ్రీగణేశుడు అచటనే అంతర్ధానుడయ్యెను. అంత భల్లాళుడు అచట గల బ్రాహ్మణోత్తములతో కూడి అక్కడే శ్రీగణేశ భగవానుని ప్రతిష్ఠించెను. విశ్వామిత్రుడు "రాజా! నీకు నేను భల్లాళ వినాయకుని ఆఖ్యానమును వినిపించితిని. ఎవరు ఈ ఆఖ్యానమును భక్తి, శ్రద్ధలతో శ్రవణము కావించెదరో వారు తమ మనోకామనలను పూర్ణమొనరించుకొని తుదకు ముక్తులగుదురు.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి దక్షుని పూర్వజన్మ వృత్తాంతమను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువదిమూడవ అధ్యాయము

(ఇందుమతీదేవి శోకము)

సోమకాంత మహారాజు "మహర్షీ! దక్షుడు అతిమానస ధృతియుతుడు. అటు పిదప కళ్యాణుడేమైయ్యెను? దయచేసి తెలుపవలసినది." భృగు మహర్షి "భీమ మహారాజు విశ్వామిత్రుని సహితము ఇదే ప్రశ్నించెను. అంత విశ్వామిత్రుడు "భల్లాళుని ద్వారా శాపగ్రస్థుడైన కళ్యాణుడు అతి కొలది దినములలోనే అంధుడు, బధిరుడు, మూగియై, ఒడలంతా

వ్రణములు పొడసూప మిక్కిలి రోగగ్రస్థుడు అయ్యెను. అంత ఆతని ధర్మపత్ని ఇందుమతి ఇట్లు చింతించెను “ఈయన మిక్కిలి దేవభూసుర సేవా సంపన్నుడు, ధర్మశాస్త్ర కుశలుడు, ఏకపత్నీ వ్రతుడు, నిష్పాపి మరియు జ్ఞాని. ఇటువంటి ధర్మాత్మునికి ఈ పీడ ఎట్లు కలిగెను?” అని తర్కించుచుండగా, ఇతరుల వలన తన పతి తన సుతుని ఎడ గావించిన అత్యాచారము గూర్చి విని వెంతనే ఆమె వనమున కరిగెను. అచట సుందరమయిన శ్రీగణేశాలయమును, చతుర్భుజుడు, త్రినేత్రుడు, సింధూరవర్ణ లేపితుడయిన వినాయకుని, ఆయనకు మిక్కిలి శ్రద్ధగా పూజలు గావించుచున్న భల్లాళుని గాంచెను. ఆమె నగరవాసుల ఎడల అత్యంత కోపోద్రిక్తయై “ నా భర్తకు మిధ్యావాక్యములు తెలిపి, మా కుటుంబమును ఈ స్థితికి ఈడ్చిన దుష్టులెవరు? నా పుత్రుడు పరమభక్తుడై శ్రీగణేశునికి పూజనము ఒనర్చుచున్నాడు. నా భర్త అత్యంత దీన స్థితిలో దుర్భర బాధను అనుభవించుచున్నాడు. నగరవాసులందరూ నివ్వెరపోయి, భయము చే నోటమాట పలుకరైరి. అంత ఒకరిద్దరు ధైర్యము బూని “శ్రీగణేశుని మహాభక్తుల మహిమలు ఎవరు తెలిసికొనగలరు?” అని పలికిరి.

అంత ఇందుమతి రక్తచందన లేపితుడై, అరుణారుణ వస్త్రము దాల్చి, ఎఱ్ఱని పుష్పమాల ధరించి, మాయా మోహాహంకార రహితుడైన తన పుత్రుడు భల్లాళుని గాంచి, ముదమునొంది, గాఢ పరిష్వంగమొనర్చి, ముద్దాడి ఇట్లనియె “పుత్రా! మనము మన గృహమున కేగుదుము. మీ తండ్రి మహా విపత్తుయందున్నాడు. మీ తండ్రి నీ యందు కావించిన అనుచిత కార్యము అంతయు కేవలము పుత్రప్రేమతో మాత్రమే! నీ వల్లనే నీ తండ్రి శ్లాఘనీయుడయ్యెను. యశశ్వి అయిన పుత్రుడు మాతృపితృభక్తి పరాయణుడై, వారి ఆలనా, పాలనా చూడవలెను. అందువలన నీ తండ్రిని స్వస్థుని గావించుటకై వలయు ఔషధ, మంత్ర, ప్రార్ధనాదులందు ఏది ఆవశ్యకమో, అద్దానిని నీవు కావింపవలసినది. నా పలుకులు ఆలకించి, ఆచరించిన ఎడల నీకు యశము కల్గును.” అంత భల్లాళుడు “ఎవరు ఎవరికి తల్లి, తండ్రి, తనయుడు? ఇవన్నియు విఘ్నరాజు అనుసంగికముగ ఏర్పరచెను. నా తల్లి, తండ్రి శ్రీగణేశుడే! నా తను, మాన, ప్రాణములు శ్రీగణేశుని కర్పించితిని. అందువల్ల ఆయన సంప్రీతుడై నాకు సద్భక్తినీ, సద్బుద్ధినీ ప్రసాదించెను. ఎవరు ఏ విధమయిన కర్మమాచరించెదరో, వారు ఆ విధమయిన ఫలములు పొందెదరు. ఓ! శుభముఖీ! నీ భర్త గణేశ దేవాలయ ధ్వంసము గావించి, శ్రీగణేశుని ప్రతిమను విసరివైచి, వినాయకుని పరమ భక్తుడనైన నన్ను హింసించిన కారణమున ఆ స్థితిని ప్రాప్తించెను. సూక్ష్మబుద్ధి తో విచారించిన నీవు, కళ్యాణుడు నా మాతాపితరులు కాదు. కేవలము శ్రీగణేశుడే సర్వులకు పూజ్యుడయిన మాతాపితరులు. జ్ఞానదాత, సర్వజగద్రక్షకుడు, సంహారకుడు, కాలస్వరూపుడు, త్రిమూర్తుల సహిత సర్వ దేవతానీకము సహితము ఆయనే! దురభిమాని, దుష్టుడు, పతితుడు, నిర్దయుడు, శ్రీగణేశ విముఖుడైన నీ భర్త ముఖము చూచుట కూడా మహాపాపము. తల్లీ! నీవు నా ఎడ ప్రేమను, వివశత్వమును వీడి, నీ పతిసేవ కావింపవలసినది.”

అంత ఇందుమతి “నాయనా! నీవు కృపాపూర్ణుడవు, అనుగ్రహదాతవు; అందువల్ల నీ తండ్రి ఎడల ప్రేమనుగొని ఆయనను రోగవిముక్తుని గావింపుము.” అంత భల్లాళుడు “ఓ! సువ్రతా! నీవు ప్రాధేయపడుచుంటివి గావున నీకు వరమొసంగి భవిష్యత్‌ను తెలుపుచున్నాను. మరుజన్మము నందు నీవు కమల అను నామముతో పుట్టి వల్లభుడు అను రాజునకు పత్నివగుదువు. అపుడు ఈ కళ్యాణుడు ఈ విధముగనే రోగగ్రస్థుడై నీకు పుత్రునిగ దక్ష నామమున కలుగును. రాజు సర్వకర్మలు కావించి, పన్నెండేండ్లు తపము సహితము గావించి, ఈ పుత్రునికి నయమవ్వక, మీరిరువురినీ దేశ భహిష్కరణము గావించును. అటుపిదప దైవేచ్ఛ చే శ్రీగణేశభక్తుని శరీర మలయ మారుత స్పర్శచే నీ పుత్రునికి స్వస్థత కలిగి, శ్రీగణేశ దర్శనమగును. నీకు శాప విముక్తి, భవిష్యత్ జన్మ రహస్యములు సహితము తెలిపితిని. ఇక నీవు ఇచ్చుకు వచ్చి చోటికి వెడలవచ్చు,” అని మౌనము వహించెను. అంత ఇందుమతి ఇంచుక హర్షము, మిక్కిలి శోకము కలిగి

నిష్క్రమించెను. కొంత కాలమునకు భల్లాళుని భక్తి పరిపక్వమయిన పిదప శ్రీగణేశుని చే పంపబడిన దివ్యవిమాన మధిరోహించి స్వర్గమున కేగెను. ఇందుమతి, కళ్యాణులు భల్లాళుడు తెలిపిన విధముగ మరుసటి జన్మము నొందిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి ఇందుమతీ శోకమను ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(దక్షుని స్వప్నము)

భీమ మహారాజు "ఓ! మునిశ్రేష్ఠా! బుద్ధిమంతుడయిన దక్షుడు మంత్రమును గ్రహించిన పిదప శ్రీగణేశానుష్ఠానము ఎక్కడ, ఎట్లు గావించెను? తదుపరి విశేషములన్నియు విస్తారముగ తెలుపవలసినది." విశ్వామిత్రుడు "రాజా! కౌండిన్య పురమునకు నికటముననే ఒక మహాటవి కలదు. అందు ఎన్నో క్రూరమృగములు, వనపక్షులు, అనేక విధములయిన వృక్షములు, సత్పురుషుల హృదయముల వంటి స్వచ్ఛమయిన నీటితో నిండిన జలాశయములు, కలవు. ఆ వనమధ్యమున ఒక శిథిలమైన గణేశాలయము యున్నది. దక్షుడు ముద్గలుని వద్దనుండి ఏకాక్షర మంత్రోపదేశమునొంది పిదప ఈ దేవాలయము చేరి మంత్ర, తపో, జపానుష్ఠానము పన్నెండేండ్లు కావించెను. ప్రతిదినము ఆ శ్రీగణేశమూర్తికి స్నానమొనరించి, సుగంధభరిత చందనమలది, పుష్పమాలాలంకృతుని గావించి, ధూప దీపములర్పించి, కందమూలాది ఫలములను నైవేద్యమొనర్చి, దక్షిణను మానసికముగ అర్పించెడివాడు. ఒకనాడు ప్రాత:కాలమున ఆతడొక స్వప్నమును గాంచెను. అందు ఒక హిమాలయ శృంగ సన్నిభమయిన గజరాజము సింధూరముతో పత్రరచన చేయబడి, కపోలములనుండి మదజలము స్రవించుచుండగా, విశాలమయిన కాయము, పొడవైన తొండము, తెల్లని దంతములు కలిగి నెమ్మదిగ నడచుచూ ఏతెంచి, దక్షుని కంఠమున ఒక రత్నహారమును వైచి, ఆతనిని తన తొండముతో పట్టి, తన శిరముపై నుంచుకొని, ధ్వజపతాకయుక్తమయిన ఒక నగరములోనికి తీసుకొని వెళ్ళెను. అంత దక్షునికి చటుక్కున మెలకువ వచ్చి కూర్చొనెను.

ఆ ఉదయము దక్షుడు తన తల్లివద్దకేగి తన స్వప్న వృత్తాంతమంతయు ఎరింగించి, అద్దాని మర్మము గూర్చి ప్రశ్నించెను. అంత కమల "కుమారా! నీవు ధన్యుడవు. నీకు స్వప్నమందు గోచరించినది కేవలము శ్రీగణేశుడే! స్వప్నమందు గజారోహణము రాజ్యప్రాప్తిని సూచించును. ఇందు సందియము లేదు." అంత దక్షుడు "మాతా! నాకు రాజ్యప్రాప్తి కలిగెనేని నేను నీకు నరయానము (పల్లకీ సేవ), అనేక గ్రామములు, నవరత్నఖచిత స్వర్ణ, వైఢూర్యములు సమర్పించెను. నేను నిరంతరము ధర్మాచరణము చేయుచూ గోదానము మొదలగు దశదానములు కావించుచూ, వ్రత నియమాదులు ఆచరించుచూ, ధర్మపరముగ జీవింతును." అంత కమల అత్యంత ప్రసన్నురాలై ఇట్లనియె "నాయనా! నీవు రాజువగుట నాకు అత్యంత ఆనందప్రదము. అట్లే నీవు సత్పురుషుడవు, సద్గుణ సంపన్నుడవు, బలశాలివి కావలెను. నీ చిత్తము ఎల్లప్పుడూ సత్య ధర్మముల యందు చరించుగాక! నీవు దీర్ఘాయుష్మంతుడవై, దేవ భూసుర పూజనమందు నీకు అత్యంత అనురక్తి కలుగుగాక!"

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి దక్షుని స్వప్నమను ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఇరువది అయిదవ అధ్యాయము

(చంద్రసేన మహారాజు మరణము)

శ్రీగణేశుని లీలలు ఆశ్చర్యజనకము. ఆ కౌండిన్య నగరమును చంద్రసేనుడను రాజు పరిపాలించుచుండెను. ఆయన బుద్ధిమంతుడు మరియు ధర్మశాస్త్ర పారంగతుడు. కాలము తీరి ఆయన అకస్మాత్తుగ పంచత్వము నొందెను. తాను చేసిన పుణ్యకార్యాచరణము చే ఆ మహారాజు దేవవిమాన మధిరోహించి స్వర్గమున కేగెను. పిడుగుపాటు వంటి ఈ వార్త విని నాగరికులు, ఆ రాజ్య ప్రజలు మిక్కిలి వ్యధనొంది రాజ భవనమునకు పరుగులు తీసిరి. కొంతమంది ఆయన పాదములను, కొంతమంది ఆయన చేతులను పట్టి వెక్కివెక్కి ఏడ్చుట నారంభించిరి. మరికొంతమంది మూర్ఛితులైరి. మహారాణి సుమన లజ్జారహితయై, గుండెలు బాదుకొనుచూ "హే! నాథా! స్వామీ! నన్ను విడచి ఎక్కడికేగిరి? ఈ విధాత ఎంతటి క్రూరుడు? తొలుత ఇరువురు ప్రాణులను ప్రేమతో ముడిపెట్టి వారి మనోరధములు పూర్ణమవకముందే వారిని విడదీయును. నా ప్రాణనాథా! ప్రతిదినము మీరు నాతో "ప్రియా! నేను సింహాసనమధిష్ఠించుటకు ఏగుచున్నాను." అని పలికెడివారు. ఈనాడు ఒక పలుకు సహితము పలుకుట లేదు. నేను కావించిన అపరాధమేమి? నేను పుత్రహీనను. నేడు పతిహీననైతిని. నా జీవితము శూన్యమయినది" అని దు:ఖించుచుండెను. ఆ మహారాజు యొక్క ఇరువురు సచివులు సమంతువు, మనోరంజనుడనువారు ఏతెంచి "మహారాజా! ప్రతిదినము మా ఇరువురితో సంప్రదించి సర్వ కార్య నిర్వహణము కావించు మీరు, ఈనాడు మమ్ము సంప్రదించక మమ్ములను ఎట్లు అనాథలను గావించి వెడలిపోయిరి. మేము సహితము మీతో పరలోక యాత్ర గావించెదము. ఇపుడు ఈ దేశమును రక్షించునాధుడెవరు?"

ఈ విధముగ సర్వులు కర్తవ్య విమూఢులై, విహ్వలులై విలపించుచుండగా అచటకు కొంతమంది మునులేతెంచి ఈ విధముగ సమయోచితమైన కఠోర సత్యములు పలికిరి "మీరందరూ స్వార్థపరులు. మీలో ఒక్కరు ఆప్తులైనవారు ఈ మహారాజుకు లేరు. ఉండిన ఎడల మీరు ఈ విధముగ కర్తవ్య విమూఢులై శోకింపరు. ఈ విధముగ రోదించు మిత్ర, బాంధవ, సుహృదుల భాష్పములు మృతునకు తీవ్రవ్యధ కలిగించును. ప్రాణహీనుని శరీరభాగమును పృధివి వోపలేదు. ఈ సమస్త బ్రహ్మాండమందు మృతులతో పాటు వేరొకరు ఏగిన ఘటన ఏదైనా యున్నదా? సూర్య, చంద్రాది వంశముల యందు మృతిచెందిన రాజులు లేరా? ఈ రాణి తన జీవితము గూర్చి రోదించుచున్నది. పతివ్రత అయిన ఏ స్త్రీ కూడా రోదింపక, ఆయనను అనుగమించు ప్రక్రియ గూర్చి ఆలోచించును. మీ నాగరికులందరూ తిరిగి మీమీ కార్యములందు సంలగ్నులగుటకు ఆతురులైయున్నారు. ఎవరు మృతులకు అంత్యేష్ఠి సంస్కారములు చేయుదురో వారు మాత్రమే మృతులకు ఆప్తులు. ఈ అంత్యేష్ఠి సంస్కారముల కొరకే లోకమందు పుత్రులను వాంఛించెదరు. ఈ కార్యము సాధారణముగ ధర్మపుత్రుడు గావింపవలెను. లేని ఎడల ఇతర పుత్ర సంతతి కూడా చేయదగును. వారునూ లేని ఎడల ఎవరేని పుణ్య పురుషుడు అంత్యేష్ఠి సంస్కారములు ఆచరించి, మిగిలిన వారందరూ తిలాంజలి సమర్పింపవలెను." అంత ఆ మునుల సమయోచితమైన పలుకులను సర్వులూ అంగీకరించిరి. సుమంతువు అను అమాత్యుడు ఔర్ధ్వదైహిక కర్మములన్నియు సలిపి, నాగరికులందరూ అతి విలంబమున స్మశానవాటిక నుండి నగరమున కేతెంచి, ఈశ్వరునకు నమస్కృతులర్పించి, పిచుమందము (వేప) ఆకులు నమిలి, మహారాణికి స్వాంతన పలికి, వారి వారి గృహములకు అరిగిరి.

పన్నెండు దినముల అనంతరము సపిండీకరణము ఆచరించి, పదమూడవరోజు భోజన సమారాధన కావించిరి. ఒకానొక దినము అమాత్యులు, రాజ సభాసదులు, ముఖ్యులైన నాగరికులు చేరి తదుపరి రాజు ఎవరు అన్న ముఖ్యాంశమును చర్చించిరి. ఆ సమయమున మహానుభావుడు, శ్రీగణేశ ప్రియభక్తుడు అయిన ముద్గల మహర్షి అచటికేతెంచెను.

ఆయనను చూచి, సర్వులు లేచి, నిలబడి, సాంజలి బంధకముగ పాదాభివందనము ఆచరించిరి. అంత ముద్గలమహర్షి "మహారాజు యొక్క సమస్త అభిప్రాయములు ఆయన రాజకుంజరము (పట్టపుటేనుగు) నకు ఎరుకపడును. అందువలన "గహనము" అనెడు రాజ కుంజరమునకు పుష్పమాలనిచ్చి, ఆ కుంజరము ఎవని మెడలో ఆ మాలను వేయునో ఆతడే రాజగును" అని వాక్రుచ్చెను. అతీంద్రియ జ్ఞాన సంపన్నుడగు ముద్గల మహర్షి పలుకులను సర్వులూ అంగీకరించిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి చంద్రసేన మహారాజు మరణమను ఇరువది ఐదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఆరవ అధ్యాయము

(దక్షుని రాజ్యప్రాప్తి)

ఒకానొక శుభదినము, వారము, లగ్నము కుదిరిన ఉత్తమ ఫలప్రదమయిన రోజున ప్రజానీకము, నాగరికులు, నగర ప్రముఖులు, అమాత్యులు, రాజపరివారము, కలసి విభిన్న ధాతువులతో అలంకృతమయిన గహనమునకు రాజ పురోహితుడు మంత్రానుష్ఠానము కావించుచుండగా, మహారాణి సుమన ఒక రత్నహారమునిచ్చి, భావి మహారాజు మెడలో ఆ హారమును అలంకరింపమని ఆజ్ఞాపించెను. అంత ఆ రాజకుంజరము మహారాణి యొక్క ఆజ్ఞను ఔదలదాల్చి నగరభ్రమణ మారంభించెను. ఆ కుంజరము వెనుక వందిమాగధులు, నటగాయక నర్తకీమణులు, ఆయుధపాణులైన రాజభటులు బయలుదేరిరి. రాజ్యకాంక్ష యున్న లోకులందరూ, చిన్న చిన్న బాలుర నుండి ముదుసలుల వరకూ, సుందర దుకూలధారులై ఆ గజమునకు ఎదురుగ ఏగిరి. కానీ ఆ కుంజరము వారినెవరినీ కన్నెత్తి చూడక గజరాజ స్వాభావిక గమనముతో పురమంతయు విహరించి, చివరకు పురము వెలుపల యున్న విపినమున ప్రవేశించెను. ఆ నాగము వెంట సర్వులూ కానన ప్రవేశము కావించిరి. ఆ కుంజరము నెమ్మదిగ నడుచుచూ వనమధ్యమున శ్రీగణేశ భగవానునకు శ్రద్ధగా పూజనమాచరించుచున్న దక్షుని వద్దకేగి, సర్వులు చూచుచుండగా ఆతని గళమున ఆ రత్నహారమును వైచెను. ఆ దృశ్యమును ఇహమున నగరవాసులందరూ, స్వర్గమున దేవతానీకము సహితము వీక్షించిరి. మరుక్షణము భూనభోంతరాళములు దద్దరిల్లునటుల దేవ దుందుభులు మ్రోగి పుష్పవృష్టి కురిసెను. రాజస్థాన ప్రముఖులందరూ వచ్చి వారి వారి స్థానముల కనుగుణముగ కూర్చొనిరి. అమాత్యులిరువురు ఏతెంచి దక్ష మహారాజుకు ప్రణమిల్లిరి. అంత దక్షుడు వారందరినీ వస్త్ర తాంబూలాదులతో సత్కరించెను. తన తల్లికిచ్చిన మాటను విస్మరింపక, ఆమెను ఒక పల్లకీ యందు ఎక్కించి, తాను గజారోహుడై, అశ్వారూఢులైన అమాత్యులు ముందు ఏగుచుండగా, సుగంధ భరిత కళ్ళాపిజల్లి, ముగ్గులు పెట్టి, ధ్వజపతాక యుక్తమయిన రాజమార్గమందు దక్షమహారాజు పయనించి, రాచనగరు చేరి, సభాస్థలి ప్రవేశించెను.

ఆ సమయమున ఆ రాజాస్థానమునకు దేవలోకము నుండి గాయక నిపుణులైన గంధర్వులు, నాట్యవిశారదులైన అప్సరసలు ఏతెంచి, ఆ సభాస్థలి నలంకరించిన సర్వులను తమ కళలతో వీనుల, కన్నుల విందు కావించిరి. ఆ వేడుక యందు జనులు గావించిన జయజయధ్వానములు స్వర్గలోకము చేరినవి. సభాసదులందరూ తమ యధాస్థానములందు ఆశీనులైన పిదప తొలుత దక్ష మహారాజు తాన అనేక దానములు సలిపి, తన తల్లిచే సహితము సర్వదానములను కావింపజేసెను. పిదప బుద్ధిమంతుడయిన దక్ష మహారాజు ఒక పల్లకినీ, ఛత్ర చామర, ధ్వజాది రాజ లాంఛనములనిచ్చి, సుమంతువు అను తన అమాత్యుని ముద్గల మహర్షిని తోడ్కొని రమ్మని పంపెను. ముద్గలమహర్షి రాకను గమనించి,

మహారాజు లేచి, స్వాగతార్థమై ముందునకేగి, తన ముకుటయుక్త శిరమును ఆ మహర్షి పాదములకు తగులునట్లు సాంజలి బంధకముగ సాష్టాంగ దండ ప్రణామములాచరించెను. పిదప ఆయనను తన సింహాసనము నందు ఆసీనుని గావించి, ఆ మహర్షిని తన పరివార సహితముగ భక్తితో పూజించెను. పిదప ఆయనకు అనేక గ్రామములు, గోవులు, ధన, మణి, రత్న, స్వర్ణ, వజ్ర, వైఢూర్యరాశులు, వస్త్రములు, బహూకరించి ఇట్లనియె.

"మహాత్మా! నేటి నా శరీర స్థితి, సౌష్ఠవము, ఈ రాజపదవి కేవలము మీ కృపాకటాక్షముల మాత్రమే సంభవించినవి. ఎక్కడ నా అంధ బధిరత్వము? కురూపిత్వము? వ్రణయుత శరీరము? సర్వము మీ దయ. నేను మిమ్ములను సాక్షాత్ శ్రీగణేశ స్వరూపముగ భావించుచున్నాను. నేడు మీ మహిమ ఈ సర్వజనులకు విదితమయినది. నాకు చిరకాలము నా మనోవాంఛిత కర్మములన్నియు సఫలీకృతమగునట్లు మీ కరకమలమును నా శిరముపై యుంచి దీవింప ప్రార్థన." అంత ముద్గలుడు సంతసిల్లి "దక్ష మహారాజా! నీకు శత్రుపీడ నశించి నీ సంపూర్ణ మనోకామనా సిద్ధి నొందెదవు" అని దీవించెను. తదుపరి దక్షుడు ఇతర బ్రాహ్మణోత్తములకు, సర్వులకు యథోచితమయిన దానములిచ్చి అందరినీ సంతోషపరచెను. వారందరూ తమ నూతన మహారాజునకు అభినందనలు తెలిపి, కానుకలు సమర్పించి, తమ గృహములకు వెడలిరి. ఆ కుండిన నగరమందు శ్రీగణేశునికి చిన్న ఆలయము కలదు. అందు దక్షుడు ఆ ఆలయమును పునరుద్ధరించి, అత్యంత విశాలము, సుందరము కావించి, అచట నిత్య శ్రీగణేశ పూజాదికములు మొదలుపెట్టెను.

ఆ సమయమున జనుల ద్వారా ఈ విషయమంతయు తెలిసికొన్న వల్లభ మహారాజు అచటికేతెంచి, దక్షుని అభినందించెను. అంత వీరసేనుడను మహారాజు శ్రీగణేశుని ఆజ్ఞానుసారముగ తన కుమార్తెను త్రిలోక కీర్తిమంతుడైన దక్షునకిచ్చి వివాహమొనరించెను. ఆ దక్షునకు బృహద్భానుడు, బృహద్భానునికి ఖడ్గధరుడు, ఆతనికి సులభుడు అను పుత్రులుదయించిరి. సులభునకు పద్మాకరుడు, పద్మాకరునికి వపుర్దీప్తుడు, ఆయనకు మీ తండ్రి అయిన చిత్రసేనుడు, చిత్రసేనునకు నీవు (భీముడు) జన్మించిరి." తన వంశ పరంపరనంతయు వినిన నృపశార్దూలుడు భీముడు విశ్వామిత్రుని సంతుష్టుని కావించి ఇట్లనియె "మహర్షీ! నేను ఎట్లు శ్రీగణేశుని పూజకావించి, ఆయనను ప్రసన్నుని చేసికొని, ఆయన దివ్య సాక్షాత్కారమును పొందగలను? ఆ వివరములన్నియు నాకు తెలుప వలసినది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి దక్షుని రాజ్యప్రాప్తి అను ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఏడవ అధ్యాయము

(భీమ మహారాజు పుత్రప్రాప్తి)

చతుర్ముఖ బ్రహ్మ ద్వారా ఈ సుమధుర పుణ్య చరితమును వినుచున్న వ్యాసమహర్షి "పితామహా! మీ అమృతతుల్య వాక్యములచే నాకు మృత్యుభయము నశించినది. అట్లే విశ్వామిత్రుని చే తెలుపబడిన ఆఖ్యానము చే నా మోహము సహితము దూరమయినది. తదుపరి చరితమును దయచేసి వివరింపవలసినది." అంత బ్రహ్మ "విశ్వామిత్రుడు భీమ మహారాజుకు ఏకాక్షర శ్రీగణేశ మహామంత్రము **(గం)** ఉపదేశించి, అద్దాని పూజావిధిని సాంగోపాంగముగ తెలిపి ఇట్లనియె "మహారాజా! నీవు తిరిగి నీ రాజ్యమునకేగి, అచటగల శ్రీగణేశాలయమునకేగి శ్రీగణేశుని మంత్రానుష్ఠానము కావింపుము. వినాయకుడు నీకు ప్రసన్నుడై నీ మనోవాంఛితములు తీర్చి, గొప్ప సుపుత్రుని ఒసగుటయే కాక నీకు

ధర్మార్ధకామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్ధములను సహితము ఒసంగును.” అంత భీముడు విశ్వామిత్ర మహర్షి ఆజ్ఞను ఔదలదాల్చి, ఆ మహర్షికి శతధా, శతవిధా సమస్కృతులు సమర్పించి, తిరిగి తన నగరమునకేగెను. తమ మహారాజు తిరిగి వచ్చుచున్నాడన్న వార్త విని ప్రజలు, నాగరికులు, అమాత్యులు ఆయనకు ఎదురేగి, ఆ దంపతికి స్వాగత సత్కారములాచరించి, ఒక పల్లకి యందు కూర్చుండబెట్టి, సుగంధభరిత జలములతో కళ్ళాపిజల్లి, ముగ్గులు పెట్టిన రాజమార్గము గుండా ఊరేగింపుగా రాజప్రసాదమునకు తీసికొని వచ్చిరి. ఆ సమయమున సర్వులు పరస్పరము ఇట్లనుకొనిరి “ఈ రాజదంపతి పునరాగమనము తో పతివ్రత అయిన సతి తిరిగి తన పతిని చేరినటుల, అంధునికి సుదృష్టి కలిగినటుట ఈ పురము శోభించుచున్నది.” రాజదంపతి తమ రాజ్యము సుభిక్షముగ యున్నదని గ్రహించి, సర్వులను వస్త్ర భూషణ, తాంబూలములతో సత్కరించిరి.

అటుపిదప ఒకానొక శుభ దినమున కుటుంబ పరివారాది సహితుడై భీముడు దక్షనిర్మిత శ్రీగణేశ ఆలయమునకేగి, పూజాదికములు మొదలుపెట్టి, ఉపవాస పరాయణుడై మంత్రానుష్ఠానము మొదలుపెట్టెను. అప్పటి నుండి సర్వకాల సర్వావస్థల యందునూ అనన్య భక్తి, ఏకాగ్రతలతో శ్రీగణేశచింతన మారంభించెను. ఆయన అన్ని చోట్లా, సర్వుల యందునూ తుదకు భక్ష్య, వృక్ష, వనస్పతులందు, జీవ నిర్జీవములందు సహితము శ్రీగణేశునే కాంచుచుండెను. ప్రజలు తమ రాజు పట్ల కించిత్ భయాంధోళనకు లోనయిరి. ఆ సమయమున ఒకానొక పుణ్యతిధి యందు శ్రీగణేశుడు ఆయనకు ప్రత్యక్షమై, ఆయన చేతిని పట్టి “రాజా! నీవు ముక్తుడవయితివి. నీ మనోవాంఛితమేమి?” అన్ని ప్రశ్నించెను. అంత మహారాజు “మహాప్రభూ! నేను మీ చరణ కమలములు వినా వేరేవియు కోరను” అని పలికెను. అంత శ్రీగణేశుడు “నీకు నా కృప చే సుందరుడు, సద్గుణశీలి, బంగారువన్నె ఛాయగల పుత్రుడు కలుగును. ఇక నీవు నీ రాజ భవనమునకేగి విహితకర్మములాచరించుచూ, దేవ భూసుర పూజనము సల్పుము.” అంత భీముడు శ్రీ గణేశుని ఆజ్ఞను శిరసావహించి, తిరిగి రాచకార్యాచరణము, దేవ భూసుర పూజనము మొదలిడెను. అతి కొన్ని దినములో మహరాణి గర్భవతియై, నెలలు నిండిన పిదప సర్వ శుభలక్షణయుతుడైన పుత్రుని కనెను. ఆ సమయమున రాజు ద్విజులకు దానమిచ్చి, ఆ బాలునికి జాతకర్మాది సంస్కారములు నెరపి “రుక్మాంగదుడు” అని నామకరణ మొనర్చెను. ఆ బాలకుడు దినదిన ప్రవర్ధమానుడై శుక్లపక్ష చంద్రుని వలె వృద్ధి నొందెను.

భీమ మహారాజు ఆ బాలుని కపిలుని వద్ద విద్యాభ్యాసమునకు పంపెను. ఆ బాలుడు ఏకసంధాగ్రాహి అగుటచే, గురువు చెప్పిన విషయములను వెంటనే ఆకళింపు చేసికొని, సర్వవిద్యలయందును ప్రవీణుడై, రెండవ గణేశుని వలె వెలుగొందెను. అంత భీముడు తన తనయునికి యుక్తవయస్సు వచ్చిన పిదప రాజ్యాభిషేకము కావించెను. ఆ రాకుమారుడు తండ్రిని మించిన భక్తుడై, తన తండ్రి వద్ద నుండి ఏకాక్షర శ్రీగణేశ మంత్రోపదేశమునొంది, ప్రతిదినము ఆ మంత్రానుష్ఠానము ఒనర్చుట ఆరంభించెను. కాలము ఎన్నడూ ఒక్కలా యండదు కదా! ఒకానొకనాడు రుక్మాంగదుడు వేట నిమిత్తము విపినమునకు అరిగి అనేక క్రూరమృగములను దునుమాడి, అద్దానిచే విపరీతమయిన అలసటనొంది, అచట దాపుననే కనిపించిన ఒక మున్యాశ్రమము ప్రవేశించెను. ఆ ఆశ్రమము అనేక ఫల, పుష్ప, లతా, వృక్షభరితమై, జన్మవైరము గల జంతువులు సహితము పరస్పరము ప్రేమాస్పదులై యుండెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి భీమ మహారాజు పుత్రప్రాప్తి అను ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఎనిమిదవ అధ్యాయము

(రుక్మాంగద శాపము)

రాజు ఆ ఆశ్రమ ప్రవేశము గావించి అక్కడయున్న ముని దంపతిని కాంచెను. మహర్షి "వాచక్నవి" శుభదర్శనుడు. ఆయన పత్ని మధుర మంజుల వాణి అయిన "ముకుంద". రాజు ఆ ముని దంపతిని గాంచి నమస్కరించెను. మహర్షి వాచక్నవి రాజును కుశలమరసి స్నానార్ధము నదికి వెళ్ళెను. రాజు రుక్మాంగదుడు దాహము చే అత్యంత బాధితుడై ఆ మునిపత్నితో ఇట్లనియె "మాతా! ముకుందా! జలపానము చేయక నేను మరొక్క క్షణము ప్రాణమును నిలుపలేదు. నాకు దయచేసి శీతల జలములు ఈయవలసినది." నవయవ్వన సంపన్నుడు, కందర్పరూప సమాన్వితుడు అయిన రుక్మాంగదుని చూచి ముకుంద కామాతురయై ఇట్లనియె "రాజా! నీవు కామదేవుని కంటె సుందరుడవు. నీ వంటి సుందరులు దేవ, నాగ, యక్ష, గంధర్వులందు సహితము కద్దు. నీ సౌందర్యము నా హృదయమును భేదించుచున్నది. నీ అధరామృతమును పానమొనర్పవలెనని నేను ఉవ్విళ్ళూరుచున్నాను. దయచేసి నాకు రతిసుఖము ప్రసాదింపవలసినది." కానీ రుక్మాంగద మహారాజు జితేంద్రియుడు. తిలోత్తమాది అప్సరసలను తలదన్ను సౌందర్యరాశి అయిన ముకుందతో ఇట్లనియె "మాతా! నీవు దు:ఖకారకము, నిర్లజ్జపూర్వకమైన నీ ప్రవర్తనను మార్చుకొనుము. నా చిత్తము పరదారా గమనమను లోకులు గర్హించు కార్యమందు రమించదు. నా దృఢమయిన వినాయక భక్తి ప్రభావమున నా మనస్సు ఆ పాపకర్మమందు లగ్నమవదు. నీవంటి దుష్ప్రవర్తన కలిగిన స్త్రీ చేతినుండి నీరు నేను త్రావదలచుకొన లేదు. ఇది మున్యాశ్రమముని భ్రమపడి నేనిచటకు ఏతెంచితిని. నేను వెంటనే ఇచటి నుండి వెళ్ళెదను" అని వెడలుటకు ఉద్యక్తుడయ్యెను. అంత కామార్త అయిన ముకుంద ముందుకు కదలి ఆ మహారాజు యొక్క హస్తమును పట్టి ఇట్లనియె " ఏ వ్యక్తి అయిననూ పరస్త్రీని బట్టి, బలాత్కరించి, ఆమె సచ్చారిత్రమును భ్రష్టమొనర్చిన ఎడల అతడు నరకగామి అగును. కానీ స్వేచ్ఛగా వచ్చిన స్త్రీతో రమించుట వలన నరకము ప్రాప్తించదు. చతుర్ముఖ బ్రహ్మ కృత, త్రేతా యుగములందలి స్త్రీలకు ఏ వాంఛిత పురుషుని తోనైననూ రమించు స్వతంత్రత ఇచ్చెను. నీవు నా పలుకులను మన్నించని ఎడల భస్మీభూతుడవగుదువు. లేదేని నిన్ను రాజ్యభ్రష్టుడను, వనవాసినీ కావించెదను. ఈ విధముగ పలికి కామబాణపీడిత అయిన ముకుంద పరుగున వచ్చి రుక్మాంగదుని గాఢముగ కౌగిలించుకొని చుంబించెను. అంత రాజు ఆమెను బలవంతముగ వెనుకకు త్రోసెను. అద్దానిచే ఆ అతివ పెనుగాలికి విరిగిపడిన కదళీతరువు వలె క్రిందపడి మూర్ఛనొందెను. ఆమె తిరిగి స్వస్థత నొందిన పిదప రుక్మాంగదుడు "ఓ! సౌభాగ్యశాలిని అయిన మునిపత్నీ! నీవు వివేకహీనవైతిని. ఏ అతివకు పరపురుషుని యందు ఆసక్తి యుండునో ఆమె నరకముల పాలగును. సముద్రము ఇంకవచ్చును; కాని నా మనస్సు ఎట్టి పరిస్థితుల యందునూ విచిలితము కాదు." ఈ విధముగ రుక్మాంగద మహారాజు చే తిరస్కరింపబడిన ముకుంద మిక్కిలి క్రోధోద్రిక్తయై, మంచి చెడ్డలు మరచి ఇట్లనియె "రాజా! నీ హృదయము పాషాణము. అందువలన కోమలమైన నా కోరికను మన్నింపక నాకు కష్టమొనరించితివి. అందువలన నీకు కుష్ఠరోగము ప్రాప్తించుగాక!" అని శపించెను.

అంత రాజు నిరుత్తరుడై, పరమ దు:ఖితుడై అచటి నుండి వెడలెను. ఆయన తిరిగి వనము నందు ప్రవేశించుసరికి ఆయన శరీరమంతయు వ్రణములు మొదలై, సువర్ణ సదృశ దేహచ్ఛాయ అంతయు మటుమాయమై కొంగలవంటి తెల్లని మచ్చలు ఒడలంతయు అల్లుకొన ఆయన సంపూర్ణ కాంతిహీనుడయ్యెను. ఆ మహారాజు అత్యంత దు:ఖసాగరమున మునిగి శ్రీగణేశుని ఇట్లు ప్రార్థించెను "ప్రభూ! నేను గావించిన అపరాధము ఏమి? నేను ఆ ఆశ్రమమునకు ఏల ఏగవలె? ఆ దుష్ట మునిపత్నితో ఏల సంవాద మొనర్పవలె? ఓ! సిద్ధిపతీ! నీవు దుష్టులకు అధిక బలము నిచ్చుచున్నావు. నీకు సత్పురుషులను రక్షించుటకు అవతారములు స్వీకరించితివి. తన సౌందర్యము పట్ల అమిత గర్వము కలిగిన ఈ

స్వైర విహారిణిని నీవేల ఉపేక్షించితివి? ఆహా! హతవిధీ! సువర్ణ సదృశమయిన నా శరీరము నేడు ఏ అవస్థకు గురి అయినది? ఇయ్యది ఏ దుష్కర్మ ఫలితము? హే! ప్రభూ! శ్రీగణేశా! నేను ఎల్లప్పుడూ నిన్నే భక్తితో అనుసరించితిని. ఇపుడు సహితము నిన్నే శరణు వేడుచున్నాను. వేరొకరిని అడుగను. నేను నా ముఖము ప్రజలకు ఎట్లు చూపించగలను? అందువలన ఇచటనే కూర్చొండి ప్రాయోపవేశ మొనర్చెదను." అని నిశ్చయించి, దగ్గరలో గల ఒక వృక్షఛాయన చతికిలపడెను. ఆతని భృత్యులు ఆ మహారాజు కొరకై వనమంతయు వెదకి, వెదకి వేసారి, తమ గృహముల కరిగిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి రుక్మాంగద శాపము అను ఇరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది తొమ్మిదవ అధ్యాయము

రుక్మాంగదుని నారద దర్శనము

ఈ విధముగ కొన్ని దినములు గడచిన పిదప, ఒకనాడు రుక్మాంగదుడు దూరముగ కనిపించిన నారద మహర్షిని గాంచి, ఎలుగెత్తి పిలచి, ఆయనను ఆ వృక్ష ఛాయన ఒక్క క్షణము విశ్రమింపమని ప్రార్థించెను. అంత కరుణాసాగరుడయిన నారదమహర్షి ఆ ప్రార్ధన నాలకించి, క్రిందికిదిగి, అచట విశ్రమించెను. అంగములు కృశించి దీనుడైనప్పటికీ, రుక్మాంగదుడు నెమ్మదిగ లేచి, యధాశక్తి ఆ మహర్షిని పూజించి ఇట్లనియె "మహాత్మా! నేను భీమ మహీపతి కుమారుడను. రుక్మాంగద నామధేయుడను" అని పలికి జరిగిన ఘోరమంతయు విన్నవించి "స్వామీ! మీరు దయచేసి నాకు ఈ శాప నివృత్తి పరిష్కారము తెలుపవలసినది "అని ప్రాధేయపడెను. అంత సర్వజ్ఞుడు, సర్వజ్ఞాత అయిన నారద మహర్షి "రుక్మాంగదా! నేను ఈ మార్గమునేతెంచు సమయమున ఒక విచిత్రము గాంచితిని. ఇచటకు దగ్గరనే యున్న విదర్భ దేశమందు కదంబమను విఖ్యాత నగరమున్నది. అచట మహా మహితాన్వితమైన చింతామణి వినాయకుని మందిరమున్నది. ఆ మూర్తి కడు కళ్యాణకరము మరియు సమస్త మనోవాంఛితములను పూర్ణమొనరించునది. ఆ మందిరపు నికటముననే గణేశకుండమను సరోవరము కలదు. ఓ! రాజా! అత్యంత ముదుసలి, జర్జరదేహుడు, దేహమంతట కుష్ఠవ్యాధితో నిండిన శూద్రుడొకడు తీర్ధయాత్రలు సలుపుచూ, కదంబనగరమున కేతెంచి, గణేశ కుండమున స్నానమాచరించిన మరుక్షణము సుందరదేహుడై, వినాయక గణములచే తేబడిన దేవ విమానమధిరోహించి, స్వర్గము కంటె ఉత్తమ లోకముల కరిగెను. ఆతనికి పునర్జన్మము, దు:ఖము యుండవు. రాజా! నేను స్వయముగా ఈ ఘటనను కన్నులారా కాంచితిని. నీవు సహితము ఆ కదంబ నగరమునకేగి ఆ గణేశ కుండమందు స్నానమాచరించి, చింతామణి గణేశుని మనసారా పూజించి యధావిధిగ దానములు సలుపుము. నీవు శీఘ్రముగ పవిత్రుడవై, ఈ శ్వేత కుష్ఠవ్యాధి నుండి విముక్తుడవై స్వస్థత నొందెదవు."

అంత రుక్మాంగదుడు ఆనంద సాగరమున మునిగి కొంత తడవు మాటలు రాక శిల్పము వలె కూర్చుండెను. అంత నారద మహర్షి తాను వెడలుటకు ఉద్యుక్తుడయ్యెను. అంత రుక్మాంగదుడు సచేతనుడై ఇట్లనియె "ఓ!! అనఘా! శుభదర్శనా! పూర్వకాలమందు ఈ మణిరత్నయుతమయిన మూర్తిని ఎవరు స్థాపించిరి? ఇంతకు మున్ను ఇచట ఎవరు సిద్ధి పొందిరి? దయచేసి నాకు తెలుపవలసినది. మీ వంటి సాధుపుంగవుల బుద్ధి ఎల్లప్పుడూ పరోపకార్యార్థమై యుండును. మీ నిరంతర త్రిలోక సంచారమునకు వేరొక కారణము లేదు. మేఘములు సర్వలోకములందునూ వర్షమును వర్షించును. శేషుడు తన ఫణములపై ధరిత్రిని వహించును. సూర్యుడు అహర్నిశలు భ్రమణము కావించుచుండును. వీరందరూ లోకోపకారము కొరకై ఈ కార్యములు ఆచరించుచున్నారు. మీరు సర్వ జీవులఎడ సమభావము నొందియున్నారు.

అజ్ఞానిని, మూఢుడనైన నేను మీకు ఏమి చెప్పగలను? ఓ! దేవర్షీ! మహానుభావా! కేవలము నా సంశయములు దూరమొనర్చుకొనుట కొరకే మిమ్ముల ప్రశ్నించుచుంటిని.” అంత నారదమహర్షి “ఓ! రాజా! సర్వ కృపానిధీ! నీ ప్రశ్న సముచితము. నేను నీ వచనములచే సంతుష్టుడనైతిని. నీకు విపులముగ సర్వమును తెలిపెదను.”

(శ్రీగణేశపురాణమందలి ఉపాసనాఖండమందు రుక్మాంగదునికి నారద దర్శనమను ఇరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పదియవ అధ్యాయము

(అహల్య వృత్తాంతము)

నారదుడు “ఒకానొక సమయమున నేను స్వర్గమందు ఇంద్రుని దర్శించుటకేగితిని. ఇంద్రుడు నన్ను విధివిధానముగ పూజించి, ఆసనమిడి, అత్యంత వినీతుడై ఇట్లనియె “దేవర్షీ! మీరు సమస్త లోకములందు యథేశ్చగా సంచరించుచూ, సర్వజ్ఞులై యుందురు. నాకు సంతోషజనకమైన విషయము ఏదైననూ తెలుపవలసినది”. “నారదుడు” “త్రిలోకాధీశా! ఈ మధ్య నేను మృత్యులోకమయిన భూలోకమునకేగి, గౌతమ మహర్షి ఆశ్రమమును సందర్శించితిని. అయ్యది నానావృక్ష పరివృతమై, అనేక పశు పక్ష్యాదులకు నిలయమై యున్నది. అందు అహల్య గౌతములను నేను సందర్శించితిని. పురంధరా! ఆ అహల్య గూర్చి ఏమి తెల్పుదును? ఆమె రూపలావణ్యముల ముందు సావిత్రీ, ఇంద్రాణీ, లక్ష్మీ, సరస్వతీ, హిమాలయపుత్రి పార్వతీ, రంభాది అప్సరసల సౌందర్యము దిగదుడుపే! ఆమెను చూచి అనసూయ, అరుంధతి సహితము ఈర్ష్యాళువులగుదురు. సూర్య పత్నులయిన సంజ్ఞ, ఛాయ, మరియు కశ్యప పత్ని అయిన అదితి గానీ, నాగ యక్ష, కిన్నెర, కింపురుషాదుల యందు కానీ, ఆమెతో తుల్యమయిన సౌందర్యముగల స్త్రీ రత్నము యుండుట కల్ల. ఆమెను కాంచిన పిదప నాకు భజన, భోజన, పూజాదికములు రుచింపలేదు. నిద్ర కరువై బ్రహ్మ చర్యమందు వెగటు పుట్టినది. ఇక అక్కడ యుండుట ఎంతమాత్రము సబబు కాదని నేను వెంతనే అక్కడ నిష్క్రమించి ఇచ్చట కేతెంచితిని. అహల్య లేని అమరావతి తుచ్ఛము” అని ఇంద్రునితో పలికి నేను అంతర్ధానుడనైతిని.

జంభాసురుని హతమార్చి, ఆ మత్తులోయున్న పురంధరుని మనస్సును అహల్యా లావణ్యమను పురుగు నారద వాక్యముల చే తొలుచుట నారంభించెను. ఆయన కామబాణాగ్ని చే దగ్ధమయి మూర్ఛితుడయ్యెను. పిదప తేరుకుని “అహల్య అధరామృతపానము చే ఈ కామాగ్ని నుండి ముక్తుడనగుదును. ఆమెను ఆలింగనము చేయక నా జీవనము శుభప్రదమవ్వదు.” ఈ విధముగ చింతించుచూ వడివడిగా గౌతమాశ్రమమును చేరుకుని, అచ్చము గౌతముని రూపము ధరించి, వేచియుండెను. ఉషోదయమునకు ముందు గౌతమ మహర్షి స్నానార్థము నదికి వెళ్ళగనే గౌతమ మహర్షి రూపము ధరించిన ఇంద్రుడు గృహాంతర్భాగమునకేగి తన రతిక్రీడాసక్తిని తెలిపెను. అంత అహల్యాదేవి “నాథా! నేడు మీరు జపతపాదుల త్యజించి గృహమున కేల ఏతెంచిరి? రాత్రి కాక పగటి యందు రతిక్రీడ సలుపుట అత్యంత గర్హితముకదా! మరి మీరేల ఆ దుష్కార్యము నాచరించుటకు ఉత్సుకులగుచున్నారు?” అంత కపట గౌతముడు “నేను స్నానమాచరించుటకు నదీ తీరమునకేగినపుడు ఒక సుందరమయిన అప్సరస కూడా అదే సమయమునకు స్నానమాచరించుటకు ఏతెంచినది. ఆమె నా కన్నుల ముందే వివస్త్రయై, నదీ జలములందు ప్రవేశించినది. ఆమె యొక్క మనోహర శరీర సౌష్ఠవము దొండపండ్ల వంటి పెదవులు, చిత్తాకర్షకమయిన పూర్ణ పయోధరములు నన్ను వివశుని కావించినవి. నేను సంపూర్ణముగ కామబాణపీడితుడ నైనందువలన నా మనస్సు జపతపాదులందు కుదురుట లేదు.

నీవు నా కోరక తీర్చని ఎడల, నేను కామాగ్ని యందు దగ్ధుడనై మృతి చెందెదను. లేని ఎడల నేను సన్యాసము స్వీకరించి గానీ, అప్రతిహతమైన నిగ్రహము అవలంబించి కానీ ఈ రతిక్రియను ఈ జన్మకు సంపూర్ణముగ వదలివేయుదును." అంత అహల్య తిరిగి ఇట్లనియె "బ్రహ్మర్షీ! మీరు ఈ ఉషోదయమున స్వాధ్యాయము, దేవపూజ మాని హేయమైన ఈ రతిక్రీడకై ఎందుకు యాచించుచున్నారు? సమయము కాని సమయమందు కాని పనులు కావించుట పరమ దూష్యము. నేను మీ ఆజ్ఞను పాలింతును. పతివ్రత అయిన స్త్రీకి పతిసేవకు మించిన ధర్మము లేదు. ఇంద్రుని వేషము, సర్వము అచ్చుము తన పతివలెనే యుండుటచే, ఆ పరమసాధ్వి వచ్చినది తన పెనిమిటే అనుకుని, ఆయనతో రమించుటకు శయ్యాగృహము చేరెను.

కానీ రతిక్రీడా సమయమున, ఆలింగన చుంబనాది క్రియలందు ఇంద్రుని శరీరమునుండి వెలివడుచున్న సుమధుర సుగంధమును ఘ్రాణము చేసి ఆమె చకితయై తన మనస్సు నందు శంకించుట నారంభించెను. ఈ కపటి గౌతమరూపధారి కాదు కదా? అద్దాని వలన శశాంకుని వలె నాకు కళంకమబ్బును. ఆ దుష్కృత్యము వలన నా పతి మరియు పితల వంశములు రెండునూ నష్టపడును. కళంకితనైన నేను నా ముఖమును లోకమునకు ఎట్లు చూపింతును? నన్ను ఎంతో ప్రేమించు నా పతికి ఈ విషయము తెలిసిన ఆయన ఏమి చేయును? అంత ఆమె అత్యంత క్రోధాన్వితయై కపటవేషధారి ఈ దుష్టుడు ఎవరు అని తర్కించి "ఓరి దుష్టుడా! నా పతి వేషమును ధరించిన నీవు ఎవరు? సత్యము పలుకుము. లేనిచో అవశ్యము నీకు శాపమిడుదును." అంత ఇంద్రుడు శాప భయమున గజగజవణకుచూ దివ్యభూషణధారి అయిన తన నిజరూపమును వ్యక్తమొనర్చి ఇట్లనియె "నేను శచీపతినైన పురంధరుడను. నీ సౌందర్యమునకు ముగ్ధుడనై, కామాగ్ని యందు దగ్ధుడనైతిని. అందువలన ఈ కార్యమాచరించితిని. నీవు కూడా త్రిలోకాధిపతినైన నాతో రమించవలసినది." అంత మునిపత్ని అత్యంత రోషభూయిష్ఠమై, కన్నుల అగ్ని వర్షించుచుండగా ఇట్లనియె "దుష్టుడా! నీవు నా పాతివ్రత్యమును భంగపరచితివి. నా పతి అయిన గౌతమ మహర్షి నీకు తగిన శాపమిచ్చును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి అహల్యా వృత్తాంతమను ముప్పదియవ అధ్యాయము సమాప్తము)

(ముప్పది ఒకటవ అధ్యాయము)

(గౌతమ మహర్షిచే ఇంద్రుడు శపింపబడుట)

రుక్మాంగదుడు "మహర్షీ! తదుపరి ఏమి జరిగినది? నా మనసు జిజ్ఞాసచే నిలుచుట లేదు." నారదుడు "వత్సా! తదుపరి గౌతమ మహర్షి తన నిత్యకర్మానుష్ఠానము ముగించి, తన ఆశ్రమమునకొచ్చి, తన భార్యను కానరాక ఎలుగెత్తి పిలచెను. అయిననూ అహల్య బయటకు రాలేదు. అంత మహర్షి "కళ్యాణీ! నీవు నా పాద ప్రక్షాళనకు నీరు ఈయవేమి? ప్రతిదినము వలె నా సుమ్ముఖమునకు రావేమి? ఆసన మీయవేమి? చతుర సంభాషణ కావింపవేమి?" ఆ పలుకులు వినిన అహల్య సుడిగాలి పడిన సుకుమారలతవలె, అవనిత శిరస్కయై, వణకుచు వచ్చి, తన మస్తకమును ఆయన పాదముల వద్ద చేర్చి, సాష్టాంగ దండ ప్రమాణములాచరించి, ముని యొక్క శాపభయమున మిక్కిలి భయభీతురాలై, ఆ ఉదయము జరిగిన సంఘటనలన్నియు పూసగ్రుచ్చినట్లు ఆయనకు వివరించెను. దుర్మార్గుడైన ఇంద్రుడు తనను మోసగించిన విధానమును, తాను రతిక్రీడ కూడదని సలిపిన సంవాదమును, గాఢ పరిష్వంగ సమయమున దేవరాజు దేహము నుండి వెలువడిన దివ్య గంధము చే తనకు కలిగిన అనుమానమును, తాను శాపమిచ్చెదనని పలికిన వైనమునూ

దుష్టుడయిన ఇంద్రుడు తన నిజరూపమును చూపిన సందర్భమునూ, సంపూర్ణముగ ఏదియునూ దాచక, సర్వమును ఎరింగించి, అవనిత శిరస్కయై ఇట్లనియె "నాధా! మీ పలుకులు వినియునూ, జరిగిన అపరాధము చే తీవ్రమయిన లజ్జావశనై వెలుపలికి రాలేకపోతిని. నా అపరాధమును మన్నింప ప్రార్ధన. ఎవరి పాపమును వారు స్వయముగ నివేదించుట దోషము కాదు. వేరొకరు దానిని నివేదించుట దోషము. మంత్రము, ఆయుష్షు, గృహ పరివార విషయములు, ధన సంపత్తి, రతిక్రియలు, ఔషధములు, మానావమానములు, మరియు దానము – వీటిని ఎన్నడు ప్రకటము చేయక గుప్తముగనే యుంచవలెను."

ఇదంతయు వినిన గౌతముడు క్రోధ తామ్రాక్షుడై "ఓ! దుశ్చారిణీ! నీవు నన్ను, దేవరాజు ఇంద్రుని యందలి అంతరమును గ్రహింపలేకుంటివి. ఎందుకనగా నీ చిత్తము పరపురుషుని యందు సంలగ్నమయినది. నీవు శిల కావలసినది. దశరధ పుత్రుడు రామచంద్రుడు ఇచటి కేతెంచినపుడు ఆయన చరణ స్పర్శచే నీవు తిరిగి నీ స్వస్వరూపమును పొందెదవు." మహర్షుల వాక్కులు పొల్లుపోవు కదా! తక్షణము అహల్య పాషాణరూపమును సంతరించుకొనెను. ఈ సంభాషణ అంతయు వినుచున్న ఇంద్రుడు పెనుగాలి తీవ్రతచే కంపనమొందు హిమాలయ శిఖరము వలె కంపించుచూ ఇట్లనుకొనెను "ఇపుడు నా కర్తవ్యమేమి? నేను సముద్ర మధ్యమున గానీ, తటాకమందలి పుష్ప మధ్యమున గానీ ఎక్కడ యున్ననూ ఈ ముని తెలిసికొనును." ఈ విధముగ చింతించి, ఒక పిల్లి రూపము ధరించి, ఆ ఆశ్రమము నుండి బయటకు వచ్చి అంతర్హితుడు అయ్యెను. అంత గౌతముడు తన ఆశ్రమమంతయు ఇంద్రుని కొరకు వెదకి, ఆయన కానరాక ధ్యానమగ్నుడై ఆయనను కనుగొని ఇట్లనియె "ఓరీ! దుష్టుడా! నీవు దేవరాజువయిన కారణమున నిన్ను భస్మము చేయను. కానీ నీకు శాపమిడుచున్నాను. నీ శరీరమంతయు వేయి యోనులు ఉత్పన్నమగుగాక! నీవు నిరంతరము దు:ఖ సాగరమున మునెగదవుగాక!" అని పలికెను.

అంత ఇంద్రుడు ఈ విధముగ తలచెను "నాకు వృద్ధజనులు అనేకమార్లు నానా విధములైన ధర్మములు తెలిపిరి. వాటిని నేను మనసునందు విచారణ నొనర్పక పోవుటచే కలిగిన ఫలమే ఈ శాపము. తన బుద్ధి హితకారకము. పరాయివారిచే తెలుపబడునది పరమ వినాశకరము. గురువు చే గరపబడిన బుద్ధి అత్యుత్తమము. నేను నారదుని పలుకులచే అనింద్య అయిన గౌతమపత్నితో దుష్కర్మమాచరించితిని. దేవరాజునైన నేను ఈ సహస్రయోనులతో జనులకు, నా పత్నికి ముఖము ఎట్లు చూపించగలను? నా దివ్య శరీరము ధ్వంసమయినది. ఛీ ఛీ!! నేను ఎంతటి నీచస్థితికి దిగజారితిని! ఈ కామము ఎంతటి దుష్కరమయనది! ఎంతటి వారలకైననూ శుభాశుభ ఫలములు భోగించుట తప్పదు. నేను తిర్యక్ యోనులందు ప్రవేశించి నా పాప ఫలితమును అనుభవించవలెను. నేను ఇంద్రగోపమను కీటక రూపము ధరించి, కమలపుష్ప నాళమందు ప్రవేశించి అదృశ్యుడనై యుందును.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి గౌతమ మహర్షి చే ఇంద్రుడు శపింపబడుట అను ముప్పది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ముప్పది రెండవ అధ్యాయము

(దేవ గౌతమ సంవాదము)

నారదుడు "ఇంద్రుడు అమరావతి యందు అదృశ్యుడగుట గని నేను అమరావతికి ఏగితిని. అచట దేవగురువు బృహస్పతి, మరియు ఇతర దేవతా ప్రముఖులు ఇంద్రుని ఆచూకీ తెలియక చింతామగ్నులై యుండిరి. అంత వారికి

నేను ఇంద్రుడు కావించిన అకార్యము, గౌతమ మునిచే ఈయబడిన శాపము, అహల్య శిలయగుట, మొదలగు వృత్తాంతమంతయు వారికి తెలిపితిని. అంత దేవతలు చింతాక్రాంతులై దీర్ఘ నిశ్వాసములు విడచుచూ ఇట్లనిరి “ఈ పురంధరుడు వంద అశ్వమేధ యాగములాచరించెను. దానవులను పరాజితుల కావించెను. త్రిలోకములను యధేచ్ఛగా తన కనుసన్నలలో పరిపాలించెను. శుభప్రదమయిన ఇంద్రపదవిని భోగించెను. దేవతలను పూజించెను. భూసురులకు దానములిచ్చెను. అన్యులకు అలభ్యములైన ఎన్నో భోగములు అనుభవించిన ఈ పురంధరుడు ఎచటకేగెను? ఆయన భోజన శయనాదులు ఎట్లు కావించును? మన హితము కొరకు, ఇంద్రుని ఉద్ధారము కొరకు, మన ప్రస్తుత కర్తవ్యమేమి? మనమందరమూ గౌతమ మహర్షిని ప్రసన్నుని కావించెదము. ఆయన ప్రస్తుతము అగ్రహోదగ్రుడై యున్నాడు. అందువలన మనము అప్రమత్తులమై, కోమల భాషణము కావించవలె” అని వారందరూ కలసి, నారద సహితముగ గౌతమాశ్రమమునకు చని ఈ విధమగ ప్రార్థించిరి.

“ఓ! మహాత్మా! మేరు మంధర పర్వతముల గరిమను వర్ణించుట ఎవరితరము? వర్షపు చినుకులను, భూమి యందలి ధూళి కణములను, సముద్రమందలి కెరటములను, విష్ణువు యొక్క గుణములను లెక్కింప నశక్యము. అట్లే మీ ప్రభావము సహితము వర్ణింప నలవికానిది. పూర్వకాలమున ధరిత్రి అంతయు దుర్భిక్షమునకు లోనయినపుడు, నీవు ఋషులందరికీ భోజనములిడి సర్వుల ప్రాణములు కాపాడితివి. వాలఖిల్యులు తమ యజ్ఞార్థమై వేరొక ఇంద్రుని సృష్టించిరి. అగస్త్యుడు ఒక్క పురుషము పట్టి సముద్రము అంతటినీ త్రావెను. గాధిసుతుడు విశ్వామిత్రుడు ప్రతిసృష్టి కావించెను. మహాత్ముడైన చ్యవనుడు ఇంద్రుని భుజమును స్థంభింపజేసెను. మానుషజాతి అంతటికీ మీ వంటి ఋషుల దర్శనము, భాషణము, పూజనము, స్పర్శ, సహితము పాపనాశకము. మీ ఋషుల జీవనము ఎల్లప్పుడూ దీన జనోద్ధరణము, పరోపకారము కొరకే!! అందువల్ల మేమందరమూ మిమ్ము శరణు వేడుచున్నాము.” అంత గౌతముడు “చర్మ చక్షువులమైన మా వంటి మానవులకు మీ వంటి దేవతల దర్శనము దుర్లభము. నా పూర్వపుణ్యము ఫలించుట చే మీ దర్శనమైనది. మీ వంటి వారి దర్శనము మానవుల మనోవాంఛితములను సఫలమొనర్చును. మీ దర్శనము చే నా జన్మము, తపము, దానము, శరీరము, ఆత్మ, వ్రతములు, ఆశ్రమము, సర్వము నేడు సార్థకమయినవి. మీ మనో వాంఛితమును శలవీయ వలసినది. నా వలన ఆ కార్యము సఫలమగునేని నేను తప్పక ఆ కార్యమును ఆచరించెదను.” అంత దేవతలు ఆ పలుకులు విని పూర్ణచంద్రుని చూచి హర్షము నొందు సముద్రము వలె, తమ పుత్రుల భాషణము విని వేడుక నొందు తల్లిదండ్రుల వలె, దేవతలందరూ మనసు తేలిక పడి ముదము నొంది ఇట్లనిరి.

“శివ భగవానుడు తన పట్ల అపరాధము కావించిన కాముని దగ్ధమొనరించెను. కానీ మహాత్మా! మీరు అపరాధి అయిన ఇంద్రుని దయతలచి కేవలము శపించిరి. వధింపలేదు. మహర్షీ! మమ్ములను, మా పలుకులను, మన్నించి, మీరు దయచేసి ఇంద్రుని అపరాధమును క్షమించి, ఆతనిని తిరిగి ఇంద్రపదవి అధిష్ఠించునటుల చేయవలసినది. దానివలన మా కోరిక సిద్ధించును.” అంత గౌతముడు చిరునవ్వు నవ్వి “ఈ పతితుడు, అపరాధి అయిన ఇంద్రుని తలంచుట సహితము మహాపాపము. కపటి, శఠుడు, దుష్టుడు, అవివేకి, ప్రాయశ్చిత్త రహిత పాపకర్ముడు అయిన పురంధరునికి నిష్కృతిలేదు. కానీ మీ అభ్యర్థన మేరకు ఇంద్రునికి హితమొనర్చెదను. దివ్యానుగ్రహము వర్షించిన ఎడల పాపి సహితము పవిత్రుడగును. నేను మీకు ఒక దివ్యమంత్రము ఉపదేశించెదను. దానిని మీరు ఇంద్రునికి ప్రసాదింపవలసినది. ఈ జగమందు సర్వకర్తా, సర్వహర్తా, సర్వ రక్షకుడు, కృపా నిధానుడు, దేవదేవుడయిన వినాయకుడు. ఆయన త్రిమూర్తుల యొక్క ఏకత్రమయిన స్వరూపము. ఆయన షడక్షర మంత్రము మహా సిద్ధి ప్రదాయకమయిన మంత్రరాజము. ఈ మంత్రోపదేశము చే ఇంద్రుడు దివ్యదేహుడై, ఆతని శరీరముపై యున్న యోనులన్నియు నేత్రములుగ మారును. ఇంద్రుడు తిరిగి రాజ్యప్రాప్తి నొందును,” అని పలికి గౌతముడు మౌనము వహించెను. అంత దేవతలు

ప్రసన్నులై, ఆయనకు పూజ, ప్రదక్షిణ, ప్రణామములు సలిపి ఇంద్రుడు యున్న స్థలమున కేగిరి. మహాజ్ఞాని, తపోనిధి అయిన గౌతముని కంటె సాత్వికుడు వేరొకడుండడు.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి దేవగౌతమ సంవాదమను ముప్పది రెండవ అధ్యాయము సమాప్తము)

ముప్పది మూడవ అధ్యాయము

(ఇంద్రుని శాప విముక్తి)

దేవతలు ఇంద్రుడు యున్న స్థలమునకేగి ఇట్లుపలికిరి "త్రిలోకపతీ! ఇంద్రా! దయచేసి బయటకురమ్ము. మేము దేవర్షి నారదుని సహితులమై గౌతమ మహర్షి వద్దకేగి, ఆయనను ప్రసన్నుని కావించితిమి. ఆ మహర్షి నీ శాపోపహరణము గూర్చిన ఉపాయమును తెల్పెను. సత్పురుషులు తాము కావించిన దోషములను సర్వులకు ఎరింగించి, అద్దాని ప్రాయశ్చితమొనర్చి, ఆ పాపము నుండి బయట పడెదరు. దోషమును కప్పిపుచ్చినచో అయ్యది మరింత పెరుగును. అందువల్ల ఇంద్రా! నీవు బయటకు వచ్చి, నీ తప్పిదమును సర్వులకు తెలిపి, ఈ దేవర్షి వద్ద ఆ మహా మహితాన్విత షడక్షర మంత్రోపదేశము నొందుము. ఒకానొక సమయమున పార్వతీ కళ్యాణ మహోత్సవమందు బ్రహ్మదేవునికి పార్వతీదేవి ఎడల మోహము కలిగి వీర్యస్కలనమయినది. అంత బ్రహ్మ లజ్జితుడై ముఖము చాటుచేసెను. కొంత కాలమునకు పరమశివునికి ఈ విషయము తెలిసి ఆయన బ్రహ్మను ఇట్లే సముదాయించెను." ఈ పలుకులు విని పురంధరుడు కమలనాళము నుండి బయటకు వచ్చెను. ఆ సమయమున ఆయన శరీరము యోనిమాయమై, చీము, నెత్తురు కారుచూ, అత్యంత దుర్గంధ భూయిష్ఠమై యుండెను. అంత దేవతలందరూ ఆయనకు నమస్కరించిరి. అంత బృహస్పతి తన ఉత్తరీయముతో తన నాసికా రంధ్రములు మూసికొని, ఇంద్రునిచే స్నానము, పునరాచమనము కావించి, పిదప షడక్షర మంత్రోపదేశము ఒనర్చెను. మరుక్షణము ఇంద్రుడు దివ్య దేహుడై, సహస్రాక్షుడై, రెండవ సూర్యుని వలె వెలుగొందెను. దేవతలు జయజయ ధ్వానములు కావించిరి. దేవ దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్ఠి కురిసినది. నారదాది మునులు ఇంద్రునికి ఆశీర్వచనము కావించిరి. కొందరు దేవతలు ఆయనను ఆలింగనము చేసికొనిరి. కొందరు సమస్కరించిరి. కొందరు తాము సనాథులమైతిమని నుడివిరి. మరి కొందరు ఆయన లేని అమరావతి చంద్రుడు లేని ఆకాశమని, సుఖవర్జితమనియు, ఆయన పునరాగమనము చే తాము ప్రసన్నులమైతిమని శెలవిడిరి.

అంత సహస్రాక్షుడు మిక్కిలి సంతసిల్లి ఇట్లనియె "దేవర్షులకు, దేవతలందరికీ, దేవగురువుకు నా నమస్కారము. మీరందరూ నన్ను ఉద్ధరించిరి. ఈనాడు నేను మిమ్ము శరణుజొచ్చుచున్నాను. మీరు గౌతముని ఏ విధముగ ప్రసన్నుని కావించిరి?" అంత దేవతలు జరిగిన విషయమంతయు ఆయనకు విన్నవించిరి. "అమరేశ్వరా! ఇక మీరు అమరావతికి రావలసినది" అని ప్రార్థించిరి. అంత శచీపతి "దేవతలారా! నేను ఈ షడక్షర మంత్రముతో శ్రీగణేశుని ఉపాసించి, ఆయనను ప్రసన్నుని గావించి, ఆయన కృపను సంపూర్ణముగ పొందిన పిదపనే తిరిగి అమరావతికి ఏతెంచెదను. మీరందరూ మిగుల ప్రశంశనీయమయిన కార్యమాచరించిరి. అందువలన మీరు మీ దివ్యధామముల కేగవలసినది. మీ సేవలు అనన్య సామాన్యము."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి ఇంద్రుని శాప విముక్తి అను ముప్పది మూడవ అధ్యాయము సమాప్తము)

ముప్పదినాల్గవ అధ్యాయము

(ఇంద్రునికి శ్రీగణేశ సాక్షాత్కారము)

అంత జంభాసురహంత అయిన మహేంద్రుడు కదంబవృక్ష ఛాయన సుఖాసనమున కూర్చొని మనస్సును నిగ్రహించి, నాసికాగ్రమున నిలిపి శ్రీగణేశుని షడక్షర మంత్రజపము గావించెను. ఆయన కేవలము వాయుభక్షణము కావించుచూ, సహస్రవర్షములు తపమొనరించెను. స్థిరమయిన పర్వత శిఖరము వలె మహేంద్రుడు కదలక యుండుటచే ఆయన శరీరము చిక్కిశల్యమై, చుట్టూ వల్మీకములు పెరిగినవి. అంత సర్వగుడు, సర్వజ్ఞుడు, అత్యుగ్రతేజుడు, స్వకీయతేజము చే సూర్య చంద్రాగ్నులను సహితము తేజోహీనమొనర్పగల తేజోమూర్తి, చతుర్భుజుడు, రత్నజటిత మకుట మాలాధారుడు, బాహువులకు సుందరమయిన అంగదములు దాల్చినవాడు, కుండలాలంకృతుడు, కంఠము నందు మణి ముత్యముల మాలలు, నడుమునకు కటి సూత్రము, పాదములకు నూపురములు ధరించిన పద్మనేత్రుడు, కమలమాలాధారి అయిన శ్రీగణేశుడు ఆ పురంధరుని ఎదుట నిలచెను. తానింతకముందు ఎన్నడూ చూడని ఈ విచిత్ర మహోన్నత రూపమును గాంచి ఇంద్రుడు భయభీతుడై, శరీరమంతయు స్వేదముతో నిండగా బోధిపత్రము వలె వణకనారంభించెను. దానిని గ్రహించిన శ్రీగణేశుడు "దేవరాజా! భయము వలదు. నిర్గుణ, నిర్వికార, చిదానంద, సనాతన, కారణరహిత, అవ్యక్త జగత్కారణుడైన శ్రీగణేశుని నేనే! మనోవాంఛిత వరము కోరుకొనుము."

ఈ మధుర వచనములాలకించి పురంధరుడు పరమభక్తి తో లేచి, ఆ పరమాత్ముని పాదములంటి ఇట్లనియె "ఓ! మహాబాహూ! త్రిమూర్తులే మీ గుణములు తెలియరన్న నేనెంత? నేను కేవలము వంద యజ్ఞములు కావించి, ఆ పుణ్య ఫలము చే లభించు కృత్రిమమైన ఇంద్రపదవిని భోగించుచూ, అనేక విఘ్నములు పొందుచున్న నాకు మీ మహిమ ఎట్లు తెలియును? ఓ! విఘ్ననాయకా! ఎవరికి మీ యొక్క సంపూర్ణ అనుగ్రహముండునో వారు మాత్రమే మిమ్ములను తెలియుదురు. స్వామీ! నీవు నిరాధారుడవైనప్పటికీ సమస్త విశ్వమునకు ఆధారభూతుడవు. నీవే జ్ఞానరూపుడవు, అజరామరుడవు, నిత్యానంద పూర్ణుడవు, క్షరాక్షరుడవు, విశ్వరూపి మరియు పరమాత్ముడవు. ప్రభూ! సనకాదులు కఠోర తపముచే మిమ్ము తెలిసికొని నివృతి పరాయణులైరి. షడక్షర ప్రభావము చే నాకు మీ దివ్య దర్శనమైనది. పూర్వకాలమందు బ్రహ్మ నాకు ఈ మంత్రోపదేశము ఒనర్చి, దీనిని విస్మరించిన ఎడల దుర్దశ ప్రాప్తించునని హెచ్చరించెను. కానీ దుర్భాగ్య వశమున నేను ఈ మంత్రమును మరచి, అత్యంత కామలోలుడనై గౌతమపత్ని అయిన అహల్యను చెరచితిని. ఆ పాపము చే ఈ దుర్గతి ప్రాప్తించినది. తిరిగి దేవగురువు బృహస్పతి పునరుపదేశము చే సహస్రాక్షుడనై మిమ్ము దర్శించుచున్నాను. స్వామీ! ఈ కదంబనగరమును చింతామణి పురముగ విఖ్యాతి గావింపవలసినది. నాకు మీ విస్మరణము ఎన్నడునూ గాకుండు గాక! నా మనస్సు ఎల్లప్పుడూ మీ పద కమలముల యందే సుప్రతిష్టమై యుండుగాక! ఇచట గల విశాల సరోవరము చింతామణి తీర్థమను పేర ప్రసిద్ధకెక్కి ఇందు స్నాన దానాదులు కావించిన ధార్మిక జనులకు ధర్మార్ధకామమోక్షములనెడు చతుర్విధ పురుషార్ధములు, యధేష్ఠ సిద్ధులు ప్రాప్తించు గాక!"

అంత శ్రీగణేశుడు "తథాస్తు" అని దీవించి ఇట్లనియె "ఈ స్థలము "చింతామణి తీర్ధము" గా ప్రసిద్ధికెక్కి నేనిచట చింతామణి వినాయకునిగ వెలసి భక్తుల కోర్కెలను పూర్ణమొనర్చెదను. నీవు నా షడక్షర మంత్రము మరువక విఘ్నములు పొడసూపినపుడు నన్ను తలంచుము. నేను తప్పక ఆవిర్భూతుడనై నిన్ను రక్షింతును." అంత పురంధరుడు ఇతర దేవతలతో కలసి సర్లోక గంగాజలము చే శ్రీగణేశుని అభిషేక పూజన మాచరించెను. తదుపరి శ్రీగణేశుడు అంతర్ధానుడయ్యెను. ఆ ప్రదేశమున ఇంద్రుడు స్ఫటిక మణులతో నిర్మించిన సర్వాంగ సుందరమైన గణేశమూర్తిని

స్థాపించి, దానిచుట్టూ అత్యద్భుతమైన మందిరమును నిర్మించి, ప్రదక్షిణ మాచరించి, అమరావతికి ఏగెను. అచటగల సరోవరము ఇప్పటికీ చింతామణి సరోవరమను పేర విఖ్యాతి గాంచెను. ఇంద్రుని ఆదేశానుసారముగ స్వర్గ గంగ ప్రతిదినము అచటికి ఏతెంచి, తన జలములతో వినాయకమూర్తిని అభిషేకమొనర్చు చుండును. రుక్మాంగదా! ఈ విధముగ నీకు చింతామణి గణపతి క్షేత్ర మహిమను తెలిపితిని. ఈ శ్రీ సంపన్న శుభక్షేత్రము సర్వదోష నివారిణి అయిన సర్వ మనోవాంఛిత కామనా పూర్ణమొనరించు మహాతీర్ధము. అందువల్ల నీవునూ అచటికేగి యధావిధిగా స్నానమాచరింపవలసినది. నిస్సందేహముగ నీ దోషములు తొలగును. అంత నారద మహర్షి రుక్మాంగదుని ఆశీర్వదించి, అనుగ్రహించి, అంతర్ధానుడయ్యెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి ఇంద్రునికి శ్రీగణేశ సాక్షాత్కారము అను ముప్పది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ముప్పది అయిదవ అధ్యాయము

(రుక్మాంగదాదుల ముక్తి)

వ్యాసమహర్షి "పితామహా! నారద మహర్షి వెడలిన పిదప రుక్మాంగదుడు ఏమి చేసెను? పరమ మనోహరమైన తదుపరి ఆఖ్యానమును తెలుప వలసినది." చతుర్ముఖ బ్రహ్మ "రుక్మాంగదుడు చింతామణి గణేశుని తీర్ధమునకు ఏగుటకు సన్నద్ధుడగుచుండగా ఎదురుగ తన చతురంగ బల సమేత సైన్యము కానబడెను. వారునూ మహారాజును గాంచి "స్వర్ణదేహుడగు మహారాజు ఎట్లు ఈ విధముగ రోగగ్రస్తుడయ్యెను?" అని చింతించుచూ, దగ్గరకు వచ్చి, నమస్కరించి, వినీతులై ఇట్లనిరి "మహారాజా! మేమ మిమ్ము వెదకుచూ కొండలు, గుట్టలు, అరణ్యములు, అన్ని ప్రదేశములు గాలించితిమి. మీకు ఈ వితర్క పరిస్థితి ఎట్లు కలిగినది? తెలుపవలసినది." అంత రుక్మాంగదుడు వారికి జరిగిన విషయములన్నియు తెలిపి, తాను చింతామణి గణేశుని తీర్ధమునకు ఏగుచున్నానని, వారిని కూడా తనతో ఆహ్వానించెను. అంత వారందరూ కలసి ఆ తీర్ధమున కేగిరి. ఆ దివ్యతీర్ధ సందర్శనమవ్వగనే రుక్మాంగదుని రుగ్మత సంపూర్ణముగ నశించి ఆయన స్వర్ణదేహుడాయెను. అంత రుక్మాంగదుడు నారద మహర్షి పలుకులను సంస్మరించి, ఆ తీర్ధమున స్నానమాచరించి, చింతామణి గణపతికి పూజనము చేసి, అనేక విధములయిన దానములర్పించెను. రాజు సైన్యము సహితము అట్లే కావించెను. తక్షణము మహారాజు, సైన్యము, అక్కడయున్న బ్రాహ్మణులు అందరూ ఒక గొప్ప సూర్య సమాన తేజోరాశిని కాంచిరి. అందు వారికి వినాయక గణములు, అప్సరసలు, కిన్నెరులు, కానబడిరి. అంత రాజు వారినిట్లు ప్రశ్నించెను. "మహాత్ములారా! మీరెవరు? ఎక్కడ నుండి ఏతెంచిరి? మీరు ఎవరి దూతలు? మీ కర్తవ్యమేమి? మాకు తెలుపవలసినది."

అంత గణములు ఇట్లు తెలిపిరి "ఓ! మహాభాగా! మేము చింతామణి గణేశుని దూతలము. నీవు ధన్యుడవు. ఎందుకనగా నీవు ఎంతో శ్రద్ధతో భగవానుడయిన చింతామణి గణేశుని పూజించితివి. యధావిధిగ ఈ తీర్ధయాత్ర కావించితివి. ఈ తీర్ధక్షేత్రము చింతించిన కోరికలన్నింటినీ తీర్చును కావున చింతామణి గణేశ తీర్ధ క్షేత్రమని ప్రసిద్ధి నొందినది. ఓ! సువ్రతా! నీ దర్శనము చే మేము సహితము కృతకృత్యుల మయితిమి. ఓ! భక్తాగ్రేసరా! నీ భక్తి మహిమను మేము వర్ణింపలేము. నీవు నీ సంపూర్ణ తను, మాన, ప్రాణములతో అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీగణేశుని ఆరాధించితివి. ఆ మహాప్రభువు నిన్ను చూచుటకు ఉత్సుకుడగుచున్నాడు. అందువలన మేము ఈ ఆకాశ గమన విమానమును గొనితెచ్చితిమి. దయచేసి దీనిని అధిరోహింప వలసినది". అంత రుక్మాంగదుడు ఆ దూతలకు సాష్టాంగ

దండ ప్రణామములాచరించి “ఆహా! మీదేమి పుణ్యము! మీరు నిరంతరము చర్మ చక్షువులకు దర్శింపరాని వినాయకుని ప్రత్యక్షముగ కాంచుచుందురు. మీ పవిత్ర దర్శనము అవశ్యము శుభఫల ప్రదము. ఓ! దూతలారా! ముంబుద్ధినైన నేనెక్కడ? అఖండ, అప్రమేయ, అప్రతిహత, విభు, చిన్మాత్ర, సృష్టిస్థిత్యంతకారుడెక్కడ? ఆయనకు నాపై ఇంత ఆదరము కలుగుటకు కారణమేమి? నా పూర్వ పుణ్యఫలమా? లేక ఈ తీర్ధరాజమందు స్నానమాచరించిన ఫలమా? దయచేసి తెలుపవలసినది. అంతేకాక నా తండ్రి భీమ మహారాజు సత్యవాది, భీషణ పరాక్రముడు, దేవ భూసుర పూజా తత్పరుడు, మరియు నా తల్లి చారుహాసిని శ్రీగణేశుని మహా భక్తురాలు. వారిరువురినీ వదలి నేనెట్లు రాగలను?” అంత ఆ దూతలు “అట్లయిన నీవు ఈ తీర్ధమందు స్నానమాచరించి, అద్దాని ఫలమును వారిరువురికీ దానమొనర్పుము. వారిని సహితము విమానములతో శ్రీగణేశుని వద్దకు గొనిపోయెదము.” అంత ఆ రాకుమారుడు తిరిగి తీర్ధస్నానము యధావిధిగ ఆచరించి, గ్రంధిబంధన మంత్రము ఉచ్చరించుచూ, తన తల్లిదండ్రుల కొరకే గాక, సమస్త రాజ్యప్రజల కోసమై గావించెను.

అంత రుక్మాంగద మహారాజు ఆ విమాన మధిరోహించి, తన సేనా సహితుడై కౌండిన్యపురము ప్రవేశించెను. ఆ విమానమందు ఆశీనులైన సైన్యము, బ్రాహ్మణుల వేద పఠనము, గంధర్వుల గానము, అప్సరసల నృత్యము చే భూనభోంతరాళములు దద్దరిల్లెను. అంత రుక్మాంగదుడు తనచే చేయబడిన వినాయక తీర్ధ పుణ్యములను తన తల్లిదండ్రులకు, సర్వజనులకు దానమొనర్చెను. అంత వినాయకుని అనుగ్రహము చే సర్వులకు విమానము లేతెంచినవి. అంత వారందరూ – బ్రాహ్మణుల నుండి ఛండాలుర వరకు, ఆబాల వృద్ధజనము, గణేశ తీర్ధస్నాన పుణ్య ప్రభావము చే స్వర్గమున కేగిరి. రుక్మాంగదుడు, ఆతని తల్లిదండ్రులు శ్రీగణేశుని చేరిరి. బ్రహ్మ “పరాశర పుత్రా! నీకు చింతామణి గణేశుని క్షేత్ర, తీర్ధ, మహాత్మ్యమును సంపూర్ణముగ ఎరింగించితిని. ఏ మానవుడు ఈ ఆఖ్యానమును భక్తి పూర్వకముగ శ్రవణము కావించునో, వారికి సహితము ఈ తీర్ధ స్నానఫలము లభించును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి రుక్మాంగదాదుల ముక్తి యను ముప్పది అయిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఆరవ అధ్యాయము

(ముకుందా చరితము)

వ్యాసుడు “మహాత్మా! పితామహా! మీ దయ చే రుక్మాంగద చరిత్రమును ఆకర్ణించితిని. నా మనసు నందు ఒక సందేహముదయించు చున్నది. రుక్మాంగదుని చే తిరస్కరింపబడిన ముకుంద ఏమైనది? ఆమెను గూర్చి తెలుపవలసినది.” అంత చతుర్ముఖ బ్రహ్మ “పరాశరపుత్రా! రుక్మాంగదుడు వెడలిన పిదప ముకుంద గ్రీష్మ ఋతువు నందు దావాగ్ని చే మండింపబడు మహావనము వలె కామాగ్ని యందు భస్మీపటలమగుట నారంభించెను. ఆమెకు వనమునందు, శీతలపవనమందు, లతాపుష్పనికుంజములయందు, శశాంకుని తెల్లని వెన్నెల యందు, చందన లేపనముల చేతనూ, వీటి వేటివలననూ కించిత్ సుఖము లభింపలేదు. నృత్య, గీత, హాస్యాదులు సహితము వెగటుగ అనిపించినవి. అత్యంత కామవిహ్వలత్వము తో భ్రమితచిత్త అయిన ముకుందకు అన్నపానములు సహితము రుచింపనయ్యె! అంత ఆమె అన్నపానములు మాని వనమున సంచరించుచూ, శ్రమ వలన నిద్దుర కలిగి ఒక చోట శయనించెను. ఈ విషయ విశేషమంతయు లోకపాలకుడయిన ఇంద్రుడు గమనించి, ఆయన రుక్మాంగదుని రూపము ధరించి, ముకుంద వద్దకు ఏతెంచి ఆమెను మేల్కొలిపెను. ముకుంద మెలకువగొని, మాయా రుక్మాంగదుని కాంచి హర్షాతిరేకముగ ఆతనిని

కౌగిలించెను. ఇరువురు నిస్సంకోచముగ వివస్త్రలై నిరవధిక సంభోగసుఖము ననుభవించిరి. తాపము తీరిన పిదప ముకుంద తన గృహమునకు చనెను. ఇంద్రుడు అదృశ్యుడయ్యెను.

ఇంద్రునితో సుఖభోగానంతరము కొన్నాళ్ళకు ముకుంద గర్భవతియై, నెలలు నిండిన పిదప, ఒక సుముహూర్తమున శుభలక్షణయుతుడయిన ఒక బాలుని ప్రసవించెను. ఆ బాలుడు సుమనోహరుడు, సర్వాంగ సుందరుడు. ఆ బాలుడు భూమిపై పడగనే ఒక మహానాదము ఉద్భవించి భూనభోంతరాళములు విస్తరిల్లెను. అంత వాచక్నవి మహర్షి ఏతెంచి, ఆ బాలుని కాంచి, తన కుమారుడే అనుకొని, అత్యంత హర్షితుడాయెను. ఆయనకు ముకుంద చే కావింపబడిన వ్యభిచార విషయము ఇంచుక తెలియదయ్యె! ఆయన ఆ శిశువునకు జాతకర్మాదులు నిర్వహించి, యథావిధిగ దానములొసగి, పది దినములు గడచిన పిదప జ్యోతిశ్శాస్త్ర పండితుల ఆజ్ఞానుసారము ఆ బాలునికి "గృత్సమదుడు" అని నామకరణ మొనర్చెను. ఆ బాలునికి అయిదవ ఏట ఉపనయనము, కావించి చతుర్వేద వ్రత సంస్కారములు – మహానామ్నీ వ్రతము, మహావ్రతము, ఉపనిషద్ వ్రతము, గోదానము చేసెను. మహా బ్రహ్మ తేజోసంపన్నుడయిన గృత్సమదుడు ఏకసంధాగ్రాహి అగుటచే అచిర కాలములోనే వేద శాస్త్రములందు నిష్ణాతుడై, బ్రాహ్మణోచిత కర్మకాండ యందు కుశలుడయ్యెను. ఒకానొక శుభ ముహూర్తమున వాచక్నవి తన పుత్రుని "గణాణాంత్వా" మొదలగు ఋగ్వేద మంత్రములను ఉపదేశించి "ఈ మంత్రము అఖిల సిద్ధులు కలుగజేయు మహామంత్రము. ఈ మంత్రము చే స్థిరచిత్తుడవై శ్రీగణేశుని జపింపుము. నీవు మంత్రసిద్ధిని పొందిన ఎడల విశ్వవిఖ్యాతుడవగుదువు" అని తెలిపెను. అంత గృత్సమదుడు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆ మంత్రమును గ్రహించి, చాలాకాలము జపధ్యానములతో ఆ మంత్రముననుష్ఠించెను.

కాలము బహు చిత్రము కదా! ఆ సమయమున "మాగధుడు" అను మహారాజు మగధ రాజ్యమును ఏలుచుండెను. ఆయన సుందరుడు, స్వాభిమాని, వీరుడు, శత్రుభంజనుడు, నానాభూషణ భూషితుడు, చతురంగ బల సమేతుడు, జ్ఞాని మరియు పండితుల యెడల పరమపూజ్య భావము గల మహనీయుడు. ఆయనకు బృహస్పతి సములయిన ఇరువురు అమాత్యులు కలరు. ఆయన ధర్మపత్ని అంబిక. ఆమె పతివ్రత, అత్యంత గుణరూపవతి, అంతేకాక శాపానుగ్రహ సమర్ధురాలు. ఈ విధముగ వీరందరిచే పరవేష్ఠితుడై మాగధుడు ద్వితీయ శశాంకుని వలె వెలుగొందువాడు. ఒకనాడు ఆ మహారాజు యొక్క తండ్రి ఆబ్దీకము వచ్చినది. ఆ శ్రాద్ధ ప్రక్రియకు అనేక మంది వేద పండితులు, అత్రి, వశిష్ఠాది మహర్షులు సహితము ఏతెంచిరి. శ్రాద్ధ కర్మ అనంతరము శాస్త్ర చర్చా కార్యక్రమము జరిగెను. ఆ చర్చ యందు గృత్సమదుడు కించిత్ ప్రౌఢిమతో, దర్పము వహించి, అధిక్షేపణగా వాదనలను వినిపించెను. అంత అత్రి మహర్షి ఆ మునుల సన్నిధిని "గృత్సమదా! ధిక్కారము!! నీవు తపస్వివి. అందువలన మాన్యుడవు. కానీ నీవు మునివి కాదు. నీ జన్మము రుక్మాంగదుని వీర్యము వలన జరిగినది. నీవు ఈ సభ యందు పూజనీయుడవు కాదు. నీవు నీ ఆశ్రమమునకు వెళ్ళవలసినది." అంత గృత్సమదుడు నివ్వెరపోయి, కొంత తడవు నిరత్తరుడై, తుదకు సంభాళించుకొని, క్రోధోద్రిక్తుడై, కన్నుల అగ్నికణములు రాలుచుండగా ఇట్లనియె "ఓ! మునులారా! నేను ఈ అత్రిమహర్షి పలికినట్లు రుక్మాంగదుని ఔరసపుత్రుని కాని ఎడల, తిరిగి వచ్చి మిమ్ములనందరినీ భస్మీభూతుల గావించెదను." ఆతని అవధులు లేని క్రోధమునకు చాలామంది మునిజనులు నలుదిశలా పలాయనులైరి. అంత గృత్సమదుడు గృహమునకేగి కన్నుల విస్ఫులింగములు విరజిమ్ముచుండగా తన తల్లిని ఇట్లు ప్రశ్నించెను "ఓ! కాముకీ! దుష్టులారా! ముకుందా! నా తండ్రి ఎవరో తెలుపుము. నిజము పలుకనిచో నిన్ను భస్మీపటలము కావింతును." అంత ముకుంద ఆ వచనములు విని భయవిహ్వలయై ప్రచండ వాయువేగమునకు కంపించు కదలీతరువు వలె వణకుచూ అంజలి ఘటించి దీనురాలై ఇట్లనియె "నాయనా! చాలాకాలము క్రితము మృగయా వినోదియై త్రిలోక సుందరుడైన రుక్మాంగద మహారాజు ఇచట కేతెంచెను. ఆ సమయమున నా ప్రియపతి వాచక్నవి అనుష్ఠాన తత్పరుడై బ్రహ్మ చర్యము పాటించుచుండెను. ఆ సమయమున "స్త్రీలు తమ కామసంతృప్తికై

స్వచ్ఛందస్వేచ్ఛ గలవారలు" అను బ్రహ్మ వచనమును అనుసరించి నేను ఆ మహారాజు నందు కామాసక్తనై ఆయనను చేరితిని. ఆ మహారాజే నీ తండ్రి" అని పలికి మౌనము వహించెను. అంత ముని నోటమాటరాక కొంత తడవు ఊరకుండి, ఇట్లు శపించెను "నీవు దుష్టురాలివి, మూర్ఖురాలివి మరియు పాపాచారిణివి. నీవు వనమందు ఒక కంటక వృక్షము అగుదువు. ఆ వృక్షమునకు అనేక ఫలములుండును. కానీ ఏ ప్రాణి సహితము ఆ ఫలములారగించుటకు ఇచ్చగించరు." అంత ముకుంద సహితము క్రోధోద్రిక్తయై "నీకు ఒక మహాబలుడగు పుత్రుడు కలుగును. ఆ దైత్యుడు త్రిలోకములను పీడించి, భయభీతుల గావించును" అని ప్రతిశాపమిడెను. మరుక్షణము ముకుంద శరీరత్యాగమొనర్చి, సర్వులు త్యజించు కంటక వృక్షముగ మారెను. అంత అంతరిక్షము నుండి "గృత్సమదా! నీ తండ్రి రుక్మాంగదుడు కాదు. నీవు ఇంద్రుని తేజస్సుతో జన్మించితివి" అని అశరీరవాణి పలికెను. అంత గృత్సమదుడు అనుష్ఠానమునకై వనముల కరిగెను. ఈ గృత్సమదాఖ్యానమును ఎవరు శ్రవణము కావింతురో వారికి సంకటములు నాశనమయి మనోకామనలు పూర్ణమగును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి ముకుందా చరితమను ముప్పది ఆరవ అధ్యాయము సమాప్తము)

ముప్పదిఏడవ అధ్యాయము

(వరద వినాయక ఆవిర్భావము)

వనములకేగిన గృత్సమదుడు అనేక విధముల తిరుగుచూ చివరకు "పుష్పకము" అను వనము చేరెను. ఆ వనము నానా లతా, పుష్ప, వృక్ష పరివృతమై, నిరంతర నిర్ఝరముల ధ్వనితో, ప్రతిధ్వనించుచూ, జరా రహితులైన శ్రేష్ఠ మునులతో నిండియుండెను. గృత్సమదుడు ఆ మునుల అనుమతితో అచటనే నివాసమేర్పరుచుకొని, తన ఒంటికాలి బొటనవ్రేలిపై నిలబడి, నిశ్చలమనస్కుడై, విఘ్నేశ్వర భగవానుని ధ్యానమొనర్ప నారంభించెను. తదుపరి దశదిశల యందు పరుగులెత్తుచున్న మనో దృష్టులను వెనుకకు మరల్చి, నాసికాగ్రముపై నిలిపి, జితేంద్రియుడై, తన శ్వాసను నియంత్రించి, కేవలము వాయుభక్షకుడై, తన మనసుపై విజయము సాధించి, వేయి దివ్య వత్సరములు కఠోర తపమాచరించెను. ఆయన కన్నుల నుండి అత్యుగ్రమయిన ఉష్ణము ఉత్పన్నమై దేవతలను తప్తమొనర్చుట మొదలిడెను. అంత అనిమేషులు "ఈ కఠోరతపము ఈ ముని దేని కోసము చేయుచున్నాడు?" అని సంశయపడిరి. అంత ఒకనాడు గృత్సమదుడు కనులు తెరచి, చెట్టు నుండి రాలిన ఒక పత్రమును స్వీకరించి, తిరిగి ప్రయత్న పూర్వకముగ మనసును నిశ్చలమొనర్చి ఏబదివేల సంవత్సరముల దుష్కర తపమాచరించెను. అంత జగన్నాథుడు శ్రీగణేశుడు అంబారావము తో పిలుచుచున్న దూడ వద్దకు పరుగులెత్తు ఆవు వలె ఆ ముని వద్దకు ఏతెంచెను. ఆ సమయమున ఆ మహాప్రభువు విశాలకాయుడై, సింహారూఢుడై, దశభుజుడై, నాగయజ్ఞోపవీతుడై, శరీరమంతయు కుంకుమాగరుకస్తూరి మొదలగు సుగంధ లేపనములతో, కోటిసూర్య ప్రకాశుడై, సిద్ధి బుద్ధియుతుడై యుండెను. ఆ రూపము అనిర్వచనీయము. ఆ ప్రకాశము చే ముని యొక్క తేజము సూర్యుని ముందు నక్షత్రముల వలె వెలవెపోయెను. ముని భయ విహ్వలుడై మూర్ఛనొంది నేలపై బడెను. కొంత తడవు గడచిన పిమ్మట స్వస్థుడై, మనసున శ్రీగణేశుని ధ్యానించుచూ, ఈ మహాభూతమెవరని తర్కించి, చివరకు శ్రీగణేశుని శరణువేడి ఇట్లనియె "మహాప్రభూ! ఈ విఘ్నరూప మహాభూతమెవరు? మునులు నా సహపంక్తి యందు కూర్చొనుట కిచ్చగింపక నేను పూజనీయుడను కాదు అని నిర్ధారించిరి. ఆ అవమాన

భారము చే నా మది బాధనొందుచున్నది."

అంత శ్రీగణేశుడిట్లనియె "వత్సా! నేను నిన్ననుగ్రహించుటకు ఏతెంచిన వినాయకుడను. భయము వలదు, నీ కఠోర తపస్సు చే నేను ప్రసన్నుడనైతిని." అంత గృత్సమదుడు ఆ మధుర వచనములచే ఆనందమగ్నుడై, కన్నులనుండి ఆనంద భాష్పములు రాలుచుండగా ఇట్లనియె "స్వామీ! అఖండానంద స్వరూపుడవు, నిరాకార, చిదానంద ఘనుడవు, వేద శాస్త్రములకు అగోచరుడవైన నీవు ప్రత్యక్ష దర్శనము ప్రసాదించుట చే నా నియమములు, తపస్సు, జన్మము సఫలీకృతములు అయినవి. ప్రభూ! ఎనుబదినాలుగు లక్షల జీవరాశుల యందునూ మనుష్య జన్మము ఉత్తమము అని తెలుపబడినది. అందు వర్ణ రహితుల కంటె చాతుర్వర్ణములు మెరుగు. చాతుర్వర్ణముల యందు బ్రాహ్మణుడుత్తముడు. ఆ బ్రాహ్మణుల యందు శ్రేష్ఠుడు జ్ఞాని. ఆ జ్ఞానులందు అనుష్ఠానపరులు, వారి యందు బ్రహ్మవేత్తలు ఉత్తమోత్తములు. ఓ! జగదీశ్వరా! నాకు నిష్కల్మష బ్రహ్మజ్ఞానమును, నీ పాదముల యందు నిరంతర భక్తినీ ప్రసాదింపవలసినది. నేను నీ భక్తులందరి యందునూ సర్వ శ్రేష్ఠుడను కావలెను. నేను త్రిలోకముల యందు ఏ ప్రాణినైననూ ఆకర్షించు దక్షత, అంతేకాక సర్వ లోకములందు దేవ, మానవ, తిర్యకులందరిలో విఖ్యాతుడను, వందనీయుడను కావలెను. స్వామీ! ఈ వనము పుష్పకమను పేర ప్రసిద్ధినొందినది. ఇకనుండి ఇచట నీవు వెలసి, ఉపస్థితుడవై, భక్తుల కామనలన్నింటినీ ఈడేర్చుచూ ఈ పురమును "గణేశపురము" అను పేర ప్రఖ్యాతి నొనర్పుము.

అంత శ్రీగణేశుడు "ఓ! మహాబాహూ! నా భక్తులకు దుర్లభమయినది ఏదియునూ లేదు. నీ మనోవాంఛితములన్నియు పూర్ణమగును. నీవు "గణానాంత్వా" మొదలగు మంత్రములతో జనమొనర్చిన కారణమున ఆ వరములన్నియు ఒసగితిని. నీవు వశిష్ఠాది మునులందరి కంటెను శ్రేష్ఠుడవగుదువు. ఏ కార్యారంభమునైననూ తొలుత నిన్ను స్మరించి, పిదప నన్ను స్మరించిన ఎడల వారికి కార్యసిద్ధి కలుగును. మంత్రములందు దేవత, ఋషి, ఛందస్సు, జ్ఞానము లేకుండ మంత్రోపాసన మొనర్చిన ఎడల అయ్యది నిష్ఫలమగును. నీకు దేవతలకు సహితము అసాధ్యుడు, అమిత బలవంతుడయిన ఒక పుత్రుడు కలుగును. అతడు త్రిలోకవిఖ్యాతుడై, రుద్రునికి మినహా మిగిలిన దేవతలందరికీ అజేయుడగును. ఆతడు నాయందు తీవ్రభక్తి కలిగి నాకు ఉత్తమ భక్తుడగును. నీవు తపమొనరించిన ఈ వనము కృతయుగమందు "పుష్పక"మనీ, త్రేతాయుగమందు "మణిపురము" అనీ, ద్వాపరమందు "భావకము" అనీ, కలియుగమందు "భద్రకము" అనీ విఖ్యాతి నొందును. ఇచట కావింపబడిన స్నాన దానాదులు తప్పక ఫలించును," అని పలికి ఆ పరమాత్ముడు అంతర్హితుడయ్యెను. అంత గృత్సమదుడు అచట ఒక శుభకర వినాయకమూర్తిని స్థాపించి, దాని చుట్టూ సుందర మందిర నిర్మాణమొనర్చి, ఆయనకు "వరద వినాయకుడు" అను నామ మొసంగెను. ఆ పుణ్య క్షేత్రమందు కావించిన స్నానాదులు ఫలించి మనోకామనలు తప్పక పూర్ణమగును. అచట గృత్సమదుడు చిరకాలము అత్యంత భక్తి ప్రపత్తులతో వరద వినాయకుని అర్చించెను. ఏ వ్యక్తి ఈ ఆఖ్యానమును భక్తితో శ్రవణము చేయునో, ఆతడు/ఆమె తన మనోవాంఛితములు పూర్ణమొనర్చుకొని, సంసార సాగరము నుండి ఉద్ధరింపబడి, ముక్తినొసగు శ్రీగణేశ భక్తిని ప్రాప్తించును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి వరద వినాయక ఆవిర్భావము అను ముప్పది ఏడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఎనిమిదవ అధ్యాయము

(త్రిపురాసుర జననము)

ఈ పరమ పవిత్రాఖ్యానమును అత్యంత శ్రద్ధాభక్తులతో వినుచున్న వ్యాస భగవానుడు చతురాననుని ఇట్లు

ప్రశ్నించెను "పితామహా! తదుపరి గృత్సమదుడేమి చేసెను? దయచేసి తెలుపవలసినది." అంత విరించి "తదుపరి గృత్సమదుడు ప్రపంచమున తిరిగి ప్రవేశించెను. ఆయనను మునులందరూ శ్రీగణేశానుగ్రహము చే అత్యంత ఆదరముగ ఆహ్వానించి సన్మానించిరి. యజ్ఞకర్మలందు తొలుత ఆ మహర్షిని, తదుపరి శ్రీగణేశుని స్మరించుట చే గృత్సమదుడు త్రిలోక విఖ్యాతుడయ్యెను. గృత్సమదుడు మాత్రము మనసున ఏమాత్రము గర్వాహంకారములు పొందక, నిశ్చల మనస్కుడై శ్రీగణేశ మంత్రమును ప్రగాఢ భక్తితో జపించుచుండెను. ఈ విధముగ గృత్సమదుడు ప్రశాంతముగ జీవించుచుండగా ఒకనాడు ఒక విచిత్రము జరిగినది. ఒకనాడు గృత్సమదుడు అకస్మాత్తుగా ఒక భయంకర శబ్దముతో తుమ్మెను. ఆ శబ్దము భూనభోంతరాళమును, గిరి కంధరములను, సర్వ దిశలను మారుమ్రోగెను. ఆయన అద్దాని నుండి తేరుకొని ఎదురుగ ఒక జపాకుసుమ సంకాశుడైన భయంకర బాలకుని గాంచి, కించిత్ భయాతురుడై, మనసున ఇట్లు తలచెను "ఈ బాలకుని శ్రీగణేశ భగవానుడు ప్రసాదింపలేదుకదా?" ఈ విధముగ తలచి ఆ బాలుని పున:పరిశీలించెను. ఆ బాలుడు సుందరమైన కన్నులు, ముఖము, బంగారు అంగరాగములు, సువర్ణ ముకుట నూపురములు ధరించి యుండెను. అంత గృత్సమదుడు ఆ బాలుని "బాలకా! నీవు ఎవరి పుత్రుడవు? నీకు ఏమి కావలెను?" అని ప్రశ్నించెను. అంత ఆ బాలుడు "స్వామీ! మీరు భూత, భవిష్యత్, వర్తమాన ద్రష్టలు. అయిననూ మీరు అడిగిరి కావున తెలుపుట నా విధి. నేను మీ తుమ్ము నుండి ఉద్భవించితిని. నా మాతా పితరులు మీరే! తండ్రీ! మీరు కొలది దినములు నా పాలన, పోషణ కావింప వలసినది. నేను దేవరాజైన ఇంద్రుని పరాజితుని కావింతును. ఇందు సందేహము లేదు."

ఆ పలుకులకు గృత్సమదుడు ఏకకాలమున హర్షభయమునొంది ఇట్లు తలంచెను, "ఈతడు కేవలము బాలుడైనప్పటికీ ఇంద్ర పరాజయము గూర్చి పలుకుచున్నాడు. ఈతడు ఆ కార్యము ఒనర్చుటకు సమర్థుడు. అందువలన నా ఆత్మజుడైన ఇతనికి నేను వినాయక మంత్రముపదేశించెదను. అందువలన వినాయక భగవానుడు సంతుష్టుడై, జగత్తు యందు నా యశము మరింత విస్తృతమగును." తదుపరి గృత్సమదుడు ఆ బాలునికి "గణానాంత్వా" మంత్రోపదేశమొనర్చి ఇట్లనియె "పుత్రా! ఈ దివ్య మంత్రమును గణేశ భగవానునిపై చిత్తము నిలిపి జపింపుము. ఆ భగవానుడు నీ యందు ప్రసన్నుడైన ఎడల నీ మనోవాంఛితములన్నియు పూర్ణమగును. అంత ఆ బాలుడు ఆ మంత్రోపదేశము నొంది, తపమాచరించుటకై విపినమునకేగి, ఒంటికాలి బొటనవ్రేలిపై నుంచొని పదిహేను వేల సంవత్సరములు తీవ్ర తపమాచరించెను. అంత శ్రీగణేశుడు ప్రసన్నుడై, దిశామండలములందలి అంధకారమును దూరమొనర్చి, సూర్యమండలమును ఆచ్ఛాదనమొనర్చి, సుందరమైన తొండమును సునాయాసముగ కదల్చుచూ, అచటికి ఏతెంచెను. ఆ సమయమున అచట ఒక అత్యద్భుత ఘీంకారనాదము వినబడెను. ఆ నాదమునకు ఉలిక్కిపడి బాలుడు కన్నులు తెరచి, ఎదురుగ దేవదేవుడయిన శ్రీగణేశుని కాంచెను. ఆ సమయమున భగవానుడు చతుర్భుజుడై, విశాలకాయుడై, నానావిధ వేషభాషాభూషితుడై, నాలుగు హస్తములందు పరశువు, కమలము, మాల, మోదకములు ధరించి యుండెను. అంత బాలకుడు కించిత్ ధైర్యము వహించి, రెండు చేతులు జోడించి "ప్రభూ! మిమ్ము శరణునొందిన భక్తుడనైన నన్ను మీరు ఏల భయభీతుని కావించుచున్నారు? మీ సౌమ్యరూపమును నాకు ఎరుకపరచవలసినది." అంత శ్రీగణేశుడు "వత్సా! భయపడవలదు. నీవు దివారాత్రములు ఎవరి కొరకై తపమొనర్చుచున్నావో ఆ గణేశుని నేనే!! నా స్వయంప్రకాశ దివ్యరూపమును త్రిమూర్తులు తెలియరనిన, మానవులు ఎట్లు తెలియుదరు? అయినను నీవు కావించిన తపము చే వివశుడనై నీ మనోవాంఛితములు పూర్ణమొనర్చుటకు నేను ఏతెంచితిని. నీ కోరికలు తెలుపుము."

అంత బాలకుడిట్లనియె "ప్రభూ! నేడు నేను, నా తండ్రి ధన్యులమైతిమి. నా జపతపములు సార్థకమైనవి. నేను బాలుడనగుటచే మిమ్ము స్తుతింపలేకున్నాను. మీరే జగత్ స్రష్టా, రక్ష, మరియు సంహారకులు. సూర్య చంద్రాగ్నులు సహితము మీ తేజస్సు చేతనే ప్రకాశించుచున్నవి. మీరు మీ విశిష్ఠ మహిమ చే చరాచర జగత్తును చైతన్యవంత

మొనరించుచున్నారు. మీ అనంత మహిమను త్రిమూర్తులు సహితము తెలియరు. ప్రభూ! నాకు త్రిలోకాధిపత్యము సాధించు శక్తి, దేవ, దానవ, మానవ, గంధర్వ, నాగ, రాక్షస, ముని, కిన్నెర, కింపురుష, చారణాదులందరూ నా వశమునందుండవలెను. నేను నా మనస్సు నందు దేనిని సంకల్పించిననూ, అది తక్షణము సిద్ధినొందవలెను. ఇంద్రాది లోకపాలకులు నా సేవకులు కావలెను. స్వామీ! మీరు నాకు ఇహలోకమందు అనేకానేక సుఖములిచ్చి, చివరకు ముక్తి నొసంగవలసినది. నాకు వేరొక కోరిక కూడా యున్నది. నేను ఉగ్ర తపమాచరించిన ఈ ప్రదేశము "గణేశపురము" అని ప్రసిద్ధికెక్కి, మీ దయ వలన ఇచట భక్తుల మనోవాంఛితములు పూర్ణమవవలెను. ప్రభూ! నాకు దయచేసి ఈ వరములు ప్రసాదింపవలసినది." అంత శ్రీగణేశుడు "వత్సా! నీవు త్రిలోకాధిపత్యము తప్పక పొందెదవు. నీకు సర్వులు వశవర్తులై యుందురు. నేను నీకు తదుపరి మూడు పురములు ప్రసాదించెను. సమయమాసన్నమయినపుడు నీకవి లభించును. ఆ పురములు స్వర్ణము, రజితము, లోహము (ఇనుము) తో తయారు చేయబడినవి. ఆ పురములు వాయువు కన్న వేగముగ నీ ఇచ్ఛము వచ్చినటుల చరించును. ఆకాశమార్గమున స్థితిగతమై యుండును. పరమశివునికి వినా వేరెవరికీ ఇవి అభేద్యములు. శివ భగవానుడు ఒకే బాణముతో మూడు పురములను ఒకే మారు భేదించినపుడు నీవు మృతుడవగుదువు. అయిననూ ప్రస్తుతము నీవు ఆ విషయమై భయగ్రస్తుడవు కానవసరము లేదు. నీ అన్య కామనలు సహితము నా కృపచే పూర్ణమగును" ఈ విధముగ పలికి శ్రీగణేశ భగవానుడు అంతర్హితుడయ్యెను. ఆ బాలకుడు "త్రిపురాసురునిగ" ప్రసిద్ధుడయ్యెను. అంత త్రిపురుడు శ్రీగణేశ భగవానుడు అంతర్ధానుడు అగుటచే కించిత్ విషాదగ్రస్తుడయి కోరిన కోరికలు లభించుట వలన హర్షయుక్తుడై త్రిలోక విజయప్రాప్తికై ప్రయత్నములు మొదలుపెట్టెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి త్రిపురాసుర జననము అను ముప్పది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది తొమ్మిదవ అధ్యాయము

(త్రిపురాసుర విజయము)

వ్యాస మునీంద్రుడు "పితామహా! వర గర్వితుడయిన త్రిపురాసురుడు తదుపరి ఏమి చేసెను? దయచేసి నాకు విస్తారముగ తెలుప వలసినది." అంత విరించి "త్రిపురుడు ఆ గణేశపుర మధ్యమున కాశ్మీర పాషాణములతో నిర్మితమయిన వినాయక మూర్తిని మంత్రవేత్తలయిన బ్రాహ్మణుల చే ప్రతిష్ఠింపజేసి, అద్దాని చుట్టూ స్వర్ణ నిర్మితము, మణిమయ భూషణమయిన ఒక గొప్ప దేవాలయము నిర్మించి, అందు ఆ శ్రీగణేశ భగవానుని షోడశోపచారములతో పూజించి, అసంఖ్యాకముగ ఆయనకు ప్రణామములర్పించి, ఆ భగవానుని ప్రసన్నుని కావించి, అచట నుండి బయలుదేరెను. తొలుత భూలోకాధిపతులను జయించి, మానవ లోకమును తన ఆధీనములోనికి తెచ్చుకొనెను. దశదిశలందలి రాజులు తమ చతురంగబల సమేతులై ఆ దైత్యుని వద్దకేతెంచిరి. అనుకూలురైన రాజులు ఆతనికి సేవకులైరి. వ్యతిరేకులందరూ సమరమున సమసిపోయిరి. ఆ విధముగ త్రిపురుడు అసంఖ్యాకమైన చతురంగబల సముపార్జన కావించి అమరావతిని జయించుటకు సన్నద్ధుడయ్యెను. ఆ సమయమున తన సేనను మూడు భాగములు గావించి, ఒక భాగమునకు ధనుర్విద్యా నిపుణుడు, శస్త్రాస్త్ర దక్షుడు, గద, మల్లయుద్ధ విశారదుడు అయిన భీమకాయుని అధిపతి గావించి ఆతనిని మానవ లోకమున తన ప్రతినిధిగ ప్రతిష్ఠించెను. రెండవ భాగమునకు అతులిత బలశాలి, పై గుణములన్నియు కలిగిన వజ్రదంష్ట్రుని అధిపతి గావించి ఆతనిని పాతాళ లోకమునకు ప్రతినిధిని కావించెను. మిగిలిన మూడవ భాగమునకు తాను స్వయముగా

నాయకత్వము వహించి ఇంద్రునిపై దండయాత్రకు బయలుదేరెను.

తొలుత ఆతడు నందన వనమున కేగి, అచటి సైనికులను ఖాతరు చేయక, ఆ వనమును చెరచి, దివ్య వృక్షములను విరచి, ఒక దూతను ఇంద్రుని వద్దకు సందేశమిచ్చి పంపెను. ఆ దూత పురంధరుని వద్దకేగి "ఇంద్రా! నీవు అమరావతి పాలనా పగ్గములు నా కప్పగించి, శీఘ్రమే మానవలోకమునకు ఏగవలసినది. నీ బుద్ధి సమరమందున్న ఎడల శీఘ్రమే యుద్ధ సన్నద్ధుడవై నన్ను ఎదుర్కొనవలసినది." దూత నుండి ఈ పలుకులు వినిన వృత్రాసురహంత అయిన ఇంద్రుడు పవన వేగముచే కంపించు మహావృక్షము వలె కంపించి, క్రోధ తామ్రాక్షుడై, యుద్ధసన్నద్ధుడై, తన నిర్ణయమును దూతకు తెలిపెను. అంత దేవతలు యుద్ధసన్నద్ధులై కరవాలములు, శక్తి, తోమర, బంధిపాలములు, గద, శూలము, ధనువు, పట్టిసాయుధులై తమ తమ వాహనములపై బయలుదేరిరి. సహస్రాక్షుడు వజ్రపాణియై ఐరావత మధిరోహించి వారి మందు నిలచెను. దేవతలందరూ చతురంగబల సమేతులై అమరావతి నుండి బయటకు ఏతెంచిరి. త్రిపురుడు సహితము తన సేనను తగు విధముగ సన్నద్ధము కావించి సాయుధుడై నిలచెను. ఇరుసేనలు ఒకరినొకరు పరికించిరి. ఏనుగుల ఘీంకారములు, హయముల సకిలింపులు, వీరుల సింహనాదములు, రథముల ఘణఘణలు, వివిధ వాద్యముల ఘోషలతో ఆ ప్రదేశమంతయు అత్యంత కోలాహలముగ మారెను. ఇరుసేనల మధ్య రోమరోమమూ ప్రకంపించు అతిమానుష సమరము ఆరంభమయ్యెను. తొలుత పదాతులు పదాతులతో, అశ్వికులు అశ్వికులతో, ఇట్లు ఎవరికి చెందినవారు వారి ప్రత్యర్థులతో సమరము కావించిరి. కొంత సమయమునకు ఆ ప్రదేశమంతయు ధూళిదూసరితమై ఎవరెవరో తెలియకుండిరి. అశ్వ, గజ, రథారోహులు, పదాతులు తమ కాళ్ళు, చేతులు, శిరములు తెగి భూశయనులైరి. దేవతలదే పై చేయగా చాలా సమయము సమరము గడచినది. అంత త్రిపురుని సైన్యము కకావికలై నలుదిక్కులకు పలాయనమొనర్చుట ప్రారంభించిరి. అంత త్రిపురుడు సింహనాదము కావించుచూ ముందునకేతెంచి, తన సేనలను యుద్ధోన్ముఖులను గావించెను.

అంత త్రిపురుడు స్వయముగ పురంధరుని ప్రతిఘటించి, ప్రళయకాల మేఘగర్జన వంటి సింహనాదమొనర్చి, తన కరవాలముతో ఇంద్రుని వజ్రాయుధపు చేతిని ప్రహరించెను. అంత వజ్రము క్రిందపడెను. అంత ఇంద్రుడు త్రిపురుని హృదయముపై తీవ్రమయిన ముష్టిఘాతమొనర్చెను. అంత త్రిపురుడు ఒక్క క్షణము మూర్ఛిల్లి తిరిగి తేరుకొని ఇంద్రునిపై ముష్టిఘాతము ప్రహరించెను. అంత ఇంద్రుడు ధరిత్రిపై బడెను. కొంత సేపటికి ఇంద్రుడు తేరుకొని త్రిపురునితో "అసురరాజా! మనమిపుడు మల్లయుద్ధము చేయుదుము. సావధానుడవు కమ్ము!" అని పలికెను. త్రిపురుడు తన బల గర్వము చే సురపతి మాటలకు విస్మయమొంది ఇట్లనియె "సురరాజా! క్రిమి కీటకములకు సహితము తమ ప్రాణములందు తీపి యుండును. నీకు భూమిని రాజ్యముగ ప్రసాదించిననూ ఒల్లక, ఈ సంగరమునేల కావించుచున్నావు?" అంత ఇంద్రుడు "దుష్టుడా! నేడు నేను నీ శిరమునుత్తరించి, అపుడు భూమండలమున కేగుదును" అని బదులిచ్చెను. అంత త్రిపురుడు రోషభూయిష్టుడై మల్లయుద్ధమునకు సంసిద్ధుడయ్యెను. వారిరువురు మదించిన పంచాస్యముల వలె బాహాబాహి, ముక్కాముక్కి, శిరము, జంఘులు, వీపు, పాదములు, తో ప్రహరణము కావించుకొనుచూ సమరమాచరించి, ఒకరినొకరు తీవ్రముగ గాయపరచుకొనుచుండిరి. అంత త్రిపురుడు ఇంద్రుని పాదములు ఒడిసిపట్టి, ఆయనను గిరగిరా త్రిప్పి దూరముగ విసరివైచెను. ఇంద్రుడు సంపూర్ణముగ స్పృహను కోల్పోయెను. అంత త్రిపురుడు చతుర్దంతి అయిన ఐరావతమును అధిరోహించి అమరావతి ప్రవేశించెను. మిగిలిన దేవతలు త్రిపురునకు ఎదరేగు సాహసము లేక ఇంద్రుని వెదకుచూ బయలుదేరిరి. కొంత కాలమునకు వారికి ఇంద్రుడు హిమాలయ కంధరమందు కానబడెను. వారందరూ పరస్పరము జరిగిన విషయములన్నియు చెప్పుకొని, పరిస్థితులను సింహావలోకనము కావించి, ప్రస్తుత కాలము తమకు అనుకూలము కాదని ఒకరినొకరు ఊరట పరచుకొని, అక్కడనే గుప్తముగ నివసింపసాగిరి. అమరావతి ప్రవేశించిన

త్రిపురుడు ఇంద్రాసనమును అధిష్ఠించి, తనకు సహాయమొనర్చిన దైత్యులందరినీ సభాసదుల గావించి, గంధర్వుల గానము శ్రవణము కావించుచూ, కిన్నెరలతో సేవలు చేయించుకొనుచూ, అప్సరాంగనలతో రమించుట నారంభించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి త్రిపురాసుర విజయమను ముప్పది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నలభైయవ అధ్యాయము

(త్రిపురాసుర సంహారమునకై దేవతల ప్రార్థన)

అమరావతిని ఆక్రమించిన పిదప త్రిపురుడు బ్రహ్మలోకమున కేగెను. చతుర్ముఖ బ్రహ్మ శ్రీగణేశ వర గర్వితుడయిన త్రిపురుని పరాజయము కావించుట అసంభవమని తెలిసి తన పద్మనాళము గుండా శ్రీహరి యందు ప్రవేశించెను. అంత త్రిపురుడు అచటి నుండి వైకుంఠమునకేగెను. విష్ణువు తన మాయచే క్షీరసాగరమందు ప్రవేశించెను. త్రిపురునకు చండ, ప్రచండులను ఇరువురు మానసిక పుత్రులు కలరు. అందు ప్రచండుని బ్రహ్మలోకమునందునూ, చండుని వైకుంఠము నందనూ అధినాయకులుగ నియమించి, ఆచటి నుండి కైలాసమునకేగి, ఆ పర్వతమును తన బాహువులతో పట్టి కంపనమొనర్చెను. అంత పార్వతీ దేవి భయభీతయై పరమేశ్వరుని గాఢముగ కౌగలించుకొనెను. ఆ దైత్యుని బలమునకు హర్షితుడై కపర్ది ఆతనికి వరమిచ్చుటకు కైలాసము బయటకు ఏతెంచెను. త్రిపురుడు ఆయనకు నమస్కరించి "పరమేశ్వరా! మీరు నా బలమునకు సంతసిల్లి వరమీయదలచిన, వెంఠనే మీ గణముల సహితులై ఈ కైలాసమును వీడి మంధర పర్వతమునకు ఏగవలసినది," అని పలికెను. అంత కైలాసనాధుడు ఆ దైత్యుని చేష్టలకు నవ్వుకొని స్వల్ప కాలమునకు మంధర పర్వతమునకేగెను. ఆ కైలాస పర్వతమందు ఆశీనుడై త్రిపురుడు మిక్కిలి హర్షితుడయ్యెను.

ఇక భూమండలమందు భీమకాయుడు రాజులందరినీ బందీకృతుల గావించెను. దేవతలకు సంతుష్టి కలిగించు అగ్నికుండములను, ఆశ్రమములను, తీర్థ క్షేత్రములను విశేషముగ నష్టపరచెను. తపస్వులను కారాగారమందు బంధించి హింసించెను. స్వాహాకార, స్వధాకార, వషట్కారములను, సదాచారములను నిషేధించి ద్వేషించెను. పాతాళమున కేగిన వజ్రదంష్ట్రుడు సప్త పాతాళ లోకములను జయించి, శేషుడు, వాసుకి, తక్షకుడు మొదలగు సర్పరాజులను, అనేక ఇతర సర్పములను వశపరచుకొని, అచట గల రత్నరాశులను తాను భోగించి, కొన్ని త్రిపురున కంపెను. నాగలోకమందలి స్త్రీలను మదోన్మత్తుడై, కౌతుహలుడై, అనుభవించెను. అక్కడ లభించు అనేకానేక భోగ వస్తువులును తాను అనుభవించి, వాటిని త్రిపురుని వద్దకు కొనితెచ్చెను. తొలుతనే త్రిపురునకు వజ్రదంష్ట్రుడనిన ప్రియము. ఇపుడాతడు సప్తపాతాళములను తన ఆధీన మొనర్చుటచే, త్రిపురుడు ఆ మహాదైత్యుని కొనియాడి అత్యధికముగ సన్మానించి బహుమతులు ఇచ్చెను. త్రిపురుడు ఈ విధముగ త్రిలోకములను తన కనుసన్నల యందు నడుపుచూ ఏకఛత్రాధిపత్యముగ పరిపాలించుట మొదలిడెను.

ఇచట దేవతలు తమ ఇక్కట్లకు అంతము లేక "ఈ త్రిపురుడు ఇంత శక్తిమంతుడు ఎట్లయ్యెను? ఈతనికి వరమిచ్చిన వేలుపెవరు? ఈతని వధ ఎట్లు సాధ్యపడును?" అని చింతించుచుండిరి. ఆ సమయమున త్రిలోక సంచారి అగు నారద మహర్షి వారి వద్దకు ఏతెంచెను. అంత దేవతలందరూ ఆయనకు నమస్కారములు సమర్పించి "దేవర్షీ! త్రిపురాసురుడు త్రిలోకాధిపతియై త్రిమూర్తులను సహితము పరాజితుల కావించెను. ఇపుడు మమ్ము రక్షించు నాధుడెవరు? మేము ఎవరిని శరణు వేడవలెను?" అని ప్రార్థించిరి. అంత ఆ దేవర్షి "సురలారా! ఈ త్రిపురుడు వేయి సంవత్సరములు

పరబ్రహ్మమైన శ్రీగణేశునికై ఉగ్రతపమాచరించి అనేక వరములు పొందెను. ఈతడు కేవలము శివ భగవానుని వలననే పరాజితుడగును. కానీ మీ ప్రస్తుత కర్తవ్యము శ్రీగణేశుని ప్రసన్నుని కావించుటయే!!! నేను మీకు ఏకాక్షర శ్రీగణేశమంత్రమును **(గం)** ఉపదేశించెదను. దానిని శ్రద్ధగా అనుష్ఠానమొనర్చి, శ్రీగణేశుడు ప్రసన్నుడై మీకు సాక్షాత్కరించు వరకు అద్దానిని వదలక ఆయనను ఆరాధింప వలసినది. ఆయన ప్రసన్నుడై మీకు సాక్షాత్కరించిన ఎడల మీకు త్రిపుర వధోపాయమును తెలుపును. నాకు తెలిసినంత వరకూ ఇదియే ఉపాయము. ఆపై మీ ఇష్టము". అని ఆయన మహతిని మీటుచూ సంచారమున కేగెను. అంత సురలందరూ తమకు నచ్చిన ఆసనమును తాము గ్రహించిరి. కొందరు పద్మాసనము, లేక స్వస్తికాసనము, వీరాసనము, కొందరు ఒంటికాలిపై నిలబడి, మరికొందరు అర్ధనిమీలిత నేత్రులై, వారందరూ ఏకాగ్రతతో ఏకాక్షర శ్రీగణేశ మంత్రానుష్ఠానము మొదలిడిరి. ఎంతో కాలమయిన పిదప శ్రీగణేశుడు వారి శ్రద్ధకు ప్రసన్నుడై వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున ఆయన సువర్ణ మకుట మండితుడై, చతుర్భుజములందు పాశాంకుశ, పరశు , కమలములు ధరించి, భుజకీర్తులు, అంగదధారియై, సింధూర, కుంకుమ, రక్తచందన లేపితుడై, ఫాలభాగమున బాలచంద్రుని ధరించి, సూర్యసమాన తేజుడై తేజరిల్లెను. ఆ భగవానుని సౌమ్య స్వరూపమును చూచి, ఆయనకు అనేక ప్రణామములాచరించి, తమ సంకటములను పూర్ణముగ హరించు పరాత్పరుని ఇట్లు స్తుతించిరి.

"పరమార్ధ స్వరూపా, అఖిలవిశ్వకారణా, సంసార సాగర తారణా, సర్వేంద్రియాధిష్ఠాత్రుదేవా, నీకు నమస్కారము. భూతమయా, సర్వుల బుద్ధులను ప్రచోదనము కావించు దేవా, సృష్టి స్థిత్యంత కారకా, నీకు నమస్కారము. విశ్వపోషకా, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా, జగత్కారణ కారణా నీకు నమస్కారము. వేదజ్ఞులయిన విద్వాంసులకు సహితము అగోచరుడవై, సర్వులకు వరదుడవైన శ్రీగణేశ భగవానునకు నమస్కారము. అవాఙ్మానస గోచరుడు, విఘ్ననాశకుడు, భక్తుల కోరికలు తీర్చి, అభక్తులకు విఘ్నములొనర్చు వినాయకునకు నమస్కారము. విశ్వవిధాన దక్షుడు, తన లీలలచే అవ్యక్తుడు, అజ్ఞాతుడు, దైత్యనాశకుడు, సంకటమోచనుడు, కరుణానిధి, సర్వోత్తమ భగవానుడయిన శ్రీగణేశునికి నమస్కారము. అజ్ఞాన తిమిర నాశకుడు, భక్తులకు భక్తి ముక్తి ప్రదాత, అభక్తులకు భవబంధన హేతువు, తత్వవేత్తలందు శ్రేష్ఠుడై తత్వ జ్ఞానమును బోధించు మహానుభావుడు, కర్మసాక్షి, గణనాయకుడు, పరమాత్మ, పరబ్రహ్మ స్వరూపమయిన విఘ్న వినాయకుడు, శ్రీగణేశునకు మరల మరల నమస్కారము." దేవతలు కావించిన ఈ స్తోత్రమునకు శ్రీగణేశుడు సంతసిల్లి ఇట్లనియె "దేవతలారా! మీ తపము చే నేను సంతుష్టుడనైతిని. మీ మనోవాంఛితములను కోరుకొన వలసినది." అంత సురలు "మహాప్రభూ! ఈ త్రిపురుడు తన బలాతిశయము చే మా అధికారములు చేతబుచ్చుకొని మమ్ము కాందిశీకుల గావించెను. ఈ సంకటము నుండి మమ్ము కాపాడవలసినది." అంత గణపతి "సురలారా! భయము వలదు. మీకు త్రిపురుని ద్వారా కలిగిన భయమును సంపూర్ణముగ దూరము ఒనర్చెదను. మీరు కావించిన ఈ స్తోత్రము నాకు అత్యంత ప్రియమైనది. ఇయ్యది లోకమందు "సంకష్ట నాశక స్తోత్రము" గ విఖ్యాతి నొందును. ఈ స్తోత్రమును పఠించిన, లేక శ్రవణము కావించిన మానవులకు సర్వ మనోభీష్టములు పూర్ణమగును. ఏ మనుజుడు ఈ స్తోత్రమును త్రిసంధ్యల యందునూ పఠించునో వారిని సంకటములు దరిచేరవు." ఈ విధముగ సురలకు వరదాన మొనర్చి దేవోత్తముడు అంతర్ధానమొందెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి త్రిపురాసుర సంహారమునకై దేవతల ప్రార్థనమను నలుబదియవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఒకటవ అధ్యాయము

(కళాధర చరితము)

వ్యాసమునీంద్రుడు "పితామహా! తదుపరి శ్రీగణేశ భగవానుడు ఏమి చేసెను?" విరించి "తదుపరి శ్రీగణేశుడు ఒక విప్రుని రూపు ధరించి త్రిపురున కడకేగెను. ఆ సమయమున త్రిపురుడు ఒక బహుమూల్య సింహాసనమందు ఆసీనుడై దుర్నిరీక్షుడై యుండెను. అంత సభాస్థలి ప్రవేశించిన విప్రుని గాంచి, త్రిపురుడు లేచి, సముచితముగ సత్కరించి, పూజించి, ఆసనమిడి ఇట్లు ప్రశ్నించెను "స్వామీ! మీ నామధేయమేమి? మీ ఆగమనము ఎట్లు జరిగినది? మీరు ఏ విద్యయందు ప్రసిద్ధులు? మీ ఆగమనమునకు కారణమేమి? నాకు తెలిపిన ఎడల నేను ప్రయత్నించి, మీ కామనను పూర్ణమొనరించెదను. అంత ఆ బ్రాహ్మణుడు "చక్రవర్తీ! నేను "కళాధరుడు" అను నామమున ప్రసిద్ధుడను. సర్వజ్ఞుడను. సర్వమును తెలియుదును. స్వేచ్ఛగా లోకహితార్ధము అన్ని చోట్లకు పయనించుచుందును. నేను సాయంగృహ వ్రతపరాయణుడను. ఏ సాయంత్రము ఎచటికి చేరుదునో అచటనే బస చేయుదును. నీ వైభవమును తిలకించుటకు నీ భవనమున కేతెంచితిని. ఇటువంటి సంపద బ్రహ్మలోకమున, వైకుంఠమున, కైలాసమున లేదనిన ఇక స్వర్గము మాట చెప్పనేల?" అంత త్రిపురుడు "స్వామీ! నా సంపదను మిగిలిన లోక సంపదలందు మిన్నయని మెచ్చుకొనిరి. మీరు కళాధరులు కదా! అందువలన మీరు కళలకు జ్ఞాత. ఈ సంపదలందు సర్వోత్కృష్ఠ సంపద ఏది? అద్దానిని నాకు దర్శింపజేయ వలసినది. మీరు గనక ఆ దివ్య సంపదను నాకు దర్శనము గావించిన ఎడల మీ మనోవాంఛితమును మీకు ప్రసాదించెదను. నాకు ప్రియమయిన ప్రాణములు సహితము ఇచ్చెదను. నాకు స్మరణ యున్నంత వరకు నేను పుట్టినదాది ఇప్పటి వరకు పరిహాసమునకు సహితము అసత్యము పలుకలేదు. నేను పూర్ణముగ సత్య వాక్పరిపాలకుడను."

అంత కళాధరుడు "పరాయి సంపదల కాంచుట చే నీకు ఒరెగెడిది ఏదియునూ లేదు. నీ వినయము చే నేను ప్రసన్నుడనైతిని. నీకు నా శక్తి చే ఒకే అక్షమందుండు మూడు పురములు బహూకరించెదను. అవి కాంచన, రజత, లోహ (ఇనుప) పురములు. త్రిపురములు. నీవు చిరకాలము ఈ పురములందుండి అనేక సుఖ భోగములు ననుభవింపుము. ఈ పురములు శివునకు వినా వేరొకరికి అభేద్యములు. మనోవాంఛిత పదార్ధములన్నింటినీ ప్రసాదించునవి. నీ ఇచ్ఛానుసారము ప్రయాణించునవి. ఏ కామోపభోగమునైననూ సులభతర మొనర్చునవి, మరియు పరమ శుభకరములు." ఈ విధముగ పలికి కళాధరుడు ధనువు సారించి, బాణ ప్రయోగము కావించెను. మరుక్షణము వినువీధియందు వాపీకూప తటాకాది సహితము, అంబర చుంబిత హర్మ్యములు కలవి, సుందర పశు పక్ష్యాదులతో కూడిన ఉద్యాన వనములతో నిండినవి, ఎల్లప్పుడూ ఆకాశమందు విహరించునవి, సమస్త మనోకామనలను పూర్ణమొనరించు త్రిపురములు వెలసినవి. శ్రీగణేశుని మాయచే మోహితుడైన దైత్యుడు ఆ పురములు చూచి పరమానంద భరితుడై, త్రిలోకములు కంపించు మహాగర్జనము కావించి, తనకంటె శ్రేష్ఠుడు మరొకడు లేడని ఆహంకరించి కళాధరునితో ఇట్లనియె.

"ఓ! ద్విజోత్తమా! మీరు నన్ను దుర్లభాతిదుర్లభమైన వరము కోరుకొనవలసినది. నేను మీకది ప్రసాదించెదను" అని పలికెను. అంత కళాధరుడు "దైత్య పుంగవా! నేను కైలాసమున కేగినపుడు పరమ శివుని చే పూజింపబడుచున్న ఒక సుందర శ్రీగణేశమూర్తిని కాంచితిని. అయ్యది వాంఛిత వస్తుసముదాయమును ప్రసాదించునది. ఓ! అసురోత్తమా! నీకు శక్తి యున్న ఎడల ఆ గణేశమూర్తిని నాకు ప్రసాదింప వలసినది. నేను త్రిలోకములందునూ అటువంటి మూర్తిని దర్శింపలేదు. ఆ మూర్తిని పొంది నేను కృతకృత్యుడనగుదును. అందువలన త్రిలోకముల యుందునూ నిన్ను మించిన దాత లేడను కీర్తిని నీవు పొందెదవు." త్రిపురుడు "శంకరుడు నా కింకరుడు. ఇక అన్య దేవతలనిన, నాకు లెక్కలేదు.

నేను అవశ్యము ఆ మూర్తిని మీ కడకు చేర్చెదను," అని ద్విజుని అనేక వస్త్ర, భూషణ, గో, రథ, గజ, హయ, గ్రామములతో సత్కరించెను. కళాధరుడు వానిని గ్రహించి తన ఆశ్రమమునకు చనెను. ఈ వృత్తాంత మంతటినీ నారదుడు దేవతలకు చేరవేసెను. దేవతలు తగిన సమయము కొరకు ప్రతీక్షింప సాగిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి కళాధర చరితమను నలుబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నలుబది రెండవ అధ్యాయము

(త్రిపురుడు చింతామణి వినాయకుని గొనుటకు ప్రయత్నించుట)

ద్వైపాయనుడు "పితామహా! కళాధరుడు వెడలిన పిదప దైత్యుడేమి చెసెను? చింతామణి వినాయకుని మూర్తిని ఎట్లు తీసికొని వచ్చి కళాధరున కిచ్చెను? ఈ విషయమంతయు విస్తారముగ తెలుపవలసినది. అత్యంత పిపాసయున్న మనుజునకు పురిషెడు జలము సరిపోవునా? అట్లే నాకు శ్రీగణేశ లీలామృతము సంక్షేపముగ తెలపనిచో తృప్తియగుట లేదు." చతురాననుడు "మునిశ్రేష్ఠా! తప్పక తెలిపెదను. సావధానుడవై వినవలసినది. కళాధరుడు నిష్క్రమించిన పిదప త్రిపురుడు ఒక దైత్యుని పిలచి మంధరాచలమునకేగి శివునికి సాదరముగ ఈ విధముగ తెలుప వలసినది "పరమేశ్వరా! మీ వద్ద చింతామణి గణేశుని సర్వార్థప్రద, శుభలక్షణ మూర్తి యున్నది. ఓ! గిరిజాపతీ! ఆ మూర్తిని శాంతియుతముగ దైత్యరాజునకు ఈయవలసినది. స్వర్గ, మానవ, పాతాళములందలి అద్భుత వస్తువులు ఏవియున్ననూ, వాటినన్నిటినీ దైత్యప్రభువు బలపూర్వకముగ తన వద్దకు తెచ్చుకొనెను. అందువల్ల ఈ వినాయకమూర్తిని శీఘ్రమే దైత్యపతికి సమర్పింప వలసినది. ఒకవేళ మీరు ఆ మూర్తిని ఇచ్చుటకు ఇచ్చగించని ఎడల, పరాక్రమశాలి అయిన మా ప్రభువు బలవంతముగ తీసికొనును. అందువలన మీరు దు:ఖభాగులగుదురు."

త్రిపురాసుని బలగర్విత పలుకులు విని త్రినేత్రుడు క్రోధోద్రిక్తుడై ఆ దూతతో ఇట్లనియె "ఓ! దైత్యదూతా! నీవు దూతవు కావున నిన్ను క్షమించుచున్నాను. లేనిఎడల కాముని భస్మము గావించినట్లు నిన్ను సహితము భస్మము గావించెడివాడను. సర్వశక్తిమంతుడనైన నా ముందు తుచ్ఛుడయిన ఆ దైత్యుడెంత? ఆ వినాయకమూర్తిని ఆతడు వంద జన్మములైననూ ప్రాప్తింపడు. ఏదేని శలభము ప్రళయాగ్నిని శాంతింపజేయునా? మూషికము మేరు పర్వతమును మోయగలుగునా? అసంఖ్యాకమయిన జలములు తోడినప్పటికీ సముద్రములు ఇంకునా? మరణోత్సుకుడై యున్న ఆ దైత్యుని అవశ్యము సమరమునకు రావలిసినదని తెలుపుము." అంత దూత ఆ సందేశమును యతాతథముగ తన స్వామికి నివేదించెను. ఆ పలుకులు వినినంతనే క్రోధానలసన్నిభుడై, త్రిపురుడు ప్రళయాగ్ని వలె మండిపడి, కన్నుల విస్ఫులింగములు జాలువారుచుండగా చతురంగ బలములకు యుద్ధోన్ముఖులు కమ్మని అనుజ్ఞ నిచ్చెను. త్రిపురుడు బహుమూల్య మణి సువర్ణ ఖచిత కవచము, సువర్ణ ముకుట, కుండలాలంకృతుడై, అంగదధరుడై, ముత్యాలమాలలు, సువర్ణ కటిసూత్రము ధరించి, త్రిపురములనెక్కి, సేనా సహితుడై మంధరాచలము చేరెను. ఆతని సేన నేల ఈనినట్లు, చెలియలికట్టను దాటిన సముద్రము వలె కానపట్టుచున్నది. ఒరల నుండి బయటకు తీయబడిన ఆయుధముల దీప్తి సూర్యకాంతిని పరిహసించు చున్నది. మేఘగర్జన వంటి ఘోష కావించుచున్న ఆ సైన్యపుధ్వనికి మృత్యువును సహితము కంపింపజేయుచున్నది.

అంత కైలాసమందు శివుడు సహితము ధనుష్పాణియై, తూణీరములు బిగించి, కూర్మపృష్ఠమును డాలుగా చేసి,

దృఢ కరవాలము, శక్త్యాది ఆయుధ సహితుడై అత్యంత శోభాయమానునిగ ప్రకాశించుచుండెను. గంధర్వులు గానము ఆలపించుచుండగా, అప్సరాంగనలు నాట్యము చేయుచూ ముందర నడచుచుండగా, సిద్ధ చారణులు ప్రకాశించు చుండగా, వారి వెనుక పినాకపాణి యుద్ధోన్ముఖుడై కదులుచుండగా దూత ఏతెంచి దైత్యుడు సేనా సహితుడై సమరమున కేతెంచెనని తెలిపెను. కాలగమనము కడు గహనము. దైత్యుని కాలమే వానిని పరమేశ్వరుని సమ్ముఖమునకు ఈడ్చినది. శివుడు శూలాయుధ ధరుడై, క్రోధానలదీప్తినేత్రుడై, తన సేనకు అగ్రభాగమున నడచి యుద్ధభూమి చేరెను. పరమేశ్వరుడు మహాజ్ఞాని మరియు శ్రీగణేశపరాత్పర భక్తులందు అగ్రేసరుడు. అయినప్పటికీ యుద్ధారంభమున శ్రీగణేశుని పూజింపలేదు సరికదా స్మరింపలేదు. మాయ ఎంతటివారలనైననూ భ్రమింపజేయును.

ఇరువైపుల యందలి యోధులు వీరోచితముగ సింహనాదములు కావించి, దిశలు దద్దరిల్లునటుల ఘోషించుచుండగా పరస్పర తుముల యుద్ధము ఆరంభమైనది. సేనల తాకిడికి ధూళి పైకిలేచి యుద్ధభూమి అంతయు అంధకార బంధురమైనది. తమవారెవరో, ప్రత్యర్థులెవరో తెలియకుండిరి. యోధులు తమ గోత్రనామములు తెలుపుచు సమరమాచరించు చుండిరి. మృతినొందిన గజ, హయ, పదాతుల రుధిరము వరదలా ప్రవహించుట చే ధూళి సద్దుమణిగెను. ఎవరికి తగిన వీరులతో వారు వేరువేరుగా సమరము ఒనర్చు చుండిరి. వీరులు ప్రతివీరులతో ఖడ్గ, తోమర, బాణ, పరశువు, బంధిపాలము, ముష్టిలతో పరస్పరము వీరోచితముగ పోరాడుచుండిరి. ప్రవహించుచున్న రుధిర సరిత యందు మృతినొందిన సైనికుల కేశములు నాచువలెను, డాళ్ళు కూర్మముల వలెను, ఖడ్గములు మత్స్యముల వలెను, శిరములు కమలముల వలెను, చక్రములు ఆవర్తములు (సుడిగుండములు) వలెను, మొండెములు వృక్షముల వలెను తోపించుచూ భయంకరాతి భయంకరముగ కానపట్టుచున్నది. ఈ విధముగ ఇరువైపులా మృత్యువునకు వెరువక, భీరువులై వెనుచూపక, మొక్కవోని ధైర్య సాహసములతో యోధులు పోరాడుచున్న సమయమున బలశాలి అయిన త్రినేత్రుడు, మదోన్మత్తుడయిన త్రిపురుడు ఒకరికెదురుగ ఒకరు ఏతెంచిరి. త్రిపురుడు ఒకే అక్షమునున్న త్రిపురమునెక్కి సమరమాచరించు చుండెను. ఇపుడు ఇరువైపులా సమరమొనరించుచున్న ప్రముఖ యోధుల నామములను సంక్షేపముగ తెలిపెదను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి త్రిపురుడు చింతామణి వినాయకుని గొను ప్రయత్నమను నలుబది రెండవ అధ్యాయము సమాప్తము)

నలుబది మూడవ అధ్యాయము

(త్రినేత్ర, త్రిపురాసుర సంగ్రామము)

ఆ సమయమున కార్తికేయుడు ప్రచండుని తోనూ, నంది చండునితోనూ, బలశాలి అయిన పుష్పదంతుడు భీమకాయుని తోనూ, భుశుండి విషయుక్త ప్రయోగము కావించు కాలకూటుని తోనూ, మహాబలి అయిన వీరభద్రుడు వజ్రదంష్ట్రునితోనూ, ఇంద్రుడు త్రిపురుని అమాత్యులతోనూ, యుద్ధోన్మత్తుడయిన ఇంద్రపుత్రుడు జయంతుడు త్రిపుర పుత్రులతోనూ, అస్త్రవిద్యా నిపుణులైన బృహస్పతి రాక్షసగురువైన శుక్రాచార్యుని తోనూ, ఈ విధముగ వివిధ దేవతలు వివిధ దైత్యులతో ద్వంద్వయుద్ధము గావించిరి. ఆ మహా సంగ్రామమును వందలాది వత్సరములు వర్ణించిననూ సమయము చాలదు. రధారూఢులు రధికులతో, అశ్వికులు అశ్వికులతో, ఇట్లు ఎవరికి వారు తమ సములతో సమరము కావించిరి. ఆ ఘోర సంగ్రామమందు నానా విధములయిన వాద్యముల ఘోష, అశ్వముల సకిలింపులు, గజముల ఘీంకారములు,

వీరుల సింహనాదములు, రథముల నేమినాదములు అన్నీ కలసి అత్యంత కోలాహలముగ మారినది. కొందరు వీరులు శస్త్రములు త్యజించి మల్లయుద్ధమొనర్చిరి.

ప్రచండుడు ఆకురాయిపై పదునుబెట్టబడిన పదునైన నారాచములను ధనస్సుకు సంధించి, ఆకర్ణాంతము నారి లాగి ఆ సాయకములను కార్తికుయునిపై ప్రయోగించెను. కార్తికేయుడు ఆ సాయకములు తనకు చేరక మునుపే సన్నతపర్వ సాయకములతో వాటిని ఖండించి, మరి అయిదు భల్ల బాణములు సంధించి తిరిగి ప్రచండుని పై విడచెను. అవి ప్రచండుని హృదయమును భేదించగా ఆతడు నేలకూలెను. భీమకాయుడు పది నారాచములతో పుష్పదంతుని బాధించెను. పుష్పదంతుడు వానిని మార్గేమధ్యమున ఖండించి, మూడు తక్షణ సాయకములు భీమకాయునిపై విడచెను. ఆ సాయక ధాటికి భీమకాయుడు పంచత్వము నొందెను. భృశుండి అయిదు నారాచ బాణములతో కాలకూటుని యమసదనమున కంపెను. వీరభద్ర, వజ్రదంష్ట్రల నడుమ కొంత సమయము తీవ్ర సంగ్రామము నడచినది. చివరకు వీరభద్రుడు మూడు భల్లబాణములను ఒకేమారు ప్రయోగించి వజ్రదంష్ట్రుని యమపురికి అతిధిగా పంపెను. ఇంద్రుడు వజ్రప్రహారము కావించి త్రిపురుని అమాత్యులను ఊచకోత కోసెను. ఈ విధముగ దైత్య వీరులందరూ ఒకరొకరుగ నేలకూలుచుండగా అది చూచి మండిపడి దైత్యపుత్రుడు ఒక నిశిత కరవాలము చేతబూని జయంతుని సంహరించుటకు ముందునకురికెను. అది గమనించిన ఇంద్ర తనయుడు జయంతుడు తన ధనువును సజ్జచేసి, ఒక తీవ్ర నారాచమును ఆకర్ణాంతము లాగి ప్రయోగించి, ఆతని నిశిత ఖడ్గమును రెండుముక్కలు గావించెను. పిదప ఒకేమారు మూడు అర్ధచంద్ర సాయకములు సంధించి, ప్రయోగించి దైత్యపుత్రుని నిహతుని గావించెను. ఈ విధముగ దైత్యవీరులందరూ నేలకొరగగా, దైత్యసేనలు పగ్గములు లేని గుర్రముల వలె నలుదిశలకు పలాయనము చిత్తగించిరి. అంత త్రిపురుడు తన సేనకు ధైర్యము తెలుపుచూ, ముందునకొచ్చి, త్రినేత్రునిపై శరసంధానము కావించెను.

తొలుత త్రిపురుడు ఒక ప్రచండ వారుణాస్త్రము ప్రయోగించెను. అంత కారుమేఘములు క్రమ్మి సమరాంగణమంతయు చిమ్మచీకట్లు అలుముకొని, ఏనుగు తొండముల వంటి వర్షధారలు వర్షించి శివ గణములను కకావికలు గావించెను. గుణములన్నియు శంభుని వెనుకకు చేరినవి. అంత పినాకి వారికి ధైర్యము చెప్పి వాయువ్యాస్త్రము ప్రయోగించెను. ఆ అస్త్ర ప్రభావము చే ప్రళయకాల ఝంఝామారుతము ఉత్పన్నమై, మేఘములను చెదరకొట్టి, వర్షధారలను ఎగురగొట్టి, అటుపిదప అచట యున్న వృక్షములను కూకటివ్రేళ్ళతో పెకలించి త్రిపురుని సైన్యము పై పడవైచెను. త్రిపురుని సైన్యము ధ్వంసమయినది. రథములు చూర్ణమయినవి. అంత త్రిపురుడు పర్వతాస్త్రముతో ఆ వాయువ్యాస్త్రమును శాంతపరచి, మరొక తీవ్ర సాయకమును ధనువుకు సంధించి, నారిలాగి, ఆగ్నేయాస్త్ర మంత్ర సంధానము గావించి విడచెను. అంత ఆ అస్త్ర ప్రభావమున సర్వదాహిని అయిన అంగారవృష్టి కురువ నారంభించెను. ఆ అంగార మాలలచే ఒళ్ళంతయు కాలుచూ శివగణములు దుర్భర శోకము ననుభవించిరి. ఆ ప్రళయాగ్నికీలక జ్వాలల నుండి ఒక భయంకర రూపుడయిన పురుషుడుద్భవించి కనిపించిన గజాశ్వపదాతులను కనిపించినట్లు మ్రింగుట నారంభించెను. ఆతడు ఉచ్ఛస్వరముతో అరచుచూ సర్వులను భయభీతుల గావించెను. ఆ మహాకాయుడు ఆకాశమంత ఎత్తు ఎదిగి, నాలుకను వంద యోజనములు వ్యాపింపజేసి సర్వులను భక్షించుచుండెను. అంత శివ గణములను కాపాడుటకు విరూపాక్షుడు పర్జన్యాస్త్రమును సంధించి విడచెను. ఆ మహాకాయుని పై మరొక తీవ్ర నారాచమును ప్రయోగించెను. ఆ దివ్యాస్త్రము ఆగ్నేయాస్త్రమును శాంతింపజేసినది. కపర్ది విడచిన బాణమునకు గాయపడిన భయంకరాకారుడు గాయపడి, కొంతతడవు క్రిందపడి, తేరుకుని, లేచి, తిరిగి శివ గణముల భక్షించుట నారంభించెను. అంత శివుడు సహితము నిస్సహాయుడై శివగణములు, కార్తికేయుగు మొదలగు వారితో పర్వత కంధరము ప్రవేశించి ప్రాణములు కాపాడుకొనెను.

ఇంతలో త్రిపురుడు శివుడు తిరుగుముఖము పట్టుట గాంచి, ఇపుడు పార్వతీ దేవి ఏకాకిగ యుండునని తలచి,

ఆమెను హరించుటకు మందర పర్వత కంధరమున కేగెను. తన కొరకై వచ్చుచున్న త్రిపురుని దూరము నుండే కాంచి హిమాలయ తనయ తన తండ్రి అయిన హిమాలయుని వద్దకేగి, జరిగిన విషయమంతయు తెలిపెను. అంత హిమాలయుడు ఆమెను తన కుటుంబ సభ్యులకు సహితము తెలియని ఒక రహస్య కంధరమందు జాగ్రత్తగా దాచెను. పార్వతీదేవికై మంధర పర్వత కంధరములు వెదకుచునన త్రిపురునకు ఒకచోట దివ్యమయిన చింతామణి గణపతిమూర్తి కానబడెను. అయ్యది కోటిసూర్య ప్రకాశకమై, నానాలంకార భూషితమై శోభించుచుండెను. త్రిపురుడు ఆమూర్తిని చేజిక్కించుకొని తన వారి మధ్యకు ఏతెంచెను. ఆతని అనుయాయులందరూ హర్షధ్వానములు కావించుచూ ఆతనికి జేజేలు పలికిరి. అంత అకస్మాత్తుగా ఆతని హస్తములందున్న వినాయకమూర్తి అదృశ్యమయ్యెను. అంత త్రిపురుడు ఆ ఘటనను అత్యంత దుశ్శకునముగా భావించి, విమనస్కుడై, దుస్తర చింతితుడై తన పురమునకు ఏగెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి త్రినేత్ర త్రిపురాసుర సంగ్రామమను నలుబది మూడవ అధ్యాయము సమాప్తము)

నలుబది నాల్గవ అధ్యాయము

(వృషాంకుని విచారము)

వ్యాసుడు ఒక్క క్షణము నిరుత్తరుడై "ఏమి చిత్రము! త్రిపురాసురుని ద్వారా పరమ శివుడు పరాజితుడగుటయా? ఒక దైత్యుడు మహాదేవునిపై విజయము సాధించుటా? ఇది ఎట్లు సాధ్యము?" అని ప్రశ్నించెను. అంత విరించి "శివుడు సహితము ఇట్లే తర్కించెను. దుర్జయుడయిన ఈ త్రిపురుని ఎట్లు సంహరింతును? ఎప్పుడు దీనులైన ఈ దేవతలు తిరిగి తమతమ స్థానముల కేగుదురు? దీనికి ఉపాయమేమి?" ఈ విధముగ కపర్ది పరిపరి విధములుగ పరివేదన చెందుచుండ, యాదృశ్చికముగ అచటకు దేవర్షి నారదుడు ఏతెంచెను. శివ భగవానుడు ఆయనను గాంచి, మరణశీలుడయిన మానవుడు అమృతము నొందినట్లు ఆనందించి, ఆయనను ఆలింగనము కావించి, విధివిధానముగ పూజించి, త్రిపురాసుర సంగ్రామ విశేషములన్నియు విపులముగ ఆయనకు వర్ణించి ఇట్లనియె "నారదా! నా అస్త్రశస్త్ర ప్రయోగములన్నింటినీ దైత్యులు ఖండించిరి. దేవతలు నలు దిశలకు పలాయనులైరి. ఇపుడు ఎవరు ఎక్కడ యుండిరో తెలియకున్నది. దీనికి కారణమేమి? నాకు ఏదేని ఉపాయము తెలుప వలసినది." అంత నారదుడు ఆశ్చర్య చకితుడై "స్వామీ! మీరు సర్వజ్ఞులు, సర్వులకు, సర్వ విద్యలకు సహితము అధీశ్వరులు, సర్వకర్తా, సర్వహర్తా, సర్వ నియంత, మరియు ఘటనాఘటన సమర్థులు. మీరు వక్తల యందు శ్రేష్ఠులు, మరియు మీకు అణిమాది సిద్ధులు కరతలామలకములు. అయిననూ మీకు సహితము విఘ్నములు దాపురించిన వనిన, దానికి ఒక్కటే కారణమున్నది," అని ఒక్క క్షణము ధ్యానించి "స్వామీ! మీరు యుద్ధోన్ముఖులై సంగ్రామమున కేగినపుడు గణపతిని పూజింపలేదు సరికదా కనీసము స్మరింపలేదు. తొలుత మీరు శ్రీగణేశ భగవానుని ప్రసన్నుని కావించి, ఆయన వరదానము చే తిరిగి యుద్ధ ప్రస్థానము కావింప వలసినది. అపుడు దైత్యుడు పరాజితుడగును. పూర్వకాలమందు ఆ మహాదైత్యుడు సహితము ఉగ్రతపమాచరించి శ్రీగణేశుని ప్రసన్నుని కావించుకొని దివ్య వరములు బడసెను. ఆ సమయమున శ్రీగణేశుడు ఆ దైత్యుని "శివుడు వినా వేరొకరు నిన్ను పరిమార్చలేరు" అని వరమొసంగెను. ఆ దైత్యుని మూడు పురములను ఒకే బాణముతో ధ్వంస మొనర్చిన ఎడల దైత్యుడు మరణించును."

ఆ మధురాలాపమునాలకించి, పినాకి ప్రసన్నుడై నారదునితో ఇట్లనియె "నారదా! నీవు సత్యము పలికితివి. నాకు జ్ఞప్తికి వచ్చుచున్నది. పూర్వకాలమున శ్రీగణేశుడు నాకు రెండు మహా మంత్రములను (ఏకాక్షర, షడక్షర)

ఉపదేశించెను. ఆ మహామంత్రములు సర్వ సంకట హారకములు. యుద్ధాసక్తుడనైన నేను ఆ మంత్ర జప, స్మరణలు కావింపలేదు. సర్వ విఘ్నహర్తా, సర్వకర్తా, సర్వ కారణ కారణుడు అయిన విఘ్న వినాయకుని నేను కనీసము స్మరింపకుంటిని." అంత నారదుడు "మహాదేవా! మీరు అవశ్యము శ్రీగణేశుని ప్రసన్నుని కావింప వలసినది" అని పలికెను. అంత మహేశుడు తక్షణము దండకారణ్యమునకేగి, పద్మాసన స్థితుడై, ఇంద్రియములను నిగ్రహించి, ధ్యాన తత్పరుడై శ్రీగణేశ మంత్రానుష్ఠానమును నిష్ఠగా గావించెను. అట్లు వంద వత్సరములు పూర్ణమయిన పిదప ఆయన ముఖము నుండి పంచవక్త్రుడు, దశభుజుడు, లలాటమందు చంద్రకరేఖాధరుడు, పూర్ణచంద్ర ద్యుతియుతుడు, కపాలమాలాధారి, సర్వభూషణుడు, ముకుటాంగదాది భూషణ భూషితుడు, దశ హస్తములందు వజ్రము, శక్తి, దండము, ఖడ్గము, పాశము, అంకుశము, గద, త్రిశూలము, పద్మము, చక్రము ధరించిన ఒక మహాభూతము ఆవిర్భించినది.

తపమాచరించుచున్న పరమేశ్వరుడు ఆ మహాపురుషుని గాంచి ఇట్లు తర్కించెను "నేను ద్వివిధ రూపములెట్లు కలిగితిని? లేక నా రూపము ధరించి త్రిపురుడు ఏతెంచెనా? ముప్పదిమూడు కోట్ల దేవతలలో పంచముఖుడయిన ఇంకొక దేవత లేదుకదా? నేను స్వప్నమును కాంచుట లేదు కదా? లేక నేను దివారాత్రములు తపమాచరించుచున్న శ్రీగణేశుడు నన్ను కరుణించుటకు వచ్చెనేమో?" ఈ విధముగ తర్కించుచున్న మహేశునితో "మహేశ్వరా! నీవు తపించుచున్న విఘ్న వినాయకుని నేనే! పంచముఖ విఘ్నేశ్వరుడను. నన్ను దేవ, ఋషి, బ్రహ్మాది దేవతలు, వేదోపనిషత్తులు సహితము తెలియరు. నేను అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడను. సృష్టి స్థిత్యంతకారుడను. త్రిగుణయుక్తమయిన స్థావర జంగమాత్మక జగత్తుకు స్వామిని నేనే! నీ తపమునకు ప్రసన్నుడనై నీకు వరమీయుటకు ఏతెంచితిని. మహాదేవా! నీ మనోవాంఛిత కామనలను అడుగవలసినది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి వృషాంక విచారమను నలుబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఐదవ అధ్యాయము

(శివుని ద్వారా శ్రీగణేశ పూజనము)

గజాననుని పలుకులు విని శివుడిట్లనియె "మహాప్రభూ! మీ దర్శనముచే నా నేత్రములు, మీ పూజనముచే నా హస్తములు, మీకు ప్రణామములర్పించుట చే నా శిరస్సులు, మీ స్తుతి కావించుటచే నా ముఖములు, ధన్యములయినవి. పంచ మహాభూతములు, పంచతన్మాత్రలు, పంచ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములు, యక్ష, గంధర్వ, మానవ, పితృ, దేవర్షి, దేవగణములు, బ్రహ్మేంద్ర, వరుణ, వసు, సాధ్యగణములు, చరాచర ప్రాణికోట్లు, సర్వము మీ నుండే ఉత్పన్నమయినవి. ఓ! అనన్యబుద్ధీ! మీరు రజోగుణము చే జగత్తునుత్పన్నము కావించి, సత్వగుణము చే పోషించి, తమో గుణము చే సంహారము కావించుచున్నారు. మీరు నిత్యులు, నిష్కాములు, సర్వకర్మ సాక్షి." అంత శివుని ఆజ్ఞన బ్రహ్మ ఇట్లనియె "ప్రభూ! సర్వ మాతృకల యందు ప్రథమ బీజాక్షరము "ఓం". ఇదియే వేదములకు మూలము, మరియు మీ నామము. మీరు గణములకు స్వామి కావున "గణేశ" నామమున విఖ్యాతి నొందవలసినది." అంత గణపతి "తథాస్తు" అని పలికెను. శివుడు సంతసిల్లి ఇట్లనియె "శ్రీగణేశ మహాప్రభూ! ఏ కార్యారంభమునైననూ ఒక్కమారు మిమ్ము తలచిన, ఆ కార్యము నిర్విఘ్నముగ పూర్ణమగును. లేని ఎడల అయ్యది విఘ్నముల పాలగును. శైవ, వైష్ణవ, గాణాపత్య, శాక్తేయ, సౌరోపాసకులెవరైననూ లౌకిక లేక పారలౌకిక కర్మలందు, శుభాశుభ కార్యములందు తొలుత మాత్రము ప్రయత్నపూర్వకముగ

శ్రీగణేశుని పూజింప వలసినదే!!! స్వామీ! సర్వ ప్రాణులకు మంగళకారకుడవు నీవే! అందుచే నిన్ను మంగళమూర్తి అని వచింతురు. పూర్వ కాలమున నేను త్రిపురాసుర సంహారమునకు బయలుదేరినపుడు నిన్ను స్మరింపక, పూజింపక యుద్ధమునకేగి పరాజితుడనైతిని. ప్రభూ! ఇపుడు మీ చరణ సన్నిధిని శరణువేడుచున్నాను. ఓ! సర్వ శక్తి స్వరూపా! నా అపరాధమును మన్నించి, నాకు విజయము కటాక్షింపవలసినది. ప్రభూ! మీ స్మరణ, భజన, పూజన మాచరింపని జనులు జడులగుదురు. ఆచరించిన పూజ్యులు సర్వసిద్ధులను పొందెదరు."

ఈ విధముగ శివుని చే స్థుతింపబడిన శ్రీగణేశుడు ప్రసన్నుడై "పరమేశ్వరా! నేను సంతుష్టి నొందితిని. మీరు నన్ను ఎప్పుడు తలచిన, నేను తక్షణము మీకు దర్శనమిచ్చి మనోవాంఛా పూర్ణమొనర్చెదను. నా ఏకాక్షర మంత్రము (గం) ను ఒక సాయకముపై అభిమంత్రించి, త్రిపురాసురుని తన త్రిపురములు ఏక కక్ష్యపై యున్నపుడు ప్రయోగింపవలసినది. నా వరదాన తేజోబలము చే ఆ పురములు దగ్ధమయి, త్రిపురుడు భస్మమగును." అంత శ్రీగణేశుడు పరమశివుని ఎడల అత్యంత ప్రసన్నుడై తన దివ్య సహస్ర నామావళిని ప్రసాదించి ఇట్లనియె "నీలలోహితా! యుద్ధకాలమున మీరు ఈ సహస్ర నామావళిని పారాయణము ఒనర్చిన, శీఘ్రముగ దైత్యుని సంహరించెదరు. ఏ మానవుడు త్రిసంధ్యల యందునూ ఈ సహస్ర నామావళిని పారాయణమొనర్చునో వారు తమ అభీష్ఠ కార్యసిద్ధి నొందెదరు." అంత శివుడు అమందానంద భరితుడై అక్కడనే ఒక దివ్యమయిన శ్రీగణేశమూర్తిని ప్రతిష్ఠించి, దేవ, మానవ, సిద్ధుల సహితుడై పూజనమొనర్చి భూసురులకు దానములిచ్చి ప్రణామములర్పించి ఇట్లు ఘోషించెను. "ఈ మణిపురము సర్వలోకములందును విఖ్యాతమగును." శ్రీగణేశుడు "తథాస్తు" అని దీవించి అంతర్ధానుడయ్యెను. తదుపరి, శివుడు తన గణముల, దేవతా సహితుడై, గృహమున కేతెంచి, పార్వతిదేవిని కాంచి సర్వ విషయములను ఆ తల్లికి వివరించెను. సర్వ దేవతలు తమ పత్నీ సహితులై, ఆ విశేషములను శ్రవణము కావించి, త్రిపురుడు సంహరింపబడునని మనస్సు నందు శాంతినొందిరి.

(శ్రీ గణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి శివుని ద్వారా శ్రీగణేశ పూజనమను నలుబది అయిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఆరవ అధ్యాయము

(శ్రీగణేశ సహస్రనామావళి)

ఇదంతయు శ్రవణము గావించుచున్న వ్యాసమహర్షి బ్రహ్మదేవుని ఆపి ఇట్లనియె "పితామహా! దేవదేవుడు శ్రీగణేశుడు మహాదేవునకు తన సహస్రనామముల నిచ్చెనని శెలవిచ్చితిరి కదా! దయచేసి ఆ నామావళిని నాకు తెలిజేయవలసినది." అంత చతురాననుడు "ఈ అమృత స్తోత్రమాలా మహామంత్రమునకు ఋషి శ్రీ మహాగణపతి; దేవత బృహస్పతి; ఛందస్సు నానావిధి; బీజము "హుం"; శక్తి "తుం"; "స్వాహా" కీలకము.

సకల విఘ్న వినాశద్వారా శ్రీ బృహస్పతి ప్రీత్యర్థం జపే వినియోగ:

గణేశ్వరో గణక్రీడ: – అంగుష్ఠాభ్యాం నమ:

కుమారగురీశాన: – తర్జనీభ్యాం నమ:

బ్రహ్మాండ కుంభ నిశ్చిదవ్యోమ: – మద్యమాభ్యాం నమ:

రక్తో రక్తాంబర ధర: – అనామికాభ్యాం నమ:

సర్వ సుద్గురు సంసేవ్య: – కనిష్ఠికాభ్యాం నమ:

ఛందశ్చందోద్భవ: – హృదయాయ నమ:

నిష్కలో నిర్మల: – శిరసే స్వాహా

సృష్టి స్థితి లయ క్రీడ: – శిఖాయై వషట్

జ్ఞానం విజ్ఞానమానందం – కవచాయహుం

అష్టాంగయోగ ఫలభృత్ – నేత్రత్రయాయ ఔషట్

అనంత శక్తి సహిత: – అస్త్రాయ ఫట్

తదుపరి "రక్తాంభోది స్థపోతో" ఇత్యాది శ్లోకములతో గణేశ ధ్యాన మొనర్చవలెను. శ్లోకార్థము: అరుణిమ చిందించుచున్న సముద్రముపై వికసిత రక్త పద్మముపై సుఖాశీనుడు, చతుర్భుజుడు, నాలుగు హస్తములందును పాశ, అంకుశ, పరశువు, మరియు వరదముద్ర ధరించినవాడు, శక్తి సంపన్నుడు, గజాననుడు, సిద్ధి బుద్ధి సహితుడు, మహోదరుడు, అర్ధ చంద్ర కళాధరుడు, సర్వ భయాపహారుడు, విఘ్నరాజయిన వినాయకునికి నమస్కారము.

ఓం "లం" పృధివ్యాప్తకం – గంధం సమర్పయామి.

ఓం "హం" ఆకాశ్యత్మకం – పుష్పం సమర్పయామి.

ఓం "యం" వాయువ్యాత్మకం – ధూపం సమర్పయామి.

ఓం "రం" వహన్యాత్మకం – దీపం సమర్పయామి.

ఓం "లం" అమృతత్యాత్మకం – నైవేద్యం సమర్పయామి.

ఈ విధమగ పూజన మాచరించి ఇపుడు సహస్రనామములు పాఠన మొనర్చవలెను.

గణేశ్వర, గణక్రీడ, గణనాథ, గణాధిప, ఏకదంష్ట్ర, వక్రతుండ, గజవక్త్ర, మహోదర, లంబోదర, ధూమ్రవర్ణ, వికట, విఘ్ననాయక, సుముఖ, దుర్ముఖ, బుద్ధ, విఘ్నరాజ, గజానన, మోద, ప్రమోద, ఆమోద, సురానంద, మహోత్కట, హేరంబ, శంబర, శంభు, లంబకర్ణ, మహాబల, నందన, ఆలంపట, భీమ, మేఘనాథ, గణాజ్యయ, వినాయక, విరూపాక్ష, ధీరసూర, వరప్రద, మహాగణపతి, బుద్ధిప్రియ, క్షిప్రప్రసాదన, రుద్రప్రియ, గణాధ్యక్ష, ఉమాపుత్ర, ఆఘనాశన, కుమారుగురు, ఈశానపుత్ర, మూషికవాహన, సిద్ధిప్రియ, సిద్ధిపతి, సిద్ధ, సిద్ధి వినాయక, అవిఘ్న, తుంబురు, సింహవాహన, మోహినీ ప్రియ, కటంకట, రాజపుత్ర, శాలక, సంమిత, అమిత, కూష్మాండ, సామసంభూతి, దుర్జయ, ధూర్జయ, జయ, భూపతి, భువనపతి, భూతపతి, అవ్యయ, విశ్వకర్త, విశ్వముఖ, విశ్వరూప, వినిర్గుణ, కవి, కవిబుషభ, బ్రహ్మణ్య, బ్రహ్మణ్యస్పతి, జ్యేష్ఠరాజ, నిధిపతి, నిధిప్రియ, హిరణ్మయ, పురాంతస్థ, సూర్యమండల మధ్యగ కరాహతిధ్వస్త సింధుసలిల, పూషదంతచిత్, ఉమాంకకోలకుతుకీ, ముక్తిద, కులపాలన, కిరీటీ, కుండలీ, హారీ, వనమాలీ, మనోమయ, వైముఖ్యహతదైత్యక్ష, పాదాహత్యోజితక్షితి, సద్యోజాత, స్వర్ణముంజమేఖలీ, దుర్నిమిత్త హృత్, దు:స్వప్న, దుష్టశమన, గుణీ, నాదప్రతిష్ఠిత, సురూప, సర్వనేత్రాధివాస, విభ్రాజినూపుర, పీతాంబర ఖండరద, ఖండేందు కృత శేఖర, చిత్రాంగ, శ్యామదశన, భాలచంద్ర, చతుర్భుజ, యోగాధిప, తారకస్థపురుష, గజకర్ణక, గణాధిరాజు, విజయస్థిర, గజపతిధ్వజీ, దేవదేవ, స్మర, ప్రాణదీపక, వాయుకీలక, విపశ్చిత్, వరద, నాదోన్నాద భిన్న మహాచల, వరాహవదన, మృత్యుంజయ, వ్యాఘ్రజనాంబర, ఇచ్ఛాశక్తిభవ, దేవత్రాతా, దైత్యవిమర్దన, శంభుదక్త్రోద్భవ, శంభుకోపజ, శంభుహాస్యభూ, శంభుతేజా, శివాశోకహారీ, గౌరీసుఖావహ, ఉమాంగమలజ, గౌరీతేజభూ, స్వర్ధునీభవ, మహానాదా, గిరివర్ష్మా, శుభాసన, సర్వాత్మా, సర్వదేవాత్మా, బ్రహ్మమూర్ధా, కకుప్శ్రుతి.

బ్రహ్మాండకుంభ, చిద్వోమభాల, సత్యశిరోరుహ, జగజ్జన్మలయోన్మేషనిమేషా, అగ్న్యార్క సోమదృక్, గిరీంద్రైకరదా,

ధర్మాధర్మేష్ఠా, సామభీంహిత్, గహ్యక్షదశన, వాణిజిహ్వా, వాసననాసిక, భ్రూమధ్యసంస్థితకర, బ్రహ్మావిద్యామదోదక కులాచాలాంశ, సోమార్కఘంట, రుద్రశిరోధర, నదీనదభుజ, సర్వాంగుళీయక, తరకానఖ, వ్యోమనాభి, శ్రీహృదయ, మేరుపృష్ఠ, ఆర్లవోదర, కుక్షిస్థయక్షగంధర్వరక్షః కిన్నెరమానుష, పృధీకటి, సృష్టిలింగమ్, శైలోరు, దస్రజానుక, పాతాళజంఘ, మునిపాత్, కాలాంగుష్ఠ, త్రయాతను, జ్యోతిర్మండలలాంగూల, హృదయానలనిశ్చల, హృపద్మకర్ణికాశాలీ, వియత్కోరిసరోవరా, సద్భక్త ధాన్యననిగడ, పూజావారి నివారిత, ప్రతాపీ, కశ్యపసుత, గణక, విష్ఠపీ, బలీ, యశశ్వీ, ధార్మిక, జేతా, ప్రధమ, పరమేశ్వర, చింతామణి ద్వీపపతీ, కల్పద్రుమదనాలయ, రత్నమండపమధ్యస్థ, రత్నసింహాననాశ్రయ, తీవ్ర శిరోదృతపద, జ్వాలినీమేళిలాలిత, నందనందిపపీఠశ్రీ, భోగదాభూషితాసనా సకామదాయినీపీఠ, స్ఫురదుగ్రసనాశ్రయ, తేజోపతీ శిరోరత్న, సత్యనిత్యావతంసికా, సవృతపార్ష్ణిక, పీనజంఘ, శిలష్ఠజాను, స్థూలోరు, ప్రోన్నమత్కుటి, నిమ్నానాభి, స్థూలకుక్షి, పీనవక్ష, బృహద్భుజ, పీనస్కంధ, కంబుకంఠ, లంబోష్ఠ, లంబనాసిక, భగ్నవామరధ, తుంగసత్యదంత, మహాహను, హ్రస్వనేత్రత్రయ, శూర్పకర్ణ, నిబడమస్తక, స్థభకాకారకుంబాగ్ర, రత్నమేళి, నిరంకుశ, సర్వహార కటిసూత్ర, సర్పయజ్ఞోపవీతవాన్, సర్పకోటీరకటక, సర్పగ్రైవైకాంగద, సర్పకక్షీధరాబంధ, సర్పరాజోత్తరభద, రక్త, రక్తాంబరధర, రక్తమాల్యావిభూషణ, రక్తేక్షణ, రక్తకర, రక్తతాల్వోష్ఠపల్లవ, శ్వేత, శ్వేతాంబరధర, శ్వేతమాల్యవిభూషణ, శ్వేతాతపత్రరుచిర, శ్వేతతామరవీజిత, సర్వాయవసంపూర్ణ, సర్వలక్షణ లక్షిత, సర్వాభరణభోభాద్య, సర్వశోభాసమన్విత సర్వమంగళమాంగల్య, సర్వకారణకారణ, సర్వదైవకర, శారంగీ, బీజపురీ, గదాధర, ఇక్షుచాపధర, శూలి, చక్రపాణి, సరోజభృత్, పాశీ, ఘృతోత్పల, శాలిమంజరీభృత్, స్వదంతభృత్, కల్పవలీధర, విశ్వాభయదైకకర, వశీ, అక్షమాలాధర, జ్ఞానముద్రవాన్, ముద్గరాయుధ, పూర్ణపాత్రీ, కంబుధర, విధృతాక్షసుమోదక, కరస్తామ్రఫల, చూతకళికాభృత, కుఠారవాన్, పుష్కరస్త స్వర్ణఘటీ పూర్ణత్నాభివర్షక, భారతీసుందరీనాథ, వినాయకరతిప్రియ, మహాలక్ష్మీ ప్రియతమ, సిద్ధలక్ష్మీ మనోరమ, రమారమేశపూర్వాంగ, దక్షిణీమామకేశ్వర, మహీవరాహవామాంగ, రతికందర్పపశ్చిమ, ఆమోదమోదజనన, సంప్రమోదప్రమోదన, సమోధిత సమృద్ధిశ్రీ, బుద్ధిసిద్ధ ప్రవర్ధన, మదనావత్యాశ్రింతాంఘ్రి, కృతవైర్ముఖ్యదుర్ముఖః, దంత సౌముఖ్యసుముఖ, కాంతికందళితాశ్రయ, విఘ్నసంపల్లవః పద్మః, సర్వోన్నత మదద్రవః విఘ్నకృన్నిమ్నచరణ, ద్రావిణీశక్తిసంవృత, తీవ్రప్రసన్నవదన, జ్వాలినీపాలితైకదృక్, మోహినీమోహన, భోగదాయినీకాంతిమండిత, కామినీకాంతయుక్తశ్రీ, తైజన్యధిష్ఠితైకదృక్, వసుధారామదోన్నాదో శంఖనిధిప్రభు, నమద్వసుమతీమాలీ మహాపద్మనిధిఃప్రభుః, సర్వసద్గురుసంసేవ్య, శోచిష్కేశహృదాశ్రయ, ఈశానమూర్ధా, దేవేంద్రశిఖ, పవననందన, అగ్రప్రత్యుగ్రనయన, దివ్యాస్త్రప్రయోగవిత్, ఐరావతాదిసర్వాశావారణోవారణప్రియః, వజ్రాది అస్త్ర పరీవరోగణచండ సమాశ్రయ, జయాజయ పరికర, విజయా విజయావాహ, అజితార్జితపదాబ్జ, నిత్యానిత్య వతంసిత, విలాసినీకృతోల్లాస, శేండీసౌందర్యమండిత, అనంతానంతసుఖద, సుమంగళసుమంగళః, జ్ఞానాశ్రయ, క్రియాధార, ఇచ్ఛాశక్తి నిషేవిత, సుభగా సంశ్రితపదా, లలితాలవితాశ్రయ, కామినీ పాలనః, కామకామినీ కేళిలాలితః, సరస్వతాశ్రయ, గౌరీస్వత్యాశ్రయ, గౌరీనందన, శ్రీనికేతన, గురుగుప్తపద, వాబాసిద్ధి వాగీశ్వరీపతి. ॥

నళినీకాముక, వామారామ్, జ్యేష్మామనోరమ, రౌద్రీముద్రితపదాజ్జ, హుంబీజ, తుంగశక్తిక, విశ్వాదిజననత్రాణ, స్వాహాశక్తిసుశీలక, అమృతాబ్ధికృతావాస, మదఘూర్ణితలోచన, ఉచ్ఛిష్టగణప, ఉచ్ఛిష్టగణేశ, గణనాయక, సార్వకాలిక సంసిద్ధ, నిత్యసేవ్య, దిగంబర, అనపాయ, అనంతశక్తి, అప్రమేయ, అజరామర, అనావిళ, అప్రతిరధ, అచ్యుత, అమృత, అక్షర, అప్రతర్క్య, అక్షయ, అజయ్య, అనాధార, అనామయ, అమల, అమోఘసిద్ధి, అద్వైత, అఘోర, అప్రతిమానస (అగ్నిసమానన), అనాకార, అబ్ధిభూమి, అబ్ధిబలఘ్న, అవ్యక్తలక్షణ, అధారపీఠ, ఆధార, ఆధారాధేయవర్జిత, అఖుకేతన, ఆశాపూరక, అఖుమహారధ, ఇక్షుసాగరమధ్యస్థ, ఇక్షుభక్షణలాలస, ఇక్షుచాపాతిరేకశ్రీ, ఇక్షుచాపనిషేవిత, ఇంద్రగోపసమానశ్రీ, ఇంద్రనీలసముద్యుతి, ఇందీవరదళశ్యామ, ఇందుమండలమండిత, ఇధ్మప్రియ, ఇడాభాగ, ఇడాధామ, ఇందిరాప్రియ,

ఇక్ష్వాకువిఘ్నవిధ్వంసీ, ఇతికర్తవ్యతేప్సిత, ఈశానమేళి, ఈశాన, ఈశానప్రియ, ఈతిహా ॥
ఈషణ్మాత్రయకల్పాంత, ఈహామాత్రవివర్జిత, ఉపేంద్ర, ఉడుభృన్మౌళి, ఉండూరక పతిప్రియ, ఉన్నతానవ, ఉత్తుంగ, ఉదారస్త్రీదశాగ్రణీ, ఊర్జస్వాన్, ఊష్మదమల, ఊహాపోహదురాసద, ఋగ్యజు:సామగాయన, ఋద్ధిసిద్ధిసమర్పక, ఋజుచిత్తైకసులభ, ఋణత్రయవిమోచన, స్వబక్తానాంలుప్తవిఘ్న, సురాద్విషామ్లుప్తశక్తి, విముఖార్చనాంలుప్తశ్రీ, లూతవిస్ఫోటనాశన, ఏకారపీఠమధ్యస్థ, ఏకపాదకృతానన, ఏ జితాఖిల దైత్యశ్రీ, ఏదితాఖిలసంశ్రయ, ఐహికాముషికఐశ్వర్యప్రద, ఐశ్వర్యయశోనిధి, ఐరావతసమోన్మేష, ఐరావతనిభానన, ఓంకారవాచ్య, ఓంకార, ఓజస్వాన్, ఓషధీపతి, ఔదార్యనిధి, ఔద్ధార్యధుర్య, ఔన్నత్యనిశ్వన, సురనాగాంకుశ, అంకుశాకారసంస్థత, సమస్త విసర్గాంతపదేషుపరికీర్తిత:, కమండలుధర, కల్ప, కపర్దీ, కలభానన, కర్మసాక్షీ, కర్మకర్తా, కర్మాకర్మఫలప్రదా, కదంబగళకాకార, కూష్మాండగణనాయక, కారుణ్యదేహా, కపిల, కధక, కటి సూత్రభృత్, ఖర్వ, ఖడ్గప్రియ, ఖడ్గీ, ఖాంతరస్థ, ఖనిర్మల, ఖల్వాటశృంగానిలయ, ఖట్వాంగీ, ఖదురాసద, గుణాఢ్య, గహన, గస్థ, గద్యపద్యసుధార్ణవ, గద్యగానప్రియ, గర్జగీత, గీర్వాణపూర్వజ, గుహ్యాచారరత, గుహ్యా, గుహ్యాగమనరూపిత, గుహాశయా, గుఢాబ్ధిస్థ, గురుగమ్య, గురుర్గురు: ఘంటాఘర్ఘరికామాలీ, ఘటకుంభ, ఘటోదరచ, ఙంకారవాచ్య, ఙంకార, ఙంకారాకారశుండభృత్, చండ, చండకేశ్వరసుహృద్, చుండేశ, చండవిక్రమ, చరాచరపతి, చింతామణి, చర్వణలాలస, ఛంద, ఛందోద్భవ, చందదుర్లక్ష్య, ఛందవిగ్రహా, జగద్యోని, జగత్సాక్షీ, గదీశ, జగన్మయి, జప, జపపర, జాప్య, జిహ్వాసింహాసనప్రభు, స్రవద్గండోల్లసద్దానఘంకారి భ్రమరాకుల, టంకారస్ఫారసంరావ, టంకారిమణినూపుర, ఠద్వయీపల్లవాంతస్థసర్వమంత్రేషుసిద్దివ:, డిండిముండ, ఢాకినీశ, డామర, డిండిమప్రియ, ఢక్కానినాదముదిత, ఢౌంక, ఢుంఢివినాయక, తత్వానాంపరంతత్వ, తత్వంపదనిరూపిత, తారకాంతరసంస్థాన, తారక, తారకాంతక ॥
స్థాణు: స్థాణుప్రియ, స్థాతా, స్థావర జంగమజగత్, దక్షయజ్ఞ ప్రమదన, దాతా, దానవమోహన, దయావాన్, దివ్యవిభవ, దండభృత్, దండనాయక, దంతప్రభిన్నభ్రమాళా, దైత్యవారణదారణ, దంష్ట్రాలగ్న ద్వీపఘట, దేవార్ధనృగజాకృతి, ధన్య, ధనపతిబంధు, ధనధ, ధరణీధర, ధ్యానైకప్రకట, ధ్యేయ, ధ్యాన, ధ్యానపరాయణ, నంధ్య, నాదప్రియ, నాద, నాదమధ్యప్రతిష్ఠిత, నిష్కల, నిర్మల, నిత్య, నిత్యానిత్య, నిరామయ, పరంవ్యోమ, పరంధామ, పరమాత్మ, పరంపద, పరాత్పర, పశుపతి, పశు పాశవిమోచక, పూర్ణానందచ పరానంద, పురాణపురుషోత్తము, పద్మప్రసన్ననమయిన, ప్రణతాజ్ఞానాశన, ప్రమాణ ప్రత్యయాతీత, ప్రణతార్తివినాశన, పణిహస్త, పణిపతి, పూత్కార, ఫణితప్రియ, బాణార్చితాంఘ్రియుగళ, బాలకేళీకుతూహలీ, భ్రహ్మా, భ్రహ్మార్చితపద, భ్రహ్మచారీ, బృహస్పతి, బృహత్తమ, భ్రహ్మపరచ భ్రహ్మణ్య, భ్రహ్మవిత్ప్రియ, బృహన్నాదాగ్ర్యచీత్కార, భ్రహ్మాండావలిమేఖలా ॥
భూక్షేపదత్తలక్ష్మీక, భర్గ, భద్ర, భయాపహా, భగవాన్, భక్తిసులభ, భూమిద, భూతిభీషణ, భవ్య, భూతాలయ, భోగదాతా, భ్రూమధ్యగోచర, మంత్ర, మంత్రపతి, మంత్రీ, మదమత్తమనోరమ, మేఖలాహీశ్వర, మందగతి, మందనిభేక్షణ, మహాబలా, మహావీర్యా, మహాప్రాణా, యజ్ఞ, యజ్ఞపతి, యజ్ఞగోప్తా, యజ్ఞఫలప్రదా, యశస్కర, యోగగమ్య, యాజ్ఞిక, యాజికప్రియ, రస, రసప్రియ, రస్య, రజ్జిక, రావణార్చిత, రాజ్యరక్షాకర, రత్నగర్భ, రాజ్యసుఖప్రద, లక్ష్యాలక్ష్యప్రద, లక్ష్య, లయస్థ, లడ్డుకప్రియ, లానప్రియ, లాస్యపర, లాభకృత్, లోకవిశ్రుత, వరేణ్య, వహ్నివదన, వంద్య, వేదాంగగోచర, వికర్త, విప్వతశ్చక్షు, విధాతా, విశ్వతోముఖ, వామదేవ, విశ్వనేత, వజ్రివజ్రనివారణ, విశ్వబంధన, విష్కించాధార, విశ్వేశ్వర, విభు, శబ్దభ్రహ్మ, శమప్రాప్య, శంభుశిక్తిగణేశ్వర, శాస్తా, శిఖాగ్రనిలయ, శరణ్య, శంబరేశ్వర, షఢ్రుతు కుసుమస్రగ్వీ, షడాధార, షడక్షర, సంసారవైద్య, సర్వజ్ఞ, సర్వభేషజభేషజం సృష్ఠి స్థితిలయక్రీడ, సురకుంజరభేదక, సింధూరితమహాకుంభ, సదసద్వ్యక్తిదాయక, సాక్షీ, సముద్రమథన, స్వసంవేద్య, స్వదక్షిణ, స్వతంత్ర, సత్యసంకల్ప, సామగానరతా, సుఖీ, హంస, హస్తి పిశాచీశ,

హవన, హవ్యకవ్యభుక్, హవ్య, హుతప్రియ, హృష్ట, హృల్లేఖ్యమంత్రమధ్యగ, క్షేత్రాధిప, క్షమాభర్త, క్షమాపరాయణ, క్షిప్రక్షేమకర, క్షేమానంద, క్షీణీసురద్రుమ, ధర్మప్రద, అర్థద, కామదాతా, సౌభాగ్యవర్ధన, విద్యాప్రద, విభవద, భుక్తిముక్తి ఫలప్రద, ఆభీరూప్యకర, వీరశ్రీప్రద, విజయప్రద, సర్వవశ్యకర, గర్భదోషహా, పుత్రపౌత్రద, మేదాప్రద, కీర్తిదాతా, శోకమారీ, దౌర్భాగ్యనాశన, ప్రతివాది ముఖస్థంధ, రుష్టచిత్తప్రసాద, పరాభిచార శమన, దు:ఖమా, బంధమోక్షద, లవ, తృణి, కళ, కాష్ఠా, నిమేష, క్షణ, ఘటీ, ముహూర్త, ప్రహర, దివానక్తు, అహర్నిశ, పక్ష, మాస, ఆయన, వర్ష, యుగ, కల్ప, మహాలయ, రాశి, తారా, తిథి, యోగ, వార, కరణ, అంకుశ, లగ్న, హోర, కాలచక్ర, మేరు, సప్తర్షి, ధృవ ॥

రాహు, మంద, కవ, జీవ, బుధ, భీమ, శశి, రవి, కాల, స్రష్టా, విశ్వస్థితి, స్థావర, జంగమాత్మజ, భూ, ఆప, అగ్ని, మరుత, వ్యోమ, అహంకార, ప్రకృతిపుమాన్, బ్రహ్మ, విష్ణు, శివ, శక్తి, త్రిదశ, సిద్ధ, కిన్నెర, పితర, యక్ష, రాక్షస, మనుష్య, పశు, ఖగ, సముద్ర, సరితా, శైల, భూత, భవ్య, భవోద్భవ, సాంఖ్యా, పాతంజలియోగ, పురాణ, శృతి, వేదాంగ, సదాచార, మీమాంస, న్యాయవిస్తర, ఆయుర్వేద, ధనుర్వేద, గాంధర్వవేద, కావ్యనాటక, వైఖాసన, ఆగమ, భాగవత, సాత్వతసంహిత, పాంచరాత్ర, ఆగమ, శైవ, పాశుపత, కాలాముఖ, భైరవశాశన, శాక్తు, వైనాయక, సౌర, జైన, అర్హతసంహిత, సదసద్, వ్యక్త, అవ్యక్త, సచేతన, అచేతన, బంధ, మోక్ష, సుఖ, భోగయోగ, సత్య, అణు, మహాన్, స్వస్తి, హుంఫట్, స్వధా, స్వాహా, శ్రేషట్, వైషట్, వషట్, నమ:, జ్ఞాన, విజ్ఞాన, ఆనంద, బోధ, సంవిత, శమ, యమ, ఏక, ఏకాక్షరాధార, ఏకాక్షరపరాయణ, ఏకాగ్రధీ, ఏకవీర, ఏకానేక స్వరూపధృక్, ద్విరూప, ద్విభుజ, ద్వ్యక్ష, ద్విరద, ద్వీపరక్షక. ద్వైమాతుర, ద్వివదన, ద్వంద్వహీన, ద్వయాతిగ, త్రిధామాత్రికర, త్రేతా, త్రివర్గఫలదాయక, త్రిగుణాత్మా, త్రిలోకాది, త్రిశక్తీశ, త్రిలోచన, చతుర్బాహు, చతుర్దంతా, చతురాత్మా, చతుర్ముఖ, చతుర్విధోపాయమయ, చతుర్వర్ణాశ్రమాశ్రయ, చతుర్విధవచోవృత్తి పరివృత్తి ప్రవర్తక, చతుర్థీపూజపప్రీత, చతుర్థీతిధి సంభవ, పంచాక్షరాత్మా, పంచాత్మ, పంచాస్య, పంచకృత్యకృత్, పంచాధార, పంచవర్ణ, పంచాక్షర పరాయణ, పంచతాళ, పంచకర, పంచ ప్రణవమాతృక, పంచబ్రహ్మమయస్ఫూర్తి, పంచావరణవారిత, పంచభక్ష్యప్రియ, పంచబాణ, పంచశివాత్మిక, షట్కోణపీఠ, షట్చక్రధామ, షడ్గ్రంధి భేదక, షడంగధ్వాంత, విధ్వంసీ, షడంగుల మహాహ్రదా, షణ్ముఖ, షణ్ముఖభ్రాతా, షట్‌శక్తి పరివారిత, షడ్వైరివర్గ విధ్వంసీ, షడూర్మి భయభంజన, షట్కర్తదూర, షట్కర్మా, షడ్గుణ, షడ్రసాశ్రయ, సప్త పాతాళచరణ, సప్తద్వీపోరుమండల, సప్తస్వర్లోకమకుట, సప్తసప్తివరప్రద, సప్తాంగరాజ్యసుగధ, సప్తర్షిగణవందిత ॥

సప్తచ్ఛందోనిధి, సప్తహోతా, సప్త స్వరాశ్రయ, సప్తాబ్ధకేళిసాగర, సప్తమాతృనిషేవిత, సప్తచ్ఛందోమోదమద, సప్తచ్ఛందోముఖప్రభు:, అష్టమూర్తి, ధ్యేయమూర్తి, అష్టప్రకృతికారణా, అష్టాంగయోగ ఫలభృత్, అష్టపత్రాంబుజాసన, అష్టశక్తీ సముద్రశ్రీ, అష్టైశ్వర్య ప్రదాయక, అష్ట పీఠోపపీఠశ్రీ, అష్టమాతృకసమావృత, అష్ట భైరవ సేవ్య, అష్టవసువంద్య, అష్టమూర్తి భృత్, అష్టచక్రస్ఫురన్మూర్తి, అష్టద్రవ్యహవిప్రియ:, నవనాగాసనాధ్యాసీ, నవ విద్యనుశాశిత:, నవద్వారపురాధారా, నవద్వారనికేతన, నవనారాయణస్థుత్య, నవదుర్గానిషేవిత, నవనాధమహానాధ, నవనాగ విభూషణ, నవరత్నవిచిత్రాంగ, నవశక్తి శిరోధృత, దశాత్మిక, దశభుజ, దశదిక్పతినందిత, దశాధ్యాయ, ధశప్రాణ, దశేంద్రియనియామక, దశాక్షరమహామంత్ర, దశాశావ్యాపివిగ్రహ, ఏకాదశాది రుద్రస్తుత, ఏకాదశాక్షర ద్వాదశద్విదశాష్టాదిదొర్దండ, ద్వాదశాస్త్రనికేతన, త్రయోదశభిదాభిన్నోవిశ్వేదేవాధిదైవతం ॥

చతుర్దశేంద్రవరదా పంచదశసామ, పంచదశీ శీతాంసునిర్మల, షోడషోధారనిలయ, షోడష స్వరమాతృక, షోడశాంతపదావాస, షోడసేందు కళాత్మకా, సప్తదీకళా, సప్తదశ, సప్తదశాక్షర, అష్టదశద్వీపపతీ, అష్టాదశపురాణకృత్, అష్టాదశేషధీస్రష్టా, అష్టాదశ విధిస్మృత, అష్టాదశలిపికృత, అష్టాదశవిజాతికృత, ఏకవింశతిపుమాన్, ఏకవింశత్యంగుళిపల్లవ, చతుర్విశతి తత్వాత్మా, పంచవింశాఖ్యపురుషా, సప్తవింశతితారేషా, సప్తవింశతి యోగకృత్, ద్వాత్రింశద్భైరవాదీశ, చతుస్త్రింశన్

మహాహ్రద, షట్త్రింశత్ తత్వసంభూతి, అష్టత్రింశత్కాతను, నమదేకొనపంచాసన్మరుద్వర్గనిరర్గళః, పంచాశదక్షరశ్రేణీ, పంచాసద్ రుద్ర విగ్రహః పంచాసత్ విష్ణుశక్తీశ, పంచాసన్ మాతృకాలయ, ద్విపంచాసత్ వపుశ్రేణీ, త్రిషష్ట్యక్షరసంశ్రయః, చతుషష్ట్యర్థ నిర్ణేతా, చతుషష్టికళానిధి, చతుషష్టి మహాసిద్ధి యోగినీ వృందవందితా. ॥
అష్టషష్టి మహాతీర్థక్షేత్ర భైరవ భావన, చతుర్నవతి మంత్రాత్మా, షణ్ణవత్యధిక ప్రభు, శతానంద, శతధృతి, శత పత్రాయతేక్షణ, శతానీక, శతమఖ, శతధారవాయుత, సహస్రపత్రనిలయ, సహస్రఫణిభూషణ, సహస్రశీర్షపురుష, సహస్రాక్ష, సహస్రపాద, సహస్రనామసంస్తుత్య, సహస్రాక్ష బలాపహ, దశ సహస్ర ఫణిభృత్ ఫణిరాజ కృతాసన, అష్టాశీతి సహస్రాద్య మహర్షిస్తోత్ర పారితః, లక్ష్యాధార, ప్రియాధార, లక్షధారమనోమయా, చతుర్లక్ష జపప్రీత, చతుర్లక్షప్రకాశిత, చతుర్శీతి లక్షజీవదేహ సంస్థిత, కోటిసూర్యర ప్రతీకాశ, కోటి చంద్రసునిర్మల, సప్తకోటి మహామంత్ర మంత్రితానయవద్యుతి, శివోద్భవాద్యష్ట కోటి వైనాయక దురంధరః, త్రియంస్త్రిం శత్కోటి సురశ్రేణీ ప్రణిత పాదుకః, అనంత దేవతా సవ్యః, అనంత శుభదాయక, అనంతనామా, అనంతశ్రీ, అనంతానంతసౌఖ్యద, అనంతశక్తిసహిత, అనంతమునిసంస్తుత, ఓం నమః ॥

ఇవి శ్రీగణేశుని, వినాయకుని, విఘ్నేశ్వరుని సహస్రనామములు.

శ్రీవినాయకుని ఈ సహస్రనామావళిని ఎవరు బ్రహ్మ ముహూర్తమందు పఠించునో వారికి సంపూర్ణ ఐహికాముష్మిక సుఖములు కలుగును. అంతేకాక ఆయురారోగ్య, ఐశ్వర్య, శౌర్య, ధైర్య, బల, యశస్సు, మేధ, ప్రజ్ఞ, ధృతి, కాంతి, సౌభాగ్యము, సుందరరూపము, సత్యము, దయ, క్షమ, శాంతి, దాక్షిణ్యము, ధర్మశీలత, జగద్వశీకరణము, విశ్వసంవాదము, వేదపాండిత్యము సభలయందు పాండితీప్రకర్ష, ఔదార్యము, గంభీర్యము, బ్రహ్మవర్చస్సు, జోజోతేజములు, కులశీలములు, వీర్యప్రతాపములు, శ్రేష్ఠత, జ్ఞాన, విజ్ఞాన, ఆస్తికత, ధైర్యము, విశ్వశనీయత, ధనధాన్యభివృద్ధి, – ఇవన్నియు ఈ స్థోత్రమును ఒక్కమారు పఠించిన ప్రాప్తించును. చతుర్విధ జీవుల (జరాయుజ, అండజ, ఉద్భిజ, స్వేదజ) తో నిండిన విశ్వమంతయు ఈ జపముచే వశమగును. ఒకవేళ ఈ పారాయణ ఏదేని రాజు, రాణి మంత్రి మొదలగువారిని వశీకరణ మొనర్చుకొనుటకు కావించిన ఎడల, వారు తప్పక వశీభూతులగుదురు. ఈ పారాయణ చతుర్విధ పురుషార్థములను అనాయాసముగ ప్రాప్తింపజేయును. శాఖినీ, ఢాకినీ యక్ష రాక్షసాదులను దూరమొనర్చును. అంతేకాక ఇయ్యది శత్రుమర్దనము కావించి, కలహ కారణములను ధ్వంసమొనర్చి, సామ్రాజ్య సుఖమును ప్రసాదించును. దుఃస్వప్న, దుష్పరిణామములు నశించి, ప్రభువు ప్రశాంతుడై, షట్కర్మ సిద్ధి (శాంతి, వశీకరణము, స్థంభనము, విద్వేషణము, ఉచ్చాటనము, మరియు మారణము); అష్ట మహాసిద్ధులు (అణిమ, లఘిమ, మహిమ, గరిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశిత్వం, వశిత్వం) ప్రాప్తించును, ఆ మానవుడు త్రికాలవేది (భూ, భవిష్యత్, వర్తమాన కాల ద్రష్ట) అగును.

శత్రురాజుల అభిచారిక కృత్యములు నష్టమై, శత్రువ్యూహములు మర్దింపబడి, సమరమందు విజయము లభించును. పడతులకు వంధ్యతము దూరమొనర్చి, గర్భరక్షణ నిచ్చును. ఏ దేశమందు ప్రతిదినము ఈ గణపతి సహస్రనామ పారాయణ జరుగునో అచట దుర్భిక్షము, ఆరు విధముల ఈతిబాధలు (అతివృష్టి, అనావృష్టి, మూషిక, శలభ, శుక, ప్రక్కరాజ్య రాజుల ఆక్రమణ) మరియు పాపము యుండదు. ఏ గృహమందు ఈ స్థోత్రము ప్రతిదినము పఠింపబడునో ఆ గృహమును లక్ష్మీదేవి వీడదు. రోగములు పొడసూపవు. కఫ, వాత, పిత్త దోషములచే జనింపబడు జ్వరములు సోకవు. ఈ స్థోత్ర పఠనము చే చాతుర్వర్ణములు, పతితులు సహితము సిద్ధి నొందెదరు. కానీ ఈ స్థోత్రమును కేవలము శుభ ఫలాభిలాషకే కావింపవలెను. ఈ స్థోత్ర పఠనమును సకామభావన చే కావించిన, ఆ జీవుడు భౌతిక సుఖములన్నియు ప్రాప్తించి, పరలోకమునందు ఇచ్ఛానురూపుడై, ఇచ్ఛితరీతిని, చంద్ర, సూర్య, బ్రహ్మ, విష్ణు, శివలోకములకేగి, తన అభీష్ట బంధు బాంధవులతో భోగములనుభవించి, చివరకు మహాగణపతికి ప్రియానుచరుడై, నందీశ్వరాది గణములచే స్వాగత సత్కారములందుకొని, పార్వతీ పరమేశ్వరులచే ప్రియ పుత్రుడు/పుత్రిక గా పాలింపబడి, తదుపరి తిరిగి భూలోకమందు

పూర్వజన్మ స్మృతితో సార్వభౌమునిగ జన్మించును. ఏ వ్యక్తి నిష్కామ భావన చే ఈ స్తోత్ర పారాయణ గావించునో అతడు/ ఆమె జ్ఞాన వైరాగ్యములందు స్థితిగతులై, యోగసిద్ధినొంది, పరమానందమునందు నిమగ్నులై, పునర్జన్మ లేని నిత్య, నివృత స్థితి యందు స్థితులై శ్రీవినాయకుని యందు లీనమగుదురు. ఎవరు ఈ సహస్రనామమును జపము, పఠించుట, పఠింపించుట, వినుట, వినిపించుట, వ్యాఖ్యానము, చర్చ, ధ్యానము, విచారవిమర్శలు, అభినందన కావించుట వలన ఇహపరలోకములందు తరగని ఐశ్వర్యములు నొందెదరు.

ఎవరు స్వతంత్రులైనప్పటికీ, వారు ఈ స్తోత్రమును ధారణ చేయుదురో వారు ఎనిమిది కోట్ల శివగణముల చే రక్షింపబడుదురు. ఈ స్తోత్రము లిఖింపబడిన పుస్తకమును ఎవరు గృహమునందు పుజించెదరో వారి ఇంట లక్ష్మీదేవి స్థిరనివాసముండును. సర్వదాన, యజ్ఞ, వ్రత, తీర్థ సేవనములచే ప్రాప్తింపని ఫలము సహితము ఈ గణేశ సహస్రనామ స్మరణచే శీఘ్రముగ లభించును. ఏ మనుజుడు త్రిసంధ్యల యుందునూ ఈ సహస్రనామమును పఠించునో, వానికి ఐశ్వర్యము సంపన్నమై, వాక్శుద్ధి గలిగి, వాని కీర్తి దశదిశలా వ్యాపించును. దరిద్రము దూరమగును. విశ్వము వశీభూతమై, పుత్రపౌత్రాభివృద్ధి కలుగును. నిర్ధనుడయిన వ్యక్తి ఆహార వ్యవహారములందు నియమనిష్ఠలు కలిగి, గణేశార్చనా తత్పరుడై, ఏకాగ్ర చిత్తము చే నాలుగుమాసములు ఈ స్తోత్ర జపమాచరించిన, వారికి ఏడు జన్మముల నుండి తరుముచున్న దరిద్రము తొలగి అఖండ లక్ష్మీ సౌభాగ్యము కలుగును. ఇది ఈశ్వరుని ఆజ్ఞ. నిత్యపఠనము కావించు సజ్జనులకు దీర్ఘాయువు, రోగరాహిత్యము, అతి నిర్మలత్వము, ఆర్తజనులను ఆదుకొనగలుగు ధనసంపత్తి, పుణ్యకర్మములచే ఆర్జింపబడు నిర్మలకీర్తి, దివ్య వాక్చతురత్వము, శరీరమందు వ్యాధి రహిత సుందరకాంతి, గుణవతి, మరియు అనుకూలవతి అయిన భార్య/భర్త, సదాచారులైన సంతానము, ఇంకా అనేక అభీష్ఠ సిద్ధులు కలుగును.

ఎవరు ఈ క్రింది ఇరువదిఒక్క నామములను శ్రీగణేశుని యందు తత్పరులై, ఆయనను ఆరాధించి, ఏకాగ్ర చిత్తులై పదకొండు మోదకములు అర్పించుచూ ఆ దేవదేవుని స్తుతించెదరో, అయ్యది శ్రీగణేశ సహస్రనామావళితో సమానమని తెలియవలెను. ఆ ఇరువది ఒక్క నామములు – "గణాజ్యయ, గణపతి, హేరంబ, ధరణీధర, మహాగణపతి, బుద్ధిప్రియ, క్షిప్రప్రసాదన, అమోఘసిద్ధి, అమిత, మంత్ర, చింతామణి, నిధి, సుమంగళ, బీజ, ఆశాపూరక, వరద, కవి, కశ్యప, నందన, వాచాసిద్ధి, డుంఢివినాయక."

చరణములకు నూపురములు, ధరించి ఎవరి అంగములు మితము, మరియు అపరిమితముగ ప్రకటమయినవో, ఎవరి కన్నులనుండి మదజలధారలు శోభాయమానముగ ప్రకాశించుచుండునో, ఆ శ్రీగణేశుడు ఈ మహాగపతి సహస్రనామ స్తోత్రమును పఠించు భక్తుల పాపములను దూరమొనర్చుగాక! శ్రేష్ఠ దేవతలచే పూజింపబడు చరణములు, బాలగజరాజ ముఖము కలిగి సిద్ధిని ప్రసాదించు శ్రీగణేశ భగవానునకు నమస్కారము! నమస్కారము!! నమస్కారము!!!

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి శ్రీగణేశ సహస్రనామ స్తోత్రమను నలుబది ఆరవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఏడవ అధ్యాయము

(త్రిపురాసుర సంహారము)

వ్యాసమహర్షి "పితామహా! శ్రీ గణేశ సహస్రనామములు పొందిన పిదప పరమేశ్వరుడు ఏమ చేసెను? దయచేసి తెలుపవలసినది" అంత బ్రహ్మ దేవుడు "శ్రీగణేశుని వరప్రసాదమయిన పిదప కపర్ది ఒక్క ఉదుటున పైకిలేచి, సింహగర్జన

కావించి, తన గణములను పిలచి, దేవతలందరినీ యుద్ధసన్నద్ధుల కమ్మని కబురంపెను. బ్రహ్మ, విష్ణు, కుబేర, ఇంద్ర, అగ్ని, వాయ, సోమ, వరుణ, గంధర్వ, యక్ష, గ్రహ, కిన్నెరాదులందరూ హర్షయుతులై, శివునికడకేతెంచి, వందనములిడి, ఇట్లనిరి "మహాదేవా! విశ్వనాశకుడయి మమ్ము స్థానభ్రష్టులను గావించిన త్రిపురుడు మీచే ఎప్పుడు హతమగును?" మహాదేవుడు వారందరినీ స్వాంతనపరచి, యుద్ధోన్ముఖుల గావించి సమరస్థలికేగెను. దైత్యుని గూఢచారులు ఈ విషయములన్నియు తెలుపుటచే త్రిపురుడు సహితము తన సైన్యమును సన్నద్ధము కావించి, వారికి ధన, వస్తు, మాలా, భూషణములు బహూకరించి, సంతోషపరచి, వారి సహితుడై సమరాంగణమున కేతెంచెను. ఇరువైపులా సేనలు కావించు ఘోషచే దిక్కులు పిక్కటిల్లినవి. అంత ఇరువైపుల యోధులు ప్రహారములు కావించుట చే సమరమారంభమైనది. వీరులు లోహనిర్మిత సాయకములచే ప్రతివీరుల మర్మస్థానములు భేదించుచుండిరి. శస్త్రఘాతములచే కావింపబడిన గాయముల నుండి రక్తస్రావము జరుగుచుండుట చే యోధులు పుష్పించిన శింశుపా వృక్షముల వలె కానపట్టు చుండిరి.

ఇరుప్రక్కల సేనల కదలిక చే ఆకాశపర్యంతము ధూళిరేగి సమరస్థలి అంతయ అంధకారబంధురమయ్యెను. అనేకమంది సైనికులు తమ ప్రాణములపై ఆశ వదలి పోరాడుచుండిరి. సమరాంగణము అంధకారమలముటచే వీరులు తమ గోత్ర నామములు పలికి కదనము కావించుచుండిరి. అంత ఒక్కపెట్టున ఝంఝూమారుతము వీచి ధూళి అంతయు తొలగగా, ఆ కదనరంగమందు పెక్కుమంది దేవతలు క్షతగాత్రులై కానబడిరి. అదిగాంచి త్రిపురుడు సంతసిల్లెను. అంత యుద్ధ ప్రియుడు, వజ్రధారి అయిన శతమఖుడు అచటికేతెంచి, తన వజ్రాయుధమును ఘళిపించి, శత్రుసేనలపై బడెను. మరుక్షణము సహస్రాక్షుని ఎదుట సర్వము పీనుగులపెంట కావింపబడెను. దైత్యులు భీతితో పలాయనమొనర్చిరి. దానిని గాంచి త్రిపురుడు తనవారినందరినీ ఉత్సాహపరచి, తిరిగి వెనుకకు త్రిప్పి, స్వయముగ ధనువు ధరించి, ముందుకు వచ్చి, ఇంద్రునిగాంచి ఇట్లనియె "ఇంద్రా! మృతినొందుటకు ఇంత ఉత్సాహమేల? బ్రతికియుండగనే యుద్ధభూమిని వదలి పారిపొమ్ము. నాతో సమరమొనరించు శక్తి నీకు లేదు. మేక ఎక్కడయిననూ సింహముతో యుద్ధము ఒనరింపగలదా? నీ మరణము తథ్యము." అయిననూ కదలక ఇంద్రుడు అక్కడనే యుండుట గాంచి, తన ధనువును సజ్జచేసి, నారి సారించి, అస్త్ర శస్త్రములను విడచెను. ఒక్క సాయకము అనేకములై లక్ష్య శుద్ధితో, దేవతలను గాయపరచుట నారంభించెను. ఈ విధముగ త్రిపురుడు సంధించి విడచిన బాణ పరంపర చే ఆకాశము నిండి తిరిగి కదనరంగమంతయు అంధకారమయ్యెను. ఇంద్రునితో సహా దేవతలందరూ మూర్ఛితులైరి.

అంత దేవతల వైపున పరమేశ్వరుడు, పినాకపాణి, త్రిశూలధారియై, సంగరమునకేతెంచి, జరిగినదికని, మనసున త్రిపురుని యుద్ధ నైపుణ్యమును ప్రశంశించి, యుద్ధ సన్నద్ధుడయ్యెను. ఆ సమయమున నారదమహర్షి గగనాంతరాళమున నిలచి "మహేశ్వరా! ఈ త్రిపురుడు శ్రీగణేశుని మెప్పించి వరములు బడసెను. ఒకే సాయకముతో ఈతని మూడు పురములను ఒకేమారు దగ్ధమొనర్చిన గానీ, ఈ దైత్యుడు సంహరింపబడడు. ఈ దైత్య సంహారము కావింప వలసినది" అని పలికెను. అంత కపాలి భూమిని రథముగ చేసి, సూర్య చంద్రులను రథ చక్రములగనూ, బ్రహ్మను సారధిగనూ, అశ్వనీ దేవతలను అశ్వములుగనూ, మేరు పర్వతమును విల్లుగనూ, విష్ణువును బాణముగనూ కావించి, ఏకాక్షర గణేశమంత్రము ధ్యానించి, శ్రీగణేశ సహస్రనామార్చన చేసి, నారిని ఆకర్ణాంతము లాగి త్రిపుర, దైత్యసేనా సహిత త్రిపురములపై విడచెను. ఆ శబ్దమునకు భూనభోంతరాళములు దద్దరిల్లి లోకములు సర్వము నిర్ఘాంతపోయెను. భూమ్యాకాశములు ఏకమగునట్లు అగ్నిజ్వాలలు పైకిలేచి దైత్యసైన్యము మీదికి వ్యాపించినవి. త్రిపురునితో సహా దైత్యులందరూ పలాయనము చిత్తగించి త్రిపురముల జొరబడిరి. అంత మహా మహితాన్వితమయిన ఆ సాయకము వారందరితో సహా త్రిపురములను సంపూర్ణముగ దగ్ధమొనరించెను. త్రిపురుడు మరణించెను. అంత అశరీరవాణి "త్రిపురుడు శ్రీగణేశసాన్నిధ్యము నొంది మోక్షము నొందెను," అని పలికెను.

అంత సర్వులు పినాకపాణి వద్దకు ఏతెంచి, ఆయనను స్థుతించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వులు గానము, అప్సరసలు నాట్యము గావించిరి. దేవతలు శివుని అనుజ్ఞ మేరకు తమ తమ స్వస్థలముల కేగిరి. మునులు తిరిగి యజ్ఞ, వ్రత, తపాదులు ఆరంభించిరి. స్కంధ, నంది, బృంగి, శైలజలతో సహితము సర్వులూ మంగళతూర్య వాద్యములతో పరమేశ్వరునికి కైలాసమందు మహదానందముతో అభినందనలు పలికిరి. అంత పరమేశ్వరుడు "త్రిపురారి" అను పేర ప్రసిద్ధినొందెను. ఈ విధముగ శ్రీగణేశుని మంత్రములు, సహస్రనామ మహిమ, వైభవము ప్రకటితమయ్యెను. విరించి "పరాశరపుత్రా! ఈ ఆఖ్యానము నాకు వినా వేరొకరికి తెలియదు. ఈ ఆశ్యానము యొక్క శ్రవణము, పఠనము, సకల మనోవాంఛితములను నెరవేర్చును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి త్రిపురాసుర సంహారమను నలుబది ఏడవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఎనిమిదవ అధ్యాయము

(పార్వతీ విలాపము)

వ్యాసమునీంద్రుడు "పితామహా! మీ నిరవధిక కరుణా కటాక్షములచే త్రిపురాసుర ఆఖ్యానమును శ్రవణము కావించితిని. కానీ ఆ సమయము నందు జగదంబ, పార్వతీదేవి ఏమి చేసినదో తెలుపవలసినది. పరమేశ్వరుడు త్రిపురుని ఏ తిథినాడు సంహరించెను? ఈ సర్వమును విస్తారముగ తెలుపవలసినది." విరించి "పరమశివుడు త్రిపురదైత్యుని కార్తీకపౌర్ణమి సాయంకాలము దగ్ధమొనర్చెను. ఆ సంగ్రామ విశేషములన్నియు నీకిదివరకే వివరించితిని. ఆ తిథిన దేవతలందరూ, దైత్యునిపై విజయము సాధించిన చంద్రశేఖరుని పూజించిరి. అందువలన మర్త్యులు భూలోకమున కార్తీక పౌర్ణమినాడు దీపదానమొనర్చెదరు. ఈ రోజున చేయబడిన స్నాన, దాన, జప, హోమాదులు, అత్యధిక పుణ్యమొసంగును. అందువలన ఈ తిథిని "బాహులీ" (కృత్తికా నక్షత్ర యుత బహుళ పూర్ణిమ) అని పేర్కొందురు. ఈ తిథినాడు శివమహోత్సవమును ఒనరింపని జనుల పుణ్యము దగ్ధమై, వారు అపజయముల పాలగుదురు. ఆ రోజున కావింపబడు ప్రాత:కాల శివపూజ చే రాత్రి చేయబడు పాపములు నశించును. మధ్యాహ్నకాల శివార్చన చే ఆ జన్మకృత పాపమంతయు నశించును. ప్రదోషకాల శివపూజ చే సప్త జన్మార్చిత పాపము సర్వము నాశనమగును."

ఇపుడు పార్వతీదేవి విషయము. శివుని ద్వారా త్రిపురాసుర సంహారము జరుగునని వినిన పర్వతరాజనందిని భయభీతయై, మంధర పర్వతము నుండి అంతర్ధానమై, హిమాలయములకేగి అచటి కంధరము నుండి బయటకు వచ్చి, సింహ, వ్యాఘ్రాది క్రూర మృగములచే కూడిన కారడవి, మరియు ఉత్తుంగ పర్వతశ్రేణుల గాంచి, భయకంపితయై విలపించుచూ "హా! శివా! నీవు సర్వజ్ఞుడవై యుండి ఈ భయంకరాటవి యందు ఏకాకి అయిన క్రౌంచపక్షీ వలె ఆక్రందన కావించుచున్న నన్ను విస్మరించుటకు కారణమేమి? నాకు తిరిగి నీ దర్శనము ఎప్పుడు కలుగును? నేను మీరులేక జీవింపలేను. మీ విరహమును నేను భరింపనోపను. హా! తండ్రీ! హిమాలయా! మీరు ఎక్కడ యుంటిరి? మీకు సహితము నా విలాపము వినుబడుట లేదు. మీరు వినా నేను ఎవరిని శరణుజొచ్చెదను? ఇపుడు నా కర్తవ్యమేమి? దయచేసి నన్ను తిరిగి నా శివునితో కలుపవలసినది. లేని ఎడల నేను ఈ అఖాతమగు పర్వతలోయ యందు పడి ఆత్మాహుతి కావించుకొందును." ఈ విధముగ ఎలుగెత్తి దీనాలాపము కావించుచున్న పార్వతీదేవిని ఒక జాలరి సమీపించి,

ఆమెతో సంభాషించుటకు యత్నించి, ఆ దేవి ప్రత్యుత్తరము నీయకుండుటచే ఆతడు హిమాలయుని వద్దకేగి "ప్రభూ! నేను ఒక సర్వ శుభలక్షణ లక్షిత, ఆపాద పర్యంతము దివ్యాభరణ భూషిత, సుందర పట్టు దుకూలములు దాల్చిన వరారోహ, అత్యంత వ్యాకులముతో రోదించుచున్న ఒక కాంతను కాంచితిని. నేనెంత యత్నించిననూ ఆ తల్లి ఒక్క పలుకు నాతో పలుకక, కేవలము మీ నామము తలచుచూ, అవనిత శిరస్కయై విలపించుచున్నది."

అంత హిమాలయుడు దిగ్గున లేచి, హుటాహుటిన ఆ జాలరి తెలిపిన ప్రదేశమున కేతెంచి, తన పుత్రికను గని, ఆమెను లేవనెత్తి, కౌగిలించి, చిబుకము పట్టి, శిరము నిమిరి, ఆమెకు స్వాంతన నిచ్చి, ఇట్లు పలికెను "ఓ! సునయనా! నీ శోకమునకు కారణమేమి? నీవు జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలకు కారణభూతవు. ఓ! మహేశ్వరీ! నీవు ఘటనాఘటన సమర్థురాలివి. నీవు పూర్ణకామవు. ప్రతి ప్రాణి యొక్క హృదయమందు స్థితిగతవై వెలుగొందుచున్నావు. నీకు శివునితో వియోగము లేదు. నీవు సర్వజీవుల సర్వాంతర్యామివి. నేను నిన్ను తప్పక శివునితో కలిపెదను. నీవు తొలుత మన గృహమున కేతెంచవలసినది," అని పలికి ఆమెను తన గృహమునకు తీసికొని వెళ్ళెను. అచట పార్వతీదేవి తన తల్లి, అయిన మేనకను, తన అగ్రజులయిన మైనాకాదులను గాంచి కొంత ఆనందము నొంది, తిరిగి శివుని విరహము చే దు:ఖ భరిత అయ్యెను.

అంత పార్వతీదేవి తన తండ్రి పాదములపై శిరమునుంచి "తండ్రీ! మీరే నాకు ఏదేని ఉపాయము తెల్పుడు. నేను శివుని పొందుటకు ఏదేని వ్రత, దాన, తపములను తెలుపవలసినది. అయ్యది ఎంతటి దుష్కరమైననూ, నేను దానిని సాధించెదను. నేను ప్రయత్నపూర్వకముగ శివుని పొందుటకు తపమొనర్చెదను." అంత హిమాలయుడు కొంత తడవు అంతర్ముఖుడై, ఆలోచన కావించి, చివరకు ఒక నిశ్చయమున కేతెంచి, ఇట్లనియె "కళ్యాణీ! నీకు శివప్రాప్తికై ఒక దివ్యోపాయమును తెలిపెదను. అదియే శ్రీగణేశోపాసనము. ఆ పరాత్పరుని ఉపాసన ధర్మార్థకామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్థములు నొసంగును. ఈ ఉపాసన నారదాది దేవర్షులు, ఇంద్రాది దేవతలు కావించి సిద్ధినొందిరి. ఆ పరమాత్ముడయిన శ్రీగణేశుడు బ్రహ్మను సృష్టించుటకు, విష్ణువును పాలించుటకు, రుద్రుని సంహారమునకు, శేషుని భూభారధారణకు, నియుక్తుల గావించెను. అ పరమాత్ముని దివ్య రూపమును బ్రహ్మాది దేవతలు తెలియరు. ఆయన అవ్జాగ్మానస గోచరుడు. సర్వ కర్మారంభము నందును ఆ పరమాత్ముని పూజింపవలె. అందువలన నీవు నీ మనోవాంఛా సిద్ధ్యర్థమై ఆ పరమాత్ముని పూజింప వలసినది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి పార్వతీ విలాపమను నలుబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది తొమ్మిదవ అధ్యాయము

(శ్రీగణేశోపాసనా పద్ధతి)

అంత పార్వతీదేవి "తండ్రీ! జగద్గురువు, సర్వేశ్వరుడయిన శ్రీగణేశుని ఉపాసనను నాకు తెలియపరుచవలసినది. నేను ఆ ఉపాసనను కావించి శివ సాయుజ్యము నొందెదను. ఈ ఉపాసన ద్వారా మర్త్య లోకమునందు అనేకులకు ఉపకారమొనర్పబడును." హిమాలయుడు "తల్లీ! నేను నీమీది ప్రేమచే మరియు ప్రజోపకారము నిమిత్తము ఈ రహస్యమును తెలిపెదను. ఏకాగ్ర చిత్తముతో వినవలసినది. సాధకుడు ఉదయమే లేచి నైఋతిదిశకేగి, వ్యవసాయ క్షేత్రములు విడచి, ఊసరక్షేత్రమందు మలమూత్ర విసర్జన కావించి, తదుపరి దంతధావన చేసి, పిదప నదీనదములందు కానీ, వాపీకూప

తటాకములందు కానీ, తొలుత మలశోధన స్నానము చేసి, తదుపరి మంత్రానుష్ఠానముతో స్నానము ముగింపవలెను. పిదప మట్టి, లేక చందనము, లేక కుంకుమను నుదిటి యందు ధరించి, ఒక శుభాసనమందు కూర్చొని, సంధ్యావందనాది నిత్య కర్మానుష్ఠానము చేయవలెను. అటుపిమ్మట శుద్ధము, కొంచెము బంక కలిగినది, రాళ్ళు, కంకర లేని పుట్టమట్టి వంటి స్వచ్ఛమయిన మృత్తికను తీసికొని, అద్దానికి కొంచెము జలము కలిపి, మర్దించి, దానితో ఒక సుందరము, సర్వాంగ సంపూర్ణ చతుర్భుజుడయిన శ్రీగణేశమూర్తిని నిర్మించి, దానిని ఒక పీఠమందు స్థాపించి, హస్త ప్రక్షాళనమొనర్చి, ఇపుడు సమస్త పూజా సంభారములు సమరూర్చుకొనవలెను.

పూజా సంభారములు–ప్రయత్న పూర్వకముగ జలము, అష్ట గంధములు, అక్షతలు, ఎర్రని పుష్పములు, గుగ్గిలము, మూడు లేక అయిదు లేక ఏడు పత్రములున్న నీలి లేక తెలుపు నూట ఎనిమిది దూర్వాంకురములు, ఘృత లేక తైలదీపము, వివిధములయిన నైవేద్యములు, మోదకములు, లడ్డూలు, పూరీలు, చక్కెరయుక్తమయిన పాయసము, కొంచెము బియ్యపు పరమాన్నము, అన్య వ్యంజనములు, కర్పూరము, వక్క మరియు ఏలకుల చూర్ణముతో కావింపబడిన తాంబూలము, నేరేడు, మామిడి, పనస, ద్రాక్ష, అరటి, మరియు ఆయా ఋతువులందు లభ్యమగు అన్య ఫలములు, వివిధములయిన ఆరతి, దక్షిణ, ఈ విధముగ సర్వ పూజా సామాగ్రి సమకూర్చుకొనవలెను. పిదప ఒక శుభ్రమయిన స్థలమునందు కుశాశనము, దానిపై కృష్ణాజినము, అద్దానిపై శుభ్రవస్త్రము పరచి, దానిపై కూర్చొని భూతశుద్ధికై ఆచమనము, ప్రాణాయామము, అష్టదిగ్బంధనము, ప్రాణప్రతిష్ఠ కావించి శ్రీగణేశాది దేవతలకు నమస్కారమొనర్పవలెను. అటు పిదప ఆగమ విధి ననుసరించి అంతర్ మాతృకాన్యాసము, బహిర్ మాతృకాన్యాసము, కావించి గురూపదేశము చే తెలుపబడిన ముద్రా ప్రదర్శనము, మంత్ర షడంగ న్యాసము కావింపవలెను. అపుడు పూజా ద్రవ్యములపై అభిమంత్రిత జలములు ప్రోక్షణ గావించి శ్రీగణేశుని ధ్యానింపవలెను. ఈ శ్రీగణేశమూర్తి ఏకదంతుడు; శూర్పకర్ణుడు; గజవదనుడు; చతుర్భుజుడు; పాశాంకుశమోదకవరదహస్తుడు; కంఠమందు రక్తవర్ణ పుష్పమాల ధరించిన సిద్ధి బుద్ధి సేవితుడు; త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, నారదాది దేవర్షులచే వందితుడు. ఈ శ్రీగణేశమూర్తిని మనసున ధ్యానించి, ఆవాహన చేసి ఇట్లు స్తుతింపవలెను.

"ఓ! జగదాధారా! దేవ దానవ పూజితా! అనాథనాథ సర్వజ్ఞా, నీవు ఈ మూర్తి యందు విరాజమానుడ మవవలసినది. స్వామీ! మీకు రత్నఖచిత స్వర్ణ సింహాసనము ఏర్పాటు కావించితిని. దయచేసి ఆసీనులు కండు. సర్వేశ్వరా! నేను సమస్త తీర్థముల నుండి జలములు సేకరించి, అందు గంధ, పుష్పాదులు కలిపితిని. అద్దానితో మీరు పాదప్రక్షాళన కావించుకొన వలసినది. ఓ! అమోఘ శక్తి స్వరూపా! పెసరపప్పు, ముత్యములు, పంచరత్నములు, జాంబూనది సువర్ణము, అష్ట గంధములు, అక్షతలు, కలిపిన ఈ అర్ఘ్యమును స్వీకరింప వలసినది. ప్రభూ! గంగాది తీర్థముల నుండి సమంత్రకముగ నీటిని తెచ్చి లవంగ, ఏలక, కర్పూరాది సుగంధ మిశ్రమమును కలిపితిని. దీనిని ఆచమనార్థము స్వీకరింప వలసినది. పరమాత్మా! చంపకాశోక, వకుళ, మాలతీ, మల్లె ఆదిగా గల పుష్ప సుగంధ తైలమును గొనివచ్చితిని. స్వామీ! దీనిని మీరు గ్రహింప వలసినది. తండ్రీ! కామధేనువు యొక్క పాలు పరమ పావనము, జీవన సాధకము, మరియు యజ్ఞహేతువు. దీనిని స్నానార్థము గ్రహింపవలసినది. ఈ దివ్యదుగ్ధము నుండి చేయబడినది, శుద్ధము, శ్రేష్ఠము, సర్వజన ప్రీతికరమయిన పెరుగు, మరియు ఆ పెరుగు నుండి చేయబడినది, సర్వ సంతుష్టి కారకము, యజ్ఞాంగము, దేవతలకు ఆహారమయిన ఘృతము, మధుపములచే పుష్పములనుండి సంగ్రహింపబడినది, శరీర సర్వాంగ పుష్టి, బల, తేజో వృద్ధి కారకమయిన మధువు, (తేనె), ఇక్షురసము నుండి తయారుచేయబడినది, పరమ మనోహరము, శరీర మలమును దూరమొనర్చునది అయిన చక్కెర, అట్లే స్వాధిష్టము, సంపూర్ణ మాధుర్యమయము, ఇక్షురస సంయుక్తమయిన బెల్లము సమర్పించుచున్నాను. వీనిని స్వీకరింప వలసినది. పాలు, మధువు, కరిగిన నేయి కలిపిన మధుపర్కమును ఒక కంచు పాత్ర యందుంచితిని. దీనిని మీరు పూజాహేతువై గ్రహింపవలసినది. పరంతపా! మీ కొరకై బహుమూల్యము, మహితాన్వితము, లోకలజ్జా

నివారకము, అయిన రెండు ఎర్రని వస్త్రములు, రజతమయ బ్రహ్మసూత్రము, సువర్ణమయ ఉత్తరీయమును అత్యంత భక్తి పూర్వకముగ సమర్పించుచున్నాను. దయచేసి స్వీకరింపవలసినది. స్వామీ! రత్నఖచిత స్వర్ణాభరణములను మీ ఆజ్ఞతో విభిన్న అంగములకు ధరింపజేయుచున్నాను. అష్టగంధ యుక్తమయిన రక్త చందనమును మీ ద్వాదశాంగములకు విలేపనము చేసితిని. స్వామీ! నన్ను కరుణింపుడు. ఓ! జగదీశ్వరా! కలగొట్టు, కర్ణికార, మందార, ఎర్రకమల, మల్లె, మాలతీ పుష్పములను, నవ పల్లవములను, బిల్వ పత్రములను, అతి మనోహరమయిన మాలగా కట్టి, తీసికొనివచ్చితిని. ప్రభూ! దీనిని స్వీకరింపవలసినది.

సర్వేశ్వరా! సర్వ సుగంధ వాతావరణ హేతువు, సర్వపాప క్షయకారకము, అయిన దశాంగ గుగ్గిలధూపము వేయుచున్నాను. దీనిని మీరు ఆఘ్రాణింపవలసినది. సర్వజ్ఞా! ఉత్తమము, అంధకార నాశకము, మంగళకారకమయిన దీపమును వెలిగించితిని. స్వామీ! దీనిని గ్రహింపవలసినది. సర్వలోకేశ్వరా! నానావిధ పక్వాన్న సహిత, చక్కెరయుక్త పాయసము, వివిధ వ్యంజనముల సహిత శల్యోదనము, పాలు, పెరుగు, సుగంధయుక్తమయిన ఖ్వాదము (చారు), అనేక సుగంధ చూర్ణములతో చేయబడిన మోదకములు, అపూపములు, లడ్డూలు, పూరీలు, చపాతీలు, అప్పడములు, మసాల దినుసులతో చేయబడిన దప్పళములు, మీ సమక్షమున యుంచితిని. సుగంధయుక్తమయిన స్వచ్ఛ జలములు సహితము యుంచితిని. స్వామీ! మీరు ఈ భోజనమును నెమ్మదిగ తీసికొని, మధ్యలో నీరు త్రాగుచూ, గ్రహింపవలసినది. పరమాత్మా! నిత్య తృప్తులయిన మీరు తృప్తినొందిన, జగములు సర్వము తృప్తినొందును. భోజనోపరాంతము ఉత్తరాపోశనమునకు జలములు సమర్పించుచున్నాను. మీరు హస్త ప్రక్షాళనము, ముఖశుద్ధి, హస్త శుద్ధి కావించుకొన వలసినది. ప్రభూ! భోజనానంతరము ద్రాక్ష, దానిమ్మ, నిమ్మ, నేరేడు, మామిడి, పనస, అరటి, బేరి, ఖర్జూరము, కొబ్బరి, నారింజ, అనాస, జంబీర, దోస ఫలములు సమర్పించుచున్నాను. ప్రభూ! మీరు వీటిని ఆస్వాదించి, తిరిగి ముఖ, హస్త ప్రక్షాళన కావింప వలసినది. అటుపిదప హస్త సుగందార్థము మనోహర శుభ చందనమును అలదుచున్నాను. స్వామీ! దయచేసి నన్ను చేయనీయవలసినది. శాలువు ధాతువు నుండి పిండబడినది, ఎర్రని రంగుతో మెరయునది అగు దివ్యమయిన పదార్థమును మీరు నుదిటిన తిలకము వలె ధరింపవలసినది. జగన్నాయకా! కర్పూర, లవంగ, ఏలక, వక్క, కేసర, చూర్ణ సహిత తాంబూలమును సమర్పించుచున్నాను. స్వామీ! దయచేసి గ్రహింపవలసినది. సంపూర్ణ పూజాఫల సిద్ధ్యర్థము సువర్ణ దక్షిణ స్థాపించుచున్నాను. ప్రభూ! తెలుపు, ఎరుపు మిశ్రిత సుగంధ పుష్పమాలలు, మూడు లేక అయిదు పత్రములు గల ఇరువది ఒకటి ఆకుపచ్చ లేక శ్వేత దూర్వాంకురములను సమర్పించుచున్నాను. సర్వేశ్వరా! మీరు వీనిని స్వీకరింపవలసినది." తదుపరి ప్రతి పదమునకూ మన పాపములు నష్టమొనర్చు ఇరువది ఒకటి ప్రదక్షిణలు కావింపవలెను. పిదప కాంస్య, రజత, తామ్ర, లేక సువర్ణ ప్రమిదలందు అయిదు దీపములను ప్రజ్వాలిత మొనర్చి ఆ నేత్రాకర్షణము గావించు హారతిని పరమాత్మునకు అర్పించి, "స్వామీ! అంధకార నాశకము, శశాంక సమాన దీప్తివంతము, అయిన ఈ హారతిని స్వీకరింపవలసినది. దీనిచే నా పాపములు, దృష్టి దోషములు దగ్ధమగుగాక!" అటు పిదప ఆ మూర్తి ఎదుట ఒక సుఖాసనమందు కూర్చొని స్తోత్ర, సూక్త, సహస్రనామావళిని పఠింప వలెను. "ఓ! దీననాథా! దయానిధీ! దేవపూజితా! అరిష్టవినాశా! త్రిలోకాధీశ్వరా! నా అపరాధములను క్షమించి, నా భక్తిని సఫలీకృతమొనర్ప వలసినది" అని పలికి, ఆధారము లేని స్వర్ణ దండము వలె నేలపైబడి సాష్టాంగ దండ ప్రణామములాచరించి, అపుడు సర్వసిద్ధి ప్రదాయకమయిన శ్రీగణేశ మంత్ర జపము ఒనర్పవలెను.

(శ్రీగణేశపురాణమందలి ఉపాసనా ఖండమందు శ్రీగణేశోపాసన అను నలుబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఏబదియవ అధ్యాయము

(శ్రీగణేశ మంత్రోపాసన)

పార్వతీదేవి "తండ్రీ! నేను శ్రీగణేశుని మంత్రములు వేటినీ ఎరుగను. దయచేసి వానిని మీరే నాకు అనుగ్రహింపవలసినది. ఆ పరమ కళ్యాణకరమయిన మంత్ర జపానుష్ఠానము చే నేను పరాత్పరుడయిన పరమేశ్వరుని ప్రాప్తించెదను." హిమాలయుడు "పుత్రీ! పార్వతీ! శ్రీగణేశుని మంత్రములు అసంఖ్యాకములు. అందు ఏకాక్షర, షడక్షర, అష్టాక్షర, దశాక్షర, అష్టవింశతి (18) అక్షర సముదాయము గలవి కలవు. నేను నీకు ఏకాక్షర, షడక్షర మంత్రములను తెలిపెదను. ఏకాక్షర మంత్రమును ఒక లక్షా, ఏబదివేల సార్లు, షడక్షర మంత్రమును పది లక్షల సార్లు జపించవలెను. ఇట్లు భక్తజనులు నానా రకముల అభీష్టసిద్ధికై, నానా విధములయిన అనుష్ఠానములను ఒనర్తురు. నీవు శ్రావణ శుక్ల చతుర్థినాడు ఈ ఉపాసనను ఆరంభించి, ఒక మాస పర్యంతము కావించుట చే, నీకు కార్యసిద్ధి, కలిగి, శివుని చేరుటయే గాక నీ ఇతర మనో కామనలు సహితము పూర్ణమగును.

ఎవరేని స్త్రీ పురుషులు ఒక పార్థివ శ్రీగణేశుని పూజించిన ఎడల వారికి వాంఛిత ధన, పశు, పుత్ర, వస్తులాభము కలుగును. రెండు శ్రీగణేశ మూర్తులను పూజించిన మానవులకు అసాధ్యములు సాధ్యమగును. మూడు మూర్తుల పూజనము చే రాజ్యము, సమస్త సంపదలు, రత్నాదులు ప్రాప్తించును. నాలుగు మూర్తుల పూజనము ధర్మార్థకామమోక్షముల నొసంగును. పంచమూర్తి, పూజనము చే సార్వభౌమత్వము లభించును. ఆరు మూర్తుల పూజనము చే సృష్టి, స్థితి, ప్రళయ సమర్థత కలుగును. ఏడు, ఎనిమిది తొమ్మిది మూర్తుల పూజనము చే సర్వజ్ఞత, త్రికాలజ్ఞత, (భూత, భవిష్యత్, వర్తమాన ద్రష్టత్వము) కలుగును. దశమూర్తి పూజచే ముప్పదిమూడు కోట్ల దేవతలు, త్రిమూర్తులు, సనకాది ఋషులు, ఆ ఉపాసకునికి సేవ చేయుదురు. పదకొండు మూర్తుల పూజ ఏకాదశ రుద్రాధిపత్యము, ద్వాదశమూర్తి పూజ ద్వాదశాదిత్య ఆధిపత్యము, కలుగును. అత్యంత సంకటము అంకురించినపుడు మూర్తుల సంఖ్యను పెంచి పూజనమాచరింపవలెను. నూట ఎనిమిది మూర్తుల పూజనము చే ఏది వాంఛించిన, అది ప్రాప్తమగును. ప్రతిదినము లక్ష మూర్తులను పూజించిన ఎడల వారు మహాముక్తిని పొందెదరు. కారాగారము నుండి ముక్తి కావలసిన వారు పంచమూర్తులను పూజింపవలెను. దాని వలన శ్రీగణేశానుగ్రహము కలిగి, ఆ వ్యక్తి ఇరువది ఒక్క దినములలో కారాగారము నుండి ముక్తుడగును. శ్రీగణేశ భక్తులు ఏడు మూర్తులను నిరవధికముగ అయిదు వత్సరములు పూజించిన ఎడల వారు మహా పాపముల నుండి సహితము ముక్తులగుదురు. ఒక మనుష్యుడు తాను పుట్టినదాదిగ మృత్యు పర్యంతము ప్రతిదినము ఒక మృణ్మయ శ్రీగణేశమూర్తికి పూజనమొనర్చిన ఎడల ఆతనిని సాక్షాత్ శ్రీగణేశునిగ తలంపవలెను. ఆ ఉపాసకుని దర్శన మాత్రమున విఘ్నములు దూరమగును. శ్రీగణేశుడు లోకులు ఈ ఉపాసకుని పూజించిన ఎడల, తనను పూజించిన దానికంటె ఎక్కవ ప్రసన్నతను పొందును. రోగజనిత పీడలు దూరమగుటకు శ్రీగణేశుని మూడు మూర్తులను తొమ్మిది దినములు పూజింపవలెను.

శ్రీగణేశుని స్వర్ణ, రజత, తామ్ర, ఇసుక, కాంస్య, ముత్య, లేక పగడము తో చేసిన మూర్తులు సహితము ఈ ఫలితముల నొసంగును. శ్రావణ శుక్ల చతుర్థి నుండి, భాద్రపద శుక్ల చతుర్థి వరకు మానవులు ఉపాసన చేసి ఆ దినము తన దక్షత ననుసరించి, ఆదర పూర్వకముగ గణపతి మహాత్సవము కావింపవలెను. ఆ రాత్రి జాగరణ చేసి, ఆ సమయమందు భోజనాదులు, మరియు శ్రీగణేశ కథలచే ప్రొద్దు పుచ్చవలెను. ఆ రాత్రి గడచిన పిమ్మట, మరుసటి ఉదయము శుద్ధజల స్నానమాచరించి, విధివిధానముగ శ్రీగణేశపూజన మొనర్చి, అటు పిదప జప సంఖ్య యందలి దశాంశము హోమమొనర్చవలెను. ఆ హోమమందు దిక్పాల, గ్రహ, క్షేత్ర పాలుర ప్రీత్యర్థము బలిదానము గావించి,

పూర్ణాహుతి ఒనర్చవలెను. తదుపరి ఆచార్యునకు ధన, ధాన్య, వస్త్ర, భూషణ, గోదానములొనర్చి, ఇతర బ్రాహ్మణులను సహితము దక్షిణ, దానములతో సంతుష్ఠుల నొనర్పవలెను. హోమ ఆహుతుల యందలి దశాంశము తర్పణ మొనర్పవలెను. తర్పణ యందలి దశాంశము పత్నీసహితులైన బ్రాహ్మణులకు భోజనమిచ్చి సంతృప్తుల గావింపవలెను. వారిని సహితము వస్త్ర భూషణముతో సంతుష్ఠుల నొనర్పవలెను. సిద్ధి బుద్ధి సహిత శ్రీగణేశ పూజయందు లోభత్వము చూపింపరాదు. తదుపరి తన బంధు మిత్రులతో కలిసి భోజనమొనర్పవలెను. మరుసటి దినము ఆ శ్రీగణేశమూర్తిని ఒక పల్లకి యందుంచి ధ్వజ, పతాక, చామర సేవనము కావించుచూ, జనులు కోలాటమాడుచూ, వాద్యములు మ్రోగించుచూ, ముందు నడచుచుండగా, వెనుక నరయానము (పల్లకీ) యందు శ్రీగణేశమూర్తిని ఊరేగించుచూ, ఒక నది యందు లేక ఒక మహా జలాశయమందు ఆ మూర్తిని నిమజ్జనము కావించి, తిరిగి గీత వాద్యములతో తమ గృహముల కేతెంచవలెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి శ్రీగణేశ మంత్రోపాసనము అను ఏబదియవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఒకటవ అధ్యాయము

(కర్దమ చరితము)

పర్వతరాజపుత్రి తిరిగి ఇట్లనియె “తండ్రీ! అమృతతుల్యమగు మీ వాక్కులు విని నేను అత్యంత ప్రసన్నత నొందితిని. నాకు మరికొన్ని సంశయములున్నవి. నా యందు కృప చే ఆ సంశయములను నిర్మూలనమొనర్చ ప్రార్ధన. పూర్వకాలమందు ఎవరు ఈ గణేశ వ్రతమును ఆచరించిరి? ఆ ఆచరణ చే ఏరకమయిన సిద్ధులనొందిరి? శ్రీగణేశ శుభచరితము గూర్చి ప్రశ్నించువారు, తెలుపువారు, వినువారు సహితము పుణ్యభాగులగుదురు. అట్టివారి జన్మము, జీవనము, కర్మము, జ్ఞానము అన్నియు సఫలీకృతమగును. ఈ విషయ విశేషములన్నియు నాకు విస్తారముగ తెలుపవలసినది.” అంత హిమవంతుడు మనసున ఎంతో ఆనందించి, ఒక్క క్షణము తాను మహాత్ముల ద్వారా వినిన శ్రీగణేశ చరితమంతటినీ ఒక్కమారు సింహావలోకనము కావించి ఇట్లనియె “పార్వతీ! నీకు నీ ప్రశ్నలకు సంబంధించిన ఒక ప్రాచీన ఇతిహాసమును తెలిపెదను. ఏకాగ్రచిత్తవై వినవలసినది. ఒకానొకనాటిమాట! పరాత్పరుడు, పినాకపాణి, చంద్రశేఖరుడు, శివుడు ఒకనాడు కైలాసమునందు సుఖాశీనుడై దేవ, గంధర్వ, ఋషులతో ఇష్ఠాగోష్ఠి కావించుచున్న సమయమున పరమతేజస్వి అయిన కార్తికేయుడు ఆ మహానుభావుని స్థుతించి ఇట్లనియె “దేవాధిదేవా! జగద్భర్తా! మీ అపార కృపావిశేషముచే నేను ఎన్నో దివ్య ఆఖ్యానములను వింటిని. కానీ ఆ కథామృతమును ఎంత త్రావినప్పటికీ తృప్తి కలుగుట లేదు. అందువలన సర్వ సిద్ధి ప్రదాయకము, వరదాయకము, మర్త్యులయిన భూలోకవాసులు సహితము సర్వ సిద్ధులు హస్తగతమొనర్చుకొనగల వినాయక వ్రతమును గూర్చి తెలుపవలసినది.”

అంత శివుడు “ఓ! కృత్తికాపుత్రా! నీ ప్రశ్న బహు ఉత్తమము. ఇది సర్వజనులకు హితకారకము. ఇయ్యది యజ్ఞ, దాన, తపో, హోమములు వినా సర్వ పురుషార్ధ సాధకము, మరియు పుత్ర, పౌత్రాభివృద్ధి కారకము. అంతేకాక ఇయ్యది మహారాజులను సహితము వశపరుచుకొనునది. అనేక జన్మల సంచిత పాపరాశిని దగ్ధమొనర్చునది, సర్వసిద్ధులను మానవులకు సహితము కరతలామలకమొనర్చునది. ఈ భూతలమందు శ్రీగణేశుని ప్రసన్నమొనర్చుటకు ఈ వ్రతము కంటె మిన్న మరియొకటి లేదు. అంత కార్తికేయుడు “తండ్రీ! ఈ వ్రతమును ఏ మాసమందు ఆచరింపవలెను? దీని విధివిధానములెట్టివి? ఈ వ్రతమును పురాతన కాలమందు ఎవరు ఆచరించిరి? దయచేసి తెలుపవలసినది.” శివుడు

"పుత్రా! ఈ వ్రతమును శ్రావణ శుక్ల చతుర్థి నాడు ప్రారంభింపవలెను. ఆ తిథిన ఉదయము సాధకుడు స్నానాదులు కావించుకొని, గురు గృహమునకేగి, ఆయనను అర్ఘ్య పాద్యాదులతో పూజించి, వస్త్ర భూషణములు సమర్పించి, సంతుష్ఠుని గావించి, ఆయన ఆజ్ఞచే ఈ వ్రతము నారంభింపవలెను."

ఆయనను "తండ్రీ! సర్వసిద్ధికారకము, సర్వమనోకామనాపూరకము, అగు శ్రీగణేశచతుర్థి వ్రతమును నాకు ఉపదేశమొనర్ప వలసినది" అని వేడుకొని, ఉపదేశము గైకొనవలెను. తదుపరి ఆయనతో కలసి గంగాతటమునకు గానీ, లేని ఎడల ఒక చెరువు, లేక కోనేరు, లేక ఒక నూతివద్దకేగి అచట యధావిధిగ స్నానమాచరింపవలెను. స్నాన సమయమున తెల్లఆవాలు, తిలలు, రాచఉసిరి, మిశ్రమముతో నలుగు పెట్టుకొనవలెను. స్నానానంతరము సంధ్యావందనాది నిత్య కర్మానుష్ఠానము కావించుకొని, గృహమునకేగి, ఒక సుఖ, శుభ్రాసనమున కూర్చొని శ్రీగణేశ పూజనమొనర్చి, గురువు చే ఒసంగబడిన శ్రీగణేశ వ్రతమును విధి విధానముగ ఆరంభింపవలెను. మట్టితో ఒక శ్రీగణేశ విగ్రహము చేసి దానిని శ్రావణ శుక్ల చతుర్థి నుండి భాద్రపద శుక్ల చతుర్థి వరకు ప్రతిదినము పూజనమొనర్పవలెను. ఈ మాస పర్యంతము బ్రహ్మచర్యము, ఏక భుక్తము (ఉపవాసము లేక నక్తము), లేక అయాచిత భోజనము, దినమున కొక్కసారి తీసికొనవలెను. మనో ఇంద్రియములను సంయమము ఒనర్చి, నాల్గవ ప్రహర మందు హవిష్యాన్నము (యజ్ఞాది ధార్మిక అనుష్ఠానములందు భక్షనీయమయిన సాత్విక భోజనము) తీసికొనవలెను. ఈ భోజనమందు ఉప్పులేనివి, మధుర పదార్థములను, స్వీకరించుచూ భక్తి పూర్వకముగ వ్రతమాచరింపవలెను. ఈ వ్రత సమయమున ప్రతిదినము ఏకాక్షర, షడక్షర, అష్టాక్షర, దశాక్షర, అష్ఠవింశతి అక్షర మంత్రములందు ఏదేని ఒక మంత్రమును పదిలక్షలు, పదివేలు, లేక అందు సగము, లేక సగమునకు సగము, జపము చేసి, అందు దశాంశము హోమము కావింపవలెను. ఆ సమయమందు సాధకుడు అత్యంత జాగరూకుడై, మనసును నియంత్రించి శ్రీగణేశుని ధ్యానింపవలెను.

భాద్రపద శుక్ల చతుర్థినాడు ఒక పలము, లేక అర్ధపలము బరువుగల మూషిక వాహనుడు లేదా మయూర వాహనుడయిన శ్రీగణేశమూర్తిని తీసికొన వలెను. పిదప ఒక శుభ్రమయిన, ఎత్తుపల్లములు లేని స్థలమందు లఘు మండపము నిర్మించి, దాని యందు సప్తధాన్యములు పోసి, దానిపై సువర్ణ, రజత, లేక రాగి కలశమును స్థాపింపవలెను. ఆ కలశముపై పైన తెలిపిన లోహములతో చేయబడిన పాత్ర యుంచవలెను. ఆ కలశమందు పంచ పల్లవములు, పంచరత్నములు యుంచి, దానిని ఒక నూతన వస్త్రముతో కట్టవలెను. ఈ కలశముపై, పైన తెలిపిన శ్రీగణేశమూర్తిని వైదిక మంత్రానుష్ఠానము గావించుచూ స్థాపించి షోడశోపచారములు సమర్పింపవలెను. పిదప వివిధ వ్యంజనములు, అపూపములు, లడ్లు, మోదకములు, శాలిధాన్యము తో చేయబడిన అన్నము, పాయసము, పంచామృతములు ఆయనకు నైవేద్యముగ సమర్పింపవలెను. తదుపరి ఉత్తరాపోశనమునకై ఉదకము సమర్పించి, తాంబూలము, సువర్ణ దక్షిణ, ఛత్ర, వ్యజన, చామరములు, ప్రదానము కావింప వలసినది. తదుపరి నీరాజనము సమర్పించి, ఆ సమయమున "రాజాధిరాజాయ, యజ్ఞేన యజ్ఞంతాం" మొదలగు మంత్రములు పఠించి, పుష్పాంజలి సమర్పించి, శ్రీగణేశుని స్తోత్రములు, సహస్ర నామావళితో స్తుతింపవలెను. ఆ రోజు రాత్రి జాగరణ యొనర్చి, ఆ జాగరణ సమయమున మంగళగీతములు, శ్రీగణేశ భజన, నృత్య గీతాదులతో గడుపవలెను. ప్రాత:కాలమున నిర్మల జలములతో స్నానమొనర్చి, నిత్యకర్మమొనర్చి, తిరిగి శ్రీగణేశ భగవానుని పూజించి, హోమమొనర్చి, ఆ హోమ మందు నానా విధ ద్రవ్యములతో హోమము పూర్ణమొనర్పవలెను. పిదప తన గురువును పూజించి ఆయనకు గోవులు, భూమి, తిలలు, సువర్ణము, దానమొనర్పవలెను. ఇతర బ్రాహ్మణులకు సహితము యధావిధిగ దానమొనర్చి, తదుపరి ఇరువది ఒకటి, లేక నూట ఎనిమిది లేక సామర్థ్యము కలిగిన ఎడల, ఇంకా ఎక్కువ మంది బ్రాహ్మణులకు, దీనదు:ఖితులకు, అంధ, కృపణులకు, పాయస సహిత భోజన మిడవలెను. పిదప వారికి తిరిగి దక్షిణ యొసంగి, వారి వద్ద నుండి ఆశీర్వాదము గైకొని, అటుపిదప బంధు, మిత్ర, బాంధవులతో ఆదర

సహితముగ భోజనము చేయవలెను."

"స్కంధా! ఇయ్యది పరమ శుభప్రదము, వరదాయకమయిన శ్రీగణేశ వ్రతము. ఇయ్యది చతుర్విధ పురుషార్థములను సమస్త మనోకామనలను పూర్ణమొనరించును. ఈ విషయమై నీకు ఒక పురాతన పురాణేతిహాసమును తెల్పెదను. పూర్వకాలమందు "కర్దముడు" అను ధర్మ పరాయణుడయిన మహారాజు యుండెడివాడు. ఆయన తేజోబలముచే చతుస్సాగర వలయుత భూమండలమును ఏకఛత్రాదిపత్యముగ ఏలుచుండెను. ఆయన సద్గుణములకు ముగ్ధులై, దేవతలు సహితము ఆయన దర్శనార్థము ఏతెంచి ఆయన సభయందు స్థితులై యుండెడివారు. ఒకానొకనాడు దైవయోగమున ఆయన గృహమునకు మహానుభావుడయిన భృగుమహర్షి ఏతెంచెను. ఆ మహర్షిని చూచిన తడవు మహారాజు ఒక్క ఉదుటున లేచి, ఆయనకు సాష్టాంగ దండ ప్రణామములాచరించి, ఒక ఉత్తమాసనమున ఆశీనుని కావించి, పూజించి, భోజనాదులు సమర్పించి, ఆయన స్వస్థుడయిన పిదప మహారాజిట్లనియె "భగవాన్! మీరు సర్వజ్ఞులు. నా మదిన ఒక సంశయము కలదు. మీరనుమతించిన అడిగెదను. స్వామీ! పూర్వ జన్మమందు నేనెవరిని? ఏ పుణ్యఫలము చే నాకు ఈ నిష్కంటక రాజ్యము ప్రాప్తించినది. ఈ విధమయిన రాజ్యము "న భూతో న భవిష్యతి." నేను దేవ, రాక్షస, యక్ష, గంధర్వ, పన్నగముల చే పూజింపబడుచున్నాను. కుబేరుని మించిన సంపద నా కోశము నందున్నది. త్రిలోకముల యందలి రత్నరాశులను నేను నా బలము చే తీసికొనివచ్చి, నా రాజ్యమందుంచి అనుభవించుచున్నాను. నేను దేనిని వాంఛించిన, ఆ పదార్థము తక్షణము నాకు అమరుచున్నది. పుణ్యశాలురందు శ్రేష్ఠుడా! నాకు ఏ పుణ్య కర్మాచరణము చే ఇవన్నియు ప్రాప్తించినవి? దయచేసి తెలుపవలసినది."

అంత భృగుమహర్షి ఒక్క క్షణము అంతరావలోకనుడై ధ్యానించి, కనులు తెరచి ఇట్లనియె "మహారాజా! నేను నా యోగ బలము చే నీ పూర్వ జన్మను తెలిసికొంటిని. నీవు నీ పూర్వ జన్మమందు శుచివైన దుర్బల క్షత్రియుడవు. నీవు కుటుంబ పోషణకు నానా విధములయిన కర్మలనాచరించుచూ, అవేవియునూ ఫలీభూతమవ్వక, నిరంతరము పత్నీ పుత్రుల నిష్ఠుర వచనములతో బాధనొందుచుండెడివాడవు. ఈ విధముగ జీవితము గడుపుచూ, ఒకనాడు సంసార బాధల నోర్వలేక, ఎవ్వరికీ చెప్పక వనములకేగి, అచట ఏమి చేయుటకు తోచక, ఏమి చేయవలెనో తెలియక, లక్ష్య రహిత భ్రమణము చేయుచుంటిమి. విధివశాత్తు నీకు మహాత్ముడయన "సౌభరి" మహర్షి ఆశ్రమము కనిపించినది. ఆ సమయమునకు ఆయన శిష్యులకు సంసార దు:ఖనాశకమగు మహావిద్యను బోధించుచుండెను. అంత నీవు వారివద్దకేగి, దండమువలె నేలపైబడి, సాష్టాంగ దండ ప్రణామములాచరించితివి. అంత ముని నిన్ను సాదరముగ ఆహ్వానించి, ఆసనమిడి క్షేమమరసెను. అంత నీవు "స్వామీ! నేను సంసార దు:ఖ సాగరమున పడి బహు క్లేశములనుభవించుచున్నాను. పత్నీ, పుత్ర, మిత్రాదులచే కడు కటు వచనములచే పీడింపబడుచున్నప్పటికీ, మనసున వైరాగ్య మంకురించుట లేదు. నేను శీతోష్ణములు, క్షుధా, పిపాసాది ద్వంద్వములచే మిక్కిలి పీడితుడనై యుంటిని. నాకు ఈ సంసారమున తరించు ఉపాయమును తెలుపప్రార్థన."

అంత కృపాళువైన సౌభరి మహర్షి కొంత తడవు ఆలోచించి ఇట్లనియె "ఓ! క్షత్రియా! నీకు సర్వపాపహరమైన ఒక వ్రతమును బోధించెదను. దీనిని ఇత:పూర్వము బ్రహ్మర్షులు, చాతుర్వర్ణముల వారు ఆచరించి, దు:ఖవిముక్తులై ఉత్తమ సిద్ధులనొందిరి. ఈ శ్రీగణేశ వ్రతము ధర్మార్థ కామ మోక్షములను చతుర్విధ పురుషార్థములను ఒసగును. అంత క్షత్రియుడు "స్వామీ! ఈ శ్రీగణేశుడెవరు? ఆయన శీల, రూప, స్వరూప, ఔదార్యములెట్టివి? ఆయన ఎట్లు ఉత్పన్నమెయ్యెను? నాకు శ్రవణ యోగ్యత యున్నదని మీరు తలచిన ఎడల, దయచేసి ఆ విషయ విశేషములను వివరింప వలసినది." సౌభరి మహర్షి "ఆ భగవానుడు నిత్యుడు, వీతరాగశోక రహితుడు, జ్ఞాన స్వరూపుడు, పరమార్థ రూపుడు, ఆదిమధ్యాంత రహితుడు, అనంతుడు. ఆయననే సంతజనులు శ్రీగణేశుడని పేర్కొందురు. ఎవరి నుండి ఓంకారము, వేదములు,

జగత్తు, ఉత్పన్నమయినవో, ఎవరు ఈ జగత్తు అంతయు వ్యాపించియున్నాడో, ఆయనే శ్రీగణేశుడు. జగత్ సృష్టికై విరించి ఒక వంద దివ్య సంవత్సరములు దుష్కర తపమాచరించెను. తదుపరి ప్రసన్న చిత్తుడై దివ్య రత్నములు, దివ్యోపచారములతో పూజనమొనర్చి, తన మనస్సు నుండి సిద్ధి బుద్ధులను ఇరువురు కన్యలను సృష్టించి ఆయనకు సమర్పించెను. అంత శ్రీగణేశుడు సంతసిల్లి చతుర్ముఖునికి తన ఏకాక్షర మహామంత్రము నిచ్చెను. ఆ మహామంత్ర ప్రభావము చే బ్రహ్మ సమస్త సృష్టి కావించెను. పురాతన కాలమందు విష్ణువు శ్రీగణేశమూర్తిని నిర్మించి, షడక్షర మంత్రజపమాచరించుచూ అత్యంత నియమనిష్ఠలతో, యధావిధిగ పూజోపచారములతో ఒక సంవత్సర పర్యంతము శ్రీగణేశుని పూజించి ఈ సృష్టి పాలనా సామర్ధ్యము పొందెను. ఈ విధముగ శ్రీగణేశుని తెలిసికొని, విశ్వరూపుడు, అనాది, సర్వకారణకారణుడు, అయిన శ్రీగణేశుని ప్రయత్నపూర్వకముగ ఆరాధింపుము. అపుడు నీవు దు:ఖ విముక్తుడవగుదువు.

అంత క్షత్రియుడు "స్వామీ! ఈ వ్రతమును ఏ కాలమందు, ఏ విధివిధానములతో ఆచరింపవలెను? నేను మీరు చెప్పిన విధులను తప్పక ఆచరించెదను." సౌభరి "శ్రావణ శుక్ల చతుర్ధి నుండి, భాద్రపద శుక్ల చతుర్ధి వరకూ ఈ వ్రతమాచరించి, పార్ధివ శ్రీగణేశమూర్తిని నిర్మించి, భక్తపూర్వకముగ పూజించి, తుదకు బ్రాహ్మణ భోజన సమారాధన కావింపుము. ఈ వ్రతాచరణ చే నీవు సర్వదు:ఖ విముక్తుడవగుదువు." అంత నీవు ఆ సౌభరిముని పలుకులను సంపూర్ణముగ విశ్వసించి, అత్యంత భక్తి శ్రద్ధలతో, ఆ ఆశ్రమ పరిశరములందే ఆ వ్రతాచరణ గావించితివి. ఆ వ్రతము పూర్ణమగుసరికి నీ గృహము స్థానమున ఒక దివ్య హర్మ్యము, దాసదాసీ యుక్తమయిన గోధనము, సమస్త సిరి సంపదలు సమకూరినవి. నీ పత్నీ పుత్రులు దివ్య దుకూలధారులై, దివ్యాచరణ భూషితులై నీ కొరకు ప్రతీక్షించుచుండిరి. నీవు సౌభరి మహర్షి అనుమతి తీసికొని నీ పాత గృహమునకై వెదకుచుంటివి. కానీ నీ భార్య నిన్ను గుర్తించి, లోనికి తీసికుని వచ్చి సత్కరించినది. ఆ వ్రత ఫలితముగ ఈ జన్మము నందు నీకు ఈ నిష్కంటక రాజ్యప్రాప్తి కలిగినది." అంత కర్దముడు హర్షితుడై, భృగుమహర్షి నాశ్రయించి, ఆ శ్రీగణేశ వ్రతమాచరించి, ఇహమందు సర్వసుఖ భోగములనుభవించి, వార్ధక్యమందు తన పుత్రులకు రాజ్యాభిషేకమొనర్చి, శ్రీగణేశవ్రత ప్రభావముచే జ్ఞాన వైరాగ్యములనొంది, పరమందు పునర్జన్మ రహితమైన శ్రీగణేశ ధామమున కేగెను.

శివుడు "స్కంధా! లోకమందు ఇటువంటి ఫలప్రదాయకమైన వ్రతము వేరొకటి లేదు. నీకు ఇచ్ఛ యున్న ఎడల నీవునూ ఈ వ్రతమాచరింప వలసినది. దీనిని ఇత:పూర్వము దేవ, దానవ, గంధర్వ, మానవులు ఆచరించిరి. నల మహారాజు, ఇందుమతి, చంద్రాంగదుడు ఆచరించి, వారి మనోకామనలు పూర్ణమయిన పిదప అంత్యకాలమున శ్రీగణేశధామము చేరిరి. పర్వతరాజు హిమాలయుడు "ఓ! మహాభాగ్యశాలినీ! పార్వతీ! నీవు ఈ వ్రతమాచరించి పరమశివుని ప్రాప్తించుము. నేను నీ యందలి అమితమైన ప్రేమచే ఈ పరమ గోప్యమయిన వ్రతము గూర్చి తెలిపితిని. దీనిని నీవు మరెవరి సమ్ముఖమున ప్రకటీకరింపరాదు."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి కర్దమ చరితమను ఏబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఏబది రెండవ అధ్యాయము

(నల చరితము)

పార్వతీదేవి "తండ్రీ! నల మహారాజు శ్రీగణేశ వ్రతమాచరించెనని శెలవిచ్చితిరి కదా! ఈ నలుడెవరు? ఈ వినాయక కధామృతము వినుటచే నా మనసు విశ్రాంతినొందుచున్నది." హిమాలయుడు "తల్లీ! ప్రాచీనకాలమందు

నిషధ రాజ్యమును "నలుడు" అను మహారాజు పరిపాలించు చుండెను. ఆతడు బ్రహ్మణ్యుడు, వేదవేత్త, ధనరూపగుణాన్వితుడు, సమస్త శస్త్రాస్త్రకోవిదుడు, బలశాలి, త్రిలోకములయందు సంచరింపగల శక్తియుతుడు, శుచి, మరియు దేవతలకు సహితము వందనీయుడు. ఆయన గుణములు వర్ణించుట ఫణిపతికి సహితము అశక్యము. ఆయన చతురంగబల సమేతుడు; ఆయన క్రోధము వహించిన దిక్పాలురు సహితము కంపింతురు. ఆయన ధర్మపత్ని "దమయంతి". చతుర్ముఖ బ్రహ్మదేవుడు దోషములన్నింటినీ దమనము గావించి, సౌందర్యమునంతటినీ ఒక మూస యందు పోసి ఆ పతివ్రతామతల్లిని సృష్టించెను. అందుచే ఆమె దమయంతి అని పిలువబడెను. త్రిలోకముల యందలి అతివలను ఒక చోట చేర్చిననూ, ఆ సౌందర్యము దమయంతికి సరికాదన్న అయ్యది అతిశయోక్తి కానేరదు. ఆ సకల సద్గుణ సంపన్న నిరంతరము ఆపాదమస్తకము భూషణములు దాల్చి, లక్ష్మీదేవి వలె భాసిల్లెడిది. ఆ మహారాజు యొక్క మంత్రి "పద్మహస్తుడు". ఆయన పరాక్రముడు, బుద్ధియందు బృహస్పతి, నీతి యందు అంగిరుడు, గంభీరత యందు సముద్రుడు, ఉత్తమ గుణములందు మేరు సమానుడు. ఒకనాడు ఈ నల మహారాజు సభతీర్చి, వంది మాగధులు స్తుతి కావించిన పిదప, అప్సర సమాన సుందరీమణుల నాట్యము వీక్షించుచుండెను. ఆ సమయమున భాను సమాన తేజశ్శాలి అయిన గౌతమ మహర్షి అచటికి ఏతెంచెను. ఆ మహర్షిని చూడగనే నలమహారాజు వెంతనే లేచి, సాదరముగ ఆహ్వానించి, సుందరమయిన ఆసనమున సుఖాశీనుని గావించి, భక్తి ప్రపత్తులతో పూజించి ఇట్లనియె "స్వామీ! మహామునీ! మీ దర్శనము చే నా జన్మము, రాజ్యము, మాతాపితరులు, కులము, జీవనము సఫలమయినవి. దయచేసి మీ ఆగమన కారణమును శీఘ్రముగ తెలుప వలసినది." అంత గౌతమ మహర్షి "మహారాజా! స్వర్గమందు ఇంద్రాది దేవతలు, దిక్పాలురు, త్రిమూర్తులు సహితము నిన్ను కీర్తించుచున్నారు. మర్త్యుడవయిన నీవు నిజముగా ధన్యుడవు. నేను కేవలము నిన్ను, నీ వైభవమును చూచుటకేతెంచితిని. నేను నిత్యతృప్తుడను. నీ వలన కావింపబడిన పూజనము చే విశేషముగ తృప్తి నొందితిని. ఇక నేను నా ఆశ్రమమున కేగెదను. అనుజ్ఞ నీయవలసినది." అంత నలుడు "మహర్షీ! మీరు వేద వేదాంగవేత్తలు, మరియు సర్వశాస్త్ర విశారదులు. బ్రహ్మన్! ఒక్క క్షణ పర్యంతము ఆగి నా సంశయములు దూరమొనర్ప ప్రార్థన." అంత గౌతముడు సంతసించి "వల్లె" అనెను. అంత నలుడు "స్వామీ! నాకు సహితము నా వైభవము విస్మయ మొనర్చుచున్నది. ఈ నా వైభవమునకు కారణమేమి? పూర్వజన్మమందు నేను పూజా, వ్రత, తపో, దానములు ఏమి కావించితిని? దేని ప్రభావమున నాకు ఈ అప్రతిహతమయిన సామ్రాజ్య సౌభాగ్యాదులు అబ్బినవి?"

అంత గౌతమ మహర్షి ఒక్క క్షణము మౌనము వహించి, అంతర్చక్షువై, తిరిగి కనులు తెరచి, ఇట్లనియె "రాజా! నీవు పూర్వ జన్మమున గౌడదేశపు ప్రక్కదేశమున పిప్పల పురమను నగరమందు ఒక దరిద్ర క్షత్రియుడవు. కానీ నీవు శుచివి, మరియు జ్ఞానివి. నీవు నీ పత్నీ, పుత్ర, మిత్ర కటువచనములు వినలేక బాధార్తుడవు, విరక్తుడవై, ఎవరికీ చెప్పకుండ అనేక వృక్ష సమావృతము, క్రూర మృగ సంయుతమైన ఒక వనము ప్రవేశించితివి. అందు తిరుగాడుచూ దైవవశమున నీవు "కౌశికమహర్షి" ఆశ్రమము చేరి, ఆయనను గని, అత్యంత భక్తి ప్రపత్తులతో ఆయనకు నమస్కరించితివి. ఆయన సంతసిల్లి "నా ఇష్టదైవమైన శ్రీగణేశుడు నీవు కళ్యాణమొనర్చు గాక!" అని దీవించెను. ఆ దీవెనకు నీవు సంతోషించి నీవు ఆయనకు నీ దయనీయ చరితమును తెలిపి, దారిద్ర్య నాశకము, సమస్త మనోకామనా పూర్ణమొనరించు ఉపాయము గూర్చి ప్రశ్నించితివి. ఆయన నీకు శ్రీగణేశ ప్రార్థనావిధినీ, మంత్రమును తెలిపెను. అంత నీవు "మహర్షీ! ఈ శ్రీగణేశుడెవరు?" మెదలగు సంశయముల నడిగితివి. ఆయన అనిర్వచనీయమయిన రూపము గల శ్రీగణేశుని అవతారములను, వైకారిక రూపములను వర్ణించి, శ్రావణశుక్ల చతుర్థి నుండి భాద్రపద శుద్ధ చతుర్థి వరకు ఒక మాస పర్యంతము పూజావిధిని తెలిపెను. నీవు ఆ విధివిధానములను ఆలకించి, ఆకళించుకొని మునివరునకు ప్రణామములర్పించి, గృహమునకేగి, యధావిధిగ మృణ్మయమూర్తిని చేసి పూజన మాచరించితివి. ఆ వ్రత ప్రభావము వలన నీకు రధ, గజ,

హయ, వస్తు వాహనములు, గోవులు, దాస దాసీ జనము, సంక్రమించినవి. వాటితో నీవు సుందర శ్రీగణేశ మందిర నిర్మాణము గావించితివి. ఇహలోకమందు అనేక భోగ భాగ్యములనుభవించి, మరణానంతరము పునర్జన్మ యందు నీకీ సామ్రాజ్య భోగములు, మరియు అచల లక్ష్మీసంపద ప్రసాదింపబడినవి. నీవు అడిగిన సందేహములన్నియు నేను తీర్చితిని. నీ అనుజ్ఞ చే నా ఆశ్రమమునుకు చనెదను" అని పలికి గౌతముడు తన ఆశ్రమమునకు ఏగెను.

గౌతమ మహర్షి వెడలిన పిదప నలుడు ఆయన పలుకుల పై అచంచల విశ్వాసముంచి, అత్యంత సుందరమయిన శ్రీగణేశ ప్రతిమను చేయించి శ్రీగణేశ వ్రతము నారంభించెను. అంతేకాక నిత్యము శ్రీగణేశ కధామృతమును వినుచూ, అద్దాని వలన ఆయన మనోభిలాషణములన్నియు పూర్ణమయ్యెను." హిమాలయుడు ఈ విధముగ నలుని చరితము తెలిపి "పుత్రీ! సంపూర్ణముగ ఈ వ్రత మహాత్మ్యమును తెలుపుట ఎవరికైననూ దుర్లభము" అని పలికెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి నల చరితమను ఏబది రెండవ అధ్యాయము సమాప్తము)

ఏబదిమూడవ అధ్యాయము

(చంద్రాంగద ఇందుమతీ చరితము)

హిమాలయుడు "ఓ! శుభాననా! నీకు ఇపుడు చంద్రాంగద ఇందుమతీ చరితమను తెలిపెదను. పూర్వము మాళవదేశమందు "కర్ణము" అను ప్రఖ్యాత నగరము కలదు. దానిని "చంద్రాంగదుడు" అను అత్యంత పరాక్రముడయిన రాజు పరిపాలించుచుండెను. ఆయన అణిమాది సిద్ధియుతుడు, సర్వశాస్త్ర పారంగతుడు, యాజ్ఞికుడు, మహాజ్ఞాని, దానశీలి, మరియు వేదవేదాంగవేత్త. ఆయన సభ దేవేంద్ర సభ అయిన సుధర్మను సహితము తలదన్నునది. రత్న, మణిఖచిత, స్వర్ణ స్థంభముతో అలరారుచూ, అనేక దివ్యకాంతులీనుచుండెడిది. ఆయన ధర్మపత్ని "ఇందుమతి" అత్యంత సుందరీమణి, పరమ పతివ్రత, మహాభాగ, మరియు పతిసేవా పరాయణురాలు. నిరంతరము గృహకార్య సంలగ్నయై, అతిథి పూజనము, వ్రతచారిణియైన నిరంతర ధర్మపరాయణి. ఆ మహారాజుకు యున్న ఒక్క దుర్గుణము వేట. "జీవహింస మహాపాపము, అతి ఘోరము" అని అమాత్యులు ఉటంకించిననూ, ఆ మహారాజు మానడయ్యె! ఒకానొక దినమున దైవయోగమున మహారాజు వేట నిమిత్తము తన సైన్యము, మిత్రులు, అమాత్యుల తోడుగా వన ప్రవేశము కావించెను. అత్యంత ఉత్సాహముతో ఆయన చిరుతపులులు, హరిణములు, వరాహముల నెన్నింటినో వేటాడి, రాజ్యమున కంపి, ఒక చేతిలో ఖడ్గము, మరియొక చేతిలో ధనస్సు ధరించి, కవచియై, అలసట నెరుగక, తిరిగి వేటాడుటకై ఆ మహారాజు వనంతరాళమున ప్రవేశించెను. ఆ సమయమున ఆయనను కొందరు రాక్షసులు చూచిరి.

ఆ రక్కసులు పర్వత కంధరముల వంటి నోరు, లోతైన నూయి వంటి కనులు, ఆకాశమునంటు దేహము కలిగి అత్యంత భయంకరముగ ఒప్పుచుండిరి. ఆ రక్కసుల గాంచి రాజ పరివారము నందు కొందరు హతాశులైరి, కొందరు మూర్ఛితులైరి. మరికొందరు పలాయనము చిత్తగించిరి. ఆ రక్కసుల గాంచి రాజునకు శీతల జ్వరము సోకి నిరుత్తరుడయ్యెను. ఆ రక్కసులందు ఒక రక్కసి కామదేవుని వంటి మహారాజుపై మోజుపడి ఆయన అమాత్యులను దాచి, సైనికులను భుజించి, మహారాజు వద్దకు వచ్చి గాఢముగ కౌగిలించుకొని చుంబించెను. తదుపరి మిగిలిన సైనికుల వైపు చూచుచుండగా, ఆ అంతరాళమున రాజు తప్పించుకొని, ఒక సరోవరము చేరి ఆ జలములందు దాగెను. వెంబడించిన రాక్షసికి మహారాజు కానరాలేదు. కానీ సరోవర జలములందు మునిగిన రాజును నాగకన్యలు బంధించి, పాతాళమున తన గృహమునకు గొనిపోయి ఇట్లనిరి "ఓ! నరోత్తమా! నీవెవరు? ఎవరి పుత్రుడవు? నీ ఆగమనమునకు కారణమేమి?" అంత రాజు

“నేను హేమాంగద మహారాజు పుత్రుడను, చంద్రాంగద నామధేయుడను. మాళవదేశమందలి కర్ణము నా రాజధాని. రాక్షసీ భయమున నేను ఈ సరోవరమందు దాగుకొంటిని. నా సేవకామాత్యులను రాక్షసి భక్షించెను. ఈ జలములు నా ప్రాణములను రక్షించినవి” అని పలికెను. అంత నాగకన్యలు “రాజా! నీవు మమ్ము పరిణయమాడి ఇక్కడనే యుండవలసినది. నీ అభీష్టములు సర్వము పూర్ణమగును. నాగకన్యలతో రమించుట అత్యంత దుర్లభము సుమా!” అని పలికిరి. అంత మహారాజు “మాతలారా! నేను ఏకపత్నీవ్రతుడను. నేను ఆ వ్రతమును వీడలేను. మీకు నేను చంద్రవంశ రాజుల ధర్మమును తెలిపెదను. పరధనాపహరణము, పరనింద, పరస్త్రీగమనము, అను హేయ కార్యములు చంద్రవంశ నరపతులు ఎన్నడునూ కావించరు. మా రాజ్యమందు “అధ్యయనము, యజనము, దానము, శరణాగత వత్సలత, నిషిద్ధాచరణ త్యాగము, విహితాచార పాలనము” ఇవన్నియు బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులకు విహితము. సర్వ వర్ణములకు అతిథి సత్కారము విహితము. బ్రాహ్మణులకు అధ్యాపన, యాజన, ప్రతిగ్రహణము విహితధర్మము.”

రాజు యొక్క పలుకులు విని నాగకన్యలు అగ్రహోదగ్రులై “నీవు నీ భార్య నుండి వియోగమునొందెదవు” అని శపించి, కామార్తులై ఆ రాజును సంకెలలతో బంధించిరి. ఇంతలో రాక్షసి రాజును వెదకుచూ, సరోవర జలములన్నియు త్రాగి జలచరములనన్నింటినీ భక్షించెను. ఇంతలో రాక్షసి భక్షణము నుండి బయలపడిన రాజపరివారము రాణిని చేరి జరిగిన విషయములన్నియు విన్నవించిరి. “రాజు సరోవరము నందు మునిగెను” అని వార్తను వినిన రాణి మొదలు నరికిన కదళీతరువు వలె నేలపైబడి మూర్ఛనొందెను. అంత ఆమె సఖులు ఆమెపై శీతల జలములు ప్రోక్షణ కావించి, వింజామరలు వీచిరి. ఆ శీతలోపచారములచే ఆమె తిరిగి స్పృహ నొంది, తన చేతులతో ముఖమును, వక్షమును మోదుకొనుచూ, విలపించుచూ ఇట్లనియె “హా! ప్రాణనాథా! నన్ను విడచి మీరు ఎక్కడికేగితిరి? నేను ఎల్లప్పుడూ మీకు వినమ్రురాలినై, నిత్య పతిసేవా కార్యములందు సంలగ్ననైతిని. నిత్యము అతిథి పూజనము సలిపితిని. నా పతి సుగంధతైలము లేక ఎట్లు స్నానమాచరించును? ఎట్లు భోజనము చేయును? ఎట్లు శయనించును? సద్గుణ నిధి, మరియు అత్యంత ప్రతాపవంతుడయిన నా పతి ఎట్లు అస్తమించెను? ఆ మహా పురుషుడు లేక దిశలన్నియు శూన్యమగుచున్నవి. ఇక నేను ఎట్లు సుఖమును ప్రాప్తింతును? ఈ రాజ్యమును, ప్రజలను ఎవరు సంరక్షించెదరు?” ఈ విధముగ గగ్గోలు పెట్టుచూ, తన ఆభరణములన్నింటినీ విసిరికొట్టి అత్యంతదీనయై విలపించసాగెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి చంద్రాంగద, ఇందుమతీ చరితమను ఏబది మూడవ అధ్యాయము సమాప్తము)

ఏబదినాల్గవ అధ్యాయము

(ఇందుమతీ నారద సంవాదము)

పర్వతనందిని “తండ్రీ! మూర్ఛానంతరము రాణి ఏమి చేసెను? హృదయానందము కలిగించు ఈ శ్రీగణేశ పురాణమును విస్తార పూర్వకముగ తెలుపవలసినది.” హిమవంతుడు “అపుడు చతురవాక్య విశారదులు అయిన ప్రజలు, మరియు నాగరికులు అచటికేతెంచి ఇట్లనిరి “తల్లీ! శోకము వలదు. మీరు పుత్రవతి. మీరు మీ శోకమును విడచి, పుత్రపాలనమందు మనసునుంచవలసినది. మనందరి దుర్భాగ్యము వలన మహారాజు మడసెను. మీ కన్నీటిచే ప్రేతము దగ్ధమగును. అది మీ పతిదేవులకు అత్యంత అశుభము. మర్త్యులందు చిరంజీవులు లేరు. లోకులు జీర్ణవస్త్రము విడచి, వేరొక శుద్ధ వస్త్రము ధరించినటుల జీవుడు ఈ శరీరమును విడచి వేరొక శరీరము ధరించును. ఆశ్చర్యమేమనగా

మృత్యుముఖమునున్న వ్యక్తి సహితము తన మరణము తథ్యమని తెలిసిననూ, వేరొక వ్యక్తి కొరకు శోకించును. కానీ ఏ మానవుడు తన జీవుడు తన శరీరమును ఎప్పుడు విడచునో ఎరుంగడు. సర్వము దైవ, కాలాధీనమైనప్పటికీ, మనుష్యుడు తనవద్దనున్న వస్తు సముదాయమును సర్వమును తనదియనే భావించును. పిపీలికాది బ్రహ్మ పర్యంతము, చతుస్సాగరవలయుతమయిన స్థావర, జంగమాత్మక జగత్తు సర్వము నశ్వరమని తెలిసికొని, శోకమును త్యజింపుము. నీకు సుపుత్రులు కలరు. ఓ! శుభాంగీ! ధర్మాత్ముడయిన నీ పతి ముక్తి నెందెను. ఒకవేళ జీవితుడయ్యేనేని ఆయన అవశ్యము తిరిగి వచ్చును. పుణ్యమధికమయినపుడు స్వర్గమునకేగిననూ మానవుడు తిరిగి రాగలడు. లేనిఎడల ఆయనను గూర్చి మన నగరమున కేతెంచు ఏదేని భూత, భవిష్యత్, ద్రష్టలను అడిగెదము. వారికి సర్వమునూ తెలియును. కానీ ప్రస్తుతము లేచి, చేయవలసిన పనులు చేయవలసినది.

అంత రాణి కొంచెము ఊరటనొంది, కన్నీరు తుడుచుకొని, వారికి కృతజ్ఞతలు తెలియజేసి, వారిని వారి ఇండ్లకు పంపెను. తదుపరి తన సౌభాగ్య చిహ్నములన్నియు త్యజించి, అత్యంత కృశించినది. ఒక్కొక్కప్పుడు రోదించుచూ, మూర్ఛనొందుచూ, లేచుచూ, ఈ విధము నెమ్మదిగ కాలము వెళ్ళబుచ్చుచుండగా, పన్నెండు సంవత్సరములు గడచెను. ఆ సమయమున త్రిలోకసంచారి, సర్వజ్ఞాత అయి నారదమహర్షి అచటికి ఏతెంచెను. అంత రాణి ఆయనకు నమస్కృతులర్పించి, తన పతియొక్క వృత్తాంతమును తెలిపి, గడచిన పుష్కర కాలమందు తాననుభవించిన అమిత దు:ఖమును తెలియజేసెను. అంత నారదుడు "తల్లీ! నీ భర్త బ్రతికియే యున్నాడు. శోకింపవలదు. నీవు తిరిగి సుందర వస్త్ర భూషణములు ధరించి, మంగళద్రవ్య ధారణ గావింపుము." అంత సర్వజ్ఞుడు, సత్యవాది అయిన ఆ దేవర్షి పలుకుల యందు పరపూర్ణ విశ్వాసముంచి, ఆమె ప్రజలను, నాగరికులను, బ్రాహ్మణులను, రావించి నారద మహర్షి ఎదుటనే ఆయన పలుకులను వారందరికీ ఎరింగించి, అత్యంత హర్షితయై, సుందర దుకూల సహిత మంగళద్రవ్యధారణ కావించి, మంగళ వాద్యములు మ్రోయించెను. పిదప జనులను వెనుకకు పంపి తిరిగి నారద మహర్షిని ఈ విధముగ ప్రశ్నించెను.

"మహర్షీ! నా పతి ఎక్కడుండెను? ఏ విధముగ యుండెను? ఓ! వేదజ్ఞాతా! ఏఉపాయము చే నేను తిరిగి ఆయనను పొందెదను? ఏ వ్రత, తప, దాన మొంతటి దుష్కరమైననూ నేను ఆచరించెదను." అంత నారదుడు "తల్లీ! నీకు సంక్షేపముగ ఒక శ్రీగణేశ వ్రతముపదేశించెదను. శ్రావణ శుక్ల చతుర్థి నుండి ఈ వ్రతము పరమ ప్రసన్నతతో ఆరంభింపుము. ప్రాత:కాలమున నదీ, వాపీ, కూప, తటాకములందు తొలుత దంతధావన కావించి, పిదప సంకల్ప స్నానమాచరింపవలెను. తదుపరి ఒక శుద్ధ శ్వేతవస్త్రము ధరించి, శ్రీగణేశుని చతుర్భుజ మూర్తిని మట్టితో చేసి, అద్దానికి షోడశోపచారములతో పూజనమొనర్పవలెను. ప్రయత్నపూర్వకముగ ఏక భుక్తము కానీ, నక్తము గానీ చేయవలెను. ఈ విధముగ భాద్రపద శుద్ధ చవితి వరకూ కావించి, ధన సంపత్తిని అనుసరించి గీతా, వాద్య, బ్రాహ్మణ, భోజన సమారాధన కావింపవలెను. రాణీ! నా వాక్యములు సత్యములు. ఎట్టి పరిస్థితుల యందు ఇది మిధ్య అని తలంపరాదు." ఈ విధముగ పలికి నారదమహర్షి అంతర్ధానుడయ్యెను. ఇది జరిగిన కొన్ని దినములకు శ్రావణమాసము ఆరంభమయినది. రాణి ఇందుమతి నారదుడు తెలిపిన విధివిధానములలను సంపూర్ణముగ పాటించుచూ, శ్రీగణేశుని అత్యంత శ్రద్ధా భక్తులతో పూజించెను. అటుపిదప దివ్య గంధ, వస్త్రాదులు, ఫల, పుష్ప, నైవేద్యములు, సువర్ణ దక్షిణ, దీపములు, పుష్పాంజలి, ప్రదక్షిణ, నమస్కార స్తుతి పాఠములు, భోజనసమారాధన, గీత, గేయ, నృత్య వాద్యాదులతో శ్రీగణేశుని ప్రసన్నుని కావించినది. ఈ విధముగ శ్రావణ శుక్ల చతుర్ధి నుండి భాద్రపత శుక్ల చతుర్ధి వరకు అత్యంత జాగరూకతతో సర్వము కావించెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి ఇందుమతీ నారద సంవాదమను ఏబదినాల్గవ అధ్యాయము సమాప్తము)

ఏబది అయిదవ అధ్యాయము

(ఇందుమతీ చంద్రాంగద సమాగమము)

హిమవంతుడు "రాణి ఇందుమతి యొక్క వ్రతపాలనమునకు ముగ్ధుడై శ్రీగణేశభగవానుడు ఆమెపై కృప జూపించెను. ఆ కారణమున నాగకన్యల మనసు మారి, రాజును సంకెలల నుండి విడిపించి, శాపవిముక్తుని జేసి, యధావిధిగ పూజించి, అనేక వస్త్రభూషణ, ధన, రత్నరాశులను బహూకరించి, మనోవేగమున పోగల ఒక అశ్వముపై, ఆయనను అధిరోహింపజేసి, పాతాళము నుండి భూమిపైకి పంపిరి. రాజు సరోవరము నుండి బయటకు వచ్చి ఒక ధృఢమయిన వృక్షమునకు ఆ అశ్వమును కట్టి, ఆ సరోవరము నందు స్నానాదులు కావించుచుండెను. అచటగల పౌరులు ఆయనను గుర్తింపక "స్వామీ! మీరు ఎవరు? ఎక్కడ నుండి ఏతెంచిరి? మీ నివాస స్థలము ఏమి? మాకు తెలుపవలసినది" అని పలికిరి. అంత రాజు ఖేదయుక్తుడై ఇందుమతి మరియు రాకుమారుని గూర్చి ప్రశ్నించెను. అంత లోకులు ఆయనను గుర్తించి ఆనందము పెల్లుబిక, ఆయనను కౌగిలించి ఇట్లనిరి "మహారాజా! మీ ధర్మపత్ని ఇప్పుడే స్నానమాచరించి, తన గృహమున కేగినది. ఆమె తీవ్ర ఉపవాసములు కావించుచూ, వ్రతమాచరించుట వలన మిక్కిలి కృశించినది. రాజకుమారుడు సహితము నామమాత్రావశేషముగ యున్నాడు." అంత కొంతమంది లోకులు నగరమునకేగి ఈ శుభ సమచారము నెరింగించిరి. అంత రాణి ఆనంద సాగరమున ఓలలాడెను. ఆమె రాజును ఆహ్వానించుటకై అమాత్యులను, రాజపరివారమును, నగర ప్రముఖులను పంపెను. నగరము నంతటినీ ధ్వజ పతాకములతో అలంకరింప జేసెను. రాజమార్గమునందు పన్నీటి జలముల చే కళ్ళాపి జల్లించెను. తాను స్వయముగ సుందర వస్త్ర భూషణములు దాల్చెను. బ్రాహ్మణులకు గోదాన, భూదాన, సువర్ణదానము లొనర్చి, తాను, ఇతర ముత్తైదువులతో హారతులు పట్టించి స్వయముగ వారితో కలసి సరోవర ప్రాంతమున కేగెను.

అమాత్యులు, నగర ప్రముఖులు ముందుగా ఏగి మహారాజునకు నమస్కృతులర్పించి, గాఢాలింగనము చేసికొనిరి. రాజు యొక్క అనుమతి తీసికొని, వారు తమతమ స్థానముల యందు కూర్చొనిరి. రాజు వరుసగా అందరినీ పలుకరించి, కుశలమరశి ఇందుమతీ శిబిరమున కేగెను. ద్వాదశ వర్షముల లేమిచే కావింపబడని పుణ్యకార్యములుండుటచే వేదవేత్తలయిన బ్రాహ్మణులచే పుణ్యా:వాచనము చేయించి, వారికి దక్షిణలొసగి, పరమేశ్వరుని యధావిధిగ పూజించి, మారేడు మొక్కను భూమియందు నాటి, తన రాణి అయిన ఇందుమతి సమీపమునకేగెను. ఆ సమయమున పూర్ణచంద్ర నిభానన అయిన ఇందుమతి శుష్కించి కేవలము శుక్లపక్ష పాడ్యమి చంద్రరేఖ వలె యుండెను. వారు ఇరువురు ఒకే సమయమున కన్నుల అశ్రుధారల జలపాతములవలె కారుచుండగా ఒకరితో ఒకరు వార్తాలాపములు కావించి, పరస్పరము వియోగబాధను తెలుపుకొనిరి. అంత అమాత్యులు అనివార్య కార్యములు నివేదింప స్వాంతననొంది, అమాత్యులు నానాలంకారములు చేసి తీసికొని వచ్చిన భద్రగజమును ఇరువురు ఆధిరోహించిరి. ఆ భద్రగజము ధ్వజపతాకయుక్తమై, మెడయందు నాలుగు గంటలు కట్టబడి అత్యంత శోభాయమానమగ యుండెను.

ఆ భద్రగజము ముందు వందమంది శస్త్రధారులయిన యోధులు నడచుచూ మార్గమును సుగమమొనర్చుచుండిరి. ఆ గజమునకు ఇరుప్రక్కలా అనేకమంది అశ్వారూఢులు, రధారూఢులు సాయుధులై ముందుకు కదలిరి. రాజదంపతికి ముందు నట, గాయక, వైతాళికులు గీతములు ఆలపించుచూ ముందుకు కదలుచుండిరి. ఆ భద్రగజము వెనుక అనేకమంది సాయుధులైన గజారోహులు వెంబడించిరి. ఆ సేన అంతయు కదలుటచే ధూళిరేగి ఆకాశము నంటినది. భద్రగజము రాజమందిరము వద్దకు వచ్చిన పిదప సైనికులందరూ వారికి వందనములిడి తమ గృహముల కరిగిరి.

రాజ పరివార ముఖ్యులు ఆ దంపతితో కలసి రాజమందిరము ప్రవేశించి, ఆ దంపతిచే సత్కరింపబడి, నమస్కృతులు సమర్పించి, వారి వారి గృహముల కరిగిరి. మహారాజు బ్రాహ్మణోత్తములకు భోజనములిడి, తదుపరి బంధుమిత్ర పరివార సహితుడై స్వాదిష్ఠ భోజనమారగించెను. ఆ రాత్రి ఆ రాజదంపతి ఒక సుందర ఆస్తరణము పరచిన హంసతూలికా తల్పమందు పరుండి, గడచిన పన్నెండేండ్లు తలచుకొని దు:ఖితులైరి. అంత రాజు పురోహితుడేతెంచి, వారిని స్వాంతన పరచెను. అంతవారు సుఖనిద్ర నొందిరి. రాజు తన పత్ని నుండి వినాయక వ్రత మహిమను గూర్చి విని, తాను సహితము శ్రీగణేశవ్రతమాచరించెదనని మనస్సున సంకల్పించి, శ్రావణమాసము ప్రవేశింపగనే యధావిధిగ శ్రావణ శుక్ల చతుర్ధి నుండి భాద్రపద శుక్ల చతుర్ధి వరకు ఒక మాస పర్యంతము శ్రీగణేశ వ్రత మాచరించి, మహోత్సవమును నిర్వహించెను."

ఈ విధముగ ఆఖ్యానమును వినిన పర్వతరాజ తనయ హర్షమునొంది, శ్రావణ మాసము వరకు నిరీక్షించి, పూర్వోక్తు విధిననుసరించి, ఒక మృత్తికా శ్రీగణేశమూర్తిని చేసి ప్రయత్నపూర్వకముగ అత్యంత శ్రద్ధతో దినమునకు కేవలము కొంచెము జలపానము కావించుచూ, మాస పర్యంతము శ్రీగణేశ వ్రతమాచరించెను. అంత త్రిశూలధారి అయిన శివుని మనసు కదిలి, వృషభారుఢుడై భాద్రపద శుద్ధ చవితి పూజ పూర్ణమవగనే ఆ ఆశ్రమ ప్రవేశము కావించెను. వృషభారూఢుడు ఏతెంచుట గమనించిన పర్వతరాజనందిని పరుగున ఎదురేగి ఆయన చరణకమలములపై తన శిరము నుంచి, నమస్కరించి, ప్రేమ విహవ్వలయై ఇట్లనియె "స్వామీ! మీ వియోగము వలన నాకు క్షణమొక కల్పము వలె తోచుచున్నది. నేను నా తండ్రి యొక్క ఉపదేశానుసారము శ్రీగణేశవ్రతమాచరించితిని. వరప్రద వినాయకుని కృపచే తిరిగి నాకు మీ దర్శన మయినది." ఆ సమయమున హిమాలయుడేతెంచి, పార్వతీదేవి చేతిని పట్టి, అద్దానిని శివుని హస్తమందుంచెను. అంత పార్వతీ పరమేశ్వరులు దేవ గంధార్వాదులతో కలసి శ్రీగణేశ పూజన మొనర్చిరి. తదుపరి దేవతలందరూ కలసి లోక కళ్యాణార్ధము పార్వతీ పరమేశ్వరులను పూజించిరి. దేవ దుందుభులు మ్రోగి పుష్పవృష్టి కురిసినది. సర్వులు శ్రీగణేశస్థుతి కావించి శివునితో సహా సర్వులు జయజయ ధ్వానములు కావించిరి. అంత శివుడు పర్వతనందినిని అక్కున జేర్చుకొని, వారిరువురు వృషభారూఢులై కైలాసమునకేగిరి. భ్రహ్మదేవుడు "పరాశరపుత్రా! నేను నీకు శ్రీగణేశ వ్రతమహాత్మ్యమును సంపూర్ణముగ తెలిపితిని. ఇపుడు నీకు వేరొక ఆఖ్యానమును వినిపింతును. దీని శ్రవణము చే మానవులు పాపవిముక్తులై సర్వమనోభీష్ఠములు పూర్ణమొనరించుకొందురు.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి ఇందుమతీ చంద్రాంగద సమాగమమను ఏబది అయిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఆరవ అధ్యాయము

(శూరసేన వృత్తాంతము)

భృగుమహర్షి ఈ విధముగ శ్రీగణేశ చరితమును తెలపుచూ ఒక్కక్షణము ఆగి గాఢ ఉచ్వాసమొనర్చెను. అంత సోమకాంతుడు "మహర్షీ! శ్రీగణేశ వ్రత మహాత్మ్యమును మీ దయచే వింటిని. భృహత్ బుద్ధిశాలి అయిన వ్యాస మహర్షి చతుర్ముఖ భ్రహ్మదేవుని నుండి ఇంకనూ ఏమి శ్రవణము చేసెను? నాకు ఈ శ్రీగణేశ కధామృతమును ఇంత శ్రవణము చేసిననూ తృప్తి కలుగుటలేదు." అంత భృగువు "మహారాజా! వ్యాసమహర్షి సహితము విరించిని ఈ విధముగనే ప్రశ్నించి ఇట్లనియె "పితామహా! ఈ శ్రీగణేశచరితము వినినకొద్దీ నాకు శ్రీగణేశ కధామృతమును సేవించవలెనన్న లాలస

పెరుగుచున్నది." అంత బ్రహ్మ "ద్వైపాయనా! నీకు మరింత కుతూహలము కలిగించు ఆఖ్యానమును వినిపించెను. ఇందు శూరసేన మహారాజు తాను ప్రత్యక్షానుభవము నొందెను.

భారతవర్షమందలి మధ్యదేశమున "సహస్రము" అను అత్యంత సుందర నగరము కలదు. దానిని రాజధానిగ చేసికొని "శూరసేనుడు" అను మహారాజు పరిపాలించు చుండెను. ఆ మహారాజు వేదవేదాంగ పారంగతుడు, ధన రూప యవ్వన సంపన్నుడు, దానశీలి, యాజ్ఞికుడు, ప్రజారక్షణ యందు అప్రమత్తుడు, త్రివిధముల శక్తి సంపన్నుడు, స్వాభిమాని, షాడ్గుణ ప్రయోగము (ఆన, ఆసన, సంధి, విగ్రహము, సంశ్రయము, ద్వైధీభావము) నందు దక్షుడు, చతుర్విధ ఉపాయములు (సామ, దాన, భేద, దండ) ప్రయోగించుట యందు దిట్ట, చతురుడు, శత్రుహంత, చతురంగబల సమేతుడు, అయి సుర భూసురలందు భక్తి ప్రపత్తులతో మెలగువాడు. భూతలమున ఆయన రాజధాని అమరావతిని మించిన సుందర, సుఖ, సంపత్తితో తలతూగుచుండెడిది. ఆతని ధర్మపత్ని "పుణ్యశీల". ఆమె సౌందర్యము నందు త్రిలోకమోహిని, మరియు సౌశీల్యము నందు అరుంధతీ, అనసూయలకు తుల్యమయిన పతివ్రత. ఒకానొకనాడు రాజు తన అమాత్య, రాజ ప్రతినిధులతో కలసి సభయందు ఉపవిష్టుడై, అందరితో ముచ్చటించుచుండెను. ఆ సమయమున ఒక విచిత్రము జరిగినది. ఆకాశ మార్గమున అగ్నిశిఖ వలె దేదీప్యమానముగ వెలుగొందుచున్న ఒక విమానమును వారందరూ కాంచిరి. మహారాజు తో పాటు సభాసదులు సహితము ఆ విమానమును కాంచి, కొంత ఉత్సుకత, కొంత భయము ముప్పిరిగొన, రాజు ఒక దూతను పిలచి ఆ విమానము గూర్చి తెలిసికొనమని పంపెను. దూత తనతో కొంతమంది సైనికులను తీసికొనివెళ్ళెను. వారిలో ఒక సైనికుడు గూని కలిగి దుష్ట భావముతో యుండెను. ఆ సైనికుని దృష్టిపాతమునకు ఆ విమానము అకస్మాత్తుగా నేలపైబడెను.

అంత దూత వెనుకకు వచ్చి "మహారాజా! ఆ విమానము పుణ్యశాలురయిన దేవతలతో నిండియున్నది. కానీ మన సైనికుని దృష్టిపాతము చే అయ్యది నేలన పడినది" అని పలికెను. అంత మహారాజు తనకు దేవతా దర్శనమగునని మనసున సంతోషించి, తనతోపాటు సభాసదస్యులను, ముఖ్య రాజకుటుంబీకులను తీసికొని అశ్వారూఢుడై, హుటాహుటిన ఆ విమానము పతనము చెందిన స్థలమునకు ఏగెను. ఆ మహారాజు విమానము నందు సర్వదేవగణసహితుడు, సర్వాభరణ భూషితుడు అయిన మహేంద్రుని గాంచి, చేతులు జోడించి, ప్రమాణములాచరించి ఇట్లనియె "సహస్రాక్షా! నేడు ఈ భూమి, నా జన్మము, సంపద, నా పూర్వీకులు, మేమందరము ధన్యులమయితిమి. ఎందుకనగా నేడు మర్త్యలోకమందు నాకు, నా అనుయాయులకు మీ దర్శన భాగ్యమబ్బినది. సర్వ దేవతా సార్వభౌములయిన మీ దర్శనము సామాన్యముగ వంద యజ్ఞము లాచరించిన గానీ కలుగదు. కానీ అటువంటి దేవరాజ దర్శనము నాకు తెలియని ఏదో పూర్వ జన్మ ఫలితముగ లభించినది. స్వామీ! మీ విమానము భూతలమందు పడుటకు కారణమేమి? అంతేకాక మీరు ఎక్కడినుండి ఏతెంచుచున్నారు? లేక ఎక్కడికేగుచున్నారు? మా ఈ సంశయమును నివృతిచేయ ప్రార్థన."

ఇంద్రుడు "ఓ! రాజా! నేను నీకొక ఆశ్చర్యపూర్వకమయిన సంఘటనను తెలిపెదను. ఈ మధ్య ఒకనాడు నారదమహర్షి నా వద్దకు వచ్చి "మహేంద్రా! మర్త్యలోకమున "భృశుండి" మహర్షి ఆశ్రమమున కేగితిని. ఆ మహర్షి అహర్నిశలు శ్రీగణేశ జపముచే శ్రీగణేశ సారూప్యము నొంది, ఇంకనూ ఆ పరాత్పరుని జపము కావించుచుండెను. నేను ఆ శ్రీగణేశరూపధారి అయిన మహర్షిచే పూజలందుకొని, ఆయనకు ప్రణామములర్పించి నీ కడకు ఏతెంచితిని. ఈ విధమయిన సారూప్యత నేను భూమండలమునందు ఇంతకు మున్ను చూడలేదు" అని పలికెను. నేను సహితము పరమాశ్చర్యమునొంది, ఆ నాదర మహర్షిని పూజించి, ఆయన వెడలిన పిదప, ఒక మనోవేగమున పోగల విమానము నధిరోహించి, ఆ భృశుండి మహర్షి దర్శన ఉత్సుకతతో ఆయనవద్దకేగి, దర్శించి, పూజనమొనర్చి, ఆయన పూజను గ్రహించి, తిరిగి సపరివారముగ అమరావతి కేగుచుంటిమి. కానీ నీ దుష్టుడయిన సేవకుని దృష్టిపాతము చే ఈ

విమానము ఇచట పతనమయినది.” అంత శూరసేనుడు “మహేంద్రా! మహానుభావా! ఈ బృశుండి ఏ తపో, వ్రతములచే ఈ శ్రీగణేశ సారూప్యము నొందెను? దయచేసి నాకు తెలుపవలసినది. ఆ అమృత తుల్య ఆఖ్యానమును వినవలెనని నా మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి శూరసేన వృత్తాంతమను ఏబదిఆరవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఏడవ అధ్యాయము

(భృశుండి చరితము)

ఇంద్రుడు “శూరసేనా! తప్పక తెలిపెదను. దండకారణ్యదేశమున “నందురము” అను నగరము కలదు. అందు “నామ” అను దుష్టుడయిన జాలరి యుండెడువాడు. ఆతనికి బాల్యావస్థయందు జూదము, యవ్వనమంకురించుసరికి వ్యభిచారము, దొంగతనము అలవాటయినవి. ఏ వస్తువునయిననూ, ఎవరిదయిననూ నిర్దాక్షిణ్యముగ దొంగిలించువాడు. జంకు, గొంకు లేక అసత్యము పలుకువాడు. నిరంతర ద్యూతక్రీడ, మద్యపానరతుడయిన ఆ నాముని ప్రవర్తనను సహింపలేక ఆ పురము నందలి పౌరులు ఆతనిని పుర భహిష్కరణ గావించిరి. అతడు తన పత్నీ, పుత్ర సహితుడై వనమునందు నివసించుచూ, ఆ వనమునందు పోవు బాటసారులను, సార్ధవాహులను, కొట్టి చంపుచూ, అపారసంపదను గడించెను. తన భార్య పుత్రులకు అనేక ఆభరణములు బహూకరించి, తన దుష్కర్మను ప్రజ్ఞ అని మురిసెడివాడు. అనేకవిధములయిన శస్త్రాస్త్రములు ధరించి, చెట్టుకొమ్మలయందుకానీ, తొర్రల యందుకానీ, దాగుకొని బాటసారులను హతమార్చి, వారి వస్త్ర భూషణ వస్తువులను హరించి, ప్రక్క గ్రామముల యందు విక్రయించుచూ, ధనము సంపాదించి, తన గృహమందు భోగ విలాస వస్తువులు అమర్చుకొని అనుభవించువాడు. ఈ పరమ పాపాచారుడు మృగ, పశు, పక్ష్యాదులను సహితము వదలువాడుకాదు.

కాలము ఎన్నడు ఒకలా ఉండదుకా! పరమాత్మ లీలలు విచిత్రము. ఒకనాడు నామ ఒక మృగమును తరుముచూ చాలా దూరము పరుగెత్తెను. కొంతసేపటికి మృగము దొరకక అలసట చెంది, నేలపైబడి కొంత తడవు విశ్రాంతి నొందెను. తదుపరి పైకిలేచి, నెమ్మది నెమ్మదిగ తన గృహమున కేగుచుండెను. మార్గమధ్యమున ఆతనికి ఒక సుందర శ్రీగణేశ తీర్థము కనబడెను. అలసట తీర్చుకొందుకై ఆ జాలరి ఆ మంచినీటిని త్రాగి, ఆ శీతల జలములందు స్నానమాచరించెను. తిరిగి తన శస్త్రములు ధరించి నడచుచుండగా ఆతనికి శ్రీగణేశ మంత్రోపాసన కావించుచున్న ముద్గల మహర్షి కానబడెను. ఆ మహర్షిని సామాన్యుడని తలచి, నామ తన ఖడ్గమును పైకెత్తి ఆ మహర్షిని సంహరించుటకు ఉద్యుక్తుడయ్యెను. కానీ చిత్రముగ ఆతని ఖడ్గము, శస్త్రములు అన్నియు జారి భూమిపై బడినవి. శ్రీగణేశ తీర్థ స్నానఫలము చేతను, మహానుభావుడయిన ముద్గల మహర్షి దర్శన భాగ్యము చేతనూ ఆతని రాతి హృదయము కరుగ నారంభించెను. అంత ముద్గలుడు ఆ దుష్ట జాలరిని కాంచి చిరునవ్వు నవ్వెను. నామకు ఇదేమియు అర్థముగాక ఇట్లనియె “ఓ! మహర్షీ!! ఏమి చిత్రము!!! ఈ శస్త్రములు ఏల ధరిత్రిపై బడినవి? నేను బాల్యావస్థ నుండి ఎన్నో పాపకృత్యములు ఆచరించితిని. నా హృదయము ఇనుము ఆయస్కాంతము చే ఆకర్షితమైనటుల, పాపాచరణమందు స్వాభావికముగ ఆకర్షణ మయ్యెడిది. కానీ నేడు అదంతయు దుష్కర్మ అనియు, ఇహపై ఆ దుష్కర్మము ఆచరింపరాదనియు మనసున తోచుచున్నది. నేను ఇక నా జీవితమందు ఈ శస్త్రములు ధరింపను. మీరు నా యందు దయచూపి ఈ భవసాగరము

నుండి తరించు తరుణోపాయమును తెలుపవలసినది. సత్పురుషులు పాపులను, పతితులను, దీనులను అనుగ్రహించెదరు అని వింటిని. స్పర్శవేదిని స్పర్శించిన ధాతువులు బంగారమయినట్లు, సత్పురుషుల సమాగమము వృధాపోదు.”

అంత శరణాగతవత్సలుడయిన ముద్గలుడు, శరణుజొచ్చిన వానిని విడచుట మహాదోషమని తలంచి ఇట్లనియె “దానాది ధార్మిక కార్యక్రమములు విధి విధానముగ ఆచరించిన ఎడల పాపక్షయము జరుగును. కానీ నీవు అందులకు అర్హుడవు కాదు. అందువలన నేను నీకు శ్రీగణేశనామమంత్రమును ఉపదేశము గావించెదను. నీవు ఈ స్థలమునందే కూర్చొని, నిద్రాహారములు మాని, కేవలము వాయుభక్షణ చేయుచూ, మంత్రోపాసన కావింపుము. నేను నా దండమును నీ ఎదుట ఈ భూమిపై పాతుచున్నాను. ఈ దండము చివురించి, పత్రపుష్పమయమగువరకు, మరియు నేను తిరిగి వచ్చు వరకు ఈ జపము ఈ విధముగనే కొనసాగింపవలసినది. నిత్యము ప్రాత:కాల, సాయంకాలాదులందు ఈ దండమునకు జలములు పోయవలసినది” అని పలికి, ముద్గల మహర్షి ఆ జాలరికి “గణేశాయ నమ:” అను నామమంత్రముపదేశించి, అంతర్ధానుడు అయ్యెను. నామ ఆ మహర్షి తెలిపిన విధి విధానములను ఆచరించుచూ, ఒక వేయి వత్సరములు నిరాహారుడై, వాయుభక్షణ గావించుచూ, జితేంద్రియుడై, నామ జపమందు సంలగ్నుడయ్యెను. అటుపిదప ఆ దండమునందు అంకురములు మొలచుట ప్రారంభించెను. అది గమనించిన నామ ఏకాగ్రతతో శ్రీగణేశ నామజపము గావించుచూ ముని కొరకై నిరీక్షించుచుండెను. ఆ సమయమున ఆతని శరీరము చుట్టూ పుట్టలు పుట్టి, శరీరమును క్రిమికీటకములు తినివేయుట చే కేవలము కనులు, అస్తులు మిగిలినవి. దైవ వశమున ముద్గల మహర్షి తిరిగి ఆ ప్రదేశమునకు వచ్చి, అకుంఠిత దీక్షతో నామజపమాచరించుచున్న నామను, అంకురములు మెలచిన తన దండమును కాంచెను.

దుష్టుడయిన జాలరి మహామునులకు సహితము సాధ్యము కాని దుష్కరతపము ఆచరించెను. అంత మహర్షి ఆ పుట్టలను తొలగించి, క్రిమికీటక యుక్తమయిన నామ శరీరముపై తన కమండల జలమును ప్రోక్షించి శుభ్రపరచి ఒక అద్భుత దృశ్యమును కాంచెను. ఆ మహర్షికి నామ స్థానమున శ్రీగణేశరూపధారి అయిన ఒక దివ్యపురుషుడు కనిపించెను. ఆతని ముఖమున తొండము కలిగియుండి, నిరంతర శ్రీగణేశ నామమును జపించుచుండెను. అంత ముద్గలుడు ఆతనిని మేల్కొలిపెను. నామ తన కనులు తెరచిన వెంటనే ఒక అగ్ని వంటి దివ్యతేజము ఆతని కన్నులనుండి వెలువడి ఆకాశమున కెగసెను. ఆ తేజము లోకులను దగ్ధమొనర్చు శక్తికలది. అంత ముద్గలుడు ఆ దివ్య తేజమును తన శక్తితో నివారించెను. అంత జాలరి తన గురువును దర్శించి, అత్యంత ఆనందమనస్కుడై, పుత్రుడు తన తండ్రిని కౌగలించుకొని నట్లుగ ఆ ముద్గల మహర్షిని గాఢాలింగన మొనర్చెను. శ్రీగణేశ నామజపముచే సంపూర్ణముగ పరిశుద్ధుడై, వల్మీకము నుండి బయటకేతెంచిన నామను తన పుత్రునిగ భావించి, ముద్గల మహర్షి ఆతనికి పున: నామకరణమొనర్చెను. ఆతని రెండు కనుబొమల మధ్య (భ్రూ) నుండి తొండము (శుండము) ఉద్భవించినది కావున ఆతనికి “భృశుండి” అని నామకరణ మొనర్చెను. తదుపరి ముద్గలుడు భృశుండికి శ్రీగణేశ ఏకాక్షర మంత్రముపదేశించి, ఈ విధముగ వరమునిచ్చెను “నీవు ఇంద్రాది దేవతలకు, సిద్ధులకు సహితము పరమ పూజ్యుడవగుదువు. నీవు ఈ రూపమున ప్రఖ్యాతుడ వగుదువు. నీ దర్శనము కలిగిన మానవులు కృతకృత్యులగుదురు. నా ఆశీర్వాద బలముచే నీవు ఒక లక్ష కల్పములు జీవించెదవు”

అటుపిదప ఇంద్రాది దేవతలు, నారదాది దేవర్షులు, ఆతని దర్శనార్థము ఏతెంచి, నమస్కరించి, పూజించి, “ఓ! భృశుండి మహర్షీ! నీవు సాక్షాత్ శ్రీగణేశ భగవానుడవు, మరియు మాకందరకు మిక్కిలి వందనీయుడవు. నీ దర్శనముచే మా జన్మము, విద్య, తపస్సు, మాతాపితరులు, వంశము సహితము సార్థకమయ్యెను.” అంత భృశుండి మహర్షి వారందరినీ యధావిధిగ పూజించి, ప్రణామములాచరించి, వారు వెడలిన పిదప ఒక సుందర శ్రీగణేశమూర్తిని స్థాపించి, షోడశోపచారములచే పూజనమాచరించుచూ, నిరంతర ఏకాక్షర మంత్రమును జపించుట ఆరంభించెను. ఆ ప్రదేశమంతయు

ఒక సుందర ఆశ్రమముగ మారి అనేక పుష్పఫలయుత వృక్షములు అమరెను. జన్మవైరము గల జంతువులు సహితము అచట తమ వైరమును మరచి ప్రవర్తిల్లుట మొదలిడెను. ఈ విధముగ ఒక వేయి వత్సరమలు గడచిన పిదప శ్రీగణేశుడు ప్రసన్నుడయి, ఆయనకు దర్శనమిచ్చి ఇట్లనియె "భృశుండీ! నీవు కృతకృత్యుడవయి నా సారూప్యము నొందితివి. నీవిక తపస్సు చేయనవసరము లేదు. నీ ఆయువు పూర్ణమయిన పిదప నీవు నా సాయుజ్యము నొందెదవు. ఈ ప్రదేశము "నామలక్షేత్రము" గ ప్రసిద్ధి నొందును. ఇచట అనుష్ఠానము ఒనర్చు సాధకులు నానా విధములయిన సిద్ధుల నొందెదరు. ఇచట మూర్తిని దర్శనము గావించు మానవులు పునర్జన్మ నొందరు. విద్యార్థులకు జ్ఞానము, పుత్రహీనులకు పుత్రులు కలుగుదురు." ఈ విధముగ వరములొసంగి శ్రీగణేశుడు అంతర్ధానమొందెను. ఇంద్రుడు శూరసేనునకు ఈ ఆఖ్యానమును వినిపించి "శూరసేనా! నీకు భృశుండి చరితమును వినిపించితిని. ఇంకనూ ఏమి అడుగ దలచితివి?" అని ప్రశ్నించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి భృశుండి చరితమను ఏబదిఏడవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఎనిమిదవ అధ్యాయము

(సంకష్ట చతుర్థి మాహాత్మ్యము)

శూరసేనుడు "మహేంద్రా! మహానుభావా! మీ కథామృతము చే నేను ధన్యుడనయితిని. ఇపుడు ఏ ఉపాయముచే తిరిగి మీ విమానము యానమునకు సిద్ధమగును? దీని నిమిత్తమై నేనేమి చేయగలవాడను?" అంత ఇంద్రుడు చిరునవ్వుతో "రాజా! నీ రాజ్యమందు ఎవరేని బ్రాహ్మణుడు లేక క్షత్రియుడు తాను కావించెడు సంకష్టచతుర్థి వ్రతము ఒక వర్షఫలమును మాకు ధారపోసినట్లయిన ఈ విమానము తిరిగి పయనమగును. లేని ఎడల ఆయుత (పదివేలు) మంది మానవుల పుణ్యమర్పించినప్పటికీ ఈ విమానము పైకిలేచుట కల్ల." అంత మహారాజు "మహాప్రభో! ఈ సంకష్ట చతుర్థి వ్రతమును ఎట్లు కావింపవలెను? దాని వలన ఏవిధమయిన పుణ్యమంకురించును? దాని ఫలితమేమి? దాని విధి విధానములెట్టివి? ఏ దేవతను ఆరాధింపవలెను? ఏరకమయిన సిద్ధులు ఈ వ్రతముచే సంభవించును? పూర్వకాలమందు ఈ వ్రతమును ఎవరు ఆచరించిరి? ఈ విషయములన్నియు దయచేసి విస్తారముగ తెలుప వలసినది." ఇంద్రుడు "శూరసేనా! ఈ విషయమై ఒక పురాతన ఇతిహాసమున్నది. అందు నారద కృతవీర్య సంవాదమున్నది. అద్దానిని నీకు వివరించెదను."

పూర్వకాలమందు "కృతవీర్యుడు" అను రాజు కలడు. ఆయన అమిత బలశాలి, సత్యవాది, దానశీలి, స్వాభిమాని, యాజ్ఞికుడు, జితేంద్రియుడు, మితభోజి, సురభూసుర పూజా తత్పరుడు, ఆసంఖ్యాక చతురంగబల సేనా సమాన్వితుడు. ఆయన సహ్యాద్రి క్షేత్ర నివాసి. ఆయన భవనమందు సర్వము బంగారమే! ఆయన పాకశాల యందు సహితము బంగారు పాత్రలే వాడుదురు. ఆయన భోజన సహపంక్తియందు అనుదినము పన్నెండు వేలమంది బ్రాహ్మణులు భోజనము చేసెడివారు. ఆయన ధర్మపత్ని "సుగంధ". ఆ తల్లి అత్యంత ధర్మపరాయణ, లోకోత్తర సుందరి, మరియు మహా పతివ్రత. ఆమె ఆపాదమస్తకము దివ్యభూషణములతో అలంకృతయై, ఎల్లప్పుడూ దేవ, బ్రాహ్మణ, అతిథి సేవా పరాయణత్వమునందు నిమగ్నమై యుండెడిది. ఆ రాజదంపతికి దేనికీ కొదవలేదు. కానీ వారికి సంతతి లేకుండెను. పుత్రప్రాప్తికై వారు చేయని వ్రత, దాన, తపో, యజ్ఞ, నియమపాలన, ప్రచురదక్షిణ, తీర్థాటనము లేదు. అయిననూ పూర్వజన్మ కృత పాపవశమున వారికి పుత్రసంతతి కలుగకుండెను. చివరకు ఆ రాజదంపతి నిరాశ, నిస్పృహలకులోనై, తన రాజ్యము, ధనము, సర్వము తన అమాత్యులకొసంగి వల్కాజినములు ధరించి వనములకేగిరి. అచట వారిరువురు

జితేంద్రియులై, ఆహార నియంత్రణము గావించి, వృక్షముల నుండి రాలిన పత్రములు మాత్రమే భుజించుచూ, వాయుభక్షణ చేయుచూ తపమొనర్చసాగిరి. ఇరువురి శరీరములు క్రిమి కీటకాదులచే తినివేయబడుటచే కేవలము కన్నులు, శల్యములు తప్ప ఇంకేవియును మిగులకుండెను.

వీరిరువురినీ చూచి నారదమహర్షి పితృలోకమునున్న కృతవీర్యుని తండ్రివద్దకేగి "మర్త్య లోకమునున్న నీ తనయుడు సంతానలేమితో తపమొనర్చుచూ అత్యంత శుష్కించియున్నాడు. ఆతడి పరిస్థితి నేడో, రేపో అన్నట్లు యున్నది. పుత్రసంతతి కలిగిన ఎడల ఆతడు జీవితుడగును. లేని ఎడల స్వర్గస్థుడగును" అని పలికి నారదుడు బయలుదేరెను. ఆ సమయమున నారదుడు ఒక విచిత్ర సంఘటన కాంచెను. భృశుండి మహర్షి యొక్క తల్లిదండ్రులు, పత్నీ, పుత్ర పుత్రికలు, అందరూ కణకణ మండుచున్న అగ్నిజ్వాలలతో కూడిన కుంభీపాక నరకమందు అధోముఖులై పడవేయబడి, యమభటులచే తీవ్రముగ దండింపబడు చుండిరి. కరుణానిధి అయిన నారదమహర్షి అత్యంత ఆశ్చర్యచకితుడై, తక్షణము ఆ విషయమును భృశుండి మహర్షికి ఈ విధముగ ఎరింగించెను "మహర్షీ! నీవు శ్రీగణేశ సారూప్యుడవు. కపిలాది మహర్షులు నీ దర్శనమును కేతెంచెదరు. అయిననూ నీ మాతాపితరులు, పుత్రీ పుత్ర బాంధవులు కంభీపాక నరకమందు శిక్షలననుభవించుచున్నారు. నీవు సర్వజ్ఞుడవు, అందువలన నీ పూర్వజుల ఉద్ధారమునకై ప్రయత్నింపవలసినది." అంత భృశుండి మహర్షి మిక్కిలి వ్యధతుడై, ఉపాయము కొరకు చింతించి, చివరకు తన సంకష్ట చతుర్థి వ్రతము చే జనితమై పుణ్యమును వారికి ధారపోసి శ్రీగణేశుని ప్రార్థించెను. ఆ వ్రత మహిమ చే ఆ మహర్షి కుటుంబీకులందరూ కుంభీపాకము నుండి విముక్తులై, దేవతా స్వరూపమొంది, అప్సరసల ద్వారా సేవింపబడుచూ, చారణులచే ప్రశంశింపబడుచూ, గంధర్వుల ద్వారా గానము చేయబడుచూ శ్రీగణేశ సదనము చేరిరి. వారితోపాటు కుంభీపాకమునందున్న ఇతర పాపులు సహితము శ్రీగణేశుని చేరిరి. ఇదంతయు భృశుండి ధారపోసిన ఒక్క దినపు సంకష్ట చతుర్థి పుణ్యము మూలముగ జరిగినది. ఇక ఎవరేని సాధకుడు జీవితకాలము సంకష్ట చతుర్థి వ్రతము ఆచరించిన ఎడల అద్దాని పుణ్యఫలము తెలుపుటకు శేషుడు సహితము సరిపోడు. అందువలన సంకటహార చతుర్థి ఫలముచే నా విమానము సహితము తిరిగి ప్రయాణించును."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి సంకష్ట చతుర్థి మాహాత్మ్యము అను ఏబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది తొమ్మిదవ అధ్యాయము

(బ్రహ్మ, కృతవీర్యపిత సంవాదము)

శూరసేన మహారాజు "మహేంద్రా! భృశుండి మహర్షి కుటంబీకులు స్వర్గమున కేగిన పిదప కృతవీర్యుని తండ్రి ఏమి చేసెను?" ఇంద్రుడు "నారదుని ద్వారా తన వంశ విచ్ఛేదనమును గూర్చి వినిన కృతవీర్యుని తండ్రి దు:ఖితుడై, బ్రహ్మలోకమునకేగి, చతురానన దర్శనమొనర్చి, ప్రణామములు సలిపి ఇట్లనియె "పితామహా! నా పుత్రుడు అత్యంత ధర్మశాలి. సకల సద్గుణ సంపన్నుడు. ఆతడు సంతానము కొరకై సర్వ విధములయిన ప్రయత్నములు గావించెను. ఏవియును ఫలింపక తన రాజ్యమును మంత్రులకొసంగి, పత్నీసహితుడై విపినమున ఘోర తపమొనర్చుచూ శల్యావశిష్టుడై యుండెను. ఇంతటి సద్గుణ సంపన్నునికి పుత్ర సంతతిలేమికి కారణమేమి? ఏ ఉపాయముచే ఈతని పూర్వజన్మ పాపము నిష్కృతి యొందును? అయ్యది దయచేసి నాకు తెలుపవలసినది. అద్దానిచే నేను నా పుత్రుని జీవింపచేసికొందును." ఈ విధముగ మృదుమధురముగ పలికిన పలుకులు విని విరించి ఇట్లనియె "నీకు నీ పుత్రుని పూర్వజన్మ విశేషములను

తెలిపెదను. ఏకాగ్రచిత్తుడవై వినవలసినది. మీ రాజ్యమందే కొంత కాలమునకు పూర్వము "సామ" అను అంత్యజుడుండెడువాడు. ఆతడు అత్యంత పాపకర్ముడు. ఆతని దర్శనము సహితము పుణ్యనాశకము. ఒకానొకనాడు ఆ దుష్టుడు లోభగ్రస్తుడై, అత్యంత శాంత స్వభావులైన పన్నెండుమంది సద్బ్రాహ్మణులను వధించి, వారిని ఒక పర్వత కంధరమందు పారవైచి, తన గృహమున కేగెను. ఆ పాపి ఆ రోజు ఉదయము నుండి ఆహారము దొరకక పస్తుండి, జలములు సహితము త్రాగక, గృహమున కేగిన మరుక్షణము "గణేశా! గణేశా!! అని తన పుత్రుని ప్రియమార పిలచెను. తదుపరి తన పుత్రునితో కలసి, అత్యంత ప్రసన్నుడై భోజన మారగించెను. ఆ పాపికి తెలియకున్ననూ ఆ రోజు మాఘ కృష్ణ చతుర్ధి (సంకట హార చతుర్ధి).

కాలాంతరమున సామ వృద్ధుడై ఒకానొక కృష్ణపక్ష చతుర్ధీ తిధిన, చంద్రోదయము అయిన పిదప పంచత్వమొందెను. కానీ అజ్ఞానవశమునైననూ కావించిన ఒక్క కృష్ణ చతుర్ధి ఉపవాస ఫలితముగ ఆతడు దివ్య విమానమందారుఢుడై అప్సరసలు సేవలు చేయుచుండగా, దేవతల ద్వారా ప్రశంశింపబడుచూ స్వర్గమునకేగెను. తదుపరి పుణ్యశేషమున నీకు పుత్రుడై జన్మించెను. కానీ పూర్వజన్మ పాప ఫలితముగ పుత్రసంతతి లేకుండెను. ఓ! అనఘా! నీ పుత్రుడు పాప ప్రక్షాళనానంతరము పుత్రసంతతి నొందును" అని పలికెను. బ్రహ్మ పలుకులు విని కృతవీర్యుని తండ్రి కంపించుచూ "విధాతా! నా తనయునిచే కావింపబడిన బ్రహ్మహత్యా పాపము ఎట్లు ప్రక్షాళనమగును? అయ్యది ఎంతటి దుష్కరమయిననూ నాకు తెలియపరుచవలసినది." బ్రహ్మ "నీ పుత్రుడు సంకష్ఠ చతుర్ధి వ్రతమును విధి విధానముగ ఆచరించిన ఎడల ఆతడు పాపవిముక్తుడగును." రాజు "విరించీ! ఈ వ్రతాచరణము ఎట్లు కావింపవలెను? ఏ మాసమందు ఆరంభింపవలెను? ఆ విధానమంతయు సంపూర్ణముగ నాకు తెలుపవలసినది."

బ్రహ్మ "మాఘమాస కృష్ణపక్ష చతుర్ధినాడు ఉదయము చంద్రుడు వెడలిన పిదప వ్రతారంభము కావింపవలెను. తొలుత దంతధావనము కావించి, జలములందు ఇరువది ఒక్క మార్లు మునిగి స్నానమాచరించి తదుపరి నిత్య కర్మానుష్ఠానము కావింపవలెను. పిదప శ్రీగణేశ మంత్రజపము కావించి, జపానుష్ఠాన సమయమున నిరాహారిగ యుండి, నియమపాలన చేసి, పరనింద, దుష్కర్మ, తాంబూల చర్వణము, పరద్రోహము, తరచు జలపానము అనెడు కర్మలను సంపూర్ణముగ వర్జింపవలెను. సాయంకాలము తిలలు, రాచఉసిరి, మిశ్రమములతో అభ్యంగన స్నానమాచరించి, శ్రీగణేశుని ఏకాక్షర, షడక్షర లేక ఏదేని వైదికమంత్రము లేక శ్రీగణేశుని నామమంత్రము జపమొనర్పవలెను. పిదప శ్రీగణేశ ధ్యానము చే మనస్సును స్థిరమొనర్చి, ఒక ముహూర్తకాలము గడచినపిమ్మట గణపతికి షోడశోపచార పూజనమొనర్పవలెను. అనేక విధములయిన నైవేద్యములు, మోదకములు, అపూపములు, లడ్లు, అటుకులు, పాయసము, వివిధ చిత్రాన్నములు, చోష్య, లేహ్యములు, వ్యంజనములు సమర్పింపవలెను. నానా విధములయిన ఫలములు, తాంబూలము, దక్షిణ, ఇరువది ఒకటి దూర్వాంకురములు, పుష్పములు, దీపములు అర్పింపవలెను. చంద్రోదయమయిన పిదప తొలుత చతుర్ధితిధికి, పిదప శ్రీగణేశునికి, తదుపరి చంద్రునికి సమంత్రకముగ అర్ఘ్యము నీయవలెను. తదుపరి శ్రీగణేశుని ప్రార్ధించి తిరిగి క్షమాయాచన చేసి శక్తి కొలది ఇరువది ఒకటి, లేక పన్నెండు లేక పదిమంది బ్రాహ్మణులకు భోజనమిడి, దక్షిణలతో సంతుష్టి నొనర్పవలెను. పిదప శ్రీగణేశ చరితము విని, సంయమముతో భోజనము చేయవలెను. ఆ రాత్రి అంతయు గీత, వాద్య, భజనాదులతో జాగరణ మొనర్పవలెను. ఈ విధముగ ప్రతిమాసము కావించుచూ ఒక వర్ష పర్యంతము ఈ వ్రతమాచరించిన ఎడల నీ కుమారుని పాపము నష్టమగును. ఈ వ్రతమొనర్చు మానవులకు ఏ ఇతర కోరికలు యున్ననూ అవన్నియు సంపూర్ణమై, సర్వ సంకటములు దూరముగును.

శమీవృక్షమూలమున కూర్చొని ఉపవాసముండి, చంద్రోదయమగు వరకు ఈ వ్రతమును ఆచరింపవచ్చును. అంధులు, మూగవారు, జడబుద్ధులు, కుంటివారు, సహితము ఈ వ్రతమాచరింప వచ్చును. వారు సహితము అభీష్టసిద్ధి

నొందెదరు. ఈ వ్రతమాచరించు వ్యక్తి స్త్రీ, పుత్ర, ధన, రాజ్యాది దేనిని కోరిననూ, అయ్యది ప్రాప్తమగును. ఈ వ్రతమాచరించు మానవుడు వివిధ మాసములందు వివిధ భోజ్యపదార్ధములను భక్షించిన ఎడల, దాని వలన ఉత్తము సిద్ధి కలుగును. ఈ వ్రతమాచరించు దినము లందు శ్రావణమాసమున ఏడు లడ్లు; భాద్రపద మాసమందు కేలలము పెరుగు; అశ్వయుజ మాసమందు పూర్ణ ఉపవాసము, కార్తీక మాసమందు కేవలము పాలు; మార్గశీర్షమందు నిరాహారము; పుష్యమాసమందు గోమూత్ర పానము; మాఘమాసమందు తిలలు; ఫాల్గుణ మాసమందు ఘ్రుతము, చక్కెరల మిశ్రము; చైత్ర మాసమందు పంచ గవ్యములు; వైశాఖ మందు శతపత్రిక (గులాబీ ROSA CENTIFOLIA, CABBAGE ROSE); జేష్ఠ మాసమందు ఘ్రుతము, ఆషాఢ మాసమందు మధువు (తేనె); ఆహారముగ గ్రహింపవలెను. అంత కృతవీర్యుని తండ్రి "చతురాననా! అన్ని సంకష్ఠ చతుర్ధులకు సామాన్య ధర్మములు తెలుపబడినప్పటికీ "అంగారక చతుర్ధి"కి విశేష విధానములు ఎందుకు తెలుపబడినవి? దయచేసి తెలుప వలసినది. ఈ కధామృతము గ్రోలుటచే నాకు జిజ్ఞాస అధికమగుచున్నది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమలి బ్రహ్మ - కృతవీర్య పిత సంవాదమను ఏబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

అరువదియవ అధ్యాయము

(మంగళ చరితము, అంగారక చతుర్ధి మాహాత్మ్యము)

బ్రహ్మదేవుడు "రాజా! నీకు అంగారక చతుర్ధి మహిమను గూర్చి తెలిపెదను. మంగళవారము నాడు ఏతెంచే సంకటహార చతుర్ధిని "అంగారక చతుర్ధి" అని పిలుతురు. దీని విషయమై ఒక పురాతన ఇతిహాసమును నీకు తెలిపెదను. అవంతీ నగరమందు "భరద్వాజుడు" అను మహర్షి నివసించు చుండెడివాడు. ఆయన వేదవేదాంగ విశారదుడు, బుద్ధిమంతుడు, సర్వశాస్త్ర నిష్ణాతుడు, నిత్యాగ్నిహోత్రుడు, శిష్యులకు అధ్యాపనమందు తత్పరుడు. శ్రీగణేశుని లీలలు చిత్రములు సుమా! ఒకానొకనాడు ఆయన నదీ తీరమున కూర్చొని తన నిత్య కర్మానుష్ఠానమును కావించు చుండెను. ఆ సమయమున ఆయన దృష్టి ఒక అప్సరస పై బడి, ఆయన మనసు యందు సంభోగేచ్ఛ కలిగెను. శరీరము విక్షుబ్ధమై తక్షణము ఆయనకు వీర్య స్కలనమయ్యెను. ఆ మహర్షి అమోఘవీర్యుడు. స్కలితమయిన ఆ వీర్యము భూమి యందలి ఒక బిలము ప్రవేశించి, ఆచటనుండి జపాకుసుమ సంకాశుడు, ఆయిన ఒక దివ్య బాలకుడుదయించెను. అంత భూదేవి ఆ బాలకుని అత్యంత ప్రేమతో పెంచి, పోషించి, పెద్ద జేసెను. ఆ బాలకుడు ఏడేండ్ల ప్రాయమంకురించిన పిదప ఒకనాడు తన తల్లిని ఇట్లు ప్రశ్నించెను "తల్లీ! సర్వ జనుల వలెనేకాక నేను ఈ అరుణ వర్ణమున యుండుటకు కారణమేమి? నా తండ్రి ఎవరు? తెలుపవలసినది. అంత ధరిత్రి "నాయనా! నీ తండ్రి భరద్వాజ మహాముని. ఆయన స్కలిత వీర్యమును నేను ధరించుట వలన నీవు ఉద్భవించితివి. నీవు నా తనయుడు కావున నిన్ను నేను పెంచుచున్నాను," అని పలికెను. అంత ఆ బాలుడు "తల్లీ! నాకు ఆ తపోనిధి దర్శనము కావింపవలసినది" అని వాక్రుచ్చెను. అంత ధరణీదేవి ఆ బాలుని తీసికొని భరద్వాజ మహర్షి వద్దకేగి, జరిగిన విషయమలన్నియు ఆయనకు ఎరింగించి, ఆ బాలుని ఆయనకు అప్పగించి, అంతర్ధానమయ్యెను.

భరద్వాజ మహర్షి ఆ బాలుని చూచి, ముచ్చటపడి, ఆ బాలుని కౌగిలించి, మూర్ధ్నమును ఆఘ్రాణించి, తన ఒడిలో కూర్చుండబెట్టుకొనెను. తదుపరి ఒక శుభ ముహూర్తమున ఆ బాలునికి ఉపనయనాది కర్మలు ఒనరించి, వేదశాస్త్రాదులందు శిక్షణనిచ్చి, శ్రీగణేశ మంత్రమును ఉపదేశించి ఇట్లనియె "పుత్రా! నీవు శ్రీగణేశుని ప్రసన్నుని ఒనర్చుటకై

చిరకాలము ఈ మంత్రానుష్ఠానము నొనర్పుము. ఆ స్వామి ప్రసన్నుడయిన, ఆయన నీ మనో వాంఛితములన్నింటినీ పూర్ణమొనర్చును.” అంత ఆ బాలుడు నర్మదా నదీతీరమునకేగి, పద్మాసనస్థితుడై, ఇంద్రియములను నిగ్రహించి, హృదయదేశమున శ్రీగణేశమూర్తిని యుంచి, తన తండ్రి ఒసంగిన శ్రీగణేశ మంత్రమును జపించుచూ ధ్యానమగ్నుడయ్యెను. ఆ బాలుడు కేవల వాయుభక్షణ చేయుచూ, ఒక వేయి వత్సరములు గడచిన పిమ్మట ఒకానొక మాఘమాస కృష్ణపక్షమున నిర్మల చంద్రోదయమయిన పిదప శ్రీగణేశుడు ద్విభుజరూపుడై ఆతనికి దర్శనమిచ్చెను. ఆ స్వామి సుందరమయిన తొండము, దివ్యాభరణ భూషితుడై, ఫాల భాగమున చంద్రుడు, హస్తములందు నానావిధమయిన ఆయుధములు ధరించి, కుండలాలంకృతుడయిన శూర్పకర్ణుడై, కోటిసూర్య ప్రకాశుడై విరాజిల్లుచుండెను.

ఆ పరాత్పరుని గాంచి భౌముడు (భూమి పుత్రుడు) “విఘ్ననాశకా, విఘ్నకర్తా, సురాసురులకు స్వామీ! సర్వ శక్తులను వృద్ధి చేయగల పరమేశ్వరా! నీకు నమస్కారము. నిత్య, నిర్గుణ, నిరామయా (నిర్దోషా), త్రిగుణములను విచ్ఛేదమొనర్చు స్వామీ! సృష్టి స్థిత్యంతకారకా! బ్రహ్మవేత్తలందు శ్రేష్ఠుడా, మరియు బ్రహ్మరూపా! నీకు నమస్కారము. లక్ష్యాలక్ష్య స్వరూపా! దుర్లక్షణ నాశకా! గణనాథా, పరమేశ్వరా! నీకు నమస్కారము.” ఈ స్తుతికి ప్రసన్నుడై శ్రీగణేశుడు కోమల స్వరముతో ఇట్లనియె “నీ కఠోరతపస్సుకు, భక్తికి అత్యంత పిన్న వయస్సునందే నీ ధైర్య సాహసములకు నేను సంతసించితిని. నీ వాంఛిత వరమును కోరుకొనుము.” అంత భౌముడు “ఓ! దేవేశ్వరా! నీదర్శనముచే నా జన్మము, కులము, జ్ఞానము, కన్నులు, పర్వత సహితమయిన ఈ ధరణి, తపము, నా ఆవాసము, వాణి, సర్వము ధన్యమయినవి. నేను కేవలము మూఢభక్తి భావముతో మీ స్తుతి కావించితిని. స్వామీ! మీరు ప్రసన్నులయిన ఎడల నాకు ఈ వరములు ప్రసాదింపవలసినది “నాకు అమృతపాన మొనరింపవలెనని యున్నది. నాకు స్వర్గ నివాసము ప్రసాదించి, నన్ను “కళ్యాణకారకుడు” లేక “మంగళుడు” అని ప్రఖ్యాతమొనర్ప వలసినది. నాకు మీ పుణ్యప్రద దర్శనము కృష్ణచతుర్థీ తిథి యందు అయినది కావున ఈ తిథిని సర్వ సంకటహారిణిగా చేసి ఈ వ్రతమొనర్చు సాధకులకు వారి మనోకామనలను పూర్ణమొనర్పవలసినది.”

అంత శ్రీగణేశుడు “ఓ! భూమిపుత్రా! నీవు దేవతలతో సమానముగ అమృత పానమొనర్చెదవు. నీవు భూలోకమున “మంగళుడు” అను నామమున ప్రసిద్ధుడగుదువు. రక్త వర్ణుడవు కావున “అంగారకుడు,” “లోహితాంగుడు,” “లోహితుడు” అని కూడా ఖ్యాతి నొందెదవు. అంతేకాక నీవు భూమి పుత్రుడవు కావున “కుమారుడు”, “కుజుడు”, “భౌముడు” అని సహితము విఖ్యాతుడవగుదువు. ఎవరు ఈ అంగాకర చతుర్థి వ్రతమాచరించెదరో వారికి ఒక వర్ష పర్యంతము సంకష్ఠహార చతుర్థి వ్రత ఫలము లభించి, సర్వ కార్యములు నిర్విఘ్నముగ సంపన్నమగును. నీవు ఈ సంకష్ఠహార వ్రతమును నిర్విఘ్నముగ చేయుట వలన నీవు ఈ అవంతీ నగరమునకు రాజువగుదువు. నీ నామ సంకీర్తన చే మానవుల సర్వ కామనలు పూర్ణమగును” అని పలికి శ్రీగణేశుడు అంతర్ధానుడయ్యెను. అంత భౌముడు సర్వాంగ సుందరమయిన ఒక శ్రీగణేశమూర్తిని నిర్మించి, అత్యంత భక్తి శ్రద్ధలతో స్థాపనమొనర్చి, దానిచుట్టూ సుందర మందిర సహిత ప్రాసాదము నమర్చి అద్దానికి “మంగళమూర్తి” అని నామకరణ మొనర్చెను. ఈ క్షేత్రము సర్వజన మనోకామనలను పూర్ణ మొనరించి, ఇచట కావింపబడు పూజానుష్ఠాన దర్శనములచే సర్వ ఇహలోక సుఖభోగములను ప్రసాదించి, చివరకు మోక్షమును కరతలామలకము నొనర్చు సిద్ధక్షేత్రముగ ప్రసిద్ధినొందెను. తదనంతరము ఒకనాడు శ్రీగణేశుడు ఈ భౌముని తన వద్దకు తెచ్చుటకు గణముల సహిత దివ్యవిమానమును పంపెను. ఆ గణములు మంగళుని ఆ భౌతిక దేహముతోనే శ్రీగణేశుని సన్నిధికి తీసికొని వెడలిరి. ఇది ఒక అత్యద్భుత ఘటన. అప్పటినుండి మంగళుడు త్రిలోకవిఖ్యాతుడయ్యెను. ఈ భాగ్యము మంగళునికి మంగళ వారయుక్త సంకష్ఠ చతర్థి వ్రతమూలమున సంభవించినది కావున అప్పటి నుండియు భూలోక మందు మంగళయుక్త సంకష్ఠ చతుర్థి “అంగారక చతుర్థి” గా ప్రఖ్యాతినొందెను. పారినేరపురమునకు పశ్చిమమున

మంగళునిచే స్థాపింపబడిన శ్రీగణేశమూర్తి మనోవాంఛితములను పూర్ణమొనరించునది కావున "చింతామణి గణపతి" అనీ, సర్వులను అనుగ్రహించును కావున "మంగళమూర్తి" అని ప్రఖ్యాతినొందినది. ఇప్పటికీ ఈ దేవాలయమునందు కృష్ణపక్ష చతుర్థి, చంద్రోదయమయిన పిదప మానవులే కాక సిద్ధ, గంధర్వులు సహితము పూజన మొనర్చెదరు. ఈ చింతామణి గణపతి ధనధాన్య సంపత్తిని, పుత్రపౌత్రాదులను, సమస్త మనోవాంఛితములను ప్రసాదించును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి "మంగళచరితము, అంగారక చతుర్థి మాహాత్మ్యము" అను అదువదియవ అధ్యాయము సమాప్తము)

అరువది ఒకటవ అధ్యాయము

(శశాంక ఉదంతము)

బ్రహ్మదేవుడు కృతవీర్యుని తండ్రితో తిరిగి ఇట్లనియె "ఓ! రాజా! నేను ఒక పర్యాయము కైలాసమునకేగితిని. మహేశునిచే సత్కరింపబడి, అచట ఆశీనుడనై, సర్వులతో ఇష్టాగోష్ఠి కావించుచుండగా అచటికి నారదమహర్షి ఏతెంచి ఒక దివ్య ఫలమును మహేశ్వరునకు అర్పించెను. ఆ ఫలమును తనకిమ్మని షణ్ముఖ, గజముఖ లిరువురు తమ తండ్రిని ప్రార్ధించిరి. అంత శివుడు నన్ను చూసి ఈ ఫలమును ఎవరికి ఈయవలెనని ప్రశ్నించెను. షణ్ముఖుడు కనిష్ఠుడు, బాలుడు కావున ఆతనికి ఈ ఫలయునీయమని నేను శివునికి తెలిపితిని. అంత శివుడు అట్లే కావించెను. తదుపరి నేను నా స్థలమున కేగి తిరిగి సృష్టి చేయ నారంభించితిని. కానీ నేను కావించిన కృత్యమునకు శ్రీగణేశుడు మిక్కిలి కృద్ధుడై, నా సృష్టికి అనేక విఘ్నములొనరించి, ఒక ఉగ్రరూపు ధరించి, నన్ను భయభీతుని, భ్రమితుని గావించెను. ఆ సమయమున చంద్రుడు తన గణముల సహితుడై, క్రూర రూపమునున్న గణపతిని కాంచి పరిహాసముగ నవ్వెను. అంత శ్రీగణేశుడు క్రుద్ధుడై చంద్రుని "చంద్రా! నీవు త్రిలోకముల యందును అదర్శనీయుడవు (దర్శించుటకు అర్హత లేనివాడవు) అగుదువు. ఒకవేళ ఎవరేని నిన్ను దర్శించిన వారికి మహాపాతకములు సంప్రాప్తించును". అంత శశాంకుడు మలినుడు, దీనుడై, దు:ఖసాగరమున మునిగి ఇట్లు తలంచెను "భగవానుడయిన శ్రీగణేశుని ఎడల ఏల నేను ఈ దుష్కార్యమాచరింప వలెను? తిరిగి నేను నా సుందరత, పూజనీయత, కళలతో దేవతలను ఎన్నడు సంతుష్టుల కావింతును?"

ఈ విధముగ జాబిలి తనలో తాను మధనపడుచుండగా, ఆ విషయము దేవతలకు తెలిసినది. ఇంద్ర, అగ్ని, ఆదిగాగల దేవప్రముఖులు విఘ్న వినాయకుని వద్దకేగి ఇట్లు పలికిరి "హే! భగవన్! మీరు ఇచ్ఛానుసారము జగత్తు యొక్క సృష్టిస్థిత్యంతములు కావింతురు. మీరు నిర్గుణులు అయినప్పటికీ త్రిగుణములకు కర్త మరియు త్రిమూర్తులకు స్వామి. ఈనాడు మేమందరము మిమ్ము శరణు జొచ్చుచున్నాము. మీ శాపము చే త్రిలోకములు తల్లడిల్లుచున్నవి. తారాపతి శశాంకుడు తమపట్ల అపరాధము అవశ్యము కావించెను. కానీ అద్దాని ప్రతిఫలము మేమందరము అనుభవించుచున్నాము. ఓ! త్రిభువనపతీ! జగత్కర్తా! చంద్రుని శాపవిముక్తుని గావించి మమ్ము, సర్వ లోకములను కాపాడవలసినది. ఎందుకనగా చంద్రుడు సర్వజీవుల జీవనమునకు ఆవశ్యకము. చంద్రుడు లేక త్రిలోకములు అనేక కష్టములకు గురి అగుచున్నవి. మీ స్వరూపమును వేదము లెరుగవనిన, మిమ్ము స్థుతించుటకు మేము ఎంతటి సమర్థులము? కానీ మీ దర్శనము చే నేడు మేమందరము కృతకృత్యులమయితిమి. ఓ! శరణాగత వత్సలా! అవ్యయా! మమ్ము రక్షింప వలసినది! మమ్ము రక్షింప వలసినది!! "అంత శ్రీగణేశుడు ప్రసన్నుడై" దేవ ప్రముఖులారా! మీ స్థుతికి నేను సంతసించితిని. మీ మనోవాంఛిత వరమును కోరుకొనవలసినది." అంత దేవతలు తిరిగి చంద్రుని శాపవిముక్తుని గావింపమని కోరిరి.

అంత శ్రీగణేశుడు "చంద్రునికి ఒక వర్షము లేక ఆరు నెలలు లేక మూడు నెలలు అదర్శనీయుత యుండును." అంత దేవ ప్రముఖులందరు ఆయన చరణములపై స్వర్ణ దండముల వలె పడిరి.

అతి వినీతులైన దేవతలను గాంచిన పరాత్పరుడు, శ్రీగణేశుడు అత్యంత భావోద్వేదమునకు లోనై ఇట్లనియె "నేను నా వచనమును మార్చుటకొల్లక ఏల భీష్మించుకొంటిని? నేను శరణాగతులను త్యజించు పాపము నెన్నటికీ చేయను. మేరు పర్వతము విరుగవచ్చు; సూర్యుడు తన కక్ష్య నుండి రాలవచ్చు; అగ్ని శీతలమవవచ్చు; సముద్రము చెలియలకట్ట దాటవచ్చు; కానీ నా వాక్యము అనృతమవదు. అందువలన దేవగణములారా! వినవలసినది. నేను నా శాపమును మార్పుచేయుచున్నాను. కేవలము భాద్రపదశుద్ధ చవితినాడు తెలిసిగానీ, తెలియక గానీ చంద్రుని దర్శించిన ఎడల వారు శాపగ్రస్తులై దు:ఖితులగుదురు. మిగిలిన దినములందు యధావిధిగ శశాంకుని చూడవచ్చు." అదివిని దేవతలు ప్రసన్నులయిరి. వారు శ్రీగణేశుని పై పుష్పవృష్టి కురిపించి, స్థుతించి, చంద్రునివద్దకేగి ఇట్లనిరి "తారాధిపా! నీవు శ్రీగణేశుని పరిహసించిన మూర్ఖుడవు. త్రిలోకములను సంకటమందు పడవైచిన మహాపరాధివి. త్రిలోకాధిపతీ, అవ్యయుడు, నిత్య, నిర్గుణ, పరబ్రహ్మస్వరూపుని ఎడల నీవు అపరాధము కావించితివి ఆయన నిన్ను దండించెను. కాన మేమందరము ఆయనను బ్రతిమాలి, ప్రసన్నుని కావించుటచే, ఆయన తన శాపమునుపహరించి, కేవలము భాద్రపద శుద్ధ చవితినాడు మాత్రమే నిన్ను చూడరాదని శాశించెను. నీవు దేవదేవుడయిన శ్రీగణేశుని శరణువేడుము. తిరిగి నీవు శుద్ధ శరీరుడవై త్రిలోక ప్రఖ్యాతి నొందెదవు." అంత ఇంద్రుడు నిశాపతికి శ్రీగణేశుని మహామహితాన్వితమయిన ఏకాక్షర మహామంత్రము **(గం)** ను ఉపదేశించెను.

శశాంకుడు ఆ మంత్రమును అత్యంత భక్తిశ్రద్ధలతో, ఏకాగ్రచిత్తుడై, సర్వసిద్ధి ప్రదాయకమగు గంగానది దక్షిణతటమున కఠోర తపమాచరించెను. అంత శ్రీగణేశభగవానుడు ప్రసన్నుడై ఆయన ఎదుట సాక్షాత్కరించెను. ఆ సమయమున ఆ పరాత్పరుడు రక్తవర్ణ వస్త్రము, రక్తవర్ణ పుష్పమాల ధరించి, రక్తచందన లేపనుడై, చతుర్భుజములు, మహాకాయము, గండమున సింధూరము, కలిగి తన ప్రకాశముతో త్రిలోకములను ప్రకాశితము కావించుచుండెను. ఆ రూపమును చూచి చంద్రుడు తొలుత కంపితుడై, తుదకు ధైర్యము తెచ్చుకొని, పరమభక్తిభావముతో ఆయనకు ప్రణామములర్పించి ఈ విధముగ స్థుతించెను. "సర్వ విఘ్నహారకుడు, చతుర్విధ పురుషార్ధ ప్రదానుడు, కృపానిధి, విశ్వరచనా దక్షుడు, బ్రహ్మమయుడు, విశ్వాత్మ, విశ్వబీజుడు, జగత్సంహారకర్త, అయిన శ్రీగణేశునికి నమస్కారము. వేద స్వరూపుడు, సర్వులకు బుద్ధి ప్రదాయకుడు, బుద్ధి ప్రదీప్తకుడు, దేవతలకు సహితము స్వామి, నిత్య సత్య నిష్కామునకు నమస్కారము. స్వామీ! నేను నా అజ్ఞాన వశమున దోషమొనర్చితిని. శరణాగతుడనైన నన్ను రక్షించి, క్షమింపవలసినది." అంత శ్రీగణేశుడు ప్రసన్నుడై అనేక వరములు ప్రసాదించుచూ ఇట్లనియె "శశాంకా! నీకు నీ పూర్వ వైభవములు తిరిగి ప్రసాదించుచున్నాను. కానీ భాద్రపద శుద్ధ చవితినాడు నీ దర్శనము తప్పక దు:ఖదాయకము. కానీ భాద్రపద కృష్ణ చతుర్ధినాడు నా పూజ కేవలము చంద్రోదయమయిన పిదప మాత్రమే కావింపవలెను. అంతేకాక నా పూజానంతరము నిన్ను సహితము పూజింతురు. ఆ రోజున ప్రయత్నపూర్వకముగ నిన్ను దర్శించి పూజింపవలెను. అట్లు కాని ఎడల జనులు కావించు సంకష్ఠ నాశక వ్రతము వృధాయగును. ఇప్పటి నుండి నీవు ఏక కళతో నా ఫాలభాగమున ఎల్లప్పుడూ వసింపుము. నీవు ప్రతిమాసమందు శుక్లపక్ష ద్వితీయ తిధినాడు (నెలపొడుపు) సర్వులకు నమస్కార యోగ్యుడవగుదువు."

అంత చంద్రుడు అత్యంత హర్షితుడై, దేవతల ఋషుల సహకారముతో ఆ గంగా దక్షిణ తటమున వదర వినాయకమూర్తిని "ఫాలచంద్ర" అని నామకరణమొనర్చి ప్రతిష్ఠించెను. తదుపరి చంద్రుడు ఆ మూర్తి చుట్టూ రత్నఖచిత సువర్ణ ప్రాసాదము నిర్మించి షోడశోపచార పూజన మొనరించెను. అఖిల దేవతలు, మునులు సహితము పూజనమొనర్చి ఈ ఫాలచంద్ర వినాయక క్షేత్రము సిద్ధక్షేత్రముగ ప్రఖ్యాతి నొందునని వరమొసంగిరి. శ్రీగణేశుడు సంతసిల్లి, వారి

నందరినీ దీవించి, తాను అంతర్హితుడయ్యెను. పిదప దేవతలు, ఋషులు, శశాంకుడు తమ తమ స్థానములకు నిష్క్రమించిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి శశాంక ఉదంతము అను అరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

అరువది రెండవ అధ్యాయము

(దూర్వాంకుర మహిమ; సులభ; సుముద్ర; మధుసూదన వృత్తాంతము)

కృతవీర్యుని తండ్రి "పితామహా! మీ దయచే కృష్ణపక్ష చతుర్థి వ్రతము యొక్క మాహాత్మ్యము గూర్చి వింటిమి. మీరు శ్రీగణేశునకు దూర్వాంకురములనిన ప్రీతియని తెలిపితిరి కదా! నాకు దూర్వాంకురముల యొక్క మహిమను గూర్చి వినవలెనని కుతూహలము కలుగుచున్నది. దయచేసి ఆ మాహాత్మ్యమును గూర్చి తెలుప వలసినది" అంత చతురాననుడు "నీకు తప్పక శ్రీగణేశునికి దూర్వాంకురముల సమర్పణచే కలుగు ఫలము తెలిపెదను ఏకాగ్రతతో వినవలసినది. దక్షిణ దేశమున "జాంబము" అను నగరము కలదు. అందు "సులభుడు" అను క్షత్రియ పుంగవుడుండెడు వాడు. ఆయన గుణవంతుడు, దానశీలి, ధనవంతుడు, బలశాలి అయినప్పటికీ వినయ వివేకశీలి, సామాన్యులను సహితము ఆదరించువాడు, శమదమాది సద్గుణ సంపన్నుడు, సర్వశాస్త్ర తత్వార్ధముల జ్ఞాత. నిత్యము శ్రీగణేశుని భక్తి పూర్వకముగ అనేక స్తోత్రములతో పూజించువాడు. ఆయన ధర్మపత్ని "సుముద్ర". ఆమె మిక్కిలి సౌందర్యరాశి, పరమ పతివ్రత, నిత్యము పతి, అతిథి సుర భూసుర సేవా తత్పరురాలు. ఇన్నిమాటలేల! ఆమె పరమ పతివ్రతా శిరోమణి. ఆ నగరమందు "మధుసూదనుడు" అను బ్రాహ్మణుడుండెడువాడు. ఆయన నిరంతర పరమేశ్వర ధ్యానముందుండెడివాడు. తన జీవనహేతువై మధూకర వృత్తి సలుపువాడు. ఎల్లప్పుడూ కుచేలుడు (చినిగిన వస్త్రములు ధరించువాడు) అయినప్పటికీ, దిగంబరుని వలె కానబడువాడు.

ఒకనాడు సులభ, సుముద్రలు తమ ప్రాత:స్నానాదులు, నిత్యకర్మానుష్ఠానము పూర్ణమొనరించుకొని, నిర్మలులై పురాణేతిహాసముల అర్ధములను పరస్పరము చర్చించు కొనుచుండిరి. ఆ సమయమున మధుసూదనుడు భిక్షాటనమునకై ఏతెంచెను. అంత సులభుడు ఆయనను చూచి ప్రసన్నుడై నమస్కరించెను. కానీ విధివశమున మనసున కించిత్ మూర్ఖత ఉద్భవించి ఆ పండితుని చూచి పరిహాసముగ నవ్వెను. అంత మధుసూదనుడు దానిని మిక్కిలి అవమానముగ భావించి, క్రోధ తామ్రాక్షుడై, త్రిలోకములను దగ్ధమొనర్పగల క్రోధముతో కంపించుచూ ఇట్లు శాపమిడెను "ఓరీ! దుర్బుద్ధీ! నీ దంతములన్నియు బయటపెట్టి నన్ను చూసి పరిహాసముగ నవ్వితివి కావున నీవు నిరంతరము బరువయిన కాడిమోయుచూ దు:ఖితుడవయిన వృషభ జన్మమొందుము." తన భర్తపై శాపమును వినిన సుముద్ర క్రోధమూర్ఛితురాలై, గాయపడిన సర్పిణి వలె బుసలు కొట్టుచూ "ఓరీ! దుష్ట బ్రాహ్మణా! ఎంత అవివేకివి. కొంచెము కూడా వెనుకముందులు ఆలోచించకుండా నా భర్తకు ఇంతటి దారుణ శాపమిచ్చెదవా? నీవు నిరంతరము బండ్లను లాగు గాడిదవై, మలభక్షణము గావించుచూ జీవింపుము" అని శపించెను. అంత బ్రాహ్మణుడు "నీవు స్త్రీవైయుండి, ఇంచుక సౌశీల్యము లేక నన్ను శపించితివి. అందువలన నీవు అత్యంత దోషయుక్త గుణములు కలిగి మలమూత్రములను భక్షించు ఛండాలినివిగా జన్మింపుము" అని ప్రతిశాపమిచ్చెను. ఎంత విచిత్రము! ముగ్గురు ఎంతటి ఉత్తములు! ఒక్క క్షణమందు కోపమునకు వశులై, దుష్కర శాపములకు గురిఅయితిరి కదా! శ్రీగణేశుని లీలలు చిత్రము.

ఈ విధమయిన పరస్పర శాపములతో సులభుడు వృషభముగనూ, మధుసూదనుడు గార్దభముగనూ, సుముద్ర

ఛండాలిని గనూ జన్మించిరి. వృషభమునకు నిరంతర వృత్తిచే అలసట చెందిననూ, విశ్రాంతికి సమయము దొరకక అత్యంత బాధనొందుచుండెను. ఛండాలిని నిరంతర ప్రాణిహింస, పిశాచవర్తిని, మలమూత్ర భక్షణాతత్పర, శుష్కించిన శరీరము, బయటకు వచ్చిన పెద్దపెద్ద దంతములు, వికటమయిన ముఖము కలిగి, అందరునూ ఆమెను చూచుటకు అసహ్యించు కొనెడివారు. గార్దభము సహితము వ్యర్ధ జీవితమును వెళ్ళబుచ్చెడిది. ఈ విధముగ వారు ముప్పురూ జీవించుచుండగా ఒకనాడు ఒక విచిత్రము జరిగినది.

నగరమునకు దక్షిణమున శ్రీగణేశుని ఒక అద్భుత ఆలయము కలదు. ఆయ్యది నానా ఫల, పుష్ప వృక్షములచే పరివేష్ఠితమయినది. అచట యోగులు సహితము తపమాచరించెడివారు. కొందరు శ్రీగణేశోపాసకులు యమ నియమాదులు ఆచరించుచూ సాధన కావించుచుండిరి. మరికొందరు తమ మనో, ధన, పుత్ర, మోక్షాది కామనార్ధము ఉపాసన చేయుచుండిరి. ఇట్లు కాలము గడచుచుండగా నెమ్మదిగా భాద్రపద మాసము ప్రవేశించి, ఇంటింటా శ్రీగణేశ మహోత్సవములు జరుగుచుండెను. అపుడు ఉన్నట్టుండి అతివృష్టి మొదలిడెను. ప్రకృతి అంతయు విజృంభించి, ప్రళయమును తలపోయుచున్నది. ఆ సమయమున ఛండాలిని భయభీతయై గృహ గృహమునకు మధూకరమున కేగెను. కానీ వారందరూ ఆమెను చీత్కరించి, శిక్షించి, బయటకు పంపిరి. ఆమె చలికి వణకుచూ, చేతిలో ఒక చిన్న అగ్నిశిఖను ధరించి నెమ్మదిగ పైన తెలిపిన శ్రీగణేశ మందిర ప్రాంగణమును చేరెను. అక్కడనూ ప్రజలు ఆమెను కొట్టబోయిరి. కానీ అచటగల యోగిపుంగవులు వారిని వారించిరి. అంత ఛండాలిని కొంచెము ఊపిరి పీల్చుకొని, శీతలము నుండి స్వేదతీరుటకై దూర్వాంకురములతో అగ్నిని మరికొంచెము ప్రజ్వాలన మొనర్చి, ఆ ఉష్ణము చే చలి నుండి బయటపడెను. ఆ సమయమున దైవయోగము చే అకస్మాత్తుగా ఒక దూర్వాంకురము వాయు ప్రచోదనమున ఎగిరి శ్రీగణేశుని శిరము పై బడెను. అదే సమయమున శీతలము చే బాధింపబడిన గార్ధభము, కాడినుండి విడువబడి బలవత్తరమయిన కాల ప్రచోదనముచే వృషభము సహితము శ్రీగణేశ మందిరము చేరినవి. అవి రెండునూ ఛండాలిని చే తేబడిన దూర్వాంకురములను భుజించి, మనుష్యులందరూ పరుండిన పిదప పరస్పరము యుద్ధమునకు దిగినవి. వృషభము కొమ్ములతోనూ గార్ధభము తోకతోనూ పరస్పరము హింసించు కొనుచున్నవి. అద్దానిచే దూర్వాంకురములు ఎగిరి శ్రీగణేశుని శిరమున బడినవి. అంత ఛండాలిని ఒక దండము గైకొని ఆ పశువుల రెంటినీ గట్టిగా దండించి, తదుపరి శ్రీగణేశుని ఎదురుగ యున్న ప్రసాదములను భక్షించుట ప్రారంభించెను.

ఈ లోపున పశువులు కావించుచున్న ధ్వనిచే పరుండిన భక్తజనము నిద్రాభంగమై లేచి, కృద్ధులై ఒక దండముతో వాటిని కొట్టి బయటకు తోలుటకు యత్నించిరి. నిద్ర నుండి లేచిన భక్తజనులను గాంచి ఛండాలిని బయటకు పరుగెత్తుటకు యత్నించెను. జనులు ఆమెను సహితము రాళ్ళతో కొట్టుచూ, దండముతో తాడించుచూ తరిమిరి. ఆ సమయమున మందిరపు బాహ్య ద్వారములు మూసి యుండుటచే, పశువులు, ఛండాలినీ జనులు తమను తరుముచుండుటచే బయటకు పోజాలక మందిరము చుట్టూ ప్రదక్షిణ పూర్వకముగ పరుగులెత్తుచూ ఆక్రందనమొనర్చిరి. ఆ ఆక్రందన పరాత్పరునికి వినిపించి, ఆయన వారి నుండి దూర్వాంకురమును పూజగా, పరుగులెత్తుటను ప్రదక్షిణగా భావించి, భాద్రపద శుక్ల చతుర్ధి యందు తనకు ఎవరు ఒక్క దూర్వాంకురము సమర్పించిననూ వారు తనకు అత్యంత మాననీయులని తలంచి, వారిని ఒక దివ్యవిమానమందు తన ధామమున కంపుటకు నిశ్చయించెను.

అంత పరాత్పరుడు తన సారూప్యులయిన గణములను గంధర్వాప్సరసల సహితులై సుగంధ పుష్ప భరితము, ధ్వజ పతాకయుక్తమయిన ఒక దివ్య విమానమందు ఆ ముప్పురినీ తన వద్దకు తెచ్చుటకంపెను. ఆ గణములు ఆ ముప్పురినీ తీసికొని శ్రీగణేశ సాన్నిధ్యమునకేగిరి. ఈ దృశ్యమును కాంచిన వారందరూ ఆశ్చర్య చకితులై "వీరికి ఏ పూర్వ పుణ్యమున ఈ సద్గతి పట్టినది? అని మనసున సమాలోచన కావించిరి. కొందరు యోగులు శ్రీగణేశ గణముల

వద్దకేగి ఆ విషయమై ఈ విధముగ ప్రశ్నించిరి. "ఈ ముప్వురు పరమ పాతకులు. వీరికి పుణ్య బలము లేశమాత్రము లేదు. అయినప్పటికీ వీరికి ఈ సద్గతి ఎట్లు కలిగినది? మేమందరము నిరంతర జ్ఞాన, యోగ, జప, తపానుష్ఠానము కావించినప్పటికీ లభించని దుర్లభమయిన శ్రీగణేశ దర్శనము వీరు ఎట్లు పొందగలిగిరి? మేము సహితము మా విధానములు విడచి అదే ప్రక్రియను అనుసరించెదము. దయచేసి తెలుపవలసినది."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి దూర్వాంకుర మాహాత్మ్యమును అరువది రెండవ అధ్యాయము సమాప్తము)

అరువది మూడవ అధ్యాయము

(అనలాసుర చరితము)

గణేశ గణములు "యోగి జనులారా! ఏకాగ్రతతో వినవలసినది "త్రిమూర్తులచే సహితము స్థుతింపబడెడివాడు, అనంత గుణ సంపన్నుడు అయిన శ్రీగణేశుని మహిమను వర్ణించుటకు ఫణిపతి, భాషాపతి అసమర్థులన, మేమెట్లు తెలుపగలము? పుణ్యతములారా! మా శక్త్యర్థము మేము తెలిపెదము. దూర్వాంకురముల మహిమను మునులు, దేవతలు సహితము తెలియరు. శ్రీగణేశునికి దూర్వాంకురార్పణము చే కలుగు పుణ్యఫలము ఇక ఏ ఇతర వ్రత, యజ్ఞ, తపో, దాన, హోమములచే సిద్ధించదు. ఈ విషయమై ఒక ప్రాచీన ఇతిహాసమున్నది. ఒకనాడు దేవర్షి నారదుడు త్రిలోకాధిపతి అయిన ఇంద్రుని దర్శించుటకు ఏగెను. ఇంద్రుడాదేవర్షిని యధాశక్తి పూజనమొనర్చి, సుఖాశీనుని కావించి ఇట్లు ప్రశ్నించెను "ఓ! మహామునీ! దేవదేవుడయిన శ్రీగణేశునికి దూర్వాంకురములనిన ఎందుకంత ప్రియము?" అంత నారదుడు "మహేంద్రా! ఈ విషయమై ఒక ప్రాచీనేతిహాసము కలదు. అద్దానిని నీకు తెలిపెదను. ప్రాచీనకాలమందు "స్థావరము" అను నగరము కలదు. అందు "కౌండిన్యుడు" అను మహాముని నివసించెడివాడు. ఆయన అనన్య తపోబల సంపన్నుడు, అచింత్య శ్రీగణేశోపాసకుడు. ఆ నగరమునకు దక్షిణమున ఈ మహర్షి యొక్క ఆశ్రమము విలసిల్లెడిది. ఆ ఆశ్రమము ఫల, పుష్పయుక్త వృక్షములచే పరివేష్ఠితమై, విరిసిన కమలములతో నిండి, స్వచ్ఛమయిన జలములు గల సరోవరములతో నిండియుండెడిది. ఆ జలములందు హంస, కారండవ, చక్రవాక, బక, జలకుక్కుటములు నిరంతరము ఆనందముతో కేరింతలు కొట్టుచుండెడివి. ఆ ఆశ్రమము నందు కౌండిన్య మహర్షి ధ్యానమగ్నుడై తీవ్రతపమాచరించుట ఆరంభించెను.

ఆయన తన ఎదుట చతుర్భుజుడు, వరదాభయ ముద్రాంకితుడు, అత్యంత ప్రసన్నమూర్తి అయిన శ్రీగణేశుని స్థాపించి, ఆయనపై అనుదినము దూర్వాంకురము నిడుచూ, షడక్షర మంత్రజపము చేయుచుండెను. ఆయన ధర్మపత్ని "ఆశ్రయ" సంశయచిత్తయై, పతిని సమీపించి ఇట్లనియె "స్వామీ! దూర్వాంకురములచే ఏ జీవి, జంతువు సహితము ప్రసన్నులవరు. అటువంటిది ఏ దేవత ప్రసన్నత నొందును? అనుదినము మీరు శ్రీగణేశునిపై ఏల దూర్వాంకురములు వేయుచున్నారు? అంత ఆ మహర్షి సంతోషించి "ప్రియా! దూర్వాంకురముల మాహాత్మ్యము గూర్చి ఒక ప్రాచీన ఇతిహాసమును నీకు తెలిపెదను. పూర్వకాలమున ధర్మరాజు రాజ్యమేలుచున్నపుడు ఒక గొప్ప ఉత్సవము జరుగుచున్నది. ఆ ఉత్సవము నందు దేవ, గంధర్వ, సిద్ధ, చారణ, నాగ, ముని, యక్షులు పాల్గొనిరి. ఆ సందర్భముగ అప్సరసలు నాట్యమాడుచుండిరి. ఆ సమయమున అప్సరస అయిన తిలోత్తమ తన నాట్యవిన్యాసము ఒనర్చుచుండగా, ఆమె పయ్యెద జారి క్రిందపడెను. ఆ నృత్యమును కాంచుచున్న యముని దృష్టి తిలోత్తమ యొక్క ఘన వక్షోజసంపద పై బడి, కించిత్ భ్రమితుడై, కామభావనా పీడితుడై, అవిశ్రాంతుడై, నిర్లజ్జుడై, ఆమెను గాఢముగ కౌగిలించుకొని, చుంబించవలెనన్న కోరిక కలిగి తత్ఫలితముగ

ఆయనకు వీర్య స్కలన మయ్యెను. అంత యముడు తిరిగి స్వస్థతనొంది, తన భావనలకు అత్యంత లజ్జితుడై, అధోముఖుడై ఆ సభను వీడి వెళ్ళెను.

అమోఘవీర్యుడయిన ఆయన వీర్యము భూమిపై బడి తత్కారణమున, అగ్నిశిఖలు వెదజల్లుచున్న వికృతముఖుడైన "అనలాసురుడు" అను మహాభూత ముద్భవించెను. ఆతడు జననమొందుచునే భయంకర రావమొనర్చి త్రిలోకములను భయభీతులొనర్చెను. ఆతని శిరము ఆకాశమును తాకుచూ, చూపులతో సమస్త ధరణీ మండలమును దగ్ధ మొనర్చుచుండెను. అంత సభాసదులందరూ అత్యంత భయకంపితులై, అనన్య తేజస్వి అయిన విష్ణు భగవానుని స్థుతించిరి. విష్ణువు వారందరితో కలసి అనామయుడయిన శ్రీగణేశుని వద్దకేగి ఇట్లు స్థుతించెను "ఓ! విఘ్నస్వరూపా! విఘ్నహర్తా, సర్వరూపా, సర్వసాక్షీ, మహాదేవా! జగదధికారా! నీకు నమస్కారము. ఓ! కృపానిధీ! జగత్పాలకా! పూర్ణ తమోగుణమయా, సంహారకారకా, నీకు నమస్కారము. భక్తులకు సర్వ వరప్రదుడవు, సర్వదాతవు, సర్వుల సర్వ కామనలను పూర్ణమొనర్చు మహానుభావా! నీకు నమస్కారము. వేదజ్ఞాతా, వేదకర్తా, నీవు తప్ప మా భయములను ఎవరు దూరమొనర్చగలరు? అకస్మాత్తుగా అకాల ప్రళయమేతెంచినది. ఓ! గజననా, దేవేశా, అవ్యయా! మాకందరకు మృత్యువాసన్నమయినది. ఇవన్నియు తెలిసి మమ్ములనేల ఉపేక్షించుచున్నావు? మమ్ము రక్షంపవలసినది! మమ్ము రక్షింప వలసినది!! అంత కరుణా సాగరుడయన శ్రీగణేశుడు వారి సమక్షమున ఒక శిశురూపమున ప్రకటితుడయ్యెను. ఆయన కమల దళాయతాక్షుడై, కోటి సూర్యుల ప్రకాశము, వందలాది చంద్రుల దీప్తి, కోటి కందర్పుల లావణ్యముతో, మల్లెమొగ్గల వంటి దంతములతో, దొండపండ్లవంటి పెదవులతో, ఉన్నతమయిన నాసిక, సుందరమయిన భృకుటి, శంఖము వంటి కంఠము, విశాలవక్షము, ఆజానుబాహువులతో, అమిత బలముతో, సుడులు తిరిగిన లోతయిన నాభితో, సుందర ఉదరముతో, బలిసిన కదళీతరువుల వంటి తొడలతో, పాదములకు రత్నఖచిత నూపురములతో, శరీరమంతయు దివ్యాభరణములతో, బహుమూల్య వస్త్ర పరివృతుడై అమిత శోభాయమానముగ విరాజిల్లుచుండెను.

ధర్మరాజ నగరమున తమ ఎదురుగ సాక్షాత్కరించిన శ్రీగణేశుని ముందు దేవతలు, మునులు, సర్వులూ దండము వలె నేలపైబడి సాష్టాంగ దండ ప్రణామములాచరించి, ఇట్లనిరి "ప్రభూ! మీరు ఎవరు? ఎక్కడి నుండి ఏతెంచిరి? మీ కార్యమేమి? అనలాసుర భయముచే మా కార్యము వీడి పరమాత్మను పూజించుటచే మాకు అభయమొసంగుటకు ఏతెంచిన పరమాత్మ మీరేనా!" వారి పలుకులు ఆలకించి చిరునవ్వు నవ్వుచూ బాలగణపతి ఇట్లనియె "మీరందరూ జ్ఞాన సంపన్నులు. మీ వాక్యములు సత్యము. మీ ప్రార్ధనచే ఆ అసుర సంహార నిమిత్తము ఏతెంచిన పరమాత్మను నేనే! నేను మీ కొక ఉపాయము తెల్పెదను. ఆ అసురుడు మీ కడకేతెంచినపుడు మీరు నన్ను వాని నుండి దూరముగ విసరివైచి, తదుపరి జరుగు వినోదమును వీక్షింపుడు." అంత దేవతలు హర్షితుడై పరమాత్ముడే బాల రూపమున ఏతెంచెనని సంతసిల్లిరి. అదే సమయమున కాలానల రూపధారి అయిన అనలాసురుడు సర్వమును దగ్ధమొనర్చుచూ అచటికేతెంచెను. అంత మునులు సర్వము మరచి "బాలకా! నీవు సహితము పారిపొమ్ము. తిమింగళము చిన్న చేపలను భక్షించునటుల ఈ దైత్యుడు నిన్ను సహితము సంహరించును" అని దశదిశలకు పరుగులెత్తిరి. కానీ బాలరూప గణేశుడు హిమాలయ పర్వతమువలె అచలుడై అక్కడనే నిలుచుండెను. దేవతలు సహితము భయకంపితులై దూరముగ తొలగిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి అనలాసుర చరితమను అరువది మూడవ అధ్యాయము సమాప్తము)

అరువది నాల్గవ అధ్యాయము

(అనలాసుర భంజనము)

ఆశ్రయ తన పతిని "దేవతలు, మునులు పలాయన మొనర్చిన పిమ్మట హిమాలయము వలె నిశ్చలుడై యున్న బాలగణపతి, అనలాసురుని మధ్య ఏమి జరిగినది? పతిదేవా! నాకు సర్వము సవిస్తరముగ తెలుపవలసినది." కౌండిన్యుడు "ప్రియసతీ! హిమాలయము వలె నిశ్చలముగ యున్న బాల గణపతి, ప్రళయాగ్ని కీలక శిఖ వలెయున్న అనలాసురుడు ఎదురెదురుగ నిలబడిరి. ఆ సమయమున అచల (పృధ్వి) తన అచలముల సహితముగ కంపించుట నారంభించెను. ఆకాశము అంతయు భయంకర మేఘ గర్జనలు మొదలయినవి. పక్షిగణములు వృక్షశాఖల నుండి క్రింద పడినవి. సముద్రములు ఇంకినవి. వృక్షములు సమూలముగ పెల్లగింపబడినవి. భూకంపముల మూలమున ఆ సమయమందు ఎవరికీ ఏదియునూ అర్ధముగాక, సర్వ జగత్తు భ్రమితమై, భయాంధోళనాభరితమైనది. అంత బాల గణపతి తన మాయా బలముచే ఆ అనలాసురుని ఒడిసిపట్టి సర్వులూ చుచుచుండగా, సునాయాసముగ అగస్త్యుడు సముద్రమును త్రావినటుల ఆ అనలుని మ్రింగివైచెను. అంత గణపతి "ఈ మహానలమును లోనికి మ్రింగిన ఎడల ఉదరము నందున్న లోకములు భస్మమగును. బయటకు పంపిన బయటి లోకములు దగ్ధమగునని దానిని కంఠమందుంచెను. కానీ ఆ మహాగ్ని శ్రీగణేశుని కంఠమును మండింప నారంభించెను.

అంత ఆ మహాగ్ని శమనమునకై ఇంద్రుడు శ్రీగణేశునకు చంద్రుని బహూకరించెను. ఆ అమృతము చిలకరించు నెలవంకను ఆయన తన లలాటముపై ధరించెను. తాపము తీరలేదు. అంత చతురాననుడు తన మనము నుండి సిద్ధి, బుద్ధులను ఇరువురు సుందర కన్యలను సృష్టించెను. వారిరువురు కమలనేత్రలు, ఉంగరములు తిరిగిన కురులతో, పూర్ణచంద్ర నిభాననలై, అమృత తుల్యమగు వాణిలో, కమలనాళము వంటి సన్నని నడుము, మెలిదిరిగి లోనికి యున్న నాభి, ఆ నాభిపై త్రివలీయుతమయిన ఉదరము, బలిసిన కదళీతరువుల వంటి ఊరువులు, ఎర్రని అరచేతులు, చల్లని స్పర్శ కలిగియుండిరి. అంత బ్రహ్మ శ్రీగణేశుని, వారిరువురినీ గాఢాలింగనమొనర్చిన ఆయన కంఠ తాపము తీరునని పలికెను. వారిరువురి గాఢాలింగనము చే ఆయన తాపము తీరలేదు. అంత విష్ణుదేవుడు అయనకు అమిత కోమలమయిన కమల పుష్పము నొసంగెను. అంత దేవ మానవులు శ్రీగణేశుని "పద్మపాణి" అని పిలచిరి. అయిననూ ఆయన కంఠతాపము తీరలేదు. వరుణుడు ఆయనను అత్యంత శీతల జలములతో అభిషేకించెను. అదియును నిష్ఫలమయినది. అంత శివుడు ఆయనకు సహస్రఫణుడయిన ఒక నాగమును సమర్పించెను. అంత గణేశుడా సర్పరాజమును తన ఉదరమునకు చుట్టుకొనెను. అంత సర్వులు ఆయనను "వ్యాళబద్ధోదరుడు" అని పిలచిరి. కంఠతాపము తీరకుండెను. అంత ఎనభై ఎనిమిది వేల మంది ఋషులు ఆయన వద్దకేతెంచి, ఒక్కొక్కరు ఇరువది ఒక్క దూర్వాంకురములు ఆయన మస్తకమందుంచిరి. తక్షణము ఆయన కంఠమందున్న అగ్ని శాంతించెను. అంత మిగిలిన సర్వులూ ఆయనను దూర్వాంకురములతో పూజించిరి.

అంత శ్రీగణేశుడు "నా ఎడల కావించిన ఎంతటి మహత్పూజనము లేక స్వల్ప పూజనమైననూ, దూర్వాంకురముల వినా అది వ్యర్ధమయి ఫలితము నీయదు. ప్రాత:కాల పూజనమందు నా భక్తులు ఒకటి లేక ఇరువది ఒకటి దూర్వాంకురములచే పూజనమొనర్చిన, దానిచే మహా ఫలితమబ్బును. వారికి వంద యజ్ఞములు, అన్ని దానములు, సర్వ వ్రతానుష్ఠానముల వలన కలిగెడు పుణ్యము కంటె అధిక పుణ్యము లభ్యమగును. కోటి జన్మల కఠోర తపాచరణము, నియమపాలనము కావించిననూ లభ్యమవ్వని పుణ్యఫలము దూర్వాంకుర సమర్పణ చే కరతలామలకమగును". ఈ పలుకులు వినిన దేవతలు తిరిగి శ్రీగణేశుని దూర్వాంకురముల చే పూజన మొనర్చిరి. అంత శ్రీగణేశుడు ఆనందముతో

రోదసీకుహరము ప్రతిధ్వనించునటుల ఒక తీవ్ర గర్జన చేసి, వారందరినీ అనుగ్రహించి, అంతర్హితుడయ్యెను. అంత దేవతలందరూ శ్రీగణేశునకు "కాలానల ప్రశమనుడు" అని నామకరణమొనర్చిరి. తదుపరి దేవతలు అచట ఒక దివ్య మందిరమును నిర్మించి, సుందర మూర్తి స్థాపనమొనర్చి, అత్యంత ప్రసన్నతతో "విఘ్నహర్త" అను నామమిడిరి. అక్కడ కావింపబడు వ్రత, దాన, తప, యజ్ఞములు విఘ్నహర్త గణపతి దయచే అనంత ఫలమొసంగును. ఆ ప్రదేశమున గణపతి అనలాసురునిపై విజయము ప్రాప్తినొందెను కావున, ఆ ప్రదేశమున నిర్మింపబడిన నగరము "విజయనగరము" అని ప్రఖ్యాతినొందినది". కౌండిన్యుడు "ఆశ్రయా! ఈ విధముగ నీకు దూర్వాంకుర మాహాత్మ్యమును గూర్చి సంపూర్ణముగ తెలిపితిని. ఇద్దాని శ్రవణము, పఠనము సర్వ పాప ప్రణాశకము. ప్రియా! నీకు ఇపుడు వేరొక దివ్య ఇతిహాసము తెలిపెదను."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి అనలాసుర భంజనము అను అరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

అరువది ఐదవ అధ్యాయము

(శ్రీగణేశుని చే జనకుని పరీక్ష)

కౌండిన్యుడు "ఒకనాడు నారదముని త్రిలోకములు సంచారము చేయుచూ చాలా కాలము పిదప శ్రీగణేశుని సందర్శనార్థము ఆయన వద్దకేగెను. నారదుడు ఆయనకు సాష్టాంగ దండ ప్రణామములాచరించి "స్వామీ. నేడు నా జన్మము సార్థకమయినది. నా పూర్వ పుణ్యములన్నియు ఫల స్వరూపమొంది నేటికి మరల మీ దర్శన భాగ్యమబ్బినది," ఈ విధముగ పలికి నారద మహర్షి చేతులు జోడించి నిలబడెను. అంత శ్రీగణేశ భగవానుడు ఆయన చేతులు పట్టి ఆసనమందు కూర్చుండబెట్టెను. నారదుడు మహదానందుడై ఇట్లనియె "ప్రభూ! ఒక పరమాశ్చర్యకరమైన ఘటన జరిగినది. నేను దానిని మీకు నివేదించి నా ఆశ్రమమునకు ప్రస్థానము కావించెదను." అంత శ్రీగణేశుడు సర్వజ్ఞుడయినప్పటికీ ఇట్లనియె "దేవర్షీ! ఆ ఆశ్చర్యకర ఘటనను నాకు విస్తారముగ తెలుపవలసినది." నారదుడు "స్వామీ! మిథిలా నగరమును జనకుడు అను మహారాజు పరిపాలించు చుండెను. ఆయన స్వాభిమాని, వదాన్యుడు (దానశీలి), వేదవేదాంగ పారంగతుడు, నిరతాన్నదానశీలి, యాచకులు ఏది యాచించిననూ దానిని వారలకు ప్రసాదించు సుమనస్కుడు. అయిననూ ఆయనకు ద్రవ్యమునకు కొదువ లేదు. దీనికి కారణమేమి? శ్రీగణేశునికి ప్రసన్నతయే దానికి కారణమా? అని నేను మనసున తలచి ఆయన దర్శనమున కేగితిని. ఆయన తన బ్రహ్మజ్ఞాన కారణమున నన్ను అవమానించెను. అయిననూ నేను ఇట్లంటిని "ఓ! రాజా! నీవు ధన్యుడవు. నీ శ్రీగణేశ భక్తి ప్రపత్తులచే, నీవు తలచిన కార్యము పూర్ణమై, వలయు పదార్థములన్నియు లభ్యమగుచున్నవి." అంత ఆ మహారాజు గర్వితుడై "నారదా! త్రిలోకముల యందునూ నేనే ఈశ్వరుడను, స్వామిని. నేనే దాత, భోక్త, రక్షకుడను, దానమిప్పించువాడను. త్రిలోకములందునూ నా స్వరూపమే వర్ధిల్లుచున్నది. నేను తప్ప వేరొకరు లేరు. కర్త, కారణము, కార్యసాధనము సహితము నేనే!" అంత నేను కించిత్ కృద్ధుడనై "రాజా! ఈశ్వరుడు వినా ఈ జగత్తునందు వేరొకరు కర్త కాదు. నీవు నీ ధర్మ కార్యములన్నియు డంభము చే ఆచరించు చుంటివి. నీకు దాని సాక్ష్యమును అతికొన్ని దినములలో నిరూపింతును." ఈ విధముగ పలికి తిన్నగా మీ వద్దకు వినతి చేయుటకు ఏతెంచితిని." ఈ విధముగ పలికి నారదుడు వెడలిపోయెను.

తదుపరి శ్రీగణేశుడు ఈ విషయమందలి నిజానిజములు తేల్చుటకు, జనకుని భక్తిని పరీక్షించుటకు ఒక కుష్టరోగి

రూపమును గొని మిధిలానగరమున కేగెను. ఆయన శరీరము నిండా వ్రణములుండి రక్తస్రావము జరుగుచుండెను. మార్గమున ఆతనిని చూచిన జనులు ఉత్తరీయముతో నాసికను మూసుకొనుచుండిరి. కొందరు దూరముగ జరుగుచుండిరి. ఆ వికృతరూపుని కొందరు బాలురు ఆశ్చర్యముతో అనుసరించుచుండిరి. ఆ కుష్ఠరోగి పడుచూ, లేచుచూ, కుంటుచూ, ఆపస్మారకుడగుచూ, తిరిగి తెలివి తెచ్చుకొనుచూ, ఇట్లు రాజద్వారము వద్దకేగి, అచట ద్వారపాలునితో "తాను అత్యంత క్షుదార్తుడనయిన వృద్ధ బ్రాహ్మణుడననీ, తనకు నచ్చిన భోజనమునకై యాచించుటకు ఏతెంచితిననీ రాజుకు తెలుపమని" పలికెను. ద్వారపాలకుడు లోనికేగి, యధావిధిగ నివేదించెను. అంత రాజు యొక్క అనుమతితో ఆ మలిన వస్త్రుని రాజ సమ్ముఖమున ప్రవేశపెట్టెను. జనక మహీపతి ఆ కుష్ఠరోగిని కాంచి ఒక్క క్షణము మనమున "ఈయన నన్ను పరీక్షించు కేతెంచిన పరమాత్ముడు కాదు కదా?" అని తలచి, ఆయనను ఆదరించి, సాదరముగ ఆహ్వానించెను. అంత వృద్ధ బ్రాహ్మణుడు "మహారాజా! నీ కీర్తి చంద్రకిరణముల వలె స్వచ్ఛమై, అకళంకితమై అలరారుచున్నది. అదివిని అత్యంత క్షుధార్తుడనైన నేను తగిన భోజనమునకై నీ కడకేతెంచితిని. నా ఆకలి తీరి తృప్తి కలుగువరకు నాకు భోజనము ఇప్పింప వలసినది. అట్లు కావించిన నీకు వంద యజ్ఞములు ఫలము లభించును." అంత రాజు సంతోషించి, ఆయనను లోనికి తీసికొని పోయి భోజనము పెట్టించెను. ఏమి ఆశ్యర్యము! మహారాజు యొక్క పాకశాల అంతయు ఖాళీ అయినది. అయిననూ ఆ వృద్ధ బ్రాహ్మణునికి ఆకలి తీరలేదు. తృప్తి కలుగలేదు.

అంత రాజు తన రాజ్యమందలి ప్రజలకు ఈ విషయము తెలియజేసెను. సర్వులు తమ ఇండ్ల నుండి భోజన పదార్ధములను తీసికొని వచ్చిరి. క్షణములో సర్వము ఖాళీ అయినది. ఆయిననూ వృద్ధ బ్రాహ్మణుడు తృప్తినొందలేదు. రాజపరివారము ఆ బ్రాహ్మణుని రాక్షసుడని తలంచి,వారు రాజునకు రాక్షసులకు ఏది ఇచ్చిననూ అయ్యది పుణ్య ప్రదము కాదని, రాక్షసులు తృప్తి నొందరనీ తెలిపిరి. ఇంతలో మరికొందరు ధాన్యము ఇచ్చిన ఎడల అయ్యది కడుపునింపునని సలహాఇచ్చిరి. అంత రాజు తన వద్దయున్న ధాన్యమును సమర్పించెను. ఆ వృద్ధ బ్రాహ్మణ కుష్ఠరోగి ఆ ధాన్యమంతయు భుజించి ఇంకనూ తృప్తినొంద లేదు. రాజు చేయునది లేక తలవంచుకొనెను. అంత ఆ వృద్ధుడు నగరములోని ప్రతి ఇంటికి ఏగి భిక్షాటన చేసెను. సర్వులు తమవద్దయున్న సర్వమును మహారాజగృహమున కంపితమని, వేరొక చోటికి పొమ్మని తెలిపిరి. అంత ఆ బ్రాహ్మణుడు "నేను ఈ రాజు యొక్క కీర్తి విని ఇచట కేతెంచితిని. క్షుధార్తుడనైన నేను తృప్తి కలుగక ఎచటి కేగుదును? అని ప్రశ్నించెను. ఆ పలుకులు విని పౌరులు మౌనము వహించిరి. ఆ వృద్ధుడు అట్లు తిరుగుచూ ఒక గృహమును కాంచెను. అందు విరోచన, త్రిశిర అను బ్రాహ్మణ దంపతి నివసించుచుండిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి శ్రీగణేశుని చే జనకుని పరీక్షయను అరువది ఐదవ అధ్యాయము సమాప్తము)

అరువది ఆరవ అధ్యాయము

(విరోచన - త్రిశిర చరితము)

కుష్ఠరోగయుక్తుడయిన ఆ వృద్ధ బ్రాహ్మణుడు నెమ్మదిగ వారి వద్దకు చేరెను. ఆ దంపతి కటిక దరిద్రులు. వారింట కూర్చుందుకు ఆసనములు లేవు. వండుకుందుకు వంట సామాగ్రి, గిన్నెలు కానీ లేవు. ఆ దంపతి కేవలము ఆయాచిత భోజనులు, అనగా యాచించకుండ వారికేమి దొరుకునో దానినే తినెదరు. కించిత్ జలపానముతో కడుపు నింపుకొని కేవలము ధర్మ కార్యాచరణము చేయుదురు. కానీ వారిరువురు అనన్య శ్రీగణేశ భక్తులు. వారింట శ్రీగణేశమూర్తి

పుష్ప పల్లవములతో అర్చింపబడి యున్నది. అంత వృద్ధ బ్రాహ్మణుడు అచటికేగి "నేను ఈ మిధిలానగరపు రాజు యొక్క కీర్తి విని, అత్యంత క్షుధా బాధితుడనై భోజన తృప్తి కొరకు ఆయన వద్దకు ఏతెంచితిని. కానీ నాకు ఏమాత్రము తృప్తి కలుగలేదు. డంభముతో కావింపబడు ధర్మ కార్యములు సహితము సత్వ గుణమును ప్రసాదింపలేవు. మీ ఇంట నాకు తృప్తి కలిగించు పదార్ధ మేదయిననూ ఈయ వలసినది." అంత దంపతి" ఓ! భూసురా! చక్రవర్తి మిమ్ము తృప్తి పరచుటకశక్యుడయిన, మా వంటి దరిద్రులు మిమ్ము ఎట్లు తృప్తి పరుచగలరు? అసంఖ్యాక నదులచే సహితము పూర్ణము కాని సాగరము ఒక్క జల బిందువుతో ఎట్లు నిండగలదు?" ద్విజుడు "భక్తితో ప్రసాదింపబడిన లేశమాత్రమయిననూ నాకు తృప్తిని ప్రసాదించును. భక్తిలేక డాంబికముతో ఈయబడిన పర్వతరాశుల వంటి భోజనము సహితము నాకు తృప్తినీయదు." దంపతి "ఓ! ద్విజశ్రేష్ఠా! మేము శపధము చేసి చెప్పుచున్నాము. మా ఇంట ఏ విధమయిన తినుబండారములు లేవు. ఉదయము శ్రీగణేశ పూజనమునకై తేబడిన దూర్వాంకురముల యందు ఒక్కటి మిగిలియున్నది." ద్విజుడు "పుణ్యభాగులారా! భక్తితో ఈయబడిన ఒక్క దూర్వాంకురమయిననూ సంపూర్ణ తృప్తి నొసంగును."

అంత విరోచన ఒక్క దూర్వాంకురమును అత్యంత భక్తి ప్రపత్తులతో ఆ ద్విజునకు సమర్పించెను. ఆ సాధ్వి ఆ దూర్వాంకురమునందు శాలి ధాన్యముతో వండిన అన్నము, పాయసము, వివిధ చిత్రాన్నములు, అనేక వ్యంజనములు, అనేక చోష్య, లేహ్యములను మనసున సంకల్పించెను. ద్విజుడు పరమభక్తితో ఈయబడిన ఆ దూర్వాంకురమును గ్రహించి భుజించెను. పరమభక్తియుతమయిన ఆ దూర్వాంకురము ఆయన జఠరాగ్నిని శాంతపరచుటచే ఆయన తృప్తుడయి త్రిపురుని గాఢాలింగన మొనర్చెను. ఆ వృద్ధ కుష్ఠ బ్రాహ్మణుని స్థానమున చతుర్భుజుడు, నాలుగు హస్తములందు కమలము, పరశువు, మాల, దంతధారి, రత్నఖచిత సువర్ణ ముకుటధారి, కుండలాలంకృతాంగుడు, దివ్య వస్త్రాంభరధారి, దివ్య గంధానులేపితుడయిన శ్రీగణేశుడు సాక్షాత్కరించెను. ఈ హఠాత్పరిణామమునకు ఆ దంపతి నివ్వెరపోయిరి. అంత శ్రీగణేశుడు "మీ ఇచ్ఛవచ్చిన మనోకామనలను కోరుకొనవలసినది" అని పలికెను. అంత ఆ పుణ్య దంపతి "ప్రభూ! మేమిరువురము ఎక్కడ జన్మించిననూ మీ పాదములయందు మాకు దృఢభక్తి యుండుగాక! ఓ! గజాననా! మాకు వేరొక కోరికలేవియునూ లేవు. మమ్ము ఈ భవసాగరము నుండి తరింపజేసి ముక్తి నొసంగవలసినది." అంత శ్రీగణేశుడు అత్యంత హర్షము నొంది, త్రిశరుని మరల కౌగిలించుకొని, వారికి ముక్తిని ప్రసాదించి, అంతర్ధానుడయ్యెను." కౌండిన్యుడు తన ధర్మపత్నికి ఈ ఆఖ్యానమును తెలిపి ఇట్లనియె "ఆశ్రయా! ఇందువలననే నేను అనుదినము శ్రీగణేశునికి దూర్వాంకురములు అర్పించుచుంటిని. అసంఖ్యాకమయిన భోజనరాశులతో సహితము తృప్తినొందని శ్రీగణేశుడు ఒక్క దూర్వాంకురముతో తృప్తి నొందెను. నేను నీకు దూర్వాంకుర మాహాత్మ్యమును తెలిపితిని. ఈ ఇతిహాసమును ఏ మనుజుడు భక్తి పూర్వకముగ వినిన, వినిపించిన, వారి మనోకామనలన్నియు పూర్ణమయి, పుత్ర, ధనాది సంపత్తులు కలిగి, ఇహపర లోకములందు ప్రసన్నత, ఆనందము కలుగును. వారికి అనన్య శ్రీగణేశ భక్తి ప్రాప్తించును. వారి భక్తి నిష్కామమయిన వారికి మోక్షము లభ్యమగును.

ఈ విషయములన్నియు తన భర్త ముఖతా వినినప్పటికీ, ఆశ్రయ హృదయమందు, ఇంకనూ సంశయములు పూర్ణముగ తీరలేదు. అంత కౌండిన్యుడు "ఆశ్రయా! నీ సంశయ నివారణార్ధము ఒక కార్యమాచరింపుము. నీవు ఒక దూర్వాంకురము గైకొని ఇంద్రునికడకేగి, అద్దాని తుల్యమయిన స్వర్ణమును ఈయమని అడుగుము. ఓ! సుముఖీ! సువర్ణము దూర్వాంకురమునకు ఒక్క లేశము ఎక్కువ, తక్కువ యుండరాదు." శ్రీగణేశ గణములు మనులకు "పతి సేవాత్పర అయిన ఆశ్రయ ఆ దూర్వాంకురమును తీసికొని ఇంద్రుని కడకేగెను," అని పలికి ఒక్క క్షణము ఆగి దీర్ఘ నిశ్వాసము విడచిరి.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి విరోచన, త్రిశిర చరితమను ఆరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

అరువది ఏడవ అధ్యాయము

(దూర్వాంకుర మహిమ)

శ్రీగణేశ గణములు తిరిగి తెలుపుట మొదలిడెను "కౌండిన్యునిచే ప్రేరిత అయిన ఆయన ధర్మపత్ని ఆశ్రయ ఇంద్రుని వద్దకేగి ఇట్లనియె "దేవరాజా! నేను నా పతి వచనానుసారము మీకడకు ఏతెంచితిని. నా పతి ఈ దూర్వాంకురమునకు సమానమయిన స్వర్ణమును తెమ్మని నన్ను పంపెను. నాకు కించిత్ ఎక్కువ, లేక తక్కువ స్వర్ణము వలదు. కేవలము సరిసమానమయిన స్వర్ణమే కావలయును." అంత ఇంద్రుడు "సాధ్వీ! నీ పతి యొక్క ఆజ్ఞ అనెడు సందేశమును పంపిన ఎడల నేను సాక్షాత్ స్వర్గమునే పంపెడివాడను. నీవు రానవసరము లేదు. అయిననూ నీవు వచ్చితివి కావున నీకు తప్పక ఆ స్వర్ణమును ఇచ్చెదను" అని పలికి, ఒక దూతను పిలిచి "ఈ సాధ్వీమణిని తీసికొని కుబేరుని వద్దకేగి ఈ దూర్వాంకుర తుల్యమయిన స్వర్ణమును ఈమెకీయమని నా ఆజ్ఞగా తెలుపుము" అని పలికెను. అంత ఆ దూత ఆశ్రయ సహితుడై కుబేరుని వద్దకేగి ఆయనకు ఇంద్రుని సందేశమును వినిపించెను. అంత కుబేరుడు తనలోతాను "ఈ కౌండిన్యుడు, ఆశ్రయ, ఇంద్రాదులందరూ మోహావేశులు కాలేదుకదా? ఈ దూర్వాంకురమునకు ఎంతటి స్వర్ణము లభించును? అద్దాని కంటె అధికము ఎందుకు అడుగలేదు?" అని చింతించి ఆమెకు అనేక మణుగుల బంగార మొసంగెను. ఆశ్రయకు ఆ బంగారము గ్రహించుటకు ఆశపుట్టియు, తన పతి భయము వలన "కేవలము దూర్వాంకుర తుల్య స్వర్ణమే కావలెనని" పట్టుబట్టెను.

అంత కుబేరుడు స్వర్ణకారులు ఉపయోగించు అతి చిన్న తులను తీసికొని, దానిపై ఒక పళ్ళెరమందు దూర్వాంకురమును యుంచి, మరియొక పళ్ళెరమందు తుల్యమయిన స్వర్ణము నుంచెను. కానీ అది సరిపడలేదు. నెమ్మది నెమ్మదిగ బంగారమును ఎక్కువ యుంచుట మొదలిడెను. ఎంత బంగారము వేసిననూ దూర్వాంకురమునకు సరిపోవుట లేదు. అంత త్రాసును మార్చి పెద్ద త్రాసునుపయోగించి మరల అధికముగ బంగారము వైచెను. ఆశ్చర్యము. ఎంత బంగారము వైచిననూ అది దూర్వాంకురమునకు సరిపోవుట లేదు. చివరకు తన ధనాగారము, పురము, తన వద్దనున్న సర్వము ఒకవైపు యుంచెను. అయిననూ అయ్యది దూర్వాంకురమునకు సరిపోకుండెను. అంత ధనపతి తన భార్యను పిలచి, ఆమెను తన ఆభరణ సహితయై తక్కెడయందు కూర్చొనమనెను. అయిననూ పని జరుగకుండెను. అంత తన ప్రతిష్ఠ కాపాడుకొనుటకై తాను సహితము అందులో కూర్చొండెను. ఫలితము సున్న. అంత కుబేరుడు జరిగిన విషయమును ఇంద్రునికి తెలియపరచెను. ఇంద్రుడు ఐరావతాధిరోహణము చేసి, అమరావతి యందున్న సమస్త సువర్ణమును తక్కెడ యందుంచెను. అయిననూ దూర్వాంకురమునకు సరిరాకుండెను. అంత వారు త్రిమూర్తులకు కబురంపిరి. త్రిమూర్తులు సహితము వారి వారి లోకములందలి సమస్త సంపదలను తీసికొని వచ్చి, తమ సహితముగ తక్కెడ యందు కూర్చుండిరి. అయిననూ దూర్వాంకురము వీసమెత్తు కదులలేదు.

అంత త్రిమూర్తులు దిక్పాలకుల సహితముగ కౌండిన్యుని వద్దకేగి, నమస్కరించి ఇట్లనిరి "మహానుభావా! మా పూర్వపుణ్య బలముచే మీ దర్శన భాగ్యము కలిగినది. దానిచే మా పాపములు దగ్ధమై, ఉత్తరోత్తరా కళ్యాణములు కలుగును. ఈనాడు మీ ధర్మపత్ని మా అహంకారమును హరించినది. మాకు దూర్వాంకుర మాహాత్మ్యము తెలియదు. స్వర్ణము, స్వర్గము, కాదుకదా, త్రిలోకములు సహితము ఈ దూర్వాంకురమునకు తుల్యము కాదు. మీచే భక్తి పూర్వకముగ శ్రీగణేశుని మస్తకమందు అలంకరింపబడిన దూర్వాంకుర మహిమను ఎవరు తెలియగలరు? యజ్ఞ, దాన, తపో, వ్రత, స్వాధ్యాయములందేదియునూ దూర్వాంకుర సమర్పణమునకు తుల్యము కాదు. శ్రీగణేశుని అహర్నిశలు ఏకాగ్రతతో

జనమొనర్చు మీ మహిమను మాత్రము ఎవరు తెలిసికొనగలరు?" ఈ విధముగ పలికి ఆ దేవ ప్రముఖులందరూ కౌండిన్యాశ్రయలను పూజించిరి. పిదప శ్రీగణేశుని పూజించి ఇట్లు పలికిరి "దేవా! అజ్ఞాతరూపుడవైన నిన్ను దేవతలు, త్రిమూర్తులు, వేదముల ద్వారా సహితము తెలియరు." ఈ విధముగ శ్రీగణేశుని స్తుతించి, సంతుష్టుని గావించి, ముని దంపతికి నమస్కృతులర్పించి, తమ తమ లోకములకరిగిరి.

తదుపరి ఆశ్రయ సహితము దూర్వాంకుర మాహాత్మ్యము తెలిసికొనినదై, పరాత్పరుడైన శ్రీగణేశుని దూర్వాంకురములతో పూజించి, మిక్కిలి ప్రసన్నయై, తన పతిని చేరి తనను తాను నిందించుకొని ఇట్లనియె "మహాత్మా! నా అంత దుష్టురాలు ఈ ప్రపంచమున యుండదు. నేను మీ వచనములను శంకించితిని. జ్ఞానులకు సహితము జ్ఞానివైన మహానుభావా! నా అపరాధమను మన్నింపవలసినది. నేను మీ శరణుజొచ్చుచున్నాను." అంత ముని చిరునవ్వు నవ్వి ఆమెను తన అక్కున జేర్చుకొనెను. మరునాడు ప్రాత:కాలము ఇరువురు కలసి దూర్వాంకురములు తెచ్చి, స్నానాదులొనర్చి, శ్రీగణేశుని అత్యంత భక్తి పూర్వకముగ దూర్వాంకురములతో పూజించిరి. సర్వ యజ్ఞ, దాన, తపములను వర్జించి ఆ దంపతి ప్రాత: సాయం సమయములందు సభక్తికముగ శ్రీగణేశుని పూజించుటచే ఆ పరాత్పరుడు కృపాళువై వారిరువురినీ తన ధామమునకు జేర్చెను."

గణములు ఈ విధముగ దూర్వాంకుర మాహాత్మ్యమును తెలిపి "ప్రాజ్ఞులారా! ఈ మాహాత్మ్యమును సంపూర్ణముగ వర్ణించుట త్రిమూర్తులకు, శేషునికి సహితము అసాధ్యము. దూర్వము యొక్క స్మరణ చేయుటచే కాయక, వాచక, మానసిక త్రివిధముల పాపములు నష్టమగును, ఎందుకనగా దూర్వాంకుర స్మరణచే శ్రీగణేశ స్మరణ జరుగును." ఈ విధముగ చింతామణి వినాయకుని క్షేత్రమహిమ స్పష్టముగ వర్ణింపబడినది. ఈ ఆఖ్యానము యొక్క శ్రవణము, కీర్తన, ధ్యానములచే లౌకిక, పారలౌకిక సుఖ భోగములు కలిగి మోక్షము సంభవించును. అందువలననే వృషభ, గార్దభ, ఛాండాలిని లకు శ్రీగణేశ సాన్నిధ్యమబ్బినది. శ్రీగణేశుడు దూర్వ గంధమాత్రమున సంతుష్టుడగును. ఇక దూర్వముతో సంపర్కము, దూర్వమను ఆయన మస్తకమందు సమర్పించిన ఇక ఏమని చెప్పుదును?" మహారాజు దూత వద్దనుండి ఈ వృత్తాంతమంతయు వినెను. అంత రాజు, ఆయన సేవకులు స్నానమాచరించి, దూర్వాంకురములు సేకరించి, వాటితో శ్రీగణేశుని పూజించిరి. తక్షణము వారందరూ దివ్యదేహులై, దేవతలతో కీర్తింపబడుచూ, దివ్య వస్త్రాభరణములు ధరించి, దేవ దుందుభులు మ్రోగుచుండగా దివ్య గంధానులేపితులై, విమాన మధిరోహించి శ్రీగణేశ ధామమునకేగిరి. ఆ నగరమందలి నాగరికులు, పౌరులు శ్రీగణేశ మహోత్సవమును తిలకించుటకేగి, వారు సహితము దూర్వాంకురములచే శ్రీగణేశుని పూజించి, దివ్య భోగాన్వితులై, వారు సహితము విమానారూఢులై శ్రీగణేశ సమ్ముఖమునకేగిరి. అందువలన సర్వులు శ్రీగణేశుని దూర్వాంకురములతో పూజింపవలెను.

ఏ మానవుడు శ్రీగణేశుని దూర్వాంకురములతో పూజింపడో ఆతడు ఛండాలుడై, నరకగామి అగును. ఏ మానవుడు శ్రీగణేశుని దూర్వాంకురములతో పూజించునో, ఆ వ్యక్తిని చూచిన పాపి సహితము శుద్ధుడగును. ఇరువది ఒకటి దూర్వాంకురములు లభింపని ఎడల ఒక్కటి చాలును. అదియే కోటి రెట్ల ఫలము నొసంగును." బ్రహ్మ ఈ విధముగ కృతవీర్య పితకు నానావిధ దూర్వాంకుర మహాత్మ్యము తెలిపి "ఈ ఆఖ్యాన శ్రవణము పాపనాశకము. దీనిని ఎన్నడునూ దుష్టులకు తెలుపరాదు." ఇంద్రుడు "బ్రహ్మదేవుడు ఈ విధముగ కృతవీర్యపితకు ఉపదేశమొనర్చి అద్దానిని కృతవీర్యునకు తెలుపమని ఆదేశించెను. రాజు ఆశ్చర్యానంద చకితుడై, బ్రహ్మకు ప్రణామములాచరించి అచటినుండి చనెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి దూర్వాంకుర మహిమ అను అరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

అరువది ఎనిమిదవ అధ్యాయము

(కృతవీర్య, అమాత్య సంవాదము)

శూరసేనుడు "మహేంద్రా! దూర్వాంకుర మహిత అద్భుతము. నాకు శ్రీగణేశ మహిమ గూర్చి ఇంకనూ వినవలెనని కుతూహలము కలుగుచున్నది. కృతవీర్యుని తండ్రి తదుపరి ఏమిచేసెను?" ఇంద్రుడు "మహారాజా! కృతవీర్యుడు పుత్రలేమిచే బాధనొందుచూ తన తపమును కొనసాగించుచుండెను. అంత ఒకనాటి రాత్రి కృతవీర్యునికి తన తండ్రి స్వప్నమున కానబడెను. వారిరువురు ప్రేమతో పరవశులై, గొంతు గాద్గదికమై, మాటలు రాక ఒకరినొకరు గాఢాలింగనము కావించుకొనిరి. అంత కృతవీర్యుని తండ్రి ఆతని చేయిపట్టి, ఒక పర్యంకముపై కూర్చుండబెట్టి, నారదుడు ఆతని గూర్చి తెలుపుటయు, తాను బ్రహ్మ వద్ద కేగుటయు, మరియు వారిమధ్య జరిగిన సంవాదమును, సంకటహార చతుర్థి మాహాత్మ్యము, దూర్వాంకుర మహిమ, ఇత్యాదులన్నిటినీ తెలిపి ఇట్లనియె "కుమారా! సర్వము ఈ నాలిక (పుస్తకము) యందు పొందుపరుపబడియున్నవి. దీనియందు తెలుపబడిన విధి విధానముల ననుసరించి, సంహటహార గణేశవ్రతము ఒక వత్సరము నియమపాలనతో కావించిన ఎడల, నీకు తప్పక పుత్రసంతతి కలుగును." ఈ విధముగ పలికి ఆయన అంతర్ధానుడయ్యెను. కృతవీర్యుడు మొలకువగని, తన స్వప్నమును గూర్చి తలంచి, తన చేతి యందు యున్న పొత్తమును స్పర్శించి, జరిగిన విషయము నిజమని తెలిసికొని ఏక కాలమున హర్ష, శోకముల నొందెను. తన తండ్రి అంతర్ధానుడు అయినందుకు శోకము, పుత్రోత్పత్తి విషయమై దొరకిన పుస్తకమునకు హర్షము ఏకకాలమున ద్వంద్వములను అనుభవించెను.

ఆ సమయమున అచటికి ఆయన అమాత్యులేతెంచి "రాజా! మీ శోకమునకు కారణమేమి? మీరు శోకము వీడి సావధాన చిత్తులవ వలసినది. మీరు శోకతప్తులయిన ఎడల మేము సహితము దుంఖాంబుధి యందు మునిగెదము" అని పలికిరి. అంత కృతవీర్యుడు వారికి తన స్వప్న వృత్తాంతమును వివరించి, తన తండ్రిచే ఈయబడిన నాలికను చూపించి, తన తండ్రి తనను సంకష్టహార వ్రతమాచరింపమని ఆదేశించెనని తెలిపెను. అంత అమాత్యులు "మహారాజా! శ్రీగణేశుడు మానవ, దానవ, నాగ, యక్ష, రాక్షస, దేవ లోకములకు సహితము జనకుడు. ఆయనే ప్రసన్నుడై మీ తండ్రి రూపమున మీకు ఈ నాలికను అర్పించి సంతాన ప్రాప్తన ఉపాయమును తెలిపెను. లేని ఎడల ఎక్కడైననూ స్వప్నమందు ఈ విధమయిన వస్తువు లభించుట కాంచితిమా! శ్రీగణేశుని కృప లేక స్వప్నము సార్థకమవ్వదు; మరియు విపరీత ఫలము లభించును. అంత రాజు సావధాన చిత్తుడై, తన ధర్మపత్నీ సహితుడై, తన రాజ్యమున కేగి, సభతీర్చి, ఉద్దండ పండితులను రావించి, వారికి ఆ నాలికనిచ్చి, అందలి విశేషములను తెలుపమని అర్థించెను. అంత పండితులు "మహారాజా! ఈ నాలిక యందు మీ తండ్రికి, బ్రహ్మదేవునికి జరిగిన సంవాదము, సంకటహార చతుర్థి విధి విధానములు, చంద్రోదయమయిన పిదప శ్రీగణేశుని పూజ, అంగారకచతుర్థి మహిమ, ఇరువది ఒక్క బ్రాహ్మణులకు భోజనము, వివిధ దాన విధులు, శ్రీగణేశునికి దూర్వాంకుర సమర్పణ ఫలము, ఇవన్నియు విడివిడిగా, విస్తారముగ, తెలుపబడినవి. రాజా! ఈ వ్రత విధానము మీకు పరమ పుణ్యవశమున లభించినది. దీనిని భూతలమందు ఇంతకుమున్ను చూడలేదు, సరికదా, వినియుండలేదు. ఈ వ్రతము లోకులకు అత్యంత ఉపకారమొనర్చును. ఇద్దాని శ్రవణ, మరియు స్మరణ మాత్రమున మానవులకు కష్టములు దూరమగును.

ఇంద్రుడు "కృతవీర్యుడు పండితుల ద్వారా ఆ విధి విధానములను కూలంకషముగ తెలిసికొని, వారందరినీ ధన, రత్న, ధాన్య, వస్త్రాలంకారములతో తృప్తి నొనర్చి, తదనంతరము తన కులగురువయిన అత్రి మహర్షిని ఆహ్వానించి, ఒక శుభ ముహూర్తమున తన కులగురువును, శ్రీగణేశ మహాప్రభువును పూజించి, తన గురువునుండి అత్యంత

శుభకరమయిన ఏకాక్షర శ్రీగణేశ మంత్రమును విధి విధానముగ స్వీకరించి, అత్యంత ఏకాగ్రత, అనన్య భక్తి ప్రపత్తులతో ఆ మంత్ర జపధ్యానములు ఆచరించెను. అట్లే అత్యంత భక్తి శ్రద్ధలతో పుత్రప్రాప్తి హేతువై సంకటహార చతుర్థి వ్రతము కావించెను.

(శ్రీగణేశపురాణమందలి ఉపాసనా ఖండమందు కృతవీర్య, అమాత్య సంవాదమను అరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

అరువది తొమ్మిదవ అధ్యాయము

(సంకటహార చతుర్థి వ్రత విధానము)

శూరసేనుడు "మహేంద్రా! మహానుభావా! బ్రహ్మదేవుడు కృతవీర్యుని కొరకై సంకటహార చతుర్థి వ్రత విధానములను తెలిపెనని చెప్పితిరి కదా! వానిని గూర్చి మరింత విపులముగ విశదీకరింప వలసినది." అంత ఇంద్రుడు "రాజా! నీకు వారి సంవాదమును మరింత విపులముగ వివరించెదను. కృతవీర్యుని తండ్రి విరించితో "వినమ్రులయిన భక్తుల కష్టములను నివారించు జగత్కర్తా! దేవదేవా! విపత్తిగ్రస్తులు, వ్యాకులచిత్తులు, చింతాగ్రస్తులు, సుహృద్ జన వియోగము నొందువారు, దుర్లభమయిన లక్ష్యప్రాప్తిని పొందవలెనన్న ధీరులు, వీరందరికీ కార్యసిద్ధి ఎట్లు కలుగును? వీరికి పుత్ర పౌత్రాభివృద్ధి, అర్థసిద్ధి, సౌభాగ్య సంపదలు ఎట్లు ప్రాప్తించును? మానవుల సర్వ సంకట నాశనమెట్లు జరుగును?" చతురాననుడు "రాజా! నీకు సర్వసిద్ధి ప్రదాయకమైన వ్రతమును తెల్పెదను. ఈ వ్రతానుష్ఠాన మాత్రమున మానవునికి సర్వ కామనలు పూర్ణమగును. ఈ వ్రతమును కృష్ణపక్ష చతుర్థి నాడు కావింపవలెను. ఆ దినము ఉదయముననే లేచి ప్రసన్నుడై తెల్లనువ్వులు, ఔషధులు, కలిపిన చూర్ణముతో స్నానమాచరించి, ఉదయము నిత్యకర్మానుష్ఠానము సలిపి శ్రీగణేశ భగవానుని పూజాధ్యాన సంకల్పము కావింపవలెను. ఈ చతుర్థశీవ్రత పూజ సాయంత్రము చంద్రోదయమయిన పిదప ప్రారంభింప వలెను. ఇంటియందు ఒక శుద్ధ సమతల ప్రదేశమును గోమయముతో అలికి, అచట చిన్న మండపము నిర్మించి, అచట పూజ హేతువై ఒక పీఠము స్థాపించి, దానిని కుంకుమాక్షతలతో పూజింపవలెను. అచట పంచరత్నయుక్త కలశముంచి, ఆ కలశముపై స్వర్ణ లేక రజిత లేక రాగి పాత్ర యుంచి దానిని పట్టు వస్త్రముతో కప్పవలెను. ఆ వస్త్రముపై ఆగమములందు తెలుపబడిన రీతిని శ్రీగణేశ యంత్రమును లిఖింపవలెను. అద్దానిపై సువర్ణ శ్రీగణేశమూర్తిని యుంచవలెను. తదుపరి

ధ్యానము: శ్రీగణేశుని ధ్యానమంత్రము "ఏకదంతం మహాకాయం" – శ్లోకార్థము–ఏకదంతుడు, మహాకాయుడు, తప్తకాంచన సన్నిభుడు, లంబోదరుడు, విశాలనేత్రుడు, ప్రజ్వలించుచున్న అగ్నిశిఖలవంటి నేత్రముల తేజస్సుతో వెలుగొందువాడు, మూషికవాహనుడు, గణములచే చామరములు వీచబడువాడు, నాగ యజ్ఞోపవీతుడు, అయిన శ్రీగణేశుని ధ్యానించుచున్నాను.

ఆవాహన: "సహస్రశీర్షా పురుష: "మంత్రము. శ్లోకార్థము – దేవదేవేశా! దయచేసి నీవు ఏతెంచి ఈ మూర్తియందు స్థిరముగ కూర్చొని, నా పూజ కొరకు సంకటములు నివారించి, నా వ్రతమును సంపూర్ణమొనర్చుము.

ఆసనము: "పురుషయే వేదం" మంత్రము. మంత్రార్థము – ఓ! సర్వసిద్ధి ప్రదాయకా! గణాధీశా! దయచేసి ఈ ఆసనమును గ్రహింప వలసినది.

పాద్యం: "ఏతావానస్యం" మంత్రము. మంత్రార్థము – ఉమాపుత్రా! మోదకప్రియా! దేవేశా! నీకు నమస్కారము. ఈ పాద్యముతో నీవు పాద ప్రక్షాళన కావింపవలసినది.

అర్ఘ్యం: "త్రిపాదూర్ధ్యం" మంత్రము. మంత్రార్ధము – ఓ! లంబోదరా! నీవు, రత్న, ఫలయుక్తమయిన ఈఅర్ఘ్యమును స్వీకరించి నా సంకటములు దూరమొనరింపుము.

ఆచమనము: "తతోవిరాం" మంత్రము. మంత్రార్ధము – స్వామీ! గంగాది సర్వ పుణ్య తీర్ధములనుండి ఉత్తమ జలములు సంగ్రహించి తెచ్చితిని. మీరు ఆచమనార్ధము స్వీకరింపవలసినది.

పంచామృత స్నానము: పాలు, పెరుగు, నెయ్యి, తేనె, చక్కెర, ఇవి పంచామృతములు. "పంచనద్య:" మంత్రము. ఈ మంత్రముచ్చరించుచూ పైన తెలిపిన పంచామృతములను స్నానార్ధము సమర్పింపవలెను.

వస్త్రము: గజాననా! పరమాత్మా! స్నానానంతరము మీరు ఈ వస్త్రయుగ్మమును స్వీకరింపవలసినది.

యజ్ఞోపవీతము: "తస్మాదశ్వాం" మంత్రము. మంత్రార్ధము – ఓ! వినాయకా! మీకు నమస్కారములు. పరశుధారణకర్తా! మీరు ఈ యజ్ఞోపవీతమును స్వీకరింపవలసినది.

చందన సమర్పణ: "తం యజ్ఞమం" మంత్రము. మంత్రార్ధము – ఓ! ఈశపుత్రా! మూషిక వాహనా! నీకు నమస్కారము. ఈ చందనమును గ్రహించి నా సంకటములు దూరమొనర్పుము.

అక్షతలు: ఘ్రుతము, కుంకుమ, కలపిన బియ్యముతో అక్షతలు చేసి వానిని శ్రీగణేశున కర్పింపవలెను.

పుష్పములు: "యత్పురుషం" మంత్రము. మంత్రార్ధము – స్వామీ! చంపకా, మల్లి, మొదలగు పుష్పములు మీ కొరకు తీసికొని వచ్చితిని. స్వీకరింపవలసినది.

ధూపము: "బ్రాహ్మణోశ్యం" మంత్రము. మంత్రార్ధము – ఓ! లంబోదరా! మహాకాయా! ధూమ్రకేతూ! దేవేశా! మీరు ఈ ధూపమును స్వీకరింపవలసినది.

దీపము: విఘ్నరూపాంధకార సంహారా! దేవేశా! స్వామీ! మీరు ఈ దీపమును గ్రహింపవలసినది.

నైవేద్యము: "నాభ్యా ఆశీద్యం" మంత్రము. మోదకములు, అపూపములు, లడ్లు, చక్కెరయుక్త పాయసము, ఘ్రుతయుక్త పరమాన్నము, కొబ్బరి, ద్రాక్ష, మామిడి, దాడిమాది ఫలములను పరమాత్మునికి సమర్పింపవలెను.

తాంబూలము: "యత్పురుషం" మంత్రము. మంత్రార్ధము – స్వామీ! లవంగ, వక్క, ఏలకులు, నాగవల్లీయుక్తమయిన తాంబూలమును సమర్పించుచున్నాను. దయచేసి స్వీకరింపవలసినది.

సువర్ణ దక్షిణ: "సప్తాస్యాసనం" మంత్రము. మంత్రార్ధము – స్వామీ! ఇయ్యది ప్రీతిజనకము, సర్వసిద్ధి ప్రదాయకము అయిన సువర్ణ దక్షిణ. దయచేసి స్వీకరించి, నా సంకటములు నివారింపవలసినది.

దూర్వాంకురములు: ఇపుడు ఇరువది ఒకటి దూర్వాంకురములు తీసికొని ఈ దిగువ మంత్రముచ్చరించుచూ, ఒక్కొక్క దూర్వాంకురము సమర్పింపవలెను.

1. ఓం గణాధిపాయ నమ:	2. ఓం ఉమాపుత్రాయ నమ:	3. ఓం అఘనాశనాయ నమ:
4. ఓం ఏకదంతాయ నమ:	5. ఓం ఇభవక్త్రాయ నమ:	6. ఓం మూషికవాహనాయ నమ:
7. ఓం వినాయకాయ నమ:	8. ఓం ఈశపుత్రాయ నమ:	9. ఓం సర్వసిద్ధిప్రదాయ నమ:
10. ఓం లంబోదరాయ నమ:	11. ఓం వక్రతుండాయ నమ:	12. ఓం మోదకప్రియాయ నమ:
13. ఓం విఘ్నవిధ్యంశకర్త్రే నమ:	14. ఓం విశ్వవంద్యాయ నమ:	15. ఓం అమరేశాయ నమ:
16. ఓం గజకర్ణాయనమ:	17. ఓం నాగయజ్ఞోపవీతినే నమ:	18. ఓం భాలచంద్రాయ నమ:
19. ఓం పరశుధారిణే నమ:	20. ఓం విఘ్నాధిపాయ నమ:	21. ఓం విద్యాప్రదాయ నమ:

హారతి: హే! భగవాన్! కర్పూరయుక్తము. ప్రజ్వాలితము, సంపూర్ణ పాప వినాశకము, అయిన నీరాజనము స్వీకరించి నన్ను సంకటముక్తుని కావింపుము.

పుష్పాంజలి: "యజ్ఞేవాం" మంత్రము. ఈ మంత్ర పఠను కావించుచూ చంపకాశోక, వకుళ, పారిజాత, పుష్ప సమర్పణ కావింపవలెను.

స్తుతి: ఓ! గజాననా! నీవే విశ్వము యొక్క సృష్టి, స్థితి, మరియు సంహార కర్తవు. ఓ! విశ్వాత్మా! నీవే ఈ విశ్వమందు ప్రకాశమానుడవు.

నమస్కారము: విఘ్నేశ్వరా! విఘ్న వినాశమందు దక్షుడా! భక్త కష్ట నివారకా! విద్యా ప్రదాతా! వేద నిధానా! దేవేశ్వరుడవయిన శ్రీగణేశుడా! నీకు ప్రణామములర్పించుచున్నాను.

ఈ విధముగ పున: పున: స్తుతి ప్రణామములు కావించి, యధాశక్తి ఇరువది ఒక్క మార్లు ప్రదక్షిణ గావించి ఈ విధముగ ప్రార్థింపవలెను "శ్రీగణేశా! ఏ మానవుడు నీ పూజనము కావింపక తన మనోరథములను పూర్ణమొనరింప దలచునో వారు నిశ్చయముగ నష్టపోయెదరు. నేను ఈ లోకమందు మీ ప్రభావమును తిలకించితిని. ఓ! ఆచార్యా! ద్విజాధ్యక్షా! సర్వసిద్ధి ప్రదాతా! స్వామీ! మీరు వాయనము స్వీకరింప వలసినది. నేను ఫల, పుష్ప, దక్షిణాయుక్త, అక్షత ప్రదానము కావించితిని. వీటిని స్వీకరించి నన్ను సంకటముల నుండి రక్షింప వలసినది. ఈ షోడశోపచార పూజానంతరము "ఓం నమో హేరంబ మదమోదిత మమసంకట నివారయ స్వాహా" అను మంత్రముతో పూజనమొనర్చి, లోకపాలురందరినీ శ్రీగణేశునకు నలుప్రక్కలా స్థాపించి, వండిన పెసలు, తిలలు, ఘృతము కలిపిన మోదకములు, మరియు ఇతర భక్ష్యాన్నములను తాంబూలముతో అలంకారమొనర్చిన గణపతికి సమర్పింపవలెను. తిరిగి ఇరువది ఒకటి దూర్వాంకరములను ఈ క్రింది ఇరువది ఒక్క నామములతో తిరిగి అర్పింవలెను.

1. ఓం గణాధిపాయ నమ:	2. ఓం ఉమాపుత్రాయ నమ:	3. ఓం అభయప్రదాయ నమ:
4. ఓం ఏకదంతాయ నమ:	5. ఓం గజాననాయ నమ:	6. ఓం మూషికవాహనాయ నమ:
7. ఓం వినాయకాయ నమ:	8. ఓం ఈశపుత్రాయ నమ:	9. ఓం సర్వసిద్ధిప్రదాయకాయ నమ:
10. ఓం లంబోదరాయ నమ:	11. ఓం వక్రతుండాయ నమ:	12. ఓం అఘనాశనాయ నమ:
13. ఓం విఘ్నవిధ్వంశకర్త్రయే నమ:	14. ఓం విశ్వవంద్యాయ నమ:	15. ఓం దేవేశ్వరాయ నమ:
16. ఓం గజాననాయ నమ:	17. ఓం నాగయజ్ఞోపవీతినే నమ:	18. ఓం భాలచంద్రాయ నమ:
19. ఓం పరశుధారిణే నమ:	20. ఓం విఘ్నేశ్వరాయ నమ:	21. ఓం సర్వవిద్యప్రదాయ కాయ నమ:

ఈ విధముగ పూజనమొనర్చి, మనసున తన కోరికను సంస్మరించి, ఆ ఉద్దేశ్యమును పూర్ణ మొనరింపమని, విఘ్నములను, శత్రువులను, దుష్టులను నాశనమొనర్చి, మిత్రులకు ఉన్నతి కల్పింపమని వినాయకునికి వినతి యొనర్చి, పిదప నూట ఎనిమిది ఆహుతులతో హోమమొనర్పవలెను. వ్రత సంపూర్ణ సఫలతా సిద్ధికై ఇరువది ఒకటి మోదకములు, లేక లడ్లు, లేక ఫలములు, ఒక రక్తవర్ణ వస్త్రమందు చుట్టి, తన ఆచార్యునికి ఈ మంత్రముతో సమర్పింపవలెను. మంత్రార్థము – ఓ! సర్వ సంకల్ప సిద్ధి కర్తా! శ్రీగణేశా! నీకు నమస్కారము. ఈ వాయన దానము స్వీకరించి, మీరు నన్ను సంకటములనుండి ఉద్ధరింప వలసినది. తదుపరి పుణ్యకథా శ్రవణము కావించి సావధాన మనస్కులై అర్ఘ్య ప్రదానము ఈ విధముగ కావింప వలసినది.

చతుర్థీ తిథి అర్ఘ్య ప్రదానము: మంత్రార్థము – ఓ! తిథులయందు ఉత్తమమైనది, శ్రీగణేశునకు ప్రియమయినది అయిన సంకట హార చతుర్థీ తిథీ! దేవీ! నీవు ఈ అర్ఘ్యము గ్రహింపవలసినది. నీకు నమస్కారము. నా సంకటములను హరింపవలసినది.

శ్రీగణేశ అర్ఘ్య ప్రదానము: ఓ! లంబోదరా! మోదకప్రియా! నీకు మరల మరల నమస్కారము. నా సంకటములను హరింపవలసినది.

శశాంక అర్ఘ్య ప్రదానము: ఓ! అత్రిగోత్రా! క్షీరసాగరోత్పన్నా! చంద్రుడా! నీవు రోహిణీ సహితుడవై నా అర్ఘ్యమును గ్రహింప వలసినది,'' అని ఏడుమార్లు అర్ఘ్య ప్రదానము కావింపవలసినది.

తదుపరి శ్రీగణేశుని క్షమింపమని క్షమాయాచన చేసి, పిదప బ్రాహ్మణులకు భోజన సమారాధన కావింపవలెను. మిగిలిన శేషమును మౌనవ్రతుడై ప్రతి భోజనమును బాంధవ సహితుడై గ్రహింపవలెను. ఇట్లు నాలుగు మాసములు సంకష్టహార చతుర్థీ వ్రతమాచరింపవలెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి సంకష్టహార చతుర్థీ వ్రత విధానమును అరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బదియవ అధ్యాయము

(సంకటహార చతుర్థి కావించిన ప్రముఖులు)

కృతవీర్యుని తండ్రి బ్రహ్మతో "ప్రభూ! ఈ వ్రతమును పూర్వకాలమందు ఎవరాచరించిరి? దీని వలన కలుగు పుణ్యమేమి? దీనిని భూలోకమందు ఎవరు విపుల ప్రచారము కావించిరి? బ్రహ్మ "రాజా! పురాతనకాలమందు స్కంధుడు తీర్థయాత్రకు చని చిరకాలమునకు గృహమునకు రాకుండెను. అంత పర్వతనందిని పార్వతీదేవి శివుని వచనానుసారముగ చతుర్మాసములు ఈ వ్రతమాచరించెను. అయిదవ మాసమున ఆమెకు కార్తికేయ దర్శనమయ్యెను. సముద్ర జల పానేచ్ఛచే అగస్త్య మునీంద్రుడు మూడు మాసములు ఈ వ్రతమాచరించెను. వరద గణేశుని కృపచే ఆయన సముద్రుని పుక్కిట పట్టెను. ఒకానొకనాడు నలమహారాజును కానక దమయంతీదేవి ఆరు మాసముల పర్యంతము ఈ వ్రతమాచరించెను. పిదప ఆ సాధ్వికి తన ప్రాణవల్లభుని దర్శనమయ్యెను. ప్రాచీనకాలమందు ప్రద్యుమ్నతనయుడయిన అనిరుద్ధుని, ఉషా చెలియ అయిన చిత్రలేఖ అపహరించెను. అంత ప్రద్యుమ్నుడు పుత్రశోక పీడితుడయ్యెను. అంత ప్రద్యుమ్నుని తల్లి రుక్మిణీదేవి ఆతనితో ఇట్లనియె "పుత్రా! నీవు జన్మించిన ఆరవ దినమున శంబరాసురుడు నిన్ను అపహరించి కొనిపోయెను. నిన్ను కానక నేను ఎంతయో పరితపించితిని. ఇతర బాలకులను కాంచినపుడు నిన్ను తలచి నీవు కూడా అదే వయసు యందుండుదువు అని తలంచుదానను. ఒకనాడు లోమశ మహర్షి ఏతెంచి ఈ వ్రతోపదేశము ఒనర్చెను. నేను నాలుగు మాసములు ఈ వ్రతమాచరించితిని. వెంతనే నీవు శంబరుని దునుమాడి మా వద్ద కేతెంచితివి. నీవునూ అట్లే ఈ వ్రతమాచరింపుము. నీ పుత్రుని జాడ తెలియును" అని పలికెను.

అంత ప్రద్యుమ్నుడు సహితము ఈ వ్రతమాచరించెను. తక్షణము నారద మహర్షి ఏతెంచి అనిరుద్ధుడు శోణపురము నుందుండెనని తెలిపెను. శోణపురము నందు శివునితో సమరమొనర్పవలెనని శ్రీకృష్ణుడు సందేహాస్పదుడై యుండగా, ఉద్ధవుని కథనానుసారము ఆ మహానుభావుడు ఒక్కమారు ఈ వ్రతమాచరించి, తదుపరి సునాయాసముగ శోణపురమును జయించి, ఉషా, అనిరుద్ధులను ద్వారకకు గొనివచ్చెను. మహారాజా! నేను సృష్టి కావించుటకు సంకల్పించి దేవాసుర, మానవ, దానవ, ఋషి, కిన్నెర, నాగ, రాక్షస, విఘ్నబాధల శాంతికై ఈ వ్రతమాచరించితిని. లోకమున ఈ వ్రతమునకు సమానమైన వ్రత, తప, దాన, జప, తీర్థ, మంత్ర లేక అన్య విద్యలు లేవు! లేవు!! లేవు!!! ఈ వ్రతాచరణముచే అత్యంత క్లిష్ట తరమయిన కార్యములు సహితము అత్యంత స్వల్ప కాలములో సిద్ధించును. ఇందు సందియము లేదు. ఈ వ్రతమును భక్తి హీనులకు, నాస్తికులకు, దుష్టులకు ఉపదేశింపరాదు. కేవలము పుత్రీ పుత్రులకు, శిష్యులకు శ్రీగణేశ భక్తులకు మాత్రమే దీనిని ఉపదేశింపవలెను. మహారాజా! నీవు క్షత్రియ శ్రేష్ఠుడవు, ధర్మాత్ముడవు, లోకోపకారుడవు మరియు నాకు ఇష్టుడవు. అందువలననే నేను నీకు ఈ వ్రతమునుపదేశించితిని. నా కథనానుసారము నీవు ప్రధమత: ఈ వ్రతమునే ఆచరింపవలసినది. వేరొక ఉపాయము లేదు. ఏఏ నర నారీమణులకు వారి సమక్షమున కఠిన పరీక్షలు ఎదురైనపుడు,

వారు తప్పక ఈ సంకటహార చతుర్ధీ వ్రతమును ఆచరింపవలెను. దీనివలన తలచిన సంకల్పము తప్పక సిద్ధినొందును.” కృతవీర్యుడు పండితుల ద్వారా తెలుపబడిన ఈ విషయములన్నియు ఆలకించి, ఆకళించుకొని, విధి విధానముగ సంకటహార చతుర్ధీ వ్రతమాచరించి, శత్రుపీడలేని రాజ్యమును తన పుత్రులతో నిష్కంటకముగ భోగించెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి సంకటహార చతుర్ధీ వ్రతమాచరించిన ప్రముఖులు అను డెబ్బదియవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఒకటవ అధ్యాయము

(సంకటహార చతుర్ధీ ఉద్యాపనము)

కృతవీర్యుని తండ్రి బ్రహ్మతో “పితామహా! ఈ సంకటహార చతుర్ధి వ్రత ఉద్యాపనము ఎట్లు కావింపవలెను? లోకోపకారహేతువై, ఆ క్రియను విస్తార పూర్వకముగ తెలుపవలసినది.” బ్రహ్మ “రాజా! ఈ వ్రతము యొక్క ఉద్యాపన ఒకటి, అయిదు లేక ఏడవ మాసాంతరమున కావింపవలెను. శ్రీగణేశ భక్తులు పూర్వోక్తు విధానమున పూజ సలిపి, తదుపరి నానా విధమయిన అలంకారములతో ఒక చిన్న మండపము నిర్మించి, అందు సర్వతోభద్ర మండలమును గీచి, కలశమును దానిపై శ్రీగణేశుని ప్రతిష్ఠించి, పూజ పూర్తయిన పిదప సుగంధ చందనము, నానా విధములయిన పుష్పములు, కొబ్బరి బొండములు పెట్టి, ఏకాగ్ర చిత్తముతో మంత్రము పఠించుచూ అర్ఘ్య దానమీయ వలెను. మంత్రార్థము – శ్రీగణేశునికి అత్యంత ప్రియము, అభిలషతమైన తిథి అయిన చతుర్ధీ తిథి దేవీ! నీకు నమస్కారము. ఈ అర్ఘ్య గ్రహణము కావించి, నా సంకటములు దూరము చేయుము. మోదకప్రియా! లంబోదరా! శ్రీగణేశా! మీకు నమస్కారము. ఈ అర్ఘ్యమును గ్రహించి, దయచేసి నా సంకటములు బాపుము. అత్రిగోత్రా! క్షీరసాగర శశాంకా! రోహిణీ సహితుడవై ఈ అర్ఘ్యమును స్వీకరింపుము. తదుపరి శ్రీగణేశునకు చతుర్విధ భోజనములు (భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములు) మరియు పేయములు (పాలు, నీరు) అర్పించి, వివిధ ఫలములు సహితము సమర్పింవలెను.

పిదప హోమమునకై ఒక ఆచార్యుని వరణము చేసి, ఇరువది ఒక్క ఋత్విక్కులను కూడా స్వీకరింపవలెను. తదుపరి “గణాణాంత్వా” మొదలగు వేద మంత్రములతో కానీ, శ్రీగణేశుని మూల మంత్రముతో కానీ, పదివేలు, లేక ఒక వేయి, లేక అయిదు వందలు, లేక నూట ఎనిమిది సార్లు ఆహుతులు అర్పింపవలెను. తదుపరి బలిదానము, పూర్ణాహుతి గావించి, హోమాగ్ని యందు వసోర్ధార సమర్పింవలెను. పిదప బ్రాహ్మణులకు భోజనమర్పించి, వారికి వస్త్రయుగ్మము, కలశము, ఆసనము, దక్షిణ అర్పింపవలెను. ఈ కార్యమందు పిసినారితనము కూడదు. తదుపరి వరణము చేసిన ఆచార్యునికి పూజనమొనరించి, ఆయన భోజన మారగించిన పిదప ఒక చేటను ఎర్రని వస్త్రముతో చుట్టి, దానియందు ఫలములు, పూజకావింపబడిన శ్రీగణేశుని సువర్ణ ప్రతిమ, దక్షిణ, నాలుగు శేర్ల (కుంచెడు) తిలలు, యుంచి వాయన దానము సమర్పింపవలెను. తదుపరి కొమ్ములకు సువర్ణ తొడుగులు, గిట్టలకు వెండితొడుగులు, మూపునకు కాంస్యపుతొడుగు, కలిగి, దూడతో సహా పాలు ఇచ్చు కపిలగోవును ఆయనకు బహూకరింపవలెను, “భగవానుడగు విఘ్నేశ్వరుడు ప్రసన్నుడగు గాక!” అని పలుకుచూ బ్రాహ్మణులకు క్షమాయాచన అర్థింపవలెను. ఇయ్యది ఉద్యాపనా విధి. ఈ విధముగ ఆచరించిన మనుజునకు అశ్వమేధయాగ ఫలము లభించును.” ఈ విధముగ పండితులు కృతవీర్యునకు పుస్తకమందు ఈయబడిన వ్రత విధానమును బోధించిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి సంకటహార చతుర్ధి ఉద్యాపనమను డెబ్బది ఒకటవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది రెండవ అధ్యాయము

(కార్తవీర్య జననము)

శూరసేన మహారాజు "మహేంద్రా! సంకటహార చతుర్థి వ్రతమును కృతవీర్యుడు ఆచరించెనా? అటు పిదప ఆయనకు పుత్రజననము కలిగెనా? ఈ విషయ విశేషములన్నియు విస్తారముగ తెలుపవలసినది." ఇంద్రుడు "మహారాజా! కృతవీర్యుడు పండితుల ద్వారా తన తండ్రి యొసంగిన నూలిక యందు తెలుపబడిన విధి విధానములను కూలంకముగ ఆకళించుకొని, వాటిని యధాతథముగ అమలుపరచెను. శ్రీగణేశుని అత్యంత శ్రద్ధా భక్తులతో ఉపాసించి, పూజా, జప, తపోదానములొనర్చెను. ఆ పరమాత్ముడు సంతుష్టినొందిన శుభములకు కొరత యుండునా? కానీ ఆయన లీలలు చిత్రములు. కృతవీర్యుని పత్ని గర్భవతియై, నెలలు నిండిన పిదప ఒక శుభ ముహూర్తమున ఒక పుత్రునకు జన్మనిచ్చెను. ఆ శిశువు సుందరమయిన ముఖము, నాసిక కరిగి కమలనేత్రుడై యుండెను. ఆతడు ద్విభుజుడు కానీ రెండు చేతులు లేకుండెను. అట్లే తొడలు దాటిన పిదప రెండు కాళ్ళు లేకుండెను. ఈ విధముగ పుత్రుని గాంచి రాణి రెండు చేతులతో గుండెలు బాదుకొనుచూ "హా! హతవిధీ! ఇటువంటి బాలుని ఏల ప్రసాదించితివి? నేను వంధ్య నైననూ బాగుండెడిది కదా! ఈ బాలుని వలన ఏమి లాభము? ఓ! పరాత్పరా! శ్రీగణేశా! నీకై కావించిన పూజలన్నియు వృధా అయినవి కదా! నా పూర్వజన్మ పాపము ఏల శమింపలేదు? నీకృప, బ్రాహ్మణుల ఆశీర్వచనము నిష్ఫలములు అయ్యెను" అని బిగ్గరగా రోదించుట మొదలిడెను. ఆమెను చూచి మిగిలిన అంత:పుర స్త్రీలు సహితము రోదించిరి. ఈ కోలాహలము అంతయు వినిన మహారాజు కృతవీర్యుడు, ఆయన ముఖ్యానుచరులు, నగర ప్రముఖులు అచటికి ఏతెంచిరి.

రాజు "పరమాత్మా! శ్రీగణేశా! నీ దయ ఈనాడు ఏల నిష్ఫలమయినది? నీవు కేవలము నీ స్మరణచే పాపములను దగ్ధమొనర్చెదవు. కానీ నేను కావించిన జప, తప, ధ్యాన, దాన, పూజన, బ్రాహ్మణసేవ, వ్రత, హోమ, అనుష్ఠానాదులన్నియు నిరర్థకములయినవా? కర్మ గతి ఎవరికి తెలియును? దైవము బలీయమై కర్మను నిష్ఫలమొనర్చును. జీవితము నందు ఎవరికి ఎప్పుడు ఏమి ప్రాప్తించునో ఎవరికి ఎరుక? కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు నేను భ్రహ్మ ప్రయత్నము గావించి ఈ వికలాంగుని పొందితిని" అని శోకాకులు డయ్యెను. అంత ఆయన అమాత్యులిట్లనిరి "మహారాజా! శోకము వలదు. జరుగవలసినది అవశ్యము జరుగును. శ్రీరామచంద్రునకు స్వర్ణజింక యుండదని తెలియదా? అయిననూ దానిని వెంబడించెను కదా! ధర్మరాజునకు ద్యూతక్రీడ నిషిద్ధము అని తెలియదా? అయిననూ ఆయన అందు పాల్గొని పరాజితుడయ్యెను కదా! మనమందరమూ ఎంత గగ్గోలు పెట్టిననూ ఇపుడు ఈ బాలుడు సర్వాంగుడవ్వడు. అదృష్టము యున్న ఎడల భవిష్యత్ నందు ఆ శుభఘటన జరుగవచ్చు. వృక్షములు ఋతువులాసన్నమయినపుడే ఫల పుష్పములు నిచ్చును. అట్లే సమయము ఆసన్నమయినపుడు ఈ బాలుడు సర్వాంగ సుందరుడగును. అంతదనుక మనము వేచి యుండవలసినదే!!" ఈ విధముగ అమాత్యులు పలికిన మీదట కృతవీర్యుడు ధైర్యము తెచ్చుకొని, పైకిలేచి తన పత్నిని సమధానపరచి తదుపరి కార్యములు ఈ విధముగ నిర్వర్తించెను.

కృతవీర్య మహారాజు ఉత్తమ బ్రాహ్మణ పండితులను రావించి శ్రీగణేశపూజనము, స్వస్తివాచకము, అభ్యుదాయక జాతక కర్మలు చేయించి, వారికి అనేక వస్త్ర, భూషణ, రత్న, మాలా, గోవులను దానమొనర్చి, మంగళ వాద్యములు మ్రోయింపించి, వంది మాగధ నట గాయక దీన దు:ఖితలుకు, అంధులకు, దరిద్రులకు, అసహాయులకు యధాయోగ్యమయిన అన్న వస్త్రాదులను దానమొనరించెను. రాజ్యమందలి ప్రతి గృహమునకు తాంబూలము, చెక్కెర పంపించెను. పదకొండవ రోజు నామకరణ సంస్కారములు కావించి ఆ బాలునికి "కార్తవీర్యుడు" అని నామమొసంగెను.

కాలమెప్పుడూ ఒకే విధముగ యుండదు కదా! క్రమముగ ఆ బాలునికి పన్నెండేండ్లు నిండినవి. ఆ సమయమున ఆ మహారాజు వద్దకు మహానుభావుడు, ఋషి సత్తముడు, నారాయణాంశ సంభూతుడైన దత్తాత్రేయుడు అరుదెంచెను. ఆయనను చూడంగనే కృతవీర్యుడు లేచి, ఆయన పాదములకు తన శిరసు తాటించి నమస్కరించెను. పిదపలేచి ఆయనను గాఢాలింగనము కావించి, ఆయనను ఒక ఉత్తమాసనమందు ఆశీనుని కావించి, అత్యంత భక్తి శ్రద్ధలతో షోడశోపచార పూజనమొనర్చి, ఆయన భోజనము చేసి విశ్రాంతి తీసుకొను సమయమున కృతవీర్యుడు ఆయన పాదముల వద్ద కూర్చొని పాదసంవాహన మొనర్చుట ప్రారంభించి ఇట్లనియె "ఓ! మహానుభావా! దత్తాత్రేయా! నేను నా పూర్వజన్మ సుకృతమును ఏ విధముగ వర్ణింపగలను? నా జన్మ జన్మాంతర పుణ్యములు ఫలీభూతమై, నా చర్మచక్షువులతో మీ దర్శనము కావించితిని. మీ దర్శనము చే నా పాపములు దగ్ధమై, నా భవిష్యత్ అత్యంత శుభతరమగును." అంత దత్తుడు "రాజా! నేను మీ అద్భుత బాలకుని చూచుట కేతెంచితిని. ఆతనిని పిలువ వలసినది" అని పలికెను. అంత రాజు ఆనంద తరంగుడై, అంతలోనే దు:ఖము ముప్పిరిగొన ఇట్లనియె "ముని ప్రవరా! నా తపోదానవ్రత యజ్ఞాయులన్నియు వృధా అయినవి. జగదీశ్వరుడు నాకు ప్రసాదించిన పుత్రుడు నాకు హృదయశల్యమయ్యెను. నా పుత్రుడు అదర్శనీయుడగుటచే నేను సహితము అదర్శనీయుడనైతిని."

అంత రాజు తన పుత్రుని పిలిపించెను. మహర్షి ఆ బాలుని చూచి తన కనులు మూసి, అర్ధనిమీలిత నేత్రుడై, కొంతసేపు మౌనము వహించి పిదప కనులు తెరచి ఇట్లనియె "రాజా! నీ పుత్రుడు సర్వరాజనీకమును జయించి ఏకఛత్రాధిపత్యముగ అఖండరాజ్యమునేలును. నీవు సంకటహారచతుర్థి జాగరణ సమయమందు ఆవులించిన పిదప ఆచమనము కావించుట మరచితివి. అందువలన ఆ పరమ పవిత్ర వ్రతము అవహేళనకు గురి అయినది. తత్ఫలితముగ నీ పుత్రుడు అంగవైకల్యము నొందెను. కానీ ఈతడు సర్వాంగ సుందరుడగుటకు ఒక ఉపాయమున్నది" అని పలికి మహర్షి ఆ బాలునికి విధి విధానముగ శ్రీగణేశుని ఏకాక్షర మంత్రమును ఉపదేశించెను. తదుపరి బాలునితో "నాయనా! ఈ విధి విధానములను నీవు ఉపవాసము, ఏకభుక్తము, నియమ పాలన కావించుచూ పన్నెండు సంవత్సరములు శ్రీగణేశుని ఆరాధింపుము. తదనంతరము నీకు ఆ పరమాత్ముని దర్శనము కలుగును. ఆయన పరమ పవిత్ర దృష్టిపాతము నీపై బడంగనే నీవు దివ్యదేహుడవగుదువు." ఈ విధముగ పలికి మహర్షి వారికి వీడ్కోలు పలికి అంతర్ధానుడయ్యెను. అంత వికలాంగుడయిన ఆ బాలుడు తన తండ్రితో తనను తపార్ధము వనములకు పంపమని కోరెను. మాతాపితరులిరువురు ఆ అభ్యర్ధనకు మిక్కిలి రోదించిరి. ఎట్టకేలకు మనసు కుదుటపరచుకొని ఒక పల్లకీ యందు ఆ బాలుని కూర్చుండబెట్టి వనములకు పంపిరి. భృత్యులు ఆ బాలుని వనమందు ఒక పర్ణకుటీరమందు వదలి వెనుకకు ఏతెంచిరి. కార్తవీర్యుడు తపమాచరించుటకు కృతనిశ్చయుడై ఆ పర్ణ కుటీరమందు నివసింపసాగెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి కార్తవీర్య జననమను డెబ్బది రెండవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది మూడవ అధ్యాయము

(కార్తవీర్యుడు సహస్రార్జునుడగుట)

ఇంద్రుడు తిరిగి శూరసేనునకి చెప్పదొడంగెను "ఆ పన్నెండేండ్ల బాలుడు ధృఢనిశ్చయుడై అత్యంత భక్తియుతుడై, దత్తాత్రేయుని చే తనకీయబడిన మంత్రమును నియమబద్ధముగ జపించుచూ, నిరాహారి, వాయుభక్షణుడై, పాషాణము

మాదిరి పన్నెండేండ్లు కఠోర తపమాచరించెను. ఆ బాలుని తపమునకు మెచ్చి, శ్రీగణేశుడు పగడములకాంతితో ప్రకాశించుచూ కొలను నుండి బయటకేతెంచి ఇట్లనియె "బాలకా! పన్నెండేండ్లు ఒంటరిగా ఈ సింహ వ్యాఘ్రయుతమయిన వనమందలి నికుంజమందు ఏల తపమాచరించుచుంటివి? నీ మనోవాంఛితమేమి? నాకు తెలుపవలసినది." అంత కార్తవీర్యుడు దేహ భావనయొంది, కన్నులు తెరచి తాను అంతకుమందు మునులు, మహర్షుల ద్వారా వినిన శ్రీగణేశ రూపతత్వములను గుర్తుకుతెచ్చుకొని ఇట్లనియె "మహాప్రభూ! నాకు మీ చరణకమలములపై ఏకాగ్రభక్తిని ప్రసాదింపవలసినది. నా కొరకు నాకేవిధమయిన ఇతర కోరికలు లేవు. దేవేశా! నా తలిదండ్రులు నా యొక్క వికలాంగత్వమునకై మిక్కిలి ఖేదమునొందుచున్నారు. అందువలన వారి సంతోషార్థము నా శరీరమును సహితము ఇతరుల వలెనే సంతుష్ఠయోగ్యము కావింపుము." అంత శ్రీగణేశుడు అణిమాసిద్ధితో ఆ బాలుని శరీరమున ప్రవేశించెను. తక్షణము ఆ బాలుడు దివ్యదేహుడై, సహస్రబాహువులతో, బలమయిన ఊరువులు, పాదములతో పర్వత సమానుడై నిలచెను. అత్యంత దారుఢ్యమయిన దివ్య దేహముతో సర్వాంగ సుందరుడయిన కార్యవీర్యుని పై ఋషి, దేవ గణములు పుష్పవృష్టి కురిపించి వారందరూ శ్రీగణేశుని స్థుతించి, కార్తవీర్యుని ప్రశంశించిరి.

అంత సహస్రబాహు శోభితుడయిన కార్తవీర్యుడు భయంకర గర్జన చేసెను. ఆ మేఘగర్జన యముని సహితము భీతిగొల్పినదనిన మిగిలిన వారి సంగతి చెప్పనేల? పృధివి యందలి సమస్త రాజనీకము భయకంపితులైరి. అంత బ్రహ్మాది దేవతలు ఏతెంచి ఈ విధముగ వరములిచ్చిరి "నీ స్మరణచే ఎవరు ఏ వస్తువులు పోగొట్టుకొనిన (దొంగిలింపబడిన) వానిని తిరిగి పొందెదరు. నీవు "సహస్రార్జునిగ" ప్రసిద్ధినొంది విష్ణు స్వరూపుడవై, సర్వుల మనోవ్యధలను దూరమొనర్చెదవు. నీవు ఒక కల్ప పర్యంతము త్రిలోకముల యందు విఖ్యాతినొందెదవు. నీకు శత్రు భయంకరుడవై వారిపై విజయము నొంది, సాధు శరణాగతులయందు తత్పరుడవై భూమండలమును ఏకఛత్రాధిపత్యమున పాలించెదవు." ఈ విధముగ వరములిచ్చి వేల్పులు అంతర్ధానమొందిరి. భూమండలమందలి సమస్త రాజనీకము ఆయనకు గజ, రధాశ్వ, ఛత్ర చామర, దీప, నరయానము (పల్లకీ) లను బహూకరించిరి.

అంత కార్యవీర్యుడు ఒక విశాలమందిరమును నిర్మించి శ్రీగణేశుని పడగముల మూర్తిని వేదపండితులచే ప్రతిష్ఠింపజేసి దానికి "ప్రవాళగణపతి" అని నామకరణము చేసెను. ఆ కార్యక్రమము ఆచరించిన బ్రాహ్మణోత్తములకు అనేక గ్రామములు, అగ్రహారములు దానమొనర్చెను. అప్పటినుండి ఈ సిద్ధక్షేత్రము "ప్రవాళక్షేత్రము" అను పేరున ప్రసిద్ధి నొందెను. ఈ ధరణీధర గణపతి స్మరణము, కథాశ్రవణము, సర్వ కామనలను ఈడేర్చును. తదుపరి కార్తవీర్యుడు అచట గల బ్రాహ్మణోత్తములను, రాజులను, సర్వ జనులను యధావిధిగ సత్కరించి, వారి మన్ననలతో తన తల్లిదండ్రుల దర్శనార్థము తన నగరమున కేగెను. ఆతని దివ్య దేహమును, సహస్ర బాహువులను, సర్వాంగ సుందరత్వమును గాంచిన పురవాసుల, కృతవీర్య దంపతి ఆనందమునకు అవధులు లేకుండెను. తదుపరి కృతవీర్యుడు ఈ వ్రతమును భూలోకమంతయు ప్రచారము కావించెను. దేవగణములు, చంద్రసేనుడు మొదలగు రాజులు ఈ వ్రతమునకు మరింత ప్రచురతను సంతరింపజేసిరి. ఈ వ్రతము అత్యంత పుణ్యప్రదము మరియు స్మరణమాత్రమున సిద్ధులను ప్రసాదించునది. ఈ వ్రతాచరణముచే రావణుడు సర్వజ్ఞుడయ్యెను; పాండవులు రాజ్యప్రాప్తి నొందిరి.

ఇంద్రుడు ఈ విధము పలికి "రాజా! ఈ వ్రత ఫలితమును నీ రాజ్యమందు ఎవరేని నాకు దానమొసంగిన ఎడల ఈ విమానము తిరిగి ప్రయాణించును." మహారాజు శూరసేనుడు ఇంద్రుడు ద్వారా ఈ సంకటహార చతుర్థీ మహాత్మ్యమును విని, కొంతసేపు స్వాత్మానందమునందు నిమగ్నుడై, తదుపరి ఇంద్రుని చరణములపై బడి "ప్రభూ! నా పూర్వ పుణ్యములు ఘనీభూతమై, మీ ద్వారా ఈ దివ్య వ్రతము గూర్చి వింటిని. దీనికంటె పుణ్యతరమయిన కర్మ త్రిలోకముల యందునూ వేరొకటి యుండదు" అని పలికి, తాను స్వయముగ ఈ వ్రతాచరణము ఆరంభించెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి కార్తవీర్యుడు సహస్రార్జునుడగుట యను డెబ్బది మూడవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది నాల్గవ అధ్యాయము

(ఛాండాలినీ చరితము)

వ్యాసుడు ఈ అమృత చరితమును బ్రహ్మదేవుని వద్ద వినుచూ "పితామహా! తదుపరి శూరసేనుడు ఏమి చేసెను? "అని ప్రశ్నించెను. బ్రహ్మ "శూరసేనుడు తన దూతలను పిలచి ఈ రాజ్యమందు వెదకి వెదకి ఎవరు ఈ సంకటహార చతుర్థీ వ్రతమాచరించుండిరో వారిని గొనిరావలసినదని పంపెను. దూతలు సర్వ ప్రదేశములు వెదకుచూ, ఒకచోట ఒక దివ్య విమానమును గాంచిరి. ఆ విమానమందు శ్రీగణేశుని దూతలు దివ్యదేహులై యుండిరి. ఆ విమానము ఒక దుష్ట ఛంధాలిని యొక్క గృహమునకు అభిముఖముగ ఆగినది. ఆ ఛండాలిని శుష్కదేహిని; జటలుగట్టి సంస్కార రహితమయిన కురులు, లోతుకు వెళ్ళిన కనులు, పుచ్చిపోయిన పళ్ళు, ఛిద్రమయిన నాసిక, చేటల వంటి చెవులు, వికృతదేహము, కర్ణ కఠోరమయిన స్వరము, దుర్గంధభూయిష్ఠమయిన శరీరము కలిగి యుండెను. అయిననూ ఆమెను తీసుకుని వెళ్ళుటకు శ్రీగణేశుని దూతలు ఉద్యుక్తులగుచుండుటచే శురసేనుని దూతలు ఈ విధముగ ప్రశ్నించిరి "మహాభాగులారా! ఈ స్త్రీ ఏ పుణ్యము చే ఈ దివ్యస్థితి నొందుటకు నోచుకున్నది?" అంత శ్రీగణేశుని దూతలు ఇట్లనిరి.

పూర్వకాలమున బంగాళదేశమున "సారంగధరుడు" అను క్షత్రియుడుండెడు వాడు. ఆయనకు "సుందర" అను అత్యంత సౌందర్యరాశి అయిన కుమార్తె యుండెడిది. ఆమె కలకంఠి, చంద్రముఖి, రతీదేవిని తలదన్ను సౌందర్యము, నాట్యశాస్త్ర నాయికులను మించు హొయలు, మునీశ్వరులకు సహితము చిత్తవిభ్రంశము కావించు మోహవత్వము కలిగి యువతను పిచ్చివారిని కావించునది. ఇంత సౌందర్యమున్నప్పటికీ ఆమె మనస్సు జారత్వమందు, నిరంతర భోగలాలస యందు, బహుమూల్య వస్త్రభూషణముల యందు నిమగ్నమై, లజ్జారహితయై రతి సుఖము అనుభవించు చుండెడిది. ఆమె తండ్రి ఆమెను "చిత్రుడు" అను నామము గల వ్యక్తితో అంగరంగ వైభవముగ వివాహమొనరించెను. కానీ ఆ దుష్ట స్త్రీ తన పతిని మోసగించి తన ప్రియలతో సంగమించెడిది. ఒక నాటి రాత్రి తన పతి శయనించిన పిదప సుందర వస్త్రభూషణములు దాల్చి బయటకు బయలుదేరెను. అంత చిత్రుడు అదిగమనించి, క్రోధోద్రిక్తుడై ఆమె కరము పట్టి, ఆమె ప్రవర్తనను దూషించెను. కానీ కామార్త, దుష్ప్రవర్తన గల సుందర తాను శాంతము వహించి, తగు వచనములతో శాంతపరచి, ఆ అంధకారమున తన రెండవ చేతి యందు ఛురిక ధరించి, దానితో చిత్రుని పొడచి, హతమార్చి, తన ప్రియులతో సంగమించుటకు బయటకు ఏగెను. సుందర తన పతిని అతి గోప్యము హతమార్చితిని అని తలంచెను. కానీ ఆ సర్వస్వము ఆమె ప్రక్క ఇంటివారు కాంచి, రాజునకు ఫిర్యాదు చేసిరి. రాజభటులు ఆమె గృహమున కేతెంచి, అంధకారమున గృహాంతర్భాగమందు దాగుకొని, సుందర తన ప్రణయ కలాపములు ముగించుకొని గృహమున కేతెంచిన మరుక్షణము ఆమెను బంధించి, రాజ సమ్ముఖమున ప్రవేశపెట్టిరి. రాజు ఆమె ప్రవర్తనను అసహ్యించుకొని ఆమెకు మరణశిక్షను విధించెను. శిక్ష తక్షణము అమలుచేయబడి సుందర మరణించెను.

ఆమెను యమదూతలు గైకొని ఘోర నరకమందు అధోముఖముగ పడవైచిరి. అందలి క్రిమి కీటకములు ఆమెను చిత్రవధ చేసెను. తాను కావించిన దుష్ప్రవర్తన, మరియు దుష్కృత్యములకు ఫలితమనుభవించుచూ సుందర ఒక కల్ప కాలము ఆ దుర్భర నరకమనుభవించి తిరిగి భూలోకమున ఈ ఛండాలినిగ జన్మించెను. ఒకానొకనాడు ఆమె మదిరాపానమత్తయై దినమందు నిద్రించి, రాత్రి ప్రథమ ప్రహరము గడచిన పిమ్మట అత్యంత క్షుధార్తయై, అన్నార్థము ఒక గృహమునకు యాచనకేగెను. ఆ దినము సంకటహార చతుర్థి, ఆ గృహస్థు పెట్టిన మాధూకరమును ఛండాలిని చంద్రోదయమయిన పిదప భుజించి అప్రయత్నముగ శ్రీగణేశ నామము ఉచ్ఛరించెను. అందువలన శ్రీగణేశుడు

కృపాళువై తక్షణము ఆమెను తెచ్చుటకు విమానము పంపెను." శ్రీగణేశదూతలనుండి ఈ వృత్తాంతమంతయు వినిన రాజదూతలు వారికి ఇంద్రుని ప్రస్థానము, విమాన పతనమును, తాము సంకటహార చతుర్థి కావించిన మనుష్యుని గూర్చి వెదకుటయు, సర్వమును వారికి వివరించి ఈ ఛండాలిని కనుక తన పుణ్యమును ఇంద్రునికి ధారపోసిన ఎడల ఈమె పుణ్యము ద్విగుణీకృతమగునని, తద్వారా ఇంద్రుని విమానము తిరిగి పయనమగునని, ఈ విధముగ సర్వులు కృతార్థులు అగుదురని తెలిపిరి. కానీ శ్రీగణేశ దూతలు "మా స్వామి మాకు ఈమె పుణ్యమును ఇతరులకు ధారపోయు ఆజ్ఞను ఈయలేదు" అని తెలిపి ఆమెను విమానమందు ప్రతిష్ఠించిరి. తక్షణము ఆ ఛండాలిని దివ్యదేహురాలై, దివ్యాభరణ భూషిత అయినది. ఈ విషయము రాజదూతలు శూరసేనునికి తెలిపిరి. వారందరూ అబ్బురపడుచుండగా ఆ దివ్య విమానము దశ దిశలనూ ప్రకాశమొనర్చుచూ అంబరము ప్రవేశించుట కాంచిరి. అంత దివ్యదేహిని అయిన ఛండాలిని దృష్టి ఇంద్రుని విమానము పై బడినది. ఆమె విమానమును స్పర్శించిన గాలి ఇంద్ర విమానమును తాకుట చే సంకటహార వ్రత పుణ్యఫలము చే దృష్టి గత దోషములు నశించి, ఇంద్రుని విమానము సహితము పైకిలేచి పయనమునకు సిద్ధమయ్యెను. అంత దేవతలు స్వర్గమునకు, ఛండాలిని శ్రీగణేశ దివ్య సముఖమునకు ఏగిరి. ఈ వృత్తాంతమును ఏ మానవుడు ప్రయత్నపూర్వకముగ శ్రవణము కావించిననూ వినిపించిననూ, సర్వసంకట విముక్తుడై, మనోవాంఛితములను ప్రాప్తించును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి ఛండాలినీ చరితమును డెబ్బది నాల్గవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది అయిదవ అధ్యాయము

(శూరసేన ఉద్ధరణ)

బ్రహ్మదేవుడు "శూరసేన మహారాజు సంకష్టహార చతుర్థి యొక్క మాహాత్మ్యమును విని, కన్నులారా కాంచి, తాను సహితము ఆ వ్రతమొనర్పవలెనని సంకల్పించి, ముని శ్రేష్ఠుడయిన వశిష్ఠుని చేరి "మహర్షీ! నేను శీఘ్ర ఫల ప్రదాయకమయిన సంకటహార చతుర్థీ వ్రతమాచరింప దలచితిని. దయచేసి నాకు మంచి ముహూర్తమును నిర్ణయింపవలసినది" అని పలికెను. అంత వశిష్ఠుడు "రాజశ్రేష్ఠా! సర్వసిద్ధి కారకమయిన ఆ వ్రతమును మాఘకృష్ణ చతుర్థీ, మంగళవారము ఆచరింప వలసినది" అని తెలిపెను. రాజు ఆ తిథి వరకు ఎంతో ఉత్సుకతతో వేచి, ఆ వ్రతమునకు వలయు సంభారములన్నియు సంగ్రహించి, తన పత్నీ సహితుడై, ఎంతో భక్తి భావముతో ఆ వ్రతమొనర్చెను. ఆ రోజు ఉదయమే లేచి, ప్రాత:స్నానము, సంధ్యావందనాది నిత్యకర్మలు సంపన్నమొనర్చి, శ్రీగణేశ ధ్యానమందు తత్పరుడై, ఒంటికాలి బొటనవ్రేలిపై సాయంత్రము వరకు నుంచొని, సాయంత్రము తిరిగి స్నాన: సంధ్యలు పూర్ణమొనర్చి, వశిష్ఠ మహర్షి సహాయమున శ్రీగణేశారాధన ప్రారంభించెను. కదళీతరువులతో అద్భుత మండపమును నిర్మించి, దానిని వస్త్ర భూషణ చామరములతో అలంకరింపజేసి, దర్పణములనమర్చి, పుష్పమాలలు వ్రేలాడదీసి, నానా విధములయిన మణిదీపములను ప్రజ్వలింపజేసి, ఆ మండపమును సర్వాంగ సుందరముగ తీర్చిదిద్దెను. ఆ మండప మధ్యమున స్వర్ణకలశముంచి, దానిపై శ్రీగణేశుని స్వర్ణప్రతిమను ప్రతిష్ఠించెను. ఆ ప్రతిమకు పట్టు వస్త్రము చుట్టి, ఆభూషణములు పెట్టి అలంకరించెను. ఆ సమయమున పండితులు పురాణ ప్రవచనములు, గాయకులు భజన, నర్తకులు నాట్యము, వాద్యకారులు రకరకములయిన వాద్యములు మ్రోగించుచుండిరి.

ఆ సమయమున మహారాజు వైదిక మంత్రములతో శ్రీగణేశమూర్తికి పూజనమొనరించి, పంచామృత స్నానము

చేయించి, షోడశోప చారములు కావించెను. అటు పిదప మోదకములు, అపూపములు, లడ్లు, పాయసము, పంచామృతములు, వివిధ వ్యంజనములు, సుగంధ జలములు, ఆ పరమాత్మని ముందుంచి, నైవేద్యము సమర్పించెను. తదుపరి అనేక ఫలములు, పూగీఫల సమాయుక్త తాంబూలము, రత్నసహిత సువర్ణ దక్షిణ, దూర్వాంకురముల సహిత ఆరతి, అనేక పుష్పములతో పుష్పాంజలి అర్పించెను. పిదప బ్రాహ్మణ సమారాధన కావించి వారి భోజనములు అయిన పిదప పదివేల గోవులు, వస్త్రభూషణాదులు, సువర్ణదక్షిణ వారికొసగి, వారి శేషమును తన బంధు మిత్రులతో కలసి భుజించెను. ఆ రాత్రి, గీతా, వాద్య, ప్రవచనాదులతో జాగరణ యొనర్చి మరునాడు ఉదయము తిరిగి స్నాన:సంధ్యాదులు కావించి, శ్రీగణేశ పూజనమొనర్చి, శ్రీగణేశ ప్రతిమతో సహా మండపమొత్తమును వశిష్ఠునకు దానమొనర్చెను. తక్షణము శ్రీగణేశుడు సంప్రీతుడై ఆ మహారాజు కొరకు ఒక దివ్య విమానమును పంపెను.

ఆ విమానమందు శ్రీగణేశ సారూప్యులు అయిన దూతలు క్రిందికి దిగి రాజుతో "మహారాజా! శ్రీగణేశుడు నీ పూజకు ప్రీతుడై నీ కొరకు ఈ విమానము నంపెను" అని పలికిరి. ప్రజలందరూ "మహారాజు యొక్క పుణ్య ప్రభావమున దేవలోకమునకేగుటకు ఈ దివ్య విమానము పంపబడినది" అని తమలో తాము గుసగుస లాడుచుండిరి. శూరసేన మహారాజు ఆ పలుకులు విని ఆశ్చర్యచకితుడై, కళ్ళవెంట అశ్రుధారలు కురిసి, గొంతు గాద్గదికమై, శరీరము రోమాంఛమై ఇట్లనియె "జగదీశ్వరుడు, అవ్యక్తుడు, అప్రమేయుడు, నిత్యుడు, అవాఙ్మానసగోచరుడు, అయిన శ్రీగణేశుడు నన్ను దర్శింప ఉత్సుకుడైయ్యెనన, దానికి హేతువు నాకు దృష్టిగోచరమగుట లేదు. వేద శాస్త్రములు ఎవరి నిరూపణమందు సమర్ధులు కాదో, బ్రహ్మాభర్గాదులు ఎవరిని నిరంతరము స్మరించుచుందురో అట్టి శ్రీగణేశుడు నన్ను పిలిచెనన నా అంతటి భాగ్యశాలి వేరొకడుండడు." అంత శ్రీగణేశ దూతలు "నిరాకారుడయిన శ్రీగణేశుని సాకారునిగ మార్చు భక్తి యొక్క మహిమను మేము వర్ణింపలేము." అంత రాజు "దూతలారా! నేను నా ప్రజలను విడచి ఒక్కడినే ఎట్లు రాగలను? వీరు లేనిదే నేను ఏమియును భక్షింపజాలను. ఓ! అనఘులారా! వీరు లేక నేను పరమానందము భోగింపలేను." అంత దూతలు "రాజా! నీ కోరిక ఏదైననూ దానిని పూర్ణమొనర్పవలసినదే!" అని పలికిరి. అంత చాతుర్వర్ణముల ప్రజలు ఆ విమాన మధిరోహించిరి. వారందరూ పరస్పరము "ఏమి ఆశ్చర్యము? మనము లేశమయిననూ పుణ్యమాచరింప లేదు. అయిననూ మనకు ఈ అర్హత కల్పింపబడినది." మరికొందరు "చింతామణి స్పర్శచే ఇనుము లేక ఏ లోహమైననూ స్వర్ణమగును. ఎంతటి పాపి అయిననూ సజ్జన సాంగత్యము చే సిద్ధినొందును కదా! అట్లే మన మహారాజు యొక్క పుణ్యబలమున మనకునూ ఈ సౌభాగ్యమబ్బినది."

అంత దూతలు ఆ వినామును కదుపుటకు ప్రయత్నించిరి. కానీ ఆ విమానము కదలదయ్యె! సర్వుల మది చింతాక్రాంతమయ్యెను. సర్వులు "భాగ్యహీనులకు నిధి ఎట్లు ప్రాప్తించును? ఈ విధముగ తమలోతాము చర్చించుచూ, తర్కించుచూ నలుప్రక్కలా చూచిరి. వారికి ఆ గుంపునందు ఒక కుష్ఠ వ్యాధితుడు కనబడెను. అంత కొంతమంది రాజుతో "ఈ కుష్ఠ వ్యాధిగ్రస్తుని దూరమొనర్చిన వెంతనే ఈ విమానము పైకి ప్రయాణించును" అని పలికిరి. అంత రాజు ఆ దూతలతో పాపాచరణుడైన నన్ను ఇచట వదలి, వీరందరినీ శ్రీగణేశ సమ్ముఖమునకు తీసికొని వెళ్ళవలసినది. లేని ఎడల ఈ కుష్ఠరోగి యొక్క పూర్వ జన్మమును, ఈతడు ఈ విమానమధిరోహించి, అందరితో ప్రయాణింపగల ఉపాయమును వివరింప వలసినది." అంత దూతలు "రాజా! చింత వలదు. నీకు నీ ప్రశ్నల యొక్క సమధానమును తెలిపెదము" అని పలికిరి.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి శూరసేన ఉద్ధరణ అను డెబ్బది ఐదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఆరవ అధ్యాయము

(బుధ చరితము; శ్రీగణేశ నామ మహిమ)

శ్రీగణేశదూతలు శూరసేనునితో "ప్రాచీనకాలమందు గౌడదేశమందలి గౌడ నగరమందు "దూర్వుడు" అను తపస్వీ, జ్ఞాని, సుర భూసుర పూజనమొనర్చు బ్రాహ్మణోత్తముడు యుండెడువాడు. ఆతని ధర్మపత్ని "శాఖిని". వారికి లేకలేక ఒక పుత్రుడు జన్మించెను. ఆ పుత్రునికి వారు "బుధుడు" అని నామకరణమొనర్చి, అల్లారుముద్దుగా పెంచిరి. ఒకే ఒక్క కుమారుడగుటచేత అత్యంత గారాబము చేసి, ఎల్లప్పుడూ భూషణములతో అలంకరించెడివారు. బుధుడు కామదేవుని వంటి సౌందర్యశాలి. యుక్తవయస్సు వచ్చిన పిదప ఆతనికి "సావిత్రి" అను కన్యతో వివాహమొనర్చిరి. ఆ సాధ్వి సత్యవంతుని భార్య సావిత్రి వంటి పతివ్రత. మహావృక్షమందు చీడపురుగు జన్మించునటుల, ఇందరు సత్ప్రవర్తనాపరుల మధ్య తులసి వనము నందు గంజాయి మొక్క వలె బుధుడు పరమ దుర్మార్గుడయ్యె! అతనికి నిరంతరము మదిరాపానము, పరస్త్రీ గమనము, పరనింద, నిరంతర పాపకర్మ, అలవాటుగ మారెను. ఈ విధముగ సమయము గడచుచుండగా పురుషులను తన మోహజాలమందు ముంచు ఒక వేశ్య ఆ నగరమున కేతెంచెను. సామాన్యముగనే పరస్త్రీ గమనము గల బుధుడు ఈ వేశ్యను కాంచగనే ఉచ్ఛనీచములు సంపూర్ణముగ మరచెను. తదుపరి ఈతడు కావించిన నీచకృత్యములు తెలిపెదము. వినుము. బుధుడు తన తల్లిదండ్రుల ఆభూషణములు ఒలిచి, ఒక పెట్టెయందు పెట్టి, వాటిని తీసికొని ఆ వేశ్యకు సమర్పించి నిరంతర కామసౌఖ్యమనుభవించెను. యోగులు ఇంద్రియ విషయ భోగములను విడచి ఎట్లు ఏకాగ్రముగ బ్రహ్మమందు వినీలులగుదురో అట్లే బుధుడు సర్వమును విడచి కామాగ్నిచే విహ్వలుడై, ఆ వేశ్యతో సమయము గడుపసాగెను.

ఎంతకు ఇంటికి రాని తమ పుత్రుని కొరకై దు:ఖితులై ఆతని మాతాపితరులు ఆకలి, దప్పికలు విస్మరించి ఆతని కొరకై నిరీక్షింపసాగిరి. "దీపము లేని రాత్రి, నీరు లేని నుయ్యి, పుత్రులు లేని స్త్రీ, ఎట్లు శోభాహీనులగుదురో, అట్లే మన పుత్రుడు లేక మన గృహము నిరర్థకమయినది. మన ప్రాణ రక్షకుడు, మన ప్రియ పుత్రుడు ఎపుడు ఏతెంచును?" ఈ విధముగ ఆ దంపతి మితిమీరిన పుత్ర వ్యామోహము తో రోదించుచుండిరి. ఒకనాడు దూర్వుడు ఒక కర్ర పట్టుకొని దాని సహాయముతో, ఆగ్రామమందలి ఇంటింటికి ఏగి తన పుత్రుని కొరకు వెదకసాగెను. దూర్వుడు క్షుధా పిపాసలచే బాధితుడై కన్నులు బైర్లు క్రమ్మసాగెను. అయిననూ ఖాతరుచేయక పుత్రుని వెదుకసాగెను. అతనికి అత్యంత వృద్ధుడు, పరమ భయంకరుడైన "భీముడు" అను శూద్రుడు కానబడెను. దూర్వుడు ఆతనిని తన పుత్రుని గూర్చి ప్రశ్నించెను. అంత భీముడు "నీ పుత్రుడు వేశ్యాలోలుడై ఆమె చెంతనే కాలము గడుపుచుండెను. ఓ! ద్విజశ్రేష్ఠా! నీది వృథాప్రయాస. అయిననూ ఇచట ఎవరు ఎవరికి పుత్రుడు? తండ్రి, భార్య, తల్లి? ఈ ప్రపంచమందు ఎవరు ఎవరికీ ఏమియునూ కారు" అని పలికెను. సర్వశాస్త్ర పారంగతుడయిన దూర్వుడు పుత్ర వ్యామోహమున ఆ పలుకులందలి సత్యమును గ్రహింపక, "నా పుత్రుడు వేశ్యాలోలుడెట్లయ్యెను?" అని చింతించుచూ ఆ వేశ్యా గృహమునకేగి, అచట మదిరా పానమత్తుడయిన బుధుని గాంచి, క్రోధ పరవశుడై ఇట్లనియె "దుష్టుడా! నీ కంటె ఒక కంటక వృక్షము లేక ఒక రాయి నయము. నీ జీవనము వలన ఎవరికి లాభము? నీ వంటి పుత్రుడు బ్రతికియుండుట కంటే మృతుడగుట మేలు." అంత బుధుడు తన తండ్రి పలికిన కఠోర వచనములు విని అత్యంత క్రోధితుడై, తన తండ్రి ముఖముపై బలముగ ప్రహరించి "ఓ! నరాధమా! క్రిమి కీటకములు సహితము మనుష్యుల వలెనే రతి సుఖము అనుభవించును. అటువంటిది అత్యంత రతిసుఖమనుభవించుచున్న నాకు నీవు విఘ్నమేల కల్పించితివి?" అని పలికి తన వద్దనున్న బలమయిన కర్రతో తన తండ్రి తలపై ప్రహరించెను. అంత ముదుసలి అయిన దూర్వుడు తక్షణము ప్రాణములు విడచెను. అంత బుధుడు

"శివ, శివ" అని పలికి, తండ్రి మరణించినందుకు ప్రసన్నుడై, ఒక త్రాటితో ఆయన పాదములు, చేతులు కట్టి, ఈడ్చి దూరముగ విసరివైచి, తిరిగి వెనుకకు వచ్చి, ఏమియును జరుగనటుల మదిరాపాన యుక్తుడై వేశ్యతో సంగమించెను.

మరునాడు ఉదయము ఇంటికి తిరిగి వచ్చిన బుధుని గాంచి ఆతని తల్లి శాఖిని, అత్యంత ఆదరముతో ఆతనిని ఆలింగనమొనర్చి "నాయనా! నీవిన్నాళ్ళు ఎచటికేగితివి? నీ కొరకై మేము ఇరువురము నిద్రాహారములు మాని నిరీక్షించుచుంటిమి. నీ తండ్రి నీ కొరకై వెదకుచూ నిన్ననగా వెళ్ళి ఇంకనూ గృహమున కేతెంచలేదు. నీవు వెళ్ళి ఆయనను వెదకి తీసికొని రమ్ము. నిన్నుగని ఆయన ఎంతో సంతోషించును." ఈ విధముగ ఎంత ప్రయాసపడి బ్రతిమిలాడిననూ బుధుడు కదలకుండెను. తల్లి పదేపదే అడుగుటచే ఆతడు క్రోధితుడై దగ్గరనే యున్న ఒక దండముతో తల్లి శిరముపై ఒక్కమారు ప్రహరించెను. అంత శాఖిని చేతనాహీనయై మరణించెను. ఆమెను సహితము ఒక రజ్జువుతో కాలుచేతులు కట్టి, దూరముగ విసరివైచి, ప్రసన్నుడై తిరిగి వేశ్యాగృహమున కేగి సురతసుఖము అనుభవింపసాగెను. ఆ నగరవాసులు ఆతని దుశ్చేష్టితములను అసహ్యించుకొని, ఆ మృత దంపతికి యధావిధిగ అంత్యేష్టి సంస్కారములొనర్చిరి. ద్విజాధముడయిన బుధుడు దండనీయు డయినప్పటికీ బ్రాహ్మణుడు కావున రాజు దండింపక వదలిపెట్టెను.

తిరిగి ఒకనాడు గృహమున కేతెంచిన బుధునికి ఆతని భార్య ఇట్లు వచించెను "ఓ! ప్రాణనాథా! మీకొక విషయము తెలిపెదను. వినుడు. మీ జన్మము అత్యంత విఖ్యాతము, అతి నిర్మలము అయిన బ్రాహ్మణకులమునందు ఉద్భవించినది. కానీ మీ ఆచరణ అందుకు సంపూర్ణముగ విరుద్ధముగ యున్నది. మీరు వివేకవంతులై ఆ దురాచారమును త్యజింప వలెను. ఇహలోకమందున్నప్పుడే పరలోక పుణ్య గతులకు ప్రయత్నింపవలెను. యువావస్థయందున్నప్పుడే ప్రయత్నపూర్వకముగ ఆర్జించి వృద్ధావస్థయందు సుఖముగ యుండు కార్యాచరణము కావింపవలెను. వర్షాకాలము నాలుగు మాసములు సుఖముగ యుండుటకు వత్సరమందలి మిగిలిన ఎనిమిది మాసములు శ్రమింపవలెను. రాత్రియందు సుఖనిద్ర పోవుటకు దినమందు సుకర్మ మాచరింపవలెను. మీరు మీ తండ్రికి సుపుత్రులగుట, మీదు మిక్కిలి బ్రాహ్మణులగుటచే మహారాజు మిమ్ము దండింపకుండెను. అత్యంత సుందరినీ, నిరంతరము మిమ్ములను అనుసరించు ధర్మపత్నినైన నన్ను వదలి మీకు ఈ వేశ్యాలంపటమేల? సర్వత్ర లోకులు మిమ్ము నిందించుచున్నారు. కానీ మీ భయవశమున మీ ఎదుట ఏమీ అనుట లేదు. జనులు నన్ను "ఓ! శుభాంగీ! నీ పతి ఎట్లున్నాడు?" అని పలుకరించునపుడు నాకు తలవొంపులతో ప్రాణ త్యాగము ఒనరింపవలెనన్న కోరిక కలుగుచున్నది. స్వామీ! మీరు దివారాత్రములు నాతో రతిసుఖనుభవించిన అది దోషయుక్తము కాదు. నేను మీ యందలి అత్యంత ప్రేమతో పలికెడి హితవచనములు విని వేశ్యాలంపటము మానుడు. మానవుడు అవశ్యము తాను కావించిన శుభాశుభ కర్మలయొక్క ఫలితము అనుభవింపవలయును. అందువలన ప్రయత్న పూర్వకముగ దష్కర్మాచరణ మాని సత్కర్మాచరణము చేయవలెను. లేని ఎడల మానవుడు ఇహపరముల రెంటియందునూ నష్టపోవును." ఆ ధూర్తునకు ఆ హిత వచనములు కర్ణశూలములై, కనుల అగ్నికణములు రాలుచుండగా అగ్రహోదగ్రుడై "ఓ! దుష్టచారిణీ! నీ వృధా ప్రలాపములు ఆపనిచో నీకునూ నా జననీ జనకుల గతియే పట్టును." అంత సావిత్రి "తనను ఎంతో ప్రేమతో పెంచి, విద్యాబుద్ధుల నేర్పించిన తల్లిదండ్రుల మర్యాద నిలుపని మానవుడు తన స్వపత్ని యొక్క రక్షణ ఎట్లు కావించును? పతివ్రత అయిన స్త్రీకి పతి చేతులయందలి మృతి ఇహపరలోక పుణ్యగతులను ప్రాప్తింపజేయును." అంత ఆ దురార్గుడు ఆమె జుట్టుపట్టి కర్రలతో, ముష్టిఘాతములతో, పాషాణములతో ఆమెను ప్రహరించెను. ఆమె తన పూర్వ పుణ్యముచే, అంతగా బాధింపబడుచున్ననూ, నిరంతర రామనామ స్మరణ మొనర్చుచుండెను. కానీ ఆ దుష్టుని ఘాతములు ఆమె మర్మస్థానముల యందు తగులుటచే ఆ సాధ్వి ప్రాణములు విడచెను. కానీ ఆమె కావించిన పుణ్యము, ఆమె శీలసంపద, ఆచరించిన పతివ్రతా ధర్మము, మరియు రామనామ స్మరణ మూలమున స్వర్గమునకేగి, అనేక భోగములనుభవించెను. కానీ నిరంకుశుడయిన బుధుడు ఆమె దేహమును

సహితము రజ్జువుతో కట్టి రాత్రి సమయమున దూరముగ పడవైచి, వేశ్యా సమ్ముఖమునకేగి, నిర్లజ్జయై "నీ కొరకు నేను నా భార్య, మాతా పితరులను హతమార్చితిని" అని తెలిపి నిరాటంకముగ ఆమెతో భోగములనుభవించెను.

కొంతకాలమునకు బుధుడు ఒక పర్యాయము "కాలభి" అను మున్యాశ్రమమునకు చనెను. ఆ సమయమున ముని స్నానార్థము నదికి ఏగెను. ఆయన ధర్మపత్ని "సులభ" ఆశ్రమమందుండెను. ఆ సాధ్వి పరమ సౌందర్యరాశి. ఈ దుర్మార్గుడు ఆమె ఒంటరిగ యుండుట గమనించి, పశుబలముతో ఆమెను ఆక్రమించి, అనుభవించెను. ఆ తల్లి ఎలుగెత్తి ఆక్రందించి "నా తల్లిదండ్రులు నాకు ఈ నామమును ఏల ఈయవలెను? ఓరీ! దుష్టుడా! నా భర్త లేని సమయమున వచ్చి, నిస్సహాయనైన నన్ను బలాత్కరించితివి. నీవు మరు జన్మమున కుష్ఠరోగముతో భయంకరముగ బాధింపబడుదువు. లోకులు నీ నామమును సహితము ఉచ్చరింపరు. బుధుడు కొంచెము భయభీతుడై అచటి నుండి తిరిగి వేశ్యాగృహమునకు ఏగి సర్వమును మరచి తిరిగి సురాపానము, సురత సౌఖ్యమును అనుభవింపసాగెను." బ్రహ్మ "ఈ విధముగ ఆతని దుష్కర్మములను ఎన్నింటిని వర్ణింపను? కాలాంతరమున ఈ దుష్టుడు మరణించెను. యమదూతలు ఆతనిని నరకమునకు గొనిపోయి ఒక కల్ప పర్యంతము నరకయాతనలను అనుభవింప జేసిరి. తదుపరి ఆ మాతృ పితృఘాతి, స్త్రీఘాతి, మద్యపానకర్త, గురుతల్పగామి అయిన దురాత్ముడు తిరిగి భూమిపై జన్మించి ఈ కుష్ఠరోగి గా కానబడుచుండెను." దూతలు ఈ విధముగ ఆ దుష్టుని చరితమును శూరసేన మహారాజుకు వినిపించిరి.

అంత మహారాజు భయకంపితుడై ఒక క్షణము భూమిపైబడి, తిరిగి లేచి, సంభాళించుకొని ఇట్లు ప్రశ్నించెను "ఈ రోగి దోషములు హరించి విమానము నధిరోహించు ఉపాయమేదైననూ కలదా?" అంత దూతలు "రాజా! శ్రీగణేశుని చతురక్షర నామమంత్రమున్నది. దానిని మేము నీకు బోధించెదము. నీవు ఆ రోగి యొక్క కర్ణమందు ఆ దివ్యనామమును ఉపదేశమొనర్చిన ఎడల ఈతని సమస్త దోషములు సూర్యోదయమయిన పిదప హరించు అంధకారము వలె నశించును." అని పలికి ఆ నామముపదేశించిరి. అంత రాజు జయ శబ్దముచ్చరించి ఆ చతురక్షర మహామంత్రము "గజానన" ను ఆ కుష్ఠరోగి యొక్క చెవియందు ఉపదేశించెను. తక్షణమే ఆరోగి తన దుర్గంధభూయిష్ఠమయిన శరీరమును వదలి దివ్యదేహుడై, దశదిశలు ప్రకాశము విరజిమ్ముచూ రథారోహణము కావించెను. అంత దూతలు క్షణములో ఆరోహితుల సహిత విమానముతో శ్రీగణేశ సమక్షమున కేగిరి. బ్రహ్మ "ఓ! అనఘా! సంకటహార చతుర్థి వ్రతము మహా పుణ్యప్రదము, ధర్మజనకము, యశోప్రదము, మరియు ఆయు:వర్ధకము. ఈ మహాత్మ్య శ్రవణము సహితము సర్వ సిద్ధి ప్రదాయకము. ఇయ్యది సర్వ పీడ, కష్ఠ, విఘ్నములను నాశమొనర్చునది. నేను దూర్వాంకుర ప్రభావమును, శ్రీగణేశ నామ మాహాత్మ్యమును నీకు తెలిపితిని. ఇంకనూ ఏమి వినదలచుకొంటివి?"

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి బుధచరితము - శ్రీగణేశ నామ మాహాత్మ్యము అను డెబ్బది ఆరవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఏడవ అధ్యాయము

(కార్తవీర్యుని జమదగ్ని దర్శనము)

వ్యాసుడు "పితామహా! ఇంకా ఎవరెవరు ఈ వ్రతమాచరించిరి? ఆ వృత్తాంతమంతయు వినవలెనని నాకు ఉత్సుకత కలుగుచున్నది." అంత బ్రహ్మ "పురాతన కాలమందు జమదగ్ని పుత్రుడయిన పరశురాముడు ఈ వ్రతమాచరించి తద్వారా యశస్సు, జ్ఞానము, విజయము, దీర్ఘాయువు ప్రాప్తించెను. ఈ విశేషమంతయు విస్తారముగ నీకు విశదీకరించెదను.

సహ్యపర్వత శిఖరమందు “శ్వేత ద్వీపము” అను విఖ్యాత ఆశ్రమమున్నది. అందు త్రికాలజ్ఞుడు, శాపానుగ్రహదక్షుడు, అయిన “జమదగ్ని మహర్షి” నివసించుచుండెను. ఆయన ధర్మపత్ని “రేణుక” రతీదేవి వంటి లోకోత్తర సౌందర్యరాశి. ఆమె నేత్ర దర్శనమునకై వనమునందలి హరిణములు, జలములందలి మత్స్యములు, అంబరమందలి చకోరములు అరుదెంచెడివన్న, ఇక వేరొక విషయము తెలుపనేల? ఆ సాధ్వి ఆద్యంతరహిత అయిన మూలప్రకృతి స్వరూపిణి ఈశ్వరియే! మహానుభావులయిన ఈ దంపతికి శ్రీవిష్ణు సమానుడయిన పరశురాముడు ఉద్భవించెను. ఆయన సుందర శరీరుడు, కామదేవుని వంటి సౌందర్యశాలి, మాతా పితృ వాక్య పరిపాలనాదక్షుడు, బలపౌరుషములకు విఖ్యాతుడు, సుర భూసుర, గురు, విద్వాంస, గో, వట వృక్షముల యందు పూజా తత్పరుడు. నిరంతరము వేదవేదాంగ శాస్త్ర స్మృతుల అధ్యయనమందు సంలగ్నుడు. ఆయన బుద్ధియందు బృహస్పతి, క్షమమందు ధరిత్రి, గంభీరత యందు సముద్రసమానుడు. ఆతడు ఒకనాడు తన మాతిపితరుల అనుమతి గైకొని విద్యాధ్యయన హేతువై నైమిశారణ్యమున కేగెను.

ఆ సమయమున భూమండలమును కార్తవీర్యుడు పరిపాలించుచుండెను. ఆయన విష్ణ్వంశ సంభూతుడు మరియు ధన ధాన్య దానతత్పరుడగుటచే ఆయన ఇంట లక్ష్మీదేవి స్థిర నివాసము ఏర్పరుచుకున్నది. ఆయన సహస్రబాహుడగుటచే శత్రువులు భయకంపితులయ్యెడివారు. ఇంద్రాది దేవతలు సహితము ఆయన సేవనమొనర్చెడివారు. ఆయన అసంఖ్యాక చతురంగబల సమేతుడు. ఆయన శంఖనాదమాలకించిన తక్షణము పంచాస్యమును గని పరుగులెత్తు కుంజర సమూహముల వలె శత్రురాజులు పరుగులెత్తెడివారు. ఒకనాడు ఆ మహీపతి తన చతురంగబల సమేతుడై వన విహారమునకేగి వన, దుర్గ, నదీ, పర్వతములను, నానా మృగ పక్షి గణములను వీక్షించుచు, కొన్నింటిని వేటాడుచూ, నెమ్మదిగ సహ్యపర్వతశ్రేణిని చేరి అచటగల శ్వేత ద్వీపాశ్రమమును కాంచెను. ఆయ్యది కైలాసశిఖరమందున్న శివధామము వలె తోపుచున్నది. రాజు తన అనుయాయులను ఆ ఆశ్రమ విషయమై ప్రశ్నించెను. వారు “మహారాజా! ఇయ్యది ద్వితీయ భాస్కర ద్యుతి సంపన్నుడు, శాపానుగ్రహ సమర్థుడు, కేవల దర్శన మాత్రము చే అనేక పాపములను దగ్ధ మొనర్పగల జమదగ్ని మహర్షి ఆశ్రమము. మీకు ఆయన దర్శనము తప్పక లభించును. అద్దానిచే మాకు సహితము శుభములు కల్గును.” అంత కార్తవీర్యుడు తన సేన నంతటినీ అక్కడే వదలి, కేవలము అతి ముఖ్యులయినవారిని వెంటబెట్టుకొని ఆ ఆశ్రమమునకేతెంచి, కుశాశనమందు ఆసీనుడై ప్రజ్వలితాగ్ని వలె వెలుగొందుచున్న జమదగ్ని మహర్షిని కాంచెను. అంత రాజు తన అనుచర సమేతుడై ఆయనకు సాష్టాంగ దండ ప్రణామములాచరించి, వినమ్రుడై దోసిలియొగ్గి నిలుచుండెను. అంత ముని వారందరినీ సాదరమగ ఆహ్వానించి, ఆసీనుల కావించి, అర్ఘ్య పాద్యాదులచే పూజించి, మధుపర్కము ప్రదానము కావించెను.

నలుదిశలా వినిపించుచున్న వేదఘోష, శాస్త్ర చర్చ, సుమధుర శబ్దోచ్చారణ వినుచూ రాజీవలోచనుడయిన కార్తవీర్యుడిట్లనియె “స్వామీ! నేడు నా తల్లిదండ్రులు, జన్మము, జ్ఞానము, తపము ధన్యమయినవి. మీరు వేరెవరోకాదు. సాక్షాత్ పరబ్రహ్మమైన పరమాత్మయే!!” ఈ సద్భాషణమును వినిన మునివరుడు అత్యంత ప్రసన్నుడై మహారాజును “రాజా! మీరెవరు? మీ నామధేయమేమి! మీ తల్లి దండ్రులెరు?” అని ప్రశ్నించెను. అంత రాజు “మునిపుంగవా! నేను కృతవీర్య తనయుడను. కార్తవీర్యుడను. నా అదృష్ట వశమున నేడు మీ దర్శన భాగ్యమబ్బినది. మీ అనుజ్ఞ అయిన ఎడల నేను తిరిగి మా రాజ్యమునకేగుదును.” అంత ముని “రాజా! నేను సహితము మీ కీర్తి, యశస్సుల గూర్చి విని, మీ దర్శనమును సహితము అభిలషించితిని. నా పూర్వ పుణ్యములు ఫలీభవించి మీ దర్శనము చే నా శరీరము, ఆత్మ, తపము, జ్ఞానము, ఆశ్రమము సర్వము సార్థకమయినవి. మీరు మా ఇంట ఆతిధ్యము స్వీకరించిన ఎడల లోకమందు నా ప్రశంశ, గౌరవము పెరుగును. అందువలన దయచేసి భోజనము స్వీకరింపవలసినది.” రాజు “మహర్షీ! మీరు పలికినది సత్యము. ఇది భోజన సమయము. మీ ఆజ్ఞను శిరసావహించి నేను భోజనము చేయవలసినదే! కానీ బ్రాహ్మణుల

ఇంట అన్నము బదులుగ జలము మాత్రమే స్వీకరింపవలెను. కానీ నేను అసంఖ్యాక సేనా సమేతుడనై ఏతెంచితిని. వారెవరూ భోజనము తినక, నేను తినుట భావ్యము కాదు. అంతేకాక మా సేన అంతటికీ భోజనమీయుటకు మీరు సమర్థులు కారు. నేను కేవలము మీ దర్శన మాత్రము చే కృతకృత్యుడనైతిని. అందువలన నాకు తిరిగి వెళ్ళుటకు అనుజ్ఞ నీయవలసినది.” అంత మహర్షి “ప్రభూ! మీ సేనా సహితులై మీరందరూ భోజనమునకేతెంచి, ఈ పవిత్ర నదీ తటమందు ఒక్క క్షణము విశ్రాంతి నొందవలసినది. క్షణములో సర్వము తయారగును. ఈ దివ్య దృశ్యమును మీరునూ కౌతుకముతో వీక్షింపవలసినది.”

రాజు మనసున కించిత్ విస్మయమొంది నదీ తీరమునకు పయనమయ్యెను. అంత జమదగ్ని మహర్షి తన ధర్మపత్నీ సహితుడై కామధేనువునకు పూజనమొనర్చి “ఓ! గోమాతా! మేము అసంఖ్యాకులైన సేనాసహిత కార్తవీర్య మహారాజును భోజన నిమిత్తము ఆహ్వానించితిమి. దయచేసి మా మర్యాద కాపాడి వెంటనే వీరందరికీ రుచికరమయిన భోజనమును సిద్ధమొనర్చ వలసినది. లేని ఎడల మేము లోకమందు అపఖ్యాతి పాలగుదుము. ఆపై మీ ఇచ్ఛ, మా ప్రాప్తి.” వారి ప్రార్ధనలాలకించి కామధేనువు ఆ నదీ తటమున ఒక మహా నగరమును నిర్మించెను. అందు రత్న ఖచిత స్థంభములు, ధ్వజ పతాకములతో కూడిన సుందర మందిరములు, అనేక లతాపుష్ప నికుంజములతో కూడిన ఉద్యానవనములు, వీనుల విందయిన వాద్యములు మ్రోతలు, స్వర్ణపాత్రలు యుంచబడిన అనేక పంక్తులు కలవు. చతుర్విధములయన భక్ష్య, భోజ, చోష్య, లేహ్యములతో కూడిన భోజన పదార్థములు, వడ్డించుటకు సిద్ధముగ యున్న దాస దాసీజనము, సర్వమును సజావుగా జరుగుటకు వలయు యంత్రాంగము, సర్వము క్షణములో సిద్ధమయినవి. ఈ విధముగ సర్వాంగ సుందరముగ తీర్చిదిద్దబడిన సుందర నగరము లోనికి భోజనార్థము కార్తవీర్యుని సేనా సహితముగ రమ్మని శిష్యులచే జమదగ్ని మహర్షి పిలిపించెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి కార్తవీర్యుని జమదగ్ని దర్శనము అను డెబ్బది ఏడవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఎనిమిదవ అధ్యాయము

(కార్యవీర్య, జమదగ్ని సంవాదము)

శిష్యులు మహీపతిని చేరి “మహారాజా! షడ్రుచులతో కూడిన భోజన పదార్థములు మీకై వేచియున్నవని మా గురువరేణ్యులు మీకు విన్నవింపమనిరి. మీరు సేనా సహితులై భోజనమునకు రావలసినదని ప్రార్ధన.” అంత రాజు సైనిక సహితుడై నది యందు స్నానమాచరించి, శుచియై ఆ భవనమందు ప్రవేశించి ఆ భవన సౌందర్యమునకు ముగ్ధుడై, విస్మయుడై, ఆయన మనసు నందు “ఈ సంపద త్రిమూర్తులకు సహితము కద్దు.” ఇది ఈ మునికి ఎట్లు సాధ్యపడినది?” అని తర్జన భర్జన చేయుచుండగా, జమదగ్ని మహర్షి ఆయన ముందుకేతెంచి, ఆ మహారాజు యొక్క అనుమతిన కర్ణపేయమయిన వాద్యగోష్ఠి నడుమ వడ్డన నారంభింపజేసెను. అటువంటి స్వాధిష్ఠ భోజనమును వారెవరూ ఈ జన్మమందు తినలేదు అనిన అతిశయోక్తి కాదు. సర్వులు తృప్తిగా భోజనము గావించి, హస్త ప్రక్షాళన మొనరించి, పక్క భవంతికేగి అచట అనేక ద్రాక్ష, దాడిమ, చెరకు, పనస ఫలములు భుజించి, ఏలక, లవంగ, కర్పూర, వక్క సహిత నాగవల్లీయుత తాంబూలచర్వణము కావించిరి. అంత మహర్షి సైనికులందరికీ యధాయోగ్యమయిన వస్త్రభూషణములిచ్చి, మహారాజుకు బహుమూల్యములయిన చీని చీనాంబరములను, సువర్ణ రత్న ఖచిత ఆభరణములను బహూకరించి

ఇట్లనియె "మహారాజా! మీరు విష్ణుస్వరూపులు. మీ వద్ద దేనికినీ కొదవలేదు. అయిననూ వన్యమునందు లభించు పదార్థములతో పొట్టపోసుకొను మా ఇంట భోజనమొనర్చి మా యశస్సును ఇనుమడింపజేసిరి. ఒక మహాపురుషుడు ఒక క్షుద్రవ్యక్తి యొక్క వచనమును మన్నించిన ఎడల ఆ క్షుద్రుడు సహితము లోకమందు ప్రఖ్యాతుడగును. ఇక నుండి లోకులు "కార్యవీర్య చక్రవర్తి జమదగ్ని మహర్షి ఇంట భోజనము చేసెనట" అని కీర్తింతురు. అంతేకాక మీరు నా వచనములను పాటించి నా విన్నపమును మన్నించుటచే మీ అరిష్టములు సహితము దూరమయినవి."

మహర్షి వచనములచే ఆశ్చర్య చకితుడయిన మహారాజు "మహర్షీ! ఈ భవనాదులన్నియు ఇంతకుమున్ను లేవు కదా! ఇవి మీచే కల్పింపబడిన మాయయా? లేక తపఃప్రభావమా? సత్యము తెలుపవలసినది." అంత ఋషి "రాజా! నేను హాస పరిహాసములందు సహితము అసత్యమాడి ఎరుగను. ఇదంతయు కామధేనువు యొక్క దయ. ఆ ధేనువే ఆ సమస్తమును ప్రసాదించినది." బ్రహ్మ "దైవము ప్రతికూలించినపుడు దుష్ట గ్రహముల ద్వారా బుద్ధి వక్రించును." రాజు మనసున దుర్బుద్ధి ప్రవేశించి కామధేనువును వశమొనర్చుటకై ఇట్లనియె" "ప్రశాంత చిత్తులు, కందమూల ఫలములచే కడుపు నింపుకొనువారు, మనసుతోనే సృష్టి సంహారములు కావింపగల సమర్థులు, కామనా రహితులు, జితేంద్రియులు, జ్ఞానులు అయిన మునులకు ఈ ధేనువు యొక్క ఆవశ్యకత ఏమున్నది? నాకు అవగతము కాకున్నది. వాయుభక్షకులు, మోక్ష సాధనా నిరతులు, వేదాభ్యాస సంలగ్నులు, అయిన మునులకు సంపదల ఆవశ్యకత ఏమున్నది? శాస్త్రముల అధ్యాపనము, ధర్మ శాస్త్రార్థములు తెలిసికొనుటయందు ఉత్సుకత, నిరంతర యోగాభ్యాస నిరతులు అయిన మునులకు కామధేనువు అనవసరము. గొప్ప వస్తువులు గొప్ప వ్యక్తుల వద్దకు చేరినపుడే మహాకార్యములు సాధ్యమగును. మీవంటి వనవాసుల వద్ద ఈ గోరత్నముండుట ఉచితము కాదు. అందువలన మీరు ప్రసన్నులై ఈ కామధేనువును నాకర్పింప వలసినది. ఈ ధేనువు నా వద్ద యున్ననూ మీదే అని తలుపవలెను. మీరు నా కోరికను మన్నింపవలసినది. లేని ఎడల బలశాలురైన రాజులు లోకమందు తమకు నచ్చిన వస్తువును చతురంగబల సమేతులై బలపూర్వకముగనైననూ గొనిపోయెదరు."

రాజు యొక్క దుర్వాక్యములను వినిన జమదగ్ని మహర్షి ఘృతము చే ప్రజ్వాలితమగు అగ్నివలె భగ్గుమని "ఓరీ! నీవు సజ్జనుడవని తలంచి భోజనమునకు పిలిచితిని. నీ హృదయమందు ఇంత కుటిలత కలదని తెలియకుంటిని. కోయిల మాయ చేసి తన పిల్లలను కాకి వద్ద యుంచుటనే అవి భక్ష్యా భక్ష్య పదార్థములందు అమరక్తలగును. నీ ప్రవర్తన కూడ అట్టిదే!"

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి కార్యవీర్య జమదగ్ని సంవాదమను డెబ్బది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది తొమ్మిదవ అధ్యాయము

(జమదగ్ని మహర్షి దుర్మరణము)

జమదగ్ని మహర్షి "అంతేకాదు. తొలుత నీవు సాధువర్తనుని వలె ప్రవర్తించి ఇపుడు ఆత్మఘాతివై కామధేనువును వాంఛించుచున్నావు. అప్రాప్యమును ప్రాప్తించుటకు యత్నించుచున్నావు. నీకు త్రిలోకములను నాశనము కావించినంత పాపము సంక్రమించును." ఈ వాగ్బాణములను వినిన కార్యవీర్యుడు అత్యంత కృద్ధుడై, కనులనుండి ప్రళయాగ్ని కీలలు వర్షించుచూ మహర్షిని చూచి "ఓరీ! దుష్టుడా! ఇటువంటి దుష్ప్రలాపములను నేను సహింపనోపను. కేవలము నీవు

బ్రాహ్మణుడవైన కారణమున నిన్ను క్షమించుచున్నాను" అని పలికి ఇరువురు సైనికులను పిలచి కామధేనువు యొక్క రెండు కొమ్ములు పట్టి ఈడ్చుకురమ్మని పంపెను. అంత ఆ ధేనువు ఒక్కమారు పూత్కరించెను. దానిచే వారిరువురు మృతులైరి. అంత రాజు మరికొంతమంది సైనికులను పంపెను. కొందరు ధేనువు యొక్క క్రోధాగ్నిచే దగ్ధమయిరి; మరికొందరు అద్దాని శ్వాస వేగముచే ఆకాశమునకెగసి సూర్యమండలమును కప్పుటచే ఆ ప్రదేశమంతయు అంధకార మలముకొన్నది. భూమి కంపించుట నారంభించుటచే సైనికులు దశ దిశలకూ పలాయనమొనర్చిరి. కొందరు కొరడాతో ఆ ధేనువునకు ఆఘాతమొనర్చిరి. అంత ధేనువు ఆ సేన వెంబడి పరుగులెత్తి వారందరినీ హతమార్చుట నారంభించెను. కార్తవీర్యుని సేనయందు హాహాకారములు చెలరేగెను. అంత మహాబలి అయిన కార్తవీర్యుడు తన సేనలను ఉత్సాహపరచి "నేను శంఖనాదము కావించెదను. అద్దానిచే ధేనువు వెనుకకు తిరుగును" అని పలికి ఒక మహాశంఖమును పూరించెను. కానీ ధేనువు కించిత్ భయమునొందలేదు. ఇంతలో రాజ సేవకులు అనేక ఆయుధములతో ఆ ధేనువును ప్రహరించిరి. ఆ ధేనువు ఎక్కడెక్కడ ప్రహరింపబడినదో అక్కడి నుండి సాయుధపాణులైన సైనికులనేకులు ఉత్పన్నమయిరి. రోమములనుండి "శకులు" మరియు "బర్బరులు", పాదముల నుండి "పటంచరులు," మరియు "యవనులు" ఉత్పన్నమై, వారందరూ ఖడ్గ కవచధారులై ధనుస్సు, తోమరము మొదలగు ఇతర ఆయుధములు సహితము ధరించి అశ్వ, గజ, రధారోహణము గావించి కార్తవీర్యుని సేనలను ఛిన్నాభిన్నము కావించిరి.

యుద్ధక్షేత్రమందు ధూళి ఎగసి సూర్యమండలమును ఆచ్ఛాదనము కావించుటచే, ఆ తుముల యుద్ధమందు ఎవరెవరో తెలియకుండిరి. "కొట్టు, చంపు" అను అరుపులు, హయముల సకిలింపులు, ఏనుగుల ఘీంకారములు, రధముల ఘోష, వీరుల సింహనాదములు, దుందుభులమ్రోత కలసి గొప్ప కోలాహలమేర్పడెను. రోమరోమమూ ప్రకంపించు మహాయుద్ధము జరుగుచుండెను. ఆ సమరము కాకులు, గ్రద్దలు, జంబుకముల కానందము, వీరసైనికుల పత్నులకు ఖేదము కలిగించుచుండెను. నరుకబడిన కాళ్ళు, చేతులు, తెగిన తొడలు, విరిగిన కత్తులు, డాళ్ళు, బాణములచే ఉత్తరింపబడిన శిరములు, ఈ విధముగ ఎటు చూచిననూ నెత్తుటి ప్రవాహములతో రణరంగమంతయు పరమ భయంకరముగ తోపుచుండెను. కార్తవీర్యుని మిగిలిన సైనికులు పలాయనము చిత్తగించుటచే ధేనువు యొక్క సైనికులు వారిని హతమార్చక, వెంట తరిమి "ఈ ముని దంపతి మీకేమి నష్టము కలిగించిరి?" అని ప్రశ్నించిరి. తనసేన పరాజితమగుటచే కార్తవీర్యుడు చివాలున లేచి అయిదు వందల ధనువులు తీసికొని వానికి సాయకములు సంధించి ధేనువుపై శరవర్షము కురిపించెను. కానీ అవన్నియు నీచుని సదాచారము వలె నిష్ఫలమయ్యెను. ఈ విధముగ రాజు ఎన్నిమార్లు ప్రయత్నించిననూ ధేనువునకు కానీ, దాని సైన్యమునకు గానీ రవ్వంత గాయము కాలేదు. కార్తవీర్యుడు నిర్వీర్యుడై "తన సామర్ధ్యమంతయు ఏమైనది?" అని తర్కించుచూ నిట్టూర్పులు విడచుచుండగా, ధేనువు ఇక తను కావించు కృత్యమేమియు లేదని తలంచి, తన సేనను ఉపసంహరించి, తాను స్వర్గమున కేగెను.

అకస్మాత్తుగా జరిగిన ఘోర సమరమును, దానిచే కావిపబడిన భీభత్సమును గాంచి నిరుత్తరులై, నిరాధారులై, ఏకాకులై యున్న ముని దంపతి వద్దకు కార్తవీర్యుడేతెంచి, క్రోధమూర్ఛితుడై "ఓరీ! కపట బ్రాహ్మణా! నేను నీ కౌటిల్యమును తెలిసికొంటిని. హృదయమందు కపటత్వము గల మనుజుని బ్రాహ్మణునిగ పరిగణింపరాదు" అని పలికి, ఒక నిశిత నిష్ఠుర సాయకమును ధనస్సుకు సంధించి ఆ మహర్షి యొక్క హృదయమును విదీర్ణమొనర్చెను. అంత జమదగ్ని మహర్షి కుప్పకూలి తక్షణము అసువులు బాసెను. అంత ఆయన ధర్మపత్ని రేణుక అత్యంత హృదయ విదారకముగ విలపించుచూ "దుర్మార్గుడా! ఎంత వ్యర్ధముగ బ్రహ్మహత్య కావించితివి?" అని పలికెను. అంత కార్తవీర్యుడు "ఓ! మునిపత్నీ! నీవు మరియొక మాట మాటలాడిన ఎడల నిన్నునూ నీ పతికడకు చేర్చెదను" అని పలికి ఆమెపై ఇరువది ఒకటి బాణములు సంధించి విడచెను. ఆమె తన పతిని స్మరించుచూ బాధను ఓర్చి "దురాత్ముడా! ఛండాలుడా! మేము

ఏమి అపరాధము కావించితిమని ఈ దుష్కృత్యము ఒనర్చితివి? నీవేకాదు, నీ సంతానము సహితము నాశనమగుదురు. ఇందు సందేహము లేదు" అని శపించెను. ఎంతటి ఆశ్చర్యము! సాక్షాత్ శ్రీగణేశుని కృపతో, దత్తాత్రేయుని ఆశీర్వచనముతో జన్మించిన కార్తవీర్యుడు ఎంతటి నీచకృత్యమొనరించెను. పూర్వ కర్మఫలము ఎంతటి బలీయమో కదా! ఈ శాపమును వినిన కార్తవీర్యుడు తనను తాను నిందించుకొనుచూ, తన సైనికుల దుర్మరణమునకు విచారించుచూ, ఉత్సాహహీనుడై, నిష్క్రియుడై తన నగరమునకేగెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనా ఖండమందలి జమదగ్ని మహర్షి దుర్మరణము అను డెబ్బది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఎనభైయవ అధ్యాయము

(రేణుకా విలాపము)

అతి రమ్యమయిన జమదగ్ని మహర్షి ఆశ్రమమంతయు పరమభయంకరమైన నిశ్శబ్దమలముకొన్నది. విగతజీవుడై జమదగ్ని మహర్షి ధరిత్రి పై పరుండెను. శరీరమంతయు బాణ ఘాతములచే తీవ్రమయిన బాధనొందుచూ రేణుకాదేవి ఇట్లు విలపించుచున్నది. "హా! హతవిధీ! నేడు నా పుత్రులందరూ ఏమయిరి? ఈ తీవ్ర సాయక పంజరముచే బాధింపబడుచున్న నేను ఏమి చేయగలను? మహాక్రోధి, నా ప్రియబాలకుడయిన పరశురాముడు ఎక్కడికి వెళ్ళెను?" ఈ విధముగ విలపించుచుండగా అచటకు పరశురాముడేతెంచి, దుష్ట కార్తవీర్యుని చే హతమార్చబడిన తండ్రిని, బాణఘాతి అయిన తల్లిని కాంచి అత్యంత దు:ఖితుడై ఆయన సహితము ఈ విధముగ విలపించెను "నేడు నాకు సర్వత్రా అంధకారమే అగుపించుచున్నది. దశదిశలు శూన్యమయినవి. మేరు రహిత పృధివి, పురంధర రహిత స్వర్గము, గంగలేని త్రిలోకములు, ఎట్లు శోభించవో అట్లే నా మాతాపితరులు లేని ఈ ఆశ్రమము శోభారహితమయినది. దేవతలు సహితము భయభీతులగు నా తండ్రి హతమొనర్చబడుట ఏమి?" అని తన తల్లి తలను తన ఒడిలోనికి తీసుకొనెను. ఆమె కుసుమకోమల శరీరము బాణములచే నిండియుండుట చే, తిరిగి అత్యంత దు:ఖార్తుడై "నా తల్లి త్రిలోకములను భస్మీపటలమొనర్చగల సమర్ధురాలు. ఎట్లు బాణఘాతములచే ఈ భూమిపై ఇట్లు పడినది? ఇది భ్రాంతి కాదుకదా? నా తల్లిదండ్రులు లేక నేడు నేను అనాధనైతిని." ఈ విధముగ విలపించుచున్న తనయుని గాంచి, ఆయన తల్లి రేణుక అతికష్టమున కనులు తెరచి, ఆతని కన్నీరు తుడిచి, ఆతనికి ఆ రోజు జరిగిన సంఘటనలన్నియు పూసగ్రుచ్చినట్లు వివరించి, కార్తవీర్యుడు జమదగ్ని మహర్షిని నిష్కారణముగ హతమార్చుటయు, తనను ఇరువది ఒక్క బాణములతో హింసించుటయు, తెలిపి ఇట్లనియె "నాయనా! నీవు ఆ దుష్టుని నాశనమొనర్చవలెను. ఆ దుష్టుడు నన్ను ఇరువది ఒక్క బాణములతో హింసించెను. నీవు ఇరువది ఒక్క మార్లు క్షత్రియ సంహారము కావింపవలసినది. నీకు ఇంకొక విషయము తెలుపుచున్నాను. మా ఇరువురి దహన సంస్కారములు ఇత:పూర్వము ఎక్కడా చేయబడని రీతిలో కావింపవలసినది. మహాముని, సర్వజ్ఞాత అయిన దత్తాత్రేయుని రావించి, మరణానంతర పదమూడు రోజుల శ్రాద్ధకర్మ చేయవలసినది. నీకుపదేశ మొనర్చుటకు దత్తాత్రేయుని వంటి జ్ఞాని మరొకరు యుండరు. అపుడే మాకు సద్గతులు కలుగును." ఈ విధముగ పలికి రేణుకాదేవి స్వర్గస్థురాలైయ్యెను. పరశురాముడు ఆమె తెలిపిన విధానముననే శ్రాద్ధకర్మములు నిర్వర్తించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి రేణుకా విలాపమను ఎనభైయవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఒకటవ అధ్యాయము

(పరశురామ దత్తాత్రేయ సంవాదము)

బ్రహ్మదేవుడు "పరశురాముడు శిరోముండనము గావించుకొని విధి విధానముల ననుసరించి, బ్రాహ్మణులాదేశించినట్లుగా తన తల్లిదండ్రులకు శ్రాద్ధ కర్మములాచరించెను. తదుపరి పిండ ప్రదానము కావించి స్మశానమందు చితి పేర్చి దహన సంస్కారములాచరించి, శీఘ్రమే తన తల్లి ఆదేశానుసారము దత్తాత్రేయుని వద్ద కేగెను. ఆ సమయమున ఆయన శిష్యసమేతుడై, మలినవస్త్రుడై, దర్బలుడై, కృశకాయుడై, కుక్కను చేతబట్టుకొని యుండెను. అయిననూ పరశురాముడు ఆయన వద్దకేగి, చేతులు జోడించి, మాట్లాడక నిశ్శబ్దముగ ఆయన నికటముననే ఆశీనుడయ్యెను. ఒక యమార్ధము గడచిన పిమ్మట సర్వజ్ఞుడు అయిన దత్తాత్రేయుడు పరశురాముని ఆగమనమునకు కారణము తెలిసినప్పటికీ తిరిగి ఏమీ ఎరుగనట్లు "నాయనా! ఏల నా వద్ద కేతెంచితివి?" అని ప్రశ్నించెను. అంత పరశురాముడు తాను లేని సమయమున తన ఆశ్రమమందు కార్తవీర్యుడు కావించిన ఘాతుకము నంతయు ఆయనకు వివరించి "స్వామీ! నేను నా మాతా పితరులకు దహన సంస్కారములు కావించి, నా తల్లి ఆజ్ఞానుసారము మిగిలిన అంత్యేష్ఠి సంస్కారములు మీ వలన తెలిసికొని కావింప వలెనని ఏతెంచితిని. తదుపరి ఈ దుష్కృత్యము కావించిన కార్తవీర్యుని హతమార్చి, ఇరువది ఒక్క మార్లు క్షత్రియ సంహారము కావింపమనిన నా తల్లి కోరిక నెరవేర్చవలెను."

అంత రేణుకాదేవి మిత్రుడయిన దత్తాత్రేయుడు సహితము కొంత తడవు శోక సంతప్త హృదయుడై ఇట్లనియె "ఏ గృహమునందు భోజనము స్వీకరించి, వారితో విరోధించుట అత్యంత అనుచితము. ఈ దుష్కర్మ యొక్క ఫలితమును దుష్టుడయిన కార్తవీర్యుడు అతి స్వల్ప కాలమున అనుభవించును. కానీ నీ ప్రస్తుత కార్యము నీ మాతా పితరుల ఔర్ధ్వదేహిక క్రియలు కావించుట." దత్తుడు పరశురాముని చే ప్రతిదినము శ్రాద్ధ కర్మలు విధి విధానముగ ఆచరింపజేసెను. తన ఇంట శ్రాద్ధ కర్మల కారణమున అశౌచముండుటచే దత్తుడు ప్రతి దినము బిక్షకై బయటకు ఏగెడివాడు. ఐదవ దినము దత్తుడు పరశురాముని అనుమతి తీసుకొని భిక్షాటనకు ఏగిన పిమ్మట పరశురాముడు ఒంటరిగయున్న సమయమున అచటికి ఒక వ్యాఘ్రమేతెంచెను. ఆతడు భయభీతుడై "అమ్మా! అమ్మా! నేనేమి చేయుదును" అని అరచెను. వెంటనే రేణుకాదేవి అచట ప్రత్యక్షమై రాముని ఆలింగనమొనర్చి భయమును బాపెను. అయ్యది ఐదవ దినమగుటనే పూర్ణముగ పదమూడు రోజుల శ్రాద్ధ కర్మ కాకుండుటచే ఆమె పూర్ణముగ దివ్యదేహము నొందకుండెను. ఆరవ దినము దత్తుడేతెంచి అసంపూర్ణ శరీరయై యున్న రేణుకాదేవిని గాంచి, రాముని "సంపూర్ణ శ్రాద్ధ కర్మమాచరింపక తల్లిని ఎందుకు పిలచితివి?" అని ప్రశ్నించెను. అంత పరశురాముడు తాను వ్యాఘ్రభయమున అప్రయత్నముగా తల్లిని పిలచితినని పలికెను. అంత పన్నెండవరోజు వృషోత్సర్గము కావించి, తదుపరి సపిండీకరణము ఒనరించెను. పదమూడవ రోజు ప్రాధేయ పూర్వకముగ వర్షాశవము (ఒక సంవత్సర పర్యంతము అన్నాది తినుబండారములు) సమర్పించి, బ్రాహ్మణులచే పుణ్యాఃవాచనము కావించి యధాయోగ్యమయిన అనేక విధములయిన దానములాచరించెను. అంత జమదగ్ని మహర్షి దివ్యదేహుడై బ్రహ్మలోకమున కేగెను. రేణుకాదేవి మాత్రము అదే అసంపూర్ణ దేహముతో భూలోకమందలి వివిధ స్థానములందు స్థితిగతయై భక్తుల మనోకామనలను పూర్ణమొనరించుచున్నది. ఈ రేణుకాదేవి విస్తృత మాహాత్మ్యము స్కాంధ పురాణమందు వివరింపబడినది. సమయాభావనచే నేను అద్దానిని స్పృశించుట లేదు.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి పరశురామ, దత్తాత్రేయ సంవాదమను ఎనభై ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఎనభై రెండవ అధ్యాయము

(కార్తవీర్య సంహారము)

వ్యాసుడు "పితామహా! పరశురాముడు బాలుడు కదా! మరి ఒక్కడే ఆమేయ బలపరాక్రమ సంపన్నుడు, అసంఖ్యాక చతురంగ బల సమేతుడు, సహస్రబాహువైన కార్తవీర్యుని ఎట్లు సంహరించెను?" బ్రహ్మ "ఒకానొకనాడు పరశురాముడు తన తల్లివద్దకేగి "మాతా! కార్తవీర్యుని భయమున ఇంద్రాది దేవతలు పలాయన మొనర్చిరి. ఆయన వద్ద అసంఖ్యాక చతురంగ బలములున్నవి. ఆయనను నేను ఎట్లు నిర్మూలింపగలను? అట్లే ఇరువది ఒక్క మార్లు క్షత్రియ సంహారము ఎట్లు కావింపగలను? ఉపాయము తెలుపవలసినది." రేణుక "నాయనా! నీవు మహాదేవుడు శివుని ఉపాసింపుము. నీవు ఆయనను సంతుష్టి నొందించిన ఎడల సర్వ కామనలు పూర్ణమగును." అంత పరశురాముడు తల్లికి నమస్కరించి, ఆశీర్వాదము నొంది, కైలాస పర్వతమున కరిగెను. అచట రత్నమయ సింహాసనాధీశుడయిన శంభుని కాంచి ఇట్లు స్థుతించెను "ఓ! గౌరీపతీ! దేవదేవేశా! శంభో! నీకు ప్రణామములు. నిత్య, నిర్గుణ, నిరాకార, సాకార, జ్ఞాననిధానా! వేద వేదాంగ శాస్త్రాదుల చేత సహితము అవర్ణనీయుడా! వ్యక్తావ్యక్త స్వరూపా, త్రిగుణాతీతా, త్రిగుణములచే తెలియబడువాడా, ప్రపంచ రహితా, ప్రపంచ జ్ఞాతా, నీకు నమస్కారము." అంత శివుడు ప్రసన్నుడై "వత్సా! నిన్ను నేనెరుగుదును. నీవు జమదగ్ని సుతుడవు. నీ స్తోత్రము చే సంతసించితిని. నీ మనోవాంఛితమేమి?" అని ప్రశ్నించెను. అంత పరశురాముడు తన మాతా పితరుల వృత్తాంతమును వివరించి, తన తల్లి యొక్క ఆదేశమును తెలిపి అద్దానిని సాధించు సామర్థ్యమును ప్రసాదింపమని కోరెను. అంత శివుడు పరశురామునకు దివ్యమైన శ్రీగణేశ షడక్షరముపదేశించి, అద్దానిని ఒక లక్ష జపించి, అందలి దశాంశము (పదివేలు) హోమము, అందలి దశాంశము (వేయి) తర్పణము, అందలి దశాంశము (వంద) బ్రాహ్మణులకు భోజనము అర్పింపమని; ఇట్లు చేయుటచే పరాత్పరుడయిన శ్రీగణేశుడు ప్రసన్నుడై, నీ ఇహలోక కార్యక్రమములన్నియు పూర్ణమొనరించునని తెలిపెను.

అంత పరశురాముడు ఆయనకు నమస్కరించి, భువికేతెంచి, కృష్ణానదికి ఉత్తర క్షేత్రమున, ఒక ఉత్తమ స్థానమున ఒంటికాలి బొటనవ్రేలిపై నుంచొని, ఏకాగ్రతతో శ్రీగణేశుని ధ్యానించుచూ ఒక లక్ష జపించెను. తదుపరి పైన తెలిపిన విధముగ హోమ, తర్పణ, భోజనములొసంగెను. అంత శ్రీగణేశ భగవానుడు ప్రసన్నుడై ఆతని ఎదుట సాక్షాత్కరించెను. ఆ సమయమున ఆ పరాత్పరుడు – చతుర్భుజుడు, మహాకాయుడు, మహామాయావి, అతి సుందరుడు, నాగయజ్ఞోపవీతుడు, నానాభూషణ భూషితుడు, ముకుట కుండలధారియై ఒప్పుచూ అనేక ముత్యముల, పగడముల మాలలు ఆయన వక్షస్థలమును అలంకరించి యుండెను. ఆయన నాలుగు చేతులయందు పరశువు, దంతము, కమలము, మోదకము యున్నవి. తన మెలితిరిగిన తొండముచే కమలమును ధరించి, తన ప్రకాశముచే దశ దిశలను ప్రభావిత మొనర్చుటచే ఆ దీప్తిని కాంచజాలక పరశురాముడు కన్నులు మూసుకొని ఇట్లు స్థుతించెను "కోటి సూర్య ప్రకాశా, సర్వసిద్ధి ప్రదాతా, సర్వవిద్యాదాత, సర్వవిఘ్ననివారకా, నీకు నమస్కారము. సర్వాంతర్యామీ, జ్ఞానస్వరూపా, భక్తప్రియా, విశ్వకర్తా, విశ్వపాలకా, నీకు నమస్కారము. ఈ స్తోత్రమును వినిన శ్రీగణేశుడు ప్రసన్నుడై "నీవు దివారాత్రములు నా షడక్షర మంత్రమును జపించుచున్నావు. నీ మనోవాంఛితమును తెలుపవలసినది. అద్దానిని తప్పక పూర్ణమొనర్చెదను." పరశురాముడు "ఓ! అప్రమేయా, జగదాధారా! సృష్టి స్థిత్యంతకారకా; నీవు వేదములు, తపస్సు, యజ్ఞము, వ్రత, దాన, యోగములు దేని వల్లను దృష్టి గోచరము కాజాలవు. కేవలము నీ కృప చేత మాత్రమే నీవు దర్శనము నిచ్చెదవు. స్వామీ! నేనేమి వరము కోరగలను? కేవలము నీ పాద పద్మములందు దృఢభక్తిని ప్రసాదింపవలసినది." అంత శ్రీగణేశుడు సంతసిల్లి నీకు నా

యందు దృఢభక్తి కలుగును. నేను నీకు వరదాన ప్రలోభములు చూపించినప్పటికీ నీ బుద్ధి విచలితము కాలేదు. అందువలన నీకు సర్వశత్రు వినాశకమయిన నా పరశువును బహూకరించుచున్నాను. త్రిలోకముల యందు నేటినుండి నీవు "పరశురాముడు" గా ప్రసిద్ధి నొందెదవు" అని పలికి సర్వులు చూచుచుండగా ఆయన అదృశ్యుడయ్యెను.

అంత పరశురాముడు ఆ ప్రదేశమున వేదవేదాంగ వేత్తలయిన బ్రాహ్మణోత్తముల చే మహా గణపతిని స్థాపించి, దానచుట్టూ రత్నమందిరమును నిర్మించి, ప్రసన్నచిత్తుడై శ్రీగణేశుని పూజించి, ప్రదక్షిణ మాచరించి, తదుపరి తన గృహమున కేగెను. అటు పిదప మాహిష్మతీ నగరమునకేగి, ఉచ్ఛ స్వరముతో కార్తవీర్యుని పిలచి, ఆతని సహస్రబాహువులు ఖండించి, హతమార్చి, ఆపై ఇరువది ఒక్కమార్లు క్షత్రియ సంహారము ఒనర్చి, తదుపరి యజ్ఞమొనర్చి మేదిని సర్వమును బ్రాహ్మణులకు దానమొనర్చెను. దేవతలు, మానవులు ఆయన పరాక్రమము గాంచి ఈతడు సాక్షాత్ విష్ణురూపుడు అని గ్రహించి ఆయనను పూజించిరి." ఈ విధముగ నీకు శ్రీగణేశుని మహిమలను సంక్షేపముగ వివరించితిని. ఆయన మహిమలను సంపూర్ణముగ వివరించుట శేషునికి సహితము అసాధ్యము. ఈ భూలోకమందు ఏ మనుజుడు ఈ శ్రీగణేశపురాణమందలి ఉపాసనా ఖండమును శ్రవణము కావించునో, ఆతడు తన సర్వ కామనలను ప్రాప్తించి, అంతమున శ్రీగణేశలోకమున కేగి ప్రళయ పర్యంతము అచటనే రమించును.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి కార్తవీర్య సంహారమను ఎనుబది రెండవ అధ్యాయము సమాప్తము)

ఎనభైమూడవ అధ్యాయము

(తారకాసుర చరితము)

వ్యాసుడు "లోకస్రష్టా! పరశురాముడు ఈ పరమాద్భుత తపస్సును ఎచట ఆచరించెను? ఆ వివరములన్నియు విస్తారముగ తెలుపవలసినది." బ్రహ్మ "భువి యందు "మయూరేశ్వరము" అను ప్రదేశము చతుర్యుగములందూ ప్రసిద్ధము. ఇచట శ్రీగణేశుడు కమలాసురుడు అను దానవుని మయూరవాహనుడై సంహరించి ప్రకటితమయ్యెను. అందువలన శ్రీగణేశుడిచట "మయూరేశుని" గా ప్రసిద్ధినొందెను. నీకు ఆ ఇతిహాసమంతయు వివరించెదను."

"ఒకానొక సమయమున "తారకుడు" అను రాక్షసుడుదయించెను. ఆతడు మహాబలి మరియు పరాక్రమశాలి. ఆతడు బ్రహ్మదేవుని కొరకు ఒక వేయి సంవత్సరములు కఠోరతపమాచరించెను. బ్రహ్మ ప్రత్యక్షమై ఆతడికి దేవ, ఋషి, యక్ష, గంధర్వ, నాగ, రాక్షసాదులచే, సమస్త అస్త్ర శస్త్రావళిచే అవధ్యత్వము ప్రసాదించెను. అంత వర గర్వితుడయిన తారకుడు త్రిభువనములను పీడింప మొదలిడెను. వేదాధ్యయన నిరతులు, అగ్నిహోత్ర తపానుష్ఠాన సంపన్నులయి స్వధర్మనిరతులైన బ్రాహ్మణోత్తములను కారాగారమందు బంధించెను. భూమండలమందలి సమస్త రాజనీకమును, పాతాళమందలి నాగులను వశమొనర్చుకొని స్వర్గముపై దండెత్తెను. దేవతలు భయభీతులై స్వర్గమును వదలి కాందిశీకులైరి. యజ్ఞ యాగాదులు కరువైయ్యను. తారకుడు "నేనే ఈశ్వరుడను. దేవ, బ్రాహ్మణ, కులదేవతనందరినీ నేనే! ఈ జగత్తుయందు పూజనీయుడను, ప్రణామ యోగ్యుడను నేనే! ఎవరేని వేరొక దేవుని పూజించిన ఎడల వారు కఠినదండనకు గురి అగుదురని" చాటింపించెను. జగత్తు సర్వము ధర్మ, సజ్జన రహితమైనది. స్వాధ్యాయము, స్వాహాకారము, వషట్కారము లేవు. యజ్ఞదానాది ధార్మిక కృత్యములు లుప్తమయినవి. లోకులు కులధర్మములను, విహిత ఆచారములను, విడుచుటచే దుష్టులయిరి. సాధుజనులు, మునులు పర్వత కంధరములందు తలదాచుకొని శివుని ఈ విధముగ ప్రార్థించిరి" స్వామీ!

నీవే ధాతా, రక్షకుడు, జగన్నిర్మాతవు, మరియు సంహారకర్తవు. తారకుడు గర్వాంధకారుడై మమ్ము దహించుచుండెను. మీరు మీ ఇచ్ఛానుసారము జగత్సంహారము కావించి మమ్ము సహితము సంహరింప వలసినది. లేని ఎడల తారకుని సంహరింపవలసినది" అని పలికి వృక్షపల్లవములు, వాయుభక్షకులు, నిరాహారులై తీవ్ర తపమునకు ఉపక్రమించిరి. ఇంతలో తారకుడు ఇంద్రపదవి అధిష్ఠించి బ్రహ్మదేవుని హింసింపసాగెను. విష్ణువు క్షీరసాగరమున మునిగెను. శివుడు పర్వత కంధరమందు అదృశ్యుడై తపమాచరించుచుండెను. దిక్పాలురు, దిగ్గజములు తమ తమ స్థానములు వదలి పర్వత కంధరములను ఆశ్రయించిరి. తారకుడు వారి స్థానమున తన అనుచర వర్గమును నియమించెను.

అంత ఇంద్రాది దేవతలు శివుని ఈ విధముగ స్తుతించిరి "దేవా! అష్టమూర్తులు, (భూమి, జలము, వాయువు, అగ్ని, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, యజమానము) మీరే! చరాచర ప్రపంచమును సృష్టి, స్థితి, సంహారములు కావించు స్వామీ! పర దు:ఖార్తహరా! ఈనాడు మీ బాధ్యతను పరహస్తగతమొనర్చుట ఉచితము కాదు. ఇపుడు తారకుని గానీ, దు:ఖితులమైన దేవ, ముని గణమును కానీ మీరు హతమార్చవలెను. మీరు వినా మేము ఎవరిని ఆశ్రయించము? ఎవరిని శరణుజొచ్చెదము? ఎవరిని భజించెదము? ఓ! పాపనాశకా! పార్వతీపతీ! అఖిలేశ్వరా! మా దు:ఖములను ఎవరికి విన్నవించగలము?" అంత అశరీరవాణి ఈ విధముగ పలికినది "దేవతలారా! శివునికి పుత్రుడు ఉత్పన్నమయిన ఎడల వానిచే తారకుడు సంహరింపబడును." దేవతలు హర్షితులై కైలాసమునకేగిరి. వారికచట శంకరుడు గోచరింపలేదు. కానీ మూలప్రకృతి స్వరూప అయిన ఉమాదేవి కనిపించినది. అంత దేవతలు ఆ తల్లిని తారకుని నుండి కాపాడమని ప్రార్థించిరి. అంత పార్వతీమాత "అశరీరవాణి పలుకులు నేను సహితము వింటిని. శివుడు తప్పక మీకు కళ్యాణమొనర్చును. ప్రస్తుతము ఆయన తీవ్ర తపము ఆచరించుచున్నాడు. మనందరము ఆయన వద్ద కేగుదుము" అని పలికి తాను ఒక భిల్ల వనిత రూపము ధరించెను. ఆ తన్వి సౌందర్యమును కాంచి రంభాది అప్సరసలు, కాముని భార్య రతీదేవి విస్తుబోయి సిగ్గుతో తలవంచుకొనిరి. వారందరూ కలసి శివుడు తపమచరించుచున్న స్థలమున కేగిరి. అచట శివుడు స్థాణువువలె అచలుడై, ధ్యానరతుడై, నిశ్చలనేత్రుడై, పరబ్రహ్మమును ధ్యానించుచుండెను. అంత పర్వతపుత్రి దేవతల నుద్దేశించి "తపోనిరతుడైన సదాశివుడు దేహాతీతుడై రమించుచుండెను. ఆయనకు దేహభావన అంకురించుటకు మీరు కామదేవుని ప్రార్థింపవలెను. కామబాణములచే తపోనిష్ఠుడైన సదాశివుడు తపోభ్రంశమై, దేహభావన కలిగినచో మనకు కార్యసిద్ధి కలుగును" అని పలికెను.

అంత సమస్త దేవతలు మన్మథునుద్దేశించి ఉత్కట ప్రార్థనమాచరించిరి. కామదేవుడేతెంచిన పిదప దేవతలు "మదనా! నీవు సర్వ లోకములందలి చరాచర జీవులందరిలో శక్తిశాలివి. నీ మూలముననే జగత్తు నందు సృష్టి జరిగి వ్యాపించుచున్నది. స్త్రీ పురుషులు నీనుండే శక్తినొందుచున్నారు. నీవు లేనిచో ఈ స్థావర జంగమాత్మక జగము వ్యర్థమగును. నీ వలన కాగల గొప్ప కార్యమొకటి కలదు. అందుకు నీ సహాయ మవసరము" అని పలికిరి. అంత మీనధ్వజుడు "దేవతలారా! మీ అనుగ్రహము చే నేను ఎంతటి క్లిష్ట కార్యమునైననూ చేయుదును. పుష్పమే నా ధనుస్సు. భ్రమరము అద్దాని నారి. వామాక్షుల కటాక్ష వీక్షణములే నా సాయకములు. వసంతుడే నా చెలికాడు. వీరి సహాయమున నేను త్రినేత్రుని సహితము పరాజితుని కావించెదను" అని పలికి శివుడు తపమాచరించుచున్న ప్రదేశమునకు ఆయనను కామమోహితుని కావించుటకేగెను.

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి తారకాసుర చరితము అను ఎనబది మూడవ అధ్యాయము సమాప్తము)

ఎనభై నాల్గవ అధ్యాయము

(మదన దహనము)

ఈ విధముగ కించిత్ మదమత్తుడై మదనుడు దేవహితార్థము పరమేశ్వరుడు తపమాచరించుచున్న వనమున కేగెను. అయ్యది సింహ, వ్యాఘ్రయుతమై పరమ భయంకరముగ ఒప్పారుచుండెను. అంత తన మాయచే మదనుడు ఆ ప్రదేశమంతయు రెండు క్రోసుల దూరము సుగంధభరిత ఫలపుష్పయతమైన ఒక పూదోటగా మార్చెను. అందు నేరేడు, బదరీ, అరటి, పనస, నారికేళ, ఖర్జూర వృక్షములు, వాటిని అల్లిబిల్లిగా అల్లుకొని ఏలక, లవంగ తీగలు సుమనోహరముగ ఒప్పుచుండెను. అంత సాయంకాల సమయమున శశాంకుని జ్యోత్స్న వెల్లివిరియుచుండగా, శివుడు కనులు తెరచి ఆ తపో ప్రదేశమంతయు సుందరముగ మారి, సుగంధభరితమై యుండుట గమనించెను. అంత కాముడు ఆయనపై తన శరములు సంధించి, బాణ పరంపర కురిపించెను. పరమేశ్వరునికి దేహభావముత్పన్నమై మరి కొంచెము మనస్సు చెదిరినప్పటికీ, తిరిగి సంభాళించుకొని, ఎవరు నా తపస్సు భగ్నమొనర్చుటకు పన్నాగము పన్నిరని నలుదిశలా వీక్షించెను. కోపము క్రోధమై, క్రోధానలమై, కనుబొమలు ముడివైచి ఈ దుష్కార్యమాచరించినది ఎవరు అని తిరిగి తేరిపార చూచెను. ఇదంతయు గమనించుచున్న మన్మథుడు భయకంపితుడై దేవతల నందరినీ స్మరించెను. ఎవ్వరునూ ముందుకు రాారైరి. అంత త్రినేత్రుడు తన త్రినేత్రమును తెరచి దావానలమును మదనునిపైకంపెను. దేవతలందరూ మదనుని కాపాడమని ఘోషించుచుండిరి. త్రిభువనములు కంపించుట నారంభించెను. క్షణములో మదనుడు బూదికుప్పయై నిలచెను. అంత భిల్లిక రూపమునున్న ప్రకృతి (పార్వతీదేవి) "ప్రభూ! త్రిలోకములు దగ్ధమొనర్పగల మీ దావానలమును ఉపసంహరింపవలసినది. బ్రహ్మ వరమున తారకుడు అతి బలవంతుడై త్రిలోకములు ఆక్రమించుట చే లోకములు యజ్ఞ, సాధ్యాయ రహితములయినవి. దేవతలందరూ స్థానభ్రష్టులగుటచే తిరిగి తమ స్వస్థానములను పొందుటకు కాముని ఆశ్రయించిరి. కానీ కాముడు అహంకారయుతుడై మీ ఎడ కావించిన అపరాధము చే భస్మీపటలుడైనాడు. మహాదేవా! మేము మిమ్ము శరణుజొచ్చుచున్నాము. శరణాగత వత్సలా! మా అపరాధములు మన్నించి మమ్ము రక్షింపవలసినది." అంత భిల్లిక వేషధారిణి అయిన పార్వతిని చూచి ప్రసన్నుడై శివుడ తన నేత్రాగ్నిని ఉపసంహరించి "పర్వతరాజనందినీ! పైకిలెమ్ము. నీవు నా పాదములపై శిరమునుంచి నీవు కావించిన మధుర భాషణము మరియు నీ సున్నితమైన ప్రేమచే ఈ దేవతలందరినీ రక్షించితివి" అని పలికి, ఆమెను లేవనెత్తి గాఢాలింగనము చేసికొనెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి మదన దహనము అను ఎనభైనాల్గవ అధ్యాయము సమాప్తము)

ఎనభై అయిదవ అధ్యాయము

(కార్తీకేయ జననము)

పిదప పార్వతీ పరమేశ్వరులిరువురూ కైలాసముకేగిరి. పార్వతీదేవి శివుని కౌగిలి నుండి విడివడిన మరుక్షణము నుండి కామాగ్నిచే దగ్ధమై, నీటి నుండి బయటపడిన చేప వలె కొట్టుమిట్టాడుట మొదలిడెను. సుఖనిద్ర లేదు. అత్యంత శీతల జలములు సహితము ఉష్ణగుండము వలె తోపుచున్నవి. కర్పూర చందన మిశ్రమము సహితము ఆమె తాపమును

అధికము కావించుచున్నది. శీతల పదార్థములేవియును ఆమెకు సంతోషమొనర్పక ఆ కామాగ్నిచే దగ్ధమయి ఆమె కేవలము ఆస్తి, చర్మముతో మిగిలెను. ఆ సమయమున ఆమె శివుని చేరి "స్వామీ! మీరు నా అవస్థను కొంచెము కూడా పట్టించుకొనుట లేదు. కాముడు దగ్ధమయినప్పటికీ నన్ను నిరంతరము పీడించుచున్నాడు. నేను నా తాపమును శాంతింపజేయుటకు అనేక ఉపాయములను అన్వేషించితిని. అవన్నియు వ్యర్థమయినవి. ఈ కామాగ్నిని చల్లార్చగల ఉపాయమును మీరే కనుగొనవలసినది" అని పలికెను. ఈ మర్మగర్భమయిన శృంగార కలాపము విని శివుడు చిరునవ్వు నవ్వి, ఆమె కెంగేలు గైకొని, ఒక ఏకాంత స్థలమునకేగి, ఆమెతో రమించుట నారంభించెను. కాముడు దగ్ధమైనప్పటికీ దేవతలు తన కిచ్చిన కార్యము నెరవేర్చెను. ఈ విధముగ శివపార్వతులు సురతక్రీడ యందు నిమగ్నులై అరువదివేల వర్షములు గడచినవి. అయిననూ వారి క్రీడకు అంతము లేకుండెను.

దేవతలు, ఋషుల పరిస్థితి దినదినమునకూ మరింత విషమించుటనే, కొందరు మునులు కైలాసమునకేగి పార్వతీ పరమేశ్వరుల దీర్ఘకాలిక సురతక్రీడ గూర్చివిని తిరిగి హిమాలయ కంధరములు చేరి తపమారంభించిరి. దేవతలు "తారక వధ ఎప్పుడు జరుగును?" అని చింతాక్రాంతులైరి. అంత దేవగురువైన బృహస్పతి వారితో "అనఘులారా! మీరందరూ అగ్నిని వేరు రూపముతో కైలాసమునకు పంపవలసినది. అతడు శివుని ప్రబోధపరచి మీ కార్యమును నెరవేర్చును." అంత దేవతలు అగ్నిని చేరి "ఓ! బ్రహ్మన్! నీ సహాయము వలననే సర్వ సంస్కారములు, యజ్ఞాదిక్రియలు సంపన్నమగుచున్నవి. నీవు జలములకు హేతువు మరియు దేవతల ముఖ స్వరూపుడవు. నీవు నిత్యము సముద్రము నుండి సూర్య కిరణముల రూపమున మరియు బడబానల రూపమున అనంత జలరాశిని పానమొనర్చి, తిరిగి వర్షరూపమున భూమికి చేర్చెదవు. జీవుల ఉదరమునందు జఠరాగ్ని వలె వారి ఆహారమును జీర్ణము ఒనర్చెదవు. సర్వ జీవ, జంతువుల సంధిబంధముల సంచలనమునకు సహాయకుడవు నీవే! జీవులకు జీవత్వము సిద్ధించునది, మరియు మృత ప్రేతములను దగ్ధమొనర్చునది నీ స్వరూపమే! సర్వులకు ప్రాణధారణాహేతువు నీవే! బ్రహ్మ, రుద్ర, సూర్యాది రూపములు నీవే! క్రోధమునకు మూలకారణము నీవు. ఎక్కడెక్కడ తేజఃస్వరూపము కలదో అదంతయు నీ స్వరూపమే! ఓ! త్రైలోకోపకారకా! తారకుని బెడద, ఆశరీరవాణి తెలిపిన ఉపాయము, కాముని గతి నీకు తెలియును. నీవు ఎట్లైననూ కైలాసమునకేగి పార్వతీపరమేశ్వరులను ప్రబోధ పరుచవలసినది" అని పలికిరి. అంత అగ్ని ఒక కాషాయాంబరధారియై, బ్రాహ్మణ రూపమున శివపార్వతుల ఏకాంత స్థలమునకేగి, బయట నిలబడి "భవతి భిక్షాందేహి" అని అరచెను.

జగన్మాతా, పితరులు ఒక్కమారు ఉలిక్కిపడి "ఇక్కడకేతెంచువారు ఎవరు? వారికి మనము ఏమి ఈయగలము?" అని తర్కించి, ఆ సమయమున పార్వతీదేవి శివవీర్యమును దాల్చుటకు అసమర్థయైన కారణమున, ఆమె ఆ వీర్యమును ఆ బ్రాహ్మణుని చేతిలో యుంచెను. అగ్ని శివ వీర్యమును చేతుల దాల్చి, అద్దానిని భరించుటకు అశక్తుడై, దానిని నేలపై విడచిన అయ్యది త్రిలోకములను భస్మీపటల మొనర్చునని తలచి, దానిని మ్రింగెను. అప్పటి నుండి ఆయనకు ఆ వీర్యమును దాల్చలేక సుఖశాంతులు కరువయ్యెను. ఒకనాడు ఉదయము ఉషోదయ కాలమున అగ్ని గంగానది వద్దకేగి, నిత్యకృత్యములు పూర్ణమొనర్చుకొని, కార్తీక స్నానమునకై ఏతెంచిన ఆరుగురు స్త్రీ మూర్తులను చూచి తన యందున్న శివ వీర్యమును వారివద్ద నీటియందు అదృశ్యరూపుడై వదలిపెట్టెను. తక్షణము ఆయన శరీరమందలి బాధ దూరమయ్యెను. ఆ స్త్రీలు శివ వీర్యమును కాంచి, ఆరుభాగములు చేసి, తాము స్వీకరించి తమ గృహముల కరిగిరి. వారి పతులు వారి ముఖములు ఉజ్వల తేజస్సుతో వెలుగుట కాంచి, దివ్యదృష్టి చే వారు గర్భము ధరించిరని తెలిసికొని ఆ పడతులను ఇంటి నుండి బయటకు బహిష్కరించిరి. అంత ఆ అతివలందరూ తిరిగి గంగా తటమున కరిగి శరవణ పొదల యందు తమ గర్భములను త్యాగమొనర్చి తిరిగి గంగా స్నానమాచరించి తమ గృహముల కేగిరి.

ఆ ఆరుగురి గర్భముల నుండి బయటపడిన పిండములు కలసి ఆ శరవణ పొదల యందు ఆరుముఖములు,

పన్నెండు చేతులు గల దివ్య బాలకునిగ మారెను. ఆ బాలుని హుంకారముచే గ్రహ, నక్షత్రములు గతులు తప్పి క్రిందికి రాలెను. సంపూర్ణముగ శేషనాగ సహిత ధరిత్రి కంపించెను. వృక్షములు వ్రేళ్ళతో సహా పెకలింపబడినవి. సూర్యుడు తేజో విహీనుడయ్యెను. ఆ సమయమున పరమ పవిత్రుడు జ్ఞాని, దేవర్షి, నారదుడు కైలాసమున కేగుచూ అప్రతిహత తేజోశాలి అయిన బాలకుని గాంచి ఈతడు శివపుత్రుడని గ్రహించి, కైలాసమునకేగి పార్వతీ పరమేశ్వరులకు ఆ వృత్తాంతమంతయు తెలిపెను. ఆ బాలకుడు శివపుత్రుడని తెలియగనే దేవ, మానవ, సర్ప, యక్ష గంధర్వాదుల ఆనందమునకు అవధులు లేవు. పుష్పవృష్టి కురిసి దేవ దుందుభులు మ్రోగినవి. అంత నారద మహర్షి "దేవీ! పార్వతీ! నా మార్గ మధ్యమున మీ పుత్రుని కాంచితిని. ఆతడు షణ్ముఖుడు, ద్వాదశబాహుడు, కోటిసూర్య ప్రకాశుడు; గంగానది యందలి శరవణ పొదలయందుండెను. నీవు కానీ ఆ బాలుని అచట వదిలివేయలేదుకదా? ఆతడు కోటి కందర్ప లావణ్యముతో వెలుగొందుచూ, తన గర్జనచే త్రిలోకములను ప్రకంపింప జేయుచున్నాడు. అంత సుందర బాలకుని పట్ల మీ కంత నిష్ఠురత ఎందులకో?" అని పలికి అంతర్హితుడయ్యెను. అంత జగన్మాత, పార్వతీదేవి ఆ బాలుని కడకేగెను.

(శ్రీ గణేశపురాణమందు ఉపాసనాఖండమందలి కార్తికేయ జననము అను ఎనబై ఐదవ అధ్యాయము సమాప్తము)

ఎనుబది ఆరవ అధ్యాయము

(కార్తికేయుడు దేవసేనాని అగుట)

బ్రహ్మ "ఆ బాలుని చూడగనే పార్వతీదేవి స్థనముల నుండి పాలు స్రవించెను. అంత ఆమె ఆ బాలుని ఆలింగన మొనరించి కైలాసమున కేగుటకు బయలుదేరెను. అంత గంగ అచటికి ఏతెంచి "అగ్ని ఈ బాలుడు నా పుత్రుడు అని తెలిపెను" అని పలికెను. అంతలో ఆరుగురు మునివధువులేతెంచి "ఈ బాలుడు మా నుండి ఉత్పన్నమయ్యెను" అని పలికిరి. అదే సమయమున అగ్ని సహితము అచటి కేతెంచి, వారందరూ కలసి కైలాసమున కేగిరి. పార్వతి తన తనయునితో అంతకుముందే కైలాసమునకేగి ఆ బాలుని తన ఒడిలో లాలించుట మొదలిడెను. అంత శివుడు సహితము ముచ్చటపడి, ఆ బాలుని తన ఒడిలోనికి తీసుకొనెను. గంగాది సర్వులు అచటికేతెంచి, ఆ దృశ్యము చూచి, మరి మాటలాడక వెనుకకు తిరిగిరి. అంత శివుడు బ్రహ్మ మరియు బృహస్పతులను రావించి, ఆ బాలునికి నామకరణ మొనర్పమనెను. అంత బ్రహ్మ, బృహస్పతులు "ఈ బాలుడు కార్తీకమాసమందు జన్మించెను కావున "కార్తికేయుడు" అని పిలువబడును. మరొక నామము "పార్వతీనందనుడు". శరద్వీపమునందుత్పన్నమయ్యెను కావున "శరజన్మ" అనియు, కృత్తికల నుండి ఉత్పన్నుడయ్యెను కావున "కార్తికేయుడు" అని, అరుగురు స్త్రీలు ఈతని మాతలు కావున "షణ్మాతుర" అనియు, తారకునిపై విజయము సాధించును కావున "తారకజిత్" అనియు, దేవతలు సేనాపతి కావున "మహాసేనుడు" అనియు, ఆరు ముఖములు కలవాడు కావున "షణ్ముఖుడు" లేక "షడాననుడు" అనియు, శివుని వీర్యము స్కలన మగుటచే "స్కందుడు" అనియు పిలువబడును" అని పలికిరి.

ఈ విధముగ వార్తాలాపము లాడుచుండగా అచటికి దేవతలు, మునులు ఏతెంచి, ఆనంద మనస్కులై కార్తికేయునికి ప్రణామములాచరించి, పూజించి, ఆయన గుణగణములు భజించి, భూనభోంతరాళములు దివ్య వాద్యములు మ్రోగుచుండగా ఆయనను దేవ సేనాపతిగా అభిషిక్తమొనర్చి "తారకుని సంహరింపమని" వేడుకొని తమ స్థానముల కేగిరి. ఋషులు తిరిగి తపస్సు ఆరంభించిరి. ఆ బాలుడు శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమానుడగుచూ, బాల చంచల భావమున

ఆకాశమందలి చంద్రుని పట్టుటకేగెను. అంత బ్రహ్మ ఆ బాలుని వారించెను. తదుపరి ఆ బాలుడు బుద్ధితో బృహస్పతిని, శక్తితో ఇంద్రుని పరాజితుల కావించెను. ఒకానొకనాడు పార్వతీపరమేశ్వరులు కైలాసమందు సుఖాశీనులై యుండగా, స్కందుడు వారిని సమీపించి, వందనమొనర్చి, తన తండ్రిని ఇట్లు ప్రశ్నించెను "తండ్రీ! నేను నానా విధములయిన శుభ ఆఖ్యానములను వింటిని, కానీ నాకు తృప్తి కలుగలేదు. ఈ లోకమందు సర్వసిద్ధి కారకము, పుత్ర సంపదాదుల వృద్ధి, సర్వపాప నాశకము, చతుర్విధ పురుషార్ధ ప్రదాయకము, శత్రువులపై విజయము ప్రసాదించు శుభవ్రతము గూర్చి తెలుపవలసినది."

శివుడు "కుమారా! నీ ప్రశ్న బహు ఉత్తమము. లోకోపకారకము. ఈ వ్రతము నీవడిగిన వన్నియు ప్రసాదించి, వానితోపాటు శ్రీగణేశుని ప్రసన్నుని కావించును. భక్తి పూర్వకముగ ఈ వ్రతమాచరించు మానవులు దేవతలచే కూడా పూజనీయులై సృష్టి, స్థితి, సంహారములు కావించు సమర్ధులగుదురు. వారి దర్శన మాత్రమున మహాపాపములు దూరమగును. ఇది "వరద చతుర్థీ" వ్రతము. దీనితో సాటివచ్చు వ్రతరాజము మరియొకటి లేదు. స్కందుడు "తండ్రీ! ఈ వ్రతమహిమ, విధివిధానములు, ఏ మాసమందు కావింపవలెను? ఈ వ్రతమును ఆచరించిన ప్రముఖులెవరు?" ఈ విషయములన్నియు లోకోపకారము కొరకు, వరద చతుర్ధి ప్రసిద్ధి కొరకు, విస్తారముగ తెలుపవలసినది.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి "కార్తికేయుడు దేవసేనాని యగుట" అను ఎనభై ఆరవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఏడవ అధ్యాయము

(వరదచతుర్ధి వ్రతము)

శివుడు "కుమారా! శ్రావణశుక్ల చతుర్ధి నాడు ఈ వ్రతమారంభించవలెను. ఆ రోజు ఉదయము తిలలు, తెల్లఆవాల మిశ్రమముతో నలుగు పెట్టుకొని స్నానమొనర్చి, క్రోధరహితులై, నిత్యనైమిత్తిక కృత్యములు ముగించి ఒక మండపము నిర్మింపవలెను. ఆ మండపము కదళీ తరువులు, చెరకు, చామరము, పుష్ప, దర్పణములచే అలంకరించి, ఆ మండపమందు వస్త్రయగ్నము పరచి, దానిపై చందనముతో అష్ఠ దళ కమలము గీసి, దానిపై కలశమును స్థాపింపవలెను. తదుపరి గురువు యొక్క ఆజ్ఞచే పూజాసామాగ్రిపై ప్రోక్షణమొనర్చి శ్రీగణేశుని షోడశోపచారములతో పూజింపవలెను. శ్రీగణేశుని యొక్కమూర్తి శక్త్యానుసారము స్వర్ణము లేక రజతము తో కావించి, ఇరువది ఒకటి పరమాన్నములను ఒక్కొక్కటి ఇరువది ఒక్కమార్లు శ్రీగణేశున కర్పింపవలెను. దక్షిణార్ధమై ఇరువది ఒకటి స్వర్ణ లేక రజత ముద్రలు పిసినారితనము విసర్జించి అర్పింపవలెను. అట్లే ఇరువది ఒకటి శ్వేత లేక హరిత దూర్వాంకురములను, పుష్పాంజలిని శ్రీగణేశునకు అర్పింవవలెను. వేదవేద్యులయిన ఇరువది ఒకటి బ్రాహ్మణోత్తములకు భోజనము సమర్పించి, క్షమాయాచన చేసి వారిచే స్వస్తివాచకమును చదివించుకొనవలెను. శ్రీగణేశుని పూజావిధి, ఆఖ్యానములు ఇదివరలో తెలిపిన విధముగనే కావించి తదుపరి బంధుబాంధవులతో కలసి మౌనముగ భోజనము స్వీకరింపవలెను లేదా ఉపవాసముండవలెను. ఈ విధముగ భాద్రపద శుక్ల చతుర్ధి వరకు కావించి, ఆ దినమున విత్తానుసారముగ శ్రీగణేశ మహోత్సవమును జరుపవలెను.

ఆ రోజు పూర్వోక్తు విధానముననే శ్రీగణేశ పూజనమొనర్చి, రాత్రి గేయ, గీత, భజనాదులతో, శ్రీగణేశ సహస్రనామ పారాయణతో జాగరణ మొనర్పవలెను. మరునాడు ఉదయము నిర్మల జలములందు స్నానమాచరించి, నిత్యకృత్యములొనర్చి, శ్రీగణేశపూజనము చేసి నూట ఇరువది ఒకటి లేక ఇరువది ఒకటి లేక ఒక్క బ్రాహ్మణునకు యధాశక్తి గో, భూ, సువర్ణ,

వస్త్ర, భూషణ, ధన, దానమొనర్చవలెను. దీన, అంధ, దు:ఖితులకు, అసహాయులకు అన్న, వస్త్ర, ధన సహాయమొనర్చవలెను. శ్రీగణేశుని ప్రతిమ ధాతు నిర్మితమయిన, దానిని బ్రాహ్మణులకు దానమీయవలెను. మృణ్మయమూర్తి అయిన ఎడల, అద్దానిని ఒక పల్లకీయందుంచి, ఛత్ర చామరములమర్చి, ఉత్సాహభరితముగ వాద్యములు మ్రోగించుచూ ప్రతిమను తీసికొని, పల్లకీముందు వేదపాఠములు, గీతా వాద్యములు, కోలాటములు, జరుగుచుండగా జలమధ్యమున ఆ మృణ్మయ శ్రీగణేశమూర్తిని నిమజ్జన మొనర్చవలెను." కార్తికేయా! ఏ వ్యక్తి ఈ వ్రతమును జీవితమందు ఒక్క పర్యాయము గావించిననూ, వాని మనోవాంఛితములు పూర్ణమై, అంత్యమున శ్రీగణేశుని సాలోక్యము నొందును. చతుర్ముఖ బ్రహ్మ సృష్టించు శక్తికై, శ్రీగణేశుని ఏకాక్షర మంత్రధ్యానము ఆచరించుచూ ఈ వ్రతము కావించెను. అంత శ్రీగణేశుడు ప్రత్యక్షమై ఆయనకు సృష్టి కావించుటకు వలయు వివిధ సామర్థ్యముల నొసంగెను. విష్ణువు అత్యద్భుతమైన షడక్షర ధ్యానమొనరించి ఈ వ్రతము సలిపి జగత్పాలనా శక్తి, స్వేచ్ఛగా అవతారములు స్వీకరించు సామర్థ్యము నొందెను. నేను శ్రీగణేశుని అష్టాక్షర మంత్రజపము చే ఈ వ్రతమొనరించి అనేక విధములయిన శక్తులు, త్రిలోక సంహార సామర్థ్యము నొందితిని. ఇంద్రుడు వృత్రాసుర వధను, ప్రద్యుమ్నుడు శంబరాసుర వధకై ఈ వ్రతపాలనమొనర్చి, తమ శత్రువులను హతమార్చిరి. ఓ! స్కంధా! కుమారా! నీవు సహితము ఈ వ్రతము ఆచరించుటచే యుద్ధమందు అజేయుడవై, త్రిలోక విఖ్యాతుడవగుదువు. నేను నీకు వరద గణేశుని షడక్షర మంత్రముపదేశించెదను" అని ఒక శుభ ముహూర్తమున ఆ విధివిధానములు శివుడు స్కందునకు ఉపదేశించెను.

అంత స్కందుడు కందమూల ఫలములు, లతలతో కూడిన వృక్షములు, వాపీ, తటాకములు గల ఒక రమ్యమయిన వనమునందు ఒంటికాలిపై నిలబడి, శివుడిచ్చిన మంత్రమును నిష్ఠగా జపించి, తదుపరి ఈ చతుర్థీ వ్రతమును కావించెను. అంత పరమాత్ముడు శ్రీగణేశుడు ప్రసన్నుడై ఆయన ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున ఆ మహాత్ముడు మహా తేజస్వియై, చతుర్భుజములు, గొప్పముకుటము, కుండలములు, అంగదాది ఆభూషణములు, లలాటమందు భాలచంద్రుడు, సుడితిరిగిన తొండము, నాలుగు హస్తములందు పాశాంకుశ దంతములు, వక్షమందు ముత్యముల మాలలు, ఉదరమందు నాగ యజ్ఞోపవీతము, బహుమూల్య వస్త్రములు, శరీరమందు చందనాది దివ్యగంధ లేపితుడై, కోటిసూర్య ప్రకాశుడై విరాజిల్లుచుండెను. ఆ రూపమును చూచి స్కందుడు ఆశ్చర్యచకితుడై విప్పారిన నేత్రములతో ఆ రూపమును త్రాగుచూ "ఈయన ఎవరు? నేను ధ్యానించుచున్న శ్రీగణేశుడా?" అని మనసున కొంచెము వ్యాకులత నొంది మౌనము వహించెను. అంత శ్రీగణేశుడు "వత్సా! నీవు దివారాత్రములు జపించుచున్న శ్రీగణేశుని నేనే! నీ మనోవాంఛితములను తెలుపుము. నీ ఎడల నేను అత్యంత ప్రసన్నుడనైతిని." స్కందుడు "జగదీశ్వరా! శ్రీగణేశా! నీ రూపమును బ్రహ్మాది దేవతలు, శాస్త్రకారులయిన ఋషులు, శేషుడు సహితము తెలియరు. అటువంటి రూపముతో నేడు నా ఎదుట ప్రత్యక్షమయితివి. నీకు నమస్కారము. నా మనోవాంఛితము – నేను ఎన్నడునూ పరాజితుడను కారాదు. నేను నిన్ను ధ్యానించిన తక్షణము నీవు నాకు ప్రత్యక్ష దర్శనమీయవలెను. నేను మీ చరణ కమల స్మరణ ఎన్నడునూ మరువరాదు. నేను దేవతలందరిలో విఖ్యాతుడను, వరిష్ఠుడను కావలెను. మీ దర్శనము అత్యంత కఠినము. అయిననూ నేడు ప్రత్యక్ష దర్శనమొసంగిరి. అందువలన నేటి నుండి మీరు "లక్ష్య వినాయక" నామమున ఇచట ఉపస్థితమై భక్తుల కోర్కెలను ఈడేర్చవలసినది."

అంత శ్రీగణేశుడు "స్కందా! నీవు అడిగిన వరము లన్నింటినీ నీకు ప్రసాదించుచున్నావు. నీవు శత్రువిజేతవై, దేవతల యందు శ్రేష్ఠత్వము నొందెదవు. నీవు తప్పక తారకుని సంహరించెదవు. నేను "లక్ష్య వినాయక" రూపమున ఈ క్షేత్రమందు భక్త వత్సలుడనై చిరకాలము నివసించెదను" అని పలికి స్కందుని వినయ విధేయతలకు, తపోబలమునకు ప్రసన్నుడై తన మయూర వాహనమును సహితము ప్రసాదించి అంతర్హితుడయ్యెను. అప్పటినుండి స్కందుడు "మయూరధ్వజుడు" అను పేర ప్రసిద్ధినొందెను. అంత స్కందుడు శ్రీగణేశమూర్తిని బ్రాహ్మణోత్తముల సాహాయ్యమున

ఆ దివ్యక్షేత్రమందు ప్రతిష్ఠించి ఆ మూర్తికి "లక్ష్య వినాయకుడు" అని నామకరణ మొనర్చెను. ఆ మూర్తికి లక్ష మోదకములు, పుష్పములు, దూర్వాంకురములతో, అన్య ద్రవ్యములతో పూజనమొనర్చెను. లక్షమంది బ్రాహ్మణులకు సహితము భోజన మర్పించెను. పిదప ఆ మూర్తికి అనేక ప్రణామములర్పించి, మయూర వాహనము అధిరోహించి, కైలాసమునకేగి పార్వతీ పరమేశ్వరులకు జరిగిన విషయమంతయు విన్నవించెను. తదుపరి వారి అనుమతి, ఆశీర్వాదము తీసికొని దేవసేనకు ఆధిపత్యము వహించి, సేనాధీశుడై తారకాసురునిపై యుద్ధమునకేగెను. వారి మధ్య ఒక లక్ష సంవత్సరములు సమరము జరిగెను. చివరకి తన శక్త్యాయుధము ప్రయోగించి స్కందుడు తారకుని సంహరించెను. ఆ భయంకర సంగ్రామమును శేషుడు సహితము వర్ణింప లేడనిన అతిశయోక్తి కాదు! దేవ, మానవ, లోకపాలురు, ఋషులు సర్వులు ఆనంద మనస్కులై స్కందునిపై పుష్పవృష్టి కురిపించి, అభినందించి, వారివారి గృహములకేగిరి. సర్వత్రా స్వాహాకార, స్వధాకార, వషట్కారములు తిరిగి ప్రారంభమయినవి.

బ్రహ్మ "పరాశరసుతా! ముప్పది మూడు కోట్ల దేవతలచే అవధ్యుడయిన తారకుడు స్కందుని చే హతమయ్యెను. యదార్థమునకు అది వరద చతుర్థి ప్రభావము. అందువలన ఇంద్రాది దేవతలచే సహితము స్కందుడు వందితుడయ్యెను." వ్యాసుడు "మహాత్మా! ఈ స్కందుడు ఎక్కడ ఈ దివ్య తపమాచరించెను?" బ్రహ్మ "ఘ్రుషణేశ్వరము అను స్థానమున శివుడు ప్రఖ్యాతుడై ఆవిర్భవించెను. అచటనే స్కందుడు తపమొనర్చి లక్ష్య వినాయకుని ప్రతిష్ఠించెను. తదనంతర కాలమున ఈ నగరమును "ఎల" అను ప్రసిద్ధ మహారాజు పరిపాలించుటనే ఇయ్యది "ఏలానగరము" అని విఖ్యాతి నొందినది.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి వరద చతుర్థీ వ్రతమను ఎనుబది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఎనిమిదవ అధ్యాయము

(కామదేవుని పునర్జన్మ)

వ్యాసుడు "బ్రహ్మదేవా! శ్రీగణేశాఖ్యానమును వింటిని. మీరు కాముడు శివుని త్రినేత్రముచే దగ్ధుడయ్యెనని తెలిపితిరి కదా! మరి మదనుడు సర్వలోకములందు ఎట్లు దృష్టిగోచరుడగుచున్నాడు? ఈ విషయమును విపులముగ వివరింప వలసినది." బ్రహ్మ "కాముడు అపరాధము కావించిన మీదట కపర్ది క్రుద్ధుడై ఆతనిని భస్మీభూతుని కావించెను. అంత కాముని పత్ని రతీదేవి మిక్కిలి శోకాకులయై శంభుని సమీపమునకేగి, సాష్టాంగ నమస్కృతులు సమర్పించి ఇట్లు స్తుతించెను "ఓ! పార్వతీపతీ! వృషధ్వజా! చంద్రశేఖరా! నీకు ప్రణామములు. నీవు రజోగుణముచే సృష్టి, సత్వగుణముచే స్థితి, తమోగుణముచే సంహారము కావింతువు. కపాలీ! నీవు భిక్షాటన గైకొని, జీవుల సమస్త కామనలను తీర్చెదవు. ఓ! దీనబంధువా! ఘటనాఘటన సమర్థా! నిన్ను శరణుజొచ్చుచున్నాను. మృతుడయిన నా పతిని బ్రతికించి, నాకు అఖండ సౌభాగ్యమును ప్రసాదింపుము. లేని ఎడల నేను ప్రాణత్యాగము కావింతును. అదే జరిగిన ఎడల నీకు అపకీర్తి ప్రాప్తించును." అంత శివుడు ప్రసన్నుడై "ఓ! సౌభాగ్యశాలినీ! సుముఖీ! నీ మనోవాంఛితమును కోరుకొనుము. నీ స్తుతి నన్ను అత్యంత ప్రసన్నుని కావించినది." అంత రతీదేవి "స్వామీ! లోకమునందు స్త్రీలకు కామినీగుణము (ఉద్వేగము, ప్రేమ, కోరుకొనబడుట, అందము, కామోత్కంఠత) సహజము. ఈ స్త్రీలెవ్వరికీ నా యందలి లేశమాత్రము కామినీగుణము లేదు. నన్ను చూచి ఇంద్రాది దేవతలు సహితము నిర్లజ్జులై వీర్యస్కలనము నొందుచున్నారు. అందువలన నేను లజ్జితురాలిని అగుచున్నాను. మదనుడు లేని నా లావణ్యమంతయు వృథా! "రతి విధవ అయినది" అను అపశబ్దము నన్ను దహించుచున్నది.

అందువల్ల ఓ! దేవేశా! నా పతికి జీవన ప్రదానము కావింప వలసినది." అంత లోకోపకారి అయిన శంభుడు సంతసిల్లి "కళ్యాణీ! చింత వలదు. నీవు ప్రతివారి (ఇతరుల) కార్యములకు సిగ్గు పడవలదు. నీవు మనసున స్మరించినంత మాత్రమున మదనుడు నీకు దృష్టిగోచరుడగును. అందువలన ఆతడు "మనోభూ" అని పిలువబడును. అతడు నీ మనోకామనలను పూర్ణమొనరించును. నీవునూ సర్వత్రా సమ్మానితవగుదువు. నీ పతి రుక్మిణీకృష్ణులకు "ప్రద్యుమ్నుడు" అను పేర పుత్రుడై జన్మించి లోక విఖ్యాతుడగును."

అంత రతీదేవి సంతుష్టాంగ తరంగయై గృహమునకేగి తన పతిని స్మరించెను. తక్షణము మన్మధుడు ప్రత్యక్షమై ఆమెకు ఆనందము నిచ్చెను. అంత మదనుడు త్రినేత్రుని వద్దకేగి ప్రణామములు కావించి, ఇట్లనియె "ఓ! దేవాశా! మీరు నిరపరాధినైన నన్ను ఏల అనంగుని కావించిరి? తారకాసురుని చే పీడింపబడిన సుర, ముని గణములు అశరీరవాణిచే మీ వలన విశాఖుడు ఉత్పన్నుడయిన ఎడల వారి కష్టములు తీరునని, కానీ మీరు తపోనిష్టులై యున్న కారణమున మీ తపోభంగము కావింపమని నన్ను ప్రోత్సహించి ప్రార్థించిరి. పరోపకారమును మించిన పుణ్యము వేరొకటి లేదు కదా! నేను సర్వులకు కేవలము ఉపకారార్ధము ఈ కార్యమొనర్చితిని. కానీ నా దుర్భాగ్య వశమున ఆ పరోపకారమే నా పాలిటి శాపమైనది. ఇంతకుమున్ను ముప్పదిమూడు కోట్ల దేవతలలో నావంటి సుందరుడు లేడు సర్వులు నాతో పోల్చుకొనెడివారు. ఇపుడు శరీర రహితుడనై ప్రేతము వలె ఎట్లు జీవింపగలను? అందువలన మహాదేవా! నా యందు అనుగ్రహము చూపి నన్ను రక్షింపవలసినది." అంత నీలలోహితుడు కృపాళువై మదనునికి శ్రీగణేశుని ఏకాక్షర మంత్రోపదేశమొనర్చి, అనుష్ఠానము కావింపమని ఆదేశించెను. అంత అనంగుడు రతీసహితుడై ఒక సురమ్య ప్రదేశమునకేగి శివుడు ఉపదేశించిన రీతిని శ్రీగణేశ మంత్రముతో కేవల వాయుభక్షకుడై తీవ్ర తపమాచరించెను. ఆ సమయమున రతీదేవి తన భర్తకు అన్ని విధముల సహాయపడినది.

అంత దేవదేవుడయిన శ్రీగణేశుడు ప్రసన్నుడై వారికి ప్రత్యక్షమయ్యెను. ఆయన అపుడు దశభుజుడు, మహాముకుటము, దేదీప్యమానమైన కుండలములు, కోటిసూర్య ప్రకాశము, గళమందు ముత్యాల మాలలు, దివ్య దుకూలములు, చందనాగరుకస్తూరి ఆలేపనములు, సింధూర లేపనముచే అరుణిమను సంతరించుకొన్న తొండము, హస్తములందు దశాయుధములు, నాగ యజ్ఞోపవీతము, సింహస్కంధము, నానాభూషణ భూషితుడై, విపుల శోభా సంపన్నుడై విరాజిల్లుచుండెను. ఆ పరమాత్మ ప్రత్యక్షమవ్వగనే దివ్య దుందుభులు మ్రోగినవి. ఇంద్రాది దేవతలు, యక్ష, గంధర్వ, కిన్నెరాదులు, ఏతెంచి, శ్రీగణేశునకు షోడశోపచారములతో పూజించిరి. అంత కామదేవుడు లేచి తొలుత దేవతలకు, మునులకు నమస్కరించి, పిదప భగవానుడైన శ్రీగణేశుని పాదపద్మముల పైబడి ఇట్లు స్తుతించెను. "ఓ! భక్తవత్సలా! పరబ్రహ్మ స్వరూపా! మీరు నిరాకారులైనప్పటికీ సాకారులై ప్రత్యక్షమయ్యిరి. మీ సర్వ దు:ఖనాశకమయిన చరణయుగళి దర్శనమగుటచే నా జన్మము, తపము, ధన్యమయినవి. మీ దర్శనము చతుర్విధ పురుషార్ధములను, సర్వ సిద్ధులను ప్రసాదించును. నా నేత్రములు ధన్యములు. ఎవరిని వేదాంతులు, సాంఖ్యయోగులు, పాతంజలి యోగ పరాయణులు, ఇతర జ్ఞాన సంపన్నులు సహితము తెలియక, కేవలము "నేతి, నేతి" (ఇది కాదు, ఇది కాదు) అని మౌనము వహించిరో, ఎవరిని చూచుటకు, వర్ణించుటకు, వేదమునకు సహితము అసాధ్యమో, ఏ అఖిలేశ్వరుని రోమకూపములందు అఖిలాండకోటి బ్రహ్మాండములు యున్నవో, అటువంటి పరమాత్ముని చూపిన మంత్రము సహితము ధన్యము." అంత పరమాత్మ "ఓ! మదనా! నీవు కేవలము నా అనుగ్రహము చేతనే నన్ను చూడగలిగితివి. నీ జప తపములచేత నేను సంతుష్టుడనైతిని. నీ మనోవాంఛితమును కోరుకొనుము. అంత మన్మధుడాయనకు జరిగిన

వృత్తాంతమంతయు తెలిపి "హే! భగవన్! మీరు నా ఎడల ప్రసన్నులయిన ఎడల నన్ను తిరిగి దేహధారిని కావింపవలసినది. పూర్వము వలె నా లావణ్యమును, సర్వ దేవతలచే గౌరవము, మీ చరణములందు అచంచల భక్తి మరియు త్రిలోక విజయము ప్రసాదింప వలసినది."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి కామదేవుని పునర్జన్మమును ఎనభై ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఎనభై తొమ్మిదవ అధ్యాయము

(మహోత్కట గణపతి ఉద్భవము, శేషుని గర్వము)

అంత శ్రీగణేశుడు "మదనా! నీవు నన్ను కోరిన వరములన్నియు నీకు సిద్ధించును. నీవు లక్ష్మి (రుక్మిణి) గర్భము నందు జన్మించి, శరీరయుక్తుడవై, సర్వాంగ సుందరుడవై, సర్వ మాన్యుడవై, త్రైలోక్య విజయుడవగుదువు. పుష్పములు, ఫలములు, కిసలయములు (లేత పల్లవములు), కామినుల అంగప్రత్యంగములు, ఇవన్నియు నీ ఉద్బోధకములగును. అంతేకాక నీవు వీని సహాయముచే సర్వులను జయించెదవు. కామినుల దర్శనము లేక స్మరణము చే నీవు సర్వ ప్రాణులయందు ఉత్పన్నమగుదువు. నీవు లోకమునందు "మనోభూ" లేక "స్మృతిభూ" అని ప్రసిద్ధుడవగుదువు. నీకు నాయందు విస్మృతి లేని దృఢభక్తి కలుగును. ఏదేని గొప్ప కార్యము సంభవించవలెనని నీవు తలచినపుడు నేను నీకు తప్పక ప్రత్యక్షమగుదును." ఈ విధముగ వరములొసంగి శ్రీగణేశుడు అదృశ్యుడయ్యెను. కాముడు తపమాచరించిన స్థలమే జనస్థానము. కాముడు ఆ జనస్థానమునందు ఒక గొప్ప శ్రీగణేశమూర్తిని స్థాపించి రతీదేవి చే వండబడిన వివిధ పక్వాన్నములను, మోదకములను లడ్డూలను, ఆ పరాత్పరున కర్పించి, ఆ మహాతేజస్సంపన్నుని "మహోత్కట గణపతి" అని నామకరణ మొనర్చెను. ఆ మూర్తి చుట్టూ రత్నఖచిత స్ధంభములతో కూడిన సుందర మందిరమును నిర్మించెను.

కాలాంతరమున కాముడు రుక్మిణీ గర్భమున "ప్రద్యుమ్నుడు"గా అవతరించెను. శంబరాసురుడు ఆ బాలుని అపహరించి సముద్ర మధ్యమున పడవైచెను. ఆ బాలుని ఒక చేప మ్రింగెను. జాలరులు ఆ చేపను వలయందు పట్టి శంబరునకు సమర్పించిరి. వంటశాలయందు ఆ చేపను కోయగా అందు ఒక శిశువు కనిపించెను. రతీదేవి ప్రచ్ఛన్న రూపమున "మాయావతి" అను పేర శంబరుని వద్దనే యుండెను. శంబరుడు ఆ బాలుని మాయావతి కిచ్చెను. నారదుడు మాయావతికి ఈ బాలుని చరిత్రము తెలిపి ఆతడే ఆమె భర్త అయిన మదనుడని తెలిపెను. అంత ప్రద్యుమ్నుడు పెద్దవాడై, మాయావతి వద్ద అనేక మంత్రములు నేర్చి, వాటి సహాయముతో శంబరుని సంహరించి, మాయావతి యొక్క నిజరూపమును గాంచి, ఆమె తన భార్య అని తెలిసికొని, ఆమెతో సహితుడై ద్వారకకు ఏతెంచి, తన తల్లిదండ్రులకు నమస్కరించెను. రుక్మిణీకృష్ణులు, ద్వారకా వాసులందరూ హృదయానంద తరంగులైరి. సత్యవతీనందనా! నీకు జనస్థానమందలి శ్రీగణేశమహిమను తెల్పితిని. ఈ జనస్థానమందే లక్ష్మణుడు శూర్పనఖ యొక్క ముక్కు, చెవులు కోసెను. అప్పటినుండి ఈ ప్రదేశము "నాసిక" (నాసిక్) అని ప్రసిద్ధి నొందినది. ఇచటి పాషాణములు సహితము మోదకముల మాదిరిగ దృష్టిగతమగును. ఏ విధముగ కాముడు శ్రీగణేశుని షడక్షర మంత్రమును జపించి ఆరాధించెనో, అట్లే శేషుడు సహితము కావించెను.

వ్యాసుడు "పితామహా! శేషుడు ఏ ఉద్దేశ్యముతో, ఏ విధముగ శ్రీగణేశుని ఆరాధించి, ఏ ఫలితము నొందెను? ఈ విషయము విస్తారముగ వివరింపవలసినది. పురాణకథల విషయమందు వక్త, శ్రోత, ప్రశ్నించువారలు అందరునూ

పుణ్యమును బడయుదురు.” అంత బ్రహ్మ “సాత్యవతేయా! ఒకానొక సమయమున పార్వతీ పరమేశ్వరులు కైలాస శిఖరమందు సుఖాశీనులై యుండిరి. ఆ పర్వతము గొప్ప వృక్షములతో, లతా కుంజరములతో, జలపాతముల హోరుతో, భ్రమర ఘుంకారములతో అత్యంత మనోహరముగ ఒప్పుచుండెను. చంపకాశోక, వకుళ, మాలతీ పుష్పములు సుగంధములు విరజిల్లుచుండెను. ఆ సమయమున వారి దర్శనార్థమై ముని, ఋషి, అప్సర, యక్ష, గంధర్వ, నాగ, కిన్నెరలు ఏతెంచి, సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించిరి. గంధర్వులు గానము, అప్సరసలు నాట్యము కావించి, చంద్రశేఖరుడు, వ్యాఘ్రచర్మాంబరధారి, నందీ భృంగాదులచే సేవితుడు, త్రిశూలధారి, భస్మలిప్తాంగ శరీరుడు, శేషుని శిరమందు దాల్చిన చంద్రమౌళిని పూజించిరి. కొందరు శివుని మానసోపచారములతోనూ, మరికొందరు అర్ధ నిమీలితనేత్రులై ధ్యానము తోనూ, వశిష్ఠ, వామదేవ, జమదగ్ని, త్రిత, అత్రి, కణ్వ, భరద్వాజ, గౌతమాది మహర్షులు స్తోత్రములతోనూ స్తుతించిరి. ఆ సమయమున ఆ త్రినేత్రుని శిరము నధిరోహించిన శేషుడు కించిత్ మోహితుడై గర్వమునందెను. ఆతడు తన మనసునందు “నా అంతటి శ్రేష్ఠతముడు ఈ త్రిలోకముల యందునూ యుండుట కద్దు. అందుకే నేను శివుని మస్తక మలంకరించితిని. ధరిత్రిని నా ఫణమందు ధరించిన సమర్థుడను. వేరెవరికైననూ ఈ సమర్థత కలదా? నా కులమందు జన్మించిన వాసుకి తాడై క్షీరసాగర మథనమందు తోడ్పడెను. అందువలననే దేవతలు అమృతపాన మొనర్పగలిగిరి. నా అంతటి శ్రేష్ఠుడు మరియొకడు లేదు.”

సర్వాంతర్యామి అయిన శంకరుడు శేషుని మనసునందు ఉత్పన్నమయిన గర్వమును గ్రహింపలేడా? ఆయన ఒక్క ఉదుటున లేచి, శేషుని పట్టి భూమి పై విసరెను. శేషుని ఫణము ఛిద్రమై పది ముక్కలైనది. సంపూర్ణ నాగకులభూషణుడైన శేషుడు ప్రాణములతో బ్రతికి ఇట్లు తలచెను “నేను త్రిలోకాధీశుడైన శివుని శిరమందు భూషణమైతిని. నేను కావించిన ఏ దుష్కర్మచే నాకీ దుస్థితి కలిగినది? నేను రెక్కలు లేని పక్షివలె చలనమునకు కూడా శక్తి లేని వాడనైతిని. నేనిపుడు ఏమి చేయుదును? నన్నెవరు రక్షింతురు? నేను నా పూర్వపదమును ఎట్లు తిరిగి చేరగలను? “ఈ విధముగ చింతించుచున్న శేషునకు నారద మహర్షి దర్శనము కలిగెను. స్వప్నమందు నిధిజాడ తెలిసిన భిక్షకుని వలె శేషుడు ప్రసన్నుడయ్యెను. నారదమహర్షి సహితము అత్యంత దీనావస్థ యందున్న శేషుని చూచి, తన దివ్యదృష్టిచే సర్వము గ్రహించి, అయినప్పటికీ ఏమియును తెలియనివాని వలె శేషుని ఇట్లు ప్రశ్నించెను.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి మహోత్కట గణపతి ఉద్భవము, శేషుని గర్వము అను ఎనబై తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

తొంభైయవ అధ్యాయము

(ధరణీధర గణపతి చరితము)

నారదుడు “అనంతా! నీవిట్లు నిస్తేజుడవై, దు:ఖితుడవగుటకు కారణమేమి? నీ శిరము ఏల పది ముక్కలైనది? మహాదేవుడు నీ ఎడల రోషభూయిష్ఠుడయ్యెనా? నీవు ఏల గర్వితుడవైతివి? నీ దు:ఖమునకు కారణము వివరించితివేని, దాని ప్రత్నామ్నాయమును, కావింపవలసిన ప్రక్రియను తెలిపెదను.” ఈ విధముగ ప్రశ్నించినప్పటికీ శేషుడు మితిమీరిన బాధతో నోట మాటరాకుండెను. అంత కరుణాతరంగుడైన నారదమహర్షి “ఓ! అశేషకళానిధీ! నా పలుకులు ఏకాగ్రతతో వినుము. నీవు తిరిగి నీ స్వకీయ స్థానమునకేగుటకు, దేవతా ప్రముఖులచే గౌరవింపబడుటకు, తిరిగి ధరిత్రిని నీ

శిరముపై మోయుటకు ఒక ఉపాయమును తెల్పెదను." అంత శేషుడు "స్వామీ! నా పూర్వపుణ్యలేశము కొంచెము మిగిలియుండి మీ దర్శనమయినది. మీ శుభ దర్శనముచే నా భవిష్యత్ సహితము శుభకరమగును. ఇందే సందేహము లేదు. పుణ్యహీనులకు మీ దర్శనమగుట కల్ల. నా శిరము దశవ్రక్కలై అత్యంత పీడనొందుటచే నేను ధరణిని మోయలేను. నేను తిరిగి నా పూర్వ సామర్థ్యము, యశస్సు సంతరించుకొను ఉపాయముపదేశింప ప్రార్ధన" అని పలికెను. నారదుడు "నాగరాజా! నీకు శ్రీగణేశుని మహామంత్రము ఉపదేశించెదను. దీని వలన పూర్వము ఇంద్రాది దేవతలు తమ పదవుల నొందిరి. త్రిమూర్తులు సృష్టి, స్థితి, సంహారములు కావించుచున్నారు. నీ ఎడల శ్రీగణేశుడు ప్రసన్నుడయిన ఎడల నీ కష్టములు సంపూర్ణముగ నశించును. నీ స్థితి కాంచి నా హృదయము ద్రవించుచున్నది. నీకు శ్రీగణేశుని షడక్షర మహామంత్రముపదేశించెదను. దీని వలన శ్రీగణేశుడు అత్యంత త్వరితముగ ప్రసన్నుడై ప్రత్యక్షమయి, నీ మనోవాంఛితములను పూర్ణమొనరించును" అని పలికి శేషునకు ఆ మంత్రోపదేశము, విధి విధానములు తెలిపి అంతర్ధానుడయ్యెను.

శేషుడు ఆ జపమొనర్చుటకు కృతనిశ్చయుడై, ఇంద్రియములను పూర్ణముగ వశపరుచుకొని, షడక్షర మంత్రధ్యానము ఒక వేయి వత్సరములు కావించెను. అంత శ్రీగణేశుడు ప్రసన్నుడై ఆతని ఎదుట ఈ విధముగ ప్రత్యక్షమయ్యెను. ఆ పరాత్పరుడు సింహారూఢుడు, త్రినేత్రుడు, దశభుజుడు, నాగయజ్ఞోపవీతుడు, కుండలాలంకృతాంగుడు, బాహువులందు అంగద కేయూరధారి, నానారత్న శోభితుడు, మహాముకుటధారి, హస్తములందు రత్నముద్ర, అక్షమాల ధరించి, గజాస్యుడై మెలితిరిగిన తొండముతో, వివిధ ఋషి, దేవగణములు సేవించుచుండగా సిద్ధిబుద్ధుల సహితుడై ఏతెంచెను. ఆ కాంతిని కాంచజాలక శేషుడు కన్నులు మూసికొని, ఒక ముహూర్తమయిన పిదప ఇట్లు చింతించెను" ఈ ప్రళయాగ్ని కీలక ప్రకాశము ఎక్కడిది? ఇయ్యది సర్వ లోకములను దగ్ధమొనర్పగలది. నేను కావించిన శుభకర్మ యొక ఫలము విపరీతమగునా? లేక నేను శ్రీగణేశుని దర్శించుచున్నానా?" అంత శ్రీగణేశుడు "కుతర్కముల యందు కుశలుడవయిన శేషుడా? భీతి వలదు. నీవు దివారాత్రములు పరితపించుచున్న శ్రీగణేశుడను నేనే! ఈ జగత్తును సృష్టించి, పోషించి, సంహరించునది సహితము నేనే!! నా తేజస్సు చే సూర్యచంద్రులు, అగ్ని, నక్షత్రములు దీప్తివంతములగుచున్నవి. పరబ్రహ్మ స్వరూపుడనైనప్పటికీ, నీ తపస్సుకు మెచ్చి మరియు లోకోపకార్యార్థమై నీ ఎదుట సాకారముగ ప్రత్యక్షమైతిని. నీ మనోవాంఛితములు కోరుకొనవలసినది."

శేషుడు "మహాప్రభూ! నీ తేజస్సు యొక్క గరిమచే నిన్ను కాంచలేకున్నాను. మీరు కొంచెము సౌమ్యరూపమును పొందవలసినది." అంత శ్రీగణేశుడు కోటి చంద్రుల కాంతితో సౌమ్యుడై శేషుని కగుపించెను. శేషుడు "ఓ! ఆద్యంతరహితా! సర్వవ్యాపీ, ఈశాన, జగత్కారణా, సర్వస్వరూపా, విశ్వేశా, విశ్వవంద్యా నీకు నమస్కారము. గజాననా, గణాధ్యక్షా, గరుడేశసంస్తుతా, గుణాధ్యక్షా, విభుడా, గుణాధీశా, గుణాతీత, గణాధీశా నీకు నమస్కారము. సర్వాదిస్థాతృదేవా, దేవప్రియా, దేవదేవా, సిద్ధిబుద్ధిప్రియతమా, సర్వసిద్ధి ప్రదాతా, భుక్తిముక్తి ప్రదాయికా, సర్వవిఘ్నహర్తా గణనాయకా నీకు నమస్కారము. స్వామీ! నేడు నా తల్లిదండ్రులు, తపో, జ్ఞాన, జన్మ, నేత్ర, శరీరములు ధన్యములయినవి. మీ స్తుతియందు సంయక్ రూపముతో ప్రవర్తిల్లిన నా జిహ్వ సహితము ధన్యము. ఓ! అవక్ర పరాక్రమా! నాకు మీయందు అఖండిత భక్తి నొసంగి, నిరంతర మీ భక్తి, పూజన, సౌభాగ్యము నొసంగవలసినది. నా అఖర్వ గర్వకారణమున మహాదేవుడు నన్ను భూతలముపై విసరివైచెను. నా ఫణము దశ వ్రక్కలయినది. మహానుభావుడయిన నారదుని వలన నాకు మీ దర్శన భాగ్యమబ్బినది. నన్ను త్రిలోకముల యందు శ్రేష్ఠుని గావించి, నా శిరమునకు పూర్వపు బలము, తేజస్సు, సమర్ధత కల్పింపవలసినది. నాకు ఒక అచల స్థానము, నాగలోకాధిపత్యము, నిరంతర మీ దర్శన ప్రాప్తి కటాక్షింపవలసినది. నాకు మహాదేవుడయిన శివుని యందు భక్తి, ఆయన సాన్నిధ్యము, మరియు నాగకులమందు శ్రేష్ఠత ప్రసాదింపవలసినది" అని పలికెను.

అంత శ్రీగణేశుడు "నీ ముఖము పది ప్రక్కలైనది. కానీ నా వరము చే నీవు సహస్ర శిరములు, ఫణములు పొందెదవు. ప్రళయ పర్యంతము నీవు లోక విఖ్యాతుడవగుదువు. నీ ఫణములుపై ధరిత్రిని మోయు సమర్థత కలుగును. నా కృపచే నీవు శివుని పంచ ముఖములందునూ శిరములపై నెలకొని నిరంతరము నా సాన్నిధ్యమునందుండెదవు. నీ ఇతర మనోరథము లన్నియునూ పూర్ణమగును." ఇట్లు పలికి ఆ పరమాత్మ శేషుని తన ఉదరమునకు చుట్టుకొని "వ్యాళబద్ధోదరుడు" అని విఖ్యాతి గాంచెను. అంత శేషుడు శిరముపై అమృతమయమయిన తన హస్తమును యుంచెను. ఆ దివ్య స్పర్శచే శేషునకు శ్రీగణేశుని విరాట్ స్వరూపము విదితమయ్యెను-దిశలు చెవులు; సూర్యుడు నేత్రములు; ఓషధులు ఆయన రోమములు; పర్వతములు నఖములు; మేఘములు ఆయన స్వేద బిందువులు; చతుర్ముఖ బ్రహ్మ ఆయన జననేంద్రియము; ఆయన ఉదరమున సమస్త లోకములు, చతుస్సముద్రములు యుండెను. ఆయన ఏకరూపుడయినప్పటికీ, అనేక బాహూదర వక్త్రనేత్రుడై, అనంత రూపుడై, అనంత శక్తిమంతుడై దీప్తించుచుండెను. ఆ విరాడ్రూపము కాంచి శేషుడు అత్యంత భయభ్రాంతుడై భ్రాంత చిత్తుడైయ్యెను. అంత శేషుడు శ్రీగణేశుని ప్రార్థించుటచే ఆ పరాత్పరుడు తిరిగి సింహారూఢుడైన తన స్వస్వరూపమును పొందెను. గణపతి "నా ఈ విరాడ్రూపమును దేవతలు సహితము ఎన్నడునూ చూచి ఎరుగరు. నీ సౌభాగ్య వశమున నీ యందలి అనుగ్రహము చే నీకు ఈ రూపమును చూపించితిని. నీవు ఎల్లప్పుడూ నా శరీరముపై, అచలముగ పాతాళమున, శివుని శిరమున, విష్ణువు యొక్క శయ్యగా విరాజిల్లెదవు. బాలుడు పుష్పమాలికను ధరించినటుల పృథివిని నీ ఫణముపై మోయుదువు" అని పలికెను.

అంత శేషుడు "స్వామీ! మీ దయచే నేను నా శిరమందు పృథివీధారణ కావించి "ధరణీధర" అనుపేర విఖ్యాతినొందెదను. మీరు ఈ క్షేత్రమందు విరాజితులై భక్తుల కామనలను పూర్ణమొనరించి "ధరణీధర గణపతి" గా ప్రసిద్ధినొందవలెను. విఘ్నేశుడు "తథాస్తు" అని పలికి అంతర్హితుడయ్యెను. అంత శేషుడా క్షేత్రమందు ఒక గొప్ప గణపతిని స్థాపించి, అద్దాని చుట్టూ రత్నఖచిత స్థంభములతో కూడిన సుందర మందిరమును నిర్మించెను. శేషనాగుని చే ధరణీధర గణపతి స్థాపింపబడిన క్షేత్రము "ప్రవాళక్షేత్రము". అటుపిదప శేషుడు శ్రీగణేశుడు తన కొసంగిన స్థానములకు చనెను." ఓ! వ్యాసా! నీకు శ్రీగణేశుని అద్భుత మహిమను వర్ణించితిని.

(శ్రీగణేశపురాణమందు ఉపాసనాఖండమందలి ధరణీధర గణపతి చరితమను తొంబైయవ అధ్యాయము సమాప్తము)

తొంబై ఒకటవ అధ్యాయము

(కాశ్యప సృష్టి)

ద్వైపాయన మహర్షి "పితామహా! నాకు ఈ ఆఖ్యానములు వినిన కొద్దీ మరింత వినవలెనని ఉత్సుకత కలుచున్నది. నాకు ఇతర శ్రీగణేశ ఆఖ్యానములు తెలుపవలసినది." బ్రహ్మ "ఒకానొకనాటి కాలమున ప్రళయము అంతరించిన పిదప నూతన సృష్టి సమయమున పరాత్పరుడు శ్రీగణేశుడు నన్ను పిలచి సృష్టి కావింపమని ఆజ్ఞాపించెను. అంత నేను ఏడుగురు మానస పుత్రులను సృష్టించితిని. వారు వరుసగా కశ్యప, గౌతమ, జమదగ్ని, వశిష్ఠ, భరద్వాజ, అత్రి మరియు విశ్వామిత్రులు. వారందరూ సర్వ విద్యా విశారదులు. వారు నాతో ఇట్లనిరి "తండ్రీ! మాచే కాగల కార్యము శలవీయ వలసినది." అంత నేను వారందరిలో బుద్ధిమంతుడయిన కశ్యపుని పిలచి "నీవు నేను కావించు సృష్టిని కొనసాగింపవలసినది" అని కోరితిని. అతడు "వల్లె" యని, తపస్సార్థము వనముల కేగి ఒక వేయి దివ్య సంవత్సరములు

శ్రీగణేశుని ఏకాక్షర మహామంత్రమును జపించెను. అపుడు శ్రీగణేశుడు సర్వాభరణ భూషితుడై దర్శనమిచ్చెను. అంత కశ్యపుడు ఆయనకు ప్రణామములాచరించి, మంగళ ద్రవ్యములతో పూజనమొనర్చి, అంజలి ఘటించి "స్వామీ! నేడు నా తల్లిదండ్రులు, తపో, ధ్యాన, శరీరాదులు ధన్యములయినవి. ఈ ఫలపుష్ప, వృక్ష సహిత ధరిత్రి ధన్యము. సర్వేశ్వరుడు, పరమాత్మ, పరాత్పరుడు అయిన శ్రీగణేశుని దర్శింపజేసిన ఏకాక్షర మంత్రము ధన్యము. ఎవరిని తెలియక వేదములు వెనుదిరిగినవో, వేదాంతము మూగబోయినదో, మానసిక తర్కమునకు అగోచరమైనదో, ఎవరి నుండి త్రిమూర్తులు, సప్త పాతాళములు, పదునాల్గు భువన భాండంబులు ఆవిర్భవించి తిరిగి విలీనమగుచున్నవో, ఎవరు నిరాకార, నిర్గుణ, నిరాధీశ, గురుగమ్యుడో అట్టి శ్రీగణేశుని దర్శనము నేను పొందితిని." ఈ వచనామృతమునకు ప్రసన్నుడై శ్రీగణేశుడు వినమ్రుడైన కశ్యపునకు "కశ్యపా! నీ భక్తి, అనుష్ఠాన, స్తుతులకు నేను సంతసిల్లితిని. నీ మనోవాంఛితములు కోరుకొనుము." అంత కశ్యపుడు "పరమాత్మా! నాకు సృష్టి కావించు సామర్థ్యము, నిరంతరము నీ పాదముల యందు భక్తి, నీ స్మరణ నా చిత్తవృత్తి యగునట్లు, నా పుత్రులు కశ్యపనందనులు అని విఖ్యాతినొందునట్లు నాకు వరమొసంగుము." శ్రీగణేశుడు ఆతడు కోరిన వరములు అన్నియును ప్రసాదించి "నీవు చిత్ర విచిత్ర సృష్టి కావించెదవు. నీకు కష్టకాలమున నన్ను స్మరించిన ఎడల నేను తప్పక నీ వద్ద కేతెంచెదను" అని పలికి అదృశ్యుడయ్యెను.

తదుపరి ఆయన పదునాల్గుమంది భార్యలు దితి, అదితి, వినత, కద్రువ, దను, కృద్ధ, సింహక మొదలగు వారిని స్వీకరించెను. ఇది జరిగిన కొన్నాళ్ళకు ఆయనకు శరీరమందు ఎడతెగని కామ విజృంభణము జరిగి నిత్య నైమిత్తిక క్రియలు సహితము ఆచరింపలేకుండెను. ఆయన స్థితిని గమనించి ఆయన భార్యలు ఆయనను చేరిరి. వారందరినీ వేరు వేరు భవనముల యందుంచి వారందరితో ఆయన సంభోగమొనరించి తన కామమును తీర్చుకొని వారిని ఆనందపరచెను. అంత వారందరూ గర్భవతులై దితి దైత్యులను, అదితి దేవతలను, దనువు దానవులను, ఇతన స్త్రీలు కిన్నెర, యక్ష, సిద్ధ, చారణ, గుహ్యక, పశు, పక్షి, మృగజాతులు, పర్వతములు, వృక్షములు, సముద్రములు, లతలు, వివిధ ధాన్యములు, ధాతువులు, పిపీలికాది సర్వము కశ్యపుని సంతతియే!! వీరందరునూ జన్మించుటచే కశ్యపుడు అత్యంత ముదిత మనస్కుడయ్యెను. ఆయన వేదములు మధించి వానినుండి వివిధ శ్రీగణేశ మంత్రములు–ఏకాక్షరము నుండి అష్టదశాక్షర (పద్దెనిమిది) మంత్రము వరకు అన్ని మంత్రములు వెలికిదీసి, వాటిని తన సంతానమునకు ప్రసాదించి, వానిని నియమబద్ధముగ శ్రీగణేశుడు ప్రత్యక్షమగు వరకు జపించమని ఆదేశించెను. వారందరూ వివిధ ప్రదేశములకేగి తమ తండ్రి తెలిపిన విధమున జపమారంభించిరి. వారు ఆ విధముగ తీవ్ర జపము ఆచరించుచూ ఒక వేయి వత్సరములు గడచిన పిమ్మట ఎవరు ఏ రూపమును ఆరాధించిరో ఆ రూపముతో శ్రీగణేశుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను.

కశ్యప పుత్రులు ఆ మహాత్ముని గని చేతులు జోడించి ఇట్లనిరి "ఎవరి నుండి ఈ అనంత జీవ సంపద ఉత్పన్నమయ్యెనో, ఎవరి అప్రమేయ తేజస్సుతో త్రిగుణములు ప్రాదుర్భూతమయినవో, ఎవరి మహిమచే ఈ సమస్త విశ్వము త్రిగుణాత్మకముగ కనిపించుచున్నదో, ఆ శ్రీగణేశునికి ప్రణామము లర్పించుచున్నాము. ఎవరి నుండి త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, దైత్యులు, మానవులు ఆవిర్భవించిరో, ఎవరి నుండి సూర్యచంద్రులు, పంచభూతములు, స్థావర జంగమాత్మకమైన జగత్తు, సమస్త జంతుజాలము, వృక్ష సంతతి ఆవిర్భవించినవో, ఆ శ్రీగణేశునకు నమస్కరించు చున్నాము. ఎవరి పూజనము చే మోక్షాభిలాషులు అజ్ఞానము హరించి మోక్షము నొందెదరో, భక్తులు సంతోష సంపదల నొందెదరో, ఎవరి భజనచే విఘ్నములు నాశనమొంది కార్యసిద్ధి కలుగునో, అట్టి శ్రీగణేశునకు ప్రణామములర్పించుచున్నాము. ఎవరి కృపచే శేషుడు అత్యంత బలిష్ఠుడు, వరిష్ఠుడు అయి ధరిత్రిని మోయు సామర్థ్యము నొందెనో, స్వర్గము అస్తిత్వము నొందినదో, ఎవరిని వర్ణించుటకు వేదములు సహితము అసమర్థములై "ఇది కాదు, ఇది కాదు" అని తడబడునో, అట్టి చిదానంద స్వరూపుడయిన పరబ్రహ్మ శ్రీగణేశునకు మేము నమస్కరించుచున్నాము."

(శ్రీగణేశ పురాణమందు ఉపాసనాఖండమందలి కాశ్యపసృష్టి అను తొంబై ఒకటవ అధ్యాయము సమాప్తము)

తొంభై రెండవ అధ్యాయము

(శ్రీగణేశుని ద్వాదశ నామ ఫలము)

కశ్యప పుత్రులు శ్రీగణేశునికి ప్రణామమలర్పించి "స్వామీ! నేడు మా జన్మము, తపస్సు, జ్ఞాన, దాన, యజ్ఞ, నేత్రములు, మా పూర్వీకులు సహితము ధన్యములయినవి." శ్రీగణేశుడు వారి అమృతతుల్య పలుకులు విని, స్థుతినాలకించి, ప్రసన్నుడై "మీరు కాంచిన నా ఈ రూపమును త్రిమూర్తులు సహితము తెలియరు. మీ స్థుతి నన్ను ప్రసన్నుని కావించినది. మీమీ మనోవాంఛితములు కొరుకొనవలసినది" అని పలికెను. కశ్యప పుత్రులు అసంఖ్యాకులు. అట్లే వారి కోర్కెలు సహితము అసంఖ్యాకములు. పరమాత్మ వారందరూ కోరిన వరములు వారికొసగి తిరిగి ఇట్లనియె "మీరు కావించిన ఈ అష్టశ్లోకీ స్థోత్రము నాకు కడు ప్రియమయినది. ఏ జీవి త్రిసంధ్యల యందునూ ఈ స్థోత్రమును జపించునో ఆతడు విద్వాంసుడు, పుత్రవంతుడు అగును. అంతేకాక ఆతడు ఆయు:, ఆరోగ్య, ఐశ్వర్య, యశో, వృద్ధి, విజయములను ప్రాప్తించి మనోవాంఛితములన్నియు సిద్ధించి, అంతమున పరమపదము నొందును. ఏ మానవుడు ఈ స్థోత్రమును మూడు రోజులు త్రిసంధ్యల యందునూ పారాయణ మొనర్చునో వానికి సర్వకార్యసిద్ధి కలుగును. ఈ స్థోత్రమును శ్రీగణేశ చతుర్ధి ఉత్సవకాలమున ప్రతి దినము ఎనిమిది సార్లు చొప్పున పారాయణ కావించిన వారు అష్ట సిద్ధుల నొందెదరు. ఏ వ్యక్తి రోజుకు పదిమార్లు చొప్పున ఒక మాస పర్యంతము ఈ స్థోత్ర పారాయణ కావించిన, వారు కారాగారము నుండి విముక్తులగుదురు. అంతేకాక వారు విద్యార్థులైన విద్య, పుత్రార్థులైన పుత్రులను బడయుదురు. శ్రీగణేశుని యందు భక్తి తత్పరుడై ఏ వ్యక్తి ఈ స్థోత్రమును ప్రతిదినము ఇరువది ఒక్క మార్లు పఠించిన వారు సమస్త మనోవాంఛితములు పొందెదరు." ఈ విధముగ పలికి శ్రీగణేశుడు వారందరూ చూచుచుండగనే అంతర్థానుడయ్యెను.

తదుపరి కశ్యప పుత్రులు ఎవరికి తగిన విధముగ వారు శ్రీగణేశమూర్తిని నిర్మించుకొని, దానిచుట్టూ మందిరము నేర్పరిచి భక్తితో పూజించిరి. దేవతలు సుందర శ్రీగణేశమూర్తిని ప్రతిష్ఠించి అద్దానికి "సుముఖ గణపతి" అని పేరిడిరి. మునులు "ఏకదంత గణపతిని" ప్రతిష్ఠించిరి. గంధర్వులు, కిన్నెరులు "కపిల గణపతి"ని, గుహ్యక, చారణ, సిద్ధులు "గజకర్ణ గణపతి"ని, ప్రతిష్ఠించి అద్దాని ప్రభావము చే వారందరూ విమాన మధిరోహించి స్వర్గమున కేగిరి. మానవులు "లంబోదర గణపతి"ని, హింసాత్మక వన్య మృగములు "వికట గణపతి"ని, వృక్ష, పర్వతములు "విఘ్న నాశక గణపతి"ని, విషధర జంతు సమూహము "ధూమ్రకేతు గణపతి"ని, జలాశయములు "గణాధ్యక్ష గణపతి"ని, క్రిమి కీటకాదులు, వనస్పతులు "భాలచంద్ర గణపతి"ని, జలాశయములు "గణాధ్యక్ష గణపతి"ని ప్రతిష్ఠించిరి. ఆ ప్రతిష్ఠ మూలమున సర్వ జీవజాతులు తమ తమ వాంఛితములను పొంది, విఖ్యాతి నొందిరి. శ్రీగణేశుని యొక్క ప్రతి నామమును తెలుపు శక్తి నాకు లేదు. ఆయన అసంఖ్యాక నామములందు కొన్నిటిని తీసికొని సహస్రనామ సోత్రముగా మలచబడినది. వానియందు సారరూపమయిన పన్నెండు నామములు నీకు తెలిపితిని. ఇవి సముద్ర మంధనముచే లభించు అమూల్య రత్నములు వంటివి. ఈ విధముగ నీకు శ్రీగణేశుని మహిమను సంక్షేపముగ వర్ణించితిని. వీని మహిమను వర్ణించుట ఎవరికైననూ అసాధ్యము. సాక్షాత్ త్రిమూర్తులు సహితము శ్రీగణేశుని మహిమను ఎరుగరన, వేరొకరి గూర్చి చెప్పనేల? చివరిగా వ్యాసా! ఏ కార్యారంభమునైననూ శ్రీగణేశుని పూజింపవలెను. ఆ విధముగ పూజింపని దురాత్ముని ఛండాలుని వలె పరిత్యజింపవలెను.

వ్యాసుడు "చతురాననా! శ్రీగణేశుని పన్నెండు నామములు పఠించిన, శ్రవణము కావించిన, తలచిన కార్యములందు నిర్విఘ్నత ఏర్పడి కార్యసిద్ధి కలుగును. వానిని మరొకమారు తెలుప వలసినది." బ్రహ్మ"

సముఖశ్చేక దంతశ్చ, కపిలో గజకర్ణక:
లంబోదరశ్చ వికటో, విఘ్ననాశో గణాధిప:
ధూమకేతుర్గణాధ్యక్షో భాలచంద్రో గజానన:
ద్వాదశైతాని నామాని య:పఠేత్ శృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమే తధా
సంగ్రామే సంకటేచైవ విఘ్నస్థస్య నజాయతే ॥
శుక్లాంబరధరం దేవం శశివర్ణం చతుర్భుజమ్ ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే
కోటికన్యా ప్రదానాన కోటి యజ్ఞ వ్రతానిచ తపాంసియాని సర్వాణి తీర్థాన్యాయతనానిచ ॥

"సుముఖ, ఏకదంత, కపిల, గజకర్ణ, లంబోదర, వికట, విఘ్ననాశ, గణాధిప, ధూమ్రకేతు, గణాధ్యక్ష, భాలచంద్ర, గజానన" ఈ నామములను విద్యారంభము, వివాహము, గృహప్రవేశము, యాత్ర, సంగ్రామము, సంకటకాలము, లందు ఎవరు పఠించిన, వినిన వారికి విఘ్ననాశకములు జరిగి కామ్యసిద్ధి కలుగును. సర్వ విఘ్నముల శాంతికై శ్వేత వస్త్రధారి, చల్లని వెన్నెలవలె ప్రకాశించువాడు, చతుర్భుజుడు, ప్రసన్నముఖుడు, అయిన శ్రీగణేశుని ధ్యానింపవలెను. కోట్లాది కన్యాదానములు, కోట్లాది యజ్ఞ వ్రతములు, తపస్సులు, సర్వ తీర్థ క్షేత్ర సందర్శనములు, వేలాది స్వర్ణ భాండ దానములు లభించునో, ఇతర అతి కష్టతరములైన కృశ్చ, చంద్రాయణాది కోట్లాది వ్రత ఫలములచే ఎంతటి పుణ్యము లభించునో, అయ్యది ఈ ద్వాదశ నామ పఠనమునకు శతాంశము (వందవ వంతు) సరికావు. ప్రాత: కాలమున లేచి, స్నానాదికములు లొనర్చి, భక్తితో శ్రీగణేశుని ధ్యానించి, ఈ ద్వాదశ నామములను పఠించిన వారికి సర్వకార్య సిద్ధి కలిగి అంతమున మోక్షము సిద్ధించును. అటువంటి వ్యక్తి యొక్క దర్శనము చే సర్వులు పవిత్రులగుదురు. అంత చెప్పనేల? శైవులు, వైష్ణవులు, శాక్తేయులు, గాణాపత్యులు, ఎవరైననూ ఈ ద్వాదశ నామ పారాయణ మొనర్చిన పిమ్మటనే వారి వారి సర్వ కార్యములను ఆరంభింపవలెను. ఈ ద్వాదశ నామములందు ఏ ఒక్క నామమునైననూ పలికి కార్యారంభము కావింపవలెను. లేనిఎడల అయ్యది నిష్ఫలమగును. దుష్టులు, నాస్తికులు, సహితము వారి వారి కార్యసిద్ధికై, అజ్ఞానమున నైననూ శ్రీగణేశుని బీజాక్షరములను ఉచ్చరంచి కార్యసిద్ధి నొందెదరు. మునివర్యా! నీకు శ్రీగణేశుని సంపూర్ణ మహిమ యందు లేశమాత్రము వివరించితిని. ఈ ఉపాసనా ఫలితమును సహితము నాకు తోచినది నీకు తెలిపితిని. దీనిని సంపూర్ణముగ తెలియుట, తెలుపుట రెండునూ అసాధ్యమే!!!

భృగుమహర్షి సోమకాంతునకు ఇంతవరకు బ్రహ్మ, వ్యాస సంవాదమగ శ్రీగణేశ మహిమను వర్ణించి "ఓ! సోమకాంతా! నీకు శ్రద్ధ యున్న ఎడల శ్రీగణేశుని పాపనాశకమయిన అన్య చరితమును వర్ణించెదను. ఏ మానవులు ఈ శ్రీగణేశ పురాణమును వినెదరో వారు సర్వ విపత్తులనుండి ముక్తులై, అనేక సుఖభోగముల ననుభవించి, పుత్రపౌత్రాభివృద్ధులై, జ్ఞానవిజ్ఞానవేత్తలై, శ్రీగణేశుని కృపచే ముక్తి నొందెదరు. శతకోటి కల్పముల వరకు వారికి ఈ భవసాగరమందు జన్మయుండదు. సూతుడు శౌనకాదులతో "ఎవరు పరమభక్తి భావముతో ఈ పురాణమును వినినా, వినిపించినా, వారు సోమకాంతుని వలెనే అద్దాని పుణ్య ఫలమును తప్పక పొందెదరు."

(శ్రీగణేశపురాణమందు ఉపాసనా ఖండమందలి శ్రీగణేశ ద్వాదశ నామ ఫలము అను తొంబై రెండవ అధ్యాయము సమాప్తము)

ఉపాసన ఖండము సమాప్తము

క్రీడా ఖండము

ఒకటవ అధ్యాయము

(దేవాంతక, నరాంతక జననము)

మునులు "సూతమహర్షీ! నీవు ఒక అద్భుతమైన ఆఖ్యానమును వినిపించితివి. మేము ఎంతో ఉత్సుకతతో వింటిమి. కానీ ప్రతిదినమూ అన్నము తినిననూ మరునాడు తిరిగి అన్నమే తినవలెనన్న బుద్ధి పుట్టునట్లు, అన్నభక్షణము నందు తృప్తి తీరనట్లు, ఈ శ్రీగణేశాఖ్యానములను ఎంత తిన్ననూ మాకు సంతృప్తి కలుగుట లేదు. అందువలన మరికొన్ని ఆఖ్యానములు వినిపింప ప్రార్థన. మీరు తెలిపెడి ఈ ఆఖ్యానములు వినినంతనే జనులు సంసార సాగరము నుండి ముక్తులగుదురు. సూతుడు "మునులారా! మీకు ఉపాసనాఖండము తెలిపితిని. ఇపుడు మీకు క్రీడాఖండము తెల్పెదను. ఇందు మీకు శ్రీగణేశుడు కావించిన దుష్ట శిక్షణము, శిష్ట రక్షణము, అందు భాగముగ వివిధ దైత్యుల సంహారము కావించిన విధానములు వివరించెదను. సావధానులై ఆలకింపవలసినది. మీకు వ్యాస, పితామహ సంవాదమును భృగు, సోమకాంత సంవాదముగ తిరిగి వినిపించెదను. వ్యాసుడు సహితము మీరు నన్నడిగినట్లే శ్రీగణేశుని అనంతావతారములు, రాక్షస వధ గూర్చి ప్రశ్నించెను. బ్రహ్మ "ద్వైపాయనా! నీవు హృదయానందకరమైన విషయము గూర్చి ప్రశ్నించితివి. పుణ్యశ్లోకులు, పవిత్ర చరిత్రులు అయిన వ్యక్తులకు నేను అత్యంత గోప్యమయిన విషయములు సహితము వర్ణించి విశదీకరించెదను. శ్రోతలు ఉత్సుకులై వినుచుండుట వక్తలకు అత్యంత ప్రోత్సాహము నిచ్చును. నేనిప్పుడు నీకు తెలిపెడి ఆఖ్యానము సాక్షాత్ విష్ణు భగవానుని చే ఉటంకింపబడినది. దీనిని ఆలకించుటచే సమస్త మనోకామనలు పూర్ణమగును. విష్ణువు "శ్రీగణేశుడు వివిధ యుగములందు వివిధ నామములు, వాహనములు, భిన్న గుణములు, కర్మములతో దైత్యసంహారము కావించెను. ఆయన కృతయుగమందు "వినాయక" నామముతో, సింహవాహనుడై, దశభుజుడు, మహాకాయుడై, తేజోమయుడై, జితేంద్రియుడై వరప్రదానము కావించెను. త్రేతాయుగమందు మయూరవాహనుడై, షడ్భుజుడై, శ్వేతవర్ణుడై "మయూరేశ్వరుడు"గా త్రిలోకప్రసిద్ధి నొందెను. ద్వాపరమందు రక్తవర్ణుడై, మూషిక వాహనము, చతుర్భుజములు కలిగి "గజాననుడు" అనుపేర విఖ్యాతినొంది సర్వులచే పూజింపబడెను. కలియుగమందు ధూమ్రవర్ణుడై అశ్వవాహనము, రెండు భుజములు కలిగి "ధూమ్రకేతు" నామమున మ్లేచ్ఛజాతిని సంహరించెను. ఆ పరాత్పరుడు ఏఏ దైత్యులను సంహరించెనో ఆ ఆఖ్యానములు తెలిపెదను.

ఒకానొకనాటి మాట. అంగ దేశమందు "రౌద్రకేతు" అను బ్రాహ్మణుడుండెడివాడు. ఆయన సర్వశాస్త్ర ద్రష్ట, తత్వజ్ఞాత, వేదవేదాంగ పారంగతుడు, బుద్ధియందు బృహస్పతి, నిత్యాగ్నిహోత్రి, గో బ్రాహ్మణ పూజా తత్పరుడు, నిత్య దేవతోపాసన కావించు భక్తుడు, ఆగమ విశారదుడు. ఆయన ధర్మపత్ని "శారద". ఆమె రూప లావణ్యములందు అప్సరసలను మించిన సౌందర్యరాశి, పూర్ణచంద్ర నిభానన, కమలదళనేత్ర, ఎల్లప్పుడు దివ్యాభరణ భూషితయై, అష్టనాయికామూర్తి వలె విలసిల్లెడిది. వారిరువురు ఎంతో ఆనందముగ సంసార జీవితము అనుభవించుచుండగా కాలక్రమమున శారద కార్తీకమాసమందు గర్భవతి అయ్యెను. నెమ్మదిగ నెలలు నిండిన ఆ సాధ్వి ఇరువురు మగపిల్లలకు (కవలలు) జన్మనిచ్చెను. ఆ బాలకులిరువురు ఆజానుబాహులు, విశాలనేత్రులు. ఆ బాలకులిరువురినీ చూచుకొని, ఆ దంపతి ఎంతో ఆనందపడి తమ తపములు ఫలించెనని తలచిరి. రౌద్రకేతు ఆ బాలకురివువురికీ యధా శ్రౌత కర్మములు, మాతృకా పూజనము, స్వస్తి వాచకము, అభ్యుదయ శాస్త్రకర్మలు కావించి బ్రాహ్మణ పూజనము చేసి, ఆ బ్రాహ్మణులకు, తన మిత్రులకు, ధన, రత్న, వస్త్రదానములు కావించి ధ్యానయోగులు పరమాత్మను ప్రాప్తించి అమితానందమును అనుభవించినటుల తన పుత్రుల గాంచి ఆ దంపతి అమందానందము నొందిరి. పది దినములు గడచిన పిమ్మట వారు

జ్యోతిషశాస్త్ర పండితులను రావించి "మహాత్ములారా! మీరు భూత, భవిష్యత్ వర్తమాన ద్రష్టలు. మీరు ఈ బాలకుల భవిష్యత్ గణించి నామకరణ మొనరింప వలసినది." అంత ఆ పండితులు సర్వము గణించి ఈ బాలకులకు "దేవాంతకుడు", "నరాంతకుడు" అను పేర్లిడిరి.

ఆ బాలకులిరువురు అత్యంత బలశాలులై వెదురుబొంగుల వలె వేగముగ ఎదుగసాగిరి. వారి పద ఘట్టనములచే రసాతలమందలి శేషుని ఫణములు ఘాతము నొందుచుండెడివి. వారు నిలుచున్నపుడు వారి శిరములు సూర్యమండలమును తాకుచున్నట్లుండెడివి. ఈ విధముగ కాలము గడచుచుండగా వారి గృహమునకు మహానుభావుడు, దేవర్షి నారదుడు ఏతెంచి రౌద్రకేతు దంపతి తో "నేను మీ ఇరువుర బాలుర కీర్తి విని ఇచటకు ఏతెంచితిని. వీరిరువురు భవిష్యత్ యందు అత్యద్భుత కీర్తివంతులగుదురు. ఇటువంటి పుత్రులను బడసిన మీరిరువురు మహాభాగ్య సంపన్నులు. ఈ బాలురను గాంచిన సాధారణ వ్యక్తులు సహితము ముదిత మనస్కులు అగుదురనిన, సజ్జనుల మాట చెప్పనేల?" ఈ హృదయానందకరమైన పలుకులు వినిన దంపతి "మీ ఆశీర్వాద బలముచే మా పుత్రులు దీర్ఘాయువులై, విఖ్యాతులై, సర్వజ్ఞులై, శత్రువిజేతలై వర్ధిల్లవలెను" అని కోరిరి. అంత నారదుడు ఆ కుటుంబము యొక్క భక్తి ప్రపత్తులను, వినయ విధేయతలను గమనించి, అత్యంత ప్రసన్నుడై ఆ బాలురివురికీ పంచాక్షరీ మంత్రము **(ఓం నమ: శివాయ)** ను సాంగోపాంగముగ ఉపదేశించి "పుత్రులారా! ఈ విద్యచే మీరు పరమేశ్వరుని ప్రసన్నము కావింపుడు" అని ఆదేశించి, తన అమృత హస్తమును వారి మస్తకము పై యుంచి దీవించి, అభయ ప్రదానము గావించి, రౌద్రకేతు, శారదల అనుమతి గ్రహించి వారు చూచుచుండగనే అదృశ్యుడయ్యెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి దేవాంతక, నరాంతక జననమను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(దేవాంతక, నరాంతక తపస్సు)

అంత ఆ బాలకులిరువురు తమ తల్లిదండ్రుల ఆజ్ఞ గైకొని వనమున కేగిరి. ఆ వనము మహావృక్ష పరివృతమై, పుష్పఫల భరితమై వాపీతటాకములతో నిండి అనేక గుహలు కలిగిన పర్వతయుక్తమై యుండెను. అందలి ఒక సమతల ప్రదేశమున బాలురిరువురు స్థిరచిత్తులై ఒంటికాలి బొటనవ్రేలిపై నుంచొని ఒక వేయి సంవత్సరములు నిరాహారులై, తదుపరి రెండు వేల సంవత్సరములు వాయుభక్షకులై, తదుపరి ఒక వేయి సంవత్సరములు క్రిందపడిన పండుటాకులు తినుచూ తపమాచరించిరి. ఈ విధముగ వారిరువురు పదివేల సంవత్సరములు తపమాచరించిన పిదప వారి శరీరమునుండి తీవ్రమయిన కాంతి వెలువడి సూర్యకాంతిని మరగుపరచినది. వారిరువురు భస్మలేపితులై, వ్యాఘ్రగజచర్మధారులై, రుద్రాక్షలు ధరించి ఉష:కాలమున పుష్ప పల్లవములతో శివపూజన మొనర్చుచుండిరి. వారి అత్యద్భుత తేజము చే ఆ వనమందలి క్రూర మృగములు సహితము తమ స్వాభావిక వైరము మరచినవి. వారి తపమునకు ప్రసన్నుడై మహానుభావుడు, త్రినేత్రుడు, దశభుజుడు, పార్వతీ సహితుడు, వ్యాఘ్రగజచర్మాంబరధారి, ఒక హస్తమందు త్రిశూలము, శిరముపై గంగ, వేరొక హస్తమందు ఢమరుకము, శరీరమంతయు సర్ప హారములు, మెడ యందు పుర్రెలమాల, నీలకంఠుడై, వృషభారూఢుడై, భస్మలేపిత శరీరుడై, నానా భూషణ భూషితుడై, చంద్రశేఖరుడై, తన వెలుగుచే దిగంతములు ప్రకాశమొనర్చుచు ప్రత్యక్షమయ్యెను.

తాము తపించుచున్న భగవానుడు ఎదురుగా కనబడుసరికి కవలలిరువురు ఆనందోత్సాహములతో నాట్యమొనరించి, తదుపరి సాష్టాంగ దండ ప్రణామము లాచరించి ఇట్లనిరి "హే! భగవాన్! నేడు మీ దర్శనముచే మా మాతాపితరులు, జన్మము, కులము, తపము, నేత్రములు, దేహము సర్వము ధన్యములైనవి. దృష్టికి అగోచరుడవు, అవాఙ్మానస గోచరుడవు, షట్ శాస్త్రములకు, ఆగమములకు అందని పరమేశ్వరా? సహస్రఫణుడైన శేషుడు నిన్ను స్తుతించుటకు అసమర్ధుడన మేమెంత? స్వామీ! సర్వజగత్‌స్రష్టా, రక్షకుడవు, పాలకుడవు, సంహారకుడవు సహితము నీవే! దరిద్రుని రాజుగనూ, రాజును దరిద్రునిగనూ మార్చగల ఘటనాఘటన సమర్ధుడవు. నీకు నమస్కారము." ఇదంతయు విని పార్వతీపతి శుచిస్మితుడై "వత్సలారా! నేను మీ తపస్సుకు, వచనామృతమునకు మెచ్చితిని. మీ మనోవాంఛితములు కోరుకొనవలసినది." అంత వారిరువురు "దేవేశ్వరా! జగదీశ్వరా! సర్వేశ్వరా! నీవు మా యందు ప్రసన్నుడవైతివేని మాకు దేవ, మానవ, యక్ష, రాక్షస, పిశాచ, నాగ, గంధర్వ, అప్సరస, కిన్నెరలు, సమస్త అస్త్ర శస్త్రాళి, వన్య మరియు గ్రామ్య పశువులు, గ్రహ నక్షత్ర, భూత, దానవాసుర, క్రిమి కీటకములనుండి కానీ, రేయింబవళ్ళు యందు కానీ మాకు మృత్యువు రాకుండుగాక! మాకు త్రైలోక్య రాజ్యపదవి లభించుగాక!" అంత శివుడు "తథాస్తు" అని పలికి, తన కరకమలమును వారిరువురి శిరము పై యుంచి దీవించి అంతర్ధానుడయ్యెను. వారు శివునికి పరిక్రమ గావించి, అనంతరము తమ గృహమునకేగి తమ తల్లిదండ్రులకు ప్రణామమలుర్పించి, ఆలింగన మొనర్చి, సమస్త వృత్తాంతమును వారికి వినిపించిరి. వారి తల్లిదండ్రులు వారి మూర్ధన్యమును ఆఘ్రాణించి "మీరు కావించిన పవిత్ర కార్యముచే మా జన్మమే కాక మన కులమంతయు పవిత్రమైనది. మీరు గొప్ప యశస్సంపన్నులైరి. మీ వాక్కులచే మాకు అమృతపాన మొనర్చినట్లున్నది." తదుపరి వారు తల్లి ద్వారా అభ్యంగన స్నానమొనర్చి, ఇతర బంధుమిత్రులతో కలసి స్వాదిష్ఠ భోజనమును స్వీకరించిరి. తల్లి వారిరువురినీ దివ్య భూషణములతో అలంకరించినది. అచటి బ్రాహ్మణులందరూ వారికి ఆశీర్వచనములొసంగి శలవుదీసికొనిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి దేవాంతక, నరాంతకుల తపస్సు అనెడు రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(దేవాంతకుని స్వర్గముపై విజయము)

మరునాడు ఉదయము వారిరువురు ప్రాత:కాలమున లేచి, కాలకృత్యములు తీర్చుకొని, నిత్య కర్మానుష్ఠానము సలిపి, బ్రాహ్మణులకు దానము లొసగి, ఒక ఏకాంత ప్రదేశమున కేగిరి. జ్యేష్ఠభ్రాత అయిన దేవాంతకుడిట్లనియె "సోదరా! మనము శివ వరప్రసాదులము. నేను స్వర్గముపై దండెత్తి స్వర్గమును ఆక్రమించెదను. నీవు భూ, పాతాళములను ఆక్రమింపుము." ఈ విధముగ సోదరులిరువురు సమాలోచన కావించి, ఒక శుభ ముహూర్తము నిర్ణయించి ఇరువురు వారి ఆక్రమణ మొదలిడిరి. దేవాంతకుడు వాయు సమ వేగము కలవాడు. ఆతడు అమరావతి చేరి అచట గల ఉద్యానములను ధ్వంసమొనర్చెను. అచటి పరిచారకులు పరుగునపోయి ఇంద్రునికీ విషయము తెలియబరచిరి. ఆయన క్రుద్ధుడై "వచ్చినది ఎవరు? వానిని వధింపుడు, బంధింపుడు లేదా దూరముగ తరిమివేయుడు" అని పలికెను. అంత దేవతావీరులు ఉద్యానవన సమీపమునకు ఏగి దేవాంతకుని గాంచిరి. ఆతని వేగమునకు గర్భిణులకు గర్భస్రావమయ్యెను. వృక్షములు వ్రేళ్ళతో పెకలింపబడినవి. పర్వతములు కంపించినవి. ఆతని దేహకాంతిని తట్టుకొనలేక సురల శరీరములు కాంతిహీనములయినవి. దేవసైనికులు పలాయనులైరి. ఇంద్రుడు వ్యాకులచిత్తుడయ్యెను. కొందరు దేవతలు యుద్ధ

సన్నద్ధులైరి. కొందరు సురాధములు దేవాంతకుని శరణమందిరి. అంత ఇంద్రుడు చతుర్దంతి ఐరావతమును అధిరోహించి, హస్తమందు వజ్రాయుధము ఝుళిపించుచూ సర్వులను యుద్ధసన్నద్ధుల గావించెను.

ఈ విధముగ ఏతెంచిన దేవతానీకమును గాంచి దేవాంతకుడు ఇంద్రునితో "శక్రా! శివుని వరముచే నేను మీకు అజేయుడను. నా భయముచే యముడు సహితము పలాయనము చిత్తగించెను. నేను గట్టిగా ఊదిన ఎడల మీ దేవతలందరూ ఎగిరిపోయెదురు. నా మాట వినుము. నీవు సామరస్యముగ నీ అధికారములన్నియు నాకొసగుము. మీరందరూ నేటి నుండి ఎక్కడికయిననూ వెళ్ళి జీవింప వలసినది. లేని ఎడల మీకందరకు మృత్యువు ప్రాప్తించును." ఈ పలుకులు విని సహస్రాక్షుడు ప్రళయాగ్నికీలక విస్ఫులింగములు కన్నుల రాలుచుండగా "ఓరీ! దానవాధమా! నేను ఎందరు దానవులను చూడలేదు? సంహరింపలేదు? నీకు శివుని వరదానమున్నప్పటికీ, నా వజ్రఘాతము చే తప్పక మరణించెదవు. నీవు దేవాంతకుడవా? దాని మరియొక అర్థము "దేవతలచే అంతమొందింప బడెడివాడవు" అని పలికి దేవాంతకునిపై తీవ్రముగ వజ్రముతో ప్రహరించెను. ఆశ్చర్యము. వజ్రము మట్టిపెళ్ళ వలె తునాతుకలయినది. దేవాంతకుని వెంట్రుక సహితము కదలలేదు. శరీరము కందలేదు. ఆతడు నిర్భీతుడై యుద్ధరంగమందు నిలబడి ఇంద్రునిపై తన ముష్టిఘాతమును ప్రహరించెను. ఝంఝూవాతమందు పెళ్ళగింపబడిన మహావృక్షము వలె పురంధరుడు నేలకూలెను. అంత నెమ్మదిగ బలముతెచ్చుకొని పలాయనమొనర్చుట మొదలిడెను. అంత దేవాంతకుడు వారి వెనుక పరెగెత్తి, వారిముందునకేగి, ఇంద్రుని చెంప ఛెళ్ళుమనిపించి, ఒక్కొక్క దేవతా ప్రముఖుని పట్టి, గిరగిరా త్రిప్పి భూమిపై విసరెను. కొందరు దేవతలను వెదురు గడలతోనూ, కొందరిని ముష్టి ఘాతములతోనూ, మరికొందరిని మోకాళ్ళు, మోచేతులతోనూ హింసించెను. వారందరూ సింహముచే పీడింపబడిన కుంజర యూథము వలె నేలపైబడి, చలించుటకు శక్తిలేక కూలబడిరి. అంత జయశాలి అయిన దేవాంతకుడు ఒక భయంకర గర్జన కావించెను. అది విని సూర్యుడు సహితము తన పురి వీడి పలాయనుడైయ్యెను. దేవాంతకుడు ఇంద్ర సింహాసనమందు అధిష్ఠితుడయ్యెను. తదనంతరము ఎక్కెడెక్కడి దానవ దైత్యగణములు అసంఖ్యాకులు దేవాంతకుని వద్దకు వచ్చి చేరిరి. వారందరూ నానా విధములయిన ద్రవ్యములు, తీర్థజలములు గొనివచ్చి, ఋషులు మంత్ర పఠనము చేయుచుండగా దేవాంతకుని పట్టాభిషిక్తుని గావించిరి. దేవతలు హిమాలయ కంధరములందు తలదాచుకొని కందమూల ఫలములు తినుచుండిరి.

ఆ సమయమున శంఖ, బేరీ, పటాకము, మృదంగ, వేణు దుందుభుల ధ్వనులు భూనభోంతరాళములు నిండెను. అంత ఆ దానవులందరూ తమ రాజును చూచి "మీ వంటి వీరుడు "న భూతో న భవిష్యత్" అని పలికిరి. అంత దేవాంతకుడు కోట్లాది దానవ సేనాసహితుడై సత్యలోకమున కేగెను. అది తెలిసి చతుర్ముఖ బ్రహ్మ ముందుగనే మాయమయ్యెను. దేవాంతకుడు బ్రహ్మ వాహనమైన హంసనూ, ఇంద్రుని వాహనమైన ఐరావతమును వశపరుచుకొని వాటిపై విహరించుచూ వైకుంఠముపై దండెత్తెను. లక్ష్మీ సమేతుడై నారాయణుడు క్షీరసాగరమందు ప్రవేశించి మాయమయ్యెను. అంత దేవాంతకుడు అసుర ప్రముఖుల రావించి వారిని "దైత్య ప్రముఖులారా! ఇంకనూ మనము గెలువ వలసిన ప్రదేశములు ఏవైననూ యున్నవా? తెలుపుడు. నేను వాటిపై దండెత్తదనని పలికెను. అంత వారు "ప్రభూ! సర్వము మీ పాదాక్రాంతమయినదని" తెలిపిరి. అంత దేవాంతకుడు అమరావతి యందే యుండి మిగిలిన ప్రదేశములందు సమర్థవంతులైన దానవులను నియమించి స్వర్గ సామ్రాజ్యమును నిరాటంకముగ పరిపాలించుట మొదలిడెను.

(శ్రీ గణేశపురాణమందు క్రీడా ఖండమందలి దేవాంతకుని స్వర్గముపై విజయము అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(నరాంతకుని పృథివీ పాతాళములపై విజయము)

వ్యాసుడు "చతురాననా! నేను అత్యంత భక్తి భావముతో దేవాంతకుని ఉదంతము వింటిని. ఇపుడు నరాంతకుని చేష్టితములు తెలుపవలసినది." బ్రహ్మ "సాత్యవతేయా! నరాంతకుడు నానా దైత్యగణ సహితుడై కొందరు రాజులపై దండెత్తెను. వాని గూర్చి తెలియక రాజులు సమరావేశులై పూర్ణముగ మడసిపోయిరి. ఆ రాజుల భయానక మరణములను కాంచిన మిగిలిన రాజులందరూ ప్రాణములు అరచతిలో పెట్టుకొని నరాంతకుని శరణుజొచ్చిరి. ఏఏ రాజులు శరణుజొచ్చిరో వారికి తిరిగి వారి వారి రాజ్యముల నొసగి వారిని సామంతుల జేసెను. యుద్ధమున మరణించిన రాజుల పుత్రులను తిరిగి ఆ రాజ్యములకు రాజులుగ నియమించెను. ఇంకనూ యుద్ధకాంక్షులైన రాజులను ఓడించి తన సేవకులు గావించెను. ఈ విధముగ చతుస్సాగర వలయుత ధరిత్రికి ఏక ఛత్రాధిపత్యముగ చక్రవర్తి అయ్యెను. కానీ ఆతని భయముచే దేవమానవ కిన్నెరాదులందరూ సంతప్త హృదయులైరి. మునిజనులు యజ్ఞయాగాదులు, స్వాధ్యాయము, విడచి పర్వత కంధరములకు చనిరి. బయటకు వేదాధ్యయనము చేయుటకు భయమునొంది వేదత్యాగము దోషము గనుక మనుసు నందే వేదపఠనము కావించుచుండిరి. నరాంతకుని భయమున తపస్సును సహితము త్యజించిరి. అటుపిదప నరాంతకుడు నాగలోకాధిపత్యమునకై వివిధ మంత్రశాస్త్ర విశారదులైన రాక్షస బృందములను అచటికి పంపెను. వారు గరుడరూపము ధరించి అసంఖ్యాక సర్పములను భుజించిరి. అంత శేషుడు ఆ స్థితి గమనించి అనేక ముత్యములు, రత్నములు, నాగాంగనలు, దివ్య వస్త్రములు తీసికొని నరాంతకుని వద్దకేతెంచి, ఆతనికి సమర్పించి సంధి గావించుకొనెను. అంత నరాంతకుడు ఒక గొప్ప దైత్యునికి అనేక దైత్యసేనలనిచ్చి, ఆతనిని రసాతలాధిపతిగ నియమించెను. ఎవరేని నాగులకు విద్రోహ భావమేర్పడిన వారని తీవ్రముగ శిక్షింపమని ఆతనికి నరాంతకుడు ఆజ్ఞనిచ్చెను. పృథివీ, రసాతలముల యందు దుర్లభమయిన వస్తువులను దేవాంతకుడు నరాంతకునకు, దేవలోక దుర్లభమయిన వస్తువులను పృథివీ రసాతలములనుండి దేవాంతకునకు నరాంతకుడు పంపించుకొనుచుండిరి. ఈ విధముగ వారిరువురు అత్యంత ప్రసన్నులై రాజ్యపాలన కావించుచుండిరి.

సోమకాంతుడు "మహర్షీ! ఈ అసహాయశూరులు, వర గర్వితులైన సోదరులను ఎవరు ఏ విధముగ ఏఏ శస్త్రములో హతమార్చిరి? దయచేసి తెలుప వలసినది." భృగు మహర్షి "మహారాజా! ఈ ప్రశ్ననే వ్యాసుడు విరించిని అడిగెను. ఆయన ఇట్లు సమాధానమిచ్చెను."

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి నరాంతకుని పృథివీ పాతాళములపై విజయము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(అదితీ దేవి తపము)

బ్రహ్మ "నా మానస పుత్రులందరిలో బుద్ధిమంతుడు కశ్యపుడు అని నుడివితిని కదా! ఆతడు పుణ్యకర్ముడు, ధర్మాచరణుడు, తపస్వి, జితేంద్రియుడు, దయాళువు, లోక దు:ఖనాశకుడు, భూతభవిష్యత్ వర్తమాన ద్రష్ట, వేదవేదాంగ

పారంగతుడు, సర్వశాస్త్ర విశారదుడు, సమలోష్టాశ్మకాంచనుడు. ఆయనకు పదముగ్గురు భార్యలున్నప్పటికీ అదితి ఆయన ప్రియపత్ని మరియు జ్యేష్ఠపత్ని. ఆమె సర్వ శుభలక్షణ సంపన్న, అద్వితీయ సౌందర్యరాశి, తన పతివ్రతా ధర్మము చే త్రిలోకములను భస్మీపటల మొనర్పగల శక్తిశాలిని. గుణవతి. ఇంద్రాది దేవతలందరూ ఆమె పుత్రులే! మూల ప్రకృతిరూపిణియే ఆమెగా అవతరించినది. ఒకానొకనాడు ఆ సాధ్వి తన పతిని చేరి "స్వామీ! నేను ప్రార్ధనా పూర్వకముగ ఒక ప్రశ్న అడుగుచుంటిని. పతివ్రతలయిన స్త్రీలకు పతితప్పవేరొక గతిలేదు." కశ్యపుడు అత్యంత మోదము నొంది "ఓ! అనింద్యా! మనోహరీ! నీ పలుకులు సత్యము. నీ మనోగతమేమి? అడుగ వలసినది." అదితి "ఇంద్రాది దేవతలందరూ మన పుత్రులు. చిదానంద స్వరూపుడు, పరమాత్మ సహితము మన పుత్రుడయిన నా చంచల మనస్సు స్థిరమగును. నేను ఆ పరమాత్మను సేవించెదను. నాకు దయచేసి ఉపాయము తెలుపవలసినది." కశ్యపుడు "శుభే! అత్యంత క్షుధార్తునకు స్వాధిష్ఠ భోజనము, మిక్కిలి దాహార్తునకు శీతల మధుర జలములు దొరికినటుల నీ పలుకులు నా కత్యంత ప్రీతిని కలిగించినవి. పుణ్యము లేక పరమాత్ముడు ఉదయించడు కదా! అందువలన నీవు తొలుత హృదయమును స్థిరపరచి అనుష్ఠాన మొనరింపుము. వేదములకు, బ్రహ్మాది దేవతలకు అగోచరుడు, నిర్గుణ నిరాకార, నిష్కామ, నిర్వికల్ప, మాయామోహన, మాయాతీత, మాయాధార, మాయావిస్తార, కారణరహితుడయిన పరమాత్మ, అనుష్ఠానము ద్వారా ప్రాప్తించును" అని పలికెను. అదితి "స్వామీ! నేను ఏ ధ్యాన, మంత్రానుష్ఠానము ద్వారా ఆ పరమాత్మను ప్రాప్తించగలను?" అంత కశ్యపుడు అదితికి శ్రీగణేశ పంచాక్షరిని **(ఓం గణపతయే నమః)** ఉపదేశించి, దాని విధి విధానములు, పురశ్చరణ విధులు తెలిపెను. అంత అదితి అత్యంత సంతోషమనస్కయై పతికి నమస్కరించి, ఆయన ఆజ్ఞను బడసి మంత్రసిద్ధి నొందుటకు వనమున కేగెను.

అచట ఆ సాధ్వి స్నానమాచరించి, పవిత్ర వస్త్రధారణమొనర్చి, ప్రచండవాయు రహితము, నిరుపద్రవమయిన ఒక శుభ స్థానమందు సుఖాశీనయై, ఇంద్రియ నిగ్రహము కావించి, దేవదేవుడయిన వినాయక భగవానుని మంత్రన్యాసముతో పరమ పవిత్ర శ్రీగణేశ పంచాక్షరిని జపించుచూ తీవ్రతపము ఒనర్చుట ఆరంభించెను. ఆమె తపము తీవ్రమై వాయుభక్షణ, నిరాహారియై తపమొనరించుచుండగా పరిశరములందలి మృగములు జాతి వైరము మరచినవి. దేవతలు ఈ సాధ్వి ఏ సిద్ధి కొరకు తపించుచున్నదోయని భయగ్రస్తులైరి. ఈ విధముగ అదితి వంద సంవత్సరములు తపమాచరించెను. ఆమె తపమునకు మెచ్చి శ్రీగణేశుడు తన స్వస్వరూపముతో, కోటిసూర్య ప్రకాశముతో ఆమెకు సాక్షాత్కరించెను. ఆ తేజము నోపలేక అదితి మూర్ఛనొంది, తిరిగి నెమ్మదిగ తెలివితెచ్చుకొని "ఈ పరమాద్భుత తేజమేమి? ఇయ్యది పరమాత్ముడు శ్రీగణేశుడా?" ఇట్లు మనసున తర్కించుచుండగా శ్రీగణేశుడు "ఓ! దేవీ! నీవు దివారాత్రములు హృదయమందు ధ్యానించుచున్న శ్రీగణేశుని నేనే! నీ నిష్ఠకు, ఘోర తపమునకు మెచ్చి నీకు వరమిచ్చుటకు ఏతెంచితిని. నీ మనోవాంఛితము తెలుపుము." అంత అదితి స్వస్థతనొంది, చేతులు జోడించి, అంజలి ఘటించి "అఖిల విశ్వమునకు స్వామీ! సృష్టి, స్థితి, సంహారములు కావించు జగన్నాటక సూత్రధారి నీవే! నిత్య నిరంజన, నిర్గుణ, నిష్కళంక, నిరహంకార, నానారూపధారీ, యోగగమ్యా! మీరు సౌమ్యరూపధారులై నాకు వరము ఒసగవలసినది. మీరు నా ఎడల ప్రసన్నులయిన ఎడల, మీరు నాకు పుత్ర రూపమున జన్మింపవలసినది. తద్వారా మీకు సేవ చేసి నేను తరింతును. అంతేకాక అపుడు మీ ద్వారా దుష్టశిక్షణ, శిష్ఠ రక్షణ జరిగి లోకము కృతకృత్యమగును."

శ్రీగణేశుడు "తథాస్తు" అని పలికి అదృశ్యుడయ్యెను. అంత అదితి తన తపస్సు ముగించి, తన భర్త వద్ద కేగి జరిగిన సమస్త వృత్తాంతమును ఆయనకు ఎరుక పరచెను. కశ్యపుడు అత్యంత ప్రసన్నుడై మనసున సంతోష పరవశు డయ్యెను. తదుపరి వారిరువురు సురమ్య సురతానందము ననుభవించిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి అదితీదేవి తపస్సు అను ఐదవ అధ్యాయము సమాప్తము)

అరవ అధ్యాయము

(మహోత్కట జననము)

భృగుమహర్షి "అదితీ కశ్యపుల జీవితమట్లు జరుగుచుండగా భూలోకమందు పాపములు పెచ్చుపెరిగి, ఆ పాపభారము సహింపలేక భూదేవి ఒక నారీ రూపము ధరించి బ్రహ్మదేవుని వద్దకేగి అంజలి ఘటించి ఇట్లనియె "చతురాననా! ఇంద్రసహితముగ దేవతలు సర్వులూ స్థానభ్రష్ఠులైరి. భూమి యజ్ఞ, వ్రత, దానహీనమై మలినమైనది. ఈ దైత్యుల భారమును నేనోపలేను. పర్వత, వృక్ష సహితముగ నేను రసాతలమునకు ఒరుగుచున్నాను. ఈ దుష్ఠులు నాశనమయ్యెడి ఉపాయమును శలవీయవలసినది." అంత బ్రహ్మ "కళ్యాణీ! ధరిత్రీ! దేవతలు, లోకపాలురు, ఋషి గణములు, సర్వులు స్థానభ్రష్ఠులు, మంత్రభ్రష్ఠులు, ఆచార భ్రష్ఠులైరి. మనకున్న ఏకైక దిక్కు పరబ్రహ్మ స్వరూపుడు, నిరాకారుడయిన వినాయకుడు. ఆయనను ప్రార్ధించెదము. దైవయోగమున ఆయన సాక్షాత్కరించిన ఎడల మన కష్ఠములన్నియు తీరును" అని ఈ విధముగ స్థుతించెను "అఖిలలోకహర్తా, దేవశత్రునాశకర్తా, భక్తుల పాపములు ఖండించి, భక్తులను పోషించి, భక్తితో సంతుష్ఠినొందు మహాప్రభో! నిరాకారా! క్షరాక్షర పరా! పరాత్పర బ్రహ్మ స్వరూపా! గుణరహితా, దీనబంధూ! మీకు నమస్కారము. నిరంజనా, నిరామయా, నిత్యసత్యపరోపకారీ, సర్వత్ర సమభావా, సర్వుల కామనలను పూర్ణమొనరించు దివ్యపురుషా, నీకు నమస్కారము! నీకు నమస్కారము!!" ఈ విధముగ స్థుతించి అత్యంత వ్యాకులులు, దు:ఖితులై మునులు, దేవతలు తిరిగి ఇట్లు రోదించిరి "మహాప్రభో! స్వాహాకార, స్వధాకార, వషట్కార రహితమైన పృధివి హాహాకారములు సలుపుచున్నది. మేమందరము వన్య పశువుల వలె మేరుపర్వత కంధరములందు తిరుగుచుంటిమి. ఓ! విశ్వంభరా! ఈ మహాదైత్యులను సంహరింపవలసినది." అంత అశరీరవాణి "భయము వలదు. భగవానుడయిన శ్రీగణేశుడు అదితీకశ్యపులకు పుత్రుడుగా జన్మించుచున్నాడు. ఆయన అద్భుతములు గావించి దుష్ఠ శిక్షణ, శిష్ఠ రక్షణ చేసి మీమీ పదవులయందు తిరిగి మిమ్ములను ప్రతిష్ఠింప జేయును" అని పలికెను. అంత బ్రహ్మ పృధివితో "అశరీరవాణి పలుకులు విశ్వసింపుము. సమస్త దేవతలు, శ్రీగణేశుడు సహితము అవతారములు స్వీకరించి నీ భారమును దూరమొనర్చెదరు. అంత వరకు సహింపుము" అని ఆశ్వాసించెను.

కొంత కాలమునకు అదితి గర్భము ధరించి, నవ మాసములు మోసి ఒక పుణ్యతిధిన ఒక పుత్రునకు జన్మనిచ్చెను. ఆతడు దశభుజుడు, అద్భుత బలశాలి, కుండలాలంకృతాంగుడు, కస్తూరీతిలక శోభితుడు, సిద్ధిబుద్ధియుతుడు, రత్నమాలా విభూషితుడు, వక్షమందు చింతామణి శోభితుడు, జపాకుసుమముల వంటి అరుణిమ గల వోష్ఠములు కలవాడు, ఉన్నతమైన సుందర నాసిక, కనుబొమలతో కూడిన లలాటము, దీప్తివంతములైన దంతములు, దివ్య దుకూలధారి, సర్వ శుభలక్షణ లక్షితుడు, మహా ముకుటధారి, కోటి సూర్య ప్రకాశము కలిగియుండెను. అదితీ కశ్యపులు ఆ తేజము నోర్వజాలక కన్నులు మూసుకొని, కొంత సేపటికి బలవంతముగా కన్నులు తెరచి ఆనందితులైరి. అంత బాలుడు "హే! మాతా! నీవు పూర్వకాలమున నా కొరకై తీవ్ర తపమొనర్చి నన్ను పుత్రునిగ పొందదలచితివి. తత్ నిమిత్తమై నేను నీకు పుత్రునిగా ఉదయించితిని. నేను మీ ఇరువురికీ సేవలొనర్చి, భూభార హరణము కావించి, బ్రహ్మేంద్రాదులను తిరిగి వారివారి స్థానములందు పున:ప్రతిష్ఠించెదను." అది విని ఆ దంపతి ఆనందాశ్రువులు కన్నులవెంట కారుచుండగా " మా ఇరువురి పూర్వ పుణ్యములు పండి పరాత్పరుడయిన వినాయకుడు పుత్రునిగా జన్మించెను. మా కులము, తల్లిదండ్రులు, జన్మము, జ్ఞానము ధన్యమయినవి. స్వామీ! మీయందే చరాచర జగత్తు మణిహారము నందలి దారములా వోతప్రేతమైనది. స్వామీ! మీరు ఇక ఈ మహేంద్రజాలము చాలించి, చిన్నారి బాలకునిగ మారి మమ్మానందింపజేయుడు." అంత ఆ

పరమాత్మ ద్విభుజుడైన ప్రాకృతిక శిశువు వలె రూపానంతరము చెందెను. ఆ పరాత్పరుని జన్మము చే ఋషి, ముని, దేవతలందరూ ఆమందానంద కందళితులైరి.

ఆ దివ్య శిశువు రోదన మారంభించెను. ఆ రోదన వినిన వంధ్య స్త్రీలు గర్భవతులైరి. శుష్క వృక్షములు పుష్పించెను. కశ్యపుడు ఆ శిశువునకు జాతకర్మాదులు కావించి బ్రాహ్మణులకు అనేక దానములిచ్చెను. అదితి సహితము ఆయిదవ దినమున వాయనములు, ఏడవ దినముల ఇక్షుసారము (బెల్లము) బహూకరించెను. ఆ బాలుడు సర్వ శక్తిశాలి, మరియు సర్వ శ్రేష్ఠుడు కావున పదకొండవ రోజు ఆ బాలునికి "మహోత్కటుడు" అని నామకరణము చేసిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి మహోత్కట జననము అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(విరజా నిశాచరి మరణము)

మహోత్కట జననము జరిగిన కొన్నినాళ్ళకు ఒకనాడు వశిష్ఠ, వామదేవాది మహర్షులు కశ్యపుని గృహమున కేతెంచిరి. అంత కశ్యపుడు వారందరినీ కాంచి, మహదానంద భరితుడై, వారిని అర్ఘ్య పాద్యాదులతో పూజించి, ఆసనములిడి, దక్షిణ సమర్పించి ఇట్లనియె "తపోధనులారా! మేము, మా తల్లిదండ్రులు, ధన్యులు. ఎందుకనగా దేవప్రముఖులైన విష్ణు, ఇంద్రాదులు సహితము పూజించు మీ వంటి మహాత్ములు మా ఇంటికి ఏతెంచుటచే, మీ చరణముల దర్శన భాగ్యము మాకు కలిగినది. మీ ఆగమనమునకు కారణము తెలుపవలసినది." అంత వారియందు వరిష్ఠుడైన వశిష్ఠుడు "కశ్యపా! మీకు మహోత్కటుడు అను పుత్రుడు కలిగెనని నారదుని ద్వారా వింటిమి. మేము ఆ బాలుని దర్శించుటకు ఏతెంచితిమి" అని పలికిరి. అంత అదితి ఆ బాలుని తీసికొని వచ్చినది. అంత ఆ దివ్య శిశువును చూచి వశిష్ఠుడు "ఈ మహోత్కటుడు అత్యద్భుత కార్యము లొనరించును. ముప్పది రెండు శుభలక్షణములతో కూడిన ఈ మహాతేజస్వి సాక్షాత్ శ్రీగణేశ పరమాత్ముడు మీకు పుత్రునిగ కలిగెను; ఎందుకనగా ఈయన పాదములందు ధ్వజాంకుశములు ముద్రితమై యున్నవి. ఓ! ముని దంపతీ! ఈ బాలునికి జీవితమందు అనేక విఘ్నములు వాటిల్లును. ఈతని స్వకీయ తేజస్సుచే అవి నష్టమగును, కానీ ఈ బాలుని కంటికి రెప్పలా కాపాడవలసినది." అంత వశిష్ఠాదులు ఆ బాలునికి పూజనమొనర్చి పృథివీ భారహరణ మొనర్చుమని మరల విజ్ఞప్తి చేసి, దుష్ఠ శిక్షణ, శిష్ఠ రక్షణ కావింపమని ప్రార్థించి తిరిగి తమ ఆశ్రమముల కేగిరి.

ఒకానొకనాటి ఉదయము కశ్యపుడు స్నానార్థమై నదికి వెళ్ళెను. అదితి-యజ్ఞ సామాగ్రి సిద్ధము చేయుచు బాలుని బయట పరుండబెట్టెను. అంత "విరజ" అను నిశాచరి అచట కేతెంచెను. ఆమె వికృతమయిన ముఖము, నేత్రములు, నాగలి వంటి దంతములు, గుహల వంటి నాసికా రంధ్రములు, పర్వతములను చూర్ణమొనరించు పాదములు, పాామువలె లోనికి, వెలుపలికి కదులుచున్న నాలుక కలిగి యుండెను. సర్వభక్ష్య అయిన ఆ నిశాచరి ఆ బాలునిగాంచి, పట్టుకొని, అరటిపండు వలె మ్రింగివైచెను. తదుపరి నెమ్మదిగ ఆకాశమార్గమున కొంతదూరము ప్రయాణించి, దాహార్తియై ఒక కొలను వద్ద దిగి నీరు త్రాగెను. అంత ఆమె ఉదరము నుండి మిక్కిలి బాధ మొదలై సర్పదష్ఠ అయిన మానవుని వలె కూలబడి మూర్ఛితురాలైయ్యెను. ఆమె బాధతో "వదులు, వదులు" అని అరుచుచూ తన ముఖము, వక్షము, ఉదరమును తాడనమొనర్చెను. ఆమె లోపల మహోత్కటుడు మునికుమారుని రూపమున పెరిగి, ఆమె ఉదరమును చీల్చుకొని బయటకు వచ్చి, ఆమె రొమ్ముపై కూర్చొని ఆటలాడుట మొదలిడెను. నిశాచరి పంచత్వము పొందెను. ఆమె దరిని ఐదు యోజనములందున్న వృక్షములన్నియు చూర్ణమయ్యెను. ఆ నిశాచరి మహోత్కట స్పర్శచే నిజముగ విరజ (నిష్పాపి) యై

శ్రీగణేశ ధామము చేరెను. కృపాసింధువు, మోక్ష ప్రదాతా, జగదీశ్వరుడయిన శ్రీగణేశుని స్పర్శ నొందిన మీదట భవసాగరమందు పురనావృత్తి యుండదు కదా!"

ఇంతలో అదితి బయటకు వచ్చి బాలుడు కానరాక అత్యంత భయవిహ్వాలయై, గృహ గృహము వెదకి మహోత్కటుడు కనబడక బిగ్గరగా రోదించుట మొదలిడెను "నా ప్రాణము, నా పాలిటి కల్పవృక్షము అయిన మహోత్కటుడు ఏమైయ్యెను? శ్రీగణేశ భగవత్ ప్రదత్తమైన నా బాలుని ఎవరపహరించిరి? జగదీశ్వరుడు ఇచ్చిన వరము వ్యర్థమగునా? నాకు స్వర్ణ పర్వతము లభించినప్పటికీ దరిద్రురాలినైతిని." ఈ విధముగ పలుకుచూ, గుండెలు బాదుకొనుచూ బయటకు వచ్చి కొంత దూరము నడచు సరికి నిశాచరి, ఆమె వక్షముపై బాలుడు కానబడిరి. అంత అదితి పరుగునపోయి, ఆ బాలుని ఎత్తుకొని, ముద్దాడి, ఆనందమగ్నయై "దైవ యోగమున ఈ రాక్షసినుండి బాలుడు బైటపడెను" అని పలికి, బాలుని సహితముగ తానునూ స్నానమొనర్చి తిరిగి ఆశ్రమమున కేగెను. కశ్యపుడు ఏతెంచిన పిదప ఆయనకు ఈ సర్వ వృత్తాంతమును తెలిపెను. అంత మహర్షి "భవిష్యద్రష్టలయిన మునుల పలుకులు సత్యమగును. మన పుణ్య వశమున సర్వభక్షిణి అయిన నిశాచరి పాలబడియు బాలుడు బ్రతికెను. ఇకనుండి ఈ బాలుని నీవు క్షణ పర్యంతము వీడవలదు" అని పత్నితో పలకి, అరిష్ఠ నాశనమునకై అనేక దానములు ఆచరించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి విరజా నిశాచరి మరణము అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(ఉద్ధట, దుంధుర సంహారము, చిత్ర గంధర్వుని ఉద్ధరణ)

విరజా మరణానంతరము కొన్నాళ్ళకు ఒక చిత్రము జరిగినది. ఆ రక్కసి మరణించినదని విని "ఉద్ధట" మరియు "దుంధుర" అను ఇరువురు రాక్షసులు కశ్యపాశ్రమమున కేతెంచి, చిలుకల రూపము ధరించి, తగిన సమయము కొరకు వేచియుండిరి. బాల మహోత్కటుడు తల్లి ఒడిలో పడుకొని స్థనపాన మొనర్చుచూ ఆ చిలుకల జంటను చూచి తన తల్లిని ఆ చిలుకలు తెమ్మని అడిగెను. అంత అదితి "నాయనా! అవి ఆకాశయాన మొనర్చగల పక్షులు. నేను వాటిని పట్టుకొన దలచిన అవి పైకి ఎగురును. నేనెట్లు తేగలను?" అని ప్రశ్నించెను. అంత మహోత్కటుడు ఒక్క తడవు రివ్వున గాలిలోనికి ఎగిరి గ్రద్ద వలె ఆ చిలుకలు రెంటినీ ఒడిసి పట్టుకొనెను. ఆ చిలుకలు రెండూ తన చుంచువులతో, రెక్కలతో బాలునికి ఘాత మొనర్చెను. అయిననూ లెక్క చేయక మహోత్కటుడు వాటిని బలముగ పట్టి, విసురుగ నేలపైకి విసరెను. అంత ఆ చిలుకలు రెండూ భయంకర రాక్షస రూపములనొంది ప్రాణత్యాగ మొనరించినవి. ఆ రక్కసులు పడిన రెండు క్రోసుల దూరము వృక్షములు విరిగి పడినవి. కశ్యపుడు బాలుని రక్షణకై "శాంతి ప్రక్రియ" కావించెను. తదుపరి అదితితో "ఇంద్రుడు సహితము సంహారమొనర్పలేని ఈ రాక్షసులను ఈ బాలుడు అవలీలగా సంహరించెను. ఇది కలయా? నిజమా? ఈనాడు ఈ బాలకుని పరమాత్ముడే రక్షించెను. అయిననూ ఈ బాలుని అనుక్షణము కంటికి రెప్పలా కాపాడవలెను."

కాలము గడచుచున్నది. మహోత్కటునకు నాలుగు వత్సరములు ఏతెంచినవి. ఒకనాడు సోమావతి అమావాస్య, వ్యతిపాత యోగము కలసి వచ్చినవి. వారి గృహమునకు దగ్గరగా ఒక కొలను యున్నది. ఆ సరస్సు స్వచ్ఛమయిన నీటితో నిండి, కమల పుష్పయుతమై మనోహరముగ యుండెను. సరోవర పరిశరములందు తమాల, సరళ, నేరేడు,

మామిడి, పనస మొదలగు వివిధ వృక్షములు నెలకొని బహు మనోహరముగ యున్నవి. ఆ రోజు అదితి నైమిత్తిక స్నానార్థమై ఆ కొలను వద్దకు ఏగి, బాలుని ఒడ్డునయుంచి, తాను సరస్సు మధ్యకు స్నానమునకేగెను. అంత బాలుడు నెమ్మదిగ నడచుచూ నీటి యందు దిగి తల్లివద్దకేగుట ఆరంభించెను. ఇంతలో తల్లి అది గమనించి, ఆ బాలుని వారింప మొదలిడెను. బాలుడు వినక సరోవర మధ్యకు ఏగెను. ఆ సరోవరమందు ఒక భయంకర మొసలి నివాసముండెను. ఆ మొసలి బాలుని చూచి, ఆతని పాదములు పట్టి లోనికి లాగ నారంభించెను. ఇంతలో తల్లి అది గమనించి కేకలు వేయుచూ బాలుని చేతులు పట్టి లాగుట మొదలిడెను. అయిననూ మొసలి బలిష్ఠమైనది కావున అయ్యది వారిరువురినీ నీటిలోనికి లాగుట మొదలిడెను. అదితి కేకలు విని కశ్యపుని శిష్యగణము అచటికేతెంచి, వారునూ తల్లీ కొడుకులను బయటకు లాగుటకు యత్నించిరి. అదితి అప్పటికే పీకలోతు నీటియందు మునిగి అబలయై, అత్యంత విహ్వలయై యుండుట గమనించి, బాలుడు ఒక్క ఉదుటున మొసలిని పట్టి కందుకమును విసురునట్లు బయటకు విసరెను. అదితిని కశ్యపుని శిష్యగణము నెమ్మదిగా బయటకు తీసికొని వచ్చిరి. ఒక యోజనము పొడవు యున్న మకరము బాలుని ఘాతము చే మృతి నొందెను. అపుడు ఒక అద్భుతము జరిగినది.

మరణించిన మకర శరీరము నుండి ఒక దివ్య పురుషుడు ఏతెంచి మహోత్కటునకు నమస్కరించి ఇట్లనియె "ఓ! గజాననా! నేను "చిత్రుడు" అను నామము గల గంధర్వ చక్రవర్తిని. ఒకనాడు మా గృహమందు వైవాహిక కార్యక్రమములందు అనేకమంది గంధర్వులేతెంచిరి. నేను వారందరినీ అత్యంత భక్తితో పూజించితిని. కానీ మా ఆచార్యుడయిన భృగు మహర్షిని పూజింపకుంటిని. అంత ఆ మహాత్ముడు క్రుద్ధుడై, నన్ను మకర రూపము నొందమని శపించెను. అంత నేను ఆయనను ప్రార్థించగా, ఆయన శాంతించి "కశ్యప నందనుడయిన గజాననుడు నిన్ను స్పర్శించినపుడు తిరిగి నీవు నీ స్వస్వరూపమును పొందెదవు" అని అనుగ్రహించెను. స్వామీ! మీరెవరోకాదు. బాలరూపుడైన గజాననులే!! మీరే జగత్తుకు స్వామి. జగత్తుకు కర్త, రక్షకుడు, సంహారకుడు సహితము మీరే! నిర్గుణ, నిరహంకార, జగత్కారణ, కారణులు మీరే! దుష్ట శిక్షణ, శిష్టరక్షణకై వేర్వేరు అవతారములు స్వీకరించెదరు. మీరే సర్వవ్యాపి, పూర్ణకాములు, అవాఙ్మానస గోచరులు. స్వామీ! మీకు నమస్కారము." ఈ విధముగ స్తుతించి బాల మహోత్కటునకు ప్రదక్షిణలు గావించి, చిత్రుడు తన స్వస్థలి కేగెను.

అదితి బాలకుని అక్కున జేర్చుకొనెను. గృహమున కేగిన పిదప కశ్యపుడు ఈ వృత్తాంతమువిని, విస్మితుడై "ఈ బాలుకుడు సాక్షాత్ పరమేశ్వరుడే! లీలామానుష దేహము ధరించెను. ఈతడు భవిష్యత్ నందు ఎన్నో అద్భుత కార్యములు ఒనర్చును. ఈతని దయ వలన మనము ఆ అద్భుతములను వీక్షింపవచ్చు. ఆత్మ హితైషులైన జనులు ఈ బాలరూపుడయిన శ్రీగణేశుని యందు ధృఢభక్తిని పెంపొందించుకొన వలెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడా ఖండమందలి ఉద్భట, దుంధుర సంహారము, చిత్రుని ఉద్ధరణ యను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(మహోత్కటుడు తన నోటియందు విశ్వరూపమును చూపించుట)

హాహా, హూహూ, తుంబురుడు అని ముప్వురు గంధర్వులు కలరు. వారు గొప్ప హరిభక్తి పరాయణులు. వారు హస్తములందు వీణాధారులై, శరీరమందు హరి చిహ్నములైన శంఖ, చక్ర, గదా, పద్మములు చిత్రించుకొని, తులసీ

మాలలు ధరించి, గోపీచందన లేపితులై, పీతాంబరధరులై, శివ దర్శనమునకై కైలాసమున కేగుచూ, హరి కీర్తన గానము చేయుచూ, దారిలో కశ్యపాశ్రమమున ఆగిరి. కశ్యప మహర్షి అతివినీతుడై వారిని ఆహ్వానించి, అర్ఘ్య పాద్యాదులచే గౌరవించి, "మీ దర్శనము చతుర్విధ పురుషార్థ ప్రదాయకము. మీ ఆగమనముచే నా జన్మము, మాతా పితరులు, తపము, జ్ఞానము, ఆశ్రమము ధన్యమైనవి. దయచేసి మీ రాకకు కారణము శలవీయ వలసినది" అని పలికెను. అంత గంధర్వులు "మహర్షీ! మేము పరమశివ దర్శనము కొరకు కైలాసమున కేగుచూ మీ దర్శనము నొందితిమి. అద్దానిచే మా పాపములు నాశమై, జన్మ సాఫల్య మొందినది. భవిష్యత్ నందు సహితము పరమ సిద్ధులు ప్రాప్తమగును. మేము పరమశివ దర్శనమునకై పరమ ఉత్సుకులమై యున్నాము. మీరు అనుజ్ఞ ఇచ్చిన ఎడల మేము కైలాసమున కేగుదుము." అంత తపోనిధి అయిన కశ్యప మహర్షి వారిని భోజనము కావింపమని అర్థించి, వారి స్నానాదులకు ఏర్పాట్లు గావించి భోజనాదులు వండించెను. వారు ముప్పురు స్నానమాచరించి, పంచాయతనమునకు (విష్ణు, శివ, సూర్య, శక్తి, వినాయక) పూజనమొనర్చి, కొంత తడవు ధ్యానము నందుండిరి. ఆ సమయమున మహోత్కటుడు ఇతర బాలురతో క్రీడలు సలిపి గృహాంతర్భాగమున కేతెంచి, అచట గంధర్వులచే పూజింపబడుచున్న పంచాయతన విగ్రహములు తీసికొని, బయటకు విసరి, తాను అగ్ని గృహము ప్రవేశించి ఒడలంతయు బూడిద పూసుకొని దాగుకొనెను.

ఇంతలో గంధర్వులు ధ్యానము పూర్ణమొనర్చుకొని, కనులు తెరచి, మూర్తులను కానక "ఏమి చిత్రము? ఏదేని దైత్య, గంధర్వ, యక్ష రాక్షసాదులు మన మూర్తులను తస్కరించిరా? లేక మన సత్యనిష్ఠా పరీక్షార్థమై ఈ మూర్తులు మాయమైనవా?" అని తర్కించి, వారు కొంచెము క్రోధితులై "మహర్షీ! మేము ధ్యాననిష్ఠులమైన సమయమున మా పంచాయతన విగ్రహములు తస్కరింపబడినవి. మీ ఆశ్రమమందు జంతువులు సహితము జాతి వైరమును మరచినవి. దేవతలు సహితము ఇచటి కేతెంచుటకు భయము నొందెదరు. అయిన తస్కరులెట్లు రాగలిగిరి?" అని ప్రశ్నించిరి. అంత కశ్యపుడు వీరి మూర్తుల దొరకక ఈ గంధర్వులు భోజనము చేయరని గ్రహించి, రోషావిష్టుడై తన శిష్యులను పిలచి "నేను జన్మించిన దాదిగ ఇచట తస్కరణ జరుగలేదు. మీలో ఎవరైననూ ఈ మూర్తులను దొంగిలించిరా!" అని కఠినముగ ప్రశ్నించెను. అంత ఆయన శిష్యులు "స్వామీ! మేము తస్కరులము కాము. దోషమును చర్చించిన మాకు సహితము దోషమంకురించును. మీకు మీ పుత్రుని గూర్చి తెలియును. అందువలన మేమేమియునూ మాట్లాడము" అని పలికిరి. అంత కశ్యపుడు ఒక దండము పట్టి, అగ్నిశాలకేగి, మహోత్కటుని చేయి పుచ్చుకొని గంధర్వుల వద్దకు తెచ్చెను. భస్మలేపిత శరీరుడైన మహోత్కటుడు గంధర్వులకు శివుని వలె కానబడెను. కశ్యపుడు క్రోధాగ్నిచే రౌద్రుడై "పుత్రా! మూర్తులను శీఘ్రమే తీసికొని రావలసినది. లేని ఎడల నా చేతులయందు నీవు మరణించెదవు" అని పలికెను.

అంత మహోత్కటుడు నిర్భయుడై "తండ్రీ! మూర్తులను నేను తీసికొనలేదు. అందులకై మీరే శపథము కావించమన్ననూ నేను సిద్ధము" అని పలికి రోదించుట ప్రారంభించెను. అంత అదితీదేవి అచటకేతెంచి ఆ బాలుని అక్కున చేర్చుకొనెను. అంత మహోత్కటుడు "తల్లీ! నేను ఆ దేవతామూర్తులను తినిన ఎడల నా నోటిని పరీక్షింపుము" అని నోటిని తెరచెను. ఆ తల్లికి ఆ బాలుని నోటి యందు సమస్త బ్రహ్మాండము గోచరించి, ఒక్కతరి భయాతురయై భూమిపైబడి మూర్ఛ నొందినది. కశ్యపుడు, గంధర్వ త్రయము సహితము ఆ బాలుని నోటియందు కైలాసము, సపరివారముగ శివుడు, వైకుంఠము, విష్ణువు, సత్యలోకము, బ్రహ్మ, అమరావతి, ఇంద్రుడు, పర్వతనదీసాగర యుక్తమయిన పృథివీ, లోకులు, యక్ష రాక్షస, నాగ, పక్షి గణములు, పదునాల్గు లోకములు, లోకపాలురు, సప్త పాతాళములు, దశదిశలు కాంచిరి. ఇంతలో అదితి తెలివి నొందినది. కశ్యపుడు విశ్వరూపధారి అయిన ఆ బాలకుని గాంచి నా ఇంటి యందే ఈశ్వరుడుండగా నేనాయనను దండించితిని అని తలచి, గంధర్వులతో ఇట్లనియె "మీరు దయచేసి భోజనము కావింప వలసినది. నేను ఈ మహాబలి అయిన బాలకుని దండింపలేను. ఈ సమిష్టి మరియు వ్యష్టి బాలకుని మీరే ఉగ్రరూపములతో

భయపెట్టి మీ మూర్తులను గొనవలసినది, లేని ఎడల దండింప వలసినది" అని పలికెను. అంత గంధర్వులు "మా పంచాయతనములు లభింపక మేము భోజనము చేయలేము" అని బాలుని వంక చూచిరి. ఆశ్చర్యము. బాలుడొక్కడే అయిదు రూపములు గా కనబడెను (శివ, విష్ణు, శక్తి, సూర్య, గణపతి). తిరిగి బాలరూపుడయ్యెను. తిరిగి అయిదు రూపములుగా మారెను. క్షణములో భయంకర రూపుడయ్యెను. మరొక క్షణమున విశ్వరూపుడయ్యెను. అంత గంధర్వులు మిక్కిలి సంతసిల్లి, షడ్రుచుల భోజనమును తొలుత బాల మహోత్కటునికి ఆరగింపజేసి, తదుపరి తామునూ భుజించిరి. అటు పిదప వారు ముప్వరూ ఆ బాలుని ఇట్లు స్తుతించిరి. "ప్రభూ! నిరాకార, ఏకాద్వితీయ, నానారూపధారీ! సగుణావతారము చేకొను నిన్ను త్యజించి, నీ చింతనా విముఖులై, అజ్ఞానము చే మోహితులై, సంసార సాగరమందు మునిగి పునర్జన్మ చక్రమందు భ్రమితులగుచూ, నానా మత భేదములచే దిగ్భ్రాంతులగుచూ, తద్వారా దుష్కర్మలచే పతితులగుచూ పాప పాశములచే బద్ధులగుచున్నారు. నిర్మల మనస్కులైన జనులు మీ చరణారవిందములందు సంలగ్నులై కర్మ ఫలములు త్యజించి, తమయందు ఇతరుల యందు యున్న ఆత్మ ఒక్కటే యను జ్ఞానము నొంది పాపమును దూరమొనర్చి, కర్మాంకురములను దగ్ధము కావించి, నదులు సముద్రము నందు కలియునట్లు పరమాత్మ యందు విలీనులగుచున్నారు. కొందరు మీ భజన యందు రక్తులై, అనేక సిద్ధులబడసి, వాటియందు ఆసక్తి పెరిగి, మీ చరణ కమలములు మరచి, ఉత్తమ గతులనొందియు, అజ్ఞాన వశమున తిరిగి పతనమగుచున్నారు. మేము తిరిగి ఏ యోని యందు జన్మించిననూ మాకు ఎల్లప్పుడూ మీ స్మృతి, మరియు దు:ఖనాశకమయిన మీ నిరంతర భక్తి కటాక్షింప వలసినది. అందువలన ఎప్పుడో ఒకప్పుడు మేము ఈ సంసార సముద్రము నుండి ఉద్ధరింపబడుదుము. ఓ! సర్వాత్మా! యోగీశా! గుణములకు, మాయకు స్వామీ! మీ అవతారముల నెరుంగుట అసాధ్యము. మీకు నమస్కారము! నమస్కారము!! నమస్కారము!!! ఈ విధముగ పలికి పంచాయతన దేవతలకు పూజసలిపి, మహోత్కటుని చేష్టలను తలంచుచూ శివ సందర్శనమునకై కైలాసమున కేగిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి మహోత్కటుని విశ్వరూపమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(మహోత్కటుని ఉపనయనము)

కాలక్రమమున మహోత్కటుని ఐదేండ్లు నిండినవి. అంత కశ్యపుడు ఉపనయన సంస్కారము కావించుటకు నిశ్చయించి, తన శిష్యుల ద్వారా దేవ దానవ, రాక్షస, ముని, యక్ష, నాగ, రాజర్షి, వైశ్య, శూద్రుల నందరినీ ఆహ్వానించెను. అనేకమయిన మధుర వాద్యముల ఘోష అచట వినిపించుచుండెను. కశ్యపుడు గణేశపూజనము, స్వస్తి వాచకము, మండప స్థాపన, మాతృకాపూజనము, అభ్యుదయక శ్రాద్ధము, బ్రాహ్మణ పూజనము చేసి వస్త్రదానము కావించెను. అంత హోమమారంభించి బాలకుని ఆ స్థలికి తీసికొని వచ్చిరి. సువాసినీ స్త్రీలు, బ్రాహ్మణులు ఆ బాలునిపై అక్షతలు జల్లిరి. ఆ బ్రాహ్మణుల మధ్య ఐదుగురు దుష్ట రాక్షసులు – విఘాత, పింగాక్ష, విశాల, పింగళ, చపల అనువారలు విభూతి, అక్షమాల, త్రిపుండ్రములు ధరించి, జల పాత్రలు పట్టుకొని, ఆ అక్షతల సమయమున బాలునిపై అస్త్రవృష్టి కురిపించిరి. బాలుని శరీరము విదీర్ణమయినది. అంత మహోత్కటుడు ఆ దుష్టులను గుర్తించి, అక్షతలు తీసికొని మంత్రించి ఐదు అక్షతలను వారి పై విసరెను. తక్షణము ఆ రాక్షసులు బ్రాహ్మణ రూపములు వదిలి, నిజరూపములు

ధరించి, శరీరములు విదీర్ణమై, మృతులై, దశ యోజనముల దూరము విసురబడిరి. ఆ ప్రదేశమున కోలాహలము చెలరేగి భూమి నుండి ధూళి రేగినది. సర్వులూ “ఒక్క బాలకుడు ఐదుగురు రాక్షసులను ఒక్క క్షణములో ఎట్లు హతమార్చెను? ఈతడే పృథివీ భార నాశనమునకు అవతరించిన పరమాత్ముడేమో!” అని గుసగుసలాడిరి. విమానములపై ఏతెంచిన వేల్పులు ఆ బాలునిపై పుష్పవృష్టి కురిపించిరి.

తదుపరి బ్రాహ్మణులు ఆ బాలునికి వేద మంత్రములు పఠించుచూ వస్త్రములు, మేఖల, ఉపవీతము, మృగచర్మము, దండము ప్రసాదించిరి. కశ్యపుడు భాస్కరునవలోకించి, తదుపరి హోమము కావించి బాలునికి గాయత్రీ మంత్రముపదేశించెను. పిదప తల్లి ప్రథమ భిక్ష ఇచ్చెను. తదుపరి అసంఖ్యాకులైన జనులు బిక్షనిచ్చి అనేక విధములైన శౌచాచారములు ఉపదేశించిరి. బాలునకు అరిష్టములు తొలగు నిమిత్తము కశ్యపుడు బహుమూల్య దానములిచ్చెను. అంత వశిష్ఠుడు ఆ బాలుని కెంగేలు గొని సభా మధ్యమునున్న బ్రహ్మదేవుని వద్దకు తీసికొని వెళ్ళెను. మహోత్కటుడు బ్రహ్మ కమండలము నుండి తీర్ధము గ్రహించెను. బ్రహ్మ తన హస్తమున యుండు సదా వికసిత కమలమును ఆతనికి బహూకరించి “బ్రహ్మణస్పతి” అని నామకరణ మిడెను. కుబేరుడు తన గళమందలి రత్నమాల నొసంగి “సురానందుడు” అను నామ మొసంగెను. జలములకు పతి అయిన వరుణుడు తన పాశమును ప్రసాదించి సర్వులు వినుచుండగా “సర్వప్రియ” అను నామము నొసంగెను. శివుడు తన త్రిశూలమును, ఢమరుకమును ప్రసాదించి “విరూపాక్ష” అను నామమును, తన నుదిటినున్న నెలవంక నిచ్చి “భాలచంద్ర” అను నామమును ఒసంగెను. పరశురామ జనని అయిన రేణుక ఆ బాలునికి పరశువు నిచ్చి, పూజనమొనర్చి “పరశుహస్త” అను నామమిడెను. ఆదిశక్తి పార్వతీమాత ఆయనకు సింహవాహనమును ప్రసాదించి “సింహ వాహనుడు” అని నామకరణము చేసి శీఘ్రమే దుష్ట నాశనము కావింపుము అని ఆదేశించెను. సముద్రుడు ద్విజరూపముతో ఏతెంచి ముత్యముల మాలను ప్రసాదించి “మాలాధరుడు” అని నామకరణమొనర్చెను. శేషుడు ఏతెంచి తనను ఆసనముగ సమర్పించుకొని “ఫణిరాజాసనుడు” అని నామమిడెను. వాయువేతెంచి అత్యంత బలము ప్రసాదించి “ప్రభంజనుడు” అను నామ మొసంగెను. ఈ విధముగ అభ్యాగతులు, ఆగంతకులు అనేక విధములైన శక్తులు ప్రసాదించిన మీదట ఆ బాలుని శక్తి ఇట్టిది అని చెప్పనలవి కాకున్నది.

ఈ విధముగ సర్వులు తమ తమ శక్తులను ఆ బాలరూప పరమాత్మ యందు విలీన మొనర్చినప్పటికీ ఇంద్రుడు కించిత్ మదోన్మత్తుడై ఆ బాలునికి ఏమియునూ ఈయక మనసున “నేను త్రిలోక పూజ్యుడను. అమృతపాన మొనర్చిన దేవరాజును. ఐరావతారూఢుడను. శివకేశవులు సహితము నన్ను పూజింతురు. సింహము గడ్డి తిననట్లే, సముద్రము చిన్న చెరువు నుండి నీరు తీసికొననట్లే, సర్వ ప్రదాత అయిన కల్పవృక్షము ఎవరినీ, ఏమియునూ అడగనట్లే, స్వర్గాధీశు డనైన నేను ఈ కశ్యప నందనుడయిన ఈ చిన్న బాలునికి ఏల నమస్కరింపవలలెను?” అని తలచి మిన్నకుండెను. కశ్యపుడు తన ధ్యానబలము చే ఈ విషయము తెలిసి నర్మగర్భమున ఇంద్రునితో ఇట్లు పలికెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి మహోత్కటుని ఉపనయనమను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(ఇంద్రుని గర్వభంగము)

కశ్యపుడు “ఇంద్రా! ఎవరి కర్మములు అద్భుతమో, ఎవరు సుగుణముల కాలవాలమో వారు సర్వులకు పూజనీయులు. బ్రాహ్మణుడు గుణహీనుడయిననూ పూజనీయుడు. మా గృహమందు సాక్షాత్ పరాత్పరుడు శ్రీగణేశుడు జన్మించెను.

ఈతడు త్రిగుణములచే ప్రకాశించు చున్నప్పటికీ త్రిగుణాతీతుడు. ఈతని విరోధులు పదభ్రష్టులగుదురు. ఈతడు కావించిన కార్యములు వినుము. విరజ అను నిశాచరిని సంహరించెను. ఉద్ధట, దుంధురులను రక్కసులను దునుమాడెను. చిత్రుడను గంధర్వుడు శాపవశమున మకరమై యుండగా ఆతని శాప విముక్తుని గావించెను. హాహా, హూహూ, తుంబురుల పంచాయతనము హరించి, వారికి పంచాయతన దేవతా దర్శనము, బ్రహ్మాండ దర్శనము కావించెను. ఈనాడు మీ ఎదుటనే ఐదుగురు రక్కసులను యమస్థలికి పంపించెను." అంత వృత్రాసుర హంత అయిన పురంధరుడు "నేను ఏ విధమయిన ప్రత్యేకము ఈ బాలుని యందు చూడలేదు. అందువలన నేనెట్లు ఈతనిని గౌరవించెదను?" అని పలికి వాయువును పిలచి "ఈ బాలుని నభోమండలమునకు విసరివేయుము" అని ఆదేశించెను. వాయువు ఆ ఆజ్ఞను గొని ప్రళయకాల ప్రచండ తీవ్రతతో వీచుచూ, ధరిత్రిని అతలాకుతలము కావించుచూ, పర్వతములు కంపింపజేయుచూ ఆ బాలుని ఆకాశమునకు కొనిపోవుటకేతెంచి, ఆ బాలుని కదపక పోగా ఆతని రోమము సహితము కదలదయ్యె! వాయువు యొక్క అసఫలతను గాంచి ఇంద్రుడు అగ్నిని ప్రేరేపించెను. అగ్ని ప్రళయాగ్ని కీలక అగ్ని జ్వాలలు విరజిమ్ముచూ, సర్వమునూ దగ్ధ మొనర్చుచూ సముద్రములను ఇంకించుచూ, వృక్షముల భస్మమొనర్చుచూ మహోత్కటుని వద్ద కేతెంచెను. రోగి చిన్న ఔషధ గుటిక మ్రింగినటుల ఆ బాలుడు ఆ ప్రళయాగ్నిని మ్రింగెను. అంత ఇంద్రుడు ఈ అవమాన భారము సహింపలేక తన సహస్రాక్షములు తెరచెను.

అంత ఆయనకు ప్రతి కంటియందు సర్వలోకములు, సహస్ర బాహూదర వక్త్ర నేత్రములతో, అనంత పరాక్రమము, చంద్ర సూర్యాగ్నులు నేత్రములుగ, ఆకాశమంతయు వ్యాపించిన శిరము, కోటి సూర్య ప్రకాశము, అసంఖ్యాక ఇంద్రుల చే పూజింపబడుచూ, అసంఖ్యాక త్రిమూర్తులచే పరివేష్ఠింపబడి, ప్రతి రోమకూపము యందునూ అసంఖ్యాక బ్రహ్మాండములు గల మహా శక్తిస్వరూపుడు కానబడెను. ఇంద్రుడు తన సమ్ముఖమున యున్న ఒక్క బ్రహ్మాండము లోనికి అడుగుపెట్టి, తిరిగి దాని యందు అనేక బ్రహ్మాండములు చూచి భ్రాంతచిత్తుడై, భ్రమించుట నారంభించెను. ఎంత తిరిగిననూ ఆయనకు బయటకు వచ్చు మార్గము కానరాకుండెను. అంత భగ్నహృదయుడై శ్రీగణేశుని ఈ విధముగ ప్రార్థించుట మొదలిడెను "ఓ! కశ్యపనందనా! భూభారహరణ హేతువుకై అవతరించిన మహాప్రభో! నీ మహిమ అచింత్యనీయము. నిన్ను నేనెట్లు వర్ణింపగలను? నేను మీ కుక్షియందు పన్నెండు సంవత్సరములుగ భ్రమించుచున్నాను. నాకు గమ్యము అగోచరముగ యున్నది. మీ ప్రతియొక రోమకూపమందు అనేక బ్రహ్మాండములుయున్నవి. ఒక్కొక్క బ్రహ్మాండమందు పదునాల్గు లోకములు ఉపస్థితమైనవి. నేను మీ సమిష్ఠి, వ్యష్ఠి రూపములు, పరమ సౌమ్య మరియు భయానక రూపములు కాంచితిని. మీ విశ్వరూపము నందు అసంఖ్యాక బాహూదర వక్త్ర నేత్రములు, దేవ, దానవ, దైత్య, మానవ, యక్ష, రాక్షస, పిశాచులు, చతుర్విధ జీవరాశులను చూచితిని. మహాప్రభో! ఈ విరాడ్రూపమును ఉపసంహరించి, నా మోహమును నష్ఠపరుచవలసినది. నేను నా మనోబుద్ధి తను వచనములతో మిమ్ము శరణుజొచ్చుచున్నాను. ఓ! భక్తవత్సలా! నాకు మీ ప్రాకృతిక రూప దర్శనమీయ వలసినది."

అంత ఇంద్రుడు సభామధ్యమున బాల బ్రహ్మచారి ఎదుట నిలబడి యుండెను. ఆయన ఒకేసారి లజ్జాహర్షయుక్తుడై, సర్వుల ఎదుటా ఆ బాలునికి సాష్టాంగ దండ ప్రణామములు ఆచరించెను. తిరిగి లేచి సర్వులు వినుచుండగా కశ్యపుని ఇంట లీలామానుష వేషధారిగా క్రీడించుచున్న బాలగణపతి మహోత్కటుని ఇట్లు స్తుతించెను "స్వామీ! నేను మిమ్మెరుగను. మీరు అనంత శక్తి సంపన్నులు, పరమాత్మ, విశ్వాత్మ, త్రిగుణములకు స్వామి, విశ్వవంద్యులు, విశ్వమును ప్రకాశింపజేయువారు. మీరు త్రిసత్యులు-సృష్ఠికి పూర్వము, సృష్ఠియందు, ప్రళయమందు, తరువాత కూడా యుండు నిత్యసత్యులు. త్రిమూర్తుల రూపములతో సృష్ఠి స్థిత్యంతములు కావించు పరమాత్మ. అద్వితీయ నిత్య సచ్చితానంద స్వరూపులు, సర్వాధ్యక్షులు, కారణాతీతులు, ఈశ్వరులు, స్థావర జంగమాత్మక ప్రాణులన్నింటి చేష్ఠలకు హేతువు మీరే!

సర్వ స్వతంత్రులు, సర్వవ్యాపి, మహాప్రభో! మీకు ప్రణామములు. సర్వాత్మా, సర్వ విద్యానిధానా, సర్వాతీతా, సర్వము యందు జ్ఞాన ప్రకాశము కావించు ప్రబోధ సుధాకరా! అవాఙ్మానస గోచరా, సర్వజ్ఞా! నీకు నమస్కారము! నమస్కారము!! నమస్కారము!!!" ఈ విధముగ పూజనమొనర్చి ఇంద్రుడు అంకుశము, కల్పవృక్షము, ఇరువురు దాసీలను ఆయనకు సమర్పించి, ఆయనకు "వినాయకుడు" అని నామకరణ మొనర్చెను. ఈ వినాయక నామమును స్మరించినంత మాత్రమున శ్రీగణేశుడు సర్వసిద్ధి ప్రదాయకుడగును. అంత ఒక్కమారు భూనభోంతరాళములు మారుమ్రోగునట్లు వాద్యములు ఘోషించెను. గంధర్వులు గానము, అప్సరసలు నాట్యము చే సభాస్థలి నలరించిరి. పుష్పవర్షము చే ఆకాశము నిండెను. నదుల ప్రవాహము మందగించి, స్వచ్ఛ జలములతో తూర్పునకు పయనించినవి. దిశలు ప్రసన్నమయినవి. పవనము సుఖావహమయ్యెను. అగ్ని ప్రదక్షిణ దిశగా ప్రజ్వలించెను. అంత బాల బ్రహ్మచారి ఇంద్రునితో "ఇంద్రా! నీవు కావించిన స్తోత్రము "త్రిశ్లోకి" నాకు అత్యంత ప్రసన్నత కావించినది. నీవు భక్తి తత్పరుడవై త్రిసంధ్యల యందును ఈ త్రిశ్లోకిని స్తోత్రపాఠము కావించిన ఎడల నీకు యుద్ధ ప్రాంగణమందు భయముండదు. ఇతరులు ఎవరైననూ ఈ త్రిశ్లోకములను భక్తి పూర్వకముగ పఠించిన ఎడల వారి మనోకామనలు పూర్ణమయి సర్వత్ర విజయము నొందెదరు. ఇంద్రుడు ఈ విధముగ వరము నొంది, మహోత్కటునకు ప్రణామ మొనరించి తన స్థలమున కేగెను. ఇతరులందరునూ బాలగణేశునకు ప్రణామములర్పించి తమ గృహములుకేగిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి ఇంద్రుని గర్వభంగము అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(ధూమ్రాక్ష వధ)

కాలచక్రము తిరుగుచూ మహోత్కటుడు ఏడేండ్ల వయస్సును సంతరించుకొనెను. ఒకనాడు అతడు స్నానాదికములు, నిత్యకర్మ కావించుకొని, గొప్ప మకుటము ధరించి, సింహారూఢుడై, చతుర్ హస్తములందు పాశాంకుశ దండకమండలములు, దర్భలు పట్టి, క్రిష్ణాజినము కట్టి, వక్షమున ముత్యాల మాలలు, నాగ యజ్ఞోపవీతుడై, రోదసీకుహరము భేదిల్లునట్లు గొప్ప సింహనాదమొనర్చెను. ఆ గర్జన విని చక్రవాకములు వర్షాకాల మేఘగర్జన యని భావించి నోళ్ళు తెరచినవి. నదులయందలి కెరటములు సూర్యమండలము వరకు ఎగసినవి. అదితీ కశ్యపులు తాము, తమ పూర్వజులు ధన్యులమైతిమని సంతసిల్లిరి. ఆ సమయమున వారి ఆశ్రమమునకు కాశీరాజు ఏతెంచెను. అంత రాజు, కశ్యపుడు ఇరువురు పరస్పరము ఆలింగనమొనర్చిరి. రాజును షడ్రసోపేతమయిన భోజనముతో ఆనందపరచి, ఆయన విశ్రమించువేళ కశ్యపుడిట్లు ప్రశ్నించెను "మహారాజా! మా పుణ్యవశమున మీవంటి శ్రీమంతుల దర్శన భాగ్యమబ్బినది. మీకు ఈ పురోహితుడు ఏల గుర్తుకువచ్చెను? మీ రాకకు కారణము తెలుపవలసినది." రాజు "బ్రహ్మన్! రాజ సంచలనము నందు మునిగి మిమ్ముల దర్శింపని నా అపరాధము మన్నింపవలసినది. మీ దర్శనము చే నేను కృతార్థుడనైతిని. నా పుత్రుని వివాహము నిశ్చితమయినది. అందువలన మీరు నాతో వేంచేసి ఆ వివాహ కార్యక్రమమును మీ చేతుల మీదుగా జరిపింప ప్రార్థన. అందువలన మీరిక కాలయాపన కావింపక వెంటనే నా రథమారోహింప వలసినది. మీరు రాని ఎడల లోకులు ఆ వివాహ క్రతువును శ్లాఘింపరు" అని ప్రార్థించెను. ముని "మహారాజా! ప్రస్తుతము నేను చాతుర్మాస్య దీక్ష యందుంటిని. అందువలన నాకు ప్రస్తుతము స్థానచలనము కుదరదు. నా పుత్రుడు సర్వసమర్థుడు. మీకు నచ్చిన ఎడల మీరు వానిని

మీ వెంట గొనిపోవచ్చును.

అంత మహారాజు "బ్రహ్మన్! మీ పుత్రునికి ఆదేశమొసంగిన ఎడల నేను తప్పక ఆ బాలుని నా వెంట తీసికొని వెడలెదను." కశ్యపుడు మహోత్కటుని గాంచి "పుత్రా! నీవు ఈ కాశీరాజు వెంట వెడలవలసినది. నీ విరహము నాకు అత్యంత దు:ఖదాయకము. అయిననూ ఈయన వెంట ఏగి కార్యములు సంపూర్ణ మొనరింపవలసినది." బాలుడు తల్లిదండ్రుల ఆజ్ఞను ఔదలదాల్చి, వారి చరణములకు ప్రణామమొనర్చి రధారోహణము కావించెను. అంత అదితి ఆ మహారాజు వద్దకేతెంచి "మహారాజా! ఈ బాలకుని నిరంతరము రక్షింప వలసినది. ఈ బాలుడున్నచోట ఉత్పాతములు సంభవించును. అందువల్ల ఈ బాలుని కంటికి రెప్పలా కాపాడి మేము ఏ విధముగ ఈ బాలుని మీకిచ్చితిమో, అట్లే తిరిగి మాకు సమర్పింపవలెను." రాజు "వల్లె" యని వారికి ప్రణామములర్పించి బయలుదేరెను. రధము వాయువేగమున కాశీవైపు పయనించెను.

ఆ మార్గమధ్యమున ఒక భయంకరమైన అడవి కలదు. అందు నరాంతకుని పినతండ్రి రౌద్రకేతుని సోదరుడయిన "ధూమ్రాక్షుడు" నివసించుచుండెను. ఈతడు మిక్కిలి బలశాలి. ఈతనికి త్రిలోకములు వశమొనర్చు కొనవలెనని కోరికచే సూర్యోపాసన చేసి, తలక్రిందులుగా చెట్టు కొమ్మలకు వ్రేలాడుచూ, ధూమ్రపానము గావించుచూ చిరకాలము తపమాచరించుటచే, సూర్యుడాతనికి ఆమోఘమయిన ఒక శస్త్రము నిచ్చెను. ఆ శస్త్రముచే ఆ ప్రదేశమందలి గగనతలమంతయు ధగధగ లాడుచున్నది. అంత వినాయకుడు ఒక్క ఉదుటున ఎగిరి, ఆ శస్త్రమును గరుడుడు సర్పమును పట్టినట్లు పట్టి క్రిందకు విసరెను. అయ్యది ధూమ్రాక్షుని పై బడి భయంకర శబ్దము కావించుచూ ఆ దైత్యుని శరీరమును రెండు ముక్కలు గావించెను. ఆ శరీరఖండములు అయిదు వందల ధనువుల దూరమున పడినవి. ఆ ప్రదేశమునందున్న గండశిలలు శిధిలమయినవి. దానిని గాంచి కాశీరాజు ఆశ్చర్యచకితుడై జీవన్మరణములు, హానివృద్ధులు సంపూర్ణముగ దైవాధీనములని తలచెను. ధూమ్రాక్షునకు "జఘన్", "మను" అను ఇరువురు పుత్రులు కలరు. వారిరువురు ఆ సమయమున తమ తండ్రి శుశ్రూష కావించుచుండిరి. తండ్రి అకస్మాత్తుగా మరణించుటచే వారు కృద్ధులై కాశీరాజుతో ఇట్లనిరి "నీవు ఈ వటువును తెచ్చి మా తండ్రిని ఏల వధించితివి? రాజా! పూర్వకాలమున మా తండ్రి నిన్ను నరాంతకుని నుండి రక్షించెను. ప్రయత్నపూర్వకముగ మా తండ్రిని హతమార్చి నీవు ఎట్లు సుఖముగ యుండగలవు?" అంత రాజు భయవిహ్వలుడై "నేను ఏల ఈ కశ్యప నందనుని తీసికొని వచ్చితిని? ఇపుడు నరాంతకుడు క్రుద్ధుడై నా రాజ్యమును గ్రహించినచో నేనేమగుదును?" అని తలచి "ఓ! నిశాచరులారా! నేను శపధము చేసి చెప్పుచున్నాను. మీ తండ్రిని సంహరించు ఉద్ధేశ్యము నాకు లేదు. ఈతడు నా పురోహితుని పుత్రుడు. మీరు ఈతనిని గ్రహించి, నా పుత్రుని వివాహమందు విఘ్నములు కల్పింపవలదు". అంత మహోత్కటుడు "రాజా! బాలకుడనైన నన్ను బంధించి శత్రువులకు ఎట్లు అప్పగింతువు? మా జననీ జనకులకు ఏ విధముగ సమాధానమిచ్చెదవు? కశ్యప మహర్షి కృద్ధుడయిన ఎడల నిన్ను భస్మమొనరించును."

ఈ విధముగ వారు సంభాషించు చుండగా దనుజ తనయులు ఆ బాలుని మ్రింగుటకేతెంచిరి. అంత బాలుడు ఒక భీషణ గర్జన చేసెను. ఆ గర్జనకు, వాయుతాడనమునకు ఆ దనుజ తనయులిరువురు చక్రవాతము (సుడిగాలి) నందు పడిన వృక్షముల వలె ఎగిరి, రెండు ముహూర్తములు గడచిన పిమ్మట నరాంతకుని రాజ్యమందు రెండు వేర్వురు స్థానములందు పడిరి. వారు పడిన చోట గృహములు చూర్ణమయినవి. అంత కోలాహలము చెలరేగి రాజదూతలు అచటి కేతెంచిరి. ఆ దనుజులు దూతలకు జరిగిన విషయమంతయు వివరించి కశ్యప నందనుడు కాశీరాజు సహితుడై కాశీ పట్టణమున కేగుచుండెనని తెలిపిరి. దూతలు ఆ విషయములన్నియు నరాంతకుని కెరిగించిరి. అంత నరాంతకుని కన్నులెర్రతామరలై, వారిని వెంటనే ఈడ్చుకురమ్మని, లేని ఎడల హతమార్చమని నిశాచరులకు ఉత్తర్వులిచ్చెను. నిశాచర

సైన్యము వాయువేగమున మహోత్కటుడున్న ప్రదేశమున కేగి ఇరువురినీ చుట్టుముట్టిరి. అంత బాలగణేశుడు ఒక సింహనాదమొనర్చెను. ఆ భీషణ ధ్వనిచే కొందరు పంచత్వమొందిరి. కొందరు క్షతగాత్రులైరి. మరికొందరు మూర్ఛితులైరి. అంత మహోత్కటుడు ధనువు సారించి బాణవర్షము కురిపించెను. నిశాచరులకు కాళ్ళు, చేతులు, ముఖములు, నేత్రములు, శిరములు ఖండింపబడినవి. మిగిలిన అతి కొద్దిమంది కాలికి బుద్ధిచెప్పి పలాయనులై వెనుకకు వెళ్ళి నరాంతకునకు ఈ విషయమంతయు నివేదించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి ధూమ్రాక్ష వధ అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(వినాయకుని కాశీనగర ప్రవేశము)

దూతలు నరాంతకునితో “మహారాజా! మేమింతవరకూ అటువంటి వీరుని చూడలేదు. మీ కృప చే మేమింకనూ బ్రతికియుంటిమి. మన సేన యందలి ఎందరో వీరులు మరణించిరి.” అంత నరాంతకుడు “మీ మూర్ఖపు మాటలను కట్టిబెట్టవలసినది. ఏడేండ్ల బాలుడెక్కడ? నేనెక్కడ? ఎలుక రంధ్రము ఒనర్చుట వలన మేరు పర్వతమునకు హాని కల్గునా? మీరందరూ మరికొంత సేనను తీసికొని, కాశీ రాజ్యమునకేగి ఆ రాజ్యమందు దోపిడీలు, దొంగతనములు కావింప వలసినది. అంత రాజు, బాలకుడు ఇరువురు వ్యాకులచిత్తులు, అగుదురు. అపుడు వారిని వధింప వలసినది” అని పలికి, వారిని బుజ్జగించి, బహుమూల్య బహుమతులిచ్చి, కాశీ రాజ్యమున కంపెను. రాజభటులు ధైర్యమునొంది రాజు నియమించిన కార్యము నొరుపుటకు కాశీరాజ్యము చేరిరి. అ సేన యందలి సేనాపతులు సైనికులతో “మీలో ఎవరైననూ ఆ బాలుని కాంచిన తక్షణము వానిని వధింపవలసినది. అట్లు చేయని సైనికుని మేము వధింతుము” అని తీవ్రముగ ఆజ్ఞాపించిరి. ఇంతలో మహోత్కటుడు కాశీరాజు సహితుడై కాశీ నగరమున కేతెంచెను. అచట మంత్రి సామంతులు, పుర ప్రముఖులు, నాగరికులు, బ్రాహ్మణులు సర్వులూ వారికి పూర్ణకుంభముతో స్వాగతించిరి. దుందుభులు మ్రోగించుచూ వారందరూ వినాయకునికి షోడశోపచార పూజనమొనర్చి, రాజును సహితము పూజించిరి. ఆ సమయమున నగరమంతయు ధ్వజ పతాకముల రెపరెపలతో అత్యంత సుందరముగ యున్నది. నగరవాసులందరూ బాలగణపతి దర్శనార్ధము తండోపతండాలుగ ఏతెంచిరి. స్త్రీలు, పతుల, తల్లిదండ్రుల, భ్రాతల ఆజ్ఞలను ప్రక్కన పెట్టి బాలుని చూచుటకు పరుగులు పెట్టిరి. కుమారీ కన్యకలు బాలగణపతిపై పేలాలు, పుష్పములు, వర్షమువలె కురింపించిరి. దేవతలు విమానముల నుండి ఈ మహోత్సవమును కాంచుచుండిరి. బ్రాహ్మణులు ఆయనను పరమాత్మవలెనూ, క్షత్రియులు ఒక మహావీరుని వలెనూ, వైశ్యులు ఆయనను సంహారకర్త అయిన రుద్రుని వలెనూ, శూద్రులు ఆయనను విష్ణువుగనూ, రాజుగనూ చూచుచుండిరి. స్ఫటికము ఏ విధముగ తన వద్దనున్న వస్తువు యొక్క వర్ణమును దృష్టిగతమొనర్చునో, అట్లే ఎవరెవరు ఏ దృష్టితో ఆయనను చూచిరో, ఆ భగవానుడు వారికి ఆ విధముగనే కనిపించెను.

ఆ సమయమున వినాయకుడు ఆ జనసమ్మర్ధ మధ్యమున “విఘంట”, “దంతుర” అను ఇరువురు మహాసురులను కాంచెను. వారిరువురు బాల వినాయకుని ఆలింగన మొనర్చి హతమార్చవలెనని దురాలోచనతో ఏతెంచుచుండిరి. వినాయకుడు వారిని సాదరముగ ఆలింగనమొనర్చి చూర్ణము కావించెను. అంత ఆ అసురులిరువురు తమ నిజరూపములు ధరించి, మృతశరీరులై నేలపై బడిరి. ఆ సమయమున వారు దశయోజనముల పొడవు యుండిరి. దేవతలు, మునులు “సాధు, సాధు” నినాదములు చేసి వినాయకుని స్తుతించి “ఇంద్రుడు సహితము సంహరింపజాలని మహాసురులను ఈ

బాలుడు అవలీలగా హతమార్చెనని" పలికిరి. తదుపరి వినాయకుని రధము కొంచెము ముందునకేగినది. అంత నరాంతకుని సేవకులు "పతంగుడు", "విధులుడు" అను వారలు ఒక భయంకర చక్రవాత (సుడిగాలి) రూపమున ఏతెంచి వినాయకుని రధమును ఆకాశమున కెగురవేసి ఆ బాలుని హతమార్చెదమని ఏతెంచిరి. ఆ భయంకర వాయుతీవ్రతకు పౌరుల వస్త్రములు ఎగిరి గాలిలో పక్షుల వలె కానబడినది. జనులు కనులు తెరువలేక పోయిరి. గృహములు, కొండలు సహితము కంపించినవి. అంత వినాయకుడు తన పదముతో రధమును తొక్కిపట్టి, తన చేతులతో ఆ ఇరువురి శిఖలు పట్టి, గిరగిరాత్రిప్పి నేలపైకి విసరెను. అంత ఆ అసురులిరువురు తమ నిజరూపములొంది హతశేషులైరి. అంత లోకులు "ఈతడు బలశాలి అయిన బాలుడు కాదు. అత్యంత బలశాలి అయిన దేవత అయి యుండవచ్చు. లేని ఎడల ఈ అసురులను ఎట్లు హతమార్చగలుగును?" అని పలికిరి.

ఇవన్నియు కాంచిన కాశీరాజు వినాయకుని మిక్కిలి సన్మానించి "ఓ! మహాయోగీ! నీవు బాలుడవు. కానీ నీవు కావించు కృత్యములు బ్రహ్మాదులకు సహితము ఎరుకపడదన్న చర్మచక్షువులమైన మేమెంత? స్వామీ! మీరు ఈ జగత్తు యొక్క సృష్టి స్థిత్యంతకారకులు. మీ అవతారములు లెక్కింపనశక్యము" అని పలికి, చివరకు వారందరూ రాజ మందిరమునకు చేరిరి. అచట వినాయకుడు పాషాణ రూపుడయిన "కూటుడు" అను దైత్యుని గాంచి, తన చేతినున్న పరశువుతో ఆ పాషాణ రూపుని ప్రహరించెను. అంత ఆ పాషాణము నుండి దీర్ఘ కాయుడు, పింగళవర్ణుడు, భయానక రూపుడు, పొడవాటి మీసములు, గడ్డము యున్న ఒక అసురుడు బయటకేతెంచెను. ఆ భయంకర రూపుని గాంచి సర్వులూ సర్వదిశలకు పరుగులు తీసిరి. అంత వినాయకుడు ఆ అసురునిపై ముష్టి ఘాతము ప్రహరించెను. అసురుడు పంచత్వము నొందెను. అంత లోకులు "ఈ బాలుడు సామాన్యుడు కాదు. సాక్షాత్ భగవదవతారమే!" అని కీర్తించిరి. అటుపిదప రాజు వినాయకుని లోనికి తీసికొనిపోయి, షడ్రుచులు గల భోజనము నారగింపజేసి, ఫలములు నివేదించి, అష్టాంగ యుక్త తాంబూలము ప్రదానము కావించి, అటుపిదప ఒక హంసతూలికా తల్పముపై విశ్రమింపజేసి, ఆ బాలుని చుట్టూ అప్రమత్తులైన సైనికులను పహారా నియమించి, వినాయకుని అనుజ్ఞగొని తాను విశ్రమించెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి వినాయకుని కాశీనగర ప్రవేశము అను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(వినాయకుని కాశీనగర బాల్య లీలు)

మరునాడు ప్రాత:కాలమున మహోత్కటుడు లేచి స్నాన:సంధ్యాదులు ముగించుకొని, అగ్ని కార్యమాచరించి తన దండకృష్ణాజినములను ఒక చోట భద్రముగ యుంచి, ఇతర బాలురతో క్రీడార్ధము వెడలెను. అంత "ధర్మదత్తుడు" అను గొప్ప వేదశాస్త్ర పారంగతుడు ఈ బాలకుని గూర్చి విని, కుతూహలుడై ఆ బాలుని చూచుట కేతెంచెను. అచటి రాజసేవకుల ద్వారా క్రీడాస్థలిని కనుగొని, ఆ బాలుని చేయిపట్టి ఇట్లనియె "నాయనా! నీవు నా మిత్రుని పుత్రుడవు. నేను నీ కీర్తి గూర్చి వింటిని. నిన్ను మా ఇంటికి తీసుకొని వెళ్ళుటకై ఇచట కేతెంచితిని. నీ చరణధూళి స్పర్శచే మా మనోరధములన్నియు ఫలించును. స్వామీ! తత్వత: నీవెవరో నాకు తెలియును. నీవు సాక్షాత్ పరబ్రహ్మ స్వరూపుడవు; పరాత్పరుడవు, పరమాత్ముడవు. భూభారహరణ హేతువై ఈ విధముగా లీలామానుష దేహమును స్వీకరించితివి." అంత వినాయకుడు "స్వామీ! మీరు ఏల నా కొరకై ఏతెంచిరి? మీ ఆజ్ఞ అయిన ఎడల నేను మీ గృహమునకు ఏతెంచెడివాడను" అని పలికి, ఆయన వెంట

ధర్మదత్తుని గృహమునకు బయలుదేరెను. మార్గమధ్యమున నరాంతకుని పనుపున ఏతెంచిన "కామ", "క్రోధ" అను ఇరువురు రాక్షసాధములు గాడిద రూపము ధరించి బాల వినాయకుని పరిమార్చుట కేతెంచిరి. ఆ దుర్మధులు ఇరువురు పరస్పరము కలహించునటుల నటించి మహోత్కటుని పై బడిరి. బాలుని పరివేష్ఠించిన వారందరూ భయభీతులై దశదిశలా పరుగులెత్తిరి. అంత వినాయకుడు ఆ రెండు గార్దభముల పాదములు పట్టి, గిరగిరాత్రిప్పి నేలపై విసరెను. ఆ ధాటికి ఒక్క క్షణము త్రిలోకములు కంపించి దనుజులిరువురు ప్రాణములు కోల్పోయిరి. ధర్మదత్తుడు మహోత్కటుని పరాక్రమమును ప్రత్యక్షముగ చూచి, తాను లోకుల ద్వారా వినిన విషయములన్నియు నిజమని రూఢి చేసుకొనెను.

తదనంతరము వారిరువురు కొంచెము ముందునకేగిరి. అచట గూఢరూపమున యున్న "కుండుడు" అను మరియొక దనుజుని వినాయకుడు కాంచెను. ఆ దనుజుడు ఒక మదోన్మత్త కుంజర రూపమున పరుగులిడుచూ మహారాజు యొక్క గజశాల పై దాడిచేసెను. అద్దాని చే ధూళి పైకి రేగి పర్వతములపై వ్యాపించు పొగ వలె సర్వత్రా అంధకారము నెలకొనుచున్నది. గజశాల ప్రక్కనే అశ్వశాల సహితము యున్నది. ఈ కుంజర విగ్రహము చే అనేక ఏనుగులు, అశ్వములు వాటివాటి శాలల నుండి బయల్వెడలి పరుగులు తీయుటచే లోకులు తమ ప్రాణములు అరచేతుల యందు నిడుకొని ప్రాణ రక్షణార్ధము నలుదిశలకు పరుగులెత్తిరి. ధర్మదత్తుడు ఆ బాలుని రక్షించుటకు ఆతనిని ఎత్తుకొని తన గృహాంతర్భాగమునకు చనుటకు యత్నించెను. కానీ మహోత్కటుని అవతార ప్రయోజనము వేరుకదా! ఆతడు ఆ మదమత్త గజమునకు ఎదురేగి, తన రెండు చేతులతో ఆ ఏనుగు యొక్క తొండమును ఒడిసిపట్టి, గిరగిరా త్రిప్పి, ఒక్క ఎగురు ఎగిరి అద్దాని కుంభస్థలమందు కూర్చొనెను. అంత చేత అంకుశము పట్టి ఆ కుంజర కుంభస్థలమును ఛిద్రము కావించెను. కాటుక కొండవంటి ఆ గజము ఘీంకరించుచూ క్రిందబడి మరణించెను. ఆ చుట్టుప్రక్కల గల గృహములు ఆ కుంజర ఘాతములచే నుగ్గు నుగ్గు అయ్యెను. సమస్త పర్వత, వన, సహిత ధరిత్రి సహితము కంపించెను. ఈ ఘటన కాంచిన ధర్మదత్తుడు ఇక వేరొక దుర్ఘటన జరుగకుండ వినాయకుని తన అక్కున జేర్చుకొని త్వరితముగ తన గృహము చేరెను.

అటు పిదప అపశకునములు కలుగకుండ బ్రాహ్మణులకు దానము లొసంగి, బాలునకు విభిన్న ఉపచారములతో, వస్త్ర భూషణ, పుష్ప నైవేద్యములతో పూజనమొనర్చి, భోజనాదికములు సమర్పించి, సిద్ధి బుద్ధులను ఇరువురు కన్యలను దక్షిణ రూపముగ అర్పించి, స్వర్ణ దండము వలె నేలపైబడి, హర్షాతిరేకము చే కంఠము గద్గదమవ్వగా "స్వామీ! నా పూర్వపుణ్యములు ఫలీభూతమై నేడు మీ చరణకమల దర్శనమైనది. జగత్స్వామీ, జగత్సాక్షీ, జగద్గురూ, నా వచనములు మన్నించి మమ్ములను, మా పూర్వజులనూ ఉద్ధరించుట కొరకై నీవు మా గృహమున కేతెంచితివి" అని పలికి తిరిగి వినాయకుని ఒక సుందర ఆసనమందు కూర్చుండబెట్టి పూజన మొనర్చెను. సిద్ధి బుద్ధుల సహితుడయిన శ్రీగణేశుడు గంగా గౌరీ సమేతుడైన త్రిశూలధారి, త్రినేత్రుడు అయిన శివుని వలె శోభిల్లెను.

ఈ శుభక్రియలు ఈ విధముగ జరుగుచుండగా అచటికి "జృంభ" అను దనుజ వనిత ఏతెంచెను. ఆమె పచ్చని పట్టుచీర కట్టి, సర్వాభరణ భూషితయై అతులిత సుందరాంగి వలె మధుర స్వరమున "ఇచట అనేక అరిష్ఠములు జరుగుచున్నవి. మీరు కావించు ఈ కార్యములచే ఈ బాలునికి, ఈతని మాతా పితరులకు ఎట్లు సుఖములు ప్రాప్తించును?" అని పలికి వినాయకుని ఉద్దేశ్యించి "స్వామీ! నేడు నా భాగ్య వశమున మీ దర్శనము కలిగినది. మీరు అనేక దుష్టులను సంహరించుట వలన మిక్కిలి అలసియున్నారు. అందువలన నేను మీ పాద సంవాహనము కావింతును." అని పలికి విషయుక్త తైలమును ఆ బాల వినాయకుని పాదములకు పట్టించి మర్దన చేయుట ఆరంభించెను. అంత వినాయకునకు అత్యంత దాహము కలుగుట నారంభించి, ఆయన అంతరావలోకియై, ఆ అతివను వీక్షించి, ఆమె దుష్కృత్యమును తెలిసి, ఒక నారికేళమును చేతులలోనికి తీసికొని బలముగ ఆమె శిరముపై మోదెను. అంత జృంభ తన నిజరూపమునొంది తక్షణము పంచత్వము నొందెను. ఆమె శరీరము నుండి రక్తస్రావమై రెండు యోజనములు ప్రవహించెను.

ధర్మదత్తుడు ఈ లీల సహితము వీక్షించి, తిరిగి గంధ పుష్ప నీరాజనములచే వినాయకునికి పూజనమొనర్చెను. సురలు పుష్పవృష్టి కురిపించిరి. ఇంతలో కాశీరాజు అచటికేతెంచి తిరిగి వినాయకుని ఒక దివ్య రథమధిరోహింపజేసి, మేళతాళములతో తిరిగి రాజ గృహమునకు తీసికొని వెళ్ళెను. ఆ సమయమున మహోత్కటుడు దేవతా ప్రముఖులచే పరివేష్ఠితుడయిన దేవరాజు ఇంద్రుని వలె శోభిల్లెను. జగదీశ్వరుడయిన వినాయకుని బాల్య లీలలను ఎవరు శ్రవణము చేయుదురో వారి మనోవాంఛితములు పూర్ణమై, వారు ఎన్నడునూ శత్రుపీడనొందరు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయకుని కాశీనగర బాల్యలీలలు అను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(కాశీనగర దగ్ధము; వినాయకుని పరిరక్షణ)

ఆ మరుసటి దినము బాల వినాయకుని ముందునుంచుకొని వందిమాగధులు, అమాత్యులు వెంటరాగా కాశీరాజు సభాస్థలి ప్రవేశించి, వినాయకుని ఒక స్వర్ణ సింహాసనమునందు ఆసీనుని గావించి, రాజు నిలుచుని, ఆ వినాయకుని వివిధ లీలలను సభాసదులందరికీ ఈ విధముగ వివరించెను – "నేను నా పుత్రుని వివాహార్థము మా కుల పురోహితుడైన కశ్యపుని వద్దకు ఏగితిని. ఆయన చాతుర్మాస్య కారణమున రాజాలక తన పుత్రుని పంపెను. మేము వచ్చుచుండగా అనేక ఉత్పాతములు కలిగినవి. అనేకమంది దైత్యులు మమ్ము సంహరించుటకు యత్నించిరి. ఈ బాల వినాయకుడు వాటన్నిటినీ వమ్ముకావించి మమ్ము రక్షించెను." "ఈ విధముగ ధూమ్రాక్షుని దాదిగా జరిగిన సంగతులన్నియు సభాసదులకు వివరించి, శ్రీగణేశుని దయాశీలతను, పరాక్రమమును కొనియాడి తిరిగి ఈ విధము పలికెను "ఇపుడు నా పుత్రుని వివాహార్థము చేయవలసిన కార్యములు – దేవతా స్థాపనము, మండప నిర్మాణము, వివాహ సామాగ్రి సంగ్రహణము, మొదలగునవి చేపట్టవలయును." అంత అమాత్యులు "మహారాజా! ఈ బాలకుడున్నచోట ఉత్పాతములు జరుగుచుండెను. అందువలన మీరు ఒక మాసము వేచియుండి అటు పిదప ఈ వివాహ కార్యక్రమములు చేపట్టవలసినది, అని మా విన్నపము" అని విన్నవించిరి. రాజు అద్దానిని సమ్మతించి సభను చాలించెను.

ఆ రాత్రి ఒక చిత్రము జరిగినది. "జ్వాలాముఖుడు", "వ్యాఘ్రముఖుడు, "దారుణుడు" అను ముప్వురు రాక్షసులు గతించిన రాక్షస మిత్రులకై తమ పగ తీర్చుకొనుటకై కాశీ నగరమున కేతెంచిరి. జ్వాలాముఖుడు కార్చిచ్చు వలె మారి కాశీ నగర మంతటినీ దగ్ధ మొనర్చుటకు, దారుణుడు వాయురూపుడై వానికి తోడగునట్లునూ, వ్యాఘ్రముఖుడు బ్రతికి బయటికేతెంచిన పురవాసులను భక్షించునటుల పన్నాగము పన్ని, తమ కార్యము నెరవేర్చుటకు ఉద్యక్తులైరి. తొలుత వారు ముప్వురునూ భయంకరావారములు కావించి ప్రజలందరినీ భయకంపితులను కావించిరి. తదుపరి జ్వాలాముఖుడు కార్చిచ్చు వలె చెలరేగి నగరమందటినీ దగ్ధమొనర్చ మొదలిడెను. నగరవాసులందరూ భయకంపితులై ప్రళయ మేతెంచెనని గగ్గోలు పెట్టిరి. పురుషులు, స్త్రీ, బాల, వృద్ధులు, కేకలు వేయుచూ, భ్రమితులై అన్ని దిక్కులకు పరుగులిడు చుండిరి. కొందరు అర్ధనగ్నులై, కొందరు సంపూర్ణ నగ్నులై, ఎవరెవరో తెలియక ఆర్తనాదములు కావించుచూ నగరము వెలుపలికి ఏతెంచిరి. అచట గుహవలె నోరు తెరచుకొనియున్న వ్యాఘ్రముఖుని నోటిలోనికి సర్వులు చేరుచుండిరి. వ్యాఘ్రముఖుడు బాలవినాయకుడు సహితము తన నోటిలోనికి ప్రవేశించిన మీదట తన నోటిని మూసి, సర్వులను భక్షింపవచ్చునని తలచి, అట్లే తన చంచువుల కదపక యుండెను.

ఆ తరుణమున కాశీరాజు బాల వినాయకుని గట్టిగా పట్టుకొని ఒక ఎత్తైన దుర్గము లోనికి ప్రవేశించెను. "సకల అరిష్ఠములు కలుగజేయువాడు, దుర్నిమిత్తములకు కారకుడు అయిన ఈ బాలుని నేనేల తీసికొని వచ్చితిని? కానీ ఇంతకు మున్ను ఏర్పడిన అరిష్ఠములన్నింటినీ ఈతడు సులభముగ నివారించి రక్షించెను కదా! మరి ఇపుడు ఏమియును చేయక నిమ్మకునీరెత్తినట్లు యున్నాడేమి? ఈ బాలునికి ఏమియును కాదు గదా? ఒకవేళ ఏదేని దుర్ఘటన జరిగిన ఎడల అదితీ కశ్యపులకు నేనేమి తెల్పుదును?" ఈ విధముగ మనసున తర్జన భర్జన కావించుచుండగా జ్వాలాముఖుని అగ్ని జ్వాలలు ఆ దుర్గమును సహితము దగ్ధమొనర్ప నారంభించెను. సైనికులు భాండములతో నీరు గుమ్మరించినప్పటికీ, జ్వాలలు ఎంతకీ తగ్గకుండుటచే సైనికులు నగరవాసులనూ, రథాశ్వగజములను, పదాతులను, సర్వులను నగరము నుండి బయటకు గొనిపోయిరి. అందరునూ పర్వత కంధరము వలె యున్న వ్యాఘ్రముఖుని నోటి యందు ప్రవేశించిరి. మరునాడు ఉదయము వినాయకుడు దగ్ధమయిన కాశీ నగరమును, వ్యాఘ్రముఖుని నోటియందున్న సంపూర్ణ ప్రజలను, సేననూ వీక్షించి ఇంకనూ మంటలు రేగుచున్న జ్వాలలను కాంచి వెంతనే వ్యాఘ్రముఖుని నోటి యందు ప్రవేశించెను. తక్షణము వ్యాఘ్రముఖుడు తన నోటిని మూసి సర్వులను భక్షింపనెంచెను. అంత వినాయకుడు తన ఆకారమును పెంచి ఆతని రెండు దవడలను విడదీసి, శరీరమును రెండు ముక్కలు గావించి, ఒక ముక్కను దూరముగ విసరివైచెను. అంత వ్యాఘ్రముఖుడు మరణించెను. దూరముగ పడిన శరీర భాగము వనమును భగ్నమొనర్చెను. నగరము వెలుపల యున్న భాగము పిల్లలకు ఆటస్థలమయ్యెను. తదుపరి మండుచున్న అగ్ని జ్వాలలను వాయుసహితముగ త్రావెను. జ్వాలాముఖుడు, దారుణుడు ఇరువురి శరీరములు చూర్ణమై పంచత్వము నొందిరి.

అటుపిదప తన కరుణామృత వర్షము చే వినాయకుడు దగ్ధమయిన కాశీనగరమును పునరుద్ధరింప జేయుటచే ఆ పుణ్యపురి పూర్వపు శోభను సంతరించుకొనెను. మరణించిన జనులు తిరిగి పునర్జీవితులైరి. అంత వినాయకుడు సింహగర్జన కావించెను. అంత రాజు, ప్రజలు మిక్కిలి ప్రసన్నులై ఆ పరమాత్ముని ఇట్లు స్తుతించిరి "ఓ! సృష్టికర్తా! అరిష్ఠనాశకా, గుణాధీశ్వరా, అనంత శక్తిశాలీ, విశ్వరక్షకా, విఘ్ననాశకా, జ్ఞానదాతా, అజ్ఞాన నాశకా! నీకు నమస్కారము. స్వామీ! నీవు లీలామాత్రముగ అవతారము స్వీకరించెదవు. సమయము కాని సమయమందు ఏతెంచిన ప్రళయమును నివారించి, దైత్యుల నుండి మమ్ము రక్షించితివి. ఈ ప్రచండాగ్నిని త్రాగుట, విశాల ముఖుడైన వ్యాఘ్రముఖుని సంహరించుట, దారుణుని హతమార్చుట, మృతులను పునర్జీవితుల కావించుట, అను కార్యములను నీవు తప్ప మరి ఎవరు చేయగలరు? స్వామీ! ఈ సంసారము యొక్క జననీ జనకులు, మరియు సంరక్షడవు నీవే! మీ సాన్నిధ్యమున యుండుటఏ నేను, నా ప్రజలు చేసికొన్న మహద్భాగ్యము." ఈ విధముగ పలికి కాశీరాజు వినాయకుని సింహాసనము నందు ఆశీనుని కావించి, షోడశోపచారములతో పూజించి, మంగళ వాద్యములు మ్రోయింపించి, వంది మాగధులచే కీర్తి గానము చేయించెను. సర్వులు ముదము నొంది వారి వారి గృహములకు ఏగిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి కాశీనగర దగ్ధము, వినాయక పరిరక్షణ అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(భృశుండి వృత్తాంతము)

బ్రహ్మదేవుడు "ఓ! వేద విభాజకా! నేకొక అత్యంత ఆశ్చర్యకరమైన ఆఖ్యానమును వినిపించెదను. దీనిని భక్తి పూర్వకముగ వినుటచే మానవులు అత్యంత సుఖప్రాప్తి నొందెదరు. కాశీరాజు ప్రాత:కాలమున లేచి సంధ్యాది

నిత్యానుష్ఠానము కావించి, అటు పిదప వినాయక దర్శనమునకేగి, పూజించి, వినాయకుని భోజనహేతువై వివిధ పక్వాన్నములను, వ్యంజనములను, మోదకములను సమర్పించెను. వినాయకుడవన్నియు భుజించి తృప్తిగా త్రేన్చెను. అంత రాజు అచట మరికొన్ని పక్వాన్నములు, వ్యంజనములు, లడ్డూలు, అపుపములు, మరియు వినాయకుని శరీరమున నూతన మణిరత్న స్వర్ణ జటిత హారములు కాంచెను. అంత రాజు ఆశ్చర్యచకితుడై "ప్రభూ! జగదీశ్వరా! మీకు నూతనముగా పూజ కావించిన భక్తుడెవరు? నాకు ఆ భక్తుని దర్శింపవలెనని కోరిక కలుగుచున్నది." మహోత్కటుడు "రాజా! నీకు సంక్షేపముగ తెలిపెదను. దండకారణ్య దేశమున "నామల సంజ్ఞకము" అను పురము కలదు. అందు "భృశుండి" అను నా భక్తుడు కలడు. అతడు త్రికాలజ్ఞాత; శీఘ్రమే ఆతడు సృష్టిస్థిత్యంతములు కావింపగల దక్షుడగును. త్రిమూర్తులు సహితము ఆతనిని అనుదినము దర్శించుటకు ఉవ్విళ్ళూరుచుందురు. ఆతడు నిరంతరము నన్ను తలచుచుండుటచే ఆతని పాపములన్నియు దగ్ధమయినవి. ఆ జితేంద్రియుడు చిరకాలము నా కొరకై తపమాచరించుటచే ఆతని కనుబొమల నడుమ నుండి తొండము మొలిచి త్రిలోకముల యందు భృశుండి నామమున ప్రసిద్ధుడయ్యెను. నా కత్యంత భక్తుడగుటచే ఈ మృత్యులోకమందు నాతో సముడయ్యెను. ఈనాడు శుక్లపక్ష చతుర్థి. అందువలన నాకై పూజనమొనర్చెను. నాపై యున్న పంచామృతావశేషములు ఆతడు సమర్పించినవే!" అంత కాశీరాజు "దేవదేవా! నేనాయనను ఎట్లు దర్శింపగలను? ఆయన ఇచటకు ఎట్లు ఏతెంచును?"

వినాయకుడు "నీవు ఈనాడే భృశుండి ఆశ్రమమునకు ఏగి, ఆయనకు ప్రణామమొనర్చి, నీ కుమారుని వివాహ నిమిత్తము ఆహ్వానింపుము. నా మాటగా "మహర్షీ! మా ఇంట వినాయకుడు యున్నాడు. ఆయన నీవలన భక్తి పూర్వకముగ కావింపబడిన పూజచే మిక్కిలి సంతృప్తుడై యున్నాడు. ఆయన సహితము మిమ్ము చూచుటకు అభిలషించు చున్నాడు. ఆయనే నన్ను మీ వద్దకు పంపెను. మీ దర్శన పూజనములు కావించుట నా ఆకాంక్ష. మీరు దయచేసి నన్ను, నా గృహమును రాజ్యమును ధన్యులను కావింపవలసినదని ఆహ్వానింపుము. నా ఉనికిని గూర్చి వినినంతనే ఆతడు తప్పక అరుదెంచును" అని పలకెను. వెంతనే కాశీరాజు ధనుర్బాణములు ధరించి, ఒక వేగవంతమయిన అశ్వమునధిరోహించి నదులు, పర్వతములు, వనములు దాటి, భృశుండి ఆశ్రమము చేరి ఆయనకు ప్రణామము లాచరించెను. ముని సహితము రాజును సాదరముగ ఆహ్వానించెను. ఆ ఆశ్రమము అత్యంత సుందరమై, అనేక పుష్ప, ఫల, సరోవర యుక్తమై వేదపఠనము, శాస్త్ర చర్చలచే మారుమ్రోగుచూ వికసించిన కమలములు గల స్వచ్ఛ సరోవర యుక్తమై, పక్షుల కలకలా రావములతో ఇది కైలాసమా, వైకుంఠమా, లేక సత్యలోకమా అనట్లు యున్నది.

రాజు స్వర్ణదండము వలె భూమిపైబడి, సాష్టాంగ దండ ప్రమాణము లాచరించి, ఆ వాతావరణమునకు ప్రశాంతచిత్తుడై తన పుత్రుని వివాహ ప్రస్తావన, వినాయకుని వినతి, తెలిపి ఆ మహర్షిని తన రాజ్యమున కాహ్వానించెను. అంత భృశుండి "రాజా! మీ నామమేమి? ఎక్కడివారు? మీ ఈ వినాయకుడెవ్వరు?" అని ప్రశ్నించెను. అంత రాజు "మహర్షీ! నేను సూర్యవంశ సంజాతుడను. కాశీరాజు నామమున ప్రసిద్ధుడను. వినాయక ప్రభువునకు గణేశచతుర్థి తిథినాడు భోజన సమర్పణ సమయమున మీచే ఈయబడిన భండారములను వినాయకుడు స్వీకరించుట కాంచితిని. ఆయన వద్ద నుండి మీ కీర్తిని వింటిని. ఆ పరమాత్ముడు "నా నామము వినిన తోడనే ఆ మహర్షి స్వయముగా ఏతెంచును" అని పలికెను. మీ దర్శనము నా వంటి చర్మచక్షువులకు, సామాన్యులకు దుర్లభమని ఓ! మునీ! నేను అనేక కష్ట నష్టములకు ఓర్చి మీ కడకేతెంచితిని. దయచేసి మీరు మా నగరమున కేతెంచవలసినది." రాజు పలుకులు విని భృశుండి ఆశ్చర్యచకితుడై "వినాయకుడు వేద వేదాంతజ్ఞుల చిత్తమునకు సహితము అగోచరుడు. మీ ఇంట ఎట్లుండును? ముప్పది మూడు కోట్ల దేవతలు మీ ఇంటికి ఏతెంచిన ఎడల నేను నా ఆశ్రమము వీడి మీ ఇంటికి ఏతెంచెదను. మీ ఇంటి వద్ద యున్న భగవానుని రూపురేఖలు వర్ణింపుము. అప్పుడైననూ మీ ఇంటికి ఏతెంచెదను" అని పలికెను.

మహారాజు "మహర్షీ! ఆయన స్వరూపములనంతములు. వానిని లెక్కించుటకు ఫణిపతికి, భాషాపతికి సహితము అసాధ్యము. ఆయన స్వరూపము వర్ణించుట ఎవరికి సాధ్యము? ఇపుడు ఆయన కశ్యప తనయునిగ అవతారము స్వీకరించి "వినాయక నామమున" త్రైలోక్య విఖ్యాతుడయ్యెను. ఆ అద్భుత రూప సంపన్నుడు ఏడు సంవత్సరముల వయస్సులో జగదీశ్వరునికి సమర్ధము కాని కార్యములు కావించుచుండెను. ఆ స్వరూపమును మీకు వర్ణించెదను. ప్రస్తుతము ఆయన బాల బ్రహ్మచారి. కశ్యప గృహమున అవతారము స్వీకరించినపుడు ఆయన దివ్య కాంతియుతుడై, చతుర్భుజుడై, దివ్యమాలా వస్త్రధారుడై అమూల్యాభరణభూషితుడై, మహాయుధ సంపన్నుడై, దివ్య గంధానులేపితుడై విలసిల్లెను. కానీ అదితీ కశ్యపుల ప్రార్ధన మేరకు ప్రాకృత శిశురూపము నొందెను. అంత భృశుండి "రాజా! మీరు తెలిపిన బ్రహ్మచారి నేను ధ్యానించుచున్న పరమాత్ముడు కాదు. నా దేవుని దర్శనము ఋషులకు, దేవతలకు, సహితము దుర్లభము. ఒకవేళ నేను పూజించు పరమాత్మ నన్ను పిలచిన ఎడల సత్వరము నేను ఏగుదును." అంత రాజు చింతాక్రాంతుడై "నాకు సౌభాగ్యము, దుర్భాగ్యము రెండునూ ప్రాప్తించినవి. మీరు మా రాజ్యమున కేతెంచదరని పెను ఆశతో మీ వద్దకు ఏతెంచితిని. మీ పుణ్య దర్శనము ప్రాప్తించినది. కానీ మిమ్ములను బలవంతముగా తీసికొని వెళ్ళు ప్రయత్నమును నేను చేయలేను." అంత ముని కరుణాతరంగుడై రాజును కన్నులు మూసుకొనమని ఆ రాజు యొక్క మూర్ధన్య స్థానమునందు తన పవిత్ర హస్తమునుంచెను. రాజు కళ్ళు తెరుచు సరికి తన రాజ భవనమందుండెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి భృశుండి కధనము అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(భృశుండి వినాయక సమాగమము)

వినాయకుడు సర్వజ్ఞుడయనప్పటికీ కాశీరాజును జరిగిన విషయమంతయు తెలుపమని ఆదేశించెను. రాజు తాను బయలుదేరినప్పటి నుండి వెనుకకు తిరిగి వచ్చు వరకు జరిగిన విశేషములను వారి మధ్య జరిగిన సంభాషణలను, చివరకు ముని తన శిరముపై హస్తము నుంచగనే తాను క్షణములో రాజమందిరము చేరుటయు సంపూర్ణముగ వివరించెను. అంత వినాయకుడు "రాజా! నీవు ఆ భృశుండి ఆశ్రమమునకు తిరిగి ఏగి నా నామము "గజాననుడు" అని తెలుపుము. ఆయన వెంఠనే నీతో ఏతెంచును. నీవు మిక్కిలి దస్సియున్నావు" అని పలికి తన హస్తముతో రాజును తాకెను. మరుక్షణము రాజు భృశుండి ఆశ్రమమునందుండెను. ముని రాజును చూచి "ఈతడు మరల ఏల ఏతెంచెను?" అని మనసున తర్కించెను. అంత రాజు మునితో "మహర్షీ! మీ స్వామి గజాననుడు మిమ్ములను పిలుచుచుండెను" అని పలికెను. గజానన నామము వినబడగనే భృశుండి ప్రసన్నుడై, రోమాంఛితుడై కొంత తడవు మూర్ఛనొందెను. తిరిగి లేచి కన్నుల వెంట అశ్రుధారలు కారుచుండగా "నాకు గనక రెక్కలు కలగెనేని వెంఠనే ఎగురుచూ వెళ్ళియుండెడి వాడను" అని పలికి ఆ మహర్షి రాజు వెంట వెడలుటకు ఉద్యుక్తుడయ్యెను. ఎప్పుడూ ఎక్కడకూ కదలని భృశుండి మహర్షి కదులుటచే అచల అయిన పృధివి సహితము చలించి, కంపించుచూ ఆయన ఎదుటికి ఏతెంచి "మునిశ్రేష్ఠా! రక్షింపుము" అని పలికెను. అంత ముని "ధరిత్రీ! భయము వలదు. నేను నా స్వామి గజాననుని దర్శనార్ధము శీఘ్రమే ఏగుచుంటిని" అని పలికి మూడడుగులు నడుచుసరికి కాశీ పట్టణము చేరెను. రాజు ఆశ్చర్య చకితుడై, హర్షోద్వేగములు పెల్లుబిక "మహర్షీ! మీ వంటి తపశ్చర్యారతులు, జపనిరతులు అయిన మహర్షుల మహిమ దుర్జయము, మరియు దానిని తెలియుట బహు కఠినము" అని పలికి ఆ ఋషిని తన మందిరమునకు తోడ్కొని పోయి, ఒక స్వర్ణ సింహాసనమందు ఆశీనుని గావించి,

అర్ఘ్య పాద్యాదులతో గౌరవించి, భోజనాదులు సమర్పించి, పూజన మొనర్చెను.

భృశుండి మహర్షి "రాజా! నన్ను మాయ చేసి ఇచటకు తీసికొని వచ్చితివా! నాకు గజాననుడిచట కనబడుట లేదు. నాకు వెంఠనే గజానన దర్శనము కావింప వలసినది. లేని ఎడల నిన్ను శపించి నేను నా ఆశ్రమమున కేగెదను." "మహర్షీ! క్రోధము వలదు. గజాననుడు బాల్యావస్థచే క్రీడాతత్పరుడైయుండెను. వెంఠనే పిలిపించెదను" అని వినాయకుని రావించెను. వినాయకుడు ద్విభుజుడై, కోటిసూర్య ప్రకాశుడై, మెలితిరిగిన తొండముతోయున్న బాల గజాననుని కాంచి ముని క్రోధోద్రిక్తుడై "గొప్ప వ్యక్తులు కనిష్ఠులకు నమస్కరించుట అవమానకరము. గజకుంభస్థలమును భేదించు పంచాస్యము గడ్డిమేయునా? ఈ చిన్ని బాలునికి నేనెట్లు ప్రణామము కావించెదను?" అని పలికెను. అంత వినాయకుడు "భృశుండీ! నీ స్వామి అయిన గజాననుడు ఎట్లుండెనో తెలుపవలసినది." ముని "ఆ పరమాత్ముడు దివ్య దుకూలధారి, దశభుజుడు, గళమున ముత్యముల మాలాధారి, సిద్ధి బుద్ధి సహితుడు, కుండలాలంకృతాంగుడు, సుందరమయిన తొండము గల ముఖము, దీర్ఘ కర్ణములు, సింధూర లేపనము, నాగ యజ్ఞోపవీతము, చరణములందు నూపురములు, మహామకుటము, హస్తములందు దశాయుధములు, ఏకదంతడు, చంద్రశేఖరుడు, మయూర వాహనుడు, ఎల్లప్పుడూ దేవతలచే ఆరాధింపబడువాడు" అని ముని ఆగెను. తక్షణము బాలుడు ఆ రూపము సంతరించుకొనెను. కమలాసనుడై పైన తెలిపిన రూపమునయున్న తన ఉసాన్యదేవత గజాననని గాంచి భృశుండి ఒక్క క్షణము భూమిపై బడెను. తదుపరి దేహభావమంకురించి, ఆయనకు ప్రణామమాచరించి, షోడశోపచార పూజనమొనర్చెను.

మహారాజు "నా పూర్వ పుణ్యములు ఘనీభూతమై వినాయక భక్తిచే కలుగు అద్భుత ఫలమును నేడు కన్నులారా కాంచితిని అని పలికి వారిరువురినీ సింహాసనమందు ఆసీనుల కావించి తాను వారిరువురికీ పూజన మొనర్చెను. భక్త; భగవానులు వార్తాలాపములు కావించుచూ, గజాననుడు తన దశ భుజములతో భృశుండిని ఆలింగన మొనర్చెను. వారిరువురి బంధనమును గాంచి కాశీరాజు గద్గదఖంటుడై ఆనంద భాష్పములు జాలువార్చెను. గజాననుడు "భృశుండీ! నీ భక్తి నిష్ఠ నేనెరుంగుదును. దాని విషయమై రాజు సహితము నాకు నివేదించెను. నన్ను నా భక్తులు ఏ విధముగ తలచెదరో నేను ఆ రూపము గొని వారికి దర్శనమిచ్చెదను. ఎవరు పూర్ణ భక్తి, విశ్వాసములతో నన్ను కొలిచెదరో, నేను వారి మనోవాంఛితములను పూర్ణము ఒనరించెదను. భూమి దుష్ట దైత్యుల భారముచే బ్రహ్మను శరణు నొందినది. బ్రహ్మ ప్రార్ధనచే నేను కశ్యప పుత్రునిగ అవతరించితిని. ఇక దైత్యనాశనము కావించి, పృధివీ భారమణచి, ఇంద్రాది దేవతలను తిరిగి వారివారి పదవులయందు ప్రతిష్ఠిత మొనర్చెదను. దేవాంతకుని భ్రాతా సహితముగ పరిమార్చి తిరిగి నా పధమున కేగెదను." భృశుండి "ఓ! సర్వలోక సుఖదా! సర్వ క్లేశహారీ! మీ దర్శనము చే నేను పవిత్రుడను, కృతకృత్యుడనైతిని. ఓ! విఘ్నహర్తా! నేను ఎప్పుడెప్పుడు మిమ్ములను ధ్యానింతునో తక్షణము మీరు నాకు ప్రత్యక్ష దర్శనము నీయవలసినది. ఈ వరమును దయచేసి నాకు కటాక్షింపవలసినది." గజాననుడు "తధాస్తు" అని తన శుభ హస్తమును ఆ ముని మస్తకముపై యుంచి, తదుపరి బాల వినాయకునిగ మారి క్రీడార్ధము బయటకు వెడలెను. భృశుండి పద్మాసనము వైచికొని గజానన ధ్యానమందు నిమగ్నమయ్యెను. ఈ ఘటనను కాంచిన లోకులందరూ పరమాశ్చర్య చకితులైరి. కాశీరాజు "ఈ జగత్తునందు నేను ధన్యుడను. ఎందుకనగా బ్రహ్మాది దేవతలకు సహితము దుర్లభమయిన గజాననుని దశభుజ రూపము నాకు దర్శనమయినది" అని పలికి తిరిగి బాల వినాయకుని చేతిని పట్టి రాజమందిరమునకు గొనివచ్చెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి భృశుండి వినాయక సమాగమము అను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(హేమజ్యోతిర్విదుని చరితము)

వ్యాసుడు "బ్రహ్మదేవా! తదుపరి కాశీ రాజ్యమున ఏమైనది? తెలుపవలసినది. ఈ కథామృతము ఎంత త్రావిననూ తృప్తి కలుగుట లేదు." బ్రహ్మ "సూర్యోదయమయిన పిదప సర్వులూ తమ యథోచిత నిత్య కర్మానుష్ఠానములు పూర్ణమొనరించిరి. వినాయకుడు క్రీడార్థము ఏగెను. మహారాజు సభతీర్చి రాజ వ్యవహారములు చక్కబెట్టుచుండెను. ఆ సమయమున ఒక దైత్యుడు గొప్ప జ్యోతిశ్శాస్త్ర పారంగతుని వలె వేషమూని రాజసభ ప్రవేశించెను. ఆతడు తన ఎడమ చేతి యందు తాళపత్ర గ్రంథము, కుడిచేతి యందు అక్షమాల, శరీరమందు గులాబీరంగు దుకూలములు, గొప్ప తలపాగ, అంగ ప్రత్యంగములందు పన్నెండుచోట్ల తిలకధారణ కావించెను. మహారాజు ఆ పండితునకు నమస్కృతులు సమర్పించి, ఒక సుందరాసనమందు ఆశీనుని కావించి "స్వామీ! మీరెవరు? ఎక్కడివారు? మీరు ఏ విషయమందు పండితులు? ఎంతటి తపమాచరించిరి? దయచేసి తెలుపవలసినది." పండితుడు "రాజా! "హేమజ్యోతిర్విదుడు" నా నామము. నీ సభాస్థలి నలంకరించుటకు గంధర్వ లోకమునుండి ఏతెంచితిని. భూత భవిష్యత్ వర్తమాన కాల ద్రష్టను. నీ ప్రశ్నలన్నింటికీ సమాధానము ఈయగలను ఇచట కలిగిన అరిష్టముల నెరింగి, నీకు భవిష్యత్‌నందు కలుగు దుష్ఫలితములు సంకేతములు గుర్చి తెలుపుటకు ఇచట కేతెంచితిని. నీ రాజాశ్రయము నందు నివసించుట నా కోరిక." మహారాజు "ఏ కారణముచే ఈ అరిష్టములు దాపురించుచున్నవి? భవిష్యత్ నందు ఇంకనూ ఏమి అరిష్టములు కలుగును? మీ పలుకుల యందు సత్యమున్నదని తెలిసిన పిమ్మటనే మీకు ఆశ్రయము ఈయగలను" అని పలికెను. జ్యోతిష్కుడు "మీ ఇంటియందున్న కశ్యప నందనుడు విఘ్నరాజు. ఆతడు ఇచట యున్నంత వరకూ ఈ అరిష్టములు కలుగుచునే యుండును. ఈ బాలుని జనసంచారము లేని అడవి యందు విడచిన నీ అరిష్టములు తొలగును. లేని ఎడల నీ నగరమంతయు జలప్రళయమందు నీటిలో మునుగును. అది తప్పిన ఎడల ప్రచండ వాయువు ద్వారా పర్వతములు కూలి నగరము చూర్ణమగును. ఈ వినాయకుడు ఇచటికి రాని క్రితము ఈ ఉపద్రవములు లేవు కదా! రాజులు తమ సింహాసనమును రక్షించు కొందుకు ఎల్లప్పుడూ అప్రమత్తులై యుండవలెను. పలుకులు అహితమైననూ సత్యము పలుకుచుంటిని. ఆపై నీ ఇష్టము" అని పలికెను. రాజు "పండితవర్యా! మీ పలుకులు నమ్మశక్యముగ లేవు. నీకు ఈ అద్భుత బాలుని గూర్చి తెలియదు. ఈతడు బ్రహ్మాండములను సృష్టింపగలడు. ఈతడు అనేక బలశాలురైన దైత్యులను సంహరించెను. ఈ బాలుని మనసునందు కించిత్ దోష భావమును కూడా నేను చూడలేదు. ఈతడు ఈ రాజ్యమును, నగరమును సహితము అనేక మార్లు ఉత్పాతముల నుండి రక్షించెను. అంతేకాదు. ఈ బాలుడు ఘటనాఘటన సమర్థుడు." అంత హేమజ్యోతిర్విదుని ముఖము కోపముతో ఎరుపెక్కి తిరిగి ఇట్లనియె "రాజా! నేను నీ మంచి కోరి పలుకుచుంటిని. బుద్ధి కర్మాను సారిణీ! విధాత తలంపును మార్పు చేయుట అసంభవము. అయిననూ నీ మంచికై నాకు ఆ బాలుని చూపింపుము." అంత రాజు వినాయకుని పిలిపించెను. బాలురందరి సహితుడై వినాయకుడేతెంచి, జ్యోతిష్కుని గాంచి, నమస్కరించి ఇట్లనియె "స్వామీ! మీరెక్కడి నుండి ఏతెంచిరి? మీరు శరీర సాముద్రిక, జ్యోతిష శాస్త్ర పారంగతులు మరియు త్రికాల జ్ఞాత. నా భాగ్యజనిత ఫలములను తెలుప వలసినది."

అంత జ్యోతిష్కుని గుండెలో రాయి పడినది. ఈ బాలుడు గొప్ప గొప్ప రాక్షసులను హతమార్చెను. దావానలమును త్రావెను. నా పరిస్థితి ఏమి? అని తన భవిష్యత్ కై కలతపడి, పైకి మటుకు మేకపోతు గాంభీర్యము ప్రదర్శించి, ఆ బాలుని చేయిపట్టి ఇట్లనియె "బాలకా! నీవు నాలుగు రోజులలో మడిసెదవు. అది తప్పిన ఎడల సముద్రము నందు

మునిగి మరణించెదవు. దానిని తప్పించుకొనిన ఎడల అంధకార కూపము నందు పడెదవు. దానినుండి బ్రతికిన నీపై పర్వత చరియలు విరిగి పడి అసువులు బాసెదవు. దానిని తప్పించుకొనిన కాలపురుషుడు నిన్ను హరించును. నీకు ఈ ఉపద్రవము నుండి బడటపడెడు మార్గము తెలిపెదను. నాలుగు దినములు నాతో వేరొక ప్రదేశముకు రావలసినది. తిరిగి ఇచటకు నిన్ను తీసికొని వచ్చెదను. ఇది నా శపథము." ఇది విని వినాయకుడు నెమ్మదిగా లోనికి ఏగి, రాజు వద్ద నుండి రాజముద్రికను గైకొని తన హస్తమందు నిడుకొని జ్యోతిష్కునితో ఇట్లనియె "పండితవర్యా! మేము పోగొట్టుకొనిన వస్తువును ఎప్పుడూ ఎవరు తీసికొని వచ్చెదరు? అద్దానిని తెలిపిన ఎడల మీ పై విశ్వాసము కలుగును." పండితుడు "మీరు పోగొట్టుకొనిన ముద్రికను నాకు బహూకరింప గలిగిన అయ్యది ఎచట గలదో తెలపెదను." వినాయకుడు "వల్లె" అనెను. అంత జ్యోతిష్కుడు" అది మీ హస్తము నందు యున్నది" అని పలికెను. అంత వినాయకుడు ఆ ముద్రిక యున్న హస్తముతో జ్యోతిష్కుని హృదయమును తాడించెను. ఆ ప్రహారముచే జ్యోతిష్కుని హృదయము విదీర్ణమై, నిజరూపము ధరించి, పర్వతము వలె క్రింద పడి మరణించెను.

కాశీరాజు సహా సర్వులూ ఆశ్యర్య చకితులై "ఈ బాలకుడు బ్రాహ్మణ వేషధారి అయిన దనుజుని ఎట్లు తెలిసెను? ఈ బాలుడు సామాన్యుడు కాడు. సాక్షాత్ భూభార హరణమున కేతెంచిన పరమాత్ముడే!" అని పలికి సర్వులూ ఆయనను పూజించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. దేవ దుందుభులు మ్రోగి భూనభోంతరాళములు మిన్నుముట్టినవి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి హేమజ్యోతిర్విదుని చరితము అను పద్ధెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(కూప కంధర హతము)

బ్రాహ్మణ వేషధారి అయిన అసురుడు మరణించెనన్న వార్త తెలిసిన నరాంతకుడు "కూప" మరియు బ్రహ్మ వరదత్తుడయిన "కంధర" అను ఇరువురు రాక్షసులను చేరదీసి, వారితో సమయాలోచితముగ మాట్లాడి, వారికి విలువయిన వస్త్ర భూషణములు సమర్పించి, వారిని బాల వినాయకుని హతమార్చమని పంపెను. వారిరువురు కాశీ పట్టణమునకు బయలుదేరిరి. అంత కూపుడు కంధరునితో ఇట్లనియె "నేను ఒక కూపము గా మారి, అందు ఒక మండూక రూపము ధరించి యుండెదను. నీవు ఒక బాలునిగమారి, ఆ బాల క్రీడల సమయమున వినాయకుని నూతిలోనికి త్రోయుము. నేను ఆతడు నా ముఖ కంధరమున ప్రవేశింపగనే తినివేయుదును. ఈ విధముగ ఆ బాలుని హతమార్చి మన మిత్రులను చంపిన పగ తీర్చుకొందము." కంధరుడు సంతసిల్లి "వల్లె" అనెను. వారిరువురు అతి విశాలము, అత్యంత సుందరమైన కాశీ నగరము ప్రవేశించి, రాజమందిరపు నికటముననే కూపుడు ఒక నుయ్యి వలె మారెను. అత్యంత స్వచ్ఛము, తీయని రుచి గల జలములు యున్న ఆ నూతిని గని రాజుతో సహా సర్వులు ఆనందించిరి. వారు ఆ కూపము లోపల మధుర స్వరముతో బెకబెక లాడుచున్న ఒక భయంకర మండూకమును సహితము కాంచిరి. బాల రూపమునున్న కంధరుడు వినాయకుని తమతో ఆడుటకు పురిగొల్పెను. బాలురందరూ క్రీడలు సలిపి మధ్యాహ్న సమయమున దాహార్తులై కొందరు బాలురు ఆ నూతిలోనికి దూకిరి. వారు ఈతలు కొట్టి, నీరు త్రావి, బయటకు వచ్చి, తమ గృహముల కేగుటకు సన్నద్ధులైరి. వినాయకుడు బయటనే యుండి వార్తాలాపము లాడుచుండెను. ఆ సమయమున కంధరుడు అకస్మాత్తుగా వినాయకుని అతి లోతయిన ఆ కూపము లోనికి త్రోసెను.

వినాయకుడు ఆ కూపమందు పడి బయటకి ఏతెంచుటకు ప్రయత్నించుచూ కొంచెముసేపు నీటిపైన, కొంచెము సేపు నీటి లోపల కొట్టుమిట్టాడు చున్నట్లు కానబడెను. వరాహ భగవానుడు భూమికై వెదకుచూ సముద్రమును అతలాకుతలము కావించినటుల, బాల వినాయకుడు ఆ కూపమందలి జలములను సంపూర్ణముగ చిలికెను. బయటనున్న బాలురు వినాయకుని వెలిదీయుటకు యత్నించిరి. కానీ అయ్యది సాధ్యపడలేదు. అంత వినాయకుడు ఆ నీటి యందు క్రిందికిపైకి తేలుచూ, ఒకమారు కంథరుని పాదములు పట్టి నీటిలోనికి లాగెను. అంత వారిరువురి మధ్య ముష్టి యుద్ధము ఆరంభమయ్యెను. నన్ను "విడువుము, విడువుము" అని కంథరుడు, అదే విధముగ వినాయకుడు, వాగ్యుర్ధము సహితము ఆరంభించిరి. అంత కంథరుడు వినాయకుని పట్టి నీటి అడుగుటకు తీసికొని పోయి చాలా సేపటికి వరకూ నీటిపైకి రాకుండిరి. ఇంతలో బాలురు తమ తల్లిదండ్రులకు, రాజుకు తెలిపిరి.

సర్వులు వినాయకుడు మృతుడయ్యెనని తలచిరి. కాశీరాజు హతాశుడై "నేనేమి చేయగలను? అగాధమగు ఈ కూపమందు పడి బాలుడు ఎట్లు జీవితుడగును?" అని పలికెను. అంత లోకులు "బాలుని ఎట్లైననూ బయటకు తీసికొని వచ్చినట్లయిన, బ్రతికించు మార్గము చూడవచ్చు" అని నమ్మ బలికిరి. అంత రాజు "ఎవరేని బాల వినాయకుని బయటకు తీసికుని వచ్చినట్లయిన, వారికి నేను నా సర్వమును సమర్పించెదను. నన్ను కూడ అర్పించుకొందును" అని పలికెను. అంత ముప్వురు వ్యక్తులు ధైర్యమునూని ఆ కూపము నందు దూకిరి. కానీ దైత్యమాయచే వారు హతులైరి. అంత మిగిలిన వారెవరూ దూకుటకు సాహసింపలేదు. అంత రాజు "నేను కావించిన పాపమేమి? నాకు ఏ కారణమున దు:ఖము లేతెంచుచున్నవి? నేను నా సుఖహేతువై ఈ బాలకుని తీసికొని వచ్చితిని. ఇపుడు ఈతని మాతా పితరులకు, నా ప్రజలకు నా ముఖము ఎట్లు చూపించుకొందును? అయిననూ ఇంతకు మున్ను ఎన్నో అరిష్ఠములను త్రిప్పికొట్టిన ఈ బాలుడు ఈ అరిష్ఠమున కేల లొంగెను? భగవానుని లీలలు అర్ధము చేసికొనుట దుర్లభము" అని విలపించుచుండెను.

ఇంతలో ఒక ఆశ్చర్యము జరిగెను. నీటిలోపల యున్న వినాయకుడు పైకి తేలి వచ్చి, కంథరుని పట్టి, తెరిచియున్న కూప మండూకుని నోటిలోనికి విసరెను. మండూకము తన నోటియందు పడినది బాల వినాయకుడని తలచి, కంథరుని నమిలి మ్రింగి ఈ విధముగ ప్రగల్బములు పలికినది "నేను బాలకుని తిని వేసితిని" అని తన నిజరూపు ధరించి "ఎందరో దైత్యులను హతమార్చిన బాలకుని చంపి, తిని నేను వారి ఋణము తీర్చుకొంటిని" అని పలికెను. ఈ లోపున కంథరుడు మండూకము తనను మ్రింగెనన్న కోపముతో ఆ మండూకము యొక్క ఉదరము చీల్చుకొని బయటకు వచ్చెను. ఆ ప్రక్రియతో ప్రాణములు కోల్పోవుచే, క్రోధము వహించి మండూకము కంథరుని కంఠమును అత్యంత బలముగ కరచి సంహరించెను. ఏక కాలమున రక్కసులిరువురూ ఒకరినొకరు చంపుకొని మరణించిరి. వినాయకుడు సురక్షితముగ బయటకు వచ్చెను. రాజభటులు దైత్యుల శరీరములను బయటకు ఈడ్చి దూరముగ విసరివైచిరి. రాజు ఆ కూపమును పూర్ణముగ మాయించెను. సర్వులూ ఈ ఘటనను ఆశ్చర్య చకితులై "చెరపకురా చెడిదెవు" అని నానుడి నిజమనిరి. దీపపు పురుగు దీపము నార్పుటకు ఏతెంచి స్వయముగ హతమైనటుల, ఈ బాలుని జోలికి వచ్చిన దనుజులందరూ మడిసిపోయెదరు. కాలము ఈ బాలుని రోమము సహితము కంపింపలేదు" అని పలికిరి. కాశీరాజు ఇది సత్యమని ముమ్మారు వక్కాణించి, బాలుడు సుఖముగ యుండుటకు దాన ప్రక్రియ లాచరించెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి కూప, కంధర హతము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(అంధక, అంబాసుర, తుంగ దానవుల వధ)

వ్యాసుడు "విరించీ! కాశీరాజగృహమున ఆతని పుత్రుని వివాహము ఎప్పుడు, ఎట్లు జరిగెను? అద్దానిని గూర్చి సవిస్తారముగ తెలుపవలసినది." బ్రహ్మ "కాశీ రాజ్యమున ఒక అరిష్టానంతరము వేరొకటి జరుగుచునే యున్నవి. ఈ అరిష్టములు ఆగిన పిదప వివాహ కార్యక్రమములు చేపట్టిదనని రాజు తలంచుచుండెను. కూప, కంధరుల మరణానంతరము "అంధక", "అంబాసుర", "తుంగ" అను ముగ్గురు రాక్షసులు ఏకమై, ఏ విధముగనైననూ బాల వినాయకుని పరిమార్చ వలెనని కాశీనగరమున కేతెంచిరి. వారు ముగ్గురు "మనము భయంకర దావాగ్నిని రగిల్చి, నగరమును దగ్ధ మొనర్చెదము." అంధకుడు తాను నలుదిక్కులా అంధకారము కావించి మనుజులకు ఏమియును కానబడనట్లు కావించెదనని పలికెను. అంబాసురుడు తాను భయంకర ఝంఝూవాతము (తుఫాను) గా మారి నగరమును వర్షాధారలచే ముంచెత్తునని పలికెను. తుంగ తాను ఒక భయంకర పర్వతముగ మారి ఆ నగరము చీకటి, వరదల మధ్య నలిగినపుడు, అకస్మాత్తుగా ఆ నగరము పైబడి నగరమును తుత్తునియలు కావించెదనని పలికెను. అంతముగ్గురు దావాగ్ని, అంధకారము, ఝంఝూవాతము, పర్వతముల మధ్య జనులు ఎచటికీ ఏగలేక నలిగి హతమగుదురనీ, వారితో వినాయకుడు సహితము హతమగునని పన్నాగము పన్నిరి.

ఒకానొక నాటి ఉదయము ముగ్గురునూ కలసి ఒక భయంకర గర్జన మాచరించిరి. అద్దానిచే త్రిలోకములు కంపించినవి. నెమ్మదిగా సూర్యరశ్మి తగ్గి పగలే రాత్రి ఛాయలలుము కొనెను. ఘోరాంధకారము నలుదిక్కులా ప్రసరిల్లెను. ఆ సమయమున లోకులు నానా ప్రకారములైన వృత్తుల యందు నిమగ్నమైరి. కొందరు స్నానము, కొందరు జప హోమములు, మరికొందరు తప, వేద పారాయణము, కొందరు వివాహ, ఉపనయనాది సంస్కారములు, కొందరు భజన, కీర్తన, పురాణ శ్రవణములు, ద్విజులు దేవపూజ యందు, ఇతర కులస్థులు వారి వారి వ్యాపారముల యందు సంలగ్నులై యుండిరి. లోకులు "వింధ్య పర్వతము తిరిగి సూర్య మండలమును ఆచ్ఛాదించినదా? సూర్యగ్రహణ మేతెంచినదా? ఇది గ్రహణ సమయము కాదే?" అని విస్తుపోయినరి. గోవులు తిరిగి గోశాలలు చేరినవి. దీపములు వెలిగింపబడినవి. ఇంతులు "భోజనము వండలేదు, తినలేదు, అపుడే ఎట్లు రాత్రి అయినది?" అని ఆశ్చర్యము ఒలకబోసిరి. లోకులు కాష్ఠ దీపములు ప్రజ్వలింపజేసి, తమ కార్యములు ఒనర్చుకొనచుండిరి. కానీ కొందరు వ్యక్తులు ఆనందము నొందిరి. వారు కాముకులు, సేవకులు, నిద్రామగ్నులు, నిద్రాళువులు మిక్కిలి ఆనందము ననుభవించిరి.

అంధకుడు ఈ విధముగ కాశీ నగరమందు అంధకారమును వ్యాపింపజేసిన మీదట అంబాసురుడు మేఘరూపుడయ్యెను. భయంకర గర్జనలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు కురిపించుచూ, ఏనుగు తొండముల వంటి వర్షధారలతో నగర మంతటినీ ముంచెత్తుట నారంభించెను. జనులు అతి భయభీతులై, గృహాంతర్భాగమున తలదాచుకొనిరి. కానీ ఆ ఝంఝూమారుత తీవ్రత చే గృహములు ఛిద్రమై కూలినవి. మెరుపుల తీవ్రత చే మంటలు పుట్టి నగరము నందు ఏకకాలమందు వరదలు, మంటలు నలుదిక్కులా అలముకొనుచున్నవి. జనులు హాహాకారము లొనర్చుచుండిరి. ఈ ఘటన అంతయు వీక్షించుచున్న పరమాత్ముడు వినాయకుడు ఒక విశాల వట వృక్ష రూపము నొంది ఆ నగరమంతయు ఊడల సహితుడై వ్యాపించెను. అద్దానిపై ఒక పక్షి రూపు ధరించి, తన రెక్కలు విప్పార్చి, ఆ వృక్షపు పై భాగములు మూసివైచెను. ఎన్ని మెరుపులు వచ్చిననూ, అవన్నియు కేవలము పక్షిని తాకుచున్నవే గానీ క్రిందికి వచ్చుట లేదు. వర్షము సహితము ఆ రెక్కలపైననే కురియుచూ క్రిందికి రాకుండెను. ఆ దివ్య విహంగము తన

నోటితో క్రిందయున్న నీటినంతటినీ పానమొనర్చి లోకులకు సుఖము నిచ్చెను. తన నుండి వెలుతురు ప్రసరింపజేసి అంధకారమును సంపూర్ణముగ పారద్రోలెను; లోకులు, నాగరికులు, అమాత్యులు, నగర ప్రముఖులు, గజాశ్వ రథములు, సమస్త జీవరాశి, సపరివారముగ రాజు, అందరూ ఆ వటవృక్ష ఛాయన రెక్కల క్రిందికి ఏతెంచి సుఖించిరి. అంధకారమంతరించిన పిదప సర్వులు అంతకు ముందు చూడని వట వృక్షమును, అద్భుతమైన పక్షిని చూచి జగదీశ్వరుడైన వినాయకుడే ఈ వృక్ష, పక్షి రూపములు ధరించెనేమో అని తలంచి యధావిధిగ తమ కార్యాచరణము ఆరంభించిరి. ఈ విధముగ రోజులు గడచినవి. లోకులు బాల వినాయకుని క్రీడలు గమనించియు ఇవన్నియు లీలా మాత్రముగ ఒనరించునది భగవానుడని తెలియరయ్యె!! ఇంతలో దైత్యుల శక్తి క్షీణించినది.

అంత "తుంగ" ఒక పర్వతముగ మారెను. ఆ పర్వతము గండశిలామయము, నదీ, జలపాతముల తో కూడినదై, అనేక పశు, పక్షి, జంతువులు, ఆశ్రమముల కాలవాలమై, ఐదు యోజనముల విస్తీర్ణము కలిగి యుండెను. ఆ దనుజుడు ఈ పక్షిని క్షణములో తుదముట్టించెదనని గర్జన చేయుచూ వేగముగ ఆ పక్షిపై పడుట ఆరంభించెను. అంత పక్షి రూప పరాత్పరుడు ఆ పర్వత శైలమును గమనించి, తాను సహితము ఎగిరి, ఆ పర్వతమును తన నోటితో పట్టుకొని, తన రెండు కాళ్ళలో ఒక దానితో అంధకుని, రెండవ కాలితో అంబాసురుని పట్టి పైకెగిరి భువర్లోకము పై వరకూ చేరెను. సూర్యుని వేడిమి చే వారు ముగ్గురూ సంతప్తులై, కొద్ది సేపటికి ఆ వేడిమి తాళజాలక మరణించిరి. అంత ఆ పక్షి ముగ్గురినీ భూమిపై విడచెను. ముగ్గురూ మృతులై పర్వతముల వలె నేలకూలిరి. నాగరికులు, స్త్రీ బాల వృద్ధులందరూ ఆ మృత దేహములు చూచుట కేగిరి. వారందరూ తిరిగి వచ్చుసరికి ఆ వట వృక్షము గానీ, పక్షిగానీ లేకుండెను. అంత సర్వులు ఇయ్యది వినాయక ప్రభువు మహాత్మ్యమని ఆయనను కొనియాడిరి. రాజు వినాయకుని గాఢాలింగనము కావించి, తిరిగి ఆ బాలుని రక్షణార్థము శాంతి హోమము జరిపించెను. సర్వులు ప్రసన్నులైరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి అంధక, అంభాసుర, తుంగ దానవుల వధ అను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(భ్రమరా దురాగతము)

బ్రహ్మ "ద్వైపాయనా! ఈ వినాయక చరితమ పాపనాశకము. సావధానుడవై వినుము. అంధకుని శిరము ఉత్తరింపబడి ఆతని గృహమున బడెను. ఆ సమయమున ఆతని తల్లి "భ్రమర" ఒక బంగారు పర్యంకముపై శయనించు చుండెను. ఒక దాసి ఆ శిరమును గాంచి వెంటనే భ్రమరకు తెలిపెను. భ్రమర తన పుత్రుని శిరము చూచి మొదలు నరికిన కదళీతరువు వలె నేలపై బడి మూర్ఛిల్లెను. అంత కొంత సేపటికి లేచి తన శిరము, రొమ్ము తాడనము చేసికొనుచూ, శరీరమందలి భూషణములన్నియు తెగి, వస్త్రములు చినిగి రోదించెను. "ఎవరు అమరావతీ సహిత స్వర్గ, ధరిత్రిలను భయభీతమొనర్చెనో, శేషుని శిరములను తన కనుసన్నలతో భయకంపిత మొనర్చెనో, దేవాంతక, నరాంతకులను రాజ్యాభిషిక్తులను చేసెనో, తన గర్జనచే రోదసీ కుహరమును కంపింపజేయునో అటువంటి నా పుత్రుడు ఎట్లు మరణించెను? ఎవరిని చూచి కాలము సహితము కంపించునో, అటువంటి వీరుడు ఏ విధముగ మృతినొందెను?" ఈ విధముగ విలపించుచున్న భ్రమరను చెలికత్తెలు ఊరడించిరి. "మృతులతో వారి స్వజనులు మృతులవ్వరు. నీ పుత్ర మరణము చే

శోకము సహజము. కానీ ఇపుడు కావింప వలసిన కార్యములు ఆచరింపుము. నీ పుత్రుని మరణము గూర్చి సంపూర్ణముగ తెలియుటకై గుప్తచరుల నియమింపుము. మంత్రయుక్తముగ ఈతని దహన క్రియలు జరిపింపుము. సుహృద్ జనుల భాష్పములు ప్రేతముల ముఖము జొచ్చి, వారికి అత్యంతఖేదము కలుగజేయునని మహర్షుల వాక్యము." ఇదంతయు వినిన భ్రమర మిక్కిలి క్రోధోద్రిక్తయై, ప్రతీకార వాంఛ అణువణువున రగులుచుండుటచే సఖులతో ఇట్లనియె "నా పుత్రుని శిరమును తైలద్రోణి యందు భద్రపరుపవలసినది. నేను నా పుత్రుని నిహతుని కావించిన అదితీ పుత్రుని శిరము గొని వచ్చెదను. ఆ శిరముతో నా పుత్రుని దహనక్రియలు సలిపెదను." ఈ విధముగ పలికి తన ప్రముఖ, అంతరంగిక రాక్షసీ గణమును గైకొని, తాను దేవమాత అదితి రూపము ధరించి, అగ్నికి ఆహుతియగు కీటక సమూహము వలె కాశీనగరమున కేగెను.

ఆ రాక్షసి దివ్యాభరణ భూషితయై, బింబాధరయై, దానిమ్మ గింజల వంటి దంతములు, సన్నని నడుము, కలిగిన అదితీదేవి రూపమును గ్రహించి, దశదిశలూ ప్రదీప్తింప జేయుచూ రాజమందిరము ప్రవేశించెను. సర్వులూ ఆమె చూచి "ఈమె యక్ష లేక నాగకన్యయా? రంభా, మేనకా, ఘృతాచి వంటి అప్సరసయా? సాక్షాత్ పార్వతీదేవి కాదుకదా! ఊర్వసియో లేక కాముని భార్య రతీదేవియో లేక కశ్యప పత్ని అయిన అదితీదేవియో అయి యుండవలెను." ఈ విధముగ తమలో తాము అనుకొనుచుండగా కాశీరాజపత్ని అచటకేతెంచి, అదితీదేవిని గుర్తుపట్టి, ఆమెకు నానా సౌభాగ్య ద్రవ్యములు, బహుమూల్య వస్త్ర భూషణములు, బహూకరించి ప్రేమపూర్ణ గద్గదవాణితో ఇట్లనియె "ఓ! దేవమాతా! నా భాగ్య వశమున నీ దర్శనము ప్రాప్తించినది. వినాయకుని కృపచే నీవేతెంచితివి. లేని ఎడల నీ దర్శనము అత్యంత దుర్లభము." ఈ విధముగ రుద్ధ కంఠముతో పలుకుచున్న రాణితో "ఓ! ఇందువదనా! నా ప్రియపుత్రుడు అనేక దినములనుండి నన్ను విడచి మీ వద్దనే యుండిపోయెను. నేను వాని దర్శనమునకై అత్యంత ఉత్కంఠినై యున్నాను. స్త్రీ స్వభావము నీకు తెలియనిది కాదు కదా! శోప సంతప్త శరీరనైన నేను నా పుత్రుని గాఢ పరిష్వంగము చే సంతోష ప్రాప్తి నొందెదను." పరమాదరయుక్త అయిన కాశీరాణి బాలునికై దూతలను వెంటనే పంపెను. ఇంతలో దూతల ద్వారా కశ్యప పత్ని ఏతెంచెనన్న వార్త విని మహారాజు శీఘ్రమే గృహమున కేగి, ఆమెను సందర్శించి, ప్రణామములర్పించి, అత్యంత భక్తి భావముతో ఇట్లనియె "మాతా! నేడు నా జన్మము, శృతము, రాజ్యము, తల్లిదండ్రులు, తపము, ధన్యమయినవి. ఎందుకనగా జగజ్జనని, దేవమాత, పరాశక్తి రూపమయిన అదితీదేవి దర్శనము నాకు ప్రాప్తించినది. నీ గుణములు వర్ణించుట నా శక్తికి మించిన కార్యము. మీ తనయుడు వినయకుడు ఇంద్రుని మించిన శక్తిశాలి. ఈ బాలుడు అనేక విధములయిన చిత్ర విచిత్ర విన్యాసము లొనర్చి ఎందరో ఘోర రాక్షసులను పరిమార్చెను. నా భాగ్యవశమున ఆతడు ఆ దుష్ఠ దనుజుల పరిమార్చినప్పటికీ ఆతనికి ఇంచుక హాని కలుగలేదు."

ఈ విధముగ వార్తాలాపములు జరుగుచుండగా వినాయకుడేతెంచెను. అంత ప్రచ్ఛన్న రూపమున యున్న భ్రమర ఆ బాలుని ఆలింగన మొనర్చి, కన్నుల అశ్రుధారలు కారుచుండగా ఇట్లనియె "నాయనా! నేను నా ప్రాణములు ఫణముగా పెట్టి నిన్ను కంటిని. నీవు నన్ను వదలి చిరకాలము ఇచటనే యుండిపోతివి. నీ వియోగముచే నేను శోక సంతప్తనై, సర్వమును విడచి ఇచటి కేతెంచితిని. నేనిక నిన్ను విడచి ఒక్క క్షణము కూడా బ్రతుకజాలను." అత్యంత చతురత, స్నేహపూర్ణ పలుకులు వినియునూ వినాయకుడు ఆమె ఎవరో గ్రహించి ఏమీ ఎరుగనటుల ఆమె ఒడిలో కూర్చొని "నీవు నా కొరకు ఏమి తెచ్చితివి?" అని ప్రశ్నించెను. అంత భ్రమర ఒక విషపూరిత మోదకమును వినాయకున కిచ్చెను. వినాయకుడు దానిని భుజించి మరియొక మోదకమును అడిగెను. ఆమె తిరిగి మరియొక విషపూరిత మోదకమును తినిపించెను. వినయకుడు బలపూర్వకముగ మరియొకటి అడుగగా కాశీరాజదంపతి వారిని వారించి భోజనమునకు ఏతెంచమని అర్ధించిరి. అంత భ్రమర బాలకుని సహితముగ లేచుటకు సిద్ధమయ్యెను. బాలకుడు హిమాలయము వలె

బరువుగ తోచెను. అంత భ్రమర "బాలకా! నేను నీ తల్లిని. ప్రేమ వశముచే నిన్ను చూచుటకేతెంచితిని. నీవు నన్ను చూర్ణము చేసెదవా ఏమి?" అని పలుకుచూ బాలుని త్రోయుటకు ప్రయత్నించెను. వినాయకుడు నిద్ర నటించుచూ కాలుసేతులు వ్రేలాడతీసెను. అంత రాజు "తల్లీ! నిదురించుచున్న బాలుని లేపవలదని వారించి, దాదులను ఆ బాలుని గొనిరమ్మని పలికెను. ఎవరెంత ప్రయత్నించిననూ ఆ బాలుని పైకిలేపరైరి. అంత వారు ఆ బాలుని నిద్రలేపుటకు యత్నించిరి. కానీ బాల వినాయకుడు బరువు పెరుగుచూ ఆ దైత్య స్త్రీని చూర్ణమొనరించెను. భ్రమర తన నిజరూపు ధరించి మరణించెను. ఆమె శరీరము పది యోజనముల దూరము వ్యాప్తినొందెను.

సర్వులు ఆశ్చర్యము నొంది "ఈ బాలఘాతిని మునిపత్ని వేషము ఎట్లు ధరించినది? మనము ఎవరమూ ఆమెను గుర్తింపకుంటిమి. ఈ బాలుని జ్ఞానము, సామర్థ్యము అద్భుతము" అని పలుకుచూ ఆ మృత శరీరముపై నిదురించుచున్న బాల వినాయకుని ఎత్తుకొని "ఈతడు పుష్పము వలె అతి తేలికగా యున్నాడు" అని పలికిరి. తదుపరి ఆ రాక్షసి యొక్క శరీరమును ముక్కలు ముక్కలు గావించి దూరముగ విసరివైచిరి. అంత కాశీరాజు తన అమాత్య, పౌర, ఋషి, దేవతా, నాగరికులతో కలసి వచ్చి వినాయకుని ఇట్లు స్తుతించెను "ప్రభూ! నీవు దేవ, మానవ, నాగ, రాక్షస, యక్ష, గంధర్వులకు, గజాశ్వ పక్షి జాతులకు, త్రికాలమునకు, ఇంద్రియములకు, మన:ప్రవృత్తులకు, సమస్త కార్యములకు, సర్వ లోకములకు, సర్వ జగత్తుకు, గ్రహ నక్షత్రాదులకు నాధుడవీవే! సృష్టి స్థిత్యంతములు కావించునది నీవే! నీకు నమస్కారము, పశుపతి, తత్వజ్ఞాన ప్రదాతా, త్రిమూర్త్యాత్మకా, అనంత రూపా, మోక్షదాయకా, విఘ్నహర్తా, నీకు నమస్కారము. భక్త ప్రియా, అభక్తవినష్టా, ఆదిదైవా, ఆది భూతాత్మా, తాపత్రయ హరణా, సర్వ ఉత్పాతములను హరించు లీలారూపధారీ, సర్వాధ్యక్షా, సర్వాంతర్యామీ, నీకు నమస్కారము. అదితీగర్భ సంపన్నా, కశ్యపాత్మజా, అమేయ పరాక్రమా, మాయచే సర్వులను మోహమొనరించు మహాప్రభూ, మాయకు ఆశ్రయము మరియు మాయాహరణుడవైన మహోదయా, నీకు నమస్కారము! నీకు నమస్కారము!! నీకు నమస్కారము!!! భ్రహ్మ " ఈ స్తోత్రము ఉత్పాత నాశకము. త్రిసంధ్యల యందునూ ఎవరు ఈ స్తోత్రమును పఠించెదరో, వారు భూత భయరహితులై, మహోత్పాతములను, విఘ్నములను, పొందక తమ సంపూర్ణ కామనలను పూర్ణమొనరించు కొందురు. వినాయకుడు వారిని సర్వదా రక్షించును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడా ఖండమందలి భ్రమరా దురాగతమను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(శుక్ల విద్రుమ చరితము)

ఈ సంఘటన అనంతరము కాశీ లోకుల యందు "వినాయకుడెవరు?" అన్న ప్రశ్న ఉత్పన్నమై, సర్వులు తర్కించుట ఆరంభించి "ఈతడు మనుష్యుడా? లేక దేవతా? ఇంద్ర, విష్ణ్వాదులకు సహితము అజేయులైన రాక్షసులను ఈ బాలుడు సంహరించెను. బాలురతో క్రీడించుచున్ననూ నిశ్చయముగా ఈతడు దేవతయే!" ఈ విధముగ తర్జన భర్జన చేయుచూ వారందరూ ఒకనాటి ఉదయము రాజసభకేగి ఇట్లనిరి "మహారాజా! మీరు మాన్యులు, దాతలు, మీకు ఏది లభించిననూ దానిని మా అందరితో పంచుకొనెడి వారు. మీరు కశ్యప పుత్రుని తోడ్కొని వచ్చిరి. మేము అభ్యంతరము తెలుపలేదు" ఆయనకు మీరు పూజన మాచరించు చుండిరి. ఈ వటువుకు పూజా నిమిత్తమై మాకు ఎందులకు అవకాశము

ఇచ్చుట లేదు?" అంత మహారాజు "సజ్జనులారా? మీరు చెప్పినది సబబే! పంచుకొని తినినచోట విషము సహితము అమృతమగును. లేనిఎడల అమృతము సహితము విషమగును. ఈ బాలకుడు దేవతా? లేక మనుష్యుడా? అను వాదనను కట్టిబెట్టి, ఎవరికి ఈయన యందు భక్తి కలదో వారు నిశ్చయముగా ఈ బాలుని పూజార్థము గొనిపోవలసినది. నగరవాసులారా! సర్వులు సత్వ, రజో, తమో గుణములను త్రిగుణముల యందే భ్రమించుచుందురు. కొందరు ఈయనను ప్రశంశించెదరు. కొందరు నిందించెదరు. కొందరు పరీక్షించెదరు. మరికొందరు పుణ్య భాజనులు భజించెదరు. ఎవరి స్వభావమును బట్టి వారు ప్రవర్తించెదరు. పలుమార్లు అరగదీసినప్పటికీ చందనము సుగంధమునే ఇచ్చును. బురదలో కలిసినప్పటికీ కస్తూరి తన సుగంధమును కోల్పోవదు. ఉల్లి సహితము దాని గుణమును వీడునా? మీకు ఈ బాలుని ఎడ అనన్య భక్తి యున్న ఎడల తప్పక ఈతని కొనిపోయి పూజింప వలసినది. ఈతడు నా మాతా పితృతుల్యుడు. ఎట్టి పరిస్థితుల యందునూ ఈ బాలుని పరీక్షార్థము తీసికొని పోరాదు. ఈతడు మన రాజ్యమును, నగరమును రక్షింపకుండిన, ఈ రోజు మీరు, నేను ఎచటనుండెడివారమో ఎవరికెరుక?"

నగరవాసులు "మహారాజా! మీరు చెప్పిన వన్నియును సత్యములు. ఇందు అనుచితము ఇంచుక లేదు. మేము ఈ బాలుని గొనిపోయి యథోచిత పూజన మాచరించెదము." ఇవన్నియు వినుచున్న వినాయకుడు "మీ వంటి మహాత్ములు నన్నేల పూజింపవలెను? నేను మునిపుత్రుడను. సాధారణ బాలుడను. మీరెంతో ఖర్చుతో కూడిన పూజనొనరించి దాని వలన ఏమి ఫలము నొందెదరు? మీ ఇంట వివాహము, లేక యజ్ఞము, జరిగి హవ్య, కవ్యాదుల అవసరమగుచో నేను తప్పక ఏతెంచెదను. మీరందరూ అసంఖ్యాకులు కదా! మీ అందరి ఇండ్లకు ఎట్లు రాగలను? మీరు నన్ను పూజించుట సవత్స గోవును వదలి వంధ్యను, కల్ప వృక్షమను వదలి సామాన్య వృక్షమును పూజించునట్లున్నది." అంత వర్తక ప్రముఖులు "స్వామీ! రాజపుత్రుని వివాహానంతరము మీరు ఇచట ఒక క్షణ పర్యంతముండరు. మా భక్తి సఫలమై, మా మహారాజు కృప వలన మాకు మీ దర్శనమయినది. మీరు అవక్రమ పరాక్రమవంతులు, సృష్టి స్థిత్యంత కారకులు, ఘటనాఘటన సమర్థులు, చిదానంద స్వరూపులు. మేము కావించు పూజచే మీకు ప్రయోజనము లేదు. కానీ వినాయక భగవానుడు భక్త ప్రియుడు అను నిగమ వాక్యము నిరర్థకమగును. దయచేసి అట్లు కావింపవలదు." అంత వినాయకుడు "మీకు నాయందు అంత భక్తి యున్న ఎడల, రాజాజ్ఞ నౌదలదాల్చి నేను తప్పక మీ ఇళ్ళ కేతెంచెదను" అని పలికెను. అంత సర్వులూ ఆనందముగా తమతమ గృహమున కేగిరి. వినాయకుని ఆగమనహేతువై సర్వులు తమ గృహములను అలంకరించిరి. కొందరు మండపములు నిర్మించిరి. కొందరు వస్త్రములతో అలంకరణమొనర్చిరి. కొందరు తోరణములు కట్టిరి. మరికొందరు దర్పణముల నమర్చిరి. బహూమూల్య పాత్రలను, కస్తూరి చందనాది సుగంధ లేపనములను, చిత్ర విచిత్ర రంగులు కూడియున్న వస్త్రములను, పంచామృతములను, భూషణములను, నానా విధములైన పక్వాన్నములను, ముత్యాల మాలలను ఇట్లు సర్వులు వారికి తగిన విధముగ ఏర్పాట్లు కావించుకొని వినాయకునికి స్వాగత సత్కారములకై సామాగ్రి సిద్ధము చేసికొనిరి.

ఆ పురము నందు "శుక్లుడు" అను బ్రాహ్మణుడుండెడివాడు. ఆయన వేద వేదాంగ పారంగతుడు. శుద్ధుడు, నిష్పాపి, సత్వగుణ సంపన్నుడు, శాంతుడు, దాంతుడు, క్షమాశీలుడు, శ్రౌత స్మార్త కర్మలయందు తత్పరుడు, బ్రహ్మ నిష్ఠుడు, అతిథి సత్కార నిరతుడు. ఆయన ధర్మపత్ని "విద్రుమ" భర్తకు తగిన ఇల్లాలు. ఆమె మృదుస్వభావి, జ్ఞాన సంపన్న, సర్వాంగ సుందరి, భర్తను ప్రేమించు పతివ్రత. వారు దరిద్రులైనప్పటికీ జ్ఞాన నిష్ఠులు. ఇంటియందు ఏ విధమయిన భోగములు లేవు. ఆ సాధ్వి కేవల వల్కల ధారణ కావించినప్పటికీ, అద్వితీయమైన తేజస్సుతో ప్రకాశించెడిది. శుక్లుడు ఆమె పరిచర్యలచే, వినయ సంపదచే ఎంతో ఆనందము నొందువాడు. వారు భోజనము లేక ఉపవాసమున్నప్పటికీ బ్రాహ్మణోచిత స్వభావము చే జ్ఞానస్థితి స్థిరులై యుండెడువారు. ఒకానాడు శుక్లుడు భిక్షాటనకై నగరమునకేగి, ప్రతి

ఇల్లు శోభాయమానముగ అలంకరింపబడి వినాయకుని ఆగమనమునకై వేచియుండుట గమనించెను. లోకులు ఆ కారణమున బిక్ష ఈయుటకు సహితము నిరాకరించిరి. ఆయనకు లభించిన అతి కొంచెముతో గృహమున కేగి తన పత్నితో "నేడు నగరమందు ఏ గృహమందునూ బిక్ష నీయకుండిరి. కశ్యప నందనుడై అవతరించిన శ్రీగణేశ భగవానుడు నేడు సర్వుల ఇంటికీ పూజా స్వీకరణకై ఏతెంచునట. మన గృహమునకు సహితము ఏతెంచునేమో! అందువలన పూజకు కావలసిన సంభారములు సిద్ధము చేయుము" అని పలికెను.

అంత విద్రుమ "స్వామీ! ఇతరుల ఇండ్ల యందు లభించు మహాపూజ విడచి మనవంటి నిర్ధనుల ఇండ్లకు ఆయన ఎందుకేతెంచెను? ఒకవేళ వచ్చిన ఎడల గంధ పుష్పములు, పాచిపోయిన అన్నము, కందమూలములే ఆయనకు నివేదించెదము. అయిననూ మీ పిచ్చిగానీ ఆ పరమాత్ముడు మన ఇంటికేతెంచునా?" అని పలికెను. అంత శుక్లుడు తన ప్రియపత్నితో "వినాయకుడు దీనులకు, అనాథలకు ప్రభువు; నేను ఆయన భక్తుడను. భగవానుడు భక్త ప్రియుడు. లోభమునకు వశీభూతుడవడు. పత్రము, పుష్పము, ఫలము, తోయము; దేనితో నైననూ తృప్తి నొందును. దంభము, అహంకారముతో సమర్పించినవి ఆయనకు ప్రసన్నత నీయవు." అంత విద్రుమ పదునెనిమిది రకముల ధాన్యములు, పాత బియ్యము, ఎక్కువ నీరుపోసి, కొంచెము జావకాచి, దానిపై ఒక శుభ్రవస్త్రము పరచెను. ఇంటిలో ఒక ప్రదేశమును శుభ్రపరచి అచట గంధ పుష్పాక్షతలు, ధూప దీప హారతులు, ఫలములు, వల్కలములు సిద్ధమొనర్చెను. భోజనానంతరము నోటిని సుగంధభరితమొనర్చుటకై నాన్చిన ఆవాలు యుంచెను. ఇంటి బయట కళ్ళాపి జల్లి, దర్భలు పరచెను. అంత శుక్లుడు నైవేద్యమును స్థాపించి, వైశ్వదేవమొనరించి, వినాయకునికై ధ్యాన నిరతుడయ్యెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి శుక్లచరితమను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది మూడవ అధ్యాయము

(వినాయకుడు శుక్ల విద్రుమలను అనుగ్రహించుట)

లోకులు వినాయకునికై వేచియుండిరి. వినాయకుడు కౌతుకముతో బాలురతో క్రీడలు సలుపుచుండెను. మహారాజు సభతీర్చి వేశ్యాంగనల నృత్యము వీక్షించుచుండెను. ఆ సమయమున దేవ లోకము నుండి అగ్ని, సూర్యుల వలె వెలుగొందుచూ సనక, సనందనులు ఏతెంచిరి. కాశీరాజు వారిరువురినీ చూచి, సింహాసనము నుండి లేచి, వారిరువురికి సాష్టాంగ దండ ప్రణామము లాచరించి, వారి పాదములను తన శిరముపై యుంచుకొని, లేచి వారిరువురినీ సుఖాసీనుల కావించి "స్వామీ! నేడు నా కులము, రాజ్యము, జ్ఞానము, శరీరము, పత్నీ పుత్రులు, సర్వము ధన్యమయినవి" అని పలికెను. తదుపరి వారికి పాద సంవాహనము కావించుచూ "నిష్కాములైన మునులకు దేనియందు ఆకాంక్ష యుండదు. నేను నా ధన్యతకై మీ సేవ కావించుటకు అనుజ్ఞ నీయవలసినది. అంతేకాక మీరు ఏతెంచిన కార్యము సహితము తెలుపవలసినది" అని పలికెను. అంత ఆ ముని ద్వయము "కశ్యప పుత్రుడు, పరబ్రహ్మ స్వరూపుడు, అవాప్త సర్వకాముడు, అత్యద్భుత పరాక్రమశాలి అయిన వినాయకుడు నీ ఇంట యుండి అద్భుత లీలలు ప్రదర్శించుచున్నాడని విని ఆయన దర్శనార్థము ఏతెంచితిమి. మేము ఆ వినాయక భగవానుని చరణ కమలములకు నమస్కరించి తిరిగి మా ఆశ్రమమున కేగెదము." ఈ విధముగ వార్తాలాపములు జరుగుచుండగా వినాయక భగవానుడేతెంచెను. ఆ సమయమున ఆ బాలరూప పరమాత్మ పంచ ఖాద్యవస్తు మిశ్రమముచే చేయబడిన మోదకమును సగము తిని, మిగిలిన సగము చేతి నిడుకొని యుండెను. ఆ మునులిరువురు ఆ బాలుని చూచి పరస్పరము "ఈ బాలుడు ఆచార వ్యవహారముల నన్నింటినీ మంటగలిపి కశ్యపునికి

సహితము చెడ్డపేరు తెచ్చును. ఈతనికి భక్ష్యా భక్ష్యములు, స్పృశ్యాస్పృశ్యములు వివేచన లేదు. ఈతని స్పృశించుటే కాదు, దర్శించుట సహితము మహాదోషము. ఈతడు బ్రాహ్మణోచిత కర్మములన్నింటికీ నీళ్ళు వదలి క్షత్రియుని ఇంట కాపురముండెను. మనము స్వధర్మ నిరతులము. ఈతని దర్శనము చే ఏమి లాభము?" అని పలికిరి.

బుద్ధియందు బృహస్పతి సముడైన బాల వినాయకుడు మునులను చూచి "ఋషులారా! మీ వంటి మహానుభావులు నా వంటి సామాన్యుని కోసమై స్వర్గము వీడి ఎట్లు ఏతెంచిరి?" మునులిరువురు వినాయకుని మహామాయచే మోహితులై "మీరు అనుమతి ఇచ్చిన ఎడల మేము మా ఆశ్రమమునకు చనెదము" అని పలికిరి. రాజు వారిని భోజనము చేసి వెడలమని బ్రతిమాలెను. వారిరువురు "రాచరికపు భోజనము తినుట వర్జితము" అని పలికి మణికర్ణిక ఘట్టమున కేగిరి. అంత బాల వినాయకుడు ఆవుదూడ తన తల్లి వద్దకు పరుగెత్తునట్లు, ఆర్తి నొందిన ద్రౌపదీ దేవి వద్దకు కృష్ణ భగవానుడు ఏగినటుల, శుక్ల విద్రుమల గృహమునకు ఇతర బాలకుల సహితుడై పరుగిడెను. బ్రాహ్మణ దంపతి తమ గృహమందు బాల వినాయకుని చూచి కన్నుల ఆనంద భాష్పములు రాలుచుండగా ఆయన చరణములపై బడిరి. నెమ్మదిగా లేచి గొంతు గాద్గదిగమవ్వగా ఆ పరమాత్ముని కౌగలించుకొనిరి. శరీరము రోమాంచమై, కన్నుల అశ్రుధారలు కారుచుండగా, దేహాతీత స్థితనొంది వారేమి మాట్లాడుచున్నారో, చేయుచున్నారో తెలియకుండిరి. కొంతసేపటికి తెప్పరిల్లి, తిరిగి వినాయకునకు ప్రణామములు ఆచరించి "పరమాత్మా! నీవు దీననాధుడు అను పాపహరణ నామమును ఈనాడు సార్ధకము కావించితివి. అంబరచుంబిత మనోహర మహా హర్మ్యములందలి మధుర పదార్ధములు త్యజించి మా పర్ణ కుటీరమునకు ఏతెంచినవి. తండ్రీ! నీ ఆగమనము చే మా జన్మము, వంశము, తపము, జ్ఞానము, ఆయువు సహితము ధన్యమయినవి" అని పలికిరి.

అంత ముని దంపతి ఆ బాల వినాయకుని ఒక కుశాశనమునందు ఆశీనుని కావించి, ఆయన పాదములు కడిగి, తమ శిరముపై ప్రోక్షణ గావించి, షోడశోపచార పూజనమొనర్చి, అత్యంత లజ్జితులై, తాము ఆ రోజు మాధూకరమొనర్చి తెచ్చిన అతి చిన్న పదార్ధమును ఆయనకు అర్పించిరి. అంత వినాయకుడు "మీ ఇంట వండిన పదార్ధమేదయిననూ నాకు ప్రసాదింప వలసినది. భక్తిగా ఒసంగిన ఏ పదార్ధమయిననూ నాకు అమృత తుల్యము. దంభము, అశ్రద్ధ చే కావించిన దేదయిననూ అయ్యది విషతుల్యము" అని పలికెను. అంత విద్రుమ తాను మిశ్రమ ధాన్యముతో కావించిన జావను అత్యంత బిడియపడుచూ ఆయనకు సమర్పించెను. అద్దానిని గమనించి వినాయకునితో ఏతెంచిన బాలురు పరిహాసముగ నవ్వుట ప్రారంభించిరి. వినాయకుడు మాత్రము ఆ జావను అమృతముగా స్వీకరించెను. బాలుడు ఒక్క మారుగ దశభుజుడై అన్ని చేతులతో ఆ దంపతి తన కర్పించిన భోజనమును స్వీకరించి, కొంత భాగము మిగిలిన బాలుర కిచ్చెను. కొంతమంది బాలురు భక్తి పూర్వకముగ అద్దానిని ప్రసాదముగ స్వీకరించిరి. కొందరు పరిహసించిరి. ఆ ప్రసాదము స్వీకరించిన బాలురు దేవతుల్యులైరి. మిగిలిన వారు పశ్చాత్తాపులైరి. ఇంతలో నగరమంతయు వినాయకుడు కటిక దరిద్రులైన బ్రాహ్మణ దంపతి ఇంట దశభుజుడై భోజనమారంగించెనని కోలాహలము చెలరేగెను. పిదప ఆ పరమాత్ముడు ముఖశుద్ధి కొరకు నానబెట్టిన ఆవాలు సహితము స్వీకరించెను.

అటుపిదప వినాయకుడు ఆ దంపతిని వారి మనోవాంఛితముల కోరుకొనమనెను. అంత శుక్లుడు "స్వామీ! నీవు నాగరికుల ఇంట మిష్టాన్న భోజనము వర్జించి మా పర్ణకుటీరము నందు భోజనము స్వీకరించితివి. మీ దర్శనము మాకు వరము. కానీ మీరడిగితిరి కావున మాకు మీ పాదములందు స్థిరభక్తి, మోక్షము ప్రసాదింపవసినది. ఇక ఈ జగత్తు యందు పునరాగమనము వలదు" అని పలికెను. అంత వినాయకుడు సంతసిల్లి ఆ దంపతికి తరగని భోగ భాగ్యములు, ఇంద్ర భవనము వంటి గృహము, విపుల జ్ఞానము, ఉత్తమ రూపము ప్రసాదించి, మరణానంతరము మోక్షమును సహితము ఒసంగి, తిరిగి ద్విభుజుడైన బాలునిగ మారి, అనుజ్ఞనొంది అక్కడి నుండి బయలుదేరెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి బ్రాహ్మణ దంపతి మోక్షమను ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(సనక సనందన గర్వ భంగము)

ఈ లోపున నగరవాసులందరూ తమ తమ ఇండ్ల యందు భోజనాదుల ఏర్పాట్లు గావించుకొని వినాయకుని ఆగమనము జరుగక నెమ్మదిగ వినాయకుని కొరకు వెదకుట ఆరంభించిరి. ఎక్కడికేగిననూ "ఇచట లేదు" అన్న సమాధానవమే వినబడుచున్నది. ఇంతలో కొందరు శుక్లుని ఇంట భోజనమారగించెనని తెలిపిరి. అంత అందరూ కలసి శుక్లుని ఇంటికి ఏగగా, ఆతడు ఇప్పుడే వినాయకుడు తమ ఇంటి నుండి వెడలెనని పలికెను. వినాయకుడు తన తోటి బాలకులను మభ్యపరచి, రాజగృహమున కేగి పరుండెను. జనులు ఆయన విడిది గృహమునకేగి పర్వత కంధరమందు శయనించుచున్న పులి వలె నిదురించుచున్న వినాయకుని కాంచిరి. "లోకో భిన్నరుచి" అని నానుడి కదా! కొందరు లోకులు క్రోధోద్రిక్తులై "ఈ తుచ్ఛ బాలుడు పిశాచము వంటి ఆ దరిద్ర బ్రాహ్మణుని ఇంటికి ఏల ఏగవలెను? ఈతడు సర్వాంతర్యామి అయిన సర్వుల మది తెలిసి, అందరి ఇండ్లకు రావలెను కదా?" అని నిందించిరి. కానీ వినాయక భక్తులు ఆయనను లేవనెత్తి "స్వామీ! మీ అన్వేషణ యందు తిరుగుచూ ఎంతో కష్టము నొందితిమి. కానీ మీ చరణ కమల దర్శనముచే ఆ కష్టము నశించినది. మేము మీకై ఎంతో శ్రమనోర్చి భోజనాదికములు సిద్ధమొనర్చితిమి. దయచేసి మా ఇండ్లకు రావలసినది" అని ప్రార్థించిరి.

అంత వినాయకుడు తాను భోజనము ముగించితినని తెలిపి తానిపుడు కదులలేనని మొరాయించెను. అంత సర్వులు నిరాశ చెంది చేతనాహీనులైరి. కొందరు డంభాచారులు వినాయకునికై వండిన పదార్థములన్నియు తాము తిని వినాయకుని నిందించిరి. ఆయన భక్తులు నిరాహారులై వినాయక ధ్యానమందు స్థిరులైరి. లోకులందరూ ధ్యాన నిరతులగుట గమనించి, వినాయక భగవానుడు సంతసించి, ఒకే సూర్యుడు అనేక ఘటములందు ప్రకాశించురీతిని, వారందరి గృహముల యందునూ ఒకేమారు ప్రత్యక్షమయ్యెను. వివిధ గృహములందు వివిధ రూపములతో ఎల్లరనూ ఆనందపరచుచుండెను. ప్రతి గృహమునందు ఎవరికి వారు వినాయకుడు తమ గృహమందే యుండెనని తలచుచుండిరి. వారందరూ ఆయనకు షోడశోపచారములతో పూజన మొనర్చిరి. కాశీరాజు తో సహా సర్వులు ఈ విధముగనే పూజించి భోజనమిడిరి. వివిధ చిత్రాన్నములు, వ్యంజనములు, అపూపములు, మోదకములు, పాయసము, ఓదనము, పంచామృతములు, ఈ విధముగ రకరకముల భోజనములు వివిధ గృహములలో సమర్పింపబడెను. కాశీరాజు వినాయకునికి భోజనమిడి, సభకేతెంచి సర్వుల ఇండ్ల యందు వినాయకుడు వివిధ రూపములతో భోజనము స్వీకరించుట తెలిసికొని "ఇది ఎట్లు సాధ్యము? ఈయన ఇచట నికటముననే కూర్చొనెను కదా! మరి ఇన్ని రూపములతో ఇన్ని విభిన్న గృహములలో ఎట్లుండెను?" అని తర్కించి, ఆశ్చర్య చకితుడై తుదకు ప్రసన్నుడయ్యెను.

ఇంతలో మరికర్ణికకు స్నానమున కేగిన సనక సనందులు స్నానమాచరించి, నిత్య కర్మానుష్ఠానము కావించి భోజనార్థమై కాశీ నగరము లోనికి ఏగిరి. వారు ఏ గృహమున కేగిననూ అచట వినాయకుడు యుండుట కాంచిరి. ఒక గృహమందు ఆయన శయ్యపై నిద్రించు చుండెను. ఒకచోట ఫలములు భుజించుచుండెను. ఒకచోట తాంబూల చర్వణము చేయుచూ మరియొకచోట చందనాదులు అలదుకొనుచుండెను. ఒకచో వేశ్యలచే కావింపబడుచున్న నృత్యము తిలకించుచుండెను. ఒకచో అక్షక్రీడలాడుచుండెను. ఒకచోట అలంకరణము, మరియొకచోట దివ్య దుకూల ధారణము చేయుచుండెను. ఒక చోట ధ్యానము, మరియొక చోట అధ్యాపనము, ఒకచో భక్తుజనులచే స్తుతింపబడు చుండెను. ఒక చోట ఆయనే జగదీశ్వరుని స్తుతించుచుండెను. ఒకచోట భక్తులకు తన దివ్య విభూతులు దర్శింపజేయుచుండెను.

ఒకచోట యువకుడై చిత్తాపహరణ మొనర్చు ఇందువదనలతో రమించుచున్న వినాయకుని, మరొకచోట వృద్ధుడైన వినాయకుని, ఒకచో చికిత్సకుడైన వినాయకుని, ఒకచోట తప్పటడుగులు వేయుచున్న బాల వినాయకుని, ఒకచోట కందుక క్రీడ, మరొకచోట మట్టి తినుచున్న వినాయకుని గాంచి వారిరువురు భ్రమితులై, క్షుదార్తులై "ఈ నగరమందు శుక్లుడు అను నిర్మల బ్రాహ్మణుడుండెను. ఆయన ఇంటికి చనెదము" అని అచటి కేగిరి. అచటను వారికి గృహ ప్రాంగణమందు కూర్చొని యున్న వినాయకుడు కనబడెను.

అంతవారు "ఈ నగరమున భోజనము స్వీకరింపరాదు" అని నిర్ణయించుకొని వెనుకకు తిరిగిరి. ఎదురుగా వినాయకుడు; ప్రక్కలకు చూడగా అచటనూ వినాయకుడు; క్రింద, పైన, సర్వదిశలయందు వినాయకుడు దర్శనమిచ్చుచుండెను. వారు నిమీలిత నేత్రులై శివకేశవులను ప్రార్థించిరి. అంత వారికి శివకేశవ రూపములందున్న వినాయకుడు దర్శనమొచ్చెను. హృదయమందు సింహవాహనుడు, మహాముకుటుడు, కుండలాలంకృతాంగుడు, ముక్తమాలాధారుడు, సర్వాభరణభూషితుడు అయిన వినాయకుడు ఎట్లు కనిపించుచున్నాడో అట్లే కన్నులు తెరిచినపుడు ఎదురుగనూ అట్లే దర్శనమిచ్చుచున్నాడు. అంత అత్యంత తత్వజ్ఞానులయిన ముని ద్వయము తమ ద్వంద్వ బుద్ధిని, భేద దృష్టిని, విడనాడి వినాయకుని పాదములపైబడి ఇట్లు స్తుతించిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి సనక సనందన గర్వభంగమను ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఐదవ అధ్యాయము

(సనక సనందులచే వినాయక స్తుతి)

సనకసనందులు "పరాత్పరా! సర్వకారణ కారణా, బ్రహ్మస్వరూపా, సృష్టి స్థిత్యంత కారకా, నీకు నమస్కారము. నీవు మాయాధీశుడవు మరియు నానారూపధారివి. పంచమహాభూతములు మరియు యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులు సహితము నీవే! సర్వచరాచర స్వరూపమైన దేవదేవుని ఎవరు స్తుతింపగలరు? మేము సహితము నీ రూపమును వర్ణించుటకు "ఇది కాదు" "ఇది కాదు" అనే పలుకగలము. అజ్ఞానులమయిన మేము మోహాంధకారమున బడి మిమ్ము తెలిసికొనుటకు అసమర్థులమైతిమి. మీ మహిమను మేమెరుంగలేము. మీ చరణకమల దర్శనముచే మేము కృతకృత్యులమయితిమి" అని స్తుతించిరి. తన స్తుతిని విని సంతసించి మాయామానుష దేహధారి అయిన బాలవినాయకుడు "మీరిరువురు నా కృపచే సర్వజ్ఞులు, తత్వజ్ఞులు అగుదురు" అని పలికి అంతర్హితుడయ్యెను. అంత ఆ మునిద్వయము రత్నజటిత స్వర్ణ వినాయకుని అచట ప్రతిష్ఠించి, దాని చుట్టూ ఒక సుందర దేవాలయమును నిర్మాణమొనర్చి, అద్దానికి "వరద వినాయకుడు" అను నామమిడి, దానికి సమీపముననే "గణేశకుండము" ను స్థాపించిరి. ఏ వ్యక్తి ఈ గణేశ కుండమందు స్నానమాచరించి వరద వినాయకుని పూజన మొనర్చునో వారు తమ సంపూర్ణ మనోరథములు పూర్ణమొనర్చుకొని విద్య, ధన, ధాన్య, యశ, పుత్రపౌత్రాదులనొంది, తత్వజ్ఞాన ప్రాప్తులై, పరమందు వినాయక ధామమునకు చనెదరు. ఇందు సందేశము లేదు. తక్షణము దేవ, గంధర్వ, యక్ష, అప్సరాంగనలు ఏతెంచి ఆ వరద వినాయకునికి పూజనమొనర్చి అంతర్ధానమొందిరి. ఆ దృశ్యమును కాంచి సనకసనందులు విస్మయమై, తామును మనసున ఆనందము నొంది, స్వర్గలోకమున కేగిరి. అంత కాశీరాజు తన కుటుంబ అమాత్యుల సహితుడై ఏతెంచి వరద వినాయకునికి నానా ద్రవ్యములు సమర్పించి, పూజనమొనర్చి, అనేక ముత్యములు, రత్నములు, ఫలములు దక్షిణగా సమర్పించి పరమ

భక్తితో బ్రాహ్మణ సహితుడై మంత్రపఠనము చేసి, తదుపరి పూజ యొనరించిన బ్రాహ్మణునికి సహితము దక్షిణ యొసంగి తన మందిరమున కేగెను. తదుపరి ఆమాత్యులు, నగరవాసులు యధాయోగ్యముగ వరద వినాయకుని పూజించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సనక సనందనాదుల వినాయకస్తుతి అను ఇరువది ఐదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఆరవ అధ్యాయము

(వ్యాధుని చరితము)

బ్రహ్మ "విదర్భ దేశమందు "మదిష" అను నగరముండెడిది. అయ్యది కుబేరుని అలకాపురి శోభతో వర్ధిల్లెడిది. ఆ నగరమందు "భీముడు" అను వ్యాధుడు (జంతు మాంస విక్రేత) యుండెడివాడు. సాధారణముగ ఇతరుల దోషములెంచుట, తెలుపుట కూడా దోషమయినప్పటికీ, ఎవరేని ప్రశ్నించినపుడు మత్సరము, ఈర్ష్య, ద్వేషములు, లేకుండ యదార్ధము వచింపవచ్చు. అతడు ఎల్లప్పుడూ ధనుర్బాణములు ధరించి, సాయుధుడై కుటుంబ పోషణ కొరకు నిత్యము వన్య ప్రాణుల వధించువాడు. అంతేకాక నిర్దయుడైన భీముడు వనమందు ప్రయాణీకులను, నిస్సహాయులైన బ్రాహ్మణులను, సహితము వధించువాడు. కాలము ఇట్లు నడచుచుండగా నగరమందు ఒక మహోత్సవము జరుపుటకు పెద్దలు నిర్ణయించిరి. అందువలన వ్యాధుడు ఎక్కువ మాంసమునమ్మి ధనార్జన కావించుటకై ఉదయముననే సాయుధుడై వేటకేగి అనేక మృగములను వేటాడి వాటిని నగరమునకు తెచ్చుచుండెను. దారిలో నరవాసన పసిగట్టిన "పింగాక్షుడు" అను రక్కసుడు, భయంకర రూపుడు, రక్త నేత్రుడు, శమింపరాని అగ్నివలె ఏతెంచెను. ఆ రక్కసుని గాంచి భీముడు భయకంపితుడై ఒక్క క్షణము మూర్ఛనొందెను. తదుపరి నెమ్మదిగా కనులు విప్పి తామిరువురు ఒక జమ్మిచెట్టు (శమీ వృక్షము) ఛాయన యందుట గమనించెను. తన ఆయుధములు అన్నియు క్రిందపడుటచే చేయునది లేక ఒక శమీవృక్షపు కొమ్మను విరిచి ఆ రాక్షసునిపై విసరెను. రాక్షసుడు ఆ ఘాతము నుండి తప్పించుకొను ప్రయత్నము గావించెను.

ఈ ప్రకియ యందు కొన్ని శమీ పత్రములు విడివడి ఆ శమీవృక్ష ఛాయన ప్రతిష్ఠింపబడిన ఒక గణపతి మూర్తిపై పడెను. ఆ విషయము వ్యాధ, రాక్షసులిరువురికీ తెలియకుండెను. వామనుడు బలి చక్రవర్తి పై విజయము సాధించిన అనంతరము ఇచట గణపతి ఆరాధన కావించుటచే గజాననుడు ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున వామనుడు గజాననుని దూర్వాంకురములతో, శమీ పత్రములతో పూజించెను. అందువలన శ్రీగణేశుడు లోకులచే కావింపబడు యజ్ఞ, తపో, దాన, వ్రతములు, సువర్ణ, రజిత, రత్నమణి, ముత్యములాదిగ కావింపబడు పూజన కంటె శమీపత్రములు, దూర్వాంకురముల చే పూజింపబడిన అత్యంత ప్రసన్నత నొందును. ఆ శమీ పత్రములు శ్రీగణేశునిపై పడిన తక్షణము పరాత్పరుడు వారిరువురూ తనకు పూజ కావించిరని తలచి, ప్రసన్నుడై, వారిరువురినీ తన ధామమునకు గొని వచ్చుటకు దూతలను పంపెను. శ్రీగణేశ సారూప్యము గల దూతలను కాంచినంతనే వ్యాధ, రాక్షసుల పాపములు అగ్ని యందు పడిన తృణముల వలె పటాపంచలై, దివ్య దేహములు ధరించి దివ్య విమాన మధిరోహించిరి. దూతలు వారిరువురికీ దివ్య దుకూలములు, సువర్ణ రత్నఖచిత ఆభరణములు, సుగంధ దివ్య లేపనములు, ప్రసాదించి, పూజించి, దేవ దుందుభులు మ్రోగుచుండగా శ్రీగణేశ ధామమునకు చనిరి. శ్రీగణేశుడు వారిని చేరదీసి, సారూప్యము ప్రసాదించి, ఒక కల్పము వరకు తన సాన్నిధ్యము నిచ్చెను.

ఈ విధముగ వినాయకుడు భావప్రియుడు. "ఏది ఇవ్వబడెను?" కంటె "ఎంత భక్తితో ఇచ్చితిమి" అనెడిది

ప్రధానము. ఆ భక్తి కారణమున శుక్లునకు అలకాపురి గృహముల వంటి వైభవము ప్రసాదించెను. అట్లే వినాయకునికి శమీపత్రపూజ అత్యంత ఇష్టము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వ్యాధుని చరితము అను ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఏడవ అధ్యాయము

(వ్యాధ రాక్షసుల పూర్వ జన్మము)

వ్యాసుడు "విరించీ! ఈ వ్యాధ, రాక్షసులు పూర్వజన్మమందు ఎవరు? వారి స్వభావము ఎట్టిది? వారు గజాననుని ఎట్లు ఆరాధించిరి? గజాననుడు వారికి ఎట్టి వరదానమిచ్చెను? శ్రీగణేశ లోకము ఎట్లుండును? ఆయనకు శమీ పత్రము ఎందుకు ప్రియము? ఈ వివరములన్నియు విస్తారమగ తెలుపవలసినది." విరించి "పూర్వకాలమందు "సుమతి" అను మహారాజు యుండెడివాడు. ఆయన వినీతుడు, ధార్మికుడు, దానశీలుడు, వేదవేదాంగ పారంగతుడు, వక్త, శుభలక్షణ యుక్తుడు, యజ్ఞనిరతుడు, అతిథి, దేవతా పూజాతత్పరుడు, అసంఖ్యాక చతురంగ బల సమేతుడు. ఆయనకు ఇరువురు అమాత్యులుండిరి. వారు "ధ్వజ" మరియు "శత్రుజిత్" అనువారలు. వారు ఇరువురు సర్వశాస్త్ర విశారదులు, బుద్ధియందు బృహస్పతి మరియు శుక్రుల సములు. ఆ మహారాజు యొక్క ధర్మపత్ని "మదనావతి". ఆమె త్రిలోకసుందరి, ధర్మశీల, పతివ్రత. దీనులు, వృద్ధులు, అతిధులు అనిన ఆమెకు మిక్కిలి దయ. ఆ రాజదంపతి యజ్ఞ, దాన, సాధుపూజ యందు సంలగ్నులై యుండెడివారు. ఆ రాజదంపతి అనిన ప్రజలకు ఎంతో గౌరవము. రాజులాచరింపవలసిన షడ్గుణములు (యాన, ఆసన, సంధి, విగ్రహ, సంశ్రయ, ద్వైధీ భావము) ఆయన నుండి ఇతర రాజులు సహితము నేర్చుకొనెడివారు. ఈ విధముగ ఎన్నో సంవత్సరములు సుమతి రాజ్యమును పాలించి ఒకనాడు అకస్మాత్తుగా మరణించెను. రాజ్యమంతయు శోక సంద్రమున మునిగెను. పతివ్రత అయిన మదనావతి రాజుతో సహా పరలోకము కేగెను. ఆ దంపతికి పుత్రసంతతి లేని కారణమున మంత్రులిరువురు యధావిధిగ శ్రాద్ధకర్మలాచరించిరి. గోదానాది దశదానములు కావించి, సర్వ విధములయిన కర్మలు పూర్ణమొనర్చిరి.

రాజదంపతి మరణించిన ఒక మాసానంతరము ఇరువురు మంత్రులు ఒక కులీనుడు, బుద్ధిమంతుడు, సత్వసంపన్నుడు, వీరుడు, సత్య పరాక్రముడు అయిన పురుషుని రాజుగా కొనిరావలెనని మంత్రాంగమొనర్చి, రాజుకు దాయాది అయిన "దుర్ధర్షుని" క్షేత్రజ పుత్రుడు, మహాబలశాలి అయిన "సాంబుని" సరి అయిన నాయకుడని తలంచిరి. అంత వారిరువురు బ్రాహ్మణులను, వైశ్యులను, నగర ప్రముఖులను, సర్వజాతుల ప్రముఖులను సంప్రదించి, వారి అనుమతితో ఒక శుభ ముహూర్తమున సాంబునికి యధావిధిగ పట్టాభిషేక మొనర్చిరి. అంత వ్యాసుడు "పితామహా! సాంబుడు దుర్ధర్షునికి క్షేత్రజ పుత్రుడెట్లయ్యెను?" అని ప్రశ్నించెను. బ్రహ్మ "దుర్ధర్షుడు పుత్రప్రాప్తికై ఎన్నో ప్రయత్నము లాచరించెను. కానీ దుర్భాగ్య వశమున వారికి పుత్రసంతతి కలుగకుండెను. ఆయన భార్య "ప్రమద" ఒక మత్స్యకులజునిచే ఆకర్షితురాలై, ఆతనితో సంగమించి తత్ఫలితముగ సాంబుని పొందెను. కానీ ఆ రహస్యము వారిరువరికీ తప్ప వేరెవరికీ తెలియకుండెను.

అమాత్యులిరువరు సాంబునికి సర్వ రాజ చిహ్నములు, చతురంగ బలములు, కోశము సమర్పించి, తమ విధి నిర్వహణ యందు తిరిగి నిమంత్రితులైరి. కానీ సాంబుడు ఆ అధికార బలముచే మదోన్మత్తుడై, మదిరా, మాంసాసక్తుడై,

నిరంతరము నీతి మార్గమునకు పరాఙ్ముఖుడై, భోగలాలసుడయ్యెను. లోకుల ధనమును హరించి, వారిని దేశ భహిష్కృతులను కావించెను. బ్రాహ్మణులను, సత్పురుషులను అవమానించెను. వంశపారంపర్యముగ వచ్చుచున్న వృత్తులను సహితము ఖండించెను. అమాత్యులిరువురు ఆతనికి ఎన్నో బుద్ధులు బోధించిరి. కానీ ఆతడు వారిమాట పెడచెవిని పెట్టెను. తిరిగి మరల మరల వారు నీతులు గరపుచుండుటచే సాంబుడు క్రోధోద్రిక్తుడై ఆ అమాత్య లిరువురినీ శృంఖలములచే బంధించి కారాగారవాసులొనర్చెను. అంత సాంబుని తల్లిదండ్రుల జోక్యము చేసికొని, వారు సహితము హితబోధ నొనర్చి "ఎవరి వలన నీకు రాజ్యమబ్బినదో వారిని కారాగారవాసుల నొనర్చుట గొప్ప పొరపాటు, మహాపాపమని" వక్కాణించిరి. ఆ దురాత్ముడు వారి సద్బోధను సహితము పెడచెవిని పెట్టి తన తల్లిదండ్రులను సహితము శృంశలములచే బంధించి వారిని కారాగారమందు త్రోసెను. సాంబునకు "దుష్టబుద్ధి" అను అనుంగు మిత్రుడు కలడు. వానిని ఆ రాజు తన సచివునిగ నియమించుకొని ఆతనికి సర్వసేన, అధికారము, దివ్య దుకూలములు, అసంఖ్యాక దాస దాసీజనమును ఒసంగి, సర్వులను దుష్టబుద్ధి అజ్ఞానుసారముగ నడచుకొమ్మని, అట్లుకాని ఎడల శిరశ్ఛేదము జరుగునని ఆదేశించి, తాను కాంతా భోగలాలసచే అంత:పురమున కరిగెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి వ్యాధ, రాక్షసుల పూర్వజన్మమను ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఎనిమిదవ అధ్యాయము

(సాంబ, దుష్టబుద్ధుల కథనము)

ఈ విధముగ దుష్టబుద్ధి రాజ్యపాలన కావించుచుండగా సాంబుడు సుందర స్త్రీ లోలుడై సంపూర్ణ భోగమనుభవించు చుండెను. ఆతని నీచత్వమునకు అంతులేదు. ఎక్కడైననూ సుందరమైన స్త్రీ యున్నదని తెలిసిన ఎడల, ఒకవేళ ఆ స్త్రీ కన్య, వివాహిత లేక విధవ, ఎవరైననూ, వారి సంరక్షకులు రోదించుచున్ననూ, ఆ స్త్రీలను బలవంతముగ తీసికొనివచ్చి అనుభవించెడివాడు. ఆ కాముకునకు జాతి, మత వివక్షత లేదు. పరస్త్రీ, పరధనమును, బలోపేతముగ లొంగదీసుకొనెడివాడు. "రాజా రాక్షస రూపేణ, వ్యాఘ్రరూపేణ మంత్రిణా" అన్నట్లు దుష్టబుద్ధి సహితము సాంబునికి తక్కువ గాక, ఈ దుశ్చర్యలన్నియు కావించెడివాడు. వారికి తల్లి, సోదరి, పరస్త్రీ అను భేదము లేవియునూ లేక, కేవలము సంభోగసుఖమే ప్రధానమగ జీవితము గడుపుచుండిరి. వారికి భ్రహ్మహత్య, స్త్రీహత్య, భ్రూణహత్య, మొదలగునవి కావించుటకు ఇంచుక సంకోచము లేకుండెను. ఈ విధముగ వారిరువురు పర్వతరాశులంత పాపములు సమకూర్చుకొనుటచే ఏ యతి, లేక బ్రాహ్మణుడు వారి ఇంట భిక్ష స్వీకరింపకుండిరి. ప్రజలు సహితము వారి నామములు ఉచ్ఛరింపరైరి. ఒకనాడు ఆ మిత్రులిరువురు వేట నిమిత్తమై విపినమునకేగి, అనేక మృగములను వేటాడి, వాటిని రాజ్యమున కంపి, ఇరువురు అశ్వారూఢులై వనాంతర్భాగమున కరిగిరి. ఆ సమయమున వారికి ఒక జీర్ణమయిన వినాయకాలయము కానబడినది. కానీ అందలి వినాయకమూర్తి శుభంకరముగ వెలుగొందుచుండెను.

ఆ వినాయక మూర్తిని శ్రీరామచంద్ర ప్రభువు తండ్రి అయిన దశరథ మహారాజు ప్రతిష్ఠించెను. పుత్రార్థమై దశరథుడు ఈ ప్రదేశమున శ్రీగణేశుని దశాక్షర మంత్రముచే తీవ్రముగ ప్రార్థించెను. శ్రీగణేశుడు ప్రసన్నుడై ఆయనకు సాక్షాత్కరించి, మనోవాంఛిత వరములిచ్చెను. తత్కారణమున దశరథుడు నలుగురు లోక ప్రసిద్ధులు, సర్వజ్ఞులు, మహావీరులయిన రామ, లక్షణ, భరత, శత్రుఘ్నులను నలుగురు పుత్రులనొందెను. అంత దశరథుడు ఆ ప్రదేశమున

వశిష్ఠునిచే వినాయక ప్రతిష్ఠాపనము ఒనర్చెను. వశిష్ఠుడు వినాయకుని ప్రతిష్ఠించి, దానికి "వరద వినాయకుడు" అని నామకరణమొనర్చెను. ఆ మూర్తి యొక్క దర్శనము, స్మరణ, పూజనము ఇప్పటికినీ చతుర్విధ పురుషార్థములు నొసంగును. ఈ దుష్ఠులయిన రాజు, మరియు అమాత్యుడు దర్శించినది ఈ మూర్తినే! వెంఠనే వారిరువురు పూర్వపుణ్యవశమున అశ్వములు దిగి, పుత్రపుష్పములచే ఆ వినాయకుని పూజించి, ప్రదక్షిణ మాచరించి, అక్కడి నుండి వెడలిరి. ఈ దుర్మార్గులిరువురు తమ జీవితకాలమందు కావించిన ఏకైక పుణ్యమిదియే! చిరకాలము వారు రాజ్యమును పాలించి, పీడించి మృతులైరి. ఈ పాపాచారులిరువురినీ గొనిపోవుటకు యమదూతలేతెంచి, పాశములతో బంధించి, యముని ముందు యుంచిరి. యముడు "వీరికి లేశమాత్రము పుణ్యము, అగణితమైన పాపము కలదని తెలిపి, వీరిరువురినీ "అవీచిమాన" నరకమందు పడద్రోయ వలసినది. పాప సమూహములకు సరి అయిన యమయాతనలను అనుభవించిన పిదప భూలోకమందు నీచ యోనులయందు విసరివేయవలసినది. వీరు చేసిన స్వల్ప పుణ్యమునకు శ్రీగణేశుడు స్వయముగ ఉద్ధరించును" అని పలికెను.

అంత మిత్ర ద్వయమును తొలుత యమదూతలు లోహ దండములతో దండనమొనర్చి, ఒక్కొక్క నరకమందు వంద సంవత్సరములు చొప్పన కుంభీపాకము, శోణితోదము, రౌరవము, కాలకూటము, తామిస్రము, అంధతామిస్రము, పూయశోణిత కర్దమము మొదలగు నరకములందు పడదోయబడిరి. తదుపరి సూచీముఖము అను నరకమందు సూదుల వంటి ముక్కులు గల క్రిములచే భక్షింపబడి క్షతగాత్రులైరి. తదుపరి అసిపత్ర వనము అను వనము నందు శస్త్రములే ఆకులుగా గల వృక్షములచే శరీరములు ఛిన్నాభిన్నమయినవి. తదుపరి తప్తశిలా నరకమందు వేడి వేడి శిలలపై పరుండబెట్టి లోహ దండములతో ప్రహరింపబడిరి. వారి శరీరములు చూర్ణమయినవి. ఈ విధముగ ఇరువది ఒక్క నరకము లందు వివిధములుగ శిక్షింపబడిరి. వీరి పాపక్షయమునకై అనుభవించిన బాధలు తెలుపుటకు సహస్రఫణుడైన శేషుడు సహితము అసమర్థుడగును. చివరకు పాపము కొంత క్షయమై, నరకమందు వేలాది వత్సరములు గడిపిన మీదట తిరిగి భూమిపై కాకి, గుడ్లగూబలుగ; కప్ప, బల్లులుగ; సర్పము, తేలుగ; కుక్క, పిల్లులుగ; ముంగిస, పందులుగ; తోడేలు,నక్కలుగ; గుర్రము, గాడిదలుగ; ఒంటె,ఏనుగులుగ; మొసలి, మత్స్యములుగ; పులి, మృగములుగ; అబోతు, గేదెలుగ; ఛండాలురుగ జన్మించి రాజు సాంబుడను వ్యాధునిగ, దుష్టబుద్ధి పింగాక్షుడను రాక్షసునిగ జన్మించిరి. కానీ జన్మాంతర పుణ్య విశేషముచే వారిరువురు వినాయక మూర్తిపై అప్రయత్నముగ శమీ పత్రములుంచుటచే, దివ్యదేహులై, శ్రీగణేశథామమునకేగిరి. గజాననుడు శమీపత్ర పూజచే అత్యంత ప్రసన్నుడగును. ఇపుడు వామనుడు వినాయక మూర్తిని స్థాపించిన వైనమంతటినీ వివరించెదను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సాంబ, దుష్టబుద్ధుల కథనము అను ఇరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది తొమ్మిదవ అధ్యాయము

(కశ్యప సంతతి చరితము)

బ్రహ్మ "నేను కశ్యపునకు సృష్టి చేయమని ఆజ్ఞాపించితిని. ఆతడు వినీతుడు, మనోజ్ఞాని, త్రికాలద్రష్ట, సూర్యాగ్నుల కంటె మహాతేజస్వి. ఆతడు సృష్టి చేయు సంకల్పముతో ఆ సామర్థ్యమొందుటకు షడక్షర మంత్రముతో గజాననునికై అత్యంత కఠోర తపమాచరించెను. ఒక వేయి సంవత్సరములు గడచిన పిదప శ్రీగణేశుడు ఆయనకు సాక్షాత్కరించి

తగిన వరము లొసంగెను. అటు పిమ్మట కశ్యపుడు ఏది మనసున తలచిన అయ్యది ఆయన ఎదుట సాక్షాత్కరించెను. ఆ వర ప్రభావమున ఆయన తన పదునాల్గు మంది భార్యలతో సంభోగించి ఈ స్థావర జంగమాత్మకమైన జగత్తునంతటినీ ఉద్భవింపజేసెను. ఆయన భార్యలందలి యందును అదితి, దితి ప్రసిద్ధులు. అదితి పదివేల సంవత్సరములు విష్ణు భగవానునికై తపమాచరించి దుష్ట దనునుడు, ధర్మసంరక్షుడైన శిశువుగా ఆయననే పొందెను. తదుపరి ఒకనాటి సాయంత్రము కశ్యపుడు హోమమాచరించుటకు ఉద్యుక్తుడగుచుండగా దితి ఆయనను సమీపించి "స్వామీ! ఇది ఋతుకాలమగుటచే నన్ను కామాగ్ని దహించుచున్నది. నాతో సంభోగమొనర్చి నన్ను రక్షింపవలసినది." కశ్యపుడు "ప్రియసతీ! ఇది ఘోరకాలము. ఇంచుక తాళుము. నేను హోమము కావించిన పిదప నీ కోరిక తీర్చెదను. ఈ సమయమందు సంగమించిన ఎడల దేహద్రోహులు, ధర్మద్రోహులు జన్మించెదరు." కానీ దితి కామపీడనమును తాళజాలక రక్తనయనయై, ఆ మహాముని చేయిపట్టి "స్వామీ! ధర్మద్రోహులు జన్మించిననూ పరవాలేదు. మీరు నాతో సంగమింపని ఎడల నేను దేహత్యాగము కావించెదను" అని పలికెను. అంత కశ్యపుడు వేరొకటి చేయునది లేక ఆమెను సురత సుఖము నందు తేల్చి, అటు పిమ్మట స్నానమొనరించి హోమము పూర్ణము కావించెను.

అటు పిదప దితి అత్యంత బలశాలురయిన హిరణ్యకశిపు, హిరణ్యాక్షులకు జన్మనిచ్చెను. వారు ఇరువురూ పంచాక్షరీ మంత్ర ముచ్చరించుచూ ఒంటికాలిపై నిలబడి అనేక వర్షములు తీవ్రతపమాచరించిరి. వారి చుట్టూ వల్మీకములు ఏర్పడినవి. అంత కృపానిధి అయిన పరమేశ్వరుడు వారికి ప్రత్యక్షమయ్యెను. అంత సోదరులిరువురు అత్యంత భక్తి ప్రపత్తులతో ఆయనను ఇట్లు స్థుతించిరి "దశభుజా! వృషభవాహనా, చంద్రశేఖరా, సర్పహారధరా, పార్వతీపతీ, అంబాధరా, జగత్కారణా, వ్యాఘ్ర గజచర్మాంబరధరా, త్రినేత్రా, త్రిశూలధారీ, చతుర్విధ పురుషార్ధ ప్రదాతా, భక్తుల కోర్కెలను పూర్ణమొనరించు మహాప్రభో, నీకు నమస్కారము." అంత శివుడు ప్రసన్నుడై వారిని మనోవాంఛితములను కోరుకొనమనెను. అంత సోదరులిరువురూ "మాకు యక్ష, రాక్షస, కిన్నెర, మానవ, పిశాచ, చారణాదులచే కానీ, సమస్త అస్త్రశస్త్రాళిచే కానీ, తడి పొడి వస్తువులతో కానీ, పృధివీ, జలములందు నివసించు జంతువులచేకానీ, స్థావర జంగమాదులచే కానీ, రాత్రి కానీ పగలుకానీ, పృధివ్యాకాశములందు కానీ, మాకు మృత్యువు యుండరాదు" అని పలికిరి. శివుడు "తధాస్తు అని అంతర్ధానుడయ్యెను. అంత సోదరులిరువురు సర్వ లోకములపై ఆధిపత్యము వహించి సుఖించుట నారంభించిరి. హిరణ్యకశిపునకు దైత్యకుల కంటకుడైన ప్రహ్లాదుడుదయించెను. ఆ బాలుని తీవ్ర విష్ణు భక్తి కారణమున హిరణ్యకశిపుడు అత్యంత క్రోధితుడై ఆ బాలుని ఎన్నో తీవ్ర శిక్షలకు గురిచేసెను. పర్వతముల నుండి త్రోయించెను. సముద్రముల యందు ముంచెను. విషము పానము చేయించెను. కానీ విష్ణు భగవానుడు అన్ని వేళలా ఆ పరమ భక్తాగ్రేసరుని కాపాడెను. సర్వలోక భయంకరుడైన హిరణ్యకశిపుని విష్ణు భగవానుడు నరశింహ రూపము ధరించి ఒకనాటి సాయం సంధ్యా సమయమున తన గోళ్ళతో చీల్చి సంహరించెను. అట్లే ఆ పరమాత్ముడు వరాహావతారము ధరించి సాగరమందు మునిగిన పృధివిని తన కోరలతో పైకి లేపి హిరణ్యాక్షుని సంహరించెను. ప్రహ్లాదుని కుమారుడు విరోచనుడు. ఈతడు సూర్య భక్తుడు. ఈతని భక్తికి మెచ్చి ఆదిత్యుడాయనకు ఒక దివ్య ముకుటమను ప్రదానము చేసి "ఈ ముకుటమును ఇతరులెవరైననూ స్పర్శించిన ఎడల ఇయ్యది నష్టమగును" అని తెలిపెను. విరోచనుడు "వల్లె" యని తన ముకుటమును జాగ్రర్తగా సంరక్షించు కొనుచూ త్రిలోకాధిపత్యము నొందెను. దేవతలు స్థానభ్రష్టులై విష్ణు భగవానుని ఆశ్రయించిరి. విరొచనుడు భక్తుడగుటచే విష్ణువు ఈ సమస్యకు కించిత్ చింతించి, ఒక సుందర లావణ్యవతి అయిన స్త్రీ రూపము ధరించి విరోచనునితో చిరకాలము రమించెను. అంత విరోచనుని మనసు చంచలమై ఆమెతో సంభోగమునకు సిద్ధమయ్యెను. అంత ఆ అతివ విరోచనుని అభ్యంగన స్నాన మొనర్పమని ఒయ్యారముగ అడిగెను. కామాంధుడైన రాజు "వల్లె"

అనెను. అంత ఆ ఇగురుబోడి ఆయన శరీరమును సుతారముగ మర్దించుచూ ఆతని ముకుటమును తీసి శిరముపై తైలము నుంచి మర్దించెను. తక్షణము ఆ ముకుటము నూరు ముక్కలైనది. విరోచనుడు సహితము అదే స్థితినొంది మరణించెను.

(శ్రీగణేశపురాణమందు కశ్యప సంతతి చరితమను ఇరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పదియవ అధ్యాయము

(వామన జననము)

బ్రహ్మ "విరోచనుని పుత్రుడు "బలి". ఈయన గొప్ప హరిభక్తుడు. వేద వేదాంగవేత్త. బుద్ధిమంతుడు మరియు సర్వశాస్త్ర విశారదుడు, పరనింద, పరద్రవ్యము, మరియు పరద్రోహమునకు పరాఙ్ముఖుడు. దానశీలి, యజ్ఞకర్త, సామాన్యులకు సహితము కొంగుబంగారము. ఆయన కూర్చున్నపుడు, నిలుచున్నపుడు, నిద్రించినపుడు, భోజనమాచరించినపుడు, సర్వకాల సర్వావస్థల యందునూ హరిధ్యానము చేయువాడు. అందువలన ఆయన తండ్రి మరణమునకు శోకింపకుండెను. ఒకనాడు ఆయన తన గురువైన శుక్రాచార్యుని చేరి పూజనమొనర్చి "గురువర్యా! ఇంద్రాదులు మన సోదరులు కదా! దేవతలు ఏల అమరావతిని భోగించుచున్నారు? అమరావతి మన పరిధి యందు, పాలనయందు ఏల లేదు? దయచేసి ఈ సంశయమును నివారింపవలసినది" అని పలికెను. అంత శుక్రుడు "ఓ! మహాభాగా! కేవలము ఈ కారణము చేతనే మీ పూర్వీకులందరూ దేవతలతో విగ్రహమొనర్చిరి. దేవతలు విష్ణువు సహకారముతో మాయలల్లి దానవ నాశనమొనర్చిరి. అందువలన నీవు వైరము వదలి ఒక వంద అశ్వమేధ యాగములు ఒనర్చవలసినది. ఆ పుణ్యబలము చే నీవు ఇంద్రపదవి అధిరోహింప గలవు." అంత బలి "ఓ! నీతిశాస్త్ర విశారదా! మీరు సత్యము పలికితిరి. సామ, దాన, భేద, దండములందు దండము అధమము."

తదుపరి బలి చక్రవర్తి వశిష్ఠాది మునులను రావించి ఒక శుభ ముహూర్తమున యజ్ఞారంభము కావించెను. ఋషులు తూర్పుదిక్కున యజ్ఞ కుండములు నిర్మించి స్వస్తివాచకము, మాతృకా పూజనము, అభ్యుదాయక శ్రాద్ధకర్మమాచరించి సమంత్రకముగ మండపములందు దేవతలను ప్రతిష్ఠించిరి. రాజు తన పత్ని, అమాత్యులు, రాజ పరివారము శ్వేత వస్త్రధారులై ఆ మండపమందు శోభించిరి. నగరవాసులు ఆ గవాక్షములనుండి ఆ యజ్ఞమును వీక్షించుచుండిరి. కల్పోక్త ప్రకారము విహితమంత్రములతో యథావిధిగ హవనమారంభించి. యజ్ఞ పశువును స్వీకరించి, సర్వాంగ పూజనమొనర్చిరి. ఆ యజ్ఞవాటి యందు ఒక ప్రక్క శాస్త్రచర్చలు, మరొక ప్రక్క అప్సరసలు నృత్యములు, మరొక ప్రక్క వైదిక విద్వాంసుల వేద పఠనము, మరొక ప్రక్క భజనాదులు, వేరొక ప్రక్క షడ్రుచులతో భోజనములు, మరొక ప్రక్క పురాణ శ్రవణాదులు జరుగుచున్నవి. హవనమయిన పిదప వశిష్ఠాది ఋషులు ప్రజ్వలించుచున్న అగ్ని యందు వసోర్ధార పోసి ఉత్తరాంగన పూజన మొనర్చిరి. అటు పిదప రాజదంపతిని ఒక రథమధిరోహింప జేసి, వాద్యములు ఘోషించుచుండగా, వంది మాగధులు కీర్తించుచుండగా, వేద పండితులు వేదపఠనము చేయుచూ సామగాన మాలపించుచుండగా, ఋషులు వారిని అవభృతస్నానము ఆచరింపజేసి, వెనుకకు తీసికొని వచ్చి తిరిగి విష్ణుపూజ కావించిరి. బలిచక్రవర్తి ఆ ఋత్విజులకు అనంత స్వర్ణరత్న రాశులను, వస్త్ర, గోవులు, గజాశ్వ, సుగంధ పదార్థములను, ఎవరికి నచ్చిన వస్తువులను వారికి దానమిచ్చెను. అంత యజ్ఞము పూర్ణమయినది. ఈ విధముగ తొంభయితొమ్మిది యజ్ఞములు పూర్ణమొనర్చి వందవ యజ్ఞము ఆరంభించెను.

అంత స్వర్గాధీశుడైన ఇంద్రుడు చింతాక్రాంతుడై వైకుంఠమునకేగి క్షీరసాగర శయనుడైన విష్ణుభగవానునికి నమస్కరించి స్థుతించెను. ఆ సమయమున బ్రహ్మ ఆయన పాదసంవాహనమును, నారద తుంబురాదులు హస్తములందు వీణాధారులై ఆయన కీర్తి, గుణగానమును కావించుచుండిరి. ఇంద్రుడు "ఓ! అనంత శక్తి స్వరూపా, విశ్వకారణకారణా, విశ్వపాలకా, విశ్వస్రష్టా, దైత్యహంతా, భక్త కామనా పూర్ణా, నీకు నమస్కారము! నమస్కారము!!" ఈ విధముగ పలికి ఇంద్రుడు బలి చక్రవర్తి చేష్టితములు, యాగముల గూర్చి తెలిపెను. విష్ణువు "ఇంద్రా! బలి నా భక్తుడు, తపస్వి, మరియు జితేంద్రియుడు. వేదవచనానుసారము ఆతడు తన తప:ఫలమును పొందవలెను. శుభమైననూ, అశుభమైననూ కర్మ ఫలమునీయక మానదు. ఇంద్రా! నీవు నీ మనస్సును స్థిరమొనర్చుకొనుము. నేను కార్యసిద్ధి కావింతును." ఈ విధముగ పలికి ఆ పరమాత్ముడు అదితి గర్భమున ప్రవేశించెను. నవమాసానంతరము అదితి ఒక శుభంకర బాలునికి జన్మనిచ్చెను. కశ్యపుడు యధోచితముగ కర్మలన్నియు కావించి అద్భుత శరీరుడైన ఆ బాలుని కాంచెను. ఆ బాలుడు చిన్నగా శిశు రూపమున యున్నప్పటికీ చతుర్భుజుడై, సర్వాభరణ భూషితుడై, దేదీప్యమానముగ వెలుగుచుండెను. అంత కశ్యపుడు సాక్షాత్ విష్ణు భగవానుడుదయించెననీ, ఆ బాలుని చూచి ఇట్లనియె "స్వామీ! నా తప, వంశ, నేత్ర, జ్ఞానములు, ఆశ్రమము ధన్యమయినవి. నేడు ధరిత్రి, స్వర్గ, పాతాళములు సహితము మీ దర్శనముచే ధన్యమయినవి." అంత శిశువు "నేను భూభార హరణమునకై, నా జ్యేష్ఠ భ్రాత అయిన ఇంద్రుని కార్యసిద్ధికి, అదితీ దేవి తప:ఫలితముగ మీకిరువురికీ ఆవిర్భవించితిని" అని పలికి, సామాన్య శిశువులా మారి రోదనము చేయుచూ తల్లి స్థనపానము కావించెను. తదుపరి కశ్యపుడు ఆ బాలునికి బ్రాహ్మణోచిత కర్మములన్నియు కావించెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి వామన జననమను ముప్పదియవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఒకటవ అధ్యాయము

(సుముఖ గణపతి చరితము)

బ్రహ్మ "కశ్యపుడు ఆ బాలునికి వేదాంగముల సహితముగ చతుర్వేదములను నేర్పించెను. ఒకనాడు బాలకుడు తన తండ్రి వద్దకు ఏతెంచి "తండ్రీ! ఈ భూభార హరణము ఎట్లు జరుగును? దేవతలు తిరిగి తమ పదవులు ఎట్లు పొందెదరు? అని ప్రశ్నించెను. అంత కశ్యపుడు "పుత్రా! నేను నీకు శ్రీగణేశుని ప్రసన్న మొనరించు సిద్ధ షడక్షర మంత్రముపదేశించెదను. సృష్టిస్థిత్యంతకారుడు, అనేక బ్రహ్మాండాధిపతి, సర్వకారణ కారుడు అయిన ఆ పరాత్పరుడు ప్రసన్నుడయిన ఏ కార్యమైననూ సిద్ధి నొందును. నీవు ఆయనను ప్రసన్నుని కావించుటకు యత్నింపుము." ఈ విధముగ పలికి కశ్యపుడు ఒక శుభ ముహూర్తమున శ్రీగణేశుని షడక్షర మంత్రమును ఉపదేశించెను. అంత బాలుడు తన తల్లిదండ్రుల వద్ద అనుమతి గొని తపస్సార్థము వనమున కేగెను. ఆతడు పలుతావుల తిరుగుచు చివరకు విదర్భ దేశమున లతావృక్ష పరివేష్టితమైన ఒక ఉత్తమ స్థలమునెన్నుకొని, అచట పద్మాసన స్థితుడై ఒక సంవత్సరము నిరాహారియై జితేంద్రియుడై తపమొనర్చెను. ఆ బాలుని ధ్యానపరాయణత్వమును గ్రహించిన శ్రీగణేశుడు సిద్ధి, బుద్ధి సహితుడై, మయూరవాహనుడై, దశభుజుడై, రత్నమాలాధరుడై, నాగయజ్ఞోపవీతుడై, సర్వాభరణశోభితుడై ప్రత్యక్షమయ్యెను. అంత బాలకుడైన వామనుడు దేవాధిదేవుడయిన శ్రీగణేశుని ఇట్లు స్థుతించెను "ఓ! అవ్యక్తా! జగత్కారణా, నీ సంపూర్ణ స్థుతిని వేదములు చేయలేవు. నీవు దేవాధిదేవుడవు. బ్రహ్మాండముల కధిపతివి; సర్వ సృష్టి కర్త, వేదాంత వేద్యుడవు. మాయాతీత స్వసంవేద్యా, నీవు సృష్టి స్థిత్యంతములు కావించు మహానుభావుడవు. సర్వరూపా, సర్వవిద్యానిధానా, సర్వభయహారీ, సర్వుల మనోకామనలను

పూర్ణమొనరించు స్వామీ! గుణత్రయరహితా, విఘ్నరాజా, తత్వజ్ఞాన ప్రకాశా, సర్వాంతర్యామీ! నీకు నమస్కారము!! నీకు నమస్కారము!!!

అంత శ్రీగణేశుడు "పుత్రా! నేను నీ యందు ప్రసన్నుడనైతిని. నీ తపము, స్తోత్రము ధన్యము. నీ మనోవాంఛితమును కోరుకొనుము." అంత వామనుడు "నీ స్వరూపమును బ్రహ్మాదులు, బ్రహ్మర్షులు, దేవతలు తెలియరు. అటువంటిది నీవు నాకు దర్శనమిచ్చితివి. అదియే పదివేలు. కానీ నీవు వరము కోరుకొనమనిన పిదప కోరుకొనకపోవుట అపచారము. అందువలన అడుగుచుంటిని. నాకు ఎప్పుడూ పరాజయము కూడదు. గెలుపే కలుగవలెను. నా ప్రయత్నమందు ఎన్నడునూ విఘ్నములు యుండరాదు. బలి ఇంద్రపదవికై యజ్ఞము లాచరించుచుండెను. ఇంద్రుడు నన్ను శరణు జొచ్చెను. అందువలన ఇరువురి కోరికలకు కార్యసిద్ధి కలుగునట్లు చేయవలసినది" అని పలికెను. అంత శ్రీగణేశుడు "ఓ! సువ్రతా! నా స్మరణముచే నీకు సర్వ కామనలు పూర్ణమగును" అని పలికి అంతర్ధానుడయ్యెను. అంత వామనుడు కాశ్మీర దేశమునుండి ఒక దివ్యశిలను తెప్పించి దానిని సుందర గణేశమూర్తిగా మలచి స్థాపించెను. ఆ మూర్తికి "సుముఖవినాయకుడు" అని నామకరణ మొనర్చెను. ఈ వినయకమూర్తి త్రినేత్రుడు, చతుర్భుజుడు, ప్రసన్నముఖుడు, మరియు సుందమయిన తొండముతో శోభిల్లువాడు. భక్తులకు అభయ ప్రదాత. ఈ మూర్తి యొక్క స్మరణము, దర్శనము, పూజనము సర్వ మనోకామనలను పూర్ణమొనరించును. వామనుడు ఆ మూర్తి చుట్టూ స్వర్ణరత్నఖచిత ప్రాకారము నిర్మించి, అచట ఒక బ్రాహ్మణుని పురోహితునిగ నియమించి, ఆ బ్రాహ్మణుని వృత్తిహేతువై అచట ఒక గ్రామము నిర్మించి, తగినంత ధనము నొసంగి శ్రీగణేశునికి త్రికాల పూజను ఆదేశించెను.

వామనుడు తన గృహమున కేగి, తన తల్లిదండ్రులకు తన తపము మరియు శ్రీగణేశ సాక్షాత్కారము గూర్చి తెలిపి, వారిని సంతోషపరచి, తిరిగి వారి నుండి అనుమతి తీసికొని బలిచక్రవర్తి కడకు బయలుదేరెను. వామనుడు కృష్ణజింక మృగచర్మము ధరించి, దర్భలు చేతబట్టి యజ్ఞవాటి యందు ప్రవేశింపగనే అచటి అహుతులందరూ ఆయన తేజము కాంచి విస్తుపోయిరి. అంత బలి ఒక్క ఉదుటున లేచి ఆ వటువును గాంచి ఇట్లనియె "ఓ! నాధా! మీరెవరు! ఎక్కడి నుండి ఏతెంచిరి? మీ తల్లిదండ్రులెవరు? నాకు తెలియజేయ వలసినది." వామనుడు "నాకు నా మాతా పితరుల స్మృతిలేదు. నన్ను అనాధ అని తలువవచ్చును. ఈ త్రిలోకములు నా నివాసమే! నాకు నా పర్ణకుటీర నిర్మాణార్ధము మూడడుగుల నేల నీయవలసినది" అని పలికెను. అంత శుక్రుడు బలితో "ఈ బాలుడు బ్రాహ్మణుడు కాడు. కపట వేషధారి అయిన విష్ణువు. ఈతనికి ఏమియునూ ఈయవలదు" అని తెలిపెను. బలి "గురువర్యా! మీ పలుకులు ఉచితము కాదు. ఒకవేళ హరి ఏతెంచిన ఎడల అయ్యది మన పూర్వ పుణ్య భాగ్యము. మన కడకు ఏతెంచిన ఈ హరి విముఖుడై చనిన ఎడల నా పుణ్యమంతయు నశించును. హరి కంటె దానమునకు పాత్రుడు వేరొకడు యుండునా? మీ పలుకులు నిజమై ఈయన హరి అయిన ఎడల నాకు అనంత పుణ్యరాశి దక్కును? అని పలికి వామనుని వంక తిరిగి "బ్రాహ్మణ వర్యా! నేను మీకు మూడడుగుల నేల దానమిచ్చుటకు నిశ్చయించితిని. దయచేసి సంకల్పింపవలసినది" అని పలికెను. వామనుడు "వల్లె" అనెను. బలి కమండలమందలి నీటినీ ధారగా పోయుచుండగా శుక్రుడు ఒక కీటక రూపము ధరించి ఆ ధారకు అడ్డుపడెను. అంత వామనుడు ఒక దర్భతో ఆ కమండలము లోనికి పొడచెను. శుక్రుని కన్ను ఒకటి అంధత్వము నొంది బయటకేతెంచెను. బలి వామనుని అంజలి యందు నీటిని విడచి మూడడుగుల నేల దానమొనర్చెను.

అంత వామనుడు శ్రీగణేశుని స్మరించి తన ఆకారమును వృద్ధి యొనర్చెను. తన శిరముతో రోదసి అంతయు నింపి, ఒక పాదముతో ఊర్ధ్వలోకములను, ఒక పాదముతో అధోలోకములను కొలచి, మూడవ పాదము బలి శిరముపై యుంచి అధోలోకములకు పొమ్మని ఆదేశించెను. బలి "స్వామీ! నీవు లేక నేనచట ఎట్లుండగలను?" అని ప్రశ్నించెను.

విష్ణువు "నీకు అచటనూ నా సాన్నిధ్యము లభించును. నీవు ఇంద్ర పదవి ఆశించుచుంటివి. నీ కోరిక సహితము నాకు సమ్మతమే! ఇంద్రుడు నన్ను శరణుజొచ్చెను. అందువలన ప్రస్తుతము యున్న ఇంద్రుడు తన పదవి ముగిసిన అనంతరము నీవు ఇంద్రుని వగుదువు. అంతదనుక నీకు దేవతలు సహితము ఈర్ష్యనొందు రసాతలమున అనేక భోగములు అనుభవించుము." దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. వారందరూ వామనుని స్తుతించి పూజన మొనర్చిరి. వామనుడు అంతర్ధానుడయ్యెను. బ్రహ్మ "ద్వైపాయనా! నీకు ఈ విధముగ వామనునిచే ప్రతిష్ఠింపబడిన లోక విఖ్యాతమగు సుముఖ గణపతిని గూర్చి తెలిపితిని. ఈ సుముఖ గణపతి "అదోషము" అను నగరమందు ప్రతిష్ఠితుడై, దశభుజుడై విరాజిల్లుచుండెను. అనుస్యూతముగ నీకు బలి, వామన చరితమును సహితము తెలిపితిని. ఇపుడు ఆ వినాయకాలయమునకు దక్షిణమునున్న శమీవృక్షము ఎందుకు వినాయకునకు ప్రియమైనదో తెలిపెదను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి సుముఖ గణపతి చరితమను ముప్పది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ముప్పది రెండవ అధ్యాయము

(ప్రియవ్రత చరితము)

బ్రహ్మదేవుడు "సాత్యవేతేయా! నీకు ఒక ప్రాచీన ఇతిహాసమును వినిపించెదను. ఇందు గజాననుడు ప్రియవ్రతునకు స్వయముగ తెలిపిన విశేషములున్నవి. గజాననుడు "ప్రియవ్రతా! నీకు శమీపత్రముయొక్క విశిష్ఠ మహిమను తెలిపెదను. నాకు యజ్ఞ, దాన, వ్రత, జప, పూజ, పుష్పార్చన కంటె శమీపత్ర సమర్పణ అత్యంత ప్రియము. "శమీ" అని పల్కుటచే వాచిక పాపములు, స్మరణముచే మానసిక పాపములు, స్పర్శనముచే కాయక పాపములు నష్ఠమగును. నిత్యము శమీవృక్ష పూజనము, ధ్యానము, నిధి ధ్యాసనములచే నిర్విఘ్నత, ఆయు:వర్ధనమ, జ్ఞానప్రాప్తి, పాపనాశనము, మనోకామనా సిద్ధి కలుగును. ఇందు సందియము లేదు." వ్యాసుడు "విరించీ! ఈ ప్రియవ్రతుడెవ్వరు? ఆయన శీలమెట్టిది? మహాత్ముడైన గజాననుడు ఆయనకు శమీ వృక్షము గూర్చి ఎందుకు తెలిపెను?" అని ప్రశ్నించెను. బ్రహ్మ "ఈ విషయమై ఒక పురాతన ఇతిహాసము కలదు. ఇయ్యది పార్వతీ పరమేశ్వర సంవాదము. ఒకనాడు జగజ్జనని పార్వతి తన పతిని చేరి "స్వామీ! మీకు నా యందు ప్రసన్నత యున్న ఎడల శ్రీగణేశునికి శమీ పత్రములన్న ఎందుకు అమిత ప్రియమో తెలియజేయవలసినది" అని అడిగెను. అంత శంభుడు "సుచిస్మితా! దీని విషయమై నీకు ఒక ఆఖ్యానమును వినిపించెదను. పూర్వకాలమందు "ప్రియవ్రతుడు" అను మహారాజు యుండెడివాడు. ఆయన బుద్ధిమంతుడు, సత్యవాది, ధర్మాత్ముడు, వ్రతాచరణుడు, తేజస్వి, దానశీలుడు, శాస్త్రార్థ తత్వజ్ఞాత, సర్వ శుభలక్షణ యుతుడు. చతుస్సాగరవలయ భూమండలమంతటినీ ఏకఛత్రాదిపత్యముగ పాలించుచూ ప్రజలను కన్నబిడ్డలవలె చూచుచుండెను. ఆయనకు "ధూర్తుడు", "కుశలుడు" అను ఇరువురు అమాత్యులుండెడివారు. వారు నీతిశాస్త్ర కోవిదులు, మరియు కార్తికేయుని వంటి పరాక్రమోపేతులు. ప్రియవ్రతునకు ఇరువరు భార్యలు. పెద్ద భార్య "కీర్తి". చిన్న భార్య "ప్రభ". చంద్రునిలోకూడా మచ్చ సహజము కదా! ఇన్ని సద్గుణములున్న మహారాజుకు గల దుర్గుణము సమానత్వపు లేమి. ఆయన చిన్న భార్య ప్రభ యవ్వనవతి, పరిపుష్ఠ శరీర శౌష్ఠవము కలిగినది, రంభాది అప్సరసల సౌందర్యమును తలదన్నునదగుటచే రాజు ఆమె అందచందములకు ముగ్ధుడై, ఆమెకు దాసుడై కీర్తి దేవిని సంపూర్ణముగ నిర్లక్ష్యము చేసెను. దివారాత్రములు ప్రభాదేవితో క్రీడించుచూ, ఆమె వియోగమును క్షణమాత్రము భరింపజాలకుండెను. అంతేకాక కీర్తిదేవి ఎడల సదా క్రోధితుడై, ఆమె ముఖము సహితము చూచుటకొల్లక, ఆమెను ఒక దాసి కంటె హీనముగ చూచుచూ, ఆమెను ద్వేషించువాడు.

ఈ విధముగ కాలము గడచుచుండగా నెమ్మదిగ ప్రభాదేవి గర్భవతియై ఒక పుత్రునికి జన్మనిచ్చినది. రాజు అత్యంత వైభవముగ జాతక కర్మాదులు నిర్వహించి ఆతనికి 'పద్మనాభి" అని నామకరణమొనర్చెను. ఆ పుత్రుడు సర్వ విధముల తండ్రి వలె బుద్ధిమంతుడు, యుద్ధ కుశలుడయ్యెను. ఆతనికి యుక్త వయస్సు వచ్చిన పిదప మద్రదేశాధీశుడయిన ప్రియవ్రతుడు పాంచాల రాజపుత్రిక తో తన పుత్రుని వివాహము వైభోగపేతముగ జరిపించెను. ఒకనాడు కీర్తిదేవి తన భర్తకు పాదసంవాహనము ఒనరించుటకు ప్రియవ్రతుని చేరగా, సపత్ని అయి ప్రభాదేవి ఆమెను దండముతో ఘాతమొనర్చెను. అంత కీర్తిదేవి మిక్కిలి అవమానము నొంది లజ్జితయై రోదించుచూ తన ఆవాసమున కేగెను. అంత ఆమె అత్యంత శోకతత్పరయై "నేను ఎవరిని శరణుజొచ్చెదను? ఎవరు నా దు:ఖమును దూరమొనర్చెదరు? నా సవతిచే అవమానితనైన నన్ను ద్రౌపదిని రక్షించిన విష్ణువు రక్షించునా? భర్తయే గౌరవించని స్త్రీకి మన్నన ఎచట లభించును? నా జీవితమునకు ప్రయోజనమేదయిననూ కలదా? నేను విషము సేవించికానీ, ఏదైన నూతిలోనికి దూకి గానీ ప్రాణత్యాగ మొనరింతును." ఈ విధముగ వ్యాకుల చిత్తయై, హృదయమందు దేనినీ నిర్ధారింపలేక రోదించుచూ సతమతమగుచుండగా ఆమె అదృష్టము పండి అచటకు రాజపురోహితుడైన దేవల మహర్షి ఏతెంచెను. ఆ ముని శ్రేష్ఠుడు దయాపూర్ణుడు. ఆయన కీర్తిదేవి కన్నీటికి కరిగి ఆమెకు సమస్త కామనలను పూర్ణమొనరించు శ్రీగణేశోపాసనను ప్రసాదించెను.

అంత కీర్తిదేవి మందారవృక్ష కాష్ఠముచే శ్రీగణేశుని ప్రతిమ చేయించి, ఒక శుభ ముహూర్తమందు స్నానాదులు కావించి, అద్దానిని ప్రతిష్ఠించి తీవ్ర పూజన మొనర్చెను. సర్వ సాధారణముగ జనులు పంచాయతనమందు శివ, విష్ణు, దుర్గ, సూర్యునితో పాటు వినాయకుని ఆరాధించెదరు. తత్వత:వీరికి భేదము లేదు. ఏ మానవుడు వీరియందు భేదము చూచునో ఆతడు నరకగామి అగును. ఒక్క పరమానంద పరమాత్మయే లోకానుగ్రహము ప్రసాదించుటకు అన్ని రూపములు ధరించెను. ఒకే మనుజుని తండ్రి, తాత, భ్రాత, పతి అని పలువురు పలుకరములుగ పిలుచునట్లు, ఒకే భగవంతుని వివిధ జనులు వివిధ రూపములతో ఇష్టపడి, ప్రేమించి, వివిధ నామములతో పిలుతురు. కీర్తిదేవి గజాననుని షోడశోపచారములతో పూజన మొనర్చి, పుష్పములతో, దూర్వాంకురములతో పూజంచి, దక్షిణ సమర్పించి ఇట్లు స్థుతించినది "జగదాధారా! సర్వకారణకారణా! నీవే త్రిమూర్త్యాత్మకుడవు. నీవే చంద్ర, యమ, కుబేర, వరుణ, వాయు, ఆది దేవతా స్వరూపుడవు. నీవే నదులు, సముద్రములు, లతలు, వృక్షములు. నీవే సుఖ, దు:ఖరూపము, మరియు హేతువు. పాశరూపము, ముక్తిదాతవు కూడా నీవే! విఘ్నకర్తా, విఘ్నహర్తా రెండునూ నీవే! విరాడ్రూపుడవీవే! ప్రకృతి పురుషులు, గుణరహిత, గుణసహితవు నీవే. త్రికాలములు, శత్రురూపము, శత్రుసంహారకుడవు నీవే! సర్వజ్ఞుడవు, కర్మకాండచే యజ్ఞము చేయించి, జ్ఞానకాండచే మనసును శుచి కావించువాడవు నీవే! సర్వసాక్షీ, సర్వత్రగామీ, సర్వవ్యాపీ, సర్వ సత్యమయ, సర్వమాయామయ, సర్వ మంత్ర, తంత్ర, జ్ఞాతవు నీవే! ప్రభూ నీకు నమస్కారము! నీకు నమస్కారము!! నీకు నమస్కారము!!!

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి ప్రియవ్రత చరితమను ముప్పది రెండవ అధ్యాయము సమాప్తము)

ముప్పది మూడవ అధ్యాయము

(క్షిప్ర ప్రసాద చరితము)

ఈ విధముగ కీర్తిదేవి అనుదినము శ్రీగణేశుని పూజన మొనర్చెడిది. ప్రతిదినము చెలికత్తెలు ఆమె పూజకై దూర్వాంకురములు తీసికొని వచ్చెడివారు. కొంత కాలమునకు జ్యేష్ఠమాస మంకురించి ఎక్కడనూ దూర్వాంకురములు

దొరకక వారు శమీపత్రములను తీసికొనివచ్చిరి. అంత కీర్తిదేవి శమీ పత్రములతో శ్రీగణేశునకు పూజనమొనర్చెను. అప్పటికి ఆమె వినాయక వ్రతమారంభించి ఒక సంవత్సరము గడచినది. ఆ పూజానంతరము ఆమె విశ్రాంతికై శయనించెను. అందు ఆమె ఒక దివ్య స్వప్నమును కాంచెను. అందు తాను అనుదినము పూజించు వినాయకమూర్తి దర్శనమిచ్చి ఇట్లనియె "ఓ! సుభ్రూ! నీవు కాంచిన శమీపత్ర పూజనముచే నేనత్యంత సంతుష్టిని పొందితిని. నీ మనోవాంఛితము తెల్పుము" అని పలికెను. కీర్తిదేవి మాట్లాడక మౌనముగ యుండెను. అంత గణపతి " నీ భర్త నీకు వశుడగును. నీవు పతి సహితవై అత్యంత దివ్య భోగములనుభవించెదవు. నీకు నాయందు అత్యంత భక్తి తత్పరుడైన ఒక మహా బలశాలి పుత్రుడుగ ఉదయించును. నీవు ఆతనికి "క్షిప్రప్రసాదుడు" అను నామము నుంచుము. ఆ బాలుడు నాల్గవ వత్సరమున విషభక్షణచే మృతుడయ్యి, తిరిగి గృత్సమదుడు అను ద్విజుని కృపచే పునర్జీవితుడగును. కాలాంతరమున ఆతడు భావిరాజై, దీర్ఘాయువై, ధర్మాచరణుడై విలసిల్లును. నీ ద్వారా కావింపబడిన స్తోత్రము నాకు అత్యంత ప్రీతిప్రదము. ఎవరు ఈ స్తోత్రమును పఠించెదరో వారి వంశము నందు రాజులు, జనులు, సర్వులు యుందురు. అంతేకాక వారు పుత్రవంతులు, ధనవంతులు, వేదవేదాంగ పారంగతులు, అయి, వారి బుద్ధి, మేధ ఇనుమడించును. త్రిసంధ్యల యందును ఈ స్తోత్రమును పఠించు జనులు, తమ మనో వాంఛితములు ప్రాప్తించి, నా యందు ధృఢ భక్తినొంది, మోక్షమును ప్రాప్తించెదరు." ఈ విధముగ వరప్రదానము గావించి శ్రీగణేశుడు అంతర్హితుడయ్యెను.

కీర్తిదేవి నిద్రనుండి లేచి, తన స్వప్నమును తలచి, మనసున ఇట్లు తలంచినది 'దీనబాంధవుడు అయిన శ్రీగణేశునకు నాపై కృప కలిగినది. అందువలననే నాకు స్వప్న దర్శనము ప్రసాదించెను. సర్వజీవ అనుకంపానిధి అయిన శ్రీగణేశుడు నన్ను అనుగ్రహించెను. నా తప:ఫలితముగ ఆ పరమాత్ముడు నాతో వార్తాలాపములు ఆచరించెను." అంత కీర్తిదేవి తిరిగి స్నానాదులొనర్చి, వినాయకుని తిరిగి పూజనమొనర్చి, అప్పటి నుండియు అనుదినము వినాయకుని అత్యంత నియమనిష్ఠలతో పూజనమొనర్చుచుండెను. తాను పూజించుచున్న శ్రీగణేశమూర్తిని పురోహితుల సహాయముతో స్థాపన మొనరించి, ఆ మూర్తిని పూజించుట మొదలిడెను. ఈ విధముగ కీర్తిదేవి మానసపూజ, నామ జపము, నిరంతర ధ్యానము కావించుచూ తగిన సమయము కొరకు వేచియుండెను. కొంత కాలమునకు రాజు యొక్క ద్వితీయపత్ని నిష్ప్రభయై, రక్తదోషము, పిత్త వికారమునకు గురియై రెండు కాళ్ళు, చేతులు, నాసికల నుండి నిరంతర రక్తస్రావము జరిగి భీభత్స రూపిణి అయ్యెను. కురూపి అయిన ప్రభాదేవిని ప్రియవ్రతుడు తన మనసు నుండి త్యాగమొనర్చి ఆమెను చూచుట, మాట్లాడుట మానివైచెను. ఒకనాడు ఆతడు కీర్తిదేవి గృహమునకు ఏతెంచి, తపశ్చర్యచే నిరుపమానముగ వెలుగుచున్న తన జ్యేష్ఠభార్యను చూచి, మైమరచి, ఆమెకు సంపూర్ణముగ వశుడయ్యెను. నిరంతరము ఆమెను సుఖభోగములందు ముంచెత్తుచూ, అనేక దివ్య వస్త్రాభరణములు బహూకరించుచూ ఆమె మనసుకు అమందానందము కలుజేసెను.

తత్ఫలితముగ కీర్తిదేవి గర్భవతియై, ఒక శుభముహూర్తమున ఒక అత్యంత సుందర శిశువుకు జన్మనిచ్చెను. ప్రియవ్రతుడు ఆనందము నొంది వైభవముగ ఆ బాలుని జాతకర్మములు ఒనర్చి, ఆతనికి "క్షిప్రప్రసాదుడు" అని నామకరణ మొనర్చెను. ఆ శిశువునకు నాల్గవ వత్సరమంకురించినది. ప్రభాదేవి క్షిప్రప్రసాదుడు ప్రియవ్రతుని జ్యేష్ఠభార్య పుత్రుగడుట వలన భావి రాజ్యాధికారి అగునని, ఒకనాడు రహస్యముగ ఆ బాలునికి విషపానమిచ్చెను. తక్షణము బాలుడు అపస్మారమొందెను. వెంటనే ప్రభ తన తప్పిదము కప్పిపుచ్చుకొనుటకు రోదన మారంభిచెను. అంత కీర్తిదేవి ఏతెంచి గజాననుడు తనకు తెలిపిన వృత్తాంతమును రాజుకు వివరించెను. అంత రాజు ప్రభాదేవిని గృహ భహిష్కరణ కావించి, భిషగర్వుచే చికిత్స చేయించెను. అంత కీర్తిదేవి తన కొడుకును ఎత్తుకొని వనమున కేగెను. మార్గమధ్యమున బాలుడు మరణించెను. అంత కీర్తిదేవి తుఫానునందు తెగిన తీగవలె విలవిలలాడుచూ, గుండెలు బాదుకొనుచూ రోదన

మారంభించెను. ఆ సమయమున దైవ వశమున ద్వితీయ భాస్కరుని వలె వెలుగొందు ముని ప్రవరుడు, శ్రీగణేశ పరమభక్తుడు గృత్సమదుడు అచటి కేతెంచెను. కీర్తిదేవి బాలుని ఆయన పాదముల వద్ద యుంచి "మహర్షీ! ఈ బాలుడు శ్రీగణేశునిచే నాకు ప్రసాదింపబడెను. దురదృష్ట వశాత్తు విషప్రభావమున మరణించెను. దయచేసి ఈ బాలుని మీ తపోబలముచే పునర్జీవితుని కావింప వలసినది. సత్పురుషుల దర్శనము వృథాపోదు. సజ్జనులు శరణాగతులను త్యజింపరు" అని పలికెను. గృత్సమదుడు ఒక ముహూర్తకాలము ధ్యానించి కనులు తెరచి "ఓ! దేవీ! నీ పుత్రుడు తిరిగి జీవించు ఉపాయము తెల్పెదను. వినుము. ఒకానొకనాడు నీవు తెలియక వినాయక ప్రభువును శమీ పత్రములతో పూజించితివి. ఆ పుణ్యమును ఈ బాలునికి ధారపోసిన ఎడల ఆతడు తిరిగి పునర్జీవితుడగును" అని పలికెను. వెంటనే కీర్తిదేవి తన పుత్రునకు ఆ పుణ్యమును ధారపోసెను. అంత బాలుడు నిద్రనుండి మేల్కొనినట్లు లేచి కూర్చొనెను. కీర్తిదేవి అత్యంత ప్రసన్నయై, కృతజ్ఞతా పూర్వకముగ మహర్షికి పాదాభివందనమొనర్చెను.

అంత కీర్తిదేవి "మహర్షీ! నేను శమీపత్ర పూజను కావించినట్లు మీకెట్లు తెలిసినది? నాకు ఈ శమీపత్ర పూజమహిమ తెలుపవలసినది. ఇకనుండి నేను అనుదినము శమీ పత్రములతోనే శ్రీగణేశుని పూజించెదను. గృత్సమదుడు "దేవీ! ఈ శమీపత్ర మహిమను పూర్ణముగ ఎవరు తెలుపగలరు? శమీపత్రము నామము స్మరించినంత మాత్రమున కోటి పాతకములు నష్టమగును. అయిననూ నా బుధ్యానుసారము సంక్షేపముగ తెలుపుటకు ప్రయత్నించెను. యజ్ఞ, దాన, తపో, తీర్థ సేవనము, గ్రీష్మ ఋతువునందు పంచాగ్నితపము, శీతాకాలమందు జలమందలి తపముచే ప్రాప్తించని పుణ్యము సహితము శమీపత్ర పూజనముచే కలుగును. ఏ వ్యక్తి ప్రాత:కాలమున గానీ, త్రిసంధ్యల యందు కానీ, శమీవృక్ష/పత్రస్మరణము, పూజనము, లేక శమీ పత్రములతో శ్రీగణేశుని పూజించునో, వారికి శ్రీగణేశుడు సర్వ కామనలు పూర్ణమొనరించి మోక్షమును ప్రసాదించును. ఇందు సందియము లేదు. ఈ విషయమై ఒక ప్రాచీన ఇతిహాసము కలదు. అయ్యది నారద మహేంద్ర సంవాదము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి క్షిప్ర ప్రసాద చరితమను ముప్పదిమూడవ అధ్యాయము సమాప్తము)

ముప్పదినాల్గవ అధ్యాయము

(శమీక మందార చరితము)

గృత్సమదుడు "ఒకానొక సమయమున పరమజ్ఞాని, భక్తాగ్రేసరుడగు నారద మహర్షి త్రిలోకములు సంచారమొనర్చుచూ ఇంద్రుని వద్దకేతెంచెను. ఇంద్రుడు ఆయనకు యథోచితముగ పూజనమొనర్చి "ఔరవుని" (కాష్ఠ మందలి అగ్ని) గూర్చి ప్రశ్నించెను. అంత నారదుడు "మహేంద్రా! మాళవ దేశమందు "ఔరవుడు" అను బ్రాహ్మణుడుండెడివాడు. ఆయన విద్వాంసుడు, వేద వేదాంగ వేత్త, సూర్య సమాన తేజస్వి, స్వపత్నీరతుడు, సమ లోష్టాశ్మకాంచనుడు, మేధావి, అగ్నివలె తేజరిల్లువాడు. ఆయన ధర్మపత్ని "సుమేధ". ఆమె సహితము భర్తకు తగిన ఇల్లాలు. ధర్మనిరత, సౌందర్యలహరి; ఎల్లప్పుడూ సర్వాభరణ భూషితయై పతిశుశ్రూష కావించెడిది. ఆ పుణ్యదంపతికి కాలక్రమమందు ఒక సుందరమయిన బాలిక జన్మించినది. ఆమెకు "శమీక" అని నామకరణమిడి అల్లారుముద్దుగ పెంచిరి. అత్యంత రూపవతి అయిన ఆ కన్యకు ఏడవ ఏడు వచ్చిన పిదప ఔరవుడు వరాణ్వేషణ కావించి, దౌమ్యుని పుత్రుడు, శౌనకుని శిష్యుడు దాంతుడు, గురుసేవా తత్పరుడు, శాంత స్వభావి, వేదవేదాంగ పారంగతుడు, తేజోరాశి

అయిన “మందారుడు” అను బాలుని గూర్చివిని, ఆ బాలుని రావించి వివాహ ప్రక్రియ కావించెను. అనంతరము మందారుడు తన ఆశ్రమమునకు చనెను. కొన్నేళ్ళు గడచిన పిమ్మట మందారుడు తన భార్య యవ్వనవతి అయినదని తెలిసి తన అత్తవారింటికి ఏతెంచెను. ఔరవుడు ఆతని మిక్కిలి సన్మానించి, భోజనాదులర్పించి, అనేక కనక, ధన, రత్నరాశులొసంగి, కన్యా సహితముగ ఆతని వెంట పంపుచూ “ఓ! బ్రాహ్మణపుత్రా! నేను ఈ నా పుత్రికను నీకు విధి విధానముగ ఒసంగితిని. ఈమెను నీవు అత్యంత ప్రేమ, స్నేహము, జాగరుకతతో దాంపత్య మొనరింపవలసినది” అని పలికెను. మందారుడు “వల్లె” అనెను. శమీక మందారులు వెంటనే గురుకులమునకు ఏగక వనమందు ఎన్నో వినోదములతో రమించుచుండిరి.

కాలము ఎల్లప్పుడూ ఒకే విధముగ యుండదు కదా! ఒకనాడు వారి కడకు భృశుండి మహర్షి ఏతెంచెను. ఆయన ప్రసన్నుడయిన ఈశ్వరుని వలె వరములు కురిపించును. రుష్టుడయిన ఎడల అగ్ని వలె భస్మీభూతుల నొనరించును. దీర్ఘ తపమాచరించుటచే ఆయన భ్రూమధ్యము నుండి తొండమంకురించనది అని తొలుత తెలిపితిని కదా! శమీక మందారులు యవ్వన చాపల్యము చే ఆ మహర్షిని కాంచి పరిహాసముగ నవ్విరి. అంత ఆ మహర్షి ఆగ్రహించి “మందబుద్ధులారా! మీరు మదోన్మత్తులై పళ్ళు బయటపెట్టి నా ఎడల పరిహాసముగ నవ్విరి. అందువలన సర్వ ప్రాణుల చే వర్జింపబడు వృక్షములుగ మారిపొండు” అని శపించెను. అంత వారిరువురు ఆయన పాదములపై పడి క్షమాభిక్షకై ప్రార్థించి, శాపవిమోచన మడిగిరి. అంత మహర్షి “మీరు నా తొండము చూచి పరిహసించిరి గావున, తొండము గల దేవుడు (వినాయకుడు) మీ ఎడల ప్రసన్నుడయిన ఎడల మీ రూపములు మీకు తిరిగి సంక్రమించును” అని పలికి తన ఆశ్రమమునకు చనెను. తక్షణము మందారుడు మందారవృక్షముగనూ శమీక కంటక సహిత శమీ వృక్షము గానూ రూపాంతరము చెందిరి. శాప వశమున ఏ ప్రాణియు ఆ వృక్షముల వద్దకు రాకుండెను.

అత్తవారింటికేగిన మందారుడు ఎంత కాలమునకు గురుకులమునకు రానందున శౌనకుడు వ్యధనొంది, శిష్య సహితుడై ఔరవుని గృహమునకు ఏతెంచి మందారుని గూర్చి ప్రశ్నించెను. ఔరవుడు తాను కావించిన క్రియలన్నియు తెలిపి, తన కన్యను సహితము తన అల్లునితో పంపితినని తెలిపెను. అంత ఔరవ, శౌనకులు చింతాగ్రస్తులై “ఈ పిల్లలకు ఏమైనది? సింహ, వ్యాఘ్ర, తరక్షువులు సంకరింపలేదు కదా? చోరులు లేక సర్పదష్టులు కాలేదు కదా?” ఇట్లు పరిపరి విధముల చింతించి, చివరకు ఇరువురు కలసి వనమునందు వెదకుటకు బయలుదేరిరి. కొంత సేపటికి వారిరువురు పిల్లల పద చిహ్నములు గుర్తించి, స్నానమాచరించి, ధ్యానమగ్నులై, సర్వమును తెలిసికొని, శాపవశమున వృక్షములైన సంగతి కనుగొని ఇరువురు అత్యంత శోకతప్తులైరి. శౌనకుడు “ఈ బాలుని నా వద్ద విద్యార్థము ఈతని తండ్రి వదలెను. ఈ విషయము ఆయనకు ఎట్లు తెలిపెదను?” అని అత్యంత శోక విహ్వలుడయ్యెను. ఔరవుని పరిస్థితి అట్లే యుండెను. అంత ఆ మహాత్ములిరువురు తాము శ్రీగణేశుని ఆరాధించి వీరికి శాప విమోచనము ప్రార్థించెదమని నిర్ణయించిరి. అంత వారు శుచియై, నిరాహారులు, వాయుభక్షకులై, ఒంటికాలి బొటన వ్రేలిపై నుంచొని, ఆకాశము పై దృష్టి సారించి, శ్రీగణేశుని షడక్షర మంత్ర జపము కావించుచు పన్నెండు వత్సరములు తపమాచరించిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి శమీక మందార చరితము అను ముప్పది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఐదవ అధ్యాయము

(శమీక మందార కధనము)

బ్రహ్మ "ఈ విధముగ తపమాచరించుచున్న ఇరువురి యందు ప్రసన్నుడై శ్రీగణేశుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున ఆయన దశభుజుడు, పాశాంకుశధారి, మహాతేజస్వీ, ముకుటకుండలాలంకృతాంగుడు, అంగద, కటిసూత్ర, నాగ యజ్ఞోపవీతుడు, సింహారుఢుడై యుండెను. అంత వారిరువురు అంజలి ఘటించి ఇట్లు స్తుతించిరి. "విశ్వబీజా, విశ్వరక్షా, భక్తజనానందప్రదాతా, విఘ్నహరణా, పరాత్పరా, వేద వేదాంతవేద్యా, నీకు నమస్కారము. త్రిమూర్తులు, శేషుడు, కార్తికేయుడు, మీ స్వరూపమును తెలియరనిన మేమెంత? మీ కృప ఎవనియందున్నదో వారు వారి యొక్క శుభాశుభ ఫలితములను అనుభవించుచున్ననూ జీవన్ముక్తులే! మీరు అనంత సంసార సాగరమున ముక్తికి హేతువు. భక్తుల కోరికలు ఫలవంతమొనర్చుటకై మీరు అనేక అవతారములు స్వీకరించెదరు. స్వామీ! మేము మా మనసా, వాచా, కర్మణా మీకు నమస్కరించుచున్నాము. అంత శ్రీగణేశుడు "భక్తులారా! మీ తపమునకు మెచ్చితిని. మ మనోవాంఛితమేమి? మీరు కావించిన ఈ స్థోత్రము రమ్యము. హీనజన్మలు పొందినవారు సహితము ఈ స్థోత్రమును త్రిసంధ్యల యందును మూడుమార్లు పఠించిన వారి మనోకామనలు పూర్ణమగును. ఈ స్థోత్రమును ఆరు మాసములు పఠించిన వారు విద్యాప్రాప్తి నొందెదరు. ఈ స్థోత్ర పఠనము నిత్యము కావించిననో లక్ష్మీప్రాప్తి కలుగును. రోజూ అయిదు మార్లు పఠించిన ఎడల వారు దీర్ఘాయువు, ఆరోగ్యము పొందెదరు." శ్రీగణేశుని పలుకులు విని వారిరువురు శమీక, మందారుల విషయములన్నియు విస్తారముగ వివరించి "వారిరువురినీ వృక్షయోని నుండి విడిపింప వలసినది" అని ప్రార్థించిరి.

అంత గజాననుడు "భక్తులారా! నేను ఈ అసంభవమైన వరము నీయలేను. ఎందుకనగా ఆ శాపము నా భక్తునిచే ఈయబడినది. కానీ నేను వీరికి వేరొక అద్భుతమైన వరము నిచ్చెదను. నేను ఎల్లప్పుడూ మందారవృక్ష మూలమున నిశ్చలముగ యుందును. మందార వృక్షము స్వర్గ, మర్త్య లోకములందు అత్యంత గొప్ప వృక్షమగును. మందార వృక్షమూలముచే నా మూర్తిని చేసి పూజించుట, లేక నన్ను దూర్వాంకురములతో లేక శమీ పత్రములతో పూజించుట నాకు అత్యంత ప్రసన్నత నిచ్చును. కానీ ప్రపంచమందు ఈ మూడు దుర్లభము. నేను శమీ వృక్షమునందు సహితము ఎల్లప్పుడూ స్థితిగతమై యుందును. నేను ఈ రెండు వృక్షములకు అతి దుర్లభ వరము లిచ్చితిని. ఈ విధముగ మీకు సంతోషకరము, మరియు భృశుండి పలుకులు వ్యర్థమవవు. దూర్వాంకురములు లభించనపుడు మందార పత్రములు, ఇవి రెండునూ లభించనపుడు శమీపత్రములచే పూజ నాకు కడు ప్రియము. శమీపత్రములతో పూజ మందార, దూర్వాంకురములతో పూజతో సమానమగును. ఇందు సందియము లేదు. మనుజులు యజ్ఞ, దాన, తప, నియమముల ద్వారా పొందని ఫలములను శమీపత్రముచే నన్ను పూజించిన పొందెదరు. అట్లే ధన, సువర్ణ, అన్నదాన, వస్త్ర, నానాపుష్ప, మణి మాణిక్యముల ద్వారా కూడా ప్రసన్నమవ్వని నేను శమీ పత్రములచే, మందార పుష్పములచే ప్రసన్నత నొంది అనంత ఫలమును అనుగ్రహించెను. ఏ మానవులు ప్రాత:కాలమునే లేచి శమీవృక్ష దర్శనము, పూజనము, నమస్కారము కావించెదరో వారికి కష్టములు, రోగములు, విఘ్నములు, బంధనములు యుండవు. నా కృపచే వారికి స్త్రీ, పుత్ర, ధన, పశు, వాంఛితములు ప్రాప్తించి, అంతమున ముక్తినొంది నా సాన్నిధ్యమునకు ఏతెంచెదరు. ఇదియే ఫలము మందార పుష్ప పూజనమునకు సహితము లభించును.

మందారవృక్ష కాష్ఠముచే శ్రీగణేశపూజ చేసి పూజించిన వారికి అలక్ష్మీ (దరిద్రము), విఘ్నములు, అపమృత్యువు, జ్వరము, అగ్ని భయము, చోరభయము యుండవు. అట్లు పూజకావించు బ్రాహ్మణులు వేద వేదాంగ పారంగతులగుదురు.

క్షత్రియులు యుద్ధ విజేతలు, వైశ్యులకు ధనవృద్ధి, శూద్రులు సద్గతిని పొందెదరు." ఈ విధముగ పలికి వినాయకుడు మందార వృక్ష మూలమున, శమీవృక్ష మూలమున స్థితిగతుడయ్యెను. అంత ఔరవుడు పత్నీ సహితుడై తీవ్రతపమాచరించుటకు ధృఢ నిశ్చయుడై, శమీవృక్ష మూలమున కూర్చొని తపమాచరించి దేహత్యాగ మొనరించెను. కానీ ఆయన ఆచరించిన తీవ్రతపముచే ఆయన శమీవృక్ష గర్భమున ప్రవేశించి "శమీగర్భుడు" అని ప్రసద్ధి నొందెను. అందువల్లనే యజ్ఞములందు అగ్ని ఉత్పాదనమునకు అరణిమంథనము శమీవృక్ష కాష్ఠములతో కావింతురు. శౌనకుడు సహితము గజాననుని ద్వారా ఎన్నో వరములు పొంది, మందార వృక్ష మూలముచే గణేశ ప్రతిమ చేయించి, తన ఆశ్రమమున ప్రతిష్ఠించి, ప్రతి దినము ఆమూర్తిని మందార పుష్పములు, శమీ పత్రములు, దూర్వాంకురములతో పూజించెను." గృత్సమదుడు "అప్పటి నుండియు శమీవృక్షము శ్రీగణేశునకు అత్యంత ప్రియమైనది" అని పలికెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శమీ మందార కధనము అను ముప్పది ఐదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఆరవ అధ్యాయము

(సావిత్రీ శాపము)

గృత్సమదుడు "మీకు శమీపత్ర మహిమకై మరియొక ఆఖ్యానమును వినిపించెదను. ఒకానొక సమయమున పరమశివుడు పార్వతీ సహితుడై గణములు వెంటరాగా సహ్యాద్రి శ్రేణుల యందలి మహాబలిక్షేత్రమందు నివసించుచుండెను. అంత విరించి తన పత్నుల, దేవతల సహితుడై ఆచటికి ఏతెంచెను. ఆయన శివుని దర్శించి, యధావిధిగ పూజనమొనర్చి, తాను యజ్ఞము చేయుటకు ఏతెంచితినని తెలిపెను. అంత కృపానిధి అయిన పరమేశ్వరుడు జమదగ్ని, వశిష్ఠ, మార్కండేయ, నారద, కపిల, పులహ, కణ్వ, విశ్వామిత్ర, త్రిత, ద్వీత, ఆదిగా గల ఋషులందరనీ పిలిపించెను. శివుని పిలువున వారేకార ఇతర ఋషులు సహితము ఏతెంచిరి. వారందరూ మరునాడు ఉదయమే శుభముహూర్తమును కనుగొని యజ్ఞారంభము కావించిరి. అతి తొందరలో యజ్ఞారంభము కావించుటచే వారందరూ తొలుత కావింపవలసిన శ్రీగణేశ పూజనమును విస్మరించిరి. తత్ఫలితముగ విఘ్నములు ఏతెంచినవి. బ్రహ్మకు సావిత్రి, గాయత్రీ ఇరువురు పత్నులు. సావిత్రీదేవి గృహ కార్యములందు నిమగ్నమై యుండుట చే ఋత్విజులు బ్రహ్మ ద్వితీయ పత్ని అయిన గాయత్రీ దేవిని కూర్చుండబెట్టి వారిచే మాతృకాపూజనము, అభ్యుదాయక శ్రాద్ధము, చేయించి పుణ్య:వాచనము కావించి, అగ్ని గుండములందు అగ్నిని వ్రేల్చిరి. ఇంతలో సావిత్రీదేవి అచటికేతెంచి, తాను లేకుండా యజ్ఞారంభము కావించుట సహింపలేక, రోషారుణ నేత్రయై "ఈ గాయత్రికి యజ్ఞమందు కూర్చొను హక్కులేదు. అయినప్పటికీ మీరు ఆ అకార్యమాచరించితి కావున ఈ దేవతలు, మునులు "జడు" లగుదురు" అని శపించెను.

అంత వారందరూ ఉచ్చ స్వరముగ ప్రార్ధించి "జననీ! సావిత్రీ! భాష యందు "డ" "ల" కు అభేదము కావున నీ శాపమందు "డ" ను "ల" గ మార్చి జడమును జలముగ మార్పుచేయవలసినది" అని అభ్యర్ధించిరి. అంత సావిత్రీదేవి "వల్లె యనెను. అంత దేవతలందరూ జలరూపము నొంది నదులుగ మారిరి. శివుడు "వేణి" నదిగనూ, కృష్ణుడు "కృష్ణా" నదిగనూ, ఇట్లు దేవతలు, మునులు వివిధ నదులుగ మారిరి. ఏ శుభకార్యమందైననూ గజాననుని తొలుత పూజించని అజ్ఞానులు ఈ విధముగనే నష్టపోయెదరు. శివుడు సహితము పురాతన కాలమున త్రిపురాసుర వధ సమయమున శ్రీగణేశుని తొలుత పూజింపక అనేక ఇక్కట్లను ఎదుర్కొనెను. యజ్ఞము విఘ్నమగుటచే బ్రహ్మ విచారగ్రస్తుడై "ఏల ఈ

యజ్ఞము నిరుపయోగమై, దేవతలు నదులుగ మారవలసి వచ్చెను?" అని మనసున మధనపడి చివరకు తామందరూ వినాయక పూజ మరచితిమని గ్రహించెను. అంత తాను వినాయకుని ప్రసన్నుని గావించి యజ్ఞము పూర్ణమొనర్చెదనని సంకల్పించెను. దేవతలందరూ నదులుగ రూపాంతరము చెందిరని వారి పత్నులకు తెలిసి, వారందరూ బ్రహ్మ వద్దకేతెంచి ఇట్లనిరి "ఈ యజ్ఞమును గజానన పూజనమాచరింపక ఎట్లు ప్రారంభించిరి? మాన్యులకు పూజన మొసగుట ధర్మము కదా! ఒకవేళ మీరు మరచిననూ దేవతలైననూ మీకు జ్ఞప్తికి తేవలెను కదా! ఇపుడు కావింప వలసిన కార్యమేమి? ఓ! విరించీ! మీరే ఒక మంచి నిర్ణయము తీసికొనవలసినది."

అంత బ్రహ్మ "సుదతులారా! మీరు భయభీతులవవద్దు. నేను సర్వ శుభకరమయిన యజ్ఞమొనరింతును. శ్రీగణేశుడు ప్రసన్నుడయిన తీరని కోరికలు యుండవు. మీరు సహితము శ్రీగణేశుని భక్తితో పూజింప వలసినది. నేను కూడా ఆయనను ప్రసన్నమొనరించుటకు తీవ్రప్రయత్నము ఒనరించెదను" అని పలికెను. అంత లక్ష్మీదేవి, పార్వతీదేవి, శచీదేవి మొదలగు దేవాంతగలందరూ బ్రహ్మ దేవునిచే నిర్దిష్ఠమొనర్పబడిన కర్ణాటక దేశమందు ఒక మందారవృక్ష మూలమున, వినాయకుని సమీపమున కూర్చొని శ్రీగణేశుని ధ్యానమొనరించుట మొదలిడిరి. ఆ ప్రదేశమునందు తొలుత "వక్రతుంగ గణపతి"ని రామచంద్ర ప్రభువు త్రేతాయుగము నందు ప్రతిష్ఠించెను. ఆ వక్రతుండ గణపతి వర ప్రభావముచే రాముడు రావణ, కుంభకర్ణాది మహాదైత్యులను హతమార్చగలిగెను. అచటనే దేవాంగనలు అత్యంత ఘోరతపమాచరించిరి. కొందరు మంత్రజపము, కొందరు ధ్యానము, వీరాసనము లేక పద్మాసనము వేసికొని చేయుచుండిరి. కొందరు దేవాలయము బయట, కొందరు మందిర కక్షలందు, ఆంగనమందు, ద్వారములందు, కూర్చొని ధ్యానము చేయుచుండిరి. కొందరు ప్రదక్షిణము, కొందరు నమస్కారములు, కొందరు అర్ధనిమీలిత నేత్రులై, కొందరు ఒంటికాలిపై నుంచొని, ఈ విధముగ ఎవరికి తగ్గట్లుగ వారు ఆశీనులై ధ్యానమాచరించుచుండిరి. చాలాకాలము గడచినప్పటికీ వినాయకుడు ప్రసన్నమవకుండెను. అంత వారందరూ చింతాక్రాంతులై వివిధ ధూప, దీప, నైవేద్యములతో, పుష్పములతో, చిత్రాన్నములతో, సువర్ణ దక్షిణలతో, దూర్వాంకురములతో, మందార పుష్పములతో పూజించిరి. అంత అశరీరవాణి "శమీ పత్రములతో పూజింపక వినాయకుడు ప్రసన్నుడు కాదు" అని పలికెను. అంత వారందరూ పరమభక్తితో శమీ పత్రములతో పూజించిరి. అంత వినాయకుడు ప్రసన్నుడై వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను. కోటిసూర్య ప్రకాశుడు, ముకుట కుండలాలంకృతాంగుడు, సిద్ధి బుద్ధి సహితుడయిన ఆ పరాత్పరుడు ప్రత్యక్షమవ్వగనే ఆ దేవాంగనలందరూ సర్ణదండముల వలె నేలపై బడి కన్నులు మూసికొనిరి. అంత వారందరూ పరమానంద భరితులై ఈ విధముగ ఆ పరమాత్ముని స్థుతించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సావిత్రీ శాపమను ముప్పది ఆరవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఏడవ అధ్యాయము

(దేవాంగనా స్థుతి)

దేవాంగనలు "ఓ! సర్వరూపా, సర్వాంతర్యామీ, సృష్టిస్థిత్యంత కారకా, అనంత శక్తిశాలీ, మీకు నమస్కారము. సర్వ ప్రభోదకా, సర్వరక్షకా, సర్వమునకూ పూర్వము యున్న ప్రధానపురుషా, పరబ్రహ్మ స్వరూపా, నిర్గుణా, చిదానందరూపా, నీవు వేదములకు సహితము అగోచరుడవు, మాయకు ఆశ్రయుడవు; అమేయా, గుణాతీత, సత్యా, అనంతరూపా, త్రిగుణములను విక్షోభింపజేయుస్వామీ, నీకు నమస్కారము! శరణాగత వత్సలా! దైత్య దానవ భంజనా, నీవు విశ్వరక్షణకై అనేక అవతారములు స్వీకరించెదవు. వివిధాయుధములు ధరించి శత్రుభంజనము కావించు జగదీశ్వరా! నీకు నమస్కారము!!

నీకు నమస్కారము!!! స్వామీ! మా పతులందరూ జలరూపులైరి. వారికి తిరిగి తమ స్వస్వరూపములు ప్రసాదింపవలసినది. మేము నిరంతరము మీ స్మరణ చేయుచూ నీ ఎడ విస్మృతులము కాకుండునట్లు వరమీయ వలసినది." అంత శ్రీగణేశుడు "మీ స్థుతికి ప్రసన్నుడనై, మీ అనుష్ఠానమునకు వశీభూతుడనైతిని. సర్వ దేవతలు శుద్ధ జలస్వరూపులైరి. ఆ కళ్యాణి వాక్కులను సంపూర్ణముగ వెనుకకు మరల్చుట అసంభవము. అందువలన మీ భర్తలందరి ఒక్కొక్క అంశ ఆ నదీ జలములుగ యండును. మిగిలిన దంతయు తిరిగి దేవ రూపములు ధరించి, తమ అధికారములను ప్రాప్తించెదరు. మీ దేవతా స్త్రీ, పురుషులందరూ నన్ను శమీ పత్రములతో పూజింపవలసినది. శమీపత్రము నాకర్పించిన ఎడల సమస్త విశ్వమును నా కర్పించినట్లే! వారికి వంద బారువుల బంగారము (బారువు = రెండు వేల పలములు) దానమొనర్చిన ఫలము లభించును. ఇందు సందియము లేదు.

వినాయకుడు ఇట్లు పలికిన తక్షణము దేవతలందరూ తమ తమ రూపములతో తమ పత్నీ సహితులై నిలబడిరి. వారందరూ వినాయకుని గాంచి, ఆయనకు ప్రణామములర్పించి, ఈ విధముగ ప్రార్ధించిరి "స్వామీ! మా బుద్ధి నశించి మేము బ్రహ్మదేవుని జ్యేష్ఠపత్ని అయిన సావిత్రీదేవిని త్యజించి, మీ పూజను విస్మరించి యజ్ఞారంభమొనర్చితిమి. దాని దుష్ఫలితమును తక్షణము అనుభవించితిమి. మీ కృపచే తిరిగి మా రూపములు నొందుటచే మేము నవ జీవనమును పొందితిమి" అని పలికి వారందరూ శమీ పత్రములచే శ్రీగణేశుని పూజించిరి. శ్రీగణేశుడు వారికి అనేక దీవనల నొసంగి అంతర్హితుడయ్యెను. అంత దేవతలందరూ చతుర్భుజుడు, సుందరముఖుడు అయిన శిలా వినాయక మూర్తిని అచట ప్రతిష్ఠించి, అద్దానికి "హేరంబ గణపతి" అని నామకరణమొనర్చి ఇట్లు పలికిరి "ఈ సుందర హేరంబ గణపతి యొక్క స్మరణ, పూజనము, స్థుతి ఎవరు కావింతురో, వారు తమ మనోవాంఛితములను సందేహ రహితముగ, తప్పక పొందెదరు." ఇత:పూర్వము అచట ఒక మందార వృక్షము నుండి చేయబడిన శ్రీగణేశమూర్తి యుండెడిది. ఇంద్రుడు ఆ మూర్తిని తన అమరావతీ నగరమందు ప్రతిష్ఠించి, ఇప్పటికీ శచీ సహితుడై పూజించుచుండెను. తదుపరి దేవతలందరూ మందార వృక్షము నుండి చేయబడిన అనేక శ్రీగణేశ మూర్తులను తమతమ స్థానములందు ప్రతిష్ఠించి శమీ పత్రములతో పూజించిరి. తత్ఫలితముగ తమ పత్నీ సహితులై అనంతానందమును, సర్వోత్తమ కామోపభోగములను అనుభవించిరి.

బ్రహ్మ పన్నెండు సంవత్సరములు తీవ్రతప మాచరించి వినాయకుని ప్రసన్నుని కావించెను. ఆయన సహితము మందార వృక్షము నుండి చేయబడిన శ్రీగణేశ మూర్తిని శమీ పత్రములు, దూర్వాంకురములు, స్వర్ణ పత్రములు, కేతకీ పుష్పములతో పూజించెను. గృత్సమదుడు "ఓ! కీర్తిదేవీ! నీకు మందార, శమీ వృక్షముల లేశమాత్ర మహిమను వర్ణించితిని. దీనిని శ్రవణము చేయుటచే పాపములు నశించును. నీవు తెలియకనే శమీ పత్రములచే శ్రీగణేశ పూజన మాచరించితివి. తత్ఫలితముగ నీ పుత్రుడు జీవన దానమొందెను. తల్లీ! నీవు ఇంకనూ ఏమి వినదలచితివి? శ్రీగణేశ భక్తిని ఇనుమడింపచేయు ఈ ఆఖ్యానమును శ్రవణము కావించు మానవులకు కష్టములు నశించి, మనోకామనలు పూర్ణమగును. ఏ మానవులు ప్రాత:కాలముననే లేచి శమీ వృక్షమును, మందార వృక్షమును, శ్రీగణేశుని భక్తితో స్మరించెదరో వారు నిష్పాపులై సుఖించెదరు." అంత కీర్తిదేవి తన పుత్రునకు ఏదేని వినాయక మంత్రోపదేశ మొనర్పమని అర్ధించెను. అంత ముని ఆ బాలునకు సర్వాభ్యుదాయకమైన శ్రీ గణేశుని షడక్షర మంత్రోపదేశమొనర్చెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దేవాంగనా స్థుతి అను ముప్పది ఏడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఎనిమిదవ అధ్యాయము

(దురాసద చరితము)

కీర్తిదేవి "మహర్షీ! ఈ బాలుడు ఇంకనూ చిన్నపిల్లవాడు, బాల్యావస్థచే షడక్షర మంత్రము జపించుట, ఉచ్ఛరించుట కష్టతరము. స్వామీ! మీరు ఈ బాలుని పునర్జీవితుని గావించి మా ఇరువురికీ మేలొనరించిరి. అందువలన ఏదేని సరళమయిన రీతిని ఈ బాలుడు శ్రీగణేశుని ప్రసన్నము చేసికొను మార్గము ఉపదేశింప వలసినది." గృత్సమదుడు "మహారాణీ! శుభాశుభ కర్మల ద్రష్ట, ధర్మ రక్షకుడు, దుష్ట దైత్యనాశకుడు, కాశీరాజయిన దివోదాసుని బ్రాహ్మణ రూపమున ఉద్ధరించినవాడు, విశ్వేశ్వరునికై అవిముక్త క్షేత్రవ్యవస్థను నెలకొల్పినవాడు, సర్వాంతర్యామి, త్రిమూర్తులచే ధ్యానింపబడెడివాడు, త్రిమూర్తులకు సహితము వారివారి శక్తుల నిచ్చెడివాడు, ఇంద్రునికి స్వర్లోకరాజ్యము, దిక్పాలకులకు పాలనాశక్తి ప్రసాదించినవాడు, దేవదానవ గురువులకు నిర్దేశకుడు, స్థావర జంగమాది సమస్త జగత్తుకు కార్యసిద్ధి నొనర్చువాడు, మహానుభావుడయిన "ఢుంఠి వినాయకుడు". ఆయన అపార గుణయుక్తుడు, మరియు గుణములకు పరుడు. నీ కుమారుడు అనుదినము ఢుంఠి వినాయకుని శమీ పత్రములతో పూజించిన ఎడల ఆతడు శత్రునాశకుడై, రాజ్య భోగముల ననుభవించును." అంత కీర్తిదేవి "మహర్షీ! ఈ ఢుంఠి వినాయకుడెవరు? ఈయన ఎట్లు ఉత్పన్నమయ్యెను? ఈయన ఎవరి అంశ? ఈయన పరాక్రమమెట్టిది? ఎవరు ఈయనకు ఈ నామకరణమొనర్చిరి? ఇత:పూర్వము ఎవరు ఈయనను పూజించిరి? స్వామీ! దయచేసి నా సంశయములు నివారణ మొనర్పవలసినది" అని ప్రశ్నించెను. మహర్షి "సాధ్వీ! నీ జ్ఞానాధిక్యత చే సముచిత విషయమును అత్యంత భక్తితో ప్రశ్నించితివి కావున నీ సందేహమును దూరమొనర్చెదను. ఈయన ఎట్లు "దురాసదుడు" అను రాక్షసుని వధించెనో, ఎట్లు దివోదాసుని మోహపరచెనో, ఎట్లు పరమేశ్వరుని తిరిగి అవిముక్త క్షేత్రమందు నెలకొల్పెనో, ఎట్లు "ఢుంఠిరాజు" అను విఖ్యాత నామ మొందెనో ఆ విషయములన్నియు విస్తారముగ వివరించెదను. ఆ శుభ విశేషములన్నియు స్కందుడు అగస్త్యునికి తెలుపుచుండగా నేనునూ కూర్చొని వింటిని. నీవు ఏకాగ్రచిత్తముతో వినుము. ఈ ఆఖ్యానమును వినినంత మాత్రమున మానవులు పాపముల నుండి విముక్తి నొందెదరు.

విష్ణు భగవానుడు కశ్యపుని సృష్టి కావింపమని ఆజ్ఞాపించెను. ఆయన తీవ్రతపము ఆచరించి, ఆ తపోబలముచే నాలుగు విధములైన ప్రాణులను సృష్టించెను. అవి జరాయుజములు (మావితో కూడినవి), అండజములు (గుడ్లనుండి పుట్టినవి), స్వేదజములు (చెమట నుండి పుట్టినవి), ఉద్భిజములు (విత్తనముల నుండి ఉద్భవించునవి). మనుష్య జన్మ అతి దుర్లభము. అందునా బ్రాహ్మణ జన్మము అనేక పుణ్యఫల స్వరూపము. బ్రాహ్మణునిగ పుట్టి, ధర్మాధర్మములను ఎరింగి, వానిని ఆచరణ కావించి, బ్రాహ్మణత్వమును రక్షించిన ఎడల ఆ మనుజుడు ఆ జన్మమునందే సంసార చక్రము నుండి బయటపడి మోక్షము నొందును. లేని ఎడల ఎనుబది నాలుగు లక్షల జీవరాశుల యందునూ తిరుగుచునే యుండును. దురాచారులైన మనుజులు నరకమునకేగి తమ పాపక్షయమగువరకునూ, నరక యాతనలను అనుభవించి అటుపిదప నీచయోనులందు జన్మము నొంది, క్రిమి కీటకములు, పాపులు, దరిద్రులుగ జన్మనొందెదరు. ఇటువంటి జనుల ఉద్ధారణార్ధమై త్రిమూర్తులు, ఋషులు, పరమ పవిత్ర దివ్య క్షేత్రములను ఏర్పాటు చేసిరి. ఈ తీర్ధములందు ఆ మహాపురుషులు జనుల పాపములు ప్రక్షాళన మొనర్చుటకై స్వయముగ స్థితిగతులై యుందురు. ఈ తీర్ధ క్షేత్రములందు నివసించుచూ, తీర్ధయాత్రా నిమిత్తము కొన్ని దినములు అచట యుండిననూ, పాపక్షయమగును. భగవానుడయిన విశ్వేశ్వరుడు సర్వగుణయుక్తము, భోగమోక్షదాయకము, ధ్యాన జ్ఞాన సంపన్నులకు ముక్తిదాయకము, సర్వతీర్థమయమయిన

వారాణసీ పురమును నిర్మించెను.

శ్రీమహావిష్ణువు ఈ పురమందు తపమాచరించుచూ తన చక్రముతో "చక్రసరోవరము" ను ఏర్పాటు చేసెను. ఇందలి స్నానము మోక్షదాయకము. ఈ సరోవరమును గాంచి శివుని తల ఆనందముతో ఊగెను. ఆ సందర్భముగ ఆయన చెవిప్రోగు తెగి క్రింద పడుటచే పరమ విఖ్యాతమయిన "మణికర్ణిక ఘట్టము" ఏర్పడెను. ఇచటనే పరమ పవిత్రమైన భాగీరథీ గంగ ప్రవహించుచుండును. వారణాసీ యందు మృతిచెందిన కీటకములు సహితము ముక్తినొందును. ఇచటి గంగ యందలి తాబేళ్ళు, చేపలు సహితము కైలాసమున కేగును. మూడుమార్లు "గంగా" నామస్మరణ మొనర్చినవారికి కాశీవాస ఫలము లభించును. ఇచట గల పశుపక్ష్యాదులే కాక లతలు, వృక్షములు సహితము ధన్యములు. ఇచట శివుడు వివిధ రూపములతో నివసించుచుండును. అంతేకాక శివుడే సూర్య, చంద్ర, విష్ణు, బ్రహ్మ, వినాయక, శక్తి రూపములుగా ఆ జగత్కారణుడు విలసిల్లుచుండును. ప్రళయము నందు సహితము కాశీ దగ్ధమవక, శివుని త్రిశూలముపై కాపాడబడుచుండును. శివుడొక్కడే!!! కానీ భక్తానుగ్రహము కొరకు విభిన్న రూపములు పొందుచుండును. ఎవరు ఏ విధముగ పూజింతురో, వారికి ఆ విధముగనే దర్శనమిచ్చును. ఆ రూపములందు భేదము చూచినవారు "అవీచిమాన నరకము" నందు పడెదరు. జనులు ఈ రూపములందు ఒక రూపమును స్థుతించి, వేరొక రూపమును నిందించువారు ఇరువది ఒకటి నరకములందు పడెదరు. భస్మాసురునకు "దురాసదుడు" అను పుత్రుడు కలడు. ఆతడు ఇంద్రుడు వద్దకు ఏగి పంచాక్షరి విద్యను గ్రహించెను. ఆతడు ఒంటికాలిపై నిలబడి, నిరాహారుడై, శరీరమును క్రిమి, కీటకములు భక్షింపగా కేవలము కన్నులు, అస్తికలు మిగిలినవి. అయిననూ ఆతడు తపము మానలేదు. అంత పరమాత్ముడు శివుడు సంతసిల్లి పంచముఖుడై, దశభుజుడై, కపాలమాల వైచికొని, చితాభస్మమును సర్వాంగముల యందును ధరించి, జటాజూటము, త్రిశూలము, ఢమరుకముతో విభూషితుడై శిరమున గంగ, త్రినేత్రుడై, వృషభకేతనుడు, చంద్రశేఖరుడు, వృషభవాహనుడై, అంకమందు జగదీశ్వరి పార్వతీదేవి కూర్చొని యుండగా ప్రత్యక్షమయ్యెను. ఆయన "దురాసదా! లెమ్ము! నీ మనోవాంఛితము తెలుపుము" అని పలికెను. దురాసదుడు "మహాదేవా! జగత్కారణ కారణా, త్రిగుణాతీతా, జ్ఞానమయా, వ్యక్తావ్యక్తవిధానజ్ఞాతా, భక్తానుగ్రహకారకా, అఖండానందపూర్ణా, అమోఘ ఫలదాయకా, పంచభూత స్వరూపా! నీకు నమస్కారము! నేడు నీ దర్శనముచే నేను, నా మాతాపితరులు, నా తపము, నేత్రములు ధన్యములు. నా పాపములు ధ్వంస మయినవి. యోగుల హృదయమందు నివసించు నీవు, వేదములకు సహితము అగోచరుడవైన నీవు నాకు దర్శన మొసంగితివి. స్వామీ! నాకు పైన తెలిపిన చతుర్విధ ప్రాణుల ద్వారా మృత్యువు లేకుండుట, యక్ష, రాక్షస, కిన్నెర, దేవ, దానవ, పిశాచ, ముని, మానవ, గంధర్వ, సర్ప, వనచరములచే అవధ్యత్వము, యుద్ధమందు అజేయత్వము, దేవ రాజ్యాధికారము ఈయవలసినది. నాకు మీ చరణ కమలములందు అవ్యభిచార భక్తిని ప్రసాదింపవలసినది. శివుడు "శక్తి" వినా మిగిలిన దేవతలందరకునూ నీవు అజేయుడ వగుదువు. శక్తి యొక్క తేజము నుండి ఉత్పన్నమయిన వీరుడు నిన్ను ఓడించి, తిరిగి పునర్జీవితుని గావించి, నీ శిరముపై తన చరణమును యుంచును. ఆతడు తన పాదమును తొలగించినపుడు తిరిగి నీవు త్రిలోకాధిపత్యము నొందెదవు. నీకు నా యందు నిరంతర భక్తి యుండును." అని పలికి శివుడు అంతర్హితుడయ్యెను. దురాసదుడు ప్రసన్నుడై తన గృహమున కేగెను. ఈ స్తోత్రమును చదివిన ఎడల సర్వాభీష్టములు పూర్ణమగును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దురాసద చరితమను ముప్పది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది తొమ్మిదవ అధ్యాయము

(దురాసద విజయము)

గృత్సమదుడు “శివునిచే ఈయబడిన వరగర్వముచే దురాసదుడు తొలుత భూలోకమును ఆక్రమించుటకు బయలుదేరెను. అతడు అశ్వారూఢుడై, జుట్టు ముడివైచి, దివ్య దుకూలములు ధరించి, కుండలాలంకృతాంగుడై, తాంబూల చర్వణము చేసి, పటిష్ఠమైన కవచము తొడిగి, తిలకధారణమొనర్చి, ఒక చేతిలో కరవాలము, మరొక చేతిలో ధనుస్సు, రెండు భుజములపై సాయకములు నిండిన తూణీరములు గొని ముందునకేగుచుండెను. ఆతని వెనుక ఇరువురు అమాత్యులు, అసహాయశూరులు, చతురంగ బలములతో నేల ఈనినట్లు బయలుదేరిరి. ఆతని సేన సముద్రమును తలపించుచున్నది. సేన కదలికచే రేగిన ధూళి ఆకాశమును కప్పుచున్నది. ఏఏ రాజులు మదోన్మత్తులై ఎదుర్కొందురో వారిని నిర్జించి, వారి స్థానమున తనకు విశ్వాసపాత్రులయిన వారిని నియమించెను. తనను శరణుజొచ్చిన రాజులను వారి స్థానములందు వారినే యుంచి కప్పము గైకొనెను. మరికొందరు భీరువులు పారిపోయి తలదాచుకొనిరి. వారిని దూతల ద్వారా వశపరచుకొనెను. ఈ విధముగ భూమండలమంతటినీ తన పాదాక్రాంత మొనర్చుకొనెను. అటు పిమ్మట స్వర్గలోకాధిపత్యమునకై అమరావతి పై దండెత్తెను. ఈ దుష్టుని వరముల గూర్చి ఎరిగిన శచీపతి, తన కుటుంబ సహితముగ అమరావతిని వదలి హిమాలయ కంథరమందు తలదాచుకొనెను. విష్ణువు వైకుంఠమును వదలి క్షీర సాగరమును, శివుడు కైలాసమును వదలి వారణాసినీ చేరిరి. బ్రహ్మ సహితము శివుని అనుసరించెను. ఏఏ దేవతలు తమ పదవులను లుప్తమొనర్చిరో, అచట దురాసదుడు తనకు నమ్మకమయిన అనుయాయులను నియమించెను. ఈ విధముగ స్వర్గ మర్త్యలోకములు జయించి, తాను స్వయముగ జాలర్ల దేశమయిన “అశ్మక పురము” ను రాజధానిగ చేసికొని పరిపాలించుచుండెను.

ఈ అశ్మక పురము “ముకుంద పురము” అని ప్రఖ్యాతి నొందినది. పూర్వకాలమున ఈ నగరమును దురాసదుని తండ్రి భస్మాసురుడు పరిపాలించెడివాడు. ఆతడు శివునికై తపమొనరించి, ఆయన ప్రత్యక్షమయిన పిదప తాను ఎవరి శిరమున హస్తమంచునో వారు భస్మీభూతులగునట్లు వరముపొంది, అద్దానిని పరీక్షించుటకై శివుని శిరము పైనే హస్తము నుంచదలచెను. అంత శివుడు పలాయనమొనర్చెను. అంత చక్రధారి అయిన విష్ణువు ఒక సుందరి రూపున ఏతెంచి “ఓ! దానవపతీ! నీవు నా పలుకులు వినిన ఎడల నేను నీ అర్ధాంగి నగుదును” అని పలికెను. అంత భస్మాసురుడు అంగీకరించెను. అంత ఆ సుందరి తాను చేయు నాట్యమును అనుకరింపమనెను. దైత్యుడు “వల్లె” యని ఇరువురు నృత్యము అరంభించిరి. అంత భస్మాసురుడు ఆ సుందరి ననుకరించుచూ తన హస్తమును తన శిరముపై యుంచుకొనెను. తక్షణము ఆతడు భస్మమై మృతినొందెను. అప్పటి నుండి విష్ణువు “ముకుంద” నామమున ఆ అశ్మకపురమందు యుండుటచే అయ్యది ముకుంద పురమని ప్రఖ్యాతి నొందినది. ఈ నగరమందు అనుష్ఠానమొనర్చు సాధకులు శీఘ్రముగ సిద్ధి నొందెదరు. విష్ణువు మోహినీ రూపమున భక్తుల మనోకామనల పూర్ణమొనర్చును. ఈ ముకుంద పురమున సింహాసనాధిష్టుడై, గర్వితుడై, దురాసదుడు తన మంత్రులతో ఇట్లనియె.

త్రిలోకములను సునాయాసముగ నా బాహుబలముచే హస్తగత మొనర్చుకుంటిని.” అంత అమాత్యులు “ప్రభూ! మీరు వారణాసిని ఇంకనూ ఆక్రమింపలేదు. ఇయ్యది భారతవర్షమందు దశమ ఖండముగ తెలుపబడును. దీనికి సమానమైన పుణ్యక్షేత్రము లేదు. ఇందు సాక్షాత్ పరమశివుడు నివసించుచుండును. ఈ నగరమును మీరు జయింపనంత వరకు మీ పౌరుష పరాక్రమములు వృథా!!” అని పలికిరి. అంత దురాసదుడు సైన్యమును సమీకరించి కాశీ నగరము

పై దండెత్తెను. ఆతడు ఒక సుందర విమానము అధిరోహించి క్షణములో కాశీ చేరెను. దైత్యుడు నగరప్రవేశ మొనరిపంగనే, నగరమందు హాహాకారములు చెలరేగెను. అచటగల దేవతలందరూ అదృశ్యులైరి. శివుడు సహితము దురాసదుడు తన భక్తుడగుటచే "నేనే ఈతనికి ఈ రాజ్యము నిచ్చితిని కదా! కొంత సమయము క్రీడించనీ!" అని తాను సపరివారముగ కేదారమున కేగెను. మునులందరూ అచటినుండి పలాయనమొనర్చిరి. క్షేత్ర సన్యాసము తీసికొనిన కారణమున "జైగీషవ్యుడు" అను ముని మటుకు కాశీనగరమును వీడక అచటనే యుండెను. అంత మోహగ్రస్తుడయిన దురాసదుడు భవనములు కూల్చి, దైవ మందిరములు ధ్వంసమొనర్చి, దేవ దేవీ మూర్తులను భగ్నమొనర్చి, సుందరమైన కాశీ నగరమును వికృతమొనర్చి సంతసిల్లెను. ఎవరు దైవస్మరణ కావించిననూ వారిని తీవ్రముగ శిక్షించెను. స్వాహా, స్వధా, వషట్కారములు లేకుండెను. వేదాధ్యయనము, శాస్త్రాధ్యయనము, పురాణ కథా శ్రవణము, దైవపూజ, వ్రతములు, ప్రదక్షిణలు, సర్వము లుప్తమయ్యెను. ఈ విధముగ ధర్మము నష్టమగుసరికి దేవతానీకము సర్వము క్షుధార్తులైరి.

గణేశపురాణమందు క్రీడాఖండమందలి దురాసద విజయమను ముప్పది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నలభైయవ అధ్యాయము

(వక్రతుండ గణపతి జననము)

గృత్సమదుడు "దేవతలు, ఋషులు, సర్వులు కేదారము చేరి విరించి, విశ్వేశ్వరుల నుద్దేశ్యించి నమస్కరించి, ఇట్లు పలికిరి "మహాత్ములారా! దేవతలు పదభ్రష్టులైరి. మునుల ఆచారములు వంచింపబడినవి. దురాసదుని భయముచే ఒక ప్రాంతమందు నివసించుట కష్టమై కాందిశీకులమైతిమి. ఈ దుష్టునకు ఈ వరము నిచ్చినదెవరు? ఈతని వధ ఎట్లు జరుగును? మీరు దయాళువులు. దయచేసి ఉపాయము తెలుపవలసినది. ఈ దురాత్ముని మరణముచే సర్వ లోకములు సుఖపడును." అంత బ్రహ్మ "ఓ! దేవతలారా! ఈ దురాసుదుడు చిరకాలము పరమేశ్వరుని నిమిత్తమై తీవ్ర తపమాచరించెను. ఈతని వధింపగలుగు దేవత ఈ ముల్లోకములలో లేరు. ఎవరి ఆజ్ఞను త్రిమూర్తులమైన మేము ఔదల దాల్చెదమో, ఎవరు త్రిగుణములను విభాగించునో, ఎవరు త్రిగుణములకు స్వామియో, విశ్వవ్యాప్తి, మాయావీ, విశ్వ రచయితయో, ఆ పరాత్పరుడు పార్వతీ గర్భము నుండి అవతీర్ణుడయిన ఎడల, ఆతడు దురాసదుని నాశమొనర్చును. అందువలన మీరు తొలుత శివపత్ని అయిన పార్వతీదేవి, పరమేశ్వరుని ప్రసన్నము కావింపవలసినది. అంత దేవతలు ముదమొందిరి. భక్తవత్సల అయిన భవానీదేవిని ఇట్లు స్తుతించిరి. "దేవీ! నవు జగదోత్పత్తికి ఏకమాత్ర హేతువువు. పరాత్పరవు. విశ్వమును నడిపించు విచిత్ర శక్తివి. నీ రూపము అచింత్యము. త్రిగుణస్వామిని, ధరణీ స్వరూపా, ధరాధారిణీ, త్రిలోక సారరూపా, జగదాధారా, వేదత్రయీ, నీవు విష్ణువును సహితము మోహమందు ముంచెత్తుదువు. దేవతలకు పదవులు ప్రసాదించునది నీవే! త్రైలోక్య రచయిత్రీ! మమ్ము రక్షింప వలసినది." అంత దేవి "దేవతలారా! మీ మనోవాంఛితము కోరుకొన వలసినది." అంత దేవతలు బ్రహ్మ యొక్క పలుకులు తెలిపిరి. అంత భవానీదేవి దేవతలతో "మీరు శుభాశుభకర్తా, సర్వ సిద్ధికరుడు, సర్వార్థ కామప్రదుడు అయిన శ్రీగణేశుని ప్రార్థింప వలసినది" అని పలికెను.

అంత దేవతలు, ఋషులు అందరూ భక్తి పూర్వకముగ శ్రీగణేశుని ఇట్లు ప్రార్థించిరి "ఓ! విఘ్నకర్తా, దయాళూ, సర్వపాలకా, జగత్కారణా, సర్వవ్యాపీ, దీనబంధూ, సర్వజ్ఞా, కరుణానిధీ, నీకు నమస్కారము. నీవు జగత్ హితార్థము అనేక అవతారములు స్వీకరించెదవు. గుణాతీత, గుణక్షోభా, జగద్గురూ, నీవే విభుడవు. ఏకదంతా, ద్విరదా, త్రినేత్రా,

దశభుజా, శుండదండయుక్తా, విఘ్ననాశకా, పాపహర్తా, భక్త వరదా, సృష్టిస్థిత్యంత కారకా, త్రిలోకప్రభూ, దేవేశ్వరా, దానవ సంహారకా, సర్వ శుభకారకా, మమ్ములను రక్షింపవలసినది! రక్షింపవలసినది!!" అంత వారికి అశరీరవాణి ఇట్లు వినిపించినది "నేను భయంకరుడయిన దురాసదుని సంహరించెదను. మీరు సంతాపము నొందవలదు." అంత దేవతలందరూ తిరిగి పార్వతీ పరమేశ్వరుల చెంతకు ఏతెంచిరి. శివుడు తీవ్ర ధ్యాన నిష్ఠయందుండెను. అంత వారలు పార్వతీదేవికి ప్రణామములాచరించి "దేవీ! ఈ ఆకాశవాణి పలుకులు ఎవరివో మాకు ఎరుకలేదు. శివుడు ధ్యాన నిష్ఠ యందుండెను. ఇపుడు మా కర్తవ్యమేమి?" అని ప్రశ్నించిరి. దేవి "సురలారా! దురాత్ముడయిన దురాసదుడు మరణించుట ఖాయము." అని పలికి మౌనము వహించి క్రోధ సంతప్తయై, నేత్రములు అరుణిమయై, దీర్ఘ నిశ్వాసములు విడచుట నారంభించెను.

ఆమె నేత్రములు, నాసిక నుండి అగ్నిజ్వాలలు కురియుచు ఒక మహాగ్నిగోళము ఏర్పడెను. దేవతలందరికీ తమ జ్ఞాన నేత్రమునకు ఆ మహాగ్నియందు వినాయకుని మహామూర్తి గోచరమయినది. ఆ మూర్తి దశభుజములు, అంధకారమును దూరమొనరించు కోటిసూర్య ప్రకాశము, రత్నజటిత స్వర్ణ ముకుటము, విద్యుత్ ప్రభ, మణిరత్నయుత కుండలములు, సుందరమైన దంతములు, దివ్య దుకూలములు, సింధూర లేపనము, దశాయుధములు, లలాటమందు కస్తూరీ తిలకము, కంఠమందు ముత్యముల మాలలు, కలిగియుండెను. ఆయన నుండి ప్రళయాగ్ని, వంటి తేజము వెలువడి దిగంతముల వరకు వ్యాప్తి చెందుచుండెను. ఆ రూపమను గాంచి వినాయకుడు ఉద్భవించెననీ తెలిసి దేవతాదులందరూ ఇట్లు పలికిరి "ప్రభూ! మేము యోగ ప్రాప్యుడవైన శ్రీగణేశుని కాంతిచిమి. నీవు అవ్యయుడవు, కల్పనాతీతుడవు, నిరామయ, నిరాభాస, నిర్వికల్పుడవు, అజరామర సర్వేశ్వరుడవు. జగదాధారుడవై జగత్తునందు వ్యాప్తినొందినప్పటికీ అవ్యక్తుడవు, పురాణ పురుషుడవు, జ్ఞానమూర్తి." ఈ విధముగ ఉద్భవించిన శ్రీగణేశమూర్తిని కాంచి వారందరూ అనందమగ్నులై నాట్యమారంభించిరి. జగన్మాత అయిన పార్వతి సహితము వినాయకుని ప్రశంశించుచూ ఇట్లనియె "నిర్గుణ, నిరాకార, అవ్యక్తా, సర్వవ్యాపీ, సర్వత్రగామీ, ధ్యానగమ్యా, పరమపురుషా, సచ్చిదానంద స్వరూపా, జగత్కారణా, నేడు నీ రూపమును చూడగల్గితిని. నీవు దైత్య సంహారమునకు, చరాచర జగద్రక్షకు, మా గృహమందు ఆవిర్భవించితివి" అని పలికి భక్తి పూర్వకముగ పూజనమాచరించి, తన సింహ వాహనమును ఆ గణపతికి సమర్పించెను. ఆయన సర్వుల మనోరథములను పూర్ణమొనరించును కావున ఆయనకు "వక్రతుండుడు" అని నామకరణ మొనర్చెను. అంత ఆ తల్లి వినాయకుని "దురాసదుని వధించి దేవతలను తిరిగి తమ పదవుల యందు ప్రతిష్ఠింపమని" ప్రార్థించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వక్రతుండ జననము అను నలభైయవ అధ్యాయము సమాప్తము)

నలభై ఒకటవ అధ్యాయము

(వినాయక, దురాసద సంగ్రామము)

పార్వతీ, దేవాదులు ఇట్లు ప్రశంశించిన మీదట వినాయకుడు సంతసిల్లి ఇట్లనియె "నేను దురాసదుని సంహరించుటకు, దేవలోకము, ఇతర లోకములందు పాలన జరిపించుటకు, పృథివీ భార నివారణార్థము, నా తల్లి పార్వతీదేవి సేవార్థము, వైదిక కర్మ, ధర్మముల స్థాపనార్థము అవతరించితిని. నేను పైన తెలిపిన కార్యములన్నియు చేసి తీరుదును." దేవతలు తిరిగి వినాయకుని పూజించి ఇట్లనిరి "స్వామీ! ధరిత్రి యందు ధూళి కణములు లెక్కించవచ్చును;

ఆకాశము నందలి తారలను గణింపవచ్చును? మంచు బిందువులను కొలువ వచ్చును; సముద్రములను ఇంకింపవచ్చును; కానీ మీ గుణములను తెలియలేము. మీ చరణ దర్శన భాగ్యమబ్బిన మా నేత్రములు ధన్యములు. నేడు మా దు:ఖములు దూరమయినవి. ప్రభూ! దయచేసి దురాసదుని హతమార్చి మాకు రక్షణ కల్పింపుము." అంత వినాయకుడు చిరునవ్వు నవ్వి, తన దశ భుజములందునూ దశ ఆయుధములు ధరించి, సింహ వాహనుడై వారణాసీ పురమున కేగెను. ఆయన వెంట ఇంద్రాది దేవతలు, పార్వతీ పరమేశ్వరులు సహితము ఏగిరి. తన నెదుర్కొనుటకు వినాయకుడేతెంచెనని తెలిసి దురాసదుడు తన సేనా సహితుడై బయటకేతెంచెను. ఆ సేన వివిధాయుధములు ధరించి మేఘ గర్జన కావించుచుండెను. అంత వినాయకుడు ఉచ్చ స్వరమున పర్వత కంథరములు ఘూర్ణిల్లునటుల ఒక మహానాదము కావించి దైత్యునితో ఇట్లనియె.

"ఓరీ! నీవు ఈనాడు సహితము భ్రాంతుడవై కుమార్గమున ఏగుచుంటివి. నీవు బలపూర్వకముగా రాజులనోడించి, మునులను అవమానించితివి. నిర్భయుడవై పాపములాచరించితివి. త్రిలోకవాసులను పీడించితివి. నేను వారందరికీ సురక్ష ప్రసాదించుటకు, భూభారమును తగ్గించటకు, ఏతెంచితిని. నీవు సిగ్గువిడచి నన్ను శరణుజొచ్చుము. లేని ఎడల నీకు మరణమే శరణ్యము." ఈ విధముగ పలికి రణోన్మాదుడయిన గణపతి ప్రళయాగ్ని సదృశము, జ్వాలామాలికాహాలము అయిన ఒక పరశువును పట్టి ఆ దైత్యునిపై విసరెను. చిత్రము. ఆ భయంకర పరశువు ఆ దైత్యుని రోమమును సహితము కదిలింప లేదు. అంత దురాసదుడు "నా సమ్ముఖమునకు వచ్చుటకు దేవ, ఇంద్ర, దిక్పాలురు భయభీతులగుదురు. నీవు బాల భావమున తెలియక ఏతెంచితివి. మూర్ఖుడా! నేను యముడికి సహితము భయము నొందను. మరణించుటకు నీకంత ఉత్సుకత ఏల?" అని పలికి ఒక ఉజ్వల చంద్రహాసమును ఒరనుండి లాగి, దానిని వినాయకునిపై ప్రయోగించెను. అద్దానిని వినాయకుడు అంకుశముతో ఆపి తిరిగి పరశువు ప్రయోగించెను. అంత కరవాలము ముక్కలయ్యెను. అంత దైత్యుడు శస్త్రములు విడచి మల్లయుద్ధమునకు సిద్ధమయ్యెను. వారిరువురూ బాహా బాహీ, ముష్టాముష్టి, చేతులతో, కాళ్ళతో, మోకాళ్ళతో, వీపుతో, శిరముతో, ఈ విధముగ భయంకర ద్వంద్వయుద్ధము ఆరంభించిరి. చాలాకాలము వారిరువురు ఇట్లే సమరమాచరించిరి. దేవతలు దురాసదుని బలమునకు అబ్బురపడిరి. కొంచెముసేపు గణపతికి, మరికొంచెముసేపు దురాసదునిదీ పైచేయి అగుచుండెను. ఎవరిది పైచేయి అయిన ఆ వర్గపువారు "సాధు సాధు" నినాదములు చేయసాగిరి. అంత వినాయకుడు తన ముష్టితో దురాసదుని లలాటమందు తీవ్రముగ ఘాతమొనరించెను. అంత దైత్యుడు మూర్ఛనొందెను. చాలా సేపటికి ఆతడు మూర్ఛనుండి బయటపడి, దుర్బలుడై, ఆ రోజు తన సేనను తీసికొని కోటలోనికి ఏగెను. వినాయకుడు సహితము తన సేనమధ్యకేగెను. ఏ మానవుడు యుద్ధసమయమందు ఈ ఆఖ్యానమును వినునో, ఆతడు వినాయకుని వలెనే విజయమందును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయక దురాసద సంగ్రామమను నలుబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నలుబది రెండవ అధ్యాయము

(దురాసద పరాజయము)

గృత్సమదుడు "గృహమునకేగిన దురాసదుడు వక్రతుండ గణపతి యొక్క పరాక్రమము గని, కొంతతడవు ఆలోచించి, తిరిగి ధైర్యము బూని మరునాడు యుద్ధరంగమున కేతెంచెను. ఆతడు శివుని స్మరించి, అగ్ని మంత్రమును

ఆయత్తము జేసి, ఆ భయంకరాస్త్రమును వినాయకునిపై వదలెను. అయ్యది దిక్కులను దగ్ధము కావించుచూ, శరవేగమున వినాయకుని చేరుచుండెను. అంత వినాయకుడు పర్జన్యాస్త్రమును మంత్రించి వదలెను. వెంటనే మేఘములు అలుముకొని ఏనుగు తొండముల వంటి వర్షధారలు కురిసి ఆ ఆగ్నేయాస్త్రమును చల్లబరచెను. ఈ విధముగ ఆగ్నేయాస్త్రము చల్లబడుట కాంచి, కొంచెము విచారించి దురాసదుడు వాయువ్యాస్త్రమును మంత్రించి వదలెను. అయ్యది వృక్షములను, పర్వతములను పడగొట్టుచూ ముందున కేతెంచెను. అంత వినాయకుడు తన మనోబలముచే పర్వతాస్త్రమును సంధించి విడచెను. అయ్యది పెద్దపెద్ద పర్వతములను సృష్టించి వాయువును నిర్బంధించి వాయువ్యాస్త్రమును ప్రభావహీనమొనర్చెను. అంత దురాసదుడు రౌద్రాస్త్రమును ప్రయోగించెను. అద్దాని నివారణార్థము గణపతి బ్రహ్మాస్త్రమును విడచెను. ఆ రెండు అస్త్రములు రోజుల తరబడి తలపడి, దానిచే అగ్ని జ్వాలలుదయించి సామాన్య ప్రజలను సంహరించుట మొదలిడెను. అంత విరించి, విశ్వేశ్వరులు తమ శక్తితో ఆ అస్త్రములందలి శక్తిని హరించిరి. ఆ సమయమున దురాసదుడు తన అమాత్యుల నుద్దేశ్యించి తాను గృహమునకేగి, భోజనమారగించి ఏతెంచెదననీ, అంతదనుక తనవారందరూ వినాయకునితో సమరమొనర్పమని పలికి తాను రణరంగము వీడెను.

అంత దైత్యసేన అంతయు ఒక్కమారు గణపతిని చుట్టుముట్టినది. గణపతి ఒక్క క్షణము చింతనమొనర్చి, తననుండి అనేక గణపతులను సృష్టించెను. వారందరూ కొందరు నాలుగు, కొందరు ఎనిమిది, కొందరు పది భుజములు కలిగి గణేశరూపులై యుండిరి. వారందరూ వివిధాయుధములు చేతబట్టి దైత్యుల తలలు, కాళ్ళు, చేతులు, తొడలు, మొండెములు, చెవులు, ఈ విధము ఊచకోతకోయుట మొదలిడిరి. అంతేకాక గజాశ్వములను సహితము తెగనరకుటచే రక్తము ఏరులవలె పారుట మొదలిడెను. ఆ రక్తసరితయందు కరవాలములు మత్స్యములవలె, ఏనుగులు మొసళ్ళవలె, డాళ్ళు కచ్ఛపముల వలె, మొండెములు కమలముల వలె, మేధ బురదవలె, ధనువాది శస్త్రములు నీటి పక్షులవలె, మాంస పిండములు కప్పలవలె తోచుచున్నవి. దురాసదుడు భోజనము ముగించి వచ్చుసరికి దైత్యసేన అంతయ హతమయ్యెను. అంత ఆతడు ఆశ్చర్యచకితుడై, తనకు శివుడు వరమొసగినపుడు శక్తి నుండి ఉత్పన్నమగు బాలుడు తనను జయించునని తెలపెను కదా! అని తలంచి, ఈతడే ఆ బాలుడు అయియుండునని, ఇక ఈ బాలుడు అజేయుని వలె కానపట్టుచున్నాడని, కాలుడు సహితము ఈ బాలుని ఓడింపలేడని తలచి పలాయన మొనర్చెను. పలాయనమగు శత్రువును సంహరించుట ఎట్లు అని వక్రతుండుడు ఆలోచన యందు పడి, ఒకసారి విరాడ్రూపము ధరించి, ఆ దైత్యుని ఒక చేతితో పట్టుకొనెను.

అంత వక్రతుండగణపతి ఒక పాదము కాశీ యందు దురాసదుని శిరముపై యుంచి, రెండవ పాదము "తుండనగరము" నందుంచి దైత్యునితో ఇట్లనియె "దురాసదా! శివుని వరము వలన నీవు ప్రస్తుతము మృతడవగుట లేదు. నీవు కాశీపురి యందు పర్వతము వలె నిశ్చలముగ యుండి, ఈ పురమునకు ద్వారము వలె మారి, దుష్టులను పీడించి, నిత్యము నా సాన్నిధ్యమునుండుము." దైత్యుడు సహితము భక్తితో "స్వామీ! నీ పాదమును ఎల్లప్పుడూ నా శిరముపై యుంచవలసినది" అని కోరెను. అంత వినాయకుడు "తదాస్తు" అని కాశీ యందు స్థిరనివాసమేర్పరుచుకొని, తిరిగి కాశీ నగరమును సుఖప్రద మొనర్చెను. దేవతలు పుష్పవృష్టి కురిపించి, వక్రతుండ గణపతికి పూజన మొనరించి, ప్రణామములు సలిపి తమ తమ స్థానముల కరిగిరి. ఎవరు ఈ వక్రతుండ గణపతికి పూజన మొనర్చెదరో వారి మనోకామనలు శీఘ్రమే ప్రాప్తించును. ఈ విధముగ కాశీ యందు ఏబది ఆరు గణపతి మూర్తులు కలవు. విరాడ్రూపము నొందిన గణపతి తన రెండవ పాదము యుంచిన తుండనగరము నందు "ఏకపాద గణపతి" గా వెలసి భక్తుల మనోకామనలను పూర్ణము ఒనరించుచుండెను. ఏ మానవుడు ఈ పవిత్ర, సుందరాఖ్యానమును భక్తితో వినునో వాని మనోకామనలు అన్నియు పూర్ణమయి, సర్వత్ర విజయమంది, పూర్ణారోగ్యము నొందును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దురాసద పరాజయమను నలుబది రెండవ అధ్యాయము సమాప్తము)

నలుబది మూడవ అధ్యాయము

(డుంఠి గణపతి వృత్తాంతము)

గృత్సమదుడు “కీర్తిదేవి! ఈ విధముగ దురాసద దైత్యునిపై విజయము ప్రాప్తించిన పిదప దిక్పాలురు, మునులు, ఇంద్ర, సూర్య, చంద్ర, బృహస్పతి, శుక్రాచార్యుడు మొదలగు వారందరూ దేవదేవడయిన వినాయకుని ఈ విధముగ స్థుతించి “ఓ! దేవా! నీవు దురాసదుని జయించి శృతి, స్మృతులయందు తెలుపబడిన ధర్మములను తిరిగి స్థాపించితివి. ఈ దైత్యుని పరాజయ మొనర్చుటకు అసమర్థులమైన మమ్ము తిరిగి మా స్థానములందు పున:స్థాపించితివి. నీవే విశ్వసృష్టి కావించు కర్మఫలప్రదాతవు. నీవు సర్వ ప్రాణుల యందునూ సమభావన కలిగి కర్మచే బంధింపబడవు. చాతుర్వర్ణముల మనుజులు, సర్వ ప్రాణులు, నీ రక్షణ యందు సురక్షితులై యుందురు. నీవు జీవుల కర్మలనన్వేషించి, తదనుసారము వారి జన్మ, కర్మల యందు సంలగ్నులను కావించెదవు కావున నీవు “డుంఠిరాజు” లేక “ఢుంఠి గణపతి” అని ప్రసిద్ధి నొందితివి. నీ స్మరణ, దర్శనము, పూజనము, చతుర్విధ పురుషార్థములను, పుత్ర పౌత్రాదులను ప్రసాదించును.” ఈ విధముగ పలికి దేవతలు వినాయకుని మందార పుష్పములు, శమీ పత్రములు, శ్వేత, హరిత దూర్వాంకురములు, నానావిధ పుష్పములు, పక్వాన్నములు, బహువిధ ఫలములతో, రత్నరాశులతో పూజించిరి.

శ్రీగణేశుడు సంతుష్టుడై అవిముక్త నగరపు ఏడు ఆవరణలయందునూ, ఎనిమిది దిక్కులా వెలసి ఏబది ఆరు మూర్తులుగ విరాజిల్లుచూ పూజలందుకొనుచుండెను. అంతేకాక ఒక పంచముఖ వినాయకుడు విశ్వేశ్వరుని ద్వారమందు సహితము ఉపస్థితుడై యుండును. ఈ ఏబది ఆరు వినాయకులు కాశీ నగరమందటా వ్యాపించి ఆ పురమును సంరక్షించుచుండెను. సూర్య చంద్రాదులు, సర్వ దేవతలు, తమ తమ అధికారములు తిరిగి పొందిరి. మునులు, ఋషులు తమ తపశ్చర్య నారంభించిరి. లోకమునందు తిరిగి స్వాహాకారాదులు మొదలై ధరిత్రి సుభిక్షమయినది. ఈ డుంఠిరాజు అవతార కథా శ్రవణము ధర్మార్థకామ సుఖ ప్రదానము కావించును. ఇపుడు కాశీరాజు దివోదాసు చరిత్రను వినిపించెదను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి డుంఠి గణపతి చరితమను నలుబది మూడవ అధ్యాయము సమాప్తము)

నలుబది నాల్గవ అధ్యాయము

(దివోదాసు చరితము)

కీర్తిదేవి “మహర్షీ! డుంఠి గణపతి అవతారము స్వీకరించినపుడు ఒక పాదము దురాసదుని శిరముపై కాశీ నగరము యందునూ, మరియొక పాదము తుండ నగరమందు యుంచెననీ తెలిపితిని కదా! ఇది ఎట్లు సాధ్యము? దయచేసి నా సంశయమును నివారింపవలసినది.” గృత్సమదుడు “సాధ్వీ! వినాయకుడు విశ్వరూప, విశ్వకర్త, విశ్వరక్షక, విశ్వవ్యాపీ, విశ్వేశుడు. ఆయనకు అసాధ్యమనునది లేదు. ఆయన తలచిన ఏదయిననూ సంభవమే! ఆయన విశ్వాంతర్యామి, పరమాత్ముడు, సర్వ సంహార కర్త; సప్త పాతాళములు ఆయన చరణములు. ఆయన కేశములు స్వర్గము వరకు వ్యాపించినవి. ఆయన కాళ్ళు, చేతులు సర్వ దిశలా వ్యాపించినవి. ఆయన నేత్ర, శ్రోత్రములే దిశలు. ఆ స్వామి మనసుకు అగోచరుడు.

అంతేకాదు, ఆయన వేదములకు, బ్రహ్మాది దేవతలకు, యోగులకు సహితము అగోచరుడు. తత్వత: పంచ భూతములు ఆయన స్వరూపమే! ఎవని రోమకూపములందు కోటి కోటి బ్రహ్మాండములున్నవో, ఆ సర్వ సమర్ధ స్వామియే వినాయకుడు. అందువలన మహారాణీ! ఆయన విషము నమృతముగనూ, అమృతమును విషముగనూ తృటిలో మార్చును. ఆయనకు అసంభవము లేదు. ఆయన ఏ అవతారములు ఎన్ని, ఎప్పుడు, ఏ విధముగ స్వీకరించునో ఎవరికి ఎరుక? దేవతా ప్రముఖులు, శేషుడు సహితము వానిని లెక్కింపలేరు. అందువలన ఓ! సర్వధర్మజ్ఞా! నీవు సంశయములు విడచి నేను నుడివెడు ఆఖ్యానమును ఆలకింపుము. ఈ ఆఖ్యాన శ్రవణముచే పాపముల నుండి ముక్తి లభించును.

పూర్వకాలమందు సూర్యవంశ సంజాతుడైన "దివోవాసు" అను మహారాజు యుండెడివాడు. ఆయన దానశీలి, స్వాభిమాని, మాన్యుడు, బుద్ధియందు బృహస్పతి సముడు, మంచివక్త, సౌభాగ్యశీలి, వేదశాస్త్ర పురాణముల జ్ఞాత, విద్వాంసుడు, సుందరుడు, జితేంద్రియుడు, పరోపకార పరాయణుడు, పరద్రోహ, పరధనములకు పరాఙ్ముఖుడు, పరాక్రమోపేతుడు. ఆయన తన రాజ్యపాలనమును తనయుల కప్పగించి తపమొనరించుచుండెను. ఆయన తపస్సుకు ప్రసన్నుడై బ్రహ్మదేవుడు ఆయనను శుష్కించి యున్న కాశీ రాజ్యమునకు మహారాజుగ నియమించెను. దివోదాసుడు ఆ కార్యమునకు ఒక్క షరతుపై అంగీకరించెను. అది ఏమన "శివునితో సహా సర్వ దేవతలు కాశీ నుండి బహిష్కృతులు కావలెను. దివోదాసుడు తన తప:బలముచే తానే సర్వదేవతా స్వరూపుడై ఆ రాజ్యమునకు సర్వము ప్రసాదించును. తత్ఫలితముగ శివుడు దేవతా సహితుడై మంధర పర్వతమున కేగెను. దివాదాసు తానే సూర్య, చంద్రాగ్ని, వాయువులై సకాలములో వర్షములు కురిపించుచూ దేశమును సస్యశ్యామలము కావించెను. ఆయన ధర్మపత్ని సుశీల. ఆమె పతివ్రత, ధర్మాచరణ తత్పర, దాన పరాయణి, మరియు పతిసేవా దురంధర. ఆ మహారాజు అచార వ్యవహారములు, ప్రాయశ్చిత్త కర్మలు పండితులచే యధావిధిగ చేయించుచూ అనవసరముగ రాజదండనము, అర్ధ దూషణము చేయకుండెను. ఆ రాజ్యమందు ఎవరికినీ శోకరోగములు, అపమృత్యు బాధలు, త్రివిధ ఉత్పాతములు, (దివ్య, అంతరిక్ష, భీమ) లేవు. అతివృష్టి, అనావృష్టి లేవు. వర్షములు సకాలములో కురియుచూ, సస్య సమృద్ధి జరిగి పశుపక్ష్యాదులు సహితము అత్యంత సుఖానందము ననుభించుచున్నవన్న ఇక మానవుల మాటలు చెప్పనేల?

రాజ్యము సుభిక్షముగ యుండుటచే ఇతర రాజ్యముల నుండి ప్రజలు కాశీరాజ్య నివాసమునకు ఏతెంచుచుండిరి. దేశమంతటా తిరిగి స్వాహాకార, స్వధాకార, వషట్కారములు వెల్లి విరిసినవి. బ్రహ్మ ప్రేరణచే దేవతలు సహితము దివోదాసును ప్రశంశించిరి. మహారాజు సహితము వారిని స్థుతించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దివోదాసు చరితమను నలుబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఐదవ అధ్యాయము

(శివుని విచారము)

కీర్తిదేవి "మహర్షీ! ప్రపంచమందు ఎన్నో స్థానములుండగా శివుడు మంధర పర్వతమునకు ఏల వెడలెను? కాశీ పురమును ఏల త్యజించెను?" గృత్సమదుడు "ధరిత్రిపై ద్వాదశ వత్సరములు అనావృష్టి ఏర్పడి, స్థావర జంగమాత్మక జగత్తు క్షోభించి నష్ఠమయినది. అందువలన పుణ్య పురుషుడయిన రాజు యుండిన రాజ్యము శోభిల్లును కావున బ్రహ్మ దివోదాసును మహారాజు కావించెను. దివోదాసుని షరతుపై సర్వ దేవతలు కాశీ నగరమును వీడవలసి వచ్చినది. అదే

సమయమున మరీచి మహర్షి పదివేల సంవత్సరముల నుండి పరమ శివునికై మంధర పర్వతము నందు తపమాచరించుచూ కేవల అస్థి ప్రాయుడాయెను. అందువలన దేవతలు ప్రేరేపించగా పరమేశ్వరుడు అచటకేగి, మరీచిని అనుగ్రహించి, ఆయనకు సారూప్యము ప్రసాదించి, దివ్య విమానమందు కూర్చుండబెట్టి కైలాసమున కంపెను. అప్పటినుండి ఆయనకు కాశీ ప్రవేశము లేని కారణమున అక్కడనే యుండెను. కానీ పశుపతికి కాశీ నగరము ప్రాణము. అందువలన ఆయన దోషాన్వేషణమునకై దేవతలను పంపెను. దివోదాసుకు దోషములున్న ఎడల తత్కారణమున ఆయనను రాజపదవి నుండి తొలగించి కాశీ నుండి బహిష్కృతుని కావింపవచ్చు.

కానీ దివోదాసు పరిపాన యందు కాశీరాజ్యము సుభిక్షమై సర్వులు వర్ణాశ్రమ ధర్మములు పాటించుచుండిరి. శిష్యులు గురుశుశ్రూష నొనర్చుచుండిరి. స్త్రీలు పతివ్రతలై ధర్మాచరణము, దాన వ్రత పరాయణత్వము, ఉపవాసయుక్తులై యుండిరి. యతులు త్రిసంధ్యల యందును స్నాన, వ్రత, హోమములు ఆచరించి మౌనులై యుండిరి. గృహస్తులు స్నాన, సంధ్యావందన, జప, హోమ, స్వాధ్యాయ, దేవపూజన, అతిధిసత్కార, బలి, విశ్వేదేవము అను అష్ట కర్మములు నిష్పాపులై, భక్తి ప్రపత్తులతో ఆచరించుచుండిరి. కాశీయందు ధర్మము వృద్ధి అగుటనే స్వర్గమందు దేవతలు, స్వధాభోజులై పితరులు తృప్తినొంది ప్రసన్నులైరి. ఆ రాజ్యమందు వంధ్యలు, విధవలు, పిల్లలకు తర్పణములిచ్చు తల్లిదండ్రులు లేరు అనగా పిల్లలు దీర్ఘాయవులై యుండి అకాల మరణము చెందకుండిరి. అతివృష్టి, అనావృష్టి లేవు. దేశమందు విద్రోహశక్తులు, బయటి నుండి శత్రురాజుల భయము లేవు. పంటలు చిలుకలు, మూషికములు, శలభములచే పాడగునన్న భయము లేదు. నెలకు మూడు వానలు, తదణుగుణముగ సూర్యశక్తి కలుగుచుండుటచే సస్యవృద్ధి సమృద్ధిగా జరిగినది. రాజు "విశ్వేశ్వర, మాధవ, డుంఠి వినాయక, భైరవనాధ, దండపాణి, కార్తికేయ, గంగా, మణికర్ణిక, భవానీ దర్శనము చేయక, గంగాస్నాన, మాచరింపక ఎవరు భోజనము చేయుదురో వారు దండనీయులని" దండోరా వేయించెను ఈ విధముగ రాజ్యపాలన జరుగుచుండుటచే కాశీరాజ్యమందు లేశమాత్రము పాపము లేకుండెను.

కానీ శివునికి కాశీ వియోగము బహు కష్టముగ యుండెను. అందువలన కాశీ యందు విఘ్నములుత్పన్నమగుటకు అష్ట భైరవులను పిలచి "మీరు కాశీ రాజ్యమునకు ఏగి లోకులను కించిత్ పాపులను కావింపవలసినది. అంత దివోదాసును అచటి నుండి పంపి నేను తిరిగి కాశీ చేరెదను" అని పలికెను. అంత భైరవులు బయలుదేరి దివోదాసుని పాలన యందు పాపము కనుగొనలేక అచటనే స్థిరపడిరి. అంత శివుడు ద్వాదశాదిత్యులను పంపెను. వారునూ కాశీ వచ్చి, దివోదాసు పాలన నచ్చి, కాశీయందు యుండిపోయిరి. అంత శివుడు అరువది నాలుగు యోగినులను పంపెను. వారును దివాదాసుని యందు లేశమాత్రము పాపము కనుగొనలేక శివుని ధ్యానించుచూ కాశీయందు నివాసముండిరి. అంత శివుడు దు:ఖనాశిని అయిన దుర్గాదేవిని పంపెను. ఆమెయు ఏమీ అపరాధము కనుగొనలేక గ్రామము వెలుపల వెలసి, తాను శివుని పూజించుచూ, లోకుల కామనలను పూర్ణ మొనరించు చుండెను. వెళ్ళిన వారందరూ తమ పేర్ల మీదగా శివలింగములు ప్రతిష్ఠించి అక్కడనే నివసింప మొదలిడిరి. అపుడు శివుడు ఋషులను పంపెను. వారందరూ అమితానంద భరితులై, కాశీకిఏగి, స్నానాదులు కావించి, దివోదాసునకు ఆశీర్వచనము కావించుటకేగి, ఆతని చేష్ఠలకు ముగ్ధులయిరి. రాజు వారికి అనేక ధన వస్త్రాదులను దానమొనర్చెను. కానీ వారు ఆ ధనము స్వీకరింపక, తమ నామముల మీదుగా శివలింగములు ప్రతిష్ఠించి అచటనే తీవ్రతపము ఆచరించుట ప్రారంభించిరి. వీరెవరునూ ధర్మపరుడయిన మహారాజు దివోదాసు యందు ఈషణ్మాత్రము పాపము కనుగొనలేక పోయిరి. అంత శివుడు ఎవరిని పంపిననూ వెనుకకు రాకపోవుటచే "నేను తిరిగి ఎన్నడు కాశీ చేరుదును?" అన మనసున చింతించి, డుంఠి వినాయకుడు, మాధవుడు వినా మిగిలిన వారలు నిరర్ధకులని తలచెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శివుని విచారము అను నలుబది ఐదవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఆరవ అధ్యాయము

(ఢుంఢి గణపతి చతురత)

గృత్సమదుడు "పరమేశ్వరుడు ఈ విధముగ తలచ ఢుంఢి గణపతిని ప్రార్థించెను "ఓ! వినాయక ప్రభో! నీవు పంచభూతములకు కారణభూతుడవు. చిదానంద ఘన పరమాత్మవు. విశ్వము నందు జనులు ధ్యానము ద్వారా తెలిసికొను వేదాంతవేద్యుడవు నీవే! పురుషుడవు, ప్రధానుడవు, త్రిగుణ విభాగకర్తవు, విశ్వవ్యాప్త, విశ్వకర్త, విశ్వనిధివి నీవే!! వివిధ అవతారములు స్వీకరించి తద్వారా పృధివీ భారనాశనము కావించునది నీవే! బ్రాహ్మణులను, ధర్మమును, ఆర్తజనులను, శరణాగతులను, దేవతలను రక్షించి, దైత్యులను వినాశమొనర్చునది నీవే! పరబ్రహ్మ స్వరూపా, నీవే నా పుత్రునిగ ఉదయించితివి. కాశీ విరహము చే దు:ఖితుడనై యున్న నేను ఎవరిని శరణుకోరను?" అంత ఢుంఢి గణపతి "పరమేశ్వరా! మీరు సర్వజ్ఞులై యుండి ఏల మోహగ్రస్తులగుచున్నారు?" అని అనునయించెను. శివుడు "ఓ! గజాననా! నీవు నా కార్యసిద్ధికై అవిముక్త క్షేత్రమునకేగి, అచటి జనులను నీ మాయచే మోహింపజేసి, ధర్మనష్ఠ మొనరించి, దివోదాసుని పుణ్యమును క్షీణమొనరింపుము" అని పలికెను. అంత ఢుంఢి గణపతి "తప్పక చేయుదును" అని పలికి శివపార్వతులకు, కార్తికేయ, నారదాదులకు ప్రదక్షిణ ప్రణామములాచరించి, పవిత్ర వారణాసీ నగరము చేరి, దివోదాసుని పుణ్యమును వీక్షించెను. అచట పాపమనెడిది లేదు. అంత ఢుంఢి గణపతి స్వర్ణమయ దేహకాంతి, మెడలో ముత్యముల మాల, బంగారు కటిసూత్రము, పచ్చని పట్టు పీతాంబరము, దివ్య గంధానులేపనము, కామదేవుని వంటి సౌందర్యము కలిగిన ఒక జ్యోతిష్కుని వలె మారి పతివ్రతల హృదయమందు సహితము కామోత్పాదన మొనరించెను.

మనసులోని భావనారూప ప్రశ్నలకు సహితము జవాబులిచ్చుచూ, అందరి మన్ననా, చూరగొనసాగెను. పతివ్రతలయిన స్త్రీలు సహితము తమ పతి, పుత్ర, భ్రాత, మిత్రులను వదలి ఆయన వద్దకు ప్రశ్నల నిమిత్తము ఏతెంచ మొదలిడిరి. తన మాయా బలముచే జనులకు స్వప్నములు రప్పించి, వాటి ఫలితములను సహితము చెప్పదొడండెను. తన సేవలొనరించు లోకులకు ఉత్తమ వరదానము నిచ్చెను. ఆయన వరదానముచే కుష్ఠాది రోగములు నశించుచుండెను. వంధ్యలు పుత్రవతులగుచుండిరి. కొందరికి అరిచేతులు చూచి సాముద్రికము చెప్పుచుండెను. ఎవరు ఏమి తినునో, లేక తినెదరో, ఆ విశేషములన్నియు తెలుపసాగెను. జనులు ఇటువంటి సర్వజ్ఞానిని ఇంతకుముందు కానరాక, ఆశ్చర్యాన్వితులై ఆయనకు అనేక ధనరత్నరాశులు సమర్పింపదొడంగిరి. ఎవరి చేతియందు ఏమున్నదో గుప్పిట మూసిననూ తెలుపుట, ఎవరు పొగొట్టుకొన్న వస్తువు ఎక్కడ యున్నదో తెలుపుట, ఇటువంటి క్రియలన్నియు ఒనర్చుటచే ఆతడు సర్వల నోటాబడి రెండు, మూడు మాసములకు రాజుకు, రాజాంత:పురమునందు తెలిసెను. రాజపత్నులు, ఇతర పతివ్రతా స్త్రీలు, తొలుత తన భర్తను తప్ప పర పురుషుని తలవని అతివలు, తమ భర్తలకు తెలుపక ఆ జ్యోతిష్కుని వద్దకు ఏగుచుండిరి. అంత వారి సఖులు వారిని వారించి, ఆ జ్యోతిష్కుని తమ గృహములకు ఆహ్వానింపమని సలహా ఇచ్చుటచే వారందరూ ఆ జ్యోతిష్కుని ఒక ఏకాంత స్థలమునకు పిలచిరి.

రాజపత్నులందరూ ఆయనను ఇక ఆసనమందు కూర్చుండబెట్టి, పాద ప్రక్షాళన కావించి, పూజించి, తమకు పుత్రుడా లేక పుత్రిక జన్మించునా? ఇట్లు తమ మనసున యున్న సందేహములన్నింటినీ అడుగసాగిరి. ఆ జ్యోతిష్కుడు వారి ప్రశ్నలన్నింటికీ సరి అయిన సమాధానములిచ్చుటచే, వారు ఆయన పలుకులను సంపూర్ణముగ నమ్ముట మొదలిడి, తమ గృహకార్యములు త్యజించి ఎల్లప్పుడూ ఆ జ్యోతిష్కుని సందర్శించుటకు ఏగుచుండిరి. అంతేకాక వారు నిరంతరము పతి చింతన మాని జ్యోతిష్కుని గూర్చియే చింతించుచుండిరి.

మహారాజు దివోదాసు సహితము ఈ జ్యోతిష్కుని గూర్చి విని, ఆయనను పిలిపించి, ఒక ఉన్నతాసనముపై కూర్చుండబెట్టి, అర్ఘ్య పాద్యాదులు, ధనము, మధుపర్కము, వస్త్రములు, గోవు, దానమొనర్చి తన మనసునందున్న సంశయములను నడిగెను. వాటికి జ్యోతిష్కుడు సరిఅయిన సమాధానములు ఇచ్చుటచే రాజుకు సంపూర్ణ విశ్వాసము కుదిరి, తన ఇష్ఠ దైవమును సహితము విస్మరించి, ఆ జ్యోతిష్కుని గూర్చిచే చింతించుచుండెను. ఒకనాడు ఏకాంతమున రాజు జ్యోతిష్కునితో ఇట్లనియె "స్వామీ! మీకు అనేక గ్రామములు, ధనము, ధాన్యము, సమర్పించెదను. మీరు ఎల్లప్పుడూ నా దగ్గరనే యుండి నాకు మార్గ నిర్దేశ్యము చేయవలసినది." అంత దుంఠి గణపతి "రాజా! నాకు ఈ గ్రామములు, ధన ధాన్యాదులు, లోకుల ప్రశంశలు, కీర్తి, గృహాదులందు రుచి లేదు. నేను స్త్రీ, పుత్ర, గృహాదులన్నింటినీ త్యజించి ఇచటికి ఏతెంచితిని. కానీ నాదొక విన్నపము. నేటికి పదిహేడవ దినము ఒక మహాపురుషుడు ఇచటికి ఏతెంచి నీకొక కార్యము ఆచరింపమని తెలుపును. నీవు అద్దానిని పరమ హితముగ భావించి, ఆచరింపవలసినది. అదియే నాకు పదివేలు. నీవట్లు గావించిన నాకు గ్రామాదులు ముట్టినట్లే!!

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దుంఠి గణపతి చతురత అను నలభై ఆరవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఏడవ అధ్యాయము

(దివోదాసు నిష్క్రమణము)

అంత మహారాజు "ఓ! మునిశ్రేష్ఠా! నేను మీ వచనమును అవశ్యము పాటింతును. నేను శివుని ఆన శపధము చేయుచున్నాను. మీరు చెప్పినట్లుగాక భిన్నముగ చేయను" అని ఘోషించెను. ఈ విధముగ దుంఠి గణపతి సర్వులను మోహింపజేసి, తన వశము నందు యుంచుకొనగా, కాశీ పంచ క్రోసముల వెలుపల "బుద్ధరూపము" న యున్న విష్ణు భగవానుడు కాశీ నగరము ప్రవేశించెను. ఆయన తన మాయచే సర్వులను మోహితుల గావించి స్మృతి, శృతులకు విరుద్ధముగ ప్రచారము గావించి, సనాతన ధర్మము పట్ల సర్వులకు వ్యతిరేకత కలుగజేసెను. ఆయన మూర్తి పూజను ఖండించి, పరమాత్ముడు సర్వజనుల హృదయమందుండెననీ, అందువలన మృణ్మయ, లేక ధాతుమూర్తి పూజ మూఢ విశ్వాసమనీ పేర్కొనెను. యజ్ఞముల హేతువై వృక్షములు ఖండించుట, వ్యక్తులు తమ ధనమును దాన రూపమున వ్యర్థమొనర్చుట కుకార్యమని వక్కాణించెను. శరీరములు నష్ఠమయిన ఎడల అందలి పంచతత్వములు పంచ భూతముల యందు కలియుననీ, అందువలన శరీర స్థలమయిన ఆత్మను అన్ని రకములుగ సంతోషపరుచవలెననీ, బోధించెను. అంత జనులందరూ ఉపవాసములు, ధర్మాచరణ మానివైచి, శరీర భోగములే పరమావధిగా అనుభవించ సాగిరి. జనులు దానాదులను వర్జించిరి. ఆ బుద్ధుని భార్య "కమల" వారణాసీ స్త్రీలకు వారి మనోరధములు పూర్ణమొనరించుచూ, వారిని మరింత మోహములో ముంచెను. ప్రతిదినము వారిని ప్రయత్న పూర్వకముగ కుమార్గములందు చరించునట్లు ఉపదేశించెను. బుద్ధుడు "పరమాత్మ మన దేహము నందు యున్నట్లే ఇతరుల దేహములందు యున్నాడు. విభిన్న అవయవములు యున్ననూ దేహమొక్కటే! అట్లే ఒకే పరమాత్మ చతుర్విధములైన దేహములను (జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజములు) పుట్టించెను. అందువలన మనమందరమ వివిధ దేహములున్ననూ ఒక్కరమే!!" అని పలికెను. కానీ జనులు ఈ వేదాంతమును తప్పుగా అర్ధము చేసికొని స్త్రీలు పరపురుష సంగమాది అకృత్యములకు పాల్పడుట ఆరంభించిరి. బ్రాహ్మణులకు అగ్నిహోత్రములు, యజ్ఞముల యందలి ప్రీతి నశించినది. జనులు వ్రత, దాన, హోమ,

దేవ బ్రాహ్మణ పూజ, సంపూర్ణముగ విడచివైచిరి. వ్రత, శ్రాద్ధ సమయములందు సహితము భోజనము తామే గ్రహించుచూ ఆనందపడసాగిరి. ఈ విధముగ కాశీనగరము, రాజ్యము సంపూర్ణముగ ధర్మభ్రష్టమైనది.

అంత బుద్ధుడు దివోదాసు గృహమున కేతెంచెను. దివోదాసు ఆయనను అత్యంత భక్తితో ప్రార్థించెను. అంత బుద్ధుడు ఈ విధముగ పలికెను "రాజా! నేను నీ హితము కోసమై పలుకుచుంటిని. వినిన పిదప నీకు ఏది హితమో దానిని కావించుము. ఈ వారణాసీ నగరమును శివుడు తన తేజస్సుచే నిర్మించెను. ప్రళయ కాలమున సహితము ఈ పురమును తన త్రిశూలాగ్రమున నిలుపును. ఈ నగరమందు పుణ్యాత్ములు, మరణానంతరము మోక్షగాములు మాత్రమే నివసింపవలెను. పాపాత్ములను భైరవుడు ఈ నగరము నుండి బయటకు త్రోయును. ఇచట శివ, భైరవులు పుణ్యాత్ములను రక్షింతురు. మీ పుణ్యమున్నంత వరకు మీరు కాశీరాజ్యమును పాలించిరి. ఇపుడు మీ పుణ్యము లుప్తమయినది. మీ రాజ్యమందు అనేక నరక కారక పాపములు జరుగుచున్నవి." మహారాజు దివోదాసు "స్వామీ! మీరు పలికినది సత్యము. నేను మీ మాటను పాటింతును. జ్యోతిష్కుడు సహితము ఇవే పలుకులు వక్కాణించెను. నా హితము కొరకై పలుకుచున్న మీరెవరు? దయచేసి తెలుపవలసినది." అంత కరుణా సాగరుడయిన విష్ణు భగవానుడు శంఖ, చక్ర, గదాధారియై, చతుర్భుజుడై, తన సమిష్టి, వ్యష్టి రూపములను, విరాడ్రూపమును దివోదాసుకు దర్శింపజేసెను. దివోదాసుడు అత్యంత ప్రసన్నుడై ఆనంద తాండవము ఆచరించెను. అంత రాజు ఇట్లనియె "మహాప్రభూ! నేను నా మాతాపితరుల సహితముగ ధన్యుడనయితిని. పూర్వకాలమున నేను రాజ్యమును పరిత్యజించి, దీర్ఘతపమాచరించితిని. కానీ బ్రహ్మదేవుడు హఠాత్తుగా ఈ రాజ్యమొసంగెను. ఈనాడు మీ దర్శనమగుటచే నాకు జనన మరణ చక్రము నుండి విముక్తి లభించినది. ఇందు సందియము లేదు. నేను మిమ్ము శరణునొందుచూ అదే వరము కోరుచుంటిని." అంత పరమాత్ముడు "రాజా! విశ్వేశ్వరుడు నీకు ముక్తిని ప్రసాదించును. ఇక నీవు రాజ్యమును త్యజించి వెడలిపొమ్ము. లేని ఎడల భైరవుడు, దండపాణి నిన్ను భహిష్కరించెదరు."

అంత రాజు కొంత తడవు పరమ చింతితుడై ధ్యానించి, జ్యోతిష్కుడే ఢుంఠి గణపతి అని గ్రహించి, ఆ విష్ణు భగవానునికి శిరసువంచి నమస్కరించి, బ్రహ్మ తన కొసగిన రాజముద్రికను విష్ణువుకు సమర్పించెను. విష్ణువు తన రూపమును మార్చి, బుద్ధరూపము ధరించి తన ఆశ్రమమునకు చనెను. అంత విష్ణువు పరమేశ్వరునకు దివోదాసు కాశీ నుండి నిర్గమించెనని కబురుజేసెను. దివోదాసు ఆ కాశీ నగరమందే "దివోదాసేశ్వరుడు" అను శివలింగమును స్థాపించి, అచటనే తీవ్ర తపమాచరించుచూ, పరమేశ్వరునికై వేచియుండెను. ఈ దివోదాసేశ్వర లింగము నిష్కాములకు మోక్షము, సకాములకు కామనాపూర్ణ మొనర్చును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దివోదాసు నిష్క్రమణము అను నలుబది ఏడవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఎనిమిదవ అధ్యాయము

(పరశుబాహు చరితము)

గృత్సమదుడు 'దివోదాసు కాశీనగర రాజ్య త్యాగానంతరము ఢుంఠి వినాయకుడు తన యధార్ధ రూపము ధరించి నివసించుట ఆరంభించి పరమేశ్వరుని శీఘ్రము రమ్మని కబురుచేసెను. అంత పరమేశ్వరుడు హర్షాతిరేకుడై, వృషభవాహనుడై, గణ సహితుడై వారణాసీ పట్టణమునకు ఏతెంచెను. తొలుత అచట వల్మీకమందు నిరాహారియై

తపమాచరించుచున్న జైగీషవ్యుని అనుగ్రహించి అటుపిదప ఢుంఠి గణపతికి ప్రణామములర్పించి ఇట్లనియె "ఓ! విశ్వరూపా! నీవే సృష్టిస్థిత్యంతములు కావించెదవు. జీవుల సుఖ, దు:ఖ కర్మఫల ప్రదాతవునీవే! నీ ఆజ్ఞచే త్రిమూర్తులు వారి వారి కర్మములు ఆచరించుచున్నారు. నీవే వారికి ఆ సమర్ధత ప్రసాదించుచున్నావు. నీ వలనే దేవతలు శత్రుసంహారము, వేదములు వివిధ విధానములు కావించుచున్నవి. నీవలనే శక్తి స్వరూపిణి అయిన ప్రకృతి మహిషాసుర మర్దనము కావించినది. నీవు అఖిలలోక ప్రభువును, అప్రమేయుడవు, కారణములకు సహితము కారణభూతుడవు. సజ్జనులు ఎల్లప్పుడూ నీ స్మరణ, పూజన కావించుచుందురు. దుర్జనులు సహితము నీ యందలి వైరభక్తిచే మోక్షము నొందెదరు. అనేక బాహూదర వక్త్రనేత్రా! అనంత విజ్ఞానమయా! అఖిలాండ కోటి బ్రహ్మాండములకు స్వామీ! నేను చిరకాలము ప్రయత్నించిననూ కేవలము నీ కృప చేతనే తిరిగి నా ప్రియమయిన వారణాసీ పురము చూడగల్గితిని. మీరు ఎల్లప్పుడూ ఇచట ఉపస్థితులై ఈ పురమును రక్షింపవలసినది. మీ కృప లేక ఎవరునూ కాశీవాసము చేయలేరు. దండపాణి, భైరవుడు, ఢుంఠి వినాయకుల కృప ఎవరిపై యుండునో వారికి మాత్రమే అంత్యకాలమందు నేను తారక బ్రహ్మ మంత్రమును ఉపదేశించెదను. లేని వారికి అయ్యది ఉపదేశించెను. ఏ మానవుడు మాఘమాస కృష్ణపక్ష చతుర్థీతిథి, మంగళవారము చంద్రోదయమయిన పిదప అపూపములు, మోదకములు, మరియు ఇతర ఉపచారముతో మిమ్ము పూజించెదరో, వారికి కష్టములు దీర్చి, వారి మనోకామనలను పూర్ణమొనర్చి, వారికి అనేక సంపదలను ప్రదానము కావింపవలసినది. ఏ మానవుడు ఈ స్తోత్రమును ప్రాత:కాలమందు కానీ, త్రిసంధ్యల యందు కానీ పఠించునో వారికి భోగమోక్షములు ప్రసాదింపవలసినది. మీరు త్రిలోకముల యందు "ఢుంఠి గణపతి" గా విఖ్యాతులై, ఢుంఠి నామము ముక్తి ప్రదమై, పాపనాశకమై, సర్వకార్యసిద్ధి ఒనర్చును."

ఈ విధముగ పలికి పరమేశ్వరుడు గండకీనంది యందు శిలలచే ఒక సుందర గణపతి మూర్తిని చేయించి, అచట స్థాపించి, దానిచుట్టూ సుందర ప్రాసాదమును నిర్మించెను. తదుపరి ఇతర దేవతలు తమ తమ భవనముల కేగిరి. శివుడు తన భక్తుడయిన దివోదాసునకు ముక్తిని ప్రసాదించెను." గృత్సమదుడు "ఈ విధముగ ఢుంఠి మరియు బుద్ధ రూపమునున్న విష్ణు భగవానుడు దివోదాసును మోహపరచి చివరకి ఆతనికి హితమొనర్చిరి. దేవీ! నీకు ఈ ప్రకారముగ ఢుంఠి గణపతి కావించిన దివ్య లీలలన్నియు నా సామర్ధ్యానుసారము నీకు తెలిపితిని. ఆ ప్రభువు ఇంతింతని చెప్పలేని ప్రభావము కలవాడు. ఆయన వరదానము వలననే నీ పుత్రుడు పునర్జీవితుడయ్యెను." ఈ విధముగ పలికి గృత్సమదుడు కీర్తిదేవి నుండి శలవు తీసికొని తన ఆశ్రమమునకు చనెను.

అంత కీర్తిదేవి తన తనయుని తీసికొని సరాసరి వారణాసీ పురమునకేగి, ఢుంఠి వినాయకుని దర్శించి నమస్కరించెను. ఆ రోజు అంగాకర చతుర్ధి. ఆలయ ప్రాంగణమంతయు అత్యంత కోలాహలముగ యుండి భక్తులచే నృత్య, భజన, గాయనములు చేయబడుచున్నవి. అనేక రకములయిన పక్వాన్నములు ప్రసాదములుగ యుంచబడినవి. శ్రీగణేశమూర్తి నానాలంకార భూషితుడై యుండెను. కానీ జన సందోహము వలన రాణికి, ఆమె పుత్రునకు శ్రీగణేశుని ముఖము పూర్ణముగ అవలోకించుటకు సహితము కుదరకుండెను. ఆమె కొంచెము నిస్పృహ చెందినది. ఆ సమయమున ఆమె వద్ద ధనము సహితము లేకుండెను. మార్గ మధ్యమున ఆమె వినాయకునికి దూర్వాంకురములు, శమీ పత్రములు, మందార పుష్పములు, సమర్పించి అత్యంత భక్తి భావముతో తన పుత్రుని అభ్యుదయమునకు ప్రార్ధించినది. కొంత సేపటికి భక్తులందరూ తమ తమ గృహముల కరిగిరి. కీర్తిదేవి తన కుమారుని సహితయై అచటనే కూర్చుండెను. వినాయకునకు సువర్ణ, రత్న, రాశుల కంటెను పైన తెలిపిన మూఊడు వస్తువులు పరమ ప్రియమని తొలుత తెలిపితిని కదా! నిరాహారియై, పరమభక్తి భావమున యున్న రాణీ, పుత్రుల ఎడల ప్రసన్నుడై ఢుంఠి గణపి మూర్తి మధ్య నుండి బయటకు ఏతెంచి వారి ఎదుట ప్రత్యక్షమయ్యెను.

అంత మాతా పుత్రులిరువురు ఇట్లనిరి "మహాప్రభూ! మహానుభావుడయిన గృత్సమద మహర్షి నిన్ను ఏ విధముగ తెలిపెనో, నీవు అదే రూపమున సాక్షాత్కరించితివి" అని పలికి ఆ రూపమును చూచుచూ సర్వమును మరచి, ఆనంద సాగరమున ఓలలాడుచూ ఆయనకు నమస్కరించుట, పూజించుట కూడా మరచిరి. అంత డుంఠి వినాయకుడు ప్రసన్నుడై "ఓ! సువ్రతా! నీ మనోవాంఛితమేమి? కోరుకొనుము. నేను మందార పుష్పపూజ, దూర్వాంకురములు, శమీ పత్రములు పూజచే పొందు ప్రసన్నత ఇక ఏ ఇతర వస్తువులు, రత్న సువర్ణరాశులచే కూడా పొందను. అందువలన నీ మనోవాంఛితమును తప్పక ప్రసాదించెదను." అంత కీర్తిదేవి దేహభావన యొంది "స్వామీ! సర్వజ్ఞులయిన మీతో స్త్రీనైన నేను ఏమి పలుకగలను? మీ ఆజ్ఞచే కొన్ని పలుకులు పలికెదను. మీరు నిష్కల, నిరహంకార, నిర్గుణ, జగత్ప్రభువులు. పరపూర్ణ ఆనందమయులు; పురాణ పురుషులు, పరమాత్ములు. సర్వ దేవతా రూపములు మీరే! పంచ భూతములు, సమస్త దేవ, దానవ, రాక్షస, యక్ష, నాగ, కిన్నెర, కింపురుష, మానవాదులు మీరే! చరాచర జగత్తు మీ రూపమే! ఓ! దీననాథా! కృపానిధీ! నేడు నా జన్మము, నేత్రములు, మాతా పితరులు, పతి, ఈ పుత్రుడు, కుల, శీల, రూప, జ్ఞానములు, తపస్సు, సర్వము ధన్యమయినవి. ప్రభూ! మీ ఆజ్ఞచే నేను ఈ బాలునికి మీ నామములు క్షిప్రప్రసాదునిగ నామకరణ మొనర్చితిని. నా సవతి ఈ పుత్రునికి విషప్రయోగ మొనర్చుటచే ఈతడు మరణించెను. కానీ మీ భక్తి ప్రభావమున గృత్సమద మహర్షి ఈ బాలుని తిరిగి పునర్జీవితుని కావించెను. ఆ మునిఏ మీ దర్శనార్థము మిమ్ములను శమీ పత్రములచే పూజింపమని ఆదేశించెను. ఓ! దు:ఖత్రయ వినాశకా! ఆ ముని యొక్క కృపా, ప్రభావము చే నేడు మీ దర్శనమయినది. మీరు నా యందు ప్రసన్నులయిన ఎడల ఈనా పుత్రునికి మీ పదముల యందు నిశ్చలభక్తి, త్రిలోకముల యందు విపులకీర్తి, అనాసక్త భావముచే రాజ్యమును పాలించు దక్షత, దీర్ఘాయువు, సద్గుణములు, బలము, కీర్తి, సుఖము, క్షమ, సమరమందు ఎల్లప్పుడూ విజయము, సుర భూసురులయందు పూజ్యతా భావము, ప్రసాదింపవలసినది." అంత డుంఠి గణపతి "ఓ! అనఘా! నీవడిడిన వరములన్నియు నీకు ప్రసాదించితిని. నీ పుత్రుడు ఒక వేయి సంవత్సరములు జీవించి, వేయి యజ్ఞములాచరించును. శాంతుడై, దాంతుడై, నా భక్తుడై రాజ్యపాలన కావించును. సామ, దాన, భేద, దండోపాయములచే సర్వులను వశమునందు యుంచుకొనును. అతడు సర్వదా నా నామ జపము, ధ్యానము చేయుచూ, అంత్య కాలమందు నా సారూప్యము నొందును." ఈ విధముగ పలికి డుంఠి గణపతి ఆ బాలునకు తన పరశువు నొసగి, ఆతనికి "పరశుబాహువు" అను ప్రసిద్ధ నామమును ఒసంగి అదృశ్యుడయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పరశుబాహు చరితము అను నలుబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది తొమ్మిదవ అధ్యాయము

(పరశుబాహు సారూప్యము)

బ్రహ్మ "ఈ విధముగ డుంఠి వినాయకుడు వరదానమిచ్చి వెడలిన పిదప కీర్తిదేవి తన పుత్ర సహితముగ ఆ రాత్రి ఆచటనే గడిపి, మరునాడు ఉష:కాలమున స్నానాదులాచరించి, తిరిగి వినాయక పూజనము ఒనర్చి, పుత్ర సహితముగ తన నగరమున కేగెను. ఆ సమయమున వారిరువురు గణపతి నామజపము ఆచరించుచుండిరి. వారు తమ నగరమైన కర్ణపురము చేరుసరికి, ఆ నగరమంతయు ధ్వజ పతాకయుక్తమై, రహదారులన్నియు కళ్ళాపి జల్లి ముగ్గులు పెట్టియున్నవి. కీర్తిదేవి అచ్చెరువొందుచుండగా ఆమె ఎదురుగా రాజు తన సేన, గాయక, వైతాళిక, వంది

మాగధులతో ఎదురువచ్చి; ఆ బాలుని ఆలింగనమొనర్చి "పుత్రా! క్షిప్రప్రసాదా! నిన్ను చూచుటనే నాకు అమృతాస్వాదనము కావించిన ఆనందము కలుగుచున్నది" అని పలికి, వచ్చిన వారందరికీ కానుకలొసగి, కీర్తిదేవిని గాఢముడ కౌగలించుకొని, ప్రేమగా ఇరువురినీ రాజమందిరమునకు గొనిపోయెను. కాలచక్రము కదలి క్షిప్రప్రసాదుడు యుక్త వయస్కుడయ్యెను. ఆతడు సర్వగుణ సంపన్నుడు, వినీతుడు, ధర్మజ్ఞుడు, నీతిశాస్త్రకోవిదుడు అయ్యెను. అంత రాజు సర్వులను సంప్రదించి, బ్రాహ్మణులను పలిచి, ఒక సుముహూర్తము నిర్ణయించి, సమస్త రాజనీకమును, ప్రజావళిని ఆహ్వానించి, గ్రహములు శుభస్థానమునున్న సమయమున పరశుబాహువు (క్షిప్ర ప్రసాదుడు) నకు రాజ్యాభిషేకమొనర్చెను. అటు పిమ్మట వారందరి వద్ద శలవు తీసికొని రాజదంపతి వానప్రస్థమున కరిగిరి.

అటుపిదప పరశుబాహుడు శాశకుడై, నీతి ధర్మముల ననుసరించి రాజ్యపాలన కావించెను. గొప్ప దానశీలి యని ప్రఖ్యాతిగాంచెను. తన బల పరాక్రమములచే త్రిలోకవిఖ్యాతుడయ్యెను. ఆతడు మందారవృక్ష కాష్ఠముతో చేసిన గణపతిని ఎల్లప్పుడూ మెడలో ధరించెను. ప్రతిదినము గణపతిని శమీపత్రములు, దూర్వాంకురములు, మందార పుష్పములతో పూజించెను. అనేకమంది రాణులను వివాహమాడి, వారితో రమించి, పుత్ర సంతతినొంది, ఒక వేయి వత్సరములు రాజ్యపాలన కావించి, తుదకు తన పుత్రులకు రాజ్య మొసగి, తాను స్వర్గమున కేగెను. ఆతడు దుంఠి వినాయక సారూప్యము నొంది అనేక కల్పములు స్వర్గమందు భోగముల ననుభవించెను.

బ్రహ్మ "మహర్షీ! నీకు ఈ విధముగ శమీపుత్ర, మందార పుష్ప, ప్రభావమును తెలిపితిని. నీవు సహితము వాటితో శ్రీగణేశుని అర్చింపవలసినది. భక్తితో సమర్పించిన పుష్పమైననూ, పత్రమైననూ, ఇష్టదేవతకు అమృతతుల్యమగును. దేవతలకు నిషిద్ధ పుష్పములు సమర్పించిన వారు నరకప్రాప్తి నొందెదరు. కానీ తన ఇష్టదేవతకు ఇష్టమయిన పత్ర, పుష్పములను ఇతర దేవతలను తన ఇష్ట దైవమనకు అభిన్నులుగ భావించి ఈయవచ్చును. ఈ విధముగ పంచాయతన దేవతల (శివ, విష్ణు, సూర్య, గణేశ, దుర్గ) ఉపాసన యొనర్చి, తన ఇష్టదేవతను ప్రాప్తించవచ్చు. సాత్విక పూజ ఆచరించు సాత్విక భక్తులు తమ ఇష్టదైవమందు లీనమగుదురు. రాజసిక భక్తులు తమ ఆరాధ్య దైవము యొక్క సారూప్యత నొందెదరు. సాత్విక, రాజసిక భావములు రెండునూ యున్న భక్తులు తమ ఇష్ట దేవత యొక్క సామీప్యత నొందెదరు. తామసిక భక్తులు తమ ఆరాధ్య దేవత యొక్క సాన్నిధ్యము నొందెదరు. ఈ విధముగ త్రివిధ భక్తుల భక్తి వృధా అవదు.

అంత వ్యాసుడు "విరించీ! వినాయకుని లోకము ఎక్కడ యున్నది? సర్వజ్ఞులైన మిమ్ములను వినా నేను ఎవరినీ ఈ సంశయము అడుగలేను." బ్రహ్మ "ఈ విషయమై వినాయకుడు నారదునకు, నారదుడు ముద్గలునకు, ముద్గలుడు కాశీరాజునకు తెలిపిరి. కాశీరాజు విమానారూఢుడై ఆ లోకమును తన చర్మ చక్షువులతో చూచెను. వినాయకుడు ఆ లోకమును తన కామదాయినీ శక్తితో నిర్మించి దానికి "నిజలోకము" అని పేరిడెను. ఆ లోకమున స్త్రీ పురుషులు కామ క్రోధాది ద్వంద్వములను పొందరు. వారు జ్యోతిరూపులై ఒక కల్ప పర్యంతము నివాసముందురు. ఆ నివాసులు ఇష్టానుసారము భోగింతురు. ఈ లోకము మహాప్రళయమందు సహితము నష్టమవదు. ఇయ్యది వినాయకుని నిద్రాస్థానము. ఇచట ఆయనకు సిద్ధి, బుద్ధులు సేవ చేయుదురు. సామవేదము ఆయనను స్తుతించుచుండును. ఇచట కల్పవృక్షము సర్వమును ఇచ్చును. ఆ కల్ప వృక్షముచే అకల్పనీయ సంపదలు సహితము లభ్యమగును. శ్రీగణేశుని నిజలోకమును వర్ణించుట నాకు అసంభవము. నీకు సర్వము సంక్షేపముగ తెలిపితిని. ఇంకనూ ఏమి వినదలచుకుంటిని?"

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పరశబాహు సారూప్యమను నలుబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఏబదియవ అధ్యాయము

(స్వానంద భువనము)

వ్యాసుడు “విరించీ! కాశీరాజు తన చర్మ చక్షువులతో శ్రీగణేశుని స్థానమును చూచెనని తెలిపితిరి కదా! ఆ దివ్య స్థలి ఆయనకు ఎట్లు కనబడినది? దయచేసి వివరింపవలసినది.” బ్రహ్మ “తీర్థయాత్రలు కావించుచూ ఒకనాడు ముద్గల మహర్షి కాశీరాజు వద్దకు ఏతెంచెను. కాశీరాజు సర్వజ్ఞుడయిన ఆ మహర్షిని “స్వామీ! శ్రీగణేశుడుండెడి వినాయక స్థానమెట్టిది? దానిని ఎట్లు ప్రాప్తింప వలెను?” ముద్గలుడు “రాజా! వినాయక స్థలి” స్వానంద భువనము” లేక “నిజలోకము” అని పేర విఖ్యాతి నొందినది. లోకము నందు దేవాంతక, నరాంతకులను ఇరువురు దైత్యులుద్భవించెదరు. వారి సంహరణార్థము ఆ పరాత్పరుడు భూలోకమందు అవతరించును. తన స్వేచ్ఛానుసారము క్రియలు గావించు ఆ వినాయక భగవానుడు బాలునిగనే తన పరాక్రమము ప్రదర్శించి అద్భుత లీలలు గావించును. నీ పుత్రుని వివాహ సంబంధముగ నీ ఇంటికి ఏతెంచును. నీ రాజ్యమందలి “శుక్ల” అను నిర్ధన బ్రాహ్మణుని ఇంట భోజనమారగించి ఆతనికి ఇంద్రతుల్య భోగములు అనుగ్రహించును. అపుడు నీవు ఆయన యందలి భక్తి ప్రభావముచే ఆయన లోకమున కేగుదువు.” ఈ విధముగ పలికి ముద్గల మహర్షి తన దారిని తాను వెడలెను. అప్పటి నుండి కాశీరాజు పరమ భక్తితో శ్రీగణేశుని పూజించుచూ సమయము కొరకు వేచి చూచుచుండెను. చాలాకాలము గడచిన పిమ్మట శ్రీగణేశుడు కశ్యప పుత్రునిగ అదితీగర్భమందు జన్మనొందెను. బాల్యమునందే అనేక మంది దైత్యులను హతమార్చి ఆ లీలామానుషధారి కాశీరాజ గృహమున కేతెంచెను.

తదుపరి దేవాంతక, నరాంతకులను సంహరించి, త్రిలోకముల యందును శాంతిని నెలకొల్పి, తన అవతారము చాలించి స్వానంద భువనమున కేగెను. అటు పిద కాశీరాజు వినాయక విరహముచే నిరంతరము ఆయన గూర్చిఏ చింతించుట మొదలిడెను. ఆయన ఎవరిని చూచిననూ ఆయనే వినాయకుడని ఆలింగన మొనర్చును. ఆయన సర్వ వేళలా, సర్వుల యందునూ వినాయకునే కాంచుచూ వినాయక ధ్యానమందు తన్మయుడయ్యెను. ఆయనకు తిండిపై సహితము ధ్యాస లేదు. స్వప్నమందు వినాయకుని చూచెదనని ఒక్కొక్కసారి నిద్రించుచుండును. వినాయకుని తలచుకొని ఒక్కొక్కసారి నవ్వుకొనును. ఒక్కొక్కసారి నృత్యమొనర్చును. కానీ, రాజు యొక్క స్థితిని గమనించిన అమాత్యులు ఆంధోళన నొందసాగిరి. ఎందుకనగా ప్రజలకు గానీ, శత్రు రాజులకు గానీ రాజు పరిస్థితి తెలిసిన ఎడల తిరుగుబాటు కానీ, దురాక్రమణము గానీ జరుగునని వారి చింత. ఎంత స్వామి భక్తి పరాయణత్వము!!!

రాజు యొక్క స్థితిని తెలుసుకొని ముద్గల మహర్షి తన తపమునాపి ఆ రాజు యొక్క ఆస్థానమున కేతెంచెను. మహర్షిని గాంచి రాజు యధావిధిగ అర్ఘ్య పాద్యాదులు సమర్పించి పూజనమొనర్చెను. మహర్షి ప్రసన్నుడై “రాజా! నీ వంటి మనుష్యుడు “న భూతో న భవిష్యతి”. నీ పూజతో నేను సంతుష్టుడనైతిని. నీకేమి వరము కావలెనో కోరుకొనుము. ప్రసాదించెను” అని పలికెను. అంత కాశీరాజు “మహర్షీ! నాకు ఈ రాజ్యము, ధనాదులు, ఏవియునూ రుచించుట లేదు. కేవలము ఈ శరీరముతో శ్రీగణేశుని స్వానంద భువనమునకు ఏగి చిరకాలము అచట నివసింప వలెనని కోరిక కలదు” అని బదులిచ్చెను. అంత ముద్గలుడు “రాజా! నీవు ఈ పాంచభౌతిక శరీరముతో స్వానంద భువనమునకేగి అచట ఒక కల్ప కాలము సుఖదానందము అనుభవించెదవు.” రాజు “స్వామీ! నేను ఎన్నో లోకముల వర్ణనము వింటిని. కానీ స్వానంద భువనము గూర్చి వినియుండలేదు. ఈ లోకము ఎట్టిది? ఎటువంటి పుణ్య బలముచే అచటికి ఏగ గలరు?”

ముద్గలుడు "రాజా! నేను ఈ లోకపు మహిమను గూర్చి కపిలముని ద్వారా వింటిని. ఈ లోకము యొక్క గతి అతి గుహ్యము, గహనము. ఇచట వినాయకుడు అయిదు వేల యోజనముల కామదాయినీ పీఠమందు విరాజమానుడై యుండును. ఈ పీఠము సువర్ణ రత్న ఖచితమై యుండి సర్వ దిశలను ప్రకాశవంత మొనర్చుచుండును. ఇయ్యది ఇక్షు సాగర మధ్యమున యున్నది. ఈ లోకమునకు కేవలము వినాయకుని నిత్యభక్తి ద్వారా ప్రాప్తించిన పుణ్య బలముతో మాత్రమే వెళ్ళగలరు. దాన, వ్రత, వేదాధ్యయనము, తప, యజ్ఞ, జపాది ఏ ఇతర క్రియలచే కూడా ఇచటికేగుట అసాధ్యము. ఇచట విఘ్నరాజు తన సమిష్ఠి, వ్యష్ఠి రూపములతో నివసించుచుండును. ఆ విరాడ్రూపుడు తన చరణములతో సప్త పాతాళములు, శేషుడు, మరియు ఆదికూర్మమును, చెవులతో దిశలను, కేశములతో ఆకాశమును, వ్యాప్తినొంది ఆధార శక్తిరూప కమలమందు స్థిరముగ యుండును. భక్తులు ఖేచరీముద్ర ధరించి భ్రూమధ్యము నందలి ద్విదళపత్ర ఆజ్ఞాచక్రమందు శ్రీగణేశుని ధ్యానమొనర్చెదరు. వినాయక భగవానుడు షట్చక్రములు, బ్రహ్మ రంధ్రమందు తేజో రూపముతో విరాజమానుడై యుండును. మూలాధార, స్వాధిష్ఠాన చక్రముల యందు బ్రహ్మగ్రంధి రూపమున బ్రహ్మ, అనాహత చక్రమందు ద్వాదశ దళ కమలము వంటి విష్ణు గ్రంధి యందు విష్ణువు, కంఠమందలి విశుద్ధి చక్రమందు షోడశ పద్మస్థితుడై రుద్రగంధి యందు శివుడు విరాజిల్లుచుందురు. సూర్య, చంద్రాగ్నులు శ్రీగణేశుని నేత్రములు. భూమండలము గ్రంధి యందు విష్ణువు, కంఠమందలి విశుద్ధి చక్రమందు షోడశ పద్మస్థితుడై రుద్రగంధి యందు శివుడు విరాజిల్లుచుందురు. సూర్య, చంద్రాగ్నులు శ్రీగణేశుని నేత్రములు. భూమండలము ఉదరము. వినాయకుడు ఊర్ధ్వమున ఇరువది ఒక్క స్వర్గములు వ్యాపించియుండును. ఓషధులు ఆయన రోమములు. నదులు, సముద్రములు ఆయన చెమట బిందువులు. బ్రహ్మాండములు ధూళి కణములవలె ఆయన రోమ కూపములందు స్థితిగతమై యున్నవి. ముప్పది మూడు కోట్ల దేవతలు, వేలాది ప్రకారములయిన జీవులు ఆ బ్రహ్మాండముల యందు నిబిడీకృతమై యున్నవి.

రాజా! నీకు ఆ స్వానంద భువనము యొక్క విశేషములను సంక్షేపముగ తెలిపెదను. అచట మేరు పర్వతము శిఖరములతో ఒప్పారుచుండును. మేరు పర్వత శిఖరము కైలాస శిఖరమువలె వేయి యోజనముల ఎత్తు కలిగి జనశూన్యమై, మునివరులకు సహితము అగమ్యగోచరమై యుండును. ఈ శిఖరముపై "భ్రామిక" అను శక్తి కలదు. ఆ శక్తిచుట్టొ తెల్లని తుమ్మెదలు ఘుంకారము చేయుచూ ఎగురుచుండెను. ఆ శక్తిపై స్వర్ణకాంతితో ప్రకాశించు ఆధారశక్తి స్థితిగతమై యుండును. ఈ ఆధారశక్తి పైన అత్యంత విశాలము, కోటిసూర్య సమాన ప్రకాశము కలిగిన కామదాయనీ పీఠముయున్నది. ఇయ్యది పదివేల యోజనముల నిడివి, వెడల్పు కలిగియుండును. ఈ కామదాయినీ పీఠముపై అసంఖ్యాక సూర్య తేజస్సుతో ప్రకాశించు స్వానంద భువనమున్నది. ఈ స్వానందభువనమందు లెక్కకందని స్వర్ణ, రజిత, రత్న, ఖచిత భవంతులెన్నియో విరాజమానమై యున్నవి. దు:ఖము, మోహము, యుండని ఈ ప్రదేశము లోనికి కేవలము వినాయక ప్రభువు కృపచే మాత్రము వెళ్ళగలరు.

ఈ స్వానంద భువనమునకు ఉత్తరమున ఇక్షుసాగరమున్నది. ఈ ఇక్షుసాగర మధ్యమున సహస్రదళయుత పద్మము పూర్ణచంద్రుని వలె ప్రకాశించుచుండును. ఈ పద్మపు కర్ణిక యందు స్వర్ణశయ్యపై వినాయక భగవానుడు శయన ముద్రాంకితుడై యుండును. సిద్ధి బుద్ధులు ఆయన పాద సంవాహనము చేయుచుండగా, సామవేదము మూర్తివంతమై, ఆయన గుణములను కీర్తించుచుండగా, పురాణములు ఆయన సుద్గణములను వర్ణించుచుండును. అచట వినాయకుడు బాలరూపధారియై, సుందరమైన తొండము, అరుణిమల కాంతినొసగు కోమలమైన అంగములు, విశాలమయిన కనుదోయి; కస్తూరీ తిలక శోభితము, మహాముకుట కుండల ధారణ మొనర్చిన శిరము; స్వయంప్రకాశుడై, దివ్యగంధానులేపితుడై, మణిముత్యముల మాలలు ధరించిన విశాలవక్షము, శిరమందు బాలచంద్రధారియై, కోటిసూర్య ప్రకాశుడై విరాజిల్లుచుండును. గంగాదేవి మానవుల పాపములను దూరమొనర్చునట్లు, తనను స్మరించు భక్తుల పాపములను ఈ

శ్రీగణేశుడు మటుమాయ మొనర్చును. సహస్ర సూర్యుల ప్రకాశము గల “తేజోవతి”, “జ్వాలిని” అను శక్తులు ఆయన పర్యంకమున కిరుప్రక్కలా విరాజిల్లుచుందురు. స్వానంద భువనమందు శీతోష్ణములు, అలసట, వృద్ధావస్థ, స్వేదము, క్షుధాపిపాసలు, దు:ఖములు ఇత్యాదులుండవు. అచటి జనులు అత్యంత ఆనంద సాగరమునందు ఓలలాడుచుందురు.” ముద్గలుడు “రాజా! నీకు స్వానంద భువనము గూర్చి నా బుధ్యానుసారముగ తెలిపితిని. నీవు అనన్య భక్తితో వినాయకుని ఆరాధింపుము” అని పలికి తన ఆశ్రమమునకు చనెను. కాశీరాజు శ్రీగణేశ భజనయందు తత్పరుడై అయిదువేల వత్సరములు రాజ్యపాలనము ఒనర్చి, మానవ దేహముతో దివ్య విమానమధిరోహించి శ్రీగణేశుని స్వానంద భువనమున కేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి స్వానంద భువనమను ఏభైయవ అధ్యాయము సమాప్తము)

ఏభై ఒకటవ అధ్యాయము

(కాశీరాజుకై దివ్య విమానాగమనము)

వ్యాసుడు “పరమపితా! కాశీరాజు వినాయకారాధన ఎట్లు గావించెను? ఆయన స్వానంద భువనమునకు ఎట్లు ఏగెను? ఆ సంఘటన గూర్చి మరింత వివరింప వలసినది.” బ్రహ్మ “సాత్యవతేయా! నీకా పాపనాశన సంఘటన సంపూర్ణముగ వివరించెదను. జ్ఞాన సాగరుడయిన ముద్గల మహర్షి బోధ వినిన పిదప కాశీరాజు మనోవాక్కాయములతో శ్రీగణేశుని యందు భక్తి తత్పరుడయ్యెను. ఆ వినాయకుని ప్రసన్నమొనరించుటకు ఆయన నిత్యము గోవు, గజాశ్వ, రథ, గృహ, ధాన్యాది దశ దానములను విరివిగ యొనరించెను. బ్రాహ్మణులను ధన మృష్టాన్న భోజనములతో సంప్రీతుల నొనర్చి, వారిని తనకు శ్రీగణేశుని యందు ధృఢభక్తిని కలుగునటుల ఆశీర్వదించమని వేడుకొనెడివాడు. ఒకనాటి మాఘ శుద్ధ చతుర్ధినాడు ఉష:కాలముసే లేచి సంధ్యావందనాది నిత్య కర్మానుష్ఠానమొనర్చి, దివ్య దుకూలాభరణములు ధరించి, లోకులను, నగర ప్రముఖులను, బ్రాహ్మణులను, మిత్రులను పిలచి వారందరికీ రత్న, వస్త్రాదులతో పూజనము ఒనర్చి కూర్చునెను. శ్రీగణేశుడు ఈ భక్త శిఖామణికి అంత్యకాలము సమీపించినదని తెలిసి “ఆమోద,” “ప్రమోదులు” అను ఇరువురు దూతలకు ఒక దివ్య విమానము నిచ్చి ఆ రాజును గొనిరమ్మని పంపెను. ఆ విమానము భువిని చేరుచుండగా లోకులు ప్రళయాగ్ని సమీపించుచున్నదని కొందరు, మేఘములు లేక విద్యుద్ఘాతము కలుగుచున్నదని మరికొందరు, సూర్యమండలమే క్రిందికి దిగుచున్నదని వేరొకరు, పేర్కొనగా, కొందరు లోకులు ఇయ్యది ఘంటాయుక్తమై, తూర్య నినాదితమై, గంధర్వాప్సరసల శబ్దములచే కూడినదై యుండుటచే, ఇది శ్రీగణేశునిచే పంపబడిన విమానమై యుండునని తలచిరి. ఇంతలో పరమ శోభాయమయిన దివ్య విమానము కాశీరాజ సన్నిధిని ఆగెను.

అందునుండి ఆమోద ప్రమోదులు క్రిందికి దిగిరి. వారిరువురు దివ్య వస్త్రభూషణములు ధరించి, దివ్య మాలాంబరధారులై, కామదేవుని వంటి సుందరులై, దివ్య గంధానులేపన మొనర్చి, వినాయక సారూప్యముతో వెలుగొందుచుండిరి. కాశీరాజు వారిరువురికీ ప్రణామము లొనర్చి, ఆశీనుల కావించి పూజించెను. అంతవారు “రాజా! శ్రీగణేశుడు నిన్ను నిరంతరము తలచుచూ, నీ గుణములు కీర్తించుచుండెను. నీవు ధన్యుడవు. నీ జీవితమును సఫల మొనర్చుకుంటివి. నీ దర్శనముచే మహాపాపములు, అజ్ఞానాంధకారము ధ్వంసమగును. నీ పూర్వ జన్మమందు నీవేమి పుణ్యకార్యములు ఒనరించితివో మేమెరుగము. నిన్ను శీఘ్రముగ తీసికొని రమ్మని ఈ దివ్య విమానము నంపెను. ఈ పలుకులన్నియు రాజుతో పాటు సభికులందరూ వినిరి. ఆ పలుకులు విని రాజు కనులవెంట ఆనందాశ్రువులు

రాలుచుండగా, ఆనంద సాగరమున మునిగి, తుదకు దేహ భావ మంకురించగా వారిరువురికీ నమస్కరించి, ఇట్లనియె "నేడు మీ దర్శనముచే నా జన్మము, మాతాపితరులు, నిష్ఠ, భక్తి, సంపద, ధన్యమయినవి. వినాయకుడు నిర్గుణ, చిదానంద, సనాతన పరబ్రహ్మ. సృష్టి స్థిత్యంత కారకుడు. అగోచరుడు. స్థూలము కంటె స్థూలము. సూక్ష్మము కంటె సూక్ష్మము. ఆయన నానావతారములు తీసికొని నప్పటికీ నిరాకారుడు. నా వంటి దీనునిపై సహితము అపార కృప కురిపించు కరుణానిధానుడు." ఈ విధముగ పలికి మహారాజు సర్వులకు నమస్కృతులొనర్చి, తన కుమారుని ఆమాత్యులకప్పగించి, ధర్మానుసారము సేనా సహాయముతో ప్రజాపాలనము ఒనర్పమని తెలిపి, దూతలిరువురినీ విమానము అధిరోహింపమని, అటుపిదప తాను విమాన మధిరోహించెను. దూతలు రాజునకు దివ్య దుకూలాభరణములు బహూకరించిరి. అంత విమానము దివ్యకాంతులీనుచూ, వాయువేగమున అంబరమున కెగసెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కాశీరాజుకై దివ్య విమానాగమనము అను ఏబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఏబది రెండవ అధ్యాయము

(వివిధలోక వర్ణన)

మార్గ మధ్యమున వికారాకృతి గల అనేక జీవుల గాంచి రాజు దూతలను "అదేమి లోకము?" అని ప్రశ్నించెను. దూతలు "రాజా! ఇయ్యది పిశాచలోకము. పరనింద కావించువారు, పిసినారితనము, చోరవృత్తి, సలుపువారలు ఆచటి కేతెంచెదరు. ఆ పైన రాజు అసుర, రాక్షసలోకములు కాంచెను. అందలి జీవులు వివిధాకృతులు కలిగి ఊర్ధ్వకేశులు, భీషణ భయానక ముఖులు, మేఘగర్జన వంటి స్వరము కలిగిన పర్వతాకారులు. ఈ లోకము గూర్చి ప్రశ్నింప, దూతలు "రాజా! ఇయ్యది దానవులు, రాక్షసుల లోకము. ఇచట శ్రౌత, స్మార్త క్రియా రహితులు చేరెదరు." కొంచెము దూరము పయనించిన పిదప వారికి వేరొక లోకము కనబడెను. అచటి గృహములు బంగారము, వెండితో నిర్మింపబడి, అచటి స్త్రీ పురుషులు రతీ మన్మధుల తోపించుచుండిరి. వారందరూ నృత్యగాన విశారదులు. దూతలు "రాజా! ఇది గంధర్వలోకము. దేవస్థానములందు భజన కీర్తనాదులు కావించిన పుణ్యులు ఇచటికి ఏతెంచెదరు. తదుపరి వారు ఇంద్రనగరమయిన అమరావతిని కాంచిరి. అంత దూతలు "ఇది అమరావతి. నూరు అశ్వమేధ యాగములాచరించిన మహాపురుషుడు ఇంద్రపదవికి అర్హుడగును. ఇచటికి ఏతెంచ వలెనన్న గో, రథాశ్వ, గజములు, స్వర్ణ, రత్నముల దాతలు, తీర్థస్నానాది వివిధములయిన పుణ్యములు ఆచరింపవలెను." అంతవారు రాజుకు ఇంద్ర భవనమును చూపిరి. రాజు "దీనిని గూర్చి వింటిని. మీ దయవల్ల, శ్రీగణేశుని కృప వలన ఈనాడు నా చర్మ చక్షువులతో చుడగలుగుచుంటిని" అని పలికెను. అటు పిదప వారు అగ్ని లోకమును కాంచిరి. అచటి జనులందరూ అగ్ని వంటి తేజస్సు గలవారై యుండిరి. తదుపరి వారు యమ లోకమును సందర్శించిరి. అచట శుభాశుభ కర్ములు ఇరువురు యుందురు. పుణ్యాత్ములు భోగములను, పాపాత్ములు నరయాతనను అనుభవవించు చుందురు. పుణ్యాత్ములకు యముడు సౌమ్య ధర్మరాజ రూపమున, పాపాత్ములకు భీషణ రూపమున దర్శనమిచ్చును. అచట కుంభీపాక, అసిపత్రవన, తామిస్ర, అంధతామిస్రాది అనేక నరములందు పాపులు శిక్షల ననుభవించుచూ ఆక్రందనలు కావించుచుండిరి. రాజు అవి చూడలేక కన్నులు మూసికొనెను.

అటుపిదప మహారాజు ఒక ఆశ్చర్యాన్విత లోకమును చూచెను. అయ్యది అమరావతి కంటె సుందరమై, భవంతులన్నియు రత్నములు పొదిగిన బంగారపు గోడలతో నిర్మింపబడినవి. దూతలు "రాజా! ఇయ్యది కుబేరుని నగరమైన

అలకాపురి. సువర్ణ, రత్న దానములు ఒసగిన మహానుభావులు ఇచటకు ఏతెంచెదరు.” కొంచెము దూరము ఏగుసరికి వారికి మరింత సుందర నగరము (లోకము) అవలోకితమయినది. అచటి జనులు అనేక సుఖ భోగములు అనుభవించుచుండిరి. దూతలు “రాజా! ఇయ్యది వరుణలోకము. తీర్థస్నానము, అన్నదానాదులు, జలదానము, వాపీకూప తటాకాదులు నిర్మించిన దాతలు ఇచట కేతెంచెదరు.” అటుపై ప్రయాణించి వారు వాయులోకము చేరిరి. గ్రీష్మఋతువు నందు విసనికర్రలు, కర్పూరమిళిత సుగంధ స్వచ్ఛ జలములు దానమొనర్చిన జీవులు ఇచటి కేతెంచెదరు. తదుపరి వారు దుర్గమమైన సూర్యలోకము చేరిరి. పంచాగ్ని హోత్ర నిరతులు, సూర్య భక్తి పరాయణులు, అవాప్తకాములు ఈ లోకమందు ఒక కల్పము నివాసముందురు. తదుపరి వారు పయనించి నక్షత్రలోకము లేక చంద్రలోకమును కాంచిరి. ఇహలోకమందు ముత్యములు, సువర్ణదానము, ఒనర్చిన మహాపురుషులు ఈ లోకము చేరి భోగింతురు. అటుపై ప్రయాణించి వారు గోలోకము చేరిరి. బ్రాహ్మణులకు వేయి గోవులు దానమొనర్చిన పుణ్యాత్ములు ఆ గోవు శరీరమందు ఎన్ని వెంట్రుకలు యున్నవో, అన్ని కల్పములు వారు ఆ గోలోకమందు సుఖానుభవము నొందెదరు. తదుపరి ప్రయాణించి వారు సత్యలోకము చేరిరి. సత్య వాక్పరిపాలకులు, వ్రత పాలనులు, వేదవేత్తలు, వేదాధ్యయనతత్పరులు, సదాచారులు, శాస్త్రవేత్తలు, పురాణమును పఠించువారలు, అన్నదాన తత్పరులు, యజ్ఞకర్తలు, తీర్థాటనము సలుపువారు, ప్రతిగ్రహము చేయనివారు, పరోపకారులు, తపస్యులు, దానపరాయణులు, వీరందరూ సత్యలోకము చేరెదరు. సత్యలోకము ఎనిమిది వేల గవ్యాతి (ఒక గవ్యాతి = రెండు క్రోసుల దూరము) పొడవు, వెడల్పు కలిగి యుండును. అందు అత్యంత భక్తి తత్పరులైన మునులు, రాజర్షులు, దేవర్షులు, అంతేకాక యక్ష, రాక్షస, గంధర్వ, అప్సరసలచే స్తుతింపబడుచున్న బ్రహ్మదేవుని మహారాజు కాంచెను. రాజు “ఆహా! నేనెంత ధన్యుడను. కృపాళువైన శ్రీగణేశుని కృపచే నేను ఈ దర్లభమైన లోకములన్నియు చూచుచున్నాను.”

అటుపిదప వారు ముప్వురూ ప్రయాణించి సర్వ శ్రేష్ఠమయిన వైకుంఠమును కాంచిరి. ఈ లోకమును మరే లోకముతోనూ పోల్చలేము. ఈ లోక వర్ణనము ఫణిపతికి, భాషాపతికి కూడా నశక్యము. కార్తీక, మాఘ, వైశాఖ మాసములందు స్నానమొనర్చినవారు. తిల, అన్న, గోదాన మొనర్చినవారు, గీతాధ్యయనము కావించువారు, పరోపకార పరాయణులు, ఇచట కేతెంచెదరు. ఇయ్యది అయిదు వేల యోజనముల పొడవు, వెడల్పు కలిగియుండును. ఇచట విశ్వకర్మ నిర్మితము, బంగారు, వెండి, రత్నరాశులతో నిర్మించిన వివిధ భవన సముదాయములు కలవు. ఇచట దైత్య సంహారకరుడయిన విష్ణుమూర్తి తన పరివార సహితుడై నివసించును. తిరిగి కొంచెము దూరము ప్రయాణించి శివుని నివాస స్థలమైన కైలాసమును వీక్షించిరి. ఇయ్యది మేరు పర్వత శిఖరమున పదివేల యోజనముల విస్తీర్ణమున యున్నది. ఇచటి భవనములు సూర్య చంద్ర రశ్మిచే ప్రకాశించుచూ అత్యంత శోభాయమానముగ యున్నవి. పంచాక్షరీ మంత్ర పరాయణులు, రుద్రాధ్యాయులు, అనేక సాధనలనొనర్చిన పుణ్యాత్ములు ఇచటికి చేరుదురు.

రాజు అత్యంత ఆనందభరితుడయ్యెను. అటు పిదప విమానము ఒక వేయి యోజనములు అగమ్యగోచరమైన చీకటి యందు ప్రయాణించెను. కేవల విమానకాంతి మినహా వేరే ఏకరమయిన కాంతి లేకుండెను. పర్వత శిఖరములను భేదించు దు:సహమైన ధ్వని కావించు భ్రమరముల మేఘగర్జన వంటి ధ్వని వినిపింపసాగెను. అంత రాజు కొంచెము భయవిహ్వలుడై దూతలతో “నేను వినాయక ప్రభుని పాదపద్మములు ఎప్పుడు కాంచెదను? ఈ భయంకర ధ్వని ఏమి?” అని ప్రశ్నించెను. ఇంతలో వారు తన ముఖము తెరచి బ్రహ్మాండమును సహితము మ్రింగగులగు భ్రామరీశక్తిని కాంచిరి. రాజు ఆ శక్తిని కాంచి మూర్ఛనొందెను. అంత దూతలు ఆయనకు స్వస్థత కలగించిరి. అంత రాజు మెలకువనొంది, కొంచెముపైకి ప్రయాణించి ఇంకనూ భయంకరమైన ఆధారశక్తిని కాంచెను. ఆధారశక్తి వికృతమయిన ముఖము, విరబోసుకున్న కేశములు, దీర్ఘజిహ్వ కలిగి యుండెను. అటుపిదప తిరిగి పయనించి పదివేల యోజనముల విస్తీర్ణమునున్న కామదాయినీ శక్తిని కాంచిరి. ఆ శక్తిపై స్థాపించియున్న స్వానంద భవనమును దూతలు రాజుకు చూపించిరి. ఆయ్యది

స్వర్ణ, రజిత, ముత్య, రత్న, సుర్యకాంత మణులతో నిర్మింపబడిన అనేక భవన రాశులతో నిండియున్నది. అచటి ఇంటి పునాదులన్నియు నీల మణులచే నిర్మితమయినవి. అచటి వాపీకూప తటాకములన్నియు స్వచ్ఛ శీతల జలములు కలిగి, వాని తటములు పుష్యరాగ నిర్మితములైయున్నవి. ఆ నీటిని సేవించు జనులకు ఆకలిదప్పులు, వృద్ధాప్యము, సోకవు. క్రీడోద్యానములన్నియు నానావృక్ష, లతాశోభితములై దివ్యౌషధ యుక్తములై విలసిల్లుచున్నవి. అచటి విలాసినీమణులు తమ సౌందర్యమును చంద్రుని యందు వీక్షించెదరు. రాత్రివేళల చంద్రుడు ఆకాశము నుండి క్రిందికి దిగి వారల దగ్గరకు ఏతెంచును. అచటి ఉపవనములందలి పుష్ప సుగంధము రతిక్రీడలొనర్చు కాముకుల శ్రమను దూరమొనర్చును. ఇటువంటి సుందర శుభస్థానమున, ఇక్షుసాగర తీరమున వారందరూ అత్యంత ప్రసన్నులై క్రిందికి దిగిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వివిధలోక వర్ణనమను ఏబది రెండవ అధ్యాయము సమాప్తము)

ఏబది మూడవ అధ్యాయము

(వినాయక, కాశీరాజ సమాగమము)

బ్రహ్మ "వారందరూ ఆ ఇక్షుసాగర తీరమున దిగి పరమ పుణ్యములచే మాత్రమే ప్రాప్తమగు ఇక్షురసమును సేవించిరి. ఆ ఇక్షుసాగర మధ్యమున సహస్రదళ పద్మము కలదు. ఆ పద్మ మధ్యమున కర్ణికపై వినాయక దేవుని పరమ మనోహరమైన పర్యంకము కలదు. అద్దానిచుట్టూ దివ్య ధూపములు, దివ్య పుష్పములు సువాసిత మొనర్చుచున్నవి. పర్యంకముపై దివ్య వస్త్రము పరుచబడియున్నది. పద్మము తన కాంతిచే దిశలు, విదిశలు, ప్రకాశవంత మొనర్చుచున్నది. ఆ సుందర పర్యంకముపై వినాయక ప్రభువు శయనించుచుండెను. ఆయన కోట్లాది చంద్రకాంతితో ప్రకాశించుచూ, నానాభూషణధారుడై, శేషుని సహితుని భూషణముగ ధరించి, కదళీ తరువు వంటి తొండముతో, త్రినేత్రుడై, మహా ముకుట కుండలధారియై, రెండు బాహువులకు అంగదములు, భుజకీర్తులు, వేళ్ళకు ఉంగరములు, నడుమునకు బహుమూల్య కటి సూత్రము, ధరించియుండెను. సిద్ధి బుద్ధులు ఆయనకు పాద సంవాహన మొనర్చుచుండిరి. "అణిమ", "గరిమ" ఆయనకు శ్వేత చామరములు వీచుచుండిరి. "జ్వాలినీ" "తేజినీ" శక్తుల ఆయనకు ఇరుప్రక్కలా జ్వాలాయమానముగ తేజరిల్లుచున్నవి. వినాయకుని శరీరము దివ్య సుగంధ విలేపితమై, సుందరమాలా విభూషితమై యున్నది. "మహిమా", ప్రధిమా" శక్తులు ఆయన కనుసన్నలలో జలము, గంధము పట్టుకొని యున్నవి. వినాయకుని దూత లిరువురు రాజు యొక్క హస్తము గ్రహించి వినాయకుని వద్ద కేతెంచి "స్వామీ! మీ ఆజ్ఞతో కాశీరాజును తీసికుని వచ్చితిమి" అని పలికి దూరముగ నిలుచుండిరి.

కొంచెము సేపటికి వినాయకుడు కనులు తెరచెను. అంత మహారాజు తన రెండు చేతులు జోడించి "మహాప్రభూ! నేడు నా జన్మము, మాతాపితరులు, వంశము, విద్య, జపతపములు, నేత్రములు, పుత్రాదులు సర్వము ధన్యమయినవి. ఎందుకనగా చతుర్ముఖ బ్రహ్మకు సహితము ధ్యానయోగ్యమయిన మీ చరణకమలములు నాకు గోచరమైనవి. ఇటువంటి వైభవము ఇక ఏలోకమందునూ కద్దు" అని పలికి అత్యంత కోమలాంగుడు, దేవాంతక, నరాంతకహారి, కర్పూరము వంటి గౌరవర్ణుడయిన బాలగణపతిని చూచుచూ, ఆనందాశ్రువులచే ఆ పరమాత్ముని రెండు పాదములు కడిగెను. ఆ మహాభక్తుని భక్తి తీవ్రతను తెలిసిన పరాత్పరుడు వినాయకుడు ఆ రాజును రెండుభుజములు పట్టి, లేవనెత్తి, చాలా కాలమునకు చూచిన పుత్రుని యందు పెల్లుబికిన వాత్సల్యము గల తండ్రివలె ఆతని శిరమును ముద్దాడి, మూర్ధన్యమును ఆఘ్రాణించెను. వినాయకునికి సహితము ప్రేమచే కన్నుల అశ్రువులు కారుచూ కంఠము రుద్ధమయ్యెను. రాజు,

వినాయకలిరువురు రోమాంచితులైరి. అంత తిరిగి దేహభావము నొందిన పిదప వినాయకుడు రాజుతో "పుత్రా! నేను మీ ఇంటి యందు కావించిన లీలా విలాసములు, శుభాశుభములన్నియు నీవు ఎంతో ఓర్పుతో సహించితివి. నేను ఎందరో దైత్యులను సంహరించి, సాధు సజ్జనులను రక్షించి, ధర్మమును స్థాపించి, నీ ఆజ్ఞచే కశ్యపుని వద్దకు ఏగితిని. అచట అదితీ కశ్యపులకు ప్రణామము లొనర్చి తిరిగి నా దివ్య లోకమునకు తిరిగి వచ్చితిని. ఇచట నేనునూ నిన్నే స్మరించుచున్నాను. నీకు నా యందలి ఉత్కట భక్తి భావముచే ముద్గల మహర్షిని నేను నీ వద్దకు పంపితిని. బ్రహ్మాది దేవతలకు సహితము అగమ్యమైన నా లోకము నీకు ఆ మహర్షి కృప వలననే లభించినది. అంత మహారాజు పున:పున: శ్రీగణేశునకు నమస్కృతులర్పించి, ధైర్యము బూచి ఇట్లు స్తుతించెను.

రాజు "ఓ! దీననాథా! బ్రహ్మాదులచే పూజింపబడునవి, పద్మ, పాశ, ఖడ్గ, పరశువాది శుభ చిహ్నములు కలిగినవి, మీ భక్తజనుల విఘ్నముల హరించునవి, శివకేశవాది దేవతా ప్రముఖులకు సహితము అనేక ప్రకారములయిన కార్యసిద్ధి కలిగించునవి, అర్థప్రయోజనము ఆశించు మనుజలచే పూజింపబడునని, విఘ్నములను వినష్టమొనర్చునవి, సంసార సర్పదష్టులయిన భక్తులపై కరుణామృతమును కురిపించునవి అయిన నీ పాదములకు నమస్కారము. స్వామీ! సూర్య చంద్రాగ్నుల రూపమయిన త్రినేత్రములు కలది, త్రివిధ (ఆధ్యాత్మిక, ఆదిభౌతిక, ఆది దైవిక) తాపములను సమూలముగ నష్టమొనర్చునది అయిన నీ ముఖారవిందమునకు నమస్కారము. అనేక శస్త్రాస్త్రములు దాల్చి దైత్య సంహారమొనర్చినవి, భక్తులకు అభయ ప్రదానము కావించునవి, సంసార కూపమునుండి వెలిదీయునవి అయిన మీ కరకమలములకు నమస్కారము. స్వామీ! మీకు జన్మలేనప్పటికీ రజో గుణావలంబనచే సృష్టి సలిపి, సత్వ గుణావలంబనచే దానిని పోషించి, తమోగుణావలంబనముచే దానిని సంహరించుచున్నావు. ఓ! గణేశా! ఈ చరాచర జగత్తు నీ వశమునందున్నది. అయిననూ శుద్ధచిత్తులయిన మానవుల విఘ్నములు దూరమొనర్చుటకు నీవు ఎల్లప్పుడూ వారి వెనుక పరుగులెత్తుదవు. భక్తులు నిన్ను భక్తితో వశీభూతులొనర్చుకొని సుఖనిద్ర గరిపెదరు. నీవు వారి హితమునకై దూడవెంబడి పరుగెత్తు ఆవువలె నిలబడి కాపాడెదవు. మనుజులు ఇతర దైవములను కొలిచి జనన మరణ చక్రమందు తిరుగుచూ ఎప్పటికో నీ అనుగ్రహము ప్రాప్తించి నిన్ను భజించెదరు. ధరిత్రి యందలి ధూళి కణములను, ఆకాశమునందలి తారలను, వర్షపు చినుకులను లెక్కపెట్టవచ్చునేమో కానీ, నీ గుణములను గణించుట ఫణిపతి, బృహస్పతి, భాషాపతులకు సహితము అశక్యము. స్వామీ! నీవు నిరాకారుడవు. కానీ నీవు సాకారుడవు కానిచో ఉపాసనా కర్మయందలి విధి విధానములు వృధాయగును కదా? సత్వ, రజస్, తమో గుణముల వైషమ్యము లేకుండిన సృష్టి ప్రపంచ మేర్పడదు కదా! ప్రకృతి యొక్క విలాసము, భక్త జనుల సుఖోపభోగములు, సంభవము కాదు కదా! కేవలము నీ అనుగ్రహ కారణముగనే భక్తులతోడి సంగము, సత్పురుషుల అనుగ్రహము, సత్కర్మ యందు నిష్ఠ, సద్ధర్మచింతన, చిత్తశుద్ధి, తద్వారా జ్ఞాన మోక్షములు సిద్ధించును." ఈ స్థోత్రము నంతయు సావధానుడై వినిన వినాయకుడు ప్రసన్నుడై "నీ మనో వాంఛితమును కోరుకొనుము" అని పలికెను. రాజు "ప్రభూ! వరదాన మడుగుటకు ఏమియునూ మిగులలేదు. ఎందువలననగా నేను మిమ్ము చేరితిని. కానీ మీరడిగితిరి కావున నాకు మృత్యువు, పునర్జన్మ వలదు" అని పలికెను. అంత శ్రీగణేశుడు "తథాస్తు" అని పలికి రాజునకు కోటి కల్పములు కాలము తన వద్దనే యుండు వరమొసంగెను.

బ్రహ్మ "వ్యాసా! నేను వినయకుని కృపచే ఈ స్థోత్రమును పొందగలిగితిని. నేను దీనిని నారదునకు, ఆతడు గౌతమునికి, గౌతముడు ఇతర మునులకు ఈ స్థోత్రము నుపదేశించిరి. ఈ స్థోత్రరాజము విఘ్నములను నాశనమొనర్చి, జ్ఞాన మోక్షములను ప్రసాదించును. ఎవరు ఈ స్థోత్రమును శ్రీగణేశుని ఎదుట పఠించిన ఎడల వారికి శ్రీగణేశభక్తి ప్రాప్తించును. ఈ స్థోత్రమును త్రిసంధ్యల యందునూ పఠించిరేని విద్యార్థులకు విద్య, పుత్రార్థులకు పుత్రులు, విజయ వాంఛితులకు విజయము ప్రాప్తించును. ఈ విధముగ నీవడిగిన విషయములన్నియు విపులముగ నీకు విశదీకరించితిని.

వ్యాసా! నీవు ఇంకనూ ఏమి తెలిసికొనదలచితివి?" అని ప్రశ్నించెను. వ్యాసుడు "స్వామీ! బాలగణపతి శుక్ల బ్రాహ్మణుని దరిద్రమును అంతమొనర్చి, ఆయనకు ఇంద్ర భోగములు ప్రసాదించి తిరిగి కాశీరాజు వద్ద కేగెను కదా! తదుపరి ఆయన కావించిన లీలలేమి? దేవాంతక, నరాంతకులను ఎట్లు వధించెను? ధరణీ భూభారము నెట్లు హరించి ధర్మ సంస్థాపన కావించెను? ఈ విషయ విశేషములన్నియు వివరింపవలసినది."

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శ్రీగణేశ కాశీరాజ సమాగమమును ఏబది మూడవ అధ్యాయము సమాప్తము)

ఏబది నాల్గవ అధ్యాయము

(శూర చపలాఖ్యానము)

బ్రహ్మ "సనక సనందనాదులు వెడలిన పిమ్మట కాశీరాజు శ్రీగణేశుని మాయయందు మోహగ్రస్తుడయి, ఆయనను ఎక్కడా కానరాక, తన అశ్వము నధిరోహించి, పట్టణమందలి ప్రతిగృహము నందు బాలగణపతిని వెదుక నారంభించెను. సర్వులునూ ఇపుడే తమ గృహమందు విందారగించి వెడలెనని తెలిపిరి. గణపతి తనతో పాటు కాశీరాజును సహితము భోజనార్ధము తీసికొని వెడలెను. కానీ మోహగ్రస్తుడై రాజు మరచెను. ప్రజలు సహితము "ఈ మహారాజు కూడా మన ఇంట భోజన మారగించెను కదా! మరి ఈయన ఎట్లు అద్దానిని మరచెను?" అని తమలో తాము తర్కించుకొనిరి. కొంత సమయమయిన పిదప కొందరు పౌరులు ఆ బాలగణపతి శుక్లుని ఇంటికి ఏగెనని తెలిపిరి. రాజు అచటికేగగా గణపతి వృషభారూఢుడై రెండవ శివుని వలె ఆ రాజుకు గోచరించెను. అంత రాజు "ఈ బాలునికి జ్ఞానము, స్నేహభావము, ప్రవర్తన తెలియదు" అని తలచి గణపతితో "నేను లేక నీవొక్కడివే మృష్టాన్నమేల భుజించితివి? నీ కొరకు నేను అన్ని గృహములు వెదకుచుంటివి" అని పలికెను. అంత గణపతి "రాజా! నీవునూ నాతో సర్వుల ఇండ్ల యందు భోజన మారగించితివి. లేని ఎడల నీ పురజనుల నడుగుము" అని పలికెను. పురజనులందరూ "ఔఔనని" తల యూచిరి. అంత రాజు మోహావస్థ నుండి బడల్వెడలి, జ్ఞానమును గొని ఇట్లు కీర్తించెను" స్వామీ! మీ మాయ యోగులను సహితము సమ్మోహితుల కావించును. దానిని దాటుట అశక్యము. మీరు మీ సర్వవ్యాపిత్వమును నాకు సహితము దర్శనమొనరించిరి." ఈ విధముగ పలికి రోమాంచితుడై వినాయక ధ్యానమందు నిమగ్నుడై, జలము నందు పోయి జలము జలమే అగునట్లు తాను సహితము వినాయక రూపుడయ్యెను. కొంత సేపటికి తిరిగి బాహ్యస్మృతి కలిగి తాను కాశీరాజును అన్న స్మృతి ఉదయించెను. అంత వినాయకుని ఒక పల్లకీయందు కూర్చుండబెట్టి, మేళతాళములతో తన అంత:పురమునకు తీసికొని వెళ్ళెను. వారి వెనుక శుక్లుడు పత్నీ సహితుడై నెమ్మదిగ నడచుచుండెను.

పల్లకీయందు ఉపవిష్టుడయిన వినాయకుడు "శుక్లుడు ఏల వెనుక వచ్చుచున్నాడు? నేనిచ్చిన సంపద సరిపడక ఈతడు సంతోషప్రదుడు కాలేదు" అనుకొని, తిరిగి ఆతనికి కుబేరుని మించిన సంపదల నొసంగెను. శుక్లుడు, ఆతని పత్ని వినాయకుడు తామొసంగిన భోజనమునకు రుష్టుడాయెనని తలచి, భారహృదయులై నెమ్మదిగ వెనుదిరిగి తమ కుటీరమున కేగిరి. ఆశ్చర్యము! ఆ కుటీరము యొక్క స్థానమున ఒక ఇంద్రభవనము వెలసియుండెను. ఆ భవనపు కుడ్యములన్నియు రత్నఖచిత స్వర్ణమయము. ప్రతిగది యందు ముత్యములు తాపిన సువర్ణాసనములు; పర్యంకములు; హంసతూలికా తల్పములు గల పడకగదులు, సుందర ఆస్తరణములు, బంగారు పాత్రలు, బహుమూల్య చీని చీనాంబరములు, ఆచ్ఛాదనములు, అనేక ప్రకారములైన భక్ష్య భోజ్యములు, వెలకట్టలేని ధనసంపద, యుండెను. ఇంతలో

సేవక సేవకీ మణులు ఏతెంచి ఆ దంపతికి వేరేవేరుగా సుగంధతైలమలది, నలుగుబెట్టి, అభ్యంగన స్నానమొనర్చిరి. తదుపరి ఇరువురినీ బహుమూల్య దుకూలాభరణములతో అలంకరించిరి. అంత ఆ దంపతి "తమ పూరిగుడెస ఇంద్ర భవన మెట్లయినది?" అని విస్తుపోయిరి. అంత శుక్లుడు తన ప్రియ పత్నితో "ఓ! శుభగా! ఇది అంతయు ఆ వినాయక ప్రభువు యొక్క కృప. ఆ పరాత్పరుడు అల్పసంతోషి. అతి కొంచెము తీసికొని, బహుసంపదనిచ్చును. పగనైన, వగనైన, పాపభీతినైన, కామ్య కర్మమునకైన, ఏవిధమునైననూ, ఆ పరమాత్ముని స్మరణ, స్తుతి, పూజ, నమస్కారము కావింపవలెను."

ఆ నగరమందు "శూరుడు", "చపలుడు" అను ఇరువురు దైత్యులు నరాంతకుని అనుయాయులు కొంత కాలము నుండి రహస్యముగ జీవించుచుండిరి. ఇరువురు ప్రచండ పరాక్రములు, ఇంద్రుని సహితము భయభీతుల గావించు భీషణ రూపులు. వారిరువురూ పల్లకీ యందు కూర్చొనిన వినాయకుని సంహరించుటకు పన్నాగము పన్నిరి. వారిరువురు విద్యుత్ రూపములు ధరించి రోదసీకుహరము కంపించునటుల గర్జనమొనర్చిరి. మేఘములు లేక మీద పడుచున్న విద్యుత్‌ను కాంచి వీరులు సహితము భయభీతులైరి. శిబికను మోయుచున్న వాహకులు భయముతో శిబికను వదలి పలాయన మొనర్చిరి. అంత వినాయకుడు ఆ దైత్యులిరువురినీ తన రెండు చేతులతో పట్టుకొని ఆకాశమందు గిరగిరా త్రిప్పుచూ వారిని ధరిత్రిపై విసరికొట్టుటకు వినాయకుడు తలచెను. అంతలోనే "వీరులను దనుమాడుట కీర్తికరము. ఈ మశకముల వంటి దైత్యులను సంహరించుట కీర్తికరము కాదు" అని తలచి వారిరువునీ వదలివైచి, వారితో ఇట్లనియె "మీరెవరి దూతలు? మీ శక్త్యానుసారము నన్ను హతమార్చుటకు మీరు యత్నించిరి. అయ్యది మీకు కానిపని. అందువలన అది మీ దోషము కాదు." అంత దైత్యులిరువురు వినాయకుని పాదములపై బడి "ప్రభూ! నీవు దీనులను బ్రోచు దయాసాగరుడవు. సర్వులకు తండ్రివి. ఎందుకనగా గర్భదాత, ఉపనయనము చేయువాడు, విద్యాదాత, అభయదాత, అన్నదాత వీరు అయిదుగురు లోకము నందు తండ్రులుగనే పరిగణింపవలెను. మేము ఇరువురము నరాంతకుని గుప్తచరులము. మిమ్ము వధించుటకు వచ్చితిమి. ప్రభూ! మీరే మమ్ము రక్షింపవలసినది. మీరు త్రికాలజ్ఞులు. మీ వద్ద కేతెంచిన దైత్యులందరూ క్షణములో మడసిరి."

ఈ అంతరాళములో కాశీవాసులు వినాయకునితో "దేవా! ఈ భయంకర దనుజులను మీరేల ఉపేక్షించుచుండిరి? వీరిరువురు ఉపకారమునకు ప్రతిగా అపకారమొనర్చెదరు" అని పలికిరి. అంత వినాయకుడు "వీరిరువురికీ నేను అభయదానము ఒసంగితిని. దీనిని వెనుకకు త్రిప్పలేను." అని వారిరువురినీ విడచెను. అంత కాశీరాజు "ప్రభూ! అసంఖ్యాక అపరాధములు కావించిన వీరిరువురినీ మీరు విడచిరి. ప్రతి ప్రాణియొక్క జీవన్మరణములు మీ ఇచ్ఛయే!!" ఈ విధముగ పలికి ఆ బాల వినాయకుని తన గృహమునకు గొనిపోయెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శూర చపలాఖ్యానమను ఏబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఐదవ అధ్యాయము

(నరాంతకుని యుద్ధ సంరంభము)

తదుపరి నరాంతకుని దూతలు శూర, చపలులు రౌద్రపురమునకేగి నరాంతకుని సభాస్థలి ప్రవేశించిరి. ఆ సభ వంద యోజనముల పొడవు, వెడల్పు కలిగి, వేల స్థంభముల యుక్తమై, మణి మాణిక్యములు తాపింపబడి, అనేకమంది వీరులచే పరివృతమై, ఆశ్చర్య జనకమై ఒప్పారుచున్నది. అంత దూత లిరువురు నరాంతకుని గాంచి "ప్రభూ! దూతలు

ఉచితానుచితములు అనునవి లేక సర్వము ప్రభువుకు నివేదింపవలెను. తదుపరి దూతల పలుకుల యందలి ఆంతర్యము గ్రహించి ప్రభువు తన హితాహితములు, శుభాశుభములు నిర్ణయించును. లేని ఎడల అయ్యది దూతల దోషము. అందుచే మేము సర్వము మీకు విశద పరచుచుంటిమి.” ఈ విధముగ మొదటి నుండి వినాయకుని హతమొనర్చుటకు ఏతెంచిన రాక్షసులు, వారికి పట్టిన గతిని గూర్చి తెలిపి, వినాయక లీలన్నింటినీ సమూలముగ వర్ణించి, తమకు సహితము జరిగిన పరాభవము, వినాయకుని చే ప్రాణభిక్ష, శుక్ల బ్రాహ్మణుని దరిద్ర నాశనము, ఇత్యాదులన్నింటినీ పరిపూర్ణముగ తెలిపి ఇట్లనిరి “మహారాజా! ఈ వినాయకుని వంటి శక్తిశాలిని మేమే ఇతర దేవతల యందు చూడలేదు సరికదా వినలేదు. ఈ వినాయకుని గెలువగల ప్రాణి ఈ త్రిలోకముల యందు లేదుగాకలేదు! ఇకపై ఏది హితకరమో మీరే నిర్ణయింపవలసినది”.

అంత నరాంతకుడు క్రోధ తామ్రాక్షుడై, కన్నుల విస్ఫులింగములు రాలుచుండగా భయంకరమైన వికటాట్టహాసమొనర్చి, భృకుటి ముడిచి ఇట్లనియె “కోతి ఎత్తుకు ఎగిరినంత మాత్రమున సింహమును బాధింపలేదు. కొండచిలువ సర్వ ప్రాణులను భక్షింపగలిగిన మాత్రమున పృథివిని మ్రింగలేదు. మీరిరువురి వచనములు నన్ను ఆశ్చర్య చకితుని కావించుచున్నవి. ఖద్యోతములు (మిణుగురు పురుగులు) దీప్తి కేవలము సూర్యుడుదయించక మునుపే! సూర్యుడు సహితము రాహువు మ్రింగనంత వరకే కాంతిని ప్రసరించును. నావంటి కాలపురుషుడు తటస్థింపనంత వరకే ఈ వినాయకుని ఆటలు చెల్లును. ఇకపై కాశీరాజు సహితము వినాయకుని దివంగతుని వలె తలుపవలసినది” అని పలికి, చివాలున లేచి తన అమాత్యులకు, సేనానులకు యుద్ధ సన్నద్ధుల కమ్మని ఆజ్ఞనిచ్చెను.

చతురంగబల సమేతమైన నరాంతకుని సేన ధ్వజయుక్తమై, పరమ భయంకరమై ఒప్పుచున్నది. ఆ సేన ప్రస్థానముచే ఎగసిన ధూళి సర్వ దిశలను ఆక్రమించుచూ పగలే రాత్రివలె భాసించుచున్నది. పదాతులు సింధూర లేపితులై, ముక్తకేశు లై, హస్తములందు ఖడ్గము, బృశుండి, డాళ్ళు, రాళ్ళు, వృక్షములు, ఖట్వాంగములు, శక్తి, పాశము, మొదలగు శస్త్రములు ధరించిరి. వారి వెనుక గజారోహులు ప్రస్థానమొనర్చిరి. ఆ కుంజరములన్నియు ఘంటాధారితములై, గండ స్థలమునందు సింధూర పత్రరచన కావింపబడి, సుందరమైన ఆస్తరణములు పరుచబడి, చిత్ర విచిత్ర ధాతుయుక్తమయిన పర్వతముల వలె భాసిల్లుచున్నవి. వాని ఘీంకారములచే పర్వత సమూహములను సహితము భేదించునట్లున్నవి. వాని కన్నులవెంట కారుచున్న మదజలము పైకెగసిన ధూళిని శాంత పరుచుచున్నది. ఆ గజసేన వెనుక శిరస్త్రాణములు ధరించిన అశ్వసేన కదులుచున్నది. ఆ అశ్వికులు ఛురిక, డాలు, కరవాలములు, ధనుస్సులు, సాయకములు నిండిన తూణీరములు, ధరించి కవచధారులై, త్రిశూలయుతులై, నేల ఈనినట్లు కదులుచుండిరి. వివిధ ఆశ్వికులు హస్తములందు గద, ముద్గరము, పట్టిశము, పరశువు, చక్రము, తోమరము, చంద్రహాసము, పాశాంకుశములు, ఇత్యాది శస్త్రములు పట్టి మనోవేగముతో పయనించగల అశ్వముల నధిరోహించి, ఆకాశము నాక్రమించు ఇచ్ఛుకతతో గజసేన వెనుక పయనించుచుండిరి. వారి వెనుక రథసేన నానాలంకార యుతమై ఉత్తుంగ తరంగములతో ఎగసిపడు సాగరము వలె కానపట్టుచూ ముందన కేగుచున్నది.

వారి నడుమ నరాంతకుడు అమాత్య సహితుడై శోభిల్లుచుండెను. ఆ మహారథి యొక్క అదరము సువర్ణ, రజిత, మణిరత్న, ఖచితమై, ధ్వజయుక్తమై నానాలంకారయుక్త అశ్వములు పూన్చి, వివిధ రకముల సమరములందు ఉపయోగించు వివిధాయుధలములచే నిండియున్నది. నరాంతకుడు కృష్ణవర్ణుడై, విశాలకాయుడై, వీరోచిత కంకణములు ధరించి, కుండలాలంకృతాంగుడై, మహాముకుట శోభితుడై, గళమందు ముత్యాల మాలలు ధరించి, అంగుళులకు అంగుళీయకములు, హస్తమందు కరవాలము, తనువునందు కస్తూరి, అగరు, కర్పూర లేపనములు అలదుకొని, ఇంతకు మున్నెన్నడూ ప్రయోగింపని దివ్యాస్త్ర సంపదను గైకొని, రోగముతో వాచిన శరీరము గల రోగివలె శోభిల్లుచూ బయలుదేరెను.

దుందుభాది వివిధ వాద్యములు ఘోషలు మిన్నునంటుచుండగా, ఏనుగుల ఘీంకారములు, హయముల సకిలింపులు, వీరుల సింహనాదములు, రథచక్రముల ఘోష, సైనికుల వీర నిదానములు, కలిసి ఒక భయంకరారావముగ మారెను. అద్దానిచే దేవతలందరూ భయభీతులై కంధరములందు దాగుకొనిరి. ఈ విధముగ కాశీరాజుపై సమరమునకు నరాంతకుడు బయలుదేరెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి నరాంతక యుద్ధ సంరంభమను ఏబది అయిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఆరవ అధ్యాయము

(కాశీరాజ పరాజయము)

బ్రహ్మ "దైత్యపతి ఈ విధముగ యుద్ధ సన్నద్ధుడై ఏతెంచు తరుణమున కాశీరాజు వేగులు పరుగుపరుగున వచ్చి భోజనము కావించుచున్న రాజుకు ఈ విషయము తెలిపిరి. అంత ఆ మహీపతి చివాలున లేచి, యుద్ధోచిత దుస్తులు ధరించి, యుద్ధ సన్నద్ధుల కమ్మని సైన్యమునకు ఉత్తర్వులిచ్చెను. ఇంతలో కాశీనగరమందలి ప్రజలు ఆంధోళన చెందుచూ, ఉచ్చస్వరమున అందరూ కోలాహలము గావించుచుండిరి. కొందరు ప్రజలు ప్రాణభయముచే దశదిశలు పరుగులిడుచుండిరి. రాజు రణభేరి మ్రోగించి, తాను స్వయముగ కవచ, శిరస్త్రాణధారియై, ఖడ్గము, డాలు, ధనువు, తూణీరములు ధరించి, వినాయకునికి పూజనమొనర్చి, "జై గణేశ" అని స్మరించుచూ సైనికుల వద్ద కేగెను. యుద్ధభేరి ధ్వనిచే చతురంగబలములు తమతమ ఆయుధములు ధరించి, యుద్ధసన్నద్ధులై, త్రిలోకములు జయింపవలెనన్న సాహసముతో ముందునకు ఉరుకుటకు సిద్ధపడిరి. రాజు నగరమునకు తూర్పునయున్న వేదికపై నిలబడి, అమాత్యులకు, సేనా నాయకులకు, సైనికులకు యధోచిత బహుమతులొసంగి ఇట్లనియె "వీరసైనికులారా! ఈ రోజు మీ ప్రతాపము చూపించు సమయము ఆసన్నమయినది. వినాయకుని కృపచే మనకు భయము లేదు. నరాంతకుడు బహుళ బలవంతుడు. ఆతడు తన స్వశక్తిచే భూమండలమంతయు జయించెను. కానీ జయాపజయములు దైవాధీనములు. మనసేన ఆ రాక్షస సేనతో పోల్చిన తృణప్రాయము. వీటి మధ్య సాగరమునకు కుంభమునకు; సూర్యునకు మిణుగురు పురుగులకు గల వ్యత్యాసమున్నది. మనమిన్నాళ్ళు సామనీతిని ఆశ్రయించి మన రాజ్యమును రక్షించుకొంటిమి. మనము ఈ నరాంతకుని దైత్యులను సంహరించితిమి. ఆ కార్యముల భారము మన మస్తకములపై యున్నది. మనము వినాయకుని బలమున ఆ దైత్యులను హతమార్చితిమి. అందువల్ల ఆ దైత్యుడు సామనీతిని ప్రక్కనబెట్టి సమరమున కేతెంచెను. ఇపుడు మన కర్తవ్యమేమి?" అంత అమాత్యుడు "మహారాజా! మీరు నలుగురు బుద్ధిమంతులైన మనుజులను వెంటబెట్టుకొని నరాంతకుని వద్దకేగి ఆతనిని శరణువేడుడు. మన కార్యసిద్ధికై నీచుని శరణువేడుట తప్పుకాదు. రాజా! మీకు బృహస్పతి నీతిని తెల్పెదను. మనకంటె బలశాలురైన శత్రువునకు మన కన్యనిచ్చికానీ, వారితో భోజనము చేసి కానీ, వారికి వస్త్రములు సమర్పించి గానీ, వారి ఎదుట వినయము ప్రదర్శించికానీ, వారి గుణగుణములు కీర్తించిగానీ, వారి విశ్వాసపాత్రుల మాటలు సమర్ధించిగానీ, వారితో సంధి యొనర్చుకొని, తదుపరి సమయమాసన్నమయినపుడు వారిని వధింపవలెను. ఒకవేళ నరాంతకుడు వినాయకుని వాంఛించిన ఎడల, వినాయకుని ఆతనికి సమర్పించి రాజ్యరక్షణ కావింపవలసినది. ఇది ఉచితమని నా మనస్సుకు తోచుచున్నది. ఆపై మీరే హితవు ఆలోచించి నిర్ణయము ఒనర్ప వలసినది" అని పలికెను. లోకులూ, సైనికులు, సర్వులు "ఇది ఉచితము" అని ఏకగ్రీవముగ పలికిరి.

ఇంతలో నరాంతకుని సేన కాశీ నగరమును నలుప్రక్కలా చుట్టుముట్టి నగరమునకు అగ్ని ముట్టించిరి. ప్రచండాగ్ని నలుదిశలా వ్యాపించుచూ ప్రజ్వరిల్ల నారంభించినది. మంటల నుండి ధూమము పైకిలేచి సూర్యమండలమును ఆచ్ఛాదించినది. ఆ దారుణాగ్ని ప్రళయమును తలపించుచున్నది. అగ్ని భయముచే బయటకేగిన జనులు శత్రువుల చేజిక్కుచుండిరి. ఆ దురాత్ములు బాలురు, బాలికలు, యువతులు, స్త్రీలు అందరినీ పట్టి చుంబించుచూ బలాత్కరించుచుండిరి. శత్రువుల వ్యవహారము గమనించిన పతివ్రతలు ప్రాణత్యాగ మొనరించిరి. కొందరు స్త్రీలు విషము సేవించి, కొందరు గోపురము నుండి క్రిందికి దుమికి, మరికొందరు శస్త్రముతో ఘాతమొనర్చుకొని, కొందరు ఉరివేసికొని దేహత్యాగ మొనరించిరి. శత్రు సైనికులు అతి సౌందర్యవంతులయిన స్త్రీలను పట్టి వారిని నరాంతకునకు బహూకరింపగా, ఆ దురాత్ముడు వారిని భోగించి, తన నగరమునకు పంపెను. “ఈ దుష్ట దురాత్ములు మన నగరమును దగ్ధమొనర్చి, మన ఎదుటనే మన స్త్రీలను గొనిపోవు చుండిరి. ఇక విజయమో, వీరస్వర్గమో!” అని అందరినీ సమరోన్ముఖులను గావించి కాశీరాజు శత్రుసేనపై దుమికెను. తన ధనువు సారించి బాణవర్షము కురిపించి, దైత్య సమూహములను నాశమొనర్చెను. దైత్యులు కొందరు మరణించిరి; కొందరు క్షతగాత్రులయిరి. కొందరికి కాళ్ళు, చేతులు, కొందరికి ఉదరము, కంఠము, శిరము, కన్నులు భగ్నమయినవి. అమాత్యులు, ఇతర సైనికులు, తమ రాజుకు సహాయమొనర్చి శత్రుసైన్యమును ఊచకోతకోసిరి. శత్రుసైనికులు సహితము తమ పరాక్రమ పటిమను ప్రదర్శించి, కాశీరాజ సైన్యమును దునుమాడిరి. ఆ తుముల సంగ్రామమందు ధూళి ఎగసి, ఎవరెవరో తెలియక, వీరులు తమ గోత్రనామములు చెప్పుకొని కదనమాడుచుండిరి. కాశీరాజు విజృంభణము చే తూర్పు దిక్కునున్న దైత్యసేన మడసి కాశీరాజ సైనికులు విజయగర్జన చేసిరి.

విజయమొందిన కాశీరాజు మరొక దిక్కునున్న దైత్యసేనపై సమర మారంభించెను. యుద్ధావేశమునున్న మహాకుంజరము వలె కాశీరాజు దైత్య వ్యూహమును భేదించి, లోనికి చొరబడి, అప్రతిహతముగ సమర మొనరించచూ, శత్రు సైన్యమందలి ప్రముఖులను నిర్జించు చుండెను. అంత శత్రు సైనికులు అదికాంచి, కొంచెము తేరుకుని, ఒక్కమారుగ అనేకమంది ఆ రాజుపై బడి, కదలనీయక బంధించిరి. అదే విధముగ రాజపుత్రులను, అమాత్యులను, సేనానులను, సహితము బంధించి నరాంతకుని సమక్షమున నిలబెట్టిరి. మిగిలిన కాశీరాజు సైనికులు కొందరు పట్టుబడిరి. కొందరు పలాయన మొనర్చిరి. కొందరు మరణించిరి. కొందరు క్షతగాత్రులైరి. మిగిలినవారు దైత్యుని శరణమొందిరి. మహావన మందు తోడేళ్ళచే చుట్టుముట్టబడిన మహా వృషభము వలె కాశీరాజు తన పుత్ర, అమాత్య సహితుడై బంధితుడయ్యెను. దురాత్ములైన దైత్య సైనికులు పరమ పావనమైన కాశీ నగరమును సంపూర్ణముగ దగ్ధమొనర్చిరి. అంత నరాంతకుడు తన సేనతో “మనమరుదెంచిన కార్యము సిద్ధినొందినది. రాజు హస్తగతమైన రాజ్యము, పౌరులు, సైన్యము, హస్తగతమైనటులే! అందువల్ల ఆ కశ్యప పుత్రుడు సహితము ఓటినట్లే! ఇపుడు ఆ రాజు వివశుడై స్వయముగ ఆ బాలుని మన వద్దకు తీసికొనివచ్చును.” ఈ విధముగ పలికి విజయ దుందుభులు మ్రోగించుచూ, నరాంతకుడు కాశీరాజును ముందునుంచుకొని, వంది జనము తన కీర్తిని గానమొనరించుచుండగా కాశీనగర ప్రవేశమొనర్చెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కాశీరాజ పరాజయమను ఏబది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఏడవ అధ్యాయము

(నరాంతక పరాజయము)

బ్రహ్మ "నరాంతకుడు ఈ విధముగ రాజును, రాజపుత్ర, అమాత్యులను బంధించి, వారిని ముందునుంచుకొని, నగర ప్రవేశము కావించి రాజు భవనము వైపు వచ్చుచుండెను. అంత దూతలు అంత:పురమును చేరి రాణి అంబాదేవికి ఈ విషయము తెలిపిరి. రాణి, మరియు నగర ప్రజలు నీటి యందు బయటపడిన మత్స్యముల వలె విలవిలలాడిరి. కాశీరాజపత్ని తుఫాను తాకిడికి తెగిన కదళీతరువువలె నేలపై బడి మూర్ఛితురాలైయ్యెను. సఖులు ఆమెకు పరిచర్యలు కావింపగా నెమ్మదిగా మేల్కొని కాంతిహీనయై ఇట్లు రోదించుట మొదలిడెను "సింహముతో క్రీడించువాడు, కుంజర సమూహములను మర్దించు బలశాలి, శత్రుభంజనుడు అయిన నా పతిని నక్కవంటి ఈ దైత్యుడు ఎట్లు బంధించెను? వేయి ఏనుగుల బలశాలి, కోట్లాది దానవులను సంహరించిన నా పతి శౌర్యము ఈనాడు ఏమైనది? శివ భగవానుడు ఈనాడు నాయందు ఏల కినుక వహించెను? తిరిగి నా పతిని నేను ఎన్నడు చూచెదను? నేనేదేవతను శరణుజొచ్చును? కశ్యప పుత్రుని కోసమై యుద్ధము సముచితమని రాజు తీసికొన్న నిర్ణయము వ్యర్ధమయినది. ఈ రాజు మూర్ఖుడై బాలుని పలుకులు విశ్వసించి బలశాలురైన దైత్యులతో విరోధము పెంచుకొనెను. నా పతిని బందీయొనర్చిన ఈ నరాంతకుని ఓడింపగల వీరుడెవ్వరు? నా వంటి అభాగినికి ఈ కష్టకాల మేల దాపురించినది? నాకిక వైధవ్యము ప్రాప్తించును. ఈ మహారాజు వంటి కరుణాసాగరుడు, శరణాగత వత్సలుడు వేరొకరుయుండరు." ఈ విధముగ దయనీయముగ రోదించుచున్న రాణి పలుకులు కశ్యప పుత్రుడయిన వినాయకుని చెవిన పడి ఆయన ఒక్కమారు తీవ్రగర్జన చేసెను. ఆ గర్జనచే రోదసీ కుహరము ప్రతిధ్వనించెను. పర్వత సహిత ధరిత్రి కంపించెను. క్రోధముతో ఎరుపెక్కిన కన్నులతో వినాయకుడు సిద్ధిని కాంచి "యుద్ధకాలమున నీవు ఎచ్చటికేగితివి?" అని ప్రశ్నించెను. అంత ఆయన మనసెరిగిన సిద్ధి వివిధ రకముల వేలాది సేనలను సృజించెను. వారందరూ కరాళముఖులు, నాగళ్ళవంటి దంతములు, సర్పము వలె లోనికి వెలుపలికి మెలిదిరుగుచున్న నాలుకలు, పర్వత సదృశ కాయులు. వారి నాయకుడు ముఖము నుండి అగ్ని వెలువరించుచూ నోరు తెరచి పృధివిని సహితము మ్రింగగల సమర్థుడు. వందలాది నేత్రములతో, కొండ గుహల వంటి నాసికా రంధ్రములతో, తన శిరమందలి జటలచే సంపూర్ణ పృధివిని కప్పుచుండెను. వెయ్యి యోజనముల పొడవుగల చేతులు, రెండు వేల యోజనముల పొడవుగల కాళ్ళతో అత్యంత క్రూరుడై యుండెను. ఆతడు వినాయకుని చేరి, అంజలి ఘటించి "ప్రభూ! నాచే కాగల కార్యమేమి? నాకు అత్యంత ఆకలిగయున్నది. నాకు తినుటకు ఏదేని ప్రసాదింపవలసినది" అని పలికెను. వినాయకుడు "నీవు తక్షణమే ఏగి నరాంతకుని సైన్యమును నీ ఆహారముగ గొని, నరాంతకుని సంహరించి, వాని శిరమును నా కడకు గొనితెమ్ము! నీకు ఇంకనూ ఆకలి యున్న ఎడల అపుడు నీకు వేరొక భక్ష్య పదార్థమును ఒసగెదను" అని పలికెను. అంత ఆ పర్వతాకారుడు వినాయకునికి వందనమొనర్చి, ఒక భయంకర సింహనాదము కావించి, నరాంతకుని వద్దకేగెను.

ఆ సింహనాదము విని, ఆతని భయంకర రూపము కాంచి నరాంతకుని సేనలు దశదిశలా పరుగులిడ నారంభించిరి. అంత ఆ కాలపురుషుడు వారందరినీ తన రెండు చేతులతో పట్టి నమిలి మ్రింగుట ఆరంభించెను. ఆ పురుషుని కదలికచే ధూళిరేగి గగనాంతరమున విస్తరిల్లి, ఆ ప్రదేశమంతయు ఘోరాంధకారము అలముకొనెను. అంత నరాంతకుని సేనలు దీపములు వెలిగించిరి. ఆ ప్రకాశమున ఆ ఘోర కాల పురుషుని తిరిగి కాంచి దైత్యులు హతాశులై ప్రాణములు విడచిరి. కాలపురుషుడు ఎవరినీ వదలక ఇంచుమించు నరాంతకుని సగము సైన్యమును భక్షించెను. నరాంతకుడా

కాలపురుషుని కాంచి "ఈతడు ద్వితీయ యముని వలె యున్నాడు. ఇపుడు నా కర్తవ్యమేమి? చూచుచుండగనే ఈతడు నా సగసైన్యమును భక్షించెను" అని తర్కించుచుండెను. మిగిలిన సైనికులు నరాంతకుని శరణుజొచ్చిరి. తినగా మిగిలిన సేనలు ఆ కాలపురుషుని కాళ్ళక్రింద నలిగి మరణించిరి. అసంఖ్యాకులైన సైనికులను భక్షించినప్పటికీ ఆకాల పురుషుని ఆకలి ఇంచుక శమింపలేదు. అంత ఆతడు రథాశ్వగజములను సహితము భక్షించుట నారంభించెను. ఇక గత్యంతరము లేక నరాంతకుడు తన వింటికి నారి బిగించి, ఆకర్ణాంతములాగి ఆ కాలపురుషునిపై బాణవర్షము కురిపించుట నారంభించెను. ఆ బాణవర్షముచే గగనము ఆచ్ఛాదితమై అంధకార మావరించెను. దైత్యుని సాయకములను కాలపురుషుడు నేరేడు పండు వలె మ్రింగివైచెను. అసంఖ్యాక సాయకములు ఆ కాలపురుషుని రోమకూలములందు దిగుటచే రక్తస్రావము అగుచుండెను. కానీ ఆ మహాకాయుడు అణుమాత్రము ఖేదము నొందలేదు. అంత నరాంతకుడు తాను తన తపస్సుచే పొందిన దివ్యాస్త్ర సంపద నంతటినీ కాల పురుషునిపై ప్రయోగించెను. కానీ ఆ బృహత్కాయుడు కొండచిలువ తన గుడ్లను తానే భక్షించునటుల, ఆ అస్త్రముల నన్నింటినీ గ్రసించెను. ఇక నరాంతకుని వద్ద అస్త్ర శస్త్రములేవియును మిగలక ఆతడు పలాయనము ఆరంభించెను. నరాంతకుడు ఎక్కడికేగిననూ కాలపురుషుడు వానిని వెంబడించెను. నరాంతకుడు భూమండలమంతయు తిరిగి స్వర్గమున కేగెను. అచటికి కాలపురుషుడేతెంచుట కాంచి తిరిగి భూమిపై కేతెంచి, అచట నుండి పాతాళమునకేగెను. అంత కాలపురుషుడు పాతాళమందు ఆ నరాంతకుని గరుడుడు సర్పమును పట్టినటుల పట్టి, వారి కేశములు పట్టి ఈడ్చుచూ ఇట్లనియె.

"ఓరీ! నరాంతకా! నీవు ఎన్నాళ్ళు నా నుండి పరుగులెత్తెదవు? దుష్టుడా? నీవు శివ వర ప్రసాదముచే ఉన్మత్తుడవై దేవతలను, మునులను పీడించితివి. అనేక నిస్సహాయులైన మనుజులను సంహరించితివి. దురాత్ముడా! నీ సంహారమునకే వినాయక ప్రభువు అవతారము స్వీకరించెను. నీవు నీ అహంకారమును సంపూర్ణముగ విడచి ఆయనను శరణుజొచ్చుము. ఆయన చరణకమల దర్శనముచే నీ పాపములు దగ్ధమగును." ఈ విధమగ పలికి నరాంతకుని బలవంతముగ ఈడ్చుకొనివచ్చి ఇట్లు పలికెను "స్వామీ! మీ ఆజ్ఞచే ఈ దైత్యరాజు సేనను ఇంచుమించు సంపూర్ణముగ భక్షించితిని. ఈతని పట్టి మీ వద్దకు ఈడ్చుకువచ్చితిని. సర్వజన సంతృప్తికై ఈ నరాంతకుని అంతమొనర్చి, నాకు కలిగిన శ్రమచే నాకు నిద్రించుటకు తగిన స్థానమును తెలుపవలసినది." అంత వినాయకుడు "నీవు నీ నోటి యందు ప్రవేశించి సుఖనిద్ర పొందవలసినది" అని పలికెను. పృధివీ గంధము తిరిగి పృధివి యందు ప్రవేశించినటుల కాలపురుషుడు తిరిగి వినాయకుని యందు ప్రవేశించి అదృశ్యుడయ్యెను. ఏ మనుజులు ఈ మహాఖ్యానమును భక్తితో శ్రవణ మొనర్చెదరో వారి ఇహలోక కామనలన్నియు పూర్ణమయి మొక్షము నొందెదరు.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి నరాంతక పరాజయము అను ఏబది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఎనిమిదవ అధ్యాయము

(కాశీ పునరుద్ధరణ)

వ్యాసుడు "విరించీ! వినాయకుడు ఈ కాలపురుషుని ఎక్కడ నుండి ఉద్భవింపజేసెను? దయచేసి నాకు స్పష్టీకరణ మొనర్పవలసినది." బ్రహ్మ "నిర్గుణ పరబ్రహ్మ, సగుణమును స్వీకరించునపుడు బ్రహ్మ, విష్ణు, రుద్రులుగ మారెనని తెలిపితిని కదా! ఆ త్రిమూర్తుల సగుణ సమిష్ఠి రూపమే శ్రీగణేశుడు. ఈ శ్రీగణేశుడు దుష్టశిక్షణ, శిష్ఠ రక్షణ, ధర్మ

సంరక్షణ, కావించి పృధివీ భారహారణార్ధము ఈ సృష్టిని సృజించి, పాలించి, సంహారమొనర్చుచున్నాడు. ఈ విషయమై సందేహింప నవసరము లేదు, ఎందకనగా ఆ పరాత్పరుడు వివిధ మాయల కాలవాలము. నీకు ఈ మాయ గూర్చి విస్తారముగ తెల్పెదను. నరాంతకుడు పుత్రామాత్య సహితముగ కాశీ రాజును బంధించి, వారితో సహితముగ కాశీ నగరమందలి రాజ భవనమున కేతెంచుచుండగా, మార్గమధ్యముననే కాలపురుషుడెదురై, వాని సేనలను భక్షించి నరాంతకుని బంధితుని కావించి వినాయక సమక్షమున కేతెంచెను. అంత వినాయకుడు కాలపురుషుని, పుత్రామాత్య సహితముగ కాశీరాజును తన నోటియందుంచుకొనెను. అంత వారందరూ ఆ పరాత్పరుని ఉదరమున ప్రవేశించి, అచట సంపూర్ణ జగత్తును దర్శించిరి. సప్త ద్వీపములు, పర్వత, వృక్ష, నదీ, సముద్ర, వాపీ, కూప, జంతు, మృగ మానవ సహితమైన వసుంధరను కాంచిరి. దేవ, గంధర్వ, ముని, సిద్ధ, యక్ష, రాక్షస, నాగ, అప్సరోయుతమైన స్వర్గమండలమునూ, సప్త పాతాళములను ఆయన ఉదరమందు కాంచిరి. ఆ దివ్య ఉదరమందు పరిభ్రమించుచూ అనేకానేక బ్రహ్మాండ సమూహములను సహితము చూచిరి. అంతవారు ఖిన్నచిత్తులై వినాయకుని ప్రార్ధించిరి.

"ఓ! కృపాసింధూ! మీ ఉదరమందు భ్రమించుచు ఖిన్నచిత్తులమైన మమ్మ దయచూప వలసినది." అంత కృపాళువైన వినాయకుడు ఒక బాలుని రూపమున ఏతెంచి, వారిని ఒక రోమ కూపమునుండి బయటకు తెచ్చి, తిరిగి తమ కాశీ రాజ్యమునందుంచెను. వినాయకుని కృపచే బుద్ధి ప్రాప్తించిన కాశీరాజు "ఓ! దేవా! నేను మీ ఉదరమందు ప్రవేశించి, దుర్జయమయిన మీ మాయను వీక్షించితిని. స్వామీ! దేవతలు, మనుష్యులు, దిశలు, స్వర్గపాతాళాది లోకములు, నదులు, సముద్రములు, సర్వము నీవే! అంతయు నీ రచనయే! నేను మీ ఉదరమందు భ్రమణ మొనర్చుచూ రోమ కూపములందు అనేక బ్రహ్మాండములను కాంచితిని. అంతేకాదు. ఎన్నో ఆశ్చర్యపూర్వకమయిన విశేషములను నేను మీ సన్నిధియందు దర్శించి అనుభవించితిని. అదే ఉత్సాహముతో వేరొక దిశకు ఏగి పుత్రామాత్య సహితుడనై నరాంతకునకు బందీ అయితిని. నరాంతకుడు ఈ పవిత్ర క్షేత్రమును దగ్ధమొనర్చెను. ఇంతలో నేను కాలపురుషుని దర్శించితిని. ఆతడు నరాంతకుని సేనను భక్షించి, దైత్యుని మీ వద్దకు ఈడ్చుకు వచ్చెను. అంత మేము మీ ఉదర ప్రవేశమొనర్చి, విస్తారముగ భూమండలమును, జంబూద్వీపమును, మిమ్మునూ వీక్షించితిమి. మీ కృపచే మీ రోమకూపము నుండి బడల్వెడలితిమి. తిరిగి నా విశాల భవనమందు బాలరూపుడైన మిమ్ము కాంచుచున్నాను. మహాప్రభో! ఏమి ఆశ్చర్యము! ఏమి మాయాజాలము! స్వామీ! నరాంతకుని పట్టి తెచ్చిన ఆ కాలపురుషుడెవరు? నన్ను రక్షించిన ఆ మహాకాయుడెవరు? మీ ఉదరము నుండి బయటకు మార్గదర్శన మొనర్చిన బాలకుడెవరు? మీ భక్తుడను అయిన నాకు ఈ సంశయములు దూరమొనర్చ ప్రార్ధన" అని పలికెను.

అంత శ్రీగణేవుడు తన పరమ పావన హస్తమును తన భక్తుడయిన కాశీరాజు మస్తకముపై యుంచెను. అంత రాజునకు దివ్యజ్ఞానమంకురించి, సర్వము శ్రీగణేశమయము, ఆయన మాయయే! అని తెలిసినది. అంత రాజు తిరిగి ఈ విధముగ స్థుతించెను" స్వామీ! త్రిమూర్తులు, పంచ భూతములు, దేవదానవ, యక్ష, రాక్షస, మానవులు చరాచర జగత్తు నీవే! దేవేశ్వరా! జడ చేతనములు నీవే! నా పూర్వపుణ్య ఫలముచే నీ దర్శన భాగ్యమబ్బినది." అంత వినాయకుడు తిరిగి రాజును మోహగ్రస్తుని కావించెను. అంత రాజు తిరిగి మానుష భావము నొందెను. రాజు ఆ అనామయ వినాయకుని పూజన మొనర్చెను. ఇంతలో పురవాసులందరూ రాజు బ్రతికియుండి, విడిపింపబడెనని విని, సంతోషాంగతరంగులై రాజ దర్శనమున కేతెంచి, ఆయనకు వస్త్ర భూషణములు బహూకరించిరి. రాజు సహితము ముదమునొంది వారికి యధోచిత వస్త్ర భూషణము లొసంగెను. అంత రాజు ప్రజల అనుమతినొంది, తన తల్లివద్దకేగి జరిగిన సర్వమును తెలిపి "తల్లీ! నీ ఆశీర్వాద బలముచే నేడు నీ చరణ యుగళిని పున:దర్శనము చేయుచున్నాను. నన్ను దైత్యుడైన నరాంతకుడు బంధించెను; కానీ దేవదేవుడయిన వినాయకుడు విముక్తునొనర్చెను." అంత రాజమాత

తన పుత్రుని ఆలింగన మొనర్చెను. ఆ సమయమున అమాత్యులిరువురు రాణి వద్దకేగి ఆమెతో “తల్లీ! మీ పుణ్యబలముచే నేడు మేము మీ చరణకమల దర్శన మొనర్చుచున్నాము. వినాయక ప్రభువు మమ్ము బంధవిముక్తుల కావించెను” అని పలికిరి. సర్వులు వెడలిన పిదప కాశీరాజు తన ధర్మపత్ని అయిన అంబాదేవి వద్దకేతెంచి, గద్గద స్వరముతో నరాంతకుని తోడి సమరము, తన బంధనము, వినాయకుని కృప, సర్వము తెలిపెను. ఇంతలో నగరమంతయు వివిధ మంగళ వాద్యములు ఒక్కమారు ఘోషించెను. వినాయకుని కృపచే దగ్ధమయిన కాశీపురి తిరిగి మామూలుగ మారి పూర్వపు శోభను సంతరించుకొనెను. మరణించిన సైనికులందరూ తిరిగి జీవించిరి. క్షతగాత్రులైన సైనికులు స్వస్థత నొందిరి. పతితులైన, మృతినొందిన స్త్రీలందరూ ఉద్ధరింపబడిరి. స్త్రీ, బాల, వృద్ధ, పురుష, మాతా పితరులందరూ అశేషానందమునకు లోనై ఒకరినొకరు ఆలింగన మొనర్చుకొని ఆనందతాండవమాడిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమునందలి కాశీ పునరుద్ధరణమను ఏబది ఏనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది తొమ్మిదవ అధ్యాయము

(వినాయక నరాంతక సమరము)

బ్రహ్మ “నరాంతకుడు వినాయకుని చేష్టితములు గమనించి, తన మనసున ఇట్లు తర్కించెను “ఈతని మనోద్భుత శక్తిని నేను తిలకించితిని. కాశీరాజును బంధితునొనర్చిన పిదప ఇతడు కాలపురుషుని సృజించెను. ఆతడు నా సేనను సంపూర్ణముగ భుజించెను. రాజు అమాత్య సహితుడై ఈతని ఉదరము ప్రవేశించి అనేక బ్రహ్మాండములు దర్శనమొనర్చెను. తిరిగి వసివాడకుండా బయటకేతెంచెను. ఈ వినాయకునిచే నాకు భోగ మోక్షములు ప్రాప్తించును. నేను ఇతనిని వధించుట కానీ, లేక నేను వధింపబడుట గానీ తథ్యము. ఈ విధముగ నిశ్చయించి వినాయకునితో ఇట్లనియె “నేను నీ మాయాజాలమును తిలకించితిని. నేను సహితము మాయావినే! నా నిశ్వాసముచే పర్వతములు కంపించును. నా ప్రహారముచే ధరిత్రి ముక్కలగును. వ్యాఘ్ర సమ్ముఖనమునకేగిన మనుజులకు సుఖముండునా? బాలుడవైన నీవు నాతో ఎట్లు పోరాడెదవు?” అంత వినాయకుడు “మూర్ఖుడా! నీవు మిథ్యా గర్వము నొందుచున్నావు. నీ వృథాగా పొగడుకొను శక్తి కాలపురుషుని ముందు ఏమైనది? శూరులు తమ శూరత్వమును చూపెదరు. ఇతరుల నిందింపరు. తేలు చిన్నదయిననూ వ్యాఘ్రమును చిటికెలో సంహరించును. దీపము చిన్నదయినప్పటికీ ప్రబలమైన అంధకారమును పారద్రోలును. అంకుశము చిన్నదయినప్పటికీ మదమత్త గజమును నియంత్రించును. నీవు మృత్యువాసన్నమయినపుడు రోగులు కావించు సన్నిపాత జ్వర ప్రేలాపన ప్రేలుచుంటివి.” అంత నరాంతకుడు భయక్రోధములు ఒక్కమారు పెల్లుబిక గజాననుని అంతమొనర్చుటకు ఆయనవైపు పరుగెత్తెను.

అంత కాశీరాజు ధనువు సారించి, బాణము సంధించి, ఆకర్ణాంతము లాగి నరాంతకుని గాంచి, శాంతియుతముగ ఇట్లనియె “ఓ! దైత్యరాజా! నీవు మరణము కొనితెచ్చుకొనుచుంటివి. “జీవన్ భద్రాణి పశ్యతి” – బ్రతికియుండిన శుభములు చూడవచ్చు. దయచేసి వెనుకకు పొమ్ము. లేని ఎడల మృత్యు కోరలయందు పడదెవు. ఓరీ! “వినాశకాలే విపరీత బుద్ధి;” అనిన నీవే! నీవు శివుడు ప్రసాదించిన వరములచే గర్వితుడవై అనేక పాపములు ఆచరించితివి. ఆ పాప భారముచే నీ వరములు శిధిలమయ్యెను. అందువలననే శ్రీగణేశుడు నీ వంటి పాపులను సంహరించి, పృధివీ బార హరణమునకు ఇలపై అవతరించెను.” ఆ పలుకులు విని నరాంతకుడు మరింత మండిపడి, వేగముగ వచ్చి,

కాశీరాజు యొక్క ధనుర్బాణములను విరచి, భూమిపై విసరి, ముష్టి బిగించి బలముగ రాజుపై ప్రహరించెను. రాజు మూర్ఛనొంది క్రింపడెను. అంత శ్రీగణేశుడు పరుగున వెళ్ళి అతి భయంకరమైన పరశువుతో దైత్యుని శిరముపై ప్రహరించెను. దనుజుడు మూర్ఛనొంది క్రిందపడెను. కానీ మరుక్షణమున పైకి లేచి తన రెండు హస్తములందు చెరియొక పర్వతమును తీసికొని వినాయకుని పై విసరెను. వినాయకుడు తన పరశువుతో ఆ పర్వతములను తునాతునకలు కావించెను. దైత్యపతి తన మాయాజాలము నుపయోగించి అనేక రూపములనొందెను. గణపతి సహితము అదే విధముగ వివిధ రూపములనొంది దైత్యుని దర్పమును చూర్ణమొనర్చెను. వినాయకుడు తన శస్త్రముతో దైత్యుని శస్త్రములను, అస్త్రములతో దైత్యుని అస్త్రములను నాశమొనర్చెను.

అంత వారిరువురూ మల్లయుద్ధమొనర్చుట మొదలిడిరి. బాహాబాహీ, ముక్కాముక్కీ, శిరము, సాదములు, మోకాళ్ళు, మోచేతులతో తాడనమొనర్చుకొనుచుండిరి. నరాంతకుడు శివుని స్మరించి వృక్షములు, వృక్షసహిత పర్వతములు వినాయకునిపై ప్రహరించుచుండెను. వినాయకుడు వాటన్నిటినీ తన పాశాంకుశ, పరశువులతో ఖండించుచుండెను. అంత వినాయకునిపై నరాంతకుడు కుంభవృష్టి కురిపించెను. వినాయకుడు సహితము క్లేశమునను భవించి, మనమున "ఈ దైత్యుడు మహాబలుడు" అని తలంచి "ఎప్పుడు ఈ దనుజుడు అంతమొంది దేవతలు తమ స్థానములు ప్రాప్తినొందెదరు?" అని తర్కించుచుండగా ఆయన తుణీరమందు కాలదండము వంటి సుదృఢ సాయకములు ప్రత్యక్షమయ్యెను. వినాయకుడు రెండు సాయకములను తన ధనువునందు సారించెను. అద్దాని ప్రకాశముచే దశదిశలు, విదిశలు, ధగధగ లాడినవి. అంత వినాయకుడు ఒక సింహనాదమొనర్చి ఆ సాయకమును తన ధనువు నందమర్చి, ఆకర్ణాంతము నారిలాగి వదలెను. ఆ సాయకములు గర్జనచేయుచూ, అంబరమును చుంబించుచూ, మధ్యనయున్న జీవసమూహమును సంహార మొనర్చుచూ, ఉల్కలవలె పోయి నరాంతకుని రెండు బాహువులను ఖండించెను. ఇంద్రుని వజ్రప్రహారముచే తెగిపడిన పర్వత శిఖరములవలె ఆ బాహువులందు ఒక బాహువు నరాంతకుని ఇంట, మరియొక బాహువు ఆతని తండ్రి రౌద్రకేతు ఇంట పడినవి. ఆ హస్తములు పడుటచే అచటి పాత్రలన్నియు నుగ్గునుగ్గు అయినవి. ఆశ్చర్యము. వెంటనే దైత్యుని రెండు బాహువులు మొలిచినవి. అంత దైత్యుడు తిరిగి వినాయకునిపైకి పరుగెత్తి ఆయనపై వృక్ష సమూహములను కురిపించెను. నరాంతకుని పరాక్రమము చూచి వినాయకుడిట్లనియె.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయక నరాంతక సమరమను ఏబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

అరవైయవ అధ్యాయము

(నరాంతక వధ)

వినాయకుడు "నేను ఇత: పూర్వము నీవంటి వీరుని చూడలేదు" అని పలికి తిరిగి వేరొక సాయకము తీసి ధనుస్సుకు సంధించి, ఆకర్ణాంతము లాగి నరాంతకుని పై విడచెను. ఆ సాయకము దిక్కులను ప్రకాశమొనర్చుచూ పోయి నరాంతకుని రెండు కాళ్ళను ఖండించెను. ఆ కాళ్ళు రెండూ దేవాంతకుని గృహమందు పడి ఆచటి జనులను చూర్ణమొనర్చెను. నరాంతకుడు త్రిలోకములను మ్రింగినటుల నోరు తెరచుకొని వినాయకుని వైపు వచ్చుటకు యత్నించుచుండగా వర ప్రభావమున ఆతనికి తిరిగి కాళ్ళు ప్రాప్తించినవి. అంత దైత్యుడు వినాయకుని వద్ద కేతెంచి "నా కాళ్ళు నరికి నన్ను పరాభవించితివి. నేనునూ నీ అంగములు చూర్ణమొనర్చి నా పౌరుషమును నిరూపించుకొందును"

అని పలికెను. వినాయకుడు తిరిగి బాణ పరంపర ప్రయోగించెను. నరాంతకుడు వాటినన్నింటినీ గ్రసించెను. అంత వినాయకుడు బంగారు రెక్కలుగల మరొక దివ్య సాయకమును గొని, అభిమంత్రించి, ఆకర్ణాంతము నారి సారించి వదలెను. అయ్యది పర్వతములను చూర్ణము కావించుచూ వెళ్ళి నరాంతకుని కంఠమునుత్తరించెను. కుండలాలంకృతాంగమైన శిరము ఆకాశమున కెగరెను. దైత్యసేనలు హాహాకారము లొనరించిరి. ఆ శిరము నరాంతకుని తండ్రి గృహము నందు పడెను. ఇంతలో దైత్యునకు వేరొక శిరము మరల మొలిచెను. తిరిగి దైత్యుడు సింహనాదమొనర్చి వినాయకునిపై పర్వతవర్షము కురిపింప నారంభించెను. వినాయకుడు వాటిని లాఘవముగ బాణపరంపరతో ఖండించెను.

ఈ విధముగ ఒక్క ప్రక్క పర్వతవర్షము, వేరొక ప్రక్క బాణ వర్షముతో ఒక అహోరాత్రము (రేయి, పగలు) తీవ్ర సమరము జరిగెను. ఇరువరు మిక్కిలి డస్సిపోయిరి. వినాయకుడు కించిత్ చింతితుడై, తిరిగి ప్రజ్వలించి, జ్వాలామాలికాయుక్తమయిన పరశువును పైకెత్తెను. భూమి కంపించినది. ఆ సమరమును అవలోకించుటకై దేవతలందరూ విమానరూఢులై అరుదెంచిరి. అంత వినాయకుడు పరశువును నరాంతకునిపై ప్రయోగించెను. అయ్యది నరాంతకుని శిరమును ఖండించెను. కానీ మరొక శిరము పూర్వము వలెనే ఆవిర్భవించెను. వినాయకుడు ఈ విధముగ వందలాది మార్లు నరాంతకుని శిరము ఖండించిననూ శివ వరముచే శిరములు ఉద్భవించుచుండుటచే, వినాయకుడు తీవ్రమయిన ఆలోచనలో పడెను. అంత నరాంతకుని ఆ మహితాత్ముడు తన మాయచే మోహితుని కావించెను. అంత దైత్యునకు తానెవరో, పరులెవరో తెలియకుండెను. క్షణములో రాత్రింబవళ్ళు మారుచుండెను. క్షణక్షణము పృధివి, స్వర్గము, పాతాళము, ఆకాశము, ఈ విధముగ దైత్యుడున్న ప్రదేశము మారుచుండెను. అట్లే జాగృత్, స్వప్న, సుషుప్తులు సహితము మారుచూ, ఒక్కొక్కమారు దైత్యునకు సహితము తురీయావస్థ అనుభవమునకు వచ్చుచుండెను. నరాంతకునకు తన ఎదుటనున్నది స్త్రీయా? పురుషుడా? గుహ్యక, సిద్ధ, రాక్షసులా? తనవారా? లేక పరాయివారా? మాతా పితరులా? నేను సజీవుడా లేక నిర్జీవుడా? ఈ విధముగ తలచుచూ త్రిశూలధారి అయిన శివుడు తన కొసంగిన వరములన్నియు వ్యర్ధమగు సమయమాసన్నమయ్యెనా? నా మృత్యువాసన్నమయ్యెనా?" అని తర్కించుచుండగా ఆతని నికటమున విరాడ్రూపముతో గణపతి ఆవిర్భవించెను. ఆయన మస్తకము ఆకాశము పైకి, చరణములు పాతాళము నందునూ యున్నవి. దిశలే ఆయన కర్ణములు. వృక్షములే ఆయన రోమములు. రోమకూపములందు బ్రహ్మాండములు భ్రమించుచున్నవి. సముద్రములాయన శ్రమబిందువులు. ఆయన నఖాగ్ర భాగమున ముప్పదిమూడు కోట్ల దేవతలు ఉపస్థితులై యుండిరి. ఉదరమందు పదానాలుగు లోకములు సుస్థిరమై యున్నవి.

ఆ సమయమున వినాయకుడు తన కొనవేలి నఖాగ్ర భాగముచే దైత్యుని నలిపి నలిపి సంహరించెను. దేవతలు, మునులు జయజయ ధ్వానములు కావించిరి. ఆయన విరాడ్రూపమును ఉపసంహరించిన పిదప పృధివి ఆయన వద్దకేగి, ప్రణామములర్పించి "ఓ! దేవేశా! మీరు నా భారమందలి సగ భాగమును హరించిరి. ఇంకనూ వేరొక సగము యున్నది. దానిని సహితము హరణమొనర్చిన ఎడల నేను మిక్కిలి ప్రసన్నత నొందెదను. దయచేసి ఆ కార్యము పూర్ణమొనర్పవలసినది" అని పలికి అంతర్ధానమొందెను. అంత కాశీరాజు వినాయకుని వద్దకేగి "స్వామీ! నేను అవాఙ్మానస గోచరము, అత్యంత ఆశ్చర్యకరమయిన విశేషము కాంచితిని. మీరు భూభారహరణహేతువై అవతారము స్వీకరించి ఆ కార్యము పూర్ణమొనర్చిరి. ముప్పదిమూడు కోట్ల దేవతలకు అశక్యమైన కార్యము మీరు కావించిరి. ఆ సమయమున నేను మీ విరాడ్రూపమును కాంచితిని." అంత కాశీ పౌరులు "మహాప్రభూ! దేవేశ్వరా! మీరు బాలరూపముతో మమ్ము మోహితుల కావించుచున్నారు. మీరు ధన్యులు. మీరు మీ యశోవిస్తారణార్ధమై ఈ లీల కావించిరి" అని పలుకుచూ వారందరూ వినాయకునికి పూజనమొనర్చి ఇట్లనిరి "స్వామీ! మాకు ఎల్లప్పుడూ మీ ఎడల భక్తిని ప్రసాదించి, ఎన్నడూ మాకు వియోగము కలిగింపవలదు." తదుపరి కాశీరాజు బ్రాహ్మణులకు, ఇతరులకు విజయ సూచకముగ బహుమతులు ప్రసాదించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి నరాంతక వధయను అరువదియవ అధ్యాయము సమాప్తము)

అరువది ఒకటవ అధ్యాయము

(శారదా రౌద్రకేతుల శోకము)

నరాంతకుడు శారదా, రౌద్రకేతుల తనయుడని తెలిపితిని కదా! ఆ సమయమున శారద తన చెలులతో కలసి గృహప్రాంగణమందు వార్తాలాపము లాడుచున్నది. అకస్మాత్తుగా కుండల యుక్తమయిన నరాంతకుని శిరము గొప్ప శబ్దము కావించుచూ ఆ ప్రాంగణమందు పడెను. శారదా, రౌద్రకేతులు ఒక్క క్షణము భయభీతులై, పిదప సంభాళించుకొని నరాంతకుని శిరము కాంచిరి. వారిరువురు ఒక ముహూర్తకాలము మూర్ఛనొందిరి. సేవకజనము పరిచర్యలొనర్చిన పిమ్మట నెమ్మదిగ తెలివి తెచ్చుకొని తిరిగి తమ కుమారుని శిరము కాంచిరి. అంత శారద గుండెలు బాదుకొనుచూ నరాంతకుని శిరమును హృదయమునకు హత్తుకొని ఇట్లనియె "హా! పుత్రా! నీ శరీరము వీరత్వముతో శోభించుచూ, నీవు ఎల్లప్పుడూ యుద్ధమునకై ఉత్సుకుడవై యుందువు. ఇపుడు కేవలము నీ శిరము మాత్రమే దక్కినది. నీ శరీరము, సేన, నిన్ను ఎల్లప్పుడూ అనుగమించు ఛత్రచామరములు ఏమైనవి? నిన్ను కాంచి కామినులు విరహాగ్ని యందు జ్వలించెడివారు. నీ శిరము అస్తంగత సూర్యుని వలె ఏల మ్లానమైనది? నేను, మీ తండ్రి కావించిన అపరాధమేమి? మా అశ్రువులను బాపి, మా సేద తీర్చుటకు నీవు ఏల వచ్చుట లేదు. బహుమూల్య ఆస్తరణములు పరచిన హంసతూలికా తల్పములపై పరుండు నీవు నేడు ఎక్కట పరుంటివి? నిన్ను చూచి మా హృదయములు విదీర్ణమగుచున్నవి. నీవు లేక మేము ఈ ప్రపంచమును చూడలేము."

శారద ఈ విధముగ రోదించుచుండగా రౌద్రకేతు సహితము అత్యంత దు:ఖాతురుడై ఇట్లనియె "నా ప్రియపుత్రా! నీవు నీ వృత్తాంతమును తెలుపక ఎచటి కేగితివి? నీవు ప్రతిదినము జరిగిన, జరుగుచున్న, జరగబోయెడు విషయములన్నియు మాతో పంచుకొనెడి వాడవు. నీవు పలుకుట లేదేమి? నీవు సమరమందు ప్రత్యర్థుల ఘాతముచే రక్తస్రావమై దివంగతుడవైతివేని, నాకు తెలుపక సమరమునకు ఏల ఏగితివి? నీవు నీ హస్తమందు ఖడ్గధారణ చేసితివేని పర్వతసహిత పృధివి, త్రిలోకములు కంపించును. అటువంటి అసహాయశూరుడవైన నిన్ను ఎవరు వధింపగలిగిరి? కాలగతి ఇంతేకదా! ఎవరికినీ ఎరుక పడదు. లోకమందు పురుష ప్రయత్నము కంటె దైవమే బలీయము. మా వంశ భూషణుడు, భూతలమునకు తలమానికమైన నరాంతకుడు ఎచటికేగెను? కాలమునకు సహితము కాలుడు, శత్రువులనెడు కుంజరములకు పంచాస్యుడు, శత్రురాజులనెడు దూదిని భస్మమొనరించు మహాగ్ని, సూర్య సమాన తేజస్వీ అయిన నరాంతకుడు నేడు అస్తమించెను." ఈ విధముగ రౌద్రకేతు ఆక్రందన కావించెను. ఈ విధముగ ఆ దంపతి నానా విధముల శోకించి, తదుపరి ఆ శిరమును గొని దేవాంతకుని వద్ద కేగిరి.

వారిద్దరినీ కాంచి, దేవాంతకుడు తన సింహాసనము దిగి, మాతా పితరుల నాలింగన మొనర్చుకొని, తన సోదరుని శిరమును కాంచి, భ్రాతృస్నేహ వశమున తానునూ క్రౌంచపక్షి వలె రోదించుట నారంభించెను. దేవాంతకుడు "సోదరా! మన మిరువురము ఒకేసారి భోజనము, జలపానము, నిద్రా క్రీడాదులు కావించెడివారము. ఒకేసారి జపతపాదులు సహితము కావించితిమి. నిన్నుచూచి ఎటువంటి దేవతా, మానవ వీరులైననూ కాలికి బుద్ధి చెప్పెడివారు. అటువంటి నిన్ను నిర్జించిన వీరుడెవ్వరు? నేను పృధివీ, పాతాళములు నీకు సమర్పించితిని. అటువంటి నన్ను వదలి నీవేడకు ఏగితివి?" అని ఆక్రందించు చుండగా, అతని తోటి వీరులు ఏతెంచి, ఆతనిని ధృఢముగ కౌగిలించుకొని, ఇట్లనిరి "రాజా! వీరులు వీరస్వర్గ మొందిన వేరొక వీరుల ఎడల శోకింపరు. కానీ ఎవరైతే వారిని సంహరించిరో, వారిని ప్రయత్నపూర్వకముగ హతమార్చెదరు. పుట్టినప్పుడే ప్రతి జీవికినీ మృత్యువు రాసిపెట్టి యుండును. ఈ మృత్యువు నేడో,

రేపో, లేక పది, వంద సంవత్సరములైననూ తప్పక ఏతెంచును. ఇందు సందేహము లేదు. అందువలన మీరు విచారింపవలదు." అంత దేవాంతకుడు సావధానచిత్తుడై తన తల్లిదండ్రులతో ధర్మవేత్త వలె ఇట్లనియె "మీరిరువురూ శోకింపవలదు. నేను మన శత్రువును యమపురికి పంపించెదను. నా సోదరుని హత్య గావించిన దురాత్ముని ఆవాసమెక్కడ? నేను వెళ్ళి ఆ దురాత్ముని నైననూ హతమార్చెదను. లేని ఎడల నేనే హతమార్పబడి నా సోదరుని చెంతకేగెదను. నానుండి ఈ త్రిలోకములను రక్షించునాధుడు లేదు." ఎంత చిత్రము మానవులు గర్వమునొంది ఎంతటి దుర్మదాంధులగుదురో కదా!

తదుపరి దేవాంతకునకు వాని మాతాపితరులు కాశీరాజ వృత్తాంతము, ధూమ్రాక్షవధ, ఇతర దనుజుల మరణము, వినాయకుని లీలలు, తెలిపిరి. అంత ఆతడు తన క్రోధముతో త్రిలోకములను కంపింపజేయుచూ, అత్యంత గర్వితుడై ఇట్లనియె "నేను శీఘ్రాతి శీఘ్రముగ ఏగి సర్వులను మడసిపెట్టెదను. సర్వులను అంతమొందించు కాలమును సహితము వధింతును. పృధివిని అతలాకుతలము కావించెదను. ఈ బ్రహ్మాండమును ఒక్క క్షణములో భస్మమొనరించెదను. నా సోదరుని శిరమును సురక్షితముగ యుంచవలసినది. నేను పోయి మునిపుత్రుని గొనివచ్చి ఇరువురి దేహ సంస్కారములు ఒకేమారు కావింతును." ఈ విధముగ పలికి, ఒక గొప్ప సింహనాదమునొనర్చి, సేనలన్నింటికీ యుద్ధ సన్నద్ధము అవమని ఉత్తర్వులు ఇచ్చెను. తదుపరి తన దైత్యసేనతో ఆఘమేఘములపై కాశీ నగరమును ముట్టడించెను. ఆ సమయమున కాశీనగరమంతటా కోలాహలము అలముకొన్నది. ధూళిరేగి నలుదిశలా ఆచ్ఛాదన మొనర్చినది. సూర్యుని ప్రకాశము మందమైనది. భయంకర సమరమునకు సూచనలు తెలియచున్నవి. నగరవాసులందరూ "నరాంతకుడు మరణించి రెండు, మూడు రోజులు సహితము గడువలేదు. ఇపుడు ఈ ఉపద్రవము ఎట్లు ఏతెంచినది? ఈ చండ ప్రచండ దేహుడెవరు? ఈ దుష్ప్రేక్ష్యమయిన సేనను తీసికొని వచ్చి, ఈ నగరమును, జనులను ఏమి కావింపనున్నాడు? వీరు నగరము చూట్టూ మొహరించి యున్నారు. బయటకు పోవు మార్గము సహితము లేదు" అని ఆక్రందించుచుండిరి.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి శారదా, రౌద్రకేతుల శోకము అనెడు అరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

అరువది రెండవ అధ్యాయము

(వినాయక, దేవాంతకుల యుద్ధ సంరంభము)

అంత దూతలు ఏతెంచి కాశీరాజుతో "మహారాజా! మనలను ముట్టడించిన దైత్యుడు మహా భయంకరుడు. ఆతని శిరము అంబరము నంటుచున్నది. ఆతని సేన చతురంగ బల సమేతమై, అసంఖ్యాకమై యున్నది. వారు నగరమునకు నలుప్రక్కలా మొహరించియున్నారు. ఇపుడు కర్తవ్యము తెలుపవలసినది." అంత కాశీరాజు భయకంపితుడై బాలురతో క్రీడించుచున్న వినాయకుని వద్ద కేగి, సర్వమునూ తెలిపి ఇట్లనియె "ఓ! లీలామానుషధారీ! జగద్గురూ! మీకు నమస్కారము. మీరు బాలరూపులయినప్పటికీ, మమ్ము అనేకమార్లు ఇక్కట్ల నుండి కాపాడిరి. ఇపుడు ఈ దేవాంతకుని బారినుండి మీరే మమ్ము రక్షింపవలసినది." కాశీరాజుచే ఈ విధముగ ప్రార్థింపబడిన విఘ్నేశుడు తన శరీరమును పెంచి, సింహవాహనుడై, సిద్ధిబుద్ధుల సహితుడై, ధనుర్బాణములు ధరించి, సూర్య సమాన తేజస్సుతో తేజరిల్లుచూ, ముఖము నుండి అగ్ని వర్షించుచుండగా, పర్వతములు కంపించునటుల, పర్వత కంధరములు ప్రతిధ్వనించునటుల సింహగర్జన కావించెను. అంత ఆకాశమార్గమున బయటకేతెంచి, శలభ సమూహముల వలె యున్న దైత్యసేనను కాంచి

సిద్ధిని చూచి ఇట్లనియె "ఈ దైత్యసేనను ఒక్కడనై ఎదుర్కొనుట కష్టతరము అందువలన ఈ దైత్యుని పరాజితులనొనర్చుటకై తగిన సైన్యమును సృష్టింపుము." అంత సిద్ధిదేవి వినాయకుని పాదములకు నమస్కృతులొనర్చి, దేవాంతకునితో యుద్ధమొనర్చుటకేగి ఒక మహా గర్జన కావించెను. ఆ గర్జన చే త్రిలోకములు శేషుడు, పర్వత సహిత పృధివి కంపించిరి. అంత సిద్ధి అష్ట సిద్ధులను స్మరించెను. "అణిమ, గరిమ, మహిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశిత్వము, వశిత్వము" ఈ ఎనిమిది సిద్ధులు, వారి వెనుక చతురంగ బలములు, సేనలతో వర్షఋతువు నందలి నదులు పొంగి పొరలి సాగరము వైపు పయనించునటుల అమిత యుద్ధ లాలసతో ఏతెంచిరి. వారి అసంఖ్యాక వాద్య నినాదములతో, వీరుల సింహనాదములతో రోదశీకుహరము దద్దరిల్లెను.

పృధివీ మండలమునందు యముని వలె తోపించుచున్న ఆ వీరుల చూచి దేవాంతకుడు "నేను ఈ మునిపుత్రుని గొని ఒక్క క్షణములో సమరము ముగించి స్వర్గమున కేగవచ్చునని తలంచితిని. అకస్మాత్తుగా ఇంత సైన్యము ఎచటనుండి ఏతెంచినది? ఈ బాలుడే ఈ మాయను సృష్టించెను. అయిననూ "చంపుటయో లేక చచ్చుటయో" ఇదియే మార్గము. ప్రాణములు పోవచ్చును; కానీ యశము నాశమొందదు" అని పలికెను. ఆ పలుకులు విని సేనా నాయకులు "రాజా! మీరు వెనుకయుండి సేనను రక్షింపవలసినది. మేమ ముందుండి సేనను నడిపించెదము. అపుడు విజయము మనను వరించును" అని పలికిరి. దేవాంతకుడు సంతసిల్లి "వల్లె" అనెను. అంత దైత్య సేనా నాయకులు దేవాంతకునకు నమస్కారమొనర్చి, ఆశీర్వచనములుగొనిరి. అంత "కర్దముడు" అను రాక్షస నాయకుడు "అణిమా" శక్తి చే సృష్టింపబడిన రథాకృతి యందున్న వ్యూహమును భేదించుటకేగెను. "దీర్ఘదంతుడు" అను దైత్యుడు పరమ దుర్జయమయిన చక్రవ్యూహమును భేదించుటకేగెను. ఈ చక్రవ్యూహము వీరులను మోహింపజేయు "గరిమ" శక్తిచే సృష్టింపబడినది. "ప్రధిమ" ద్వారా రచింపబడిన వ్యూహమును భేదించుటకు "తాళజంఘుడు" ఉద్యక్తుడయ్యెను. "మహిమ" ద్వారా సృష్టింపబడిన వ్యూహమును భేదించుటకు "యక్ష్ముడు" అను దైత్యుడు సంసిద్ధుడయ్యెను. "ప్రాప్తి" ద్వారా కావింపబడిన వ్యూహ భేదనమునకు "ఘంటాసురుడు", "ప్రాకామ్య" యొక్క వ్యూహభేదనము నకు బలశాలి అయిన "రక్త కేశుడు" మక్కువచూపెను. "వశిత్వ" సిద్ధిచే తీర్చిదిద్దబడిన వ్యూహభేదనమునకు "కాలాంతకుడు", "ఈశిత్వ" చే నిర్మింపబడిన దుర్జయ వ్యూహ భేదనమునకు "దుర్జయుడు" తలయూచిరి. ఈ విధముగ ఎనిమిది సిద్ధులచే రచింపబడిన వ్యూహ భేదనమునకు ఎనిమిదిమంది మహాదైత్యులు సంసిద్ధులై రణమారంభించిరి. ఇరుసేనల నడుమ రోమరోమము ప్రకంపించు తుముల యుద్ధము ఆరంభమయ్యెను. ఇరువైపుల నుండి బాణవర్షము కురియు చుండెను.

ఇరుప్రక్కలా వీరసైనికుల శిరములు ఖండింపబడుచున్నవి. ఖండింపబడిన మానవ, గజాశ్వముల చేతులు, కాళ్ళు, మొండెములు అడ్డముగ పడి యుండుటచే ఒక్కొక్కమారు ముందునకేగుట కష్టముగ యుండెను. ఒకచోట సైనికులు తమ డాళ్ళను ముందుకు చాపి శత్రు సైనికుల కాళ్ళు ఖండించుచుండిరి. కొందరు పర్వతములవలె కాయములు పెంచి శత్రు సేనలపై దుమికి వారిని చూర్ణమొనరించు చుండిరి. ధూళిరేగి అంబరము నంటుటచే తమ పక్షము, ప్రతిపక్ష సైనికులు తెలియకుండిరి. ఇరుసేనలు భీషణ సింహనాదము లొనర్చుచుండిరి. ఆ యుద్ధము ఎంత భయంకరముగ యుండెనన శిరము లేని మొండెములు సహితము ప్రత్యర్థులతో సమరము ఒనర్చుచుండిరి. శత్రు ప్రహారముచే రక్తస్రావము జరిగి వీరులు పూచిన శింశుపా వృక్షముల వలె శోభిల్లుచుండిరి. ఇంతలో ఒక విచిత్రము జరిగినది. రాక్షస గురువయిన శుక్రాచార్యుడు తన మృత సంజీవినీ విద్యతో మరణించిన దైత్యులను తిరిగి బ్రతికింప నారంభించెను. అంత దేవసేన చింతాగ్రస్తులయి "ఈశిత్వ" సిద్ధికి తెలిపిరి. అంత ఈశిత్వము క్రోధానలయై తన ముఖము నుండి ఒక కృత్యను సృష్టించెను. అంత ఆ కృత్య రాక్షసగురువు వద్దకేగి, ఆయనను తన శరీరమందు దాచి అంతర్ధానమై ఆయనను అనార్యుల కాలవాలమైన బర్బరదేశమందు విడచెను. ఈ దేశమందలి లోకులు ఈషణ్మాత్రము సంస్కృతి, ప్రవర్తన తెలియని దుర్జనులు. అంత

దేవతలు తిరిగి పుంజుకొని దైత్య సేనలను తరిమికొట్టిరి. దైత్యులు కొందరు పలాయనులై, కొందరు శరణాగతులైరి. ఒకప్పుడు దేవతలు, మరొకప్పుడు దైత్యులు పైచేయగా భయంకర ద్వంద్వ యుద్ధము జరుగుచున్నది.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయక దేవాంతక యుద్ధ సంరంభమను అరువది రెండవ అధ్యాయము సమాప్తము)

అరువది మూడవ అధ్యాయము

(దేవ దైత్య సమరము)

కాలాంతకుడు ప్రాకామ్యసిద్ధితో ద్వంద్వ యుద్ధ మొనర్చుచుండెను. కొంత సేపటికి కాలాంతకుని బలమధికమై ప్రాకామ్యను జయించు స్థితి ఏతెంచెను. అంత వశిత్వసిద్ధి అతి శీఘ్రముగ ఏతెంచి, ప్రాకామ్యకు సహాయమొనరించి, తన హస్తలాఘనుమును ప్రదర్శించి, కాలాంతకుని శిరమును ఒక పర్వత శిఖరముచే ప్రహారమొనర్చెను. కాలాంతకుడు రధిరము గ్రక్కుచూ, శరీరము విరీర్ణమై భూమిపైబడి దివంగతుడయ్యెను. రాక్షస సేనలు హాహాకారములొనర్చినవి. అంత "ముసలుడు", "భల్ల" అను ఇరువురు దైత్యులు ప్రాకామ్య సిద్ధితో యుద్ధహేతువై అరుదెంచిరి. అంత ప్రాకామ్యకు సహాయముగ మహిమ నిలచినది. ఈ విధముగ వారి నలుగురి నడుమ భయంకర సమరము జరిగినది. అందు అనేకమంది దేవ సైనికులు మృతినొందిరి. రక్తము ఏరులైపారెను. అంత ఈశిత్వ, వశిత్వ, విభూతి శక్తులు ప్రాకామ్యకు సహాయముగ ఏతెంచి, నాలుగు పర్వతములు పెకలించి ఆ దైత్యులపై విసరిరి. ఆ దైత్యులందరూ ఆ పర్వత ప్రహరణముచే నుగ్గునుగ్గయి మరణించిరి. అణిమాశక్తి కర్దముని శిఖను పట్టి బలపూర్వకముగ భూమిపై విసరెను. కర్దముని శరీరము తునాతనకలై, ఉనికి సహితము లేకుండ నశించెను. మహిమ, లఘిమ, మరియు గరిమ వృక్ష సమూహములు గ్రహించి యక్ష్మాసుర, తాళజంఘ, దీర్ఘదంతులపై ప్రహరించిరి. ఇంతలో దీర్ఘ నిశ్వాసములు విడచూచా ఘంటాసుర, రక్తకేశ, దుర్జయులను మహాబలులు ఈ శక్తుల నడ్డగించుటకై ఏతెంచిరి. ఆ దైత్యులచే దేవసేన ఉచకోత కోయబడుచుండెను. ఆ ఘోరకలి నవలోకించి వశిత్వము, సిద్ధి, విభూది, అచటికేగి పిడికిలి బిగించి ఆ దైత్యుల లలాటమందు ప్రహరించెను. ఆ దైత్యులందరూ ఒక్కమారుగ శరీరములు శిధిలమై నేలకొరగిరి.

అంత సిద్ధులన్నియు విజయము ప్రాప్తించి గర్జన చేయుచూ "వినాయకునకు జయము; వినాయకుడు జయించెను" అని నినాదములు కావించచూ దైత్యసేనను ఛిన్నా భిన్న మొనర్చిరి. అంత దైత్యసేన వెనుకకు మరలి, దైర్యము తెచ్చుకొని, వీరులతో కూడి తిరిగి సమరమున కేతెంచెను. తిరిగి భయంకర తుముల యుద్ధము ఆరంభమయ్యెను. ఇంతలో దివాకరుడస్తమించి, రాత్రి ఉదయించి, లోకము సర్వము అంధకార బంధురమయ్యెను. అంత ఇరుసేనలు రాత్రి పకాశమునిచ్చు దివ్యౌషధులను గ్రహించి, వాటి వెలుగున సమరమొనర్చు చుండిరి. ఈ విధముగ మూడు రాత్రింబవళ్ళు ఎడతెగని యుద్ధము జరిగెను. నలువంకలా రక్త సరితలు ప్రవహించుచుండెను. ఆ సరితలందు డాళ్ళు తాబేళ్ళవలె, కత్తులు మత్స్యముల వలె, శిరములు కమలముల వలె, ఏనుగులు మొసళ్ళవలె, తోపించుచూ వీరులకు మహోత్సాహము, భీరువులకు భయము గొల్పుచున్నది. బలశాలురైన దేవతలచే తన సేన ఓడింపబడుట గాంచి, దేవాంతకుడు చింతితుడయ్యెను. "నేను నా బల ప్రభావముచే సర్వ దేవతలపై విజయమునందితిని. ఒక చిన్న బాలకుని సామాన్యమయిన మాయ నన్నేల ధిక్కరించుచున్నది? నేను ఈ అష్టసిద్ధులను, ఈ దేవసేననూ నాశన మొనరింతును. అపుడు బాలుడయిన వినాయకుని పట్టి నా గృహమున కేగుదును" ఈ విధముగ తలచి, చేత కరవాలము బూని, గర్జన చేయుచూ

శత్రుసేనపైబడెను. ఆ భయంకరాకారుని గాంచి కొందరు దేవతలు మూర్ఛితులు, పలాయనులు అయిరి. కొందరు భూమిపై పడిరి. కొందరు వినాయకుని స్మరించి ప్రాణత్యాగ మొనరించిరి. కొందరు దేవతలు రక్తప్రవాహమందు కొట్టుకొనిపోయిరి. అంత దేవసేన భగ్నమై దశదిశలకు పలాయన మొనర్చెను. దైత్యుడు కరవాలముతో వారి వెనుక పరుగెత్తి వారిని హతమార్చెను.

అంత గరిమ ఈ దృశ్యమును గాంచి, ఒక మహావృక్ష సహిత పర్వతమును పెకలించి వానిపై విసరెను. దేవాంతకుడు తన కరవాలముతో ఆ పర్వతమును ఛిద్రమొనర్చెను. అంత అష్టసిద్ధులు కలసి దేవాంతకునిపై పర్వత వర్షము కురిపించిరి. దైత్యుడు తన హస్తలాఘవమును ప్రదర్శించి వాటిని ఛేదించెను. అంత మహిమ ఎగిరి, ఆ దైత్యుని హస్తముపై కూర్చొని, ఆతని కరవాలమును గ్రహించి అంతర్ధానమొంది, తిరిగి ఆ ఖడ్గముచే ఆ దైత్యుని ప్రహరించెను. ఆశ్చర్యము. ఖడ్గము తునాతునకలయ్యెను. దైత్యుని రోమము సహితము కదులకుండెను. అంత దైత్యడు ఆ అష్టసిద్ధులపై బాణ వర్షము కురిపించెను. సిద్ధులన్నియు భూమిపై బడి పరాజితమై, ఒక ముహూర్తకాలమయిన పిదప నెమ్మదిగ లేచి, వినాయకుని వద్దకేగి తమ పరాజయ వృత్తాంతమును తెలిపిరి. అంత "బుద్ధి" వారితో "బుద్ధిని వదలిన ఎడల మీకు జయము ఎట్లు సిద్ధించును?" అని పలికి వినాయకునితో "స్వామీ! నాకు అనుజ్ఞ నీయవలసినది. నేను సమరమున కేగి నా పౌరుషమును ప్రదర్శించెదను" అని పలికెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దేవదైత్య సమరమను అరువది మూడవ అధ్యాయము సమాప్తము)

అరువది నాల్గవ అధ్యాయము

(బుద్ధి, దేవాంతక సంగ్రామము)

వినాయకుడు బుద్ధి పలుకులు విని సంతసిల్లి, ఆ శక్తికి వస్త్ర భూషణములొసంగి సమరాంగణమున కేగుటకు అనుజ్ఞనిచ్చెను. అంత బుద్ధి వినాయకునకు ప్రణామము లొనర్చి యుద్ధభూమి కేగెను. సమరాంగణమున నిలుచొని ఒక తీవ్ర గర్జనమొనర్చి, తన నుండి ఒక భయంకర కృత్యను ఉద్భవింపజేసెను. ఆ కృత్య వికారమయిన ముఖము, గుహవంటి నోరు, నాగళ్ళవంటి దంతములు, భయంకరమైన కనులు, కలిగి నేత్రముల నుండి అగ్నివర్షము కురిపించుచుండెను. ఆ అగ్ని జ్వాలలచే దైత్య సైన్యము సర్వము దగ్ధమగుచుండెను. కొందరు దైత్యులు పలాయనమొనర్చిరి; కొందరు అశువులు బాసిరి; మరికొందరు "ఇపుడు ఎచటికేగి సుఖించగలము?" అని తర్కించిరి. కొందరు దేవాంతకుని ఆశ్రయించిరి. ఈ కోలాహలమంతయు విని, దేవాంతకుడు అచటి కేతెంచి, ఆ కృత్యను కాంచి, ధనువు సారించి విష సర్పముల వంటి సాయకములతో బాణవర్షము కురిపించెను. ఆ సాయక సంపద సూర్య మండలమును ఆచ్ఛాదన మొనర్చెను. అంత కృత్య విశాలబిలము వంటి తన నోటిని తెరచి ఆ శస్త్రములను గ్రసించెను. ఎంతమంది మనుజులను భక్షించిననూ తృప్తినొందని రాక్షసులవలె ఆ శస్త్ర సంపదనంతటినీ మ్రింగిననూ ఆ కృత్యకు ఆకలి తీరదయ్యె! దేవాంతకుని క్షీణబలము గమనించి, వానిని వదలి కృత్య దైత్యసేనపై బడి కొందరిని చేతులతో మర్దించి, కొందరిని కాళ్ళతో నలిపి, కొందరిని భుజించి, ఈ విధముగ కోట్లాది దైత్యులను అట్టడిగించెను. ఈ విధముగ ఎదురయిన సర్వులనూ సర్వనాశన మొనర్చి దేవాంతకుని వైపు నడచెను. అంత దేవాంతకుడు పలాయనమొనర్చెను. ఆ దైత్యుడు ఎక్కడెక్కడికేగిననూ కృత్యవానిని వెంబడించి, తుదకు వాని శిఖపట్టి, వానిని తన పాయువందు దాచి వినాయక ప్రభువు వద్దకు బుద్ధి సహితయై

ఏతెంచెను. ఆ భయానక కృత్య ఏతెంచు సమయమున పర్వతములు చూర్ణమయ్యెను. అంత వినాయకుడు ఆ కృత్యను సమరాంగణము నుండి బయటకు పంపెను. ఆ సమయమున ఆమె శరీరమందున్న దేవాంతకుడు బయటపడి, ఓడి, లజ్జితుడై, ముఖము మ్లానమవ్వగా, అదోముఖుడై తన గృహమున కేగెను. బుద్ధి, కృత్యలు వినాయకునకు నమస్కృతులర్పించినవి. అంత కృత్య తను నిద్రించుటకు స్థానము నీయమని వినాయకుని అర్థించెను. వినాయకుడు "ఓ! దైత్యనాశినీ? నీవు ఇంద్రాది దేవతల కంటె బలమయిన శక్తివి. కానీ దేవాంతకుడు నిన్ను వంచించి తన గృహమున కేగెను. నేను దేవాంతకుని వధించెదను. నీవు చింతింపవలదు. నీవు నా ముఖము ప్రవేశించి, నా ఉదరము నందు స్థిరస్థానము నొందుము. అంత కృత్య వినాయకుని ఉదరము చేరి నిద్రించెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి బుద్ధి-దేవాంతక సమరమను అరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

అరువది అయిదవ అధ్యాయము

(దేవాంతకుని సమర పునరాగమనము)

బ్రహ్మ "శారదా, రౌద్రకేతులు ఆ నిశా సమయమున ఏకాకిగా యున్న దేవాంతకుని గాంచి, ప్రేమతో ఆలింగన మొనర్చి, చక్రవాతమందు కంపించు వృక్షము వలె కంపించుచున్న తనయుని ఇట్లు ప్రశ్నించిరి "పుత్రా! నీ ముఖము ఏల మ్లానమైనది? నీ వాంఛిత వస్తువు త్రిలోకములయందు ఎక్కడ యున్ననూ దానిని నీకు ఉపలబ్ధ మొనర్చెదము." అంత దేవాంతకుడు తాను కాశీనగరమునకు ఏగిన దాదిగ జరిగిన విషయములన్నియు ఉగ్గడించి, తాను కృత్య చేతిలో పొందిన పరాభవము సహితము తెలిపెను. అంత రౌద్రకేతు "పుత్రా! నీవు విచారింపవలదు. నేను నీకొక ఉపాయము తెల్పెదను. నీకు బీజాక్షర సహితముగ శివుని అఘోర మంత్రోపదేశ మొనర్చెదను. నీవు ఆ మంత్రమును ఒకలక్ష జపము, అందలి దశాంశ హోమము, అందలి దశాంశము తర్పణము, అందలి దశాంశము బ్రాహ్మణ భోజనము కావింపవలెను. తత్ఫలితముగ నీకు అగ్నికుండము నుండి ఒక అశ్వము ఉద్భవించును. దానిపై అధిరోహించి నీవు యుద్ధమున కేగుము. నీకు విజయము తథ్యము" అని పలికెను. అంత వారిరువురు గృహాంతర్భాగమున కరిగిరి. ఇరువురు స్నానమాచరించి, రక్తవర్ణ దుకూలములు ధరించి, రక్తచందన విలేపన మొనర్చి, రక్తవర్ణ పూలతో శివుని పూజించిరి. దేవాంతకుడు పరమభక్తితో మంత్రానుష్ఠాన మొనర్చెను. తదుపరి తండ్రీ తనయులిరువురూ ఒక షట్కోణాత్మక యజ్ఞకుండము నిర్మించి, అగ్నిని ప్రజ్వలింపజేసి, పంచప్రేతాసీనులై అత్యంత భక్తితో తమ తొడలనుండి మాంసమును ఖండించి, దానిని ఆహుతులుగ యజ్ఞ కుండమందు వైచి, దశాంశ హోమమును ఒనర్చిరి. అంత రౌద్రకేతు తన కుమారుడు దేవాంతకుని శిరము ఖండించి, ఆ యజ్ఞగుండమందు వ్రేల్చి పూర్ణాహుతి యొనర్చెను. అంత శివుని కృపచే దేవాంతకుడు పునర్జీవితుడై, ఇరువురు పూర్ణ స్వస్థత నొందిరి. తదుపరి తర్పణము, బ్రాహ్మణ భోజనము సమర్పించిరి.

ఆ రాత్రి గడచిన పిమ్మట సూర్యోదయమున దేవాంతకుడు కృష్ణవర్ణముతో ప్రకాశించుచున్న ఒక గొప్ప అశ్వమును కాంచెను. అయ్యది అత్యంత అవయవ పుష్టి కలిగి, మనోవాయు వేగమున పయనించగలదై, సకిలించిన మాత్రమున త్రిలోకములను కంపింపజేయుచున్నది. దైత్యుడు ఆ అశ్వమునుకు నీరాజనమిచ్చి, భక్తితో పూజించి, మణిమాణిక్యాదులతో అలంకరించి, తన తల్లిదండ్రులకు, బ్రాహ్మణులకు వందనమాచరించి, అశ్వారూఢుడై తిరిగి యుద్ధభూమికేగెను. దేవాంతకుని యుద్ధ భూమి యందు కాంచిన దైత్యసేన ద్విగుణీకృత ఉత్సాహమునొంది తీవ్రగర్జన మొనర్చిరి. దేవాంతకుడు తిరిగి

ఏతెంచెనన్న వార్తవిని దేవసేన దు:ఖితులై పలాయన మొనర్చుటకు సిద్ధమైరి. కానీ సిద్ధి, అణిమాది శక్తులు వారిని శాంతపరచి, తిరిగి యుద్ధోన్ముఖులను కావించిరి. అంత ఇరుసేనల మధ్య తీవ్ర తుముల యుద్ధమారంభమయ్యెను. “కొట్టు”; “చంపు”; “నిన్ను సంహరించెదను” అను నినాదాములతో కరవాలములు దూసి, ధనువులు సారించి, డాళ్ళు ముందుకు జాపి, శత్రువులను ఘాతమొనర్చుచుండిరి. అంత దేవాంతకుడు తన అశ్వమును ప్రేరేపించి, దేవసేనపై కంపెను. ఆ అశ్వము తన కాళ్ళతో త్రొక్కుచూ, హేషణలతో దేవ సైనికులను మూర్ఛనొందించెను. ఆ సమయమున దేవాంతకుడు ఒక చేతిలో కరవాలము, వేరొక చేతిలో త్రిశూలము ధరించి దేవసేనను నిర్ద్వంద్వముగ సంహరించుట నారంభించెను. అంత సిద్ధి తన అణిమాది సిద్ధుల సహితయై వినాయకుని వద్దకేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దేవాంతక సమర పునరాగమనము అను అరవది ఐదవ అధ్యాయము సమాప్తము)

అరువది ఆరవ అధ్యాయము

(వినాయక దేవాంతక సంగ్రామము - I)

వినాయకుడీ విషయము విని కించిత్ ఆశ్చర్యము నొంది, తిరిగి కృద్ధుడై, సింహారూఢుడై గర్జించుచూ దేవాంతకుని వద్దకేగెను. దేవాంతకుడు పరిహాసముగ నవ్వుచూ “బాలకా! నీవు నవనీతము తిను యోగ్యుడవు. అదితీనందనా! నీకీ మూర్ఖత్వము వలదు. నీవు దేవాంతకునితో యుద్ధమొనర్ప దలచితివి. నన్ను చూచిన కాలము సహితము కంపించును. ఏల మరణమును కోరుకొన దలచితివి?” అని పలికెను. ఆ పలుకులు విని వినాయకుని కనులు అరుణిమలైనవి. “ఓరీ! మూఢుడా! నీకు సన్నిపాత జ్వరము వచ్చియో, లేక మద్యపానరతుడవై, మూఢత్వముతో అసంబద్ధ ప్రలాపములు పలుకుచుంటివి. అగ్నికణము చిన్నదైననూ సర్వమును దహించును. నీ ప్రేలాపనచే ప్రేరితడనై నిన్ను వధించెను. నీవు వర గర్వితుడవై “నాకు అంతము లేదు” అని అహంకరించు చుంటివి. నేను సనాతన బ్రహ్మ స్వరూపుడను. నిన్నంతము చేయటకే అవతారము స్వీకరించితిని. నీ వరముల యొక్క అవధి సమీపించినది. నీవు బుద్ధిహీనుడవై అవగాహన మొనర్పకుంటివి. నీవు త్రిలోకములను పీడించితివి. అయిననూ అద్దానిని చర్చించుట అనవసరము. నీవు నీ పౌరుష పరాక్రమములు చూపింపుము. నీవు కృత్య యొక్క గుప్తాంగము నందు యుంచబడి వెలువడితివి. అయిననూ నీవు సమరము చేయదలచు చుంటివి” ఈ విధముగ పలికి వినాయకుడు నారి సారించి, టంకారమొనర్చి, దైత్యుని పై బాణ పరంపర కురిపించెను. దైత్యుడు సహితము వానిని ఖండించి వినాయకునిపై బాణవర్షము వర్షించెను. వినాయకుడు ఒక బాణముతో దేవాంతకుని ముకుటమును, రెండు బాణములతో వాని కుండలములను కూల్చెను. అంత దేవాంతకుడు పళ్ళు పటపట కొరుకుచూ, తిరిగి నారి సారించి బాణప్రయోగ మొనర్చెను. ఆ సాయకములు అంబర వీధిని ఆదిత్యుని ఆచ్ఛాదించుచూ వినాయకునిపై పడసాగెను. వినాయకుడు ఒకే భల్ల బాణముతో వాటన్నింటినీ ఖండించెను. ఈ విధముగ అనేకమార్లు వారిరువురు ఒకరినొకరు సాయకవర్షముతో ముంచెత్తిరి.

అంత దేవాంతకుడు అఘోర మంత్రమును నూట ఎనిమిది మార్లు జపించి వారణాస్త్రమును సంధించి విడచెను. ఆ అస్త్ర బలముచే పర్వతములను సహితము పిండిచేయగల చతుర్దంతములు గల ఐరావత వంశమునకు చెందిన మహా కుంజరములు వేలాది ఉత్పన్నమై దేవసేనను ఛిద్రమొనర్చి నామ మాత్రావశేషము కావించుట మొదలిడెను. వాని కనుల నుండి కారు మదజలము ప్రవాహము వలె పారుచుండెను. దేవ సైనికులు దశదిశలు పలాయన మొనర్చిరి.

అంత వినాయకుడు దానిని శాంతింప జేయుటకు సింహాస్త్రమును సంధించి విడచెను. అంతే!! ఆ ప్రదేశమున వేలాది సింహములు గర్జన కావించుచూ ఏతెంచి, ఆ కుంజర సమూహమును విదీర్ణ మొనర్చెను. ఆ పంచాస్యములు ఏనుగుల కుంభ స్థలములపై దూకి వానిని దునుమాడినవి. ఈ విధముగ సింహములచే కుంజరములన్నియు వధింపబడినవి. అంత సింహములన్నియు దైత్యసేనపై బడి, ఆ సేన నంతటినీ కకావికలు కావించి భుజించినవి. అంత దేవాంతకుడు ఈ కశ్యప పుత్రుడు సామాన్యుడు కాదని నిర్ధారించుకొని, ఒక అస్త్రమును అభిమంత్రించి వదలెను. అంత అనేక శార్దూలములు ఉత్పన్నమై, అవి సింహములను ఎదుర్కొని సంహరించినవి. అంత సింహ, శార్దూలములు రెండునూ అంతర్ధాన మొందెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయక-దేవాంతక సంగ్రామము-I అను అరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

అరువది ఏడవ అధ్యాయము

(వినాయక-దేవాంతక సంగ్రామము-II)

తదుపరి దేవాంతకుడు ఒకే పర్యాయము రెండు సాయకములు సంధించి అందు నిద్రాస్త్రము, గంధర్వాస్త్రములను అభిమంత్రించి, నిద్రాస్త్రమును దేవసేనపైకి, గంధర్వాస్త్రమును వినాయకుని పైకి ప్రహరించెను. వినాయకుడు తన నికటమున తాళ, మృదంగ, భేరీ ఘోషలు, గంధర్వుల గానము, అప్సరసల నాట్యము చూచుచూ చేతనున్న విల్లు జార్చెను. ఆ నృత్యాదులు వీక్షించుచూ తన కర్తవ్యమును మరచెను. నిద్రాస్త్రము చే చీకట్లు మొహరించి దేవ సైనికులందరూ తమ శస్త్రములను దిగవిడచి నిద్రించిరి. అంత దైత్యుడు దేవసేన చుట్టూ అనేక గుల్మములు (గుల్మము=45 పదాతులు; 27 అశ్వారోహులు; 9 రథములు; 9 గజారోహులు యందురు) సేనను మొహరించి, తాను ఆ యుద్ధ స్థలియందు అభిచారిక హోమము కావించెను. అందు భాగముగ భూమిని శుభ్రమొనర్చి, శుద్ధుడై, నానా ప్రేతములపై పద్మాసనమందు కూర్చొని వందలాది దనుజుల సంహరించి వారి విశాల మాంసరాశిని ఒక చోట చేర్చెను. అంత అగ్నిస్థాపన మొనర్చి, నిర్వస్త్రుడై ఆ మాంసమును ఆహుతులుగ సమర్పించుచూ హోమ మొనర్చెను. ఒక వేయి ఆహుతులు హోమ మొనర్చిన పిదప అగ్నియందు ఒక క్షుధాతుర శక్తి కనబడెను. అంత ఆ శక్తికి నరమాంసము, ముందు సేకరించిన రక్త కలశములు సమర్పించెను. ఆ శక్తికి ఆకలి తీరకపోవుటచే తిరిగి ఇతర ప్రేతములను సమర్పించెను. అంత ఆ శక్తి సంప్రీతమై ఆ అగ్ని నుండి బయటకు ఏతెంచి, ఆకాశమంత ఎత్తు ఎదిగి, వికట దంష్ట్రలు, క్రూర ముఖము, రక్తవర్ణము కలిగి "దేవాంతకా! నేను తృప్తి నొందితిని. నీకు భయము వలదు" అని పలికెను. అంత దైత్యుడు ఆ శక్తికి షోడశోపచార పూజనాదులు కావించి, తాను తిరిగి దివ్య వస్త్ర భూషణములు దాల్చి, ఆ శక్తి ఒడిలో కూర్చొని ఒక మహాగర్జన మొనరించి "ఈ కశ్యప పుత్రుడు తొలుతనే చంచల స్వభావుడు. ఇపుడు గంధర్వాస్త్ర ప్రభావముచే మరింత అలసుడై యున్నాడు. ఓ! శక్తీ! నేను నీ సమక్షముననే ఈ వినాయకుని, ఈతని సేనలను సంపూర్ణముగ నాశమొనరించెదను" అని పలికెను.

దైత్యరాజు పలుకులు వినాయకుని చేరువనే యున్న కాశీరాజు ఆలకించి, వినాయకుని చేరి ఇట్లనియె "స్వామీ! నీవు త్రికాల జ్ఞాతవు. ఈ దైత్యునిచే రచింపబడిన గంధర్వమాయను ఏల భేదింపకుంటివి? ఇపుడు దేవాంతకుడు ఆభిచారిక హోమము కావించి ఒక మహారాక్షసిని ఉత్పన్నము కావించెను. ఆ రక్కసి మీ సేనను నాశమొనర్పగలదు. సావధానులై యుండవలసినది." అంత వినాయకుడు జ్ఞాన దృష్టి నొంది ఆ గంధర్వమాయను కాంచి, మోహమును

విడచి తన తుణీరము నుండి రెండు సాయకములు తీసి ఘంటాస్త్రము, ఖగాస్త్రములను మంత్రించి, నారి ఆకర్ణాంతము లాగి విడచెను. ఘంటాస్త్ర శబ్దముచే సైనికులు, సిద్దులు తిరిగి మెళకువనొంది యుద్ధసన్నద్ధులైరి. ఖగాస్త్రముచే అతి బలిష్ఠమైన పక్షులు వేలాది ఉత్పన్నములై, వాని రెక్కల తాకిడికి భయంకర ఝంఝూమారుతము వెడలి గంధర్వమాయను ఛిన్నాభిన్న మొనర్చెను. అంత ఆ పక్షులు దైత్యసేనను భక్షించుట నారంభించెను. కొందరు దైత్యులు పక్షుల రెక్కల ఘాతములచే మరణించిరి. కొందరు వాని చుంచువులచే పొడవడడి క్షతగాత్రులైరి. కొందరు భక్షింపబడిరి. మరికొందరు ఆ విహంగముల చూచి భయభ్రాంతులై ప్రాణములు విడచిరి. అంత దేవాంతకుడు క్రోధోద్రిక్తుడై ఖడ్గాస్త్రమును మంత్రించి వదలెను. అనేక వేల ఖడ్గములు ఒకేమారు ఏతెంచి దేవసేనపై బడినవి. దేవసేన వాటిని ప్రతిఘటించగా ఆ కరవాలముల ఒరిపిడికి మంటలు రేగి దేవతలు మృతినొందిరి. దేవసేన హాహాకారము లొనర్చెను. ఆ కరవాలములు ఖగాస్త్రముచే ఉత్పన్నమయిన పక్షులను సంహరించెను. చావగా మిగిలిన పక్షులు అంతర్ధానమయ్యెను.

ఇక కత్తులవాన కురియుట ప్రారంభించి దేవసేన యందు కొందరికి శిరములు, కాళ్ళు, చేతులు, మొండెములు, తొడలు, సర్వము తెగి దేవసేన సర్వనాశనమయినది. దశదిశలకు రక్తపుటేరులు పారెను. అంత వినాయకుడు ఆ దైత్యుని శక్తికి అబ్బురపడి, తన తుణీరము నుండి ఒక సాయకమును తీసి, దానియందు వజ్రాస్త్రమును అభిమంత్రించి విడచెను. ఆ వజ్రాస్త్రపు మహిమచే వృక్షములు పతనమై, దిశలు దగ్ధమయినవి. ఆ వజ్రాస్త్ర ప్రభావముచే ఖడ్గాస్త్రము ముక్కలైనది. వజ్రాస్త్రపు శక్తిచే దైత్యసేన దహింపబడినది. దైత్యులు దశదిశలకు పరుగులిడిరి. వజ్రము వారిని వెంబడించి శరీరములను చూర్ణమొనరించెను. వేలాది దైత్య సైనికులు మరణించిరి. అంత దేవాంతకుడు వేరొక సాయకమును శివనామముతో అంకితమొనర్చి దేవసేన పై విడచెను. అయ్యది దిక్కులు, విదిక్కుల ప్రతిధ్వనింప జేయుచూ దేవసేనపై బడెను. తక్షణము భయంకర శబ్దమొనరించుచూ ఒక భీషణ ముఖదారి ప్రత్యక్షమయి, త్రిలోకములు గ్రసించునటుల నోరు తెరచి దేవసేన పై బడెను. జటాధారియై, పొడవాటి చేతులు, కాళ్ళు, విశాలమయిన ఉదరము కలిగిన ఆ వికృత ముఖుడు ఒక్కక్షణములో వజ్రాస్త్రమును గ్రసించెను. అంత ఆ వికృతరూపుడు వినాయకుని గాంచి, ఆయనను హతమార్చుటకై ఆయన వంక పరుగెత్తెను. వినాయకుడు శీఘ్రముగ శతాక్షర సంఖ్యగల మంత్రము అభిమంత్రించి బ్రహ్మాస్త్రమును ప్రతిగా సంధించి ప్రయోగించెను. ఆ సాయకము లోకమును కంపింపజేయుచూ, విస్ఫులింగములు విరజిమ్ముచూ వెళ్ళి మరొక భయానక పురుషుని ఉత్పన్నమొనర్చెను. వారిరువురు కొంతతడవు ఆకాశమందు మల్ల యుద్ధ మొనర్చి అదృశ్యులైరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడా ఖండమందలి దేవాంతక సంగ్రామము II అను అరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

అరువది ఎనిమిదవ అధ్యాయము

(వినాయక దేవాంతక సంగ్రామము - III)

బ్రహ్మ "దేవాంతకుడు అత్యంత ఆశ్చర్య చకితుడై "ఈ బాలుడు నేను ప్రయోగించిన ప్రతి మాయకు ప్రతిక్రియ ఒనర్చుచున్నాడు. ఎప్పుడు ఈ బాలుని హతమొనర్చి నేను గృహమునకేగి విశ్రాంతి నొందెదను?" అని తలపోసి తిరిగి ఒక తీవ్రసాయకమును సంధించి వినాయకునిపై ప్రయోగించెను. అయ్యది అనేక సాయకములై బాణవర్షము కురిపింపసాగెను. అంత దేవాంతకుడు తాను యజ్ఞము నుండి బహిర్గత మొనర్చిన శక్తిని అధిరోహించి ముందుకు

వచ్చుచుండెను. అంత అణిమాది అష్టసిద్ధులు ఏకమై, ఆ శక్తిని దృఢముగ బంధించి వినాయకుని వద్దకు ఈడ్చుకొచ్చుట మొదలిడెను. అంత శక్తి లాఘవముగ తప్పించుకొని పారిపోయెను. అంత సిద్ధులు దేవాంతకుని శిఖ పట్టుకొని ఈడ్చుట మొదలిడిరి. అంత దైత్యుడు తొలుత అణిమపై ముష్టి ఘాతములు ప్రహరించెను. అంత అణిమ మూర్ఛనొందెను. అంత గరిమ, లఘిమ, వశిత్వము కర్రలతో, లాఠీలతో దేవాంతకుని ప్రహరించెను. అంత దేవాంతకుడు వారి ముగ్వురి పాదమలను ఏకకాలమున పట్టి గిరగిరా త్రిప్పి భూమిపై విసరెను. అంత వారు తప్పించుకొని ఆకాశమున కెగిరిరి. అంత భూతి, ప్రాకామ్యము, దైత్యుని బలముగ ప్రహరించిరి. దైత్యుడు నోటి నుండి మంటలు గ్రక్కుచూ, నేలపైబడి క్షణకాలము మూర్ఛనొందెను. తిరిగి తేరుకొని తాను యజ్ఞమునందు ఉద్భవింపజేసిన హయము నధిరోహించి, చేత కరవాలము ధృఢముగ పట్టి, వేగమున ఏతెంచి వినాయకుని శిరముపై కరవాలముతో ప్రహరించెను. అంత వినాయకుడు ఒక్క క్షణము మూర్ఛనొంది తిరిగి తేరుకొని తన నాలుగు హస్తములందు పద్మ, పాశాంకుశ, ధనువును ధరించి హిరణ్యకశిపుని సంహరించుటకు ఏగిన విష్ణువువలె గర్జించుచూ, వాయువేగమున దేవాంతకుని పై తన ఆయుధములు ప్రయోగించెను. ఆశ్చర్యము. ఆ దైత్యుడు ఆ ప్రహారములకు కనీసము కందలేదు. అంత వినాయకుడు ధూమ్రాక్షునికి సూర్యునిచే ప్రసాదింపబడిన దివ్యశస్త్రమును దేవాంతకునిపై ప్రయోగించెను. ఇంకనూ ఆశ్చర్యము. ఆ దైత్యుని రోమము సహితము కంపింపలేదు. చర్మము వసివాడకుండెను. ఆ దివ్య శస్త్రము నూరు ముక్కలయినది. వినాయకుడు సహితము కించిత్ ఆశ్చర్య చకితుడయ్యెను. తదుపరి ఇరువురు ఒకరిపై ఒకరు బాణపరంపర కురిపించుకొనుచూ, బాహాబాహీ, ముక్కాముక్కీ మల్లయుద్ధ మొనర్చుచూ, విరామము లేక, భయభీతులవక పోరాడుచునే యుండిరి. ఇంతలో ప్రభాకరుడస్తమించి చీకట్లు క్రమ్ముకొనెను. ఇరువురు కృత్రిమముగ ప్రకాశము నమర్చుకొని సంగ్రామము కొనసాగించిరి. అంత దేవాంతకుని తండ్రి రౌద్రకేతు దేవతలను మోహితుల కావించి, ఒక మాయా అదితీదేవిని సృష్టించి, ఆమెను దేవాంతకుని హస్తమందుంచెను. ఆ మాయా స్త్రీ అచ్చము అదితీదేవి వలె శరీర సౌష్ఠవము కలిగి, అవే వస్త్ర భూషణములు ధరించి, వినాయకుని చూడగనే ఇట్లు రోదించుట నారంభించెను.

“కుమారా! నన్ను కాపాడుము. నేను మిక్కిలి డస్సి యున్నాను. నీవు ఇంకనూ వేచి చూచుచుంటివేమి?” ఇంతలో దేవాంతకుడు ఆమె కట్టుకున్న వస్త్రములను చింపి, ఆమెను వివస్త్రను కావించుట యత్నించుచుండెను. అంత మాయా అదితి వినాయకుని ఉద్దేశ్యించి ఉచ్చస్వరముతో “నీ పౌరుష పరాక్రమములు మంటగలపనా? ఏమైనవి? ఓరీ! నిష్ఠురా! నిర్దయా! నన్న ఈ లోక లజ్జ నుండి కాపాడుము. లేదేని నేను వివస్త్రనగుదును” అని పలికెను. దానిని కాంచి వినాయకుడు అత్యంత విచారగ్రస్తుడై, కృద్ధుడై, ఏమి చేయుటకు తోచక, ఒక్కతరి నిస్త్రాణుడయ్యెను. చేతుల నుండి ఆయుధములు జారి క్రింద పడినవి. “అరణ్యమున యున్న నా తల్లి ఈ దుష్టదైత్యుని పాలి ఎట్లు పడినది? లోకమున ఇటువంటి దురవస్థ ఏ తల్లీ తనయులకు రారాదు. సాక్షాత్ దేవతా జనని అయిన నా తల్లి ఈ దుష్టుని వద్దకు ఎట్లు గొనిరాబడినది?” అని గణేశుడు తర్కించుచూ అత్యంత శోకమునొందెను. ఆయనను గాంచి కాశీరాజు, పౌరులు సహితము శోకమగ్నులైరి. దీనిని గాంచి అదే సమయమని దేవాంతకుడు వినాయకుని మరింత పరిహసించుచూ “వినాయకా! నీ తల్లిని రక్షింపలేని నీ జన్మము వృథా! నీకు సిగ్గులేదు. లోకులకు నీ ముఖమును ఎట్లు చూపించుకొందువు? దుష్టుడా! నీ సమక్షముననే నీ తల్లి శిరము ఖండించి శరీరము నుండి వేరుచేయుదును.” అంత వినాయకుడు ఇదంతయు నిజమే అని భ్రమించి, అత్యంత శోకగ్రస్తుడై ఇక తనకు మరణమే శరణ్యమని, తాను విషపానము కావించి కానీ, ఉరివేసికొని గానీ, శస్త్రముతో ఉదరమును ఛేదించుకొనిగానీ మరణింపవలెనని నిశ్చయమునకు వచ్చుచుండగా అశరీరవాణి ఇట్లు పలికెను. “దేవా! ఈ దుష్టబుద్ధి అదితీ దేవిని మాయతో సృష్టించెను. దీనిని తెలిసికొని నీవు సావధానుడవై తిరిగి సంగర మారంభించుము.” అంత వినాయకుడు తిరిగి ధైర్యముబూని ఇక ఈ దైత్యుని తుదముట్టింపవలెనని నిశ్చయించి, శివుని వరమును స్మరించెను.

ఆ వరము ప్రకారము షఃకాలమున మినహా ఇక ఏ సమయమందైననూ ఈ దైత్యుని పై ప్రయోగింపబడిన ఏ అస్త్రశస్త్రమైననూ నిష్ఫలములగును. దీనిని గ్రహించి వినాయకుడు ఆ రాత్రి సంగరము చాలించి మరునాటి ఉదయము ప్రాతఃకాలముననే యుద్ధ భూమి కేతెంచెను. ఆ సమయమున ఆయన నిజరూపు ధరించి, క్రోధముతో కనులెఱ్ఱతామరలై, శిరమందు మహా ముకుటము, కర్ణములందు ఉజ్వల కుండలములు ప్రకాశించుచుండెను. తెల్లని దంతములు, మెడలో ముత్యాలహారములు, దివ్య దుకూలములు, మెలితిరిగిన తొండము, మనోహరముగ ఒప్పుచునే భయము గొల్పుచుండెను. దేవాంతకుడు తొలిసారి ఆ రూపము గాంచి వినాయకుడు సగము కుంజరము, సగము మానవాకారమున యుండుట గమనించి అత్యంత భయభీతుడయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయక దేవాంతక సంగ్రామము - III అను అరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

అరువది తొమ్మిదవ అధ్యాయము

(దేవాంతక వధ)

బ్రహ్మ, ఈ విధముగ శ్రీగణేశుడు తన నిజరూపము ధరించి, పద్మాసనస్థితుడై, దేవాంతకుని తన ఒడిలోనికి తీసికొని "దైత్యా! నీవు శివునిచే నీకీయబడిన వరమును స్మరింపుము" అని పలికెను. దైత్యుడు ఇంకనూ తెంపరితనముతో వినాయకునిపై విజయ మందవలెనని, ఆయన దంతమును పట్టుకొని తీవ్రముగ లాగెను. అంత వినాయకుని దంతము విరిగి దంత సహితుడై దేవాంతకుడు నేలపై పడెను. అంత వినాయకుడు ఆ విరిగిన దంతమును పట్టుకొని అద్దానితో దేవాంతకుని బలముగ ప్రహరించి భయంకర సింహనాద మొనర్చెను. ఆ నాదము సప్త ఊర్ధ్వలోకములు, సప్త పాతాళములందు ప్రతిధ్వనించెను. దేవాంతకుని శరీరము వందలాది ముక్కలై, ఆకాశము నుండి మేఘములు వర్షమును వర్షించునటుల రక్త మాంసములు వర్షించెను. లోకులు ఇయ్యది దైవీయఉత్పాతమని భ్రమపడిరి. దేవతలందరూ చూచుచుండగనే ఒక దివ్యజ్యోతి దేవాంతకుని శరీరము నుండి బయలుదేరి శ్రీగణేశుని యందు విలీనమయ్యెను. దైత్యుని శరీరము భూమిపై పడి, మూడు యోజనములు విస్తరిల్లి, ఆ ప్రదేశము నందలి చెట్లను నుగ్గునుగ్గు కావించెను. అంత దేవాంతకుని సేనలు నలుదిశలా పలాయనమొనర్చినవి. దేవతలు దుందుభులు మ్రోగించి, వినాయకునిపై పుష్పవృష్టి కురిపించిరి. దిశలు నిర్మలములయినవి. అగ్ని తేజోవంతమయ్యెను. నదులు అనుకూలముగ ప్రవహించినవి. ఇంద్రాది దేవతలు, మునులు వినాయక పూజనమొనర్చి ఇట్లనిరి. "ఓ! దేవదేవా! నీవు మాకు దేవాంతకుని పీడ విరగడనొనర్చిరి. ఈ మహత్కార్యము నొనర్చుటచే మీరు "ఉపేంద్రుడు" అని విఖ్యాతి నొందెదరు. మీరు మా అధికారములను తిరిగి మాకు బహూకరించిరి. ఇక ప్రతి గృహమందు స్వాహాకార, స్వధాకార, వషట్కారములు తిరిగి మొదలగును." ఈ విధముగ పలికి వారందరూ తిరిగి తమ తమ స్థానముల కరిగిరి. మునులు ఆ పరాత్పరునకు "హృషీకేశుడు" అను నామమొసంగి సంతోషాంగ తరంగులై వెడలిరి.

అంత భూలోకమందలి రాజులందరూ ఏతెంచి, నమస్కరించి "ప్రభూ! దైత్యుల భారము నుండి ఈ ధరణిని ఉద్ధరించిరి. అందువలన మీరు "ధరణీధర" నామమున ప్రసిద్ధి నొందెదరు." ఈ విధముగ పలికి వారు సహితము శలవు తీసికొనిరి. అంత కాశీరాజు ఏతెంచి, బాలకులతో క్రీడించుచున్న బాలగణపతిని చూచి ఇట్లనియె "ఏమి నా భాగ్యము? బ్రహ్మాదులకు సహిము అగమ్యమైన సనాతన పరబ్రహ్మము నా పూర్వ పుణ్యముచే నిరంతరము నా చర్మచక్షువులకు

“వినాయక” రూపమున కానబడుచున్నది. కారణ రహితుడు, విశ్వకారణ కారణుడు, స్వయం ప్రకాశుడు, అనేక అవతారములు స్వీకరించు స్వామి అయిననూ నిరాకారుడు, భూభారహరణమొనర్చు మనోహరమూర్తి నా గృహమందు బాలక్రీడలాడుచున్నాడు.” ఈ విధముగ పలికి నానావిధ వాద్యఘోష కావించి శ్రీగణేశుని స్తుతించెను. అంత శ్రీగణేశుడు కాశీరాజును గాఢముగ కౌగలించుకొనెను. భక్త భగవానులిరువురు ఆనందాశ్రువులు కారుచుండగా ఒకరినొకరు వీక్షించిరి. అంత రాజు వినాయక సహితుడై తన పురమున కేగి సర్వులకు బహుమతు లొసంగెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి దేవాంతక వధయను అరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బదియవ అధ్యాయము

(వినాయకుని తిరుగు ప్రయాణము)

ఆ మరుసటి దినము కాశీరాజు సభతీర్చి అమాత్యులు, వీరులు, నగర ప్రముఖులు, వృద్ధులు, సుహృత్ జనులు, అందరినీ పిలచి, నమస్కరించి, తన హృదయమందున్న విషయము నిట్లు విశదీకరించెను “నేను నా పుత్రుని వివాహ విషయమై వినాయకుని ఇచటకు పిలిపించితిని. ఆయన ఏతెంచిన పిదప అనేక ఉత్పాతములు జరిగినవి. వాటినన్నిటినీ వినాయకుడు దూరమొనర్చెను. నేను అదితీదేవికి “శీఘ్రమే మీ పుత్రుని తీసికొని వచ్చెదనని” మాట ఇచ్చితిని. ఇప్పటికే అనేక దినములు గడచినవి. దేవాంతక, నరాంతక, మరణముచే లోకము స్వస్తి నొందినది. అందువలన నా పుత్రుని వివాహ క్రతువు జరిపింపవలెను.” అంత అమాత్యులు, మరియు సర్వులు అదే ఉచితమని శలవిచ్చిరి. రాజు ప్రసన్నుడై జ్యోతిష పండితులచే ముహూర్తము నిర్ణయించి, లగ్నపత్రికను వ్రాయించి, బంధుజనులను ఆహ్వానించుటకు దూతలను పంపెను. వివాహ సామాగ్రిని విశ్వసనీయులచే తెప్పించెను. అంత మగధరాజు తన పుత్రీ సహితుడై ఏతెంచెను. అన్ని దిశలనుండి బంధు, సుహృద్ జనులు ఏతెంచిరి. కాశీ నగరమంతయు వేడుకలతో నిండెను. వియ్యంకులిరువురు ఒకరినొకరకు కౌగిలించుకొనిరి. వారిరువురు వివాహ సంస్కారమునకై దేవతా స్థాపనము కావించి, మహోత్సవమును ప్రకటించిరి. వారిరువురూ ఆ వివాహ క్రతువును ప్రయత్న పూర్వకముగ, శుభకరముగ కావించి, బ్రాహ్మణులకు ధనాదులను ఒసగి సంతుష్టులు కావించిరి.

కాశీరాజు వినాయకునకు అభ్యంగన స్నానము చేయించి, అమూల్య వస్త్ర భూషణాదులతో అలంకరింపజేసి, భోజనాదులయిన పిదప వారందరూ రథములధిరోహించి, పుణ్య వాద్య ఘోష నడుమ అందరూ కలసి కశ్యపాశ్రమమునకు బయలుదేరిరి. నాగరికులందరూ వారి వారి కార్యములు మాని బయటకు వచ్చిరి. సర్వులు భోజన, అధ్యయన, నిద్ర, ధ్యానాదులు త్యజించి, వేషభాషలు సహితము మరచి బయటకేతెంచిరి. ఆ రథమునకు ఎదురుగా వేలాది బాలకులు మార్గము నడ్డగించి వినాయకునితో “నీవు మమ్ము వదలి ఏల వెడలుచుంటివి? ఈ నిష్ఠురమేల? పూర్వ ప్రసంగములందెన్నడునూ నీవు మమ్ము విడచి వెళ్ళెదవను మాట కూడ సూచాయగ తెలుపలేదే? మా ఇంట భోజన మొనరింపక ఏల ఏగుచుంటివి?” ఈ విధముగ పలుకుచూ కొందరు బాలురు ఆయనను ఆలింగన మొనర్చుచుండిరి. కొందరు ఆయన పాదములపై బడిరి. నగరమందలి స్త్రీ, బాలికా, ముగ్ధ యువతులు తమ వేష భూషణములు సహితము సరిగా దాల్చక వర్షాకాలమందలి నదులు పొంగిపొరలి సముద్రమున కేగునటుల, మరుద్గణములు ఇంద్రుని వద్ద కేగునట్లు, ఆయన వద్దకేగి పై విధముగనే పలికిరి. అంత వినాయకుడు కాశీరాజ సహితుడై రథముదిగి ఇట్లనియె.

వినాయకుడు "నేను మిమ్ములనందరినీ ప్రార్థించుచున్నాను. నా యందు దయ చూప వలసినది. నేను మీ ఇండ్లయందు కావించిన అపరాధములు క్షమింప వలసినది. నేను తిరిగి మీ పునర్దర్శనము పొందినపుడు నన్ను మరువవద్దు."

ఈ పలుకులు విని పౌరులు రోమాంఛితులై ఇట్లనిరి "స్వామీ! మీరు జగత్పిత. జగత్తు నంతటినీ మీరు మాయ యందుంచినప్పటికీ మాకు మాత్రము మీరు మాయా స్వరూపులు కారు. తండ్రి తన సంతానము అపరాధము కావించినప్పటికీ వారిని ఎన్నడూ వదలడు. చంద్రుడు ఉష్ణము నొందదు. స్వర్ణము నీలిరంగు నొందదు. అటులయిన మీరు మమ్ము ఏల త్యజించుచున్నారు? మీరు తొలుత ఇచటికి రాకున్న మాకు ఈ శోకముండెడిది కాదు. ఇపుడు మీరు మా మనసులు హరించి ఏగుచున్నారు. మా మనస్సులు హరింపబడి మేము ఇచట ఏ కార్యము సలుపగలము? జలములు నష్టమయిన పిదప జలచరములు బ్రతుకునా? మా ప్రాణము వెడలిన పిదప మా శరీరమునకు ప్రయోజన మేమున్నది? మీరు వెడలుటకు సిద్ధపడిన ఎడల దాసులయిన మమ్ములను సహితము గొనిపోవలసినది". ఈ విధముగ స్త్రీ పురుష, బాల, వృద్ధులందరూ కన్నుల అశ్రువులు ధారాపాతముగ కారుచుండగా గద్గద వాణితో పలికిరి. అంత వినాయకుడు "మీరు దు:ఖింపవలదు. మీకు నా ఎడ వియోగమెన్నడూ జరుగదు. ఎందుకనగా నేను సర్వాంతర్యామి, అవినాశి, ఆనంద స్వరూపుడను. కేవలము నన్ను చింతించుటచే మీ చిత్తము శాంతినొందదు. మీరందరూ నా మట్టి ప్రతిమను మీ ఇంటయుంచి పూజింప వలసినది. మీకేసంకటములు ఏతెంచిననూ నన్ను స్మరించిన ఎడల నేను మీకు దర్శనమిచ్చి సంకటములు దూరమొనర్చెదను." అంత నాగరికులందరూ వినాయకునకు నమస్కరించి, జయజయ ధ్వానములు సలిపి తమ గృహముల కరుగుటకు అశక్యులై వేచియుండిరి. వినాయకుడు తన మాతృపితృదర్శన లాలసచే రథమధిరోహించి, ఒక్కమారు వెనుకకు తిరిగి వారందరినీ కాంచి "నేను పున:వెనుకకు వచ్చెదను. చింతింపవలదు. ఇది సత్యము. అనృతము కాదు." అని పలికి తన తల్లిదండ్రుల వద్ద కేగెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి వినాయకుని తిరుగు ప్రయాణమను డెబ్బదియవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఒకటవ అధ్యాయము

(వినాయకావతార పరిసమాప్తి)

బ్రహ్మ "కాశీరాజదూతలు ముందుగనే ఏగి అదితీదేవికి కాశీరాజు వినాయక సహితుడై ఏతెంచుచన్నాడని తెలిపిరి. అంత అదితీదేవి స్వాగతార్థము ముందునకేగి వేచి చూచుచుండెను. ఆ ఉత్సుకత యందు ఆ తల్లి తన శిరము పై గల ఆస్తరణమును సహితము మరచెను. ఆశ్రమము బయటకు వచ్చి ఎదురు చూచుచున్న తల్లిని దూరము నుండి కాంచి వినాయకుడు తానునూ రథముదిగి పరుగున ఏగి ఆమెను కౌగిలియందు బంధించెను. చాలాకాలము తరువాత కుమారుడు కనిపించుటచే గొంతు గాద్గదిగమై అదితీదేవికి మాటలు రాకుండెను. వినాయకుని స్థితియు అట్లేయుండి ఒక ముహూర్తము వరకు వారిరువురు కన్నుల అశ్రుకణములు దాల్చుచుండిరి. అంత నెమ్మదిగ కాశీరాజు వారిరువరినీ చేరి అదితీదేవితో "తల్లీ! ఈ బాల వినాయకుని నేను గొనిపోయి బహుదినములయినది. అందువలన మీరు నాయందు క్రోధము పూనవలదు. నేను సహితము ఈ వినాయక విరహము అనుభవించుటకు సమర్థుడను గాను. అమృతపానమందు ఎన్నటికీ తృప్తి కలుగదు కదా? ఈ వినాయకుడు మా గృహమందు ప్రతిదినము నూతన ప్రేమోత్సాహములు పెంపొందుచునే యుండెను. ఈ బాలుడేతెంచిన పిదప మా రాజ్యమందు అనేక ఉత్పాతములు నివారించెను. అనేకమంది దైత్యులను

సంహరించెను. ఇంద్రాది దేవతలు సహితము చూపలేని అఖండ శౌర్యమును, పౌరుషమును చూపి అత్యంత కీర్తి ప్రతిష్ఠలు మూటగట్టుకొని ధర్మమును స్థాపించెను." తదనంతరము బాలునికి అదితీదేవి దిష్ఠి తీసెను. అంత వినాయకుడు రాజ సహితుడై ఆశ్రమము ప్రవేశించి, కశ్యప మహర్షికి అంజలి ఘటించి ప్రణామము లొనర్చిరి. అంత కశ్యపుడు రాజును గాంచి "రాజా! నీవు ఈ బాలుకుని నీ రాజ్యమునకు గొనిపోయి వెంటనే తిరిగి పంపించెదనని, ఇన్నాళ్ళ తరువాత తీసికొనివచ్చుట ఉచితము కాదు. ఈ బాలుని దర్శింపక నా అంగములన్నియు సంతప్తము లగుచున్నవి" అని పలికి, రాజుకు ఉచితాసనము నొసంగి, తాను తన కుమారుని ముద్దాడి, మూర్ధన్యమును ఆఘ్రాణించెను.

అంత కాశీరాజు ఆ ముని దంపతితో ఇట్లనియె "ఓ! పుణ్య దంపతులారా! ఈ వినాయకుని మాయ చేతనే నా పలుకులు అనృతములయినవి. దేవదేవుడయిన ఈ వినాయకుడు మా గృహమును తన గృహముగనే భావించెను. ఈయన అవాప్తకాముడు అనగా ఈయన కామనలన్నియు పూర్ణమయినవి. ఈతడు నా కుమారుని వివాహము జరిపించియే తిరిగి ఇచట కేతెంచెను" అని పలికి సంపూర్ణ దైత్య సంహరణము, దేవాంతక, నరాంతక సంహార వృత్తాంతమునంతయు వారికి ఎరింగించెను. ఆ పుణ్యముని దంపతి తమ కుమారుని పరాక్రమమును, గుణ వర్ణనమును విని మిక్కిలి ప్రసన్నులయిరి. అంత ఆ దంపతి రాజునకు షడ్రుచులతో కూడిన భోజనమొసంగెను. రాజు ఆ ఆతిథ్యము స్వీకరించి మునిదంపతికి, వినాయకునకు ప్రదక్షిణ ప్రణామములు ఆచరించి, కన్నుల అశ్రుకణములు రాలుచుండగా వినాయకుని విడువలేక నెమ్మదిగ రథ మధిరోహించి, స్నేహపూర్ణమయిన మదిలో వినాయక గుణసమూహ స్మరణ మాచరించుచూ తన నగరమునకేగెను. నాగరికులు, బాలురు, అందరూ రాజు యొక్క రథమును గాంచి వినాయకుడు తిరిగి వచ్చెనేమో అని తిరిగి రాజ ప్రసాదమునకేతెంచి, వినాయకుడు రాలేదని తెలిసి దు:ఖితులై గృహముల కరిగిరి. మరుసటి దినము వారందరూ కలిసి రాజాస్థానమునకు ఏతెంచి "రాజా! కశ్యప పుత్రుడు వినాయకుడు తిరిగి వచ్చెదనని ప్రమాణము చేసెను కదా! ఆయన రాలేదా? లేక మీరు ఆయనను తీసికొనిరాలేదా?" అన్ని ప్రశ్నించిరి. అంత రాజు "నేను కశ్యపపుత్రుని తిరిగిరమ్మని ప్రార్థించితిని. వినాయకుడు నాతో తన మూర్తిని స్థాపించి, అద్దానికి పూజన, భజన కావింపమని నిర్దేశించెను. తాను సర్వాంతర్యామి కావున ఎవ్వరునూ వియోగదు:ఖ మొందరని తెలిపెను." అంత సర్వులు కలసి చతుర్భుజుడు, శూర్పకర్ణుడు, సర్వాభరణ భూషితుడు, గజముఖుడు, సర్వాంగ సుందరుడు, అయిన ఒక శ్రీగణేశమూర్తిని నిర్మించి, అద్దానిని ఋత్విజులచే, వేదశాస్త్ర విశారదులైన బ్రాహ్మణులచే స్థాపింపజేసి దానికి "ఢుంఢిరాజు" అని నామకరణ మొనర్చిరి. ఆ మూర్తి చుట్టు ఒక సుందర ప్రాసాదమును నిర్మించి, పూజించుట మొదలిడిరి. భక్తులు ఏ కామనతో ఆయనను పూజించెదరో వారికి ఆ కామనలు పూర్ణమగును.

కాశీ నగరమునుండి పునరాగమనము జరిగిన పిదప వినాయకుడు తన మాతా పితరులతో ఇట్లనియె "పూర్వకాలమందు మీ తపస్సుకు మెచ్చి నేను మీ పుత్రునిగ జన్మించితిని. భూభారహరణమొనర్చి త్రిలోకములను బాధించుచున్న దేవాంతక, నరాంతక సహిత ఇతర దైత్యులను సంహరించితిని. సాధుజనులను రక్షించి, దేవతలను వారి వారి పదవులందు తిరిగి నియోగించితిని. ఇక నేను నా లోకమున కేగుదును." అది విని అదితీ కశ్యపులు ఖిన్నులై అశ్రు నయనములో "తిరిగి నీ పునర్దర్శనము ఎప్పుడు జరుగును?" అని ప్రశ్నించిరి. అంత ఆ పరాత్పరుడు తల్లిని చూచి "నీకు నా దర్శనము భవానీదేవి మందిరమందు కలుగును" అని పలికి తిరిగి వారు ప్రశ్నించు సమయమునకు అంతర్ధానుడయ్యెను. అంత అదితీ కశ్యపులు శ్రీగణేశ వియోగముచే అత్యంత ఉదాసీనులై ఒక సుందర గణపతి మూర్తిని, స్థాపించి దానిచుట్టూ అద్భుత ప్రాసాదమును నిర్మించి, ఆ మూర్తికి "వినాయకుడు" అని నామకరణమొనర్చిరి. ఈ మూర్తిని ధ్యానించినంత మాత్రమున నానారూపధారి అయిన వినాయక ప్రభువు వారికి దర్శనమొసంగును. సాత్యవతేయా! ఈ విధముగ నీకు వినాయక శుభ చరితమును తెలిపితిని. ఇద్దాని శ్రవణముచే సర్వ సిద్ధులు ప్రాప్తించి ఆయుర్వర్ధనము,

ఉపద్రవ వినాశనము, సర్వ కామనాపూర్ణము, సర్వ పాపనాశనము జరుగును. ఈ వినాయకుడు "సింధు" అను దైత్యుని సంహరించుటకు శివుని గృహమందు "మయూరేశ్వర" నామముతో అవతారము స్వీకరించి, అచట సహితము తన బాల్యవస్థ నుండే అనేక ఆశ్చర్యకరమైన కర్మములాచరించెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి శ్రీగణేశావతార పరిసమాప్తి అను డెబ్బది ఒకటవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది రెండవ అధ్యాయము

(చక్రపాణి చరితము)

వ్యాసుడు "పితామహా! మయూరేశ్వరుడు అను వినాయకుడు శివుని ఇంట జన్మించెనని తెలిపితిరి కదా! ఆ అవతారము ఎట్లు జరిగెను? ఆయన కావించిన లీలలెట్టివి? ఆయనకు మయూరేశ్వరుడు అను నామమెట్లు కలిగినది? ఈ విషయ విశేషములన్నియు విస్తారముగ నాకు తెలుపవలసినది." బ్రహ్మ "త్రేతా యుగమున "సింధు" అను మహాదైత్యుడుదయించెను. ఆ దైత్యుని అంతమొందించుటకు శ్రీగణేశుడు శివుని గృహమందు అవతారము స్వీకరించెను. ఈ విషయమై ఒక ప్రాచీన ఇతిహాసమున్నది. దానిని నీకు ఎరింగించెదను. "మైథిలీదేశము" నందు "గండకి" అను సుందర నగరము కలదు. దానిని రాజధానిగ చేసికొని "చక్రపాణి" అను మహారాజు పరిపాలించుచుండెను. ఆ మహారాజు సర్వగుణ సంపన్నుడు, సూర్యతేజుడు, కామదేవుని వంటి సౌందర్యఖని, బుద్ధియందు బృహస్పతి, పరాక్రమము నందు స్కందునిసాటి. ఆయన అగణిత చతురంగబల సమేతుడై, శత్రువులకు దుర్నిరీక్షుడై యుండెడివాడు. ఆయన గృహమందు సాక్షాత్ లక్ష్మీదేవి కొలువుయున్నది అనుట అతిశయోక్తికాదు. కోశాగారమంతయు సువర్ణ, రత్న, ధనరాశులతో నిండియుండి నవరత్న యుతమై ఒప్పారెడిది. రాజభవనము అలకాపురిని తలతన్నునట్లు భాసించెడిది. ఆయనకు ఇరువురు అత్యంత స్వామిభక్తి పరులు, అరివీరభయంకరులైన "సాంబుడు", "సుశోధనుడు" అను అమాత్యులుండెడివారు. ఆయన ధర్మపత్ని "ఉగ్ర". ఆమె పూర్ణచంద్ర నిభానన. అప్సరసలను మించిన అసామాన్య సౌందర్యరాశి. ఆమె తన గుణములచే సర్వులను అలరించుచూ పరమ పతివ్రతా ధర్మమును పాటించెడిది. ఈ సర్వమాన్యుడయిన మహీపతి స్వయముగ విద్వాంసుడయ్యూ, నిరంతరము పురాణ శ్రవణము కావించుచూ, ధర్మశాస్త్ర పరాయణుడై విష్ణుభక్తి యందు లీనమై యుండెడువాడు. చంద్రునిలో సహితము మచ్చ యున్నటుల, సర్వము యున్న రాజదంపతి అనపత్య దోషము (సంతానము లేకపోవుట) చే మిక్కిలి దు:ఖపడు చుండెడివారు. సంతానమునకై వారు చేయని దానము, కావింపని వ్రతము, సేవింపని తీర్థము, ఆచరింపని యజ్ఞము లేవు.

ఇక సంతానలేమిచే విసిగి వేసారిన రాజు ఒకనాడు తన అమాత్యులను, పురప్రముఖులను, జనులను పిలచి ఇట్లనియె "నేను సంతానమునకై సర్వ విధముల యత్నించితిని. ఈ సంతాన ప్రాప్తికై నేను కావించిన యత్నములు పరాత్పరునికై చేసిన ఎడల మేమిరువురము మోక్షము నొంది యుండెడివారము. సజ్జనులారా! నాకు కాలము వ్యర్థముగ గడచుచున్నది. మేము ఇక వనమునకేగి తపము కావించవలెనని నిశ్చయించితిమి. నా రాజ్యమును మన అమాత్యులిరువురికీ సమర్పించుచున్నాను. ఒకవేళ దైవ వశమున మాకు సంతతి కలిగెడు యోగ్యత సంభవించిన ఎడల తిరిగి వచ్చెదము. అందువలన మీరందరూ మా వన గమనమునకు అనుజ్ఞనీయవలసినది." అంత పౌరులందరూ అత్యంత దు:ఖితులై "మహారాజా! మాకు తల్లియైననూ, తండ్రియైననూ మీరే! మీరు లేక మా జన్మములు వృధా! మేము సహితము మీతో

వనమున కేతెంచెదము" అని పలికిరి. ఆ సమయమున ద్వితీయాగ్నిహోత్రుని వంటి తేజశ్శాలి, వేదవేదాంగ శాస్త్ర పారంగతుడు, త్రిలోక విఖ్యాతుడు, ఇంద్రాది దేవతలకు సహితము వందనీయుడు, త్రికాలద్రష్ట అయిన శౌనక మహర్షి అచటి కేతెంచెను. రాజు ఆయనను చూడగనే లేచి, అర్ఘ్య పాద్యాదులచే గౌరవించి, సుఖాశీనుని కావించెను. తదుపరి ఆయనకు భోజనాదికములు సమర్పించి, ఆయన విశ్రమించు సమయమున ఆ మహర్షికి పాదసంవాహన కావించుచూ రాజు ఇట్లనియె "మహాత్మా! నా పూర్వ పుణ్యములు పండి సర్వపాపహరము, పాపులకు దుర్లభము, పుణ్యాత్ముల మనోకామనా ప్రదము అయిన మీ దర్శనము లభించినది."

రాజు యొక్క భక్తి ప్రపత్తులకు, వినయ విధేయతలకు ముగ్ధుడై శౌనకుడిట్లనియె "రాజా! నీవు శోకాకులుడవై రాజ్య త్యాగ మొనర్పవలదు. నేను హాస పరిహాసములందు సహితము అనృతమాడి ఎరుగును. నా మాట నమ్ముము. నీకు తప్పక పుత్రసంతతి కలగును." ఆ పలుకులు అమృతవర్షములై రాజదంపతిని అత్యంత ఆనందపరచెను. రాజు మహర్షికి అనేక సువర్ణ, రత్న, వస్త్రాదుల నొసంగెను. కానీ ఆ మహర్షి వాటిని వేటినీ స్వీకరింపక "రాజా! మేము ఋషులము, వల్కలధారులము. సమస్త సుఖ, భోగముల పట్ల నిస్పృహ, సర్వజీవ హితము మా జీవనము. మేము సమలోష్ఠాశ్మకాంచనములమై, దయాసాగరులమై యున్ననూ సృష్టి స్థిత్యంత సమర్థులము. విద్వాంసుల ఇంట లక్ష్మీ యుండదు. నేను తీర్థయాత్రలు కావించుచూ, కేవలము నీ సందర్శనార్థము ఏతెంచితిని. నాకు ఈ బహుమతుల యందు, భోగముల యందు ఏ విధమయిన కోరిక లేదు." అంత రాజదంపతి ఆయనకు పున:నమస్కరించి సంతానోపాయము గూర్చి పరి ప్రశ్నించిరి. అంత శౌనకుడు "రాజా! అనేక జన్మల పాపములు నాశమొనర్చి, సంతానమును ప్రసాదించు సౌరవ్రతమున్నది. అద్దానిని సౌర సప్తమి నుండి ప్రారంభించి, ఒక మాస పర్యంతము కావింపవలెను. ఈ వ్రతమందు తొలుత శ్రీగణేశ పూజనమొనర్చి, మాతృకాన్యాసము, అభ్యుదాయిక శ్రాద్ధము, స్వస్తి వాచకము, బ్రాహ్మణులచే కావించి, స్వర్ణ కలశముపై స్వర్ణరచిత సూర్యమండలము స్థాపించి, భక్తితో షోడశోపచార పూజన మొనర్పవలెను. సూర్య భగవానుని పూజ రక్తచందన మిశ్రిత అక్షతలతో, రక్తవర్ణ పుష్పములతో రత్నములు, వివిధ ఫలములతో కావింపవలెను. పిదప పన్నెండు మార్లు అర్ఘ్య ప్రదానము కావించి, నమస్కార ప్రదక్షిణలు సమర్పించి, సూర్యుని అభీష్ఠ సిద్ధికై ప్రార్ధన మొనరింపవలెను. తదుపరి సూర్యునికి ఒక లక్ష సార్లు నమస్కారములు తాను స్వయముగ కానీ, బ్రాహ్మణుల చేత కానీ చేయంపవలెను. ప్రతి దినము ఒక లక్షమంది బ్రాహ్మణులకు ప్రసన్నతతో భోజన మర్పింవలెను. కుటుంబమున్న ఒక వేదజ్ఞాత అయిన బ్రాహ్మణునకు ప్రతిదినము ఒక గోవును దానమొనర్పవలెను. ఈ మాస పర్యంతము వ్రతము ఆచరించు సమయమున మీరిరువురు బ్రహ్మచర్య వ్రతము పాలింపవలెను. దీన దు:ఖితులకు, అంధులకు, వికలాంగులకు భోజన మొసంగవలెను. వ్రతాంతమున ఆ పూజా సామాగ్రి నంతటినీ ఒక బ్రాహ్మణునకు దానమీయవలెను. ఈ ప్రకారముగ విధి విధానములతో మీరు ఈ సూర్యోపాసనా వ్రతమొనర్చిన ఎడల మీకు అత్యంత విఖ్యాతుడు, శుచి, పరమ సూర్యభక్తుడు అయిన పుత్రుడు కలుగును." ఈ విధముగ ఉపదేశమొనర్చి శౌనకుడు అంతర్హితుడయ్యెను.

రాజు అత్యంత వినీత భావముతో ముని ద్వారా ఉపదేశింపబడిన వ్రతమును పత్నీసహితుడై, సూర్యభక్తి పరాయణుడై కావించెను. ఒక మాస పర్యంతము ఉపవాస విధి పాటించుచూ, అనుదినము ఒక లక్షమంది బ్రాహ్మణులకు భోజనమిడుచూ, ప్రతిదినము ఒక గోవును దానమొనర్చుచూ, సూర్య భగవానునికి ఒక లక్ష నమస్కారములు తాను కావించి, బ్రాహ్మణులచే సహితము చేయించెను. సదా సూర్య మంత్రమును జపించుచుండెను. భగవానుని లీలలు విచిత్రములు. వాని పోకడ ఎవరికెరుక? ఈ విధముగ సర్వము సజావుగ సాగుచుండగా, ఒకనాటి రాత్రి మహారాణికి రాత్రి కలయందు సూర్య భగవానుడు తన పతి రూపమున కాంచెను. వెనువెంతనే ఆమె యందు కామ భావన కలిగి ఇట్లనియె "స్వామీ! నాకు ఋతుకాలము సమీపించినది. నా దేహము సర్వము కామాగ్ని యందు దగ్ధమగుచున్నది. మీరు ఈనాడు నాకు కామ

సుఖమును ప్రసాదించని ఎడల నేనీ భారము సహింపలేక మృత్యువు నొందెదను.” అంత సూర్య భగవానుడు రాణి యొక్క పలుకులాలకించి, ఆమెతో సంభోగమొనర్చి ఋతుదానము కావించెను. అంత రాణి నిద్ర నుండి మేల్కొని, తన పతిని మేల్కొలిపి “స్వామీ! మీరు ఒక మాసము బ్రహ్మచర్య వ్రతాచరణమునకై సంకల్పమొనరించి, ఆ నియమమునకు వ్యతిరేకముగ నాతో ఋతు సంగమేల కావించిరి?” అని ప్రశ్నించెను. రాజు “ఓ! శుభగా! నేను స్థిర మనస్కుడనై, ఉపవాస నిరతుడనై, సూర్యభక్తి తత్పరుడనై, బ్రహ్మచర్యము పాటించుచుంటిని. నేను నీతో రమింపలేదు” అని ప్రత్యుత్తర మిచ్చెను. అంత ఉగ్ర “స్వామీ! నేను మిమ్ములను వినా వేరెవరినీ తెలియను. నేను మిమ్మే సూర్యునిగ ఉపాసించుచుంటిని.” అంత చక్రపాణి మహారాజు అత్యంత ప్రియవాదిని అయిన తన భార్యతో “మనము కావించుచున్న ఉపాసన, ఉపవాస, వ్రతదీక్షకు సూర్య భగవానుడు సంతుష్టుడై మనకు సిద్ధిని ప్రసాదించెను. మనకు పుత్రుడు ఉత్పన్నమగును” అని ఆమెను సముదాయించెను. కాలక్రమమున ఉగ్ర గర్భవతియై దినదిన ప్రవర్ధమాన మగుచుండెను. ఆ ఫలితముగ ఆమెకు శరీరమందు తాపమధికమై కర్పూర, చందన, కుశగ్రాసాదులు సహితము ఆమె తాపమును హరింపజాలకుండెను. వస్త్రములు, హంస తూలికా వింజామరలు సహితము వ్యర్థమయ్యెను. ఆమె ఆ గర్భమును ఓర్వజాలక ఒకనాడు సముద్రమునకేగి, ఆ సింధువు నందు తన గర్భమును ప్రసవించి, తాపము నుండి శాంతినొంది, గృహమునకేగి తన గర్భస్రావము గూర్చి రాజునకు తెలిపి, తిరిగి గృహ కృత్యముల యందు లీనమయ్యెను.

(శ్రీగణేశపురాణమందు క్రాడాఖండమందలి చక్రపాణి చరితమను డెబ్బది రెండవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది మూడవ అధ్యాయము

(సింధు జననము)

బ్రహ్మ “రాణికి గర్భస్రావమయిన పిదప ఆ పిండము సముద్రము నందు పెరిగి ఒక మహాబలశాలి, తేజస్వీ, విశాలమయిన నుదురు, త్రినేత్రములు గల బాలునిగ మారెను. ఆతడు రక్తవర్ణ కేశములు, జటాజూటము, హస్తములందు చక్ర, త్రిశూలములు ధరించి పుట్టుచునే త్రిలోకములు కంపించు నాదమొనర్చెను. ఆ బాలుడు ఆజాను బాహుడై జలచరములన్నింటినీ భక్షింప మొదలిడెను. అంత సముద్రుడు మిక్కిలి అశాంతి నొంది “నేను నా జీవనార్థమై ఈ బాలుని తిరిగి చక్రపాణి మహారాజు వద్దకు చేర్చెదను” అని తలచి, ఆ బాలుని గొని రాజదంపతి వద్దకేగి “రాజా! మీ పత్ని తన గర్భమును సహింపలేక ఈ శిశువును నా యందు వదలినది. ఈతడు సర్వలోక భయంకరమైన ఉగ్ర ప్రవృత్తిగల బాలకునిగ మారెను. ఈతడు జన్మించుచునే కావించిన రావముచే త్రిలోకములు కంపించెను. నేను సావధానముగ కనులు తెరచి ఈ బాలుని తేజస్సును చూడలేకున్నాను. అందువలన ఈతనిని మీవద్దనే విడచుచున్నాను” అని పలికి సముద్రుడు వెడలెను. అంత రాణి ఆ బాలుని ఒడిలోనికి గ్రహించి, ముద్దాడి స్థవపానమొనర్చెను. అంత రాజదంపతి ఆ బాలుని చూచి చిరకాలము యోగనిష్ఠుడై తపమాచరించిన ఋషికి పరబ్రహ్మ దర్శనము అయినటుల అత్యంత ఆనందితులైరి. అంత వారిరువురు ఆ బాలునికి జాతకర్మాదులు కావించి, అమాత్యులను, పుర ప్రముఖులను ఆహ్వానించి, జ్యోతిష్కుల సంప్రదించి, “సింధు” అని నామకరణ మొనర్చిరి. తదుపరి బ్రాహ్మణులకు, సర్వులకు అనేక విధములయిన దానము లొసగి రాజదంపతి సత్కరించెను. నగరమంతయు ధ్వజ, పతాకములతో ఆవిష్కృతమై, మంగళ వాద్యములు మిన్నుముట్టెను. రాజు తన నగరమందలి ప్రతి కుటుంబమునకు చక్కెర, తీపి పదార్థములు పంచిపెట్టెను. లోకులందరూ తమ ఇండ్లకరిగిన పిదప, ఆ దంపతి ముద్దుగా ఆ బాలుని “రక్తాంగుడు” అని పిలచిరి. అంత అమాత్యులు ఆ బాలుడు మహారాణి ఉగ్ర

నుండి ఉద్భవించిన కారణమున “ఉగ్రనేత్రుడు” అని పిలచిరి. పౌరులందరూ “విప్రప్రసాదుడు” అని బాలునికి నామమిడిరి.

ఆ బాలుడు రాజ గృహమున శుక్లపక్ష చంద్రునివలె దినదిన ప్రవర్ధమానుడగుచుండెను. వాయు సమక్షమున అగ్ని తేజరిల్లునటుల ఆ బాలుని బలము, వేగము, తేజస్సు అతి త్వరితముగ పెరిగి ఆతడు ఆకాశమంత ఎత్తు ఎదిగెను. క్రీడా సమయమున తన ఎడమ చేతితో పెద్ద పెద్ద వృక్షములను సహితము కూకటి వ్రేళ్ళతో పెకలించెడివాడు. పర్వత శిఖరములతో బంతులాట లాడెడివాడు. ఒకనాడు ఆకాశమున కెగిరి చంద్రుని యందున్న హరిణమును పట్టెను. తన దారికి ఏనుగులు అడ్డువచ్చిన వాటి కుంభస్థలములపై ముష్ఠి ఘాతము లొనర్చువాడు. లోకులు ఈతని ప్రవర్తనకు విస్మితులయ్యెడివారు. మాతా పితరులు ఈతని అమానుష శక్తికి, పౌరుషమునకు ముదమునొందడి వారు. ఒకనాడు ఆ బాలుడు తన తల్లిదండ్రుల వద్దకు ఏతెంచి “నేను తపానుష్ఠానమొనర్చి, తద్వారా త్రిలోకములను ఆక్రమించి, మీకు ఆధిపత్య మొసంగెదను. గృహము నందేయుండి నా ఆయువు, జన్మ వృధా అగుచున్నది” అని పలికెను. మాతాపితరులు సంతసిల్లి, దీవించి పంపి, ప్రతిదినము తమ పుత్రుని క్షేమమునకై సర్వ దేవతలను పూజించుచుండిరి. అంత సింధు వనమున కరిగి, ఒక కమలయుక్త సరోవరమును గాంచి, ఆ తీరమున ఒంటికాలి బొటనవ్రేలిపై నిలబడి శుక్రాచార్యునిచే ప్రసాదింపబడిన మంత్రమును హృదయమందు నిలిపి, అంజలి ఘటించి, సూర్యుని వైపు దృష్ఠి సారించి ధ్యాన నిరతుడయ్యెను. ఆతడు శీతల, ఉష్ణ, వాయు, ధూమ, వర్షములు, సహించుచూ కేవలము వాయు భక్షణ కావించుచూ, సూర్య మహా మంత్రము జపించుచూ వేయి వత్సరములు తపమొనర్చెను. ఆతని చుట్టూ పుట్టలు పుట్టి ఆతనిని ఆచ్ఛాదించెను. ఆతని శిరము నుండి బయలుదేరిన కాంతి సూర్యమండలము చేరెను. సింధు కేవలము అస్థిపంజర ప్రాయుడయ్యెను.

అంత సూర్యుడు ప్రత్యక్షమై “నాయనా! నీ తపస్సుకు మెచ్చితిని. నీ మనోవాంఛిత వరము కోరుకొనవలసినది.” సింధు “ఓ! దీననాధా! సర్వసాక్షీ! దేవతలకు స్వామీ! త్రిమూర్త్యాత్మకా! నీకు నమస్కారము. స్వామీ! నీవు వర్షములకు మూలమై, సస్యములకు ఆధారమై యుంటివి. నీవే పరబ్రహ్మ స్వరూపుడవు, సృష్ఠి స్థిత్యంతములకు మూలము. నీవు గుణములకు పరుడవు మరియు గుణ వైషమ్యముల ఉత్పత్తి కారకుడవు. సర్వజ్ఞా, జ్ఞానదాతా, నీకు నమస్కారము. నేటి నీ దర్శనముచే నా జన్మము, వంశము, మాతాపితరులు, తపము, సర్వము ధన్యమయినవి. ఓ! దేవేశా! మీరు నా తపమునకు సంతుష్ఠులైన ఎడల నాకు మృత్యువు లేని జీవనము, దేవలందరిపై విజయము, ఇత్యాది వరములు ప్రసాదింపవలసినది” అని పలికెను. అంత ఆదిత్యుడు “నీకు దేవతలు, దేవయోని సంభవులు, మనుష్యులు, తిర్యక్ జంతువులు, నాగులు, దివారాత్రములు, ఉష:సంధ్యలందు నీకు మృత్యువు యుండదు. ఓ! రాజపుత్రా! నీవు ఈ అమృతపాత్రను గైకొని నీ కంఠమునందు యుంచుకొనుము. ఎవరు ఈ అమృతపాత్రమును నీ కంఠము నుండి వెలిదీయుదురో, వాని చేతిలో నీ మృత్యువగును. ఎవరేని దేవుడు కేవలము తన కేశములతో స్వర్గమును కంపింపజేయునో, ఎవరి బొటనవ్రేలి నఖాగ్రము నందు కోటి కోటి బ్రహ్మాండములుండునో, అటువంటి ప్రభువు నిన్ను వధించును. ఇతరుల వలన నీకు భయము లేదు. ఇతరులందరూ నీకు తృణ ప్రాయులు. నేను నీకు త్రిలోక రాజ్యమును ప్రసాదించు చున్నాను.” ఈ విధముగ వరములొసంగి సూర్యుడు అంతర్ధానుడయ్యెను. అటుపిదప సింధు తన గృహమున కేగి, తల్లిదండ్రులకు నమస్కరించెను. వారిరువురు ఆతని శిరమును మూర్కొని చుంబించి, ఆలింగనమొనర్చి “నాయనా! మేమిరువురము నీ కొరకై తపించుచూ కృశావస్థ యందుంటిమి.” అంత సింధు తాను ఆచరించిన తపాదులు, సూర్యుని వరదానము గూర్చి తెలిపి, తాను త్రిలోకాధిపత్యము నొందెదనని తెల్పెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు జననము అను డెబ్బది మూడవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది నాల్గవ అధ్యాయము

(సింధు దిగ్వి జయము)

బ్రహ్మ "చక్రపాణి మహారాజు తన తనయుని బుద్ధి కుశలతను, సూర్యదత్త వరములను కాంచి, ఆతని రాజుగా అభిషేకించి తాను ఆత్మసాధనకు వనముల కరిగెను. అంత సింధు రాజ్యపాలన యందు తన మనసును కేంద్రీకృతమొనర్చి, అమాత్యులను, వర్తక ప్రముఖులను అధికారులను పిలచి వారికి బహుమతులిచ్చి, తిరిగి వారిని యధా స్థానములందు నియమించి, రాజ్యమందటా "తన మాటే శాశనము, తన ఆజ్ఞను ఉల్లంఘించుట దండనార్హమని దండోరా వేయించెను. అంత వీరులందరినీ సమాయత్త పరచి దిగ్విజయ యాత్రకు సన్నద్ధము కావించెను. సింధు స్వయముగ అతి భీషణరూపుడై, ఆయుధపాణియై ముందుకు నడచెను. ఆతని పద ఘట్టనలచే ధరిత్రి కంపించెను. వాని వెనుక ఆసంఖ్యాకులైన యోధులు రధారూఢులై, సింధు దైత్యుని అనుసరించిరి. వాని వెనుక చతుర్దంతులు, పర్వతాకారముగల ఏనుగులు మావటి వారితో కలసి నడచెను. వాని కంఠమునకు కట్టబడిన ఘంటాధ్వనిచే దిగంతములు ప్రతిధ్వనించుచున్నవి. వాని వెనుక అశ్వారోహులైన యోధులు ఖడ్గ, చామర, ధనువులు ధరించి కవచధారులై శోభించుచుండిరి. వాని వెనుక గణతికి అందని పదాతులు అనేక విధములయిన ఆయుధములు ధరించి, నేల ఈనినట్లు నడచుచుండిరి. మహాబలి అయిన దైత్యుడు తనను ఎదరించిన రాజులను నిహతుల గావించి, అచట తన సేనా నాయకులను ప్రతినిధులుగ నియమించెను. తనను శరణువేడిన రాజులను వారి స్థానములందు తనకు సామంతులుగ యుంచెను. శుంభ, నిశుంభ, వృత్ర, ప్రచండ, కాల, కదంబాసుర, శంబర, కమలాసురాది అనేక దైత్యులు సింధు వద్ద కేతెంచిరి.

ఒకానాడు కోలాసురుడు ఇట్లనియె "రాజా! ఒకానొక సమయమున త్రిపురాసురులు త్రిలోకములు జయించి అప్రతిహతమైన దానవ రాజ్య స్థాపన మొనరించిరి. మీరు త్రిపురుని మించిన పరాక్రమోపేతులు. మీ ముందు యముడు సహితము దిగదుడుపే! ఓ! మహాబలీ! మేమందరమూ మీ ఆజ్ఞను పాలించి, మీ సేవ చేయవలెనని ఆకాక్షించుచున్నాము." అంత దైత్యరాజు ప్రసన్నుడై వారందరికీ రధాశ్వ గజవస్త్ర భూషణములొసంగి ఇట్లనియె "నేను ఇంద్రుని అమరావతిని, బ్రహ్మ యొక్క సత్యలోకమును, విష్ణువు యొక్క వైకుంఠమును, శివుని కైలాసమును, సప్త పాతాళములను గెలిచి మన ఆధిపత్యమును సుస్థిర మొనర్చెదను." సర్వులు "సాధు, సాధు" నినాదములు చేసిరి. సింధు "నా రణఖండూతి భూలోక రాజులపై విజయముతో శాంతింపదు" అని పలికి అమరావతి కేగెను. ఆతని అనుచరులు నగర మధ్యమున యున్న రత్న రాశులను బలపూర్వకము దోపిడీ చేయుట నారంభించిరి. ఇంద్రుడు చేత వజ్రాయుధము ధరించి, ఐరావతమునెక్కి దైత్యుని ఎదుర్కొనుట కేతెంచెను. అంత మిగిలిన దేవతలు ఇంద్రునితో "ఈ రక్కసుని ఎదుర్కొనుట కేవలము విష్ణు భగవానునికి వినా మరెవరికైననూ అసాధ్యము" అని నుడివిరి. ఇంతలో సింధు ఇంద్ర సహిత సురలపై బాణవర్షము కురిపించుట నారంభించెను. కొందరు దేవతలు పలాయనులైరి. ఇంద్రుడు క్రోధముతో దైత్యుని ఎదుర్కొని తన వజ్రాయుధముతో ఆతని ప్రహరించెను. సింధు మూర్చితుడై, ఒక ముహూర్తకాలము గడచిన పిమ్మట తేరుకొని ఇంద్రునితో "ఇంద్రా! నేను ప్రహరించిన ఎడల నీవు జీవించి యుండవు. అందువలన వెడలిపొమ్ము" అని పలికెను. కానీ ఇంద్రుడు కదలక పోవుటచే ఐరావత కుంభస్థలమును తన చేతితో ప్రహరించి, అద్దాని దంతములు పట్టి, గిరగిరా త్రిప్పి భూమిపై విసరెను. ఐరావతము విచలితమై, రక్తధారలు కారుచుండగా భూమిపై పడెను. ఆ దైత్యుని బలసంపద గాంచి ఇంద్రుడు ఆశ్చర్య చకితుడగుచుండగా, దైత్యుడు ఇంద్రుని బంధించెను. క్షణములో ఇంద్రుడు సూక్ష్మరూపుడై విడివడి, వడివడిగా దూర ప్రదేశమున కేగెను. తదుపరి బ్రతుకు జీవుడా అనుచు అన్యరూపము దాల్చి, ఇతర దేవతా సహితుడై విష్ణువును

శరణుజొచ్చెను. సింధు ఇంద్రాసనమందు ఆశీనుడై తన దైత్య మిత్రులను ఇతర పదవులందు నియుక్తుల కావించెను. వారందరూ సింధును ప్రశంశించుచూ విజయ ధ్వానములు కావించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు దిగ్విజయము అను డెబ్బది నాల్గవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది అయిదవ అధ్యాయము

(దేవ దానవ సంగ్రామము)

బ్రహ్మ "వైకుంతమందు సుఖాసీనుడై యున్న విష్ణు భగవానుని వద్దకు ఇంద్రాదులేతెంచి, ప్రణామములొనర్చి ఇట్లు పలికిరి "హే! గోవిందా! సింధు అను దైత్యరాజు అమరావతి పై దాడి యొనర్చి మమ్ము పదవీచ్యుతులను కావించెను. మేము యధాశక్తి వారితో పోరాడితిమి. కానీ వాని శౌర్యము ముందు మేము నిలువలేకుంటిమి. మీరు వినా మాకు వేరొక గతిలేదు. దయచేసి మమ్ము రక్షింపవవసినది." విష్ణువు ఆశ్చర్యచకితుడై "దేవతలారా! మీరు భయపడవలదు" అని వారిని ఆశ్వాసించి, తాను గరుడారుఢుడై, దేవతలు వెంటరాగా అమరావతికేగెను. ఆ విషయము వినిన సింధు తన దైత్య బలగముతో ఆశ్వారూఢుడై అరుదెంచెను. దేవతా ప్రముఖులందరూ యుద్ధ సన్నద్ధులైరి. సింధుని ఎదుట దేవ దానవులు ద్వంద్వ యుద్ధమునకు సంసిద్ధులైరి. ఆ సమయమున వరుణుడు ప్రచండునతోనూ, కుబేరుడు కమలునితోనూ, ఇంద్రుడు వృత్రాసురునితోనూ, వాయువు నికుంభునితోనూ, విష్ణువు శంభునితోనూ, అగ్ని చుండునితోనూ, సోముడు ముండునితోనూ, కుజుడు (మంగళుడు) కదంబునితోనూ, కామదేవుడు శంబరునితోనూ, అశ్వనీ కుమారులు కాలరాక్షసునితోనూ, సమర మొనరించిరి. ఒండొరులు అనేక శస్త్రాస్త్రములతో మర్మ స్థానములందు ప్రహరించుకొనిరి. కొందరు మల్ల యుద్ధము, మరికొందరు బాణవిద్యతో పోరాడుచుండిరి. సైనికుల శిరములు, మొండెములు, కాళ్ళు, చేతులు, తొడలు తెగి, భయంకర రక్తస్రావమై రుధిరము ఏరులై పారుచుండెను. ఇంద్ర, వృత్రాసురులిరువురు ఒకరినొకరు ముష్ఠి ప్రహారములొనర్చిరి. తదుపరి చేతులు, కాళ్ళు, శిరములు, వీపులు, తొడలతో ప్రహరించుకొనుచూ తీవ్ర యుద్ధమొనర్చిరి. అంత వృత్రాసురుడు ఇంద్రుని శిరముపై తీవ్రముగ ముష్ఠి ఘాతమొనర్చెను. ఇంద్రుడు ముఖము రుధిరమయమై వృత్రుని పరాక్రమమునకు తాళలేక పలాయనమొనర్చుట నారంభించెను. ఇరుప్రక్కల నుండి దైత్యసేనలు ఆక్రమించుటచే ఇంక చేయునది లేక పురంధరుడు అంతర్ధానమొందెను. ఆయనేకాక ఇతర దేవతా ప్రముఖులు సహితము సమరమందు దైత్యుల ధాటికి ఓర్వలేక, తమ దర్పములు చూర్ణమై పలాయన మొనర్చిరి.

దీనిని కాంచిన విష్ణుభగవానుడు ఉత్ప్రేరితుడై తన చక్రాయుధముచే దైత్యుల నిర్జించెను. దైత్యుల అంగములు విదీర్ణములై కొందరు హతులైరి. కొందరు ఆయనను శరణుజొచ్చిరి. వారిని విష్ణువు వదలిపెట్టెను. విష్ణు భగవానునిచే హతమొందిన దైత్యులు మోక్షము నొందిరి. ఈ విధముగ ఆ కదనరంగమందు స్వైర విహారము కావించి, విష్ణువు తన శంఖమును పూరించెను. అంత దానవ ప్రముఖులైన శుంభనిశుంభులు విష్ణువు పై కయ్యమున కేతెంచిరి. అంత విష్ణువు విరాడ్రూపము ధరించి శుంభ, నిశుంభ, చండ, ముండాది దైత్యులను పట్టి దూరముగ విసరివైచెను. వారు కొంతసేపు మూర్ఛితులై, తిరిగి తెలివి తెచ్చుకొని సమరాంగణమునకు ఏతెంచిరి. విష్ణువు ప్రచండుని వక్షమందు, వృత్రాసురుని వీపుయందు, కాల, కమల, భౌమాసురులను శిరమందు ప్రహరించి భూశయనుల కావించెను. కదంబుని చక్రముతో ముక్కలుకావించి, కాలాసురుని హృదయమును గదతో విచ్ఛిన్నమొనర్చెను. ఈ కోలాహలము విని సింధు దైత్యుడచటికి

ఏతెంచి, దిగంతములు ప్రతిధ్వనించునటుల గర్జించి ఇట్లనియె "ఓ! విష్ణూ! నీవు నీ బలము చూపించితివి. ఇపుడు నా పౌరుషమును సహితము ఆస్వాదించుము. నా దృష్టి పడిన ఏ శత్రువు జీవింపనోపడు. నీవు త్రికాలజ్ఞుడవు కదా! యుద్ధమునకు వచ్చెడిముందు పూర్వాపరములు విచారింపలేదా? మిణుగురు పురుగు సూర్యోదయమయిన పిదప ఎట్లు మాయమగునో నా ఆగమనానంతరము నీవును అట్లే మడసిపోయెదవు" ఇంతలో పలాయన మొనర్చిన దేవ ప్రముఖులు సమరాంగణమునకు ఏతెంచిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందు దేవదానవ సంగ్రామమను డెబ్బది అయిదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఆరవ అధ్యాయము

(సింధు దైత్యుని త్రిలోకాధిపత్యము)

బ్రహ్మ "ఈ విధముగ పలికి సింధు దైత్యుడు ఇంద్రునిపై ముష్ఠి ఘాతమొనర్చెను. పురంధరుడు సుడిగాలి పడిన వృక్షము వలె నేలపై కూలెను. అంత సింధు కుబేరుని లలాటమందు, వరుణుని దవడలపై, యముని వీపుపై చక్రముతో ప్రహరించెను. అగ్నిని దంతములపై, కామదేవుని లాఠీతోనూ ప్రహరించెను. పవనుని తన కాళ్ళతో మర్దించి, శనైశ్చరుని భుజములు పట్టి బలముగ విదిలించెను. చంద్రుని, కుజుని ఇరువురిని గిరగిరా త్రిప్పి భూమిపై విసరెను. సనక, సనందనులను వీపుపై ప్రహరించెను. అశ్వనీ కుమార ద్వయము, నారదుడు పలాయన మొనరించిరి. విష్ణువు యొక్క మణికట్టును చక్రముతో ప్రహరించగా, ఆ మహానుభావని చేతినుండి సుదర్శనము జారి క్రిందపడెను. అంత విష్ణువు "ఓ! దైత్య శిఖామణీ! నీ వంటి యుద్ధ విశారదుని నేనింతకు మందు చూడలేదు. నీ మనోకామన తెలిపిన ఎడల నీకు వరదాన మొనర్చెదను" అని పలికెను. అంత సింధు అత్యంత ఆనందితుడై "ఓ! దేవేశా! మీరు ప్రసన్నులయిన ఎడల మీ పరివార సహితులై నా గండకీ నగరమందు స్థిర నివాస మేర్పరుచుకొనవలసినది" అని కేరెను. విష్ణువు "నేను నీకు వశీభూతుడను. నీ మనోవాంఛితమును పూర్ణమొనర్చెదను" అని పలికి గండకీ నగరమున కేగెను. సింధు వైకుంఠ, కైలాస, సత్య, స్వర్గలోకముల యందు తన ప్రతినిధులను నియమించి, తాను వివిధ మేళతాళముల మధ్య, వంది మాగధులు పొగడుచుండగా, దుందుభులు దిగంతములు ప్రతిధ్వనింప జేయుచుండగా తన నగరమున కేతెంచెను. గండకీ నగరమందు నాగరికులు తమ మహారాజు వద్ద నిలబడిన దేవతా ప్రముఖులను కాంచి, తమ ఇండ్లకు ప్రస్తాన మొనర్చిరి. సింధు విష్ణు భగవానునితో "స్వామీ! మీరు సపరివారముగ ఈ దేవతా ప్రముఖుల సహితులై ఇచటనే యుండవలసినది" అని పలికెను. ఆతడు వెడలిన పిదప దేవతలందరూ విష్ణు భగవానుని వద్ద కేతెంచి "ఓ! గరుడధ్వజా! మీ లీలలు మాకు అగమ్య గోచరములు. మీరు సంగరము మాని ఈ దైత్యుని ఇంట కొలువుండుటకు కారణమేమి? మేము ఈ కారాగారమందు, ఈ మృత్యులోకమందు ఎట్లుండగలము? స్వామీ! మా కష్టముల కంతమెన్నడు?" అని ప్రార్థించిరి. అంత విష్ణువు "కాలము దురతిక్రమము; కాలగతి అజేయము. సర్వులు కాలము వశముననే యుందురు. సర్వుల వృద్ధి, హానిలకు కాలమే కారణము!! అందువలన మీరందరూ తగిన కాలము కొరకు ప్రతీక్షింపవలసినది. కాలమే ఈ దైత్యుని సహితము గ్రసించును" అని శెలవిచ్చెను.

సింధు దైత్యుడు త్రిలోక విజేతయై, ప్రసన్నుడై తన మాతా పితరుల వద్దకేగి ఆ విషయ విశేషములు వర్ణించెను. వారిరువురు తమ తనయుని పౌరుష పరాక్రమములకు సంతసిల్లి ఆశీర్వదించిరి. అంత దుర్బుద్ధి అయిన ఆ దైత్యుడు

తన రాజ్యమునకు తిరిగి వచ్చి "ఎవరు దేవ బ్రాహ్మణ పూజనమొనర్చెదరో వారు తీవ్రముగ శిక్షింపబడుదురు. ఎక్కడెక్కడ దేవాలయములున్నవో, వాని యందలి దేవతా ప్రతిమలన్నింటినీ ధ్వంసము గావించి, వాటి స్థానమున సింధు ప్రతిమల నుంచి పూజింపవలెను" అని దండోరా వేయించెను. దానవ ప్రతినిధులు ఆ నియమములను అమలు పరచి తిరిగి రాజుకు నివేదించిరి. అప్పటి నుండి యజ్ఞ, దాన, తపములు, స్వాహా, స్వధా, వషట్కారములు లుప్తమయ్యెను. కొందరు ఋషులు మేరు పర్వతమున కేగి తమ తపము కొనసాగించిరి. చాలా మంది ఋషి, ముని గణములు పతితులైరి. దేవగణములు ఎక్కడెక్కడో విలీనమయిరి. దేవ ప్రముఖులందరూ సింధు దైత్యుని రాజ్యమందు ఒకచోట బంధితులైరి. సాధుజనులు మృతి నొందిరి. త్రిలోకమందు దైత్యులు ప్రబలిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు దైత్యుని త్రిలోకాధిపత్యమను డెబ్బది ఆరవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఏడవ అధ్యాయము

(దేవతల మంత్రాంగము)

బ్రహ్మ "అత్యంత శక్తిశాలి, దుర్నిరీక్ష్యుడు అయిన సింధుచే బందీలయిన దేవతాప్రముఖులు అందరూ ఆ దైత్యుని వధ నిమిత్తమై ఒక చోట సమావేశమయిరి. అంత ఇంద్రుడు "మన అందరి అభిప్రాయములు తెలిసిన మీదటనే ఒక నిర్ణయమునకు రావలసి యుండును. సర్వులు మీమీ అభిప్రాయములు తెలుపవలసినది." అంత బ్రహ్మాది దేవతలు "ఈశ్వరుడే సర్వకార్యసిద్ధి ఒనర్చగలడు. ఆ మహానుభావుని ప్రసన్నము కావించు ఉపాయము చింతించెదము. ఆయన ఈ దైత్యుని పరాజితునొనర్చి, తిరిగి మన స్థానములు మనకు ప్రసాదింపగలడు." అంత వక్తలందరి యందును శ్రేష్ఠుడయిన దేవగురువు బృహస్పతి "ఆ ప్రభువు అల్పసంతోషి. స్వల్ప పూజతో ప్రసన్నుడు అగును. అసుర వినాశకుడయిన అయిన పూజను సర్వులు కావింపవలెను" అని పలికెను. అంత దేవతలందరూ బృహస్పతి వయిపు తిరిగి "ఓ! వాచస్పతీ! మనమిపుడు ఏ దేవుని పూజింపవలెనో నిశ్చయాత్మకముగా మీరే నిర్ణయించి తెలుపవలసినది. మేమందరము ఆ దేవుని ప్రసన్నుని కావించెదము." అంత బృహస్పతి "ఎవరు తనను త్రిమూర్తులుగ విభజించుకొనెనో, ఎవరు సృష్టింత్యకార్యములు ఆచరించుచుండెనో, ఎవరు అవాఙ్మానస గోచరుడో, ఎవరు నిత్యుడు, బ్రహ్మమయుడో, జ్యోతి స్వరూపుడు, ఆది మద్యాంత రహితుడు, నిర్గుణ నిరామయుడో, ఎవరు ఏకరూపుడయినప్పటికీ సర్వ జీవులుగ మార్పు చెందుచుండెనో, ఎవరి నామస్మరణచే సర్వ కార్యములు అభీష్ఠ సిద్ధినొందునో, ఆ వినాయకుని భక్తి పూర్వకముగ పూజంచిన ఎడల, సంకటములు తొలగును. ఇప్పుడే మాఘమాస కృష్ణపక్ష మారంభమయినది. మంగళవారముతో కూడిన కృష్ణపక్ష చతుర్దశీ తిథి వినాయకునకు అత్యంత ప్రియము. మీరు ఇక వేరువేరు విచారము లొనర్పక ఆయనను పూజించిన ఎడల మీ మనోవాంఛితములన్నియు ఆయన సమకూర్చును.

అంత దేవతలందరూ ఆయనకు నమస్కరించి "ఓ! దేవగురూ! మీరు పలికినది సత్యము. మీ పలుకులు మమ్ములను తృప్తుల నొనరించినవి. ఈ మహా విపత్సమయము అనెడు సాగరము దాటించు నావ మీరు!" అని పలికిరి. అంత బ్రహ్మ, విష్ణువు, ఇంద్రుడు, దిక్పాలురు, మిగిలిన దేవతలందరూ చందనము, పంచామృతములు, పుష్పమాలలు, శమీ, దూర్వ పత్రములు, వివిధ ఫలములు, రాళ్ళు కంకర లేని మట్టి సేకరించిరి. ఆ మట్టిని గండకీ జలములతో తడిపి సుందరమైన వినాయక మూర్తులు చేసిరి. అంత వనమందు దొరుకు వృక్షశాఖలతో ఒక సుందర మందిరమును

నిర్మించి, అందు సింహారూఢుడు, దశభుజుడు, సుందరమైన మెలితిరిగిన తొండము కలవాడు, నానా భూషణ భూషితుడు, సువర్ణ ముకుట కుండలాలంకృతాంగుడు అయిన వినాయకుని ప్రతిష్ఠించిరి. అంత ఆ మూర్తికి షోడశోపచార పూజనమొనర్చి, పంచామృతములు, శుద్ధ జలములు, వస్త్ర భూషణాదులు, వివిధ ఫలములు, నైవేద్యములు సమర్పించి, సూర్యాస్తమయమయిన పిదప దేవతలందరూ ఈ విధముగ స్తుతించిరి "ఓ! దీననాథా! దయాసాగరా! నీవు యోగుల హృత్కమల వాసుడవు. ఆది మద్యాంత రహితుడవు. నీకు నమస్కారము. నీవే జగత్ప్రకాశకుడవు, జ్ఞాన స్వరూపుడవు, దైత్య నాశకుడవు. ఓ! త్రిలోకనాథా! గుణాతీతుడ వైనప్పటికీ, గుణములందు వైషమ్యమొనర్చి జగత్తును నడుపుచుందువు. త్రిలోకపాలకా, విశ్వవ్యాపీ! నీకు నమస్కారము. మాయారహితా, భక్తుల మనోకామనలను పూర్ణమొనరించు మహాప్రభో! సూర్య చంద్రాగ్నులు త్రినేత్రములుగ గల విశ్వపాలకా, నీకు నమస్కారము. చంద్రశేఖరా, నీ శక్తికి పరిమితి లేదు. శశివర్ణా, శుద్ధస్వరూపా, శుద్ధ జ్ఞానదాతా, నీకు నమస్కారము! నమస్కారము!!

దేవతల ద్వారా ఈ విధముగ స్తుతింపబడిన వెంటనే వారి సమక్షమున ఒక తేజోరాశి ప్రకటమయినది. సురల నేత్రములు ఆ కాంతిని చూచుటకు అశక్యములైనవి. అంత దయాళువైన పరాత్పరుడు తన కాంతిని సౌమ్య మొనర్చెను. అంత దేవతలందరూ సింహారుఢుడు, దశభుజుడు, సర్వ హస్తములందు ఆయుధధారి, దివ్యమాలాశోభితుడు, మహాముకుట కుండలాలంకృతాంగుడు, దివ్య గంధాను లేపితుడు, మనోహర ముత్యముల మాలాధారి, భుజములకు భుజకీర్తులు, పాదములకు స్వర్ణ రత్నఖచిత నూపురములు ధరించిన వాడు, కస్తూరి తిలకాంకితుడైన పరాత్పరుడు శ్రీగణేశుని కాంచిరి. అంత దేవతలందరూ ముక్త కంఠముతో "స్వామీ! మీ దర్శనముచే మా జన్మము, నేత్రములు ధన్యములు" అని పలికిరి. అంత శ్రీగణేశుడు "మీ ద్వారా కావింపబడిన స్తుతిచే, మరియు సంకటహార పూజనముచే నేను సంతుష్టుడనైతిని. మీచే కావింపబడిన ఈ స్తోత్రము సంకటహార స్తోత్ర రూపమున విఖ్యాతమగును. ఏ భక్తుడు ప్రయత్నపూర్వకముగ తను, మనో శుద్ధుడై ఈ స్తోత్రమును నిత్యము పఠించిన ఎడల, ఆతడు నాచే సన్మానింపబడును. వానిని చూడగనే యక్ష రాక్షసాదులు నశించెదరు. ఆతడు ఇహమందు సర్వ భోగములు అనుభవించి, పరమందు మోక్షము నొందును. మీరు సింధు దైత్యునిచే పీడింపబడుచున్నారు. యజ్ఞ, తపములు కావింపలేక మీరు ఈ గండకీ నగరమందు బందీలయిరి. నేను ఈ సింధు దైత్యుని సంహరించుటకు అవతారము స్వీకరించి, పార్వతీ మాత గృహమందు జననమొంది, మయూరేశ్వరునిగా విఖ్యాతి నొందెదను. సింధు దైత్యుని మరణానంతరము మీరు తిరిగి మీ స్థానములను పొందెదరు. ఇందు సందేహము లేదు. నేను కృతయుగమందు దశభుజునిగా, సింహ వాహనుడనై, తేజోరూపినై "వినాయక" నామమున తెలియుదును. త్రేతాయుగమందు షడ్భుజునిగ, శ్వేత వర్ణముతో, మయూర వాహనముతో "మయూరేశ్వరుని"గ విఖ్యాతి నొందెదను. ద్వాపరమందు చతుర్భుజునిగ, రక్తవర్ణము, మూషిక వాహనముతో "గజాననుని"గ ప్రసిద్ధి నొందెదను. కలియుగమందు శ్యామ వర్ణముతో, రాతితో చేయబడిన రూపముతో "ధూమకేతు" నామముతో సర్వులను అనుగ్రహించెదను." ఈ విధముగ పలికి పరాత్పరుడు శ్రీగణేశుడు అదృశ్యుడయ్యెను. అంత కార్యాసిద్ధి నొందిన దేవతలు సంతుష్టి నొందిరి. ఈ ఉత్కృష్ట ఆఖ్యానమును ఎవరు వినెదరో, లేక వినిపించెదరో, లేక పరమ భక్తి భావముతో చదివెదరో వారి మనోకామనలన్నియు పూర్ణమయి, మరణానంతరము వారు పరబ్రహ్మమునందు లీనమగుదురు.?

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి దేవతల మంత్రాంగము అను డెబ్బది ఏడవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది ఎనిమిదవ అధ్యాయము

(పార్వతీ పరమేశ్వర సంవాదము)

బ్రహ్మ "సింధు దైత్యునిచే దేవతలు పరాజితులైరి అని వినిన శంకరుడు తన ఏడు కోట్ల గణములతో, గంగా, గౌరీ సమేతుడై "త్రిసంధ్య" క్షేత్రమున కేగెను. అచట సింధు దైత్యుని భయమున స్వాహాకార, స్వధాకార, వషట్కార రహితులైన గౌతమాది ఋషులు నివసించుచుండిరి. వారందరూ శంకరుని కాంచగనే బాలురు తల్లివద్దకు, విప్రగణములు తీర్థములకు పరుగిడునటుల ఆయన వద్దకు పరుగులిడి, ప్రణామము లొనర్చి ఇట్లనిరి "స్వామీ! మీ దర్శనముచే మేము ధన్యులమయితిమి. మా అనుష్ఠానములు, నేత్రములు, జన్మము, జ్ఞానము సహితము ధన్యమయినవి. ఎందుకనగా చర్మచక్షువులకు అగోచరుడగు శివుడు దండకారణ్యమునకు ఏతెంచి మాకు దర్శన మిచ్చుచున్నాడు. నేడు మా పాపములు నష్టమై, మా పుణ్యములు ఫలీభూతమయినవి. శివ దర్శనముచే మా భయములన్నియు తొలగినవి. సూర్యోదయమయిన పిదప అంధకారముండునా?" అంత శివుడు "సింధు దైత్యుడు త్రిలోకములు ఆక్రమించి, దేవతలనోడించి, గండకీపురమందు బందీలు గావించెను. ఆ దురాత్ముడు కొంతమంది మునులను సహితము అచటనే బలవంతముగ యుంచుటచే నేను ఖిన్నుడనైతిని. మీ దర్శనము పాపనాశకము. నాకు కొన్నాళ్ళు నా సపరివారముగ ఇచట నివసించుటకు ఆవకాశ మీయవలసినది. అట్లయిన నేను జగదీశ్వరునికై తపము ఆచరించెదను" అని పలికెను. శివుని పలుకులు విని మహర్షులు "స్వామీ! మీరు సర్వేశ్వరులు. సర్వులకు స్వామి. మీకు స్థానమునిచ్చువారెవరు? కల్ప వృక్షమునకు కామనలుండునా? ఉన్నచో దానిని తీర్చువారెవరు? క్షీర సాగరము తీర్చలేని దాహమును ఒక చిన్న చెరువు తీర్చునా? ఈ పృధివి కేవలము నీ రూపమే! ఇచట గల సర్వము మీ అధీనమే! మీకు కావలసిన విధముగ కార్యసిద్ధి కావించు కొనవచ్చును. స్వామీ! మీకు మీ ఆశ్రమమును చూపించెదము. ఇయ్యది నానా విధ వృక్షములచే, స్వచ్ఛ సరోవరములచే, లతా పుష్పములచే, జల జంతువులు, హంస కారండవాది పక్షులచే పరివృతమై, స్వాధిష్ఠ కందమూలాదులు, మృదువయిన గడ్డి దొరుకు దివ్య స్థలము. పరమాత్మ స్వరూపా! మీరు ఇచట నివసించి మమ్ము పాలింప ప్రార్ధన" అని పలికిరి.

శివుడు ఆ ప్రాంతమును కైలాసము కంటె మిన్నగా ప్రేమించెను. శివాగమనముచే ఋషులు సహితము నిశ్చింతులై తమ తపాచరణము కొనసాగించిరి. గంగా, గౌరిలు, శివగణములు, పరమేశ్వరుని సాధనకు కావలిసిన ఉపకరణములన్నియు సమకూర్చుచుండిరి. ఈ విధముగ కాలము గడచుచుండగా ఒకనాడు జగన్మాత పార్వతిదేవి శివుని చేరి "స్వామీ! మీరే విశ్వకర్తా, విశ్వహర్తా, మరియు జగద్రక్షకులు. మీరు మూర్తి రహితులైనప్పటికీ అష్ట మూర్తులుగ వెలసిరి. మీరు సర్వదేవతా శ్రేష్ఠులు మరియు సర్వుల మనోకామనలను పూర్ణమొనరించువారు. అష్టవిధ కర్మములకు ఫలప్రదాత, మరియు సర్వార్థ జ్ఞాత మీరే! మీకంటే శ్రేష్ఠులు ఎవరు? దేవ, ముని, యక్ష, రాక్షస, మానవాదులందరూ మీ శక్తిచే కదలుచున్నారు. ముప్పదిమూడు కోట్ల దేవతలు, సిద్ధులు, సాధకులు, మిమ్మే పూజించి, భజించుచున్నారు. మరి మీరెవరిని ధ్యానించుచుంటిరి? దయచేసి నా సందేహమును తీర్చవలసినది." అంత శివుడు "ఓ! దేవీ! నీ ప్రశ్న బహు ఉత్తమము. నీ ప్రశ్నకు సమాధానముగ, లోకోపకారమునకై, మరియు ధర్మాత్ములు సంసార సాగరమును దాటుటకు నా ఇష్టదైవ నిరూపణ కావింతును. ఏ పరమాత్ముడు విశ్వ రచయితయో, ఎవరు సర్వ ప్రాణులందు అంతర్యామియో, ఎవరు అనంతశ్రీ ప్రసన్నుడో, ఎవరు అనంత బాహూదర వక్త్ర నేత్రుడో, ఎవరు గుణాతీతుడు, వేదకర్త, అఖిల పదార్ధ ప్రదాతయో, ఎవరు అనంత శక్తిశాలి, విశ్వాత్మ, అనుపమేయుడో, సనాతనుడో; ఎవరిని భాషాపతి, నారాయణుడు, శేషుడు కూడా తెలియరో, ఎవరినుండి అనంత జీవరాశి ఉత్పన్నమగుచున్నదో, ఎవరు త్రిమూర్తులకు త్రిగుణములు ప్రసాదించిరో, ఎవరు ఆ గుణముల నాశ్రయించి

ఈ సృష్టి, స్థితి, లయముల కావించునో, ఆ పరమాత్మ, పరబ్రహ్మ స్వరూపుడయిన గుణేశుడు శ్రీగణేశుని నేను నిరంతరము ధ్యానమొనర్చుచున్నాను."

అంత గౌరీదేవి నేను మీ పలుకులకు సంతుష్టనైతిని. కానీ నేను ఆ గణేశుని ఎట్లు చూడగలను? ఆయన సాక్షాత్కారమెట్లు కలుగును. ఆ శక్తిని, నిరాకార పరమాత్మను ఎట్లు భజింతును? ప్రభూ! నాకు ఉపాయము తెలుపవలసినది." శివుడు "దేవీ! నీవు ఏకాగ్ర మనసుతో తపమొనర్చిన ఎడల ఆ దేవదేవుడు ప్రత్యక్ష దర్శనమిచ్చును" అని పలికి, అత్యంత ప్రసన్నతతో పార్వతీదేవికి ఏకాక్షర మంత్రదీక్ష **(గం)**నిచ్చి, అద్దాని విధి విధానములు తెలిపి "నీవు పన్నెండు సంవత్సరములు తపమొనర్చిన ఎడల ఆ ప్రభువు నీకు తప్పక దర్శనమిచ్చును" అని పలికెను. అంత అపర్ణ శివునికి ప్రణమిల్లి ఏకాక్షర జప తపము లొనర్చుటకు జీర్ణా పురమునకు ఉత్తరమున యున్న "లేఖనాద్రి" పర్వతమునకు చనెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పార్వతీ పరమేశ్వర సంవాదమను డెబ్బది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

డెబ్బది తొమ్మిదవ అధ్యాయము

(పార్వతీ తపము)

బ్రహ్మ "అంత లేఖనాద్రి యందు పార్వతీదేవి సమతలము, వృక్షఛాయాయుతము అయిన ఒక సరోవర తీరమున పద్మాసనము వైచికొని, నాసాగ్రముపై దృష్టి నిలిపి, తూర్పుకు తిరిగి శ్రీగణేశుని ఏకాక్షర మంత్రము జపించుచూ నిశ్చల అయినది. ఆమె కందమూలాదులు, జలము, ఫలములు, పత్రములు, చివరకు వాయు భక్షణము సహితము వర్జించి తీవ్ర తపమొనర్చుచుండగా పన్నెండు సంవత్సరములు గడచినవి. అంత గుణవల్లభుడయిన శ్రీగణేశుడు ప్రత్యక్షమెయ్యెను. ఆ సమయమున ఆ పరాత్పరుని రూపము ఇట్లుండెను. ఆయన కిరీట కుండలధారియై, దశభుజుడై, శంఖ, చక్ర, త్రిశూలములు, అక్షమాల, పద్మము ధరించి, గళమందు ముత్యాలమాలా శోభితుడై, లలాటమందు చంద్రశేఖరుడై, కస్తూరీ తిలక శోభితుడై, ముఖమందు మధ్యన నారాయణుడు, కుడివైపున శివుడు, ఎడమవైపున బ్రహ్మ యుండి, శేషునిపై పద్మాసనమునందు కూర్చొని, మల్లె, కర్పూరము వంటి ధవళవర్ణ కాంతితో ప్రకాశించుచుండెను. ఆ పరాత్పరుడు పార్వతీమాతతో "తల్లీ! నీవు ఏగణేశుని కొరకై తపమొపరించుచుంటివో ఆ శ్రీగణేశుని నేనే! నీ తీవ్ర తపశ్చర్యకు సంతుష్టుడనై ఏతెంచితిని. నీకు నా స్వరూపము గూర్చి వివరించెదను. ముప్పది మూడు కోట్ల దేవతల యందు నా కంటె అధికుడు లేడు. గుణములను సత్వ, రజస్, తమస్సులను మూడు గుణములుగ విభజించుటచే భక్తులు నన్ను "గుణేశుడు" అని పిలుతురు. ఈ త్రిగుణముల కారణముగనే నేను త్రివిధ శరీరములు గ్రహించితిని. ఓ! మహేశ్వరీ! త్రిలోకముల యందలి ఎంతటి అసాధ్యమయిన వరమునైననూ నేను నీకు ప్రసాదింపగలను. నీ తపస్సుకు నేను అత్యంత సంతుష్టుడనైతిని. నీ మనోవాంఛితమును కోరుకొనవలసినది" అని పలికెను.

అంత భవాని కనులు తెరచి, ఆ శ్రీగణేశుని గాంచి, ప్రణామము లొనర్చి, గద్గద కంఠముతో "స్వామీ! మీ చరణ కమల దర్శనముచే నా జన్మము, నిష్ఠ, మంత్రము, తపము, నా పతి అయిన శివుడు కూడా ధన్యులమైతిమి. మీ దర్శనమే నా పరమ సిద్ధిప్రాప్తి. నాకు వేరేమి వరములపై ఆశ లేదు. కానీ మీ ఆదేశము అతిక్రమింపలేనిది కావున అడుగుచుంటిని. మీరు నా పుత్రులై జన్మించి నాకు సంతోష మొనరింప వలసినది. నేను మీ నిరంతర దర్శనముచే నిత్య సంతోషినై మీకు సేవ యొనర్చెదను." అంత శ్రీగణేశుడు హర్షితుడై "నేను నీ పుత్రుడనై జన్మించి, లోకములకు, మీకు,

సంతోష ప్రదుడనై మీ మనోకామనలను పూర్ణ మొనరించెదను" అని పలికి అంతర్హితుడయ్యెను. అంత పార్వతీదేవి తాను కన్నది కల కాదు కదా అని కొంత తడవు సంశయించి, తదుపరి ఈశ్వరోపదేశమయిన మంత్రము ఫలించి తనకు గుణేశుడు శ్రీగణేశుని దర్శన మయినదని సంతోషాంగతరంగ అయ్యెను. అంత పార్వతీ దేవి ఆ పరాత్పరుని తలంచుచూ గుణేశుని ప్రతిమను చేసి, అత్యాదరముతో దానికి ప్రాణప్రతిష్ఠ గావించి, దాని చుట్టూ నాలుగు ద్వారములు కల ఒక సుందర మందిరమును నిర్మించి, ఆ గుణేశునకు "గిరిజానందనుడు" అని నామకరణ మొనర్చెను. పిదప "ఈ క్షేత్రము "సిద్ధ క్షేత్రము" గా విఖ్యాతి నొందును. ఇచట ధ్యాన, తప మొనర్చిన సాధకులు తప్పక సిద్ధి నొందెదరు" అని వరము నొసంగెను. అంత ఆ సాధ్వి బ్రాహ్మణులకు దానము లొసంగి, ఒక ఆచార్యుని వద్ద నుండి ఆశీస్సులు పొంది, ఆ గిరిజానందనునకు ప్రదక్షిణ ప్రణామము లొసంగి, తిరిగి త్రిసంధ్య క్షేత్రమున కేతెంచి శివుని చరణ కమలములకు నమస్కృతు లర్పించెను. తదుపరి ఆయనకు తాను లేఖనాద్రికి వెడలిన దాదిగ జరిగిన విషయ విశేషములన్నియు తెలిపి, గుణేశ దర్శనము, పుత్రప్రాప్తికై వర ప్రసాదనము, గిరిజానందన ప్రతిష్ఠాపన, ఇత్యాదులన్నియు ఆయనకు వివరించెను. శివుడు అమందానంద కందళిత హృదయారవిందుడై పార్వతీదేవిని మనసార కౌగలించుకొనెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పార్వతీ తపము అను డెబ్బది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఎనభైయవ అధ్యాయము

(శ్రీగణేశ జననము)

బ్రహ్మ "తదుపరి పార్వతీదేవి అత్యంత ప్రసన్నయై తన చెలుల వద్దకేగి ఈ వృత్తాంతమంతయు పంచుకొన్నది. ఆ తల్లి తన హృదయమందు నిరంతరము శ్రీగణేశుని గూర్చి చింతించుచూ, ఏ చిన్న బాలుడు కనబడిననూ ఆతడు గుణేశుడని తలచుచుండెను. శ్రీగణేశ తత్పరత యందు ఆమె విశ్రామ మొందకుండెను. ఒకనాడు ఆమె తన చెలులతో ఇట్లనియె "నేను శివుని పతిగావలెనని తపించు సమయమున నా తండ్రి శ్రీగణేశపూజ గూర్చి తెలిపెను. నేను శ్రీగణేశుని మృణ్మయమూర్తిని కావించి ఉపాసించితిని. తత్ప్రభావమున నాకు పరమేశ్వరుడు పతిగా లభించెను. నేనిపుడు తిరిగి అదే వ్రతమును శ్రీగణేశుని పుత్రునిగ పొందుటకు తిరిగి కావింతును." ఈ విధము పలికి భాద్రపద కృష్ణ చతుర్దశి తిథినాడు ఒక మట్టి వినాయకుని చేసి, అద్దానికి షోడశోపచారములతో పూజనమొనర్చెను. ఆ మూర్తికి నానా విధములైన పుష్పములు, మందారములు, దూర్వాంకురములు, శమీపత్రములు, వివిధ ఫలములు, నైవేద్యములు, అనేక విధములయిన దక్షిణ, హారతులు, మంత్ర పుష్పాంజలి, సమర్పించి స్థుతిపాఠము ప్రదక్షిణలు, బ్రాహ్మణ పూజనము కావించెను. అంత అకస్మాత్తుగా ఆ మూర్తి నుండి కోటి సూర్యుల ప్రభ ఆవిర్భవించుట మొదలిడెను. అయ్యది ప్రళయకాలాగ్ని రూపమై, కోటి చంద్రుల ఆహ్లాదమను సహితము కలిగియున్నది. ఆ దివ్య ప్రభను కాంచజాలక పార్వతీదేవి మూర్ఛితురాలై క్రిందపడెను. ఒక ముహూర్తానంతరము సావధానయై తిరిగి లేచి ఆ జగదీశ్వరుని కాంచి "దేవా! నేను నీ పూజ యందు ఏదేని అపచార మొనర్చితినా? లేక ఎవరేని ఆభిచారిక ప్రయోగము కావించిరా? ఓ! కృపానిధానా! నా ప్రయత్నమేల విఫలమయినది?" అని ప్రశ్నించెను. అంత శ్రీగణేశుడు తన తేజస్సును తగ్గించుకొనెను. అంత ఆ తల్లి వినాయకుని గాంచి, అత్యంత ఆనందము నొందెను. ఆ స్వామి అనేక బాహూదర వక్త్ర నేత్రములు కలిగి, సూర్యచంద్రాగ్నులు నేత్రములుగ, హస్తములందు అనేక ఆయుధములు ధరించి సర్వాంగ సుందరుడై, అత్యద్భుత కాంతితో తేజరిల్లుచుండెను.

అంత పార్వతీదేవి అర్ధ నిమీలిత నేత్రయై, శరీరము కంపించుచుండగా, ఏమిచేయుటకు తోచక, మనసున "ఈ మహాపురుషుడు నేను చింతన చేయుచున్న శ్రీగణేశుడా? లేక ఏదేని అరిష్టమా?" అని తటపటాయించి, చివరకు తన జ్ఞాన చక్షువుతో దర్శించి, శివుని ఉపదేశము మనసున స్మరించి ఇట్లనియె "ప్రభూ! నేను నీ మాయచే భ్రమించుచూ నిన్ను తెలియకున్నాను. స్వామీ! నీవెవరు? ఎక్కడనుండి ఏతెంచితివి? నీవు గుణేశుడవైన శ్రీగణేశుడవా? తెలుప ప్రార్ధన." అంత దేవదేవుడు "ఓ! శుభగా! నీవు నిరంతరము అనుష్ఠాన మొనర్చుచున్న పరాత్పర పరమ పురుషుడను నేనే! నీవు నన్ను పుత్రునిగ పొందదలచితివి. అందువలన నేను మీ ఇంటియందు అవతరించెదను. నేను ఆ రూపము నందు కావించెడు కార్యములు తెల్పెదను. వినుము. నేను మాతా పితరులైన మీ ఇరువురికీ సేవ చేసెదను. సింధు దైత్యుని సంహరించెదను. దేవతలకు వారివారి పదవులు తిరిగి యొసంగి, నా పథమున కేగెదను" అని పలికెను. అంత పార్వతి "నేడు అనంతకోటి బ్రహ్మాండ నాయకుని కాంచితిని. ఇయ్యది నా పరమ సౌభాగ్యము, మరియు దివ్య తపఃఫలము. ఈ పంచ మహాభూతములు, త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, సూర్య చంద్ర, గ్రహ, నక్షత్రములు, మునిగణము, స్థావర జంగమాత్మక సమస్త పృధివీ, పదునాల్గు లోకములు, సంపూర్ణ సచేతన, అచేతన సృష్టి ఎవరినుండి ఆవిర్భవించినదో ఆ పరాత్పరుడు నా పుత్రునిగ ఉద్భవించుచున్నాడు. ఓ! స్వామీ! ఇక విడంబమేల? మిమ్ము ప్రార్ధించుచున్నాను. ఒక ప్రాకృతిక బాలుని వలె ఇప్పుడే ఆవిర్భవించ వలసినది. మిమ్ము అత్యంత ప్రేమతో లాలించి, పాలించి, మీ సేవ యొనర్చెదను." ఈ విధముగ పార్వతీదేవి పలికినంతనే ఆ మహానుభావుడు ఆరు భుజములతో, పూర్ణిమా సుధాకరుని వంటి సుందరతతో, త్రినేత్రుడై, సుందరమయిన నాసిక, కనుబొమలతో, విశాల వక్షస్థలముతో, చరణకమలములందు ధ్వజ, అంకుశ, పద్మ చిహ్నములతో, కోటి స్పటికముల కాంతితో, స్వర్ణవర్ణ దేహముతో, బాలరూపుడై ఆమె ఎదుట నిలబడెను. ఆ బాలుని చూడగనే పార్వతీదేవి యందు మాతృత్వము పొంగి, ఆ బాలుని తన రెండు బాహువులయందు బంధించి, గాఢాలింగన మొనర్చి, ఉష్ణ జలములతో ఆ బాలునికి స్నానమొనర్చి, పరమ ప్రసన్నతతో ఆ బాలునికి స్థనపాన మొనర్చెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి గుణేశ జననము అను ఎనభైయవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఒకటవ అధ్యాయము

(గుణేశ నామకరణము)

బ్రహ్మ "ఇంతలో తపమాచరించుచున్న శివుని వద్దకేగి రుద్రగణములు పార్వతీపుత్ర జననము గూర్చి నివేదించి "స్వామీ! మీరు మీ పుత్ర దర్శనార్ధము గృహమున కేగవలసినది" అని పలికిరి. శివుడు ప్రసన్నుడై గృహమునకేగి పున్నమిచంద్రుని వంటి ఛాయగలిగిన స్పటికమణి నిభానుడు, మల్లెపూవు వంటి శ్వేతవర్ణుడు, కమలదళ నేత్రుడు, అయిన పరమాద్భుత బాలకుని గాంచి ఇట్లనియె "ఈతడు బాలుడు కాడు. అనాదిసిద్ధుడు, జరాజన్మ రహితుడు, లీలామాత్రముగ అవతారము స్వీకరించువాడు, అఖిల విశ్వాధారుడు, సర్వ పదార్ధ ప్రదాత, పరబ్రహ్మ స్వరూపుడయిన పరమాత్మ ఈతడే!" ఈ విధముగ పలికి ఆ బాలుని తన చేతులలోనికి తీసికొనెను. సర్వాంతర్యామి అయిన శివుడు ఆ బాలుని ప్రేమాలింగనము కావించి, చుంబించి, తన హృదయమునకు హత్తుకొని పార్వతీదేవితో "దేవీ! గుణాతీతుడైన పరమాత్మయే నీకు పుత్రునిగ జన్మించెను" అని పలికెను. తదుపరి శివుడు బ్రాహ్మణులను పిలపించి గణపతి పూజన, మాతృకాన్యాసము, పుణ్యాఃవాచనము, ఆభ్యుదాయిక శ్రాద్ధము, జరిపించి బాలునికి మధు మరియు ఘృతప్రాసన మొనరించెను. అంత భూమికి అభిమంత్రిత మొనర్చి ఆ ఆదిదంపతి గౌతమాది ఋషులకు పూజనమొనర్చి అనేక దానములిచ్చిరి.

అంత మునులు ప్రసన్నచిత్తులై "అనాదిసిద్ధుడైన అఖిలేశ్వరుడు, సర్వలోక నిర్మాత, చరాచర జగత్తుకు గురువు, మీకు పుత్రుడుగా ఉత్పన్నుడయ్యెను. వేద వేదాంతములకు సహితము అగోచరుడయిన మాయావి, సూర్యుడు నడినెత్తిన యుండగా అభిజిత్ లగ్నమందు జన్మించెను. అందువలన ఈతడు తన కీర్తిచంద్రికలను దిగంతముల వరకు వ్యాపింపజేయును. భాద్రపద శుక్ల చతుర్థి తిథి యందు సోమవారము, స్వాతి నక్షత్రము, సింహలగ్నమందు ఉదయకాలమున అయిదు గ్రహములు ఉచ్ఛయందుండగా ఈ బాలకుడుత్పన్నమయిన కారణమున ఈతడు శ్రీమంతుడు, పరాక్రమవంతుడు, అద్భుత కర్మలు చేయువాడు, మహాబలుడు, భక్తులకు సుఖము ప్రసాదించువాడు అగును. ఈ బాలునకు పదకొండవ రోజు నామకరణమొనర్ప వలసినది" అని పలికిరి. శివుడు మునులందరికీ వీడ్కోలు పలికెను.

తదుపరి శేషుడేతెంచి ఆ బాలునికి తన పడగలతో గొడుగుపట్టెను. మేఘములు ఇంచుక వర్షించి ఆ ప్రదేశమును ధూళిరహిత మొనర్చినవి. గంధర్వులు గానము చేయుచూ, అప్సరసలు నాట్యమొనరించిరి. మునులందరూ ఒక మృణ్మయమూర్తిని చేసి, దానిని కదళీతరువులతో చేసిన ఒక సుందరమందిరమందు ప్రతిష్ఠించి, పద్మాసనస్థితులై, ప్రయత్న పూర్వకముగ పరమభక్తితో పూజించి "గుణేశ-గణేశ" మను మంత్రమును నిరంతరము జపించుచూ, అహోరాత్రము ఉపవాసము, జాగరణ కావించిరి. మరుసటి దినము బ్రాహ్మణులకు భోజన సమారాధన కావించి, తాము పారణమొనర్చిరి. ఈ విధముగ పదిరోజులు కావించి, ప్రతిదినము వినాయక ప్రసన్నతకై మహోత్సవము కావించిరి. పదకొండవ రోజు శివభగవానుని గృహమునకు నామకరణమునకై ఏతెంచిరి. వారందరూ శివునిచే సన్మానితులై, ఆ బాలుడు సర్వేశ్వరుడు కావున ఆతనికి "గుణేశుడు" అని నామకరణమొనర్చిరి. అంత పరమేశ్వరుడు ఆ బాలునికి "ఈతడు సర్వ శుభ కార్యారంభము నందునూ పూజనీయుడగును" అని వరమునిచ్చెను. తదుపరి మునులందరూ శివునిచే సత్కరింపబడి తమ గృహములకేగిరి. పార్వతీదేవి సహితము తమ గృహమందు దేవతా పూజనమొనర్చెను. అప్పటినుండియు భాద్రపద శుద్ధ చవితి రోజున గణేశపూజ మహోత్సవములు చేయవలెనన్న ఆచారమేర్పడినది. ఆ దినము శ్రీగణేశుని మృణ్మయమూర్తి (మట్టిబొమ్మ)కు యధావిధిగ పూజనమొనర్చి ఆ రోజు ఉపవాసము, జాగరణ కావించి, మోదకములు, లడ్డూలు, అపూపములు, పాయసాది నైవేద్యములు సమర్పింపవలెను. మరునాడు ఇరువది ఒక్క మంది బ్రాహ్మణులకు భోజనము, దక్షిణ, సమర్పించి, నమస్కారమొనర్చి వారు వెడలిన పిదప భోజనము కావింపవలెను. ఏ వ్యక్తి ఈ రోజున మృణ్మయమూర్తికి పూజ కావింపడో ఆతడు విఘ్నములచే బాధితుడై అనేక రోగములతో పీడితులగును. అటువంటి మనుజుని దర్శనము సహితము పాపము. గణేశచతుర్థి మహిమను వర్ణించుట నా తరము కాదు. నా శక్తి మేరకు తెలిపితిని.

దైత్యరాజు సింధుని గుప్తచరులు అచట సహితము యుండిరి. ఈ కార్యక్రమానంతరము వారు నేరుగా తమ రాజు వద్దకేగిరి. ఆ సమయమున సింధు గంధర్వుల గానము వినుచూ, అప్సరసల నాట్యము వీక్షించుచుండెను. వారచటకేగి త్రిసంధ్య క్షేత్రమందు ఎనుబదివేలమంది మునులు యందుట, అచటికి శివుడు చేరుట, పార్వతీ తపము, గుణేశ జననము, గుణేశుడు తాను సింధు దైత్యుని పరిమార్చెదనని తెలుపుట, మొదలగు వార్తలన్నియు ఆయనకు తెలిపిరి. "రాజా! మేము ఆ బాలుని హతమార్చవలెనని తలచితిమి. కానీ అచట ఏడు కోట్ల రుద్రగణములు, మహాబలులు యుండిరి. ఒకవేళ మేము పట్టుబడి హతమార్చబడినచో, ఈ విషయమును మీకు ఎరింగించు వారుండరు. అందువలన తదుపరి కార్య నిర్ణయము మీరు కావింపవలసినది" అని మౌనము వహించిరి. ఇంతలో ఆకాశవాణి "ఓరీ! సింధూ! నిన్ను వధించు మహాత్ముడు ఆవిర్భవించెను. నీవు సావధానుడవై యుండుము" అని పలకెను. అంత సింధు అపరిమితమైన ఆగ్రహము నొంది "చంపు, నరకు" అని కేకలు పెట్టెను. అచటయున్న దైత్యులందరూ దశ దిశలకు పలాయనమొనర్చిరి. అంత సింధు దైత్యుడు చింతామగ్నుడై, మ్లానముఖుడై, నిరుత్సాహుడై, హతప్రభుడై, మూర్ఛనొంది నేలపై బడెను. ఒక మూహూర్త కాలము గడచిన పిదప చేతన నొంది, కంపించుచూ, "త్రిలోకములకు నేను కంటక ప్రాయుడను. ఇపుడు

నాకు కంటకప్రాయుడేతెంచెను. ఒక మశకము ఏనుగును ఎట్లు హతమార్చెను? నేను ఒక్క క్షణములో ముప్పది మూడు కోట్ల దేవతలను పరాజితులొనర్చితిని. ఇటువంటి అసహాయ శూరుడనైన నన్ను ఎవరు సంహరింపగలరు? ఈ ఆకాశవాణి ఒక మిధ్య. ఒకవేళ అది సత్యమయిన నేనవశ్యము నా శత్రువులను గ్రసించెదను." ఈ విధముగ తనను తాను సంభాళించుకొని తిరిగి తన సింహాసనమందు ఆశీనుడయ్యెను. ఈ సమాచారము విని రాక్షసవీరులేతెంచిరి. వారందరూ "రాజా! ఏమి ఈ బేలతనము? మీరు మృత్యువుకు సహితము మృత్యు స్వరూపము. మీకు మృత్యువెట్లు సంభవించును? ఒకవేళ మిమ్ము సంహరించువాడు త్రిలోకముల యందు ఎచటయున్ననూ వానిని మేము హతమార్చెదము" అని ధైర్యము నూరిపోసిరి. అంత సింధు ధైర్యము బూని "మీ వంటి మిత్ర, సాన్నిహిత, సేవకుల వచనామృతముచే నేను మిక్కిలి ప్రసన్నుడనైతిని. మీరందరూ నా శత్రువున్నచోటికి శీఘ్రముగ ఏగి, అనేక మాయలు పన్ని వానిని వధింపవలసినది" అని పలికెను. అంత అసంఖ్యాక దైత్యులు గుప్త రూపముతో త్రిసంధ్య క్షేత్రమునకేగి, పార్వతీ పుత్రుని హతమార్చుటకై అచట నివాస మేర్పరుచుకొనిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గుణేశ నామకరణమను ఎనభై ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఎనభై రెండవ అధ్యాయము

(గృధ్రాసుర భంజనము)

బ్రహ్మ "గుణేశుడు శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమాను డగుచుండెను. గౌరీదేవి పుత్రుని పొందినదని వినిన హిమాలయుడు బహుమూల్య వస్త్రాభరణములను తీసికొనివచ్చెను. తన తండ్రిని చూడగనే పార్వతీదేవి పరుగెత్తి ఆయనను ఆలింగన మొనర్చెను. చాలాకాలము తరువాత వారిరువురు ఒకరినొకరు చూచుటచే వారి కన్నులనుండి అశ్రువులు జారినవి. అంత పార్వతీదేవి "తండ్రీ! ఇంత నిష్ఠురత ఏల? మీరు నా కుశల సమాచారము అడుగుట కానీ, మీ కుశల సమాచారము తెలుపుటకానీ లేదు." హిమాలయుడు "పుత్రీ! నీవు చెప్పినది నిజమే! కానీ నా ప్రాణములు నిన్ను కలసి, వీక్షించుటకు ఎల్లప్పుడూ ఉవ్విళ్ళూరుచున్నవి. ఓ! శివప్రియా! అందువలననే నేడు ఇచటి కేతెంచితిని. గోవు తన మనస్సును దూడ యందు ఎట్లుంచునో, అట్లే నేనునూ ప్రతిక్షణము నిన్ను స్మరించుచున్నాను." అంత పార్వతి ఆయనను ఒక సుందరమైన ఆసనము నందు ఆశీనుని కావించెను. అంత హిమాలయుడు "పుత్రీ! నేను నీకొక అద్భుతమైన బాలుడు ఉదయించెనని నారదుని ద్వారా తెలిసికొంటిని. సర్వ విఘ్నహర్త అయిన ఆ బాలుని చూచుటకు నేను అత్యంత ఉత్సుకతతో యున్నాను." అంత పార్వతి ఆ బాలుని తీసికొని వచ్చి తన తండ్రి ఒడిలో కూర్చుండబెట్టెను. హిమాలయుడు ఆ బాలుని ఆభూషణములతో అలంకరించి ఆతని మహిమను ఇట్లు తెలిపెను.

"పుత్రీ! చంద్రుడు తన కిరణములతో పృధివిని శీతల మొనర్చునట్లు ఈ బాలుడు ధరిత్రిని నిష్కంటక మొనర్చును. ఈతడు దేవగణములను తిరిగి తమ తమ స్థానములందు నెలకొల్పును. మునులు ఈ బాలుని చరణసేవ చేయుదురు; కానీ ఈ బాలుడు నీ చరణసేవ యొనరించును. స్థావర జంగమాది సమస్త జీవకోట్లు ఈతని ప్రతిరూపములే! బ్రహ్మాది దేవతలు సదా ఈతనినే ధ్యానించుచుందురు. సహస్ర బాహూదర వక్త్ర నేత్రుడైన ఈ బాలుడు సర్వకారణకారణుడు. త్రిలోకములయందు ఏరిచూసిననూ ఇటువంటి బాలకుని వేరొకని కనలేము. జలములందు కలసిన జలము తదనురూప మగునట్లు, నేను ఈ బాలుని చరణకమలములు కాంచి తన్మయుడ నగుచున్నాను. ఈతని పాలన, పోషణ, రక్షణ

ప్రయత్నపూర్వకముగ కావింపవలసినది. ఈతడు మనందరి పురాతన నిధి." అంత పర్వతరాజు సర్వాభరణ భూషితుడైన తన మనుమని గాంచి, భక్తులకు అభయదానమొనర్చువాడు, మహా విఘ్నములను దూరమొనర్చువాడు కావున ఆ బాలకునికి "హేరంబ" అను సుందర నామమిడెను. తదనంతరము హిమవంతుడు హైమవతి ఇంట భోజన మారగించి, ఆమె ఆనుజ్ఞచే తిరిగి తన గృహమున కేగెను.

కొన్నినాళ్ళు గడచిన పిదప బాలకుడు గృహమందు క్రీడలు సలుపుచుండెను. అచటకు "గృధ్రాసురుడు" అను రాక్షసుడు ఒక గొప్ప గ్రద్ద రూపము ధరించి ఏతెంచెను. ఆతని రెక్కల నుండి వెలువడు వాయువు యొక్క వేగమునకు పర్వత సమూహములు కదలుచుండెను. ఆతని గోళ్ళు తాకిడికి పర్వత శిఖరములు నుగ్గునుగ్గు అగుచుండెను. ఆతడు నెమ్మదిగ ఆకాశమున ఎగురుచూ బాలుని వీక్షించుచుండెను. ఆ రెక్కల తాకిడికి ధూళిరేగి సర్వుల కన్నులు కప్పెను. రెక్కల తాకిడికి జనించెడి శబ్దముచే లోకులు బధిరులగు చుండిరి. అకస్మాత్తుగా ఆ గ్రద్ద క్రిందికి దిగి, ఆ బాలుని ముక్కున కరుచుకొని ఆకాశమునకు ఎగిరెను. బాలుని పరాక్రమము నెరుగక ఆ విహంగము ఆకాశమున ఎగురుచుండెను. ఇంతలో పార్వతీదేవి ఏతెంచి తన బాలుని కానక శోకతప్తయై ఇట్లు శోకించెను "నా బాలుని తస్కరించిన దుష్టుడెవరు?" అనుచూ ఆకాశమున గ్రద్ద చుంచువులందు చిక్కుకొనిన తన పుత్రుని గాంచి కొంత తడవు మూర్ఛనొందెను. తిరిగి లేచి "శివా! ప్రభూ! ఈ పుత్రుడు లేనిదే నా ప్రాణము నిలబడదు. నాపై ఈ పిడుగు ఎట్లు పడినది? జగదీశ్వరుడయిన శివుడు నాయందు అయిష్టుడగుటకు కారణమేమి? నేను పన్నెండేండ్లు నిరాహారియై తపించితిని. తత్కారణమున స్వయంప్రకాశుడైన శ్రీగణేశుడు మా ఇంట ఆవిర్భవించెను. నా వంటి అభాగిని యుండదు. నా పూర్వ పాప సమూహముల కారణమున నా నిధి కొనిపోబడినది". ఇంతలో ఆమె చెలులు సహితము తొలుత రోదించి తదుపరి తర్క పూర్ణ యుక్త వచనములు ఈ విధముగ పలికిరి "దేవీ! మీరు ఆద్యంతరహితుడైన మీ బాలుని పట్ల శోకింపవలదు. ఆతడు మీరు కావించిన అద్వితీయ తప:ఫలితముగ ఆవిర్భవించిన స్వయంప్రకాశుడు. లేని ఎడల ఎక్కడైననూ మృణ్మయమూర్తి నుండి చేతనాయుక్త పురుషుడుదయించునా? మీరు స్థిరముగ యుండవలసినది. క్షణములో అంతకాంతకుడయిన ఆ బాలుడు తిరిగి కుశలముగ ఏతెంచును." ఈ విధమయిన పలుకులు విని పార్వతీదేవి ధైర్యము బూని స్వాంతన నొందెను. ఇంతలో బాలుడు ఆ గ్రద్ద యొక్క చంచువులు పట్టి మూసెను. అంత గ్రద్ద ఊపిరి అందక వజ్రాయుధపు దెబ్బతిన పర్వతము వలె బాలుని సహితముగ ధరిత్రిపై బడెను. ఆ గ్రద్ద దశయోజనములు పొడవు యుండి వృక్షముల నన్నింటినీ నాశమొనర్చెను. అంత పై నుండి పడిననూ బాలునికి ఏమియునూ కాకుండెను.

అంత పార్వతి శీఘ్రమే అచటికేతెంచి, బాలుని కౌగలించి పరమానందభరిత అయ్యెను. తదుపరి బ్రాహ్మణులను పిలచి దానము లొసగి ఇకపై అరిష్టములు రాకుండగ పూజ లొనరించెను. అయినప్పటికీ ఆమె మనసున అచ్చెరువునొందినది. బాలుడు శిశువు కదా! ఈ గ్రద్ద పది యోజనముల నిడివి గల పక్షి. అయిననూ ఈ బాలుడు ఆ దుష్ట విహంగమును సంహరించెను. ఈ బాలుడు సామాన్యుడు కాడు. అగ్నికణము చిన్నదయినప్పటికీ గొప్ప కాష్టమును దహించునటుల, బాలుడు కనిష్టుడయినప్పటికీ, విశాల కాయుడైన అసురుని అంతమొందించెను. అంత శివుడు గణముల ద్వారా ఆ పక్షి శరీరమును ఖండించి దూరమగ పారవేయించెను. ఏ మానవులు ఈ ఆఖ్యానమును వినెదరో వారికి అసుర పీడలుండవు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గృధ్రాసుర భంజనము అను ఎనుబది రెండవ అధ్యాయము సమాప్తము)

ఎనుబది మూడవ అధ్యాయము

(క్షేమ, కుశల భంజనము)

బ్రహ్మ "రెండవ మాసమందు ఒకనాటి సాయంకాలము పార్వతీదేవి బాలుని తన ఒడిలో లాలించుచుండెను. అంత "క్షేమ", "కుశల" అను ఇరువురు దైత్యులు, సింధుని అనుయాయులు బాలగణేశుని హతమార్చుటకు ఎలుకల రూపము ధరించి ఏతెంచిరి. భయంకరమైన గోళ్ళు, దంతములు కల ఆ ఇరువురు పర్యంకము వద్ద చేరి సమయము కొరకు నిరీక్షించు చుండిరి. ఆ భయంకర జంతువులు రెండునూ తమ ఛీత్కార శబ్దముతో, తమ పద ఘట్టనములతో భూమిని అదిరింపజేయుచూ బాలుని సమీపింపసాగెను. అంత పార్వతి ఒక ఒక దండముతో వానిని అదిలించెను. అంత ఆ ఎలుకలు రెండూ భవనపు పైకి ప్రాకి, అచట రెండునూ ద్వంద్వ యుద్ధమొనర్చినట్లు నటించి బాలునిపై బడినవి. అంత బాలుడు ఉలిక్కిపడిలేచి ఏడ్చుచూ, బాలోచితముగ చేతులు కదుపుచూ ఆ ఎలుకలను ప్రహరించెను. అవి రెండూ రక్తము గ్రక్కుచూ క్రిందపడినవి. అంత శివగణము లేతెంచి వాటిని బయటకు ఈడ్చిరి. అవి రెండు దశయోజనములు శరీరములు గల దజునుల వలె మారి మరణించిరి. గణేశుని చేతిలో మరణించుటచే అవి మోక్షము నొందినవి. ఆ దనుజుల శరీరములు క్రిందపడుటచే అనేక వృక్షములు, ఆశ్రమము ధ్వంసమయినవి. అంత పార్వతి రోదించుచున్న బాలుని దగ్గరకు తీసికొని స్థనపానమిచ్చినది. తదుపరి అనింద్యలైన మునిపత్నులేతెంచి "ఓ! పార్వతీ! నీవు మహాపుణ్యమాచరించితివి. రెండునెలల బాలుడు ఈ మహాదైత్యులనెట్లు సంహరించెను? త్రిలోకములందు ఇటువంటి బాలుడు యుండనోపడు. నీవు ఈ బాలుని ప్రయత్న పూర్వకముగ రక్షింపవలసినది. రాక్షసులు గుప్తరూపులై ఏతెంచి ఈ బాలుని తస్కరింపవచ్చును" అని పలికి వారు వెడలిరి. ఇంతలో గణములేతెంచి హాస పూర్వకముగ "మాతా! నీ పుత్రుడు ప్రతిదినము ఒక రక్కసుని పరిమార్చుచుండెను. మేము ఆ రక్కసులను బయటకు ఈడ్చుట యందే నిమగ్నమై యుంటిమి" అని పలికిరి. అంత మునులు ఏతెంచి "తాము రాక్షసపీడ లేకుండా మంత్రముతో రక్ష కట్టెదమని మంత్రపఠనము కావించిరి. పార్వతీదేవి వారికి అనేక బహుమానము లొసంగెను.

తదుపరి మాసమున ఒకనాటి మధ్యాహ్న కాలమున సర్వులు తమతమ కార్యములందు నిమగ్నమైరి. పార్వతి బాలుని ప్రక్కలో పెట్టుకొని పర్యంకముపై నిద్రింపసాగెను. కొందరు పరిచారికలు గృహకార్యములందు సంలగ్నులై యుండగా, కొంతమంది నిద్రించిరి; మరికొందరు వార్తాలాపము లాడుచుండిరి. ఆ సమయమున "క్రూరుడు" అను రాక్షసుడు ఒక మార్జాల రూపము ధరించి పార్వతీ గృహమందు ప్రవేశించెను. ఆ మాయావి అందరి కళ్ళు కప్పి, పర్యంకము వద్దకేగి పార్వతి నిద్రించుట కాంచి, ముదమునొంది, ఆ బాలుని నోట కరచి చివాలున మంచము పై నుండి క్రిందికి దూకెను. అంత బాలుడు రోదించుట మొదలిడెను. పార్వతి ఒక్క ఉదుటున లేచి, బాలుని బిడాలముఖమందు కాంచి భయ తత్పరయై మూర్ఛిల్లెను. ఆ పిల్లి బాలుని కంఠమందు పళ్ళు బిగించుటచే ఆ బాలుడు పిల్లి రెండు చెవులు పట్టి యుండెను. పిల్లి నడచుచుండుటచే స్వాభావికముగ బాలుని పాదములు కదలి ఆ బిడాలము యొక్క ముఖమును తాకెను. ఆ ప్రహారమునకు బిడాలము బాలుని వదలి, హృదయము విదీర్ణమై, పరుగెత్తుచూ భవనము బయటకేతెంచి సుడిగాలి యందు విరిగిపడిన మహావృక్షము వలె క్రిందపడి మరణించెను. వాని దుర్గంధపూరిత రుధిరము అన్నివైపులా చిమ్మెను. బాలగణేశుని రోదనము విని పార్వతి, పరిచారికలు ఏతెంచిరి. పార్వతి ఆ బాలుని అక్కునజేర్చి, సముదాయించి స్థనపానమిచ్చెను. చెలికత్తెలు ఆ బాలుని శరీరమంతయు తడిమి సర్వాంగములు ఎట్లున్నవో చూచిరి. వారికి బాలుని యొక్క అజరామరత్వము నందు అపార విశ్వాసము కలదు. ఇంతలో శివగణములేతెంచి ఆ బిడాలము నడుము పట్టి

బయటకు లాగిరి. అయ్యది పన్నెండు యోజనముల నిడివి గల దనుజునివలె మారెను. గణములు ఈ విశాలకాయుని బాలుడెట్లు మర్దించెను? అని ఆశ్చర్య జనితులై ఆ దనుజుని శరీరమును ఖండించి దూరముగ విసిరిరి.

తదనంతరము కాలము దొర్లుచూ ఉత్తరాయణ పుణ్యకాల మేతెంచినది. కొందరు మునిపత్నులు తమ బాలురను, పుణ్య ద్రవ్యములు తీసికొని పార్వతీదేవి గృహమున కేతెంచిరి. పార్వతి బాలగణపతిని నేలపై పరుండబెట్టి, ఏతెంచిన ముని పత్నులతో సంభాషించుచుండెను. బాలురందరూ బాలోచిత క్రీడలాడుచుండిరి. అంత మునిపత్నులు "ఓ! పార్వతీ! శివ సాన్నిధ్యముచే నీకుద్భవించిన ఈ బాలకుడు అమిత తేజస్వి. నీ బాలుని సంసర్గముచే ఈ ముని బాలకులందరూ శోభించుచున్నారు. పరుసవేది స్పర్శచే ఇనుము సహితము బంగారమగును కదా?" అని పలుకుచు పరస్పరము పసుపు, కుంకుమ పటిక బెల్లము, చందనము, తిలలు, బెల్లము, తాళపత్రములు ఇచ్చి పుచ్చుకొనిరి. కొందరు స్త్రీలు తమ ముఖమునకు పసుపు రాసుకొనుచుండిరి. ఈ అంతరాళమున "బాలాసురుడు" అను మహాదైత్యుడు అచటికేతెంచి, ఒక ముని బాలకుని వలె మారి, ఆ బాలురతో ఆట మొదలిడెను. దైత్యుడు తొలుత ఇతర బాలకులతో ఆడి నెమ్మదిగ గణేశుని చేరి యుద్ధక్రీడ మొదలుపెట్టెను. వారిరువురు మత్తేభ, పంచాస్యములవలె పోరాడుట మొదలిడిరి. కొంత సమయమునకు క్రీడ మాయమై నిజముగ యుద్ధమొనర్చుట మొదలిడిరి. ఆ దుష్ట దైత్యుడు తన పాదములతో బాల గణేశుని శిరమును బలముగ తన్ని, ఆతని కేశములు పట్టి ఈడ్చుట మొదలిడెను. గుణేశుడు సహితము అదే విధముగ స్పందించగా, ఆ మిధ్యాబాలుడు రాత్రివేళల ఊళవేయు వృద్ధక్రోష్ఠము (ముసలి నక్క) వలె శబ్దము చేయుట మొదలిడెను. అంత మునిపత్నులు అది గమనించి "ఈ బాలుడెవరు? ఎన్నడూ చూడలేదే!" అని తర్కించుట మొదలిడిరి. పార్వతీదేవి ఇవి బాలురకు సహజమని కదలకుండెను. ఆ బాలురిరువురు నేలపై పొర్లుచూ ఒకరి కేశములు మరొకరు వడిసి పట్టుకొనుచుండిరి. కానీ గణేశునకు వచ్చినది బాలాసురుడని తెలియును. అంత బాలవినాయకుడు ఆ మిధ్యా మునిబాలకుని కంఠమును పట్టి బలముగ నొక్కుట ప్రారంభించెను. అంత మునిబాలుడు ఆ పట్టు విడిపించుకొనలేక విహ్వాలుడగుచుండెను. అంత మునిపత్నులు నిశ్చయముగ గణేశుడు ఆ మునిబాలుని హతమార్చునని నిశ్చయించి వారిరువురినీ విడదీయుటకు యత్నించిరి. వారు విఫలులై, పార్వతీదేవి వద్దకు పరుగులెత్తి "వినాయకుడు ముని బాలకుని సంహరించుచున్నాడు. అట్లు జరిగిన ఎడల ఆతడు ముని శాపమునకు గురియై అధోగతి నొందును. నీవు శీఘ్రమే ఏతెంచి, ఆ బాలుని విడిపింప వలసినది" అని పలికిరి. పార్వతి వెంటనే ఏతెంచి ఆ ముని బాలకుని విడువమని, లేని ఎడల ముని శాపముచే నీ మహాశక్తి అంతరించుననీ తెలిపినది. వినాయకుడు ఏమియును వినక తనపని తాను కొనసాగించెను. దనుజుని ప్రాణములు ఒక్క క్షణములో నేత్రముల గుండా బయటకు వచ్చెను.

అంత మునిబాలుడు దశ యోజనములు నిడివి గల మహాదైత్యునిగ మారెను. ముని పత్నులు తమ పిల్లలను తీసికొని తోడేళ్ళ గుంపు చూచి పరుగులిడు గోవులవలె పలాయనులైరి. పార్వతి తన పుత్రుని లేవనెత్తి, ధూళి అంతయు దులిపి, స్థనపానమిచ్చెను. తదుపరి బ్రాహ్మణులను పిలచి, దానములు ఇచ్చి, ఆశీర్వాదములు పొందెను. గణములు ఆ దైత్యుని ఖండించి దూరముగ విసరివైచిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి క్షేమ, కుశల భంజనమను ఎనుబది మూడవ అధ్యాయము సమాప్తము)

ఎనభై నాల్గవ అధ్యాయము

(శ్రీగణేశ కవచము)

బ్రహ్మ, "గుణేశునకు అయిదవ నెల ఏతెంచెను. అంత మునుల ద్వారా ఈ విషయమును వినిన మరీచి మహర్షి వారి కడకేతెంచెను. ఈ మహాత్ముడు త్రికాల ద్రష్ట. ఈయనకు స్వపరభేదము లేదు. ఆయనను చూడగనే పార్వతి నతమస్తకయై, సాష్టాంగ దండ ప్రణామము లాచరించి, ఆసనమిడి, ఆయనకు పాద ప్రక్షాళన మొనర్చెను. తదుపరి ఆ జలములను తన శిరముపై ప్రోక్షణ మొనర్చెను. అంత ముని "దేవీ! నేను నిరంతరము మనస్సును ఆత్మయందు లయమొనర్చి ధ్యానమగ్నుడనై యుందును. అకస్మాత్తుగా నా ధ్యానమందు నీ పుత్ర దర్శనము అయ్యెను. అందువలన ఆ బాలుని, మరియు మీ పార్వతీ పరమేశ్వర దంపతి దర్శనార్థము నేనేతెంచితిని. ఒక్కమారు నీ పుత్ర దర్శనము కావింపవలసినది." అంత పార్వతి ఆనంద పరవశయై తన పుత్రుని ఆయన ఒడిలో యుంచెను. అంత ఋషి "పార్వతీ! నీ ఈ బాలుడు నాకు పరబ్రహ్మ స్వరూపుడై కానబడుచున్నాడు. ఋషులు యోగమార్గమందు వాయుభక్షణ చేయుచూ షట్చక్ర భేదనమొనర్చి, ఏ పరబ్రహ్మను ఉపాసింతురో, ఆ పరమాత్ముడే పుత్రరూపమున నీకు ఉత్పన్నమయ్యెను. త్రిగుణముల భేదముచే త్రిమూర్తులను సృష్టించిన పరబ్రహ్మమితడే! ఈయన బలము చేతనే శేషుడు భూమిని భరించుచుండెను. ఈతడు అణువు కంటె అణువు. స్థూలము కంటె స్థూలము. ఇరువదిఏడు తత్వముల కర్త ఈతడే! చేతనాచేతన విశ్వమితని రూపమే! ఓ! గౌరీ! నీవు సర్వదా ఈ బాలుని దైత్యుల నుండి రక్షింపవలెను" అని పలికెను. అంత పార్వతి "ఓ! మునిశ్రేష్ఠా! ఇచటకు నానావిధములైన దుష్ట దైత్యులేతెంచుచున్నారు. వారు సాధువుల, దేవతల పట్ల ద్రోహులు. అందువలన మీరే ఏదేని తాయత్తు ఈ బాలునికి కట్టవలసినది."

అంత ముని "మానవులకు సర్వదా రక్ష నొనరించు శ్రీగణేశ కవచమును నీకు తెల్పెదను. కృతయుగమందు సింహారూఢుడు, దశభుజుడైన వినాయకుని, త్రేతాయుగమందు మయూర వాహనుడు, షట్భుజుడు అయిన సిద్ధదాతను, ద్వాపరమందు చతుర్భుజుడు రక్తవర్ణుడయిన గజాననుని, కలియుగమందు ద్విభుజుడు, శ్వేతవర్ణుడు, సర్వార్థ ప్రదాత అయిన ధూమ్రకేతును ధ్యానింపలెను.

కవచము: పరాత్పర పరమాత్మ వినాయకుడు నా శిఖను రక్షించుగాక. అతిసుందర దేహుడయిన మహోత్కటుడు నా మస్తకమును, కాశ్యపుడు నా లలాటమును, రక్షించుగాక. మహోదరుడు నా రెండు కనుబొమలను, ఫాలచంద్రుడు నా కన్నులను, గజాననుడు నా రెండు పెదవులను, గుణక్రీడుడు నా జిహ్వను, గిరిజాసుతుడు నా చిబుకమును, వినాయకుడు నా వాణినీ, దుర్ముఖుడు నా దంతములను రక్షించుగాక. పాశపాణి నా చెవులను, చింతితార్థప్రదుడు నా నాసికను, గణేశుడు నా ముఖమును, గణాజ్యయుడు నా కంఠమును, గజస్కంధుడు నా భుజములను, విఘ్ననాశకుడు నా స్థనములను, గణనాధుడు నా హృదయమును, హేరంబుడు నా ఉదరమును, ధరాధరుడు నా పార్శ్వమును రక్షించుగాక! వీపును విఘ్నహర్త, లింగ, గుహ్యములను వక్రతుండుడు, మోకాళ్ళను గుణక్రీడుడు, తొడలను మంగళమూర్తి, బుద్ధిమంతుడయిన ఏకదంతుడు నా కాళ్ళను, పాదములను, క్షిప్రప్రసాదుడు నా బాహువులను, ఆశాపూరకుడు నా చేతులను, పద్మహస్తుడు నా కాళ్ళను, పాదములను, శత్రుహంత నా అంగుళులను, గోళ్ళను, విశ్వవ్యాపి అయిన మయూరేశుడు, సర్వాంగములను, ఎల్లప్పుడూ రక్షించుగాక! శరీరమందు ఏ స్థానమునైననూ తెలుపని ఎడల అద్దానిని ధూమ్రకేతుడు రక్షించుగాక! నా ముందువైపు ఆమోదుడు, వెనుక ప్రమోదుడు, తూర్పున బుద్ధి యొక్క స్వామి, ఆగ్నేయమున సిద్ధిదాత, దక్షిణమున ఉమా పుత్రుడు, నైఋతిన గణేశ్వరుడు, పశ్చిమమున విఘ్నహర్త, వాయువ్యమున గజకర్ణుడు, ఉ

త్తరమున నిధిపతి, ఈశాన్యమున ఈశపుత్రుడు నన్ను రక్షించుగాక! దినమందు ఏకదంతుడు, రాత్రి మరియు ద్విసంధ్యల యందు విఘ్నహర్త, రాక్షసాసుర, భేతాళ గ్రహ, భూత పిశాచముల నుండి పాశాంకుశధారి నన్ను రక్షించుగాక. త్రిగుణములు, స్మృతి, జ్ఞాన ధర్మ, లక్ష్మీ, లజ్జ, కీర్తి, దయ, కుల, శరీర, ధన, ధాన్య, గృహ, పత్నీ, పుత్ర, మిత్రుల రక్ష సర్వాయుధధారుడైన శ్రీగణేశుడు కావించుగాక! పౌత్రులను మయూరేశుడు; మేకలు, గోవులు, అశ్వములను కపిలుడు రక్షించుగాక!

బుద్ధిమంతుడయిన మానవుడు ఈ కవచమును ఒక భోజపత్రమందు లిఖించి అద్దానిని కంఠమందు ధరించిన ఎడల వానికి యక్ష, రాక్షస, పిశాచముల భయముండదు. ఏ మానవుడు త్రిసంధ్యల యందునూ ఈ కవచమును పఠించునో ఆతడు వజ్రదేహుడై, శక్తివంతమయిన శరీరము కలవాడగును. యాత్రాకాలమందు పఠించిన నిర్విఘ్నయాత్ర, యుద్ధకాలమందు పఠించిన నిశ్చయముగ విజయము, కలుగును. మారణ, మోహన, ఉచ్చాటన, స్థంభన, ఆకర్షణ, కావలెనన్న ఇరువది ఒక్క దినములు ప్రతిదినము ఏడుమార్లు కావించిన సాధకుడు తత్ఫలితముగ పొందును. ఏ మానవుడు ప్రతిదినము ఇరువది ఒక్క మార్లు చొప్పున ఇరువది ఒక్క దినములు పఠించిన ఎడల, కారాగారము నుండి, మృత్యుదండనము నుండి ముక్తుడగును. రాజ దర్శన సమయమున ఈ కవచమును మూడుమార్లు పఠించిన ఎడల రాజు, వాని అమాత్యులు, వశమగుదురు. సభ మొత్తము గెలువబడును. ఈ శ్రీగణేశ కవచమును ముద్గలుడు కశ్యపునకు, కశ్యపుడు మాండవ్యునకు, మాండవ్యుడు సర్వసిద్ధికరమైన ఈ కవచమును నాకు ఉపదేశించెను. ఈ కవచమును భక్తిహీనులకు, ఉపదేశింపరాదు. కేవలము భక్తిగల శ్రద్ధాళువులకు మాత్రమే ఉపదేశింపవలెను. ఈ కవచము సర్వ రక్షాకరమై, సర్వ మనోకామనలను పూర్ణమొనరించును. ఈ కవచముతో పాటు ఈ బాలునికి రక్ష కట్టినచో రాక్షసాసుర, భేతాళ, దైత్య, దానవులచే ఏ బాధ యుండదు. ఈ కవచమును ధరించుటచే, పఠించుటచే సర్వారిష్టములు నష్టమగును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శ్రీగణేశ కవచమను ఎనుబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఐదవ అధ్యాయము

(వ్యోమాసుర సంహారము)

బ్రహ్మ "మరీచి మహర్షి నుండి బిడ్డను తీసికొని పార్వతీదేవి లోనికి ఏగినది. మరీచి మహర్షి శివునికి నమస్కరించి, పార్వతీ పరమేశ్వరుల అనుజ్ఞ తీసికొని తన ఆశ్రమమునకు చనెను. ఒకనాడు పార్వతి గౌతమాది ఋషులను ఆహ్వానించి, ఆశీనుల కావించి, వారి చరణములకు ప్రణామము లర్పించెను. అదే సమయమున దేవ గణములు, ముని గణములు, గంధర్వులు, అప్సరాంగనలు ఏతెంచిరి. అంత పార్వతి వారందరినీ "నా కుమారుని భూమి ప్రవేశము (కూర్చుండ బెట్టుటకు) సరి అయిన ముహూర్తము నిర్ణయింప వలసినది" అని అర్థించెను. అంత మునులు "తల్లీ! నేడు గురువారము, త్రయోదశి, రేవతీ నక్షత్రము. ఈనాడే ఈ బాలుని భూమి ప్రవేశ కర్మమాచరింప వలెను" అని పలికిరి. వెంటనే గృత్సమదుడు అచటి కొంత భూమిని శుభ్రపరిచి, దానిపై నానా విధములైన రత్నములను పోసి, దాని చుట్టూ, రత్నఖచిత మండపమును నిర్మించెను. అంత గణేశ పూజనము, పుణ్యః వాచనము కావించి, బాలుని దివ్య వస్త్ర ధారణము, దివ్యాభరణ భూషితుని కావించి, ఆ మందిరమందు బాలుని కూర్చుండబెట్టి, సువాసినీ స్త్రీలచే నీరాజన మిప్పించెను. ఆ సమయమున దివ్య దుందుభులు మ్రోగి, సర్వులు భక్తి తత్పరులై, పార్వతీ పరమేశ్వరులకు, వినాయకునకు, బహుమతులు ప్రదానము కావించిరి. పార్వతీదేవి సువర్ణ, వస్త్రాదులతో బ్రాహ్మణులను పూజించెను. వారందరూ బాలుని ఆశీర్వదించి, అక్షింతలు వైచిరి. పార్వతీదేవి ముని పత్నులను, ముని కన్యలను పూజించెను. వారందరూ "పార్వతీ! నీ అంతటి

ధన్యురాలు ఈ లోకమున యుండదు. ఈ బాలుని వంటి సర్వ శుభలక్షణలక్షితుడు వేరెవరికీ పుత్రుడుగా జన్మింపడు.

ఈ విధముగ వారందరూ వార్తాలాపము లాడుచుండగా "వ్యోమాసురుడు" అను మహాబలి, దుష్ట రాక్షసుడు, మహా మాయావి అచటి కేతెంచెను. అంతటి బలశాలి త్రిలోకములయందు ఉండడు అనిన అతిశయోక్తి కాదు. పార్వతీ గృహ ప్రాంగణమునందు ఒక మామిడి చెట్టు కలదు. అయ్యది అనేక వృక్షశాఖలతో విస్తరిల్లి వందలాది ఏనుగులను, కల్పాంపమందలి ప్రళయ వాయువును సహితము ధిక్కరించునటుల యుండెను. వ్యామాసురుడు తన మాయాబలముతో ఆ వృక్షమందు చేరి, తన బలముచే ఆ వృక్షమును సుడిగాలి పడినటుల కదిరించుట నారంభించెను. మునులు, గణములు, పడతులందరూ ఆ భయంకర ధ్వనికి నలుప్రక్కలా పరుగులిడిరి. పార్వతీదేవి సహితము ఆ గడబిడ యందు బాలుని వదలి దూరముగ పరుగెత్తెను. ఫెళఫెళా రావములు కావించుచూ ఆ మహావృక్షము మందిరమందు కూర్చొనిన వినాయకునిపై బడెను. తనపై పడుచున్న వృక్షమును వినాయకుడు తన చేతితో చరచెను. అంత వృక్షము వందలాది ముక్కలయ్యెను. ఆ వృక్షము యొక్క శాఖా పల్లవములు ఆకాశమున కెగసి క్రింద పడుటచే ఋషుల ఆశ్రమములు ధ్వంసమయినవి. కొన్ని పల్లవములు పరుగులిడు జనులపై పడినవి. వ్యోమాసురుడు రక్తము కక్కుచూ క్రిందపడెను. ఆతని శరీరము వందలాది ముక్కలయ్యెను. పలాయనులైన సర్వులు తిరిగి గృహ ప్రాంగణమున కేతెంచి మేరు పర్వతము వలె నిశ్చలుడై యున్న బాలుని చూచి "ఐదు నెలల బాలుడు ఈ మహావృక్ష ప్రహారమును సహించి, ఈ మహాసురుని ఎట్లు సంహరించెను?" అని పలికిరి. పార్వతి తన బాలుని హృదయమునకు హత్తుకొని, స్థనపాన మిచ్చెను. ఎవరిని ఈశ్వరుడు రక్షించునో, వానిని బాధించువాడు అగ్నికి ఆహుతి అగు శలభము వలె మడసిపోవును. ముని గణములు తమ గృహముల కరిగిరి. పార్వతీదేవి శివ గణములకు చక్కెరాది తీపి తినుబండారములను ఒసంగెను. ఏ మానవుడు భక్తితో ఈ ఆఖ్యానమును వినునో ఆతడు/ఆమె జీవనము నందు బాధనొందక సర్వత్ర నిర్భయుడై యుండును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వ్యోమాసుర సంహారమును ఎనభై అయిదవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఆరవ అధ్యాయము

(శతమహిష, కమఠాసుర సంహారము)

బ్రహ్మ "ఈ వ్యోమాసురునికి ఒక సోదరి కలదు. "శతమహిష" ఆమె నామధేయము. ఆకలి గొనిన ఎడల ఆ రాక్షసవనిత వంద బలిసిన దున్నలను భక్షించును. అందువలన ఆమె సార్థక నామధేయురాలు. ఆ రక్కసి వికృతమైన కేశములు, అతిపెద్ద పెదవులు, తాడిచెట్టు వంటి ముక్కు, గుహవంటి ముఖము, నాగళ్ళ వంటి దంతములు, నూతుల వంటి కళ్ళు, గలిగిన ఆ రక్కసి మిక్కిలి వంచన వల మహా భయంకరి. తన సోదరుడు ఒక బాలుని వలన మరణించెనని తెలిసి శోకమొంది, ఎట్లైననూ ఆ బాలుని సంహరింపవలెనని ఒక పదహారేండ్ల సుందరి వలె రూపు మార్చుకొని, నానాలంకార భూషితయై, తన వీక్షణములచే ఎల్లరునూ మోహింపజేయుచూ పార్వతీదేవి గృహమున ప్రవేశించెను. ఆమె పార్వతికి ప్రణామము లాచరించి పరమాదరముతో ఇట్లనియె "తల్లీ! నీ దర్శనము చే నేను ధన్యురాలిని, కృతకృత్య నైతిని. ఎందుకనగా నీవు సర్వ జగజ్జననీ, సర్వ దేవమయి, శుభ స్వరూపిణి, సర్వధ్యేయ, సర్వ సిద్ధి స్వరూప, సర్వ కారణ కారణ, జగన్మోహినివి." అంత పార్వతి ఆమెను లేవనెత్తి, తన చెలులతో ఆమెకు పాద ప్రక్షాళన మొనరింపజేసి, ఆశీనురాలిని గావించి ఇట్లనియె "ఓ! శుభగా! నిన్ను చూచి ప్రసన్నురాలినైతిని. నీవు ఎవరి పుత్రికవు? ఎక్కడి నుండి

ఏతెంచితివి? నీ కోరిక ఏమి? నా సమ్ముఖమున సత్యము తెలుపుము. నీ మనోవాంఛితమును తీర్చెదను" అని పలికెను. అంత శతమహిష "నేను చిరకాలము నుండి పతి వియోగముతో దు:ఖితురాలినై యుంటిని అందువలన మిమ్ము శరణుజొచ్చుచున్నాను. అమరావతిని సింధు రాక్షసుడు ఆక్రమించి, దేవతలనందరినీ బందీకృతుల గావించెను. ఇంద్ర సహిత దేవగణములందరూ ఒక రహస్య ప్రదేశమున దాగుకొనిరి. ఏ దు:ఖమునైననూ సహింపవచ్చు. కానీ వియోగ జనిత దు:ఖమును సహించుట కష్టము. దేవీ! నీవు సౌభాగ్యవతివి. శివునితో నీకు ఎన్నడూ వియోగము కలుగలేదు" అని పలికెను.

అంత పార్వతి "ఓ! కళ్యాణీ! నా ఈ బాలుడు తన బలముతో ఎందరో దుష్ట రక్కసులను సంహరించెను. ఈతడు సింధు రాక్షసుని సంహరించి, దేవతలను తిరిగి యధా స్థానములందుంచుటకే అవతారము స్వీకరించెను. అందువలన నీవు ఆంధోళన పడక కొంతకాలము వేచియుండుము" అని పలికెను. అంత పార్వతి తన చెలులతో ఆమెకు యధోచిత సత్కారములు చేయించి భోజనమిడెను. ఆమె భోజన మారగించి పార్వతీ చెలులతో చతుర సంభాషణ కావించెను. అందరూ ఆమెను నమ్మి వార్తాలాపములు చేయుచుండిరి. ఆ సమయమున ఆ దుష్ట రక్కసి పార్వతీసుతుని తనకిమ్మని అడిగెను. చెలులు ఆమెను శంకింపక ఆ బాలుని ఆమె హస్తములందుంచిరి. శతమహిష తగిన సమయము కొరకు వేచియుండెను. కానీ గజాననుడు ఆమె పూర్వాపరములు పూర్ణముగ ఎరిగి ఆమె ముక్కునూ, చెవులనూ బలముగ పట్టి తన భారమును పర్వతమంతగా పెంచెను. అంత ఆ రక్కసి ఊపిరి ఆడక, ఆ బాలుని క్రిందికి త్రోయలేక బలముగ పాదములను భూమిపై మోదుచూ "నేను కేవలము నిన్ను చూచుట కేతెంచితిని. నిరపరాధినైన నన్ను ఏల సంహరించు చుంటివి? వదులు! వదులు!!". అని ఆక్రందన మొనర్చుచుండెను. పార్వతీదేవి చెలులు ఆ బాలుని ఆమె నుండి విడదీయుటకు యత్నించి విఫలులై లోనికి పరుగెత్తి పార్వతికి ఈ విషయము తెలిపిరి. అంత పార్వతి పరుగున ఏతెంచి, ఆమె సహితము బాలుని విడదీయుటకు యత్నించి విఫలమై ఆ బాలునితో "ఈమె ఇంద్రుని ప్రియపత్ని. ఈమెను వెంటనే వదులుము" అని పలికెను. అంత గణేశుడు ఆమెను దూరముగ త్రోసి, తిరిగి ఒక్క క్షణములో వెంటనే పైకురికెను. క్షణములో ఆ రాక్షస వనిత ముక్కు, చెవులు ఆ బాలుని చేతిలోనికి వచ్చెను. ఆమెకు రక్తస్రావమై, ఆ బాలుని చరణ ప్రహరణముచే రక్కసి అసువులు బాసెను. ఆ స్త్రీ ఎడల స్నేహభావ మలవరచుకొన్న పార్వతి శోకమగ్నయై "ఈ చంచల బాలుడు దుర్యశము ఒసంగు కార్యమునేల కావించెను? శచీదేవి హత్య కావింపబడినదను వార్త విని ఇంద్రుడేతెంచిన ఏమి యొనరించును?" అని ఆక్రందించుచూ, ముందునకేగి దశయోజన పర్యంతము యున్న వికృత రాక్షసిని గాంచెను. అంత ఆమె శోకము నాపి, ప్రసన్న హృదయమై, ఆ బాలుని ప్రశంశించుచూ గృహాంతర్భాగమున కేగెను. పార్వతీ సఖులు ఆ బాలుని పరాక్రమము గని చప్పట్లు చరచుచూ, జయజయ ధ్వానములు కావించిరి. శివ గణములు ఆ రక్కసి దేహమును ఖండించి దూరముగ పడవైచిరి. పార్వతి తిరిగి బ్రాహ్మణులచే ఆ బాలునికి ఆశీర్వాదము కావింపజేసెను.

బాలునికి ఏడవ మాసము ఏతెంచెను. ఒకానొకనాటి సాయం సమయము దాటి రాత్రి అయినది. ఆ సమయమున వన్యమృగములు, కప్పలు శబ్దము కావించుచున్నవి. స్త్రీ పురుషులందరూ గాఢ నిద్రయందుండిరి. ఆ సమయమున కమరుడు అను రాక్షసుడేతెంచి, గృహ ప్రాంగణమంతటినీ తన వీపుతో ఆచ్ఛాదించెను. సూర్యోదయమయిన పిదప లోకులు ఆతని వీపుపై నడచుచుండిరి. కొందరు ఆ వీపుపై నిద్రించుచుండిరి. ప్రాంగణము అతి నున్నగా యుండుటచే కొందరు జారి పడిరి. కొందరు అచట ముగ్గులు పెట్టిరి. పార్వతి అచట ఒక దివ్యాస్తరణమును పరిచి, దానిపై గణేశుని పరుండబెట్టి చెలులను ఆ బాలుని చూడమని చెప్పి, తాను శివ సేవకు చనియెను. అంత కమరుడు తన వీపును కంపించుట ఆరంభించెను. అంత లోకులు "భూకంపమేతెంచినదా? ఇది ఏదేని అరిష్టమా? భూమి ఏల కంపించుచున్నది?" అని తర్కించుచుండిరి. అంత సర్వజ్ఞుడయిన బాలకుడు తన బరువురు పదునాల్గు భువనములంత

పెంచెను. కమఠుడు ఆ బరువు భరింపజాలక విలవిలలాడుచూ, మరింత కదులుట ప్రారంభించెను. కమఠుని శరీరము నుండి రుధిరము ధారలుగ కారుచూ పైకి లేచుటకు యత్నించెను. అప్పట వరకు ప్రాంగణము నందున్న జనులు అచటి నుండి తప్పుకొనిరి. చెలులు పార్వతి వద్దకేగి "తల్లీ! ఏదేని రక్కసుడేతెంచెనో, లేక భూమి కంపించుచుండెనో తెలియదు. మీరు తొందరగా రావలసినది" అని పలికిరి. పార్వతి రివ్వున ఏగి ఆ బాలుని ఎత్తుకొన చూచినది. కానీ ఆ బాలుడు పృధివి కంటె భారముగ తోచెను. అంత బాలుని బరువు సహింపలేక కమఠుడు అసువులు బాసెను. అంత అసురుడు తన నిజరూపము నొంది దశ యోజనములు విస్తరించెను. అంత పార్వతి బాలుని నెత్తుకొని లోనికేగెను. శివగణములు కమఠుని ఖండించి దూరముగ విసరివైచెరి. దేవతలు ఆ బాలునిపై పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శతమహిష, కమఠాసుర సంహారమను ఎనభై ఆరవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఏడవ అధ్యాయము

(తల్పాసుర, దుందుభి సంహారము)

వ్యాసుడు "పితామహా! సర్వ పాపహరము, పరమ పుణ్యదాయకము అయిన గణేశ లీలలు వినుచున్ననూ నాకు తృప్తి తీరుట లేదు. మరికొన్ని విశేషములు వివరింపవలసినది." బ్రహ్మ "సాత్యవతేయ! ఈ ఆఖ్యానములు పాప నాశకములే కాక మోక్షదాయకములు. ఎనిమిదవ నెల యందు గ్రీష్మ కారణమున సుతునితో కలసి పార్వతి పుష్పవాటిక చేరెను. ఆ వాటిక అశోక, చందన, పనస, విభీతక, మాలతీ, చంప, మల్లె, దీప, పారిజాత వృక్షములతో శోభించుచున్నది. అచట కమలయుక్తమయిన ఒక రమణీయ సరోవరము కలదు. సఖులు అచట గల పర్యంకముపై ఒక సుందర ఆస్తరణమును పరచిరి. పార్వతి ఆ బాలుని పక్కన పెట్టుకొని, చల్లగాలి తిమ్మెర వీచుచుండుటచే నెమ్మదిగ నిద్రలోనికి జారెను. అదే తరుణమని తల్పాసురుడను దనుజుడు అచటికేతెంచి, ఆదృశ్యముగ ఆ తల్పము ప్రవేశించి, అకస్మాత్తుగా ఆకాశమున కెగిరెను. పార్వతి వెంఠనే లేచి పుత్రునితో సహా తాను అంతరిక్షమునుండుట గాంచి ఉచ్ఛస్వరమున రోదించుట మొదలిడెను. "ఓ! శంకరా! మహాప్రభూ! ఎక్కడుంటివి? శీఘ్రముగ ఏతెంచి మమ్ము కాపాడుము. నేనేమి అపకారము కావించితినని నన్ను ఉపేక్షించుచున్నావు? అత్యంత బలశాలి అయిన దైత్యుడు మమ్ము అంతరిక్షమందు ఎగురవేయుచుండెను. సమర్థుడైన భర్త ఇటువంటి సమయమున భార్యనిట్లు ఉపేక్షింపరాదు. ఈ పుత్రుని పొందిన నాటినుండి నాకు నానావిధముల ఆటంకములు, పరీక్షలెదురగు చున్నవి. ప్రభూ! నేనేవిధమయిన బంధనమందు పడితిని?" అంత వినాయకుడు తన పాదముతో ఆ పర్యంకమును ఒక్క ప్రహారమొనర్చెను. పర్యంకము ముక్కలైనది. అంత రక్కసుడు అదృశ్యుడై పలాయన మొనర్చుటకు సిద్ధమయ్యెను. అంత వినాయకుడు తన కుడిచేతితో తల్లిని పట్టుకొని, ఎడమ చేతితో రక్కసుని శిఖను పట్టి గిరగిరాత్రిప్పి, వేగముగ భూమిపై విసరెను. తల్పాసురుడు తన ముఖము నుండి రక్తము వమనమొనర్చుచూ అసువులు బాసెను. ఆతని శరీరము ఇరువది ఒక్క యోజనముల నిడివి కలిగి అచట గల వృక్షములను చూర్ణమొనర్చెను.

బాల గణేశుడు మాతా సహితుడై తల్పాసురునిపై పద్మాసనము వైచికొని యోగి వలె కూర్చొనెను. పార్వతికి భయముచే కలిగిన ఆయోమయముచే కన్నులు మూసికొని భయాతురయై యుండెను. అంత మునులేతెంచి ఆమెను కన్నులు తెరవమని అర్థించిరి. ఆమె నెమ్మదిగ కనులు తెరచి, బాలుని సురక్షితముగ కాంచి, ఆనంద మనస్కయై ఆ బాలుని ఎత్తుకొని, ఆ దనుజుని నుండి క్రిందకిదిగి తన గృహమున కేగెను. శిశురక్షకై ఎన్నో దానములాచరించెను.

మునులు, ముని పత్నులు ఏతెంచి బాలుని ప్రశంశించిరి.

ఈ అంతరాళమున దందుభి అను రక్కసుడు భయంకర గర్జన కావించుచూ ఆచటి కేతెంచెను. ఆతడు తన ముష్ఠి ఘాతములతో పృథివిని ముక్కలు చేయగల బలశాలి. ఆతని శిరము సూర్యుని ఆచ్ఛాదించు చుండెను. ఆ దుష్టుడు ఒక బాలుని రూపము ధరించి అచటి కేతెంచి పార్వతీ పుత్రుని క్రీడార్థము పిలచెను. వినాయకుడు ఏమియును ఎరుగని వానివలె వాని వద్దకు ఏగెను. అంత ఆ మిధ్యాబాలుడు ఒక విషతుల్య ఫలమును వినాయకునకిచ్చి ఆరగింపమనెను. దుందుభి "నేను ఈ ఫలమును అత్యంత దూరదేశము నుండి తీసికొనివచ్చితిని. దీనిని భుజించుటచే జరామరణములను దూరమొనర్చును." అని పలికెను. అంత గణేశుడు ఆ ఫలమును సంపూర్ణముగ భుజించి ఇంకొక ఫలమునిమ్మని అడిగెను. శివానుగ్రహము యున్న ఎడల విషము అమృతమగును. అంత గణేశుడు ఆ బాలుని పాదముపై తన పాదమునుంచి, ఆ రక్కసుని శిఖను చేతితో పట్టుకొని నుంచొనెను. సమస్త భూమండల భారమును ఆ పాదముపై మోపి నృత్యమారంభించెను. అంత దైత్యుడు "పార్వతీ పుత్రా! నన్ను విడువుము. నేను నా గృహమున కేగుదును" అని విలపించుచుండెను. వినాయకుడు వానిని వదలక విసురుగా ఆతని శిఖ పట్టి లాగెను. అసురుని శిరము శరీరము నుండి వేరయి వినాయకుని చేతికి వచ్చెను. రక్తధారలు నలుప్రక్కలా చిమ్మెను. అంత తన హస్తమునున్న అసుర శిరముతో పార్వతీపుత్రుడు క్రీడించుట మొదలిడెను. అంత పార్వతి అచటికేతెంచి, బాలుని చేతినుండి శిరమును తీసి, దూరముగ విసరివైచి, బాలుని శుభ్రముగ స్నానము చేయించి తానునూ స్నానమాచరించి బాలుని గృహాంతర్భాగమునకు తీసికొని వెళ్ళెను. చెలికత్తెలు బాలుని కుశలమడిగిరి. శివభక్తి పరాయణత్వము, మరీచి మహర్షిచే ఈయబడిన రక్షా కవచపు మహిమ వలన బాలుడు సుఖముగ నుండెనని పార్వతి బదులిచ్చెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి తల్పాసుర, దుందుభి సంహారమును ఎనభై ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనభై ఎనిమిదవ అధ్యాయము

(అజగర, శలభాసుర సంహారము)

బ్రహ్మ "పదవ మాసమందు ఒకనాటి సూర్యోదయానంతరము పార్వతీ పుత్రుడు పొట్టతో పాకుచూ, నెమ్మదిగ అడుగులు వేయుచూ, పార్వతీ పరమేశ్వరులతో అప్పడప్పుడు నడచుచూ, బాలోచిత చేష్ఠితములు కావించుచుండెను. వీటిని చూచి పార్వతి అత్యంత ఆనందము నొందుచుండెడిది. ఇంతలో ఒక వృక్ష మూలమున "అజగరము" అను దైత్యుడు పొంచియుండి సమయము కొరకు వేచియుండెను. బాలుడు అది గమనించి, నెమ్మదిగ పాకుచూ వెళ్ళి ఆ కొండచిలువను చేరెను. అంత ఆ దుష్ఠ సర్పము బాలుని సంపూర్ణముగ మ్రింగెను. ఇంతలో పార్వతి బయటకు వచ్చి బాలుని కానక "ఇప్పటి వరకు ఈ బాలుడు ఇక్కడనే యుండెను. ఎవరైననూ తీసికొని పోయిరా? హత్య గావించిరా?" అని అత్యంత ఆర్తినొంది శిరమును మోదుకొనుట మొదలిడెను. అంత శివగణములు ఏతెంచి, ఆమెను వారించి "మాతా! మీరు హతాశులవవద్దు. మీ బాలకుని ప్రతాపము, ప్రభావము సర్వ విదితము" అని అనునయించిరి. ఇంతలో అజగరము ముఖము ప్రవేశించిన గణేశుడు తన ఆకృతిని పెంచ నారంభించెను. అద్దానిచే ఆ సర్పము యొక్క ఊపిరి అందక తోకను నేలపై కొట్టుచూ, కన్నుల నుండి రక్తస్రావము జరుగుచుండెను. బాలుడు సర్పము యొక్క ముఖమును ఛేదించి బయటకు వచ్చెను. బాలుని శరీరమంతయు రక్తమయమై పూచిన పలాశవృక్షము వలె శోభించుచుండెను. బాలుని

చూచి పార్వతి ఆనంద మనస్కయై, ఆ బాలుని హృదయమునకు హత్తుకొని, ఆతనికి స్నానమొనరించి, శుభ్రపరచి, తానునూ స్నానమాచరించెను. తదుపరి బాలునితో సహితము గృహాంతర్భాగమునకు చనెను. శివగణములు ఆ అజగరమును దూరముగ విసరివైచిరి.

కొన్నినాళ్ళు గడచినవి. పార్వతి ఒకనాడు తన చెలులతో కలసి కౌతుకముతో బాలగణేశుని చేష్ఠలను అవలోకించుచూ ఆనందించుచుండెను. బాలుడు నడచుచూ కొందరికి కన్నులు మూయును. కొందరి వస్త్ర భూషణములు పట్టి లాగును. జనులందరినీ కాంచుచూ చిరునవ్వులు చిందించుచుండును. ఆ సమయమున "శలభాసురుడు" అను దుష్ఠ దానవుడు ఒక శలభాకారము ధరించి అచటి కేతెంచెను. ఆతడు పర్వతాకారుడై, మేఘము వంటి నీలవర్ణుడై, నేత్రములు జపాకుసుమముల వలె ఎర్రనై, వేగముగ ఎగురుచూ బాలుని వద్ద కేతెంచెను. బాలుడు వేగముగ పరుగెత్తుచూ ఆ శలభమును పట్టుకొనుటకు ప్రయత్నించెను. కానీ ఆ శలభము అందక ఎగురుచుండెను. కొంత సమయమునకు బాలుడు అలసి, కించిత్ కోపమునొంది, ఒక్క ఉదుటున వెళ్ళి ఆ శలభమును పట్టుకొనెను. తిరిగి వదలిపెట్టి అయ్యది ఎగురుచుండగా తిరిగి దాని వెనుక పరుగులెత్తెను. ఈ విధముగ పలుమార్లు కావించిన పిదప పార్వతి తనయునితో "నీవు జీవహింస కావింపరాదు. అందువలన ఆ శలభమును వదులుము" అని పలికెను. బాలుడు హఠమొనర్చి, ఆ శలభమును పట్టి, బలముగ ఒక పాషాణముపై విసరెను. శలభాసురుడు ఒక భయంకరారావము కావించి వేయి ముక్కలయ్యెను. ఆతని శరీరము పది యోజనములు నిడివి గలిగి వృక్షములను చూర్ణమొనర్చెను. మునిపత్నులు, చెలులు "సాధు, సాధు" (మంచిది, మంచిది) అని నినాదములు కావించిరి. పార్వతి తన పుత్ర, సఖీ సహితయై గృహమున కేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి అజగర, శలభాసుర సంహారమను ఎనభై ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఎనభై తొమ్మిదవ అధ్యాయము

(నూపురాసుర, అవిపుత్ర సంహారము)

బ్రహ్మ "నెమ్మదిగ బాలుడగు గుణేశునకు పన్నెండు నెలలు వచ్చినవి. పార్వతీదేవి ఆ బాలుని కోటి సూర్య సమానమైన ఆభూషణములతో అలంకరించి తన ఒడిలో కూర్చుంబెట్టుకొనెను. ఆనాడు శివతాండవము అగుటచే సర్వులు పరమేశ్వరుని కొరకై వేచియుండిరి. అంత గణపతి సహితము ఇతర బాలురతో కలసి నృత్యము వీక్షించుటకు ఉత్సుకుడై నెమ్మదిగ తాను లేచి "థేథీ, థేథీ" అను పలుకుచు, తప్పటడుగులు వేయుచూ నృత్యము ఆరంభించెను. అంతలో శివుడచటికేతెంచి తానునూ బాలుని అనుకరించుచూ, అనేక హావభావము లొలికించుచూ నాట్యము కావించెను. శివుని చూచి విష్ణువు, ఆయనను కాంచి ఇంద్రాదులు, వారిని చూచి యక్ష, రాక్షస, నాగ, ముని, మనుష్య, పదునాల్గు మంది మనువులు, పదునాల్గు లోకములందు జీవులు, సచేతన, అచేతన ప్రాణులు వారి ననుకరించుచూ నృత్య మొనరించుచుండిరి. ముని పత్నులు, దేవపత్నులు సహితము పాల్గొనిరి. చివరకి పార్వతీదేవి సహితము నృత్య మారంభించెను. నూపురముల ఝుంకారములతో, పాదములందలి చిన్ని గంటల రణరణలతో, చరణముల ఆఘాతములతో, జనింపబడిన శబ్దముచే దిశలు, విదిశలు భూనభోంతరాళములన్నియు ప్రతిధ్వనించుచున్నవి. పృథివి, శేషుడు, సూర్య,

చంద్ర తారాగణములు కంపించుట నారంభించినవి. పార్వతీదేవి నృత్య పరాకాష్ఠను గమనించి నృత్యమును నిషేధించెను. కానీ బాలుడు ఆమె ఆజ్ఞను పాలింపక నృత్యమును కొనసాగించెను.

ఇంతలో నూపురుడు అను మహాదైత్యుడు అచటికి ఏతెంచెను. ఆతడు అత్యంత ధృఢ శరీరుడు, పాతాళము వరకు కాళ్ళు, ఆకాశము నంటు శిరముతో ఒప్పువాడు. ఆతడు ఆ నృత్య ప్రదేశమునకు ఏతెంచి, బాలగణేశుని నూపురము నందు చేరెను. సర్వజ్ఞుడయిన బాలగణేశుడు అది గమనించి బలమయిన కుంజరమును సంకెలలతో బంధించినటుల నూపురుని ఆ నూపురమునందే బంధించెను. తదుపరి పార్వతి ఆ బాలుని తన ఒడిలో కూర్చుండబెట్టుకొనెను. అకస్మాత్తుగా బాలుడు పర్వతము వలె బరువు పెరిగెను. అంత పార్వతి ఆ బరువును సహింపలేక "ఇప్పుడే ఇంత బరువు ఎట్లైతివి?" అని బాలుని ప్రశ్నించుచూ బాలుని క్రిందికి దింపెను. అంత బాలుడు కినుక వహించినటుల తన రెండు పాదములను ఝుళిపించెను. అంత నూపురుడు ఆకాశము నందు విసరబడి, పక్షివలె కొంతసేపు భ్రమణ మొనర్చి, సూర్య మండలమును ఆచ్ఛాదనము కావించి, కొంత సేపటికి క్రిందపడి వందలాది ముక్కలయ్యెను. అంత మునులు, దేవతలు అత్యంత ముదిత మనస్కులై, బాలగణేశుని స్థుతించిరి "ఓ! దేవా! మేము నీ రూపమును, నీ తేజస్సును, దైత్య, దానవ నాశనమొనర్చు నీ దివ్య లీలలను, మాయను ఎరుగము. సూర్యమండలమును ఆచ్ఛాదన మొనర్పగల దైత్యుని నీ పాదములు ఝుళిపించి సంహరించితివి." ఈ విధముగ పలికి ఆ విశ్వరూపుడయిన బాలుకునికి పూజన మొనర్చిరి. నృత్యోత్సవము సంపూర్ణమయిన పిదప పార్వతి గౌతమాది మునులకు, ముని పత్నులకు నమస్కార మొనర్చి, వీడ్కోలు తెలిపి, తన గృహమున కేగెను.

తదుపరి కొన్నాళ్ళకు బాల వినాయకుడు తోడి బాలురతో గృహ ప్రాంగణమందు క్రీడించుచుండెను. వారు ఒకరితో ఒకరు మల్లయుద్ధమొనర్చుచూ బాహా బాహీ, ముక్కాముక్కి, శిరముతో శిరము త్రోసికొనుచూ ఆడుచుండిరి. కొందరు మునిబాలకులు గణేశుని గంధ, పుష్పాక్షతలతో పూజన మొనర్చిరి. కొందరు బాల గణేశుని తమ ఆశ్రమమునకు కొనిపోయి భోజన మొసంగిరి. మరికొందరు ఆయన చరణములకు నమస్కరించి ఆయనకు మాలాధారణ కావించిరి. ఇంతలో సింధు దైత్యుని ద్వారా పంపబడిన "అవిపుత్ర" అను దైత్యుడు యముడు సహితము భయపడునట్టి ఒక గొర్రె రూపము ధరించి ఏతెంచెను. తీక్షణమైన వాడిగల గోళ్ళు, బలమయిన భుజములు, విశాల నేత్రములు, గుండ్రని కొమ్ములు, కలిగి పర్వతములను సహితము చూర్ణమొనర్చు బలసంపదతో బాల వినాయకుని సంహరించుట కేతెంచెను. ఆ గొర్రె వినాయకుని వెనుక పరుగులెత్తెను. వినాయకుడు అందక కొంతసేపు క్రీడించి, అటుపిదప దాని శృంగములు పట్టి వెనుకకు త్రోసి, అద్దాని వీపుపై కూర్చుండెను. ఇంతలో ముని కుమారులు దాని తోక పట్టుకొని, లాగి లాఠీలతో మోద నారంభించిరి. అంత ఆ గొర్రె తన తోకతో వారందరినీ ప్రహరణమొనర్చి, బాలగణేశుని సహితము బలముగ ప్రహరించెను. గణేశుడు ఆ దెబ్బకు కించిత్ విచిలితుడై, క్రిందకు దిగి, తన రెండు చేతులతో దాని కాళ్ళు పట్టి, గిరగిరా త్రిప్పి, ముష్ఠి బిగించి దాని వీపుపై బలముగ ప్రహరించెను. అంత అవిపుత్రుడు ఒక భయంకర నాదమొనర్చి, వందలాది ముక్కలై అసువులు బాసెను. ఆ భయంకరారావముచే ముల్లోకములు కంపించెను. ముని కుమారులేగి పార్వతీదేవికి ఈ విషయము నెరింగించిరి. అంత ఆ సాధ్వి ఏతెంచి, మృత కళేబరమును వీక్షించి, బాలుని ఎత్తుకొని, తన గృహమునకేగి దిష్ఠితీసెను. శివ గణములు ఆ దైత్య శరీరమును దూరముగ విసరిరి. బాల గణేశుని ప్రశంశించిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడా ఖండమందలి నూపురాసుర, అవిపుత్ర సంహారము అను ఎనబై తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

తొంభైయవ అధ్యాయము

(కూట, మత్స్యాసుర, శైల దైత్యుల సంహారము)

బ్రహ్మ "వినాయకుడు రెండేండ్ల ప్రాయుడయ్యెను. అతడు తోటి బాలకులతో కలసి లతా, వృక్ష యుతమైన పుష్పవాటిక యందు క్రీడలు సలుపుచుండెను. అచట పనస, ఖర్జూరాది వృక్షములు కలవు. వినాయకుడు మిక్కిలి బలశాలి అగుటచే ఆ వృక్షముల నుండి పండ్లు రాల్చి, మిగిలిన బాలుర కిచ్చెడివాడు. ఒకనాడు అచటకు "కూటుడు" అను దైత్యుడేతెంచెను. ఆ దుర్బుద్ధి అచటగల సరోవరమందు విషము కలిపి, అలసట చెందిన బాలురు నీరు తాగునపుడు వారిని హతమార్చవలెనన్న నీచమయిన ఆలోచన గల దురాత్ముడు. పిల్లలందరూ ఆటలాడిన పిదప దాహార్తులై సరోవర జలములను త్రావిరి. కాలకూట విషఫలితముగ వారందరూ తక్షణము మరణించిరి. బాలురు సరోవరమున కేగినపుడు అందలి జలచరములు మరణించి నీటియందు తేలుటవారు గమనించకుండిరి. ఇంతలో గ్రామరక్షకుడు అచటికేతెంచి, మరణించిన బాలురకాంచి, వెంటనే గ్రామ మధ్యమునకేగి ఆ విషయము తెలిపెను. అంత గ్రామమంతయు హాహాకారములు చెలరేగినవి. అంత పార్వతీదేవి ఆ కోలాహలము నాలకించి పుత్ర సహితముగ బయటకు వచ్చెను. అంత బాల వినాయకుడు తన అమృత దృష్టిని ప్రసరించి మరణించిన బాలురను, జలచరములను తిరిగి బ్రతికించెను. తన క్రూరదృష్టి ప్రసరించి కూటుని సంహరించెను. అంత కూటుడు తన నిజరూపమునొంది అచట గల వృక్షాదులను చూర్ణమొనర్చెను. సర్వులు పార్వతీ పుత్రుని ప్రశంశించిరి. కానీ నాస్తికులు నిందించిరి.

కొన్నాళ్ళకు గుణేశునకు మూడేండ్ల వయస్సు వచ్చినది. ఒకనాడు ఆతడు సర్వుల కళ్ళుగప్పి బయటకేతెంచెను. గణేశుడు బయటకేతెంచుట గాంచి ముని బాలకులు సహితము ఆతనిని అనుసరించిరి. వారందరూ ఒక అహోరాత్రము ఒకరినొకరు చూచుకొననిచే, ఆనందముతో ఆలింగన మొనర్చిరి. అంత ఆ బాలురు వినాయకుని గాంచి "దేవా! నిన్ను ఎల్లప్పుడూ రాత్రివేళల స్వప్నమందు కాంచుచుంటిమి. నీవు స్వప్నమందు కనిపించని రాత్రి ఒక యుగము వలె తోచుచున్నది. కానీ నిన్ను కాంచిన మరుక్షణము మేము ప్రసన్నులమగుదుము." ఈ విధముగ వారు వార్తాలాపములాడుచూ, ఒకరిపై ఒకరు పడుచూ, ఒకరినొకరు త్రోసికొనుచూ, అత్యానందము అనుభవించు చుండిరి. ఈ విధముగ వారు క్రీడించుచు తమ ఆశ్రమమునకు కొంత దూరమునున్న వేరొక ఆశ్రమమున కేగిరి. అచట ఒక యోజనము పొడవు యున్న సరోవరము కలదు. బాలురు పూర్వము వలె రెండు జట్లుగా మారి, ఒకరినొకరు భుజములపై ఎక్కించుకొని, బలపూర్వకముగ నీటియందు ముంచుచుండిరి. తదుపరి మునిగిన వారు పైకి లేచి, ప్రత్యర్థులను సహితము అట్లే కావించుచుండిరి.

ఈ విధముగ వారు క్రీడించుచుండగా ఒక మత్స్యరూప రాక్షసుడు అచటికేతెంచి, జలములను అతలాకుతలము కావించుచూ, పుచ్ఛముతో బాలురను ప్రహరించుట నారంభించెను. బాలురందరూ గబగబా ఒడ్డుకు చేరుచుండిరి. అంత ఆ దైత్యుడు వినాయకుని చేరి తన బలమయిన నోటితో ఆతని పాదములు పట్టి, లోనికి లాగుట మొదలిడి, లోతుగా యున్న నీటిలోనికి ఏగి, అచటనే యుండిపోయెను. బాలురు గణేశుని కానక హాహాకారములొనర్చి రోదించిరి. కొందరు ధైర్యవంతులు నీటిలోనికి దిగి వెదకిరి. కానీ ఆ సరోవరము అగాధమగుటచే గణేశుని కానక బయటకేతెంచి, తిరిగి వెళ్ళి ఆ విషయమును పార్వతీదేవికి తెలిపిరి. వారి పలుకులు విని పార్వతి ఒక ముహూర్తము మూర్ఛనొంది, తిరిగి తెలివి తెచ్చుకొని, సఖీ సమేతముగ సరోవరము చేరెను. వార్త విని మునిజనులు సహితము అచటికి చేరిరి. కొందరు తిరిగి ఆ జలములందు దుమికి గణేశునికై వెదకిరి. కానీ ఆ అగాధ జలములందు బాలుని కానక వెనుదిరిగిరి. కొందరు బాలుని మత్స్యము మ్రింగెనేమో అని అనుమానము వెలిబుచ్చిరి. అంత పార్వతి గుండెలు బాదుకొనుచూ

“సర్వాంగ సుందరుడయిన ఈ బాలుని చూడకున్న నా ప్రాణములు నిలువవు. నేను అత్యంత క్లేశముల కోర్చి ఈ బాలుని పొందితిని. ఈతడు అత్యంత పరాక్రముడు, ఈశ్వరుడు, చరాచర జగత్తుకు గురువు, పరమ మాయావి అయినప్పటికీ మాయాతీతుడు, అనంతకోటి బ్రహ్మాండ నాయకుడు, ఈ సృష్టికే మూలము” అని పలుకుచూ రోదించుచుండెను. పార్వతీదేవి రోదనమును గాంచి మునిజనులు సహితము రోదించిరి.

ఆ పలుకులు విని కృపాళువైన గుణేశుడు మత్స్యరూపమునొంది, దైత్యునితో యుద్ధమొనరింప మొదలిడెను. ఒకరినొకరు దంతములచే కొరుకుచూ, తను వీపు, పొట్ట, పుచ్ఛములతో ప్రహరించుకొనుచూ కొంతసేపు యుద్ధ మొనరించిరి. అంత గుణేశుడు బలపూర్వకముగ దైత్యుని ముఖమును ప్రహరించెను. అంత దైత్యుని ముఖము ముక్కలై, కన్నులు బయటకువచ్చి, చూర్ణమయి పలాయనమొనర్చి జలమధ్యమున కేగెను. ఆసురుడు ఎచటికేగిననూ వినాయకుడు వాని వెనుకనే ఏగి తన పండ్లతో కొరుకుచూ, తన పుచ్ఛముతో ప్రహరించుచూ అసురుని వెంబడించెను. అంత అసురుడు అలసట నొందిన పిదప వాని పుచ్ఛమును పట్టి, జలముల బయటికి లాగి, ఆ మత్స్యమును పట్టి నేలపై మోది హతమార్చెను. అంత మత్స్యము మరణించుటకు ముందు ఒక మహార్తనాదము కావించి మరణించెను. ఆ ఆర్తనాదము చే త్రిలోకములు కంపించెను. పార్వతి బాలుని ఆలింగనమొనర్చి శివ మహిమచే, మరీచి మహర్షి ప్రసాదించిన కవచ ప్రభావముచే బాలుడు బ్రతికెనని తలచెను. మునిగణములు “ప్రభూ! మేము మీ దర్శనమొందుటచే అత్యంత ఆనంద మనస్కులమైతిమని పలికిరి. వారందరూ అచటినుండి తమ ఆశ్రమమునకు ఏతెంచుచుండగా దారిలో వారికి “శైలుడు” అను మహాదైత్యుడెదురయ్యెను. ఆతడు శత్రువులను హతమొనర్చు బలసంపన్నుడు; మొసలి వంటి కర్కశ శరీరుడు; వజ్రమును సహితము చూర్ణమొనర్చువాడు. ఆతడు ఒక పర్వతరూపమొంది వారిని అడ్డగించెను. ఆ పర్వతమందు సరోవరములు, వృక్షములు, లతలు, హస్తి, సింహ శార్దూలాది మృగములు, పక్షులు, రాక్షసులు సహితము ఉపస్థితులైరి. అందరూ ఆ పర్వతమును కాంచి “ఇంతకు ముందు ఈ పర్వతము లేదే? ఇది ఎక్కడి నుండి వచ్చినది? ఇదేమి విఘ్నము?” అని విస్తుపోయిరి. ఆ పర్వతమును దాటలేక వారందరూ అచటనే కూలబడి “తిరిగి మన కుటుంబములను ఎన్నడు చూచెదము?” అని తర్కించిరి. అంత పార్వతి వారితో “మీరు దు:ఖపడవలదు. నేను సహితము గృహమునకేగి శివుని కార్యము లాచరింప వలెను” అని పలికెను. అంత బుద్ధిమంతుడయిన గణేశుడు తన విరాడ్రూపము ధరించి ఒక్క నిశ్వాసము విడచెను. ఆ వాయుతాకిడికి పర్వతము ఆకాశమున కెగసి, ఒకింత తడవు భ్రమించి, పిదప క్రిందపడి నుగ్గునుగ్గు అయి శైలుడు మరణించెను. అచటగల జనులందరూ వినాయకుని మాయచే మోహితులై ఆయన విరాడ్రూపమును చూడలేకుండిరి. మునులందరూ శ్రీగణేశుని ప్రశంశించి “నీ దయచే అరిష్ఠము దూరమయినది. నీ కృపచే తిరిగి మా ధర్మాచరణమును ఆరంభించెదము” అని పలికి, ఆయనకు నమస్కరించి ఎవరి గృహములకు వారరిగిరి. ఏ మానవుడు ఈ ఆఖ్యానమును ఆలకించునో ఆతడు/ఆమె సుఖములు, ఆయురారోగ్య ఐశ్వర్యములు, సర్వత్ర విజయము ప్రాప్తించును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కూట, మత్స్యాసుర, శైలదైత్య సంహారమను తొంబైయవ అధ్యాయము సమాప్తము)

తొంబై ఒకటవ అధ్యాయము

(వినాయకుడు విశ్వరూపమును చూపుట)

బ్రహ్మ “గణేశునకు నాలుగు సంవత్సరములేతెంచెను. ఒకనాటి ఉదయము ఆతడు ఇంకనూ నిద్రించుచుండెను.

అంత పార్వతి ఉదయముననే లేచి, స్నానాదులొనర్చి, పార్థివలింగము చేసి, దానిని తన ఎడమ చేత ధరించి తన కుడిచేతితో దానికి పూజనమొనర్చు చుండెను. ఇంతలో గణేశుడు లేచి హఠము చేయుట మొదలిడెను. పార్వతి బాలుని ఒక్క తడవు ఆగమని, తాను పూజ పూర్ణమొనర్చి వచ్చెదనని తెల్పెను. అంత గణేశుడు రుష్టుడై దగ్గరకు వచ్చి ఆమె చేతినున్న లింగమును పడవైచెను. అంత పార్వతి కొంచెము కృద్ధురాలగుటచే బాలుడు దూరముగ పరుగెత్తెను. పార్వతి తిరిగి పూజ ఆరంభించెను. గణేశుడు తిరిగి ఏతెంచి, ఆమె అంగుళిని కొరికి దూరముగ పరుగిడెను. అంత పార్వతి తన ఆగ్రహమును అణచుకొనలేక ఒక దండము గొని గణేశుని వెనుక పరుగెత్తెను. కొంచెము దూరము పరుగెత్తిన పిదప తల్లి బాలుని చేతిని పట్టి శిక్షించుటకు దండమునెత్తెను. అకస్మాత్తుగా బాలుడు శివరూపుడయ్యెను. పంచముఖములు, దశ భుజములు, త్రినేత్రములు, శేషుడు, భస్మలేపిత శరీరము, త్రిశూల ఢమరుకములు పట్టి కంఠమందు పుర్రెల మాలలతో కానబడెను. ఆ స్వరూపమును కాంచి పార్వతి లజ్జితయై దండమును పారవైచెను. అంత వినాయకుడు తిరిగి మునిబాలకుడై, బాలురతో క్రీడార్థము ఏగెను. అంత పార్వతి తిరిగి బాలుని వెంబడించెను. కానీ ఆమెకు ఆ గుంపుయందు వినాయకుడు కనబడకుండెను. అంత ఆమె ఆ బాలకులను గణేశుని గూర్చి ప్రశ్నించెను. వారందరూ గణేశుని తాము చూడలేదని పలికిరి. అంత పార్వతి ముందుకేగినది. ఆమె కబరీబంధము వదులైనది. గణేశుని వెంబడించిన శ్రమచే శరీరము స్వేదయుక్తమై వస్త్రములు అస్తవ్యస్తమయినవి. అంత గణేశుడు తల్లి స్థితి గాంచి దగ్గర కేతెంచెను. అంత ఆమె ఆ బాలుని పట్టి, తన కొంగుతో ఆ బాలుని కట్టి, తిరిగి తన గృహమున కేతెంచుట మొదలిడెను. బాలునితో "నీవొనర్చిన కార్యమునకు గృహమున కేగగనే నిన్ను మిక్కిలి దండింతును. లేని ఎడల శివునికి నివేదించెను. ఆయన నిన్ను తీవ్రముగ శిక్షించును" అని పలికెను. అంత బాలుడు తిరిగి ఆ కొంగుముడిని విప్పి పలాయనమొనర్చెను. పార్వతి అత్యంత దు:ఖితురాలై తిరిగి ఆ బాలుని వెనుక పరుగెత్తెను.

ఇంతలో "కర్దమాసురుడు" అను దనుజుడు ఒక బ్రాహ్మణరూపము ధరించి, చేతులలో దండకమండలములు దాల్చి, భస్మలిప్తాంగ శరీరుడై, అరుణోదయ సూర్యుని పోలు కాషాయములు ధరించి అచటి కేతెంచి, పలాయన మొనర్చుచున్న గణేశుని ఆపి ఇట్లనియె "బాలకా! నీవు ఎవరి భయముచే పలాయన మొనర్చుచున్నావు? నీ భయమును నేను శీఘ్రమే దూరమొనర్చెదను. నిన్ను అణుమాత్రము భయములేని ప్రదేశమునకు తీసికొని వెళ్ళెదను. ఆ ప్రదేశమును నీ తల్లిదండ్రులు సహితము తెలియరు." అంత భయభీతుడయిన బాలుడు "నన్ను నా మాతాపితరులు కనుగొనని ప్రదేశమునకు గొనిపొమ్ము. నేను మిమ్ము శరణు జొచ్చుచున్నాను" అని పలికెను. అంత కర్దమాసురుడు ఆ బాలుని ముగ్గిన అరటిపండుని మ్రింగునటుల మ్రింగెను. ఇంతలో పార్వతీదేవి బాలుని పద చిహ్నముల జాడను బట్టి అచటికేతెంచి, ఆ బ్రాహ్మణునకు నమస్కరించి "స్వామీ! మీరు నా పుత్రుని గానీ చూచితిరా? బాలుని పద చిహ్నములు ఇక్కడ వరకు వచ్చి మాయమయినవి" అని ప్రశ్నించెను. అంత మిథ్యా బ్రాహ్మణుడు "తల్లీ! నేను సదా ఈశ్వర ధ్యానచిత్తుడను. ఉదాసీనుడను. నీ బాలునితో నాకు పని ఏమి? అంతేకాదు. నేను నీ బాలుని ఎన్నడైననూ చూడను కూడా చూడలేదు. నీవు నీ బాలకుని నాకు అప్పగించలేదుకదా?" అని పలికెను. పార్వతి మరి మాటలాడలేక దు:ఖితురాలైయ్యెను. ఇంతలో గణేశుడు ఆతని నోటినుండి బయటకు వచ్చెను. అంత పార్వతి "ఓరీ! నీవు అసత్యము ఏల పలుకుచుంటివి? నా పుత్రుడు నీ యొద్దనే యుండెను. సాధుజనులు ప్రాణాపాయ స్థితియుందున్ననూ అసత్యమాడరు." అంత దైత్యుడు తన నిజరూపు ధరించి గగనమును చుంబించు శిరము, భయంకర శరీరము కలిగి గణేశుని తన చేతియందు బంధించి వెడలుగ మొదలిడెను. అంత పార్వతి రోదించుచూ ఆ దైత్యుని వెంబడించెను. తన తల్లి దు:ఖితురాలై యుండుట గమనించి, గణపతి ఆ దైత్యుని కంటె పెద్ద రూపమునొంది, ఆ దైత్యుని తన పాదములతో మర్దించి సంహరించెను. దైత్యుని శరీరము వందలాది ముక్కలయ్యెను. మునులు, మునిపత్నులు అచటికేతెంచి ఆ బాలుని ప్రశంశించిరి. పార్వతి అదృష్టమును అభినందించి,

బాలుని పూజించి వెడలిరి.

పార్వతి తన కుమారుని ఒడిలోనికి తీసికొనెను. అకస్మాత్తుగా బాలుడు మూర్ఛనొంది కొంత సేపటికి తేరుకొని, మాటిమాటికీ తన నోరు తెరచుచుండెను. పార్వతి పరుగున పోయి ఆ బాలుని నోటియందు చూచెను. ఆ నోటియందు సప్తద్వీప వసుంధర; పృధివి యందలి గ్రామ, నగర, వనములు; బ్రహ్మ, సూర్యుడు, శేషుడు, విష్ణువు, పర్వత సాగరములు, యక్ష, గంధర్వ, రాక్షస, ముని గణములు; పక్షులు, నదులు, పదునాల్గుమంది మనువులు, అష్టవసువులు, సూర్య, చంద్రాగ్ని తారాగణములు; సర్వ సచేతన, అచేతన ప్రాణులు; సప్త పాతాళములు; ఇరువది ఒకటి స్వర్గములు ఆ సాధ్వి కాంచెను. అంత బాలుడు తిరిగి ముని కుమారుని రూపమును సంతరించుకొనెను. ఆమె తన నేత్రములను నిమీలితమొనర్చి, రెండు ముహూర్తముల కాలము మతిభ్రమించినదై, తుదకు శివుని స్మరించెను. అంత పార్వతి నిర్మలబుద్ధినొంది ఇట్లు స్థుతించెను "ఈ చరాచర జగత్తుకు తండ్రివి, పరమాత్మవు నీవే! నిత్యానిత్య స్వరూపుడవు, చిదానంద ఘనుడవు నీవే! నీ కుక్షియందు నేను పదునాల్గు భువన భాండములను, చరాచర జగత్తును కాంచితిని. దానిని సంపూర్ణముగ వర్ణించుట నాకశక్యము." ఈ విధముగ పార్వతి పలుకుచుండగా గణేశుడు తిరిగి ఆమెను మోహితురాలిని కావించెను. అంత పార్వతి దేహభావననొంది తిరిగి తన బాలుని ముద్దాడెను. ఈ ఆఖ్యానమును వినిన మనుజులు ముక్తులగుదురు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశుడు పార్వతీదేవికి విశ్వరూపము చూపుట అను తొంబై ఒకటవ అధ్యాయము సమాప్తము)

తొంబై రెండవ అధ్యాయము

(ఖడ్గ సంహారము)

బ్రహ్మ "గుణేశుడు పంచవర్ష ప్రాయుడయ్యెను. ఒకనాడు ప్రాత:కాలమున ఆతని మిత్రులందరూ ఏతెంచి గణేశుని నిద్రనుండి లేపిరి. ఆతడు నిద్ర లేకవపోవుటచే వారు పార్వతీదేవి వద్దకేగి గణేశుని నిద్రలేపమని అర్థించిరి. అంత పార్వతి "మీరు దివారాత్రములు క్రీడలందే మునిగి తేలుదురు. మీకు నిద్రరాదా? సూర్యోదయమునకు ముందే ఏల ఏతెంచిరి?" అని ప్రశ్నించెను. అంత బాలురు "మాతా! మీ పలుకులకు మాకు కోపము రాదు. నీవు మా తల్లివి. మేము సహితము నీ పుత్రులమే కదా! మా అందరి మనస్సు సర్వదా నీ బాలుని గూర్చియే చింతించుచుండును. ఈతని వినా మా చిత్తమునకు శాంతి లభింపదు." ఇవన్నియు వినిన వినయకుడు నిద్రలేచి, వారందరినీ ఆలింగన మొనర్చి క్రీడార్థము బయటకేగెను. వారందరూ రెండు దళములుగ చీలి యుద్ధక్రీడలొనర్ప మొదలిడిరి. వారు బాహా బాహీ, ముక్కాముక్కీ ప్రహారము లొనర్చుకొనుచుండిరి. కొంత సేపటికి వారు కందుక క్రీడలాడుట మొదలిడిరి. వివిధ వాద్యములు మ్రోగించుచూ కోలాహలమొనర్చుచుండిరి. వారు దేవ దానవులవలె నటించుచూ యుద్ధక్రీడలు సలుపుచుండిరి. ఆ సమయమున "ఖడ్గ" అను అసురుడు వారి మధ్యకేతెంచెను. ఆతడు ఒంటె రూపము ధరించి, విశాల దేహము, శూలముల వంటి దంతములు, పాము వలె మెలిదిరిగిన నాలుక, కలిగి దశదిశలను తన పాదములతో కంపింప జేయుచుండెను. ఆతడు ఒనరించు వికృత శబ్దములచే దిశలు, విదిశలు, ప్రతిధ్వనించుచుండెను. ఆ ఒంటెను చూచి సర్వులు పలుదిశలా పరుగులెత్తిరి. అంత ఒంటె ఒంటరిగా యున్న వినాయకుని నిర్జించుటకు ఆతని పైకి పరుగులెత్తెను. వినాయకుడు మేరుపర్వతమువలె స్థిరుడై, అతి విశాలరూపము ధరించి, తన వద్దకేతెంచిన ఒంటె మూర్ధన్యముపై ముష్ఠి ఘాతము ప్రహరించెను. అంత దుష్టదైత్యుని హృదయము విదీర్ణమై, ముఖము నుండి రక్తము కార్చుచూ, మహాశబ్దమొనరించుచూ మరణించెను. అంత దైత్యుడు పదునెనిమిది యోజనముల పొడవు గల నిజరూపమొందెను.

ఆ దైత్యుడు మరణించిన పిదప ముని కుమారులేతెంచి "ఓ! పార్వతీపుత్రా! ఆ దైత్యుని గాంచి మేము భయభీతులమై పలాయన మొనర్చితిమి. నీ పరాక్రమము ఆశ్చర్యజనకము" అని పలికి తిరిగి వారందరూ క్రీడలందు నిమగ్నమైరి. ఇంతలో ఖడ్గుని మిత్రుడు ప్రతీకారవాంఛతో అచటికి ఏతెంచెను. ఆతడత్యంత బలశాలి. ఆతని పద ఘట్టనమునకు శేషుడు సహితము కంపించును. ఆతడు ప్రాణుల ఛాయయందు ప్రవేశించు నేర్పు కలవాడు. ఆతడు అదృశ్యుడై ఏతెంచి, గణేశుని ఛాయయందు ప్రవేశించి, ఆ బాలుని క్రింద పడవేయుచుండెను. ముని కుమారులు గణేశుని "నీవు ఏల క్రిందపడుచుంటివి? అని ప్రశ్నించిరి. గణేశుడు చుట్టూ తేరిపార చూసి ఏమియును కానక తిరిగి క్రీడించుటకు ఉద్యుక్తుడయ్యెను. ఎంత ప్రయత్నించిననూ ఆతడు కదలడయ్యె! అంత తిరిగి పరిశరములు నిశితముగ పరీక్షించి, దైత్యుడు తన ఛాయ యందు ప్రవేశించెనని తెలిసికొని, తాను ఒక మహా పర్వతరూపము ధరించి ఆ ఛాయపై బడి, అంత ఆ పర్వతముపై నుంచొని నృత్యమొనర్చ సాగెను. అంత దైత్యుడు చూర్ణమై, ఆతని మేధ, రుధిరము గణేశునిపై బడి ఆతడు వసంత ఋతువునందు పుష్పించు పలాస వృక్షము వలె శోభిల్లెను. దైత్యుడు మరణించుటచే బాలురు తిరిగి క్రీడా నిమగ్నులైరి.

అనంతరము అడవిదున్నవంటి బలిష్ఠమైన శరీరము, సూకర ముఖము, ఏనుగువంటి ఉదరము కలిగిన "చంచలుడు" అను దైత్యుడు అచటి కేతెంచెను. అతని పద ఘట్టనములచే పర్వతములు చూర్ణమగును. ఆతడు ఒక ముని కుమారుని రూపు ధరించి, ఆ బాలురమధ్యకేతెంచి, వారితో కందుక క్రీడలాడుట మొదలిడెను. తన హస్త లాఘవముతో వారిని అలరించుచూ ఆనందింప జేయుచుండెను. కొంతసేపటికి వారందరూ ఒక నిర్ణయమునకు వచ్చిరి. ఒక బాలుడు కందుకమును విసరవలెను. దానిని ఎవరు క్రిందపడకుండ పట్టుకొందురో వానిని కందుకము విసరిన వారు తమ వీపుపై మోయవలెను. కొంత సమయమైన పిదప దైత్యుడు కందుకమును విసరగా దానిని గణేశుడు పట్టుకొనెను. అంత దైత్యుడు గణేశుని మోయుటకు అంగీకరించి, ఆతనిని భుజములపై కూర్చుండబెట్టుకొని పరిగెత్తుట ప్రారంభించి ఆకాశమార్గమున కేగెను. మునికుమారులందరూ హాహాకారములు ఒనర్చసాగిరి. అంత గణేశుడు తన బరువును పెంచి పర్వత సమానుడయ్యెను. దైత్యుడా భారము సహింపలేక తనను కాపాడమని గణేశుని ప్రార్థించెను. అంత గణేశుడు క్రిందికి దిగి, ఆ దైత్యుని పాదములు పట్టి, గిరగిరా త్రిప్పి దూరముగ విసరివైచెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి ఖడ్గదైత్య సంహారమను తొంబై రెండవ అధ్యాయము సమాప్తము)

తొంబై మూడవ అధ్యాయము

(గణేశుని బాల్యలీల)

బ్రహ్మ "మునిపుత్రులు అచటనే గణేశుని కొరకు నిరీక్షించుచుండిరి. గణేశుడు దైత్యుని విసరివైచి తిరిగివచ్చిన పిదప వారందరూ జయజయ ధ్వానములు కావించిరి. తిరిగి వారందరూ క్రీడల యందు నిమగ్నమై యుండగా సూర్యాస్తమయము దాటి సగము ప్రహర గడచినది. ఈ పిల్లల తలిదండ్రులు తమ పుత్రులను కానక గ్రామము మధ్యకు ఏతెంచిరి. అక్కడను వారిని కానరాక, వారిని వెదకుచూ బాలకులను శిక్షించుటకు దండములు బూని ఏతెంచిరి. వారు గణేశుని కాంచి "నీ మూలముగ ఈ బాలురు స్నాన పానములు, ఆచార వ్యవహారములు, బ్రాహ్మణోచిత కర్మములు, వేదాధ్యయనము చేయక వినయమును సహితము త్యజించిరి" అని నిందించిరి. తదుపరి క్రోధము శాంతించి "మనము

ఈ బాలుని ఎట్లు దండింపగలము? శివ, పార్వతులు మటుకు ఏమి చేయగలరు? ఈ బాలుడొక్కడే అనాయాసముగ అనేకమంది దైత్యులను సంహరించెను. ఓ! గణేశా! నీ ఆగడముల వలన దూర దేశములకు ఏగదలచుకుంటిమి" అని పలికిరి. అంత గణేశుడు అచట అంతర్ధానుడై దూరముగ ఏగెను. బాలురందరూ తిరిగి గణేశుని చేరిరి. వారందరూ నడుచుచూ గౌతమాశ్రమము చేరిరి. వారందరూ ఆ మునిని ధ్యానావస్థయందునూ, ఆయన ధర్మపత్నిని గృహ కార్యములందునూ కాంచిరి. గణేశుడు గృహాంతర్భాగమునకేగి భోజన పాత్రను పట్టి, తన స్నేహితులతో ఇట్లనియె "మీరందరూ చాలా సేపటినుండి నాతో క్రీడించుచుండిరి. మీకందరకు ఆకలి యున్నది. దయచేసి నాతోపాటు ఈ భోజన మారగింప వలసినది" అని పలికెను. వారందరూ ఆ భోజన మారగించి తిరిగి క్రీడలందు నిమగ్నమైరి. అంత అహల్య గణేశునిపై కుపితయై "బాలకులారా! నేను నైవేద్యమర్పింప లేదు. వైశ్వేదేవము చేయలేదు. మీరు ఆ ప్రసాదమంతటినీ భుజించిరి. ఇపుడు మహర్షి ధ్యానము నుండి లేచి, భోజనమడిగిన ఎడల నేనేమని తెల్పుదును?" అని ప్రశ్నించెను. ఈ కోలాహలమునకు గౌతమునకు ధ్యానభంగమై లేచి, జరిగిన విషయము తెలిసికొని, గణేశుని చేయపట్టి, ఆతడు ఆరగించిన ఖాళీ భోజనపాత్రను సహితము తీసికొని గౌరీదేవి వద్దకేగి ఇట్లనియె "మాతా! మీ బాలుడు నిత్యము మా ఎడల అన్యాయ మాచరించు చుండెను. నేడు నీకు తెలుపుట కేతెంచితిని. ఇకపై ఏమి చేయుదువో నీ ఇష్టము. లేని ఎడల మేము ఏదేని దూర ప్రదేశమున కేగెదము." గౌరి ఈ పలుకులు విని క్రోధానలయై బాలుని లాఠీతో దండించి, క్రోధముతో మహర్షితో ఇట్లనియె "నాకు సహితము ఈ బాలకుని గూర్చి భయము కలుగుచున్నది. రాక్షసుల ద్వారా కావింపబడిన విఘ్నములు మీరునూ కాంచితిరి. మునులు కానీ, మునిపత్నులు, స్త్రీలు నాతో వార్తాలాపము లాడుటకు సహితము ఏతెంచుట లేదు. ఈతడు నా పుత్రుడగుటచే ఎవరు శాపమిచ్చుట లేదు" అని పలికి ఆ బాలుని చేతులు, కాళ్ళు, తాళ్ళతో కట్టి, ఒక గది యందుంచి బయట గడియపెట్టెను. గౌతముడు తన గృహమున కేగెను.

అంత బాలురందరూ శోకగ్రస్తులై, తాము తిరిగి ఎన్నడు గణేశుని కాంచెదమని శోకించిరి. వారట్లు తలవగనే గణేశుడు వారి మధ్య ప్రత్యక్షమయ్యెను. అచటేకాక ఆతడు పార్వతీదేవి ఒడియందూ, గదియందు సహితము దృష్టిగతుడయ్యెను. అంత బాలురు "మాతా! నీ పుత్రుడు బయటకు ఏతెంచెను" అని తెలిపిరి. అంత పార్వతి బయటకు వచ్చిచూడగా గణేశుడు బాలుర మధ్య, తాను బంధించిన గది యందు రెండు చోట్లా కనిపించెన77ు. అంత పార్వతి వినాయకుని తత్వము తెలిసి, తన తప్పు దిద్దుకొని, తలుపు తెరచి, ఆతని బంధనములు త్రెంచి, ముద్దాడి, హృదయమునకు హత్తుకొని భోజనమిడెను. గౌతముడు తన గృహమునకేగి దేవపూజనము ఆరంభమొనర్చెను. ఆయనకు ప్రతీ దేవతా స్వరూపము గణేశుని గనే కనిపించి, సర్వులు అన్న భక్షణ మొనర్చి తృప్తులైనట్లు గమనించెను. అంత ముని ఆశ్చర్యచకితుడై, తాను కావించిన కార్యమునకు లజ్జితుడయ్యెను. నేను క్రోధము వహించి పార్వతీదేవికి గణేశుని గూర్చి తెలిపితిని. వ్యక్త జగత్తుకు కారణమైన అవ్యక్త పరాత్పరుని ఆ మాత ప్రహారము కావించినది. ఎవరు భోజనమొనర్చిన సర్వులు తృప్తిచెంది మహా పుణ్యఫలము లభించునో, అట్టి పరమాత్ముడు తనంత తాను బాలకుల సహితుడై మా ఇంట భోజన మొనర్చెను. నేను ఆ గణేశ మాయచే తెలుసుకొన లేకుంటిని.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాంఖండమందలి గణేశుని బాల్యలీల అను తొంబై మూడవ అధ్యాయము సమాప్తము)

తొంభై నాల్గవ అధ్యాయము

(వినాయకునికి విశ్వకర్మ ఆయుధ ప్రదానము)

బ్రహ్మ "ఒకానొకనాడు గణేశుడు తన మిత్రులతో క్రీడార్థము బయటకు ఏగెను. ఆ సమయమున బాలుని దర్శనార్థమై విశ్వకర్మ ఏతెంచెను. పార్వతి విశ్వకర్మను సాదరముగ ఆహ్వానించి, ఆసనమిడి, ఆయన చరణ ప్రక్షాళనమొనర్చి, చందన తాంబూలములు సమర్పించెను. విశ్వకర్మ పార్వతీదేవి ద్వారా కావింపబడిన సత్కారమునకు అత్యంత ముగ్ధుడై ఆమెను ఇట్లు స్థుతించెను "ఓ! విశ్వేశ్వరీ, విశ్వరూపా, బ్రహ్మేంద్ర రుద్ర, ఆర్యమ, విష్ణురూపా! నీకు ప్రణామము లర్పించుచున్నాను. నీవు సర్వుల అంత:శక్తివి. బ్రహ్మాదులచే సహితము అభినందనీయురాలివి. విశ్వరచన కావించినది నీవే! రజో గుణాశ్రయవై జగత్తును సృష్ఠించి, సత్వ గుణముచే దానిని పాలించి, తమో గుణముతో దానిని సంహరించుచున్నావు. ఈ త్రిగుణాత్మికతయే నీ నిత్య రూపము. నీ ద్వారా మృతినొందు దైత్యగణము ముక్తి నొందెదరు. నీ యందు భక్తి కలుగు యోగులు జ్ఞానమొంది తద్వారా ముక్తి నొందెదరు. నీవే సంపూర్ణ విష్ణుశక్తివి, విశ్వమునకు హేతువు మరియు మహామాయ! సత్యాసత్యముల పరాశక్తి స్వరూపము నీవే! నిన్ను శరణుమొందిన భక్తులకు మృత్యు, దైత్య భయముండదు. నీవు పుణ్య కర్ములకు లక్ష్మీ స్వరూపము, పాపకర్ములకు అలక్ష్మీ స్వరూపము. నారీ స్వరూపము, త్రిలోకముల యందలి విద్యాస్వరూపము, సూర్యచంద్రుల యందలి తేజము నీవే! నిన్ను శరణుజొచ్చిన జనులు సంపూర్ణ జగత్తుకు ఆశ్రయదాత లగుదురు. వారికి లేశమాత్ర విపత్తి యందదు. ఓ! విశ్వేశ్వరీ! విశ్వసంహారకర్తవు, జలరూపిణివి, ఆదిమధ్యాంత రహితవు, నీవే! త్రిమూర్త్యాదులకు సహితము నీ దర్శనము దుర్లభము. కేవలము నీ కృప చేతనే భక్తులు నిన్ను భజించి ఆనంద స్వరూపులై స్వర్గమందు నివసించెదరు. ఈ నాడు నీ దివ్య చరణారవింద దర్శనముచే నా నేత్రములు, విద్య, జీవనము, మాతాపితరులు, వంశము, కులము ధన్యమయినవి." అంత పార్వతీదేవి సంతసిల్లి వరము కోరుకొనమనెను. అంత విశ్వకర్మ జగన్మాత పాదములందు అవిరళ భక్తి కోరుకొనెను. ఎవరు ఈ స్థోత్రమును పఠించెదరో వాని కామ్యకర్మములన్నియు ఫలించి విజయము, పుష్ఠి, విద్య, ఆయువు, సుఖము, కళ్యాణము ప్రాప్తించును.

అంత పార్వతి "ఓ! మహా బుద్ధిమంతుడవగు విశ్వకర్మా! నీ గూర్చి శివుడు తెలిపినవన్నియు నేడు నీవు నిజము చేసితివి. దేవతలందరు సింధు దైత్యుని కారాగారమందు యుండిరి. కైలాసము సహితము వారి హస్తగతమగుటచే శివుడు ఇచట కేతెంచెను. ఈ దండకారణ్యమందు ఆప్తజనులు ఎవరునూ కానరారు. చాలా కాలమయిన పిదప నీవేతెంచితివి." అంత విశ్వకర్మ "ఓ! జగదంబా! ఇందు ఆశ్చర్యమేమున్నది? బాలుడు తన తల్లి వద్దకు, భక్తుడు తన ఇష్టదైవము కడకు, విద్యార్థి గురువు వద్దకు ఏగెదరు. అట్లే నేను మీ పుత్రుని పరమాద్భుత మహిమను వింటిని. మీ ఇరువురి దర్శనార్థమే నేను ఏతెంచితిని." అదే సమయమున వారు వార్తాలాపము లాడుచుండగా బాలగణేశుడు అచటికి ఏతెంచెను. అసంఖ్యాక చంద్రులకాంతితో ప్రకాశించు ఆ పరబ్రహ్మ స్వరూపము ధూళి దూసరుడై, రక్త వర్ణమున యుండి, బాలకులచే చుట్టబడి యుండెను. ఆ సమయమున గణేశుడు నలుబది తొమ్మిది మంది మరుత్తులచే పరివేష్ఠింపబడిన ఇంద్రుని వలె శోభించుచుండెను. ఆ బాలుని చూడగనే విశ్వకర్మ లేచి, చేతులు జోడించి ఇట్లనియె "సచ్చితానంద స్వరూపా, సర్వ వ్యాపీ, ఈశానా, వ్యక్తా వ్యక్త స్వరూపా, నీవు సర్వ దేవతలకు అగమ్యుడవై సృష్ఠి స్థితి, సంహారములు కావించెదవు. యోగుల హృత్కమల నివాసా, సిద్ధి బుద్ధుల పతీ, భక్తులకు సిద్ధి ప్రదాతా, అభక్తుల కామనలను దగ్ధమొనర్చు ప్రభూ! సూర్య కోటి సమప్రభా! సర్వశక్తి సంపన్నా, దైత్య దానవ సంహార కర్తా! అనాది, అవ్యయ, శాంత, జరామరణరహితా, త్రిమూర్త్యాత్మకా, నీవే త్రయీ వేదములకు మూలము. నీకు నమస్కారము!!!.

అంత గణేశుడు "ఓ! విశ్వకర్మా! నీవు నా దర్శన హేతువై ఏతెంచితివి. నా ప్రసన్నతకై నీకేమి తెచ్చితివి?" అని ప్రశ్నించెను. విశ్వకర్మ "నిజ సుఖదానందపూర్ణా, ఇతరుల మనోకామనలను పూర్ణమొనరించు కృపానిధీ! సర్వకర్తా, సమలోష్టాశ్మ కాంచనా, నీవు నీ దానశీలత యందు కల్పవృక్షమును సహితము మించిన దాతవు. నీ ప్రతాపముచే స్వేచ్ఛానుసారముగ ఆచరణ కావింపగల సమర్ధుడవు. అటువంటి దివ్య పురుషుడవైన నీకు పరాధీనుడను, అసమర్ధుడను, అకించినడను, మరణ శీలుడనైన నేను ఏమియ్యగలను? కానీ నా శక్త్యానుసారము నేను కొన్ని తెచ్చితిని" అని పలికి సహస్రసూర్యుల పగిది ప్రకాశించుచున్న పాశాంకుశ, పద్మ, పరశువులను గణేశునికి బహూకరించెను. గణేశుడు వానిని ధరించి ఇట్లు ప్రశ్నించెను "విశ్వకర్మా! నీవీ ఆయుధములు ఎట్లు చేసితివి?" అంత విశ్వకర్మ "నాకు సంజ్ఞ" అను నామము గల కన్యక కలదు. ఆమె పూర్ణచంద్ర నిభానన. ఆమెను కాంచి లక్ష్మీ, ఇంద్రాణి, సావిత్రి, శారద, అరుంధతీ, రతి లజ్జితులు అగుదురన అతిశయోక్తి కాదు. నేను ఆమెను వేదత్రయీ స్వరూపుడయిన ఆదిత్య భగవానునికిచ్చి అంగరంగ వైభోగముగ వివాహము ఒనరించితిని. ఎనిమిది దినములు మహోత్సవములు జరిగినవి. అటుపిదప ఆదిత్యుడు ఆమెను తీసికుని తన గృహమున కేగెను. సంజ్ఞ సూర్యుని తేజస్సు భరింపజాలక సంతప్తయై ఆమె స్థానమందు ఆమె ఛాయను యుంచి తాను తిరిగి నా వద్దకేతెంచి విషయమును వివరించెను. కొంతకాలమునకు సూర్యుడీ విషయము గ్రహించి నావద్ద కేతెంచి సంజ్ఞ గూర్చి ప్రశ్నించెను. అంత సంజ్ఞ భయభీతయై తనను తిరిగి తన భర్త వద్దకు పంపవలదని కోరెను. నేను ఆమె అభ్యర్ధనను నిరాకరించుటచే, ఆమె ఒక అశ్వనీ రూపము నొంది ఒక గుప్త ప్రదేశమున నివసింపసాగెను. అంత నేను సూర్యునికి ఈ విషయములన్నియు విశదపరచి, ఆమె అతని తేజస్సును భరింపజాలకున్నది అని తెల్పితిని. అంత సూర్యుడు తరుణోపాయమును తెలుపమని అడిగెను. నేను సూర్యుని ఒక చక్రమందు బంధించి, కొంత తేజస్సును హరించి, ఆయనను శాంతపరచితిని. అంత సౌమ్యుడయిన సూర్యుడు తన దివ్య దృష్టిచే సంజ్ఞ యున్న స్థానమును కనుగొని, అచటికేగి తాను ఒక అశ్వరూపమునొంది ఆమెతో రమించెను. తత్ఫలితముగ అశ్వనీ దేవతలు ఉదయించిరి. అటుపిదప సంజ్ఞ తిరిగి సూర్యుని చేరెను. సూర్యుని నుండి నేను వేరుపరచిన తేజముచే నేను విష్ణువునకు సుదర్శన చక్రము, శివునకు త్రిశూలము, మీకు ఈ చతురాయుధములు తయారు చేసితిని."

అంత గణేశుడు "ఓ! విశ్వకర్మా! నీ వొనర్చిన కార్యము శుభప్రదము. నీవు దైత్య నాశనమునకు, సజ్జనులకు పరోపకార మొనర్చుటకు, నాకు ఈ ఆయుధములు ప్రదానము కావించితివి" అని పలికి ఆ ఆయుధములు ధరించి శోభాయమానుడయ్యెను. అంత విశ్వకర్మ వారిరువురి అనుజ్ఞనొంది, వారికి నమస్కరించి తన స్థానమునకు చనెను. తదుపరి గణేశుడు క్రీడార్ధము బాలకులతో బయటకు ఏగెను. అచటకు "వృకుడు" అను రాక్షసుడు ఏతెంచెను. ఈ దుష్టుడు తీక్షణమైన ముఖము కలిగి, తన పుచ్ఛమును తాడించి పృధివిని కంపింప జేయుచుండెను. దంతములు నాగళ్ళవలె యుండి, పరమ భయంకర రూపుడై ఏతెంచెను. ఆ వృకమును గాంచి మునిబాలకులందరూ పరుగులెత్తిరి. అంత గణేశుడు తన అంకుశమును ప్రహరించి ఆ వృకమును సంహరించెను. అంత వృకుడు తన నిజరూపముతో, పది యోజనముల నిడివితో నేలపై బడెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి విశ్వకర్మచే ఆయుధ ప్రదానమను తొంబై నాల్గవ అధ్యాయము సమాప్తము)

తొంభై ఐదవ అధ్యాయము

(గుణేశుని ఉపనయనము)

బ్రహ్మ "వినాయకునకు ఏడవ వత్సరము జరుగుచుండగా ఒకనాడు పార్వతి శివుని చేరి "ఓ! దేవేశా! గణేశునకు ఏడవ వత్సరమేతెంచినది. దయచేసి ఒక శుభ ముహూర్తము నిర్ణయించి ఈతనికి ఉపనయన సంస్కారము ఒనరింపవలసినది." అంత శివుడు "కళ్యాణీ! నీవు నా హృదయము నెరిగి పలుకుచుంటివి. నేను ఆ కార్యమును తప్పక నిర్వహించెదను" అని పలికి గౌతమాదులను రావించి, ఒక శుభ ముహూర్తము నిర్ణయించి, వలసిన సామాగ్రిని ఏకత్ర మొనర్చెను. ఆ ఉత్సవార్థమై ఒక విస్తృత మండపమును నిర్మించిరి. సమస్త ఋషి, ముని గణములు, ఆహ్వానింపబడెను. శివుడు వారందరినీ యధావిధిగ పూజించి బహుమతులు ప్రదానము కావించెను. ఆహ్వానితులైన ఋషి, ముని గణములు, ముప్పదిమూడు కోట్ల దేవతలు, యక్ష, కిన్నెర, చారణాదులు సహితము శివ కుటుంబమునకు బహుమతులిచ్చిరి. వాతావరణమంతయు నానా వాద్యఘోషచే మారుమ్రోగుచున్నది. గంధర్వులు గానము చేయుచుండగా, అప్సరసలు నాట్యమాచరించు చుండిరి. దేవతలందరినీ యధా స్థానములందు స్థాపించి, వారందరికీ భోజనములిడిరి. ప్రాత:కాలముననే వటువుకు స్నానము, చౌల సంస్కారము కావించి, బ్రాహ్మణులతో పాటు ఆతనికి భోజనము తినిపించి, తిరిగి స్నానము చేయించి, వటువును వేదిక యందు కూర్చుండబెట్టి, మంత్రోచ్ఛారణ జరుగుచుండగా ముహూర్త సమయము కొరకు వేచియుండిరి.

ఆ సమయమున "కృతాంత", "కాల సంజ్ఞక" అను ఇరువురు దైత్యులు మదమత్త కుంజర రూపములు ధరించి అచట కేతెంచిరి. పదునైన దంతములు, పొడవాటి తొండము, సింధూర లేపన మొనరింపబడిన గండస్థలము, పర్వతముల వంటి దేహము కలిగి తమ పద ఘట్టనములచే పృధివిని కంపింపజేయుచూ, ఘీంకారములచే సర్వులను భయభీతు లొనర్చుచుండెను. ఆ రెండు ఏనుగులు పరస్పరము యుద్ధమొనర్చుచూ, సభాస్థలికేతెంచి, ద్వారమునందున్న ఐరావతము కుంభస్థలముపై ఆఘాతము కావించినది. అంత ఐరావతము క్రిందపడి మూర్ఛనొందెను. కొంత తడవు అయిన పిదప ఆ గజము మెలకువనొంది పలాయన మొనర్చెను. అంత ఆ రెండు కుంజరములు ఐరావతము వెంటపడి తిరిగి ఆఘాతము కావించి గాయపరచి వెనుకకు సభాస్థలి కేతెంచినవి. ఆ భీకర గజముల కాంచి సర్వులు భయభీతులై దశదిశలా పరుగులెత్తిరి. వినాయకుడు ఏకాకియై వేదికపై కూర్చుండెను. అంత కుంజరములు ఆయనపై దాడి యొనర్చినవి. వినాయకుడు ఒక భీషణ గర్జనమొనర్చి, కాయము పెంచి, తన రెండు చేతుయందు ఆ రెండు కుంజరముల తొండములు చేతబట్టి, గిరగిరా త్రిప్పి నేలపై విసరెను. రెండు కుంజరములు తక్షణము మరణించినవి.

అంత పలాయనమొనర్చిన దేవతలు, ఋషులు, మునులు, సర్వులు తిరిగి సభాస్థలికి ఏతెంచిరి. సర్వులు ఆయనను "సర్వగుణాకరా! కుంజరముల కపటవేషమును పసిగట్టి వాని పని పట్టితివి. లీలామాత్రముగ వానిని సంహరించితివి. నీకు జయము" అని పలికిరి. తదుపరి బ్రహ్మదేవుడు శివునితో సంప్రదించి మేఖలను కట్టెను. తదుపరి యజ్ఞోపవీతము, మృగచర్మము ధరింపజేసి, హోమాగ్ని యందు సమిధలు వేసి, అగ్నిని ప్రజ్వలింపజేసి గాయత్రీ మంత్రముపదేశించిరి. తల్లి పార్వతి ఆ వటువుకు ప్రధమభిక్ష, వస్త్రద్వయము, ఉత్తరీయము, ఆభూషణములు, రత్నములు, ముత్యములు, భక్ష్య భోజ్యములు ప్రసాదించెను. శివుడు త్రిశూలము, చంద్రవంక ప్రసాదించి "ఫాలచంద్ర", మరియు "శూలపాణి" అను నామములు ప్రసాదించెను. విష్ణువు తన చక్రమును ప్రసాదించి "శోచిష్కేశ" అను నామమునిచ్చెను. ఇంద్రుడు ఆ బాలుని పూజించి చింతామణిని ఒసంగి "చింతామణి" అను నామమిచ్చెను. బ్రహ్మ కమలమునిచ్చి "విధాత"

అని పిలచెను. తదుపరి దేవగణములందరునూ ఆయనను పూజించి వివిధ బహుమతులిచ్చిరి. ఆ సమయమున అదితీ, కశ్యపులు అచటికేతెంచి అత్యంత ఆదర భావముతో పూజించిరి. గణేశుడు వారికి తన పూర్వకాలిక శుభరూపమును దర్శింపజేసెను. ఆ రూపమును ఆయన దశభుజుడు, చంద్రశేఖరుడు, ముకుట కుండలధారి, దివ్యగంధవస్త్రధారి, దివ్యాభరణ భూషితుడు, సింహారూఢుడు, నాగయజ్ఞోపవీతుడై యుండెను. అదితీ, కశ్యపులు ఆ రూపము చూచి రోమాంఛితులై, గద్గద శరీరులై, స్నేహ పూర్వకముగ ఆయనను ఆలింగన మొనర్చిరి. అటు పిదప వారి కన్నుల వెంట ఆనందాశ్రువులు రాలుచుండగా, ఇట్లనిరి "వత్సా! మేమిరువురము నీ విరహముచే కృశించి యున్నాము. నీ దర్శనముచే ఆనందభరితులమైతిమి. మేము నీ చరణానురక్తులము. మమ్ము విడువవలదు." అంత గణేశుడు "మాతా! నేను మీకు మరొక దర్శనము ఇచ్చెదనని వాగ్దాన మొనర్చితిని. అందువలన నేడు మీకు నా దర్శనము కలిగినది. మీరు శోకింపవలదు. నేను సర్వాంతర్యామిని. నేను సర్వుల హృదయమందు ప్రతిష్ఠితుడనై యున్నాను. మీకు నా వియోగమెన్నటికీ కలుగదు."

ఈ విధముగ వార్తాలాపములు జరుగుచుండగా పార్వతీదేవి అచటికేతెంచి, అదితీ కశ్యపులు కాంచి, ముదితమనస్కయై ఆమెతో "అదితీ! నీవు నా పుత్రుని చాలా సమయము ఎత్తుకొని యుంటివి. ఇక నాకు ఈయవలసినది" అని పలికెను. అంత అదితి గణేశుని దశభుజరూపము కాంచుచూ "పార్వతీ! ఈతడు నా పుత్రుడు. సరిగా చూడవలసినది" అని పలికెను. అంత వారిరువురూ "ఈతడు నా పుత్రుడే" అని వాదులాడ మొదలిడిరి. అంత దేవతలు ఆశ్యర్యచకితులై "ఆద్యంత రహితుడు, సృష్టి స్థిత్యంతకారుడు, అనంతరూపుడు, అనంత శ్రీ, శక్తి సంపన్నుడు అయిన భగవంతుడు ఎవరికి పుత్రుడు కాగలడు? వీరిరువురు శ్రీగణేశుని మాయలో పడిరి" అని పలికిరి. అంత ఆ మాతలిద్దరూ ఈ బాలుడు ఎవరి పుత్రుడో నిర్ణయించమనిరి. అంత ఆ బాలుని చూచి కొందరు విధాతయనీ, కొందరు విష్ణువనీ, కొందరు శివుడనీ, మరికొందరు వరుణుడనీ పేర్కొని చివరకు మా తరము కాదనిరి. మీరిరువురు మీ వివేకము ననుసరించి నిర్ణయించుకొన వలెనని తెలిపిరి. అంత శీఘ్రమే పార్వతి ఆ బాలుని తీసికొని, ముద్దాడి, స్థనపానమిచ్చెను. అంత అదితి నీరసించి "ఇతడు నా బాలుడయిన వేరొక స్త్రీ యొక్క స్థనపాన మెట్లు కావించును? నేను భ్రమించి ఈతడు నా బాలుడే అని అనుకుంటిని" అని తలచెను. తదుపరి మునులు, కశ్యపుడు సర్వులు ఆ బాలుని పూజంచి వీడ్కోలు పలికిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశుని ఉపనయనమను తొంభై ఐదవ అధ్యాయము సమాప్తము)

తొంభై ఆరవ అధ్యాయము

(నాగ, విహంగ సమరము)

వ్యాసుడు "విధాతా! మీరు మయూరేశ్వరుని గూర్చి ప్రస్తావించిరి. కానీ గుణేశుని గూర్చి తెలుపుచుండిరి. గుణేశు డు మయూరేశ్వరుడెట్లయ్యెను? దయచేసి తెలుపవలసినది." భ్రహ్మ "తప్పక తెలిపెదను. పాతాళమున ఒకనాడు సభామధ్యమున శేషుడు సింహాసనాధీశుడై యుండెను. ఆయనను పరివేష్ఠించి వాసుకి, కర్కోటకుడు మొదలయిన సర్పరాజులు యుండిరి. ఆ సమయమున అత్యంత సుందర స్వరూపిణి, తేజస్విని, మణిరత్న స్వర్ణమాలా విభూషిణి, పూర్ణచంద్ర నిభానన, దివ్య వస్త్రధారిణి అయిన నాగమాత కద్రువ అచటికి ఏతెంచెను. అంత శేషాదులు అందరూ నిలబడి, ఆమెకు ప్రణామములర్పించి, ఆమెను ఆశీనకావించి ఇట్లనిరి "తల్లీ! మేమందరమూ మీ దర్శనమునకై తహతహ లాడుచుంటిమి. మాతా! నీవు కశ్యపుని అతిలోక సందరివైన భార్యవు, మరియు పరమ పతివ్రతవు. ఆయన సర్వ విద్యా

నిధానుడు. ఆయన శక్తి దేవతలు సహితము తెలియరు. నీవు సహితము ఆయన వలెనే శాపానుగ్రహ సమర్ధురాలివి. నీవేతెంచిన కారణము తెలుపవలసినది.” కద్రువ “నాయనలారా! ప్రయోజనము లేక ఎవరు ఎవరివద్దకు ఏగరు. నా సపత్ని పక్షులకు జనని అయిన వినత. ఒకనాడు నాకు ఆమెను చూడవలెనన్న కోరిక కలిగినది. నేను ఆమె గృహమున కేగితిని. ఆమె నన్ను నిర్లక్ష్యము చేసి అవమానించినది. నాకు సత్కారము చేయలేదు. అసన మీయలేదు. పూర్వకాలపు వైరము గుర్తుపెట్టుకొని తన పుత్రుడయిన జటాయువును ప్రేరేపించి, నా దుస్తులను లాగి నన్ను వివస్త్రను కావించినది. జటాయువు నాతో ఇట్లనియె “ఓ! దుష్ట వనితా! నీ ముఖము మరెన్నడూ చూపించవలదు. పూర్వకాలమున నీవు నా తల్లిని నీ దాసి గావించితిని. నీకు లేశమాత్రమైన కరుణ లేకుండెను. నీవు వెంతనే ఇచటి నుండి వెడల వలసినది. లేని ఎడల నిన్ను సంహరించెదను. నీ ముఖము మరెన్నడూ చూపింప వలదు.” కద్రువ “నాగరాజా! ఆ వచనములు విని నేను మిక్కిలి దు:ఖితనైతిని. నేను మిక్కిలి రోదించి ప్రాణత్యాగమునకు నిశ్చయించితిని. అయిననూ మిమ్ము దర్శించుటకు ఏతెంచితిని. మీకు నా ఎడల ఏవిధమయిన భక్తి యున్ననూ నాకు సహాయ మొనర్పవలసినది. మీరు నా సపత్నికి వినాశ మొనర్పవలెను. అప్పుడే నాకు సుఖము కలుగును.”

అదివినిన శేషుడు ఘ్రుతముచే ప్రజ్వలించు అగ్నివలె భగ్గున మండిపడెను. వినత నా తల్లి ఎడల అపరాధ మొనరించిన ఎడల నేను ప్రతీకార మొనర్చెదనని పలికి, వాసుకి మొదలగు నాగులతో వినత మందిరమునకు ఏగుటకు సిద్ధపడెను. అంత వాసుకి “ఓ! ఆనఘా! మీరు వెళ్ళవలదు. నేను నా సోదరులతో ఏగి ఆమెను ఇచటకు తెచ్చెదను” అని పలికి వినత ఆశ్రమమున కేగెను. అసంఖ్యాకమయిన సర్పములు తనను చుట్టుముట్టుటచే వినత భయకంపిత అయ్యెను. ఆ సర్పములన్నియు ఆమెను బంధించి శేషుని వద్దకు తీసికొని వచ్చినవి. వినత “ఓరీ! పాపిష్టులారా! నిరపరాధినైన నన్ను ఎందుకు బంధించి తీసికొని వచ్చితిరి? నా పుత్రుని ప్రభావము మీకందరకు ఎరుకయే! నన్ను వెంతనే విడువ వలసినది. లేని ఎడల నా పుత్రుడు మిమ్ముల నందరినీ సంహరించును.” అంత వినత ఆ సర్పముల దుష్టతను గమనించి గరుడుని స్మరించెను. గరుడుడు సహితము తన పక్షిమూకలతో ఏతెంచెను. వారితో శ్యేన, సంపాతి, జటాయువులుండిరి. పక్షులు తమ రెక్కలతో భూమిని కంపింపజేయుచుండగా, సర్పములు విషమును గ్రక్కుచున్నవి. ఈ విధముగ వారిరువురు నడుమ భయంకర సంగ్రామము జరుగుచుండెను. అంత సర్పములు శ్యేన, సంపాతి, జటాయువులను బంధించిరి. గరుడుడు తన పక్షములు కదుపుచూ అచటి కేతెంచగా, వాని వాసనను పసిగట్టి సర్పములు పలాయన మొనర్చినవి. గరుడుడు వినత బంధములు విడదీసి తీసికొని వెడలుటకు సమాయత్త మయ్యెను. ఇంతలో వాసుకి విషము గ్రక్కుచూ అచటికేతెంచెను. గరుడుడు తన రెక్కలతో వాసుకిని బలముగ ప్రహరించి భూమిపై పడద్రోసెను. అంత వినత స్వస్థత నొంది తన సుస్థిర ప్రదేశమున కేగెను. అంత వాసుకి మిక్కిలి కృద్ధుడై శ్యేన, సంపాతి, జటాయువులను ఒక బిలము నందు దాచి, దానికి అడ్డముగా ఒక పాషాణము నుంచెను. తదుపరి వాసుకి ఆ సమాచారమును తన తల్లికి, శేషునకు తెలిపెను.

తన పుత్రులు ముప్వురు బంధితులైన సంగతి తెలిసి వినత దు:ఖితురాలై, తన పతి అయిన కశ్యపుని వద్దకేగి, నమస్కరించి, జరిగిన విషయములన్నియు ఏకరువు పెట్టి “స్వామీ! నా పుత్రులు బందీలయిరన్న విషయము విని నా ప్రాణములు నిలుచుట లేదు. మీ వంటి పతి యుండి నాకీ దు:ఖము ఎందువలన ప్రాప్తించుచున్నది?” అంత కశ్యపుడు “ఓ! ప్రేయసీ! నీవు చింతింపవలదు. నేను నీతో ఋతుకాలమందు సంగమించెదను. తత్ఫలితముగ నీకు ఒక పుత్రుడు జన్మించును. నీ గర్భము నుండి ఉత్పన్నమయ్యెడు అండము వజ్రముచే కూడా ఖండింపబడదు. కానీ పార్వతీ తనయుని కాలితో తొక్కబడినపుడు, దాని నుండి రెండవ నీలకంఠుడా అన్నట్లు నీ పుత్రుడు (పక్షి) ఉత్పన్నమగును. ఆ పక్షి కూత విన్నంతనే సర్పములు పరాభవము పొంది పారిపోవును. ఆ పక్షినధిరోహించి గుణేశుడు పృధివీ భారమును హరించును”

అని పలికి ఆమెను ఒక ఏకాంత ప్రదేశమునకు గొనిపోయి ఆమెతో సంగమించెను. తదుపరి వినత జంతు రహితమైన ఒక ఉపవనమునకేగి అచట తగు సమయమున ఒక అండమును ప్రసవించెను. అయ్యది వజ్రఘాతముచే సహితము పగులనంత దుర్భేద్యముగ యుండెను. ఆమె ఆ అండమును వృక్ష వల్కలములచే కప్పి, ఒక మృత్పిండ భాండమందు యుంచి, దానిపై స్థిరముగ కూర్చొనెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి నాగ విహంగ సంగ్రామమను తొంభై ఆరవ అధ్యాయము సమాప్తము)

తొంభై ఏడవ అధ్యాయము

(గణేశుడు మయూరేశ్వరుడగుట)

బ్రహ్మ "గణేశునకు ఏడు వర్షములు నిండి ఎనిమిదవ వర్ష మేతెంచినది. ఆతడు ఉదయమే స్నానాదులాచరించి గాయత్రీ మంత్రము, చతుర్వేద పారాయణ యందు తత్పరుడై యుండెను. ఆ సమయమున వినాయకుడు కస్తూరీ తిలక ధారణ చేసి నానా భూషణాలంకృతుడై, దివ్య దుకూలధారియై, దివ్య గంధానులేపితుడై, దివ్య మాలా విభూషితుడై యుండెను. ఆ సమయమున ముని పుత్రులు అచటి కేతెంచిరి. సూర్యకాంతి చే మేఘములు దీప్తించినటుల గణేశుని కాంతిచే వారందరూ ప్రకాశించుచుండిరి. అంత గణేశుడు వారందరి మస్తకములపై తన దివ్య హస్తము నుంచెను. మూడు, నాలుగు, ఐదు వత్సరముల బాలురు సహితము వేదాధ్యయనమందు దిట్టలయిరి. వారందరికీ వేదములు, వేదార్థములు కరతలామలకములైనవి. వారందరికీ ఆకాశవాణి నుండి వేదము వినిపింప సాగినది. ఆ బాలురందరూ చతుర్వేదములను పారాయణ మొనర్చుట మొదలిడిరి. పశువులు తమ గ్రాసము తినుటమాని ఆ వేద శబ్దమును విని ఆనందించుచున్నవి. బాలురు ఋగ్, యజుర్వేదములు పారాయణ సమాప్త మొనరించి సామవేద గానమారంభించిరి. ఆ దివ్యగానము వినుటకు సింహ, శార్దూల, కుంజర, హరిణ, సర్ప, పక్షి గణములేతెంచి కన్నుల అశ్రుధారలు కారుచుండగా ఆ గానమందే నిమగ్న మయినవి. ప్రమదులు విగ్రహముల వలె నిలబడిరి. శివుని శిరమందలి చంద్రుడు అమృతవర్షము కురిపింప నారంభించెను. అమృత సంపర్కముచే శివుని గళమందలి పుర్రెలమాల నుండి సజీవ పురుషులు ఉత్పన్నమయిరి. ఆ సామగానము సంగీతమందు నిష్ణాతులైన గంధర్వ, కిన్నెరలును సహితము లజ్జితుల నొనర్చినది. కామభావన పొందిన మనుజులు శాంతి నొందిరి.

ఆ సమయమున ఒక దైత్యుడు ఒక విచిత్రాకృతి గల జంతువు వలె ఏతెంచెను. ఆతని ఉచ్ఛ్వాస, విశ్వాసములచే గుహలు ప్రతిధ్వనించు చున్నవి. నాగళ్ళవంటి దంతములు, గుహ వంటి నాసిక, చెరువులు వంటి కళ్ళు, కలిగి అత్యంత క్రూరముగ యుండెను. ఆ విచిత్ర జంతువునకు ఐదు నేత్రములు, నాలుగు కొమ్ములు, ఎనిమిది కాళ్ళు, నాలుగు చెవులు, మూడు ముఖములు, రెండు తోకలు కలవు. ఆ విచిత్ర జంతువును చూడగనే గుణేశుడు పెద్దపెట్టున అట్టహాస మొనర్చి, తన తోడి బాలురతో ఆ విచిత్ర జంతువును చూడమని చెప్పెను. బాలురు సహితము అటువంటి విచిత్ర జంతువును అంతకు ముందు చూడలేదని తెలిపిరి. ఆ జంతువు తన చేష్టలతో ఎల్లరనూ విస్మయాన్వితుల కావించుచున్నది. ఒక్కొక్కసారి నృత్య మొనర్చుచూ, ఒక్కొక్కసారి పైకి, క్రిందికి ఎగురుచూ, కొన్నిసార్లు దగ్గరకు వచ్చుచూ, కొన్ని సార్లు దూరముగ నిలుచుచూ, కొన్ని మార్లు అదృశ్యమయి తిరిగి ప్రత్యక్షమగుచు, తన విన్యాసములను చూపుచుండెను. అంత గణేశుడు బాలురను కాంచి ఆ పశువును బంధింపమని తెల్పెను. గణేశ సహిత బాలురందరూ ఆ విచిత్ర జంతువును

బంధించుటకు దాని వెనుక పరుగెత్తిరి. వారిని చూచి ఆ మృగము సహితము పరుగులిడి, ఒక దట్టమయిన విపినము ప్రవేశించి అంతర్ధానమయ్యెను. ఆ వనమంతయు సింహ, శార్దూల, కుంజర, సూకర, సర్ప మయము. అంత గణేశుడు ఖిన్నుడై, కోపముతో కన్నులెఱ్ఱబడి తన పాశమును విసరెను. ఆ పాశము భూమ్యాకాశములనేకము చేయు శబ్దము కావించుచూ, దైత్యుని పట్టి గణేశుని వద్దకు ఈడ్చుకువచ్చెను. పాశమందు బంధింపబడుటచే ఆ మృగము ఉపిరి తీయలేక ఆ బాలురందరూ చూచుచుండగనే అసువులు బాసెను. అంత ఆ దైత్యుడు తన నిజ రూపము నొంది ఇరువది నాలుగు యోజనముల శరీరముతో క్రిందపడెను. అంత బాలురందరూ జయజయ ధ్వానములు చేసి గణేశుని ప్రశంశించిరి.

ఇంతలో బాలురందరికీ ఆకలి వేసినది. వారు చుట్టూచూసి దగ్గరలో యున్న మామిడిచెట్టును కాంచి, దాని పండ్లను ఆరగించుచూ, ఒకరిపై ఒకరు ఆ పళ్ళరసమును జల్లుకొనుచూ, క్రీడించుచూ పరుగులిడుచుండగా ఒక విచిత్రము జరిగినది. వారందరూ తన గుడ్డును కాపాడుకొనుచూ కూర్చొనియున్న వినతను కాంచిరి. వినత సహితము బాలురను చూచి వారి వంక దూసుకొని వచ్చెను. ఆమె రెక్కల తాకిడికి క్రూర మృగములు ఎగిరి పడుచున్నవి, వృక్షముల కొమ్మలు విరిగి పడుచున్నవి. ఆ తాకిడిని చూచి గణేశుడు ఒక చెట్టు తొఱ్ఱలోనికి దూరెను. అందు చంద్రమండల సమానము, అత్యంత శ్వేత వర్ణము, కలిగిన ఒక అండమును కాంచెను. గణేశుడా అండమును తాకగనే అయ్యది పగిలి దానిలోనుండి నీలివర్ణ కంఠము, పెద్దపెద్ద రెక్కలు, విశాల నేత్రములు కలిగిన ఒక సుందర విహంగము ముఖము నుండి అగ్ని చిమ్ముచూ బయటి కేతెంచి, తన రెక్కలను ఒక్కమారు విదిలించెను. ఆ శబ్దము చే భూమి కంపించి, సముద్రము చెలియలికట్ట దాటెను. ఆ పక్షిని చూచి ముని బాలకులు పలాయనమైరి. ఆ పక్షి బాలురను వెంబడించ సాగెను. తన మిత్రులను బాధించుచున్న పక్షిని అదుపుచేయుటకు గణేశుడు నిశ్చయించి, ఆ పక్షి యొక్క రెక్కలను పట్టెను. అంత ఇరువురు యుద్ధ మొనర్ప మొదలిడిరి. ఆ విహంగము తన రెక్కలతో, వాడి అయిన ముక్కుతో గణేశునిపై ఘాతమొనర్చెను. గణేశుడు సహితము తన ముష్ఠి ప్రహారములచే ఆ పక్షిని మర్దించెను. గణేశుడు ఆ పక్షిపై తన నాలుగు ఆయుధములు ప్రయోగించెను. చిత్రము. అవి నిష్ప్రయోజనములై క్రింద పడినవి. అంత ఆ నీలకంఠ పక్షి వేగమున ఎగిరి బాలురను తన కాళ్ళతో పట్టి, బంధించి ఎగురసాగెను. అంత గణేశుడు ఆ పక్షిని వెంబడించి, తన మిత్రులను విడిపించి, ఆ పక్షిని తన బలముతో లొంగదీసుకొని, దాని నధిరోహించి, కొంతసేపు విహరించి క్రిందికి ఏతెంచెను.

ఆ సమయమునకు ముని బాలురు, వినత, ఆక్కడికేతెంచిరి. అంత వినత అత్యంత వినీతయై ఇట్లు స్థుతించెను "స్వామీ! నీవు రజోగుణాశ్రయుడవై బ్రహ్మవై జగత్తును సృష్ఠించి, సత్వగుణముతో విష్ణువవై దానిని సంరక్షించి, తమోగుణముతో రుద్రునివై ఆ జగత్తును సంహరించెదవు. నీ రూపమును దేవతలు, ఋషులు తెలియరనిన మేమెంత?" ఈ విధముగ స్థుతించి "ప్రభూ! నేను కశ్యప పత్నినైన వినతను. ఈ పక్షి మా ఇరువురికీ జన్మించిన మయూరము. ఈ అండమును ఎవరు భేదించెదరో, ఆతడే ఈ పక్షికి స్వామి అగునని కశ్యప మహర్షి నాకు ఇంతకుముందే తెలిపెను. ఆతడే నా పుత్రులకు విముక్తి ప్రసాదించునని కూడా ఆ మహాత్ముడు తెలిపెను. నేను చిరకాలము నుండి నీ చరణ కమల దర్శనమునకై వేచియుంటిని. కద్రువ పుత్రులు నా పుత్రులయిన శ్యేన, సంపాతి, జటాయువులను పట్టి పాతాళ బిలము నందు బంధించిరి. ఓ! జగన్నాధా! నా పుత్రులను అక్కడినుండి విడిపించి, నాకు నా పుత్ర దర్శనము కావింపుము" అని ప్రార్ధించెను. అంత గణేశుడు "మాతా! నీవు చింతింపవలదు. నీకు నీ పుత్ర దర్శనము అగును" అని పలికి మయూరము వైపు తిరిగి "నీవు వరదానమడుగుము" అని పలికెను. మయూరము "స్వామీ! మీరు నా ఎడల ప్రసన్నులైన ఎడల నా నామమును మీ నామము ముందుంచి, నా నామమును లోకవిఖ్యాత మొనరింపవలసినది; మరియు నాకు మీ చరణములందు ధృఢశక్తిని ప్రసాదింపవలసినది" అని వచించెను. అంత గణేశుడు సంతసిల్లి "నీ అంతరాత్మ నిర్లోభమయినది. నీవు కోరినట్లే నా నామము "మయూరేశ్వరుడు" గా విఖ్యాతమగును. నీకు నా యందు ధృఢభక్తి కలుగును." ఇదంతయు

గాంచి వినత అనంద మనస్కయై తన ఆశ్రమమునకు చనెను. అంత గణేశుడు ఆ విహంగ మధిరోహించి తన ఆశ్రమమునకు కేతెంచెను. వాని వెనుక ముని బాలురు "మయూరేశ, మయూరేశ" అని జపించుచూ గణేశుని అనుగమించిరి. గణేశుడు గృహమున కేతెంచి జరిగిన విషయమంతయు తన తల్లికి నివేదించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశుడు మయూరేశుడగుట అను తొంబై ఏడవ అధ్యాయము సమాప్తము)

తొంబై ఎనిమిదవ అధ్యాయము

(ముని బాలకులకు విశ్వరూప సందర్శనము)

బ్రహ్మ "మయూరేశునకు నవ వర్ష ప్రాయమేతెంచినది. ఒకనాడు ఆతడు తన మయూరము నధిష్ఠించి ఆయుధధారియై, కస్తూరి తిలకము, దివ్య దుకూలములు ధరించి బాలకులతో క్రీడించుచుండెను. బాలకులు ఆయనను పరివేష్ఠించి జయజయ ధ్వానములు కావించుచుండిరి. కొందరు ఆయనకు ఛత్రము పట్టిరి. కొందరు చామరములు వీచుచుండిరి. ఈ విధముగ బాలరందరూ మహోత్సవము కావించుచూ నెమ్మదిగ ఒక సరోవరము చేరిరి. ఆ సమయమున కొందరు బాలురు ఆ సరోవరమందు దూకిరి. కొందరు సరోవర తీరమునున్న మామిడి చెట్లపై క్రీడించుచుండిరి. ఆ సమయమున ఒక మహాదైత్యుడు అశ్వరూపుడై అచటి కేతెంచెను. ఆ అశ్వపు సకిలింపులచే త్రిలోకములు కంపించుచుండెను. తన తోకను ఝుళిపించుచూ ఆ అశ్వము ఇతర జంతువులను హింసించుచుండెను. ఈ విధముగ దైత్యుడు ముందునకేతెంచి, తన శరీరముతో మామిడి చెట్టును త్రోయుట ప్రారంభించెను. ఆ తాకిడికి ఆ వృక్షముపైనున్న బాలురందరూ క్రిందపడిరి. గజాననుడు సహితము క్రిందపడి, ఆ అశ్వపు రెండు చెవులను పట్టి సరోవరము లోనికి ఈడ్చెను. ఇరువురు చాలసేపు జలాంతర్భాగమున యుండుటచే ముని కుమారులు గణేశుని కొరకై రోదించుట నారంభించిరి. అంత గణేశుడు ఆ అశ్వమును అధిరోహించి తన బరువును పెంచెను. ఆ బరువును మోయలేక అశ్వము ఊపిరి ఆడక మరణించెను. అంత గణేశుడు ఆ అశ్వమును సరోవరము బయటకు విసరి, తానునూ బయటకేతెంచెను. అశ్వము వందలాది ముక్కలయ్యెను. మునిపుత్రులందరూ గణేశుని చూచి ఆనందభరితులై ఆయనను చుట్టుముట్టి "వినాయకా! నీవు మృతుడవైతివని మేము భయాతురులమైతి"మని పలికిరి.

తదుపరి బాలురందరూ సరోవరమునందు దిగి ఒకరిపై ఒకరు దోసిళ్ళతో నీరు చిమ్ముకొనుట ఆరంభించిరి. గణేశుడు తన ఆరు చేతులతో అందరినీ నీటితో ముంచెత్తెను. అంత సర్వులునూ ఆయనపై నీరు చిమ్ముట ఆరంభించిరి. అంత ఆయన ఒక్కమారు అసంఖ్యాక హస్తములు ధరించి అందరినీ నీటిచే తడిపెను. అంత వారందరూ అంజలి ఘటించి "ప్రభూ! రెండు చేతులుగల మేమెక్కడ? అసంఖ్యాక హస్తములు గల మీరెక్కడ?" అని నుడివిరి. అంత గణేశుడు తన ఆయుధములు ధరించి మయూరము నధిరోహించెను. బాలకులు ఇంకనూ అంజలి ఘటించి అట్లే యుండిరి. వారందరికీ గణేశుని ముఖమున విశ్వమంతయు గోచరించినది. గంధర్వ, యక్ష, రాక్షస, నదీ, సముద్రములు, వృక్షములు, దేవతలు, అసురులు, మానవుల సహిత సంపూర్ణ చరాచర విశ్వము గోచరించగా, ఆ బాలురు భయాన్వితులై "ప్రభూ! మాకు మేము, అన్యులను తెలియకున్నాము. ఓ! అఖిలేశ్వరా! దయచేసి నీ సౌమ్యరూప దర్శనము నిమ్ము" అని ప్రార్థించిరి. అంత శ్రీగణేశుడు తిరిగి బాలరూపము నొందెను.

ఆ సమయమున ఆ సరోవరమందు ఎనిమిది మంది నాగకన్యలు సహితము క్రీడించుచుండిరి. వారందరూ

అతిలోక సౌందర్యరాశులు; మృగాక్షులు, అతి సుందర శరీరులు. వారందరూ మయూరేశుని కాంచి, కామాగ్ని యందు దగ్ధలై, ఈ మయూరేశుడు మన పతి అయిన మన జన్మము, జీవనము, యవ్వనము ధన్యమగునని తలంచిరి. అంత వారు ధైర్యముబూని "నీ వెచటి నుండి ఏతెంచితివి? నిన్ను చూచి మా చిత్తము విహ్వలమగుచున్నది. మాతో సంగమించి మాకు చిత్త విశ్రాంతిని కలుగజేయుము" అని పలికిరి. అంత గణేశుడు నేను శివపుత్రుడను, మయూరేశ నామమున విఖ్యాతుడను. బలశాలురైన ముని పుత్రులు నన్ను ఈ సరోవరమందు ముంచిరి. తద్వారా నాకు మీ పాదపద్మ దర్శనమయినది" అని పలికెను. అంత నాగకన్యలు "ఒక్క క్షణము విశ్రాంతి నొందుటకై మా గృహమున కేతెంచ వలసినది" అని పలికి ఆయన చేయిపట్టి తమ గృహమున కరిగిరి. ముని పుత్రులు తిరిగి గణేశుని కానరాక "తిరిగి ఈ గణేశుడెచటికి ఏగెను? పదివేల తప్పులు చేసిన పుత్రుల నయిననూ తండ్రి వదలడు కదా! ఇపుడు మనము ఏమి చేయవలెను?" అని తర్కించుచూ నెమ్మదిగ వెనుకకు ప్రయాణించుట మొదలిడిరి. దారిలో వారికి మయూరేశుని కమల చిహ్నములు గల పద చిహ్నములు కనిపించినవి. వాటికి ప్రణామములు సలుపుచూ, మయూరేశ నామస్మరణ మాచరించుచూ వారు వెడలుచుండిరి.

ఆ దారిమధ్యమున "భగాసురుడు" అను దైత్యుడు ఒక పెద్ద అజగర రూపము ధరించి, నోరు తెరచి నిద్ర పోవుచుండెను. ముని బాలురు మయూరేశ ధ్యానము ఒనర్చుచూ తెలియక ఆ నోటి యందు ప్రవేశించి, నెమ్మదిగ అద్దాని ఉదరము చేరిరి. అంత వారు దారి తెలియక "మయూరేశా! నీ వెచటికేగితివి? ఇపుడు మాకు దారి తెలియుట లేదు. ఇల్లు కనబడుట లేదు. మా తల్లి, తండ్రి, భ్రాత, సర్వము నీవే!" అని తలంచుచుండిరి. ఆ బాలురకు తాము భగాసురుని ఉదరమందు యుంటిమన్న సంగతి తెలియదు. అంత ఆకస్మాత్తుగా చతురాయుధ ధారి అయిన మయూరేశు డు వారి ముందు ప్రత్యక్షమై "మీరు శోకింపవలదు. మీ దు:ఖము తెలిసి నేను శీఘ్రమే ఏతెంచితిని" అని పలికి, వారిని నిద్రపుచ్చి, ఆ అజగర ఉదరమున వామనుడు త్రివిక్రముడయినటుల తన శరీరమును పెంచెను. ఆ దైత్యుని శరీరము ముక్కలై బాలురందరూ బయటపడిరి. ఇంతలో సాయం సమయమగుటచే మునిపుత్రులు తల్లిదండ్రులు ఆంధోళన చెందుచూ "ఈ బాలకులేమైరి? గణేశుడు మన బాలకులను తీసికుని ఉదయముననే వెళ్ళెను. వీరికి ఏమీ ప్రమాదము జరుగలేదుకదా! లేని ఎడల క్షుధార్తులై ఈ పాటికి ఇంటికి రావలెను కదా!" అని పలుకుచూ సర్వ ప్రదేశములందు వెదకి బాలురను కానక హతాశులై తిరిగి ఇంటికి చేరిరి. వారి ఆక్రందన విని మయూరేశుడు తనే సర్వ బాలకుల రూపము ధరించి, అవే వేషభాషలు, అభినయముతో సర్వులను అలరించెను. పార్వతి సహితము గణేశుని కాంచి ఆనందమగ్నయై భోజనమిడెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి ముని బాలకులకు విశ్వరూప సందర్శనమను తొంబై ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొంబై తొమ్మిదవ అధ్యాయము

(విహంగత్రయ విడుదల)

బ్రహ్మ "మయూరేశుని నాగకన్యలు తమ గృహమునకు తీసికొని వెళ్ళిరని తెలిపితిని కదా! వారు ఆ పరాత్పరునికి బహు విస్తారముగ పూజన మొనర్చిరి. తొలుత ఆయన శరీరమునకు సుగంధ తైలమర్దన మొనర్చి, తదుపరి ఉష్ణ జలములచే స్నానమాచరింప జేసిరి. తదుపరి బహుమూల్య వస్త్రాభరణములతో అలంకృతమొనర్చి, ధూప దీప

నైవేద్యాదులర్పించి, ఫల, తాంబూల సువర్ణ దక్షిణ సమర్పించి, చేతులు జోడించి ఇట్లనిరి "ఓ! ప్రభూ! బ్రహ్మాదులకు సహితము అగోచరమగు మీ పాదయుగళి మా చర్మచక్షువులకు గోచరమగుటచే మేము ధన్యులమయితిమి. మీ రాకచే మా నాగలోకము ధన్యమయినది; మా జీవనములు సాఫల్యము నొందినవి. ఆనంద సాగరమందు మగ్నమగుటచే, మా సంతాపములు దూరమయినవి. ఇచట మీకేది నచ్చినదో దానిని మీరు గ్రహింపవచ్చును. దయచేసి ఇచట కొన్ని దినములుండి మమ్ము ఆనందింపజేయ ప్రార్థన." అంత మయూరేశుడు "మీ మనోకామలను నేను పూర్ణమొనరింతును. కానీ ప్రస్తుతము పార్వతీమాత నా కొరకై వేచియుండును. నా వియోగముచే ఆమె పచ్చి మంచినీరు సహితము ముట్టదు. మీరు ఎవరి పుత్రికలు? నాకు మీ పితృదేవుల దర్శనము కలిగింప వలసినది" అని పలికెను. నాగ కన్యలు "ప్రభూ! మేము వాసుకి యొక్క పుత్రికలము. మా ఇంటికి బ్రహ్మాది దేవతలు, మునిగణములు సదా ఏతెంచుచుందురు. మా తండ్రి అప్రమేయ పరాక్రముడు. ఆయన తన విషజ్వాలచే త్రిలోకములను దగ్ధమొనర్పగల బలశాలి" అని పలికి మయూరేశుని తమ తండ్రి వద్దకు తీసికుని వెళ్ళిరి.

ఆ సమయమున వాసుకి ఒక రత్న సింహాసన మధిష్ఠించి, రత్నమాలా సుశోభితుడై, కోటిసూర్య ప్రకాశముతో తేజరిల్లుచుండెను. ఆయన శిరమందు ఒక మణి కిరణములను వెదజల్లుచూ, సర్వ దిశలను ప్రకాశవంత మొనర్చుచుండెను. వాసుకి స్వకీయ బలగర్వితుడై కూర్చొనియున్న సమయమున మయూరేశుడేతెంచి, ఒక్కమారు ఎగిరి వాసుకి శిరమునందున్న మణిని చేజిక్కించుకొనెను. ఆ మణి ప్రకాశముచే పాతాళమందు అంధకారముండదు. అంత వాసుకి తన శిరము కంపింపజేయుచూ సప్త కుల పర్వతములను, సప్త సముద్రములను, స్వర్గమును, సప్త పాతాళములనూ అతలాకుతలము కావించెను. అంత మయూరేశుడు వాసుకిని ఒక చేతితో పట్టి అవలీలగా తన కంఠమునకు చుట్టుకొనెను. అప్పటి నుండి ఆయన "సర్పభూషణుడు" అని పిలువబడెను. అంత గణేశుడు ఆనందముతో గర్జించెను. అద్దానిచే త్రిలోకములు క్షోభనొందెను. సర్ప గణములు ఏగి శేషుని వాసుకిని విడిపింపమని ప్రార్థించిరి. శేషుడు క్రోధావిష్టుడై విషము విరజిమ్ముచూ గణేశుని వద్ద కొచ్చి "ఆగుము" అని గర్జించెను. ఆ సమయమున సమస్త నాగలోకము శేషుని వెనుక యున్నది. అంత మయూరేశుడు ఆగి తన వాహనమైన మయూరమను ఆ సర్పకోటిపై ప్రేరేపించెను. అంత మయూరము తన రెక్కల తాకిడిచే ఆ నాగ సమూహమును చెల్లాచెదురు చేసి, కొన్నింటిని భక్షించి, కొన్నింటిని చెంచెవులతో కరచి, కొన్నింటిని కాళ్ళతో మర్దించి సంహరించెను. అంత శేషుడు ఆ మయూరముపై విషలిప్త వాయువును విరజిమ్మెను. అంత మయూరము మూర్ఛనొందెను.

అంత శేషుడు గణేశునిపై దాడి జరిపి విషమును విరజిమ్మెను అద్దానిచే త్రిలోకములు దగ్ధమగుట నారంభించెను. అంత గణేశుడు విరాడ్రూపుడై ఎగిరి శేషుని పడగలపై తాళము వేయుచూ నర్తించుట నారంభించెను. ఒక్క బ్రహ్మాండమునే అతి కష్టముతో మోయుచున్న శేషునికి, అనేక కోటి బ్రహ్మాండములు ఉదరమందున్న వినాయకుడు తన పడగలపై నృత్యమొనర్చుటచే భరింపలేక అత్యంత పీడితుడయ్యెను. అంత గణేశుడు శేషుని తన చేతితో పట్టి ఉదరమునకు ఒక తాడు వలె కట్టుకొనెను. అంత సర్పములన్నియు ఒకేసారి వినాయకునిపై పడినవి. అంత ఆయన ఒక హుంకారముచే వాటిని బయటకు నెట్టెను. అంత శేషుడు మిక్కిలి డస్సి ఇట్లనియె "స్వామీ! మీ స్వరూపమును బ్రహ్మాది దేవతలు, మునులు తెలియరనిన నేనెంత? నీవే సృష్టిస్థిత్యంత కారుడవు. నీవు దైత్య సంహారమునకు అనేక అవతారములు స్వీకరించెదవు. సర్వజీవ సర్వాంతర్యామివై సర్వులను రక్షించెదవు. సర్వ కారణ కారణము నీవే! నా అజ్ఞాన వశమున కలిగిన గర్వముచే నీచే యుద్ధ మొనరించితిని. మమ్ము క్షమింపవలసినది." ఈ విధముగ పలికి శేషుడు బిలమందు యుంచిన పక్షిత్రయమును తీసికుని వచ్చి గణేశునకు సమర్పించి మౌనము వహించెను. శ్యేన, సంపాతి, జటాయువులు మయూరేశునకు నమస్కృతులొనర్చి "ఓ! దీననాథా! నీ దయచే మేము బంధన విముక్తుల మయితిమి. మీకు నమస్కారము"

అని పలికి మయూరమును ఆలింగన మొనర్చి గద్గద కంఠముతో వారి తల్లి యొక్క కుశలము గూర్చి ప్రశ్నించిరి. అంత మయూరేశుడు తన వాహన మధిరోహించి, మిగిలిన పక్షుల సహితుడై భూలోకమున కేతెంచెను. శ్యేనాదులు ఆయనకు నమస్కరించి వీడ్కోలు పలికిరి.

మయూరేశుడు మార్గమధ్యమున భగాసురుని ఉదరమునండి బయటపడి గణేశ మాయచే నిద్రించుచున్న ముని పుత్రుల వద్ద కేతెంచెను. ఆ ముని పుత్రులు కూర్చునపుడు, పడుకున్నపుడు, భుజించునపుడు, నిద్రించునపుడు, ఏమి చేయుచున్ననూ మయూరేశునే తలచుచుండిరి. మయూరేశుడు వారందరినీ తీసికొని తన ఆశ్రమమున కేగెను. గణేశుని యోగమాయా బలముచే మునిపుత్రులకు తాము సర్పోదరము నందు యుంటిమన్న జ్ఞప్తి లేదు. వారి మాతా పితరులకు తమ వద్దనున్న పుత్రులు గణేశుని రూపమన్న అవగాహన లేదు. సర్వము యధావిధిగ జరిగి పోయెను. పార్వతీదేవి ముద్దుగా ఇంత ఆలస్యమేల చేసితివని దండించి గణేశునకు భోజనమిడెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి విహంగత్రయ విడుదల అను తొంబై తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూరవ అధ్యాయము

(కమలాసురుని యుద్ధాగమనము)

బ్రహ్మ "పార్వతీ తనయునకు దశమ వర్ష మేతెంచినది. ఒకనాడు పార్వతీసమేతుడై పరమేశ్వరుడు గణములచే పరివేష్ఠితుడై, ప్రాంగణమందు ఇతర బాలురతో నృత్య మొనరించుచున్న మయూరేశుని చూచుచుండెను. ఆ సమయమున గౌతమాది మునులందరూ ఏతెంచి, ప్రణామములర్పించి ఇట్లనిరి "స్వామీ! మీరెంతకాలము మయూరేశునితో ఇచట యుండెదరో అంత కాలము దైత్యులిచటికి ఏతెంచుచునే యుందురు. దాని వలన మేము మిక్కిలి పీడితులమగుచున్నాము. అందువలన మహాదేవా! మీరు వేరొక ప్రదేశమున కేగవలసినది. లేని ఎడల మేమే వేరొక ప్రదేశమున కేగెదము." అంత శివుడు "మునులారా! మీ సంసర్గముచే మేము తొమ్మిది వత్సరములు సుఖముగ ఇచ్చట గడిపితిమి. మయూరేశుడు మీ విఘ్నములను దూరమొనర్చెను. మీరు వెడలిన ఎడల ఇక్కడ మేమేమి చేయుదుము? మీమే వేరొక ప్రదేశమును ఏగెదము" అని పలికెను. తదుపరి పార్వతీ సహితుడై, వృషభారూఢుడై, గణములు, గణేశుడు వెంటరాగా ప్రసన్నుడై అచటినుండి బయలుదేరెను. ఆ సమయమున నానా వాద్యములు ఘోషించుచుండెను. వారి వెనుక మునులు, మునిపత్నులు, బాలురు ఏగిరి. కొంతదూరము ఏగిన పిదప శివుడు వారిని వారించి వెనుకకు పంపెను.

అంతలో వారు దూరముగ ధూళి రేగుట గమనించిరి. శివుని వేగులు ముందునకేగి, విషయము గ్రహించి, వెనుకకు వచ్చి శివునితో "కమలాసురుడు పన్నెండు అక్షౌహిణీ సేనతో, చతురంగ బల సమేతుడై ఏతెంచుచుండెను. ఈతడు శంఖాసురుని సోదరుడు, బహు పరాక్రమవంతుడు " అని పేర్కొనిరి. కమలాసురుడు అనేక భూషణభూషితుడై, తన సేన కదలికచే ఆదికూర్మమును కంపింపజేయుచూ ముందుకు వచ్చుచుండెను. శివునితో పాటు యున్న కొద్దిమంది మునులు కంపితులైరి. మయూరేశుడు వారికి ధైర్యము గొలిపి "శివ సన్నిధిని యున్న వారికి భయము లేదు" అని తెలిపెను. అంత మయూరేశుడు శివునకు నమస్కరించి "తండ్రీ! ఈ కమలాసురుడు చతురంగ బల సమేతుడై, యుద్ధార్థియై ఏతెంచుచున్నాడు. మీ అనుజ్ఞ అయిన ఎడల నేను వారి మదమణిచెదను" అని పలికెను. శివుడు "పుత్రా! ఏకాకివై ఏగుట ఏల? ఈ గణములను నీతో తీసికొనిపోయి ఆ మహాదైత్యుని వధింపుము" అనెను. గణేశుడు "తండ్రీ! మీ కృపచే

నేను త్రిలోకములను దగ్ధ మొనరింపగలను. ఆ కృపచే నేను అనేకమంది దైత్యులను సంహరించితిని. ఇక ఈ దైత్యుని మాట చెప్పనేల? తప్పక విజయము సాధించి ఏతెంచెదను" అని పలికెను. శివుడు సంతోషించి, ఆలింగన మొనర్చి ఆతని శిరమున తన శుభ హస్తమునుంచి, దీవించి, తన త్రిశూలమును ప్రసాదించి, శివగణములు తోడునిచ్చి పంపించి, ఆ యుద్ధమును వీక్షింపవలెనన్న కౌతుకముతో వారి వెనుక పార్వతీ సహితుడై తానునూ ఏగెను.

విఘ్నహర్త అయిన మయూరేశుడు యుద్ధ లాలసతో భయంకర గర్జన మొనరించి, ప్రమథులతో కలసి కమలాసురునికి ఎదురేగెను. దైత్యుని అపార వాహినిని కాంచి మయూరేశుడు తన శరీరము నుండి విశాల సేనా వాహినిని ఉద్భవింప జేసెను. ఆ సేన కాలునితో సమానమైన తేజస్సులు. బ్రహ్మాండమును మ్రింగగల సమర్థులు. మేరుపర్వత సదృశులైన మహాబలురు. తక్షణమే తుముల యుద్ధమారంభమయినది. ఇరు ప్రక్కలా సేనావాహిని విజృంభణముచే ధూళిరేగి, ఆకాశమండలమున కేగి అంధకార మలముకొన్నది. దైత్యగణము ఇంతసేన ఇంత తక్కువ వ్యవధిలో ఎక్కడనుండి ఏతెంచెనని ఆశ్చర్య చకితులైరి. కొందరు ఈ బాలుడు పరమ పురుషుడు. భూభార హరణ హేతువై శివుని ఇంట అవతరించెనట" అని పలికిరి. అంత మయూరేశుడు కమాలాసురుని దీర్ఘరూపము గాంచి, యోగమాయ ఆశ్రమయుతో తాను సహితము బృహత్కాయుడై, దశభుజుడై, దశాయుధములు ధరించెను. ఇరుసేనల యందలి సైనికులు అత్యంత యుద్ధ నిపుణులు, యుద్ధ విశారదులే! వారు గుంపులు గుంపులుగ, వేర్వేరుగా, సమర మాచరించుచుండిరి. కొందరు మల్లయుద్ధ మాచరించుచుండిరి. ఎందరో సైనికుల శిరములు మొండెములు, కాళ్ళు, చేతులు, ముఖములు, తొడలు, ఖండింపబడి రక్తము ఏరులై ప్రవహించుచున్నది. అయిననూ వీరులు శిరములు, ఊరువులు, కాళ్ళు, చేతులు, వీపు, ఈ విధముగ బాహా బాహీ యుద్ధమొనరించుచుండిరి. సమరాంగణమంతయు అంధకార మావరించుటచే సైనికులు తమ నాయకుల నామములు, తమ గోత్ర నామములు చెప్పుకొని విగ్రహ మొనరించుచుండిరి. అంతలో కమలాసురుని సైనికులు వెనుకకు పోయి అసంఖ్యాక దైత్య గణములు సంహరింపబడినవి ఆ దైత్యుని కెరింగించిరి. ఆతడు మండిపడి, ఆయుధ పాణియై, మయూరేశుని సేనపై బడి, కార్చిచ్చువలె చెలరేగి వారందరినీ సంహిరించుట మొదలిడెను. వాని విజృంభణము కాంచి మయూరేశుడు తన సేనను కాపాడుటకై ముందునకొచ్చి, భీషణ యుద్ధ మొనర్చెను. ఆయన ద్వారా చంపబడిన దైత్యసేన అంతయు మోక్షము నొందినది.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కమలాసుర యుద్ధాగమనమను నూరవ అధ్యాయము సమాప్తము)

నూట ఒకటవ అధ్యాయము

(మయూరేశ కమలాసుర సంగ్రామము)

బ్రహ్మ "తన సేనయందు అసంఖ్యాకులు మరణించుటచే దైత్యుడు అశ్వము నధిరోహించి, ఖడ్గము ధరించి మయూరేశుని వద్ద కేతెంచెను. వాని నెదుర్కొనుటకు మయూరేశుడు తన వాహనమైన మయూరముపై సంసిద్ధుడయ్యెను. అంత దనుజుడు తనకు శుక్రాచార్యునిచే ప్రదత్తమైన పన్నగాస్త్ర మంత్రమును వందసార్లు జపించి, దానిని మయూరేశునిపై ప్రయోగించెను. తత్ప్రభావముచే అన్ని దిశలనుండి పన్నగములేతెంచి మయూరేశుని సేనను చుట్టుముట్టినవి. కొందరు పలాయన మొనర్చిరి. కొందరు పరలోకగతులైరి; మరి కొందరు మూర్ఛితులైరి. అంత మయూరేశుడు దైత్యుని పరాక్రమమును ప్రశంశించి, "దైత్యరాజా! నీ యుద్ధ విశారద నన్ను అబ్బుర పెట్టినది. నీ వంటి వీరుని నేనింతకుమందు

చూడలేదు." అని పలికి గారుడాస్త్రము సంధించి విడచెను. తత్ప్రభావముచే అనేక గరుడపక్షులుదయించి పన్నగములను భక్షించినవి. మయూరుని సేన తిరిగి పుంజుకొనినది. తదుపరి మయూరుడు చక్రాస్త్రమును విడచెను. ఆ అస్త్రము కొందరికి కాళ్ళు, కొందరికి చేతులు, శిరములు, తొడలు ఖండించుటచే సర్వులు "పారిపొందు", "పారిపొందు" అని అరుచుచూ పలాయన మొనర్చిరి. అంత కమలాసురుడు ఖడ్గము చేతబట్టి ద్వంద్వ యుద్ధమున కేతెంచెను. మయూరుడు తన అప్రతిహతమైన పరశువును ప్రయోగించెను. ఆ పరశువు దైత్యుని ఖడ్గమును ముక్కలు గావించెను. అంత దైత్యుడు ధనుర్బాణములు గ్రహించి, బాణ ప్రహరణముచే గగనమంతటినీ ఆచ్ఛాదన మొనర్చి బాణవర్షము కురిపించెను. అంత మయూరుడు వాటిని అన్నింటినీ ఖండించి, దైత్యుని అశ్వమును సంహరించెను.

అంత దైత్యుడు కృద్ధుడై "నీవు నా వాహనమును సంహరించితివి కావున నేనునూ అట్లే చేసెదనని, తిరిగి తూణీరము నుండి సాయకములు తీసి ప్రత్యర్థి సైన్యముపై ప్రహరించెను. ఆ బాణ వర్షముచే అసంఖ్యాక శివగణములు మరణించిరి. మయూరము సహితము గాయపడి మూర్ఛనొందెను. అంత మయూరుడు తన వాహనమును విశ్రాంతికై వదలి, అతి బలమయిన తన పాశమును వదలెను. అయ్యది కమలాసుర సైన్యమును మట్టి కరిపించి కమలాసురుని కంఠమును బిగించెను. అంత అసురుడు ఊపిరి ఆడక పీడింపబడెను. అంత దైత్యుడు అన్యరూపము ధరించి, ఆ భయంకరాకారముచే సూర్యుని ఆచ్ఛాదించెను. అంత ఆతడు ముందునకొచ్చి ఈ విధముగ ప్రగల్భములు పలికెను "ఓ! బాలకా! నీవు ఏల నాతో యుద్ధ మొనర్చుచున్నావు? నీవు గృహమునకేగి, మాతృ స్థనపానమొనర్చి, తోడిబాలురుతో క్రీడింపుము. నా గర్జనచే త్రిలోకములు తల్లడిల్లును. నా పాద ఘాతముచే శేషుడు కంపించును. నా ముష్ఠి ప్రహారముచే పర్వతములు చూర్ణమగును. నేను నా నఖాగ్రముచే నీ శిరమును రసాతలమునకు పంపించగలను." అంత మయూరేశు డు "నీవు పిశాచగ్రస్తుని వలె, మద్యపానయుహితునివలె, ప్రేలుచున్నావు. సురభూసుర నింద గావించు దురాత్ములు ఎన్నడూ విజయము నొందరు. నేను నా క్రోధము చే త్రిలోకములను దగ్ధమొనరింప గలను. కేవలము నీకు ఖ్యాతి కలుగుటకు నీతో సంగర మొనరించుచున్నాను" అని పలికెను. ఈ విధముగ పలికి వారిరువురూ తిరిగి యుద్ధసన్నద్ధులైరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశ కమలాసుర సంగ్రామమను నూట ఒకటవ అధ్యాయము సమాప్తము)

నూట రెండవ అధ్యాయము

(కమలాసుర సంహారము)

బ్రహ్మ "దైత్యుని ఉధృతిని గాంచి మయూరేశుడు వానిపై బాణవర్షము కురిపించెను. దైత్యుడు ఆ బాణములను ఖండించెను. అంత మయూరేశుడు ఆ దైత్యుని పరాక్రమమునకు ముగ్ధుడై వానికి తన విరాడ్రూపమును చూపించెను. దైత్యునకు సర్వదిక్కులా మయూరేశుడే కనిపించుచుండెను. అంత దైత్యుడు కన్నులు మూసికొనగా ఆతనికి తన హృదయమందు సహితము ఆ పరాత్పరుడే కనిపించెను. అంత దైత్యుడు పలాయనమొనర్చుట మొదలిడెను. అంత మయూరేశుడు "దైత్యేంద్రా! నీ పలుకులు, పరాక్రమము, గుర్తుకు తెచ్చుకొని నాతో సమరమొనర్పుము" అని పలికెను. అంత దైత్యుడు క్రుద్ధుడై తిరిగి సమర మారంభించెను. మయూరేశుడు దైత్యునిపై బాణ పరంపర కురిపించెను. ఆ దైత్యుని ఎన్ని రక్తపు బిందువులు నేలపై పడినవో, అందరు కమలాసురులు జన్మించి యుద్ధ మొనరించుచుండిరి. అంత మయూరేశుడు మండిపడి తన సిద్ధి బుద్ధులను మూడు కోట్ల సేనను మోహరింపజేసెను. అంత వారందరూ తాము

క్షుధార్తులమనీ, తమకు ఆహారము కావలెనని పలికిరి. మయూరేశుడు దైత్యసేన నంతయు తినమని తిరిగి బాణవర్షము కురిపించెను. ఎంతమంది కమలాసురులు జన్మించిరో వారందరినీ, క్రిందపడిన రక్తముతో సహా ఆ గణములు భుజించినవి. అంత మయూరేశుడు తనకు శివుడనుగ్రహించిన శూలమును స్మరించి, దానిని ప్రయోగించెను. ఆ త్రిశూలము విస్ఫులింగములు విరజిమ్ముచూ, గ్రహ, తారలను చూర్ణమొనర్చుచూ, భయంకర శబ్దము కావించుచూ, కమలాసురుని చేరి, వానిని మూడు ఖండములుగ ఖండించెను. వాని శిరము భీమానది దక్షిణ భాగమున, వాని పాదములు కష్ణానది ఉత్తర భాగమున, మొండెము మయూరేశుని పాదముల వద్ద పడెను. అసురుడు అసువులు బాసెను. సర్వులు జయజయ ధ్వానములు కావించిరి.

పార్వతీ పరమేశ్వరులు, గౌతమాది ఋషులు అచటికేతెంచిరి. పుష్పవృష్టి కురిసినది. మాతాపితరులు మయూరేశుని ఆలింగన మొనర్చిరి. మునులు ఈ విధముగ స్తుతించిరి “కమలకాంతుని (విష్ణువు) హృదయమందు విరాజమానుడై ఆయనకు హృదయానందము కలుగజేయువాడు, కమలకాంతునికి వందితుడు, కమలాసుర నాశకుడు, కమలాసేవిత చరణుడు, లక్ష్మీ ప్రదాతా! నీకు జయము. కమలాసన వందితా, కమలాకర సమాన శీతలుడా, కమలచిహ్న పదాంకితా, కమలబంధు (చంద్రుడు) లలాటా, భక్తులకు లక్ష్మీ ప్రదాతా, కమలసుత (సింధు దైత్యుడు) శత్రూ, శివపుత్రా, కమలాపుత్ర (మన్మథుడు) సదృశ సందరుడా, సముద్ర రత్నమాలా సుశోభితా, మయూరేశా, నీకు జయము. కమలాసురుని సాయకములను కమలముతో నివారించినవాడా, కమలకాంతుని (విష్ణువు) హస్తస్థితమైన పద్మము వంటి కరకమలములు కలవాడా, కమలనేత్రా, సర్వుల హృదయ కమలమందు ఆనంద ప్రదాతా, పాపనాశకా, నీకు నమస్కారము. పద్మాంకుశ ధారీ, విఘ్నహర్తా, అవినాశీ, నీకు జయము. వజ్రాయుధము, చక్రాయుధములకు సహితము అభేద్యుడు, ఇంద్రాది దేవతలకు శత్రువయిన కమలాసురుని సంహరించిన మయూరేశా! నీకు నమస్కారము! నమస్కారము!! నమస్కారము!!!

అంత ఋషి, మునిగణము పార్వతీ పరమేశ్వరులను, మయూరేశుని “మీరందరూ విఘ్న నివారణకు, భక్తుల కార్యములు పరిపూర్ణ మొనర్చుటకు, సర్వ దేవగణ సహితులై సర్వదా ఇచట నివసింపవలసినది” అని అభ్యర్థించిరి. వారందుకు అంగీకరింపగా, విశ్వకర్మ అచట అసంఖ్యాక శిఖరములు, ద్వారములు గల అద్భుత మందిరమును నిర్మించి, దాని చూట్టూ ఒక సుందర నగరమును సహితము నిర్మించెను. ఆ నగరము “మయూరేశ పురము” అని విఖ్యాతమయ్యెను. ఆ నగరము వివిధ జనులకు ఆవాసమయినది. పరమేశ్వరుడు తిరిగి తన తపస్సును కొనసాగించెను. గణేశుడు తోడి బాలురతో క్రీడలు మొదలిడెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కమలాసుర సంహారమను నూట రెండవ అధ్యాయము సమాప్తము)

నూట మూడవ అధ్యాయము

(విరించి గర్వ భంగము)

బ్రహ్మ “ద్విజశ్రేష్ఠా! తదుపరి నేను ఒక గుప్తరూపము ధరించి మయూరేశ పురమునకు ఏగితిని. అచట మయూరేశుడు స్నానమాచరించి పరబ్రహ్మను జపించుచుండెను. నేను ఆయన సన్నిధికేగి ఇట్లు స్తుతించితిని” పురాణపురుషా, మాయావీ, అచింత్యుడయిన మయూరేశునకు నమస్కారము. పరాత్పర, చిదానంద, నిర్వికార, సర్వాంతర్యామీ, గుణాతీత, గుణమయ మయూరేశునకు నమస్కారము. తన ఇచ్ఛానుసారము జగత్క్రీడ సాగించు విఘ్నహర్తకు నమస్కారము.

ఎవరు ఇంద్రాది దేవతలచే నిరంతరము స్థుతింపబడునో, సత్యాసత్యములు, వ్యక్తావ్యక్తములు కలవాడు, దైత్యహంతుడు, నానారూపధారి, నానా ఆయుధధారి, సర్వశక్తిమయుడు, సర్వ విద్యాప్రవక్త, పార్వతీనందన, శివానంద, భక్తానంద, దేవ, మానవ ఋషిగణముల ఆరాధ్య స్వరూపా, మునుల కార్యములను పూర్ణమొనరించు మహాప్రభో! నీకు నమస్కారము. సంపూర్ణ అజ్ఞాన నాశకా, సర్వజ్ఞాన ప్రదా, సర్వజ్ఞానమయా, శుచీ, సత్యస్వరూపా, అనేక కోటి బ్రహ్మాండనాయకా, జగదీశ్వరా, అనంత వైభవ సంపన్నా, విష్ణురూపా, నీకు నమస్కారము. నీ దర్శనము చే నేను పవిత్రుడనై పరమానంద మగ్నుడనైతిని. ఇంద్ర, యమ, వరుణాది దేవతలను, లోకపాలురను తన బల పరాక్రమములచే ఓడించిన కమలాసురుని, వందలాది దనుజులను, దునుమాడిన నీ పరాక్రమమునకు నమస్కారము." ఈ విధముగ స్థుతించి, నేను మయూరేశుని పూజించి, సర్వతీర్థ జలములు కలిగిన నా కమండలపు జలములచే ఆయన పాదములను ప్రక్షాళన మొనర్చి, ఆయనకు దివ్య వస్త్రాభరణములు సమర్పించి, విశ్వవిఖ్యాత స్వర్ణమాలాలంకారము కావించి, ఆయనకు "వనమాలి" అని నామకరణమొనర్చి ఆయనకు ప్రదక్షిణ మాచరించితిని.

ఇంతలో ఒక చిత్రము జరిగినది. సర్వతీర్థ జలములు గల నా కమండలము ప్రక్కకు ఒరిగి, ఆ జలములు పారి ఒక పవిత్రసరితగ ప్రవహించినది. నేను ఆ జలములను తిరిగి నా కమండలము నందు గ్రహించుటకు యత్నించితిని. అంత ఆ పరాత్పరుడు నాతో ఇట్లనియె "ఈ స్థోత్రము మానవులకు సర్వ పాపనాశకము, సర్వకామ ప్రదము, సర్వోపద్రవ నాశకము. ఇయ్యది కారాగార వాసులను ఏడు దినములలో ముక్తుల గావించును. అంతేకాక ఇయ్యది అదివ్యాధి నాశకము. భోగమోక్ష ప్రదాయకము. సర్వులను పవిత్ర మొనరించు ఈ నది "కమండల ప్రభావ" లేక "బ్రహ్మ కమండలము" అని విఖ్యాతి నొందును. ఈ నది దర్శనము వాచిక పాపములను, స్పర్శ మానసిక పాపములను, స్నానము కాయిక పాపములను నశింపజేయును. ఈ నదిని నిరంతరము సేవన మొనర్చుటచే మోక్షము ప్రసాదించును. ఈ విధముగ వరదాన మొనర్చిన పిమ్మట నేను, పత్నీ పుత్ర సహిత మునులు, ఏడుకోట్ల గణములు, ఈ నది యందు స్నానమాచరించి, ఆ నదీ తటమున నాతో సహితులై తపమాచచించిరి.

అంత నేను మయూరేశుని మాయ యందు మునిగితిని. ఇంత బుద్ధిగా స్థోత్ర మొనరించిన నేను మోహగ్రస్తుడనై, నేను జగత్కర్త, జగద్వందనీయుడను, ఇంద్రాది దేవతల ద్వారా పూజితుడను; ఈ పదకొండు వత్సరముల బాలుడు ఆచారహీనుడు. నేనేల ఈతనికి ప్రణామ మాచరించితిని? ఈ విధముగ తలచి నేను కావించిన సృష్ఠి నంతటినీ అంతర్థాన మొనరించితిని. అంత గణేశుడు తేరిపారజూడ ఆయనకు పార్వతీ పరమేశ్వరులు, తన గృహము, మిత్రులు, స్వర్గాది లోకములు, పాతాళాది అధోలోకములు సర్వము మాయమయినవి. అంత ప్రభువు అంతరావలోకనుడై జరిగినది గ్రహించి, తన పెనుమాయచే సర్వమును పున:సృష్ఠించెను. అంత నా గర్వము సర్వము ఖర్వమై నేను ఆయనకు ఈ విధముగ క్షమాయాచన మొనర్చితిని "మహా ముకుట కుండలధారి, నాగ యజ్ఞోపవీతుడు, వాసుకీ కంఠాభరణుడు, దివ్య మాలాదుకూలధారి, దివ్య సింహాసనాస్థితుడు, దేవతలచే స్థుతింపబడువాడు, సిద్ధిబుద్ధులు, సర్వ విభూతులచే ఉపాసింపబడువాడు, అయిన శ్రీగణేశునకు నమస్కారము. నేను సర్వ విభూతులను, నన్ను సహితము మీ రూపమందు కాంచితిని. నేను కేవలము మీ మహిమను కాంచుటకు ఈ దుష్కృత్య మాచరించితిని" ఈ విధముగ పదేపదే ఆయనను ప్రార్థించి క్షమాయాచన కావించితిని. అంత ఆ పరమాత్ముడు ఒక దీర్ఘ ఉచ్వాసము తీసికొనెను. దానిచే నేను ఆయన నాసిక ద్వారా ఉదరము లోనికి ప్రవేశించితిని. అందు అనేక బ్రహ్మాండములు కాంచితిని. ఒక బ్రహ్మాండము నుండి వేరొక బ్రహ్మాండమున కేగితిని. ప్రతి రోమకూపమందు అనంతకోటి బ్రహ్మాండములు కాంచితిని. ప్రతి బ్రహ్మాండమందు సృష్ఠి, స్థితి, లయ కాంచితిని. నేను ఎక్కడా ఆద్యంతములు కానక, డస్సి, బుద్ధి తెచ్చుకొని ఆ మహా ప్రభువును తిరిగి ప్రార్థించితిని. అంత ఆ పరాత్పరుడు తిరిగి నన్ను బయటకు తీసికొనివచ్చి, తన మాయను ఉపసంహరించెను. అంత

నేను అంజలి ఘటించి “మహాప్రభూ! మీ మాయ దురజ్ఞయము. మీరు క్షమాశీలత వహించి నా అపరాధములను మన్నింప వలసినది.” అంత ఆయన తన కృపాకటాక్ష వీక్షణములను నాపై ప్రసరించి తన అమృత హస్తమును నా శిరసుయందుంచి, ఇట్లనియె “విరించీ! నాకు క్రోధము యుండదు. నాకు స్వకీయులు, పరులు లేరు. నాకు ఎవరి వలన భయము లేదు. నా వలన ఎవరికీ భయము కూడదు.” అంత నేను ఆ మయూరేశ పురమన పార్వతీ పరమేశ్వరులకు, మయూరేశునకు నమస్కరించి నా స్వస్థలి కేగితిని.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి విరించి గర్వభంగమను నూట మూడవ అధ్యాయము సమాప్తము)

నూట నాల్గవ అధ్యాయము

(మయూరేశుని అభేద తత్వము)

బ్రహ్మ “కాలచక్రము గిర్రున తిరుగుచూ భాద్రపదమాస మేతెంచినది. బాలురందరూ చవితి రోజు మెత్తని మట్టిని తీసికుని వచ్చి తడిపి, దానితో వివిధ రకములయిన గణేశమూర్తులను చేసిరి. అందు కొన్ని సింహ వాహనునిగ, కొన్ని మయూర వాహనునిగ, మరికొన్ని మూషిక వాహనునిగ చిత్రీకరించిరి. తదుపరి ఆ మూర్తులకు దివ్య వస్త్ర భూషణాది అలంకారము లొనర్చి, మండపమందు ప్రతిష్ఠించి, కమల మాలలు ధరింపజేసి, వివిధోపచారములతో పూజన మొనర్చిరి. మయూరేశ పురమునందు పార్వతి ఉదయముననే గణేశునకు అభ్యంగన స్నానమొనరించి, పూజనమొనర్చి, సువాసినులకు వాయన దాన మొనర్చెను. ఆ సమయమున “విశ్వదేవుడు” అను బ్రాహ్మణుడు విష్ణుదేవుని వలె అలంకరిచుకొని కంఠమందు వనమాల, శంఖ చక్రాదులు ధరించి, తులసీమాలలు వైచికొని, లలాటమందు నామము ధరించి, దివ్యగంధ విలేపనుడై, శోభాయమానుడుగా ఏతెంచెను. ఆతని గాంచి, భక్తిభావముతో పూజించి పార్వతి ఇట్లనయె “స్వామీ! మిమ్ము చూని నేను ప్రసన్ననయితిని. మీ ఆగమనమునకు కారణమేమి?” ద్విజుడు “నేను మీ గూర్చి విన్నది నిజమని తోచుచున్నది. నేను క్షుధార్తుడనై యుంటిని. మీ గృహమునకు భోజనార్థమై ఏతెంచితిని.” అని పలికెను. పార్వతి “స్వామీ! మీరు ఆశీనులై, స్వస్థులవవలసినది. భోజనము వడ్డించెదను” అని ఆయనను ఆశీనుని కావించెను. మయూరేశుడు ఆయన పాదములు ప్రక్షాళన మొనర్చి, ఆ జలమును తనపై మరియు గృహమందయు ప్రోక్షణ కావించెను. అంత పార్వతి అనేక పక్వాన్నములు, పాయసాదులు వడ్డించెను. ద్విజుడు ఆచమన మొనర్చి చింతాకులుడై కూర్చుండెను. అంత పార్వతి “ద్విజోత్తమా! దయచేసి భుజింపవలసినది. ఈ వంటకములు మీకు మనోనుకూలత లేని ఎడల దయచేసి తెలుపవలసినది. నేను మీకు శివ ప్రభావముచే వాటిని ఏర్పాటు గావించెదను.” ద్విజుడు “నేను అనుదినము క్షీరసాగర శయనుడయిన విష్ణువును చూడక పచ్చి మంచినీరు సహితము ముట్టను. నేడు ఆ సంగతి మరచి భోజనమునకు కూర్చుంటిని.” పార్వతి “ఓ! ద్విజోత్తమా! మీ నియమమును మీరు ముందుగనే ఏల తెలుపలేదు? వడ్డింపబడిన విస్తరి ముందునుండి ఎట్లు లేచి వెడలిపోగలరు? శివుడు మీపై అగ్రహోదగ్రుడగును” అని పలికెను.

మయూరేశుడు “ద్విజోత్తమా! మీకు మనసునందు తీవ్రమయిన భక్తియున్న ఎడల మీరు ఇప్పుడే విష్ణు భగవానుని చూడవచ్చు. కానీ మీ దుర్భాగ్యమేనగా సాక్షాత్ పార్వతీదేవి చే ఈయబడిన పక్వాన్నములు భుజింపక వెడలుచున్నారు. ఓ! సద్వ్రతీ! అనేక జన్మల ఫలితముగ మీకు పార్వతీ కృపాకటాక్షము భూలోకమందు దొరుకుచున్నది. బ్రహ్మాదులు సహితము దర్శింపలేని జగన్మాత దర్శనము మీ చర్మ చక్షువులకు కానబడుచున్నది. అటువంటి ప్రసాదమును మీరు

పారవేయు చున్నారు. ఈ పార్వతీదేవి సర్వలోక జనని. సర్వ దేవతల పరమాద్భుత శక్తి. ఈ తల్లిని చూచుటచే నీవు విష్ణువును చూచినట్లే! అగ్ని భోజి అయిన చకోరమునకు మిష్టాన్నము రుచింపనట్లే నీకునూ ఈ అమృతతుల్య భోజనము ఇష్టమగుట లేదు. లేని ఎడల సర్వరూపధారినైన నా దర్శనముచే కూడా నీకు విష్ణు దర్శనము కలుగును. అంత ద్విజుడు "నేను లక్ష్మీపతి అయిన విష్ణువు యొక్క దాసుడను. నీవు సర్వ రూపుడవు అయిన, నీకు సమర్ధత యున్న ఎడల, నాకు అనామయుడయిన విష్ణువును చూపింపుము" అని పలికెను. అంత విప్రుని ధృడ నిశ్చయమును గని గణేశుడు అంతర్ధానుడై, విష్ణురూపమున శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించి, పీతాంబర ధారియై, సర్వాభరణ భూషితుడై, కౌస్తుభమణి ధారుడై, శేషాయిపై లక్ష్మీదేవి పాదసంవాహనము ఒనర్చుచుండగా కనిపించెను. అంత విశ్వదేవుడు శరీర విస్మృతినొంది, భక్తి తత్పరుడై, చిదానంద పరిపూర్ణుడై ఇట్లనియె "నేడు నా జన్మము, ఈ నగరము, నా మాతాపితరులు, ధన్యులయిరి. మయూరేశుని ఉపదేశము, మరియు పార్వతీదేవి దర్శనముచే చరాచర స్వరూపుడు, పరాత్పరుడు, సర్వాంతర్యామి, అయిన విష్ణుభగవానుని దర్శన మయినది." విష్ణు భగవానుడు సహితము ఆ భక్తుని ఆలింగన మొనర్చి, అశ్రు నయనములు, గద్గద కంఠముతో ఇట్లనియె "నీవు నా కొరకై భోజనమును త్యజించితివి. నీ దృఢ నిశ్చయమునకు, నీ అచంచల భక్తికి మెచ్చి నేను క్షీర సాగరము నుండి ఏతెంచితిని. నేను నా భక్తుల మార్గమందలి కంటకములను పవనము చే పారద్రోలి, ఆ మార్గమంతయు సుగంధభరిత కళ్ళాపి జల్లెదను. భక్తుల పిపాసను నివారించుటకే నేను జలరూపుడనైతిని. భక్త కష్ట నివారణకే నేను నానా అవతారములు స్వీకరించెదను. నాకు భక్తులే అత్యంత ప్రియులు."

భాద్రపద శుద్ధ చవితి నాడు మయూరేశుని మహోత్సవము ఆరంభమయినది. అనేక రూపములు ముందు తెలిపిన విధముగ తయారుచేయబడి, అలంకరింప బడినవి. భక్తులు కొందరు నృత్య గీతములు, కొందరు ప్రదక్షిణలు, కొందరు పురాణ శ్రవణము, కావించుచుండిరి. ఇంతలో వశిష్ఠముని పౌత్రుడు పరాశరుడు అచటి కేతెంచెను. ఆతడు నాలుగు సంవత్సరముల బాలుడు. ఆతడు భక్తి తత్పరుడై, మయూరేశుని మూర్తిని చేసి, ఎండుటాకుల మాల దానికి వైచి, సుగంధ చందనాదులను మనసున తలచి, బురదను విలేపన మొనర్చెను. అంతేకాక మట్టితో చేసిన మిష్టాన్న, లడ్డూ, ఫలములను సమర్పించెను. క్రీడా రూపముగ సంకల్పమొనరించి, తన తొడలపై తాళము వేయుచూ నృత్యమొనర్చి, తాను సమర్పించిన నైవేద్యాదులను మయూరేశుడు స్వీకరించుటలేదని రోదన మారంభించెను. అంత ఆ మూర్తి చేతన నొంది, పరాశరుని చే అర్పింపబడిన మట్టి వస్తువులన్నియు యధారూపమునొంది చందన, పుష్ప, మోదకములుగ మారి, అవన్నియు మయూరేశునిచే తినబడినవి. అంతేకాక ఆ మయూరేశుడు మాటిమాటికీ విష్ణువుగా, మయూరేశునిగా రూపాంతరము చెందుచుండెను. అంత విశ్వదేవుడు మయూరేశుని "స్వామీ! ఈ మృణ్మయ వస్తువులను ఏల భుజించుచున్నారు?" అని ప్రశ్నించెను. అంత మయూరేశుడు "భక్తితో సమర్పించినది ఏదైననూ నాకు అమృతతుల్యము. భక్తి లేని ఎడల అది విషతుల్యము" అని తెలిపెను.

విశ్వదేవుడు "స్వామీ! నీ భక్తుడెవరు? నాకు చూపింప వలసినది" అని పలికెను. అంత ఆ స్వామి విశ్వదేవుని చేయిపట్టి బయటకు వచ్చెను. ప్రతి గృహము నందునూ మయూరేశుని పూజ జరుగచుండెను. ఇయ్యది నా స్వామి విష్ణువు కాదు అని విశ్వదేవుడు ముందుకు జరుగుచుండెను. అంత ఆతనికి ప్రతి గృహము నందునూ మయూరేశుడు విష్ణువుగనూ, విష్ణువు మయూరేశునిగనూ రూపాంతరము చెందుచూ కానబడెను. విశ్వదేవుడు విష్ణువు కనిపించినపుడు నమస్కరించి, మయూరేశుని ఉపేక్షించుచుండెను. ఈ విధముగ ముందున కేగుచూ వారు వశిష్ఠుని గృహమున కేతెంచిరి. అంత మయూరేశుడు "నా ఉత్తమ భక్తుని చూపెదను" అని పరాశరుని చూపెను. విశ్వదేవుడు మట్టి మయూరేశునకు మట్టి మోదకములు అర్పింపబడుట, వాటిని ఆయన భుజించుట కానబడెను. క్షణములో మయూరేశుని మూర్తి విష్ణువుగ మారెను. విశ్వదేవుడు మయూరేశుని పంచభూతములందు కాంచుట మొదలిడెను. అంత విశ్వదేవుడు తన భేదబుద్ధిని

విడనాడి, అభేద బుద్ధి, భక్తి పారవశ్యముతో మయూరేశునకు నమస్కృతులొనర్చి, ఆయన అనుజ్ఞగొని తిరిగి తన ఆశ్రమమున కేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశుని అభేద తత్వమను నూట నాల్గవ అధ్యాయము సమాప్తము)

నూట ఐదవ అధ్యాయము

(మయూరేశుడు గణాధ్యక్షుడగుట)

బ్రహ్మ "మయూరేశునకు కాలక్రమమున పదమూడేండ్లు నిండినవి. ఒకనాడు దశభుజుడు, పంచాననుడు, భస్మలింగ దేహుడు, చంద్రశేఖరుడు, పుర్రెలమాల ధరిచినవాడు, మనోహరుడు, మహేశుడు నిద్రించుచుండెను. మయూరేశుడచటికి ఏతెంచి, ఆయన శిరముపై యున్న చంద్రవంకను తీసికొని, బయటికేగి తన మిత్రులతో క్రీడించుచుండెను. ఆ సమయమున అచటికి క్రూరమయిన ముఖము, అద్భుత శరీరము, సూకర రూపమునున్న "మంగళుడు" అను దైత్యుడు ఏతెంచెను. ఆతడు వజ్రదేహుడై వృక్షములు కూల్చుచూ, పృధివీ, పర్వతముల చూర్ణమొనర్చుచూ, కాలాంజన పర్వత సదృశుడై, కన్నుల విస్ఫులింగములు విరజిమ్ముచూ, వర్షాకాల మేఘగర్జన కావించుచూ ఏతెంచెను. ఆ సూకరమును చూచి బాలురెల్లరూ పరుగులిడిరి. అంత దనుజుడు మయూరేశుని పైకి పరుగులిడెను. మయూరేశుడు తన చేతులతో ఆ సూకరపు కోరలు పట్టి, గిరగిరా త్రిప్పి, భూమిపైకి విసరెను. సూకరము వంద ముక్కలై మరణించెను. బాలురందరూ తిరిగి ఏతెంచి మయూరేశుని ప్రశంశించిరి. ఇంతలో శివుడు నిద్రనుండి లేచి, శిరమందు చంద్రవంక కనిపించక, ద్వారపాలురందరినీ పిలిచి కోపముతో "నా లలాట మందలి చంద్రుని ఏ దనుజుడు దొంగిలించెను? మీరందరూ ఏ రకమయిన రక్షణ యొనరించు చుండిరి? అని ప్రశ్నించెను. అంత భయాతురులైన ద్వారపాలురు ఏమియును మాట్లాడకుండిరి. అంత కొందరు ధైర్యము బూని "మీ పుత్రుడు మయూరేశుడు క్రీడార్థమేగినపుడు చంద్రవంకను తన హస్తమందు ధరించెను" అని పలికిరి. శివుడు "వెంఠనే వెళ్ళి చంద్రవంకను, అద్దానిని హరించిన వానిని నా వద్దకు తీసికొని రావలిసినది. లేని ఎడల మిమ్ముల నందరినీ భస్మమొనరించెదను" అని పలికెను.

అంత గణములు పరుగెత్తి మయూరేశుని వద్దకేగి "ఓ! చోర శిఖామణీ! మయూరేశా! నీవు వెంఠనే చంద్రవంకను మాకిమ్ము. లేని ఎడల శివుని కడకు మాతో రమ్ము" అని పలికిరి. అంత మయూరేశుడు కృద్ధుడై "నేను త్రిలోక జనని అయిన పార్వతీదేవి పుత్రుడను. మిమ్ముకానీ, మీ స్వామిని గానీ నేను లెక్కచేయను" అని పలికి ఒక నిశ్వాసము విడచెను. అంత ఆ గణములన్నియు ఎగిరి శివుని వద్ద పడినవి. అంత శివుడు క్రోధితుడై ప్రమధగణములను పిలచి వెంఠనే వెళ్ళి మయూరేశుని బంధించి తీసికుని రమ్మని పంపెను. వారందరూ క్రీడాస్థలికేగి బాలుని బంధించుటకు యత్నించిరి. అంత మయూరేశుడు అంతర్ధానుడయ్యెను. అంత వారందరూ వివిధ ప్రదేశముల కేగి వెదకి వెదకి అత్యంత డస్సిపోయిరి. అంత బాలుడు దయాళువై తిరిగి వారికి కానబడెను. అంత వారందరూ బాలుని బంధించి తీసికొని వెళ్ళుటకు యత్నించిరి. ఆతడు పృధివీ సదృశ భారముండెను. మయూరేశుని కొనిపోవుటకు శక్తిలేక రిక్త హస్తములతో శివుని కేడకేగి జరిగిన విషయములు వివరించిరి. అంత శివుడు మరింత మండిపడి, తన ఎరురుగ యున్న నందికేశ్వరుని చూచి, ఆ బాలుని గొనివచ్చుటకు పొమ్మనెను. నంది "స్వామీ! మీ ఆజ్ఞ అయిన ఎడల శేషుని, సూర్య చంద్రులను సహితము నేను హతమార్చగలను. ఈ చిన్న మయూరేశుని తీసికొని వచ్చుటెంత?" అని పలికి రోషయుక్తుడై

వాయువేగమున మయూరేశుని వద్దకేగి "ఓరీ! నీవు శివుని వద్ద కేగవలసినది. లేని ఎడల నిన్ను బలవంతముగ గొనిపోయెదను" అని పలికెను. అంత మయూరేశుడు నందిని తన శ్వాస యందు బంధించెను. కొంచెము సేపు లోనికి బయటకు ఏగి తదుపరి ఎగిరి శివుని వద్ద పడెను. ప్రగల్భములు పలికిన నంది ముఖము నుండి రుధిరము వమనము చేసికొనుచూ ఒక ముహూర్తము శివుని వద్ద మూర్ఛితుడయ్యెను. అంత శివుడు తన పాదముల వద్ద కూర్చొని యున్న మయూరేశుని కాంచెను. ఇంతలో గణములు శివునితో "స్వామీ! చంద్రవంక మీ శిరమునందు యున్నది. మీరు వృధాగా మమ్ము ఆజ్ఞాపించిరి" అని పలికిరి. శివుడు సహితము "నేను వృధాగా ఆజ్ఞాపించితిని. తత్ఫలిగముగ మీరు డస్సిపోయిరి" అనెను. ప్రమధులు "స్వామీ! మీరు మయూరేశుని మాకు నాయకుని కావింపవలసినది." అని పలికిరి. శివుడు "తధాస్తు" అని పలికెను. అంత ప్రమధగణ నాయకుడయి మయూరేశుడు పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించెను. గణములు హర్షముతో గర్జన మొనర్చిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశుడు గణాధ్యక్షుడగుట అను నూట ఐదవ అధ్యాయము సమాప్తము)

నూట ఆరవ అధ్యాయము

(ఇంద్ర గర్వభంగము)

బ్రహ్మ "మయూరేశునకు పదునాల్గేండ్లు వచ్చినవి. ఒకనాడు గౌతమాది మునులు పార్వతీ పరమేశ్వరుల దర్శనార్థమై ఏతెంచి, వారిరువురికీ పూజన మొనర్చి, తమకొసగబడిన ఆసనములందు ఆశీనులైరి. అంత పార్వతీ "మునులారా! మేము విఘ్నముల భయముతో త్రిసంధ్య క్షేత్రమును విడిచి ఇచట కేతెంచితిమి. ఇచటనూ మాకు విశ్రాంతి లభించుట లేదు. ఈ విఘ్నములు తీరు వ్రతము, మార్గమేదయిననూ తెలుపవలసినది." మునులు "దేవీ! ఇంద్రయాగ మొనరించిన ఎడల సర్వ విఘ్నములు తీరును" అని పలికి ఒక గొప్ప యజ్ఞమండపము నిర్మించి, ఇంద్రయాగమునకు వలయు సంభారములన్నియు అమర్చిరి. అంత పార్వతి శివుని అనుజ్ఞచే ఇంద్ర యాగము ఆరంభింపజేసెను. మునులు సపరివారముగ ఇంద్రుని, ఆయన గణములను ఆహ్వానించి, కుండములందు అగ్నిని ప్రజ్వలింపజేసి, యజ్ఞమొనర్చి, అందలి దశాంశమును తిలసహిత పాయసమును హెూమమొనర్చి, మంత్రములకు ముందు "ఓం", చివర "నమ:" తదుపరి "స్వాహా" జోడించి యాగమొనరించు చుండిరి. ఆ సమయమున మయూరేశుడు మిత్ర సహితుడై యాగస్థలికేతెంచెను. ఆ సమయమున "కళ", "వికళ" అను ఇరువురు దైత్యులు మహా బలిష్ఠమైన దున్నపోతుల రూపము ధరించి, వృక్షములను పెల్లగించుచూ, పర్వతములను చూర్ణమొనర్చుచూ, ఒకదానితో ఒకటి పోరాడుచున్నట్లు నటించుచూ యజ్ఞవేది వద్దకు ఏతెంచుట మొదలిడెను. వానిని చూసి సర్వులు భయగ్రస్థులైరి. బాలురందరూ పలాయనులైరి. అంత మయూరేశుడు వానిని గమనించి, నెమ్మదిగ వానిని సమీపించి, తన రెండు చేతులతో వాని రెండు పుచ్ఛములు పట్టి గిరగిరా త్రిప్పి నేలపై విసరెను. దనుజులిరువురు రుధిరము గ్రక్కి మరణించిరి. మునిబాలురు ఏతెంచి మయూరేశుని ప్రశంశించిరి.

మయూరేశుడు యజ్ఞవాటిక వద్దకేతెంచి ఇంద్రయాగము కాంచి వారందరినీ యజ్ఞమాపమని ఆజ్ఞాపించెను. ఇంద్రుని విగ్రహమును దూరముగ విసరివైచెను. తదుపరి మునులతో "ఓ! నిర్మలచిత్తులారా! మీరు కావించుచున్న కర్మ ఏమి? ఇంద్రుడు కేవలము తన కొరకే కర్మ కావించును. ఆయన సంతుష్ఠుడయిన ఏమి ఈయగలడు? మేకను ప్రార్థించినంత మాత్రమున కామధేనువు ఈయగల ఫలితమిచ్చునా?" ఈ విధముగ పలికి, కుండమందలి అగ్నిని ఆర్పి, మిగిలిన

భోజ్యములన్నింటినీ తాను భుజించెను. మయూరేశుని చపలతను గాంచి మునులు ఆశ్చర్యచకితులై, పార్వతీభక్తులైన వారందరూ మయూరేశుని ఏమీ అనలేక, పార్వతీదేవి వద్దకేగి సర్వమును తెలిపి, ఈ విషయము ఇంద్రునికి తెలిసిన ఎడల జరుగు విపర్యములకు సిద్ధముగ యుండమని నిష్క్రమించిరి. అంత ఇంద్రుడు ఈ విషయము తెలిసి రోషయుక్తుడై దేవగణములను పిలచి "మునులు ఆరద పూర్వకముగ నా యజ్ఞము నారంభించిరి. కానీ గణేశుడు దానిని మధ్యలో మానిపించి తానే సర్వ భక్షకుడయ్యెను. నాకు క్రోధము కలిగిన చరాచర జీవరాశి నష్టమగును." దేవగణములు "మహేంద్రా! మీ ఆజ్ఞ ఆయిన ఎడల మయూరేశుని బంధితుని యొనర్చి మీ కడకు తీసికొని వచ్చెదము" అని పలికిరి. ఇంద్రుడు తొలుత "ఓ! అగ్నీ! మయూరేశ పురము నుండి నీవు నిష్క్రమింపుము" అని ఆజ్ఞాపించెను. అంత మయూరేశ పురవాసులకు అగ్నిహోత్ర మొనర్చుటకు, వంటకు అగ్ని లేకుండెను. అందరూ పచ్చి వస్తువులే భుజించిరి. కానీ వారి జఠరము నందు జఠరాగ్ని లేక, తినిన ద్రవ్యములు జీర్ణమవక, జీవులు మిక్కిలి వ్యధనొందిరి. అంత వారందరూ మయూరేశుని వద్దకేగి, నమస్కరించి, ఇంద్రయాగ విఘ్నముచే కావింపబడుచున్న ఘోరము తెలిపిరి. అంత మయూరేశుడు తానే అగ్నియై నలుదిశలా ప్రసరించెను. అంత జీవులందరూ జఠరాగ్నినొంది క్షుధా బాధితులై తిరిగి భుజింపగలిగిరి. యజ్ఞకుండములు అగ్నిచే ప్రజ్వలించెను. అంత ఇంద్రుడు వాయువును నిగ్రహించెను. అంత జీవులందరూ విగత జీవులై క్రిందపడిరి. అంత మయూరేశుడు తానే పంచప్రాణములై సర్వులను పునర్జీవితుల కావించెను. అంత ఇంద్రుడు సూర్యుని నిగ్రహించెను. అంత ఆ ప్రదేశమంతయు అంధకార బంధురమై, త్రాగుటకు నీరు కరువయ్యెను. వాపీ కూప తటాకములు, నదులు నీరు లేమిచే ఎండిపోయెను. అంత మయూరేశుడు సూర్యుని వలె ప్రకాశించుచూ, మేఘమై నీటిని వర్షించెను. ఇట్లు ఏ విధముగ ఇంద్రుడు విఘ్నమొనర్చిననూ, దానిని మయూరేశుడు నివారించెను.

అంత ఇంద్రుని గర్వము సర్వము ఖర్వమై, మయూరేశుని వద్ద కేతెంచి, ప్రణామములాచరించి ఇట్లనియె "స్వామీ! నీవు సర్వరూపుడవు, బ్రహ్మ స్వరూపుడవు, సర్వాంతర్యామివి. నిన్ను వేదములు, మునులు, ఋషులు, బ్రహ్మాది దేవతలు, తెలియరు. నీవే సర్వకారణ కారుడవు. సృష్టిస్థిత్యంతములు కావించునది నీవే! నిన్ను శరణుజొచ్చుచున్నాను. నా అపరాధములు మన్నింపుము" అని ఆయన చరణములపై బడెను. అంత మయూరేశుడు "ఇంద్రా! లెమ్ము! నీకు కళ్యాణమగుగాక! నీవు తిరిగి నీ పదవిని పొందెదవు" అని పలికెను. అంత ఇంద్రుడు మయూరేశునకు ప్రదక్షిణ ప్రణామములర్పించి వెడలెను.

(శ్రీగణేశపురాణమందు క్రీడాఖండమందలి ఇంద్రగర్వభంగమనెడు నూట ఆరవ అధ్యాయము సమాప్తము)

నూట ఏడవ అధ్యాయము

(యమ గర్వ భంగము)

మయూరేశునకు పదిహేను వర్షము లేతెంచినవి. ఒకనాడాతడు తన మిత్రసహితుడై బ్రహ్మకమండల నది యందు స్నానమాచరించుట కేగెను. వారందరూ స్నానములాచరించి, సంధ్యానందనాది నిత్యకర్మలు సలిపి, మానసోపచారములతో షోడషపూజను తమ హృదయమందున్న గణాధిపునకు ఒనర్చుచుండిరి. కొందరు బాలురు ఆయనను పద్మాసనస్థితునిగ, కొందరు మయూర వాహనునిగ, దివ్యగంధ, పుష్పాదులతో పూజన మొనర్చుచుండిరి. "గార్గ్యుడు" అను ముని ఆయనను ఒక మందిరమందు రజిత సింహాసనమందు సమాసీనుని కావించి పూజించుచుండెను. అంత అకస్మాత్తుగా ఆ మందిరపు తలుపులు మూసుకొన్నవి. సర్వులు అధిక శ్రమ నొనర్చి ఆ తలుపులు తీయుటకు ప్రయత్నించిరి. కానీ అవి రాకుండెను. బాలురందరూ ఆక్రందించిరి. ఆ సమయమున ఒక మహాబలి అయిన దైత్యుడు వ్యాఘ్రరూపమున,

భయంకరముగ నోటిని తెరచి అచటి కేతెంచెను. ఆ భీషణ మృగము యొక్క జూలు అత్యంత భీతి గొలుపుచున్నది. దానిని కాంచి బాలురందరు దశదిశలకు పలాయన మొనర్చిరి. అంత వ్యాఘ్రము ఆ మందిరపు ద్వారమును పగులగొట్టి లోనికి ప్రవేశించి మయూరేశుని చేరెను. మయూరేశుడు తానును ఒక శార్దూల రూపమునొంది, ఆ వ్యాఘ్రము నెదిరించెను. అంత కొంత సమయము వారిరువురు సమరమొనరించిరి. మయూరేశుని ప్రతాపమును తాళజాలక దైత్యుడు పలాయనమొనర్చి, వనము చేరి, ఒక నికుంజపు అంతరాళమున ప్రవేశించి దాగుకొనెను. మయూరేశుడు వానిని వెంబడించి, ఒక వృక్షపుకొమ్మపై ఎక్కి, ఆ నికుంజము లోనికి దూకి, వ్యాఘ్రము పై బడి గాయమొనర్చి, తుదకు తన పరశువునెత్తి దాని శరీరమును, ముఖమును ఖండించి, గాయపరచి, జూలును ఉత్తరించి, "ఇకపై నీ ముఖము నాకు చూపింపవలదు" అని హెచ్చరించి వదలివైచెను. దైత్యుడు "నిన్ను సహితము నేను ఇదే విధముగ గాయపరిచెదను" అని పలికి వెడలిపోయెను.

ఇంతలో మునిబాలకులు మయూరేశుని వెదకుచూ వనము ప్రవేశించి, కొంతదూరము నడిచి, ఇక నడవలేక, డస్సి, ఒక వృక్షఛాయన కూర్చుండిరి. బాలురగుట మరియు అలసట చే వారందరూ దక్షిణదిశగా కాళ్ళుపెట్టి నిద్రించిరి. అంత యముడు తన దిశగా పాదములుంచిన ఆ బాలురందరినీ కట్టగట్టి తన లోకమునకు గొనిపోయెను. ఇంతలో మయూరేశుడేతెంచి, బాలురను కానక, ఆ చుట్టూ ప్రక్కలంతయు వెదకి, వారు దొరకక మౌనముగ తన నగరమున కేగెను. అంత నగరవాసులు "దేవా! మా పుత్రులేరి? ఉదయము నీవు వారందరినీ తీసికొని నదికేగితిని కదా?" అని ప్రశ్నించిరి. మయూరేశుడు ఏమియును మాట్లాడకుండుటచే వారందరూ ఆయనను నిందించిరి. అంత మయూరేశుడు తనలో తాను ఆలోచించి యమపురికి అరిగెను. అంత యమదూతలు యముని వద్దకేగి "స్వామీ! ఒక బాలుడు మహాకృద్ధుడై మీతో యుద్ధ మొనరించుట కేతెంచెను. ఆతడు త్రిలోకములు వినాశమగు రీతిని గర్జించుచూ, మాచే నివారింపబడినప్పటికీ వినక లోనికి ఏతెంచెను" అని పలికిరి. యముడు "నా దండము చే త్రిలోకములు చూర్ణమగును. అటువంటి నాతో ఈ బాలుడు యుద్ధమొట్లు కావించును?" అని పలికెను. ఇంతలో మయూరేశుడు లోనికేతెంచి "యమా! నీ ప్రగల్భములాపుము. నీవు నన్ను అసమర్ధునిగ తలచుచున్నావు. నేను భృకుటి ముడివైచిన ఈ బ్రహ్మాండమంతయు వినష్టమగును" అని పలికి ఒక్క ఎగురు ఎగిరి యముని భుజములు పట్టి క్రింద పడవైచి యమునిపై నిలబడెను. అంత యముడు మయూరేశుని శక్తి గ్రహించి "స్వామీ! బ్రహ్మాది దేవతలు, సనకాది మునులు నిన్ను తెలియరు. నిన్ను ఎప్పుడూ "ఇది కాదు", "ఇది కాదు" అను తెలియవలెను. కానీ నీ నిజస్వరూపమును ఎవరు తెలియుదురు? నీవు స్వేచ్ఛగా సర్వ క్రియలు సలిపెదవు. నా వలన కావింపబడిన అపరాధమును క్షమింపుము" అని పలికి ఆయనకు అనేక రత్న, వస్త్రాదులను బహుమతులుగ ప్రసాదించి పూజించెను. తదుపరి బాలురను తెచ్చి ఆయనకు అప్పగించెను. మయూరేశుడు ఆ బాలురను తీసికొని తన పురమున కేగెను. అంత మునులు తిరిగి ఏతెంచి, జరిగిన విషయము తెలిసికొని, మయూరేశుని క్షమింపమని ప్రార్థించి, తమ పుత్రులను కౌగలించి, తమ గృహముల కేగిరి. మయూరేశుడు సహితము మాతా పితరుల వద్దకేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి యమ గర్వభంగమనెడు నూట ఏడవ అధ్యాయము సమాప్తము)

నూట ఎనిమిదవ అధ్యాయము

(మయూరేశుని వివాహ ప్రస్తావన)

బ్రహ్మ "ఒకనాడు శివుడు ప్రసన్నచిత్తుడై, సుఖాసీనుడై యున్న సమయమున పార్వతీదేవి ఆయనను చేరి "స్వామీ! మన మయూరేశునకు పదహారేండ్ల ప్రాయమంకురించినది. ఇక ఈతని వివాహ ప్రయత్న మొనరింపవలెను. కామదేవుని వంటి సౌందర్య సంపన్నుడయిన ఈతనికి సుశీల, సుముఖి, ముగ్ధ, మృగాక్షీ, హంసగమన, కోకిల వంటి కంఠము, సుందరమయిన నాసిక, కలిగిన తన్వంగిని భార్యగా తేవలయును". శివుడు సహితము అంగీకరించి, మనసున తర్కించి, ఎవరినీ కానక కించిత్ చింతితుడయ్యెను. ఆ సమయమున నారద మహర్షి అచటికేతెంచెను. ఆయనకు స్వాగత సత్కారములు సలిపి శివుడు "దేవర్షీ! మీ ఆగమనము నాకు పరమాహ్లాదము కలిగించినది. మీరు బహుకాలము అయిన పిదప మా గృహమున కేతెంచిరి. దయచేసి ఒక్క దినమైననూ మా ఇంట యుండవలసినది. ఓ! అనఘా! మీరు త్రిలోకసంచారులు. అందువలన త్రిలోకముల యందలి విషయ విశేషములు మీకు కరతలామలకములు. అతి సుందరుడయిన మా పుత్రునికి వధువును తెలుపవలసినది" అని పలికెను. పార్వతి సహితము నారదుని అట్లే ప్రశ్నించెను. అంత నారదుడు "నా కర్మ పరిపాకము చే ఏ ప్రదేశమందునూ రెండు ముహూర్తముల కంటె ఎక్కువ యుండలేను. స్వామీ! మన్నింపవలసినది. అయిననూ నేను బ్రహ్మదేవుని ద్వారా పంపబడి మీ వద్దకేతెంచితిని. ఆయనకు సిద్ధి, బుద్ధులను ఇరువురు కన్యలు కలరు. వారిరువురు రూప లావణ్య గుణ శీలములందు అనసూయ, శచీదేవి, సంజ్ఞాదేవిలను లజ్జిత మొనర్చెదరు. ఆ కన్యలిరువురు మీ పుత్రుని సంయోగముచే స్వర్ణ రత్నములు, ముత్య పగడము వలె ప్రకాశించెదరు. బ్రహ్మ ఆ ఇరువురు కన్యలను మయూరేశుని కిచ్చుటకు ఉత్సుకుడై యున్నాడు." ఈ పలుకులు విని పార్వతీ పరమేశ్వరులు అత్యంత ప్రసన్నులై "దేవర్షీ! మీరు మా మనోవాంఛితము పూర్ణమొనరించు శుభ వచనములు పలికిరి" అని పలికెను. తదుపరి శివుడు తన అర్ధాంగిని పార్వతితో కలసి, వృషభారూఢుడై, కార్తికేయాది దేవగణములను, ఏడుకోట్ల ప్రమథులను, అందరితో కలసి తక్షణమే బ్రహ్మ వద్దకు బయలుదేరెను. మయూరేశుడు తన వాహనమయిన మయూరము నధిరోహించి ముందుకు సాగుచుండెను. వారందరి వెనుక ఎనభై ఎనిమిది వేల మునిగణములు కదులు చుండిరి. వారందరూ కొంత దూరమేగి, గండకీనగర పొలిమేరలు చేరి అచటగట సైనిక దళములను కాంచిరి.

అచటగల రాక్షసదళ నాయకుడు శివ పరివారము నంతటినీ ఆపి "మీరెవరి సైనికులు? ఎక్కడ నుండి ఏతెంచుచున్నారు? ఎక్కడికేగుచున్నారు? మా స్వామి ఆజ్ఞలేక మిమ్ము లోనికి అనుమతింపము" అని పలికెను. అంత మయూరేశుడు "మేము స్వతంత్రులము. దైత్య, దానవుల నంతమొందించి, సజ్జనులను రక్షించెదము. మాకు మార్గమీయని ఎడల మీరందరూ నాశనమగుదురు" అని పలికెను. ఇంతలో ఇంతకు మునుపు మయూరేశునిచే ముక్కు చెవులు కోల్పోయిన "హేమ" అను రాక్షసుడు అచటికేతెంచి మయూరేశునితో "తొలుత నన్ను ఒక్కడిని చేసి, వికృతుడను గావించితివి. నేను నా మిత్రులతో కలసి నిన్ను అంతమొందించెదను" అని పలికి రాక్షసులతో "ఈ మయూరేశుడు బలపూర్వకముగ ఎందరో దనుజులను హతమార్చెను. నాకునూ అంగచ్ఛేదము కావించి, వికృతుని యొనర్చెను. వీనిని శీఘ్రమే తుదముట్టింపవలెను." అంత మయూరేశుడు కృద్ధుడై ముని పుత్రుల వంక తిరిగి "మీరు నా అనుగ్రహము చే ఈ రాక్షసులతో యుద్ధమొనర్ప వలసినది." అంత మునిపుత్రులు కుశలను ధరించి యుద్ధ సన్నద్ధులైరి. మంత్రములు ఉచ్చరించుచూ కుశలను ప్రయోగించిరి. మయూరేశుని ప్రభావముచే దనుజుల శస్త్రములు విఫలమయ్యెను. కుశలు దానవుల కాళ్ళు, చేతులు, శిరములు, తొడలు, పాదములను ఖండించినది. రాక్షసులు "కుశలతో సహితము ప్రత్యర్థులను

చంపవచ్చునా?" అని ఆశ్చర్యచకితులైరి. ముని బాలకులు సర్వులను సంహరించి గర్జన కావించుచూ మయూరేశుని వద్దకేతెంచి "మీ ఆజ్ఞచే దనుజుల సంహరించితిమి. మాకు పున:ఆజ్ఞ నీయవలసినది" అని పలికిరి. శివుడు "పుత్రా! నేడు నీ పరాక్రమము కాంచితిని. నీవు తొలుత నీ శస్త్రములచే దనుజుల పరిమార్చితివి. తదుపరి ముని పుత్రులు వారిని సంహరించిరి. నీ ప్రభావమును బ్రహ్మాదులే తెలియరు. మునుముందు నీవు కావించు లీలలు నేను సహితము తెలియను" అని ప్రశంశించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశ వివాహ ప్రస్తావన యను నూట ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నూట తొమ్మిదవ అధ్యాయము

(మయూరేశుని రాయబార ప్రయత్నము)

బ్రహ్మ "మయూరేశుడు విజయుడై, హర్షోత్పులుడై ముందుకు సాగుచుండెను. ఆతని వెనుక వృషభారూఢుడై శివుడు, ప్రమథాదులు, ముని బాలకులు గౌతమాది మునులు ఏగుచుండిరి. ముని బాలురు, శివ గణముల గర్జనలతో దిశలు, విదిశలు ప్రతిధ్వనించుచున్నవి. గండకీ నగరమునకు ఒక యోజనము దూరమున వారందరూ ఆగిరి. మయూరేశుడు తన వాహనము దిగి, ఒక ఉత్తమాసనమందు ఆశీనుడై, శివాదులను, మునులను కూర్చుంబెట్టి ఇట్లనియె "సింధు దైత్యుడు ఇంద్రాది దేవతలను కారాగార వాసుల కావించెను. ఈ దేవతలను విడిపించక వివాహ మహోత్సవము శోభనొందదు. వారిని ముక్తులొనరించుటకు బుద్ధిమంతుడయిన ఒక దూతను పంపవలెను. ఒకవేళ సింధు దైత్యుడు ఒప్పుకొని, ఆ దేవతలను విడుదల కావించిన ఎడల సర్వము సుగమమగును. లేని ఎడల సమరము తప్పదు. అపుడు సంగ్రామమందు దనుజుని నిర్జించి దేవతలను విడిపించెదము." అంత సభికులందరూ "మయూరేశా! నీవు బాలుని వయినప్పటికీ బుద్ధి యందు బృహస్పతివి. మనము దూతగా పుష్పదంతుని పంపించెదము. ఆతడు బుద్ధిమంతుడు, నీతి శాస్త్ర విశారదుడు, కుశలవక్త, బలశాలి మరియు శ్రేష్ఠుడు. ఈతడు స్తోత్ర రచన గావించి పరమేశ్వరుని ప్రసన్నము కావించెను" అని పలికిరి. అంత పుష్పదంతుడు "ఓ! మయూరేశా! నీ మహిమ అవాఙ్మానస గోచరము. నిత్యద్రష్టా! నీ మాయ యందు పడి జనులు నీ మహిమను ఎరుగరు. నీవు పృథివీభార హరణమునకై పరమేశ్వరుని ఇంట అవతరించితివి. అపార సేనాయుతుడు, పరాక్రముడు అయిన సింధు దైత్యుడు దూతనైన నన్ను బంధించినచో నేను వెనకకు రాలేను. కానీ నాకు బాహుబలముతో చెలరేగి ఆ దనుజ సేనావాహినితో సమర మొనర్పవలెనని యున్నది. సామముతో కార్యసాధన జరిగిన దాన, భేద, దండములు నిరర్థకములు. దండము (యుద్ధము) ఎల్లప్పుడూ చివరి సాధనము మాత్రమే!"

అంత శివుడు "పుష్పదంతా! నీవు తెలిపిన పురాతన నీతి సముచితము. కేవలము బలశాలి, క్రోధి అయిన వ్యక్తి శాంతియుత ప్రయత్నమందు దక్షుడు కానేరడు. కార్తికేయుని పంపిన ఆతడు సింధుని బంధించుటకు యత్నించును. వీరభద్రుని పంపిన ఆతడు క్రోధపూరితుడై కార్యము భగ్నము కావచ్చును. శృంగిని పంపిన ఎడల ఆతడు అచటనే సంగ్రామము ఆరంభించును. ప్రమథులను పంపిన వారేమి చేయుదురో వారికే ఎరుక. భూతరాజును పంపిన ఆతడు సర్వులను భయభీతులొనర్చును. రక్తలోచనుని పంపిన ఎడల ఆతడు స్త్రీ సంభోగమందు నిరతుడై వెనుకకు రాడు" అని పలికి ఒక్క క్షణము మౌనము వహించెను. అంత మయూరేశుడు సర్వమును విని "తండ్రీ! నంది సాగర సమాన గంభీరుడు; ధైర్యమందు హిమాలయతుల్యుడు, బుద్ధియందు బృహస్పతి, బలమందు ఇంద్రసముడు. చక్కని పరేంగితావగాహి.

మనము సామము వాంఛించిన ఎడల ఆయనను పంపవలెనని నా అభిప్రాయము.” శివుడు “మయూరేశా! నీ పలుకులు అత్యంత సముచితములు. నీవు గుణదోషముల ఎంపిక యందు జ్ఞాతవు. నందికి వివిధ వస్త్ర భూషణములు ఒసంగి ఆయనను ప్రేరేపింప వలసినది” అని బదులిచ్చెను.

మయూరేశుడు అమూల్య వస్త్ర భూషణములను నందికి బహూకరించి “ఓ! మహాబలీ! నీవు సింధు దైత్యుని వద్దకేగి దేవతలందరూ ఎట్లు విముక్తులగుదురో అట్టి నీతివాక్యములను చతురతతో పలికి, సర్వులకు ఉపయోగరకముగ నీ బుద్ధిని ఉపయోగించి, ఈ కార్యము సామముగా సిద్ధి నొందింపుము. నంది పార్వతీ పరమేశ్వరులకు, మయూరేశునకు, నమస్కారమొనరించి “స్వామీ! లోకమందు మీ అనుగ్రహము లేశమున్ననూ వారు మహాత్ములగుదురు. మీరు నన్ను శ్రేష్ఠుడు అని తలచిరి. నేను నా సర్వ శక్తులు వినియోగించి మీ ప్రయోజనము సిద్ధించుటకు యత్నించెదను. మీ కృపచే నేను భూమిని తల్లక్రిందులు కావించి, శేషుని సహితము మీ వద్దకు తీసికొని రాగలను” అని పలికి, మనసున సర్వసిద్ధి కారిణి అయిన పార్వతీమాతకు, శ్రీగణేశ, పరమేశ్వరులకు భక్తితో నమస్కరించి, వారిని జపించుచూ మనోవేగమున సింధు దైత్యుని నగరము చేరెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశుని రాయబార ప్రయత్నము అను నూట తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూట పదియవ అధ్యాయము

(నంది రాయబారము)

బ్రహ్మ “రాయబారులచే నంది యొక్క ఆగమనమును తెలిసిన సింధు ఆయనను ప్రవేశపెట్టమని అనుజ్ఞనిచ్చెను. ఆ సభయందు సింధు తేజశ్శాలియై కూర్చొని యుండెను. ఆతని పరివేష్ఠించి అనేకమంది శస్త్రాస్త్ర కోవిదులు శస్త్రధారులై, అప్రమత్తులై యుండిరి. ఆతని కిరుప్రక్కలా పురుషులు నిలబడి వింజామరలు వీచుచుండిరి. అనేక ప్రకారములయిన వాద్యముల మధ్య సింధు వారాంగనల నృత్యము అవలోకించుచూ నందిని కూర్చొనమని సంజ్ఞ చేసెను. ఆ సభ యందలి కొంతమంది దైత్యులు అత్యద్భుత బలశాలి అయిన నందిని గాంచి “సూర్యుడు భువికేతెంచెనా?” అని అబ్బురపడిరి. కొందరు ఆతని శరీర సౌష్ఠవము చూచి భయకంపితులైరి. మరికొందరు దైత్యులు నందిని భయపెట్టుటకు గర్జనలు చేసిరి. స్వకీయ బలమందు నమ్మకమున్న నంది ఇంచుక భయము నొందక ఒక ఆసనమందు ఆశీనుడయ్యెను. ఆ సమయమున సింధు సభయందున్న రాక్షసయోధులు నందిని గాంచి చిత్తరువుల వలె నిష్క్రియులైరి. కొంత సేపయిన పిదప సింధు యొక్క సంజ్ఞ గ్రహించి నంది ఇట్లనియె “నేను ఇత:పూర్వము ఎన్నో సభలను కాంచితిని. కానీ ఇంతటి మూఢులను ఎక్కడనూ చూడలేదు. మీరందరూ అద్భుత బలశాలురు, శోభా సంపన్నులు, వైభవోపేతులు, కామదేవ సదృశ సుందరులు, కానీ తోడేళ్ళ వంటి బుద్ధిహీనులు. సభయందు ప్రవేశించిన దూత సజ్జనుడైననూ, దుర్జనుడైననూ, బలశాలి అయిననూ, దుర్బలుడయిననూ, ఆతనిని ఆదరించి, కుశల ప్రశ్నలడుగవలెను. ఇయ్యది సనాతన నీతి. మీ సభయందు అటువంటి మర్యాద కరువైనది. తత్ఫలితముగ నాకు ఆశ్చర్యము కలుగుచున్నది. ఇటువంటి సభయందు ఉపవిష్టులైన సభాసదులు, అమాత్యులు, నాగరికులు, సర్వులు వృధా! ధర్మము కేవలము ప్రభువుకేకాదు, సభ్యుల కర్తవ్యము కూడా!!”.

ఆ పలుకులు విని సింధు దైత్యుడిట్లనియె “ఓ! గుణఖనీ! నీ బుద్ధి అద్భుతము. ఓ! నందీ! నీవు ఎవరి దూతవు? ఎక్కడి నుండి, ఎందుల కేతెంచితివి? నీవు అగ్ని వంటి తేజస్సు కలిగిన సింహ పరాక్రముడవు”. నంది “ఓ! దనుజేంద్రా! నేను కామధేను రూపిణి అయిన సురభి పుత్రుడను. నంది నామధేయుడను. బ్రహ్మాండ భేదనమొనర్చు సామర్థ్యము కలవాడను. పరమశివుని వాహనమును. పృధివీ భారహరణమునకు, దుష్ఠ వినాశనమునకు, బాల్యావస్థ యందే అనేక దైత్యులను సంహరించిన మయూరేశుడు శివుని ఇంట అవతారము స్వీకరించెను. ఆ మయూరేశుని పరాక్రమము వర్ణించుటకు ఫణిపతికి, భాషాపతికి సహిత మసాధ్యము. సముద్ర మంధనమందు అనేక రత్న సమూహములు వెలుపలికి వచ్చినవి. అట్లే నీవు నీతిని మధించి, కార్యసిద్ధిని విచారింపవలసినది. మయూరేశుని ద్వారా పంపబడిన సందేశమును వినుము. ఎవరు ఆయన ఆజ్ఞను ఉల్లంఘించెదరో వారికి వినాశము తప్పదు. నీవు దేవ గణములను బలపూర్వకముగ కారాగారమందు బంధించి, వారి పదవుల నాక్రమించి, పాలించుచుంటివి. ఇంతకంటె భాగ్యమేముండును? ఇకనైననూ దేవతలతో వైరము మాని, వారిని విడిపించి, వారి స్థానములు వారికి ప్రసాదింపుము. త్రిపురాసురుడు దేవతలతో వైరము ప్రకటించెను. శివుడు క్షణములో వానిని సంహరించెను. హిరణ్యకశిపుని విష్ణుభగవానుడు స్థంభము నుండి ఆవిర్భవించి హతమార్చెను. తారకాసురుడు నీ వలెనే ప్రవర్తించెను. స్కందుడు వానిని తుదముట్టించెను. అందువలన నీవు దేవతలను నా కప్పగించి చిరకాలము నీ నగరమందు నీవు సుఖముగ యుండుము” అని పలికెను.

నంది వచనములు విని సింధు అత్యంత క్రోధితుడై కన్నుల నిప్పులు చెరుగుచూ “ఓ! వృషనందనా! నీ చతురత గమనించితిని. నీకు వార్తాలాప ప్రసంగము తెలియదు. ప్రసంగానుకూలత లేని ఎడల బృహస్పతి వచనములు సహితము నిరర్ధకములగును. నీవు, నీ స్వామి యొక్క పలుకుల చే దేవతలను ఎట్లు విడచెదను? నీ స్వామిని అంత మొనర్చువరకు నేను నిద్రపోను. ఓరీ! గడ్డితిను పశువా! నీ వంటి వనచరుని పలుకులకు ప్రమాణము, ప్రాముఖ్యము ఎక్కడయున్నది? నీ శివుడు, వాని పుత్రుడు ఎక్కడ? నీవు వృధా ప్రసంగము చేయుచున్నావు. మాకు వారి వలన కించిత్ భయము లేదు. నీవు దూతవై వచ్చుట వలన నిన్ను విడువవలసి వచ్చుచున్నది. లేని ఎడల నిన్ను వధించి యుందును. నేను భృకుటి ముడి వేసినంత మాత్రమున త్రిలోకములు తల్లక్రిందులగును. నక్కకు కోపమొచ్చినంత మాత్రమున సింహమునకు, గజరాజుకు ఆపత్తి లేదు” అని పలికెను. ఈ విధమయిన అపశబ్దయతమయిన వాగ్బాణములను విని నంది క్రోధావిష్ఠుడై “ఓరీ! అసురాధమా! నేడు నీ వక్రబుద్ధిని కన్నులారా కాంచితిని. నీవు సన్నిపాత జ్వర రోగివలె ప్రేలుచూ, మరణోన్ముఖున వగుచున్నావు. నా స్వామి నన్ను కేవలము సామరస్యముగ కార్యసిద్ధిని కావింపమని ఆదేశించెను. దుష్టునకు ఉపదేశించు నీతివలె నీతో మాటలాడుట వ్యర్థము. నీవు శివ, మయూరేశుల నింద కావించితివి కావున నీకు ఆయు:క్షీణమై, సంగ్రామమందు పరాజయము నొందెదవు. మూర్ఖుడా! నిన్ను ఇపుడే సంహరింపగలను. కానీ నా స్వామి అనుజ్ఞ లేక ఆగితిని. నాయకుడు ప్రత్యర్ధి దూతను, దూత ప్రత్యర్ధి నాయకుని వధింపరాదు” అని పలికి ఒక్కమారు దీర్ఘ నిశ్వాసము వదలెను. దానితో దానవ ప్రముఖులందరూ ఎగిరి దూరముగ పడిరి. నంది వెడలుటకు సింధుని అనుజ్ఞ నడుగక, వెనుదిరిగి క్షణములో మయూరేశుని చేరి జరిగిన విషయమంతయు వెల్లడించెను. నంది పలుకులు విని మయూరేశుడు సింధు సంహార లాలసుడై ప్రమధాది గణములను సింధు సైన్యముపై సంగ్రామమునకు ఉద్యుక్తుల గావించెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి నంది రాయబారమను నూటపదియవ అధ్యాయము సమాప్తము)

నూట పదకొండవ అధ్యాయము

(దైత్య, శివగణ యుద్ధారంభము)

బ్రహ్మ "మరునాడు మయూరేశుడు తన నాలుగు హస్తములందు ఆయుధపాణియై, మయూరారూఢుడై, భీషణగర్జన మొనర్చెను. శివుడు సహితము భయంకర గర్జన మొనర్చి వృషభారూఢుడు అయ్యెను. ఏడు కోట్ల ప్రమధ గణములు వారి ననుసరించుటకు సన్నద్ధులైరి. ఆ సమయమున నంది "ప్రభూ! మీరు యుద్ధమున కేగవలదు. ప్రమధగణ నాయకుడు వీరభద్రుడు, నేను, అసురాంతకులైన ప్రమధులు యుండగా మీరు వచ్చి సంగరమొనర్చుట సముచితము కాదు" అని పలికెను. అంత మయూరేశుడు "నందీ! నీ పలుకులు సత్యము. కానీ సింధు దైత్యుని పరాక్రమమును పరికింపవలెను. అందువలన నేను మీ ముందు సాగుచుందును. మీరందరూ నా వెనుక అనుసరింప వలసినది. భూతరాజు, పుష్పదంతులు సేనలను వెనుక రక్షించుచుందురు. నేలఈనినట్లు ప్రమధులు కదిలి ప్రళయకాల మేఘముల వలె గర్జన చేయుచూ, శేషుని శిరములు కుంటుబడునట్లు పృధివిని దద్దరిల్ల జేయుచూ, కన్నుల నుండి క్రోధాగ్ని కురియుచుండగా గండకీపురము ప్రవేశించిరి. కోట యొక్క సింహద్వారము వద్ద కోట్లాది అసురులు కాపలా కాయుచుండిరి. ఇరుసేనలు అస్త్రశస్త్రములు, సాయకములు, భిందిపాల, పరశువులతో భీషణ సంగ్రామ మొనరించిరి. దైత్యులకు శిరములు, కాళ్ళు, చేతులు, తొడలు, పాదములు, చీలమండలు తెగి ప్రాణములు హరింపబడినవి. చావగా మిగిలిన దైత్యులు సభామధ్యమున కేగి సింధునకు ఈ విధముగ తెలిపిరి. ఆ సమయమున వారందరూ రక్తస్రావముచే పూచిన శింశుపా వృక్షముల వలె గోచరించుచుండిరి.

"మహారాజా! నగరద్వారము వద్ద పది కోట్ల మంది నిశాచరులు కాపలాయుండిరి. శత్రువులు దాడి జరిపి వారిలో అత్యధిక దైత్యులను సంహరించిరి. శత్రువులు ఉద్యానములను, ఇళ్ళు, వాకిళ్ళను, నగర వీధులను దగ్ధమొనర్చుచున్నారు. కొందరు పౌరులు నిద్రించుచూ, కొందరు భోజనాదికములు కావించుచున్నారు. వారందరూ అకస్మాత్తుగా వెలువడిన దాడికి నిరుత్తరులై, ఇండ్లను విడచి బయటకు పరుగులెత్తుచున్నారు. కొందరు బాలురను వక్షముల నిడుకొని, మరికొందరు వస్త్రములు జారి అస్తవ్యస్తమై పరుగులిడుచుండిరి. సర్వదిక్కులా అగ్నిని కాంచి నాగరికులు ప్రళయ మేతెంచెనన్న ఆలోచనతో యుండిరి. మహారాజా! ఇవన్నియు జరుగుచున్ననూ నీవు ఏమీ పట్టనటుల మౌనముగ ఏల యుంటివి? తగిన చర్య తీసికొన వలసినది" అని పలికిరి. ఈ పలుకులు వినిన సింధు దైత్యుడు ఒక దీర్ఘ ఉఛ్వాసము తీసికొని "మనసేన అపారము. సింహపు సమక్షమున కుందేటి పరాక్రమము ఏపాటిది? మేరు పర్వతమును శలభ, జంబుకములు అధిరోహింపగలవా? కాలుని వంటి నన్ను మయూరేశుడు ఏమి చేయగల్గును?" అని ఒక తీవ్ర గర్జన చేసి ఒక్క క్షణము మౌనము వహించెను. ఆతని సేనానులు క్రోధమూర్ఛితులై "రాజా! మాకు అనుజ్ఞ నీయవలసినది. క్షణములో మయూరేశుని నిర్జించెదము" అని పలికిరి. సింధు "మీరు పలికినది ఉచితము. మీరు వాని సేనతో యుద్ధమొనర్పుడు. నాకునూ ఆ మయూరేశుని కాంచుటకు ఉత్సుకతగా యున్నది" అని పలికి యుద్ధోన్మత్తుడై మనోగతి పోగల అశ్వము నధిరోహించి యుద్ధ భూమికేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దైత్య, శివగణ యుద్ధారంభమను నూట పదకొండవ అధ్యాయము సమాప్తము)

నూట పన్నెండవ అధ్యాయము

(కౌస్తుభ, మైత్రుల మరణము)

బ్రహ్మ "చతురంగబల సమేతమైన దైత్యసేన నెమ్మదిగా బయటకేతెంచుట ఆరంభించెను. అందరికంటె ముందు పదాతులు యుండిరి. వారందరూ కరాళముఖులై, సింధూర లేపనముచే ముఖములు అరుణ వర్ణముచే ప్రకాశించుచుండెను. కవచములు శరీరమునకు బిగించి, జుట్టు ముడివైచి, కొందరు శిరోజములు ఒక గుడ్డచే బంధించి, చందనానులేపితులై, నానాశస్త్రాస్త్రములు ధరించి, అనేక యుద్ధములందు ఆరితేరిన వీరులు ముందున కేగుచుండిరి. వారి వెనుక మదోన్మత్త గజసైన్యము నడచుచుండెను. వాని శరీరమందు కావింపబడిన పత్రరచనచే గజసైన్యమంతయు చిత్ర విచిత్ర పర్వతముల వలె గోచరించుచున్నవి. వాని దంతములు అత్యంత పొడవుగా యుండి వివిధా భరణములచే అలంకరింపబడి, వాని కంఠములకు కట్టబడిన గంటల ధ్వనిచే జనులను బధిరులను కావించుచున్నవి. వాటి వెనుక అశ్వసైన్యము కదలుచున్నది. వాని గిట్టల ధ్వనిచే పృధివిని చూర్ణ మొనర్చుచూ, వాని సకిలింపుల ధ్వనిచే భూనభోంతరాళముల ప్రతిధ్వనించుచూ కదలుచున్నది. ఆ అశ్వములు సువర్ణ ఖచిత రత్నాభరణములచే అలంకరింపబడి, వానిపై మహా యోధులు కవచములు ధరించి ముందునకేగుచుండిరి. ఆ యోధుల హస్తములందు వివిధ శస్త్రములు ఇమిడియున్నవి. వాని వెనుక రధారోహులు ఏగుచుండిరి. అంతేకాక ఆ అదరములన్నియు యుద్ధవిధానమెరిగిన సుశిక్షితులైన సారధులచే సారధ్యము చేయబడుచున్నవి. ఆ రధములందలి యోధులు భుజములకు ధనుస్సు, తూణీరములు, చేతులయందు కరవాలము, ధరించియుండిరి. ఈ విధముగ గర్జించుచూ బయటకు వచ్చిన దైత్యసేనను చూచి భూతరాజు, పుష్పదంతులు భయభీతులై మయూరేశుని వద్దకేతెంచి ఇట్లనిరి "స్వామీ! మీ ఆజ్ఞచే మేము గండకీ నగర ద్వారము వద్దకేగి అచటగల దైత్యగణమును సంహరించి, నగరమును దగ్ధమొనర్చితిమి. ఇపుడు సింధు దైత్యుడు తన నిజసేనతో బయటకేతెంచెను. మేము కించిత్ భయభీతుల మయి మీ వద్దకు ఏతెంచితిమి." ఈ విధముగ పలుకుచూ వారు తూర్పుదిశకు చూపించిరి. అచట దుస్తరమైన దైత్యసేన సముద్రము వలె ఎగిరిపడుచున్నది.

అంత మయూరేశుడు ఆ సమాచారము విని హర్షితుడై, మయూరారూఢుడై, ఆయుధపాణియై, మందునకేగెను. ధనుర్బాణ, చంద్రహాసములు ధరించి వృషభారూఢుడై వృషాంకుడు సహితము యుద్ధోన్ముఖుడయ్యెను. శివగణములన్నియు ఆయనను అనుసరించినవి. దుందుభుల మ్రోతతో ఇరు పక్షముల మధ్య ద్వంద్ద యుద్ధమారంభమయ్యెను. ఇరుసేనలు ప్రత్యర్థుల కాంచి ఆశ్చర్యచకితులైరి. మయూరేశుడు నంది తెలిపిన విషయములు నిజమని నమ్మెను. అంత నంది మయూరేశునకు నమస్కరించి, ఆకాశమార్గమున దైత్యసేన ప్రవేశించి, వీరుల మస్తకములు ఛేదించుచూ దైత్యరాజు సింధును చేరి, తన శృంగములతో ఆతని అశ్వమును తీవ్రముగ గాయపరచి, ఛత్రమును క్రింద పడవైచి దైత్యప్రభువు క్రిందపడగా, తక్షణము వెనుదిరిగి మయూరేశుని చేరెను. దేవసేన విజయ నినాదములు కావించినది. దైత్యుడు సహితము ఆశ్చర్యాన్వితుడై, తన వీరులను మందలించి, తిరిగి వేరొక అశ్వమును గ్రహించి నిలబడెను. అంత ఆతని అమాత్యులు "కౌస్తుభుడు", "మైత్ర" అనువారలు తమ రాజును వారించి, ఆయన అనుజ్ఞను గొని, శత్రువినాశన మొనరించెదమని శపధము లాచరించి, చతురంగబల సమేతులై మయూరేశుని పరిమార్చుట కేతెంచిరి. అంత వారిని వీరభద్ర, కార్తికేయు లెదుర్కొనిరి. వారందరూ తీవ్రగర్జనలు కావించుచూ ఒకరిపై ఒకరు శర పరంపర కురిపించిరి. అన్ని ప్రక్కలా "కొట్టు", "చంపు" అను అరుపులు వినిపించుచుండెను. అమాత్యులిరువురు చెలరేగి భల్ల బాణములు, అర్ధచంద్ర బాణములు, భిందిపాలములు, పరిఘలు, ముసలములు విసురుచూ శత్రుసేనలను చూర్ణమొనరించిరి. ఇరుపక్షములందు అనేకానేక

సైనికులు మరణించిరి. శస్త్రములు లుప్తమయిన యోధులు మల్లయుద్ధ మొనరింపదొడంగిరి. కొందరు శిరములు, కొందరు కంఠములు, మరికొందరు కాళ్ళు, చేతులు, కొందరు తొడలు, పాదములు ఈ విధము నరుకబడి, క్షతగాత్రులై మరణించిరి. రుధిరము కాల్వలై ప్రవహించుచుండగా ఆ సంగరరంగమంతయు పరమ భయానకమగయుండెను. వీరులు తమ కాళ్ళు, చేతులు, శిరము, వీపు, తొడలు ఈ విధముగ తను సర్వావయవములతో పోరు సలుపుచుండిరి. ఈ విధముగ మొదటిరోజు మయూరేశుని సేన అధికముగ నష్టమయ్యెను. దైత్యులు విజయాతిరేకముచే గర్జన చేయుచూ సాయంత్రమగుటచే సమరము చాలించి గృహముల కేగిరి. అమాత్యులయిన కౌస్తుభ, మైత్రులు వందిజనము తమను పొగడుచుండగా సింధు దైత్యుని వద్దకేగిరి. కార్తికేయ, వీరభద్రులు మయూరేశుని వద్దకేగిరి. సూర్యాస్తమయమై, చీకట్లు అలముకొని భయంకరమైన నిశ్శబ్దము ఆవరించినది.

మరునాడు ఉదయమే తిరిగి సేనలు యుద్ధసన్నద్ధ మయినవి. దైత్యసేన విజృంభించుటచే దేవసేన పలాయన మొనర్చుట ప్రారంభించినది. కానీ వీరభద్ర, కార్తికేయులు వారికి ధైర్యము గొలిపి ముందునకొచ్చి గర్జన చేసిరి. తీవ్రమయిన శస్త్రాస్త్రములు ప్రయోగించి దైత్యసేనను దగ్ధమొనర్చుట ఆరంభించిరి. దానితో దేవసేన ధైర్యమునొంది తిరిగి సంగరమందు ప్రవేశించెను. ఆ వీరులిరువురు తమ సేనను రక్షించుకొనుచూ, శత్రుసేనను వధించుచూ, తీవ్రముగ సంగరమాచరించుచుండిరి. వారిరువురి విజృంభణము కాంచి దైత్య అమాత్యులిరువురు తమ ప్రాణములపై ఆశ వదలి సంగ్రామము మొదలుపెట్టిరి. అంత కార్తికేయుడేతెంచి మైత్ర దైత్యునిపై ముష్టి ప్రహార మొనరించెను. మైత్రుడు పుడమిపై బడి అశువులు బాసెను. అదిగాంచి కౌస్తుభుడు మిక్కిలి వ్యధనొంది, అగ్రహోదగ్రుడై ఒక కరవాలము ధరించి, కార్తికేయునిపై బడి ప్రహారమొనర్చెను. అంత కార్తికేయుడు మూర్ఛనొందెను. అది చూచి వీరభద్రుడేతెంచి కౌస్తుభునితో ద్వంద్వ యుద్ధ మొనరించి, చివరకు ఆ దైత్యునిపై తీవ్రముగ ముష్టి ప్రహార మొనరించెను. ఆ ఘాతమునకు కౌస్తుభుడు క్రిందపడి పంచత్వము నొందెను. తమ అమాత్యులు మరణించుటచే దైత్యసేన దిక్కులేనిది అయ్యెను. దేవసేన వారిని ఊచకోత కోయుట నారంభించెను. వారందరూ కకావికలై పలాయన మొనరించి, సింధు వద్దకేగి జరిగిన విశేషములు తెలిపిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మైత్ర, కౌస్తుభ సంహారమను నూట పన్నెండవ అధ్యాయము సమాప్తము)

నూట పదమూడవ అధ్యాయము

(దైత్య సేనా నాయకుల మరణము)

దైత్యులు సింధు వద్దకేగి "మహాప్రభూ! మైత్ర, కౌస్తుభులు అసంఖ్యాకమైన దేవసేనను సంహరించిరి. ఇంతలో శత్రుసేన నుండి ఇరువురు బలాఢ్యులేతెంచి, వారిద్దరినీ మర్దించి, హతమొనరించిరి. మేము ఇదివరలో అనేక దేవసేనలను చూచితిమి. కానీ ఇటువంటి వీరులను చూడలేదు. అంత సింధు "సర్వుల ప్రాణములు హరించు యముడు సహితము భయమొందు నా అమాత్యులు శత్రు వీరుల చేతిలో మరణించిరనిన నమ్మ నశక్యముగ యున్నది. ఇక నా పరాక్రమమును చూడవలసినది. నా ధనుష్పాండిత్యము చే శత్రువుల శిరములను నాట్యమాడించెదను. నేను చక్రపాణి పుత్రుడనగుటచే చక్రయుద్ధ మొనర్చెదను." ఈ విధముగ పలికి ఆ దుష్టుడు తిరిగి మయూరేశునితో సమరమున కేతెంచెను. ఆతని వెనుక అసంఖ్యాకమయిన మహాబలురు, దుర్జయులైన దైత్యులు కలరు. "నందీ, పుష్పదంతులు, భూతరాజు, వికటులు" ఒక్కొక్కరు ఒక లక్ష సైన్యముతో రక్కసుల నెదుర్కొనుట కేగిరి. "చపలుడు" అర్ధ లక్ష సైన్యముతో యుద్ధకామియై వెడలెను.

అసంఖ్యాక సేనా సహితులై కార్తికేయ, వీరభద్రులు ఏగిరి. ఈ విధముగ దేవసేన ఏడు వివిధ వ్యూహములతో వెలువడెను. ఆ వ్యూహరచన గాంచి దనుజులు సహితము ఏడు వ్యూహములుగ మారిరి. వారికి "గంధాసుర, మదనకాంత, వీరరాజ, ధ్వజ, మహాకాయ, శార్దూల, ధూర్తులు" నాయకులుగ నిలబడిరి. దైత్యసేన ఈ ఏడు వ్యూహములతో ముందుకు కదిలి బాణవర్షముతో దేవసేనను ముంచెత్తిరి. బంధిపాలములతో ప్రహరించి దేవసేనను భూశయనుల కావించిరి. బలోన్మత్తుడయిన గంధాసురుడు కార్తికేయునితో యుద్ధ మారంభించెను. వీరభద్రుడు మదనకాంతునితో, నంది వీరరాజుతో, పుష్పదంతుడు ధ్వజాసురునితో, భూతరాజు మహాకాయునితో, వికటుడు ధూర్తునితో, చపలుడు శార్దూలునితో ద్వంద్వ యుద్ధ మొనర్చిరి. చపలుడు శూర్దూలుని తీవ్రముగ ప్రహరించెను. ఆ ఘాతమునకు శార్దూలుడు భూమిపై బడి, కొంతసేపు మూర్ఛిల్లి, తిరిగి తెలివి తెచ్చుకొని వేరొక కరవాలము బూచి చపలునిపై ప్రహరించెను. చపలుడు మూర్ఛనొందెను. ఆ సమరమందు ఇరుపక్షములు ధనుర్బాణములు, ఖడ్గములు, అనేక శస్త్రములతో సంగర మొనరించుచుండిరి. నలువైపులా "కొట్టు, చంపు, నా ప్రహారముతో నీవు భూమిపై పడెదవు? నా ప్రహారముతో నీవు స్వర్గమున కేగుదువు" అనుచూ కోలాహలము కావింపబడు చుండెను. శస్త్రములు లుప్తమయిన పిదప వీరులు లాఠీలతో, ముష్ఠిలతో ప్రహారము లొనర్చుకొనుచుండిరి. కొందరు ప్రత్యర్థుల పాదములు పట్టి నేలపై పడవేయుచుండిరి. మరికొందరు ప్రత్యర్థుల పాదములు పట్టి నేలపై విసిరి నుగ్గునుగ్గు కావించుచుండిరి. శస్త్రములచే క్షతవిక్షితులైననూ, రుధిరము ధారలు కట్టి ప్రవహించుచున్ననూ, మరణ పర్యంతము యోధులు ప్రత్యర్థులతో సంగర మొనరించుచునే యుండిరి. రక్తము ప్రవాహములై నదిగా మారి ప్రవహించ మొదలిడెను. ఆ నది యందు వీరుల కేశములు నాచువలె, ఖడ్గములు మత్స్యముల వలె, డాళ్ళు తాబేళ్ళవలె, కవచములు మొసళ్ళవలె ఒప్పుచున్నవి. ఆ సంగరము వీరులకు మహదానందము, భీరువుకు మహాభయదాయకమై యున్నది. సూర్యాస్తమయమైననూ ఎవరికినీ ఎరుక లేక పోరాడుచునే యుండిరి. హింసాత్మక వన్య మృగములు, భూత, ప్రేత, పిశాచములు, పక్షులు, నక్కలు, తాబేళ్ళు, మరణించిన వీరుల కళేబరములు తిని, తృప్తినొంది మయూరేశునకు దీవెన లిచ్చుచున్నవి. ఈ విధముగ మూడు రోజులు దివారాత్రములు మహా సంగ్రామము జరిగినది.

గంధాసురుడు కార్తికేయునితో ద్వంద్వ యుద్ధ మొనర్చెనని తెలిపితిని కదా! గంధాసురుడు పరుగున వచ్చి కార్తికేయుని పై ముష్ఠిఘాత మొనర్చెను. ఆ ప్రహారమునకు కార్తికేయుడు మూర్ఛనొంది క్రిందపడెను. ఒక ముహూర్తానంతరము పైకిలేచి, కృద్ధుడై తన పన్నెండు చేతులతో ధనుర్బాణములు ధరించి గంధాసురునిపై బాణవర్షము కురిపించెను. గంధుడు వాటినన్నింటినీ చాకచక్యముగ నివారించెను. కొంతసేపు గడచిన పిమ్మట ఈ విధమగ సమరమొనరించుచూ, కార్తికేయుడు గంధాసురుని పాదములు చేజిక్కించుకొని, గిరగిరా త్రిప్పి విసురుగ నేలపై కొట్టెను. అంత గంధాసురుడు పంచత్వము నొందెను. అటు పిమ్మట ఆతని సేనలు కకావికలైనవి. కార్తికేయుడు వారిని నిందించుచూ బాణ పరంపర కురిపించెను. అంత "సేన, క్రోధన, శతఘ్న" అను ముగ్వురు దనుజులు మేఘగర్జన కావించుచూ కార్తికేయునిపై బడి "ఓరీ! దుష్టుడా! నీవు మా సేనను నాశనము కావించితివి. నిన్ను యమపురికి పంపించెదము" అని ఆయనపై బాణ వర్షము కురిపించిరి. కార్తికేయుడు తన ద్వాదశ హస్తములతో ఆరు ధనువులు చేపట్టి ఆ దనుజుల ఆక్రమణను తిప్పికొట్టెను. వారు మూర్ఛితులై క్రిందపడి, కొంత సమయమునకు తేరుకుని కార్తికుయుని మెడకు పాశము బిగించిరి. కార్తికేయుడు మూర్ఛితుడై నేలపైబడెను. ఈ విషయము తెలిసి బలశాలురయిన "హిరణ్యగర్భుడు, శ్యామలుడు, రక్తలోచనుడు" అచటికేతెంచి ఆ ముగ్వురు దనుజులతో యుద్ధమొనర్చిరి. కానీ ఆ ముగ్వురు దనుజుల ప్రతాపమునకు తాళజాలక ధరాక్రాంతులైరి. మదనకాంతుడు వీరభద్రునితో ఘోరయుద్ధమొనర్చెను. మదనకాంతుని ప్రహారములకు వీరభద్రుడు సొమ్మసిల్లెను. కొంత సమయమునకు వీరభద్రుడు తెలివి తెచ్చుకొని క్రోధముతో తిరిగి మదనకాంతునితో యుద్ధమొనర్చి, పిడికిలితో ప్రహారమొనర్చెను. ఆ ప్రహారముతో మదనకాంతుడు ధరాశయుడై యమపురికి అరిగెను.

ఆ ఘటనను కాంచి వీరరాజు కించిత్ దు:ఖితుడై, క్రోధము పూని వీరభద్రుని పైకి వచ్చెను. వానిని నంది అడ్డుకొని తన శృంగములతో ప్రహారమొనర్చెను. వీరరాజు రక్తము వమనము చేసికొనుచు వందలాది ముక్కలై భూశయనుడయ్యెను. అంత వీరరాజు మరణమునకు ప్రతీకారమొనర్చుటకై నందిని సంహరించుటకు శార్దూలుడు, మహాకాయుడు, ధూర్త, ధ్వజాసురులు ఏతెంచిరి. పురాతన యుద్ధములందు అనేక దేవతలను పరిమార్చిన ఆ దైత్యులు నందిపై అనేక సాయకములు ప్రయోగించిరి. నంది మూర్ఛనొందెను. అది కాంచిన పుష్పదంత, భూతరాజ, వికట, చపలు లేతెంచి, యుద్ధోన్మత్తులై ఒక్కొక్కరు ఒక్కొక్క పర్వత శిఖరమునెత్తి ఆ దనుజులపై ప్రయోగించిరి. దనుజులు శిరములు పగిలి చూర్ణమయిరి. ఇక ఏడుగురు సేనా నాయకులు మరణించుటచే, దనుజ సైన్యము దిక్కులేక వెనుకకు పరుగెత్తి, సింధు దైత్యుని సమీపించి తమ పరాజయమును, సురల విజయము గూర్చి తెలిపిరి. ఇంతలో దేవ సైన్యము "మయూరేశునకు జయము! మయూరేశునకు జయము!!" అని నినాదము లొనర్చిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దైత్య సేనా నాయకుల మరణమను నూట పదమూడవ అధ్యాయము సమాప్తము)

నూట పద్నాల్గవ అధ్యాయము

(సింధు దైత్యుని పరాజయము)

సింధు దైత్యుడు తన సేన పరాజితమయినదని తెలిసికొని, కొంత సమయము మ్రాన్పడి "ఇది ఎట్లు సాధ్యము? దేవతలందరినీ పరాజితుల కావించిన నా సేనా నాయకులు ఒక బాలుని వలన మరణించుట ఎట్లు సంభవము?" అని తర్కించి, చివరకు తాను సమరాంగణము ప్రవేశించుటకు నిశ్చయించి, సర్వాయుధపాణియై, ఒక అశ్వము నధిరోహించి, వింటికి వారి బిగించి దేవసేన పై విరుచుకు పడెను. ఆ హయ పద ఘట్టనకు పృధివి కంపించెను. సమరాంగణము ప్రవేశించుచునే సాయక వర్షము కురిపించి, అసంఖ్యాకమైన దేవసేనను హతమార్చెను. దేవసేన యందు సైనికులు కాళ్ళు, చేతులు, తొడలు, కంఠములు, చీలమండలు తెగి కొందరు క్షతగాత్రులైరి. అత్యధికులు మరణించిరి. ఇరు పక్షముల మధ్య పోరు తీవ్రమొయ్యెను. దేవసేన సింధుచే హింసింపబడినప్పటికీ వెనుకంజ వేయక ప్రత్యర్థుల నెదుర్కొనిరి. రణరంగమంతయు ధూళిరేగి ఎవరెవరో తెలియకుండిరి. అంత సింధు అశ్వము నుండి క్రిందికి దిగి, వీరభద్రుని పాదములు పట్టి లాగి క్రింద పడవైచెను. నంది యొక్క మస్తకముపై ప్రహరించి మూర్ఛితునొనర్చెను. భూతరాజు నడుముపై ఖడ్గ ప్రహార మొనర్చెను. పుష్పదంతుని వీపుపై ప్రహరించి క్రిందపడవైచెను. హిరణ్యగర్భుని పట్టి నేలపై విసిరెను. శ్యామలుని నుదిటిపై బాణ పరంపర కురిపించి మట్టికరిపించెను. చపలుని హనువును విరుగగొట్టెను. వికటుని సంహరించెను. లంబకర్ణుని కంఠము నుత్తరించెను. రక్తలోచనుని పాదములు పట్టి గిరగిరా త్రిప్పి విసరివైచెను. భృంగిని కరవాలముతో పొడిచి ఘాతమొనర్చెను. దావానలుని శిరము విదీర్ణము చేసెను. పంచాననుని వీపు పగులగొట్టి, చపలుని ధరాక్రాంతుని కావించెను. ఈ విధముగ యుద్ధారంభముననే ప్రత్యర్థి వీరులందరినీ పడగొట్టెను. దేవసేన యందలి మిగిలిన వీరులు పలాయన మొనర్చిరి. అంత త్రిలోకములు ప్రతిధ్వనించునటుల సింధు దైత్యుడు గర్జన మొనర్చెను.

ఆతని భయంకర రూపము గాంచి విరూపాక్షుడు మొదలగు రుద్రగణములు పలాయన మొనర్చిరి. సింధు మయూరేశుని గాంచి "ఓ! శివపుత్రా! నీ గూర్చి, నీ పరాక్రమము గూర్చి వింటిని. కానీ ప్రత్యక్షముగ నీవు నక్క వంటి దుర్బలుడవు. నా అరచేతి దెబ్బచే శిలలు చూర్ణమగును. నీవు దానిని ఎట్లు సహింపగలవు? నీవు మాతృ స్థనపానమొనర్చి

గృహాంగణమందు నృత్యమాచరింప వలసినది. ఇంద్రాదులను జయించిన నాకు నీవొక లెక్కా? నేను నిన్ను వధించుట కేతెంచితిని. కానీ అతి కోమలమయిన నీ అంగములపై బాణపరంపర వైచుటకు మనసు ఒప్పుకున్నది" అని పలికెను. అంత మయూరేశుడు "ఓరీ! అసురాధమా! నీవు మూఢుడవై ప్రగల్భములు పలుకుచున్నావు. నేను నా శరీరమును చిన్నదిగా తలచిన ఎడల అవతార మేల స్వీకరింతును? నేను నిన్ను తృటిలో సంహరించెదను. నీవు సూర్యదత్త వర గర్వితుడవై, దుష్కర్మ నిరతుడవైతివి. నీ పుణ్య కాలము గడచి మరణ సమయమాసన్న మయినది. నీవు ప్రగల్భములందు చతురుడవు. అవన్నియు ఆపి సంగర మొనర్పుము" అని బదులిచ్చెను. అంత సింధు ధనుష్టంకారమొనర్చి, తీవ్ర సాయకములతో మయూరేశుని ముంచెత్తెను. అంత మయూరేశుడు వజ్రకఠినమైన తన పరశువును ప్రయోగించెను. అత్యంత దృఢమై, శత్రువుల దర్పమును పూర్ణముగ నష్ట మొనర్చు ఆ పరశువు ప్రళయకాల జ్వాల వలె సర్వ దిక్కులను ప్రజ్వలింపజేయుచూ వచ్చి, ఆ సాయకములన్నింటినీ కూల్చి, సింధు చేతియందున్న దనుస్సును వందలాది ముక్కలుగ ఖండించెను. అంత సింధు క్రోధితుడై తన శత్రువుపై చక్రాయుధమును ప్రయోగించెను. అంత ఆ చక్రము దిశలను నినదించుచూ మయూరేశుని పైకి వచ్చెను. మయూరేశుడు ఉగ్రమయిన శూలమును విసిరెను. ఆ శూలము చక్రమును ఖండించి, దైత్యుని ముకుటమును క్రిందకు కూల్చి, కుండలాలంకృతములైన రెండు కర్ణములను ఖండించి, తిరిగి మయూరేశుని చేరెను. అంత సింధు చేత కరవాలము ధరించి మయూరేశుని వద్ద కేతెంచెను. ఆ సమయమున మయూరేశుడు తన స్వరూపమును నలుప్రక్కలా చూపెను. దైత్యుడు విస్మితుడై దశదిశలయందు మయూరేశుని కాంచి కన్నులు మూసికొనెను. తన అంతరమున సహితము ఆయనే కనిపించెను. అంత దనుజుడు లజ్జితుడై వెనుకకు తిరిగెను. అచటనూ మయూరేశుడు కనబడెను. అంత దైత్యుడు తన అంతర్ దృష్టిచే తన హృదయమందునూ మయూరేశుని గాంచి చేయునది లేక యుద్ధము విరమించి తన నగరమున కేగెను. మరణించగా మిగిలిన యోధులు ఆతని చుట్టూ చేరిరి. దైత్యసేన నిరాశతో గృహముల కేగిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు దైత్యుని పరాజయము అను నూట పద్నాల్గవ అధ్యాయము సమాప్తము)

నూట పదిహేనవ అధ్యాయము

(మయూరేశుని ద్వారా దేవతలు సహజస్థితి నొందుట)

మయూరేశుడు విజయము ప్రాప్తించిన మీదట మునులు, పార్వతీ పరమేశ్వరులు, ఆచటికి ఏతెంచిరి. పార్వతి అత్యంత ఆనందముతో వినాయకుని కౌగలించుకొని ఇట్లనియె "పుత్రా! ఆ క్రూర దైత్యునితో సంగ్రామమందు నీవు డస్సిపోతివి. ఆ దైత్యుని క్రూర నాచారములను నీ కోమలమైన అంగములు ఎట్లు సహించినవి? ఆ మాయావి అయిన దనుజుడు యముని కంటె భయంకరము తోపుచున్నాడు. అటువంటి దనుజుని నీవు ఎట్లు ఎదుర్కొంటివి?" అని రోదింపసాగెను. అంత శివుడు, మునులు ఆమెకు ఇట్లు తెలిపిరి "నీవు మయూరేశుని తెలియవు. ఈతడు బాలుని వలె కనిపించుచున్ననూ, సర్వకారణకారుడు, ఆదిమధ్యాంత రహితుడు, వేదాంతమునకు సహితము అగోచరుడు. దైత్య సంహారకుడగు ఈ మయూరేశుని ముప్పది మూడు కోట్ల మంది దేవతలు స్తుతించెదరు. ఈ పరమాత్ముడు పృథివీ భార హరణమునకై అనేక అవతారములు స్వీకరించుచుండును. ఈయనే సృష్టి స్థిత్యంతములకు, ప్రళయమునకు కారకుడు. ఈయన రోమ కూపములతో అనేక బ్రహ్మాండములు యున్నవి. ఈయన యోగ, తపో, జ్ఞాన సంపన్నుడు. ఈ మహానుభావుడు

మాయను విచ్ఛేదమొనర్చును; అంతేకాక మాయావులను మోహ పరచును. ఈతడు శైశవావస్థయందే అనేకమంది దైత్యులను సంహరించెను". మయూరేశుని ఈ స్తుతిని విని పార్వతి సంతసిల్లెను. మయూరేశుడు "నాకు వజ్రహస్తుడయిన ఇంద్రుడనిన భయము లేదు. ఇక మిగిలిన వారి గూర్చి చెప్పనేల? కానీ మాతా! నాకు సర్వులకు ప్రణామములొనర్చుటచే, మునుల ఆశీర్వాదముచే, శివుని వరదానముచే సింధు దైత్యునిపై విజయము లభించినది. ఈ దైత్యుడు స్కంధాదులను సహితము ఓడించెను. దైత్యసేన అనేకమంది దేవతా వీరులను సహితము సంహరించినది. వీరులు హర్షితులగు రక్తపుటేరులు పారినవి. ఓ! మునులారా! మనమిపుడు యుద్ధరంగమందు పడియున్న దేవతలందరినీ వెదుకుదుము" అని ముందుకు కదలెను.

అంత వశిష్ఠాది ముని పుంగవులు "అట్లే" అని ఆయన వెనుక నడిచిరి. రణరంగమంతయు పీనుగుల పెంటయై, రక్త, మాంస, అస్థి, మేధామయమై, అత్యంత దుర్గంధ భూయిష్ఠమై యుండెను. ఛిన్నాభిన్నమయిన అంగములు, భీషణమైన శరీరములు, రక్తము స్రవించి శింశుపా వృక్షముల వలె యున్న భీభత్స దృశ్యము గాంచి దేవతల మనస్సు వికలమయినది. అచట ఒక వీరునిపై అనేకమంది వీరులు పడియుండిరి. కొందరు జీవించి యుండి, మరికొందరు మూర్ఛితులైరి. కొందరు అంగ విహీనులైరి. అచట గల వీరులతో ఎవరు దేవతలో, ఎవరు దైత్యులో తెలియకుండిరి. కొందరు ప్రాణములను మయూరేశ దర్శనమునకై యుంచుకొని, ఆయన దర్శనమయిన పిదప "స్వామీ! మేము మీ నిమిత్తమే మృత్యువును ప్రాప్తించితిమి. అదృష్టవశాత్తు మాకు అంత్య కాలమున మీ దర్శనమయినది" అని పలికి అసువులు బాసిరి. అద్దానిని గాంచి మయూరేశుడు అశ్రునయనుడై, గొంతు గాద్గదిక మైనది. కొంచెము ముందునకేగి మయూరేశుడు మూర్ఛితుడైయున్న కార్తికేయుని కాంచెను. అంత మయూరేశుడు కన్నుల అశ్రువులు ధారాపాతముగ కార్చుచూ "సోదరా! లెమ్ము! లెమ్ము! నీకు కళ్యాణమగుగాక! నీవునూ ప్రాకృత జనుల వలె భూశయనుడవైతివి?" ఈ విధముగ పలికి ఆయన శరీరమును నిమిరెను. అంత కార్తికేయుడు స్మృతినొంది, మయూరేశుని కాంచి ఆనందితుడై "నీ దర్శన భాగ్యముచే నా దు:ఖములన్నియు మటుమాయ మయినవి" అని పలికి తన పన్నెండు చేతులతో మయూరేశుని ఆలింగన మొనర్చెను. అంత వారిరువురు ఒకరి కరము మరొకరు పట్టుకొని యుద్ధ భూమి యందు ముందునకేగిరి. అంత వారు బాణ ప్రహారములచే డస్సిన వీరభద్రుని, బాణ ఘాతములచే మూర్ఛిల్లిన నందినీ, మస్తకము విదీర్ణమయిన భూతరాజునూ, అనేక ప్రహారములతో నలిగిన వికటుని, అత్యంత బాధతో వ్యాకులుడై యున్న పుష్పదంతుని, లలాటము చిట్లిన హిరణ్యగర్భునీ, గుర్తుపట్టని రీతిలో మృతప్రాయుడయిన లంబకర్ణుని, ఉదానవాయు ప్రకోపముతో శరీరము ఉబ్బిన సుముఖుని, దయనీయమయిన అవస్థయందున్న రక్తలోచనుని, మూర్ఛితుడై మృత్యుముఖమునున్న భృంగినీ, భయభీతుడయిన శంఖునీ, ప్రేతత్వము నొందిన మిగిలిన వారందరినీ, ఈ విధముగ మృతప్రాయులై యున్న సర్వ దేవతా యోధులను కాంచి మయూరేశుడు చింతాక్రాంతుడై కార్తికేయునితో ఇట్లనియె.

"మరణించిన స్వపక్ష, ప్రతిపక్ష యోధులందరూ నా ధామమున కేగిరి. ఇపుడు క్షతగాత్రులయిన మన యోధులందరినీ ఏమి చేయవలెను?" అంత కార్తికేయుడు "ఓ! గుణేశ్వరా! నీవు స్వయముగ అనంత కోటి బ్రహ్మాండ నాయకుడవు. పదునాల్గు విద్యలు, మరియు సకలకళల యందు నిధానుడవు. నీవీ ప్రశ్న నన్నేల అడుగుచుంటివి? నేను కానీ, ఈ దేవతలు కానీ ఏ మంత్రము ఎరుగము. నీవు సర్వ మంత్ర జ్ఞాతవు. నీవు నానా దైత్య సంహారము కావించి, నీ కీర్తి విస్తరణ కావించుచుంటివి. నీ ఆజ్ఞానుసారము, నా బుధ్యానుసారము నీకు తెలిపెదను. పూర్వకాలమందు త్రిపురాసుర సంహార సమయమున అనేకమంది దేవతలు క్షతవిక్షితులైరి. అంత శివుడు ద్రోణ పర్వతమందు లభ్యమగు లతల రసముచే దేవతలందరినీ తిరిగి బ్రతికించెను." అంత మయూరేశుడు "కార్తికేయా! ఇంకా కోట్లాది దనుజులు యుద్ధరంగమునకు ఏతెంచెదరు. వారితో ఎవరు సమరమొనర్చెదరు? ద్రోణ పర్వత మందలి లతలను ఇప్పటికిప్పుడు

ఎవరు తీసికొని రాగలరు?" అని పలికి తన మాయను ఆవిష్కరించెను. అంత ఆయన శరీరాంగములకు తగిలిన గాలి దేవతలందరికీ తగిలి మరణించిన దేవతా ప్రముఖులు, దేవతలు, దేవసైన్యము, సర్వులూ నిద్రనుండి లేచినటుల బ్రతికి నిలబడిరి. వారందరూ హర్షోత్పుల సంపన్నులై మయూరేశునకు నమస్కృతులు సమర్పించి, ఆలింగనమొనర్చి, "మేము దైత్యులతో యుద్ధ మొనర్చుటకు సిద్ధముగ యుంటిమి. మీ దృష్టి పాతముచే మా తేజో బలములు ద్విగుణీకృతములయినవి." అంత మయూరేశుడు వారిని అభినందించి పార్వతీ పరమేశ్వరుల వద్దకేగి, వారికి నమస్కరించి, యుద్ధమున కేగుటకు అనుజ్ఞనొందెను. ఆది దంపతి మయూరేశ, కార్తికేయులను గాఢాలింగన మొనర్చిరి. దేవసేన అంతయు శివ, పార్వతులతో "మేమందరమూ యుద్ధమున క్షతగాత్రులమై పృధివిపై పడితిమి. కానీ మయూరేశుని అంగసంసర్గ వాయువు మమ్ము పునర్జీవితులను కావించినది" అని పేర్కొనిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశుని ద్వారా దేవతలు సహజస్థితి నొందుట అను నూట పదిహేనవ అధ్యాయము సమాప్తము)

నూట పదహారవ అధ్యాయము

(దుర్గా సింధు సంవాదము)

బ్రహ్మ "పర్యంకముపై సింధు దైత్యుడు అత్యంత చింతాగ్రస్తుడై, మ్లానముఖుడై, క్రోధితుడై, ఏదియునూ పాలుపోక సంతప్త హృదయుడై, దేనినీ నిర్ణయింపజాలని డోలాయమాన మనస్కుడై యుండెను. ఆ సమయమున ఆతని ధర్మపత్ని అయిన "దుర్గ" చింతా సర్పదష్టుడయిన సింధు యొక్క స్థితిని గూర్చి విని ఆతని వద్ద కేతెంచెను. అంత సింధు దైత్యుని సేవకులందరూ బయటకు వెడలిరి. అంత దుర్గ "స్వామీ! మీరేల చింతాగ్రస్తులై యున్నారు? ఈ లోకము సర్వము దైవాధీనము. జరుగనున్నది జరుగక మానదు. ఇచట మనమెవరము స్వతంత్రులము కాము. మీ ఉద్వేగము సమస్త రాక్షస పరివారమునకు, నాకు సహితము బాధను కలుగజేయుచున్నది. మీ చింతకు కారణము తెలిపిన ఎడల దాని నివారణోపాయమును నేను తెల్పెదను" అని మృదు మధురముగ పలికెను. అంత సింధు సావధాన చిత్తుడై ఇట్లనియె "ఓ! ప్రియా! నీవు అత్యంత శ్లాఘనీయురాలివి. నా మనసుకు అత్యంత ఖేదము కలిగించిన ఉదంతమును తెలిపెదను. నేను సంగరమునకేగి ప్రత్యర్థుల ఏడుకోట్ల సేనను నాశనమొనర్చి, దేవ ప్రముఖుల నెందరినో ధరాశయుల కావించితిని. మయూరేశునితో ద్వంద్వ యుద్ధ సమయమున ఆతడు త్రిశూలము ప్రయోగించి నా చెవులు రెంటినీ ఖండించెను. నేను వస్త్రముచే నా ముఖము కప్పుకొని గృహమున కేతెంచితిని. ఇపుడు నా శత్రు వధోపాయమును తెలుపుము."

అంత దుర్గ "స్వామీ! మీరు వీరధర్మమును నిర్వర్తించిరి. శత్రుసైనికుల నిర్జించిరి. కానీ గో, బ్రాహ్మణ, దేవ ద్వేషము, దూషణము యశస్సు నీయదు, సరికదా కళ్యాణము నొసగదు. గో బ్రాహ్మణుల సేవనము, వందనము, ధ్యానము, స్మరణము, పూజనము, చేతనే ఇంద్రాది దేవతలు స్థిరస్థాన ప్రాప్తి నొందిరి. ఎవరు సర్వజీవ సమానత్వము కలిగి, శుభాశుభ ఫలితము నీయగల దక్షత కలిగెదరో, వారి సేవ కామధేను సేవ వంటి అభీష్ఠ సిద్ధినిచ్చును. ఏ విధమయిన బీజములు నాటెదమో అట్టి అంకురమలే ఉద్భవించును. శుభకర్మచే సుఖము, అశుభ కర్మచే దు:ఖము ప్రాప్తింపక తప్పదు. అందువలననే సత్పురుషులు ఎల్లప్పుడూ శుభకర్మములాచరించుచూ, మనసా, వాచా, కర్మణా, సర్వజీవ హితమునే కోరెదరు. మీరు మీ పరాక్రమముచే దేవతలను, ఋషులను చెరసాల యందు పెట్టిరి. పురుషార్థము (పరాక్రమము) ఎల్లప్పుడూ ధర్మార్థ కామమోక్ష సాధకమై యుండవలెను. ఎవరి మనసునందు ధనలోభముండదో, ఎవరి

మనసు పరస్త్రీయందు అనురక్తమవ్వదో, ఎవరు శరణాగతరక్షణ యందు ధృఢ సంకల్పులగుదురో, ఎవరు ధర్మ పరాయణులో, వారి సత్కర్మమే పురుషార్ధమగును. సర్వజీవ సమత్వమే పురుషార్ధము. స్వామీ! మీకు హితకరమయిన వాక్యములు తెలిపెదను. దయచేసి వినవలసినది. దుర్వచనములుమాని, ఆత్మస్తుతి వర్జించి, పరోపకార నిరతులై, పరనింద చేయక యుండవలసినది. మీకు నా ప్రసన్నత ఇష్టమయిన ఎడల నేను తెలిపెడి కార్యము సత్వరము ఆచరింపవలసినది. వెంతనే ఇంద్రాది దేవతలందరినీ బంధన విముక్తుల కావింప వలసినది. తక్షణము సర్వలోకేశ్వరుడయిన మయూరేశుడు వెనుదిరుగును. తద్వారా మనకు, ఇతరులకు సహితము సుఖము లభించును. లేని ఎడల దు:ఖమే శరణ్యము."

ఆ అమృతతుల్య వచనములు రోగికి పథ్యము వలె సింధు దైత్యునకు విషతుల్యముగ తోచెను. అతడు క్రోధోద్రిక్తుడై "ఓ! భద్రస్త్రీ! నీవు లోకము నిందించు పలుకులు రమణీయముగ పలికితివి. కార్యాకార్యములు జ్ఞాతనైన నేను నీ చాతుర్యమును తెలిసికొంటిని. స్వాభిమాని అయిన ఏ వ్యక్తి తన శత్రువు యొక్క శరణుకోరడు. అన్యాయ కృత్యము ఒనరింపరాదు. కానీ ఆ కార్యము మొదలుపెట్టిన ఎడల దానిని సంపూర్ణ మొనర్పవలెను. ఆ కృత్యము సుఖదు:ఖములు, యశాపశయములు, లాభనష్టములు, జీవన్ మృత్యువులు దేనిని తెచ్చిననూ సరే! ఆ కృత్యము సంపూర్ణ మొనరింపవలెను. సాధ్వీ! మయూరేశుడు నాపై సామమును ప్రయోగించినపుడు నేను సంధి కావింపలేదు. ఇపుడు వెనుదిరుగుట అసాధ్యము. కానున్నది కాకమానదు. విధాత వ్రాతను మీరుట దుర్లభము. యుద్ధమందు మృత్యువు లభించిన వీరస్వర్గమునకు ఏగెదను. తద్వారా యశము విస్తారమగును. కానీ శత్రువును శరణుజొచ్చినచో అపకీర్తి పాలై నా పూర్వజుల సహితముగ నేను నరకమందు పడెదను. రావణుని కోసము రాముడవతరించినట్లుగా దేవదేవుడయిన శ్రీగణేశుడు నా మరణము కోసమై మయూరేశునిగ అవతరించెను. నేను సహితము ఆతని శిరమును ఖండించెదను. శూరులు ప్రాణములు త్యజించెదరు. స్వాభిమానమును ఎన్నడునూ త్యజింపరు. ఓ! మృగనయనా! నేను యమునికి సహితము భయపడను. ఇక ఇతరుల విషయము చెప్పనేల? "ఈ విధముగ పలికి, తన తెగిన చెవులు కప్పునటుల తలపాగ ధరించి, శోభాయమానముగ రాజోచిత వస్త్ర భూషణములు ధరించి రాజసభకేగి సింహాసనమందు ఆశీనుడయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దుర్గా సింధు సంవాదమను నూట పదహారవ అధ్యాయము సమాప్తము)

నూట పదిహేడవ అధ్యాయము

(కల వికల మరణము)

బ్రహ్మ "సింధు దైత్యుడు సింహాసనమందు కూర్చొని "త్రిలోకములను స్వాధీన పరచకొనగల సమర్థులు నా అమాత్యులిరువురు గతించిరి. వారి వంటి పరాక్రమశాలురు, బుద్ధిమంతులు కద్దు" అని చింతించుచుండగా దైత్యవీరులు సింధుతో "ఓ! మహాభాగా! మీరు చింతింపవలదు. మీరు పుష్ప పర్యంకముపై విశ్రాంతి నొందవలసినది. మేము సమరమొనర్చి విజయశ్రీని మీ వద్దకు తెచ్చెదము. మీరు యముని సహితము భయపెట్టగల సమర్థులు. మీరు ఇటువంటి పలుకులు పలుకవలదు." అంత సింధు దైత్యుని బావ మరుదులు "కల, వికల" అను వారలు లేచి "రాజా! మాకు అనుజ్ఞ నీయవలసినది" అని పలికి రాజాజ్ఞను గొని, వివిధాయుధధారులై సమరాంగణమున కరిగిరి. వారి వెనుక సర్వాభరణ భూషితులై చతురంగ బలములు కదిలినవి. వారు ముందునకేగి మయూరేశుని, కార్తికేయుని, ఇతర వీరులను కాంచిరి. దేవసేన ఈ దైత్యులు గూర్చి తెలిసికొనుటకై గూఢచారులను పంపిరి. వారు వెనుకకు వచ్చి ఆ దైత్యవీరులు

కలవికలురనీ, బహు సంగ్రామముల యందు అనుభవజ్ఞులనీ, సమస్త శస్త్రాస్త్ర ప్రవీణులనీ తెలిపిరి. అంత వారిరువురినీ ఎదుర్కొనుట నందీ, పుష్పదంతులు తమ సేనలతో కదిలిరి. ఇరు పక్షముల మధ్య తుమల యుద్ధ మారంభమయినది. నంది, పుష్పదంతులు అరువది బాణములతో కలవికలురను కప్పిరి. దైత్య ప్రముఖులు ఆ సాయకములను మధ్యలో ఖండించి తిరిగి దేవసేనను సాయకములతో ముంచెత్తిరి. నంది కొంత సమయానంతరము కలుని ఖడ్గమును ఖండించెను. పుష్పదంతుడు వికలుని ఖడ్గమును ముక్కలు చేసెను. అంత వారు మల్లయుద్ధము ఆరంభించిరి. వారి వారి సేనలు సహితము ఖడ్గములు, తోమరములు, బల్లెములు, తో పరస్పరము సంగరమొనర్చిరి. దేవసేన యొక్క పరాక్రమమునకు దైత్యసేన పలాయన మొనర్చినది. కొంతమంది దేవతలు వారి వెనుక ఏగి, వారిని తరిమి సంహరించిరి. ఆ సమయమున మృతవీరుల రుధిరము ఏరులై ప్రవహించెను.

అదిగని దనుజ వీరులిరువురు చెలరేగి దేవసేనపై సాయక వర్షము కురిపించిరి. తత్కారణమున దేవసేన యందలి అసంఖ్యాక సైన్యము అసులువు బాసినది. అంత నంది దైత్యసేన యందు చొరబడి తన వాడి అయిన కొమ్ములతో పొడుచుచూ, పుచ్ఛముతో ప్రహరించుచూ వేలాది దైత్యులను సంహరించెను. దైత్యాధిపతులను చూర్ణ మొనరించెను. దైత్యసేన అంతయు హాహాకారము లొనర్చినది. అంత కలవికలురు ఇరువురు ఒకచోట చేరి నందిని నిందించుచూ "ఓరీ! గడ్డి తిను జంతువులందు నీవు శక్తిమంతుడవు గావచ్చు. కానీ మాతో నీకు సాపత్యమేల? నీవు మా దృష్టిలో తృణ సమానుడవు" అని పలికి వారు ఇరువురు కలిసి నంది శృంగములు పట్టి బంధించిరి. దానిని చూచి పుష్పదంతుడు అచటికేగి వారిని నివారించుటకు యత్నించెను. కానీ దైత్య సోదరులు దండముతో ప్రహరించి పుష్పదంతుని మూర్ఛితు నొనరించిరి. అంత కార్తికేయ, వీరభద్రులేతెంచి, చెరియొక పర్వతమును పెకలించి దనుజ సోదరులపై ప్రహరించిరి. కార్తికేయుని ప్రహారముచే కలుడు, వీరభద్రుని ప్రహారముచే వికలుడు తక్షణము మరణించిరి. దేవసేన విజయ దుందుభులు మ్రోగించుచూ తన శిబిరమున కేగెను. దైత్యులు సింధుని వద్దకేగి నానా సేన సహిత కల, వికలురు హతమార్చబడిరని తెలిపిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కల వికల మరణమను నూట పదిహేడవ అధ్యాయము సమాప్తము)

నూట పద్ధెనిమిదవ అధ్యాయము

(ధర్మాధర్ముల మరణము)

ఈ విధముగ పర్వత ప్రహారములచే కలవికలురు మరణించిరని వినిన సింధు దైత్యుడు కొంత తడవు మూర్ఛనొంది, నెమ్మదిగ లేచి శివ పుత్రుడయిన మయూరేశుడు ఏ విధముగ ఈ భయంకర బలశాలురైన దనుజుల హతమార్చుచుండెనని ఆశ్చర్యము నొంది, చింతాగ్రస్తుడై చింతించుచుండెను. ఆ సమయమున ఆతని పుత్రులు "ధర్మాధర్ములు" అనెడివారు ఆచటికేతెంచి "తండ్రీ! మీరు ఆ చిన్న బాలకుని చూచి ఏల భయమునొందుచున్నారు? మా మామ లిరువురు యుద్ధక్షేత్రమందు వీరోచితముగ పోరాడి, అసంఖ్యాకమైన శత్రువుల దునుమాడి, వీరస్వర్గమలంకరించిరి. మేము సహితము యుద్ధభూమికేగి, మా పరాక్రమము ప్రదర్శించి, ప్రత్యర్థులనోడించి, శత్రువుల మస్తకములను మీకు కానుకగా తీసికొని వచ్చెదము. ఇంద్రాది దేవతలు మన కారాగారముననే యుండిరి. మేము మా పలుకులను నెరవేర్చుకొనని ఎడల మా ముఖములు ఎవరికీ చూపింపనోపము" అని పలికిరి. వారి పలుకులకు అత్యంత ఆనందితుడై సింధు వారిని ఆశీర్వదించి పంపెను.

వారిరువురు తమ తండ్రికి నమస్కరించి, సర్వాయుధములు ధరించి, దివ్య ముకుటము, దీప్తులు విరజిల్లు కుండలాలంకృతాంగులై గళమున ముత్యములు, స్వర్ణఖచిత రత్నమాలలు ధరించి ముందున కేగిరి. వారి వెనుక చతురంగ బలములు కదిలినవి.

మయూరేశుడు వారిరువురినీ కాంచి వారికి ప్రత్యర్థులుగ కార్తికేయుని, వీరభద్రుని, క్రోధితుడయిన హిరణ్యగర్భుని, విశాల దృష్టి గల భూతరాజును సేనా సహితులై పంపెను. ఇరు సేనలకు మధ్య తిరిగి సంగ్రామము ప్రారంభమయ్యెను. తొలుత దైత్యసేన విజృంభించి దేవసేనను మిక్కిలిగ హతమార్చిరి. దేవ సైనికుల కాళ్ళు, చేతులు, కంఠములు, తొడలు చీలమండలు, ఖండింపబడి రక్తము ఏరులై పారుట మొదలిడెను. దానితో దేవసేన పరాజితమై పలాయన మొనర్చుట మొదలిడిరి. అంత కార్తికేయుడు ముందుకొచ్చి, గర్జన కావించి, వారిని తిరిగి ప్రోదిచేసి, తాను స్వయముగ పన్నెండు హస్తములందు ఆయుధములు ధరించి, దైత్యసేనను ఊచకోత కోసి తన వారికి ఆనందము కల్పించి, దైత్యులకు భయావహుడయ్యెను. ఆ సమయమున మరణించిన సైనికులు కొందరు స్వర్గమునకు, కొందరు కార్తికేయు రూపులైరి. మరణించు సమయమున మయూరేశుని తలచిన సైనికులు పరమ పదమునకేగిరి. కార్తికేయుని ధాటికి తమ సేన అంతయు అగ్నికి ఆహుతి అగు శలభములవలె సంహరింపబడుట కాంచిన ధర్మాధర్ములు ఇరువురు కార్తికేయుని ఎదుర్కొనిరి. వారిరువురు కార్తికేయునిపై శరవర్షము కురిపించిరి. కార్తికేయుడు తన ద్వాదశ హస్తములందు ఆరుధనువులు ధరించి వారికి ప్రతి సమాధానమిచ్చెను. అంత దైత్యుల వద్ద సాయకములు కొరవడి మల్లయుద్ధమునకు దిగిరి. అంత కార్తికేయుడు తన హస్తములతో దైత్య పుత్రులిరువురి శిఖలను పట్టి గిరగిరా ఆకాశమందు త్రిప్పి విసురుగ నేలపై విసరెను. వారిరువురి శరీరములు వంద ముక్కలై ఇరువురు పంచత్వము నొందిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి ధర్మాధర్ముల మరణమను నూట పద్ధెనిమిదవ అధ్యాయము సమాప్తము)

నూట పంతొమ్మిదవ అధ్యాయము

(సింధు దుర్గల శోకము)

మరణించగా మిగిలిన దైత్య సైనికులు శరీరము నందు రక్త స్రావము జరుగుచుండగా అత్యంత కష్టములు సహించుచూ రాజసభకేగి ఇట్లనిరి “ఓ! ధనుర్ధరా! ఈ అత్యంత దు:ఖభరితమైన వాక్యములు వినవలసినది. నీ పుత్రులు ధర్మాధర్ములు చిచ్చుర పిడుగులు వలె చెలరేగి, గొప్ప సమరమాచరించి దేవసేనను మట్టి కరిపించిరి. అంత ఆరు ముఖములు గల ఒక యోధుడేతెంచి వారితో సమర మొనర్చెను. తొలుత నీ పుత్రులు వానిని మూర్ఛితుని కావించిరి. కానీ ఆ యోధుడు తిరిగి తెలివి తెచ్చుకొని నీ ఇరువురి పుత్రుల శిఖలను పట్టి, గిరగిరాత్రిప్పి, నేలపై విసరి వందలాది ముక్కలు కావించి హతమార్చెను.” ఆ పలుకులు విని దైత్యరాజు శోక సంద్రమున మునిగి వజ్రఘాతములచే కూలిన పర్వతము వలె క్రిందపడి మూర్ఛనొందెను. ఆతడు తెలివి తెచ్చుకొని విలపించుచూ “నా పుత్రులు ఇంద్రుని, లోకపాలురనూ జయించిరి. వారు కార్తికేయునిచే ఎట్లు నిర్జింపబడిరి? మృత్యులోకమును వదలి స్వర్గమున కెట్లు ఏగిరి? వారిరువురు యముని సహితము పరాజితుని కావించు శౌర్యశాలురు కదా! శత్రువు యొక్క శిరము తీసికొని వచ్చెదమనీ, లేని ఎడల నాకు వారి ముఖము చూపింపమని శపథము చేసి మరీ యుద్ధరంగమున కేగిరి. వారి పలుకులు నిజమయ్యెను కదా!” అని పలికెను.

ఇంతలో అంత:పుర స్త్రీలు ఈ దుర్వార్తను రాణి దుర్గకు తెలిపిరి. “ఓ! సౌందర్యఖనీ! నీ పుత్రులు ధర్మాధర్ములు అసువులు బాసిరి. నీ భర్త అత్యంత శోకాకులుడై రోదించుచుండెను.” అదివిని సుడిగాలి యందు పడిన కదలీతరువు వలె కూలి మూర్ఛనొందెను. తన చెలుల పలుకులతో హృదయము విదీర్ణమై, క్షతగాత్ర అయ్యెను. కొంత సేపటికి లేచి, గుండెలు బాదుకొనుచూ విలపించుట మొదలిడెను. ఆమె వస్త్ర భూషణములన్నియు అస్తవ్యస్తములయ్యెను. శోకాగ్నిచే కాంతి తగ్గెను. ఆమె తాను రాణిననీ, స్త్రీననీ వివక్షత మరచి, ఎవరు ఏమి చెప్పిననూ ఖాతరుచేయక, రాజసభ ప్రవేశించి, కన్నుల అశ్రు జలపాతములు కారుచుండగా సభాసదుల నుద్దేశించి “మీ వంటి వీరులందరూ జీవించి యుండగా నా అనుమతి లేక నా పుత్రులిరువురు సంగరమునకు ఎట్లేగిరి? నేను ఆశీర్వాదము నొసగిన ఎడల వారికి మృత్యువు ప్రాప్తించి యుండెడిది కాదు. నా వచనమును అసత్యము కావించుట విధాతకయినను అశక్యము. నేనిక వారిని ఎప్పుడు ఎట్లు చూచెదను? వారిరువురు కాంతి యందు కామదేవుని, బుద్ధి యందు సరస్వతినీ గెలిచన మహాత్ములు. నన్ను విడచి ఎట్లు వెడలిపోయిరి? ఈ శోకాగ్నిచే దగ్ధమయి నేడు నేను మరణించెదను” అని పలుకుచూ, రోదించుచూ తన చేతులతో శిరమును, గుండెలను ప్రహార మొనర్చుకొనుచూ క్రిందపడెను.

అంత నాగరికులు, అంత:పుర స్త్రీలు, సభాసదులు ఇట్లనిరి “మాతా! శోకపడినంత మాత్రమున మరణించిన వారు తిరిగి రారు. ఈ మృత్యులోకమందు చిరకాలము నివసించు వారెవరు లేరు. సప్త చిరంజీవులయిన హనుమంతుడు, కృపాచార్యుడు, బలి, వ్యాస, పరశురామ, విభీషణ, అశ్వత్థామలు తప్ప వేరవరయిననూ ఈ భూతలము వీడవలసినదే? బ్రహ్మాది దేవతలకు సహితము మృత్యువు తప్పదు. ఇక అన్య జీవుల మాటేల? తనకు, తన స్వజనులకు మృత్యువు లేనపుడే మరణించిన వారి ఎడల రోదింపవలెను. ఋణము తీరిన పిదప స్త్రీలు, పురుష, పశు, పక్షి, జీవులందరూ ఈ లోకమును వీడెదరు. శోకించుట వృధా! ప్రవాహమందు రెండు కర్రపుల్లలు కొంతసేపు కలిసి ప్రయాణించి తిరిగి విడివడి తమ ప్రయాణము తాము కావించును. అట్లే జీవుడు సహితము ఇతర జీవుల సంయోగ వియోగములందు వివశుడగును. రాత్రి అయిన పిదప అనేక పక్షిగణములు ఒక చెట్టుచేరి విశ్రాంతి నొంది, తెల్లవారగనే తిరిగి ఎవరి దారిన వారు ఎగిరి వెళ్ళిపోయెదరు. జీవాత్మ యొక్క సంయోగ వియోగములు కూడా అట్లే!! దయచేసి మీరు విలపింపవలదు.” తదుపరి అంత:పుర స్త్రీలు, అంతరంగికులు, రాణి దుర్గను బలవంతముగ అంత:పురము లోనికి గొనిపోయిరి. ఆమె నిష్ప్రాణిగా మంచముపై పడినది.

ఇక రాజసభ యందు సింధు, తదితర వీరులు మూర్ఖముగ శోకమును వదలి తమ ఆసనములందు కూర్చొని మంత్రాంగము నారంభించి, శోకించుచూ కూర్చొనిన ఎడల తమ శత్రువులు తమను పరాజితులు ఒనర్చెదరని యుద్ధమునకు సంకల్పించిరి. సింధు బాధను క్రోధముగ మార్చుకొని శస్త్రములు చేపట్టెను. తన పుత్రులను అంతమొందించిన దేవతలపై అత్యంత క్రోధముతో రగులుచూ, శస్త్ర ధారణ చేసి, వాయు వేగమున పోగల అశ్వ మధిరోహించి సంగర రంగమునకు బయలుదేరెను. ఆతని వెనుక చతురంగ బలములు యుద్ధోన్ముఖమయినవి. అంత తీవ్రగతిన ఒక దూత ఏతెంచి “రాజా! నీ తండ్రి ఏతెంచుచున్నాడు. ఆయన పలుకులు విని తదుపరి కదన రంగమునకు ఏగవలసినది” అని పలికెను. దైత్యుడు వెనుకకు తిరిగి చూడగా ఆతనికి తన తండ్రి చక్రపాణి కానబడెను. అంత సింధు అశ్వము దిగి తండ్రికి నమస్కరించెను.

అంత చక్రపాణి పుత్రునకు ఆశీర్వచనము నొసంగి ఇహపర లోక సుఖమునొసగు ఉపదేశమును వినిపించెను “పుత్రా! నీవు ధన సంపదచే మదోన్మత్తుడవై మంచి చెడులను గూర్చి చింతించుట మానివేసితివి. నీవు ఎల్లప్పుడూ శుభములొసగు కార్యాకార్య విచారణకు వయోవృద్ధులైన విద్వాంసుల సలహా స్వీకరింపవలెను. భవిష్యత్ నందు శుభములు పొందవలెనన్న పూర్వకాలమందు అశుభములు ఆచరింపరాదు. అశుభకార్యములు స్వల్పమైనప్పటికీ చిన్నదయిన నిప్పు సర్వమును ఎట్లు దగ్ధమొనరించునో, అట్లే పుణ్యమంతటినీ నష్టమొనరించును. నాయనా! దేవతలను

బందీకృతులొనర్చుట నీకు ఎంత మాత్రము శ్రేయస్కరము కాదు. మాతాపితరుల వాక్పరిపాలన కావించు పుత్రుడు మాత్రమే పుత్రుడని పిలువబడును. వారి పలుకుల నుల్లంఘించు పుత్రుడు నరకముల పాలగును. అందువలన పుత్రా! నా మాట వినుము. దేవతలను విడిచిపుచ్చుము. వారిని విడచిన తక్షణము అఖిలార్ధ ప్రదాత అయిన మయూరేశుడు నీ మిత్రుడగును. ద్వేషముతో ఈ ధరాతలమందు ఎవరునూ సుఖము నొందరు. దేవతలు హిరణ్యాక్షాది మహా దైత్యులను మట్టుబెట్టిరి." సింధు "నా తండ్రి అత్యంత చతురుడు అని నేను తలచితిని. మీ జ్ఞానము ఈనాడు బట్టబయలైనది. తండ్రీ! మీరు మూర్ఖుని వలె పలుకుచున్నారు. నా సైన్యమును, సేనానులను, పుత్రులను సంహరించిన శత్రువుతో సంధి కావించుకొనమని తెలుపుచున్నారు. దీనిని మించిన అవమానము వేరొకటి యుండదు. కుశలు, అక్షమాల ధరించుట రాజులకు శోభిల్లదు. రాజు శత్రువుల పట్ల దయ ఎన్నడూ కూడదు. నీతి యందు శత్రువుతో నిర్దయగా ప్రవర్తించుటయే ప్రసస్తమని తెలుపబడినది. ఇక ఈ ఉపదేశములు ఆపి వెళ్ళవచ్చును" అని కఠినముగ పలికి, ఆయనను బల పూర్వకముగ గెంటించి తాను సంగరమున కేగెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు, దుర్గల శోకమను నూట పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువదియవ అధ్యాయము

(సింధు పరాజయము)

బ్రహ్మ "సుఖముగ కూర్చొని వీరులతో సుఖపూర్వక వార్తాలాపము లాచరించుచున్న మయూరేశుని వద్దకు వీరభద్రుడు పరుగులిడుచు ఏతెంచి "స్వామీ! సింధు స్వయముగ యుద్ధరంగమున కేతెంచెను. ఆతడు కాలుని వలె సంహారమొనర్చుటకు సన్నద్ధుడగుచున్నాడు" అని పలికెను. అంత మయూరేశుడు హర్షితుడై తన ఆయుధములు ధరించి, మయూరుని అధిరోహించి, పార్వతీ పరమేశ్వరులకు ప్రణామములర్పించి దిశలను దీప్తినంతము లొనర్చుచూ యుద్ధరంగమునకు బయలుదేరెను. అంత కార్తికేయుడేతెంచి "విఘ్నరాజా! ఈ సింధు రాజుతో సంగరమునకు నేనేగెదను. ఒకవేళ మా పౌరుషములు క్షీణమయిన ఎడల అపుడు మీరు కదన రంగమున ప్రవేశింపవచ్చు". ఈ విధముగ పలికి చతురంగ బల సేనా సహితుడై సింధు సైన్యమును ఎదుర్కొనెను. ఇరుపక్షముల మధ్య ఘోరయుద్ధము జరుగుచుండెను. "కొట్టు; చంపు; నా ప్రహారము సహింపుము; ముందుకురా; నిన్ను నేను సంహరించెదను" ఈ విధమయిన అరుపులు సర్వత్రా వినిపించుచుండెను. శస్త్రఘాతములు, బాణ పరంపరచే సైనికులు పరమపదించు చుండిరి. కత్తులు, భిందిపాలములు, కుంతములు, ముద్గరములు, తోమరములు ఈ విధముగ వివిధాయుధములు చేపట్టి ఇరు పక్షముల వారు ప్రాణములకు తెగించి పోరాడుచుండిరి. వీరుల సింహనాదములు, హయములు హేషలు, కుంజరముల ఘీంకారములు, రధముల నేమిలు కావించుచున్న శబ్దముచే భూనభోంతరాళములు దద్దరిల్లుచున్నవి. ఇరుసేనలు నియమము అన్నది సంపూర్ణముగ మరచి ప్రత్యర్ధుల మస్తకములు, ముఖములు, నేత్రములు, నాభి, భుజములు, ఉదరము, పాదములు, మోకాళ్ళు, చీలమండలు సహితము ఖండించుచుండిరి. కొందరు చేతులతో, కొందరు కాళ్ళతో, కొందరు కరవాలములతో సంగర మొనర్చుచుండిరి. సూర్యాస్తమయమయినప్పటికీ ఎవ్వరునూ వెనుకంజ వేయక తమ తమ గోత్ర నామములు తెలుపుకొనుచూ సమరమాచరించు చుండిరి. ఆ భీషణ సంగ్రామమందు రక్తము ఏరులై పారెను. కొన ఉపిరితో యున్న యోధులు సహితము తమ హుంకారములతో, ప్రహారములతో, హతమొనర్చుచుండిరి. ఈ విధముగ యుద్ధలంపటులై

ఇరు సేనలు ఐదు రోజులు తుముల యుద్ధము సాగించిరి.

ఆ సంగ్రామమందు దేవతలు కోట్లాది దైత్యసేనను హతమార్చిరి. అంత గజసేన మందుకు వచ్చినది. వీరభద్రుడు ముందునకేగి గజారోహులైన యోధులను మట్టుబెట్టెను. అగ్నికణముల వంటి సాయకములు సంధించి గజారోహులైన యోధులను గజసహితముగ కూల్చెను. వీరభద్రుడు ఒక గజమును పట్టి దానితో వేరొక గజమును ప్రహరించి రెంటినీ ముక్కలు ముక్కలు గావించుచుండెను. కార్తికేయుడు వేరొక ప్రక్క గజసేనను తుత్తునియలు కావించుచూ శోభిల్లెను. ఆయన తన పన్నెండు హస్తములందు ఆరు ధనువులు చేపట్టి శత్రుపక్షమందలి వీరుల సహితముగ యున్న గజబలమును ఉట్టడిగించెను. హిరణ్యగర్భుడు, భూతరాజులు సహితము తమదైన శైలిలో గజ సంహారము కావించిరి. పుష్పదంతుడు ఒక సింహము వలె రూపు ధరించి, అనేక ఏనుగులను ఛిన్నాభిన్నమొనర్చెను. నంది తాను ఒక మహా కుంజర రూపము ధరించి ఇతర కుంజరములను క్రింద పడవైచెను. ఇతర వీరులు సహితము తమ సాయకములచే మత్తేభముల మస్తకములు ఛేదించి విజయ భేరి మ్రోగించిరి. ఈ విధముగ సింధుని గజసేన నాశనమయ్యెను. అంత సింధు యొక్క అశ్వసేన ముందుకొచ్చి, వివిధాయుధములు ధరించి, విజృంభించి, క్రోధపూర్వకముగ దేవసేనపైబడి ఊచకోత కోసి అనేకమంది దేవసైనికులను సంహరించిరి. ఈ విధముగ దేవసేన నష్టమగుచున్నదని కాంచిన ఆరుగురు మహావీరులు "కార్తికేయుడు, వీరభద్రుడు, పుష్పదంతుడు, నంది, హిరణ్యగర్భ, భూతరాజు"లు ముందునకు ఏగి, నలుగురు వీరులు శత్రు సైన్యముల మధ్య కేగిరి. ఇరువురు వెనుక నిలబడి తమ సేనను రక్షించిరి. ముందునకేగిన ఆ నలుగురు వీరులు అసంఖ్యాక అశ్వారూఢులను సంహరించిరి. వారు భూమిపై నిలబడి, కాలినడకనే సంగరము కావించుచూ కోట్లాది దైత్య సేనను హతమార్చిరి. వీరితో పాటు భృంగి నిలబడి, అశ్వసేన యందు జొరబడి, అశ్వముల పాదములు పట్టి విసురుచూ అశ్వసేనను హతశేష మొనర్చెను. దైత్యసేన దేవతల శరణుజొచ్చెను. ఆ అశ్వసేన యందు హాహాకారములు చెలరేగెను. దేవతావీరులందరూ మయూరేశుని స్తుతించిరి.

దైత్యసైనికులు వెనుకకు తిరిగి సింధును చేరి తమ సేన పరాజయమును తెలిపిరి. అంత దైత్యుడు ప్రళయాగ్ని వలె మండిపడి "ఎవరు తిరిగి వచ్చిననూ మనసేన పరాజయముననే తెల్పుచున్నారు. నేను స్వయముగ మయూరేశుని సంహరించెదను" అని పలికి, సింహనాదమొనర్చి, భువి నుండి దివి వరకు ఆ నాదముతో ప్రకంపిత మొనర్చి, ధనుస్సుకు బాణములు సంధించి ఆకర్ణాంతము లాగి విడచుచూ వీరభద్రాదులచే రక్షింపబడుచున్న దేవసేనపై విరుచుకుపడెను. తదుపరి ఒక వందమార్లు అగ్నిమంత్రము జపించి ఆ శక్తిని ఒక సాయకమందుంచి, దానిని దేవసేనపైకి ప్రయోగించెను. ఆ అగ్నినుండి ఒక భయంకర పురుషుడు ఉదయించెను. ఆతడు జటాధారియై, అగ్నితేజుడై, విద్యుత్ సమాన జిహ్వా గలిగి, వికృతముఖుడై యుండి, దేవసైనికులందరినీ భక్షించుట ప్రారంభించెను. ఆ రణ క్షేత్రమందు మరణమాసన్నమయిన దేవ సైనికులు మయూరేశుని ధ్యానించి, మరణానంతరము ఆయన నిజధామమునకు ఏగుచుండిరి. ఆ అగ్ని పురుషుడు ప్రళయాగ్ని కీలలు కురిపించుచూ, దేవసేనను దగ్ధమొనరించుచూ ముందున కేగుచుండగా, కార్తికేయాది యోధులందరూ వానిని ప్రతిఘటింపలేక పలాయనులై మయూరేశుని శరణుజొచ్చిరి. మయూరేశుడు ఆ అగ్ని పురుషుని కాంచి, ఏమి చేయవలెనో తోచక, కేవలము శివుని కృప వలన మాత్రమే విజయమందగలమని తలచి, తన పరశువును అభిమంత్రించి ఆ అగ్ని పురుషునిపై ప్రయోగించెను. అంత పరశువు దశదిశలు మార్మోగుచుండగా, సూర్యదీప్తిని సహితము లఘువు కావించుచూ శత్రుసేనను దగ్ధమొనర్చుట ఆరంభించెను. ఆ పరశువు నుండి వేరొక మహాభూతము ఆవిర్భవించి, ఆకాశమును మ్రించునటుల, భూమండలము కుందునటుల ముందునకేగి సింధుచే ప్రయోగింపబడిన అగ్ని పురుషుని ఎదుర్కొని, కొంతతడవు యుద్ధమొనర్చి, వానిని మ్రింగెను. తదుపరి విశ్రమింపక పరమ భయంకరమైన ప్రళయాగ్ని కీలలు వర్షించుచూ దైత్యసేనపైబడి వారందరినీ సమూలముగ దగ్ధమొనర్చెను. దీనిని గమనించి దైత్యరాజు ఒకే సాయకమును

తీసి, అభిమంత్రించి వదలెను. ఆ ఒక్క సాయకము నుండి అనేక బాణములు ఉత్పన్నమై దేవసేనను బాధింప దొడంగెను. అంత మయూరేశుడు అనేక శస్త్రములు సృజించి, ఆ సాయకములను ఖండించెను. పరశువు నుండి ఉత్పన్నమయిన కాలపురుషుడు ఎక్కడెక్కడ దైత్యసేనలు యున్ననూ అక్కడికి చేరి వారిని నిహతుల కావించుచుండెను. అంత దైత్యరాజు కర్తవ్య విమూఢుడై, ఏమి చేయుటకు పాలుబోక ఒక కొయ్యవలె పడుచూ, లేచుచూ యుద్ధరంగము నుండి నిష్క్రమించెను. అంత దేవసేన విజయ ధ్వానములు కావించిరి. మయూరేశునిచే విడువబడిన కాల పురుషుడు తిరిగి మంత్రయుక్తమయిన పన్నగము వలె తిరిగి వెనుక కేతెంచి పరశువు నందు విలీనమయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు పరాజయమను నూట ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరవై ఒకటవ అధ్యాయము

(నారద అభ్యర్ధనము)

బ్రహ్మ "మయూరేశుడు తన విడిది యందు దేవ వీరులచే పరివేష్ఠితుడై ఇష్టాగోష్ఠి కావించుచుండెను. అచటికి గౌతమాది ఋషులు, పార్వతీ పరమేశ్వరులు ఏతెంచిరి. ఋషులు మయూరేశుని ప్రశంశించుచూ "సింధు సమరమందు ఇంద్రాదులను, శేషుని జయించెను. ఇక మిగిలిన వారు వానినొక లెక్కా? నీవు ఆ సింధును జయించితివి. ఓ! సురేశ్వరా! ఎందరో దేవ, మానవులను నీవు ఆ సింధు దైత్యుని బారి నుండి కాపాడితివి. నీకు నమస్కారము" అని పలికిరి. పార్వతి పుత్రుని ఆలింగన మొనర్చి "నాయనా! నీవు యుద్ధ రంగమందలి శ్రమచే మిక్కిలి దస్సితివి" అని పలికెను. శివుడు సహితము మయూరేశుని ఆలింగన మొనర్చి "ఇంద్రాదులకు సహితము అసాధ్యమయిన కార్యము నీవు సుసాధ్యము కావించితివి. పరబ్రహ్మ స్వరూపమా, నీవు సర్వజ్ఞుడవు, మరియు చరాచర జగత్తుకు గురువువు. పృధివీభార హరణమందు నిరతమైన నీ మహిమను బ్రహ్మాది దేవతలు, గౌతమాది మునులు తెలియరన మిగిలిన వారి దక్షత గూర్చి పలుకనేల?" అని ప్రశంశించెను." ఈ విధముగ సర్వులు ప్రశంశించుచుండగా దేవర్షి నారదుడు పార్వతిని కాంచి "మాతా! నా పలుకులాలకింపుము. ఇచట నివాసముండి అనేక దినములు గడచినవి. ఈ దుష్టదైత్యుడు ఎప్పుడు మరణించును? ఇంద్రాది దేవతలు ఎన్నడు విడుదలగుదురు? మయూరేశుని వివాహము ఎప్పుడు జరుగును? మీ ఆజ్ఞ అయిన ఎడ మేము వెళ్ళి తిరిగి మీరు పిలచినపుడు ఏతెంచెదము. ఈ దైత్యుని హతమార్చుట అసంభవమని నా కనిపించుచున్నది" అని పలికెను. అంత కార్తికేయుడు నారదునితో ఇట్లనిరి "ఓ! అనఘా! సర్వజ్ఞులైన మీరు ఈ పలుకులు పలుకుట ఆశ్చర్యకరము. ఈ మయూరేశుని అవతార ప్రయోజనమే సింధు సంహారము. ఈయన భక్తుల కోరికలను ఈడేర్చు భగవంతుడు. త్రిగుణములను క్షోభింపజేసి జగన్నిర్మాణమొనర్చు గుణాతీతుడు మయూరేశుని నీవెరుగవా? ఇంద్రాదులను దునుమాడిన ఎందరో దైత్యులను ఈయన పసితనముననే సంహరించెను. ఈయన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు, సృష్టి స్థిత్యంతములు కావించువాడు, మరియు అఖిలాత్ముడు" అని ఆశ్వాసించిరి. అంత నారదుడు "ఈ దనుజుడు సంహరింపబడినపుడు మీ పలుకులు నమ్మెదను. అంతవరకు నమ్మను" అని కఠినముగ పలికెను.

నారదుని కటు వచనములు విని మయూరేశుడు కృద్ధుడై త్రిలోకములు కంపించు నటుల గర్జించి మేఘ గంభీర స్వరముతో ఇట్లనియె "ఓ! మునీశ్వరా! నీవు బ్రహ్మ పుత్రుడవు మరియు సర్వజ్ఞుడవగుటచే సమ్మానితుడవు. కానీ నీవు నీ మర్యాద నతిక్రమించుచున్నావు. నేను సమస్త బ్రహ్మాండమును అంతకుని సహితము క్షణములో మ్రింగగలను. భూమండలమును విచిలితము కావించి సముద్రములను ఇంకింపజేయగలను. నా నిశ్వాసముచే మేరు పర్వతమును

విరుగగొట్టగలను. ఓ! సర్వత్రగామీ! నారదా! నా సత్య ప్రతిజ్ఞను వినుము. నేను సింధు దైత్యుని వధించెదను. ఇందు సందియము లేదు." ఈ విధముగ పలికి కుపితుడై మయూర మధిరోహించి యుద్ధరంగమున కేగెను. అంత నందీ, భృంగిలు ఆయనను సమీపించి "స్వామీ తొలుగ మా రణ కౌశలమును తిలకింపవలసినది" అని పలికి గండకీ నగరమున కేగిరి. వారు ఏగిరన్న వార్తవిని వీరభద్ర, భూతరాజులు సహితము వారి సహాయార్ధము ఏగిరి. ఆ సమయమున సింధు దైత్యుడు భార్యాసహితుడై ఒక పర్యంకముపై కూర్చొని యుండెను. వేగులు వేగముగ ఏగి "నలుగురు మహాకాయులు మన దుర్గమును చుట్టుముట్టిరి. రాజా! మీరు రావలసినది" అని పలికిరి. అంత దైత్య దంపతి చింతాకులులై ముఖములు మ్లానమైనవి. దుర్గ "మహారాజా! నేను పలికిన హితోపదేశమును మీరు ఆచరింపలేదు. తత్ఫలితముగ ఈ ఫలము ప్రాప్తించినది. ఇపుడు చింతించి ప్రయోజనమేమి?" అని పలికెను.

ఆ సమయమున నందీ, భృంగి, వీరభద్ర, భూతరాజులు అమితాశ్చర్యయుక్తము, స్వర్ణ రత్న జటితము, అనేక శిఖరమయము అయిన సింధుని సభాస్థలి ప్రవేశించి అచట గల అనేక స్థంభములను ఊపుచూ, సభను భంగమొనర్చి, భూస్థాపితమొనర్చిరి. ఆ మహాకాయుల ముఖములు క్రోధముతో అరుణ వర్ణమున యున్నవి. అంత సింధుని సర్వసేన ఖడ్గ, బాణ, ధనుర్బాణములు, ముద్గర తోమరాది ఆయుధములు, ధరించి వారి నెదిరించిరి. ఆ మహాకాయులు ప్రతిపక్ష సైనికులను చేతులతో కొట్టుచూ, పరిఘలతో మోదుచూ, కాళ్ళతో త్రొక్కుచూ, ఆకాశమునందు విసురుచూ, అస్త్రశస్త్రములతో దైత్యసేన నంతటినీ నాశనమొనరించిరి. దైత్యసేన కేవలము నామమాత్రావశిష్ఠముగ యుండెను. అంత ఆ నలుగురు మహాకాయులు సింధు అంత:పురమునకేగి, వాని శిఖపట్టి ఈడ్చిరి. అంత సింధు వారిపై పన్నగాస్త్రము ప్రయోగించెను. అంత సర్పములు ముగ్గురు మహాకాయులను బంధించినవి. అంత భృంగి గారుడాస్త్ర ప్రయోగము కావించి వారిని విడిపించెను. అంత సింధు ఆగ్నేయాస్త్రమును సంధించెను. భృంగి పర్జన్యాస్త్రముతో దానిని శాంత పరచెను. సింధు వాయువ్యాస్త్రమును ప్రయోగంపగా భృంగి పర్వతాస్త్రముతో దానిని ప్రతిఘటించెను. ఆ నలుగురు వీరులు సింధును చుట్టిముట్టి మల్లయుద్ధ మొనర్చిరి. నంది ఆ దైత్యుని కిరీటమును అవనతమొనర్చెను. వీరభద్రుడు సింధు చూచుచుండగా దుర్గ కేశములను పట్టుకొనెను. ఆ సాధ్వి తన భర్త ఓటమిని, పరాభవమును చూడలేక కన్నులు మూసుకొని, ఆతని కర్మలను నిందించుచూ గృహాంతర్భాగమునకు పరుగిడెను. అంత సింధు క్రోధోద్రిక్తుడై వీరభద్రుని పాదములు పట్టి భూమిపై పడవైచెను. నందిపై ముష్ఠి ఘాతము ప్రహరించి, భృంగిని భూమిపై విసరి, భూతరాజును మూర్ఛితు నొనరించెను. అంత సింధు తిరిగి తన మకుటమును దాల్చి, చావగా మిగిలిన నామమాత్ర సైన్యమును తీసికుని "మనము మయూరేశు ని మట్టుబెడదము" అని పలికి యుద్ధమున ముపక్రమించెను. నలుగురు దేవ మహాకాయులు మయూరేశుని వద్ద కరిగి "స్వామీ! మేము దైత్యసేన నంతటినీ ఉట్టడిగించితిమి. సేన నామ మాత్రావశిష్ఠమైనది. సింధుని హతమార్చుటకు మాకు అనుజ్ఞ లేదు కావున వెనుదిరిగితిమి. ఇక వానిని మీరు హతమార్చ వలసినది" అని పలికిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి నారదుని అభ్యర్ధనమను నూట ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరవై రెండవ అధ్యాయము

(సింధు దైత్యుని మరణము)

సింధు దైత్యుడు యుద్ధరంగమున కేతెంచెనని వినిన మయూరుడు ప్రసన్నుడై, తన నాలుగు హస్తములందు ఆయుధములు ధరించి, మయూరారూఢుడై, దిశలను, విదిశలనూ మారు మ్రోగించు గర్జన చేయుచూ, యుద్ధ నిశ్చయుడై

ఎదురుగ యున్న దైత్యరాజును కాంచెను. సింధు సహితము ఏతెంచిన మయూరేశుని చూచెను. సింధు గజము పంచాస్యమును, సర్పము గరుడుని, మధుకైటభులు విష్ణువును, త్రిపురుడు శివుని, శుంభనిశుంభులు జగన్మాత దుర్గాదేవిని చూసినట్లు మయూరేశుని కాంచెను. అంత వారిరువురు ఒకరిపై ఒకరు సాయక వర్షము కురిపించుచూ, రక్త స్రావము చే నిండి పూచిన మోదుగుచెట్లవలె దీప్తించుచుండిరి. వారిరువురి శస్త్ర సంఘర్షణచే ఉద్భవించిన అగ్నిచే పర్వతములు, వృక్షములు, అడవులు దగ్ధమగుచుండెను. సప్తదీప అయిన వసుంధర కంపించుచుండెను. సింధు ఒక తీవ్ర సాయకమును సంధించి, దానిని ఆగ్నేయాస్త్రముతో మంత్రించి విడచెను. అయ్యది మయూరేశుని దగ్ధమొనర్చుటకు వేగముగ ఏతెంచుచుండెను. మయూరేశుడు దానిని ప్రతిఘటించుటకు పర్జన్యాస్త్రమును ప్రయోగించెను. తద్వారా జలధారలు కురిసి ఆగ్నేయాస్త్రము చల్లబడెను. అంత సింధు వాయువ్యాస్త్రమును సంధించి విడచెను. తత్ప్రభావముచే సమీపమున యున్న చెట్లు, చేమలు విరిగిపడి, సమరాంగణమంతయు సుడిగాలిచే ఆవరింపబడెను. అంత మయూరేశుడు పర్వతాస్త్రమును ప్రయోగించెను. అంత వాయువ్యాస్త్రము క్షీణించి, అన్నివైపులా పర్వతములు నిలిచి దైత్యసేనపై పడుట ప్రారంభించెను. తనపై బడి నుగ్గునుగ్గు కావింపక మునుపే సిందు వజ్రాస్త్రము సంధించి విడచి ఆ పర్వతములను ఛేదించెను. పర్వతములన్నియు విరిగిననూ వజ్రాస్త్రపు ప్రభావము ఇంకనూ యుండుటచే మయూరేశుడు తానునూ వజ్రాస్త్రమును సంధించి విడచెను. రెండు అస్త్రములు వినువీధిని కొంతసేపు పోరాడి, పెటపెట ధ్వనులు కావించుచూ మాయమయినవి.

ఇక ఈ అస్త్రములచే పని కాదని సింధు కరవాల సహితుడై మయూరేశుని వద్దకు పరుగిడెను. దైత్యరాజు ఈ విధముగ ఏతెంచుట గని మయూరేశుడు విరాడ్రూపము నొందెను. శిరము ఆకాశమునందు, పాదములు పాతాళమందు, కర్ణములు దిగంతము వరకు వ్యాపించి, సహస్ర బాహూదర వక్త్ర నేత్రుడై రోదసీ పర్యంతము వ్యాపించిన మయూరేశు ని కాంచి సింధు మూర్ఛితుడయ్యెను. మయూరేశుడు ఒక చేతితో ఆకాశమంతటినీ ఆచ్ఛాదించెను. సింధు ఆ ప్రక్రియను చూచి సూర్యుడు తన కొసంగిన వరమును స్మరించి “చాలా కాలము తరువాత ఏ దేవుడు తన ఒక చేతితో ఆకాశమంతటినీ ఆచ్ఛాదన మొనర్చునో, ఆయనే నీకు ముక్తిని ప్రసాదించునని సూర్యభగవానుడు తెలిపెను. ఇన నేను యుద్ధము చేయను. జరుగనున్నది జరుగును” అని తలచి ఆ మయూరేశునే చూచుచుండెను. మయూరేశుడు తిరిగి నాలుగు భుజములు గల బాలుని వలె మారి, మయూరమును దిగి, శుద్ధాచమన మొనర్చి, తన పరశువును గ్రహించి, దానిని అభిమంత్రించి సింధుని అమృతయుక్త కంఠమును విదీర్ణమగునటుల విసరెను. ఆ పరశువు ప్రళయకాల జ్వాలా మాలికలు విరజిమ్ముచూ, బ్రహ్మాండమును విస్ఫోటనమొనర్చు శబ్దము కావించుచూ, వన పర్వత సహిత ధరిత్రిని ప్రకాశమొనర్చుచూ, దైత్యుని వద్దకేగి ఆతని కంఠమందున్న అమృత భాండమును విస్ఫోటమొనర్చెను. తక్షణము సింధు దైత్యుడు సుడిగాలి పడిన పెను వృక్షము వలె, వజ్రఘాతముచే కూలిన మహా పర్వతము వలె, రక్తము వమనము చేయుచూ క్రిందపడి అసువులు బాసెను. మయూరేశుని కృపచే ఆ దైత్యుడు దుర్లభమయిన మోక్షము నొందెను. పుష్పవృష్టి కురిసినది. గంధర్వులు దివ్యగాన మాలపించిరి. అప్సరసలు నాట్యము చేసిరి. భూమి యందలి ధూళి శాంతినొందెను. వాయువు సుఖప్రదముగ వీచెను. మేఘములు మందగతిని గర్జించెను. దిశలు ప్రసన్నమయినవి. అంత కార్తికేయాది వీరులు మయూరేశుని స్తుతించిరి “ఓ! పరబ్రహ్మ స్వరూపా, చిదానందరూపా, సురేశా, పరేశా, సదానందరూపా, గుణసాగరా, గుణేశా, గుణాతీత, అనాది అయిన మయూరేశునకు నమస్కారము. పరమోంకారరూపా, జగత్తునందు ఏకమైన వందనీయా, గుణములకు ఏకమాత్ర కారణమైనవాడా, జగత్పాలకా, నీకు నమస్కారము. మహాదేవపుత్రా, మహాదైత్యనాశకా, మహాపురుషా, విఘ్ననాశకా, భక్తపోషకా, జ్ఞానకోశా, నీకు నమస్కారము. అనాది, గుణాది, సురాది, పార్వతీ ప్రసన్న ప్రదాతా, అసురాంతకా, భక్తి ముక్తిప్రదాతా, నీకు నమస్కారము. మాయావులకు సహితము మోహము కల్పించు ప్రభూ, మహామాయావీ, నీవు మునుల ధ్యాన గమ్యము. నిరాకారా, నీవే అనేక అవతారములు స్వీకరించెదవు. ఆద్యా, అజ్ఞాననాశకా, సర్వకారణకారణా,

స్మృతి శృతులకు సహితము అగోచరా, వేదభోదిత, కర్మలకాది బీజమయినవాడా, క్రియాసిద్ధిహేతూ, ఇంద్రాది దేవ వందితా, నీకు నమస్కారము. శివాది దేవతలచే నమస్కరింపబడు చరణ కమలములు కలవాడా, యోగులను సదా రక్షించువాడా, చిత్స్వరూపా, కామరూపా, కృపాసాగరా నీకు నమస్కారము. నీ పరమ దయచే భక్తులకు అత్యంత పరమానందము నిచ్చెదవు. ఓ! విభో! మాకు షడూర్ములు (క్షుధ, పిపాస, శోక, మోహ, జరా, మరణ) నష్ఠమొనరింపుము. నీ భజనానందము చే లభించు ముక్తి శ్లాఘనీయము. ఓ! మయూరేశా! నిన్ను ఏమని పొడగము తండ్రీ! నీ శక్తి అపారము. నీ గుణములు వర్ణించు శక్తి మాకు లేదు." దేవతలు "స్వామీ! నీవు మా కొసంగిన వరమును నిజము చేసితివి. సర్వ దేవగణములకు అవధ్యుడయిన సింధు దైత్యుని నీవు సంహరించితివి" అని పలికిరి.

అంత పార్వతీ పరమేశ్వరులు అచటి కేతెంచి, మయూరేశుని ఆలింగనమొనర్చి, "నీవు సత్కర్మ మాచరించితివి. త్రిలోకములను హర్షిత మొనర్చితివి. చతుర్వేదములు నిన్ను వర్ణింపలేవు. నీవు సర్వ విద్యా నిధానుడవు" అని పలికి తమ స్థానముల కరిగిరి. దేవతలు మయూరేశునకు నమస్కార మొనర్చి "పై స్థోత్రమును పఠించు వారలకు సమస్త మనో కామనలు పూర్ణమగును. ఈ స్థోత్రమును వేయిమార్లు పఠించిన కారాగార విముక్తి, పదివేల సార్లు పఠించిన ఎడల అసాధ్యము సహితము ఒక్క క్షణములో సుసాధ్యమగును. ఆతడు/ఆమె సర్వత్రా విజయమంది పరమ దుర్లభమయిన లక్ష్మీప్రాప్తి నొంది, ధనవంతుడు, పుత్రవంతుడు అగును. అఖిల జగత్తు ఆతని వశమగును." ఈ విధముగ పలికి దేవగణములు మయూరేశుని అనుజ్ఞనొంది తమ స్థానములకు వెడలిరి. మయూరేశుడు గణముల సహితుడై గృహమున కేగెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి సింధు దైత్య వధయను నూట ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువది మూడవ అధ్యాయము

(దుర్గ, చక్రపాణి, ఉగ్రల శోకము)

బ్రహ్మ "గండకీ నగరమందు సింధు మాతాపితరులు, భార్య దుర్గ అనేక అపశకునములు కాంచుచూ భయము నొందుచుండిరి. ఎవరేని వ్యక్తి ఉత్తరదిశగా శిరము యుంచి నిద్రించిన, ఎవరేని వ్యక్తి ముఖము క్రిందికి దించి కాళ్ళను చూచుచూ నడచిన, ఎవరేని స్త్రీ తన చిబుకమును తన అంజలి యందు నిడుకొని అప్రసన్నయై కూర్చొనిన, ఇవనియు అపశకునములుగ భావింపవలెను. ఆ సమయమున దూతలు ఏతెంచి "అసంఖ్యాక శత్రుసేనను నిర్జించి సింధుమహీపతి ప్రాణములు త్యజించి దివంగతుడయ్యెను. దేవతలు అపజయమొందుట గాంచి కృద్ధుడై మయూరేశుడు సమరాంగణమున కేతెంచి, సింధు చక్రవర్తి ప్రయోగించిన దివ్యాస్త్ర సంపదను నివారణమొనర్చి, తన పరశువుతో ఆయనను నిర్జించెను" అని పలికెను. దూత పలుకులు విని దుర్గ, సింధు మాతా పితరులు రోదించిరి. దుర్గ తన శిరమును, శరీరమును తీవ్రముగ ప్రహరించుకొనెను. ఉగ్ర, చక్రపాణిలు తమ ముఖములను అంజలియందుంచుకొని అమితముగ దు:ఖించిరి. నాగరికులు కొందరు ముఖముపై దుమ్ము పోసికొనిరి; కొందరు తమ చేతుల వెనుక భాగమును కరచుకొనిరి. కొందరు తమ చేతులతో, కాళ్ళతో భూమిని తాడించిరి. స్త్రీలు వేళ్ళు విరుచుచూ పార్వతీ పుత్రుడయిన మయూరేశునికి శాపనార్థములు పెట్టిరి. అంత ఉగ్ర "నేను తపము చేసి, నానా యత్నములొనర్చి, సూర్యుని ఉపాసనతో సంతుష్టుని ఒనర్చి, ఉపవాసములొనర్చి, పుత్రా! నిన్ను కంటిని. నీవు శూరుడవు, ఆత్మాభిమానివి, త్రిలోక నాయకుడవు. నీ కారణముననే

నేను త్రిలోకముల యందు ప్రశంశలందితిని. ఇపుడు లోకులు నన్ను భాగ్యహీన యని పిలుతురు. నీవు ఇదివరలో యముని ఓడించితివి. తిరిగి ఏల జయింపకుంటివి? పుత్రా! నీవు దివంగతుడవగుటచే మయూరేశుని ఇచ్ఛ పూర్ణమయినది. నీవు నన్ను సంప్రదించక, సుముఖుడవై ఏల స్వర్గస్తుడవయితివి? నా దు:ఖము నీకు సంతోషప్రదమా? నీవు గర్జించిన ఎడల మేఘములు గర్జన చేయజాలవు. అటువంటి నీవు నిశ్శబ్దమెట్లయితివి?" అని రోదించెను.

అంత దుర్గ "వేద ప్రకారము బ్రహ్మ దంపతిని ఒకే శరీరముగ చేసెను. కానీ ఆ మూఢబుద్ధి ఒకే ప్రాణముగ ఏల కావింపలేదు? సౌభాగ్య మదవతినై నేను ఇంద్రాణి, సావిత్రి, మరియు ఏ ఇతర పతివ్రతలను లెక్కచేయలేదు. నేడు నేను విధవనైతిని. స్వామీ! మీ చేతులతో నాకు సుగంధ, చందన, కస్తూరి అలదినపుడు నా అంగములు శీతలమయ్యేడివి. నేడు నా సర్వాంగములు శోకముచే దగ్ధమగుచున్నవి. దయచేసి నాకు శీతలత్వము ప్రసాదింపుము. నేను వినా నీవు ఒక్క అణుమాత్రము భుజించువాడవు కాదు. నేను లేక నీవు స్వర్గమును ఎట్లు భోగింతువు? సమదర్శనులైన సజ్జనులు అపరాధరహిత భృత్యుల ఎడల ఉదాసీనతతో యుందురు. కానీ నీవు నేడు నన్ను ఉపేక్షించుటకు కారణమేమి? స్వామీ! మీరు నా పట్ల కపటరహితమైన ప్రేమను ప్రకటించువారు. అటువంటి అనిర్వచనీయమైన ప్రేమను కాదని ఎక్కడికేగిరి?" ఈ విధము దయనీయముగ దుర్గ రోదించుచుండెను. అంత తపోవృద్ధులు, జ్ఞానవృద్ధులైన జనులు లేతెంచి "ధర్మశాస్త్రమెరిగిన జనులు ఈ విధమయిన రోదనము కావింపరు. ఎందుకనగా సుహృద్ జనుల కళ్ళనీరు ప్రేతముఖమున పడును. దయాళువులు ప్రేతమునకు ఏది హితమో దానినే చేయవలెను. మీరు జాగ్రర్తగా ఆలోచించిన ఎడల బ్రహ్మరూపి, నిర్గుణుడు, చిదానంద ఘనుడు, అయిన మయూరేశుడు సింధునకు మోక్షము ప్రసాదించెను. వేదమందు నిశ్చితముగ తెలిపిన విషయము, ఆత్మకు పుట్టుక, చావు, రెండును లేవు. మనుష్యులు తమ స్వార్ధకారణమున రోదించెదరు. వారు ప్రేత హితము వాంఛింపరు. అసంఖ్యాకమయిన జీవరాశులను మోయు ధరిత్రి, శేషుడు, ప్రేత భారమును సహింపలేరు." ఈ హిత వచనములను వినిన వారు ముప్పురు శోకమును త్యజించి యుద్ధరంగమున కేగిరి.

ఆ సమరాంగమున కనులు తెరచి, తెల్లని నేత్రములతో నిర్జీవుడై సింధు నేలపై పడియుండెను. అంగరక్షకులు ఆయనకు వింజామరలు వీచుచుండిరి. వారందరూ ఆతనికి నలుప్రక్కలా కూర్చొని దు:ఖాతురులైరి. దుర్గ తన పతి శిరమును ఒడిలో యుంచుకొని తీవ్ర స్వరముతో రోదించుచూ ఇట్లనియె "నాధా! నేను మీ పాదములను ఎల్లప్పుడూ ఒత్తుచుండెడిదానను. నేడు జనుల మధ్య చేయజాలకుంటిని. మీ శత్రువులు జీవించియుండగా మీరు నిద్రించుట పాడికాదు." ఉగ్ర, చక్రపాణిలు సహితము కన్నీరు తుడుచుకొనుచూ "వత్సా! నీవు వజ్రఘాతము తిన్న పర్వతము వలె భూశయనుడవయితివి. నీ శత్రువులు జీవించియుండగా నీ విట్లు జీవించుట ధర్మమా? నీవు ఇదివరలో యముని జయించితివి కదా! ఇపుడు నీవెట్లు వశవర్తివయితివి? ఒక్కమారు మా హృదయానందకరమయిన పలుకులు పలుకవలసినది. ఓ! అనఘా! ఒకప్పుడు నీ మాటకు త్రిలోకములు కంపించుచుండెడివి. నేడు నీవు శిధిల పరాక్రముడవైతివి. మేము నీకేవిధమయిన అపకారము కావింపలేదు కదా! అయిననూ నీవు మౌనము వహించి మాతో మాట్లాడవేల?" ఈ విధముగ హృదయ విదాకరముగ వారు ముప్పురు రోదించుచుండగా కొంతమంది వృద్ధులు అచటికేతెంచి వారికి ఈ విధముగ శాంత వచనములు పలికి స్వాంతన నొనర్చిరి "మరణించిన వారి వెంట వెడలుట ఉచితము కాదు. దశరధుని మరణానంతరము రాముడు ఆయనతో పాటు పరలోకమున కేగలేదు. అమిత పరాక్రముడైన రాముడు శత్రుమర్దనుడైనప్పటికీ ఇలపై యుండిపోలేదు కదా! వందలాది రాజులు సంగరమొనర్చి స్వర్గస్తులైరి." అంత వారందరూ చందన, బిల్వ కాష్ఠములు తెప్పించి, సింధునకు పరలోక క్రియలు జరిపి దహన సంస్కారములు ఒనర్చిరి. పతివ్రత అయిన దుర్గ సతీసహగమనమాచరించి స్వర్గమున కేగెను.

అంత ఒకనాడు చక్రపాణి నగర జనులతో కలసి మయూరేశుని వద్దకేగి, నమస్కరించి, నెమ్మదిగ ఈ విధముగ

స్థుతించెను "ప్రభూ! నీవు నిర్గుణ పరమాత్మవు. చరాచర జగత్తుకు గతి, వేదములకు గమ్యము, విశ్వమునకు నాధుడవు నీవే! నీ మాయచే మోహితులై దేవతలు సహితము నిన్ను తెలియలేరు. నీ దర్శనముచే నేను, ఈ ప్రజలు ధన్యుల మయితిమి." ఆ స్థుతికి మయూరేశుడు అత్యంత ప్రసన్నుడై "చక్రపాణీ! నీ సుతుడు మరణించెను. నీవు ఏదేని వరము కోరుకొనుము" అని పలికెను. రాజు "దేవేశా! మీరు ప్రసన్నులయిన ఎడల దయచేసి మా గృహములకు ఏతెంచి, ఈ గండకీ నగరమును పవిత్రమొనరింపవలసినది" అని బదులిచ్చెను. మయూరేశుడు "తథాస్తు" అని పలికి మయూరారూఢుడై, పార్వతీపరమేశ్వరులు, గణములు, మునులు, అందరూ వెంటరాగా గండకీనగరమున కేగిరి. ఆ సమయమున వారి రాకకై వేచి నగరమంతయు ధ్వజ, పతాకయుక్తమై అలంకృతమైనది. నగర వీధులన్నియు కళ్ళాపి జల్లబడి ధూళి రహితమయినవి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి దుర్గా, ఉగ్ర, చక్రపాణి శోకమను నూట ఇరవై మూడవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరవై నాల్గవ అధ్యాయము

(మయూరేశ వివాహము)

బ్రహ్మ "చక్రపాణి మహారాజు తొలుత తన నగరముకేగి తన సభను, నగరమును ధ్వజ పతాకములతో అలంకరింపజేసెను. మయూరేశుడు ఆ నగరమంతయు అలంకరింపబడి యుండుట కాంచెను. అసుర స్త్రీలందరూ భవనములపై నిలబడి మయూరేశుని వీక్షించిరి. చక్రపాణి ద్వారా విడుదల కాబడిన దేవ ప్రముఖులందరూ మయూరేశుని సమక్షమున కేతెంచిరి. విష్ణు, ఇంద్ర, అగ్ని, కుబేర, వాయు, సూర్యాదులందరూ మంగళవాద్యముల మధ్య అచటి కేతెంచిరి. వారందరూ వారివారి వాహనములనుండి క్రిందికి దిగి మయూరేశునికి ప్రణామములర్పించిరి. ఆ దేవతలు, మరియు గండకీ నగరవాసులు మయూరేశుని ఆలింగనమొనర్చిరి. విష్ణ్వాది దేవతలందరూ సింధు నిర్జనమునకు మయూరేశుని ప్రశంశించిరి. అచట గల శైవులు, వైష్ణవులు, సౌరులు, శాక్తేయులు ఎవరు ఏ రూపముతో తమ ఇష్టదైవమును ప్రార్ధించెదరో, మయూరేశుడు వారికి ఆ రూపముతో కానబడెను. బాలురు, ముగ్ధ, ప్రౌఢస్త్రీలు, వృద్ధులు, యువజనులు సర్వులు మయూరేశుని పూజించిరి. చక్రపాణి యొక్క సభయందు మయూరేశుడు ఒక దివ్య సింహాసన మలంకరించి కూర్చుండెను. ఆయన చూట్టూ ఇంద్రాది దేవతలు, త్రిమూర్తులు, ఏడు కోట్ల రుద్రగణములు పరివేష్ఠించి యుండిరి. ఆ సమయమున తొలుత వంది జనులు మయూరేశుని కీర్తించిరి. తదుపరి నారదాదులు గానము, అప్సరసలు నాట్యము కావించిరి.

అంత చక్రపాణి మహారాజు లేచి సభికులందరికీ యధావిధి పూజనమొనర్చి ఇట్లనియె "నేడు మన సభ ఇంద్రాది లోకపాలురు, త్రిమూర్తులు, భగవానుడయిన మయూరేశునితో అలంకరింపబడి నా జన్మకర్మములు ధన్యమయినవి. నా వందలాది జన్మముల పుణ్యఫలముగ నాకు మయూరేశ దర్శనము కలిగినది." ఇంద్రుడు ప్రప్రథముగ మయూరేశుడు పూజింపబడుట కాంచి మాయా మోహితుడై ఇట్లనియె "ఓ! చక్రపాణీ! జగత్ సృష్ఠికర్త అయిన బ్రహ్మ, లక్ష్మీపతి అయిన విష్ణువు, ఈ సభయందుండగా నీవు ఒక బాలకునికి పూజన మొనర్చుచున్నావు. నీవెంతటి మూర్ఖుడవు! నీవు ఆ బాలునికి పూజనమొనర్చి మమ్ములనందరినీ అవమానించితివి. ఇచట బ్రహ్మ, విష్ణువులతో పాటు సంహారక్త అయిన శివుడు, త్రిలోక జనని అయిన పార్వతీదేవి, త్రిలోకములను కర్మమార్గమందు తీసికొనివెళ్ళు, సూర్యభగవానుడుండగా వారందరినీ

కాదని నీవు ఈ బాలుడు మయూరేశునికి పూజనమొనర్చుట ఉచితము కాదు.'' అంత చక్రపాణి ''ఈ మయూరేశుడు ఇంద్రాది దేవతలు, దిక్పాలకుల కంటె పరాక్రమోపేతుడు అని దృష్ఠిగతమగుచున్నది. ఈయనే సింధు దైత్యుని సంహరించి, దేవతలందరినీ బంధన విముక్తి యొనర్చెను. ఈయన కేవలము దైత్య నిర్మూలనమునకు, భూభార హరణమును మాత్రమే శివుని గృహమందు జన్మించెను.'' ఈ విధముగ తర్జన భర్జన జరుగుచుండగా వారికి అకస్మాత్తుగా ఒక గొప్ప శబ్దము వినిపించెను. ఆ శబ్దమునకు కొందరు దేవతలు మూర్చితులైరి. పృధివి కంపించినది. ఆ సమయమున ఆ సభామధ్యమున కోటిసూర్యతుల్య కాంతి మండలము సాక్షాత్కరించెను. ఆ కాంతి నడుమ దశభుజుడు, నానా భూషణ భూషితుడైన గజాననుడు దర్శనమిచ్చెను. ఆ స్వరూపమును చూచి దేవతలు ఆశ్చర్యపోయిరి. తిరిగి ఆ దేవుని పంచముఖుడైన ఈశ్వరునిగ చూచిరి. మరల ఆ కాంతి మధ్యమున పద్మాసనస్థితుడైన వక్రతుండ రూపము, దానిని ఆగ్నేయ కోణమున శివుడు, నైఋతిన సూర్యుడు, వాయువ్యమున పార్వతి, ఈశాన్యమున విష్ణువు దృష్ఠిగతమయిరి.

అంత దేవతలు భ్రమితులగుచుండగా అశరీరవాణి ఇట్లు పలికెను ''ఈ గజాననుడు సర్వులకు ఆరాధ్యనీయుడు. ఆదిమధ్యాంత రహితుడు, జగద్వ్యాపి. ఈ అయిదు రూపములతో ప్రకటితమయ్యెను. సర్వ విఘ్నవినాశకుడైన ఈ దేవదేవుడే సకల యక్ష, రాక్షస, దేవ, మానవులందరికీ పూజనీయుడు. ఈయను పూజించిన ఎడల సర్వ దేవతలను పూజించినట్లే! ఈ గజాననుని విషయమందు శంక, తర్క వితర్కములు, చేయవలదు. అట్లు చేసిన ఎడల నరకగాము లగుదురు.'' అశరీరవాణి పలుకులు వినిన దేవతలు మయూరేశుని తొండముతో ప్రకాశించుచున్న ఓంకార రూపునిగా కాంచిరి. అంత దేవతలందరూ తమ భ్రమ, అహంకారములను త్యజించి, జయ జయ ధ్వానములు కావించి ఆ సర్వాంతర్యామిని పూజించిరి. అంత చక్రపాణి ఆ గుణేశునికి పంచామృత స్నానము, తదుపరి శుద్ధజల స్నానము చేయించి, వస్త్ర భూషణములు, పుష్పధూప దీపములు, నానా విధములయిన నైవేద్యములు, తాంబూల దక్షిణాదులు, మంత్ర పుష్పాంజలి, నమస్కార స్థుతులతో పూజించెను. తదుపరి అత్యంత భక్తితో ఇతర దేవతలను సహితము పూజన మొనర్చెను. అంత చక్రపాణి ''నేడు మీ అందరినీ పూజించి నేను ధన్యుడనయితిని. ఈ విధముగ దేవతా శ్రేష్ఠులందరూ ఒకచోట సమావేశమగుట బహు దుర్లభము.''

అంత నారదుడు లేచి బ్రహ్మ దేవునితో ''తండ్రీ! నేను మీ ఆజ్ఞానుసారము పార్వతీ పరమేశ్వరులకు సిద్ధి బుద్ధుల గూర్చి నివేదనమొనర్చి మయూరేశుని ఇచటకు తీసికొని వచ్చితిని. మీరు ఈ సర్వ శుభలక్షణ లక్షితలైన కన్యలను మయూరేశునకు సమర్పింపవలసినది.'' ఆ ఇరువురు కన్యలను చూడగనే దేవతలు సర్వులూ, ఆ కన్యలను తమకీయమని వాదులాట మొదలిడిరి. అంత బ్రహ్మ ఆ కన్యలిరువురికీ చెరియొక పుష్పమాలనిచ్చి, వారికి ఇష్ఠమయిన వరుని గ్రహింప వలసినదని తెలిపెను. వారిరువురు మయూరేశుని మెడలో ఆ పుష్పమాలలు సమర్పించిరి. దేవతలు నిరాశ నొందిరి. బ్రహ్మ యధావిధిగ వారిరువురినీ మయూరేశునికిచ్చి వివాహక్రతువు జరిపించెను. అంత బ్రహ్మ ''నేను ఏది వాంఛించితినో, అయ్యది జరిగినది. నేను నా కన్యలను మయూరేశునికిచ్చి వివాహక్రతువు జరిపించితిని'' అని పలికి, మయూరేశుని వంక తిరిగి ''నేను ఈ కన్యలను అత్యంత ప్రేమాభిమానములతో పెంచితిని. ఇపుడు మీకు సమర్పించితిని. మీరు వీరిని ప్రయత్న పూర్వకముగ రక్షింపవలసినది.'' ఇంద్రాది దేవతలు మయూరేశునితో ''స్వామీ! మీ కృపచే మేము సింధు కారాగారము నుండి బయటపడి, తిరిగి మా పదవులు మేము పొందితిమి. మేము గౌతమాది మునుల సహితులమై మీ అనుజ్ఞ అయినచో మా స్థానముల కేగెదము.'' మయూరేశుడు ప్రసన్నుడై ''తధాస్తు'' అనెను. అంత పార్వతి తన తనయుని, కోడళ్ళను, తన ఒడిలో కూర్చుండబెట్టుకొని పరమ ప్రసన్నయై వారికి అనేక ఆభూషణములను ప్రసాదించెను. ఏ మానవులు సింధు వధను, మయూరేశ విజయము మరియు వివాహమును గూర్చి వినునో, వారి మనోకామనలన్నియు పూర్ణమగును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశ వివాహమను నూట ఇరవై నాల్గవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరవై ఐదవ అధ్యాయము

(మయూరేశుని అవతార పరిసమాప్తి)

బ్రహ్మ "మయూరేశుడు వివాహానంతరము తన వాహనమైన మయూరము నధిరోహించి తన నగరమునకు ప్రస్థానమయ్యెను. ఆయన ముందు దేవతలు, వెనుక మునులు పయనమైరి. చక్రపాణి మహారాజు మరియు నాగరికులు సహితము ఆయనను అనుసరించిరి. వారందరూ కొంతదూరమేగి యుద్ధభూమిని చేరిరి. అచట స్కంధాది వీరులు మయూరేశునితో "సమరమందు సంహరింపబడిన దేవగణములన్నియు మీ కృపచే తిరిగి జీవితులైరి" అని పలికిరి. పురజ్జన్మ నొందిన ఆ దేవగణములను చూచి సర్వులు ఆశ్చర్య చకితులైరి. ఒక యోజనము దూరము ప్రయాణించిన పిదప మయూరేశుడు చక్రపాణి మహారాజును కాంచి, తన దశభుజ రూపమునొంది, ఆయనను ఆలింగనమొనర్చి, తన శుభహస్తమును ఆయన మస్తకముపై యుంచి, ఇట్లనియె "నీవు నా మాటను మన్నించి, నీ పురవాసులతో వెనుకకు నీ నగరమునకు ఏగుము." చక్రపాణి కన్నుల అశ్రువులు జాలువార్చెను. అంత పురవాసులు "స్వామీ! నీవెక్కడికేగెదవో మేము సహితము అచటికి ఏతెంచెదము" అని పలికిరి. మయూరేశుడు తిరిగి వారిననునయించి వెనుకకు పంపెను. వారందరూ మయూరేశునకు నమస్కరించి, ఆయన గుణగణములు పొగుడుచూ గృహముల కేగిరి. చక్రపాణి తన నగరమందు పంచాయతన దేవతలతో ఒక సుందర మందిరమును నిర్మించి, అత్యంత భక్తి భావముతో ఆయనను పూజించెను.

మయూరేశుడు గండకీపురమును వదలి క్షణముతో మయూరేశపురము చేరెను. ఆ నగరము సర్వము రత్న, మణి మాణిక్య, జటితము. మయూరేశుడు తన సభా భవనము చేరి, బ్రహ్మాదులందరినీ తన చుట్టూ పరివేష్టింపజేసి, అందరినీ తేరిపార చూసెను. ఆయన తన తూర్పున రతీసహిత మన్మధుని, "మార్జార" అను లోక ప్రసిద్ధమొందిన సుఖప్రదాయిని అయిన దేవతను చూచెను. దక్షిణమున పార్వతీ పరమేశ్వరులను, భక్తుల కోరికలు ఈడేర్చు "విరజాదేవిని" కాంచెను. పశ్చిమమున వారాహి సహిత వరాహుని, మరియు సర్వ విఘ్నహారిణి అయిన "శుభంకరీదేవి"ని గమనించెను. ఉత్తరమున లక్ష్మీ నారాయణులను, మరియు సర్వముక్తి ప్రదాత అయిన "ముక్త" అను విఖ్యాత దేవిని గుర్తించెను. ముప్పది మూడు కోట్ల దేవతలు సహితము మయూరేశుని దర్శనార్థము అచటి కేతెంచిరి. భాద్రపద మాస, శుక్ల పక్ష పాడ్యమినాడు గజాననునకు పూజన మొనర్చి, తూర్పు దిశన యున్న "మార్జరీ దేవి"ని పూజించి, బ్రాహ్మణులకు దానమొసంగి, గజానన స్మరణ కావించుచూ మౌనియై, పాదములు భూమిపై నెమ్మదిగ వేయుచూ, ఏ విధమయిన క్రిమి, కీటకములకు ఆపద కలిగింపకుండ శుచియై, సాయంకాలము తిరిగి స్నానమాచరించి గజానన పూజన మొనర్పవలెను. ద్వితీయ తిథినాడు ఇవే నియమములు పాటించుచూ దక్షిణ దశన "విరజాదేవి" పూజన మొనర్పవలెను. తృతీయనాడు ఇదే విధముగ కావించుచూ పశ్చిమమన గల "ఆశ్రయ" అను దేవిని పూజింపవలెను. చతుర్ధి నాడు ఉత్తరదిశన "ముక్తాదేవి"ని పూజించి, మయూరేశునకు మహోత్సవము సలిపి, రాత్రి జాగరణ ఒనర్పవలెను. ఈ విధముగ భక్తి పూర్వకముగ ఉపవాస మొనర్చి, ఈ నలుగురు దేవీ మూర్తులను క్రమముగ పూజించి, మయూరేశుని కొలిచిన భక్తులకు సర్వ మనోకామనలు పూర్ణమగును. ఒకవేళ సమర్ధత యున్న ఎడల చతుర్ధినాడు నాలుగు ద్వారములందలి దేవతా మూర్తులను మయూరేశుని సహితమై పూజింపవచ్చును. ఈ దేవీ పూజలతో పాటు ఎవరు ఆ పూజ యొక్క ఆద్యంతముల యందు స్నానమాచరించి మయూరేశుని కొలిచెదరో వారికి గజాననుడు తక్షణ ఫలితము నొసంగును. భాద్రపద శుక్ల పాడ్యమి నుండి బ్రహ్మచర్య వ్రతము పాటించి, చతుర్ధి నాటి ఉదయము సంధ్యాది నిత్యకర్మలు పూర్ణమొనర్చి, మయూరేశుని పూజ

సలిపి, ఆయనకు ఇరువది ప్రదక్షిణలు, ఇరువది ఒక్క నమస్కారములు చేసి, పూర్వ ద్వారమందు మార్జరీదేవికి, దక్షిణద్వారమందు విరజకు, పశ్చిమమున ఆశ్రయకు, ఉత్తరమున ముక్తాదేవికి నమస్కరింపవలెను. తదుపరి మయూరేశుని షోడశోపచారములతో పూజింపవలెను. రాత్రి భజన, కీర్తనాదులతో జాగరణమొనర్చి, మరునాడు ఉదయముననే నిర్మల జలములతో స్నానమొనర్చి, పున:మయూరేశ పూజన మొనర్పవలెను. తదుపరి బ్రాహ్మణులకు భోజనమొసంగి, తాను సహితము పారణ మొనర్పవలెను. పిదప బ్రాహ్మణులకు సువర్ణ దక్షిణ, వస్త్ర, ధాన్య, గోవులు మొదలగు వాటిని దానమీయవలెను. ఏ మానవుడు ఈ విధముగ పూజన మాచరించునో, వానికి అసాధ్యము సహితము సుసాధ్యమగును. ఆ మానువుడు పుత్ర, పౌత్రాదులతో సంసార భోగములనుభవించి అంతమున స్వర్గమున కేగును. ఇంద్రాది లోకపాలురు సహితము ఇటువంటి మనుష్యుని పూజింతురు. అష్ఠ నాయికలు ఆతని చరణ కమలములను శిరమున దాల్చెదరు. ఈ విధముగ పూజ కావించిన ఎడల అంధులకు దృష్టి, మూగివారికి మాట, బధిరులకు వినికిడి శక్తి, కుంటివారికి చలనశక్తి, పత్నీ, విద్యాతురులకు వారివారి ఇష్ఠ కామ్యములు ప్రాప్తించును. ఇదే ఫలము నాలుగు ద్వారములందు ఉపవాసము చేసిననూ లభించును.

ఒకనాడు మయూరేశుడు త్రిమూర్తులను, దేవతా ప్రముఖులను కూర్చుండబెట్టి మృదు వచనములతో ఇట్లనియె "దేవతలారా! నేనవతరించిన కార్యము పరిసమాప్తి నొందినది. అనేకమంది దైత్యులను సంహరించితిని. పృధివీ భారము నణచితిని. దేవతలను కారాగార విముక్తుల కావించితిని. ఇపుడు పుడమి అంతటా తిరిగి స్వాహా, స్వధా, వషట్కారములు వెల్లివిరియుచున్నవి. ఇకనేను నా నిజ ధామమునకు ఏగెదను. మీరు అనుజ్ఞ నీయవలసినది." అంత దేవతలందరూ హతాశులై, అశ్రుపూర్ణులై "స్వామీ! మమ్ము వదలి నీవు ఎచటి కేగెదవు? మా స్నేహము త్యజించు నిష్ఠురత నీకేల?" అని పలికిరి. పార్వతీదేవి హతాశురాలై మూర్ఛతో భూమిపై పడెను. ఒక మూహూర్తానంతరము సచేతనయై ఇట్లనియె "ఓ! దయాసింధూ! నీవు సింధు దైత్యుని హతమార్చితివి. నిజమే! ఓ! జగన్నాధా! నీ జననిని విడిచి వెళ్ళుట న్యాయమా? నీవు వెడలిన పిమ్మట నా ప్రాణములుండవు." అంత మయూరేశుడు "తల్లీ! తిరిగి ద్వాపర యుగమందు నీ పుత్ర రూపమున ఉత్పన్నమగుదును. నా మాట సత్యము. నీవు చింతింపవలదు. నీ విరహముచే నాకు సహితము దు:ఖము కలుగుచున్నది. మాతా! స్నేహము, ప్రేమ యున్న జనులందరికీ ఒక చోట యుండుట సంభవము కాదు. భవిష్యత్ నందు "సింధూరుడు" అను దారుణ దైత్యుడుత్పన్నమగును. ఆతడు సర్వ దేవతలకు అవధ్యుడగును. అపుడు నేను మీకు పుత్రునిగ అవతరించెదను. ఓ! శివప్రియా! నీవెప్పుడైననూ కేవలము స్మరించినంత మాత్రమున నేను నీ చెంత కేతెంచెదను" అని పలికెను.

అంత కార్తికేయుడు "స్వామీ! నీ వెక్కడికేగిననూ నన్ను సహితము గొనిపొమ్ము. బాలుడను, దీనుడను అయిన నాపై ఉదాసీనత ఉచితము కాదు." మయూరేశుడు "సోదరా! నీవు విచారింపవలదు. నేను తిరిగి వచ్చెదను. సర్వాంతర్యామినైన నేను నీకు ఎప్పటికీ దూరము కాను" అని పలికి తన మయూర వాహనమును కార్తికేయునకు ప్రసాదించి ఆతనికి "మయూరధ్వజుడు" అని నామకరణ మొనర్చెను. మరుక్షణము మయూరేశుడు అంతర్ధానమొందెను. ఆయన బాహ్యముగ అంతర్ధానము పొందినప్పటికీ భ్రహ్మాది దేవతా ప్రముఖులందరూ ఆయనను తమ హృదయమందు కాంచిరి. అంత భ్రహ్మ మెత్తని ఇసుకతో మయూరేశుని మూర్తి కావించి, దానిని వస్త్ర భూషణములతో అలంకరించి దానిచుట్టూ సుందర ప్రసాదము నమర్చి యధావిధిగా షోడశోపచార పూజన మొనర్చెను. వశిష్ఠాది మునులు భ్రహ్మకమండల నది యందు స్నానాదులు కావించి, సంధ్యవార్చి, ఆ సుందర మయూరేశమూర్తిని దర్శించిరి. మునులు ఆ మూర్తికి నాలుగు ప్రక్కలా నాలుగు ద్వారములు అమర్చి, ప్రదక్షిణ మాచరించిరి. సర్వులు భక్తుల కోర్కెలు పూర్ణమొనరించు ఇటువంటి క్షేత్రము వేరొకటి యుండదని కొనియాడిరి. తదుపరి మునులు తమ ఆశ్రమములకు చనిరి. దేవతలందరూ ఎవరి స్థానములకు వారు వెడలిరి." భ్రహ్మ "వ్యాసా! నీకు మయూరేశుని అవతార గాధలను వినిపించితిని. ఈ మయూరేశ

చరిత్ర శ్రవణము ధన, పుత్ర, విద్య, ఆయు:ప్రదమై సర్వ మనోకామనలను పూర్ణమొనర్చును. అంతేకాక ఇయ్యది పుణ్యప్రదము, దు:ఖనివారకము, ఆదివ్యాధి హరణము; కుష్ఠు మొదలగు దుష్ఠ రోగములు సహితము నయమగును. ఈ శుభ చరితమును చదివినచో మనుష్యులకు భోగ మోక్షములు, విజయము, సందప (శ్రీ), పుష్ఠి ప్రసాదించును. నీవడిగిన విషయములన్నియు నీకు విస్తారముగ వివరించితివి. ఇంకనూ ఏమి వినదలచుకుంటివి?"

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మయూరేశ అవతార పరిసమాప్తి అనెడు నూట ఇరవై ఐదవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువది ఆరవ అధ్యాయము

(సింధూర దైత్య జననము)

వ్యాసుడు "బ్రహ్మదేవా! మీరు మయూరేశుని చరితమను తెలిపిరి. మానవులకు అమృతపానముచే తృప్తి కలుగవచ్చు; కానీ నాకు భగవత్కథా శ్రవణమందు తృప్తి కలుగుట లేదు. ఇంకనూ వినవలెనన్న కోరిక ఇనుమడించు చున్నది. మీరు త్రేతాయుగమందలి అవతారము గూర్చి తెలిపిరి. ద్వాపరమందు ఆయనకు "గజాననుడు" అను నామము ఎట్లు కలిగెను? ఆయనకు మూషికము వాహనము ఎట్లయ్యెను? దయచేసి నా సంశయములు దూరమొనర్పవలసినది." బ్రహ్మ "వత్సా! నీవడిగిన ప్రశ్న నాకు మహదానందము కలిగించుచున్నది. ఎందుకనగా భగవత్కథల యందు వక్త, శ్రోత, ప్రశ్నించువారలు అందరూ సిద్ధి నొందెదరు. ద్వాపరమందు గజాననుడు రక్తవర్ణుడు, చతుర్భుజుడు, గజముఖుడు, మూషిక వాహనుడు. ఆయన చరిత్ర నీ కెరింగించెదను."

ఒకానొకనాడు పరమేశ్వరుడు బ్రహ్మలోకమునకేగెను. ఆ సమయమున చతుర్ముఖ బ్రహ్మ నిదురించుచుండెను. శివుడు బ్రహ్మను నిద్రలేపెను. ఆయన లేచి, నిద్రాభంగమగుటచే కించిత్ క్రోధితుడై ఒక పెద్ద ఆవులింత ఆవులించెను. తక్షణము ఆయన నోటి నుండి ఒక భయంకర పురుషుడు ఆవిర్భవించి, ఒక భయంకరారావము కావించెను. తత్ఫలితముగ సప్తదీప వసుంధర కంపితయై, దిక్పాలురు చకితులై, శేషుడు క్షుబ్ధుడై, పర్వతములు చూర్ణములై పాణులు వ్యాకులత నొందెను. ఆ పురుషుడు నిలబడిన ఆతని శిరము అంబరము నంటుచుండెను. ఆతని శరీర సుంగంధ సౌరభము త్రిలోకముల యందు వ్యాప్తి చెందుచున్నది. ఆతడు జపాకుసుమ వర్ణ శరీరుడై, సర్వ దిశలను అరుణిమతో ప్రకాశించుచుండెను. కామదేవుని మించిన సౌందర్యఖని అయిన ఆ పురుషుని గని, బ్రహ్మ ఆశ్చర్యచకితుడై "నాయనా! నీవెవరు? ఎక్కడ నుండి ఏతెంచితివి? ఏమి చేయదలచితివి?" అని ప్రశ్నించెను. అంత ఆ పురుషుడు "ఓ! దేవేశా! నీవు అనేక బ్రహ్మాండములు సృష్ఠించు విధాతవు. సర్వజ్ఞుడవు. కానీ భ్రమితుడవై నన్ను ప్రశ్నించుచున్నావు. నేను నీ ఆవులింత నుండి ఉత్పన్నమయితిని. నీ పుత్రుడనైన నాపై అనుగ్రహము చూపి, నాకు నామకరణమొనర్చి, నాకు నివాసస్థానము, భోజ్య వస్తువులు తెలుపవలసినది." అంత విరించి "నీవు రక్తవర్ణ శరీరుడవగుటచే నీ నామము "సిందూరుడు". నీవు త్రిలోకములను వశపరుచుకొను సమర్ధత కలిగియుందువు. నీవు క్రోధముతో ఎవరిని ఆలింగన మొనర్చిననూ వారు వందలాది ముక్కలగుదురు. నీవు పంచ భూతముల వలన, దేవ దానవ, యక్ష, రాక్షస, నాగ, గంధర్వ, కింపురుషాదులు, ఇంద్రాది లోకపాలుర వలన భయము యుండదు. అనగా వారు నిన్నేమీ చేయలేరు. సజీవ, నిర్జీవ వస్తువులు నిన్ను పరిమార్చలేవు. నీకు త్రిలోకముల యందు ఇష్ఠమయిన ప్రదేశమున నివసింపుము."

బ్రహ్మ యొక్క పలుకులచే ప్రసన్నుడై సిందూరుడు ఒక భీషణ గర్జన కావించిన బ్రహ్మతో ఇట్లనియె "ఓ!

బ్రహ్మాండనాయకా! నీ వచనామృతము నన్ను ప్రసన్నుని కావించినది. నీ త్రిగుణములచే సృష్టి స్థిత్యంతములు కావించుచుంటివి. నీవు నిద్రించిన అయ్యది జగత్తుకు ప్రళయము. తపో, దాన, వ్రతాదులు ఆచరింపకున్ననూ, నీవు నా ఎడల పుత్ర వాత్సల్యము చూపుట నా మహద్భాగ్యము. సాధారణముగ కోటి కల్పములు తపస్సుచే సహితము లభ్యము కాని నీ దర్శనము నాకు సాధారణముగ జరిగినది. నీకు కోటి కోటి నమస్కారములు." ఈ విధముగ స్తుతించి, సిందూరుడు బ్రహ్మకు ప్రదక్షిణ మాచరించి, తన నివాస స్థానమును వెదకుచూ బయలుదేరెను. కొంచెము దూరము పోయిన పిదప ఆతనికి ఒక అనుమానము ఉదయించెను–"నేనేమీ జపతపాదులు చేయలేదుకదా! ఈ బ్రహ్మ ఈ వరములన్నింటినీ ఎట్లు నాకిచ్చెను? ఈ వరములు సత్యములేనా? లేక వృధానా? నేను బ్రహ్మ వద్దనే ఈ విషయము తేల్చుకొందును" అని తలచి తిరిగి చతుర్ముఖుని వద్ద కేతెంచి, భయంకరముగ గర్జించి, ఆయనను ఆలింగన మొనర్చుటకై యత్నించెను. అంత బ్రహ్మ "నేను పుత్ర స్నేహ వశమున అత్యంత దుర్లభమయిన వరములు నీకిచ్చితిని. నీవు దుర్భావన నొంది నాకే అపకారము తలపెట్టితివి. సర్పమునకు సమర్పించిన పాలు సహితము విషమే అగును. నీవు దుష్ట భావమును పొందితివి కావున నీవు దైత్యుడవగుదువు. పరమాత్మ అయిన గజాననుడు శీఘ్రముగ అవతారము స్వీకరించి నిన్ను వధించును. నీ శరీరము సుగంధభరితము కావున ఆ పరమాత్మ నీ శరీరముచే మర్దనము చేయించుకొనును. తత్ఫలితముగ ఆయన శరీరము అరుణిమను సంతరించుకొనును. అందువలన ఆయన "సిందూరలేపనుడు" అని పిలువబడును." ఈ విధముగ పలికి బ్రహ్మ భయభీతుడై మనోవేగమున పరుగిడుట ప్రారంభించెను. సిందూరుడు ఆయన వెనుక పరుగెత్తెను. బ్రహ్మ ఈ విధముగ పరుగెత్తుచూ వైకుంఠము చేరెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సిందూర దైత్య జననమను నూట ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువది ఏడవ అధ్యాయము

(శివ, సిందూర కదనము)

వైకుంఠమునకేగి బ్రహ్మ అచట పద్మాసనమందు విరాజమానుడై యున్న విష్ణుభగవానుని చూచెను. విష్ణువు సహితము ఎదురుగా వివర్ణముఖుడై యున్న విరించిని కాంచి, ఆయన చేయిపట్టి, ఆలింగనమొనర్చి, ఒక సుందరాసనమునందు ఆశీనుని గావించి, పూజించి ఇట్లడిగెను "విధాతా! నేడు మీ ముఖము ఏల మ్లానమయ్యెను? ఈ కంపనమేల? మీరేతెంచిన కార్యమేమి? తెలుపవలసినది." అంత చతుర్ముఖుడు సిందూరుని జన్మ వృత్తాంతమును, తాను పుత్ర స్నేహవశమున ఆతని కిచ్చిన వరములు తెలిపి, ఆ దైత్యుడు తనను ఆలింగనము ఒనర్చుటకు వచ్చుచున్నాడని తెలిపి "ఓ! సర్వ దేవేశ్వరా! మిమ్ములను కాక నేను ఎవరిని శరణుజొచ్చును?" అని పలికి మౌనము వహించెను. అంత మధుసూదనుడు "విరించీ! తొలుత బుద్ధి పూర్వకముగ వరములిచ్చి, ఇపుడు సంకటమున పడుట ఏల? జరుగనున్నది జరుగక మానదు" అని పలికెను. ఇంతలో వారి వద్దకు సిందూరుడేతెంచి గర్జన కావించెను. అంత విష్ణువు మృదుస్వరముతో "ఓ! సిందూరా! నేను సత్వగుణ యుక్తుడను. విశ్వపాలనము నా విధి. నీవు బ్రహ్మచే వరములు పొందిన మహనీయుడవు. నీతో యుద్ధము కావించు సాహసము నాకు లేదు. ఈ బ్రహ్మ బ్రాహ్మణుడు. అందువలన నీవు ఈయనతో యుద్ధ మొనర్పరాదు. నీతో సమరమొనర్పగల సమర్థత కేవలము కపాలికి మాత్రము కలదు. ఆయన కాముని భస్మమొనర్చి లోకవిఖ్యాతుడయ్యెను. నీవు ఆయనతో సంగర మొనర్చిన ఎడల నీవు త్రిలోక విఖ్యాతుడవగుదువు"

అని పలికెను. అంత సిందూరుడు సంతసిల్లి లోకములను కంపింపజేయుచూ, పర్వతములను చూర్ణమొనరించుచూ, వృక్షముల పడగొట్టుచూ, శీఘ్రముగ ఎగిరి కైలాసమున కేగెను. అచట పరమేశ్వరుడు ధ్యానమగ్నుడై యుండెను. నంది, భృంగి, త్రిలోకజనని అయిన పార్వతి ఆయనకు సేవ లొనరించుచుండిరి. ఆయన చంద్రశేఖరుడై, వ్యాఘ్ర, గజ చర్మాంబరధారియై, యుండెను. ఆ పరమేశ్వరుని కాంచి సిందూరుడు నిందించుచూ "ఈ తపస్వితో యుద్ధము నాకేల? ఈతని సుందర పత్నిని తీసికొని నేను వెళ్ళుదను" అని నిశ్చయించి పార్వతీ దేవి వద్ద కేతెంచెను. ఆ తల్లి భయకంపితయై మూర్ఛితురాలైయ్యెను. ఆ దుష్టుడు ఆమె కేశపాశములు పట్టి అక్కడ నుండి వేగముగ ఎగురుచూ వెళ్ళసాగెను.

ఆ సమయమున పార్వతి రావణునిచే పట్టబడిన సీతామాత వలె శోకించుచూ "అఖిలార్థ జ్ఞాత అయిన దేవదేవునికి నా యందు ఈ ఉదాసీనత ఏల? స్వామీ! నీ అర్ధాంగిని హరించు సమయమున నీవు ధ్యాననిష్ఠుడ వెట్లగుచున్నావు? నేను మీ సేవ యందు అలసత్వము ప్రకటింపలేదు కదా! నాకు ప్రాణదానమొసగి నన్ను ఎవరు రక్షించెదరు? నాకు శివ దర్శనము తిరిగి ఎపుడు జరుగును?" అని విలపించుచుండెను. శివగణములు "శివుడు ధ్యాననిష్ఠుడై యుండెను. కాలము అనుకూలించుటచే ఈ దుష్టుడు త్రిలోకజనని, సర్వ విశ్వమును మోహగ్రస్త మొనరించునది, సర్వదుఃఖ నివారిణీ, లావణ్యలహరి అయిన పార్వతీ మాతను చెరబట్టెను. తిరిగి ఈమె ఎట్టు వెనుకకు ఏతెంచెను?" అని హాహాకారములు ఒనర్చుచుండిరి. అద్దానిచే ధ్యానభంగమై శివుడు కనులు తెరచి, క్రోధితుడై "మిమ్ములనందరినీ కష్టపరచు ఏ సంకట మేతెంచినది? అద్దానిని భస్మమొనరింతును" అని పలికెను. అంత వారందరూ ఆయనకు నమస్కరించి జరిగిన విషయము వివరించిరి. తక్షణము శివుడు వృషభవాహనుడై, కన్నుల విస్ఫులింగములు విరజిమ్ముచూ, దశభుజుడై, వివిధాయుధపాణియై, దశదిశలను ప్రతిధ్వనింపజేయుచూ, ఆకాశమార్గమున దైత్యుడుయున్న స్థలమునకు క్షణములో వెడలి, ఆ దైత్యుని వీపుపై ప్రహరించి, ఆతని ఎదుట నిలచి "ఓరీ! దుష్టుడా! నా పత్నిని వీడుము" అని పలికెను. కాని దైత్యుడు మోహితుడై, స్వబల గర్వితుడై "నేను సర్వలోకములకు ప్రభువును. నీ వంటి మశకములకు నేను భయపడను. నా నిశ్వాసముచే పర్వతములు కంపించును. నీవు నాతో ఏ విషయమునందూ పోలవు. నీకు నాతో యుద్ధమొనరింప వలెనన్న కోరిక యున్న ఎడల సమరమునకు సిద్ధముకమ్ము. లేని ఎడల నీ ముఖము నాకు చూపింపవలదు. నీవు పోయి వేరొక స్త్రీని వివాహమాడుము." అంత వారిరువురు మల్లయుద్ధమొనర్ప మొదలిడిరి.

అంత పర్వతరాజపుత్రి భయభీతయై మయూరేశుని స్మరించెను. తక్షణము మయూరేశుడు ఒక బ్రాహ్మరూపము ధరించి వారిరువురి నడుమ ప్రత్యక్షమయ్యెను. ఆ ద్విజుడు కోటిసూర్య ప్రకాశుడై, సర్వాంగ సుందరుడై, దివ్యాభరణభూషితుడై యుండెను. ఆయన తన పరశువును వారిరువురి నడుమ యుంచి, మధుర స్వరముతో సిందూరునితో ఇట్లనియె "ఈ త్రిలోక జనని అయిన పార్వతిని నా వద్ద యుంచి మీరిరువురు సంగరమొనర్ప వలసినది. ఎవరు మీరిరువురిలో విజేతలగుదురో వారు పార్వతి స్వీకరింపవచ్చు." ద్విజుని పలుకులు విని యుద్ధలాలసుడయిన దైత్యుడు ఆ తల్లిని ద్విజుని వద్ద యుంచి తాను యుద్ధ సన్నద్ధుడయ్యెను. ఇరువురు సమ బలాఢ్యులు, యుద్ధ విశారదులు, అగుటచే మదించిన పంచాస్యములవలె యుద్ధమొనర్చు చుండిరి. ఆ సమయమున దైత్యుడు శివుని తన భుజములతో చుట్టివేయుటకు ప్రయత్నింపగా, మయూరేశుడు అదృశ్యముగ తన పరశువును ప్రయోగించి ఆసురుని వక్షమందు ప్రగాఢ ఘాతమొనర్చెను. ఆ సమయమున శివుడు తన శూలముచే ఆ దైత్యుని ప్రహరించెను. అంత దైత్యుని శక్తి క్షీణించెను. అంత బ్రాహ్మణుడు ఈ విధముగ దైత్యునికి హితోపదేశమొనర్చెను. "నీవు త్రిలోకనాథుడైన శివునితో సమరమొనర్చుటకు సమర్థుడవు కాదు. నీవు ఈ పార్వతి విడచి నీ గృహమున కేగుము. లేని ఎడల శివుడు నిన్ను భస్మమొనరించును. అంత దైత్యుడు పార్వతిపై ఆశవీడి భూలోకమున కేగెను.

శివుడు విజయమందిన పిదప పార్వతి ద్విజునితో "ఓ! మునిశ్రేష్ఠా! నన్ను ఈ దుష్టదైత్యుని బారినుండి విముక్తి

ఒనరించిన నీవెవరు? నీ రూపము వాస్తవము కాదు. నాకు దయచేసి నీ స్వాభావిక రూపము చూపవలసినది. నీవు నాకు ప్రాణదానము కావించితివి. కావున నీవు నాకు ప్రాణ సఖుడవు. ఓ! ద్విజోత్తమా! నేను నా ప్రాణత్యాగ మొనరించినప్పటికీ నీ ఋణము తీర్చుకొనలేను" అని పలికెను. అంత ద్విజుడు ఓ! మాతా! నేను కేవలము నిమిత్తమాత్రుడను. శివుడే ఆ దైత్యుని పరాజితుని కావించి నిన్ను విముక్తను చేసెను" అని పలికి తన స్వస్వరూపమును వ్యక్తపరచెను. ఆయన దశభుజుడై, కండలాలంకృతాంగుడై, లలాటమందు కస్తూరీ తిలకము ధరించి, రత్న, ముత్య, స్వర్ణ, మాలాధారియై, నానా భూషణ భూషితుడై, కంఠమందు శేషనాగుని ధరించి యుండెను. ఈ విధముగ ఆ శ్రీగణేశ పరమాత్మను కాంచి పార్వతి అత్యంత ఆనందము నొంది ఆయన పాదములపై బడెను. ఆ భగవానుడు ఆమెను లేవనెత్తి "త్రేతాయుగమందు నీకు నేను మరల దర్శనమిచ్చెదనని వాగ్దాన మొనర్చితిని. ఈ ద్వాపరమందు తిరిగి మీ ఇంట జన్మించి, "గజానన" నామముతో విఖ్యాతినొంది, నా పరాక్రమము చే ఈ సిందూర దైత్యుని సంహరించెదను' అని పలికి అంతర్ధానుడయ్యెను. అంత పార్వతి శోకాకులయై మూర్ఛనొందెను. ఆమె సచేతనమయిన పిదప విశ్వనాథుడు ఆమెతో ఇట్లనియె "ఓ! ప్రియా! నీ హృదయమును స్వస్థత యొనర్చి అద్దానియందు ఆ వినాయకుని దర్శింపుము. ఆయన పలుకులు అసత్యములు కాదు. ఆయన చెప్పినది తప్పక చేసి తీరును." తదుపరి శివుడు పార్వతీ సహితుడై, వృషభారూఢుడై, ప్రసన్నుడై, కైలాసమున కేగెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శివసిందూర కదనము అను నూట ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువది ఎనిమిదవ అధ్యాయము

(పార్వతీ గర్భధారణ)

బ్రహ్మ "మర్త్యలోకము చేరిన దనుజుడు అచట గల రాజులందరినీ జయించెను. బ్రహ్మాదులు ఆతని ముందు నిలువలేరనిన ఇక మర్త్యుల మాట చెప్పనేల? కొందరు రాజులను తన కరవాలముచే ఖండించెను. కొందరిని ఆకాశము లోనికి విసరెను. కొందరు ఆతనితో కదన మొనర్చి స్వర్గస్థులైరి. కొందరు పదభ్రష్టులగుటచే అభిమాన వశమున వనముల కేగిరి. కొందరు రాజులు ఆతనిని శరణమొంది సేవకులైరి. తదుపరి ఆ దుష్టుడు మునుల నాక్రమించి కారాగార వాసుల కావించెను. కొందరు మునులు దేహత్యాగ మొనరించి స్వర్గవాసులైరి. కొందరు మేరు పర్వత కంథరములు చేరి నిశ్చితులైరి. కొందరు మునులను ఆ దురాత్ముడు హతమార్చి, మిగిలిన వారిని హింసించెను. దేవ మందిరములను, ప్రాసాదములను భగ్నము చేసి, దేవీ దేవతా మూర్తులను ధ్వంసమొనర్చెను. వైదిక ధర్మములన్నియు లుప్తమయ్యెను. స్వాహా, స్వధా, వషట్కారములు కరువయ్యెను. అంత పర్వత కంథరములందున్న దేవ, ముని ముఖ్యులు మంత్రాంగము కొరకై బృహస్పతిని పిలచి తమకు సిందూర దైత్యభయము తీరు మార్గమును బోధింపమని ప్రాధేయపడిరి. బృహస్పతి "దేవ, ముని, ప్రముఖులారా! మీరు పరాత్పరుడయిన వినాయక ప్రభువును పూజింపవలసినది. ఆయన ఈ యుగమందు పార్వతీ గర్భమున జన్మించి సిందూరుని హతమొనర్చును. ఆపుడు జగత్తు సర్వము నిష్కంటకమగును. ఇందు సందేహము లేదు." అంత వారందరూ కలసి వినాయక స్తుతి యొనర్చిరి.

ఎవరు జగత్కారణుడో, ఎవరి నుండి సూర్యాది గ్రహ నక్షత్రములు ఆవిర్భవించినవో, ఎవరి నుండి సిద్ధ సాధ్య గణములు, గంధర్వ, కిన్నెర, యక్ష, రాక్షస, మానవ, నాగ, దేవ, పన్నగాది చరాచర విశ్వము ఆవిర్భవించినదో ఆ

వినాయకునికి నమస్కారము. ఎవరి నుండి త్రిమూర్తులు, మహర్షి గణము, త్రిగుణములు ఆవిర్భవించినవో, అట్టి వినాయకునకు నమస్కారము. ఎవరు సర్వాంతర్యామియో, ఎవరు వివిధ అవతారములు స్వీకరించునో, ఎవరిని స్తుతించుట శేషునకు సహితము అశక్యమో, ఆ గణపతిని భజించెదము. ఈ విశ్వ సంహారకుడయిన సిందూరుని ఎవరు సృష్టించిరి? స్వామీ! నీవు యుండగనే ఈ దురాత్ముడు త్రిలోకములను సంతప్తుల నొనర్చుచున్నాడు. మేము ఎవరిని శరణు పొందగలము? నీవు దయచేసి శివుని గృహమందు అవతరించి ఈ దుష్టుని నిర్మూలింపుము." ఈ విధముగ పలికి వివిధ అనుష్ఠానములందు నిరతులై, వారందరూ తీవ్ర తపమాచరించుట మొదలిడిరి. వారందరూ మితాహారులై, వాయుభక్షణ మాచరించుచూ ప్రాణాయామ పరాయణులైరి. కొందరు ఏకపాదులై, కొందరు జలమగ్నులై, కొందరు ఊర్ధ్వబాహులై, కొందరు యోగాసన స్థిరులై, మరికొందరు తమ శరీరములు కోసుకొని, మరికొందరు తమ శిరములను ఖండించుకొని, తపమొనర్చుచుండిరి. ఈ విధముగ తప మాచరించుచున్న దేవ, ముని గణముల వద్దకు ఒకానొకనాడు కోటిసూర్య ప్రకాశుడై, ప్రళయాగ్ని స్వరూపుడై వినాయకుడేతెంచెను. అంత వారందరూ "మనము ధ్యానమందు అవలోకించిన పరాత్పరుడు మన ఎదుట ప్రత్యక్షమయ్యెను. ఈ మహాత్ముడు మన దు:ఖములను దూరమొనర్చును. ఇందు సందియము లేదు" అని పలికిరి. అత్యంత చింతా గ్రస్తులయిన దేవతాదులతో శ్రీగణేశుడు ఇట్లనియె "ఓ! దేవతలారా! నేను తప్పక సిందూరుని సంహరించెదను. మీరు కావించిన ఈ స్తోత్రము "దు:ఖ ప్రశమన స్తోత్రము" అనుపేర విఖ్యాతి నొందును. ఈ స్తోత్ర పఠనము వలన నా అనుగ్రహము చే దు:ఖములు దూరమగును. ఈ స్తోత్రమును ప్రతిదినము ఒకటి, రెండు లేక మూడుసార్లు పఠించిన ఎడల వారికి త్రివిధ (ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆది భౌతిక) తాపములు యుండవు. నేను శివుని గృహమున అవతారము స్వీకరించి, సర్వార్థ సిద్ధి కారకమైన "గజానన" నామముతో విఖ్యాతుడనై, వివిధములుగ పార్వతీదేవికి సేవయొనర్చి ఈ సిందూరాది దైత్యులను హతమార్చెదను" అని పలికి అంతర్థానుడయ్యెను.

అంత కొద్దికాలమునకు పార్వతి గర్భవతి అయ్యెను ఆమె గర్భము శుక్లపక్ష చంద్రునివలె వృద్ధి నొందెను. ఆ గర్భ తాపముచే పార్వతి శివుని తనను ఏదేని శీతల ప్రదేశమునకు కొని పొమ్మని అభ్యర్థించెను. అంత శివుడు ఆమెను వృషభారుఢను గావించి వివిధ ప్రదేశములకు కొనిపోయెను. వారు వివిధ వనములందు విహరించిరి. చివరికి వారు "పర్యళీ" అను వనము చేరిరి. ఆ వనము అనేక పుష్ప, ఫల, వృక్ష, పరివేష్ఠితమై, అనేక వాపీకూప, తటాకములతో నిండినదై, స్వచ్ఛ జలములు గల సరోవరయుక్తమై, అత్యంత శీతలయుక్తమై ఒప్పారెను. ఆ వనము స్వర్గమందలి నందనవనము, కుబేరుని చైత్రరథ వనము కంటె పార్వతికి మనోహర మనిపించి, తన ప్రాణేశ్వరుని కెరింగించెను. గణములు పార్వతీ ప్రసన్నతకై అచట అనేక భవనములు నిర్మించిరి. అనుక్షణము ఆమె కనుసన్నలలో మెలగుచూ వారు ఆమెను సంతోషపరుచ సాగిరి. అంత శివుడు పార్వతితో "నీవు ఇచట యుండవలసినది. గణములు నీకేది కావలియునన్ననూ దానిని సమకూర్చెదరు" అని పలికి తాను హిమాలయమునకేగి ధ్యానమగ్నుడయ్యెను. పార్వతీదేవి తన చెలులతో కలసి సుఖముగ యుండెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పార్వతీ గర్భధారణ యను నూట ఇరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నూట ఇరువది తొమ్మిదవ అధ్యాయము

(గజానన జననము)

బ్రహ్మ "నవ మాసములు పూర్ణమయిన పిదప పార్వతి ఒక సుందరమయిన బాలునకు జన్మనిచ్చెను. ఆ బాలుడు పుట్టుచునే పూర్ణచంద్ర వదనుడై, కమలదళ నేత్రుడై, ముకుట కుండల కేయూరధారియై, స్వర్ణఖచిత ముత్యమాలాలంకృతుడై, పగడముల వంటి పెదవులు, చేతులకు కంకణములు, నాలుగు హస్తములందు పరశువు, కమలము, మాల, మోదకము ధరించి, చరణ కమలములందు ధ్వజాంకుశ పద్మ చిహ్నములతో, శుశోభితుడై యుండెను. లలాటమందు చంద్రవంక కలిగి కోటి చంద్రుల కాంతితో ప్రకాశించుచుండెను. ఆ రూపము గాంచి పార్వతి అత్యంత హర్షయుక్తమై "స్వామీ! నీ తేజస్సును చూడలేక నా నేత్రములు నిమీలితము లగుచున్నవి. నీవెవరు? దయచేసి తెలిపి నాకు హృదయానందమును కలుగజేయుము." ఈ విధముగ పలికి పార్వతి తనకు పూర్వకాలమున మయూరేశుడు ఒసంగిన వరమును సంస్మరించి, నమస్కరించెను. అంత ఆ బాలరూపుడు "మాతా! భయము వలదు. నేను అనేక బ్రహ్మాండముల నిర్మాతనైన శ్రీగణేశుడను. నా అవతారములను దేవతలు సహితము లెక్కింపజాలరు. నేను ఇచ్ఛానుసారము త్రిమూర్తుల స్వరూపమును ధరించి యథేచ్ఛగా సృష్టి స్థిత్యంతములు కావింతును. పూర్వకాలమున త్రేతాయుగమందు మీ ఇంట అవతారము స్వీకరించి సింధు దైత్యుని సంహరించితిని. ద్వాపరమున తిరిగి నీ ఇంట అవతరించి, నీ సేవ చేయుదునని నీకు వరమొసంగితిని. ఓ! సువాసినీ! ద్విజ రూపమున ఏతెంచి, నిన్ను సిందూరుని నుండి విడిపించినది నేనే! నీ వరమును సత్యమొనరించుటకై ఇపుడు నీ ఇంట జన్మించితిని. మాతా! నేను సిందూరుని సంహరించి, భూభార హరణమొనర్చి, నీకు సేవ చేయుదును." అని పలికెను.

అంత పార్వతి విఘ్ననాశకుడయిన దేవేశుడు గజాననునకు నమస్కరించి ఇట్లు స్తుతించెను "నిర్వికల్ప, చిదానందఘన బ్రహ్మ స్వరూపా! భక్తప్రియా, నిరాకారా! నీవు సత్వరజస్తమోగుణముల న్యూనాధిక్యత యొక్క భేదానుసారము సాకారుడనై అనేక అవతారములు గ్రహించి స్థూలము కంటె స్థూలము, సూక్ష్మము కంటె సూక్ష్మరూపుడవై వెలుగొందుచున్నావు. నీకు నమస్కారము. నీవు అవ్యక్తుడవైనప్పటికీ త్రిగుణములచే సాకారుడవై కనిపించెదవు. మాయావీ, మాయాపతీ, సర్వ మాయావేత్తవయిన మహాప్రభో! నీవే సర్వాంతర్యామివి. నిత్యుడవు, సర్వులకు ఆధారభూతుడవు. పరాత్పరా, చతుర్వేదములకు, మనసునకు అగోచరుడవైన నీకు నమస్కారము. నీవు నా పుత్రునిగ జన్మించుట నా మహద్భాగ్యము. నేను నీ జన్మమునకై ప్రతీక్షించుచుంటిని. ఇన్నాళ్ళకు నాకు నీ ప్రత్యక్ష దర్శనమయినది. స్వామీ! నీవు ఇక మనకు వియోగము లేని విధముగ కావింపుము. తల్లి అట్లు పలుకుట తోడనే శిశువు తన రూపును మార్చుకొనెను. ఆ శిశువు చతుర్భుజుడై, చంద్రశేఖరుడు, హృదయమందు చింతామణి, ముఖమునందు తొండము, దివ్య దుకూల భూషణధారి, దివ్య గంధామలేపితుడై, సిద్ధి బుద్ధి యుతుడై కానిపించెను. పార్వతి ఆ బాలుని చూచి "నా గణేశుడేమయ్యెను? ఎవరేని అపహరించిరా? తొండముతో యున్న బాలుని త్రిలోకముల యందు ఎన్నడునూ చూడలేదు. ఈ బాలుని చూచి బ్రహ్మాది దేవతలు అపహాస్యము చేయుదురు" అని రోదించుట ఆరంభించెను. ఈ కోలాహలము విని శివుడు గణసహితుడై అచటి కేతెంచి, తన కుమారుని ఒడిలోనికి తీసికొని పార్వతిని ఇట్లు అనునయించెను "ప్రియా! ఈ తొండము చే యున్న బాలుడు ఆద్యంత రహితుడయిన శ్రీగణేశుడు. ఈయన వర్ణన కావించుట యందు వేదశాస్త్రములు, మునులు అశక్యులైరి. ఈయనే జగత్తుయందు వివిధ కార్యచరణమునకు దేవతల నియోగించును. ఈయన సర్వాంతర్యామి మరియు సర్వ బ్రహ్మాండ రచయిత. చతుర్యుగములందూ ఈయన రూపము వేరువేరుగా యుండును. కృతయుగమందు దశభుజుడయిన వినాయకునిగ,

త్రేతాయుగమునందు షడ్భుజుడయిన మయూరేశునిగ, ద్వాపరమందు రక్తవర్ణుడయిన గజాననునిగ మన ఇంట అవతరించెను. ఈయన సిందూర దైత్యుని సంహరించి, మూషిక వాహనుడై, భూభారహరణ మొనర్చి, గజాననుడను పేర త్రిలోకవిఖ్యాతి నొందును. కలియుగమందు చతుర్భుజుడై, సుందర నయనుడై ధూమ్రకేతు నామమున విఖ్యాతుడగును.”

శివుని పలుకులు విని శిశువు సంతుష్టుడై స్పష్టముగ ఇట్లు పలికెను “ఈశ్వరా! నీవు నా స్వరూపమును గూర్చి సత్యము పలికితివి. నేను సుర, భూసురులను, అనేకమంది రాజులను పీడించుచున్న సిందూరదైత్యుని హతమొనర్చి భూభార హరణమును, మీ ఇరువురి సేవ చేయుటకు ఈ అవతారము స్వీకరించితిని. ఆ దైత్యుని తప్పక పరిమార్చి లోకమును ప్రసన్నము కావింతును. భక్తుల కామనలను పూర్ణమొనర్చి, వైదిక ధర్మమును తిరిగి ప్రవర్తిల్లు జేయుదును. భూలోకమందు ప్రస్తుతము నా భక్తుడు “వరేణ్యుడు” కలడు. ఆతడు సుర భూసుర, అతిధుల ఎడల పూజాతత్పరుడు. సదాచారములు పాటించి, పురాణ శ్రవణము కావించు శుచి మరియు సత్యవాది. ఆయన ధర్మపత్ని “పుష్పిక”. ఆమె పతివ్రత, ధర్మపరాయణ, పతియందు అత్యంత అనురాగము గల స్త్రీ. వారిరువురు పన్నెండేండ్లు నా కొరకై ఘోర తపమాచరించిరి. నేను వారికి పుత్రరూపమున అవతరించెదనని వరమొసంగితిని. ఆ పుష్పిక ఒక శిశువునకు జన్మనిచ్చినది. కానీ ఒక దుష్ట రాక్షసి ఆ శిశువును అపహరించినది. పుష్పిక ఆ దు:ఖమును సహింపలేక ప్రాణత్యాగ మొనర్చును. అందువలన మీరు నన్ను అచటికి చేర్చవలసినది.” శివుడు “అట్లే” అని పలికి అనేక స్తోత్రములతో ఆ పరబ్రహ్మమును స్తుతించెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గజానన జననమను నూట ఇరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పదియవ అధ్యాయము

(శిశువును పుష్పిక వద్దకు చేర్చుట)

బ్రహ్మ “తదనంతరము శివుడు శిశువును వరేణ్యుని గృహమునకు తీసుకొని వెళ్ళు విషయమై చింతించుచుండెను. అంత నంది అచటికేతెంచి “స్వామీ! నేను మీ కృపచే పర్వతములను పిండి కావింపగలను. సముద్రమును ఇంకింప జేయగలను. మీ మనసున యున్న కార్యమును నాకు తెలియజేసి, నన్ను ఆజ్ఞాపింప వలసినది” అని పలికెను. అంత శివుడు ప్రసన్నుడై “నందికేశ్వరా! నేను నీ శక్తి నెరుగుదును. నీవు అత్యంత కార్యశూరుడవు. ఈ కార్యము నీ వలననే జరుగవలెను. మాహిష్మతీ నగరమందు “వరేణ్యుడు” అను గొప్ప బలసంపన్నుడు, ధర్మ పరాయణుడైన రాజు యుండెను. ఆతని ధర్మపత్ని పుష్పిక ఇప్పుడే ప్రసవించినది. కానీ ఆ శిశువును ఒక దుష్ట రాక్షసి అపహరించినది. నీవు వెంటనే ఈ శిశువును తీసికొని వెళ్ళి, పుష్పిక నిద్రించుచుండగనే ఈ శిశువును ఆమె వద్ద యుంచవలసినది. ఆమెకు ఏ విషయము తెలియరాదు సుమా!” అని పలికెను. నంది “వల్లె” యని, ఆ శిశువును తీసికొని పుష్పిక పాన్పుపై ఆమె ప్రక్కనే పరుండబెట్టి, తిరిగి వెనుకకు ఏతెంచి మహేశునితో ఇట్లనియె “స్వామీ! నేను మాహిష్మతికి ఏగుచుండగా ఒక దుష్ట రాక్షసి ఒక పసిబాలుని మాంసము భక్షించుచూ నా వద్ద కేతెంచినది. నేను నా పుచ్ఛముతో ఆ రక్కసిని పట్టి, గిరగిరా త్రిప్పి ఒక పర్వతముపై విసరితిని. మీ నామ ప్రభావముచే ఆ రక్కసి పర్వతముపై ఖండఖండములై మరణించినది. తదుపరి ఒక విశాలమయిన దుష్ట గంధర్వుల సమూహమును చూచితిని. వారితో పోరాడిన ఎడల బాలకుని ఎవరు రక్షించెదరని వ్యాకుల చిత్తుడనైతిని. అంత మీ నామస్మరణము కావించి, నా పుచ్ఛముతో, శృంగములతో, నా భీషణ

నిశ్వాసముతో వారిని నివారించి, కార్యసిద్ధి నొనర్చి, తిరిగి ఏతెంచితిని. ఆ గంధర్వులందు కొందరు మరణించిరి. కొందరు పలాయనులైరి. కొందరు క్షతగాత్రులైరి. ఆకాశము నుండి పుష్పవృష్టి కురిసినది. దేవా! మీ కార్యములకు విఘ్నములెట్లు కలుగును? మీ నామస్మరణ ప్రభావముచే బాలుని పట్టుకొని యున్ననూ, ఆ కార్యములన్నియు సంపూర్ణమొనర్చ గలిగితిని.” శివుడు ప్రసన్నుడై నందిని గాఢాలింగనము ఒనర్చి “నీ పరాక్రమము నాకు తెలియును. త్రిలోకముల యందు నీ వంటి వీరుడు లేడు” అని ప్రశంశించెను. అంత నంది పార్వతీదేవి వద్దకేగి, అంజలి ఘటించి, మధుర స్వరముతో “మాతా! నేను శివుని ఆజ్ఞ ఔదలదాల్చి, బాలుని మాహిష్మతీ నగరమందు పుష్పిక వద్దకు చేర్చితిని” అని పలికెను. పార్వతి ప్రసన్నయై “పుత్రా! నందికేశ్వరా! నీ భీషణ పరాక్రమము గూర్చి వింటిని. నీవు రాక్షసిని సంహరించి, గంధర్వులకు బుద్ధి గరపి, బాలుని రక్షించితివి. నీవు మహత్కార్యము నాచరించితివి” అని నందిని ప్రశంశించి, విశ్రాంతి తీసికొనమని అనుజ్ఞనిచ్చెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శిశువును పుష్పిక వద్దకు చేర్చుట అను నూట ముప్పదియవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది ఒకటవ అధ్యాయము

(సిందూర దైత్యుని గర్వభంగము)

ఒకానొకనాడు దైత్యరాజు సిందూరుడు మదోన్మత్తుడై తన సభా మధ్యమున ఆసీనుడై సభికులతో “నా వీర్యము, ప్రతాపము, బలము వ్యర్ధమయినవి. నేను ఇంద్రాదులతో, బ్రహ్మ, విష్ణువులతో యుద్ధ మొనర్పలేదు. ఈ మర్త్యలోక మహారాజులందరూ మశకముల వంటి తుచ్ఛులు. వీరిని పరిగణింప వలసిన అవసరము లేదు. కులీనురాలైన పడతి యవ్వనము పతిలేక వృధా అయినటుల, ప్రముఖ యోధులతో సమర మొనర్పక నా ప్రతాపము, బలము వ్యర్ధమయినవి” అని పలికెను. అంత అశరీరవాణి “మూర్ఖుడా! నీవు మదముచే ఎగిరెగిరి పడుచుంటివి. నీతో యుద్ధమొనర్చు యోధుడు జన్మించెను. ఆతడు పార్వతీగర్భ సంభూతుడై, ప్రస్తుతము వరేణ్యుని ఇంట పెరుగుచుండెను. అగణీయమైన లీలలు కావించు ఆ శిశువు శుక్లపక్ష చంద్రుని వలె పెరుగుచుండెను.” ఈ పలుకులు విని సిందూరుడు కొంత తడవు మూర్ఛితుడై, హర్ష రహితుడై “ఎవరు ఈ విధముగ పలికినది? వారెవరైననూ నాకు కనబడిన ఎడల వానిని ఖండఖండములుగ ఖండించెడి వాడను. సూర్యుడు పశ్చిమమున ఉదయించునటుల కాలకాలుడినైన నన్ను సంహరించుట అసంభవము”. ఈ విధముగ పలికి దిశలు ప్రతిధ్వనించునటుల గర్జన చేసి, పర్వతములను, వృక్షములను చూర్ణమొనరించుచూ, కైలాసమున కేగెను. ఆ దైత్యుని భారముచే ఆదికూర్మము, శేషుడు విచలితులైరి. అచట వానికి పార్వతీ పరమేశ్వరులు కానరాలేదు. వారిని వెదకుచూ ఆతడు పృధివి అంతయు తిరిగెను. క్రోధ పరవశుడై చివరకు పర్యళీ మహావనము చేరి, అచట గల శివ గణములను, పార్వతీ పరమేశ్వరులను, సరోవరములను సుందర భవన మండపములను కాంచెను. ఆ దైత్యుడు సూత గృహము ప్రవేశించి బాలకుని కొరకు వెదకెను. బాలుని కానక అగ్నివలె మండిపడుచూ “ఆకాశవాణి పలుకులు మిధ్యకాదని” తలచి, ఒకవేళ ఆ బాలుడు జన్మించకున్న ఇకపై జన్మింపకుండా పార్వతిని మట్టుబెట్టెదనని తలచెను.

ఈ విధముగ ఆలోచించి, ఆ దుష్టుడు చేత శస్త్రము ధరించి పార్వతీదేవిని సంహరించుట కేగెను. ఆ దైత్యునికి పార్వతికి ప్రక్కనే చతుర్భుజుడై, చతుర్హస్తములందు ఆయుధపాణియై, సర్వాభరణ భూషితుడైన శిశువును కాంచెను. అంత ఆ దైత్యుడు పార్వతీ హత్యా ప్రయత్నమువిడిచి, ఆ శిశువును సంహరించుటకు యత్నించెను. ఆతడు ఆ శిశువును

చేజిక్కించుకొని, సముద్రమున పడవేయుటకు నిశ్చయించి, శిశువును హస్తమందు దాల్చి బయలుదేరెను. కొంచెము సేపటికి బాలకుడు బరువు పెరుగుట ఆరంభించి, హిమాలయమంత బరువు పెరిగెను. ఇక ఆ బాలుని మోయలేక, ముందునకేగుటకు శక్తి చాలక, కంపితుడై ఆ బాలుని భూమిపై విడచెను. భూమిపై పడుచునే ఆ బాలుడు ఛీత్కారమొనర్చెను. దానిచే పర్వతములు కంపించి, సముద్రములు క్షోభనొందినవి. బ్రహ్మాండ కుహరమందు ఘెళఘెళారావములు ధ్వనించినవి. బాలుడు నర్మదానదీ తీరమున మున్యాశ్రమముల సమీపమున పడెను. ఆ బాలుడు పడినచోట ఒక కుండమేర్పడి "గణేశకుండము" అను పేర ప్రసిద్ధినొందెను. నర్మదానదీ స్మరణముచే ఆజన్మ పాపములన్నియు నశించును. నర్మదా దర్శనముచే పది జన్మముల పాపములు నశించును. నర్మదా స్నానముచే వంద జన్మముల పాపములు నశించును. నర్మద వద్దే అనుష్ఠాన నిరతులైన జనులు మోక్షము నొందెదరు. క్రిందపడుటచే బాలుని శరీరము నుండి రక్తము స్రవించి, అచటగల పాషాణముపై బడి, ఇప్పటికీ ఆ రాయి "నర్మదాగణేశుని" గ ప్రఖ్యాతినొందెను. నర్మదా గణేశుని దర్శనము, పూజ, మనోకామనలను పూర్ణమొనరించును. నర్మద యొక్క సంపూర్ణ మహిమను వర్ణించుట నశక్యము.

క్రిందపడిన బాలుని గాంచి, దైత్యుడు బాలుడు నాశనమయ్యెనని తలంచి, తన గృహమున కేగుటకు నిశ్చయించెను. ఇంతలో బాలుడు మాయమై ఆతడు పడిన కుండము నుండి ఒక భయంకరాకారుడు బయటకు వచ్చెను. ఆతడు జటాజూటధారియై, పొడవాటి మీసములు, గడ్డము కలిగి భయంకరముగ యుండెను. వానిని గాంచి సిందూరుడు తన ఖడ్గము పట్టి, ఆ ఆగంతకుని పైకి ఏగెను. అంత ఆ పురుషుడు ఒక్కమారు గాలిలోనికి ఎగిరి, దైత్యునికి అందక ఇట్లనియె "ఓరీ! దుష్ట దైత్యా! నీవు నన్ను వ్యర్థముగ భూమి పైకి విసిరితివి. నిన్ను అంతమొందించు వాడు వేరొకచోట పెరుగుచున్నాడు. ఆతడు నిశ్చయముగ నిన్ను పరిమార్చును." ఈ విధముగ పలికి అంతర్హితుడయ్యెను. అంత దైత్యుడు ఆ పురుషుని బంధించుటకు సర్వ విధముల ప్రయత్నించి, ఎక్కడనూ ఆతని కానక, తన గృహమునకేగి "శత్రువు కనిపించినపుడు తప్పక వధించెను" అని తలచెను. ఈ జరిగిన విషయము లేవియునూ పార్వతికి తెలియవు. ఎందుకనగా ఆమె సహితము పరాత్పరుని మాయచే మోహిత అయ్యెను. ఆమె ఒకనాడు పరమేశ్వరునితో "ఇచట కూడా దైత్యపీడ ఆరంభమయ్యెను. మనము మీ అనుజ్ఞ అయిన ఎడల తిరిగి కైలాసమునకు ఏగెదము" అని పలికెను. శివుడు సంతోషముతో "వల్లె" యిని, తిరిగి వారందరూ సంతోషముగ కైలాసమున కేగిరి.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సిందూర దైత్యుని గర్వభంగము అను నూట ముప్పది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది రెండవ అధ్యాయము

(పుష్పికా శోకము)

వ్యాసుడు "పితామహా! నందికేశ్వరుని ద్వారా వరేణ్యుని గృహమందు విడువబడిన బాలుడు ఏమైయ్యెను? అయ్యది విస్తారముగ తెలుపవలసినది." బ్రహ్మ " ఆ రాత్రి గడచి తెల్లవారినది. పుష్పిక వేకువనొంది, తన ప్రక్కనే యున్న బాలుని కాంచెను. ఆతడు చతుర్భుజుడు, రక్తవర్ణుడై, కుంజరముఖుడై, నానాభూషణ భూషితుడై, దివ్య దుకూలధారియై, దివ్యగంధాను లేపితుడై, లలాటమందు కస్తూరీ తిలకధారణ మొనర్చి యుండెను. ఆ బాలుని చూచి పుష్పిక ఆశ్చర్యచకితయై, ఒక్కమారు దు:ఖము ఆవహించి, భయభీతయై, తన వక్షమును చేతులతో తాడించుకొనుచూ, ఇంటి బయటకు వచ్చి రోదించుట ఆరంభించెను. ఆమె ఆక్రందన నాలకించి పరిచారిక లేతెంచి, జరిగిన విషయమును వరేణ్య మహారాజుకు తెలిపిరి.

ఆయన అమాత్య సహితుడై ఏతెంచి ఆ దివ్య బాలకుని గాంచెను. రాజు యొక్క ఆంతరంగికులు "రాజా! ఇటువంటి బాలుని ఇంతకు ముందు చూడలేదు సరికదా వినలేదు. వంశ విచ్ఛేదన మొనరించు ఇటువంటి వికృతమయిన బాలుని ఇంటియందు యుంచరాదు." వారి మాటలు విని రాజు ఆ పలుకులు నమ్మి, ఆ బాలుని వనాంతరాళమందు విడువమని ఆజ్ఞాపించెను. అంత సైనికులు ఆ బాలుని తీసికొని ఒక ఘోర విపినము ప్రవేశించి, ఒక సరోవర తీరమున ఆ బాలుని యుంచి, ఆకులతో కప్పి, వెనుకకు వచ్చి రాజునకు నివేదించిరి. ఆ బాలుని భుజించుటకు నక్కలు ఏతెంచినవి. కానీ దైవవశాత్తు అదే సమయమునకు అచటకు మహానుభావుడయిన పరాశర మహర్షి ఏతెంచి, ఆ దివ్య బాలకుని గాంచెను. ఆ మహానుభావుడు సహితము మోహము నందు పడి "ఇంద్రుడు నా తపస్సు భగ్నమొనర్చుటకు ఈ విధముగ బాలుని ఇచ్చెనా? పాపభీరువు నగుటచే నేను పాపము కావింపలేను. ఇపుడు నా కర్తవ్యమేమి? ఈ బాలుని వదలవలెనా? లేక గృహమునకు కొనిపోవలెనా? ఓ! పరమాత్మా! చంద్రశేఖరా! శివా! నన్ను రక్షించి నాకు కర్తవ్యముపదేశింపుము" అని ప్రార్థించెను.

అంత దయాళువైన గణేశుడు ఆ ముని యొక్క మోహాంధకారమును విచ్ఛేదన మొనర్చెను. అంత పరాశరుడు ఆ పరబ్రహ్మ పరమాత్మను గుర్తించి, ఆనందాతిశయముతో "నేడు నా జన్మము, నా మాతా పితరులు, నా తపము, సర్వము ధన్యమయినవి. నేను జనన మరణ చక్రము నుండి బయటపడితిని. ఈ దివ్య బాలకుని ఇచట వదలిన మందభాగ్యులెవరో కదా!" అని పలికి, ఆ బాలుని తన గృహమునకు కొనిపోయి తన ధర్మపత్ని కొసంగెను. ఆ బాలుని చూడగనే ఆ ముని పత్ని అమందానంద కందళిత హృదయారవిందయై, బాలుని తన హృదయమునకు హత్తుకొని "స్వామీ! మీ ద్వారా ఒనరించిన మహాతపస్సు నేడు ఫలీభూతమయినది. ఎవరి స్వరూపమును త్రిమూర్తులు, మునులు తెలియరో, ఎవరు సృష్టిస్థిత్యంతకారియో, ఎవరు నానా అవతారములు స్వీకరించి పృథివీ భారహరణము కావించునో, ఆ పరమాత్ముడు మన చర్మ చక్షువులకు దృష్టిగోచరుడయ్యెను." ఆ బాలుని స్పర్శించినంత మాత్రమున ఆమె స్థనములు చేపునకు వచ్చి, ఆ సాధ్వి బాలునకు స్థనపానమిచ్చెను. వరేణ్య మహారాజు ఆ బాలుడు పరాశర ముని దంపతిచే పెంచబడుచున్నాడని విని హర్షయుక్తుడై, తన రాజ్యమందలి ప్రజలకు ఆనంద సూచకముగ చక్కెర వితరణ మొనర్చి, మిత్రులకు, బాంధవులకు సుందర దుకూలాభరణములు బహూకరించెను. బాలుడేతెంచినప్పటి నుండియు మున్యాశ్రమమున ఆవులు మరింత పాలు ఇచ్చుచుండెను. శుష్క వృక్షములు సహితము పుష్పించి ఫలించెను. వాపీకూప తటాకములు స్వచ్ఛ జలములతో నిండెను. ఏ మానవుడు ఈ ఆఖ్యానము శ్రవణమొనరించునో ఆతడు/ఆమె పుత్రవంతులు, ధనవంతులగుదురు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి పుష్పికా విలాపమను నూట ముప్పది రెండవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది మూడవ అధ్యాయము

(మూషికము గణేశ వాహనమగుట)

వ్యాసుడు "విరించీ! ఈ బాలునకు గజాననుడు అను నామము ఎట్లేర్పడినది? ఈతనికి మూషికము వాహన మెట్లైనది?" బ్రహ్మ "పరాశర పుత్రా! పురాతన కాలమందు ప్రహ్లాద, శుక్రాచార్య సంవాదమను ఆఖ్యానము కలదు. అయ్యది నీ ప్రశ్నకు సమాధానమిచ్చును. శుక్రుడు ప్రహ్లాదున కిట్లనియె "ప్రహ్లాదకుమారా! గణపతికి మూషికము వాహన మెట్లయ్యెనో తెల్పెదను. ఈ ఆఖ్యానము శ్రవణ మాత్రమున మనోకామనలను పూర్ణమొనరించును. పూర్వకాలమున

ఒకనాడు ఇంద్రుని సభ జరుగుచుండెను. దానికి దిక్పాలురు, దేవతా ప్రముఖులు, మునులు, గంధర్వాదులెందరో ఏతెంచిరి. ఆ సమయమున క్రౌంచుడు అను గంధర్వుడు త్వరితముగ సభకు ఏతెంచుచూ వామదేవమునిని తన పాదాగ్రముతో ప్రహరించెను. అంత ముని కృద్ధుడై "ఓరీ! గంధర్వా! నీవు మూషికము కమ్ము. ఒకనాడు గణేశుడు నిన్ను లొంగదీసి తన వాహనముగ ఒనర్చుకొనెను. దయాళువైన ఆ ప్రభువు కాలాంతరమున నీకు మోక్షమును ప్రసాదించును." తత్ఫలితముగ క్రౌంచుడు ఒక మహా మూషిక రూపము ధరించి పరాశరాశ్రమమున పడెను. ఆతడు పర్వతాకారుడై, భయంకర రూపుడై, పొడవాటి రోమములు; తీక్షణమయిన ముఖము, కరుకయిన దంతములు, మహాబలియై ఒప్పుచూ, ఆ మహర్షి ఆశ్రమమున ఉపద్రవ మొనర్చుచుండెను. ఆతడు ఆశ్రమమందలి మట్టిపాత్రలు ధ్వంసమొనరించి, అన్నమంతటినీ భక్షించి, మునుల, వారి పత్నుల వస్త్రములు ఛిద్రమొనర్చి, తాళపత్రములను చింపి, సారభూత వస్తువులన్నింటినీ నాశమొనర్చెను. తన ఉఛ్వాస, నిశ్వాసములచే భయంకర నాద మొనర్చుచూ సర్వులను భయభీతుల కావించుచుండెను. అకస్మాత్తుగా ఏర్పడిన ఈ హఠాత్ పరిణామమునకు దిక్కుతోచక పరాశర మహర్షి చింతాగ్రస్థుడై "ఇపుడేమి చేయవలెను? చూడగా ఈ ఎలుకను ఎదుర్కొనుట అసంభవము అని తోచుచున్నది. అందువలన ఈ స్థానమును వదలి వేరొక ప్రదేశమునుకు ఏగవలెను. కానీ ఈ ప్రదేశము మనకు అనుకూలమై సుఖప్రదముగ యుండును? ఈ సుఖ ప్రదమయిన ఆశ్రమము ఈ విధముగ దు:ఖప్రదమగుటకు నేను పూర్వజన్మమందు ఏ పాపమొనర్చితిని? ఈ మూషికమును ఎవరు నాశన మొనర్పగలరు? ఎవరు దీనిని సంహరింపగలరు? నేను ఎవరిని శరణుజొచ్చును? నన్ను రక్షించునాధుడెవ్వరు?" ఈ విధముగ తర్కించుచుండెను.

ఆ సమయమున గణేశుడేతెంచి, తన తండ్రిని కాంచి మధుర స్వరముతో "తండ్రీ! మీరు చింతింపవలదు. దుష్ట సంహారమొనర్చు నావంటి పుత్రుడుండగా మీరు చింతాగ్రస్తులవనేల? మీకు ప్రియమొనర్చుట నాకు కనీస కర్తవ్యము. నా గర్జనచే పృధివి ఖండితమగును. నా చరణ ప్రహారముచే పర్వతములు నుగ్గునుగ్గు అగును. నీను ఈ మూషికమును నా వాహన మొనర్చుకొందును." ఈ విధముగ పలికి ఆ పరాత్పరుడు కోటి సూర్య ప్రకాశముగల తన పాశమును విసరెను. ఆ అగ్నిముఖ పాశము అంతరిక్షము నందలి మేఘములను సహితము శోధించి, భూమండలమంతయు వెదకి, మూషికము కానరాక, పాతాళము జొచ్చి, ఆ మూషికమును పట్టెను. ఆ పాశము బిగించుటచే శ్వాస తీసికొనుట కవరోధమై మూషికము మూర్ఛపోవుటకు సిద్ధమై మనసున "నాకు మృత్యువాసన్నమయినదా? నా బలము, ప్రతాపము వ్యర్ధమయినది కదా! నా దంతములచే కొరకి పర్వతములను సహితము చూర్ణమొనర్చు నేను ఈ పాశమును కించిత్ స్పర్శింప నోపకుంటిని. నా కంఠమందు ఈ పాశమును ఎవరు బిగించిరి?" ఈ విధముగ మూషికము తర్జన భర్జన చేయుచుండగా, అద్దానిని గరుడాస్త్రము సర్పమును లాగినట్లుగా పాశము గణేశుని వద్దకు ఈడ్చుకువచ్చినది. మూషికము గణేశుని కాంచి, తనకొసగబడిన శాపమును సంస్మరించి, ఆ ప్రభువును గుర్తించి, అంజలి ఘటించి స్తుతించెను "ప్రభూ! మీరు ఈ జగత్తు యొక్క సృష్టిస్థిత్యంతములు కావించెదరు. మీరు గుణ రహితులైనప్పటికీ గుణములచే ప్రకాశించి వానిచే తెలియుదురు. మీరు మాయా రహితులైనప్పటికీ మాయచే సర్వులనూ మోహింపజేయుదురు. మీరు బ్రహ్మాది దేవతలకు సహితము అగమ్యగోచరులు, కానీ మునుల హృత్కమలముల యందు విరాజమానులై యుందురు. మీరు జగత్కారణ కారణులు. అటువంటి పరాత్పరుని నేను నా చర్మచక్షువులతో దర్శనమొనర్చి ధన్యుడనయితిని. నేడు నా మాతా పితరులు, నేత్రములు, తపము, విద్య, వ్రతము, జపము ధన్యమయినవి."

మూషికము యొక్క ఈ స్తోత్రము విని గణేశుడు ప్రసన్నుడై "ఓ! అనఘా! నీ పురుషార్ధ కారణముగ నిర్గుణరూపుడనైన నేను సగుణ రూపుడనైతిని. నీవు నన్ను శరణుజొచ్చితివి కావున నీకు వరమొసంగెదను. కోరుకొనుము" అని పలికెను. అంత మూషికము "ఓ! గణేశా! నేనే వరము అడగను. నీవే నా నుండి ఏమి కావలెనో తెలుపుము." అంత గర్వయుక్తముగ

పలికిన ఈ పలుకులు విని గణేశుడు "ఈ పలుకులు సత్యమయిన, నీవు నా వాహనము కావలసినది" అని పలికి, ఆ మూషికమును పట్టి, దానిపై అధిష్ఠించెను. మూషికము ఆ భారమును భరింపనోపక చూర్ణమయి, గర్వము నశించి అంజలి ఘటించి ఇట్లనియె "ప్రభూ! నేను మీ వాహనమునైతిని. కానీ మీ భారమును సహించుశక్తి నాకు లేదు. దయచేసి మీ భారమును తగ్గింపవలసినది" అని ప్రార్థించెను. తక్షణము విఘ్నేశుడు దూది వలె తేలికయ్యెను. ఆ పరమాత్ముని దయకు మూషికము వందనము లర్పించెను. దీనినంతటినీ కాంచిన పరాశర మహర్షి "నేను త్రిలోకములందునూ ఒక బాలకుడు ఈ విధమయిన వీరోచిత కార్యమొనరించుట కానలేదు. ఎవరి బల, వీర్య, పౌరుషములచే పర్వతములు నుగ్గునుగ్గు అగునో, లోకపాలురు చ్యుతులగుదురో అట్టి మూషికమును క్షణములో మథించి, బంధించి, నీ వాహనమును కావించుకొంటివి" అని పలికెను. ఇంతలో ఆయన పత్ని ఏతెంచి, కుమారుని పరాక్రమమునకు సంతసిల్లి ఆలింగన మొనర్చి "పుత్రా! నీ బల, పరాక్రమములు నేనెరుగను. కానీ మా జన్మ జన్మాంతర పుణ్యములు ఫలించి నీవు మా గృహమునకు ఏతెంచితివి" అని పలికి ప్రశంశించెను. గణేశుడు ఆ ఎలుకను బంధించి దానితో ఒక ప్రాకృతిక బాలుని వలె క్రీడించుచుండెను. ఈ విధముగ మూషికము గణేశుని వాహనమయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మూషికము గణేశవాహనమగుట అను నూట ముప్పది మూడవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది నాల్గవ అధ్యాయము

(మూషిక పూర్వజన్మ వృత్తాంతము)

వ్యాసుడు "పితామహా! ఈ మూషికము పూర్వజన్మమందు ఏ పాపపుణ్యములు ఒనరించెను? మూషిక జన్మమొందిననూ గజాననునికి వాహనమయ్యెను." బ్రహ్మ "వ్యాసా! నీ ప్రశ్న సముచితము. సుమేరు పర్వత శిఖరమందు "సౌబరి" అను మహర్షి ఒక సురమ్య ఆశ్రమమును కట్టుకొని నివసించుచుండెను. ఆ ఆశ్రమము అనేక ఫల, పుష్పయుక్తమై, అనేక సరోవర సహితమై, పక్షియుతమై, పరమ ప్రశాంతముగ, సుందరముగ యుండెడిది. ఆ సౌబరి మహర్షి దర్శనార్థము ప్రతిదినము వశిష్ఠాది మునులు, ఇంద్రాది దేవతలు అరుదెంచెడివారు. మహా తపశ్శక్తిచే ఆయన ద్వితీయ భాస్కరుని వలె వెలుగొందువాడు. సర్వదా ఈశ్వర ధ్యాన నిరతుడయిన ఆ మహర్షి త్రిలోకవిఖ్యాతుడు. ఆయన ధర్మపత్ని "మనోరమ" పరమ పతివ్రత, పతియందు అత్యంత అనురాగమున్న పడతి. పతివ్రతల యందు ప్రఖ్యాత. అంతేకాక ఆమె అతిలోక సౌందర్యరాశి. రతీ, ఇంద్రాణి తుల్య లావణ్యఖని. ఒకనాడు సౌబరి హోమ సమిధల సేకరణకై వనమున కరిగెను. మరోరమ గృహకార్యములయందు నిమగ్నమై యుండెను. ఆ సమయమున "క్రౌంచుడు" అను గంధర్వుడు అచటికి ఏతెంచి, ఆ ఆశ్రమము యొక్క సుందరతను ప్రశాంతతను గమనించి "ఇక్కడ నివసించుచున్న మునులు ధన్యులు; వారి జపతపములు ధన్యము. చిరకాలము ఇచట నివసించిన ఎడల ముక్తి సహితము తథ్యము" అని మనసున తలచుచూ ఆ ఆశ్రమము నందలి పర్ణశాలను చూచి, అందు ప్రవేశించి మునిపత్ని అయిన మనోరమను కాంచి, ఆమె సౌందర్యమునకు నిరుత్తరుడై, కామాగ్నియందు జ్వలించి, ఆమె యందు అనురక్తుడై, ఆమెను అనుభవించుటకు ఆమె హస్తమును గ్రహించెను.

పర పురుషుని స్పర్శచే ఆ సాధ్వి కంపించి మూర్ఛితురాలైయ్యెను. ఆమె తన పతిని స్మరించుచూ, ముఖము మ్లానమై, కంఠము గద్గదమై, శరీరము స్వేదయుక్తమై, కన్నుల అశ్రుకణములు ధారాపాతముగ కార్చుచూ అత్యంత ఉద్విగ్నయై రోదించుచూ "నేను ఎవరిని శరణునొందను? నన్ను ఈ దుష్టుని నుండి ఎవరు విడిపించెదరు? నేను

జీవితమందు ఒక్క దుష్కర్మ సహితము కావింపలేదు. జన్మాంతర పాపములచే ఈ జన్మమందు సుఖదు:ఖములు ప్రాప్తించును" అని తలచి గంధర్వుని శాంత పరుచుటకై ఇట్లనియె "మహాత్మా! నేను నీ పుత్రిక వంటి దానను. నీవు నా పితృ సమానుడవు. నీవు జ్ఞానివి. నీవు నిర్లజ్జితుడవై ఈ పాపకర్మ మాచరింపవలదు. పాపులు అనేక కోటి వర్షములు నరకమందు పడెదరు. ఓ! మహాభాగా! అసహాయురాలిని, నీ పుత్రిక వంటి నన్ను విడిచిపెట్టుము. లేని ఎడల నిస్సందేహముగ నేను ప్రాణత్యాగము కావింతును. నీకు స్త్రీహత్యా పాతకము చుట్టుకొనును. నా భర్త వనమున కేగెను. అతి తొందరలో ఆయన వచ్చును. ఆయన క్రోధముచే నిన్ను ఒక్క క్షణములో భస్మమొనరించును. నేనే విధమయిన తుచ్ఛకార్యము ఆచరించను. నా పతి బ్రహ్మ సృష్టిని సహితము భస్మమొనరించు సమర్థుడు. నిన్ను నిలువెల్లా దహించును." ఈ విధముగ ఆ సాధ్వి పలుకుచుండగా, సౌభరి ఆశ్రమమున కేతెంచి, విషయము గ్రహించెను. వెంటనే క్రౌంచుడు మనోరమ హస్తమును విడచెను. మహర్షి ప్రళయాగ్ని వలె మండిపడి "ఓరీ! దుర్మతీ! నీవు నా పరోక్షమున నా భార్యను పీడించితివి. మూర్ఖుడా! నీవు పరోక్షచారివై (ఎప్పుడూ దాగుకొని బ్రతుకు) మూషికమగుము. ఒక చోరుని వలె పృధివి యందు బిలములు త్రవ్వుకొని ఉదర పోషణ కావించుకొనుము" అని శపించెను.

అంత క్రౌంచడు ఆయన పాదములపైబడి " స్వామీ! నేను మీ పత్నిని వంచింప వలెనన్న ఆలోచనతో ఇచటికి ఏతెంచలేదు. కానీ ఇచటి కేతెంచి అపురూప లావణ్యరాశి అయిన మీ పత్నిని చూచిన పిదప నాకు ఈ దుర్భావన అంకురించినది. నేను కేవలము ఆమె చేతిని మాత్రమే స్పర్శించితిని. మిమ్ములను కాంచి భయభీతుడనై ఈ అనఘను విడచితిని. ఓ! కృపానిధానా! నా అపరాధమును క్షమింపవలసినది. ఓ! శరణాగతవత్సలా! నా ఎడ దయ చూపింపవలసినది. మిమ్ము శరణుజొచ్చుచున్నాను. నేను త్రిలోకముల యందు ఇటువంటి పతివ్రతను చూడలేదు. దయచేసి నన్ను కరుణింపవలసినది." అంత ముని "మేరు పర్వతము సముద్రమునందు మునుగవచ్చు; సూర్యుడు పశ్చిమమున ఉదయింపవచ్చు; అగ్ని శీతలమవవచ్చు; కానీ నా వచనము వృధాకాదు. కానీ నీవు శరణమొందితివి కావున ద్వాపర యుగమందు పరమాత్మ "గజాననుడు" అను పేర అవతారము స్వీకరించును. నీవు ఆయన వాహనమగుదువు. అపుడు బ్రహ్మాది దేవతలు నిన్ను సన్మానించెదరు. నీవు ఆయన వాహనముగ మారిన పిదప తిరిగి స్వర్గమున కేగెదవు." అని పలికెను. కాలాంతరమున ఈ క్రౌంచుడే ద్వాపరమందు తిరిగి శపింపబడి, ఆ ఇరువురు మునుల శాపములచే పరాశరాశ్రమమునకేగి గజాననుని వాహనమయ్యెను. "బ్రహ్మ" వ్యాసా! ఇది క్రౌంచుని వృత్తాంతము. "వ్యాసుడు" మహాత్మా! గణేశుడు సిందూరుని ఎట్లు సంహరించెను? ఆ విషయ విశేషములన్నియు వివరింప వలసినది."

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి మూషిక పూర్వజన్మ వృత్తాంతమను నూట ముప్పది నాల్గవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది ఐదవ అధ్యాయము

(గజాననుని యుద్ధ ప్రయత్నము)

గజాననుడు ఒకమారు పరుల దు:ఖముచే పరితాపము నొందు మనస్కుడయిన పరాశరుని చేరి ఇట్లనియె "తండ్రీ! సిందూరుడు సంపూర్ణ జగత్తును పీడించుచున్నాడు. జగత్తంతయు స్వాహా, స్వధా, వషట్కార వంచితమైనది. దేవగణములు తమ పదవుల నుండి భ్రష్టులైరి. నేను దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కావించి, భూభార హరణమొనర్చి, దేవతలను వారి స్థానములందు పున: ప్రతిష్ఠించెను. జగత్తునందు ఆనందము తిరిగి నింపెదను. తండ్రీ! మీరు మీ అభయ హస్తమును

నా మస్తకమందుంచి, నన్ను దీవించవలసినది. మీ అనుగ్రహముచే నేను ఆ దుష్ఠ దైత్యులను వధించెదను." అంత మహర్షి "పుత్రా! నీవు బాల భావముతో పలుకుచున్న పలుకులు నన్ను అమితాశ్చర్యమున ముంచుచున్నవి. బాలురు కౌతుకముతో చంద్రమండలము నడిగెదరు. అట్లే సర్వ దేవతలకు దుర్లభమయిన కార్యమును నీవు కావింపదలచితివి. ఏ దైత్యుని నిశ్వాసముతో పర్వతములు చూర్ణమగునో, ఎవరి చరణ ప్రహారముచే త్రిలోకములు కంపించునో, అటువంటి దైత్యునితో కమల నాళము వంటి కోమల శరీరుడవైన నీవు సమరమెట్లు కావించెదవు? నీవు ఆడుచూ, పాడుచూ తొమ్మిదేండ్లు వయస్సు గలవాడవైతివి. నా అనుగ్రహము చే నీవు సమర్ధుడవగుచో, నేను నిన్ను తప్పక ఆశీర్వదించెదను" అని తన శుభ హస్తమును ఆ బాలుని శిరముపై యుంచెను. అంత గణేశుడు మునికి, మునిపత్నికి, దుర్గా, విష్ణు, శివులకు నమస్కరించి, మూషిక మధిరోహించి నాలుగు హస్తములందు ఆయుధపాణియై, ప్రళయాగ్ని వలె దీపించుచూ సిందూరుని నగరమున కేగెను. ఘుష్మేశ్వర సమీపమున "సిద్ధ సిందూర వాటకము" అను నగరమందు సిందూరుడు నివసించుచూ, త్రిలోకములను శాశించుచుండెను. ఆ నగరమునకు ఉత్తర దిశన నిలబడి గణేశుడు దిక్కులు పిక్కటిల్లునటుల గర్జన కావించెను. అద్దానిచే పర్వతములు కంపించి, సాగరములు ఘూర్ణిల్లెను. దైత్యులు కంపించి, మూర్ఛిల్లిరి. భీరువులు మరణించిరి. సిందూరుడు ఒక్క క్షణము మూర్ఛనొంది, తిరిగి తేరుకుని, సేవకులను పిలచి, ఆ కోలాహలమునకు కారణము కనుగొనమని పంపెను.

అంత వేగులు నలుప్రక్కలకు వెడలి ఉత్తరమునున్న గజాననుని కాంచి, సింహమును కాంచిన మత్తేభమువలె కంపించుచూ, నెమ్మదిగ ధైర్యము వహించి ఆయనను చేరి "నీ వెవరవు? ఎక్కడనుండి ఏతెంచితివి? ఎందుల కేతెంచితివి? నీ నామధేయమేమి? నీ గర్జన విశ్వసంహార రసికుడయిన సిందూరునకు క్రోధము కలిగించు చున్నది. నీవు తొమ్మిది వర్షముల బాలుని వైననూ, మిక్కిలి బలవంతుని వలె కానిపించుచున్నావు. ఒక్క క్షణములో జగత్సంహారము కావించు బలవంతుని వలె యున్నావు" అని పలికిరి. అంత గజాననుడు "నేను శివపుత్రుడను. పరాశరుని ఇంట పెరుగుచుంటిని. దుష్ఠ సంహార రసికుడను. భక్తపాలనా తత్పరుడను. అనేక అవతార గ్రహణమందు కుశలుడను. బ్రహ్మాది దేవతలకు సహితము అగోచరుడను. నా నామము గజాననుడు. మీరు వెళ్ళి మీ స్వామితో ఈ విషయములన్నియు తెలుప వలసినది. నేను ఆ దుష్ఠుని సంహరించిన పిదప ప్రసన్నుడగుదును." అంత వేగులు వేగముగ సిందూరుని వద్దకేగి సర్వము తెలిపిరి. ఈ పలుకులు వినినంతనే సిందూరుడు కించిత్ చింతించి, క్రోధముతో జ్వలించుచూ, కన్నులు రక్తవర్ణము దాల్చగా ఒకేమారు క్రోధ హర్షయుక్తుడై దూతలతో ఇట్లనియె "మీ వచనములు నాకు ఆశ్చర్యము కలిగించుచున్నవి. సింహముతో సమర మొనర్చుటకు ఒక మశక మేతెంచెనా? నవ వర్ష బాలుడు నాతో యుద్ధము ఒనర్చునా! మీరందరూ ఆ విషయమునకై భయము నొందుచున్నారా? నాకు క్రోధము కలిగిన త్రిలోకములు కంపించును. ఈ బాలుడు ఒక లెక్కా?" అని పలికి ఒక గొప్ప సింహనాదమొనర్చి, దిశలను కంపింపజేసెను. తన అస్త్ర శస్త్రములన్నియు తీసికొని యుద్ధలాలసతో సమరాంగణమునకు బయలుదేరెను. అంత ఆతని అమాత్యులు ఆతనినాపి, నమస్కరించి "మహారాజా! సైనికులు, అమాత్యులు యుండగా ప్రభువు సమరమున కేగరాదు. మీ ప్రతాపముచే మేమా బాలుని సంహరించెదము. కేవలము యుద్ధము కొరకే సేనను తయారు చేసెదము కదా! ఆ తరుణమిపుడు ఏతెంచినది. మహాప్రభూ! మేము మీ కొరకై ప్రాణము లర్పించెదము. మాకు సంగరమునకు అనుజ్ఞ నీయ వలసినది." అని పలికిరి. అంత సిందూరుడు "మీరందరూ నా ప్రతాపమును చూడవలసినది. నేను సమరమున కేగెదను" అని పలికి క్షణములో సమరాంగణము చేరెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి గజాననుని యుద్ధ ప్రయత్నమను నూట ముప్పది ఐదవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది ఆరవ అధ్యాయము

(సిందూర మరణము)

బ్రహ్మ "బాలుడయిన గజాననుని కాంచి సిందూరుడు మదగర్వితుడై ఇట్లనియె "ఓరీ! మందబుద్ధీ! నీ వంటి బాలకునితో సమర మొనర్చుటకు నాకు సిగ్గుగా యున్నది. నీవు శీఘ్రమే నీ గృహమునకేగి నీ తల్లి స్థనపానమొనర్చుము. లేని ఎడల నా తీవ్ర శరాఘాతముచే నీవు మరణించెదవు. నన్ను చూచి త్రిమూర్తులు పలాయన మొనర్చెదరు. ఒకవేళ నీవు మృత్యుగతుడవైన ఎడల నీ మాత పితరులు సహితము ఆ బాధతో మరణింపవచ్చు. అందువలన నీవు గృహమున కేగుము. నీ ముఖము తిరిగి నాకు చూపింపవలదు. నేను ఈ బ్రహ్మాండమును నా అరచేతితో ప్రహరించిన ఎడల, అయ్యది అనేక వ్రక్కలగును." అంత గజాననుడు "ఓరీ! దుష్టుడా! నీవు మనసునందు ఇంచుక విచారింపక పలికితివి. నీవు నా సామర్థ్యము నెరుగవు. నేను క్రోధమొందిన ఎడల దేవతలు స్థానభ్రష్ఠము నొందెదరు. నేను త్రిగుణముల ఆధారముచే జగత్తు యొక్క సృష్ఠి స్థిత్యంతములు కావించెదను. దుష్ఠ సంహారము కావించి భూభార హరణ మొనర్చెదను. పరాక్రమమున్న వ్యక్తి వయసు యందు చిన్నవాడయిననూ లఘువు కాదు. అణుమాత్రమైన అగ్ని సంపూర్ణ మహానగరమును దగ్ధమొనర్చును. నీవు జీవింపదలచిన ఎడల, నాకు నమస్కరించి, నతమస్తకుడవై నీ గృహమున కేగుము. లేని ఎడల నా శస్త్ర ప్రహారముచే స్వర్గమున కేగెదవు. నీవు ఈ జగత్తును ఎంతో పీడించితివి. నీ మరణముచే జగత్తు సుఖించును. బ్రహ్మ వరదాన మొందితినని నీవు గర్వపడవలదు. ఆ వరములు వ్యతిరేక ఫలములు సహితము ప్రసాదించును. పురాతన కాలమందు నృశింహ భగవానుడు స్థంభము నుండి ఉద్భవించి హిరణ్యకశిపుని సంహరింప లేదా? కాలము కలసివచ్చి సుగ్రీవుడు రామునితో స్నేహమొనర్చి వాలి వధ యొనర్చెను కదా! కాల యోగముననే నీ బుద్ధి సహితము భ్రమించినది. నీ గర్వముచే మిక్కిలి బలిసి నేను అతి చిన్నవానిగ నీకు కనిపించుచుంటిని. నీవు ధైర్యము వహించి, సిగ్గు విడచి, నాతో యుద్ధ మొనర్పుము" అని పలికి గణేశుడు తన విరాడ్రూపము నొందెను.

ఆయన శిరము బ్రహ్మాండమునకు పైన యున్నది. పాదములు సప్త పాతాళములను భేదించి క్రిందకు యున్నవి. రెండు చెవులు దిశాంతముల వలరు వ్యాపించినవి. దైత్యుడు ఆయన విశ్వరూపము నందు సహస్రాది బాహూదర, వక్త్ర, నేత్రములు కలిగి దివ్య వస్త్ర భూషణ ధారియై, దివ్య గంధాను లేపితుడై, అసంఖ్యాక సూర్య తేజస్సుతో యున్న స్వామిని కాంచి, కంపించి, తిరిగి ధైర్యము తెచ్చుకొని, ఖడ్గము చేపట్టి మహాగ్నియందు దూకు శలభము వలె ఆయన పైకి దండెత్తెను. అంత గజాననుడు "ఈ మూర్ఖుడు ఇక మారడు" అని తలచి, వాని కంఠము పట్టి, పైకెత్తి వానిని మర్దించెను. వాని రక్త వర్ణ శరీరమును తన దేహమునకు విలేపనముగ రాసుకొనెను. అప్పటి నుండియు భక్తుల మనోకామనల పూర్ణమొనర్చు గజాననుని జనులు "సిందూర వదనుడు" లేక "సిందూర ప్రియుడు" అని పిలిచిరి. సిందూర దైత్యుని మరణముచే పుష్పవృష్ఠి కురిసినది. గంధర్వులు గానమొనరించిరి. అప్సరసలు నాట్యము చేసిరి. వశిష్ఠాది ప్రముఖ మునులు ఇంద్రాదులను ముందర యుంచుకొని, ఆ పరాత్పరుని సమ్ముఖమున కేగి "గజాననునకు జయము; గజాననునకు నమస్కారము" అని దిశలు ప్రతిధ్వనించునటుల జేజేలు పలికిరి. ఇహలోకమందలి రాజులందరూ ఏతెంచి సర్వాభరణ భూషితుడు, దివ్యగంధ లేపనుడు, మూషిక వాహనుడు, చతుర్భుజుడు అయిన పరమాత్మునికి షోడశోపచార పూజన మొనర్చిరి. ఇంద్రాదులు "ప్రభూ! మేము మిమ్ము స్థుతింప నసమర్ధులము. మిమ్ము స్థుతించుటకు నాలుగు వేదములు, బ్రహ్మాది దేవతా ప్రముఖులు, మునులు చాలరనిన మేమెంత? ఈ జగత్తుకు కర్త, కారణము, కార్యము, రక్షణ, పోషణ నీవే! నీవు విశ్వమును మోహమునందు ముంచి, మాయాగ్రస్త మొనర్చి, తిరిగి జ్ఞానమును ప్రసాదించునది నీవే!! నీవే

నదులు, సముద్రములు, వృక్ష, పర్వతములు, పశువులు, పంచ భూతములు, త్రిమూర్తులు, మరుద్గణములు, యక్ష, రాక్షస, సిద్ధ చారణ, గంధర్వ, నాగ, అప్సర, మునిగణ, సంపూర్ణ చరాచర జీవరాశి నీ రూపములే!!! స్వామీ! ఉన్నది నీవొక్కడివే!!! దేవా! మోక్ష ప్రదాయకమయిన నీ ప్రత్యక్ష దర్శనము మేము చేయగలిగితిమి. సిందూరుని మరణముచే మేము సుఖము నొందితిమి. రాజులు, మునులు, మానవులు తన కార్యములందు సంలగ్నులయిరి. ఇక స్వాహా, స్వధా, వషట్కారములతో ధార్మిక కార్యక్రమములు తిరిగి ఆరంభమగును. స్వామీ! మమ్ము పాలింపుము" అని పలికిరి.

ఈ విధముగ పలికి దేవతలందరూ సుందర శిఖరములతో కూడిన ఒక దేవాలయము నిర్మించి, అందు గజాననుని సుందర మూర్తిని ప్రతిష్ఠించిరి. అద్దాని దర్శన మాత్రమున మానవుల పాతకములు నష్టమగును. ఆ స్వామిని స్మరించినంత మాత్రమున మానవులు వారి పితరులను, తరతరములను తరింప జేయుదురు. ఆ మూర్తిని పూజించి దేవతలు శాంతి నొందిరి. తదుపరి మునులేతెంచి, ఆ మూర్తిని పూజించి సిందూరుని హతమొనర్చిన కారణమున ఆయనను "సిందూర హంత" అని పిలిచి, తమ ఆశ్రమముల కేగిరి. పుడమినందలి రాజులందరూ ఏతెంచి ఆ పరాత్పరునకు నానా ద్రవ్యములతో, అనేక మార్లు పూజనమొనర్చి "స్వామీ! ఈ క్షేత్రము "రాజసదనము" అని పిలువబడును" అని పలికిరి. అంత వరేణ్యుడేతెంచి, ఆ పరాత్పరుడు తన పుత్రుడే అని గుర్తించి ఇట్లనియె "ఓ! నాథా! నీవు లోక కంటకుడయిన సిందూర దైత్యుని సంహరించి, రాజులకు, దేవతలకు వారి వారి పదవులు తిరిగి ప్రసాదించితివి. అందువలన నీవు "దైత్యమర్దనుడు" అను పేర విఖ్యాతి నొందెదవు." తన పుత్రుని పరాక్రమమునకు ఆనందము నొంది, కంఠము గద్గదమవ్వగా తిరిగి ఇట్లనియె "ఎవరి పూజను త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు కావించెదరో అట్టి పరమాత్ముని నేను మూఢుడనై, పాపినై, విఘ్నబాధ నొందెదనని త్యజించితిని. నీవు అనంతకోటి బ్రహ్మాండ నాయకునివని మేము తెలియకుంటిమి. మూఢుడైన వ్యక్తి ఎట్లు కల్పవక్షమును, కామధేనువునూ, నిధినీ త్యజించునో, అట్లే నేను మాయా మోహితుడనై, నిన్ను గృహ భహిష్కృతుని గావించితిని."

ఈ విధముగ కంటికి, మింటికి ఏకధారగా రోదించుచున్న వరేణ్యుని గజాననుడు తన నాలుగు హస్తములతో ఆలింగన మొనర్చెను. తదుపరి ఆ ప్రభువు ఇట్లు పలికెను "పూర్వ కాలమందు మీ దంపతి ఇరువురు మహావనమందు వటవృక్షపు రాలిన ఆకులు భుజియించి సహస్ర వర్షములు నా కొరకై దారుణ తపమాచరించిరి. నేను ప్రత్యక్ష మయినపుడు మూఢులై మోక్షము కోరక, నన్ను పుత్రునిగ కోరిరి. అందుచే మరియు సిందూర మరణము, భూభార హరణము హేతువై నేను మీ పుత్రుడనైతిని. లేని ఎడల నేను నిర్వికార సర్వసాక్షిని. నేను నా వచనమును సత్యమొనర్చి త్రిలోకములను సంతోష మొనర్చితిని. నేను ఇక నా నిజ ధామమునకు ఏగెదను. నీవు విచారింప వలదు. అని పలికెను. అంత వరేణ్యుడు "స్వామీ! నేను ఈ సంసారమందు దు:సహ దు:ఖములను చూచితిని. ఓ! దు:ఖహర్తా! నాకు మోక్ష మార్గమును ఉపదేశింపుము. నీ సాక్షాత్కారమయిన పిదప కూడా నాకు సంసార బంధనమేల? నాకు ముక్తి నొసగు ఉపదేశము నిమ్ము. నాకు కామ, క్రోధ, మృత్యుభయములేని శిక్షణ నిమ్ము" అని ప్రార్థించెను. అంత గజాననుడు కృపతో ఆ మహారాజును ఒక సుఖాసనమందు సుఖాశీనుని కావించి, ఆయన శిరమందు తన అమృత హస్తమునుంచి దీవించి, ఆయన సందేహములు అన్నియు తీర్చి, తన విశ్వరూపము చూపించి, ఆయనకు "గణేశగీత" ను ఉపదేశించెను. ఆ మహారాజు గణేశగీతను బాగుగా తెలిసికొని, రాజ్యభారమును అమాత్యుల యందుంచి, తపస్సార్థము వనమున కరిగెను. అత్యంత వైరాగ్యము నొంది, ఆయన గజాననుని ధ్యానించుచూ, అన్య విషయములను సంపూర్ణముగ విడచి, సర్వదా గీతా పాఠములను, ఆవృత మొనర్చుచూ, జలమందు చేరు జలము జలమయినట్లే ఆయన నిరంతరము గజాననుని ధ్యానించి వరేణ్యుడు గజానన మయుడు అయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సిందూర మరణమను నూట ముప్పది ఆరవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది ఏడవ అధ్యాయము

((శ్రీ గణేశ గీత - 1)

వ్యాసుడు "పితామహా! శ్రీ గణేశ భగవానుడు వరేణ్య మహారాజు కుపదేశించిన శ్రీగణేశ గీతను దయచేసి నాకు తెలుప ప్రార్థన." బ్రహ్మ ఇట్లనియె "గజాననుడు "రాజా! నా అనుగ్రహముచే నీకు బుద్ధి యందు పక్వత కలిగి ఆ ప్రశ్న నడిగితివి. నీకు యోగరూపామృతమైన గణేశ గీతను బోధించెదను. రెండు వస్తువులు, ఇరువురు వ్యక్తుల కలయిక యోగము కాదు. శ్రీ (సంపద) ప్రాప్తి యోగము కాదు. ఇంద్రియానందము, పంచతన్మాత్రల సంయోగము యోగ మనిపించుకోదు. మాతాపితరుల, బంధు బాంధవుల, పుత్రాదులతో కలయిక యోగము కాదు. అణిమాది అష్టసిద్ధుల ప్రాప్తి, స్త్రీ సంగమము, రాజ్యభోగము యోగము కాదు. రథ, గజాశ్వములు, పొందుట, ఇంద్రపద ప్రాప్తి, యమనియమాదులు, సత్య లోకమున కేగుట, ఇవేవియును యోగము కాదు. శైవ, వైష్ణవ యోగములు, దిక్పాలత్వము, దేవత్వము, సార్వ భౌమత్వము, ఇవేవీ కూడా యోగమని అనిపించుకొనదు. జ్ఞానులు శ్రీగణేశుని ద్వారా తెలుపబడిన వివిధ యోగములు సాధన చేయుదురు. వారు ఊర్ధ్వరేతస్కులై, నిరాహారులై లేక సంయమాహారులై సాంసారిక తృష్ణను విడచి ప్రాణములను వశమొనర్చుకొని వానిని పవిత్రము చేయుదురు. దయాళువులై కొద్దిమంది పాత్రులైన వారికి ఆ యోగమును తెలిపెదరు. వారు నిమీలిత నేత్రులై, హృదయమందున్న పరబ్రహ్మ స్వరూపమును తమ యోగము ద్వారా వశమొనర్చుకొని, ఆయననే ధ్యానించుచూ సర్వప్రాణుల యందు సమానత్వము కలిగి, హృదయమందు స్థితిగతుడయిన పరమానంద స్వరూపుని యందు నిమగ్నమై జీవన్ముక్తులగుదురు. ఎవరు వారిని అవమానించినా, నిందించినా, కొట్టినా, భోజనమిడినా, పొగడినా స్పందించక తమ క్రోధముపై విజయము సాధించి, ఇంద్రియములను సంయమ మొనర్చి, దయాళువులై, యోగిజనులు కేవలము ప్రాణుల అనుగ్రహ హేతువై భూతలమందు సంచరించెదరు. వీరు శరీరధారులైనప్పటికీ సమలోష్టాశ్మ కాంచనులు (మట్టినీ, బంగారమును ఒకే విధముగ చూచెదరు). ఇపుడు నీకు ఆ యోగము గూర్చి తెలిపెదను. దీనిని విని, తెలిసిన, జ్ఞానులు భవసాగరమును దాటెదరు. రాజా! ఎవరు శివ, విష్ణు, దుర్గ (శక్తి), సూర్యుడు, నేను (నా యందు) భేదబుద్ధి నొందరో అదియే సమబుద్ధి అని నేను తలంచెదరు.

రాజా! నేనే నానా అవతారములు స్వీకరించి ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, అంతయు కావించుచున్నాను. మహావిష్ణువు, సదాశివుడు, మహాశక్తి, ఆర్యములను నేనే! సర్వులకు స్వామినైన ఏకమాత్రుడ నైనప్పటికీ, పురాతన కాలమందు నన్ను నేను అయిదు రూపములుగ (శివ, విష్ణు, శక్తి, సూర్య, గజానన) విభజించుకుంటిని. అజ్ఞాన వశమున లోకులు జగత్కారణమైన నన్ను తెలియరు. పంచభూతములైన పృధివి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము నా నుండే ఉత్పన్నమయినవి. త్రిమూర్తులు, లోకపాలురు, దశదిశలు, అష్ఠ వసువులు, పశువులు, సమస్త జంతుజాలము, పక్షులు, మునులు, నదులు, సముద్రములు, యక్ష, వృక్షములు, ఇరువది ఒక్క స్వర్గములు, నాగులు, సప్త వనములు, మానవులు, పర్వతములు, సిద్ధ సాధ్యులు, రక్షోగణము (భూత, పిశాచ, రాక్షసాదులు), నా నుండే ఉత్పన్నమయినవి. నేను సర్వ సాక్షిని, జగత్ చక్షువును, సర్వ కర్మలకు నిర్లిప్తుడను. నిర్వికారుడను, అప్రమేయుడను, అవ్యక్తుడను, అవ్యయుడను. రాజా! నేను ఆనందాత్మకుడయిన పరబ్రహ్మను. నా మాయ సర్వులను మోహ మొనర్చుచున్నది. నా మాయచే సర్వులు షడ్వికారములు (పుట్టుట, ఉండుట, పెరుగుట, పరిణామము చెందుట, తరుగుట, మరణించుట) యందు సంలగ్నులగుదురు. జీవులు అనేక జన్మములందు వీటియందు చిక్కుకొని, నెమ్మది నెమ్మదిగ మాయను గూర్చి తెలిసికొని, విషయ విరక్తులై పరబ్రహ్మప్రాప్తి నొందెదరు. ఆత్మ శస్త్రముచే ఖండింపబడదు. అగ్నిచే మండింపబడదు, జలముచే తడుపబడదు, వాయువుచే

ఎండింపబడదు. శరీరము మరణించినప్పటికీ ఆత్మ చావదు. కొందరు జనులు పుష్పిత పలాశ వృక్షముల వలె ఆపాత రమణీయ వేదవచనములను వల్లెవేయుచూ, ప్రశంశించుచూ, వాని యందలి గూఢార్థములను ఆచరింపక కేవలము స్వర్గప్రాప్తికై, ఐశ్వర్యమునకై, నిరంతరాసక్తులై, తత్ఫలితముగ జన్మమృత్యు చక్రమందు నిరంతరము సంచరించుచుందురు.

వైదికకర్మ నిరతులైన జడబుద్ధులు కామ్య కర్మానుష్ఠానమందు బంధితులై జనన మరణ చక్రమందు తామే పడుదురు. ఏ వర్ణాశ్రమములకు చెందిన మనుజులు తమ విహిత కర్మల ఫలములను నా కర్పించి, అనాసక్త భావముతో కర్మల నాచరింప వలెను. తత్ఫలితముగ కర్మ ఫల బీజములు విచ్ఛిన్నమై, జ్ఞానప్రాప్తికై చిత్తము శుద్ధమగును. మునులు జ్ఞానము ద్వారానే పరబ్రహ్మను తెలిసికొనిరి. మానవులు కర్మ యొనర్పక నిష్క్రియులై యుండజాలరు. అంతేకాక వారు తమ ధర్మమును విడువరాదు. కర్మను విడుచు మానవులు సిద్ధినొందరు. మానవులకు తొలుగ జ్ఞానప్రాప్తికి అధికారముండదు. అందువలన తొలుత కర్మనే కావింపవలెను. అనాసక్త భావముతో కర్మ కావించు మానవులకు, తదుపరి హృదయము పరిశుద్ధమై సమత్వభావన మేర్పడును. ఈ విధముగ కర్మయోగమందు సోపానములు అధిరోహించి జ్ఞానయోగము నొంది తద్వారా పరబ్రహ్మ రూపమయిన అమృతత్వము నొందును. రాజా! నీకు వేరొక యోగమును తెలిపెదను. పుత్ర, మిత్ర, బాంధవులను, శత్రు జనులను, పశుపక్ష్యాదులను, బాహ్యాంతర దృష్టులచే సమత్వ భావముతో చూడుము. సుఖదు:ఖముల యందు, హర్షక్రోధముల యందు, రోగభోగముల యందు సమత్వ భావమేర్పరుచుకొనుము. సర్వ వస్తువుల యందు, సర్వ జీవుల యందు, బాహ్యాంతరముల యందు ఎవరు నన్నే చూచునో, ఎవరు సూర్య చంద్రాగ్నుల యందు, శివ శక్తుల యందు, వాయు, తీర్థ సరోవర, మహానదీ తీర్థములందు, పాపనాశక క్షేత్రములందు, త్రిమూర్తులు, సర్వదేవతలు, యక్ష, రాక్షస, గంధర్వ, కిన్నెర, కింపురుష, నాగుల యందు, మనుష్యుల, తిర్యక్ యోనులయందు, ఎవరు నిరంతరము నన్నేచూచునో ఆ యోగి నన్నే తెలిసికొనెనని తెలియుము. ఎవరు ఇంద్రియార్థముల (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు) సుఖమందు వివేకపూర్ణుడై విముఖత యెందునో ఆతడు యోగి అనబడును. స్వధర్మమందు ఆసక్తిచిత్తుడయిన మానవుని బుద్ధి, దైవ వశమున ఆత్మయందు నిమగ్నమైన ఆతడు యోగి అగును. యోగనిష్ఠుడై వ్యక్తి ధర్మాధర్మములు రెంటినీ వదలును. యోగమే జీవిత లక్ష్యముగ మలచుకొని, సమత్వభావము కలిగి, అనాసక్త భావముతో కర్మలు చేసి, కర్మఫలములను ఈశ్వరార్పణము కావించిన వానిని కర్మ కౌశలుడు అందురు. ఇదియే యోగము.

జితేంద్రియుడయిన మానవుడు ధర్మాధర్మముల ఫలత్యాగ మొనర్చి జన్మ మరణ కర్మబంధమునుండి ముక్తినొంది, అనామయ స్థానమున కేగును. మానవుని బుద్ధి అవివేక రూప కాలుష్యము నుండి దూరమగు కొలది, ఆతడు వేదములందు తెలిపిన ఐహిక కామ్యఫల ప్రాప్తి విషయముల నుండి విరక్తుడగును. నెమ్మదిగ వేదవిహిత కర్మఫలము నుండి విముఖుడై, బుద్ధి స్థిరమై పరమాత్మయందే కేంద్రీకృతమై యోగప్రాప్తి నొందును. ఏ వివేక శీలుడయిన మనుష్యుడు తన మనసు నందు సర్వ కామనలను త్యాగమొనర్చి, తన స్వకీయ ఆత్మయందు పరమాత్మను దర్శించుచూ సంతుష్టి నొందునో ఆతడు "స్థితప్రజ్ఞుడు" అని పిలువబడును. ఎవరు సుఖములందు తృష్ణను విడచి, దు:ఖములందు ఉద్విగ్నతనొందక, భయ, రాగ, శోక, రహితుడై యుండునో ఆతడే స్థితప్రజ్ఞుడు. కచ్ఛపము (తాబేలు) ఎట్లు తన అంగములను పెంకులోనికి తీసికొనునో, అట్లే యోగసాధనా తత్పరులు సర్వ ఇంద్రియార్థ విషయముల నుండి ఇంద్రియములను వెనుకకు త్రిప్పవలెను. తత్ఫలితముగ విషయ వాసనలందు ఆకర్షణ యుండక మనసు నివృత్తమగును. ఇక ఏవేని రాగజనక విశేషములు యున్న ఎడల, పరమాత్మ దర్శనముచే అవి సంపూర్ణముగ నివృత్తి అగును. వివేకశీలుడయిన మానవుడు యోగి అయి ఇంద్రియములను సంయమ స్థితియందు యుంచినప్పటికీ ఇంద్రియములు బలవంతముగ తిరిగి వానిని విషయ వాసనలందు ముంచుటకు యత్నించును. అందువలన యోగులు ఇంద్రియములను వశపరుచుకొని, సంయములై సర్వదా నా ధ్యాన మొనర్చుచుండవలెను. ఎవరు తన చింతన మొనర్చుటచే వాని యందు ఆసక్తి పెరిగి, తద్వారా వాని యందు తృష్ణ

ఏర్పడును. తృష్ణ పూర్ణమవ్వని ఎడల క్రోధముత్పన్న మగును. క్రోధముచే వివేకము నష్టమగును. తద్వారా అజ్ఞానము, ఉద్రేకము కలిగి దానిచే స్మృతి, బుద్ధి నాశనమై పురుషుడు పూర్ణముగ నష్టపోవును.

ఎవరు తన మనస్సును వశమునందుంచుకొనెదరో, వారు ఇంద్రియార్థముల ఎడల రాగద్వేష రహితులై సంతోషము నొందెదరు. మనసు సంపూర్ణమయిన తాపత్రయ (ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవిక) నాశనమొందును. ప్రసన్నాత్మ లేక నిర్మల హృదయమందు (నిశ్చల బుద్ధి యందు) పరమాత్ముడు స్థితిగతుడు అగును. మానవుని మనస్సు నిర్మలమవని ఎడల బుద్ధి శుద్ధమవ్వదు. బుద్ధి శుద్ద మవ్వనిచో బ్రహ్మజ్ఞాన వాసనలు ఉత్పన్నమవ్వవు. దానిచే చిత్తశాంతి యుండక సుఖప్రాప్తి కలుగదు. ఇంద్రియరూప అశ్వములు యోగి యొక్క మనస్సును శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనబడు ఇంద్రియ భోగములను అనుభవింపజేయుచూ ఆత్మను పరమాత్మయందు ఏకత్వమవ్వనివ్వక, ప్రచండ వాయువు జలమునందున్న నావను దూరముగ గొనిపోయి, ముంచివేయు నటుల పరమాత్మను చేరనివ్వవు. సర్వ ప్రాణులకు రాత్రి సమయమున యోగి మేల్కొని పరబ్రహ్మ సాక్షాత్కారము కొరకై యత్నించును. సాంసారిక జనులు ఏ సంసార సుఖములకై మెలకువతో యుందురో అవి యోగికి రాత్రి సమానములు. అనగా యోగి వాని కొరకై జాగరూకుడై యుండడు. అన్ని స్థలముల యందలి జలములు కలిసి నదులై, ఆ నదులు సముద్రమందు కలిసినప్పటికీ సముద్రము స్థితి మారదు. అట్లే సర్వ కామనలు ఎవరి మనసు చేరినప్పటికీ, ఎవరి మనస్సు విచలితము కాదో, ఆ యోగి మోక్షము, శాంతి పొందును. సర్వవైపులా పరుగులెత్తు ఇంద్రియములను వాని విషయముల నుండి నివారించి, వాని యందు సంయమము కలిగిన వ్యక్తి బుద్ధి పరమాత్మ యందు స్థిరపడును. ఎవరు మమతాహంకారములను త్యజించి, సర్వ కామనలను త్యాగమొనర్చి నిత్య పరమార్థ జ్ఞానమందు నిరతులగుదురో, ఆ జ్ఞానముచే ముక్తి ప్రాప్తిఅగును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 1 అను నూట ముప్పది ఏడవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది ఎనిమిదవ అధ్యాయము

(గణేశ గీత - 2)

వరేణ్యుడు "ప్రభూ! మీరు జ్ఞాన, కర్మ మార్గముల రెండింటి గురించీ తెలిపిరి. కానీ ఈ రెంటియందునూ నాకు ఏది శ్రేయస్కరమో నిశ్చయముగ తెలుపవలసినది. "గజాననుడు" పురాతన కాలమందు నేను రెండు విధములయిన మార్గములు తెలిపితిని. అవి సాంఖ్య యోగులకు జ్ఞానయోగము, విహిత కర్మాచరణులకు కర్మయోగము. విహిత కర్మలు కావింపకుండుటచే మానవులు నిష్క్రియులగుదురు. రాజా! కేవల కర్మ త్యాగము వలన మానవులు సిద్ధి నొందలేరు. ఏ మనుష్యుడు కర్మ చేయక ఒక్క క్షణమైననూ యుండజాలడు. ప్రకృతి గుణములైన సత్వ, రజస్, తమో గుణములు మానవుని కర్మ చేయుట యందు వివశుని కావించును. ఒకవేళ మానవుడు కాళ్ళు, చేతులు మొదలగు కర్మేంద్రియములు నియంత్రించు కొన్నప్పటికీ, మనసు పని చేయుట మానదు. ఈ విధమయిన మనుష్యులను "మిధ్యాచారులు" అందురు. ఏ మానవుడు తన ఇంద్రియ సమూహములను మనసుచే వశమొనర్చుకొని, కర్మేంద్రియములచే కర్మ యొనరించినప్పటికీ, దాని యందు తృష్ణ లేక అనాసక్తుడై యుండునో వానిని "కర్మయోగి" అందురు. కర్మ మానుట కంటే అనాసక్తముగ కర్మ అచరించుటయే మేలని నా అభిప్రాయము. కర్మ మానిన ఎడల జీవుల శరీరపోషణ సహితము అసంభవము కదా! ఏ మానవులు కర్మలు నా కర్పింపక కర్మ చేయుదురో, వారు బంధనమందు చిక్కుకొందురు. ఎవరు కర్మ ఫలాసక్తి లేక కర్మ

ఫలములను నాకు అర్పించెదరో లేక నా కొరకు కర్మలొనర్చెదరో వారు కర్మ బంధమందు తగులుకొనరు. కించిత్ ఫలాభిలాషచే కావింపబడిన కార్యమైననూ బంధనమందు ముంచును.

వత్సా! పూర్వకాలమందు నేను చతుర్వర్ణములను, యజ్ఞ విధి విధానములను, ఒసంగి వారందరికీ యజ్ఞముల ద్వారా వృద్ధినొందమని తెల్పితిని. ఈ యజ్ఞములు కల్పవృక్షముల వలె మనో కామనలను పూర్ణ మొనరించును. మనుష్యులు దేవతలను యజ్ఞముల ద్వారా తృప్తి పరచిన ఎడల, దేవతలు మానవులకు పుత్ర, పౌత్ర, కళత్ర, స్వర్ణ, పశు, అన్నాదులు ప్రదానమొనర్చి, వారిని తృప్తులనొనర్చెదరు. యజ్ఞమందు ఆహుతి అనంతరము అవశిష్ఠమైన అన్నము తిను మనుష్యులు సర్వ పాప విముక్తులగుదురు. ఏ మానవుడు కేవలము తన ఉదర పోషణకై భోజన మొనర్చునో, ఆతడు కేవలము పాపమునే భుజించుచున్నాడు. ప్రాణము అన్నము నుండి ఉత్పన్నమగుచున్నది. అన్నము వర్షము వలన పుట్టుచున్నది. వర్షము మేఘముల వలన ఉత్పన్నమగుచున్నవి. మేఘములు యజ్ఞము వలన కలుగుచున్నవి. యజ్ఞము విహిత కర్మాచరణము ద్వారా కలుగుచున్నది. విహితకర్మలు వేదము నుండి ప్రాదుర్భూత మగుచున్నవి. వేదము నా ముఖము నుండి వెలివడినది. సర్వవ్యాపి, సర్వత్ర స్థితుడను, పరమాత్మను అయిన నేను యజ్ఞమందు స్థితిగతుడనైతిని. విద్వాంసుడు ఈ సృష్టి చక్రమును, ఈ విహితానుష్ఠానములను, యధావిధిగ అనువర్తనము కావించి, ఈ జనన మరణ చక్రము నుండి బయట పడవలెను. రాజా! ఏ మానవుడు కేవలము ఇంద్రియములతో క్రీడించుచూ, ఇంద్రియ భోగమునే పరమావధి అనుకొనునో వాడు అధముడు. వాని జీవితము వ్యర్ధము. ఏ మనుష్యుడు స్త్రీ, పుత్ర, ధనాది బాహ్య విషయములను ఉపేక్షించి, అంతరాత్మచే అంతరాత్మయందే రమించుచూ, నిరంతరము ఆనంద స్వరూపుడయిన పరమాత్మనే హృదయమందు చింతించుచుండునో, అట్టి జ్ఞానయోగికి కర్మవలన ప్రయోజనము లేదు. వానికి విహితకర్మలు ఆచరించిననూ, ఆచరింపకున్ననూ పాప పుణ్యములు ప్రాప్తించవు. ఆతని ద్వారా కావింపబడిన పాప పుణ్యములేవియునూ వానికి వర్తింపవు. వానికి ఏ విధమయిన స్వార్ధము యుండదు. అందువలన రాజా! మానవులు అనాసక్తులై కర్మల నాచరింపవలెను. ఆ విధముగ కర్మలను అనాసక్తముగ ఆచరించినవారు నన్నే చేరుదురు. పూర్వకాలమందు ఆ విధముగ ఆచరించిన రాజులు, పండితులు, సర్వులు పరమసిద్ధి నొందిరి. కర్మయోగులు లోక హితార్ధము సహితము కేవలము అనాసక్తత తోనే కర్మల నాచరింపవలెను. శ్రేష్ఠులు ఏ విధమయిన కర్మల నాచరించెదరో అట్లే సామాన్యులు ఆచరించెదరు. శ్రేష్ఠులు ఏ విధమయిన కర్మ, లేక జ్ఞాన మార్గమును అనుసరించెదరో, సామాన్యులు సహితము వాటినే అనుసరించెదరు.

ఓ! రాజా! నాకు ఈ జగత్తుయందు పొందవలసినది, పొంద దగినది, పొందలేనిది ఏదియునూ లేదు. అయిననూ నేను కర్మము నాచరించు చున్నాను. నేను సర్వ స్వతంత్రుడనైనప్పటికీ సహజ ధర్మములు పాటించుచూ కర్మల నొనర్చుటకు కారణము, సామాన్యులు సహితము అదే విధముగ పాటించి సిద్ధి నొందవలెనని, లేని ఎడల వారు అకర్మణ్యులగుదురు. సంప్రదాయములు నష్టమై, సమాజము వర్ణసంకరమై, లోకము దోషభూయిష్ఠమై వినాశనమునకు దారితీయును. ఫలాపేక్ష గల వ్యక్తులు అజ్ఞాన వశమున తమ కొరకై సకామ కర్మల నొనర్తురు. కానీ విద్వాంసులు అనాసక్త బుద్ధితో లోక హితార్ధము శుభకర్మలను ఆచరింతురు. కానీ విద్వాంసులు అజ్ఞానులు కావించు కర్మలంపట పనులయందు తగులుకొనరాదు. వారు స్వయముగ కర్మయోగులై సర్వ కర్మలను కావించుచునే, ఆ కర్మ ఫలములను నా కర్పింపవలెను. అవిద్యచే ఆవరింపబడిన మందబుద్ధులు కర్మల నాచరించి "నేనే చేయుచున్నాను" అని అహంకరించెదరు. గుణములను (సత్వ, రజస్, తమో), కర్మలను ఆత్మనుండి వేరుగా ఎరిగి జ్ఞాని ఆత్మతత్వము నెరిగి, ఇంద్రియములు వాని పనులు అవి చేయుచున్నవని తెలిసి, కర్మ ఫలములందు అనాసక్తుడై యుండును. గుణములచే మోహితులైన అజ్ఞానులు ఫలాపేక్షతో కర్మల నాచరించెదరు. ఆత్మజ్ఞానులైనవారు అజ్ఞానులను కర్మమార్గము నుండి విచలితులను కావింపరాదు. ఎందుకనగా కర్మమార్గమాచరించిననూ, కొన్నాళ్ళకు వారికినీ కర్మ ఫలత్యాగమునందు బుద్ధి కలుగును. ఆత్మజ్ఞానులు తాము కావించు

నిత్య, నైమిత్తిక కర్మ ఫలములను సహితము నాకు అర్పించెదరు. ఎవరు తమ “అహం”, “మమ” (అహంకార, మమకారములు) బుద్ధిని త్యాగమొనర్చెదరో, వారు పరమగతిని ప్రాప్తించెదరు. ఏ మానవులు శ్రద్ధాళువులై, ఈర్ష్యా రహితులై, నా ద్వారా కావింపబడిన పలుకులను పాలన మొనర్చెదరో, వారు సర్వ కర్మ బంధముల నుండి విముక్తులు అగుదురు. అట్లుకాక అశుభకర్మములు ఆచరించు బుద్ధిహీనులు నా వచనములు పాలింపక, ఈర్ష్యాళువులై, మూర్ఖులై, నష్టపోయెదరు. ప్రతి జీవికి తన ప్రకృతి సిద్ధమయిన బుద్ధి యుండును. దానినే “స్వభావము” అందురు. ప్రతి జీవి జ్ఞానులు సహితము తమ స్వభావానుసారమే కర్మల నాచరించెదరు. ఇంద్రియ భోగములందలి అనుకూలత కామము (అనురాగము), వ్యతిరేకత క్రోధమును కలుగజేయును. ఈ కామ క్రోధములకు వశపడినచో యోగి సహితము భ్రష్టుడగును. చక్కగా ఆచరింపబడిన పరధర్మము కంటెను గుణ రహితమయిన స్వధర్మమే మేలు. స్వధర్మము ఆచరించుట యందు మృత్యువు సంభవించిననూ అయ్యది శ్రేయస్కరమే! పరధర్మాచరణ ఇహపర లోకములు రెండింటి యందునూ భయహేతువే!

వరేణ్యుడు “గజాననా! ప్రాణులు (జీవులు) పాప కర్మాచరణమునకు ఇష్టపడనప్పటికీ, ఏదో ప్రబల శక్తిచే ప్రేరితులై పాప మొనర్చుచున్నారు. దీనికి కారణమేమి? “గజాననుడు” రజస్థమో గుణముల నుండి ఉత్పన్నమయిన కామక్రోధములు రెండునూ మహాపాపులు. అవి లోకమును తన వశము నందుంచుకొనును. అవి రెండునూ జీవులకు ప్రబల శత్రువులు. మాయ సంసారిక జీవులను పరివేష్ఠించినటుల, భాష్పములు దృష్టిని మందగింప జేసినటుల, వర్షఋతు మేఘములు సూర్యుని ఆచ్ఛాదించినటుల, కామ క్రోధములు జనుల వివేకమును సంపూర్ణముగ ఆవరించి వివేక శూన్యుల నొనర్చును. సమిధలచే ఆరని అగ్ని వలె, భోగములచే తృప్తినొందని కామము వివేకశీలురైన మనుజుల జ్ఞానమును కప్పివేయును. ఈ కామము మనో, బుద్ధి, ఇంద్రియములనే ఆశ్రయించుకొని యుండి వాటిని మోహగ్రస్తుల కావించును. అందువలన మనుజులు తొలుత ఈ మనో, బుద్ధి ఇంద్రియములనే ఆశ్రయించి, జ్ఞానవిజ్ఞానములను విచ్ఛేదన మొనర్చు కామముపై విజయము సాధింపవలెను. పాంచభౌతిక శరీరము శ్రేష్ఠము. దానికంటె దాని యందలి ఇంద్రియములు ప్రకృష్టము. వాని కంటె మనసు శ్రేష్ఠము. మనసు కంటె బుద్ధి శ్రేష్ఠము. బుద్ధి కంటె ఆత్మ మరింత శ్రేష్ఠము. ఈ విధమయిన ఆత్మజ్ఞానమును పొంది, ఆ ఆత్మబోధ ద్వారా సమాధి స్థితి నొంది, ఆత్మానుభవము నొంది కామ రూప శత్రువును జయించి, పరమ పదమును పొందవలెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత-2 అను నూట ముప్పది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నూట ముప్పది తొమ్మిదవ అధ్యాయము

(గణేశ గీత-3)

గజాననుడు “రాజా! పురాతన కాలమందు నేను త్రిగుణాత్మకులైన త్రిమూర్తులను సృష్ఠించి అందు సత్వగుణ ప్రధానుడైన విష్ణువుకు ఈ యోగమును తెలిపితిని. విష్ణువు సూర్యునకు, ఆయన తన పుత్రుడైన వైవశ్వతునకు తెలిపెను. వైవశ్వతుడు గురు శిష్య పరంపరగా మహర్షులకు విదిత మొనర్చెను. కాలాంతరమున ఈ యోగము విస్మృతి నొందబడి, అవిశ్వసనీయమై, నిందనీయమైనది. అటువంటి సర్వాధిక, గోపనీయ, వేదరహస్య, పరమశుభ, పురాతన యోగమును నీవు తిరిగి నా ద్వారా వినుచుంటివి.” వరేణ్యుడు “గజాననా! నీవు కొన్ని సంవత్సరముల క్రితము పార్వతీ గర్భము నుండి ఉత్పన్నమయితివి. ఇంత చిన్న బాలుడవైన నీవు పురాతన కాలమందు ఎట్లు విష్ణువునకు ఉపదేశించితివి?”

గజాననుడు "రాజా! నీకు, నాకు సహితము అనేక జన్మలు గడచినవి. నీకు ఆ జన్మల స్మరణ లేదు. కానీ నాకా జన్మలన్నింటి స్మరణ యున్నది. ఓ! మహాభాహూ! త్రిమూర్తులు ఆది యందు నా నుండే ఉత్పన్నమై, ప్రళయ కాలమున తిరిగి నా యందే వినీలులగుచున్నారు. నేను పరబ్రహ్మను, మహా రుద్రునీ, సంపూర్ణ చరాచర జగద్రూపుడను. నేను అవినాశినీ, జన్మ లేనివాడను, సర్వ ప్రాణికోట్ల యందున్న ఆత్మను, అనాది మరియు ఈశ్వరుడను. త్రిగుణాత్మకమయిన మాయను ఆశ్రయించి, అనేక యోనులందు జన్మను గ్రహించుచున్నాను. అధర్మము వృద్ధియై, ధర్మము లుప్తమైనపుడు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు, నేను అవతారము స్వీకరించి, అధర్మమును ఛేదించి, ధర్మ సంస్థాపన యొనర్చెదను. అనేక లీలలు గావించుచూ, వేలాది దుష్ట దైత్యుల సంహార మొనర్చుచూ, వివిధావతారములు స్వీకరించి, వివిధ రూపములు ధరించి, సర్వ వర్ణాశ్రమ, మునిగణ, సజ్జనులను రక్షించెదను. ఈ విధముగ ప్రతి యుగము నందునూ నేనవతరించుచునే యుందును. ఏ మానవుడు నా అవతారములను, నా విభిన్న కర్మలను, పరాక్రమమును తెలిసి, తన అహంకార, మమకారములను విడచునో ఆతడు జనన మరణ చక్రము నుండి విముక్తుడగును. అనేక మంది యోగులు నిష్కాములు, నిర్భయులు, క్రోధ రహితులై నన్ను ఆశ్రయించి సర్వమును నాకు సమర్పించి, జ్ఞాన తపములు చే శుద్ధులయి నన్ను చేరెదరు. ఎవరు నా యందు ఏ విధమయిన భక్తిని గొల్చెదరో వారికి అవికారినైన నేను ఆ విధముగనే దర్శనమొసంగి ఫల ప్రసాద మొసంగెదను. జనులు సామాన్యముగ తమ కర్మ ఫలముల కొరకై దేవతలను భజింతురు. వారు నిశ్చయముగ ఆ ఫలితములను పొందెదరు.

నేను ఈ మృత్యులోకము నందు చాతుర్వర్ణములను, త్రిగుణములను, కర్మలను బట్టి సృష్టించితిని. సత్వ గుణ ప్రధానమయిన శమ, దమ, తపము మొదలయిన కర్మలు చేయుటకు భ్రాహ్మణులను, రజోగుణ ప్రధానమయిన శౌర్యాది కర్మములా చరించుటకు క్షత్రియులను, రజస్సు ప్రధానతతో, తమస్సు మిశ్రమముతో కృషి, వాణిద్యము, గో రక్షణ మొదలగు కర్మాచరణమునకు వైశ్యులను, తమస్సు ప్రధానము, రజస్సు గౌణముతో సేవా ధర్మమునకై శూద్రులను సృష్టించితిని. ఈ చతుర్వర్ణముల సృష్టికర్త నైనప్పటికీ విద్వాంసులు నన్ను అనాది, ఈశ్వరుడు, నిత్యుడు అనియు; మరియు నేను అనాసక్తుడను, కర్మ జన్య గుణములనుండి నిర్లిప్తుడనగుటచే అకర్ముడననీ తెలియుదురు. ఎవరు కర్మ ఫల స్పృహ లేక "నేను నిష్కాముడను" అని తలంతురో వారిని కర్మ ఫలములు అంటవు. ఈ విధముగనే పూర్వకాలమందు మోక్షాభిలాషులగు విద్వాంసులు కర్మల నొనర్చిరి. వాసనా సహిత కర్మలు అనగా ఫలప్రాప్తి కాంక్షించు కర్మలు సంసార చక్రమందు దృఢబంధన మొనర్చును. ఇది తెలిసి మానవులు సంసార చక్రము నుండి విముక్తి యొందవలెను. ఇపుడు నీకు "కర్మ" అనగా శాస్త్ర విహిత కర్మలు, "వికర్మ" శాస్త్ర విహితము కాని కర్మలు గూర్చి తెల్పెదను. దీని విషయమై ఋషులు సహితము మౌనులైరి. మోక్షాభిలాషులకు కర్మ, అకర్మ, వికర్మ (నిషిద్ధ కర్మ) ల తత్వము తెలియవలెను. ఈ విధముగ కర్మ మూడు రకములు. ఏ మానవుడు అహంకారము, ఆసక్తి లేక కావించు కర్మ "అకర్మ" అనబడును. ఈ రకమయిన కర్మలు కావించు తత్వదర్శి జీవన్ముక్తుడగును. కానీ ఆసక్తి, ఫలాపేక్షతో కావించు కర్మత్యాగమైననూ అయ్యది కర్మయే అనబడును. ఎవరు కర్మలను, కర్మ ఫల బీజాంకురములను తత్వజ్ఞానమనెడు అగ్నియందు దగ్ధమొనర్చిన ఎడల ఆతడు బుద్ధిమంతుడు అని తెలియవలెను. కర్మఫల త్యాగమొనర్చి, సాంసారిక సుఖ సాధన రహితుడయినప్పటికీ సంతుష్టుడుగ యున్న ఎడల ఆతడు కర్మ బంధితుడు అవడు. ఏ మానవుడు తృష్ణా రహితుడై, ఆత్మ సంయమియై, సుఖోపభోగములన్నింటినీ త్యజించి, కేవలము గృహ పరివార నిర్వహణకై కర్మల నాచరించిన ఎడల ఆతనికి పాతకములు అంటవు. సుఖదు:ఖములు, శీతోష్ణములు, వర్షాతపములు, క్షుధ పిపాసలు, కామ క్రోధములు, రాగద్వేషములు, శోకమోహాది ద్వంద్వములచే ప్రభావితమవ్వక, ఈర్ష్యా రహితుడై, సిద్ధి అసిద్ధుల ఎడల సమభావము నొంది, అనాయాసముగ ఏది లభించినూ సంతుష్టి నొందు మానవులు కర్మబంధనమందు పడరు. సర్వ విషయ వాసనల నుండి విముక్తుడై, జ్ఞాన

విజ్ఞాన యుక్తుడై, ఏ వ్యక్తి కేవలము యజ్ఞ నిమిత్తము కర్మల నాచరించునో, ఆ కర్మలన్నియు అకర్మలై కర్మబంధన మొనర్పవు.

బ్రహ్మజ్ఞాని యజ్ఞమందు అగ్ని, ఆహుతి, హోత (యజ్ఞకర్త), సర్వులు పరమాత్ముడే అని తలచును. అట్టి బ్రహ్మజ్ఞాని సర్వకాల సర్వావస్థల యందునూ బ్రహ్మమందే నిరతుడగును కావున బ్రహ్మమునే పొందును. కొందరు దేవ పూజనమే పరమ యజ్ఞమని తెల్పుదురు. కొందరు యజ్ఞమందు ఆహుతులు వదలుటచే యజ్ఞమందురు. కొందరు యోగులు సంయమము అను అగ్ని యందు ఇంద్రియములను ఆహుతి యొనర్చెదరు. కొందరు జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ విషయములను హోమ మొనర్చెదరు, అనగా రాగద్వేష రహితులై, ఇంద్రియములు విషయములను గ్రహించిననూ వాని యందు అనాసక్తులగుదురు. ఇంద్రియ విషయములను జ్ఞానరూప జ్యోతిచే ప్రదీప్త మొనర్చి, ఆత్మ సంయమము అను అగ్ని యందు హోమము లేక విలీన మొనర్చెదరు. మరికొందరు ప్రాణాయామ పరాయణులై ప్రాణమును అపానమందు, అపానమును ప్రాణమందు హోమమొనర్చి, ప్రాణశక్తిపై విజయమొందెదరు. ఈ విధముగ వివిధ యజ్ఞముల యందు నిరతులై, ఆ యజ్ఞములచే పాప విముక్తులై, యజ్ఞావశిష్ఠ అమృత అన్నము భుజించి యోగులు నిత్య బ్రహ్మమును పొందెదరు. ఏ యజ్ఞము ఆచరింపని మనుజులకు ఇహపర లోకములు రెండింటి యందునూ సుఖముండదు. రాజా! నీవు వేద ప్రతిపాదిత మయిన కాయక, వాచిక, మానసిక యజ్ఞములు సమగ్రముగ తెలిసి, ఆచరించి, బంధన విముక్తుడవు కమ్ము. సర్వ యజ్ఞముల యందు జ్ఞాన యజ్ఞము మిన్న. సర్వవిధ కర్మలు మోక్షసాధన రూప జ్ఞానమందే అంతర్భూతమగును. ఆ ఉత్కృష్ఠ జ్ఞానమును నీవు తత్వజ్ఞాన పారంగతులయిన సజ్జనులకు నమస్కార పూరిత సేవాదులు యొనర్చి, పరిప్రశ్నించి, వారి వద్ద నుండి తెలిసికొన వలసినది. నీ సేవచే సంతుష్ఠులై వారు తప్పక ఆ విషయములు నీకు తెలిపెదరు.

సామాన్యజనులు సజ్జనుల సంపర్కమొందక, ఇతర మనుజుల సంసర్గము నొందుటచే, తత్ఫలితముగ సాంసారిక బంధనములందు పడెదరు. సత్సంగము సర్వులకు సద్గుణములు ప్రాప్తింపజేసి, విపత్తులు దూరమై, ఇహపరలోక సాధనమగును. సాంసారిక మహామోహ లిప్తజనులకు స్వర్గము సులభమవవచ్చును. కానీ సత్సంతము అతి దుర్లభము. అందువలన జనులు ప్రయత్న పూర్వకముగ సత్సంగ మొనర్చి, జ్ఞాన ప్రాప్తి నొంది, పున:బంధనమందు పడరాదు. అటువంటి పరమజ్ఞానమొందిన మనుజులు సర్వప్రాణుల యందున్నది తన ఆత్మయే అతి దృఢస్థితి నొందెదరు. ఆ పరమ జ్ఞానము నొందిన మనుజుడు పరమపాపి అయిననూ, ఆ పాపముల నుండి ముక్తుడగును. లోకాగ్ని క్షణముతో సర్వమును భస్మమొనరించునటుల జ్ఞానాగ్ని సర్వ పాపములను దహించును. మనుజుల పవిత్ర మొనరించుటలో జ్ఞానమునకు మించిన సాధనము వేరొకటి లేదు. ఈ పవిత్ర జ్ఞానమును యోగి కాలక్రమముగ కర్మ యోగము లేక రాజయోగము (సమాధి యోగము) ద్వారా సిద్ధింపజేసికొని, తన ఆత్మ యందు నిరతుడగును. భక్తియుతుడు, జితేంద్రియుడు, సాధుజన సంసర్గుడు, గురు శుశ్రూషా పరాయణుడు ఈ ఉపాయముల చే జ్ఞానము ప్రాప్తించి యోగి అగును. ఈ జ్ఞానము నొంది స్వల్ప కాలమందే పరమ మోక్షము నొందును. ఏ మానవుడు భక్తిహీనుడో, శ్రద్ధా రహితుడో, సర్వత్రా సంశయ సహితుడో వానికి ఇహపర లోకములందు కళ్యాణము అసంభవము. ఆత్మజ్ఞాన నిరతులకు జ్ఞానముచే సంశయములు నష్ఠమై, పరమేశ్వరారాధన ద్వారా సర్వ కర్మ ఫల త్యామొనర్చుటచే వారి కర్మలు బంధనమందు ముంచవు. హృదయమందు స్థితమైన అజ్ఞాన, సంశయములను జ్ఞానరూప ఖడ్గముచే విచ్చిన్న మొనర్చి మానవుడు యోగనిష్ఠుడవ వలెను.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత-3 అను నూట ముప్పది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూట నలభైయవ అధ్యాయము

(గణేశ గీత-4)

వరేశ్యుడు "ప్రభూ! మీరు కర్మయోగము, మరియు కర్మ సన్యాసము గూర్చి తెలిపిరి. ఈ రెండింటి యందునూ నాకేది శ్రేయస్కరమో తెలుప వలసినది." గజాననుడు "కర్మ యోగము, కర్మ సన్యాసము రెండునూ మోక్ష మార్గములే! కానీ ఈ రెండింటి యందునూ కర్మ సన్యాసము కంటె కర్మ యోగమే శ్రేష్ఠము. రాగ ద్వేషములు వదలి, త్రివిధ తాపములు సహించి, ఎన్నడూ ఏ విధమయిన కోరిక లేకుండా, ఎవ్వరినీ ద్వేషింపకుండ యున్న ఎడల కర్మ బంధముల నుండి విముక్తులగుదురు. అల్పజ్ఞానము కల మూర్ఖులు ఈ రెండింటికీ వేర్వేరు ఫలములు తెలిపెదరు. విద్వాంసులు ఈ రెండింటి యందునూ దేనినైననూ ఆచరింపవచ్చు. కానీ విద్వాంసులు కేవలము కర్మ త్యాగమే సన్యాసమని ఒప్పుకొనరు. కర్మ ఫల త్యాగము సంపూర్ణముగ యొనర్చి, కర్మల నాచరించుట చేతనే బ్రహ్మమయులగుదురు. నిర్మలాంత:కరణులు, ఆత్మ సంయములు, జితేంద్రియులు, సర్వ జీవులయందు, తన యందు ఒకే ఆత్మ గలదను విశ్వాసము గల మహాత్ములు కర్మ చేసినప్పటికీ, దాని ఫలము నొల్లరు. కర్మ సన్యాసులు "నా ఇంద్రియములు వాని కర్మలు చేయుచున్నవి. ఆ కర్మలన్నియ పరబ్రహ్మ కల్పించుచున్నవని" తలంతురు. కర్మయోగులు కర్మఫలమందు ఆసక్తి వదలి, మనో వాక్కాయములచే కావింపబడు కర్మలన్నియు చిత్తశుద్ధికే చేయుదురు. కర్మయోగ భావన లేని మనుజులు కర్మలాచరించి, ఫలితము ఆకాంక్షించి బంధనమందు పడెదరు. కర్మ సన్యాసులు సర్వ కర్మలు (నిత్య, నైమిత్తిక, కామ్య, నిషిద్ధ కర్మలు) త్యజించి, కర్మలు చేయక, చేయింపక దేహమునందు సుఖముగ యందురు.

రాజా! నేను ఎవరికీ ఏ విధమయిన కర్మ నిర్దిష్ఠ మొనర్పలేదు, ఎవరినీ కర్త లేక కర్మఫల భాగిని చేయలేదు. అదంతయు ప్రకృతి ద్వారా చేయబడుచున్నవి. నేను పాపపుణ్యముల స్పర్శింపను. కానీ మోహగ్రస్థులు నన్ను శుభాశుభ ఫలములిచ్చువానిగ తలంచెదరు. ఎవని అంత:కరణము నందు ఆత్మజ్ఞానమను సూర్యుని ద్వారా అజ్ఞానము నష్ఠమగునో, వారి యందు ఆత్మజ్ఞానము ప్రకాశితమగును. నా యందు సమర్పిత బుద్ధి కలిగి, నా ధ్యానమందు నిరతచిత్తులై, నా యందు తత్పరులైన భక్తులు బ్రహ్మజ్ఞానము ద్వారా పాపములు నష్ఠ మొనర్చుకొని మోక్షము నొందెదరు. మహాత్ములు పండితుడు అయిన బ్రాహ్మణుని యందు, ఏనుగు, శునకము, ఛండాలుని యందు సమదర్శనము కలిగి యుందురు. సచ్చిదానంద పరమాత్మ నిర్దోషి మరియు సమత్వ భావన కలవాడగుటచే, పైన తెలిపిన మహాత్ములు జీవన్ముక్తులై ఆ పరమాత్మను పొందెదరు. ఏ మనుజుడు ప్రియవస్తు ప్రాప్తికి సంతోషించడో, అప్రియవస్తు ప్రాప్తికి చింతింపడో, ఆ మోహ రహితుడు ఎల్లప్పుడూ బ్రహ్మము నందే స్థితిగతుడగును. ఇంద్రియ భోగములందు అనాసక్తుడై పరమాత్మ ధ్యానమందు రమించు మానవునకు తన అంత:కరణమందు అనందమే నిరతిశయ సుఖము నిచ్చును. ఇంద్రియ సుఖములు తొలుత సుఖము నిచ్చిననూ, చివరకు దు:ఖహేతువులగును. అందువలననే తత్వజ్ఞానులు ఇంద్రియ విషయ భోగములందు రమించక, కామక్రోధములు కలుగుటకు గల కారణమును చింతించి, ఆ రెండింటినీ సహించుచూ, ప్రకట మొనర్చక, శరీర పతనమునకు ముందే వాటిని జయించిన ఎడల, వారికి చిరంతన సుఖప్రాప్తి కలుగును. ఎవరు అంతరాత్మను బ్రహ్మమందు లీనమొనర్చి, జ్ఞానము ప్రాప్తించి, నిరంతరము పరమాత్మ చింతనము చేయుచూ సుఖానుభవమునొంది, సకల ప్రాణుల హితము కోరు వ్యక్తులు అక్షయ పరబ్రహ్మమునే ప్రాప్తించెదరు. అరిషడ్వర్గములను (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు) జయించి, శమ దమాది యుక్తుడయిన ఆత్మజ్ఞాని బ్రహ్మమునే పొందును.

సాధకుడు ఆసనమందు కూర్చొని, ఇంద్రియ విషయములు త్యజించి, భ్రూ మధ్యమందు దృష్టి నిలిపి

ప్రాణాయామము చేయుచూ కూర్చొనవలెను. ప్రాణాపాన వాయు నిరోధమే ప్రాణాయామ మనబడును. విద్వాంసులు మాత్రభేదముచే శ్వాసను లఘువు, మధ్యమ, ఉత్తమమని మూడు విధములుగ విభజించిరి. పన్నెండు ఓంకారములు అవధి యున్న ప్రాణాయామము లఘువనియు, ఇరువది నాలుగు ప్రణవములున్న ప్రాణాయామము మధ్యమమనియు, ముప్పది ఆరు ప్రణవములు యున్న ప్రాణాయామము ఉత్తమ మని తెలుపబడును. ఏ విధముగ మానవులు సింహ, శార్దూల, కుంజరములను మచ్చిక చేసికొందురో, అట్లే ప్రాణ, అపానములను సాధనచే మచ్చిక చేసికొనవలెను. హింసాత్మక జంతువులు వశీభూతమయిన పిదప ఎట్లు సాధువులుగ మారునో, అట్లే ప్రాణాపాన వాయు నియంత్రణచే మనస్సు లొంగి వశీభూతమై, శరీరము దృఢమగును. మనుజులు ఎట్లు సోపానములను ఒకటొకటిగా అధిరోహించెదరో, అట్లే యోగి నిరంతర అభ్యాసము చే ప్రాణాపానములను వశపరచుకొనవలెను. పూరక, కంభక, రేచకములను అభ్యాసమొనర్చి, ఈ విధముగ ప్రాణాయామ మొనర్చు సాధకులకు జగత్తునందు భూత, భవిష్యత్, వర్తమానములు అవగతమగును. ఉత్తమ ప్రాణాయామము పన్నెండు సార్లు ఒనర్చిన ఎడల ఒక “ధారణ” అగును. రెండు ధారణలు ప్రతిరోజూ యోగి అభ్యాసమొనర్పవలెను. ఎవరు ఈ విధముగ అభ్యాస మొనర్చెదరో వారు త్రికాలజ్ఞులు అగుదురు. త్రిలోకములు అనాయాసముగ వానికి వశమగును. ఆతడు తన అంతరాత్మ యందు సంపూర్ణ జగత్తును బ్రహ్మముగ చూచును. ఈ విధముగ కర్మయోగము, కర్మ సన్యాసము కూడా ముక్తి నొసంగును.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత-4 అను నూట నలభైయవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై ఒకటవ అధ్యాయము

(గణేశ గీత-5)

గజాననుడు “రాజా! ఫలాపేక్ష లేకుండా శ్రౌత, స్మార్త కర్మలాచరించుట కర్మ సన్యాసము కంటే మేలు. ఓ! మహాబాహూ! యోగ ప్రాప్తికి కర్మయోగమే ఉత్కృష్ట మయినదని నా అభిప్రాయము. కర్మయోగము సిద్ధించిన మీదట పరమాత్మ ప్రాప్తికై శమ, దమాదులు అత్యంత అవశ్యకము. ఇంద్రియ విషయ లాలసులు స్వయముగ ఆత్మఘాతులు. తమ మిత్రత్వ, శత్రుత్వమునకు; బంధనోద్ధరణములకు ఎవరికి వారే కారణము. మూఢులు తమకు తామే శత్రువులై, బంధనమందు పడెదరు. రాజా! మానవమానములు, సుఖ దు:ఖములు, మిత్ర శత్రువులు, మట్టి బంగారము మొదలగు ద్వంద్వములు పట్ల సమభావన కలిగి జితేంద్రియుడవై యోగాభ్యాస మొనర్పుము. ఈ విధముగ యోగాభ్యాసము కావించు యోగి సర్వోత్కృష్టుడయిన యోగి అగును. దు:ఖ సంతప్తులు, అలసిపోయిన వారు, వ్యాకులురు, క్షుధార్తులు, అన్య మనస్కులు, ప్రాణాయామ మొనరింపరాదు. అత్యంత శీతలము, ఉష్ణము నందు, తీవ్ర వాయువు, జల ప్రవాహములందు, జలపాతములందు, కోలాహలమున్న స్థలముల యందు, జీర్ణ గోశాల యందు, అగ్ని వద్ద, నుయ్యివద్ద, స్మశానమందు, నది యందు, గోడలపైన, ఎండుటాకులపై, వల్మీకములున్నచోట, భూత ప్రేత, పిశాచములున్న ప్రదేశములందు, ప్రాణాయామ మొనరింపరాదు. ప్రాణాయామము దోష రహితముగ చేయవలెను. లేని ఎడల సాధకులకు మతిమరుపు, మూగ, చెవుడు, జ్వరము, జడత్వము, మొదలగు శారీరక దోషములు కలుగును. వీటిని ఎట్టి పరిస్థితుల యందు ఉపేక్షింపరాదు. రాజా! అతిభోజనము, అల్పభోజనము, అతినిద్ర, అల్పనిద్రచే యోగము సిద్ధింపదు. యుక్తాహార, విహార, భోజనాదులు తీసికొని, ఇంద్రియములు నియంత్రించి, నెమ్మది నెమ్మదిగ అనుదినము క్రమము తప్పక యోగాభ్యాస

మొనర్చవలెను. ఈ విధముగ కావించిన ఎడల యోగి పరమశాంతినొంది, విశ్వమంతటినీ తనయందు, తనను విశ్వమంతటి యందూ చూచును. ఈ విధముగ ఎవరు యోగము చే నన్ను చేరెదరో, నేను వారి వద్దకు పరమాదరముగ ఏగెదను. నేనాతని, ఆతడు నన్నూ ఎన్నడూ వీడము. ఎవరు సుఖ దు:ఖములందు, శ(త్రుమి(త్రుల యందు, క్షుధ, సంతుష్టి, బాధలు మొదలగు ద్వంద్వముల రెండింటినీ సమానముగ చూచి, సర్వ (ప్రాణుల యందు ఏకాత్మను కాంచు యోగి పుంగవుడు జీవన్ముక్తుడై, నన్నే ఆ(శయించును. ఆతడు (త్రిలోకములందూ, (బహ్మాదులచే సహితము వందనీయుడగును.

వరేణ్యుడు "స్వామీ! ఈ రెండు సాధనలు నాకు బహు కష్టతరము. ఎందుకనగా అంత:కరణము దుష్టము, చంచలము, మరియు నియం(త్రించుట బహు కష్టము. "గజాననుడు" నిజమే! కానీ అభ్యాస, వైరాగ్యములచే ఈ మనసును ని(గహింప గలిగిన, ఆ సాధకుడు జనన మరణ సంసారచ(క్రము నుండి విముక్తుడగును. ఈ సంసార చ(క్రమునకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములే చువ్వలు. కర్మమే కీళ్ళు. వీటితో ఈ చ(క్రము సుదృఢముగ కదలును. ఇది సామాన్యులకు ఖండించుట సమర్థము కాదు. ఈ సంసారము నందు మనసుపై విజయమునకు అత్యంత దు:ఖ(ప్రాప్తి, వైరాగ్యబోధ, భోగ విలాసముల పట్ల విరక్తి, గురుకృప, సత్సంగము ఉపాయములు. లేని ఎడల యోగసిద్ధితో అభ్యాసమొనర్చి, మనస్సును వశమొనర్చుకొనవలెను. వరేణ్యా! మనసుపై విజయమందక యోగసిద్ధి నొందుట దుర్లభము." వరేణ్యుడు "మహా(ప్రభూ! యోగ(భ్రష్టులు ఏ లోకమున కేగుదురు? వారి గతి ఏమి? వారికి కలుగు ఫలమేమి?" గజాననుడు "యోగ(భ్రష్టులు దేహత్యాగానంతరము స్వర్గమందు దివ్య దేహము ధరించి, ఉత్తమ భోగముల నుభవించి, ధన వైభవములున్న కుటుంబమందు తిరిగి జన్మించి, పూర్వజన్మ సంస్కారములచే తిరిగి యోగులగుదురు. వారు ఎన్నడూ నరకమున కేగరు. రాజా! జ్ఞాన, తపో, కర్మనిష్ఠ కలిగిన వారి కంటె యోగులు (శేష్ఠులు. వారందరిలో నాపై భక్తి గలవారు (శేష్ఠులు.

((శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత-5 అను నూట నలభై ఒకటవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై రెండవ అధ్యాయము

(గణేశ గీత-6)

గజాననుడు "రాజా! నీకు లోక హితార్థమై తత్వమును బోధించెదను. నీవు నీ అంతరాత్మ యందు నా యందు మనసు నిలిపి, ఈ తత్వములను విచారించి, నన్ను సర్వాంతర్యామిగా (గహించి మోక్షము నొందుము. దీనిని మించి తెలుసుకొనునది, తెలసుకోగలిగినది ఇకలేదు. నేను పర, అపర అను ద్వి (ప్రకృతి స్వరూపుడను. తొలుత పరా (ప్రకృతిని తెలిసికొనన ఎడల మానవులు జ్ఞాన(ప్రాప్తి నొంది, నన్ను జ్ఞాన గోచరునిగ తెలిసెదరు. అహంకారము, బుద్ధి, మనస్సు, ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధివి, సూర్యుడు, చం(ద్రుడు, యజమానము – ఈ పది విభక్తులు నా అపరా (ప్రకృతి. రెండవది నా పరా(ప్రకృతి. ఇయ్యది నా జీవ రూపమున (త్రిలోకములయందు వ్యాప్తి నొందినదిగా మునులు తెలియుదురు. ఈ రెండు పర, అపర (ప్రకృతుల నుండే సర్వ జగత్తు ఉత్పన్నమయినది. సంగమే విశ్వోత్పత్తికి కారణము. ఈ జగత్తును సృష్టించి పాలించి, సంహరించునది నేనే! సర్వ వర్ణా(శమ (ప్రాణులందు ఎవరో ఒకరు ఈ తత్వమును తెలుసుకొనుటకు యత్నించెదను. ఈ విధముగ యత్నించు వారిలో ఎవరో ఒకరు తమ పూర్వజన్మ సుకృతముచే నా సాక్షాత్కారము నొందెదరు. ఈ పుణ్యకర్ముడయిన యోగి నన్ను అన్నిచోట్లా చూచుచూ నా నుండి అభిన్నుడగును. నేను పృధివి యందు గంధముగ, అగ్ని యందలి తేజముగ, సూర్యుని యందు వెలుగుగ, జలములందలి రుచిగ, బుద్ధిమంతుల

యందలి బుద్ధిగ, తపస్సుల తపముగ, బలవంతుల యందలి బలముగ, త్రిగుణములుగ యున్నది నేనే! త్రిగుణములు నానుండే ఉత్పన్నమయినవి.

మాయా మోహితులైన పాపులు నన్ను ప్రాప్తించరు. త్రిగుణములు (త్రివికారములు) అయిన సత్వ, రజస్, తమోగుణములు కల మాయ లేక ప్రకృతి లోకులను మోహితుల కావించుచున్నది. కానీ నా తత్వమును గ్రహించిన జ్ఞాని ఈ మోహము వీడును. ఈ విధముగ అనేక జన్మలందు నన్ను తెలిసికొని జ్ఞానులు ఈ సంసార చక్రము నుండి విముక్తులగుదురు. ఎవరు ఏ దేవతను ఉపాసించెదరో, వారు ఆ దేవత చే కామనా పూర్ణము నొనర్చుకొందురు. నేను త్రికాలములు (భూత, భవిష్యత్, వర్తమాన కాలములు) ఎరుగుదును. కానీ నన్ను ఎరిగిన వారెవరూ లేరు. నేను అవ్యక్తుడనైనప్పటికీ అనేక అవతారముల ద్వారా ప్రకటీకృతుడ నగుదును. కానీ కామమోహితులైన జనులు నన్ను తెలియరు. అజ్ఞానులకు, పాపాచారులకు, నేను గోచరమవ్వను. అంత్య కాలమునందు నన్ను స్మరించు భక్తులు నన్నే చేరుదురు. భక్తులు ఏఏ దేవతలను అంత్యకాలమందు స్మరించెదరో, వారు ఆ దేవత యొక్క సాలోక్యము నందెదరు. అందువలన అనేక రూపుడనైన నన్ను భక్తులు అహర్నిశలు స్మరింపవలెను. నదులన్నియు సముద్రమును చేరునట్లే సర్వుల ప్రాప్యము నేనే! బ్రహ్మ, విష్ణు, శివాదుల లోకములు చేరిన జీవులు పతనమై తిరిగి జన్మించెదరు. కానీ నా లోకము చేరిన జీవులకు పతనముండదు. అందువలన జీవులు అన్య దేవతల నాశ్రయింపక, నన్నే శరణమొంది, భక్తితో నా ఆరాధన కావించిన ఎడల వారి యోగక్షేమములను నేను స్వయముగ కాపాడెదను. మానవుల పరలోక ప్రయాణము శుక్ల, కృష్ణములను రెండు విధములుగ యుండును. శుక్లము నందు పరబ్రహ్మమును, కృష్ణము నందు సంసార చక్రమును ప్రాప్తించెదరు.

(శ్రీ గణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 6 అను నూట నలభై రెండవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై మూడవ అధ్యాయము

(గణేశ గీత - 7)

వరేణ్యుడు "స్వామీ! శుక్ల, కృష్ణ గతులనగా ఏమి? ఎవరు ఈ యానము కావించెదరు? బ్రహ్మ, ప్రకృతి అనగా ఎవరు? "గజాననుడు" ఏ మార్గము వెలుగుతో నిండి, పగలుగా యుండి, ఉత్తరాయణ పుణ్యకాలము నడచుచుండునో అయ్యది శుక్లగతి. ఏ మార్గము చంద్రుని వెలుతురుతో యుండి, ధూమమయమై, రాత్రివేళ, దక్షిణాయన పుణ్యకాలము నడచుచుండునో అయ్యది కృష్ణగతి. శుక్లగతి పరబ్రహ్మ ప్రాప్తికి, కృష్ణగతి సంసార చక్రమునకు కారణమగును. ఈ సంపూర్ణ దృశ్యాదృశ్య జగత్తు సర్వము బ్రహ్మమే అని తెలియుము. ఇందు నాశనమగునది పంచభూతాత్మిక సృష్టి, దానియందు అంతర్లీనముగ అక్షరుడను, అవినాశిని అయిన నేను యుంటిని. ఈ రెండింటికి పరముగ యున్నది శుద్ధ సనాతన బ్రహ్మము. అనేక మార్లు జన్మమొందుటచే "సంసృతి" (సంసార చక్రము) అనబడును. నన్ను గుర్తింపని, పూజింపని వారలు తిరిగి, తిరిగి, ఈ సంసార చక్రమందు పడెదరు. ఎవరు నన్ను సరియైన, సముచితమైన రీతిలో ఉపాసించెదరో వారు పరబ్రహ్మ ప్రాప్తి నొందెదరు. ధ్యానాది ఉపచారములు, పంచామృత స్నానము, వస్త్రాలంకార చందన సుగంధ లేపనములు, ధూప దీప నైవేద్యములు, ఫలములు, తాంబూలము, దక్షిణలతో ఏకాగ్రతతో ఎవరు నన్ను పూజించెదరో వారి అభీష్టములను నేను పూర్ణ మొనర్చెదను. నా భక్తులు ఈ విధముగ నన్ను ప్రతిదినము పూజింపవలెను.

లేని ఎడల ఫలము, పుష్పము, పత్రము, నీరు, ఏదైన సమర్పింపలెను. లేని ఎడల నా మానసిక పూజ కావింపవలెను. త్రివిధ పూజలందు మానసికపూజ సర్వశ్రేష్ఠము. నా పూజ యందు ఇచ్ఛ లేక ఫలరహిత పూజ అత్యుత్తమము. బ్రహ్మచారులు, గృహస్తులు, సన్యాసులు, ఈ త్రివిధ పూజల యందు ఏదో ఒకటి కావించిన ఎడల నన్నే పొందెదరు.

ఏ మానవులు నన్ను పూజింపక, ఇతర దేవతలను పూజించిననూ పరిమాణత: వారు నన్నే పూజించినట్లు. కానీ, అది విధి విధానము కాదు. కానీ నన్ను ద్వేషించి, ఇతర దేవతలను పూజించు మనుజులు నరకగాములగుదురు. నా ఉపాసన యందు తొలుత భూతశుద్ధి కావించి, ప్రాణ ప్రతిష్ఠాపన ఒనర్చవలెను. మనుసును ఇతర వ్యాపకముల నుండి వెనుకకు మరల్చి, అంతర్ మాతృకాన్యాసము, బహిర్ మాతృకా న్యాసము, షడంగ న్యాసము కావించి, మూల మంత్రమును ధ్యానమొనర్చి, తదుపరి జపము కావింపవలెను. నా మంత్రమును గురుముఖతా పొంది, దానిని స్థిర చిత్తముతో జపమొనర్చవలెను. తదుపరి ఆ జపమును జపదేవతకు సమర్పించి, ఆ దేవతలను అనేక స్తోత్రములతో స్తుతింపవలెను. ఈ విధముగ ఉపాసన యొనర్చు ఉపాసకుడు మోక్షప్రాప్తి నొందును. ఉపాసనా రహితమైన జీవితము వ్యర్థము. యజ్ఞము, ఔషధము, మంత్రము, అగ్ని, ఆజ్యము, హవిస్సు, హోమ ద్రవ్యములు, ధ్యాన ధ్యేయములు, స్తుతి, స్తోత్రము, నమస్కారము, భక్తి, ఉపాసన, వేదమందలి జ్ఞానము, పవిత్రత, బ్రహ్మ, ఓంకారము, పావనము, సాక్షీ, ప్రభువు, మిత్రులు, గతి, ప్రళయము, ఉత్పత్తి, పాలన, పోషణ, బీజము, శరణము, నివాసము, మృత్యువు, సత్పురుషుల అమరత్వము, ఆత్మ, పరబ్రహ్మము నేనే! నేనే!!

మానవులు కావించు దాన, హోమ, తప, భక్తి, జప, స్వాధ్యాయములు, అన్నియు నాకే సమర్పింపవలెను. దురాచారులు, పాపులు, సర్వజనులు, నన్నాశ్రయించి, నన్ను శరణుజొచ్చిన ముక్తులు అగుదురన, ఇక నా భక్తుల మాట చెప్పనేల? నా విభూతులను స్మరించు భక్తులు ఎన్నటికీ నాశనమవ్వరు. నా విభూతులను, అవతారములను దేవతలు, ఋషి, మునిగణములు తెలియరు. నేను నానా రూపములతో ఈ విశ్వమంతయు వ్యాప్తినొంది ప్రతిష్ఠుడనైతిని. ఈ లోకమందు శ్రేష్ఠమయినది దేనిని చూచిననూ నీవు అయ్యది నా విభూతియే అని తెలిసికొనుము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 7 అను నూట నలభై మూడవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై నాల్గవ అధ్యాయము

(గణేశ గీత - 8)

వరేణ్యుడు "ఓ! భగవాన్! నారదుడు మీ వివిధ రూపముల గూర్చి తెలిపెను. అవన్నియు నాకు తెలియవు. మీ సర్వ విభూతులు ఆయనకు సహితము తెలియవు. కేవలము మీరు మాత్రమే వానిని తెలియుదురు. నాకు మీ సుందర సర్వవ్యాపి రూపమును దయచేసి చూపింప వలసినది". గజాననుడు "వరేణ్యా! నా శరీరమందు చరాచర విశ్వమును, నానా ప్రకారములయిన దివ్యాశ్చర్యములను, ఇంతకు పూర్వము ఎవరూ కాంచని దివ్యరూపమును వీక్షింపుము. నీకు జ్ఞాన నేత్రములు ప్రసాదించెదను. చర్మ చక్షువులతో అజుని (జన్మ లేని వానిని), అవ్యయుని (అవినాశిని) చూడలేరు". అపుడు పరమాత్ముడు గజాననుడు వరేణ్యునకు తన విశ్వరూపమును చూపించెను. ఆ మహాద్భుత రూపము అనేక బాహూదర, వక్త్ర నేత్ర, ముఖములతో కూడి, సుగంధానులేపితమై, దివ్య దుకూల భూషణధారియై, దివ్య మాలాలంకృతమై, కోటి సూర్య ప్రకాశమై, వివిధాయుధములు ధరించి యుండెను. ఆయన శరీరమందు వరేణ్యుడు త్రిలోకములను కాంచెను.

ఆ పరమాశ్చర్య ఈశ్వరీయ రూపమును గాంచి వరేణ్యుడు “స్వామీ! నేను మీ శరీరమందు దేవతలు, ఋషులు, పితరులు, సప్త పాతాళములు, సప్త సముద్రములు, సప్త ద్వీపములు, రాజులు, వనవాసులైన ఋషులు, సప్తవర్షులను చూచుచుంటిని. మీ శరీరమందు సప్త ఊర్ధ్వలోకములు, మనుష్యులు, యక్ష, రాక్షస, నాగులు, త్రిమూర్తులు, ఇంద్రాది దేవతలు, అనేక ప్రకారములైన జీవ జంతువులను, కాంచుచుంటిని. అనాది, అనంతము, సృష్ట్యాది నుండి యుండినది, అనంత శిరములు, భుజములు కలిగినది, ప్రదీప్తమయిన అగ్ని వలె వెలుగొందునది, అప్రమేయము, పురాతనము, కిరీటకుండలములు కలిగినది అయిన నీ తేజోరూపము అత్యంత తేజోమయమగుటచే చూచుటకు కఠినతరముగ యున్నది. విశాల వక్షస్థలము గల ప్రభూ! నిన్ను చూచుచుంటిని.

దేవతలు, విద్యాధరులు, యక్ష, కిన్నెర, ముని, మానవ, అప్సరస, గంధర్వ, అష్ఠ వసువులు, ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, సిద్ధ, సాధ్య గణములు ద్వారా భక్తితో సేవింపబడుచూ, విస్మితులై చూడబడుచున్న మిమ్ము నేను చూచుచుంటివి. మీరు సర్వజ్ఞులై, అక్షరులై, జ్ఞానజ్ఞాతలై, ధర్మరక్షకులై ఈశ్వరులై, సప్తపాతాళములు, దిశలు, స్వర్గములు, సంపూర్ణ పృధివి యందు వ్యాప్తినొందుట కాంచుచుంటిని. ఇటువంటి మీ రూపము చూచి నాతో సహితముగ సర్వులు భయభీతులగుచున్నారు. వివిధ కరాళదంష్ట్రులు, సర్వ విద్యావిశారదులు, ప్రళయాగ్ని సమాన ఆకారస్తులు, జటలు గలిగి ఆకాశమును చుంబించుచున్న మీ రూపము చూచి నేను భ్రమితుడనగుచున్నాను. దేవ, మానవ, నాగాది సర్వులు మీ ఉదరమున యుండిరి. సముద్రపు నీరు ఆవిరై, మేఘమై, వర్షపునీరు, నదులు చేరి చివరకు సముద్రము చేరునట్లు, నానా యోనుల యందు జన్మించిన జీవజాలము చివరకు మీ యందే ప్రవేశించుచున్నది. స్వామీ! ఇంద్రాగ్ని, యమ, నైఋుతి, వరుణ, మారుత, కుబేర, ఈశాన, సోమ, సూర్యాది సంపూర్ణ జగత్తు మీరే! స్వామీ! మీకు నమస్కారము! నమస్కారము!! నమస్కారము!!! నాపై కృప యుంచి నాకు ఇంతకు ముందు చూపిన మీ సౌమ్యరూపము తిరిగి చూపింప వలసినది. మీ లీలలు తెలిసికొనుట ఎవరికైననూ అసాధ్యము. మీ కృపా కటాక్షములచే నాకు దివ్య చక్షువులు ప్రసాదించుట వలన మాత్రమే నేను మిమ్ములను చూడగలిగితిని.” అంత గజాననుడు “ఓ! మహాబాహూ! యోగులు కానివారు నా ఈ రూపమును చూడలేరు. నారద, సనకాదులు నా కృపచే ఈ రూపమును చూచుచుందురు. చతుర్వేదముల అర్ధతత్వజ్ఞాతలు, సర్వశాస్త్ర నిష్ణాతులు, యజ్ఞ, దాన, తపోనిరతులు, సహితము నా ఈ రూపమును చూడలేరు. కేవలము భక్తి ద్వారా మాత్రమే నన్ను చూడగలరు, తెలియగలరు, ప్రాప్తించగలరు. ఇక నీవు భయ మోహములు విడచి నా సౌమ్యరూపమును కాంచుము. రాజా! ఎవరు నా భజన, పూజన యందు తత్పరులై, సర్వాశక్తి రహితులై, నా నిమిత్తమే కార్యములాచరించుచూ క్రోధ రహితులై, సర్వ ప్రాణి సమ భావన కలిగిన నా భక్తులు నన్ను చేరెదరు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 8 అను నూట నలభై నాల్గవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై ఐదవ అధ్యాయము

(గణేశ గీత - 9)

వరేణ్యుడు “స్వామీ! భక్తులు మిమ్ము ద్వివిధములుగ కొలిచెదరు. కొందరు అనన్య భక్తి భావముతో నీ మూర్తిని (సాకారమును) ఉపాసించెదరు. మరికొందరు నీ అక్షర, అవ్యక్త, నిరాకారమును ఉపాసించెదరు. ఈ రెండింటి యందును ఏది ఉత్తమము? ఓ! పరమాత్మా! నీవు సర్వజ్ఞాత, సర్వసాక్షి, అయిన ఈశ్వరుడవు కావున దయతో నాకు తెలుపవలసినది.

"గజాననుడు" భక్తులు నన్ను అనన్యభావముతో హృదయమందు స్థాపించుకొని, నా సాకారమూర్తిని ఉపాసించెదరు. మరికొందరు ఇంద్రియములు నిగ్రహించి, సర్వ ప్రాణుల యందు సమానత్వము నొంది ధ్యానముచే రూప రహితుడను, సర్వవ్యాపిని, కూటస్థుడను, అచలుడను, అనిర్దేశ్యుడను, అక్షర పరబ్రహ్మనైన నా నిరాకారమును ధ్యానించెదరు. నేను వీరిరువురినీ ఉద్ధరించెదరు. కానీ అవ్యక్తోపాసన (నిరాకార తత్వమును ధ్యానించుట) కష్టతరము. నా సాకారోపాసన చే ఏ ఫలము నొందెదరో, నా నిరాకారోపాసన చే అదే ఫలము నొందెదరు. నా కృప నొందుటకు భక్తి ఒక్కటే మార్గము. భక్తితో నన్ను పూజించు మానవుడు ఏమీ తెలియకున్ననూ, ఆతడు విద్వాంసుల కంటె శ్రేష్ఠుడు. భక్తి రహితముగ నన్ను పూజించు బ్రాహ్మణుని కన్న భక్తితో పూజించు ఛండాలుడు మిన్న.

పురాతన కాలమందు శుకుడు, సనకాదులు, నారదాది చిరాయువులు, భక్తి మూలముగనే ముక్తి నొందిరి. ఓ! రాజా! నీవు భక్తిచే నీ మనోబుద్ధులను నా యందు యుంచి భజింపుము. నీవు నన్నే పొందెదవు. ఒకవేళ నీవు ధ్యానమందు మనసు నిలుపుటకు అసమర్ధుడ వగుదువేని, నెమ్మది నెమ్మదిగ వేరు వేరు ప్రదేశములకు ఏగుచున్న మనసును మళ్ళించి, తిరిగి తిరిగి నా ధ్యానమందు లగ్నమొనర్చు అభ్యాసమొనర్చుము. ఈ అభ్యాసము కష్టతరమయిన ఎడల నీ కర్మ ఫలములను నాకు అర్పింపుము. నీవు నా అనుగ్రహముచే పరమపదము ప్రాప్తించెదవు. అదియును కష్టతరమైన ఎడల త్రివిధ (మనోవాక్కాయ) కర్మ ఫలములను ప్రయత్న పూర్వకముగ త్యజించి, నా కర్పింపుము. అభ్యాసముచే జ్ఞానము నొందుట శ్రేష్ఠము. ఆ జ్ఞానము కంటె ధ్యానము శ్రేష్ఠము. ధ్యానము కంటె కర్మఫల త్యాగము శ్రేష్ఠము. దానికంటె శాంతి శ్రేష్ఠము. అహంకార, మమతా, రాగ, ద్వేష రహితుడు, ద్వంద్వముల యందు సమభావమున్న భక్తుడు నాకు ప్రియుడు. ఎవరిని చూచి జనులు భయము నొందరో, ఎవరు జనుల చూచి భయమునొందడో, హర్ష, క్రోధ రహితులైన భక్తులు నాకు ప్రియులు. శత్రుమిత్రాదులు, నిందాస్తుతులు, శోకహర్షములు, యందు సమానస్థితి నొంది, మౌనియై, స్థిరబుద్ధినొంది, సర్వాసక్తిరహితుడై, భక్తి తత్పరుడగు భక్తుడు నాకు ప్రియుడు. ఏ మానవుడు నా ద్వారా కావింపబడిన ఈ ఉపదేశమును అర్ధము చేసికొని పాటించునో ఆ మహాత్ముడు సర్వలోక వందనీయుడు మరియు నాకు సదైవ ప్రియుడు. ఎవరు అభీష్ఠ ప్రాప్తి యందు ప్రసన్నత, అనిష్ఠ ప్రాప్తి యందు ద్వేషము పొందడో, మరియు క్షేత్ర క్షేత్రజ్ఞులను తెలియునో ఆతడే నాకు విశేష ప్రియుడు.

వరేణ్యుడు "ఓ! కరుణాసాగరా! క్షేత్ర, క్షేత్రజ్ఞులనగా ఎవరు? వారిని ఎట్లు తెలిసికొనవలెను?" గజాననుడు "పంచ మహాభూతములు (ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధివి), పంచ తన్మాత్రలు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు), పంచ కర్మేంద్రియములు (వాణి, కాళ్ళు, చేతులు, మల, మూత్ర ద్వారములు), మనో, బుద్ధి, అహంకారములు, పంచ జ్ఞానేంద్రియములు (నేత్రము, చెవి, ముక్కు, చర్మము, నాలుక), కోరిక, మూల ప్రకృతి, ధృతి, ద్వేషము, సుఖ దు:ఖములు, చేతనా సహిత ఈ సమూహ మంతయు "క్షేత్రము" అనబడును. నేనే వీటన్నిటి యందునూ యన్న సర్వాంతర్యామిని. తెలుసుకొను వాడను (జ్ఞాత), అయిన "క్షేత్రజ్ఞుడను". ఈ క్షేత్రమందున్న విషయజ్ఞాతను నేనే! ఆర్జవము (మనో వాక్కాయ సరళత), గురు శుశ్రూష, ఇంద్రియభోగ విరక్తి, శుద్ధి (మనో నిర్మలత్వము), క్షాంతి (క్షమాశీలత), డంభము లేకుండుట, జన్మాదులందు (జన్మ, జర, వ్యాధి, మృత్యువు), దు:ఖ, దోషములు చూచుట, సమదర్శనత్వము, దృఢభక్తి, ఏకాంతవాసము, శమ (బాహ్యేంద్రియ నిగ్రహము), దమ (అంతరేంద్రియ నిగ్రహము), వీటన్నిటినీ కలిపి జ్ఞానమందురు. ఓ! రాజా! నీవు ఈ జ్ఞాన విషయమును గ్రహించి పరమపదము ప్రాప్తింపుము. విద్వాంసులైన జనులు అట్లే చేయుదురు. అనాది, ఇంద్రియ రహితుడయినప్పటికీ సర్వేంద్రియ, గుణములను భోగించువాడు, ఇంద్రియార్ధములందు (శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములందు) వ్యాపించినవాడు, విశ్వమును ధరించినవాడు, సర్వవ్యాపి, ఏకమైనప్పటికీ అనేకములుగ ప్రతీతమైనవాడు, నానా రూపములతో దృష్టిగతమైనవాడు, చరాచర ప్రాణికోట్ల బాహ్యాంతరములందు

విరాజమానుడు, ఆసక్తి రహితుడు, అజ్ఞాన రూపాంధకారమునకు దూరుడు, మరియు పోగొట్టువాడు, అతిసూక్ష్ముడు అగుటచే దుర్జ్ఞయుడు, సూర్య, నక్షత్రాదులందు తేజరిల్లెడి తేజము, జ్ఞానగమ్యుడు, పురాతన పురుషుడు, అవినాశయే పరమాత్మ! పరమాత్మ!!

ప్రకృతికి పరుడైన పురుషుడు ప్రకృతి జనితమైన త్రిగుణములచే ఉత్పన్నమయిన పదార్థములను భోగించును. ప్రకృతి ఈ సత్వ, రజస్, తమో గుణములచే పురుషుని దేహమందు బంధించును. చైతన్యాత్మిక జ్ఞానము, క్షమాశీలత, అధికమయినపుడు సత్వ గుణాధిక్యము కలుగును. లోభము, అశాంతి, తృష్ణ, అధికమయినపుడు, కర్మ ప్రవృత్తికి కారణమయిన రజోగుణాధిక్యత కలుగును. తమోగుణాధిక్యత చే మోహము, అజ్ఞానాదికములు కలుగును. సత్వ గుణాధిక్యము చే సుఖము, జ్ఞానప్రాప్తి, రజోగుణాధిక్యముచే కర్మప్రవృత్తి, తమో గుణాధిక్యముచే నిద్ర, ఆలస్యము, అలసత్వము కలుగును. ఈ విధముగ మనుజులు సత్వగుణాధిక్యముచే ముక్తినీ, రజోగుణాధిక్యముచే సంసార చక్ర పరిభ్రమణము, తమో గుణాధిక్యతచే దుర్గతులు ప్రాప్తించెదరు. అందువలన రాజా! నీవు సత్వగుణ యుక్తుడవై పరిపూర్ణ ఏకాగ్ర భక్తి భావముచే సర్వవ్యాపినైన నన్ను భజించి, పూజింపుము. అంతేకాదు. రాజా! సూర్య చంద్రాగ్ని తారల యందు, విద్వాంసులైన బ్రాహ్మణుల యందు యున్న తేజము నేనే! నేనే సృష్టిస్థిత్యంతములు కావించుచున్నాను. నేనే నా జల, సోమతత్వముచే ఓషధులతో సంపూర్ణ విశ్వమును తృప్తి యొనర్చుచున్నాను. నేనే ఇంద్రియముల యందు సంపూర్ణ భోగములు భోగించుచున్నాను. ఉదరస్థ అగ్నినై జీర్ణమొనర్చుచున్నాను. శివ, విష్ణు, శక్తి, సూర్య, గజాననులనెడి పంచాయతనము నేనే! ఇంద్రాది లోకపాలురు నా అంశలే! ఎవరు ఏ విధముగ నన్ను ఉపాసించెరో, వారిని నేనట్లే అనుగ్రహించెదను. రాజా! నీవు నన్ను శరణుమొందితివి కావున క్షేత్ర, క్షేత్రజ్ఞుల మరియు జ్ఞాన, జ్ఞేయ విషయములు బోధించితిని.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 9 అను నూట నలభై ఐదవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై ఆరవ అధ్యాయము

(గణేశ గీత - 10)

గజాననుడు "రాజా! మానవుల ప్రకృతి దైవీ, ఆసురీ, రాక్షసీ అని మూడు విధములు. ఈ మూడు విధముల ప్రకృతుల చిహ్నములు, ఫలములు నీకు తెల్పెదను. దైవీ ప్రకృతి ముక్తినీ, ఆసురీ, రాక్షసీ ప్రవృత్తులు కర్మ బంధమును ప్రసాదించును. దైవీ ప్రకృతి గుణములు – ధైర్యము ఆర్జవము (వాక్, మనో సరళత), నిష్కపటత్వము, నిర్భీకత, అహింస, క్షమ, శౌచము, దయ మరియు కొండెములు చెప్పకుండుట, క్రోధము, చపలత్వము, దురభిమానము, లేకుండుట. ఆసురీ గుణములు – కటువుగ మాట్లాడుట, దురభిమానము, దర్పము, అజ్ఞానము, క్రోధము. రాక్షసీ గుణములు – నిష్ఠురత్వము, మదము, మోహము, అహంకారము, గర్వము, ద్వేషము, హింస, నిర్దయ, క్రోధము, దుర్వినీతము, అభిచారిక కర్మములు, క్రూర కర్మల యందు రుచి, సత్పురుషుల యందు అవిశ్వాసము, అశుచి, అకర్మణత్వము, వేద, భక్తగణములు ఎడల నిష్కారణ ద్వేషము, దేవతా, ముని, శ్రోత్రియ, బ్రాహ్మణ, స్మృతి పురాణముల నింద, పాఖండ వచనములందు విశ్వాసము, మలిన తను, మనస్కుల తోడి సంసర్గము, డంభయుక్త కర్మ ప్రదర్శన, పరవస్తు కామన, అత్యధిక కోరికలు కలిగియుండుట ఎల్లప్పుడూ అసత్యమాడుట, ఇతరుల ఉన్నతిని సహింపలేకుండుట, ఇతరుల కార్యములను

భగ్నము చేయుట, ఇవన్నియు రాక్షసీ గుణములు.

రాజా! తామసీ ప్రకృతి యున్న మనుజులు నిశ్చయముగ రౌరవాది నరములందు పడి, వర్ణింపలేని బాధలను అనుభవించి, దైవవశమున ఎన్నాళ్ళకో అక్కడి నుండి బయటపడి భూమి యందు క్షుద్ర జంతువుల వలె, అంధులు, వికలాంగులు, దీన దు:ఖితుల వలె జన్మించెదరు. నా భక్తిలేని ఆ పాపులు తిరిగి నరకమందు పడెదరు. నా భక్తులు ఏ యోని యందు పుట్టిననూ ఉద్ధరింప బడెదరు. వారు యజ్ఞము మరియు ఇతర అనుష్ఠానములచే స్వర్గమునకేగెదరు. సకామోపాసన కావించువారలకు స్వర్గప్రాప్తి సులభము. కానీ నా భక్తి దుర్లభము. మూర్ఖులు మోహము మరియు తమ కర్మరూప పాశములచే బంధింపబడుదురు. ఈ మూర్ఖులు "నేను పండితుడను; నేను సుఖించుచున్నాను" అని తలంతురు. ఈ దుర్బుద్ధి అధ:పతనము కావించును. రాజా! నీవు ఈ ఆసురీ, రాక్షసీ ప్రవృత్తిని విడచి దైవీ ప్రవృత్తిని ఆశ్రయింపుము. స్థిరచిత్తముతో నా భక్తిచే నన్ను భజింపుము. భక్తి మూడు విధములు. అయ్యది సాత్వికీ, రాజసీ, తామసీ భక్తి. భక్తియుతముగ దేవతా పూజనము సాత్వికీభక్తి. యక్ష, రాక్షస పూజనము రాజసీ భక్తి. అయ్యది జనన మరణ చక్రమందు పడవేయును. వేద విధి విధానములను వదలి క్రూరత, అహంకారము, డంభముచే భూత, ప్రేత పిశాచాదులను ఉపాసించి కేవలము తమ భౌతిక మనోకామనా సిద్ధికై దృఢమయిన నిశ్చయము కలిగి శరీరమును శుష్కింపచేసికొని, అంతరమునున్న భగవానుని సహితము క్షోభింపజేయు భక్తి తామసీభక్తి అనబడును. ఈ తామసీ భక్తి నరక ప్రదము. అందువలన కామ క్రోధాదులను వర్జింపుము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి గణేశ గీత - 10 అను నూట నలభై ఆరవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై ఏడవ అధ్యాయము

(గణేశ గీత - 11)

గజాననుడు "రాజా! తపము మూడు విధములు. అవి కాయక, వాచక, మానసికములు. ఋజుత్వము, ఆర్జవము, తను మనశ్శుద్ధి, అహింస, బ్రహ్మచర్యము, గురుజన, బ్రాహ్మణ, విద్వాంసుల, దేవతల పూజనము, నిత్యస్వధర్మ పాలనము, కాయక తపస్సు అనబడును. ఇతరులను పీడింపని సత్యము, ప్రియము మరియు హితకరమయిన సత్యము, వేదశాస్త్రాధ్యయనము, వాచిక తపస్సు అనబడును. రాగద్వేషములు, చింత, వ్యాకులత రహితమయిన మనస్సు కలిగియుండుట, శాంతి, సౌమ్యత, భావరహిత మౌనము, ఆధ్యాత్మ చింతన, ఇంద్రియ సంయమము, చిత్తమందు నిరంతరము సద్భావనాపూర్ణ పవిత్ర విచారణ, మానసిక తపస్సు అనబడును. ఇక సాత్విక తపస్సు – ఫలేచ్ఛ లేకుండా శ్రద్ధా పూర్వకముగ కావించు తపము. తన ప్రశంశ, సత్కారము, మానము, పూజాహేతువై డంభముతో కావించు పూజ రాజసిక తపము. ఈ తపస్సు అస్థిరమై జనన మరణ చక్రమందు పడవేయును. ఇతరులకు పీడించుటకు, తన ఆత్మను సహితము పీడించుచూ కావించిన తపస్సు తామసిక తపస్సు. దాన విధులు – శాస్త్రీయ విధి విధానములను పాటించుచూ శ్రద్ధతో షడంగ సహిత వేద, పురాణాది శాస్త్ర విశారదుడయిన ద్విజునికి తీర్థాది పుణ్యక్షేత్రములందు, పర్వ దినములందు చేయబడిన దానము సాత్విక దానము. భక్తి భావము లేక మానసిక క్లేశ నాశనమునకు, స్వర్గప్రాప్తికి, రోగనివృత్తి లేక సామాజిక స్థానమున, కావించు దానము రాజసిక దానము. అనుచిత దేశ కాలములందు, మ్లేచ్ఛాది అశుచి జనులుండు స్థానమున, విద్యా, తప రహిత మూర్ఖ బ్రాహ్మణునికి గానీ, అపూజనీయ వ్యక్తికి గానీ, కావించిన అపాత్రదానము

తామసికమనబడును.

రాజా! జ్ఞానము, కర్మము, కర్త ఇవి సహితము మూడు విధములు. శ్రద్ధగా వినుము. ఎవరు తన యందు, ఇతర జంతు జాలములందు ఒకే విధమయిన ఆత్మ యున్నదని నిశ్చయాత్మకముగ యుండునో అయ్యది సాత్విక జ్ఞానము. ఎవరు తననూ, ఇతరులను వేరువేరుగా చూచుచూ విభిన్న స్థితులయందుందురో అయ్యది రాజసిక జ్ఞానము. ఎవరి జ్ఞానము యుక్తసంగతము కాదో, అసత్యయుతమో, దేహమే ఆత్మయని తలచబడునో, అయ్యది తామసిక జ్ఞానము. ఇపుడు కర్మ, – కర్మ సహితము మూడు విధములు. ప్రతి వ్యక్తీ శాస్త్రవిహిత నిత్య నైమిత్తిక కర్మాచరణము (సంధ్యావందనాదులు) కావింపవలెను. వీటిని రాగద్వేషములు, డంభము, ఫలాపేక్ష లేకుండా కావించిన ఎడల అయ్యది సాత్విక కర్మ. నిత్యకర్మలను బహు కష్టముచే ఆచరించుచూ, ఫలేచ్ఛకై డంభ దర్పములతో తన ధార్మిక ప్రవృత్తిని ప్రఖ్యాత మొనర్చుకొనుటకు కావించు కర్మ రాజసిక కర్మ. తన సమర్థతను విచారింపక, ధన నాశనముతో కావించునది, అవివేకముతో కావంపబడు కర్మ. తామసిక కర్మ. ఇక కర్త. కర్త సహితము త్రివిధములు. రాజా! ఎవరు ఉత్సాహవంతుడో, కార్యసిద్ధి కలిగిననూ, కలుగకున్ననూ హర్షశోకములొందక, స్థిరబుద్ధితో అహంకార రహితుడై కర్మమాచరించు కర్త సాత్వికుడు. కార్యసిద్ధి యందు హర్షశోకములు పొందువాడు, ఫలాపేక్షతో కార్యము లొనర్చువాడు, హింస, పరపీడనము ఒనర్చువాడు, అశుచి, లోభి రాజసిక కర్త. ప్రమాదయుక్తుడు, అజ్ఞాని, ఇతరులకు బాధ యొనర్చువాడు, శఠుడు, ధూర్తుడు, ఆలస్యుడు, ఎల్లప్పుడూ తర్కమొనర్చువాడు తామసిక కర్త.

రాజా! సుఖ దు:ఖములు సహితము మూడు విధములు. జ్ఞానము, వైరాగ్యము, ధ్యానము, సమాధి, మొదలగు సాధనములు ఆరంభమందు విషము వలె దు:ఖతరములై, సమయము గడచుసరికి నెమ్మది నెమ్మదిగ పరిణామక్రమమున అమృతతుల్యమై, ఆత్మశుద్ధిని ప్రసాదించు నిర్మల సుఖము సాత్విక సుఖము. ఇంద్రియయుక్త సుఖభోగ విలాసములు ఆరంభమున అమృత తుల్యములై, పరిణామ క్రమమున దు:ఖ భాజనములగుటచే అవి రాజసిక సుఖములు. నిద్ర, ప్రమాదము, ఆలస్యముతో కూడిన సుఖము స్వకీయ ఆత్మను మోహము నందు ముంచున కావున అయ్యది తామసిక సుఖము. ఈ విధముగ త్రిగుణముల నుండి ముక్తులయిన వ్యక్తులు త్రిలోకముల యుందును ఎవరు యండరు.

సమాజము భ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు అని గుణత్రయ భేదముచే నాలుగు వర్ణములుగ విభజింపబడినది. వానిని గూర్చి నీకు సంక్షేపముగ వివరించెదను. అంత:కరణ నిగ్రహము, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ నిగ్రహము, ఆర్జవము, క్షమ, కాయక, వాచిక, మానసిక తపము, బాహ్యాంతర శౌచము, ఆత్మ విషయక జ్ఞానము, వేద శాస్త్ర పురాణ స్మృతులందు ప్రతిపాదితమయిన జ్ఞానమును తెలిసికొని అనుష్ఠాన పర్యంతము ఆచరించుట భ్రాహ్మణ కర్మములు. దేహ దారుఢ్యము, దక్షత, యుద్ధమందు పరాక్రమము, శరణాగత వత్సలత, ప్రజాపాలన, దానము, ధైర్యము, స్వాభావిక తేజము, ప్రభుత్వ భావన, ఉత్కృష్ట మనోవృత్తి, సునీతి యొక్క అనుసరణ, ఆచరణ, లోకరక్ష, పంచ కర్మాధి కారములు (ప్రజారక్ష, దానము, యజ్ఞము, అధ్యయనము, విషయభోగ అనాసక్తత) ఇవి క్షత్రియ ధర్మములు. నానా వస్తు క్రయ విక్రయములు, వ్యవసాయము, కృషి, గోరక్షణ, అధ్యయనము, యజనము, (యజ్ఞము చేయుట), దానము ఈ మూడు కర్మములు వైశ్య కర్మములు. భ్రాహ్మణులకు దానమిచ్చుట, క్షత్రియ వైశ్యులకు సేవ, సర్వదా శివపూజనము శూద్ర కర్మలు. రాజా! ఈ చాతుర్వర్ణముల వారూ తమ తమ సహజ కర్మములాచరించుచూ వాని ఫలములను నా కర్పించుటచే, నా కృప వలన మోక్షము నొందెదరు. ఈ విధముగ నీకు నా కృప చే ఉత్తమ యోగమును సాంగోపాంగముగ వివరించితిని. దీనిని నేనిదివరకూ ఎవరికినీ వివరింపలేదు. నీవు ఈ యోగమును అభ్యసింప వలసినది. కానీ దీనిని గుప్తముగ యుంచవలసినది. ఈ యోగము వలన నీవు పురుషోత్తమ సిద్ధి నొందెదవు."

భ్రహ్మ "తదుపరి వరేణ్య మహారాజు శ్రీగణేశుడు తెలిపిన విధముగనే ఆచరించెను. కుటుంబాదులను వదలి

వనమున కేగెను. ఏ విధముగ యోగాభ్యాసము తెలుపబడెనో, ఆ విధముగ ఆ ప్రక్రియ నాచరించి మోక్షము నొందెను. ఈ ఉత్తమ చర్చను ఎవరు వినెదరో ఆతడు యోగియై మోక్షప్రాప్తి నొందును. ఎవరు ఈ యోగమును ఇతరులకు వివరించి తెలిపెదరో వారు సహితము మోక్షము నొందెదరు. ఎవరు ఈ గణేశ గీతను అభ్యాసమొనర్చి, గురుముఖతా దాని అర్ధమును తెలిసికొని, ప్రతిదినము శ్రీగణేశుని పూజించి, దినమునకు ఒకటి, రెండు మార్లు దీనిని పఠించిన వారు జీవన్ముక్తులై బ్రహ్మ సమానులగుదురు. వారి దర్శనము సహితము ముక్తినిచ్చును. పరబ్రహ్మ ప్రాప్తి, యజ్ఞ, వ్రత, దాన, అగ్నిహోత్ర, అధికధన వ్యయ యాగములచే, ఆరు అంగములు (శిక్ష, వ్యాకరణము, కల్పము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిష్యము) గల చతుర్వేదములను అర్ధ సహితముగ తెలిసికొన్ననూ, పురాణ శ్రవణము, శాస్త్రాధ్యాయనము పరబ్రహ్మ ప్రాప్తి కలిగింపదు. కానీ గణేశ గీతాధ్యయనము పరబ్రహ్మ ప్రాప్తి కలిగించును. బ్రహ్మహత్య, మధ్యపానము, స్వర్ణ చౌర్యము, గురుతల్పగతము (గురు పత్నీ సంగమము), మొదలగు మహా పాపములు చేసినవారు, ఈ పాపములాచరించిన వారితో స్నేహమొనరించినవారు, స్త్రీహత్య, గోహత్య, కావించినవారు ఈ గణేశ గీత పఠించిన ఎడల వారు ఆ పాప విముక్తులు అగుదురు. ఎవరు నిత్యము జితేంద్రియులై, పవిత్రులై, ఈ గీతను పఠింతురో వారు నిస్సందేహముగ శ్రీగణేశ సమానులగుదురు. ఎవరు చతుర్థీ తిథినాడు ఈ గణేశ గీతను పఠించెదరో వారు మోక్ష భాగులగుదురు. ఎవరేని ఒక పుణ్యక్షేత్రమునకేగి, గజాననుని పూజించి, ఈ శ్రీగణేశగీతను ఒక్కమారు పఠించిన ఎడల వారు బ్రహ్మప్రాప్తికి అధికారులగుదురు. ఎవరు భాద్రపద శుద్ధ చవితి (గణేశ చతుర్థి) నాడు శ్రీగణేశుని ఆయుధ వాహన సహిత మృణ్మమమూర్తిని చేసి, దానికి యధావిధిగ పూజనమొనర్చి, ప్రయత్న పూర్వకముగ అద్దాని ముందు ఏడుమార్లు శ్రీగణేశగీతను పారాయణ మొనర్చిన ఎడల వారికి శ్రీగణేశుడు ప్రసన్నుడై ఉత్తమ భోగములు, పుత్ర, పౌత్ర, ధన ధాన్య, పశు రత్నాది సంపదలను ప్రదానము కావించును. దీనిని పఠించుటచే విద్యార్ధులకు విద్య, సుఖకాముకులకు సుఖము, జనులకు అభీష్టసిద్ధి, కలిగి అంతమున ముక్తి నొందెదరు.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందల గణేశ గీత - 11 అను నూట నలభై ఏడవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై ఎనిమిదవ అధ్యాయము

(కలియుగ లక్షణములు, ధర్మములు)

బ్రహ్మ “ఈ విధముగ గజాననుడు దేవ, ముని, రాజుల, ప్రజల, అన్యభక్తుల పూజను స్వీకరించి, వారి మనోకామనలను పూర్ణమొనర్చి, ఆ రాజ సదనము నందే నివసింప దొడంగెను. అంత వ్యాసుడు “మహాత్మా! బ్రహ్మదేవా! నాకు ఈ వినాయక మాహాత్మ్యమందు కొన్ని సంశయములున్నవి. వేరువేరుచోట్ల గజాననుని గూర్చి వేరు విధములుగ ప్రస్తావింపబడినది. ఒకచోట గణేశుడు వరేణ్యుని ఇంట అవతరించి విఘ్నాసురుని సంహరించెననీ, గజాసుర సంహారమొనర్చి గజముఖమును పొందెననీ, పార్వతీ గర్భము నుండి గజాననుడు ఉద్భవించెననీ, వర్ణింపబడినది. ఇందు ఏది నిజము? త్రిలోకముల యందునూ ఈ సంశయమును వేరొకరు నివారింపలేరు.” అంత బ్రహ్మ “వ్యాసా! అనంత శక్తియుతుడయిన శ్రీగణేశుని సంశయింప పనిలేదు. కల్ప భేదము ననుసరించి ఆ మహాత్ముడు విభిన్న కల్పములందు విభిన్న అవతారములు, రూపములు స్వీకరించెను. ఒకసారి గజాననుడు శివుని ముఖము నుండి, మరియొక మారు శివుని కోపము నుండి ఉత్పన్నమయ్యెను. అట్లే ఒకసారి పార్వతీ తేజస్సు నుండి, మరియొకమారు పార్వతి ఉదరము

నుండి, వేరొకసారి పార్వతీ దేవి శరీరమలము నుండి గజాననుడు ఉత్పన్నమయ్యెను. ఒకప్పుడు దశభుజుడు, మరొకసారి పన్నెండు లేక వేయి చేతులతో శోభిల్లును. ఆగమములందు ఆయన రూపము లనేకములు. ఓ! మునీ! ఆ ప్రభుని చరిత్ర విషయమున సంశయము, విస్మయము కూడదు. లింగ పురాణమందు శివుని నుండి బ్రహ్మ, విష్ణువులు ఉద్భవించెరని యున్నది. స్కాంధ పురాణమందు విధాత నేత్రముల నుండి శివుడు ఉద్భవించెననీ యున్నది. శివుడు విష్ణువునూ, విష్ణువు శివునీ ధ్యానమొనర్చెదరనీ యున్నది. శివుడు పంచాక్షర సహిత తారకమంత్రము ఉపదేశించుననీ, మరియు ఆయన వంద కోట్ల శ్లోకముల రామచరితను మూడు ప్రకారములుగ సంక్షిప్త మొనర్చెననీ, మృత్యులోకమందు శివుడు తారక మంత్రోపదేశ మొనర్చుననీ ఒక నానుడి. వేరొకచోట శివుడే సృష్టి యొనర్చెననీ, వేరొకచోట బ్రహ్మయనీ, విష్ణువనీ, శక్తియనీ, సూర్యుడనీ సృష్టి కావించిన వారి నామములు తెలుపబడినవి. ఒకచోట గజాననుడే సృష్టి కావించెనని యున్నది. అవన్నియు శాస్త్ర సమ్మతములే! ఏ మానవుడు ఈ విషయములందు సంశయగ్రస్తుడగునో, ఆతడు నరకగామి అగును. వ్యాసా! నీకు ద్వాపరమందలి గజాననావతారము గూర్చి తెలిపితిని. ఇపుడు కలియుగ సంభందిత ఆఖ్యానమును తెలిపెదను.

సాత్యవతేయా! కలియుగాంతమందు జనులు భ్రష్టాచారులై, అనృతవాదు లగుదురు. బ్రాహ్మణులు వేదాధ్యయనము, స్నాన సంధ్యాదులు ఆచరింపరు. వారు యజన, యాజన, దానములు చేయరు. వారు దుష్టులనుండి దుర్లభమయిన వస్తువులను సహితము దానము తీసికొందురు. వారు ఇతరులపై కళంక మారోపించుట, పరనింద, పరస్త్రీ గమనాది దుష్కర్మ లాచరించెదరు. అంతేకాక వారు విధి విధానములు నన్నింటినీ వదిలెదరు. సర్వ జనులు విశ్వాస ఘాతకులగుదురు. విధి లోపముచే సర్వులు మిథ్యా శపథములు స్వీకరించెదరు. మేఘములు వర్షింపవు. నదీతీరములందు పంటలు పండించెదరు. బలవంతులు బలహీనులను పీడించి ధనము గైకొనెదరు. వారి నుండి ఇతరులు ధనమును తస్కరించెదరు. శూద్రులు వేదాధ్యయనము చేయుదురు. బ్రాహ్మణులు శూద్ర ధర్మము లాచరించెదరు. క్షత్రియులు వైశ్య కర్మలను, వైశ్యులు శూద్రకర్మలను ఆచరించెదరు. బ్రాహ్మణులు ఛండాలుర వద్ద దానము స్వీకరించి అజ్ఞానులై, దరిద్రులై, హాహాకారము లొనర్చెదరు. లోకులు ధనమును అప్పుగా గొని సంపూర్ణముగ అబద్ధమాడి తాము తీసికొనలేదని వాదించెదరు. దొంగతనముగ ధనము తీసికొని మిథ్యా సాక్ష్యములు చెప్పెదరు. సత్పురుషుల నింద, దురాత్ముల సావాసము ప్రయత్న పూర్వకముగ చేయుదురు. క్షత్రియ, వైశ్యులు పితరులకు అర్పింపకూడని మాంసమును భుజించెదరు. సజ్జనుల వినాశము, దుర్జనుల వృద్ధి జరుగును. దేవతల భజన, పూజనము త్యజించి సర్వులు ఇంద్రియ భోగ లంపటులగుదురు. భూత, ప్రేత, పిశాచాదులను పూజించుటకు ఇష్టపడెదరు. బ్రాహ్మణులు నానా వేషధారణ కావించి ఉదర పోషణ చేసెదరు. క్షత్రియులు కుల మర్యాద నతిక్రమించి బిక్షాటన మొనర్చెదరు. వ్రత నియమములను, విధి విధానములను ఎవ్వరూ గౌరవించి పాటించరు.

సమాజము వర్ణసంకర మగును. జనులందరూ అకృత్యముల నాచరించెదరు. పతివ్రతలైన స్త్రీలు భ్రష్టులగుదురు. సర్వులు మ్లేచ్ఛ సమానులయి పరద్రవ్యాపహరణము, నిర్దయ, కుమార్గాసక్తి, సత్య రాహిత్యము నొందెదరు. పృథివి సస్య రహితము, వృక్షములు రసహీనములగును. ఐదు లేక ఆరేండ్ల బాలికలు గర్భవతులగుదురు. పదహారేండ్ల వర్షముల ప్రాయమే పరమాయువగును. తీర్థ, క్షేత్ర, దేవాలయములు గుప్తమగును. పాపము బాగుగా వృద్ధియై, పుణ్యము, ధర్మము లుప్తమగును. స్వాహా, స్వధా, వషట్కారములు లేక దేవతలు ఉపవాస పరాయణులై, భయాతురులై గజాననుని శరణువేడెదరు. తత్ఫలితముగ గజాననుడు "శూర్పకర్ణుడు" "ధూమ్రవర్ణుడు" అను నామములతో, నీలివర్ణ అశ్వమధిరోహించి, ఖడ్గధారియై, క్రోధముచే జ్వాజ్వల్యమానుడై, అనేక రూపములు గల సేనను, అస్త్ర శస్త్రములను నిర్మించి మ్లేచ్ఛ సంహారము కావించును. తదనంతరము కంధరాయుక్త దేశములందు దాగుకొని కందమూల ఫలములు భక్షించుచూ దేవ పూజన నెరపుచున్న బ్రాహ్మణోత్తములను రావించి వారికి భూమిని దానమిచ్చును. సత్కర్మాచరణులైన సజ్జనులను రావించి వారిని పూజించును.

అంత తిరిగి కృతయుగము (సత్యయుగము) మొదలగును. తదుపరి ధూమ్రవర్ణుడు అంతర్ధానుడగును. ఓ! అనఘా! వ్యాసా! నీకు చతుర్యుగములందు శ్రీగణేశ భగవానుని లీలలు నామరూపములు తెల్పితిని. ఈ అత్యద్భుత వ్యాఖ్యానము వినినంత మాత్రమున మనుజులు పాపవిముక్తులు అగుదురు. ఆయన అనంత రూపములు వర్ణించుటకు నేనశక్యుడను. అయ్యది వేదములకు సహితము అసాధ్యము. ఇక నీవు వెళ్ళి అనుష్ఠాన మొనర్పవలసినది. నేను నా స్వకర్మల నాచరింపవలెను."

భృగు మహర్షి సోమకాంతునితో "బ్రహ్మ నుండి ఈ పలుకులు వినిన వ్యాసమహర్షి, "నేను ధన్యుడను. మీ అనుగ్రహముచే నా సంశయములన్నియు తీరినవి. ఈ కథా శ్రవణముచే జన్మ జన్మాంతర పాపములు నష్టమగును. మనోకామనలు పూర్ణమగును. కేవలము పూర్వజన్మ పుణ్యఫలితము చేతనే మనుజులు ఈ ఆఖ్యానమును వినగలరు. దీనిని దుర్జనులకు వినిపింపరాదు." అని పలికి వ్యాసుడు బ్రహ్మకు ప్రదక్షిణ ప్రణామము లాచిరించి, ఆయన ఆజ్ఞను అనుసరించి, కందమూల ఫల సహితమయిన ఒక ఉత్తమ వనము ప్రవేశించి, సుఖాశీనుడై శ్రీగణేశుని ఏకాక్షర మంత్రమును **(గం)** పన్నెండేండ్లు తీవ్ర తపము ఒనరించెను. అంత ఆయనకు శ్రీగణేశునకు ప్రత్యక్షమయ్యెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి కలియుగ లక్షణములనెడు నూట నలభై ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నూట నలభై తొమ్మిదవ అధ్యాయము

(వ్యాసునికి శ్రీగణేశ సాక్షాత్కారము)

సోమకాంతుడు "మహాత్మా! శ్రీగణేశుడు వేదవ్యాసుని ఎదుట ఎట్లు ప్రత్యక్షమయ్యెను? అయ్యది పాపనాశకమయిన అధ్యాయము. అద్దానిని నాకు తెలుప వలసినది" అని పలికెను. భృగు మహర్షి "రాజా! నీకు తప్పక తెల్పెదను. శ్రీగణేశుడు రక్తవర్ణ దుకూలములు, మాల ధరించి, రక్త చందనాది రక్తవర్ణ విలేపములు అలదుకొని, కమలదళ నయనుడై, మస్తకమందు సిందూర లేపనముతో, అనేక సూర్యులదీప్తితో, మహామకుటముతో, దివ్య కుండలాలంకృతాంగుడై, నాగ యజ్ఞోపవీతుడై, హస్తములకు వంకీలు, భుజములకు భుజకీర్తులు, చేతులకు కంకణములు, ధరించి యుండెను. ఆయన రూపము చూచి వ్యాసుడు భయభీతుడై మూర్ఛిల్లెను. అంత శ్రీగణేశుడు "మునిశ్రేష్ఠా! నీకు భయము వలదు. నీవు దివారాత్రములు ఎవరిని జపించుచుంటివో ఆ గజాననుని నేనే! బ్రహ్మాది దేవతలకు సహితము అగోచరుడనైన నేను నీకు వరదాన మిచ్చుటకు ఏతెంచితిని." సాత్యవతేయుడు మిక్కిలి సంతసిల్లి, ఆ గణేశ భగవానుని పాదములపై శిరసునుంచి, నమస్కరించి పున:పున: "నేను ధన్యుడను. నా మాతా పితరులు, నా తపము, ఈధరిత్రి, ఈ వృక్షము సహితము ధన్యములు. ఎందుకనగా సర్వస్వరూపుడు, గుణాతీతుడు, అఖిల విశ్వాధారుడు, చిదానంద ఘనుడు, అనంతుడు, అఖిల కారణ కారణుడు, అయిన శ్రీగణేశుడు నాకు దర్శన ప్రాప్తి నొసంగెను." ఈ విధముగ స్తుతించి గజాననుని ఈ విధముగ ప్రార్థించెను. "ప్రభూ! నా భ్రమను నివారించి, నాకు దృఢభక్తి నొసంగ వలసినది. నాకు అష్టాదశ పురాణములు రచించు దక్షత నీయవలసినది. మిమ్ము స్తుతించు శక్తినిచ్చి, మీరు ప్రసన్నులయిన ఎడల, దయచేసి నా హృదయమందు నివసింప వలసినది."

అంత గజాననుడు "వత్సా! నీవు కావించిన ప్రార్థన పూర్ణమగును. నీవు "వ్యాస" రూపమున సర్వులకు మాన్యుడ వగుదువు. నీవు పావన మొనరించు వస్తువుల యందు పరమ పావనుడవగుదువు. నీకు అపరోక్ష జ్ఞానము

కలిగి సర్వులకు గురువు వగుదువు. నీవు నీ ఖ్యాతి చే గుణ కీర్తులచే, శోభా సంపదల చే నారాయణ సమానుడ వగుదువు. నీవు అష్టాదశ పురాణములు, ఉప పురాణములను సహితము రచించెదవు. పూర్వకాలమందు నీవు దంభముచే నన్ను పూజనము, స్మరణము కావింపకుంటివి. తత్ఫలితముగ నీ ఆలోచన యందు స్థంభన మేర్పడినది. ఇపుడు బ్రహ్మ ద్వారా నా మహిమను వినిన కారణమున ఆ పాపమంతయు నష్టమయినది” అని పలికి గజాననుడు వ్యాసుని హృదయమందు ప్రవేశించెను. అంత వ్యాసుడు కోటి సూర్య కాంతులతో ప్రకాశించుట మొదలిడెను. ఆయన ప్రకాశముచే దిశలు దీప్తివంతయు లయినవి. అంత వ్యాసుడు ఆ ప్రదేశమున ఒక విశాలమయిన శ్రీగణేశ మూర్తిని స్థాపించి, దాని చుట్టూ మందిరము, ప్రాసాదము నిర్మించి, అందు శ్రీగణేశుని పూజించి “ఇయ్యది సిద్ధ క్షేత్రము. ఈ క్షేత్రము సర్వులను పవిత్ర మొనరించును. ఈ క్షేత్ర దర్శనముచే భక్తుల నేత్రములు పవిత్రమై, ఇచట అనుష్ఠాన మొనర్చుటనే మంత్రసిద్ధులు, ఇతర సిద్ధులు తొందరగా కలుగను.” ఈ విధముగ పలికి శ్రీగణేశుని ఆజ్ఞనొంది, నారాయణ స్వరూపుడయిన వ్యాసదేవుడు తన ఆశ్రమమున కేగి, తాను బ్రహ్మ వద్ద వినిన సంపూర్ణ శ్రీగణేశ పురాణమును వైశంపాయనునికి వినిపించెను. అప్పటి నుండియు శ్రీగణేశ పురాణము లోక ప్రసిద్ధమయ్యెను. ఓ! రాజా! ఈ పురాణముతో సమానమైనది, ఆనంద దాయకమైనది, పావనమైనది త్రిలోకములయందు వేరొకటి లేదు. సోమకాంతా! నీవీ పురాణమను దుష్టులకు బోధింపరాదు. వినీతులు, భక్తులు అయినవారికి ప్రయత్నపూర్వకముగ తెలుపవలెను. రాజా! నేనీ పురాణమును నిరంతరము జప, స్మరణాదులు కావించుచున్నాను. నీపై కరుణ కలిగి నీకీ పురాణమును వినిపించితిని. నీవు నిరంతరము గజానన ధ్యానమందు నిరతుడవై శ్రీగణేశ మంత్ర జపము ఒనర్చుము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వ్యాసునికి శ్రీగణేశ సాక్షాత్కారమను నూట నలభై తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నూట ఏభైయవ అధ్యాయము

(సోమకాంతుని కుష్ఠువ్యాధి నివారణము)

సూతుడు “ఈ విధముగ సోమకాంతుడు నిత్య కథా శ్రవణ మొనరించి, ఆ కథా శ్రవణ పుణ్యముతో చేతిలోనికి జలము తీసికొని, ఎండిపోయిన మామిడి చెట్టుపై ప్రోక్షించుచుండెను. ఈ విధముగ ఒక ఏడాది గడచిన పిమ్మట మామిడి వృక్షము కథాశ్రవణ పుణ్యముచే నవ పల్లవ, పుష్ప, ఫల యుక్తమై, అత్యంత సుందరమై శోభించెను. సోమకాంత మహారాజు సహితము కుష్ఠరోగము నుండి విముక్తుడై, క్షత, వ్రణ రహిత దివ్య శరీరుడై, దుర్గంధమంతయు నశించి, సుగంధయుక్తుడయ్యెను. ఆయన శరీరము నుండి వెలివడు సుగంధము దశదిశల వ్యాపించినది. ఆయన స్వస్థుడై, దివ్యదేహుడై, సూర్య సమానకాంతి, కోటి చంద్రుల సమాన దీప్తి కలిగియుండెను. ఆయనను చూచిన లోకులు “ శ్రీగణేశ పురాణ మహిమచే ఈ రాజు ఎంత స్వస్థుడయ్యెను?” అని ఆశ్చర్య జనితులైరి. ఒకనాడు భృగుమహర్షి “రాజా! నీకీ సిద్ధి శ్రీగణేశ పురాణ శ్రవణము వలన కలిగినది. ఇక నీవు పుత్ర, అమాత్య, ప్రజల వద్ద కేగవలసినది. వారందరూ చిరకాలము నుండి నీ కొరకు వేచియుండిరి. నిన్ను చూచి అత్యంత సంతోషము నొందెదరు. నీవు సహితము వారిని గాంచి సంతోషము నొందెదవు.” భృగు మహర్షి పలుకులు విని సోమకాంతుడు ఆ మహర్షి పాదములపై బడి, ఆనంద సాగరమగ్నుడై “స్వామీ! నేడు నేను మీ తపస్సు మరియు శ్రీగణేశ పురాణ శ్రవణ అద్భుత మహిమను కాంచితిని. అద్దాని మహిమచే నేను కుష్ఠరోగము నుండి విముక్తుడనై దివ్య దేహుడనైతిని. ఇక నుండి మీరే నా మాతా పితరులు.

ఎందుకనగా ఈ శరీర నిర్మాతలు మీరే! మీ కథా ప్రభావము చే ఎండిన మామిడి చెట్టు తిరిగి చిగురించినది. నేను మిమ్ము విడువలేను. పుత్ర, ప్రజలచే నాకొరుగునది ఏదియునూ లేదు.” అంత భృగువు “రాజా! నీ జన్మాంతర పుణ్య ప్రభావముచే నీకు నా ముఖతా శ్రీగణేశ పురాణము విను సౌభాగ్యము అబ్బినది. నీవు నన్ను విస్మరింపక నీ నగరమునకు ఏగ వలసినది” అని పలికెను.

ఈ విధముగ వారిరువురు వార్తాలాపము లాడుచుండగా కోటి సూర్య సమాన తేజస్సుగల విమానమొకటి వారికి దృష్టిగతమైనది. అంత భృగుమహర్షి “రాజా! ఈ మహాద్భుత విమానము నీ కొరకేతెంచినది. దీని నధిరోహించి నీవు శ్రీగణేశ సన్నిధానమునకు ఏగుము. మహానుష్ఠానమొనర్చిన మునీశ్వరులు సహితము ప్రాప్తించని విమానము కేవల శ్రీగణేశ పురాణ శ్రవణముచే నీకు లభించినది.” ఇంతలో విమానము భూమిపై దిగినది. అందు చతుర్భుజులు, దివ్య వస్త్ర భూషణాలంకారులు, హస్తములందు కమల, పరశు హస్తులు, అయిన శ్రీగణేశ దూతలు యుండిరి. వారితో పాటు కిన్నెరాంగనలు మృదంగాది వాద్యములు మ్రోగించుచూ, నృత్య గీతములాలపించు చుండిరి. వారిని కాంచి రాజు ఇట్లనియె “మునీశ్వరా! నేను విమానమును గూర్చి వినియుంటిని. కానీ కేవలము మీ తపోబల శక్తి చేతనే ఈ విమాన మేతెంచినది. నేడు నేను మీ మహిమను మీ ముఖతా పురాణ శ్రవణము ద్వారా కాంచితిని.

ఇంతలో శ్రీగణేశ దూతలు విమానము నుండి దిగి మహారాజుతో ఇట్లనిరి “ఓ! శుద్ధాత్మా! నీ వలన కావింపబడిన పురాణ శ్రవణాది పుణ్యములచే శ్రీగణేశుడు నిన్ను తలచుచున్నాడు. పుణ్యకీర్తివైన నిన్ను తీసికొని వెళ్ళుటకై మేమేతించితిమి. ఇకనీవు ఆ ఉత్తమ లోకమున కేగవలసినది. నీవు ఆ పరాత్పరుని దర్శనముచే జనన మరణ చక్రము నుండి విముక్తుడవై, ఆయన సాన్నిధ్యము నందుండి, ఆయన కృపచే అత్యధిక సుఖము నొందుము.” ఈ పలుకులు విని సోమకాంతుడు దేహాతీతుడై, శరీరము రోమాంచమై, గద్గద వాణితో ఇట్లనియె “పరాత్పరుడు, నిర్గుణుడు, చరాచర సృష్టికర్త, విశ్వజనకుడు అయిన దీననాధుడు నన్ను స్మరించెనా! ఓ! అనింద్యులారా! సనకాది దేవర్షులు, బ్రహ్మాది దేవతలకు సహితము ధ్యానముచే లభించని అనంతగుణ పూర్ణ ప్రభువు ఈ ఉత్తమ యానమును నా కంపెనా? నానావతార గ్రహణుడు, నానారూపధారి, పరమ మాయా స్వరూపుడు అయిన శ్రీగణేశుడు నన్ను తలచెనా?” అని పలికి భృగు మహర్షి వంక తిరిగి నమస్కరించి “మీ ఆజ్ఞానుసారము మీ కృప, శ్రీగణేశుని కృపచే నేను ఈ విమానమందు ఆరూఢుడ నగుదును. దయచేసి నన్ను మరువవద్దు” అని పలికెను. రాజు పలుకులు విని భృగు మహర్షి ప్రేమ విహ్వలుడై, రోమాంచితుడై, కన్నుల ఆనందాశ్రువులు కారుచుండగా రాజును కౌగలించి “రాజా! నేను భాగ్య హీనుడను. నీకు నీ పుణ్యము యొక్క మహాఫలము లభించినది. నీవు శ్రీగణేశుని సమ్ముఖమున కేగుము. కానీ నన్ను మరువకుము” అని పలికెను. అంత ఇరువురు చేతులు పట్టుకొని ఆశ్రమము బయటకు ఏతెంచిరి. రాజు తిరిగి మునికి నమస్కరించి, తన భార్య, అమాత్యుల సహితుడై ఆ విమాన మధిరోహించెను. ఆ విమానమందలి వాద్య ఘోష ఆ సమయమున దిగంతముల వరకు వ్యాపించినది. ఆ విమానము యొక్క శోభను తిలకించి సోమకాంతుడు ప్రసన్నుడై, తనకు ఆ సౌభాగ్యము పుణ్యప్రాప్తి వలన కలిగినది అని తలంచెను. అంత భృగు మహర్షి, ఆశ్రమ వాసులు చూచుచుండగా విమానము ఆకాశమార్గమున కెగరెను. తనకు ఈ మానుష దేహముతో సర్వోత్తమ పదము ప్రాప్తించుటచే రాజు పరమాశ్చర్య చకితుడయ్యెను. అంత ఆయన దూతలకు నమస్కరించి కూర్చొనెను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండము నందలి సోమకాంతుని కుష్ఠవ్యాధి నివారణమను నూట ఏబైయవ అధ్యాయము సమాప్తము)

నూట ఏభై ఒకటవ అధ్యాయము

(సోమకాంతుని మోక్షము)

సోమకాంత మహారాజు విమానమందు శ్రీగణేశ ధామమున కేగుచూ, తన పురమయిన దేవపురిని, ఆ నగర గోపురమును కాంచి, ఆ శోభను తిలకించి ప్రసన్నుడయ్యెను. ఆయన పత్ని సుధర్మ రాజసభను చూచి తమ పుత్రుడు హేమకంఠుడు స్మరణకు వచ్చి తన భర్తతో గద్గద వాణియై ఇట్లనియె "స్వామీ! మన పుత్రుడు సింహాసనాధీశుడై ఒక సంవత్సరము కావచ్చుచున్నది. ఆతడు మన కొరకై ప్రతీక్షించుచుండును. ఓ! కృపానిధీ! నాకు ఒక్కమారు పుత్ర దర్శనము కావింప వలసినది." మహారాజు "నా పుత్రుడు హేమకంఠుడు ఏమయ్యెనో? నేను ఒక సంవత్సరానంతరము తప్పక దర్శన మిచ్చెదనని వాగ్దాన మొనర్చితిని. నా పలుకులు అనృతములగును. నేనిపుడు నా పుత్రుని కాంచలేను. పరమ పదమును త్యాగ మొనర్పలేను. ఈ విపరీత స్థితి యందు ఏమి చేయుదును?" అని పలుకుచూ రోదించుట నారంభించెను. అంత దూతలు సోమకాంతుని చూచి "మీ రోదన చే మాకు మీ యందు దయ కలిగినది. విమానమును మీ పురము వద్ద ఆపెదము. అమాత్యులు పురమునకేగి మీ పుత్రునికి మీ రాక గూర్చి ఎరింగించెదరు. మీరిరువురు కొన్ని క్షణములు విమానము దిగి, మీ పుత్రుని కాంచి వెంతనే తిరిగి ఆరూఢులవ వలసినది. మీ చిత్తశాంతి మాకు ఆనందము నిచ్చును" అని పలికి వారు దేవపురికి ఉత్తరమున విమానము నాపిరి. విమానము యొక్క కాంతిచే పురము సర్వము దీప్తివంతమై, విమానమందలి వాద్యఘోషచే నగరమంతయు నినాదితమైనది. అంత రాజు యొక్క అమాత్యులు దూతలకు నమస్కరించి, రాజపుత్రునికి ఈ విషయము తెలుపుటకై ఏగిరి. ఆ సమయమున హేమకంఠుడు నృత్య ప్రదర్శన చూచుచుండెను. అమాత్యులు రాజాస్థానము ప్రవేశించి, సింహాసనమందు ఆశీనుడైన హేమకంఠ మహారాజును కాంచి నమస్కరించిరి.

వారిని చూచి హేమకంఠుడు, సభాసదులు, తమ ఆసనముల నుండి లేచి నమస్కరించి, వారిరువురినీ సుఖాసీనుల కావించి, పూజనమొనర్చి "అమాత్యులారా! మా మాతా పితరులు కుశలమేనా? వారివురురినీ విడచి మీరేల ఇట్లు ఏతెంచిరి? వారు లేక నా ప్రాణములు కంఠము వరకు వచ్చి నిలచినవి. నేను దివారాత్రములు వారి గూర్చియే చింతించుచున్నాను. మా తండ్రిగారు ఒక సంవత్సరానంతరము నాకు పునర్దర్శన మిచ్చెదనని వాగ్దానమొనర్చిరి. ఆ వాక్యము మిథ్య అయినది" అని గద్గద కంఠుడై పలికెను. అంత అమాత్యులు "రాజా! నీ మాతా పితరులు క్షేమమే! వారి పుణ్య ఫలము త్రిలోకములలో ఎవరు తెలియగలరు?" అని పలికి ఆ అమాత్యులిరువురు రాజదంపతితో తామేగిన దాదిగా జరిగిన సంఘటనలన్నియు – వనమున కేగుట, రాజు మిక్కిలి దస్సిపోవుట, భృగు మహర్షి సందర్శనము, శ్రీగణేశ పురాణ శ్రవణము, అద్దాని ఫలితముగ రాజు కుష్ఠ రోగము నుండి నివారితుడగుట, శ్రీగణేశుడు విమానము పంపుట, మొదలగునవన్నియు తెలిపి, మీ మాతాపితరులు నగరము వెలుపల నీ దర్శనమునకై వేచియుండిరని తెలిపిరి. అంత హేమకంఠుడు రోమాంచితుడై కన్నుల అశ్రుధారలు కారుచుండగా, ఆ అమాత్యులిరువురినీ ముందుంచుకొని తన తల్లిదండ్రుల వద్దకు పరుగిడెను. ఆ సమయమున ఆయన వస్త్రభూషణములు చిందర వందర అయ్యెను.

అంత అమాత్యులు విమానము వద్దకేగి రాజుతో తమ కుమారుడేతెంచెనని తెలిపిరి. హేమకంఠుడు, వీరులు, నాగరికులు, నగర ప్రముఖులు, అమాత్యుల నడుమ దేవగణ సహిత ఇంద్రుని వలె శోభిల్లుచూ హర్షశోకములు ఒకేమారు ముప్పిరిగొన, కన్నుల అశ్రుధారలు కారుచుండగా తన మాతాపితరుల కాంచెను. ఆ సమయమునకు హేమకుంఠుని ప్రకటనముచే ఆ నగరమందలి స్త్రీ బాల వృద్ధ సహిత జనులందరూ ఆ విమానము వద్ద కేతెంచిరి. విమానము మధ్యనున్న

హేమకాంత దంపతిని కాంచి వారందరూ ప్రణమల్లిరి. హేమకాంతుడు విమానము దిగి కన్నుల అశ్రుకణములు నిండగా కుమారుని కౌగలించెను. వారిరువురి మధ్య మాటలు లేక మౌనము రాజ్యమేలెను. ఇరువురు ఆనంద సాగరమున ఓలలాడిరి. సోమకాంతుడు పుత్రప్రేమతో "నాయనా! నేను నిత్యము నిన్ను తలంచుచున్నాను. లోకములో జనులకు పుత్రులుండవచ్చు. కానీ నీ వంటి పుత్రుడుండడు. నీవు నిజముగ వంశ భూషణుడవు." ఇంతలో సుధర్మ పరుగున వచ్చి హర్ష శోకములు ముప్పిరిగొన, కన్నుల బాష్ప జలము లొలుకుచుండగా "పుత్రా! చిరకాలము తరువాత నిన్ను చూచుచుంటిని. నిన్ను చూడక నాకు సుఖము సంపూర్ణముగ కరువైనది. నీ వియోగము చే నేను మిక్కిలి కృశించితిని. నిన్ను చూచుటచే నాకు అమితానందము కలుగుచున్నది" అని పలికెను.

అంత నగర ప్రముఖులు రాజును ఆలింగన మొనర్చిరి. ప్రజలు ఆయనకు ప్రదక్షిణ మాచరించిరి. అంత సోమకాంతుడు "నేను నా జీవిత కాలమందు ఎన్నో భోగములు అనుభవించితిని. స్వేచ్ఛానుసారము ధరణీమండలమును పాలించితిని. భృగు మహర్షి కృపచే శ్రీగణేశ పురాణమును శ్రవణమొనర్చి కుష్ఠరోగము నుండి విముక్తుడనై దివ్యదేహుడనైతిని. ఆ మహర్షి ఆశీర్వచనము, శ్రీగణేశుని కృపచే పరమాత్ముడు నాకీ దివ్య విమానమును పంపెను. మేమీ విమాన మధిరోహించి ఆ పరేశుని దివ్యథామమునకు ఏగుచుంటిమి. మిమ్ములను చూడవలెనన్న కాంక్షతో ఈ దూతలను ప్రార్థింప, వీరు దయతో ఈ విమానము నిచట విశ్రమింపజేసిరి. మీ అనుజ్ఞ అయిన ఎడల తిరిగి మా ప్రయాణమును కొనసాగించెదము." అంత ప్రజలు "మహారాజా! మీరు వెడలిన ఎడల మేము ప్రాణత్యాగము కావించెదము. ఆ హత్యాదోషము మీ శిరముపై బడును. కానీ మాకు శ్రీగణేశుని కాంచు పుణ్యము లేదు. ఈ సంసారము నందు సుఖము ఇంచుక లేదు. మేము సహితము మీతో శ్రీగణేశుని థామమునకు ఏతెంచెదము. ఇచట ఆయు:నాశనము తప్ప వేరొక గతి లేదు. మాకు మీతో ఏతెంచు సాధనమేదయిననూ కలదా?" అని ప్రశ్నించిరి. హేమకంతుడు "తండ్రీ! మీరు నన్ను వదలి శ్రీగణేశ థామమునకు ఏల ఏగుచున్నారు? నాకీ రాజ్యముతో పని ఏమి? నేను మీ ఆజ్ఞచే రాజ్యమును ఒక వర్ష పర్యంతము పాలించితిని. నాకీ రాజ్యము వలదు. నన్ను సహితము మీతో కొనిపోవలసినది" అని పలికెను.

సోమకాంతుడు వారందరినీ ఉద్దేశ్యించి "నాయనలారా! మీకందరకు శ్రీగణేశ చరణ దర్శన లాలస కలదు. కానీ ఆ విషయమందు నేను పరాధీనుడను. ఓ! సజ్జనులారా! ఆ కార్యము నేనెట్లు చేయగలను? నేను నా పుత్రప్రేమ, మీ యందలి అభిమానముచే, కేవలము మీ దర్శనార్థము ఇచట కేతెంచితిని" అని పలికెను. అంత ప్రజలు, హేమకంతుడు రోదన మొనర్చుట మొదలిడిరి. వారిని చూచి దూతలు కృపావేశులై "రాజా! నీవు ధన్యుడవు. నీ హృదయము జగదీశ్వరుడయిన శ్రీగణేశుని యందు ఎట్లు అర్పితమైనదో, అట్లే వీరి హృదయములు నీ యందు అర్పితములయినవి. నీవు నీ శ్రీగణేశ కథాశ్రవణ పుణ్యమును వీరికి ధారపోసిన ఎడల వీరందరినీ మీ సహితము శ్రీగణేశ థామమునకు గొనిపోయెదము" అని పలికిరి. రాజు అత్యంత ఆనందితుడై "అట్లు ఒనర్చిన నా కీర్తి చిరకాలము ఈ ధరామండలమున విస్తరిల్లును." అని పలికి జలములు తీసికొని తన పుణ్యమును వారిపై ప్రోక్షించెను. అంత ఆ ప్రజలందరూ దివ్య దేహులై, హేమకంత సహితముగ సర్వులు దివ్య విమాన మధిరోహించి శ్రీగణేశ థామమునకు ఏగిరి. కానీ ఆ సమయమున కొందరు పాపులు సోమకాంతుని ద్వారా పుణ్య జలముల నొల్లక తిరిగి నగరమునకేగి మిగిలిన వారికి ఈ సంగతి తెలిపిరి. వారందరూ నగర ప్రజలు త్యాగమొనర్చిన ధన సంపదను కాజేసి పరస్పరము ప్రసన్నులై వివిధ వ్యవసాయములందు నిమగ్నమైరి.

సోమకాంత మహారాజు పత్నీపుత్ర అమాత్య సహితుడై విమాన మధ్యమున ప్రతిష్ఠితుడయ్యెను. ఆయన చుట్టూ పుర ప్రముఖులు, నాగరికులు, ప్రజలు సుఖాసీనులై "మయూరేశునకు జయము; గజాననునకు జయము; శ్రీగణేశునికి జయము" అని నినాదములు చేయుచూ, అతి వేగముగ వెడలి పరాత్పరుని థామము చేరిరి. వారందరూ శ్రీగణేశుని

దర్శనము నొందిరి. తదుపరి వారందరూ శ్రీగణేశ సామీప్యత నొందిరి. మహారాజు సోమకాంతుడు శ్రీగణేశ సాయుజ్యము నొందెను. సూతుడు "మహర్షులారా! మీకందరకూ శ్రీగణేశుని పురాతనాఖ్యానము వినిపించితిని. ఈ కథాశ్రవణము సర్వ జనుల పాపములను ప్రక్షాళన మొనరించును. ఇపుడు విమానమందు రాజు శ్రీగణేశ దూతలతో కావించిన సంవాదమును మీకు వినిపించెదను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి సోమకాంత మోక్షమను నూట ఏభై ఒకటవ అధ్యాయము సమాప్తము)

నూట ఏభై రెండవ అధ్యాయము

(వారణాసి యందలి వినాయకులు)

సూతుడు "విమానము ఊర్ధ్వ లోకముల కేగుచుండగా వారికి వారణాసీ పురము కానిపించెను. అంత సోమకాంతుడు దూతలను ఈ విధముగ పరిప్రశ్నించెను "ఓ! దూతలారా! నాకు విశ్వేశ్వరుని పరివార గణేశుల గూర్చి పూర్ణముగ తెలుపవలసినది." దూతలు "రాజా! దుంఠి వినాయకుడు కాకుండా ఇంకా ఏబది ఆరు వినాయకులు గలరు. విశ్వేశ్వరునికి ఆవల ఏడు ప్రాకారములు కలవు. ఒక్కొక్క ప్రాకారమందు ఎనిమిది మంది గణేశులు కలదు. ఒకటవ ప్రాకారమందు తూర్పు దిశ నుండి వరుసగా ఎనిమిది దిక్కులందు "అర్క వినాయకుడు, దుర్గ వినాయకుడు, భీమచండ, దేహళీ, ఉద్దండ, పాశపాణి, ఖర్వ, సిద్ధి వినాయకులు." ద్వితీయావరణము నందు క్రమముగ "లంబోదర, కూటదండ, కూష్మాండ, ముండ వినాయక, వికటదంత, రాజపుత్ర, ప్రణవ (ఓంకార) వినాయకులు." మూడవ ఆవరణమందు "వక్రతుండ, ఏకదంత, త్రిముఖ, పంచాస్య, హేరంబ, విఘ్నరాజ, వరద, మోదకప్రియ, వినాయకులు." నాల్గవ ఆవరణమందు "అభయప్రద, సింహతుండ, కూణితాక్ష, క్షిప్రప్రసాద, చింతామణి, దంతహస్త, ప్రచండ, (లేక పిచిండళ) ఉద్దండముండ" వినాయకులు. ఐదవ ఆవరణ యందు "స్థూలదంత, కలిప్రియ, చతుర్దంత, ద్వితుండ, జ్యేష్ఠ, గజవినాయక, కాల, నాగేశ" వినాయకులు. ఆరవ ఆవరణ యందు "మణికర్ణ, ఆశా వినాయక, సృష్ఠి, యక్ష, గజకర్ణ, చిత్రఘంట, సుమంగళ, మిత, వినాయకులు." ఏడవ ఆవరణ యందు "మోద, ప్రమోద, సుముఖ, దుర్ముఖ, గణప, జ్ఞాన, ద్వార, అవిముక్త, వినాయకులు." ఈ అవిముక్త వినాయకుడు మోక్షప్రదాత. ఇవిగాక అన్య వినాయకులు గలరు. వారు "భాగీరథ, హరిశ్చంద్ర, కపర్ది, బిందు" వినాయకులు. వీరి నిత్య స్మరణచే సర్వ మనోకామనలు పూర్ణమగును. ఎవరు ప్రాత:కాలమే లేచి శుద్ధ మనస్సులై ఈ నామములు పఠించెదరో, వారి కర్మములందు విఘ్నములు యుండువు. అంతేకాదు. ఇందు ఒక్కొక్క నామమును ఉచ్ఛరించి శ్రీగణేశునకు తిలలు, తండులములు (బియ్యము), దూర్వాంకురములు, శమీ పత్రములు సమర్పించిన, వారికి అసాధ్యములు సహితము సిద్ధించి, సర్వత్ర విజయము ప్రాప్తించి, దీర్ఘాయువులై పుష్ఠి, ఆరోగ్యము, అప్రతిహతమయిన ధనము లభించును. మహారాజా! నీ వడిగిన ప్రశ్నకు మేము సమాధానము తెలిపితిమి" అని పలికి మౌనము వహించిరి. విమానము శ్రీగణేశ ధామము చేరినది. సూతుడు "మహర్షులారా! మీకు కాశీ పురమందలి ఏబది ఆరు గణేశుల గూర్చి తెలిపితిని. ఇక ఈ గణేశ పురాణ ఫలశ్రుతి తెలిపెదను.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి వారణాసీపుర గణేశ నామములు అను నూట ఏబది రెండవ అధ్యాయము సమాప్తము)

నూట ఏబది మూడవ అధ్యాయము

(శ్రీగణేశ పురాణ ఫలశృతి)

సూతుడు "ఈ గణేశ పురాణ శ్రవణము మానవుని జనన మరణ చక్రము నుండి ముక్తుని గావించును. ఈ పురాణమును ఒక్కమారు శ్రవణము కావించిననూ ఉత్తమ ఫలము నొసంగును. ఈ పురాణ ఫలము, మాహాత్మ్యము వర్ణించుట శేషునికి సహితము అసాధ్యము. ఒక మానవుడు సూర్య, చంద్ర, గ్రహణములందు కురుక్షేత్రమున పరమ భక్తి భావముతో శ్రోత్రియ బ్రాహ్మణులకు ఒక వేయి బారువుల (రెండు వేల సువర్ణ ముద్రికలు ఒక బారువు) సువర్ణమును దానమొనర్చిన ఎంత ఫలము లభించునో అంత ఫలము ఈ పురాణ శ్రవణముచే లభించును. బ్రహ్మదేవుడు త్రాసులో ఒక్క ప్రక్క సంపూర్ణ అంగ, దక్షిణ సహిత సర్వ యజ్ఞ ఫలమును, వేరొక ప్రక్క ఈ పురాణ శ్రవణ ఫలమును తూచగా ఈ పురాణ శ్రవణమే ఎక్కువ ఫలము నిచ్చినది. సర్వ వ్రత, దానముల కంటే ఈ పురాణ శ్రవణమే ఎక్కువ ఫలితము నిచ్చును. కోటి కన్యాదానములు, వేలాది గోదానములచే ఆర్జిత పుణ్యములకు కోటిరెట్లు పుణ్యము ఈ శ్రీగణేశపురాణ శ్రవణము చే కలుగును. నాలుగు వేదములు, వేదాంగములు (శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము) సహిత అధ్యయనము, శాస్త్రములందలి వాటి వ్యాఖ్య, చదివిన పిదప సత్పురుషుల సేవ చేయుట ఏ ఫలము నొసగునో, దానికి కోటిరెట్ల పుణ్యము ఈ పురాణ శ్రవణముచే కలుగును. సంపూర్ణ మహాభారతము, సర్వ ఇతర పురాణములు శ్రవణము కావించిన ఎంతటి పుణ్యము లభించునో, దానికి కోటి రెట్ల పుణ్యము ఈ శ్రీగణేశ పురాణ శ్రవణము వలన లభించును. ఎవరి ఇంటి యందు ఈ పురాణము లిపిబద్ధముగ యుండునో, ఆ గృహమందు భూత, ప్రేత, రాక్షసులు, పూతనాది బాలఘాతులు, చేరరు; చేరలేరు. ఎందుకనగా ఆ గృహము సర్వదా శ్రీగణేశునిచే రక్షింపబడు చుండును. ఏ మానవుడు శాంతచిత్తుడై ఈ పురాణమును వినినా, దీనిని పూజించినా, ఆ మనుజుని దర్శించిన పతితులు సహితము పవిత్రులగుదురు. ఈ పురాణ శ్రవణము కావించు మనుజులు బ్రహ్మాది దేవతలు, మునుల ద్వారా సమ్మానితులగుదురు. ఈ మనుజుడు క్రుద్ధుడయిన సంపూర్ణ సంసారమును దగ్ధమొనర్చును. ప్రసన్నుడయిన ఇంద్ర పదవిని సహితము ప్రసాదించును. ఎవరు ఈ పురాణమును ప్రతిదినము పఠించెదరో వారు అష్టసిద్ధుల నొందెదరు. ఆ మానవునకు దరిద్రము, కష్టములు యుండవు. ఆతడు ఈప్సిత ఫలముల నొంది పద్మాది నిధులు ప్రాప్తించును.

కల్పవృక్షము, కామధేనువు, నవ నిధులు, చింతామణి ఆతనికి వశీభూతమై, ఆ మానవుడు సర్వులకు పూజనీయుడగును. ఈ గణేశ పురాణ స్మరణ మాత్రముచే మారణ, మోహన, స్థంభన, ఉచ్చాటనాది అభిచారిక ప్రక్రియలన్నియు నిరర్ధకములగును. ఎవరు శ్రీగణేశుని వద్ద కూర్చొని ఈ పురాణమును శ్రవణము కావించెదరో వారు బ్రహ్మ హత్య, స్త్రీ హత్య, భ్రూణ హత్యాది మహాపాపముల నుండి విముక్తులయి, అంతమందు నిస్సందేహముగ శ్రీగణేశ సాన్నిధ్యము నొందెదరు. ఈ పురాణమును వినిన శూద్రులు క్రమముగ తరువాత జన్మలందు క్రమముగ వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కులములందు జన్మించెదరు. నిత్య, నైమిత్తిక కర్మలనుండి చ్యుతులైన మనుజులు ఈ పురాణ శ్రవణముచే శ్రీగణేశుని కృప వలన ఆ కర్మము లొనర్చిన సంపూర్ణ ఫలము నొందెదరు. భాద్రపద శుద్ధ చవితి అనగా వినాయక చవితి నాడు ఎవరు సుందరమయిన వినాయక మట్టి విగ్రహమును తెచ్చి, ఒక సుందర తోరణయుక్త మండపమందుంచి, అత్యాదర భావముతో పూజ యొనర్చి, ఈ శ్రీగణేశ పురాణమును ఎవరు శ్రవణ మొనర్చెదరో వారికి శ్రీగణేశుడు శీఘ్రముగ ప్రసన్నుడై, సంపూర్ణ మనోకామనలను పూర్ణమొనర్చి, అంతమున మోక్ష మొసంగును. ఈ శ్రీగణేశ పురాణ మందున్న స్థోత్రములను ప్రతిదినము పఠించుట వలన నిశ్చయముగ సిద్ధి కలుగును. ఏ విధమయిన అసాధ్యమైననూ

మానవునకు సుసాధ్యమగును. ఏ మనుజుడు విధి విధానముగ శుద్ధుడై, పూజ స్తోత్రాది నియమములతో ఈ శ్రీగణేశ పురాణమును పఠించి, చివరన బ్రాహ్మణులకు భోజన మిడిన ఎడల ఆతడు/ఆమె శ్రీగణేశుని యందు తాదాత్మ్యము నొందును.

ఋషులు "సూతా! మహానుభావా! అనఘా! పురాతన కాలమందు ఈ పురాణమును విని ఎవరు ఏ విధమయిన పుణ్యములు నొందిరి?" అని ప్రశ్నించిరి. సూతుడు "పూర్వకాలమందు "మూకుడు" అను ఋషి యుండెడివాడు. పూర్వకర్మ వశమున ఆయన మూగవాడు. ఆయన ఒకనాడు బ్రహ్మలోకమున కేగెను. అదే సమయమున "లోమశ మహర్షి" సహితము అచటి కేతెంచెను. బ్రహ్మ లోమశుని గౌరవించి, ఆశీనుని కావించి, కుశలమడిగెను. అంత లోమశుడు విరించికి నమస్కృతులర్పించి "స్వామీ! మీరు వ్యాసునకు శ్రీగణేశ పురాణమును ఉపదేశించిరి కదా! ఆ పరమ పుణ్య వర్ధకమయిన పురాణమును నాకు కూడా వినిపింప ప్రార్ధన" అని అభ్యర్ధించెను. అంత చతుర్ముఖుడు లోమశు నితో "నీవు పరమ భోగ, మోక్షదాయకమైన ఈ పురాణమును శ్రద్ధతో వినుము" అని పలికి ఆయనకు ఆ పరమ పవిత్ర పురాణమును వినిపించెను. ప్రలోభవశమున అత్యంత భక్తి భావముతో మూకుడు అద్దానిని విని, తత్ప్రభావముచే తన మూగత్వమును వీడి బృహస్పతి వంటి వాక్చాతుర్యము నొందెను. అంతేకాక ఆయన ఆ శ్రీగణేశ పురాణమును పఠించి, అన్యులకు సహితము వినిపించెను. తత్ఫలితముగ ఆయన ఇహమందు సర్వ సుఖ భోగములనుభవించి, పుత్ర పౌత్రాభివృద్ధితో జీవించి అంతమున శ్రీగణేశ ధామము చేరెను.

ఇక్ష్వాకు వంశమందు శుద్ధాత్ముడు, శుచి, నిత్య యజ్ఞ దాన స్వాధ్యాయ పరాయణుడు, శత్రుహంత, సర్వధర్మ నిరతుడు, ప్రజాపాలనా దక్షుడు, ప్రజారక్షకుడు, త్రిలోక విఖ్యాతుడయిన "సంవరణుడు" అను రాజు యుండెడివాడు. ఆయన అనపత్య (పిల్లలులేని) దోషముచే బాధపడుచూ పుత్రకామేష్ఠి యజ్ఞము అచరించెను. ఆ యజ్ఞము యధావిధిగా కావించి, అనేక దక్షిణాదుల నొసగిననూ ఆయనకు పుత్ర సంతతి లేకుండెను. అంత ఆయన నిరుత్సాహుడై "హరివంశ" పురాణమును శ్రవణము కావించెను. ఆ పురాణాంతమున బ్రాహ్మణులకు భోజన, వస్త్ర, మణిరత్న సువర్ణ భూషణాదులు, గోవులు, భూమి దానమొనర్చెను. అయిననూ ఫలితము లేకుండెను. దైవ వశమున ఒకనాడు ఆయన వద్దకు మూక మహర్షి ఏతెంచెను. అప్పటికే మూకుడు శ్రీగణేశ పురాణ జ్ఞాతగా ప్రసిద్ధి కెక్కుటచే సంవరణుడు ఆయనను గౌరవించి, తన నగరమున ఆయనకు నివాసము కల్పించి, అనేక వసతులు ఇచ్చి, ఆయన ముఖతా శ్రీగణేశ పురాణమును శ్రవణము కావించెను. పురాణాంతమున ఆ ద్విజ శ్రేష్ఠునకు అనేక బహుమూల్య సువర్ణ, మణి రత్న వస్త్ర భూషణముల నొసంగెను. తత్ఫలితముగ ఆ మహారాజు దంపతికి వంశోద్ధారకుడయిన సుపుత్రుడు జన్మించెను. ఆ మహారాజుకు ఒక సోదరి కలదు. ఆమెకు ముప్పది రెండేండ్లు వచ్చిననూ సంతానము కలుగక మిక్కిలి వ్యధ నొందుచుండెను. ఆమె తన సోదరునకు శ్రీగణేశ పురాణ శ్రవణము ద్వారా పుత్రుడు కలిగెనని విని, ఆమె సహితము మూక మహర్షిని రావించి శ్రీగణేశ పురాణ శ్రవణ మొనరించెను. ఆమెకు సహితము మహాశూరుడయిన పుత్రుడు జన్మించెను. ఈ విధముగ ఆమె పుత్ర, పౌత్రులను పొంది మనానుకూల భోగములనుభవించి, అంతమున శ్రీగణేశ సన్నిధి నొందెను. పురాతన కాలమందు సగర చక్రవర్తికి ఒక పుత్రుడు జన్మించెను. ఆతడు పుట్టుకతో కుంటివాడు. అంత సగరుడు లోమశ మహర్షిని రావించి ఆయనచే పన్నెండు సంవత్సరములు ఆ బాలుని చే ఈ శ్రీగణేశ పురాణ శ్రవణ మొనరించి, తదుపరి లోమశ మహర్షిని అనేక విధములుగ సత్కరించెను. తత్ఫలితముగ ఆ సగర పుత్రునకు పూర్ణముగ కాళ్ళు కలుగుటయే కాక, ఆతడు గొప్ప శూరుడై, శత్రు మర్దనుడై, పూర్ణాయువు జీవించి, అంతమున శ్రీగణేశ సన్నిధి చేరెను.

అష్టాదశ పురాణ శ్రవణముచే ఏ ఫలము లభించునో, అయ్యది కేవలము శ్రీగణేశ పురాణ శ్రవణముచే కలుగును. కాకవంధ్య (పిల్లలు పుట్టలేని స్త్రీ) సహితము ఈ పురాణ శ్రవణ మొనర్చిన సంతానము కలుగును. తరుచు గర్భపాతమగు

స్త్రీలు ఈ పురాణ శ్రవణ మొనర్చిన గర్భము నిలుచును. మూగవారు మాట గలిగి బృహస్పతి సములగు వాక్చాతుర్యము నొందెదరు. వేదాధ్యయన సంపన్న సర్వమాన్యులగుదురు. కన్య ఈ పురాణమందు ఒక్క అధ్యాయమును వినినంతనే ఆమెకు మనానుకూలమయిన యుక్తుడు, కులీనుడు, సజ్జనుడు, ధనవంతుడు అయిన పతి లభించును. జన్మాంధులు సహితము దృష్టి నొందెదరు. భక్తి భావముతో వినిన మానవులకు సర్వతీర్థ స్నాన ఫలము, సర్వ విధములయిన దాన ఫలము లభించును. ఏ మానవుడు గ్రీష్మఋతువు నందు పంచాగ్ని మధ్యమున, హేమంత ఋతువు నందు నీటి మధ్యమున, వర్ష ఋతువు నందు ముసలముల వంటి చినుకులతో వర్షధారల మధ్యన కూర్చొని అనేక వర్షములు కావించిన తపస్సుచే ఏ ఫలము లభించునో, ఆ ఫలితము ఈ శ్రీగణేశ పురాణమందలి ఐదు అధ్యాయములు శ్రవణ మాత్రమున లభించును. అత్యంత భక్తి భావముతో జీవితకాలము నిత్యాగ్నిహోత్ర మొనర్చుటచే కలుగు పుణ్యము ఈ శ్రీగణేశ పురాణశ్రవణము చే కలుగును. ఒక మనుజుడు ఒంటికాలి బొటనవ్రేలిపై నుంచొని పదివేల సంవత్సరములు తపము ఆచరించిన ఎడల ఎట్టి ఫలము లభించునో అంతటి ఫలము ఈ పురాణమందలి పది అధ్యాయములు శ్రవణ మొనర్చిన ఎడల కలుగును. ఇందు సంశయము లేదు. ఎవరు భూలోకమందు జన్మము నుండి మృత్యు పర్యంతము శ్రీగణేశ పురాణమును శ్రవణ మొనర్చునో ఆతడు చక్రవర్తి అగును. ఏ మనుజుడు ప్రయాగ యందు ఒక వేయి మాఘ మాసములు స్నాన మొనర్చిన ఎడల ఎటువంటి పుణ్యము నార్జించునో, అంతటి పుణ్యము ఈ శ్రీగణేశ పురాణ శ్రవణముచే ప్రాప్తించును. గోమతీ సాగర సంగమమందు (ద్వారక) భక్తి భావముతో స్నానమొనర్చిన ఎటువంటి పుణ్యము నొందెదరో, దానికి కోటి రెట్ల పుణ్యము ఈ శ్రీగణేశ పురాణ శ్రవణముచే కలుగును. ఈ శ్రీగణేశ పురాణమును వినిన మనుజులకు శివుని త్రిశూలముచే, ఇంద్రుని వజ్రాయుధముచే, విష్ణువు యొక్క చక్రాయుధము చే కూడా భయము లేదు.

మునులారా! మీకు నేను సంపూర్ణ శ్రీగణేశ పురాణమును వినిపించితిని. ఈ పురాణ మహిమను సంపూర్ణముగ వర్ణించుట భాషాపతి బ్రహ్మకు, కార్తికేయునికి, ఫణిపతి శేషునకు సహితము కోటి వర్షములు వర్ణించిననూ అసాధ్యము. పరమాద్భుత లీలాన్వితమయిన ఈ శ్రీగణేశ పురాణము వక్త, శ్రోత లిరువురికీ సర్వ పాప నాశకము, సర్వ కామ ప్రదము, పుణ్య వర్ధకము, భోగమోక్ష ప్రదాయకము.

(శ్రీగణేశ పురాణమందు క్రీడాఖండమందలి శ్రీగణేశ పురాణ ఫలశృతియను నూట ఏబది మూడవ అధ్యాయము సమాప్తము)

శ్రీగణేశ పురాణం సంపూర్ణము

అనుబంధము

త్రిమూర్తికృత శ్రీగణేశ స్తోత్రము (స్తోత్ర రాజము)

అజం నిర్వికల్పం నిరాకారమేకం నిరాలంబమద్వైతమానందపూర్ణం
పరం నిర్గుణం నిర్విశేషం నిరీహంపరం బ్రహ్మరూపం గణేశం భజేం ॥

గుణాతీతమాద్యం చిదానందరూపం చిదాభాసకం సర్వగం జ్ఞానగమ్యం
మునిధ్యేయమాకాశరూపం పరేశం పరం బ్రహ్మరూపం గణేశం భజేం ॥

జగత్కారణం కారణ జ్ఞానహీనం సురాదిం సుఖాదిం యుగాదిం గణేశం
జగద్వ్యాపినం విశ్వవంద్యం సురేశం పరం బ్రహ్మరూపం గణేశం భజేం ॥

రజోయోగతో బ్రహ్మ రూపం శృతిజ్ఞం సదా కార్యసక్తం హృదాచింత్యరూపం
జగత్కారకం సర్వవిద్యానిధానం సదాబ్రహ్మరూపం గణేశం నతా: స్మ: ॥

సదా సత్వయోగం ముదాక్రీడమానం సురారీన్ హరంతం జగత్పాలయంతం
అనేకావతారం నిజాజ్ఞానహారం సదావిష్ణురూపం గణేశం నతా: స్మ: ॥

తమోయోగినం రుద్రరూపం త్రినేత్రం జగద్ధారకం తారకం జ్ఞానహేతుం
అనేకాగమౌ: స్వజనం భోదయంతం సదాశర్వరూపం గణేశం నతా: స్మ: ॥

తమస్తోమహారం జనాజ్ఞానహారం త్రయివేదసారం పరబ్రహ్మ పారం
మునిజ్ఞానకారం విదూరే వికారం సదాబ్రధ్నరూపం గణేశం నతా: స్మ: ॥

నిజైరౌషధీస్తర్పయంతం కరాఘౌ సురౌఘాన్ కళాభి: సుధాస్రావిణీభి:
దినేశాంశు సంతాపహారం ద్విజేశం శశాంక స్వరూపం గణేశం నతా: స్మ: ॥

ప్రకాశస్వరూపం నభోవాయురూపం వికారాదిహేతుం కళాకాలభూతం
అనేకక్రియానేక శక్తి స్వరూపం సదాశక్తిరూపం గణేశం నతా: స్మ: ॥

ప్రధానస్వరూపం మహత్తత్వరూపం ధరావారిరూపం దిగీశాదిరూపం
అసత్ సత్ స్వరూపం జగత్‌హేతుభూతం సదా విశ్వరూపం గణేశం సతా:స్మ: ॥

త్వదీయే మన: స్థాపయేదంఘ్రియుగ్మే జనో విఘ్న సంఘాన్న పీడాం లభేత్
లసత్ సుర్యబింబే విశాలేస్థేయం జనోధ్వాంత బాధాం కథం వా లభేత్ ॥

వయంభ్రామితా: సర్వథా జ్ఞానయోగాద లబ్ధ్వా తవాంఘ్రి బహూన్ వర్షపూగాన్
ఇదానీవాప్తాస్తవైవ ప్రసాదాత్ ప్రపన్నాన్ సదాపాహి విశ్వంభరద్యా ॥

అష్ట శ్లోకీ

యతోనంత శక్తేరనంతాశ్చ జీవాయతో నిర్గుణాదప్రమేయాద్ గుణాస్తే
యతోభాతి సర్వత్రిధా భేదభిన్నం సదాతం గణేశం నమామో భజామ: ॥

యతశ్చావిరాశీజ్జగ సర్వవేత్తుస్తథాబ్జాసనో విశ్వగో విశ్వగోప్తా
తథేంద్రాదయో దైత్య సంఘా మనుష్యా: సదాతం గణేశం నమామో భజామ: ॥

యతోవహ్నిభానూ భవోభూర్జలం చయత: సాగరశ్చంద్రమా వ్యోమావాయు:
యతస్థావరాజంగమా వృక్షసంఘా: సదాతం గణేశం నమామో భజామ: ॥

యతోదానవా: కిన్నరో యక్షసంఘా యతశ్చారణా వారణా: శ్వాపదాశ్చ
యత: పక్షికీటా యతోవీరుదశ్చ సదాతం గణేశం నమామో భజామ: ॥

యతోబుద్ధి రజ్ఞాననాశో ముముక్షేర్యత: సంపదో భక్త సంతోషకా:స్యు:
యతో విఘ్ననాశో యత: కార్యసిద్ధి: సదాతం గణేశం నమామో భజామ: ॥

యత:పుత్ర సంపద్ యతో వాంఛితార్థో యతోభక్తి విద్యాస్తథానేక రూపా
యతోధర్మ మోక్షౌ యతశ్చార్ధకామ సదాతం గణేశం నమామో భజామ: ॥

యతోనంత శక్తి: సశేషోభభూవ ధరాధారిణే నేకరూపేచ శక్త:
యతోనేకధా స్వర్గలోకాహి నానాసదాతం గణేశం నమామో భజామ: ॥

యతో వేదవాచో వికుంఠామనోభి: సదా నేతి నేతీతి తాయం గృణంతి
పరబ్రహ్మరూపం చిదానంద భూతం సదాతం గణేశం నమామో భజామ: ॥

ద్వాదశ శ్రీగణేశ నామములు

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణక:
లంబోదరశ్చ వికటో విఘ్ననాశో గణాధిప:
ధూమకేతుర్గణాధ్యక్షో, భాలచంద్రో గజానన:
ద్వాదశైతాని నామాని య:పఠేత్ శృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమేతథా
సంగ్రామే సంకటేచైవ విఘ్నస్థస్య నజాయతే ॥

సంకటహార స్తోత్రము

దీననాథ దయాసింధో యోగి హృత్పద్మ సంస్థిత:
అనాది మధ్యరహిత స్వరూపాయ నమోనమ:
జగద్భాస చిదాభాస జ్ఞానగమ్య నమోనమ:
ముని మానస విష్టాయ నమో దైత్య విఘాతినే
త్రిలోకేశ గుణాతీత గుణక్షోభ నమోనమ:
మాయాతీతాయ భక్తానాం కామపూరాయతే నమ:
సోమ సూర్యాగ్ని నేత్రాయ నమో విశ్వంభరాయతే
అమేయ శక్తయే తుభ్యం నమస్తే చంద్ర మౌళయే
చంద్రగౌరాయ శుద్ధాయ శుద్ధ జ్ఞాన కృతే నమ:

శ్రీ గణేశ కవచము

అస్యశ్రీ గణపతి కవచస్య ముద్గల ఋషి: అనుష్టుప్ ఛంద: శ్రీ మహా గణపతిర్దేవతా ఆత్మరోక్ష్యార్థ పాఠే వినియోగ:

వినాయక శిఖాంపాతు పరమాత్మా పరాత్పర: అతి సుందర కాయస్తు మస్తకం సుమహోత్కట:
లలాటం కాశ్యప: పాతు భ్రూయుగంతు మహోదర: నయనే భాలచంద్రస్తు గజాస్యస్త్వోష్ఠ పల్లవౌ
జిహ్వాం పాతు గుణక్రీడశ్చిబుకం గిరిజాసుత: వాచం వినాయక: పాతుదంతాన్ రక్షతు దుర్ముఖ:
శ్రవణౌ పాశపాణిస్తు నాసికాం చింతితార్థద: గణేశస్తు ముఖం కంఠంపాతు దేవో గణాజ్యయ:
స్కంధౌపాతు గజస్కంధ: స్థనౌ విఘ్నవినాశన: హృదయం గణనాథస్తు హేరంబో జఠరం మహాన్
ధరాధర: పాతు పార్శ్వం పృష్ఠం విఘ్నహర: శుభ: లింగం గుహ్యం సదాపాతు వక్రతుండో మహాబల:
గణక్రీడో జానుజంఘే ఊరూ మంగళమూర్తిమాన్ ఏకదంతో మహాబుద్ధి: పాదౌ గుల్ఫౌ సదావతు
క్షిప్ర ప్రసాదనో బాహూపాణీ ఆశాప్రపూరక: అంగుళీశ్చ నఖాన్ పాతు పద్మహస్తోరినాశన:
సర్వాంగాని మయూరేశో విశ్వవ్యాపీ సదావతు అనుక్తమపి యత్థానం ధూమ్రకేతు సదావతు
ఆమోదస్వగ్రత: పాతు ప్రమోద:పృష్ఠ తోవతు ప్రాచ్యాం రక్షతు బుద్ధీశ ఆగ్నేయ్యాం సిద్ధిదాయక:
దక్షిణశ్యాం ఉమాపుత్రో నైఋత్యాంతు గణేశ్వర: ప్రతీచ్యాం విఘ్నహర్తావ్యాద్ వాయువ్యం గజకర్ణక:
కౌబేర్యాం నిధిప: పాయాదీశాన్యాం ఈశనందన: దివావ్యాదేక దంతస్తు రాత్రౌ స్కంధాసు విఘ్నహృత్
రాక్షసాసుర వేతాళ గ్రహభూత పిశాచత: పాశాంకురధర: పాతురజ: సత్వం తమ:స్మృతిం
జ్ఞానం ధర్మంచ లక్ష్మీంచ లజ్జాం కీర్తిం దయాంకులం వపుర్ధనంచ ధాన్యాంచ గృహాన్ దారాన్ సుతాన్ సుఖీన్
సర్వాయధ ధర: పౌత్రాన్ మయూరేశో వతాత్ సదా కపిలో జావికం పాతు గవాశ్యం వికటోవతు ॥

భ్రహ్మకృత మయూరేశ స్తోత్రము

పురాణ పురుషం దేవం నానాక్రీడాకరం ముదా మాయావినం దుర్విభావ్యం మయూరేశం నమామ్యహం
పరాత్పరం చిదానందం నిర్వికారం హృదిస్థితం గుణాతీతం గుణమయం మయూరేశం నమామ్యహం
సృజంతం పాలయంతం చ సంహరంతం నిజేచ్ఛయా సర్వవిఘ్నహరం దేవం మయూరేశం నమామ్యహం
ఇంద్రాది దేవతావృందైరభిష్టుత మహర్నిశం సదసద్ వ్యక్తమవ్యక్తం మయూరేశం నమామ్యహం
నానాదైత్య నిహంతారం నానారూపాణి బిభ్రతం నానాయుధ ధరం భక్త్యా మయూరేశం నమామ్యహం
సర్వశక్తిమయం దేవం సర్వరూపధరం విభుం సర్వవిద్యా ప్రవక్తారం మయూరేశం నమామ్యహం
పార్వతీనందనం శంభోరానంద పరివర్ధనం భక్తానందకరం నిత్యం మయూరేశం నమామ్యహం
మనిధ్యేయం మునిమతం మునికామ ప్రపూరకం సమిష్ఠి వ్యష్ఠిరూపం త్వాం మయూరేశం నమామ్యహం
సర్వజ్ఞాన నిహంతారం సర్వజ్ఞానకరం శుచిం సత్యజ్ఞానమయం సత్యం మయూరేశం నమామ్యహం
అనేక కోటి భ్రహ్మాండ నాయకం జగదీశ్వరం అనంతం విభవం విష్ణుం మయూరేశం నమామ్యహం ॥

దు:ఖ ప్రశమన స్థోత్రము

జగత: కారణం యోసౌ రవి నక్షత్ర సంభవ: సిద్ధ సాధ్యగణా: సర్వే యతయేవచ సింధవ: గంధర్వా: కిన్నెరా యక్షా మనుష్యోరగ రాక్షసా: యతశ్చరాచరం విశ్వంతం నమామి వినాయకం యతో భ్రహ్మాదయో దేవా మునయశ్చ మహర్షియ: యతో గుణాస్త్రయో జాతాస్తం నమామి వినాయకం

యతో నానావతారశ్చ యశ్చసర్వ హృదిస్థిత: యం స్థోతుంనైవ శక్నోతి శేషస్థం గణపం భజేత్ సిందూరో నిర్మిత: కేన విశ్వ సంహార కారక: తేనాపి తాపితం విశ్వం వ్యతి స్వామిని జాగ్రతి అన్యంకం శరణం యామ: కోను పాశ్యతి నోఖిలాన్ జహ్యేనం దుష్ట బుద్ధిం త్వమతీర్య శివాలయే ॥